	ప్రతి	రూ.	అ
గోపీనాథరామాయణము, 2 సంపుటములు	...	10	0
చాటుపద్యమణిమంజరి, ప్రథమభాగము, క్రొత్తకూర్పు		1	8
చిత్రభారతము, చరిగొండ ధర్మన్నగారిది	...	1	8
చెన్నబసవపురాణము, పాపకవికృతము	...	1	4
ఛందోదర్పణము (అనంతునిఛందము)	...	1	0
జైమినీభారతము, అశ్వమేధపర్వము	...	1	4
దశకుమారచరిత్రము, పద్యము కేతనకవి	...	1	8
దశావతారచరిత్ర, చక్కనిక్రొత్తకూర్పు	...	3	0
ధ్రువోపాఖ్యానము, సటీక, భాగవతములోనిది	...	0	10
నరసభూపాలీయము, అట్టబైండు	...	1	0
నలచరిత్ర, ద్విపద, చక్రపురి రాఘవాచార్యప్రణీతము		1	4
నిర్వచనోత్తరరామాయణము, తిక్కనామాత్యప్రణీతము		1	0
పంచతంత్రము, నారాయణకవిది	...	1	0
,, కాళిక్రోబైండు	...	1	6
,, వేంకటనాథరాజకవికృతము	...	1	4
,, కాళిక్రోబైండు	...	1	10
పారిజాతాపహరణము, చిన్నసైజు, క్రొత్తకూర్పు	...	0	12
,, సాంధ్రటీకాతాత్పర్యము	...	3	0
బ్రహ్మోత్తరఖండము, క్రొత్తకూర్పు, శ్రీధరమల్లె వేంకటరామకవి		1	8
బసవపురాణము, పిడపర్తి సోమనాథకవి	...	2	8
భాస్కరరామాయణము, చక్కనిక్రొత్తకూర్పు	...	6	0
మనుచరిత్ర, సటీక, వావిళ్ల రామస్వామిశాస్త్రిగారి వ్యాఖ్యానముతో చిన్నసైజున మేలైతములమీఁద స్ఫుటమైన అక్షరములతో చక్కఁగ ముద్రితము	...	4	0
మార్కండేయపురాణము, మారనకృతము	...	2	8
భక్తిరసశతకసంపుటము I 20 శతకములు	...	3	0
,, II ,,	...	3	0
,, III ,,	...	3	0
నీతిశతకసంపుటము I ,,	...	3	0
రంగనాథరామాయణము, ద్విపద, చక్కనిక్రొత్తకూర్పు		3	8

		ప్రతి	1-కి	రూ.	అ.
రాఘవపాండవీయము, సటీక, ద్వ్యర్థిప్రబంధరాజము	...		3	0
లంకావిజయము (రావణదమ్మీయము) సటీక	...		1	4
వసుచరిత్రవిమర్శనము	...		1	4
వసుచరిత్ర, సటీక, రామరాజభూషణప్రణీతము	...		5	0
వాసిష్ఠరామాయణము, ద్విపద, తరిగొండ వెంకమ్మ	...		1	4
విక్రమార్కచరిత్ర, జక్కనకవిది	...		1	4
విష్ణుపురాణము, వెన్నెలకంటి సూరనార్యప్రణీతము, లఘుటిప్పణము	...		3	8
వివేకసింధు, కొండనార్యప్రణీతము	...		1	0
వేంకటాచలమాహాత్మ్యము, తరిగొండ వెంకమ్మ	...		1	8
వైశ్యపురాణము, శ్రీగురు భాస్కరాచార్యకృతము	...		1	4
వీరభద్రవిజయము, పోతనకృతము	...		1	0
శకుంతలాపరిణయము, కృష్ణకవికృతము	...		1	0
శశిరేఖాపరిణయము, అప్పప్పకవికృతము	...		1	0
శృంగారనైషధము, శ్రీనాథకవిది	...		1	8
శృంగారశాకుంతలము, పినవీరభద్రకవి	...		1	0
శేషధర్మము, తామరపల్లి తమ్మయ్య	...		1	0
శుకసప్తతి, కదిరీపతికృతము	...		1	8
సమారకుమారవిజయము, నూతనముద్రితము	...		1	8
సానందోపాఖ్యానము, శ్రీ శివరామకవి విరచితము	...		1	0
సీతారామాంజనేయసంవాదము, సటీక, తాత్పర్యము	...		4	8
" అట్టబైండు	...		2	8
సుదక్షిణాపరిణయము, తెనాలి అన్నయకవి (క్రొత్తకూర్పు)			1	0
హరివంశము, క్రొత్తకూర్పు, ఎట్టాప్రగడ	...		4	8
హరవిలాసము, శ్రీనాథకవి	...		1	0
హరిశ్చంద్రోపాఖ్యానము, శంకరకవి	...		1	0
హరిశ్చంద్రనలోపాఖ్యానము, సటీక, రామరాజభూషణకవి			3	8

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,

292, ఎన్ప్లనేడ్, చెన్నపురి.

శ్రీరస్తు

శ్రీరంగనాథరామాయణము

ద్విపదకావ్యము.



చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్

వారిచే ప్రకటితము.

All Rights Reserved]

[*Price Rs.* 5 0 0.

జ్ఞాపిక.

ఆర్యులారా!

ఈరంగనాథరామాయణము పూర్వముద్రణమునందు మంచి ప్రాత ప్రతులు దొరకనందునఁ బూర్వతరముద్రితములగు ప్రతులసాహాయ్యముననే కొంతవఱకు సంస్కరింపించి ముద్రించితిమి. తరువాతఁ గొన్నిదినములకు రెండుమూఁడు ప్రాత ప్రతులు మామిత్రులు శ్రీ జనమంచి శేషాద్రిశర్మగారివల్ల లభించుటవలన వానిం బట్టి మాపండితులగు శ్రీమాన్ ఉత్పల వేంకటనరసింహాచార్యులుగారిచేతను, శ్రీ యుత జనమంచి శేషాద్రిశర్మగారిచేతను బూర్వముద్రణములో వదలిపోఁబడిన భాగములను బొందుపఱచి చక్కఁగ సంస్కరింపించి ముద్రించినారము కావున నింకను నెందేని యపూర్వవర్ణనాభాగములు గల ప్రాతప్రాతప్రతు లుండెనేని పంపినచోఁ బునర్ముద్రణమునఁ గూర్చుకొనియెదము. రంగనాథకృతమగు నుత్తర కాండము గూడ లభించినది వానిని బ్రత్యేకసంపుటముగాఁ బ్రకటించుచున్నారము.

వావిళ్ల రామస్వామిశాస్త్రులుఅండ్ సన్స్.

పీఠిక.

రంగనాథుఁడు.

ఈ మహాకవి రామాయణమును ఆఱుకాండములు ద్విపదఁగా నాంధ్రీకరించెను ఇతఁడు రామాయణమును తాను దెనిఁగించినట్లు గ్రంథమున నెచ్చటను జెప్పుకొనలేదు, కాని గ్రంథములకు నామములు కవులనుబట్టియుఁ, గృతిపతి ననుసరించియుఁ, గథనుబట్టియుఁ బెట్టఁబడుచుండును గాన రంగనాథుఁడే రామాయణమును రచించె నని వచించుట కనుమాన మొందవలసిన యవసరము లేదు

కోనబుద్ధరాజు తాను రామాయణమును ద్విపదఁగా నాంధ్రీకరించి తన తండ్రి యగువిట్టలరాజునకుఁ గృతి యిచ్చినట్లు కాండాంతములయందుఁ జెప్పఁబడి యున్నది.

"అని యాంధ్రభాష భాషాధీశవిభుఁడు, వినుతకావ్యాగమవిమలమానసుఁడు
పాలితాచారుఁ డపారధీశరధి, భూలోకనిధి కోనబుద్ధభూవిభుఁడు
తమతండ్రివిట్టలధరణీశుపేరఁ, గమనీయగుణధైర్యకనకాద్రి పేరఁ
బనివూని యరిగండభైరవుపేర, నాచంద్రతారార్కమై యొప్పు మీఱ
భూచక్రమున నతిపూజ్యమై వెలయు, నసమానలలితశబ్దార్థసంగతుల
రసికమై చెలువొందు రామాయణంబు .. "

దీనింబట్టి కూడ బుద్ధరాజు రామాయణమును రచింపలే దని స్పష్టమగుచున్నది. ఎట్లన:—సాధారణముగా విద్వత్కవు లాత్మస్తుతిని జేసికొనువారు కారు ఒకానొకఁడట్లు తన్నుఁ దా స్తుతించుకొన్నను నీలాగున వ్రాసికొనుట యెందును గానము.

ఇందు బుద్ధరాజునకు:—౧ భాషాధీశవిభుఁడు, ౨ వినుతకావ్యాగమవిమల మానసుఁడు, 3 పాలితాచారుఁడు, ౪ అపారధీశరధి, ౫ భూలోకనిధి అను నైదు విశేషణములు వాకొనఁబడి యున్నవి వాస్తవముగా నీవిశేషణముల కీరాజు తగిన వాఁడేయైయుండు ననుకొన్నను దాను వ్రాసిన యీ ద్విపదకావ్యమున నిన్ని విశేషణములు స్వవిషయమునఁ దోరణము గూర్చినట్లు చేర్చియుండు ననుకొనుట సమంజసముగా లేదు. సాధారణముగా లోకమున నూటిలోఁ దొంబదితొమ్మిదిమంది యాత్మస్తుతిపరాయణులు కారా? యని ప్రశ్నింపవచ్చును ఐనను అట్టివారు లేరని చెప్ప

వీలుండదు గాని యట్టివా రితరులచేతఁ దమ్ముఁ బొగడించుకొందు రనిచెప్పుట యుక్తిహీనము గాదు.

శ్లో. "వాణీం కాణభుజీమజీగణదవాసాసీచ్చ వైయాసికీ
మంతస్తంత్రమరంస్త పన్నగవిగుంభేషు చాజాగరీత్,
వాచామూచకలద్దివాహస్యమఖిలం యచ్చాటుపాదస్ఫురాం
లోకేఽభూద్యదుపజ్ఞ మేవ విదుషాం సౌజన్యజన్యం యశః."

అని కోలచలమల్లినాథసూరి చెప్పుకొనలేదా? యనిప్రశ్న వేయవచ్చును.

కోలచలమల్లినాథసూరి కావ్యపంచకమునకు నైషధమహాకావ్యమునకును వ్యాఖ్యలవ్రాసినమహానుభావుఁడు ఈకాలమున బిరుదములు చెల్లినట్లాకాలమునఁ జెల్లకుండెను బిరుదమును ధరించినవాని నెట్లయినను బట్టిచూచుచుండిరే కాని సాధారణముగా విడిచి పెట్టినవారు కారు మల్లినాథకవి యంతకు ముందు వ్యాఖ్య వ్రాసినవారు మూలార్థమును బాడుచేసి యున్నందునఁ దాను వ్రాయఁబూనిన వ్యాఖ్య సమంజసముగ నుండునే కాని ముందటిదానివలె నపార్థమును బోధింప దను విషయమును లోకులు తెలిసికొందురుగాక యనియు, వ్యాఖ్య వ్రాయఁ బూనినవాని కన్నిశాస్త్రములలోఁ బాండిత్యముండియే తీరవలెనో యాసంగతిని దెలుపుటకును నట్లు చెప్పుకొనియెంగాని వేఱుగాదని కొందఱనుచున్నారు పంత మున వ్యాఖ్య వ్రాయఁబూనినందునఁ బరపక్షవాదులగుండె లవియఁగాక యని యీలాగునఁ జెప్పినాఁడని కొందఱు వాదించుచున్నారు. ఏది యెట్లున్నను ఈమహా కవి వ్యాఖ్య రచించిన వాఁడేకాని మూలకర్తగానందున మన మీయుదాహరణ మును బ్రకృత కవినిర్ణయఘట్టమున గ్రహింప ననవసరము కాళిదాసాదు లిట్లు చెప్పు కొనలేదుగదా!

సీ. "తనకులబ్రాహ్మణు ననురక్తు నవిరళ, జపహోమతత్పరు విపులశబ్ద
శాసను సంహితాభ్యాసు బ్రహ్మాండాది, నానాపురాణవిజ్ఞాననిరతుఁ
బాత్రు నాపస్తంబసూత్రు ముద్గలగోత్ర, జాతు సద్వినుతావదాతచరితు
లోకజ్ఞు నుభయభాషాకావ్యరచనాభి, శోభితు సత్ప్రతిభాభియోగ్యు
తే. నిత్యసత్యవచను మత్యమరాధిపా,చార్యు సుజను నన్నపార్యుఁ జూచి
పరమధర్మవిదుఁడు వరచళుక్యాన్వయా,భరణుఁ డిట్టులనియెఁ గరుణతోడ."

అని నన్నయభట్టారకుఁడు చెప్పుకొనలేదా? యనియు నడుగవచ్చును.

క. హితుఁడవు చతురవచోనిధి, వతులపురాణాగమేతిహాసకథార్థ
స్మృతియుతుఁడ వాంధ్రకవితా, పితామహుఁడ వెవ్వ రీడు పేర్కొన సీకున్."

అని యల్లసానిపెద్దనకవిశిరోమణియుఁ జెప్పుకొన్నాఁడుగదా? యని కూడ నొక ప్రశ్న వేయవచ్చును. ఇట్టి వెన్ని యో యుదాహరణములు చూపి యాత్మస్తుతి

పరాయణత్వము కొందఱకు సహజముగాని యవలేపమున వారు వ్రాసికొనుట లేదనియును సిద్ధాంతము చేయవచ్చును

"తమతండ్రి విట్టలధరణీశుపేర....."

అనుచోఁ దనతండ్రి యనక తమతండ్రి యనుటచేతనే వారి యాశ్రితుఁ డొకఁ డీగ్రంథమును రచించి ప్రభువునాశయమురీతి వారు వ్రాసినట్లే చెప్పుచు, వారి యందుఁ దనకుఁ గలగౌరవాతిశయమున నేకవచనము చెప్పుట ధర్మము కా దని "తమ" యని బహువచనము చెప్పినట్లూహించుట రంగనాథుఁడే యీకృతికర్త యనుటకు సహాయముగా నుండు ననినాతలంపు నాయీతలంపు నిరర్థకమే కా వచ్చును; దానిని సాధించుటకుఁ దగినంతసామర్థ్యము నాకు లేకపోవచ్చును; గాని రంగనాథుఁడే రామాయణమును ద్విపదగా రచించె ననుసజ్జనోక్తిమాత్రము నిరంకుశము దానికి నాతలంపుగూడఁ గొన్నికారణములతోఁగూడఁ దోడ్పడుఁ గాక!

రంగనాథుఁడు కోనబుద్ధారెడ్డియాస్థానపండితుఁడు. సరసముగఁ గవిత్వము చెప్పఁగలవాఁడు. గ్రంథమునఁ దనకుఁ గలపాండిత్యమును వీలులేక చెప్పుకొన నందున వారితండ్రిపేరు మొదలగునవి మనము నిర్ణయింపఁజాలము

ఇక్కవితిలకుఁడు సర్వజనశ్లాఘాపాత్రముగ నొకగ్రంథమును జెప్పఁబూని నన్నయభట్టు రచించినభారతమునుజూచి యిఁకఁ బద్యరచనవలనఁ బ్రఖ్యాతిని సంపాధించుట సాధ్యము కాదని నిశ్చయించి ద్విపదకావ్యము రచించి ప్రఖ్యాతి నొందె నని పెక్కండ్రు వాడుచున్నారు దీనియందు సత్య మెంత యున్నదో యెఱుఁగఁ జాలము గాని ద్విపదకావ్యకర్తలలో నతఁ డగ్రగణ్యుఁడనుటలో నెవరును భిన్నాభిప్రాయులు కారు, కనుక నీపైగాథ కొంతవఱకు నిజ మని యంగీకరింపఁబడఁదగి యున్నది

రంగనాథకవి ద్విపదగ రామాయణమును రచించుచుండ మంత్రిభాస్కరుఁడు తానాసంగతి విని పద్యకావ్యముగ రామాయణమును రచించి కృతి నిచ్చుటకు రాజుగారికొలువుకూటమునకుఁ దెచ్చినపుడే రంగనాథునికృతియు సంపూర్ణమై యతఁడును గ్రంథమును గొనితెచ్చెననియు, రాజు తాను జెప్పివ్రాయించిన దగుటచే రంగనాథరామాయణమును గుడిచేతితోడను, దనకుఁ దానై రచించి కృతి నీయఁ దెచ్చియున్న భాస్కరరామాయణము నెడమచేతితోడను గ్రహించె ననియు, నందుమీఁద మంత్రిభాస్కరుఁ డవమానజనితదుర్వారక్రోధంబున రసజ్ఞుఁడు గాని రాజునకుఁ గృతి నిచ్చుటకంటె నొకగుఱ్ఱపువాని కిచ్చినను మేలేయని సభనుండి

వెడలిపోయెననియు నొకగాథను బెక్కండ్రు చెప్పుదురు భాస్కరునంతటిమహాకవి రాజుపైఁ గలకోపమునఁ దనకృతిని నీచునకియ్యఁ బూనె ననుట యేమాత్రము విశ్వాసార్హము కాదు. సాహిణిమారుఁడు గుఱ్ఱములఁ గాచువాఁడు కాఁ డనుట కనేకదృష్టాంతము లున్నందున నీకథ కేవలకల్పిత మని కొంద ఱందురు అది నిజమే కావచ్చును లేక సాహిణిమారుఁడనువాఁడొకఁడు గుఱ్ఱములను గాచు వాఁడుగను నుండవచ్చును ఆపేరుగలవాఁడు గుఱ్ఱములకాచువాఁడుగా నుండఁ గూడ దనునియమము లేదు గాన నతఁ డుండినను మహాకవి యట్టివానికిఁ గృతి నియ్యఁ బూనుకొనె ననుటయే యసంగతము గాన నీగాథ కల్పితమే ఐనను దీనిం బట్టిచూచినను రంగనాథుఁడు రాజునొద్ద నాస్థానకవిగా నున్నవాఁడనియు నతని గ్రంథము రాజుగారిప్రీతికిఁ బాత్రమనియుఁ దేలుచున్నది

రంగనాథుఁడు రామాయణమును రచించుచో హనుమంతుఁడు సంజీవినై పోవునప్పుడు కాలనేమి కపటమునివేషధారియై హనుమ నొకసరోవరమునకుఁ బంప నతఁ డచ్చటికేగి మకరిచే మ్రింగఁబడి దానిం జంపఁగా నది తనపూర్వవృత్తాంత మును జెప్పుఘట్టమున

"ఇది తపఃఫలసార మెలనాఁగ! నాకు, నిది పుణ్యఫలసార మెలనాఁగ! నాకు
నిది మోక్షసాధన మెలనాఁగ! నాకు, నిది స్వర్గసోపాన మెలనాఁగ! నాకు."

అని కవి వ్రాయఁగా నాభాగమును విని రాజు తనభార్య యగునెల నాగయం దాతఁడు బద్ధానురాగుఁడయ్యె ననుకొని తనభార్యతో నాకవి వాంఛి తమును దీర్పవలయు నని యాజ్ఞాపించె ననియు, నాసంగతి విని కవి తనకామె యందుఁ గలమాతృభక్తిని దెలిపె ననియుఁ గొందఱు చెప్పుదురు. ఇట్టిగాథల కర్థము లేకపోవుటయేకాక యిట్టివి కవియొక్క నిర్మలమనశ్శుద్ధిని నణంచు నవియు నగునని చెప్పవచ్చును. ఇట్టిగాథల నేమాత్రము ప్రపంచజ్ఞానమున్న వారైనను విశ్వసింపరనుటలో సంశయముండదు

ఇక్కవి యిప్పటి కేడువందలసంవత్సరములక్రిందట నున్నవాఁడు. ఇతఁడు రామాయణమును యథామూలముగాఁ దెనిఁగింపక కథను మాత్రమే గ్రహించి కొన్నితావులంబెంచియుఁ గొన్నితావుల సంకుచితముచేసియుఁ దెనిఁగించెను. ఇంతియే కాక మూలములో లేనిగాథలఁ గొన్నింటిం జేర్చియున్నాఁడు సులో చనసహగమనము, కాలనేమిచరిత్రము నివి క్రొత్తగా నిందుఁ జేర్పఁబడినవి. మూలమున కిది యెట్టిపరివర్తనమో ఆవిషయమును జర్చించుట యనవసరము గాన దానిజోలి మానితిని.

రంగనాథునకు సంస్కృతాంధ్రములయం దసమానపాండిత్యము గలదు. మనోహరముగఁ గవిత్వము చెప్పుసామర్థ్య ముగ్గురితోఁ బెట్టినట్లూహింపవచ్చును. ద్విపదకావ్యముగాన శైలి సరసముగనే యుండుననరాదు. ఎన్ని యో ద్విపదగ్రంథము లున్నవిగాని దీనిం బోలినదానిం దఱుచుగఁ గానము ఒకొక్కస్థలమునఁ బూసగూర్చినట్లు సంస్కృతపదములను గవి కూర్చియున్నాఁడు కొన్ని తావుల సులలితము లగునాంధ్రపదములను రత్నములవలెఁ గూర్చియున్నాఁడు.

ఈరంగనాథరామాయణము లాక్షణికగ్రంథమే యని యప్పకవి మొదలగువారు పరిగ్రహించియున్నారు దుష్టసంధులు లోనగువ్యాకరణదోషము లందందుఁ గనుపట్టుచున్నవి చిరకాలముక్రిందట వ్రాయఁబడినతాళపత్రగ్రంథ మొకటి నాకరగతమై యున్నందున దానింబట్టి ముద్రితపుస్తకములో వదలిపెట్టఁబడినకొన్ని భాగములను జేర్చితి. కొన్ని కొన్నితావుల విశ్రమదోషములును గనఁబడుచున్నవి పారకులవలన నిట్టి దోషములు సంభవించినవో లేక ప్రమాదవశమునఁ దొలుతనే పడినవో చెప్పఁజాలను.

ఇఁక నీగ్రంథమందలివిశేషాంశములం జూపుచున్నాను.

సంస్కృతసమాసములు.

"రణభేరి వేయించి రత్నశైలాభ, గణనీయశబలాశ్వకలితవైడూర్య
మణికూబరసువర్ణమయచక్రదశక, రణజయప్రదధనుర్బాణాసిపూర్ణ
రణితకింకిణి యైనరథ మెక్కి వెడలె ." ఆరణ్యకాండము 139 పుట.

"బర్హ్మణవర్ణనిబర్హ్మణపవన, గర్హ్మణచణకాంతిఘనవేగతురగ
సందోహసంభృతస్యందనో త్తమము .." ఆరణ్యకాండము 140 పుట.

"మండితపరివేషమధ్యందినార్క, మండలపరివేషమహితానుకారి
కుండలీకృతచండశోదండదండ, భండనాత్యుత్సాహబాహుఁడై వ్రేయ"
ఆరణ్యకాండము 141 పుట.

"నూత్నశృంగారమనోహరాగార, రత్నవికర్దికారమణీయహార
రంగవల్లీహారరంజితద్వార, రంగధ్వజోదారరమ్యపటీర
నీరపూరితమార్గనిరుపమాకార, పౌరసంచారసంభరితంబుగాఁగ" కిష్కిం. 190 పుట.

"చండవాతాభూతజాతడిండీర, గండూషితాశావకాశనీకాశ
వీచీసమాచీనవిహరమాణాది, వైచిత్రకరవాలవరవాలములను" కిష్కింధా. 204 పుట.

ఆంధ్రపదములకూర్పు.

"వ్రతములఁ గడు డస్సి వనటులఁ గ్రుస్సి, యతిదుఃఖములఁ గుంది యాత్మలోఁ గంది
విపులాశ్రువులఁ దోఁగి విరహాగ్నిఁ గ్రాగి, కపటవృత్తులఁ జిక్కి కడుముట్ట స్రుక్కి

జీవంబువై రోసి చెలువంబుఁ బాసి, యూవిధి మదిఁ దూఱి యలసత మీఱి
చెక్కిటఁ జెయిఁ జేర్చి చింతల కోర్చి, దిక్కు లేమిఁ దలంచి ధృతి దూర డించి
యినరశ్మి వాడినయెలదీఁగెఁబోలె, ఘనధూమయుతదీపకళికయుఁబోలె" సుం. 216 పుట.

క ల్ప న లు.

'శాకినీభూతపిశాచబేతాళ, డాకిను లంతఁ దండంబురై యపుడు
నేనుంగుతలకాయ లెసఁగఁ గుండలుగఁ, బూని యందలిమత్స్యములు దండులముగ
దండి రామునిరణధర్మసత్రమున, పండినారిచె రండు వరుస భుజింప
ననివేడ్కఁ బైకొన్నయధికారముద్ర, గొని రొద గాకుండఁ గూర్చుండఁబెట్టి
రక్తచందనమును రక్తాక్షతలును, రక్తసంకల్పపూరంబును దాల్చి
శరపహ్నిపక్వమాంసంపుటన్నములు, బారలినమెదడుపప్పును గొవ్వులందు
వరదలై యూజ్యప్రవాహముల్ కండ, లెరిగి కారిజము లనేకశాకముల
పాలపేపులు శాపపాశముల్ మేలి, వాలుగుండెలు పిండివంటలు మఱియు"
ఆరణ్యకాండము 142 పుట.

'పరితాప మనియెడిబడబాగ్ని గలిగి, పెరిగెడిలాల యిక్ ఫేనంబు గలిగి
వెడలుకన్నీరనువెల్లువగలిగి, కడలేనివగ పనుకరుడులు గలిగి
ప్రకటరోదనమనురావంబు గలిగి, చకితత్వ మనియెడిచలనంబు గలిగి
మునుకొని శోకసముద్రుడై పెద్ద, వెనుఁబడి యెంతయు వికలుఁడైయున్న
యూరావణుని. ." యుద్ధకాండము 364 పుట.

శ్లే ష లు.

"ఆతతానంతభోగాస్పదం బగుచుఁ, బాతాళమునుబోలెఁ బరఁగినదాని
మహనీయశతకోటిమహిమచేనిండ్రు, మహితాలయమువోలె మాసైనదాని
నిఖిలంబునందును సెగడుతేజమున, శిఖినివాసమువోలె జెలువైనదాని
సమధికం బైనశీషణప్పృత్తి గలిగి, యమునివాసమువోలె నమరినదాని
వివిధమేదోమాంసవితతిఁ గ్రవ్యాదు, భవనాంగణమువోలె భాసిల్లుదాని
నిరుపమతరవారుణీయుక్త మగుచు, వరుణాలయమువోలె వ్రాలినదానిఁ
దిరమైనయూసుగంధిస్పర్శనమున, మరుదాలయమువోలె మాసైనదాని
విలసితనిధులచే వెలసి కుబేరు, సెలవునువోలె వర్ణిశమైనదాని
సురవిభూతికిసెల్లనునిక్కిపట్టగుచు, హరునివాసమువోలె నమరినదాని" యు. 342 పుట.

చమత్కారములు.

"ఘన మైన పరుషరాక్షసభాషణములు, సనకాదియోగీంద్రసన్నుతుల్ గావు
ఊరపడిఁ బఱతెంచు నుగ్రదానవులు, పరిచారకామరప్రతతులుగావు
చలమున నార్చురాక్షసభటోత్తములు, నలిఁబాడుతుంబురునారదుల్ గారు
వ్రాలుచు నీమీఁద వచ్చునాగాలి, యాలవట్టంబులయనిలంబు గాదు
యుద్ధరంగం బమృతోదధిగాదు, యుద్ధంబు మఱికొలువుండుటగాదు" యు. 361 పుట.

ఈషక్కిని దరువాతికవులు తమగ్రంథములలో నిట్లే చెప్పుకొనియున్న వారు.

భాగవతము - పోతనకవిగారు.

సీ. "చలమున ననుఁ డాసి జలరాశిఁ జొరరాదు, నిగిడి గోత్రముదండ నిలుపరాదు
కేడించి కుంభినిక్రిందికిఁ బోరాదు, మనుజసింహుఁడ నని మలయరాదు
చేరినఁ బడవైతుఁ జేయి సాపఁగరాదు, బెరసి నాముందటఁ బెరుగరాదు
భూనాథహింసకుఁ బోరాదు ననుమాఱి శోధింతుఁ గానలఁ జొరగరాదు

ఆ. ప్రబలమూర్తి ననుచు భాసిల్లఁగారాదు, ధరఁ బ్రబుద్ధుఁడ నని తలఁపరాదు
కల్కితనముచూపి గర్వింపఁగారాదు, తరముగాదు కృష్ణ ! తలఁగు తలఁగు.

సీ. మహిమతో నుండఁగ మధురాపురముగాని పొలుపార వైకుంఠపురము గాదు
గర్వంబుతో నుండఁ గంసునిసభగాని సంసారరహితులసభయుఁగాదు
ప్రకటించి వినఁగ నాబాహునాదముగాని నారదువీణాస్వనంబుగాదు
చదురులాడఁగ మల్లజవిగ్రహముగాని రమతోడిప్రణయవిగ్రహముగాదు

తే. వెలసి తిరుగఁగ వేదాంతవీథిగాదు, మొఱసిసోమునిమనములమూలగాదు
సాగి నడుపంగ భక్తులజాడగాదు, శౌరి నామ్రోల నీవెందుఁ జనియె దింక.

భాగ. స్క-o. ౧౦.

ఇంకను గొందఱు కవు లీరంగనాథునిమార్గమునే యనుసరించిరి. వాని నన్నింటిని బేర్కొనుట కిది సమయముగాదు గదా.

శైలి.

"మాటమాత్రంబున మహియునాకసము, మీటను నాట నవ్వేటియె నేర్చు
గార్చిచ్చునైనను గరువలినైన, నార్చను గూర్చును నాతఁడే నేర్చు
భువనంబు లన్నియు బూదిగావింప, నవి బోదిగావింప నాతఁడే నేర్చుఁ
బాల్పడ బ్రహ్మాండభాండంబునైన, నిల్పఁబగుల్ప నానిపుణుండె నేర్చు" ఆర. 145 పుట.

"పెట్టినసొమ్ములు పెట్టెలోఁ బెట్టి, దట్ట మా కస్తూరి తిలపట్టుపెట్టి
మలినవస్త్రము గట్టి మదినల్కదొట్టి, చలముచేఁబట్టి భూస్థలిఁబండెనంత." ఆయో. 79. పుట.

సులలిత నానార్థపదప్రయోగము.

"పుండరీకంబులఁ బొలుపారువారు, పుండరీకాక్షులఁ బొలుపారువారు
పుండరీకచ్ఛాయఁ బొలుపారువారు, పుండరీకోన్నతిఁ బొలుపారువారు."

యుద్ధ. 376 పుట.

ఇట్లెన్నియో యీగ్రంథమునుండి యుదాహరణములు చూపవచ్చును అప్పనిని జేసినచో గ్రంథమునెత్తి వ్రాసినట్లే యగును గాన మానితి ఇట్లు వీనుల విందైనగ్రంథమును రచించిన మహాకవిని బొగడ నాతరం బగునే?

ఇట్టియుత్కృష్టగ్రంథరత్నమున నేలొకో కొన్నిస్ఖాలిత్యములు కనఁబడు చున్నవి. కొన్నింటి నుదాహరించుచున్నాను.

యతిభంగము.

'అనఘు గంగాయమునలు గూడి యునికి.'' అయోధ్యాకాండము 105 పుట.

వ్యాకరణవిరుద్ధక్రియలు.

'వరతపోనియతిమై వర్షసహస్ర, మరుగఁబారణ నేతుననియున్నచోట.' బా. 54 పుట.

'ఏతల్లిపనినేతు నేతల్లిఁగొలుతు.' ఆరణ్యకాండము 161 పుట.

'మనఁజేతు నిప్పుడు మహిమోఁద ననిన.' యుద్ధకాండము. 302 పుట.

ప్రాసము.

'ఓరియూవానరుఁ డున్నాఁడొ లేఁడొ, వెర వారఁగా నాకు వివరించిచెప్పు'

యుద్ధకాండము. 298 పుట.

సంధులు

'ఆడుగులు చేతులు నంటంటి చూచి, యొడలఁ బ్రాణములు లేకునికి భావించి'

అయోధ్యాకాండము. 111 పుట.

'మునుకొని వార్ధుల ముంచి ముంచెత్తు' కిష్కింధాకాండము. 188 పుట.

'మొఱపెట్ట వార్ధుల ముంచి ముం చీడ్చి' యుద్ధకాండము. 298 పుట.

ద్రుతసంధి.

'చూపులచేతనే చూడఁ బుత్తునుచు' యుద్ధకాండము. 420 పుట.

కుషష్ఠికిముందునగాగమములేమి.

'శరభంగవానియాశ్రమము కేతెంచి. ఆరణ్యకాండము. 132 పుట.

'అనవుడు వెఱగంది యాజాంబవంతు, కనియె విభీషణుం డతిసంభ్రమమున'

యుద్ధకాండము. 379 పుట.

'అని లక్ష్మణుఁడు పల్క నావిభీషణుఁడు, దనమది నూహించి ధరణీశు కనియె'

యుద్ధకాండము. 398 పుట.

కొనునకు కాదేశము.

'బ్రహ్మాదులకు నడ్డపడరానియట్టి, బ్రహ్మాస్త్ర మవలీలఁ బట్టుక మ్రింగె'

బాలకాండము. 48 పుట.

'అడవుల కేనును నర్థితో వత్తు, దోడుక పొమ్మనఁ దూలి రాఘవుఁడు

అయోధ్యాకాండము. 90 పుట.

'తోఁక గాల్పించుక తొలఁగి వచ్చితిని, వీఁకతో రామునివీటిలోఁపలను'

యుద్ధకాండము. 299 పుట.

శేషద్వయమైత్రి.

'రెండుహస్తము లెత్తి యొక్కలతోడి, కొండరివ్వున వచ్చుకొమరుదీపింప' బాలకాండము. 23 పుట.

'ధరణీశుఁ డారాత్రి దప్పితో నంత, మఱి పొంది యాయజ్ఞమందిరమందు'

బాలకాండము. 60 పుట.

'ధారాకరాళమై దనుజవర్గములఁ, గాఱించి నొంచి చీకాకు గావించి'

ఆరణ్యకాండము 142 పుట.

'మొఱపెట్ట వార్ధుల ముంచిముంచీడ్చి, కరుణించి విడువఁడే ఘనుఁ డైన వారి?'

యుద్ధకాండము. 298 పుట.

ఇట్టిదోషము లందందుఁ గనఁబడుచున్నను సంపూర్ణనిశాకరునందుఁ గళంకము వలె మొత్తముమీఁద నిమ్మహాకవిత్వము నిర్దుష్టమై శ్లాఘాపాత్రమై తరువాతికవులకు మేలుబంతియయ్యె ననిచెప్పుట కావంతయు సంశయము లేదు. ఇట్టియుత్తమగ్రంథమును రచించియుఁ దనవిషయమును గొంచెమైనను జెప్పుకొనుట కవకాశమీయక ధనలోభమునకుఁ జిక్కి ననుటకంటె నిమ్మహాకవివిషయమున వేఱొక్కమాటఁ జెప్పవీలులేదు. ఎంతగాఁ దనపేరు నాచ్ఛాదించుకొనినను శాశ్వతకీర్తియిమ్మహాకవిపుంగవునకు వచ్చియే తీఱినందులకు మనము సంతోషింపవలయును. ఈగ్రంథము పెక్కుతావులఁ బురాణము చెప్పఁబడుచు నెందఱో పామరులకోరామాయణకథను వెల్లడించి భక్తిశ్రద్ధల వృద్ధి సేయుచున్నది ఇంతకంటె సత్కవులకు వేఱొక ఫలమేమి కావలెను? ఇట్లే యిక్కాలపుఁగవిపుంగవులును సద్గ్రంథముల రచించి పామరులకు జ్ఞానాభివృద్ధిని జేయుదురుగాక! సర్వేశ్వరుఁడు, సర్వసాక్షి, కరుణానిలయుఁడు నగుపరమపురుషుఁడు సద్గ్రంథముల వృద్ధిఁ జేయుట కెల్లరఁ బురికొల్పుఁగాక.

ఇట్లు విన్నవించు విద్వద్విధేయుఁడు,

జనమంచి శేషాద్రిశర్మ,

కడప హైస్కూలు ఆంధ్రపండితుఁడు.

మొదటికూర్పు పీఠిక.

శ్రీవాల్మీకిమహర్షిప్రణీతం బగు శ్రీమద్రామాయణము సంస్కృతభాషయం దాదికావ్యము అది తన్నుపాసించుమానవులకుఁ గల్పతరువుంబోలెఁ జతుర్విధ పురుషార్థంబుల నొసంగుచు మహామహిమంబునఁ జెన్నారు రామాయణకథ నెఱుంగనిమనుజులు మనదేశంబున లేరని చెప్పవచ్చును ఈపుణ్యచరిత్రమును సంస్కృత భాష నెఱుంగని యాంధ్రదేశపుజనుల కుపయుక్తం బగునట్లు తొలుత రంగనాథుఁడనుకవి ద్విపదకావ్యంబుగా రచియించెను పిమ్మట భాస్కరుఁడు మున్నగు కవులు పద్యకావ్యంబుగా రచించిరి అనంతరము కొండొకకాలమున కుత్తరరామకథను గవిబ్రహ్మ యని సన్నుతి గాంచిన తిక్కనసోమయాజి నిర్వచనోత్తరరామాయణం బనుకావ్యంబును నిర్మించెను ఇప్పటికాలంబున గోపీనాథము వేంకటకవియు, వావిలి కొలను సుబ్బారాయకవినాథుఁడును రామాయణకావ్యంబును మూలము ననుసరించి పద్యకావ్యంబులుగా వ్రాసి కీర్తిఁ గాంచిరి ఇంకను బెక్కండ్రుకవులు రామచరిత్రమును బెక్కుతెఱంగుల వ్రాసియున్న వారు

ఆంధ్రంబున రామాయణమును వ్రాసినవారిలోఁ దొల్లటికవి రంగనాథుఁడు. ఈగ్రంథమున సుపోద్ఘాతమునందుఁ గోనబుద్ధరాజు తనజనకుండగు విట్ఠల నృపాలునియాజ్ఞచే నతని కంకితంబుగ రామాయణము నాంధ్రీకరించె నని యుండుటం బట్టి దీనిని రచించినకవి కోనబుద్ధరాజని యెన్నఁదగి యున్నను దీనికిఁ జిరకాలము నుండి రంగనాథరామాయణ మనియే వేరు కలిగియుండుటచేఁ గోనబుద్ధరాజునొద్ద నాస్థానకవి యగు రంగనాథుఁ డీగ్రంథమును బుద్ధరాజువేరుతో వ్రాసి తదీయాజ్ఞానుసారంబుగ విట్ఠలధరణీశువేర నంకితంబు గావించెనో యనుసందేహము పొడమచున్నది. లేకున్న నీగ్రంథమునకు రంగనాథరామాయణ మనుపేరు కలుగుటకుఁ గారణము కానంబడదు

రంగనాథకవి యేకాలపువాఁడో యేకులమువాఁడో యని తెలియుట కాధారము లేవియుఁ గానరావు హూణశకము పండ్రెండవశతాబ్దంబున నుండిన వాఁడని వీరేశలింగముపంతులుగారు కవిజీవితములోఁ వ్రాసిరికాని దానికిఁ బ్రబల నిదర్శనములు కానంబడవు. భాస్కరుఁడును రంగనాథుఁడును సమకాలికు లనుట కొకగాథ కలదు. కోనబుద్ధరాజు నాస్థానకవియగు రంగనాథుఁడు రామాయణమును

ద్విపదకావ్యముగా వ్రాయుచుండఁగా దాని నెఱింగి నృపాలునియొద్ద మున్నుగాఁ దనకావ్యము నొసఁగి బహుమతు లందఁగోరి భాస్కరుఁడు రామాయణమును బద్యకావ్యముగాఁ దనమిత్రులచేఁ గొంత వ్రాయించి తానుం గొంతభాగమును వ్రాసి పూర్తిచేసి రాజునొద్దకుఁ గొనిపోయెననియు నాసమయంబుననె రంగనాథుఁడును దా నొనర్చినరామాయణమును దీసికొనివచ్చి రాజున కొసఁగఁగా నమ్మహీపతి యాశ్రితపక్షపాతంబున రంగనాథునిరామాయణమును దక్షిణహస్తంబున గ్రహించి భాస్కరుని రామాయణము నెడమచేతఁ బుచ్చుకొనఁబోఁగా భాస్కరుఁ డవమానితుఁడై కోపించి నాయుత్తమకావ్యంబును నీయట్టి పక్షపాతముగల నరవరున కిచ్చుటకంటె నీగుఱ్ఱపువాని కిచ్చుట మేలని చెప్పి లేచి పోవుచుండగా నతని యశ్వాధ్యక్షుఁడైనసాహిణిమారుఁ డామాటలు వినుచుండి కవీంద్రా! నీయా డినమాట తప్పక కృతిని నా కిమ్మని వేఁడఁగా భాస్కరుండు రామాయణము నతని కంకితము చేసె ననియు నొకకథ కలదు. ఇది నిక్కమయేని రంగనాథుఁడును హూణ శకము పదుమూఁడవశతాబ్దమున నుండినవాఁడని చెప్పవచ్చు.

ఇక రంగనాథుని కవిత్వముం గూర్చి యించుక విచారింతము ద్విపదకావ్యములలో శ్రేష్ఠమైనది రంగనాథరామాయణ మనిచెప్పుటకు సందేహము లేదు అందఱును బ్రౌఢకావ్యములను జదివి వానియర్థంబుల నెఱుంగుట దుష్కరము. కావున స్త్రీలు లోనగువారికి సులభముగాఁ దెలియుటకై తొల్లి కొందఱు కవీశ్వరులు ద్విపదకావ్యములుగా వ్రాసియున్నారు హరిశ్చంద్రోపాఖ్యానము, నలచరిత్రము రాజయోగసారము, పరమయోగివిలాసము, సిద్ధేశ్వరచరిత్రము మొదలగు గ్రంథములు ద్విపదకావ్యములుగా వ్రాయఁబడి యున్నవి. రంగనాథుఁడు రామాయణమును వ్రాసిన యనంతర ముత్తరరామాయణమును ద్విపదకావ్యముగా రంగనాథుఁడే వ్రాసి కోనబుద్ధరాజుకుమారులైన కాచవిభుఁడును విట్టలనృపాలుఁడును రచించినట్లు వారికిఁ గృతిపతిత్వ మొసఁగెనని తోఁచుచున్నది

రంగనాథునిశైలి ద్రాక్షాపాకమై సలక్షణమై రసవంతమై యెంతయు మనోహరముగా నుండును అన్వయకారిన్యము కొంచమేనియు లేక చక్కనిజాతీయములతో నొప్పారుచుఁ జదువఁ జదువ మనంబున కానందంబుఁ గలిగించును గ్రంథమును జదువుచున్నపుడు శ్రీరాముని దివ్యచరిత్రమును గన్నులారఁగనుచు వీను లార వినుచున్నట్లు తోఁచును కావున రంగనాథరామాయణమును నాంధ్రదేశీయులు పలుమాఱు వీధిపురాణముగాఁ బరింతురు

ఇతనికవిత్వమునఁ దెనుఁగుపదములు మెండుగాను సంస్కృతపదములు స్వల్పముగాను నుండును.

తెనుఁగురచనల కుదాహరణము: —

"తిట్టుపాటున కోడి తివిరి నాకొడుకు, పట్టుబు మాన్పింపఁ బనిచెఁ గాకథిప
సొంపేది రాముని స్రుక్కక కైక, చంపు మన్నను బట్టి చంపవే నీవు?
పెద్దకాలము నాకు బిడ్డలు లేక, పెద్దయు శోకించి పెక్కులు నోచి
కడపట నొక్కనిఁ గని యేను గొంత, యుడుకాఱి యున్నచో నుండనివైతి"

అయోధ్యాకాండము. పుట. 107

ఇక్కవి తెలుఁగుశబ్దములు విశేషముగాఁ బ్రయోగించుచున్నను దనపాండిత్యమును దెల్పుటకై యక్కడక్కడ సంస్కృతరచనలును గావించియున్నాఁడు ఉదాహరణము:—

"గంధకస్తూరికాకలితాంబుపూర, గంధిలసకలమార్గధరాంగణంబు
చీనిచీనాంబరశ్రేణివితాన, నానామణితోరణధ్వజాంచితము
ఫలభారక మ్రరంభాస్తంభపూగ, కలిత ప్రతిద్వారకక్ష్యాంతరంబు
సాంకవలిప్తవిస్తారవితర్ది, కాంకితరంగవల్ల్యావిశోభితము
మణిశాతకుంభకుంభవితర్కితార్క, గణసౌధగోపురోత్కరశిరోగ్రంబు" బా పు. 63

ఈగ్రంథంబునందు రంగనాథకవి శబ్దాలంకారములను నర్థాలంకారములను సమయోచితంబులుగా నందందుఁ బ్రయోగించి యున్నాఁడు శబ్దాలంకారముల కుదాహరణములు: —

"రాముని జితభృగురాముని కాంతి, సోముని సద్గుణస్తోముని కీర్తి
కాముని సౌందర్యకాముని శాంత, ధాముని రవిసమధాముని బాసి" అయో. పుట. 82.

"కమనీయమృదుకరకమలయుగ్మముల, గమలము ల్లింతురు కమలంగఁ బట్టి
కమలాకరంబులఁ గమలాప్తకులుఁడు, కమలారియునుబోలి కమలముల్ నొంచు"

యుద్ధకాండము. పుట. 247

"జగతీతనూజాత జగదేకమాత, నిగమసన్నుతపూత నిగమవిఖ్యాత
యమితగుణోపేతయైనయాసీత....." యుద్ధకాండము. పుట. 282

219-220 పుటలలోఁ గన్పడు వర్షాకాలశరత్కాలవర్ణనలందును 313 పుటయందుఁ గన్పట్టుచంద్రోదయవర్ణనలందును నుపమోత్ప్రేక్షాశ్లేషాద్యర్థాలంకారములు తెలియనది.

రంగనాథుఁడు లాక్షణికుండగుమహాకవియయ్యు చంద్రునందుఁగళంకముంబోలె నితనికావ్యంబున నక్కడక్కడఁ గొన్ని లక్షణవిరుద్ధములు కానంబడియెడి.

"వీతల్లిపని సేతు సేతల్లిఁ గొలుతు" పుట. 161.

ఒకానొకచోట రేఫశకటరేఫలమైత్రియుఁ జూపట్టుచున్నది:—

"మీఱి తాపసులను మ్రింగెదువీవు, వారు తాపసులను వడిఁ బ్రోతురెపుడు" పుట. 282

ఇట్టి ప్రయోగము లొకకొన్ని కానంబడుచున్నను రంగనాథకవిని లాక్షణికునిగాఁ బూర్వకవు లంగీకరించియున్నారు కావున నివి రంగనాథునివి కావనియుఁ గొంద ఱూహించుచున్నారు

రంగనాథుఁడు వాల్మీకిరామాయణము ననుసరించి వ్రాసినను మూలగ్రంథము లోని యన్నియంశములను సంక్షేపముగా వ్రాసెను; గాని యన్యూనానధిక మగు భాషాంతరము చేసినవాఁడుకాఁడు కొన్నిచోటులఁ దనయిష్టము చొప్పున వర్ణనలు పెంచియుఁ గొన్నిచోటుల మార్చియు నున్నాఁడు ఎటు లున్నను ముఖ్యములగు నంశములనుమాత్రము విడువక తెనుఁగు చేసి యున్నాఁడు. వీని కుదాహరణము లూహించుకొనునది

రంగనాథరామాయణ మాంధ్రదేశంబున సకలజనాదరణీయమైనగ్రంథ మనిమున్నె యెఱింగించితిమి. ఇందేపట్టునఁ జూచినను రసవంతముగాను హృదయరంజకముగాను నున్నను మిక్కిలి రమణీయములగుభాగములలోఁ గొన్నించి నిటఁ జూపెదము

అయోధ్యాకాండమున దశరథుఁడు కైక ననునయించుసందర్భమున—

(పుట. 80).

"ఇందీవరాక్షి పూర్ణేందునిభాస్య, ఇందిందిరాలక యేల యీయలుక
పళింప నేలనే బాలేందుఫాల, యవిరళమృదులపర్యంకంబు లుండఁ
గోమలమృదులదుకూలంబు లుండ, నీమైలచీర నీ వేల కట్టితివి
పసిఁడిశలాకతోఁ బ్రతియైనమేనఁ, బొసఁగ భూషణములఁ బూన వేమిటికిఁ
జలపట్టి వెన్నెలచందమా నుదుటఁ, దలపట్టు వేయ నీతలఁ పెట్టు పుట్టె
నీలాలకంబుల నిగ్గులు దేర, నేల పాపటదీర్పు విన్నాళ్లరీతిఁ
గెమ్మోవి కినుమడి కెంపుసంధిల్లఁ, గమ్మకమ్ముల మేల కైదోవు బాల
జిలుగుపన్నెలతేట చిఱునవ్వుమొలక, మొలిపింప వేటికి ముఖచంద్రునందు"

సుందరకాండమున హనుమంతుఁడు సీతాదేవిని వెదకుప్రకరణంబున—

(పుట 215)

"ఇనవంశవల్లభుఁ డేకతంబునను, మును నన్ను రమ్మని ముద మొప్పఁ బిలిచి
జనకజఁ బొడఁగానఁ జాలుదు వీవ, యని చెప్పి నాచేతి కానవా లిచ్చెఁ
బనిపూని వచ్చితి బంటనై యేను, కనుఁగొనలే నైతిఁ గమలాక్షి నెందు
నీదురాత్ముఁడు సీత నిటఁ దెచ్చుచోట, వేదనఁ బ్రాణము ల్విడిచెనో యింత

* * * *

యేమని మగుడుదుఁ నేమందుఁ బోయి, యేమిసేయుదు నింక నిటమీఁద నేను
వామాక్షిఁ గానక వచ్చితి ననిన, రాముఁ డప్పుడె పాయుఁ బ్రాణవాయువుల
నన్నకై సౌమిత్రి యడుగు నీవార్త, విన్నంత భరతుండు విడుచుఁ బ్రాణముల
నతనికై శత్రుఘ్నుఁ డఖిలబాంధవులు, హతు లౌదు రినవంశ మంతట సమయు
నది చూచి సుగ్రీవుఁ డాయంగదుండు, మొదలైనకపివంశమును నాశమొందుఁ
గాన వానప్రస్థగతి మహాటవుల, నేను గా ఫుండుదు నిదియుఁ గాదేని
సొదఁ బెర్చుకొని యగ్నిఁ జొత్తు నొండేని, యుదధులఁ బడిచత్తు నుసురాన దక్కి-
యక్కట సంపాతి యూడినమాట, నిక్కంబుగా నమ్మి నీరధి దాఁటి
యిచ్చటి కొంటిమై యేవచ్చు టెల్ల, నచ్చుగా వృథ మయ్యె నౌఁగాక యేమి"

272 పుట చంద్రోదయవర్ణన మెంతమనోజ్ఞముగాఁ జేయఁబడినది చూడఁదగు

"కృతకృత్యుఁ డగురాముకీర్తిపుష్పములు, చతురతమై వెదచల్లినయట్లు
కరమొప్పఁ జుక్కలు గాన్పించె నంతఁ, జిరకాలములసీమ శిశువులమామ
పాలుపొందుకలువలపోరాని విందు, కలసినజక్కవకవఁ బాపు మందు
పాలవెల్లిని ద్రచ్చిపడసిన వెన్న, హాలియూఁదలపూవు చుక్కలనవ్వు
నెఱిచకోరములకు నెలనేల పంట, యురవేది విరహుల నుడికించుమంట
గగనంబుతొడవు దొంగలగుండెదిగులు, నొగి నబ్ధిఁ బొంగించు నూఱటపట్టి
హరిహరబ్రహ్మల యానందదృష్టి, సరసిజరిపుఁ డైన చంద్రుఁడు వొడిచె"

ఇట్టి వర్ణనలు మఱియుఁ బెక్కు లున్నవి వానిం జదువరు లారయునది

తేనియతేఁటలంబోని మధురరసవచనంబులు నివ్వటిల్ల "నసమానలలితశబ్దార్థ సంగతులఁ...బరఁగ నలంకారభావనల్నిండ"నీరామాయణమును రచియించిన రంగ నాథకవి నెంతయేని నుతింపఁ దగియుండెడు చరిత్రము శ్రీరాముని దగుటచే నిది పరమపావనంబును సకలపురుషార్థప్రదంబును గలికలుషవిధ్వంసనచణంబును గావున దీని నాంధ్రదేశీయులెల్లరుఁ బరమాదరంబునఁ బరించుచుఁ గృతకృత్యులై యెల్ల సౌఖ్యములఁ బడయుచు నానందింతురుగాక.

నాగపూడి - కుప్పుస్వామయ్య.

విషయసూచిక

బాలకాండము.

విషయము.		పుట.
కథాప్రారంభము	...	4
దశరథుఁడు మంత్రులతోఁ బుత్రకామేష్టి సేయ నాలోచించుట	...	9
ఋష్యశృంగుండు వారాంగనలఁ దగిలి రోమపాదునియింటికి వచ్చుట	...	12
దశరథుఁడు యాగదీక్ష వహించుట	...	13
దశరథునకు యజ్ఞపురుషుఁడు దివ్యపాయస మిచ్చుట	..	16
శ్రీరామావతారము	...	17
కౌశికుఁడు యజ్ఞరక్షణార్థమై దశరథునితోఁ రాముని బంపుమనుట	...	19
కౌశికునితోఁడ రామలక్ష్మణులఁ బంపుట	...	21
విశ్వామిత్రుఁడు రామునకుఁ దాటకాజననము చెలుపుట	...	23
శ్రీరాములకు భృశాశ్వసంతానము లైన యస్త్రశస్త్రముల నిచ్చుట	..	24
శ్రీరాములకుఁ గౌశికుఁడు ఆశ్రమాదుల నెఱిఁగించుట	...	26
రాముని మిథిలానగరమునకుఁ బోన మునులు ప్రేరేపించుట	...	28
విశ్వామిత్రుఁడు తనవంశక్రమంబు చెలుపుట	...	30
కౌశికుఁడు కుమారస్వామిజననము చెలుపుట	...	31
శ్రీరాముఁడు సగరులవృత్తాంతముఁ చెల్పు మనుట	...	34
అంశుమంతుఁడు అశ్వరాశ్వముఁ చెచ్చుట	...	36
భగీరథుఁడు గంగను చెచ్చుట	...	37
దేవత లమృతంబు వడయుట	...	40
సుమతి యనురాజు విశ్వామిత్రుని నెదుర్కొనుట	...	42
గౌతముఁ డహల్యకు శాపమిచ్చుట	...	44
శతానందుఁడు విశ్వామిత్రప్రభావంబుఁ చెల్పుట	...	46
కౌశికుఁడు ఈశ్వరునిచేత నస్త్రాదులు వడసి వసిష్ఠునితోఁ బోరుట	...	48
త్రిశంకునికై కౌశికుఁడు యజ్ఞంబుచేయ నారంభించుట	...	50
అంబరీషుఁడు యజ్ఞపశువుగా శునశ్శేఫునిఁ గొనిపోవుట	...	51
విశ్వామిత్రుఁడు మేనకను గూడుట	..	53
జనకుండు శివునిచాప మెఱిఁగించుట	...	55
శ్రీరాముఁడు శివునివిల్లు విఱుచుట	...	57
దశరథుఁడు మిథిలకుఁ బోవుట	...	58
వసిష్ఠుఁడు యువనాశ్వునివృత్తాంతముఁ చెల్పుట	...	60
శతానందుఁడు జనకునివంశక్రమంబు చెల్పుట	...	62
దాశరథుల నలంకరించుట	...	64
శ్రీసీతారామకల్యాణము	...	66

విషయము.		పుట.
పరశురాముఁడు శ్రీరాము నెదుర్కొని భంగపడుట	...	68
దశరథుఁడు పుత్రులం దోడ్కొని అయోధ్యకేగుట	...	71

అయోధ్యాకాండము.

దశరథుఁడు వసిష్ఠాదులతో రామునకుఁ బట్టముఁ గట్ట నాలోచించుట	...	74
మంథర కైకకు దురుక్తులు బోధించుట	...	77
దశరథుఁడు కైకయింటికిఁ బోవుట	...	79
కైక తన కిచ్చినవరముల నడుగుట	...	81
కైకయింటికి దశరథుని బిల్వ సుమంత్రుండు పోవుట	...	83
శ్రీరాములు కైకయింటిలో నున్నదశరథునిఁ బొడగాంచుట	...	84
కౌసల్య ప్రలాపించుట	...	86
శ్రీరాములు కౌసల్యకు నీతిఁ జెల్పుట	...	88
సీతతో రాజ్యాభిషేకభంగ మెఱిఁగించుట	...	90
సీత వచ్చుటకు శ్రీరాములు సమ్మతించుట	...	92
శ్రీరాములు త్రిజటాఖ్యునకు గోవుల నిచ్చుట	...	93
శ్రీరాములు సీతాలక్ష్మణసమేతుఁడై దశరథునియొద్దకు వచ్చుట	...	95
వసిష్ఠుఁడు కైకతో కరినోక్త లాడుట	...	97
కౌసల్య సీతకుఁ బతిధర్ముఁ జెల్పుట	...	98
దశరథుఁడు రథము నిల్పుమని సుమంత్రునిఁ బిలుచుట	...	101
శ్రీరాములు గుహునిఁ జూచుట	...	102
సుమంత్రుఁడు అయోధ్యకు రథముఁ దెచ్చుట	...	104
దశరథుఁడు కౌసల్యకుఁ దనశాపముఁ జెల్పుట	...	107
దశరథుఁడు యజ్ఞదత్తుని జూచి చింతించుట	...	108
దశరథుఁడు ప్రాణముల విడుచుట	...	111
భరతుఁడయోధ్యకు వచ్చుట	...	112
భరతుఁడు కౌసల్యయొద్దకు బోవుట	...	114
భరతుఁడు రామునియొద్దకుఁ బోవుట	...	116
భరతుఁడు భరద్వాజాశ్రమంబుఁ జేరుట	...	117
భరతుఁడు మునివేషధారులైన రామలక్ష్మణులఁ బొడగాంచుట	...	119
దశరథునిమృతి రామలక్ష్మణు లెఱుంగుట	...	121
జాబాలి యనుముని శ్రీరామునకు నీతిఁ జెల్పుట	...	123

అరణ్యకాండము.

శ్రీరాముఁడు దండకారణ్యమునకుఁ బోవుట	...	127
శ్రీరాముఁడు శరభంగాశ్రమంబుఁ జేరుట	...	128

విషయము.		పుట.
శ్రీరాముఁడు అగస్త్యులఁ గాంచుట	...	131
సౌమిత్రి ఖడ్గముఁ గొనుట	...	134
మునులు జంబునితపఃప్రభావంబుఁ దెల్పుట	...	135
శూర్పణఖ రామునిఁ జూచి మోహించుట	...	137
ఖరుఁడు సేనలఁ బంపుట	...	139
ఖరునిసేనలు రాము నెదుర్కొనుట	...	141
శ్రీరామునితో ఖరదూషణులు పోరుట	...	142
ఖరుఁడు శ్రీరాముల నెదుర్చుట	...	144
శూర్పణఖ శ్రీరాములరూపాతిశయముఁ దెల్పుట	...	147
మారీచుఁడు శ్రీరామునిప్రభావముఁ దెల్పుట	...	148
మారీచుఁడు మాయామృగరూపధారియై వచ్చుట	...	150
మాయామృగము రామునిచేఁ గూలుట	...	152
రావణుఁడు భిక్షుకవేషధారియై సీతాదేవియొద్ద కేతెంచుట	...	153
జానకి శోకించుట	...	155
రావణునితో జటాయువు పోరుట	...	157
జనకజను అశోకవనమునం దుంచుట	...	159
శ్రీరాముఁడు ప్రలాపించుట	...	161
లక్ష్మణుఁడు రాముని శాంతిపఱచుట	...	163
జటాయువునకు అగ్నిసంస్కారము సేయుట	...	164
రామలక్ష్మణులు శబరినిఁ గాంచుట	...	167
శ్రీరాముఁడు ఋశ్యమూకమును జూచి హర్షించుట	...	168

కిష్కింధాకాండము.

శ్రీరాములవద్దికి హనుమంతుఁడు వచ్చుట	...	173
హనుమంతుఁడు తనజన్మప్రకార మెఱిఁగించుట	...	174
సుగ్రీవుఁడు జనకజతొడవు లిచ్చుట	...	176
వాలి మాయావితో యుద్ధముచేయుట	...	178
వాలిదుందుభులయుద్ధము	...	179
వాలిసుగ్రీవులు పోరుట	...	182
తార సుగ్రీవునితోఁ బోరపడ్డని వాలి నడ్డగించుట	...	183
అమోఘాస్త్రముచే వాలి గూలుట	...	185
తార ప్రలాపించుట	...	187
వాలి సుగ్రీవునకు హేమదామ మిచ్చుట	...	189
శ్రీరాములు మాల్యవంతముఁ జేరుట	...	191
లక్ష్మణుఁడు కిష్కింధకుఁ బోవుట	...	193

విషయము.		పుట.
లక్ష్మణుఁడు సుగ్రీవుని మన్నించుట	...	194
వానరవీరుల సీతను వెదకఁ బంపుట	.	196
శ్రీరాములు హనుమంతునిచేత తనముద్రిక నిచ్చుట	...	197
అంగదాదులు కణ్వాశ్రమముఁ జేరుట	...	199
అంగదాదుల సంపాతి చూచుట	...	202
వానరవీరులు తమతమసత్త్వములఁ జెల్పుట	...	204
జాంబవంతుఁడు హనుమంతునిఁ బ్రార్థించుట	...	205
హనుమంతునకు మైనాకుఁ డాతిథ్య మొసఁగుట	. .	207

సుందరకాండము

హనుమంతుఁడు లంకాపురిఁ జొచ్చుట	...	211
హనుమంతుఁడు ఉద్యానవనంబుఁ జూచుట	...	214
హనుమంతుఁడు సీతను జూచుట	...	216
రావణుఁడు సీతాదేవియొద్దకు వచ్చుట	...	217
జానకి రావణుని తిరస్కరించుట	...	218
మండోదరి రావణునికి నీతిఁ జెల్పుట	...	220
రాక్షసస్త్రీలబాధలకు జానకి పలవించుట	...	222
హనుమంతుఁడు సీతకుఁ దనజన్మముఁ జెల్పుట	...	224
హనుమంతుఁడు సీతతో శ్రీరాములక్షేమముఁ జెల్పి శిరోరత్నము గొనుట	...	225
హనుమంతుఁడు అశోకవనముఁ జెఱచుట	...	227
హనుమంతునిమీఁదికి రక్తరోముఁడు మొదలైనరాక్షసుల రావణుఁడు పంపుట	...	229
హనుమంతునిమీఁదికి అక్షకుమారుఁడు వచ్చుట	...	231
ఇంద్రజిత్తు తండ్రి నూరార్చి హనుమంతునిపైకిఁ బోవుట	. .	233
హనుమంతుఁడు రావణునితో తనరాక యెఱిఁగించుట	...	234
హనుమంతుఁడు లంకఁ గాల్చుట	...	236
అంగదాదులు మధువనంబునకు వచ్చుట	...	239
హనుమంతుఁడు సీతను జూచినతెఱం గెఱిఁగించుట	...	240

యుద్ధకాండము.

హనుమంతుడు లంకాప్రభావముఁ జెల్పుట	...	244
సుగ్రీవుఁడు కపిసేనల వెడలించుట	...	245
శ్రీరాములు మహేంద్రాద్రిఁ జేరుట	. .	247
రావణుఁడు మంత్రులతో నాలోచించుట	...	249
రాక్షసవీరులు రావణునితోఁ బ్రతాపముఁ జెల్పుట	...	250
విభీషణుఁడు రావణునియొద్దకుఁ బోవుట	...	252
రావణుఁడు కుంభకర్ణునితో రామునిరాక యెఱిఁగించుట	...	254

విషయము.		పుట.
ఇంద్రజిత్తు విభీషణునికి తనప్రతాప మెఱిఁగించుట	...	256
రావణుఁడు విభీషణునిఁ దన్నుట	...	258
తల్లియొద్దకు విభీషణుఁడు వచ్చుట	...	259
విభీషణశరణాగతి	...	261
రామునకు విభీషణునియోగ్యత నాంజనేయుం డెఱిఁగించుట	...	261
విభీషణుఁడు శ్రీరామచంద్రు నుతించుట	...	262
శ్రీరామచంద్రుఁడు విభీషణు ననుగ్రహించుట	...	263
విభీషణుఁడు రామునకు రావణునిబలం బెఱిఁగించుట	...	263
శ్రీరాముఁడు విభీషణునకు లంకాభిషేకము సేయుట	...	265
శ్రీరాములు దర్భశయనముసేయుట	...	267
శ్రీరాములు సముద్రునిమీఁద బ్రహ్మాస్త్ర మేయుట	...	269
శ్రీరాములు సుగ్రీవునితో సేతువుగట్ట నాజ్ఞాపించుట	...	270
చంద్రోదయవర్ణనము	...	272
శ్రీరాములు సేతువును జూచి సంతోషించుట	...	274
శ్రీరాములు సువేలాద్రిఁ జేరుట	...	276
శైకేశి రావణునకు బుద్ధిచెప్పుట	...	278
శైకేశి రావణునకు రామునిమహిమఁ దెల్పుట	...	281
శైకేశి రావణునికి జలప్రళయముఁ దెలుపుట	...	282
రావణున కతికాయుఁడు నీతిచెప్పుట	...	284
రావణునకు శుకసారణులు కపిపుంగవులఁ దెలుపుట	...	286
శుకుఁడు శ్రీరాములతేజోవిశేషములఁ దెల్పుట	...	289
సీతకు శాంబరీమాయచేఁ గల్పితంబైన శ్రీరాములశిరోధనువులను జూపి వెఱపించుట	...	290
మాల్యవంతుఁడు రావణునితో నీతి చెప్పుట	...	292
సుగ్రీవుఁడు రావణునితో మల్లయుద్ధము చేయుట	...	295
శ్రీరాముఁడు వానరులచే లంక ముట్టడి వేయించుట	...	296
అంగదరాయబారము	...	298
రావణుఁ డంగదునితోఁ దనపరాక్రమము చెప్పుట	...	300
రావణుఁడు తనభటులతో నంగదునిఁ బట్టి కట్టుండని నియమించుట	...	303
రావణుఁడు యుద్ధసన్నద్ధుఁడై యుత్తరగోపురమునకు వచ్చుట	...	303
శ్రీరాములు రావణుని ఛత్రచామరంబుల బాణములతోఁ దెగవేయుట	...	305
వానరరాక్షసుల ద్వంద్వయుద్ధము	...	308
యుద్ధభూమివర్ణనము	...	310
సాయంకాలాదిరాత్రివర్ణనము	...	311
ఇంద్రజిత్తు మాయాయుద్ధము సేయుట	...	313

విషయము.		పుట.
ఇంద్రజిత్తుచే నాగపాశబద్ధులైయున్న రామలక్ష్మణులఁజూచి సీత దుఃఖించుట	...	315
ఇంద్రజిత్తు రెండవసారి యుద్ధమునకు వచ్చుట	...	317
నారదుఁడు శ్రీరాములయొద్దకు వచ్చుట	...	318
ధూమ్రాక్షుఁడు యుద్ధమునకు వచ్చుట	...	320
అకంపనుఁడు యుద్ధమునకు వచ్చుట	...	322
మహోదరుఁడు యుద్ధమునకు వచ్చుట	...	324
రాక్షసులతో వానరులు ఘోరయుద్ధము సేయుట	...	325
మహానాదుఁ డంగదునితోఁ బోరి మడియుట	...	327
మహోదరుఁ డంగదునితో మల్లయుద్ధముసేసి మడియుట	...	329
ప్రహస్తునియుద్ధము	...	330
మందోదరి రావణునితో శ్రీరాములపరాక్రమముఁ జెల్పుట	...	333
రావణుఁడు యుద్ధమునకు వెడలుట	...	334
రామరావణుల ప్రథమయుద్ధము	...	341
కుంభకర్ణుని నిద్రమేల్కొనఁజేయుట	...	342
విభీషణుఁడు శ్రీరాములతోఁ గుంభకర్ణునిశాపప్రకారము చెలుపుట	...	346
రావణునకుఁ గుంభకర్ణుఁడు నీతి చెప్పుట	...	347
రావణుఁడు కుంభకర్ణుని దిరస్కరించుట	...	349
కుంభకర్ణుఁడు యుద్ధమునకు వెడలుట	...	352
వానరవీరులు కుంభకర్ణునితో యుద్ధము సేయుట	...	353
సుగ్రీవుఁడు కుంభకర్ణునిచే మూర్ఛనొందుట	...	357
సుగ్రీవుఁడు మూర్ఛదేరి కుంభకర్ణుని విరూపునిగాఁ జేయుట	...	358
విభీషణుఁడు కుంభకర్ణునికి నీతి చెప్పుట	...	360
శ్రీరామునిచేఁ గుంభకర్ణుఁడు కూలుట	...	362
రావణుండు కుంభకర్ణునిమరణమునకు శోకించుట	...	364
అతికాయమహోదరాదివీరులు యుద్ధమునకు వెడలుట	...	365
అంగదనరాంతకుల ద్వంద్వయుద్ధము	...	368
హనుమదాదులు త్రిశిరాదిరాక్షసవీరులఁ జంపుట	...	369
విభీషణుఁడు శ్రీరాముల కతికాయునిప్రభావముఁ జెలుపుట	...	371
లక్ష్మణాతికాయుల ద్వంద్వయుద్ధము	...	373
అతికాయుఁడు లక్ష్మణునిచేఁ జచ్చుట	...	375
ఇంద్రజిత్తు రెండవమాఱు యుద్ధమునకు వెడలుట	...	376
ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రముచే రాముఁడు మొదలగువారల మూర్ఛనొందించి మరలుట	...	378
ఆంజనేయుఁ డోషధీశైలముఁదెచ్చి రామలక్ష్మణాదుల మూర్ఛదేలించుట	...	380
వానరులు లంకం గాల్చుట	...	381

విషయము.		పుట.
కుంభనికుంభాదులు యుద్ధమునకు వచ్చుట	...	383
కుంభనికుంభులయుద్ధము	...	385
మకరాక్షుఁడు యుద్ధమునకు వచ్చుట	..	387
ఇంద్రజిత్తు హోమముచేసి కృత్తియనుశక్తి బుట్టించి చేకొని మాయాయుద్ధముచేయుట	...	389
శ్రీరాముఁ డాగ్నేయాస్త్రముచే నింద్రజిత్తునిమాయ దెరల్చుట	...	391
ఇంద్రజిత్తు హోమముజేసి శస్త్రసమేతముగా రథమును బడయుట	...	392
ఇంద్రజిత్తు మాయాసీతను దెచ్చి తల దఱుగుట	...	395
ఇంద్రజిత్తు నికుంభిళయాగము చేయుట	...	396
విభీషణుఁ డింద్రజిత్తునిమాయ శ్రీరాములతోఁ జెప్పుట	...	398
లక్ష్మణుఁడు యుద్ధమునకు వెడలుట	...	400
ఇంద్రజిల్లక్ష్మణులద్వంద్వయుద్ధము	...	402
లక్ష్మణునిచే నింద్రజిత్తు చచ్చుట	...	406
రావణుఁ డింద్రజిత్తుమరణమునకు శోకించుట	...	408
రావణుండు సీతను దెగవేయఁ బోవుట	...	410
ఇంద్రజిత్తుభార్య సులోచన శోకించుట	...	411
సులోచన శ్రీరాముల నుతించుట	...	412
సులోచన సహగమనమునేయుట	...	415
మూలబలయుద్ధము	...	416
శ్రీరాముఁడు మూలబలముపై మోహనాస్త్రమేయుట	...	418
రాక్షసస్త్రీలు రావణుని నిందించుట	...	419
రావణుఁడు రెండవసారియుద్ధమునకు వెడలుట	...	422
సుగ్రీవునిచే విరూపాక్షుఁడు మొదలగురాక్షసవీరులు చచ్చుట	...	424
రావణుఁడు రామలక్ష్మణులపైఁ గదియుట	...	426
రావణునిశక్తిచే లక్ష్మణుఁడు మూర్ఛిల్లుట	...	428
రావణుఁడు విభీషణాదులమాటలఁ దలంచి చింతించుట	...	429
లక్ష్మణునిమూర్ఛకు శ్రీరాముఁడు శోకించుట	...	431
హనుమంతుఁడు సంజీవకరణికొఱకు ద్రోణాద్రికిఁ బోవుట	...	433
కాలనేమివృత్తాంతము	...	433
హనుమంతుని మకరి మ్రింగుట	...	436
ధాన్యమాలి తనశాపప్రకారము హనుమంతునితోఁ జెల్లుట	...	436
మునివేషధారి యగుకాలనేమిని హనుమంతుఁడు చంపుట	...	438
హనుమంతునితో మాల్యవంతుఁడు పోరుట	...	441
శ్రీరాముఁడు లక్ష్మణునిఁ జూచి పరితపించుట	...	442
సుషేణుఁడు సంజీవకరణిచే లక్ష్మణునిమూర్ఛఁ దేర్చుట	...	444

విషయము.		పుట.
శుక్రునియొద్ద రావణుఁడు శోకించుట	...	446
రావణుఁడు పాతాళహోమముసేయుట	...	447
అంగదుండు మందోదరిని రావణునివద్దకు నీడ్చుకొనివచ్చుట	...	449
మందోదరి శ్రీరాములమాహాత్మ్యము రావణునికిఁ దెల్పుట	...	451
రావణుఁడు మూఁడవసారి యుద్ధమునకు వెడలుట	...	453
ఖడ్గరోముఁడు మొదలగురాక్షసులు వానరవీరులతో యుద్ధము సేయుట	...	455
దేవేంద్రుఁడు శ్రీరామునకు రథముఁ బంపుట	...	457
రావణుఁడు శ్రీరాములపై శూల మేయుట	...	459
శ్రీరాముల కగస్త్యు లాదిత్యహృదయ ముపదేశించుట	...	460
రావణుఁడు మూర్ఛిల్లుట	...	462
శ్రీరాములు రావణునికరశిరంబులు దెగవేయుట	...	464
రావణునకు కరశిరంబులు మరల మొలచుటకై శ్రీరాములు చింతించుట	...	466
రావణుఁడు బ్రహ్మాస్త్రముచే మడియుట	...	468
మందోదరి మొదలగురావణునిభార్యలు శోకించుట	...	469
మందోదరీవిలాపము	...	471
విభీషణుఁడు మందోదరిని చూచి దుఃఖించుట	...	472
రాముఁడు విభీషణు నోదార్చి రావణునకుఁ బ్రేతకృత్యంబులఁ జేయించుట	...	472
విభీషణునిలంకాపట్టాభిషేకము	...	473
శ్రీరాములు విభీషణునితో సీతను దెమ్మనుట	...	475
సీత యగ్నిఁ జొచ్చుట	...	477
అగ్నిదేవుఁడు సీతను శ్రీరాముల కొప్పగించుట	...	478
శ్రీరాములు పుష్పకవిమాన మెక్కి యయోధ్యకుం జనుట	...	481
శ్రీరాములు సీతకు రాక్షసవీరులవిక్రమముఁ దెల్పుట	...	482
శ్రీరాములు లింగప్రతిష్ఠ సేయుట	...	484
శ్రీరాములు సేతుమహిమను దెలుపుట	...	486
శ్రీరాముఁడు మార్గమధ్యములోని విశేషములు సీత కెఱిఁగించుట	...	486
శ్రీరాములు భరద్వాజాశ్రమంబునకు వచ్చుట	...	487
హనుమంతుఁడు భరతుని జూచుట	...	490
భరతుఁడు వసిష్ఠాదిసహితుఁడై శ్రీరాముల నెదురుకొనుట	...	492
శ్రీరాము లయోధ్యఁ జేరుట	...	494
శ్రీరాములపట్టాభిషేకము	...	496



శ్రీరామచంద్రపర బ్రహ్మణే నమః

శ్రీరంగనాథరామాయణము

బాలకాండము.

శ్లో. చరితం రఘునాథస్య శతకోటిప్రవిస్తరం,
ఏకైకమక్షరం ప్రోక్తం మహాపాతకనాశనమ్
రామాయ రామభద్రాయ రామచన్ద్రాయ వేధసే,
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః.

శ్రీకామినీనాథు జితదైత్యనాథు, లోకరక్షణకృత్యు లోకైకనిత్యు
నిత్యసదానందు నిర్వాణకృత్యుఁ, గృత్యవిదూరు నకృత్రిమాథారు
నాథారకమలమధ్యామోదభేద, సాధనక్రమసమాచరణషట్చరణు
సింధురవరదు నాశ్రితలోకబంధు, [1]బంధమోచను బలిబంధనోద్యు
నారూఢపంచదశాక్షరప్రసవ, పారిజాతాకారుఁ బ్రణవానుకారు
నగ్రామ్యగోపికాభ్యంతరవ్యగ్రు, నగ్రసదాకారు నాకారరహితు
యోగిమానసలసదోంకార[2]దీప్తు, యోగసందర్శితాభ్యుదయప్రచారు
శ్రుతిశిరోభాగవిశుద్ధచైతన్యు, నతిలోకు సర్వలోకాశ్రయశ్లోకు
నఖిలాండమాతృకాయతనిత్యసూత్రు, నఖిలతత్త్వాతీతు నాద్యంతరహితు
నమలాత్మ నక్షరు నామ్నాయకమల, కమలాప్తు నక్షీణకల్యాణసదను
శంకావినిర్ముక్తసద్భక్తవర్య, కైంకర్యవత్సలుఁ గారుణ్యసింధు
బోధకుండై వచ్చి బోధ్యమై తోఁచి, బోధమై వీక్షించు పూర్ణస్వరూపు
నాదితత్త్వము తత్త్వమస్యాదివాక్య, భేదాతిరూపు నభేదప్రతాపు
గడుకొని నియతులై కర్మబంధములు, గడచి యేకతమునఁ గదలక నిలిచి
యరుదుగా నింద్రియవ్యాప్తుల మఱచి, విరచితాసనబద్ధవిన్యాసలీలఁ
బరిచితాసనమునఁ బదిలమై నిలిచి, సవితో మదిలోన సరసత నిల్పి
వెలయ డెబ్బదిరెండువేలనాడులను, గలయ వివేకించి కసటు వోఁ దుడిచి
యొకరెండుత్రోవల నొకటిగా మెలఁగి, చకలంకమతితోడ నతిసూక్ష్మముగను

1 బంధమోక్షణు. 2 విప్ర, యోగిసందర్శితా.

నవయవంబులయందు నానందమైన, పవను నిరోధించి పశ్చిమవీధిఁ
జొనిపి కోణత్రయశుద్ధి గావించి, మనసుతోడనె కూడ మఱపించి తెచ్చి
కుండలినిజశక్తిఁ గూర్చి సంప్రీతి, నొండొండఁ గమలంబు లొగి నాఱుగడచి
యటఁ జంద్రమండలం బల్లనఁ జేర్చి, యటఁ బరమవ్యోమ మై తమ్ము మఱచు
పరమయోగీంద్రులభావమ్ముకీలు, పరికింపఁ బానైన బ్రహ్మస్వరూప
మొగి రెంటఁ బెరయక మూట నేర్పడక, తగిలి నాల్గవత్రోవ తత్త్వమై యుండి
యైదింటి కాదియై యాఱిటిఁ గడచి, యాగికి నాదియై యమరినదేవుఁ
డనుతరనిర్మలాంతర్నాడియూప, మనురూప మగుమనం బాబద్ధపశువు
నిష్ఠాభిరతివేది నిఖలేంద్రియములు, కాష్ఠము ల్లోభ మఖండపావకుఁడు
యోగామృతము ఘృతముజ్జ్వలానంద, యోగంబు ఫలనుగా నొగిఁ జెల్లుచున్న
యభిమతాంతర్యనిత్యామోదకర్మ, విభవంబుకడపట విలసిల్లుపరముఁ
బరమేశు నవ్యయుఁ బరమకల్యాణుఁ, బరమాత్మ నపరోక్షుఁ బ్రత్యక్షకర్మ
మాదేవుఁ గమలాక్షు మమ్మేలు దేవు, నాదినారాయణు నఖిలలోకేశు
భావించి కీర్తించి ప్రార్థించి మ్రొక్కి, సేవించి యభిమతసిద్ధిఁ గావింప
హరకర్పూరనీహరగోక్షీర, తారకాకృతి శారదాదేవిఁ గొలిచి
చారురామాయణచంద్రాబ్ధి యగుచు, వారక విలసిల్లు వాల్మీకి దలఁచి
భారతమంజరీపారిజాతంబు, సారమానసుఁ బరాశరసూనుఁ గొలిచి
యతనితనూభవు నాశుకబ్రహ్మ, నతిభక్తియుక్తిమై నభినుతి చేసి
యేకథఁ జెప్పిన నెల్ల సజ్జనులు, నేకొని కీర్తనల్ చేయుచు నుందు
రేకథఁ జెప్పిన నిహపరోన్నతులు, ప్రాకటంబుగఁ బెర్చి [1]ఫలియించుఁ బ్రీతి
నేకథఁ జెప్పిన నీప్సితార్థములు, నైకొని పుణ్యముల్ గడఁగి కాన్పించు
ననువిచారములు నాయంతరంగమునఁ, గొనకొని కృతినేయఁ గోరుచున్నంత
శ్రీరమణీయులై కృష్టిసత్తములు, గోరి వర్ణనసేయఁ గోనవంశమున
ఫలితసదాచారభానుఁ డై తోఁచి, కలికాలదోషాంధకారంబు ద్రోలి
గురుధర్మపథముల కొలఁదులు దెలిసి, పరన్యపనక్షత్రపంక్తుల నణఁచి
నిత్యపుణ్యోదయనియతిఁ బెంపొందు, నత్యున్నత ప్రతాపాభిరామునకుఁ
గరదీప్తి నిజఖడ్గగంగాప్రవాహ, పరధరణీపాలభాలాక్షరములఁ
గలపూర్వగర్వపంకము లొప్పఁ గడుగు, నలవుమైనసమానుఁ డగుసత్యనిధికి
శరణార్థిరాజన్యషట్పదాధార, కరపద్మనకుఁ గోనకాటభూపతికి
నయనయోదయదయాయతనిత్యమతికిఁ, బ్రియతనూజన్మఁ డై పృథివిఁ బెంపొందు
రుద్రప్రతాపుండు రుద్రనిర్మలుఁడు, రుద్రాత్ముఁ డగు కోనరుద్రనరేంద్ర
పౌత్రుఁ డభంగుఁ డప్రతిమవిక్రముఁడు, గోత్రధీరుఁడు కులగోత్రవర్ధనుఁడు
దివిజేంద్రవిభవుండు ధీరవర్తనుఁడు, భువనవిఖ్యాతుండు బుద్ధభూపాలు
తనుజస్తుఁ డక్షీణదాక్షిణ్యధనుఁడు, ధనధాన్యధనదుండు ధర్మధర్మజ్ఞుఁడు

1 ఫలియించుచుండు.

అతిపుణ్యసౌజన్యుఁ డరిభీమజనున్యుఁ, డతిశౌర్యశరజన్ముఁ డాజన్మశుభుఁడు
కామినీకాముఁ డఖండవిక్రముఁడు, రామత్రయోదారరణవిశారదుఁడు
చందనమందారచంద్రికాహార, కందళితుఁ దేందు ఘనకీర్తినుఁడు
పరఁగు కోనాన్వయపారిజాతమునఁ, బరిపక్వఫలరీతిఁ బరఁగినవాఁడు
పొలుచు కోనాన్వయపూర్వాద్రియందు, వెలుఁగుభానుఁడువోలె విలసిల్లువాఁడు
దొరసి కోనాన్వయదుగ్ధాంబురాశిఁ, బరిపూర్ణచంద్రుఁడై భాసిల్లువాఁడు
నిక్కి యంతంతకు నిర్మలం బగుచు, దిక్కులఁ దనపేర్మి దీపించువాఁడు
దానధర్మక్రియాతాత్పర్యకేళిఁ, దానయై వినుతులఁ దనరారువాఁడు
మగఁటిమి నసమానమహిమ దీపింప, బగతుఱ నవలీల భంజించువాఁడు
బలితోగ్రరాజన్యబలవజ్రపాణి, లలినొప్పువాసపు లలిఁబోలువాఁడు
ప్రత్యక్షనృపవనపావకోజ్జ్వలుఁడు, సత్యంబుచేతను సరిదగువాఁడు
విమలోగ్రరాజన్యవిపులాంధకార, కమలాప్తబింబ ఖడ్గప్రభావిభవ
విలసితామరవధూవిమలాస్యకమల,ముల వీరమధుకరంబులఁ గూర్చువాఁడు
అరినృపప్రాణానిలాహారభుజగ, వరభుజాస్ఫాపితావని[1]గలవాఁడు
కురు[2]కేరళావంతికుంతలద్రవిళ, మరుమత్స్యకకరూశమగధపులింద
సరససుపాండ్యకోసలబర్బరముల, నరనాథసభల వర్ణనకెక్కువాఁడు
ఆతతసామభేదాదుల నొప్పు, నీతిక్రమంబుల నెరసినవాఁడు
రమణమై నాదిమరాజన్యరీతి, నమితవైభవముల నమరినవాఁడు
వినయనయోపాయ విజయసుస్థిరుఁడు, ఘనకీర్తి విర్రలక్ష్మోపాలవరుఁడు
రాజసర్వజ్ఞుండు రాజసింహుండు, రాజశిరోమణి రాజపూజితుఁడు
సకలజగద్ధితచాతుర్యధుర్యుఁడు, డొకనాఁడు కొలువున [3]నున్నతుం డగుచు
బహుపురాణజ్ఞులు బహుశాస్త్రవిదులు, బహుకావ్యనాటకప్రౌఢమానసులు
హితులు మంత్రులుపురోహితులునాశ్రితులు, సుతులురాజులుబహుశ్రుతులునుగొల్వ
దీపించి భూలోకదేవేంద్రుపగిది, నేపారి యున్నచో నింపు సొంపొంద
రసికులు భారత రామాయణాది, రసగోష్ఠిచెల్లింప రసికశేఖరుఁడు
రామకథాసుధారస[4]రక్తుఁ డగుచు, నామహాసభలోన నందఱు జూచి
రమణమైఁ దెనుఁగున రామాయణంబు, క్రమమొప్పఁ జెప్పెడి ఘనకావ్యశక్తి
గలకవు లెవ్వారు గల రుర్వి నసుచుఁ, దలపోయ విర్రలధరణిపాలునకు
నున్నతమూర్తికి నురుయశోనిధికి, విన్నవించిరి వేడ్క విబుధులు గడఁగి.
నీతనూజన్ముండు నిపుణమానసుఁడు, ధూతకల్మషుఁడు బంధురనీతియుతుఁడు
సర్వజ్ఞుఁ డనఘుండు [5]చతురవర్తనుఁడు, సర్వపురాణ విచారతత్పరుఁడు
కమనీయబహుకళాగమవిచక్షణుఁడు, సుమనీషిపోషణోత్సుకసుఖోన్నతుఁడు
కవిసార్వభౌముండు కవికల్పతరువు, కవిలోకభోజుండు కవిపురందరుఁడు

---

1. వ్రాలువాఁడు. 2 కురుకుంతళావంతి ఘూర్జరద్రవిళ. 3 నున్నతుల్ మెఱయ 4 రక్తి తనర. 5 సాధువర్తనుఁడు.

ప్రత్యర్థిరాజన్యబలవజ్రపాణి, ప్రత్యర్థినృపదావ[1]పావకోజ్జ్వలుఁడు
భీకరనిజఖడ్గబింబితస్వర్గ, లోకాసుర క్షత్రిలోకదుర్దముఁడు
వరసాధుజలజాతవనజాతహితుఁడు, పురుషచింతామణి బుద్ధభూవిభుఁడు
నీ కతిభక్తుండు నిఖిలశబ్దార్థ, పాకజ్ఞుఁ డత్యంతపాండిత్యధనుఁడు
మఱియు రామాయణమర్మధర్మజ్ఞుఁ, డెఱుఁగు నాతనిఁ బిల్వు మీకథఁ జెప్ప
ననిన మజ్జనకుఁ డుదాత్తవర్తనుఁడు, ననుఁ గర్థిఁ బిలిపించి ననుఁ గారవించి
భూమిఁ గవీంద్రులు బుధులును మెచ్చ, రామాయణంబు పురాణమార్గంబు
తప్పక నావేరఁ దగ నంధ్రభాషఁ, జెప్పి ప్రఖ్యాతంబు సేయింపు మిర్వి
నని యానతిచ్చిన నమ్మహాదూక్తులకు, ననయంబు హర్షించి యట్ల కావింపఁ
బనిపూని యరిగండభైరవుఁ వేర, ఘనుఁవేర మీసరగండాంకుఁవేర
లలితసద్గుణగణాలంకారుఁవేర, నలఘునిశ్చలదయాయతబుద్ధివేర
నాతతకృతివేర నతిపుణ్యవేర, మాతండ్రి విర్రలక్ష్మానాథుఁవేర
రాజులు బుధులును రసికులు సుకవి, రాజులు గోష్ఠిని రాగిల్లి పొగడఁ
బదము లర్థంబులు భావము ల్గతులు, పదశయ్య లర్థసౌభాగ్యములయతులు
రసములకల్పన ల్ప్రసంగతులు, నసమానరీతులు నన్నియుఁ గలుగ
నాదికవీశ్వరుఁ డైనవాల్మీకి, యాచరంబునఁ బుణ్య లందఱు మెచ్చుఁ
జెప్పిన తెఱఁగున శ్రీరామచరిత, మొప్పఁజెప్పెదఁ గథాభ్యుదయ మెట్లనిన

కథాప్రారంభము.

ఘనతపస్సా ధ్యాయకమనీయశీలు, మునినాథు నారదు మునిలోకవంద్యు
ననఘుతపోనిధి యైనవాల్మీకిఁ, గనుఁగొని యొకనాఁడు కర మర్థి నడిగె
ఎవ్వఁడు శ్రీమంతుఁ డెవ్వఁడు శాంతుఁ, డెవ్వఁడు ఘనపుణ్యుఁ డెవ్వఁ డున్నతుఁడు
ఎవ్వఁడు నీతిజ్ఞుఁ డెవ్వఁడు ప్రాజ్ఞుఁ, డెవ్వఁడు దుర్దముం డెవ్వఁ డుత్తముఁడు
ఎవ్వఁడు జితకాముఁ డెవ్వఁ డజేయుఁ, డెవ్వఁడు నిరసూయుఁ డెవ్వఁ డాఢ్యుండు
ఎవ్వఁడు సుప్రతుం డెవ్వఁ డుదారుఁ, డెవ్వఁడు సుచరిత్రుఁ డెవ్వఁడు సముఁడు
ఎవ్వనికిన్కఁ గు నింద్రాదిసురలు, దవ్వుదవ్వులనుండి తలఁకుచుండుదుర
అట్టివాఁ డిలఁ బుట్టి యరిగెనో యిప్డు, పుట్టెనో యింకమీఁదఁ బుట్టనున్నాఁడో
యనినఁ ద్రిలోకజ్ఞుఁ డైన నారదుఁడు, దనబుద్ధి నెంతయుఁ దలపోసి చూచి
యీమహి శ్రీవిష్ణుఁ డిపుడు జన్మించె, రాముఁడై దశరథరాజున కతఁడు
నియతాత్ముఁ డతిశౌర్యనిధి కృపాజలధి, జయశాలి స్వజనరక్షణవిచక్షణుఁడు
కంబుకంధరుఁడు చక్కని మేనివాఁడు, బింబారుణోష్ఠుండు పీనవక్షుండు
వెడఁదకన్నులవాఁడు విపులాంసతలుఁడు, నిడుదచేతులవాఁడు నియతవర్తనుఁడు
వేదవేదాంగకోవిదుఁడు కోదండ, [2]వేదవిదుండు వివేకభూషణుఁడు
కమలాప్తతేజంబు కడలిగాంభీర్య, మమరాద్రిధైర్యంబు నవనిసైరణయు
ధనదునితాగ్యంబుఁ దనయందు మిగుల, ననువొందు నిత్యకల్యాణవిగ్రహుఁడు

1 పావకాభుండు. 2 వేదవిద్వరుఁడు.

కౌసల్యకానందకరుఁడు శ్రీకరుఁడు, భాసుర త్రైలోక్యపావనమూ ర్తి
రాముఁడై యిలఁబుట్టి రాజశేఖరుఁడు, రాము నిమ్మనివేఁడ రాజు పంపఁగను
మౌనివెంటను బోయి మఖమును గాచి, దానవి నటుకూల్చి వైత్యుని ద్రుంచి
రాతి నాతినిజేసి రాముఁడు వేగ, సీతఁ జేకొనుటకు శివువిల్లు విఱిచి
ఖ్యాతిగా సీతను గడుఁబెండ్లియాడి, సీతతోడను గూడి చెలఁగి యయోధ్య
కేతెంచుచోటఁ గెంపెసఁగంగ విప్రు, డేతెంచి నిలిచిన నేపునఁ గదిసి
వాపోవ నాతని బలువిల్లు దిగిచి, కోపంబుతో మునుఁ గొమరొప్పఁదీసి
యేపున నందఱు నెద వేడ్కమీఱ, నాపట్టుననె వచ్చి యప్పురిఁ జేరి
నాస్తి యౌవరాజ్యాభిషిక్తునిగఁ, జేసెదనని తండ్రి చెలఁగి యయోధ్యఁ
బట్టంబు గట్ట భూపతి సమకట్ట, మట్టుమీఱినయట్టి మంథరయపుడు
నెట్టనఁ గైకతో నెఱినాటఁ జెప్పఁ, గట్టడిగైక సంగరమునఁ దొల్లి
రెండువరంబు లర్థించిన దొటఁ, జండించి కాననస్థలికి రాఘవునిఁ
బనిచిన జనకునిప్రతినకై వూని, జనకజాలక్ష్మణసహితుఁడై వెడలి
దేవనంబునను నెంతేవనంబునను, బావనమునిచర్యఁ బరఁగు సంయములఁ
గరుణమైఁ గాపాడి ఖరదూషణాది, శిరములు శరములఁ జెండుచెండాడి
ఋశ్యమూకంబున నినజుఁ [1]జేపట్టి, వశ్యత నొకకోల వాలిఁ దూలించి
సీతకై చలపట్టి సేతువు గట్టి, పాతకదశకంఠపతిల ల్గొట్టి
సీతతోఁ గూడి యాశ్రితలోకపారి,జాతంబు వనచరజాతంబు గొలువ
నింద్రాదివినుతుఁడై యే తెంచి రామ,చంద్రుండు నిజపూజ్యసామ్రాజ్యలక్ష్మిఁ
బాలించుచున్నాఁడు ప్రజలకు వేడ్కఁ, గీలించుచును గృతకృత్యుఁడై యనుచు
నారాముచరిత మాద్యంతంబు చెప్పి, నారదమని పోయె నలినజాపురికి
మునిపతి వాల్మీకి ముదమొప్ప నంతఁ, దనశిష్యుఁ డగు భరద్వాజుండుఁ దాను
బ్రకటింప సజ్జనభావంబు పోలె, నకలుషజీవనం బై కరం బలరు
తమసానదికిఁ బోయి తన్నదీవారిఁ, దమయనుస్నానము ల్దగఁ జేయుచుండి
యాయేటిదరిఁ గ్రౌంచయమళంబు ప్రేమఁ, గాయజుక్రీళిమైఁ గవయుచో నొకటి
నొకబోయ చంపిన నున్నయాక్రౌంచి, ప్రకటశోకంబునఁ బలవింపఁ జూచి
దగవును ధర్మంబు తలపోసి మౌని, పగదాయనబ్బోయపైనల్కవొడమి
యోరి నిషాదుండ యోరి పాపాత్మ, యోరి నీ కెగ్గేమి యొనరించె రోరి
కామించి క్రౌంచముల్ [2]గవయుచో నొకటి, నేమిటికై చంపి తిబ్బంగిఁ గదిసి
యీపాతకమున ననేకదుఃఖములు, ప్రాపించి తిరుగుము బహుసంవత్సరములు
అని బోయ శపియించి యంత వాల్మీకి, దనశిష్యుఁ డగు భరద్వాజునిఁ జూచి
పలికెను శ్లోకంబుపద్ధతిగాను, బలికినపల్కును బలుమాఱు చూడ
ఛందోనిబద్ధమై సమవర్ణపం క్తిఁ, బొంది నాలుగుపదంబుల హృద్యమగుచు
నిది చాల విస్మయ మీశాపవాక్య,పదములు దమయంతఁ బద్యమై నిలిచె

---

1 స్నేహించి 2 కవయంగ నొకటి, కవయ నం దొకటి.

ననిన భరద్వాజుఁ డాదిగా శిష్యు, లనుర క్తిఁ బరియించి రాపద్య మంత
ననఘుఁ డానాల్మోకి యాశ్రమంబునకుఁ, జనియున్న చో బ్రహ్మ చనుదెంచుటయును
నెదురేఁగి పదముల కెఱఁగి తోడ్తెచ్చి, కుదురుగాఁ గుశపీఠిఁ గూర్చుండఁజేసి
కరమర్ధిఁ బూజించి కరములు మొగిచి, పరఁగ శాపాక్షరపద్యంబుఁ జదువ
విని బ్రహ్మ నగి పద్యవిషయమై వాణి, యనఘు నీముఖమున నవతరించినది
శ్రీరాముచరిత మశేషంబు నీకుఁ, గోరి నారదుఁడు సంకోచించి చెప్పె
నది విస్తరించి నీ వఖిలంబు చెప్పు, మది సర్వమును దోఁచు నని చెప్పి పోయె
నీరీతిఁ గృప వరం బిచ్చి మన్నించి, సారసగర్భుండు చనిన పిమ్మటను
మఱి నిర్మలధ్యానమతిఁ బూని మౌని, తఱిగొని సకలంబుఁ దలపోసి చూచి
రఘుచరిత్రము దశరథుచరిత్రంబు, రఘురాముజన్మంబు రామువర్తనము
తాటకావధము నుద్దండరాక్షసుల, [1]యాటోపహరణంబు యజ్ఞరక్షణము
దనరు గంగామహత్త్వంబు గౌతమని, వనితను శాపంబువలనఁ బాపుటయు
ధనువు ద్రుంచుటయు సీతావివాహంబు, చనుచోట జమదగ్ని జాతునాగ్రహము
రామాభిషేకసంరంభంబు దుష్ట, కామిని కైకేయి కష్టభాషణము
నభిషేకవిఘ్నంబు నడవికి రాము,విభుఁడు వోవుటయు భూవిభునిశోకంబు
దశరథుమరణంబు దశరథరాముఁ, గుశలసంభాషియై గుహుఁడు గాంచుటయు
నురుపుణ్యు లట గంగ నుత్తరించుటయు, వరతపోనిధి భరద్వాజుఁ గాంచుటయు
నరిగి యాచిత్రకూటాద్రి నెక్కుటయు, భరతుండు రఘురాముపజ్జ వచ్చుటయు
నన్న చేఁ బాదుక లర్థిమైఁ బడసి, [2]మన్ననఁ బంపార మగిడి వచ్చుటయు
దండకాగమనంబు తగిలి విరాధుఁ, జండవిక్రమునందు సంహరించుటయుఁ
బరమపుణ్యుని శరభంగుఁ గాంచుటయుఁ, బరువడి మునులతోఁ బ్రతినలాడుటయు
చనియయ్యగస్త్యునాశ్రమముచొచ్చుటయు, మునిచేతదివ్యాస్త్రములువడయుటయు
మునిచెప్పఁగా వారు ముదమున వేగ, చని పర్ణశాలలో సరగనుండుటయు
మోహించి రాక్షసి మొనసి వచ్చుటయు, నూహించి దానితో నొగిఁబల్కుటయును
స్రుక్కక రామానుజుండు శూర్పణఖ, ముక్కును జెవులును మ్రోడుసేయుటయు
నదివోయి ఖరదూషణాదిరాక్షసుల, కది చెప్ప వారంత నలిగి వచ్చుటయు
నురవడి రఘురాముఁ డొక్కఁడే కడఁగి, ఖరదూషణాదుల ఖండించుటయును
నట రావణునిబుద్ధి నలుక పుట్టుటయుఁ, గుటిలమారీచుండు క్రొవ్వి చచ్చుటయు
నసురాధిపతి సీత నపహరించుటయు, విసువక రాముఁడు విలపించుటయును
నని జటాయువుచావు నవలఁ గబంధుఁ, గనుటయు మఱి పంపకడకుఁ బోవుటయుఁ
గరమర్ది ఋశ్యమూకమున సుగ్రీవుఁ, డరుదెంచి కనుటయు నతనిసఖ్యంబు
వాలిసుగ్రీవుల వైరంబు తెఱఁగు, చాలంగ రాముండు సప్తతాళముల
నేలఁ గూలఁగనేసి నెమ్మి మెప్పించి, వాలి నొక్కమ్మున వధియించుటయును
దారావిలాపంబు దశరథసూనుఁ, డారవిసూను రాజ్యమున నిల్పుటయు

---

1 యాటోపమణఁచుట. 2 మన్ననల్ చేసి.

మానవపతి యంత మాల్యవంతమున, వానకాలంబెల్ల వసియించుటయును
గాకుత్స్థుకోపంబు కపిసమాగమము, నేకతంబున ముద్ర నిచ్చి పుచ్చుటయు
నలయక కపులు సీతాన్వేషణంబు, సలుపుటయును బిలసందర్శనంబు
నాఋణంబున మహేంద్రాద్రి నెక్కుటయుఁ, బక్షీంద్రుఁ డైన సంపాతిదర్శనము
వనధిలంఘనమును వనధిమధ్యమునఁ, జనుచోట మైనాకసందర్శనంబు
మదమెత్తి సింహిక మారుతసూనుఁ, గదిసి చచ్చుటయు లంకాప్రవేశంబు
లంకను నొప్పించి లలనచే నటన, లంకత్రోవయుఁ గని లంకఁ జొచ్చుటయు
నంతఃపురంబున కరిగి చూచుటయు, నంత నశోక వనావలోకనముఁ
దెఱగొప్ప నందు వైదేహిఁ గాంచుటయు, నెఱుకకు నానవా లిచ్చి దేర్చుటయుఁ
బెనచి యావనమెల్లఁ బెఱికి వైచుటయు, హనుమంతుఁ డత్తఱి నక్షుఁ జంపుటయుఁ
బవనజుఁ డటఁ బట్టువడిపోవుటయును, గవిసి లంకాపురి గలయఁ గాల్చుటయు
మానినీమణి శిరోమణి యిచ్చుటయును, మానితాత్తుం డబ్ధి మరల దాఁటుటయు
మధువనహరణంబు మణిఁబ్రీతి నిచ్చి, యధిపతి మారుతి యాశ్వసించుటయు
నినకులాధిపుఁడు దండెత్తి పోవుటయు, వనధితీరంబున వచ్చి నిల్చుటయు
వనరాశి త్రోవయియ్యక క్రొవ్వుటయును, గొనకొని రాముండు కోపించుటయును
నంత విభీషణుఁ డధిపుఁ గాంచుటయుఁ, జింతించుటయు మఱి సేతుబంధనము
జడధి దాఁటుటయును జని లంకమీఁద, విడిసి వేర్చుటయు దోర్వీర్యంబు మెఱసి
కరమగ్రులగు కుంభకర్ణాది వీర,వరులఁ ద్రుంచుటయు రావణునిఁ జంపుటయు
నావిభీషణుని లంకాధినాయకునిఁ, గావించి పట్టంబు కరుణఁ గట్టుటయు
ననుపమశుద్ధి బ్రహ్మాదులు మెచ్చ, జనకజ రఘురామచంద్రుఁ బొందుటయు
నెలమిఁ బుష్పక మెక్కి యెల్లరు వేడ్కఁ, జెలఁగి యంభోనిధిసేతువుమీఁదఁ
దెలిసి శ్రీకంఠుఁ బ్రతిష్ఠసేయుటయు, వెలయ నయోధ్యకు వేగ వచ్చుటయు
భరతుఁ గాంచుటయును బట్టాభిషేక, మరుదుగా రఘురాముఁ డవధరించుటయుఁ
గపిసైన్యపతుల నర్కజవిభీషణుల, విపులసంపద లిచ్చి వీడుకొల్పుటయుఁ
బరికించి ప్రజల కాపదలొందకుండఁ, గరుణఁ బ్రోచుట యనుకథ లెల్లఁ దెలిసి
వెలయ నిర్వదినాల్గువేలశ్లోకములు, గలిగి యేనూఱు [1]సర్గల విస్తరిల్లి
కాండంబు లాఱింటఁ గరమొప్ప మిగిలి, యుండ రామాయణ మొప్పఁ గావించి
యొనరఁ దక్కిన కథ లుత్తరకాండ,మునఁ జెప్పి వాల్మీకిమునినాథుఁ డంత
ఈకథ పరియింప నెవ్వరు నేర్తు, రీకథ జగముల నెబ్బంగి వెలయు
ననుచుండ కుశలవు లనఘమానసులు, మనసిజాకారులు మంజుభాషణులు
జనసుతుల్ సంగీతసాహిత్యపరులు, మునివేషధాను లిమ్ముల వచ్చి మ్రొక్కి
యనఘు రామాయణం బర్థితోఁ జదువఁ, జనుదెంచితిమి మమ్ము [2]చదివింపవలయు
ననిన సంతోషించి యమ్మునీశ్వరుఁడు, తన మనోరథమెల్లఁ దలకూడె ననుచు
గేయమై పార్యమై కేవల పుణ్య,దాయకం బగు రఘూత్తమచరిత్రంబు

---

1 సర్గముల వర్తిల్లి. 2 చదువనీవలయు.

ననుపమతంత్రీలయాన్వితభణితి, మునిపతి చదివింప ముదమొప్పఁ జదివి
రమణ శృంగారాది రసము లేర్పడఁగ, సమవృత్తభేదముల్ సంధి సమాస
సమధికశబ్దార్థసంగతు లెఱిఁగి, క్రమమొప్పఁ బాడుచుఁ గవగూడి వారు
మునిజనసభల నిమ్ములఁ బూజనములు, గొని వినోదింపఁ గాకుత్స్థవల్లభుఁడు
వెలయఁ దమ్ములు దాను వేడ్క లింపొందఁ, గొలువిచ్చి వారలఁ గోరి రావించి
వారిరూపంబులు వారినిల్కడలు, వారినిర్మలతరవాగ్విశేషములు
తనకు నింపొనరింపఁ దత్క్రమము, వినుచుండె రాముఁ డవ్విధమెట్టిదనిన
ద్వాదశయోజనాత్మాయతం బగుచు, నైదుయోజనముల నది వెడల్పగుచు
నిపుణత మయునిచే నిర్మితంబగుచు, నెపుడు శాత్రవకోటి కెదురుచుక్కగుచు
కొలఁదిమీఱిన భానుకులజులకెల్ల, కులరాజధానియై కొనియాడఁ బరఁగి
సరయువుపొంత కోసలదేశమునసు, ధరణికిఁ దొడ వయోధ్యాపురం బొప్పు
మణిగోపురంబుల మణితోరణముల, మణికుట్టిమంబుల మణిగవాక్షములఁ
గేళికాగృహములఁ గృతకశైలముల, బాలానిలంబులఁ బటహానాదముల
మహితవారణముల మానితాశ్వముల, బహురథప్రతతుల భటకదంబముల
విమలసౌధంబుల విపణిమార్గములఁ, గమనీయవనములఁ గమలాకరములఁ
జెఱువుల బావులఁ జెఱకుదోఁటలను, దఱుచైన శాలికేదారవారములఁ
బరిఘులఁ గోటలఁ బసిడిమాడువులఁ, గరమొప్ప లోకవిఖ్యాతమై పరఁగు
నాపురి దశరథుం డేనుమహారాజు, చాపవిద్యావరజ్ఞాలకార్ముకుఁడు
చతురుపాయజ్ఞుండు పాద్గుణ్యశాలి, సతతశక్తిత్రయసంధానకర్త
ధర్మోత్తరుఁడు కృతాధ్వరుఁడు శ్రీకరుఁడు, ధర్మశాస్త్రపురాణతాత్పర్యపరుఁడు
అజునినందనుఁడు బాల్యాదిగా నియతిఁ, బ్రజలఁ బాలించిన పరమపావనుఁడు
జంభారికై పోయి శంబరాసురుని, దంభం బణంచి సుత్రాముచేత
మందారపుష్పదామములు గైకొన్న, యిందుమతీపుత్రుఁ డినకులాధిపుఁడు
తేజంబు కాంతియుఁ దెగువయు నేర్పు, రాజసంబును నుదారతయు ధైర్యంబు
మొదలైనసద్గుణంబుల ప్రోది యగుచు, సుదయార్ద్రగతిఁ దనయగ్రతేజంబు
దీపితంబై యేడుదీవులఁ బర్వ, భూపాలతిలక మై పొలుపొంద నేలు
నన్నరనాథుకులాంగనామణులు, మున్నూటయేఁబండ్రు ముఖ్యులై యందు
నచలితసౌశీల్య యైనకౌసల్య, కుచకుంభనిర్జితకోక యాకైక
యనఘచరిత్ర యా నాసుమిత్రయును, వినుతికెక్కిరి త్రయీవిద్యలో యనఁగ
నిలమీఁద నతనికి హితపురోహితులు, పొలుచువసిష్ఠాదిపుణ్యసంయములు [జీయు
అనఘాత్ముకుఁడు దృష్టియనువాఁడు విజయుఁ, డనువాఁడు సిద్ధార్థుఁ డనువాఁడు మ
నర్ధసాధకుఁడు జయంతుఁడు నీతి, తీర్థుఁ డశోకుండు ధీమంతుఁడైన
మంత్రపాలకుఁడు సుమంత్రుండు ననఁగ, మంత్రులు గల రెనమండ్రు నాతనికి
ఆమంత్రులందఱు ననోన్యహితులు, స్వామికార్యవిచారచతురమానసులు
పరమర్మభేదనోపాయధారేయు, లరసి ప్రజారక్ష యాచరింపుదురు

అట్టివా రెనమండ్రు నఖలకార్యములఁ, బట్టునదిద్దఁ దీర్పనుఁ జాలి కొలువ
నష్టాక్షరముల బాహాష్టకంబులను, స్రష్టయై వెలయు నారాయణుకరణి
దశరథుం డలరె నాతనిదేశమునను, గృశుఁడు కొండీఁడు రోగియు దరిద్రుండు
జారుండు మఱి యనాచారుండు పుణ్యదూరుండు క్రూరుండు తుచ్ఛుండు జడుఁడు
మందుండు మఱి లేరు మందునకైన, నందఱు మణికుండలాద్యలంకృతులు
నందఱు ధర్మపరాయణచిత్తు, లందఱు విహితకులాచారరతులు
అందఱు సకలశాస్త్రాబ్ధిపారగులు, నందఱు శ్రీవిష్ణు నతిభక్తిపరులు
ఈచందమున రాజ్య మేపు దీపింప, భూచక్ర మెల్ల నేప్పున నేలి యేలి
ప్రకటరాజ్యాంగసంపదఁ దేలి తేలి, యొకనాఁడు దశరథుం డుల్లంబులోనఁ

దశరథుఁడు మంత్రులతో పుత్రకామేష్టిసేయ నాలోచించుట.

దనకు సంతతి లేమిఁ దలపోసి వగచి, తనకు నాయువువేగ తగఁబోయె ననుచు
మనమునఁ గుందుచు మఱియు నాతండు, తన మంత్రివరుల నందఱను రప్పించి
ఘననుగఁ గొలువిచ్చి ఘనతఁ గూర్చుండి, తనమంత్రివరుల నందఱఁ జూచి పలికెఁ
బెక్కుదానంబులు పెక్కుధర్మములుఁ, బెక్కుయాగంబులు పెక్కువఁ జేసి
పెక్కేండ్లు మంటి శోభితకీర్తిఁ గంటి, మక్కువ మీవంటి మంత్రులు గలుగఁ
గొదువ లే దేమిటఁ గొడుకులు లేని, కొదువ యొక్కటి గాని కులముద్ధరించు
కొడుకులు లేకున్నఁ గోరి పుణ్యములు, వడయ రుత్తమలోకపదవు లెవ్వరును
గానఁ బుత్త్రులఁ గానఁగా నాకు వలయుఁ, గాన నేనింక లోకము లెల్ల మెచ్చుఁ
దలకొని యశ్వమేధము నేసి పిదప, నెలమితోఁ బుత్త్రకామేష్టి వ్రేల్చెదను
ఈయాగములచేత హితము రంజిల్లఁ, బాయక పుత్త్రులఁ బడసెద నేను
నని చెప్ప వారలు నతి సంభ్రమమున, మనమున సంతోషమగ్నులై యున్న
నామంత్రివర్యుల నందఱఁ జూచి, తా మది మూహించి తగవొప్పఁ బలికె
ననుపమంబుగ నేను నశ్వమేధంబు, వినయంబునం జేసి విబుధులు మెచ్చుఁ
బుత్త్రుల కొఱకునై పుత్త్రకామేష్టి, నేత్రోత్సవంబుగ నేఁ జేయువాఁడ
నని తగు పనులకు నందఱఁ బనుప, ననఘులు మఱి వసిష్ఠాదులు వచ్చి
నిలిచిన మ్రొక్కుచు నెలమిఁ దోడ్తెచ్చి, పలికెను వారితోఁ బార్థివోత్తముఁడు
అనఘువసిష్ఠ సంయములార యిపుడు, ఘనమైన హయమేధకంబు నాచేతఁ
జేయించి పుత్త్రైకసిద్ధి నొందుటకుఁ, జేయింపుఁడీ దానిఁ జెచ్చెర నన్న
నలపడ నీచేయ హయమేధమఖము, నెలకొని యేమింక నిర్వహించెదము
మదినెన్న శక్యమే మఖరాజమహిమ, మిదిగాక పుత్త్రకామేష్టియుఁ జేయఁ
దనయులఁ గాంచెదు ధన్యమానసులు, ననవుడు హర్షించి యవనినాయకుఁడు
అందఱఁ బనిచి శుద్ధాంతంబు సొచ్చి, సుందరీమణుల కా శుభవార్తఁ జెప్పి
యనురక్తి నేకాంతమై నున్న వేళ, ననఘుండు సూతుఁ డిట్లనియె భూపతికి
ధరణీశ మీకు సంతానసంప్రాప్తి, వెరవైన కథ మున్ను విన్నాఁడ నేను
భూమీశ వినుమంగభూమీశుకొడుకు, రోమపాదుఁడు గుణారూఢుండు దొల్లి

యేమి పాపముననో యెఱుఁగఁ జొప్పడక, యామహిలో వర్ష మటు కుర్వదయ్యె
ఁ బా నేలి పాలించుధరణిపై నెందు, వానలు లేకున్న వగలను జెంది
వరమునీంద్రులచేత వర్ష హోమములు, పరువడి చేయించి పడయ రాకున్న
భూరిశోకంబునఁ బొగలుచు నున్న, యారాజుఁ గనుఁగొని యమ్మును లనిరి
యోమహీపాలక యోరాజచంద్ర, యీమహిపై వాన లిటఁ బర్వుటకును
నొకయుపాయమ్ము మే మెఱిఁగి జెప్పువార, మకలంకమతితోడ ననువొందఁ జేయు
పరహితోన్నతుఁడు విభ్రాండకసుతుఁడు, చిరపుణ్యనిధి ఋశ్యశృంగుఁ డన్నాఁడు
నగధైర్య పుట్టిననాఁట నుండియును, నగరరాష్ట్రంబు లెన్నఁడు నెఱుంగమిని
నతఁ డెందు నాఁడువారనువేరు నెఱుఁగఁ, డతఁడు తాపసవృత్తి నడపులనుండు
వసుధేశ యతఁ డిందు వచ్చినఁ జాలు, వెసఁ బాయు నీయనావృష్టిదోషంబు
నావుడు మునినాథు నగరికేరీతి, రావింతు నని విచారము చేసి తెలిసి
అతఁడు వచ్చుటకును నాత్మఁ జింతించి, మతిమంతు లగునట్టి మంత్రులఁ బిలిచి
మునులను రప్పించి ముదమొప్ప నడుగ, మునులును మంత్రులు ముఖముల్రోఁ జెప్ప
మనమున సుతోషమహిమ శోభిల్ల, మునులమాటలు విని మోదంబు మీఱి
నుండెను భూకాంతుఁ డొగి మాను లనిరి, దండిగ నోరాజ తలపోసి యిపుడు
వారకాంతల నెల్ల వసుధేశ పంపు, వారకాంతలచేత వనముల కిపుడు
దండిగా భక్ష్యముల్ దగవారి కిచ్చి, మెండుగ వనముల మేటి వస్తువులు
పెట్టి పంపుము నీవు పెంపుతో ననుచు, గట్టిగాఁ గాంతలు కడుఁ బ్రౌఢసతులు
తిన్నగ నటు పోయి తెఱఁగొప్పఁ గాంచి, మన్ననచే మౌనిమహిమ వీక్షించి
తియ్యని భక్ష్యముల్ తెఱఁగొప్ప నిచ్చి, నెయ్యంబుచే మది నెఱిఁగరఁగించి
యాటలఁ బాటలఁ దేటమాటలను, బాటలగంధులు పదిలులై నిలిచి
మనసెల్లఁ గరఁగించి మఱి వెంటనంటి, మనసిజాకారులు మఱి మాయ వన్ని
యచ్చుగ నిటు రాఁగ నతఁడు వెందగిలి, వచ్చు నిచ్చటికిని వసుధేశ వినుము
అని చెప్పి మునివర్య లటఁ జనిరంత, ఘనముగా నారాజు కరుణ నారాత్రి
మన మలరఁగ నుండి మఱునాఁడు లేచి, మునులను దలఁచుచు ముదమొప్ప నంత
ననుర క్తిఁ గడుఁబ్రోడ లగువారసతుల, వినుతయౌవనరూపవిభ్రమవతుల
మనసిజుమోహనమంత్రదేవతల, బనిచె నొప్పెడువారఁ బాటించి యతఁడు
అతివ లమ్మని యున్న యడవికిఁ బోయి, యతనియాశ్రమభూమి కల్లనఁ జేరి
చతురనర్తనకళాసంగీతగతుల, నతనికిఁ దమయొప్పు లర్థిఁ జూపుటయు
నాపుణ్యనిధి వారి నాఁడువా రగుట, రూపింప నేరక రుచులఁ జేపడక
యలసయానముల నీయడవిలో నొప్పు, మెలఁగెడు నివి వింతమృగములోఁ గాక
యనుచుండ నొక్కనాఁ డతివలు ప్రీతిఁ, దనుఁ జేరవచ్చినఁ దప్పక చూచి
చన్నులపే రడ్డి చన్నులమీఁద, నున్నహారములకు నుపదేశ మడిగి
మాకుఁ గొమ్మొక్కటి మస్తకమ్మునను, మీకుఁ గొమ్ములు రెండు మెఱసె నొమ్మునను
నేపృథుములఁ గల్గె నివి యపూర్వములు, మీవల్కలము లతిమృదులంబు లరయ

మాజటాబంధంబుమాడ్కి విగావు, మీజటాబంధము లైఱుఁగులఁ బొదలె
మేనిబూడిదెవ్రూఁత మేల్తావిగొట్టు, వీనులవిందు లీవేదనాదములు
కని విని యెఱుఁగ మిక్కా–ననభూమి, ముసులకు నీవేషములు గలవొక్కొ–
ఎక్క–డి మునులన్న నింతు లాఘనుఁడు, చిక్కు–ట భావించి చెలఁగి నవ్వుచును
నానుపూర్విగ శ్రుతిహరియాఁ సామ,గానంబు పాడి చక్కఁగఁ బఠక్రమము
శుద్ధమార్గంబునఁ జూపంగ నేర్తు, మిద్ధర మాచర్య లెఱుఁగ మీతరమె
యని నేర్పుమాటల నమ్మునిస్వామిఁ, గనుఁబ్రొమి మఱియు నక్క–న్యకామణులు
ఎవ్వరితనయుఁడ వెవ్వఁడ వేల, యివ్వనంబున నుండు టెఱిఁగింపు మనుడు
అమలకీర్తులఁ బుణ్యుఁ డగువిభాండకుని, కొమరుండ ఋశ్యశృంగుండు నాపేరు
విపులతపోనిష్ఠ వెలయ నీయడవిఁ, దపము నేయుటకునై తగిలి వర్తింతు
భాగీరథీస్నానపరత మాతండ్రి, యోగిపుంగవులతో నొగి నేగినాఁడు
ఒండు దేశంబుల నొందక యిచట, దండిమైఁ దపములు తగవొప్పఁ జేసి
కదలక యున్నాఁడు ఘనత మాతండ్రి, సదమలచిత్తుఁడై సద్భక్తి నిపుడు
వినుఁడు మీ రిచటికి విచ్చేయుకతన, ననఘుండ నైతిఁ గృతార్థుండ నైతి
మాతండ్రికృపచేత మఱియు నిచ్చటను, నాతతంబుగఁ దప మనువొందఁ నెపుడు
చేసి యిచ్చట నుండుఁ జింతఁ బోనాడి, వాసిగా వనముల వరుస మిమ్ములను
గనినయప్పుడు నాకుఁ గడుఁజోద్యమయ్యె, ననువొందఁ బోదమా యాశ్రమమునకు
నని మునులను వారి నాశ్రమంబునకుఁ, గొనిపోయి ఋశ్యశృంగుండు పూజించె
నెలనాఁగ లమ్మని యిచ్చినపూజ, యలరుచుఁ గైకొని యతని వీక్షించి
మునివర మావనంబునఁ దెచ్చినార, మనుపమఫలరాజి యనుచు లడ్వములు
అతిరసంబుల మనోహరము లైనట్టి, యతిరసంబులు వడి లలరు మండిగలు
సారసరసముల చవు లుగ్గడించి, పేయవెట్టఁగరాని పెక్కు భక్ష్యములు
నిచ్చిన నములుచు నెడనెడఁ జవుల, మెచ్చుచుఁ దనిసి యామెలఁతలఁ జూచి
గ్రుక్కి–ళ్లుమ్రింగుచుఁ గొసరి యడుగుచును, జొక్కు–చు నందంద సొరదిఁ జేచాచి
ము న్నిట్టిఫలముల మునివరులార, యెన్నఁ డే నెఱుఁగ నదేవనంబులను
మీతపంబె తపంబు మీతపోవనమె, యీతపోవనముల కెక్కుడు ధరణి
నని పల్క– నయ్యింతు లల్లన నగుచు, ననువారఁ దనులత లట సోకఁ గదిసి
తావియూర్పులచేతఁ దాలిమి దూలి, పోవ నొయ్యన ముఖాంబురుహంబు లొత్తి
పలుకులఁ దళుకులఁ బాటతేటలను, బిలుపుల సొలపుల బేలించి యతని
హృదయంబుఁ గరఁగంగ నిరుచన్నుగవలు, గదియించి బిగియారఁ గౌఁగిళ్ల మరపి
యనఘు పోయెదమిదె యాశ్రమంబునకు, నని విభాండకుదెస నడరినభీతి
నరిగి చేరువ నుండి రావనంబునకు, నరవిందలోచన లరిగినపిదప
వారింక నెన్నఁడు వత్తురో యనుచు, నాఋశ్యశృంగుండు నట నిద్ర లేక
యారాత్రి వేగించి యమ్మఱునాఁడు, ఆరమణులఁ గన్నయచటి కేతేర

ఋష్యశృంగుండు వారాంగనలఁ దగిలి రోమపాదునియింటికి వచ్చుట.

నందియ లైఅయంగ నసపుఁగౌఁదీఁగె, లందంద వడక రాయంచలనడల
మగువలు వచ్చి యామహితాత్ముఁ గాంచి, నగుమొగంబులతోడ నలుఁదట్లఁజేరి
మునివర మావనంబునకు రావలయు, ననిపల్క రాకకు ననుమతించుటయుఁ
గని చాల వెలఁదులు ఘనమునిఁ జూచి, మనసులు గరఁగంగ మఱిమఱి పలికి
తమయుపాయంబుఁ దమవిలాసములఁ, దమకంబు పుట్టించి తరలాక్షులంత
విస్తారపథ మని వెఱచి పోవమికి, హస్తపల్లవముల నాందోళికగను
నొనరెడుదీమంబు లొక వింతమృగము, గొనివచ్చు లెఱఁగునఁ గొనివచ్చిరతని
నతఁడు వచ్చుటయు నయ్యంగరాజ్యమున, నతులవర్షములు సస్యము లొప్పెనంత
సకలసౌభాగ్యముల్ సలలితంబుగను, సకలంకమతితోడ నానృపుఁ డుండి
యామౌనిఁ గనుఁగొని యతిభక్తియుక్తి, నేమంబుతోఁ బూజ నెమ్మిఁగావించి
యనఘుండు దనకూఁతు నారాజు శాంత, యనుదాని నిచ్చిన నారాజునింట
నతఁ డుండ దశరథుం డమ్మునిఁ దెచ్చి, హితమతిఁ బుత్రకామేష్టినాఁ బరఁగు
క్రతు వమ్మునీంద్రుచేఁ గావించెనేని, సుతుల నల్వుర బహుశ్రుతుల నున్నతుల
నాతతోన్నతిఁ గాంచు ననిచెప్పెఁ దెలియ, నాతోడఁ దొల్లి సనత్కుమారుండు
అటుగాన నీవింక నాఋష్యశృంగుఁ, బటుభక్తి యుక్తిమైఁ బ్రార్థించి తెమ్ము
అని చెప్పి యంసూతుఁ డరిగిన పిదప, మనమున సంతోషమమతలు సెలఁగ
నసువరి దశరథుం డారోమపాద, జననాథువీటికిఁ జని ఋష్యశృంగు
మునిపతిఁ గని మ్రొక్కి ముదముతోఁ ననియె, వినవయ్య మునిచంద్ర విమలమానసుఁడ
యనువందఁ బుత్త్రుల నడుగుట కేను, మనమునఁ దలపోసి మమత నీకడకుఁ
గొనకొని వచ్చితిఁ గొనుము నీవనుచు, మనమునఁ గృప పుట్ట మఱి నుతిసేసి
క్రతువున కాచార్యుఁగా వరియించి, యతులిత చతురంతయానాథ్యుఁ జేసి
వచ్చుచో దూతలవలను వీక్షించి, పుచ్చి ముందర వారిఁ బురమును నగరు
వాసపుపురితోడ వైభవం బొప్పఁ, గైసేయవలయునఁ గడువేగ మీరు
అని పల్క వారును నరిగి పౌరులకు, వినిపింపఁ జేసిరి వివిధశిల్పములు
దుందుభిశంఖాది తుములనాదముల, నందంద మ్రోయించి రంత భూపతియుఁ
బురమున కేతేరఁ బురజనుల్ నేయు, పరమమంగళతతుల్ పరఁగఁ గైకొనుచు
నతనివిరోధ్యసాధ్యకు నయోధ్యకును, జతుపుఁడై తోడ్తెచ్చె శాంతతోఁగూడ
నీరీతి నాఋష్యశృంగుని దెచ్చి, భూరమణుం డంతిపురమున నునిచి
వితతార్ఘ్యపాద్యాదివిధులఁ బూజించి, యతికృతార్థుఁడనైతి నని సంతసించె
నాసమయంబున నారాజసతులు, కౌసల్య మొదలుగాఁ గలవారు వేడ్క
నలువొంద తొనియానతిఁ బూని చాల, నలరి సంతసమున నాశాంత కపుడు
మహితభూషణవస్త్రమాల్యాదు లిచ్చి, బహువిధంబుల వారిఁ బ్రార్థించిరంతఁ
గొంత కాలమునకుఁ గువలయజనులు, సంతోష మెసఁగ వసంత మేతెర
నడరెడు వేడుక నాఋష్యశృంగు, కడకు భూపతి వచ్చి కడుభక్తి మ్రొక్కి

సన్నుతస్థితి నన్ను సంయమిప్రవర, చెన్నొంద జన్నంబు సేయింప వలయు
నని విన్నవించిన నౌఁగాక యనుచు, నినకులో త్తముఁ జూచి యిట్లని పలికె
వేగంబె తెప్పింపు విహితంబు లైన, యాగసంభారంబు లన్నియు నధిప
యనవుడుఁ దగువారి నయ్యెతెఱంగు, లొనరింపుఁ డనుచు నియోగింపఁ బనిచి
యఖిలసంభారంబు లర్థిఁ దెప్పించి, మఖము చూచుటకు సుమంత్రునిఁ బంపి
కేకయక్ష్మానాథుఁ గీర్తిసనాథు, నా కాశిరాజు నవ్యాహతతేజు
జనకాంగరాజాది జననాథవరుల, ననఘచరిత్రుల నర్థి రప్పించి
మనుజనాయకుఁడు సుమంత్రుతో ననియె, ననఘుల వేదవేదాంగపారగుల
గృహమేధు లగువారి గృహతంత్రభావ్య, మహితార్థనిశ్చయమతుల భూసురులఁ
బరఁగు సుయజ్ఞు జాబాలిఁ గశ్యపుని, సుచిరాత్మునిఁ వసిష్ఠుని వామదేవు
రయమునఁ దోడ్కొని రమ్ము నీవనిన, బ్రియమున నాతండు పెంపార నరిగి
యురుభక్తి నందఱి నొగిఁ దోడితేరఁ, బరువడిఁ దా నర్ఘ్యపాద్యాదు లిచ్చి
నిర్మలవ్రతనిత్యనిష్ఠార్థ మైన, ధర్మార్థయుతముగాఁ దగుమాటఁ బలికె
మునులార కొడుకులు మును నాకు లేమి, మనమునఁ దలపోసి మమత రెట్టించి
మిత్రసూక్తుల నశ్వమేధయాగంబు, పుత్రులకొఱకు నై పుత్రకామేష్టి
సేయంగ నీబుశ్యశృంగుఁ దోడ్తెచ్చి, మీయనుగ్రహము గామించియున్నాఁడ
ననవుడు నావసిష్ఠాదిసంయములు, జననాథుమాటకు సంతోషమంది
యినకులో త్తమ లోకహిత మాచరింపఁ, దనయులఁ గోరు నీతలఁపొప్పు నింక
నశ్వంబు విడువు మీయశ్వమేధమున, విశ్వరక్షకులైన విక్రమోజ్జ్వలులు
నలువురుకొడుకులు నరనాథ నీకుఁ, గలిగెద రని పల్కఁ గడు సంతసిల్లి
సవనయోగ్యం బైన జవనాశ్వ మరసి, భువనపావనమూ ర్తి పూజించి నొసటఁ
బ్రకటిత బిరుదాంకపట్టిక గట్టి, యొకయేఁడు దనయిచ్చ నుర్వీ జరింప
సమకట్టి విడిచె నశ్వంబు రక్షింప, విమతోగ్రులగు సైన్యవిభులతోఁ గూడ
నంత వసిష్ఠాదు లనుమతిసేయ, వింతగా శిల్పకోవిదుల రావించి
సరయువు నుత్తరస్థలి యాగశాల, విరచింపఁగాఁ బంచె వేదోక్తసరణి
మఱియు నానాదేశ మనుజవల్లభుల, వఱలువిప్రనృపాలవైశ్యశూద్రులను
రప్పించె నంత వర్ష ము పూర్ణమైన, నెప్పటి మధుమాస మేతేర నృపుఁడు
చిరతపోనిధి ఋశ్యశృంగుసమ్మతియు, గురుని యానతియుఁ గైకొని మంచివేళ
స్పృహను శాంతాఋశ్యశృంగులతోడ, నిహితసంభారవర్ణితహోమకుండ
సహితమై యేకవింశతిరమ్యయూప, మహితమై శ్రౌతధర్మక్రియాచార
విహితమై మాయా ప్రవీణదై తేయ, రహితమై సకలాఘరహితమై యొప్పు

దశరథుఁడు యాగదీక్షవహించుట.

యాగవాటము చొచ్చి హయమువచ్చుటయు, యాగదీక్షవహించి యతిశుద్ధినొంది
మునుల వసిష్ఠాదిమునిజనో త్తముల, ఋసుల ఋత్విక్కులఁగా వరియింప
సవనత్రయం బభీష్టమున నొనర్చి, ప్రవిమల యూపాగ్రబద్ధంబు లైన

జలచరంబు లరణ్యచరములు విహగ,ములు నురగంబులు మొదలుగానొప్పు
పశువుల మున్నూటిఁ బ్రధితాశ్వ మొకటి, విశసించి క్రతుకర్మ వేదులు ప్రీతి
నేమంత్రములతోడ నేపలలములు, గామించి వేలుపఁగాఁ జెప్పు శ్రుతులు
నామంత్రములతోడ నాపలలములు, కామించి వేల్చిరి కడఁగి ఋత్విజులు
అనలుండు సప్తజిహ్వాలఁ బ్రజ్వరిల్లె, ననిమిషుల్ దనిసి రాహవిరాదికముల
నాయాగదినముల నాఁకొన్న వాఁడు, నాయాసపడినవాఁ డరసిన లేఁడు
సారమృష్టాన్నవస్త్రపటీరకనక, హీరభూషాదిసంతృప్తులే కాని
యే క్రియలందును నెడపడకుండ, నీక్రియ హయమేధ మీఁడేరుటయును
వెనుక జ్యోతిష్టోమవిశ్వజిదాది, ఘనయాగతతులు సాంగముమీఱఁజేసి
అధ్వరదక్షిణకై పూర్వదేశ, మధ్వర్యునకును బ్రహ్మకు దక్షిణంబు
పొనరంగఁ బశ్చిమభూమి హోతకును, దనర నుత్తరము నుద్గాతకు నిచ్చె
నిల నయోధ్యయుఁ దక్క నెల్ల దేశముల, నలరి యిచ్చిన ముదమంది ఋత్విజులు
ఎప్పు డేలుదుము నీ విచ్చినదేశ, మెప్పు డనుష్ఠాన మేము సల్పుదుము
ఏమేడ దేశంబు లేలుట లేఁడ, భూమికి వెలయిమ్ము భూమీశ మాకు
ననవుడుఁ బటికోటు లగు సువర్ణములు, కనకంబు నలుమడి కలధౌతచయము
గోరంగ నొకలక్షగోవుల నిచ్చె, నాఋశ్యశృంగాదు లైనఋత్విజులు
అవి పంచుకొని ముద మందిరి ప్రీతిఁ, బ్రవిమలాధ్వరకర్మపరిచారకులకు
నరనాయకుఁడు సువర్ణములు కోటియిను, వరభూషణంబులు వలయువారలకుఁ
గామితార్థంబులు కామించువారి, కేమి వాఁకొచ్చిన నింపార నిచ్చి
పరఁగ భూసురులకు భక్తితో మ్రొక్కి, వరుస వారిచ్చు దీవనలు గైకొనుచుఁ
బ్రకటదివ్యాంబరాభరణాదు లొసఁగి, యకలంకచిత్తుఁడై యవభృథంబాడి
శ్రీమహితుఁడు ఋశ్యశృంగుచేఁ బుత్ర,కామేష్టిఁ జేయింపఁగా నేగుదెంచి
క్రమమొప్ప యాగభాగములు గైకొన్న, యమరు లారావణు నాత్మలోఁ దలఁచి
బ్రహ్మ గనుంగొని ప్రణమిల్లి నిలిచి, బ్రహ్మ నీవరశక్తిఁ బంక్తికంధరుఁడు
ప్రవిమలాచార్యుల బ్రహ్మర్షివరుల, దివిజుల మునుల బాధించుచున్నాఁడు
దారుణవరశక్తి దలఁప మాచేత, వారిజాసన వాఁడు వారింపఁబడఁడు
సురగణంబులతోడ సుక్రామఁ బట్టి, పరిభవించుచు నేఁచు బాహుదర్పమున
గంధర్వయక్షాదిగణముల మునుల, బంధించు సాధులఁ బట్టి బాధించు
వాఁడన్నఁ గులగిరుల్ వడవడ వడఁకు, వేఁడిమి చూపఁగ వెఱచు భాస్కరుఁడు
వీఁకతో నతఁ డున్నవీట నెన్నఁడును, దేకువచెడి గాలి దిరుగంగ వెఱచు
నన్ని శాచరుఁగన్న నాటోప మెసఁగ, మున్నీరు కడలొత్తి మ్రోయంగ వెఱచు
నేపునఁ గన్నప్పు డెల్ల మమ్మేఁచు, పాపాత్ముఁ డగునట్టిపంక్తికంధరుని
నంతంబు నొందించు నాయుపాయంబు, చింతింపవలయు నీచిత్తంబులోన
ననవుడు నాతెఱం గంతరంగమునఁ, గని బ్రహ్మయును దేవగణము నీక్షించి
యమరులచేఁ జావఁ డసురులచేత, సమయఁడు గంధర్వసమితిచేఁ జెడఁడు

రజనీచరులచేతఁ గ్రాగఁడెన్నఁడును, భుజగసంఘములచేఁ బొలియఁ డెన్నఁడును
యక్షులచే నీల్గఁ డాలంబులోనఁ, బక్షియూథంబుచేఁ బడఁడు వానికిని
వరమిచ్చునప్పుడు వాంఛింపఁడయ్యె, నరులఁగావున వాఁడు నరులచేఁ జచ్చు
విశేదంబుగా నింక వినుఁడు హిరణ్య,కశిపుఁడు లోకముల్ గారించునాఁడు
నరసింహరూపంబు నారాయణుండు, ధరియించి వాని విదారించినాఁడు
వాఁడె వీఁడై విశ్రవసునకుఁ బుట్టి,నాఁడు గావున నేఁడు నారాయణుండు
వీని నిర్జించు నవిష్ణుని నభయ,దానంబు మన మింకఁ దగ వేఁడవలయు
నని దేవతలతోడ నాబ్రహ్మ పలుక, ననువొంద నందఱు నప్పుడే కదలి
యమృతాబ్ధికడకేగి యచ్యుతుఁ గాంచి, విమలచిత్తులు నయి విబుధులు వేఁడఁ
గరములు ముకుళించి కడుభక్తి మ్రొక్కి, యరుదుగ సుర లప్పు డావిష్ణుఁ గాంచి
సన్నుతించిరి మది సంతోష మెసఁగఁ, గనకాక్షశిక్ష లోకత్రయాధ్యక్ష
వనజాలయావాస వసుమతీరక్ష, వనజాక్ష మాకు నెవ్వరు లేరు దిక్కు
నీవొక్కఁడవు దక్క నిక్క మీమాట, గోవింద పరిపూర్ణగుణ చిదానంద
దేవ జగన్మయ దేవాదిదేవ, దేవనిస్తారక దివ్యావతార
శుభమూర్తి శరణంబుఁ జొచ్చిన మాకు, నభయమిచ్చితిగాదె యమృతాబ్ధిఁ దొల్లి
తలపోయ దానవదళన నీబాహు, బలవిక్రమంబులఁ బరఁగు లోకములు
భక్తవత్సల నిన్నుఁ బరికింపఁ దరమె, భక్తియోగముదక్క బయలుమాటలను
మధుసూదనుఁడ నిన్ను మదిలోన నమ్ము, నధికపుణ్యుల కెందు నాపదల్గలవె
జగదుద్భవస్థితిసంహారగతులు, దగ వినోదంబులై తనరు నీమాయ
ఆధారభూతమై యఖిలలోకములు, మాధవ దాల్చు నీమహనీయతనువు
అహిరాజతల్ప నీయలరువైభవము, మహిమఁ జూడఁగ నవాఙ్మనసగోచరము
శరణాగతత్రాణ శరణు లోకేశ, శరణార్థు లగుమమ్ముఁ జనుఁ గావ నీకుఁ
గావునఁ ద్రైలోక్యకంటకుం డైన, రావణుఁ బొలియించి రక్షింపు మమ్ము
మా కొకకార్యంబు మసలక చేసి, లోకకీర్తులఁ బొందు లోకైకవినుత
నిర్మలచిత్తుండు నిశ్చలవ్రతుఁడు, ధర్మశీలుండు నుత్తమగుణాన్వితుఁడు
నగుచున్న దశరథుఁ డశ్వమేధంబు, తగఁజేసి మది శుచిత్వమున నున్నాఁడు
కాకుత్స్థవంశునికాంతలఁ దలఁప, నేకాంతలను వారి కెనసేయ రాదు
నరమూర్తులొప్పంగ నాలుగంశముల, సరసిజోదర నీవు జనియింపవలయు
వరశక్తి సురల కవధ్యుఁడై లోక,పరితాపకరుఁ డైన పంక్తికంధరుని
మునుల గంధర్వకింపురుషుల సురలఁ, బనిసడఁ జంపినపాపాత్ముఁ జంపి
సవనము ల్సేయింపు సంయమివరుల, భువనము ల్రక్షింపు పుండరీకాక్ష
యని విన్నపము సేయునమరులఁ జూచి, వనదగర్జితగతి వనజాక్షుఁ డనియె
సురలార మీరింక సుఖమున నుండుఁ, డరిగి మర్త్యమున నే నవతారమంది
యాదట బంధుమిత్రామాత్యపౌత్ర, సోదరయుతు దశాస్యుని గీటడంచి
నిండార నేలెద నియతితోఁ బదునొ,కొండువేలేఁడు లీకుంభినీతలము

నజునివరంబున నవనీతలమున, రజనీచరేంద్రుండు రాజిల్లఁగలిగె
ననుచు వరంబిచ్చి యజుని వీడ్కొలిపి, యనిమిషులను బంపి యసురారి చనియె

దశరథునకు యజ్ఞపురుషుఁడు దివ్యపాయస మిచ్చుట.

అప్పుడు విమలహోమాగ్ని లోనుండి, యొప్పెడుపుణ్యాత్ముఁ డొకదివ్యమూర్తి
హరినీలనీలాంగుఁ డరుణాంబరుండు, తరుణార్కతేజుఁ డుదగ్రవిక్రముఁడు
పరఁగఁ బాయసముతోఁ బసిడిపాత్రంబు, కరమున ధరియించి గ్రక్కునఁ వెడలి
తనుఁజూచి యద్భుతాదరమున లేచి, వినయాఢ్యుఁడై యున్న విభుని వీక్షించి
భూనాథ విను యజ్ఞపురుషుండ సుతుల, నే నీకు నీఁగోరి యే తెంచినాఁడ
నాదట నీపాయసాన్నంబు పుచ్చి, నీదేవులకుఁ బెట్టు నిష్ఠతో ననిన
ననురాగమునుబొంది యవనీశుఁ డతని, ననువొందఁ బూజించి యాపాయసంబు
తానందుకొనియె సుధాకలశంబు, చేనందుకొన్న శచీపతిమాడ్కి
నంతఁ బ్రాజాపత్యుఁ డటు మాయమైన, నంతగపురంబున కరిగి భూవిభుఁడు
రమణు లెదురొక్కని ప్రమదాబ్ధిఁ దేల, సమరనిర్మితమైన యాపాయసంబు
సగము కౌసల్యకు సగములోఁ బుచ్చి, సగము సుమిత్ర కా సగములో సగము
కైకకు నిచ్చి యత్కంత నాసగము, ప్రాకటంబుగ సుమిత్రకు నిచ్చె మఱియు
నప్పాయసాన్నంబు లర్ధి భుజించి, యప్పుడు గర్భిణు లైరి వా రెలమి
తగిలి వారలఁ జూచి దశరథేశ్వరుఁడు, మిగుల నానందించి మెఱసెఁ జూపఱకు
మొగి ఋశ్యశృంగాదిమునుల భూపతులఁ, దగునర్చనము లిచ్చి తగవీడుకొలిపి
పరమానురాగుఁడై పడఁతులు దాను, ధరణీశుఁ డయ్యోధ్యకు నేగుదెంచెఁ
దమయాగభాగము ల్దగిలి కైకొన్న, యమరులు దమలోక మరిగెడుచోట
నాకంజగర్భుఁ డింద్రాదులఁ జూచి, లోకరక్షణకళాలోలుఁడై శౌరి
ధారణిపై నవతారంబు నేయ, మీరును దోడ్పడ మేకొనవలయు
నటుగాన లోకహితార్థవర్తనులఁ, బటుపరాక్రమరూపబలపరాక్రమనిధుల
బలగర్వముల మిమ్ముఁ బ్రతిపోల్పఁజాలు, బలియుర వానరపతులఁ బెక్కండ్రఁ
గిన్నరగంధర్వఖేచరయక్ష, పన్నగామరసిద్ధభామలయందుఁ
బుట్టింపుఁ డేమున్ను పుట్టించినాఁడ, నెట్టన బలపరాక్రమనిధి జాంబవంతు
నదియెట్టిదనిన నేనావులించుటయు, నుదయించె జిరతరాయుష్మంతుఁ డతఁడు
అని బ్రహ్మ తమతోడ నానతిచ్చుటయు, విని సంతసిల్లి యావేల్పులందఱును
అనిమిషపతి వాలి ననలుండు నీలు, నిసుఁడు సుగ్రీవు సురేజ్యుండు తారు
సింధువల్లభుఁడు సుషేణు గుహ్యకుఁడు, గంధమాదను విశ్వకర్మయు నలుని
దివిజవైద్యయుగంబు ద్వివిదమైందులను, దివిరి పర్జన్యాధిదేవత శరభుఁ
గరువలి హనుమంతుఁ గడఁగి పుట్టింప, ధరణిఁ బుట్టించిరి తక్కినసురలు
తమతమసత్త్వము ల్దగఁ బుచ్చి వేర్చి, యమితశౌర్యుల వానరాధీశ్వరుల
నావానరులు జగదాప్తవర్తనులు, దావాగ్నితుల్యలుబగ్రవిక్రములు

[1]పర్వతాకారులై భాసిల్లువారు, పర్వతయోధులై పరఁగెడువారు
భీమసాహసికులై పెంపారువారు, కామరూపంబులఁ గరమొప్పువారు
దఱిమి యబ్ధులనైన దాఁటెడువారు, [2]పెఱికి కొండలనైన భేదించువారు
నఖదంష్ట్రాహేతుల నలిఁ గ్రాలువారు, నఖులలోకోత్తరు లై యొప్పువారు
ధారణినైన విదారించువారు, నై రూఢికెక్కియు నరుదుగ వారు
కొందఱు సుగ్రీవుఁ గొందఱు వాలిఁ, గొందఱు హనుమంతుఁ గొందఱు నీలుఁ
గొందఱు నలమైందకుముదులఁ గొలిచి, యెందు నభేద్యులై యేఫుదీపించి
మలయదర్దురగంధమాదనవింధ్యములు మొదలగు శైలములఁ గాననముల
[3]బహుజలనదనదీప్రాంతదేశముల, విహరించుచుండిరి వేడ్కతో నంత
మహనీయపాయసమహిమచేఁ జేసి, యహిమాంశుకులపత్ను లందు గర్భంబు
లలవడ నాథానమైనది మొదలు, కలిమిఁ గైకొనెఁ బేదకొను లెంతయును
నమృతాన్నరుచిలోన నడఁగక వెలికి, గమనించె నన దేహకళ వెల్లవాటె
రావణుసామ్రాజ్యరమ ముక్కునల్పు, గావించుటకు సూచకము లివి యనఁగ
ననపత్యతాదోష మంతయు వెడల, మొనసె నాఁదగెఁ జనుముక్కులనల్పు
చెక్కులుపలుచఁగాఁ జిట్టుముల్బలిసె, నిక్కినాభులువళు లెన్నులకుఁబాసెఁ
దలచూపెఁ గోర్కి లంతటఁగ్రమంబునను, నెలలు తొమ్మిదియును నిండినపిదప
వర్ణితమధుమాస వరశుక్లపక్ష, పూర్ణయా నవమిని బుధవాసరమున

శ్రీ రా మా వ తా ర ము.

మహిఁ బునర్వసు తార మధ్యాహ్న వేళ, గ్రహపంచకము నుదగ్రస్థితిఁ దనరఁ
దొలఁగక గురుఁడు చంద్రుఁడుఁ గూడియుండ, లలితకర్కాటలగ్నంబునందు
సర్వలోకాధారు జగదేకవీరు, శర్వాదిదేవతాసంస్తూయమానుఁ
దివ్యలక్షణకళాదేదీప్యమానుఁ, నవ్యయు నసమానుఁ నార్తార్తిహరణు
భవ్యుఁ జిదానందుఁ బరమకల్యాణు, దివ్యులరక్షించు దీనార్తిహరణు
గుణగణాలంకారు గురుకీర్తిహారు, ఫణిరాజశయను శ్రీపతి హృషీకేశు
నాకమలోదరునర్ధాంశమునను, గాకుత్స్థకులు రాముఁ గనియెఁ గౌసల్య
యదితి యింద్రునిగన్న యనువునఁ దూర్పు, సుదతి చంద్రునిగన్న చొప్పున నంత
భూలోకవిదితమై పుష్యనక్షత్ర, లాలితం బగు మీనలగ్నంబునందుఁ
గమలాప్తసమతేజుఁ గమలాప్తవంశుఁ, గమలాప్తుభరతుని గనియెఁ గైకేయి
ప్రణుతింపఁ దగునట్టి ఫణితారకమున, గణితకర్కటకలగ్నంబునఁ గవలఁ
దరళలోచన సుమిత్రాదేవి మిత్ర,చరితుల లక్ష్మణు శత్రుఘ్నుఁ గనియె
దివి మ్రోసె నప్పుడు దేవదుందుభులు, దివి నాడి రప్పుడు దేవకామినులు
సొరిదిఁ బువ్వులవాన సోనలై కురిసెఁ, బరితోష మందిరి బ్రహ్మాదిసురలు
కలయ నయోధ్యలోఁ గలవార లెల్ల, వెలసి రుత్సవముల వీరు వారనక

---

1 పర్వతశౌర్యులై పరఁగెడువారు. 2 మెఱిమి కొండల నైన మీటెడువారు. 3 బహు జలనిధినదీప్రాంతదేశముల.

అప్పుడు దశరథుఁ డనఘు వసిష్ఠు, రప్పించి జాతకర్మములు సేయించి
పుత్రోత్సవంబును బొరియించె దివిజ, నేత్రోత్సవంబుగా నిఖిలపౌరులకుఁ
బురుడు దీరినయంతఁ బుణ్యాహవేళ, వరుస నాసుతులకు వంశోన్నతులకు
నామకరణములు నలువుర కిప్పు, డేమఱ కీవు సేయింపు వసిష్ఠ
యనవుడు నౌఁగాక యని తనమదిని, గనుఁగొని పలికెను గౌసల్యసుతుని
రముక్రీడయని థాతురమ్యార్థమమరు, రమయతి యననొప్పు రామనామంబు
కైకేయితనయుండు ఘనబలాన్వితుఁడు, సుకుమారతనుఁడు సుశ్లోకుండు గాన
భరతనామంబునఁ బరఁగుసుమిత్ర, కిరవైనసుతులకు నింపు సొంపెసఁగ
లక్షణగుణులు సంలక్షించి చూడ, లక్ష్మణశత్రుఘ్ను లనునామ మొదవుఁ
గాన వీరలు మహాఘపుణ్యమతులు, ఈనలువురకును నివి నామము లన
లక్ష్మీసమన్వితులకు రామభరత, లక్ష్మణశత్రుఘ్ను లలితాఖ్య లెసఁగ
నొగి నామకరణంబు లొప్పఁ గావించి, తగ నర్ధకోటులు దానంబు లిచ్చె
వారలు తల్లులు వరుస దాదులును, బోరామిఁ దము నర్థిఁ బోషింపఁ బెరిగి
కల్లరినగవులఁ గన్నులు దెఱచి, యల్లనల్లనఁ దప్పు టడుగులు వెట్టి
మల్లడిగొను డొంకుమాటలు నేర్చి, యెల్లవారికిఁ జాల నింపు లొనర్చి
కొద్దిగా ముత్తెంపుఁగొనబు వజ్రాల, మద్దికాయలడాలు మలయఁ జెక్కిళ్లఁ
బ్రాకటంబుగ భాలబాలేందుకళల, శ్రీకరాకృతి రావిరేక లల్లాడఁ
బొగడొందు మగరాల పులిగోళ్ల మేలి, జిగిడెందములయందుఁ జిందులు ద్రొక్క
నెడనెడఁ బలుపచ్చ లేయడ్డిగలుగఁ, గడునొప్పు మొలనూళ్ల గంటలు మెఱయ
మువ్వ లందెలు పదంబుల దొడ లల్దేయ, నవ్వులాటల బాల్యనటన లేర్పడఁగ
విద్దెలు నెఱపుచు విభునిముందఱను, ముద్దులుగులుకుచు మోహనాకృతుల
నంత నానలువురు నభివృద్ధిబొంది, సంతతపుణ్యులై సమచిత్తు లగుచుఁ
దమలోనఁ గవకూడి దశరథాత్మజులు, రమణీయమూర్తులు రామలక్ష్మణులు
భరతశత్రుఘ్నులు పాయక పుణ్య, నిరతులై చాలోపనీతులై యంత
మాయావినోదము ల్మరిగి యాడుచును, నాయెడ రఘురాముఁ డాప్తులు దాను
నిండారుప్రేమతో నెక్కొలుగట్టి, చెండును దండంబు చెలువొప్పఁ బట్టి
తరమిడి యాడెడుతఱిని గైకేయి, వరపు డామంథర వడి నేగుదెంచి
చిట్టంటుచేతలఁ జెండు దట్టుటయు, కట్టల్క రాముఁ డాకాష్ఠంబుచేత
నడచిన నొక్కఁకా లప్పుడే విఱిగెఁ, దడయక యందందఁ దమకించి రాము
నడరెడువేడ్కతో నాడంగఁ జూచి, తడయకరాముపైఁ దగఁ గ్రౌర్య ముంచి
విరిగినకాలితో వెసఁ గైక నగరి, కరిగి తద్వృత్తాంత మంతయుఁ దెలుపఁ
దరమిడి కైకేయి దశరథాధిపున, కెఱిఁగింప నంతయు నెఱిఁగి భూవిభుఁడు
అలవసిష్ఠుని నయోధ్యకును రావించి, వలగొని మ్రొక్కి యోవరమునిచంద్ర
వీరికి వేదాదివిద్య లన్నియును, నేరుపుఁ డనుచు నానృపుఁ డప్పగింప
ననఘుఁ డమ్మునినాథుఁ డట్లకావించె, జననాథుతనయు లాసంయమికరుణఁ

గరిహయారోహణక్రమము లెఱుంగి, వరరథారోహణవైఖరు లెల్లిసి
యఖలవేదంబులు నఖలశాస్త్రములు, నఖలశస్త్రాస్త్రవిద్యలు నేర్చిరంత
వారిలో రాముఁ డవార్యశౌర్యమున, సారవివేకాదిసద్గుణావళులఁ
దేజరిల్లుచు విష్ణుదేవుండుగాన, రాజిల్లె నాదశరథుఁడును నంతఁ
గొడుకులపెండ్లిండ్లు కొమరొప్పఁ జేయ, నడరి చింతింప విశ్వామిత్రుఁ డట్టె
వచ్చి నిల్చుటయు దొవారికు లెల్లిసి, వచ్చి యాదశరథవరునర్థిఁ జూచి
యవధారు దేవ విశ్వామిత్రమాని, తివిరి వాకిట నేగుదెంచియున్నాఁడు
అనవుడు దశరథుం డాప్తులతోడ, మునివసిష్ఠుఁడుఁ దాను ముదముతోఁ నపుడు
పరమేష్ఠి కెదురేగుపాకశాసనుని, కరణి నెదుర్కొని ఘనశక్తి నెఱిఁగి
యమ్మునిఁ గొనిపోయి యర్ఘ్యపాద్యములఁ, నెమ్మిఁ బూజించిన నృపుఁ జూచి యతఁడు
కుశలమే ప్రజలకుఁ గుశలమే నీకుఁ, గుశలమే నీముద్దుకొడుకుఁగుట్టలకు
విశదవ్రతాచారవినుత వసిష్ఠ, కుశలమే మునులార కుశలమే యనిన
నేమిటఁ గొఱఁతలే దేము ధన్యులము, నామందిరము పావనమ్ము చెన్నొంద
భావితమూర్తి యోపరమమునీంద్ర, నీవు విచ్చేసితి నేఁడు మాకడకుఁ
గాన లోకములఁ బ్రఖ్యాతుఁడ నైతి, మానవాధిపులలో మాన్యుండ నైతి
వచ్చినకార్యంబు వలనొప్పఁ జెప్పుఁ, డిచ్చమైఁ జేసెద నేకార్యమైన
ననిన విశ్వామిత్రుఁ డారాజుఁ జూచి, జననాథ దశరాత్రసవమును దొడరి
కోరి యేఁ జేయుచోఁ గ్రూరరాక్షసులు, దారుణాకారు లిద్దఱు వచ్చి వచ్చి
మాయాయాగశాలలో మాంసరక్తములు, పాయక గురియుచుఁ బ్రబలవిఘ్నములు
నేయుచు నున్నారు క్షితిపాల మాకు, నాయాగమధ్యంబునం దల్లరాదు
అటుగాన నీపుత్రు నభిరాముఁరాముఁ, బటుసత్త్వోద్రేకుఁవొప్పఁ బాలించుకొఱకుఁ
గొనిపోవ వచ్చితిఁ గ్రూరులు దనుజు, లనిఁ జావ రొరులచే నతనిచేఁ గాని
యితనిమహత్త్వ మే నెఱుఁగుదు బ్రహ్మ, సుతుఁడైన యీవసిష్ఠుండును నెఱుఁగు
అనఘరాముఁడు బాలుఁ డనుబుద్ధి మాను, మనఘ నీపుత్రకుం డనులోభ ముడుగు
క్రతుకర్త క్రతుమూర్తి క్రతుభాగభోక్త, యతఁడు లోకారాధ్యుఁడతనిఁబుత్తెంపు

కౌశికుఁడు యజ్ఞరక్షణార్థమై దశరథునితో రాముని బంపుమనుట.

మతులశస్త్రాస్త్రంబు లతని కీనిత్తు, నతనిచేఁ గ్రతురక్ష యగు మాకు ననుడు
బెలుకురి మూర్ఛిల్లి పెద్దప్రొద్దునకుఁ, దెలిసి వెల్వెలఁబాఱి దీనుఁడై మిగులఁ
గలఁగి కంపించి గద్గదకంఠుఁ డగుచుఁ, బలికె విశ్వామిత్రు బ్రార్థించి నృపుఁడు
రాముఁడు బాలుండు రాముండు నిసువు, రాముఁ డెఱుంగఁడు రణకళాకేళిఁ
బదియును నై దేండ్లప్రాయంబువాఁడు, కదలెడి చిప్పకూఁకటిగలవాఁడు
పరికించి తనయందుఁ బగవారియందు, నురుబలాబలగతు లూహింపలేఁడు
ఇటువంటిపసిబిడ్డ నేల వేఁడితిరి, కటకటా ఘనదయాకలితుండ వయ్య
బహుదివ్యశస్త్రాస్త్రహతులు రాక్షసులు, మహితమాయోపాయమతులు రాక్షసులు
నిపుణసంగరకళానిధులు రాక్షసులు, విపులబాహాటోపవిభులు రాక్షసులు

వారితోఁ బోర నెవ్వఁడు రాముఁ డనఁగ, వారేడ యితఁడేడ వరమునిచంద్ర
యరువదివేలేఁడు లవనిఁ బాలించి, తఱిదప్పి ముదిసి యీతనిఁ గంటి నేను
ఇతనిఁ బుత్తెంచుట కేజాలనయ్య, క్రతురక్షకై విచారములేల మీకు
నేను సేనలఁ గూడి యీప్రొద్దె కదలి, వూని వచ్చెద నిదె పొండు మీవెనుక
మునినాథ మీయాగమున విఘ్నకర్త, లగురాక్షసులశక్తు లవియెంత గలవు
ఱా రెవ్వరెవ్వరు వారిపేరేమి, యీరాఘవుఁడు వారి నెబ్బంగి గెలుచు
ననిన విశ్వామిత్రుఁ డనియె భూపతికి, మనుపుల స్త్యబ్రహ్మమనుమండు ఖలుఁడు
ఆవిశ్రవసుకొడు కఖలకంటకుఁడు, రావణుఁ డుగ్రసంరంభుఁడై పనుప
బలసి మారీచసుబాహులన్వారు, నలిరేఁగి యాగవిఘ్ను లులు నేయుదురు
రాముఁడొక్కఁడు దక్క రణభూమి వారి, నేమిచందంబున నెదురలేరొరులు
అని పల్క సమ్మక యధిపతి మఱియు, మునినాథుతోఁ బల్కె మోమోటలేక
బ్రహ్మానాలవవాఁడు పరమసాహసుఁడు, బ్రహ్మచే వరములు వడసినవాఁడు
అట్టిరావణుచేత నటు పంపు వడసి, నట్టివారల గెల్వ నతఁడేమిచాలు
వారిలా వెఱుఁగక వచ్చెద ననుచు, మీఱి పల్కితి నింక మెల్లనఁ జనుఁడు
ననవుడు రోషతామ్రాక్షుఁడై చూచి, కనలుచుఁ గటము లుత్కటములై యదర
నొడలెల్లఁ గంపింప నురుగతిఁ బలికె, నడరి విశ్వామిత్రుఁ డారాజుఁ జూచి
కాకుత్స్థకులజులగతి విచారింప, కీకష్టదుర్భాష లేల భాషింప
నేను వచ్చినపని యెఱిఁగింపు మంటి, వూని చేసెద నంటి బొంకెద విపుడు
క్రతురక్షకై రాముఁ గడఁగి వేడుటయు, ధృతిమాలి యీనని తెగి పల్కెదీవు
సూనృతేతర నిన్నుఁ జూడఁగారాదు, గానఁ బోయెదనంచుఁ గడఁగి పల్కుటయు
జలనిధులింకె భూచక్రంబు గ్రుంగెఁ, గలఁగె లోకములు దిగ్గజములు మ్రొగ్గె
దివిజులు వెఱచిరి దిశలు గీడ్పడియె, నవశంబులుగఁ జొచ్చె నఖలభూతములు
అప్పుడు మౌని కోపాటోపవృత్తి, తప్పక భావించి దశరథుఁ జూచి
యీవసిష్ఠుఁడు పల్క నర్కవంశజులు, భూవలయంబున బొంక రెన్నఁడును
మిన్నందు నీకీర్తి మీవారికీర్తి, లన్నియుఁ జెడుఁ గల్ల లాడితివేని
యిచ్చెద ననిపల్క యీకున్నఁ బొలియు, నచ్చుగాఁ జేసిన యఖిలధర్మములు
దశరథాధీశుండు ధర్మాత్ముఁ డనఁగ, విశదకీర్తుల నీవు వినఁ బ్రసిద్ధుఁడవు
పుడమిలో నవనీశ భువనరక్షణము, గడవంగ ధర్మముల్ గలవె రాజులకుఁ
గాన రాముని నిచ్చి గాధినందసుని, మానసీయునిఁ బంపు మీనవాధీశ
ఘనబలోన్నతులు రాక్షసు లీకుమారు, డనికి దక్కుండు గాఁడనుచు నీకొడుకు
శైశవంబున కింత శంకింపనేల, కౌశికుఁ డుండంగఁ గలుగునే భయము
అధిప విశ్వామిత్రు నత్యుగ్రతపము, లధికసామర్థ్యంబు లతివిచిత్రములు
భూనాథ యిమ్మహాపుణ్యుండు దేవ,దానవగంధర్వదైత్యులకంటె
నెఱుఁగు దివ్యాస్త్రంబు లిమ్మహాబాహుఁ, డెఱుఁగనివిషయంబు లెందును లేవు
జనలోకనాయక జయయు సుప్రభయు, ననఁగ దక్షునికూఁతు లాజయవలన

సుప్రభవలన రక్షోవధార్థముగ, సుప్రభుం డగుభృశాశ్వుండు వేర్వేఱ
నస్త్రాకృతులఁ బుత్త్రు లరయ నేఁబండ్రఁ, శస్త్రాకృతుల తనూజన్ము లేఁబండ్రఁ
గామరూపంబులు గలవారిఁ గాంచి, భూమీశ యిచ్చె నీపుణ్యాత్మునకును
అది కారణంబుగా నఖిలశస్త్రాస్త్ర,విదుఁ డిమ్మునియు నీవు వెఱవంగ వలదు
ఈమునిమహిమమెం పెఱుఁగవే యకట, యీమునితో నాడి యేల తప్పెదవు
ఈమునిచంద్రుతో నేగ రామునకు, నేమంబు జయమును సిద్ధమ్ము సుమ్ము
ఇతఁడు రక్కసుల జయింపఁగా లేఁడె, హితమతి నీపుత్త్రు నిర్దగ్ధచారిత్రు
నలఘుశస్త్రాస్త్రవిద్యలఁ బెద్దనేయ, వలసి యిచ్చటికి భూవర వచ్చెఁగాక
కాన రాముని బంపు క్రతువు రక్షింప, నీనిర్మలాత్ముని కిచ్చుట మేలు

కౌశికునితోడ రామలక్ష్మణులఁ బంపుట.

అని వసిష్ఠుఁడు పల్కఁ నాత్మలో నమ్మి, జననాథుఁ డారామచంద్రుని బిలిచి
బాలభావము చూచి బాష్పము ల్నించి, యాలింగనము సేసి యర్థి దీవించి
చిప్పకూఁకటి దువ్వి చెక్కిలి పుడికి, తప్పక యొక్కింతతడవు చింతించి
పుణ్యాహవాచనపూర్వంబు గాఁగఁ, బుణ్యవ్రతంబులు పుణ్యహోమములు
గ్రహపూజనలు సేసి కమనీయవస్త్ర, మహితభూషణములు మనసార నిచ్చి
యొగిఁ దానుఁ గౌసల్యయును వసిష్ఠుండు, తగిన దీవనలిచ్చి దశరథేశ్వరుఁడు
పుణ్యలగ్నంబునఁ బుత్త్రరత్నంబుఁ, బుణ్యాత్ముఁ డగు గాధిపుత్త్రున కిచ్చి
నెమ్మియుఁ దెగువయు నెఱిబిరిగొనఁగ, నమ్మునిఁ గొలిచి పొమ్మని వీడుకొలిపె
నప్పుడు లక్ష్మణుం డారాముఁ గొలిచి, తప్పక భక్తితోఁ దానును జనియెఁ
బొదివి పువ్వులవాన పొరిఁబొరిఁ గురిసె, వదలక యనుకూలవాయువుల్వీచె
వరఘోషమంగళవాద్యము ల్మ్రోసె, సుర లాకసంబునఁ జూచిరి ప్రీతి
నారాఘవుం డప్పు డరుగుచిత్రముల, నారిమ్రోఁతల మహోన్నతశస్త్రములను
మహితతూణీరముల్ మండలాగ్రముల, సహజంబుగాఁ బూని సంప్రీతితోడ
నక్షీణతూణగోధాంగుళిత్రాణ, కఱులంబకృపాణకలితులై దివ్య
శరచాపహస్తులై సంయమిపిఱుదఁ, గరము సంప్రీతిమైఁ గదలి రాఘవులు
ఆవనజాప్తుని నర్థితోఁ గొలిచి, పోవు నశ్విను లనఁ బోవుచో వేడ్క
నురుపుణ్యమతు లర్ధయోజనం బరిగి, సరయువుడగ్గర శ్రమముఁ బొందుటయు
రామసౌమిత్రుల రమ్మని యపుడు, తా మున్ను దారుణతపముచేఁ గొన్న
గనకగర్భునిపుత్త్రికల సర్వమంత్ర, జనసుల సర్వదా సౌఖ్యదాయినుల
బల యతిబల యనఁ బరఁగుమంత్రములు, నెలమిమై వారల కిచ్చెఁ గౌశికుఁడు
ఆరామలక్ష్మణు లామంత్రశక్తి, నారూఢరవితేజులై బడలికయు
నాఁకలి నీరువట్టాదిగా రుజలు, సోఁకక బలవృద్ధి శోభిల్లి రంత
సరయూనదీతటస్థలి నాఁటిరాత్రి, దరుణకోమలదర్భతల్పంబులందుఁ
గౌశికుచేఁ బుణ్యకథలొప్ప వినుచు, దాశరథులు ప్రమోదమున నిద్రింప
నాగాధితనయుండు నాప్రభాతమున, వేగంబె మేల్కొని వేడ్క చిత్తమునఁ

దనరంగ నటఁ దృణతల్పంబులందుఁ, గనుమోడ్చియున్న రాఘవుల నీక్షించి
అరుణోదయంబయ్యె ననఘాత్ములార, నిరుపమపూర్వాహ్ణనిత్యకృత్యములు
వలయు నేమంబులు వరుసఁ గావింప, వలయుట మేల్కొన వలయు మీరనిఁ
దెలిసి సంధ్యావిధుల్ దీర్చి కౌశికుని, కలరుచిత్తములతో నతిభక్తి మ్రొక్కి-
తరణివంశోత్తము ల్దారర్ధిఁ జనుచు, సరయూసురాపగాసంగమంబునను
బహుసహస్రాబ్దము ల్పాయనినియతి, బహుతపంబులు సేయుపరమసంయములఁ
గనుఁగొని సంతోషకలితుఁడై గాధితనయతోఁ బలికె నాదశరథాత్మజుఁడు
ఎవ్వనియాశ్రమం బిది సంయమీంద్ర, ఎవ్వ రుండుదురయ్య యీతపోభూమి
నవుడు రామ యనంగాశ్రమమున, వినఁబడు నిది లోకవిఖ్యాత మగుచు
నీయాశ్రమంబున నెలమితోఁ దపము, సేయుచు లీలమై శివుఁడున్నఁ జూచి
కందర్పుఁ డతిదర్పగర్వితుం డగుచు, నిందుశేఖరుమీఁద నేయంగఁ జూచి
యడరి యాదేవుభాలాక్షానలమునఁ, జెడుట ననంగాఖ్యఁ జెందె లోకముల
నంగసంగతిఁ దదీయాశ్రమభూమిఁ, యంగదేశం బయ్యె నంతనుండియును
అరుదారఁ దపము లీయాశ్రమ భూమిఁ, జరిపించుపుణ్యులు చరితార్థు లెందు
ననుచు విశ్వామిత్రుఁ డత్తెఱుంగెల్ల, వినిపించి యారఘువీరులుఁ దాను
నిలిచి నాఁ డావాహినీసంగమమున, విలసితస్నానాదివిధు లనుక్షించి
యానందమందఁ దదాశ్రమవాసు, లైనమునీశ్వరు లాత్మలో నెఱిఁగి
రమణీయమూర్తుల రామలక్ష్మణుల, నమితతపోధనుఁ డైన కౌశికునిఁ
గొనిపోయి వేడ్కలు గొనలొత్త నపుడు, వినుతార్ఘ్యపాద్యాదివిధులఁ బూజించి
పుణ్యకథాగోష్ఠిఁ బొదల నారాత్రి, పుణ్యరాత్రముఁజేసి పుణ్యసంయములు
మఱునాఁడు నిత్యకర్మంబు లయ్యేటఁ, దెఱఁగొప్ప నందఱు దీర్చినమీఁద
నీనావికుఁడు నేర్చు నియ్యేఱు గడప, భానువంశుజులకుఁ బదిల మీనావ
యనుచు విశ్వామిత్రుఁ డలరంగఁ బలుక, విని రామలక్ష్మణు ల్వెరవొప్పనపుడు
వారికిఁ బ్రణమిల్లి వారు దమ్మనుప, నాఋషితోఁ గూడ నానావ యెక్కి-
సరయువు దాటుచో సరయువునడుమఁ, గరము విస్మయమునుఁది కరములు మొగిచి
యివి మహాధ్వనులు పెల్లెసఁగుచున్నవియు, దివినుబ్బి యిదియేమి తెలుపవేయనుడుఁ
గర మొప్ప మీఱుచుఁ గైలాసశిఖరి, సరయువు మానససరసి జన్మించి
పొంగారు సాకేతపురిచుట్టు గవిసి, గంగలోఁ గూడెడు కరడులమ్రోత
యని మునిచెప్పిన నర్థితోఁ మ్రొక్కి, యనఘు లన్నదిదాఁటి యరుగుచో నెదుర
కరులు సూకరములు కాసరంబులును, హరిణముల్ శరభంబు లజగరంబులును
బులులు భల్లూకము ల్వాదలుసింగములుఁ, గలమహాటవిఁ జొచ్చిఘనుఁడురాఘవుఁడు
ఖదిరతిందుకపూగఖర్జూరనింబ, బదరీవటప్లక్ష పాటలీతరులు
బహుళకంటకలతాపరివృతవృక్ష, సహితంబు నిర్మానుషంబునునైన
నివ్వనభూమి మునీశ్వర పూర్వ, మెవ్వరియాశ్రమం బెఱిఁగింపు మనుచు
నడుగ విశ్వామిత్రుఁ డంతయుఁ జెప్పఁ, దొడఁగి యారామునితో నిట్టులనియె

నలుక నింద్రుండు వృత్రాసురుఁ జంపి, మలకలుషప్రాప్తి మలినాంగుఁ డైన
సురలును మునులును సుత్రాము నిటకు, దురితముక్తునిఁజేయఁ దోడ్కొ ని వచ్చి
ఘణోదకంబులఁ బుణ్యమంత్రములఁ, బుణ్యాభిషేకము ల్పాలుపారఁ జేయ
నామలకలుషంబు లనునవి రెండు, భూములనిడ శుద్ధిఁబొంది వాసవుఁడు
మలయుక్తమైనది మలదంబు కలుష, కలితమైనది యొప్పుగాఁ గరూశంబు
ననియుఁ బాపఘ్నుంబు లనియుఁ బేరొసఁగి, జనపదంబునఁ దొల్లి జంభారి దనకు
నలవృత్రవధపాపమందుఁ దీఱుటయు, వినుతింప ధనధాన్యవిభవములొప్పదలఁ
బొలుపార వరము లాపురముల కిచ్చి, వెలయించె నిఁకనొండు విను రఘురామ

విశ్వామిత్రుఁడు రామునకుఁ దాటకిజననము చెలుపుట.

ధరణిఁ దాటక యనుదానవురాలు, కరులు వెయ్యేంటికిఁ గలలావు గలిగి
పొలుపేది నీరెండుపురములు సొచ్చి, యలవుమై బాధించు ననుడు రాఘవుఁడు
ఎవ్వరు లా విచ్చి రీయింతి కింత, యెవ్వారి కిది పుత్రి యీదుష్టబుద్ధి
యీపురంబులు రెండు నేల కాఱించు, నీపాపకర్మురా లెఱిఁగింపు మనుడు
నవని సుకేతుఁ డ్ఢ యక్షుండు తొల్లి, తవిలి పద్మజునకుఁ దపమాచరించి
యడరెడునిష్ఠమై నతని మెప్పించి, కొడుకు వేఁడుటయును గొడుకు నీకీను
వెలసినగజముల వేయింటిలావు, గలకూతు నిచ్చితిఁ గనుము పొమ్మనిన
నావరంబున దాని నాథండు గాంచి, భావించి సుందునిభార్యగాఁ జేసె
నతఁ డవ్వధూటియం దతిఘోరసత్త్వ,వతుల మారీచసుబాహు లన్వారిఁ
బడసి లోకాంతరప్రాప్తుఁ డైటయును, గొడుకులు దానును గూడి గర్వమున
నాయింతి మఱి యగస్త్యాశ్రమంబునకుఁ, బోయి మౌనుల సారెఁ బొదలి కాఱింపఁ
గలశజుఁ డాపాపకర్ములఁ జూచి, యలిగి రాక్షసులు గండని శాప మిచ్చె
నదియాదిగా రాక్షసాకృతుల్వాని, యదయత మానవాహారముల్ గొనుచు
దానిందు వసియించి ధరణిఁ గాఱించు, దీనిఁ జంపఁగలేరు లెఁగువ నెవ్వరును
నీ వొక్కఁడవు దక్క నీచేతఁ గాని, చావ దాఁడుది యని చంపరా దనకు
మెఱసి గో బ్రాహ్మణహితమైనఁ జాలుఁ, జనుఁ జంపఁ గామినీజనుల రాజులకుఁ
దొల్లి ధారణియెల్లఁ ద్రుంపఁ జింతించు, ప్రల్లదురాలైనఁ బర్జన్యుఁ డలిగి
సంపన్నమతి విరోచనుకూఁతుఁబట్టి, చంపఁడె యది ప్రశస్తముగాదె యెందు
నెఱయలోకంబు లనిద్రముల్ గాఁగఁ, జెఱుపఁ జిత్తంబునఁ జింతించుటయును
నలుక దృఢవ్రత యగు భృగుపత్ని, జలమొప్ప విష్ణుండు చంపఁడే తొల్లి
యదిగాన లోకహితార్థమై సతులఁ, బొదవి చంపుటయును బుణ్యంబులనఘు
యనిన విశ్వామిత్రునతులవాక్యములు, తనతండ్రిపనుపును దలఁచి రాఘవుఁడు
హాటకగర్భాభుఁ డగుమౌనిమాటఁ, దాటక తాటక దండింతు ననుచు
ఘనధనుర్ఘోషముల్ గగనంబు నిండ, నినుచుటయును మండి నిండఁ గోపించి
కర్ణకఠోరమా కార్ముకధ్వనికి, ఘూర్ణితారుణనేత్ర కుటిలాస్య యగుచు
రెండుహస్తము లెత్తి యెక్కలతోడి, కొండ రివ్వునవచ్చుకొమరు దీపింప

విదితాట్టహాసంబు వెలిదంష్ట్రరుచుల, వెదఁజల్ల దివియెల్ల వెసఁ బెల్ల గిల్లఁ
జరణఘట్టనములఁ జటులసత్త్వంబు, ధరణికిఁ దెలుపుచుఁ దవిలి యే తెంచు
తాటకఁ గనుఁగొని దశరథరాముఁ, డాటోప ముప్పొంగ ననియెఁ దమ్మునికిఁ
జూచితే లక్ష్మణ చూచితే దీని, నేచంద మేయంద మేయుగ్రదృష్టి
దీనిఁ జూచిన గుండె దిగు లేరికైన, మానునే యటు గాన మర్దింతు దీని
ననుచుండ గర్జన నాకసం బగలఁ, జనుదెంచి పదధూళి సకలంబుఁ గప్ప
నలిమాఱి ఘోరదానవురాలు ఱాలు, కలగొన్నఁ గురియ రాఘవుఁడు గోపించి
యనుపమాస్త్రంబున నమ్మహాశిలలు, దునుమాడి దానిచేతులఁ ద్రుంచివైచె
నప్పుడు లక్ష్మణుం డసురేశుచెలియ, కప్పాటుగావింతు నని యన్నకరణి
ముక్కును జెవులును మొదలంటఁగోసె, నక్కామరూపిణి యక్కజం బొదవ
మాయలు ధరియించి మఱియుఁ బెక్కమ్ము, లాయింతి గురియ విశ్వామిత్రుఁ డనియె
ననఘ సంధ్యాకాల మగుచునున్నదియు, దనుజుల నెందు సంధ్యల గెల్వరాదు
నీవింకఁ గృపమాని నెలకొని దీని, నీవిశ్వహితముగా నిటఁ జంపుమనుడు
గాధేయమునిమాట గడపక శబ్ద, వేదిబాణముల నవ్వేడమాయ లడఁచి
పెడపెడనార్చుచుఁ బిడుగుచందమున, నడతెంచుచున్న దానవి నిరీక్షించె
మహితాస్త్ర మొకటి చన్నొన నాటనేయ, బహురక్తధారలు పర్వ నావనిత
అసురశిక్షారంభమం దది రాముఁ, డొసఁగెనో శరముల కుపహారమనఁగఁ
బ్రళయమారుతమునఁ బగిలి సంధ్యాభ్ర, మిలఁ గూలు తెఱఁగున నిలఁ గూలె దూలి
యప్పుడానందించె నఖలభూతములు, నప్పు డానందించి రమరులు మునులు
ఆరాము దీవించి యాలింగనంబు, గారవంబునఁ జేసె గౌశికుఁ డంత
దేవగంధర్వాది దివిజులు గొలువ, దేవేంద్రుఁ డచటి కేతెంచి శ్రీరామ
దేవునిఁ గాంచి ప్రార్థించి పూజించి, దేవవిధేయు గాధేయు నీక్షించి
మమ్ము రక్షింప నిమ్మహిఁ బుట్టినట్టి, యిమ్మహామహునకు నిమ్ము భృశాశ్వ
సంతాన మైన యస్త్రములు శస్త్రములు, నంతయు నని చెప్పి యరిగిన దివికి
నినుఁ డంతఁ గ్రుంకె నయ్యెడను నాఁడుండి,ముని మఱునాఁడు రాముని బ్రేమఁజీరి

శ్రీరాములకు భృశాశ్వసంతానము లైనయస్త్రశస్త్రముల నిచ్చుట.

రామ నీవిక్రమరణకేళి చూచి, యేము మెచ్చితిమి నీ కిచ్చెద మింక
నమరోరగాసురయక్షయుద్ధముల, సమధిక మగు నస్త్రశస్త్రంబు లనుచుఁ
దనుశుద్ధితోడ సుస్థలిని గూర్చుండి, మునిపతి రాముఁ బ్రాఙ్ముఖునిఁ గావించి
యమలమనస్కుఁడై యఖలంబుఁ దలఁచి, క్రమమున దండచక్రంబును ధర్మ
చక్రంబు మఱి కాలచక్రంబు విష్ణు,చక్రంబు శక్రువజ్రంబును నసియుఁ
బాశిపాశము ధర్మపాశంబు కాల,పాశంబు నీశానుభయదశూలంబు
నొగి శక్తియుగ్మంబు నుగ్రమై మిగుల, నెగడు నుష్ణానుష్ణనిర్మితాశనులు
కంకాలమును ఘోరకరవాల ముసల, కంకణాఖ్యంబులుఁ గ్రౌంచబాణాది
శస్త్రంబు లొగినిచ్చి సమ్మదం బడర, నస్త్రంబు లాగ్నేయమన నొప్పునదియు

బ్రాహ్మంబు తేజఃప్రభంబు నైంద్రంబు, బ్రహ్మశిరంబును బ్రహ్మోపనంబు
నారాయణంబుఁ బైనాకంబు శిఖర, దారుణశౌర్యసుదామనంబులును
బ్రశమనమును విలాపనము సత్యంబు, విశదప్రభలఁ బొల్చు విద్యాధరంబు
వాయవ్యసౌమసంవర్తాస్త్రములును, మాయాధరాస్త్రంబు మానవమధన
సౌమనసహారుద్రసంతాపనములు, తామసమాసలదర్పణాస్త్రములు
హయశిరంబును మాయలడరించి చాల, జయమిచ్చుగాంధర్వసమ్మోహనములు
సొరిది నైష్ఠికమును శోణితాఖ్యంబు, నరుదుగ నాగ్నేయ మనుసాయకంబు
గరుడబాణంబును గౌబేరశరము, నారసింహాస్త్రంబు నాగబాణంబు
వారింపరానట్టి వైష్ణవాస్త్రంబు, వారక నుతికెక్కు వైద్యాధరంబు
రౌద్రబాణంబును రాక్షసాస్త్రంబు, భద్రప్రదంబైన పాశుపతాస్త్ర
మొగిఁ గర్తరీచక్రములును మేఘాస్త్ర, మగణితంబైనట్టి యస్త్రజాలముల
నఖిలదారుణమైన యమరమోదకియు, శిఖియనఁదగునుల్లసిలుగదఖడ్గ
వామనపైశాచ వాయవ్యశస్త్ర, సామసౌమ్యాఖ్యానసావర్తనములు
సామంబు మథనంబు సంతాపనంబు, తామసంబును జగదంబుదారుణము
కంకోలకాహాలకరవాలముసల, కింకిణుల్ మొదలుగాఁ గీలితాస్త్రనుల
నెలమి నిచ్చిన వానినెల్లఁ గైకొనుచు, నలరి రాముం డమ్మహాత్మునిఁ జూచి
మునినాథ సకలాస్త్రములు భవత్కరుణఁ, గని కృతార్థుఁడ నైతిఁ గావున నింక
సలలితంబుగ నుపసంహరణాస్త్ర,ముల నొసంగు మటన్న ముదమంది యతఁడు
సత్యవంతము రభసము పరాఙ్ముఖము, సత్యకీర్తియు దశాక్షము నవాఙ్ముఖము
ప్రతిహారతరము మారణమును శుచియు, శతవక్త్రదైత్యదృష్టములు లక్ష్యములు
గ్రశనంబు కరవీరకరిసత్యకీర్తి, దశశీర్షమును శతోదరము జ్యోతిషము
విమలంబు మకరంబు విరుచి నిష్కలికుఁ, బ్రమథనంబును సునాభంబును సర్వ
నాభంబు మతి దుందునాభంబు పద్మ,నాభంబుఁ దృఢనాభనైరాశ్యములును
గామరూపంబునౌ గంధర్వరణము, సౌమనమునునిద్రసంథానములును
మోహనవిషమోక్షములు మహానాభ, బాహువిభూతిజృంభకములు ధాన్య
ధనువులు వృత్తవంతము రుచిరంబు, నెనయ సార్చిర్మాలి ధృతిమాలి యనఁగఁ
గామరూపంబులు గలమహాస్త్రములు, భూమీశునకుఁ జెప్పి పాలుపాఱ మఱియు
నివియును గాక యనేకశస్త్రాస్త్ర, నివహముల్ రఘువంశనేతకు నొసఁగి
తత్ప్రభావంబులు తన్మంత్రములును, దత్ప్రయోగంబులు తదుపసంహతులు
విలసిల్లు శస్త్రాస్త్రవిద్యారహస్య,ములు సర్వమును దెల్ప మొగి రామునెదుట
నంగారసదృశంబు లై కొన్ని ఘోర,భంగుల ధూమ్రనిభంబు లై కొన్ని
యనుపమదీప్తి రమ్యంబు లై కొన్ని, తనరారు బహువిధ్యతనువులై కొన్ని
పరువడి చంద్రప్రభంబు లై కొన్ని, పరికింప భానుదీప్తంబు లై కొన్ని
బహుశాంధకారవిభ్రమము లై కొన్ని, మహితాట్టహాస భీమంబులై కొన్ని
యకలంకమూర్తు లి ట్లమర నేతెంచి, ముకుళితకరయుగ్మములతోడ నిలిచి

యే కార్య మొనరింతు మేమిటఁ బనుపు, మాకేమి యానతి మనుజలోకేశ
యనుడు నేఁ దలఁచినయప్పుడే మీరు, చనుదెండు పొండన్న సకలశస్త్రములు
వలగొని మ్రొక్కి యవ్వసుమతీపతికి, నెలమితో మ్రొక్కుచు నేగె నంతటను
మునినాథుఁ జూచి కేల్మొగిచి రాఘవుఁడు, వినయంబు భక్తియు విశ్వాసమెసఁగ
ననఘ కృతార్థుఁడ నైతి నీకరుణ, నని వినుతించి విశ్వామిత్రు వెంట
నరుగుచో నట వామనాశ్రమభూమి, కరమొప్పుటయుఁ జూచి కాకుత్స్థకులుఁడు
ఈపర్వతముచెంత నిది యొక్కవనము, చూపుల కింపారి సొంపుల నలరి
పొలుచు నానామృగంబులుఁ గలధ్వనులు, గలపక్షిమృగములు గలిగి చెన్నగుచు
నున్న దీయాశ్రమం బో సంయమీంద్ర, యెన్న నెవ్వరిది యిం దెల్ల జంతువులు
సుఖలీల నున్నవి చూడ నిక్కడికి, నిఖిలజ్ఞ యొక్కఁడ నీయజ్ఞభూమి
ఎటనుండి చనుదెంతు రేచి రాక్షసులు, చటులోద్ధతులు నీదుజన్నంబు చెఱుప
యాగరక్షణముగా నఖలరాక్షసుల, వేగంబె నిర్జింతు విశిఖాళి ననిన
నక్కౌశికుఁడు జగదభిరాముఁరాముఁ, జెక్కిలి పుణికి సన్నేహుఁ డై పలికె
ననఘ నీ వెఱుఁగని యర్థంబు గలదె, వినుము నాచే విన వేడుకయేని
ముసు విష్ణుదేవుండు ముదముతోఁ దపము, గొనకొని కావించుకొఱకునై యిచట
యుగములనేకంబు లుండఁగా ననఘ, మగు వామనాశ్రమం బండ్రు ముఁ దీని

శ్రీరాములకు కౌశికుఁడు ఆశ్రమాదుల నెఱిఁగించుట.

మఱియును సిద్ధాశ్రమంబును ననఁగ, వఱలు నీయాశ్రమవనము లోకముల
జననాథ బలి విరోచనసుతనూజుండు, ఘనరాజ్యపదమున గర్వంబు మిగిలి
యేఁచి మరుత్తుల నింద్రాదిసురల, వేఁచి కారింపంగ విబుధులు మునులు
నీయాశ్రమంబున కేతెంచి మ్రొక్కి, తోయజనాభునితోడఁ దామనిరి
శరణాగతప్రియ శరణు లోకేశ, సరసిజోదర మాకు శరణంబు నీవ
పన్నుగా మమ్మేచు బలి యనుఘాఁడు, చెన్నొంద జన్నంబు సేయుచున్నాఁడు
అవ్వారి దానవయజ్ఞవాటమున, నెవ్వ రేమడిగిన నిచ్చుచున్నాఁడు
క్రతువు దీఱకమున్నె కామింపుమాకు, హితమంచుఁ బ్రార్థింప నెల్ల దేవతలు
నాసమయంబున నదితితోఁ గూడ, భాసుర వ్రతనిష్ఠఁ బరఁగు కశ్యపుఁడు
ఇమ్ములఁ దపము వెయ్యేఁడులు సేయ, సమ్మదంబున విష్ణు సాక్షాత్కరించె
నీమహాతనువున నిఖిలలోకములు, సోమార్కలోచన చూపుము మాకు
నాద్యంతరహితుండ వగునిన్ను వేద, వేద్యుని శరణంబు వేఁడెద మనినఁ
గరుణ నావిష్ణుండు కశ్యపుఁ జూచి, వరము నీకిచ్చెద వాంఛితం బెద్ది
యడుగుము నీవన్న నలరి కశ్యపుఁడు, కడుభక్తితోఁ గరకమలముల్మొగిచి
యతిబలోద్ధతి నాకు నదితికి నీవు, సుతుఁడవై జన్మించి సురల రక్షింపు
మిది కోరి నాకును నీదేవతలకు, మహిలోన మన్నింపు మమ్ము నందఱను
అనవుడు నావిష్ణు వదితిగర్భమున, ననుపమం బగుతేజ మలర జన్మించి
వామనత్వము దాల్చి వచ్చి యద్దనుజు, భూమి మూఁడడుగులు పొసఁగంగ నడిగి

రెండడుగులనే ధరిత్రియు దివియు, దండిమైఁ గొలిచి యాధన్య బంధించి
లోలత నీమూఁడులోకము ల్వెలయ, నేలుము నీవంచు నింద్రున కిచ్చె
నదిగాన నిది వామనాశ్రమం బందు, రిదియ మాయాశ్రమం బీపుణ్యభూమి
సిద్ధించు నిటు దపస్సిద్ధులు గాన, సిద్ధాశ్రమంబు నాఁ జెల్లు నెల్లెడల
నీవె వామనుఁడవై నెగడి త్రివిక్ర,మావతారము దాల్చి నట్టివిష్ణుఁడవు
నాఁడును నిది నీవనంబు శ్రీరామ, నేఁడును నారీతి నీవనం బయ్యె
ననుచుఁ గౌశికుఁడు నిజాశ్రమంబునకుఁ, జని యందు రామలక్ష్మణులఁ బూజించె
నచ్చట మునిజనం బంతయుఁ గొంత, ముచ్చట దీఱ రామునిఁ బూజనేసె
నంత రాఘవుఁడు విశ్వామిత్రుఁ జూచి, సంతసంబున మునీశ్వర నేఁడు మీరు
యాగదీక్షకు జొరుం డనుమాన ముడిగి, యాగశత్రులనెల్ల నడఁచెద నేను
అనిన విశ్వామిత్రుఁ డంత హర్షించి, మునుల రప్పించి యిమ్ముల దీక్ష వడసి
యాగవేదుల మును లర్ధిఁగావింప, యాగాంగములఁ బూర్ణమయి వేదియొప్పె
నంచితాజ్యాహుతులందందు దొరుఁగ, మించి యగ్నులు మండి మింటికిఁ బ్రాఁక
హోమాగ్నిఁబ్రభవించుచున్నతధ్వనులు, సామాదివేదప్రసన్నఘోషములు
నాతతదేవతాహ్వాననాదములు, హోతల పుణ్యమంత్రోపనాదములు
దిక్కులన్నియ నుండి తివిరి ఘోషింప, నక్కజమయి యాగ మటుచెల్లుచుండ
రామభద్రుఁడు ధనుర్ధరుఁడునై మైత్రి, సౌమిత్రియును దాను జాగరూకతను
రక్కసు ల్వచ్చుమార్గము మున్నె ఱింగి, యక్కౌశికుని మానియై యున్న వాని
విశ్వమంతయుఁ దమోవృతము గాకుండ, శాశ్వతధృతిఁగాంచు చంద్రార్కులనఁగఁ
గాచిరి కంటికిఁ గనుపెప్పకరణి, నేచినభక్తి నయ్యెడ నైదునాళ్లు
నలవుమైఁ గవ గూడి యాఱవనాఁడు, బలిమి మారీచసుబాహు లేతెంచి
మేలిఖడ్గద్యుతు ల్మెఱుఁగులు గాఁగఁ, గ్రాలు కాలాంబుదోత్కరములో యనఁగ
దళములుఁ దారు నుద్భటవృత్తి మింట, నిలిచి గర్జనములు నిగుడించి మించి
వదలక యయ్యజ్ఞవాటంబులోన, మదమున నుప్పొంగి మాంసరక్తములు
గురియుచో హోతలకోలాహలంబు, గరిమ సదస్యుల కలకలధ్వనియుఁ
బరిచారకుల దీనభాషణధ్వనియుఁ, బరికించి విని రామభద్రుండు పొంగి
లక్ష్మణా చూడు నాలావంచు విజయ,లక్ష్మి ధనుర్ఘోషలక్షణం బెసఁగ
నెలకొని వినువీధి నిజదృష్టి నిలిపి, బలువడి వాయవ్యబాణ మేయుటయు
నురవడి మారీచు నువ్వెత్తుగాఁగ, సరభసవృత్తిమై శతయోజనములు
గొనిపోయి యటిమిటఁ గ్రూరరాక్షసుని, వనధిలోపలఁ బాఱవై చె నాశరము
అడరి వజ్రమునకు నళికి యంభోధిఁ, బడిన మైనాకమై పడిన యయ్యసుర
యొకరీతి దరిచేరి యుగ్రాంశుకులుని, యకలంకవిక్రమం బంబందఁ బొగడి
దనుజులఁ బాసి యాతతనిష్ఠతోడ, ననయంబు నాసుచంద్రాశ్రమభూమి
శూరత విడిచి యాసురవృత్తి నడఁచి, కోరి తపమునేయఁ గూర్చుండె నంత
అటిమిటి రఘురాముఁ డగ్ని బాణమున, నురక సుబాహుని యురమేసి చంపెఁ

దక్కిన రాక్షసదళములనొకటఁ, జక్కాడె మానవశరమహత్త్వమున
సురలుమోదించి యచ్చోఁ బుష్పవృష్టిఁ, గురిసిరి మునికోటి గొనియాడెనతని
మున్ను వృత్రాసురు మునుమిడి చంపి, సన్నుతింపఁగ దేవసంఘంబుఁ గూడి
వెలుఁగొందు దేవతావిభునిచందమున, బలువిడి రాముఁడు బాహుశౌర్యమునఁ
గడఁగి యజ్ఞారులఁ గడఁగి శిక్షించి, విలసిల్లె రాముండు విభవంబుతోడ
నతినిష్ఠ వెలయ విశ్వామిత్రుఁ డంతఁ, గ్రతుకర్మమంతయుఁ గడతేర్చి వచ్చి
నెలకొని రఘురామ నీప్రసాదంబు, గలుగఁగాఁ జెల్లింపఁగంటి నీక్రతువు
నని కృతార్థుఁడ నైతి ననిక్కౌఁగిలించి, వినుతించి రాము దీవించి హర్షించి
యనఘుమానసుఁడు విశ్వామిత్రమౌని, యనురాగమునుబొంది యచ్చోట దాను
భూవరు లారాత్రిఁబుచ్చి యచ్చోట, వేవిన బూర్వాహ్ణవిధు లాచరించి
మునులకుఁ బ్రణమిల్లి మునులతో గాధి,తనయునిఁ గనుఁగొని తాపసప్రవర
యింకనెయ్యదికార్య మెఱిఁగింపు నీకుఁ, గింకరులము నీదుకృపకుఁ బాత్రులము
అనిన నచ్చటివారు లందఱు గాధి,తనయు మున్నిడికొని తామిట్టులనిరి
జలజాప్తకులవర్య జనకభూవిభుఁడు, చెలువొప్ప జన్నంబు సేయుచున్నాఁడు
మన మందుఁ బోదము మనుజేశునింటఁ, ద్రినయనుపాటించుదివ్యకార్ముకము
గంధాదిపూజలఁ గరమొప్ప దేవ,గంధర్వయక్షరాక్షసవీరవరులు

రాముని మిథిలానగరమునకుఁ బోవ మునులు ప్రేరేపించుట.

మొదలైనవారికి మున్ననేకులకు, నది యెత్త నెక్కిడ నలవి గాకుండు
నట్టి విల్లునుబట్టి యటు లెక్కుపెట్టి, గట్టిగా నెత్తిన ఘనునకు నతఁడు
తనకూఁతు నిచ్చెదఁ దప్పక నేను, ననుచున్న వాఁడని యందఱు నఘుడు
జననాథ యాశరాసనలలామంబు, జనకునిజన్నంబు చనుఁ జూడ నీకు
ననుచు విశ్వామిత్రుఁ డాదిగా సకల,మునులు నావీరోత్తముల దాశరథుల
లలితపుణ్యుల మిథిలాపురంబునకుఁ, జెలువారఁ బయనంబు సేసి సమ్మదము
నొంది భాగీరథియుత్తరతటము, జెంది హిమాద్రియు సిద్ధాశ్రమంబు
వలపట నిడి యక్షవల్లభుదిశకుఁ, బొలుపారఁబొందిన భూరిమార్గమున
మూఁడుయోజనములు మూఁడుజాములకు, నాఁడేగి యట శోణనదముతీరమున
విడిసి తీర్థస్నానవిహితకర్మములు, నడిపి రమ్యస్థలి నరనాథసుతులు
సంతోషమున మునీశ్వరులతో నుండి, రంత కౌశికుఁ జూచి యారాముఁ డనియెఁ
గరము ప్రజావృద్ధిగలుగు నీదేశ, మరయ నెవ్వరిదేశ మానతిం డనిన
భూనాథ విను బ్రహ్మపుత్త్రుండు కుశుఁడు, నానొక్కముని మహోన్నతకీర్తి గలఁడు
అతఁడును వైదర్భి యసునింతివలన, సుతుల నల్వురఁ గాంచె సుచిరాకృతులఁ
బ్రశమితాత్ముల ధూర్తరజసుఁ గుశాంబు, గుశనాభు వసువు నక్కొమరులు మిగిలి
యనివార్యశౌర్యులై యనుపమలీల, దనరు మహోత్సాహధర్మంబు నడుపఁ
గొడుకులచరితంబు గుణములుఁ జూచి, యడరుసంతసముతో నాకుశుం డనియె
నిలఁ బ్రజాపాలనం బెలమిఁ గావింపుఁ, డలఘుకీర్తులు గల్గునన ముదమంది

కౌశలంబున నొప్పుగాఁ గుశాంబుండు, కౌశాంబియనుపేరఁ గావించెఁ బురము
దశరథాత్మజ మహోదయమనుపురము, కుశనాభుఁ డొనరించెఁ గుశలుఁడై ధరణి
శూరుండు ధూ ర్తరజుండు నిర్మించె, నారంగ పురము ధర్మారణ్య మనఁగ
వసుపు నిమ్ముల గిరివ్రజ మనుపేరఁ, బసుగుగా నిర్మించెఁ బట్టణం బొకటి
యిది ప్రీతి నవ్వసుఁ డేలుదేశంబు, ముదమంది గిసులైదు ముందఱనొప్పె
నానగమధ్యంబునందును మాగ, ధానామమున నొక్కతటిని చెన్నొందుఁ
జాల నమ్మగధదేశం బెల్ల వసువు, పాలించుచుండును బరమధర్మమున
నచ్చెరు వడరంగ నాకుశనాభుఁ, డచ్చరలేమ ఘృతాచియం దెలమిఁ
గన్నులు మరునంపగములు నానొప్పు, కన్నెల నూర్వురఁ గడురూపవతులఁ
గనియె నత్తరుణులఁ గమనీయకాంతి, వినుతయౌవనకళావిస్ఫూర్తి లమర
మంజీరమేఖలామధురవాచాల, మంజులకంకణమధుశింజితములు
కరమొప్పఁగాఁ జాళగతులనఁగూడి, మెరయు లీలాలాస్యములు సల్పువారు
మురిపెంబు లింపార మొగి మృదంగాది, వరవాద్యములు వేడ్క వాయించువారు
పాణిపల్లవలఘుస్ఫారితలీల వీణామృదుక్వణవితతంబు గాఁగ
మాకందమంజులమధుపానమత్త, కోకిలధ్వనిఁ గూడికొని పాడువారు
నగుచు నుద్యానంబునందుఁ గ్రీడింపఁ, దగిలి యాచెలువలఁ దప్పక చూచి
కామాంధుఁడై సర్వగతుఁడైనపవనుఁ, డామానినులఁ జూచి యర్థితోఁ బలికె
మానినీమణులార మఱి వినుఁడింక, బూని చెప్పెద మీకుఁ బొసఁగంగనిపుడు
నన్ను వరింపుఁడు నలినాక్షులార, చెన్నార నమరత్వసిద్ధిఁ గైకొనుఁడు
ఎన్నఁడు జరలేనియెలజవ్వనంబు, నున్నతయశము మీకొప్పారఁ గలుగు
ననిన నల్లన నవ్వి యనిలుండ వఖిల, జనహృదయంబులఁ జరియింతువీవు
నీవెఱుంగుదు మమ్ము నీమహత్త్వంబు, భావింప కిది యేమి పలికెద వకట
నియతుఁడై వర్తించు నిర్మలధర్మ,నయశీలుఁ డగుకుశనాభుకూఁతులము
ఓడక మాతండ్రియుండ మాయంతఁ, గూడుట యటుసేయఁ గులహానిగాదె
యిరవార మాతండ్రి యెవ్వరికిచ్చుఁ, బరికింప నాతఁడు పతి మాకు ననినఁ
బవనుఁడు కోపంబు పట్టలే కప్పు, డవయవంబులఁ జొచ్చి యాతలోదరులఁ
గుదియంగ దిగిచినఁ గుబ్జలై తండ్రి, కదియెల్ల నెఱిఁగింప నందఱు వచ్చి
విన్నలై వదనారవిందములార్పించి, సన్నిధి నిలిచి బాష్పములు నించుటయుఁ
గుశనాభుఁ డప్పు డాకూఁతులకైన, దశ చూచి వెఱఁగంది తా వారి కనియె
నిట్టిరూపములు మీ కెలనాగలార, యెట్టుగాఁ బాటిల్లె నెవఁ డిట్లు సేసె
మీరేల పలుకరు మీరింత కేమి, కారణం బనవుడుఁ గరములు మొగిచి
తమతండ్రితోడ నాధవళాక్షు లనిరి, మముఁ జూచి పవనుండు మానంబువిడిచి
నన్ను వరింపుఁడు నలినాక్షులార, యన్న నామాటకు నోఁ గాక యనక
మాతండ్రి నడుగు మీమాట నీవనిన, నాతండు కామాంధుఁడై యల్లి మమ్ము
గుబ్జలఁగాఁ జేసెఁ గ్రూరాత్ముఁ డనిన, నబ్జలోచనలతో నాతఁ డిట్లనియె

తగవును ధర్మంబు దలపోసి మీరు, తగదని శీలంబు దాఁట నోడితిరి
కన్నియలార మీగౌరవంబులను, నున్నతసత్కీర్తి నొందె నాకులము
దేవతావిషయమై తెగి యొల్లరైతి, రీవిధి మీరు సహించుటే లెస్స
ఋమయె సత్యంబును ఋమయె శీలతయు, ఋమయె తపంబును ఋమయె కీర్తియును
ఋమయె ధర్మంబును ఋమయె లోకంబు, నమరంగ రక్షించు నని విచారించి
తనమంత్రివరులతోఁ దలపోసిచూచి, యనఘాత్ముఁ డగుచూడి యనుమునీంద్రునకుఁ

విశ్వామిత్రుఁడు తనవంశక్రమంబు దెలుపుట.

దనుజస్తుఁ డగుగుణో త్తరు బ్రహ్మదత్తుఁ, డనువాని రప్పించి యమ్మహాత్మునకు
ధర్మపత్నులుగాఁగఁ దనదుకన్నియల, నిర్మలబుద్ధిమై నెమ్మి నిచ్చుటయు
చూడిపుత్త్రుఁడు వారిఁ జూచి కైకొనఁగ, వీడె నానూర్వరవికృతరూపములు
అవనీశ యదిమొద లాపురో త్తమము, అవనిఁ గన్యాకుబ్జ మనుపేరఁ బరఁగె
నాకుశనాభుండు నప్పుడొప్పారు, నాకృతులో గల తనయలఁ గనుంగొనుచు
నలరి యాకూఁతుల నల్లుని ననిచి, యెలమిమైఁ బుత్త్రకామేష్టి గావింపఁ
గొడుకైన కుశనాభుఁ గుశుఁడు వీక్షించి, పడసెదు పుత్త్రునిఁ బరమధర్మాత్ము
వినుతనిర్మలకీర్తి విఖ్యాతు గాధి, యనుపేరు గలపుణ్యు నని యెఱిఁగించి
పరమప్రియంబున బ్రహ్మలోకమున, కరిగె నాకును మన్మఁడై పుట్టె గాధి
దశరథాత్మజ గాధితనయుండ నేను, కుశవంశమునఁ గౌశికుం డంద్రు నన్ను
మతిధర్మనిష్ఠార్థ మాయక్ష సత్యవతి భక్తిమై సురేశ్వరలోకమునకు
వేడుకఁ దనప్రాణవిభుఁడైన రుచికు,తోడ శరీరంబుతోడఁ దా నరిగి
యీలోకమున లోకహిత మాచరింపఁ, బ్రాలేయపర్వతప్రాంతదేశమున
నలిఁ గౌశికీనామనది యయ్యెఁ దాను, వెలయ నన్నదిచెంత విహరింతు నేను
సిద్ధాశ్రమముఁ బ్రవేశించినకతన, సిద్ధంబు గాఁ దపస్సిద్ధుండ నైతి
నాదినుండియు మదీయాన్వయస్థితియు, నీదేశవిధమును నేర్పడ వింటి
నడురాత్రి యరుదెంచె నరలోకనాథ, కడు డస్సినాఁడవు కనుమోడ్తుగాక
చలియింపకున్న వి సకలవృక్షములు, మెలఁగవు వనభూమి మృగసమూహములు
నెఱి విహంగంబులు నీడముల్ చేరి, మఱిచియున్న వి తమ మంజులధ్వనులు
యామినీచరులైన యక్షరాక్షసులు, భూమి విచ్చలవిడిఁ బొరిఁ జరించెదరు
దీటుగఁ జీకటి దెసలు నాకసము, కాటుకఁ బూసినకరణి నున్నదియు
నీలాంబరంబున నిండుముత్తెములు, గీలించి బ్రహ్మాండగేహగోళమునఁ
గడు నొప్పుగా మేలుక ల్గొత్తినట్ల, యుడుగణంబులతోడ నున్నది నింగి
యడరంగ జనులసు నానంద మొదవ, నుడురాజు పొడ తెంచుచున్నాఁడటన్న
నామాటలకు మెచ్చి యఖిలసంయములు, నామునీంద్రునితోడ నని రప్పుడలరి
నెఱయ నీవంశంబు నిర్మలం బనఘ, గుఱి లేనిమహిమ నీకులమువారెల్ల
బ్రహ్మసమానులు పరికింప నీదు, బ్రహ్మవర్చసమును బరికింప నొప్పు
ననిన విశ్వామిత్రుఁ డమ్మునీశ్వరుల, వినుతించె నంత భూవిభులు సంయములు

నారాత్రి నిద్రింప నాప్రభాతమున, నాఋషిపుంగవు లాగాధిసుతుఁడు
జననాథ నిద్రయుఁ జాలింపు మనిన, విని తేఱి పూర్వాహ్ణవిధు లాచరించి
కౌశికుఁ జూచి యగాధమై చూడ, నీశోణనదరత్న మింత యొప్పగునె
యాకీర్ణ మీనంబు నతిరమణీయ, సైకతంబును సుప్రసన్నతోయంబు
పరిచితహారితాదిపక్షిసంఘుమ్ము, తరుణనీలోచ్చలత్తరళతరంగ
మై యున్న దీయేఱు ననఘాత్మక మన, మేయెడ దాఁటుద మెఱ్ఱెఱుంగనిన
దఱుచుగా మును లెల్లఁ దాఁకెడుమార్గ, మెఱిఁగిపోద మటంచు నెడదవ్వుపోవఁ
గలహంససారసకారండవాది, జలపక్షిరవములు సరిదమ్ముఁ బిలుచు
విధమునఁ జెలఁగంగ వీను లింపార, నధిపుఁ డాలించి మధ్యాహ్న కాలమున
సిద్ధమునీంద్రసంసేవ్యతీరమును, శుద్ధపుణ్యోదకసుప్రవాహమును
గలిగి నదీతిలకంబై ధరిత్రిఁ, బొలుపారుజాహ్నవిఁ బొడగాంచి మ్రొక్కి-
గాధేయ చూడ నగాధమై తోఁచు, నాథునీరత్నంబు నటఁ దాఁటిపోవ
దెరు వింకనెయ్యది దెలుపవే యనిన, నరనాథ యట శోణనద ముత్తరించి
మొగి మూఁడు యోజనమ్ములు దాఁటిపోవ, నగు నమ్మహానది యందాక మనకు
దోయఫలాదులు ద్రోవఁ బెక్కనుచు, నాయేఱు దాఁటి వారటుపోవుచోటఁ
జెలఁగుసారసగణసేవ్యమై పుణ్య, సలిలమై యుత్ఫుల్లజలజమై మిగుల
ఫేనమై నిత్యగంభీరమై చారు, మీనమై యతిపుణ్యమిళితమై యమరు
గంగాతటంబున ఘనలతాసంఘ, సంగతంబగు సమస్థలమున నిలిచి
మనుజేంద్రతనయులుమాధ్యాహ్నికంబు, లొనరించిముదమందియుచితభోజ్యములఁ
బోజమై మునిగోష్ఠి నొప్పుచున్నంత, రాజన్యతిలక మా రామచంద్రుండు
రాజహంసోద్ధూత రాజీవరేణు, రాజీవరాజితరంగ త్తరంగ
గంగ నాలోకించి కౌశికుఁ జూచి, గంగ యీవసుధ కేక్రమమున వచ్చె
నేఱెఱుంగునఁబోయె నిట నాకమునకుఁ, బాతాళమునకు లెబ్బంగిఁ దానరిగె
నేచి పారావార మేగతిఁ జొచ్చె, నేచందమునఁ బుట్టె నిమ్మహాతటిని
చెప్పవే యనవుడు శ్రీరాముఁజూచి, యప్పుణ్యధనుఁడు విశ్వామిత్రుఁ డనియెఁ
గమనీయకాంతులు గలరూపవతులు, హిమవంతునకుఁ గూతు లిరువురు గలరు
అమరులందఱు గూడి యాగంబుకొఱకు, హిమవంతు వేఁడి యాయిద్దఱిలోన
గురుపుణ్య యగుపెద్దకూఁతును గంగ, నరుదారఁగొనిపోయి రటనాకమునకు
నటమీఁదఁ బార్వతి యనుపిన్నకూఁతుఁ, బటుతపోనిష్ఠతోఁ బరితృప్తుఁడైన
భాలలోచనునకుఁ బత్నిఁగా నిచ్చె, నాలోలలోచన నానగాధిపుఁడు
సురుచిరరుచి గంగ సురలోకములకు, నరిగి తా సురనది యనువేఱఁ బరఁగె
ననిచెప్పి మునినాథుఁ డవనీశుఁ జూచి, వినుము వృత్తాంతంబు వెండియు నొకటి

కౌశికుఁడు కుమారస్వామిజననము చెప్పుట.

పార్వతి వరియించి పరమానురక్తి, సార్వకాలంబును జంద్రశేఖరుఁడు
అతిలోకగతిలోలుఁడై దివ్యవర్ష, శతము దా రతిశేలి సలుపుచున్నెడను

గమలాసనుం డాదిగా సర్వసురలుఁ, దమలోననెంతయుఁ దారు చింతించి
వెలయ నీయిరువుర విషయతేజంబు, దలఁప నెవ్వరికైన ధరియింపవశమె
యనుచు నందఱు నమ్మహాదేవుకడకుఁ, జనుదెంచి వినతులై సభ్భక్తితోడ
దేవదేవ మహేశ దేవ సర్వేశ, దేవనిస్తారక దేవ నీమహిమ
సర్వగీర్వాణులు సన్నుతించెదరు, సర్వజ్ఞ మాకుఁ బ్రసన్నుండవగుమ
యేపారి నీతేజ మెవ్వరు దాల్ప, నోపుదు రటుగాన నుడుగు మీవిధము
కరుణఁ దపోవృత్తిఁ గైకొని మీరు, సరిబ్రహ్మచర్యంబు చరియింపవలయు
ననవుడు నౌఁగాకయనుచు నాసురఁడ, గనుఁగొని ముదముతో గౌరీశుఁ డనియె
జలియించె నిదె నిజస్థానంబువలన, నెలకొని మీలోన నిర్జరులార
యెవ్వరు దాల్చెద రీతేజమనిన, నివ్వసుంధర దాల్చు నింపార ననిరి
హరుఁడు నాసురలతో నౌఁగాక యనుచు, ధరణిపై గావించెఁ దద్విమోక్షణము
దివిజు లయ్యెడ నగ్ని దేవు నీక్షించి, పవనునితోఁ గూడి పావక నీవు
ఇలమీఁదఁ బడియున్న యిమ్మహాతేజ, మెలమిఁ బ్రవేశింపు మింపార ననిన
స్వవశంబుగా నట్టి శర్వతేజంబు, పవనపావకులును ధరియింపలేక
యంగజహరువీర్య మప్పుడు వేగ, గంగ లోఁగొననిచ్చెఁ గరమర్థితోడ
నిచ్చిననాయింతి యిరవొందగాను, మచ్చిక ధరియించె మమత రెట్టింపఁ
దనవిభుతేజ మత్తఱిఁ దాల్పలేక, తనమది భయమంది తత్తఱపడుచు
గంగాతరంగనులో గరము భీతిల్లి, పొంగెల్ల నడఁగుచుఁ బొదలుచునపుడు
చిత్తసంక్షుభితయై శీఘ్రంబుగాను, దత్తీరదేశంబుఁ దాఁజేర్చుటయును
శరవణంబునయందుఁ జయ్యనఁజొచ్చి, చిరతరంబున నందుఁ జెలర్వొందుచుండె
నప్పుడు ఋషిపత్ను లందఱుఁగూడి, యొప్పుగాఁ దమతమ యుచితకృత్యములు
తప్పక తీర్పంగఁ దామేగుదెంచి, రప్పుడు నార్యుఁడు నాగంగఁ జొచ్చి
తోయంబులాడుచుఁ దొడరి వేవేగ, పాయక శరవణభవ్యస్థలమునఁ
ద్రైతాగ్నులనుబోలి తేజరిల్లుచును, బ్రాతిగాఁ బ్రచురమై పరఁగుచు లెస్స
నున్నవి యీయగ్ను లొండొరుల్ మనము, చెన్నారఁ జలిచేతఁ జిక్కి స్రుక్కితిమి
మన్నన లింపొంద మనము నిచ్చటను, గ్రన్నన చేకొనఁ గడఁగుదమనిన
నీశ్వరతేజంబు నిరవొందఁ బుచ్చి, శాశ్వతంబుగ ధర సత్కీర్తి వెలయ
జాతవేదునిఁ జేరఁ జనిన యింతులకు, నాతతంబుగఁ జూచినట్టి యింతులకు
నిర్భరవృత్తిమై నిలిచె గర్భములు, గర్భిణులై వారు కరమొప్పుచున్న
బహుభీతలగుచు నాభామిను లపుడు, తహతహపడి మఱి తన్మయత్వమునఁ
దమతమయింట్లకుఁ దారర్థి నరుగ, శమితాత్ము లగుమునిసంఘంబు లప్పు
డంత నావృత్తాంత మాయోగదృష్టిఁ, జింతించి మును లలచెలువల కనిరి
మీసత్యశీలత మీదుగర్వంబు, మీసౌఖ్య మిప్పుడు మిమ్మింతచేసె
ననుచు నాగ్రహమున నవనిఁ గంపింప, వనితలమీఁద నవార్యకోపమున
మతిహీనులరుమిమ్ము మన్నింపనేల, పతిదూరు లగుఁడంచుఁ బల్కిన వినుచు

మగుడ జాహ్నవిఁ జేరి మగువలందఱును, దగునమ్మ నీకిది తగునంచుఁ బలికి
తమతమబాహులతాడనంబులును, దమగర్భములమీఁదఁ దగఁ జేసిరొగిని
గరతాడనంబులఁ గలఁగి కంపించి, కరమొప్ప గర్భముల్ గరఁగి విచ్ఛిన్న
గర్భంబులై యపు కాంతలవలన, నిర్భయంబున జాతి నెఱయంగ నప్పు
డాఱుఖండంబులై యవనిపైఁ బడియె, జాతేన యాఖండచయము గ్రహించి
శరవణంబునయందుఁ జయ్యనఁ బెట్టి, యరుదలరఁగ లేచి యాతలోదరులు
తపమున కరిగిరి తద్దయుఁ బ్రీతి, నుపమింప నటఁ జాల నుగ్రవీర్యంబు
కవగూడి వృద్ధియుఁ గడుఁగల్గఁజాల, నవనిపై శ్వేతాద్రి యనఁ గడునొప్పె
నరయ నాశైలంబునందుఁ గుమారుఁ, డరుదార జన్మించె నతనితేజమున
జననప్రదేశంబు శరవణం బగుట, జననాథ యతఁడొప్పె శరజన్ముఁ డగుచు
నిలఁ గృత్తికలు చన్నులిచ్చుటఁజేసి, యలరుచుఁ గార్తికేయాఖ్యఁ జెన్నొందె
నారయ నమ్మాత లార్వురుగాన, వారు సంతోషింప వదనంబు లాఱు
ధరియించి సముచిత స్తన్యపానంబు, సరినొప్పఁ జేయుట షణ్ముఖుం డయ్యెఁ
దరుణేందుమౌళి రేతస్కందమునను, నరుదారఁగా స్కందుఁ డననొప్పె నంతఁ
బరువడిఁ దమసురల్ బ్రణుతింప నెఱిఁగి, గిరిపుత్త్రి కన్నులఁ గెంపారఁ జూచి
సురలార సంతానశూన్యత మీకు, ధరణికిఁ గానిమ్ము ధరణికి నింక
బహునాయకత్వంబు పాటిల్లనిమ్ము, బహువిధంబుల ననిపలికెఁ గోపించి
కలఁగిరి సురలంతఁ గౌరితోఁ దపము, సలుప హేమాద్రికిఁ జనియె నీశ్వరుఁడు
అమరేంద్రుఁడాదిగా నఖిలదేవతలు, కమలసంభవుఁ డున్నకడకుఁ దామేగి
జలజసంభవ భుజాసత్త్వసంపన్ను, నెలమి సేనాపతి నిమ్ము మా కనిన
వారిజగర్భుండు వారి నీక్షించి, గౌరీశసుతుఁ డైనకార్తికేయుండు
సేనాధిపత్యంబు సేయు మీకనిన, నానిలింపులు వేడ్క నోఁగాక యనుచుఁ
జేకొన నాతఁడు సేనానియయ్యె, నాకనాయకున కున్నతసౌఖ్య మెసఁగ
ననిపల్క రఘురాముఁ డధికసంతోష,మునుబొంది మఱియు నమ్మునినాథుఁ జూచి
యీమహానది సంయమీశ్వర త్రిపథ,గామిని యగుటేమి కారణం బనిన
ననఘుండు కౌశికుఁ డారాముఁ జూచి, వినుమని యాకథ వివరింపఁదొడఁగె
ననఘుఁ డయోధ్యకు నధిపుఁడై సగరుఁ, డనుచక్రవర్తి యాయతకీర్తి గలఁడు
హిమవంతమున నాతఁ డిచ్చలో సుతులఁ, దమకించి భృగుగూర్చి తపమాచరింప
నంత నాభృగుఁడును నాతపంబునకు, సంతుష్టహృదయుఁడై సగరు నీక్షించి
పృథ్వీశ కొడుకులు పెక్కండ్రు నీకుఁ, బ్రథితోరుకీర్తులు పరఁగఁ బుట్టెదరు
అంచితకీర్తిని నతివలందొకతె, గాంచు నొక్కని వంశకరుఁడైనపుత్త్రు
మఱియొక్కసతిగాంచు మాసుగా సుతుల, నఱువదివేవుర నతులవిక్రముల
నని వరంబిచ్చిన నారాజసతులు, విని కరంబులు మోడ్చి వినయంబుతోడ
మునినాథునకు మ్రొక్కి ముదమంద నొక్క,తనయుఁడే సతికన్న తనయులేసతికి
ననపుడు మీకోరినట్లవుఁ బుత్త్ర, జననంబులని పల్క సంతోషమంది

యంబ గ్రమహిషి నిజాన్వయరుచిక, నందను నొక్కని నరనాథుఁ గోరె
మఱి గోరె నాయున్న మగువయు సుతుల, నఱువదివేవుర నధికమోదమున
సగరుండు భృగునకు సతులతోఁగూడ, నొగిఁ బ్రదక్షిణ మంత నొనరించి ప్రీతిఁ
బురమున కేతెంచి పొలుపార నంతఁ, గరము వేడుకఁ గొంతకాలంబు చనఁగ
మానుగాఁ దనయగ్రమహిషి కేశినియు, సూనుని నసమంజసుం డనువానిఁ
గనియె నాసుకృతియుఁ గాంతకుఁ బుట్టె, ఘనతరంబై నట్టిగర్భతుంబంబు
కఱ్ఱనైన యాసొరకాయలోఁ బుట్టి, ఱఱువదివేవు రత్యద్భుతలీల
నంత దాదులు వారి నాజ్యభాండములఁ, గొంతకాలము పెంపఁ గొమరారి వారు
రూపయౌవనముల రూఢిమైఁ బెరిగి, రా పెద్దవాఁ డందు నతులదర్పమున
వాపోవఁ దమ్ముల వడిఁ జుట్టి పట్టి, చాపలంబునఁ గట్టి సరయువులోన
వైచిన నవ్వుచు వచ్చిన మగుడఁ, ద్రోచుచునుండు నాదుష్టాత్ముఁ డైన
యసమంజసున కంత నంశుమంతుండు, దెసలఁ జేజంబులు దీపింపఁ బుట్టె
నాయసమంజసుం డతిదుష్టచిత్తుఁ, డై యున్న నతనిఁ బోనడఁచి యూరాజు

శ్రీరాముఁడు సగరులవృత్తాంతముఁ దెల్పుమనుట.

శాశ్వతధర్మనిష్ఠాపరుం డగుచు, నశ్వమేధమునేయ ననురక్తిఁ దొడఁగె
ననినఁ గౌశికుఁ జూచి యూరాముఁ డనియె, మునినాథ మావంశములవారికథలు
విన వేడ్క పుట్టెడు వివరించి చెప్పు, మనిన విశ్వామిత్రుఁ డనియె రామునకు
విడువక హిమశైలవింధ్యశైలముల, నడుమ నాసగరుజన్నంబు వర్తించె
యాగంబుచేరువ నంశుమంతుండు, రాగిల్లి యశ్వంబు రక్షించునెడను
ననిమిషపతి దైత్యుఁడై మ్రుచ్చిలించి, కొనిపోయి పాతాళకుహరంబు సొచ్చి
కపిలసంయమిచెంతఁ గడఁకతోఁ గట్టి, యపరిమితానందుఁడై పోయె దివికి
భూపాలుఁ డశ్వంబు పొడగాన కిచ్చఁ, గోపించి మండుచుఁ గొడుకులఁ జూచి
యిటఁ గాన మశ్వంబు నెవ్వఁడో వచ్చి, కుటిలుఁడై మ్రుచ్చిలి కొనిపోయినాఁడు
మూఁడులోకంబులు మునుమిడి వెదకి, వాఁడెవ్వఁడైనను వాని నిర్జించి
తెండు గుట్టముమీఱ తెగువమైఁ గడఁగి, పొండన్న సాగరుల్ భుజశక్తి మెఱసి
నెఱసి బ్రహ్మాండంబు నిండ గర్జించి, యఱువదివేవురు నా ప్రొద్దె కదలి
యానాకమర్త్యంబు లంతయు వెదకి, కానక ధరణి ప్రక్కలుసేయఁ దొడఁగి
యొకొక్కఁడొకొక్క యోజనం బుర్వి, నక్కజంబుగఁ ద్రవ్వుఁ డని యేర్పరించి
పరువడి పూర్వదిగ్భాగంబు తొడరి, ధర ప్రదక్షిణముగాఁ ద్రవ్వుదమనుచుఁ
బొరిబొరిఁ గుద్దాలభూరిశూలముల, ధర రసాతలమునందాఁకఁ ద్రవ్వుచును
బాతాళవాసులఁ బ్రకటసత్త్వముల, భూతసంతతులఁ జంపుచుఁ జెలంగుచును
వెస నప్పు డఱువదివేలయోజనము, లసమునఁ ద్రవ్వి రాయసమానబలులు
భూరిసత్త్వముల జంబూద్వీప మిట్లు, వారక దిరిగి రావడిఁ ద్రవ్వు కెఱిఁగి
యమరగంధర్వసిద్ధాదులు బెదరి, కమలగర్భుం డున్నకడకేగి మ్రొక్కి
వనపర్వతద్వీపవతి యైనభూమి, చని త్రవ్వుచున్నారు సగరనందనులు

బలువడి సత్త్వసంపన్నంబులైన, జలచరంబులఁ బట్టి చంపుచు మఱియు
వీఁడు యజ్ఞమునకు విఘ్నంబుఁజేసె, వీఁ డశ్వహరుఁడంచు విడువక పట్టి
బలియురై తమదృష్టిఁ బడువారినెల్ల, జలజసంభవ వృథా చంపుచున్నారు
దలఁచి నీవిది సమాధానంబుసేయ,వలయు నన్నను బ్రహ్మ వారితో ననియెఁ
గపిలమునీంద్రుఁడై కైకొన్న వాఁడు, తపము నవ్యయుఁడునై దామోదరుండు
అమ్మునికోపాగ్ని యందంద వారిఁ, గ్రమ్మ భస్మంబు గాఁగలవార లింక
నని పల్క సురలెల్ల నౌఁగాక యనుచుఁ, జని రంత నక్కడ సగరనందనులు
పిడుగులఁబోలెడు భీకరధ్వనులు, కడుమ్రోయ నిలఁ బ్రదక్షిణముగాఁ గలయఁ
జుట్టును ద్రవ్వి యెచ్చోట ఘూటకము, పట్టుగానక తండ్రిపాలి కేతెంచి
యశ్వంబు పొడగాన మఖలంబు వెదకి, యశ్వచోరునిఁ గానమైతిమి దేవ
యేమేమినేయుదు మిటమీఁద ననిన, భూమీశుఁ డలిగి యాపుత్త్రుల కనియె
విశ్వంబు కలగొని వెదకి నాయెదుట, నశ్వంబుఁ దేక మీ రరుదేర వలవ
దని పల్క నౌఁగాక యనుచు నాసగర,తనయు లుద్ధతి రసాతలమున కరిగి
యెలమి శిరఃకంప మలుకగావించి, తలకొని యందంద ధరణి కంపింప
దొరఁకొని యందఱు తూర్పుదిక్కెల్ల, నరసి గుఱ్ఱముఁగాన కచ్చోట సకల
ధారణీమండలోద్ధరణముకుంద, చారుభుజాదండసమదండకాండ
చతురగ్రముల ధరాచక్రంబుమోవఁ, జతురతగల శుభ్రసామజేంద్రంబుఁ
బొడగాంచి సంప్రీతిఁ బూజించి యచటఁ, దడయక మఱి బృహద్బాహునుదిక్కునకుఁ
బోయి నానావిధంబుల నందు వెదకి, యాయశ్వరత్నంబు నందుఁ జూపడక
సతతదానచ్ఛటాసమ్మదామోద, భృతశిలీముఖపుండరీకాఖ్యగజముఁ
గనుఁగొని పూజించి కడువేడ్కతోడ, వినుతించి యవ్వల వెదకుచు యామ్య
భాగంబునకు నేగి పరికించి హయము, లాగొకింతైనను లక్ష్యింప లేక
ఘనతరత్వేషు త్రివిక్రమునాక్రమించు, ననిమించువామనం బనుదంతిఁ గాంచి
యర్చించి యవ్వలికరిగి నైఋతిని, జర్చించి యందు నశ్వము గానలేక
కుముదమార్దవమునఁ గుముదవర్ణమునఁ, గుముదంబునా నొక్కకుంజరేంద్రంబుఁ
గని నమస్కారంబు గావించి యవలఁ, జనిచని పశ్చిమాశాప్రదేశమున
శోధించి తురగంబు చొప్పింతయైన, సాధింపలేక యంజనశైల మనఁగ
రంజితమదనిర్ఝరంబులు గలిగి, యంజనం బనునేర్పు నచ్చోటఁ గాంచి
వివిధసత్కృతులు గావించి యామీఁదఁ, బవనునిదెసకేఁగి బహువిధంబులను
నెమకి గుఱ్ఱముఁ గాననేరక యచట, నముచిసంహారవారణప్రతిమాన
దంతమయ్యును బుష్పదంతాఖ్యఁ బరఁగు, దంతినీక్షించి మోదమునఁ బూజించి
యటఁబాసి చని కుబేరాశాంతరమునఁ, దటుకున నరసి సైంధవముఁ గానంగ
లేక యచ్చట నొక్కలేఖాధినాథ, లోకగజాధిప లోకైకసార్వ
భౌమమో యన సార్వభౌమాభిధాన, సామజేంద్రము గాంచి సద్భక్తి మ్రొక్కి
సార్వభౌమునిపుత్త్రసంఘంబు గదలి, శర్వునిదెస కేఁగుసమయంబునందు

ననతిదూరమున హుంతాగ్నినిబోలి, కనుఁగవమోడ్చి యేకతమ గూర్చుండి
తననిష్ఠ పెంపునఁ దపమాచరించు, ననఘాత్ముఁ గపిలమహామునిఁ గాంచి
యతనిచెంగట నున్నహయము నీక్షించి, యతని భర్జించిన నతఁ డుగ్రదృష్టి
నటమునఁ సగరుల నలిగి చూచుటయు, నటువదివేవ్రురు నట భస్మ మైరి

అంశుమంతుఁడు అశ్వరాశ్వముఁ దెచ్చుట.

కొడుకు లయ్యశ్వంబుఁ గొనిరాక చాలఁ, దడసిన సగరుండు తాపంబు నొంది
మనుమని నయ్యంశుమంతుఁ బంపుటయుఁ, జని యంశుమంతుఁ డాజాడనే పోయి
యమరేంద్రుదెస విరూపాక్షంబు గాంచి, సముచితస్థితి నమస్కరణ మొనర్చి
మాతంగపుంగవ మాపినతండ్రు, లేతెంచి రెటుపోయి రెం దున్న వారొ
తురగచోరకుఁ డెందుఁ దూఱినవాఁడొ, వరుస నీవెఱిఁగింపవలయు నా కనిన
నాదిగ్గజాధీశుఁ డాయంశుమంతు, నాదరంబునఁ జూచి యిట్లనియెఁ
బ్రియమార నొక్కెఁడఁ బృథివీశతనయ, హయముఁగాంచెదవన్న నౌఁగాక యనుచు
నున్న [1]దిక్కరులను నొగి దాఁటిదాఁటి, యన్నిటి నిబ్భంగి నడుగంగ నవియుఁ
బరువడి తామిట్టు పలుకంగ వినుచు, నరిగి యాముందర నధ్వరాశ్వంబు
నరయుచుఁ గపిలసంయమిపొంతఁ గనియె, సరిప్రోపులైయున్న [2]సగరభస్మములు
కని చాల శోకించి కరఁగి తండ్రులకుఁ, బొనరఁ దిలోదకంబులు వోయ వెదకి
యుదకంబుగానక యున్న యయ్యెడకు, సదయుఁడై గరుడుండు సనుదెంచి పలికెఁ
గపిలుని నలుకమైఁ గలఁచి యవ్హాని, కుపితాగ్ని సాగరుల్ కూలి నీవైరి
యిదియేల శోకింప నిటు శోకమంద, నిది వేళగా దొక్క కేర్పడ వినుము
సరసిజాసనవంద్యచరణారవిందుఁ, డరవిందదళనేత్రుఁ డాదిపూరుషుఁడు
బలిదానవేశ్వరు బంధించునప్పు, డలుకఁ ద్రివిక్రముఁ డై నిండఁ బెరిగి
యగణితశక్తి రెండడుగులయందు, జగతీతలం బెల్ల సరి నాక్రమించి
జలజాతజలచరశంఖచక్రమ్ము, లలవడునట్టి మూఁడవపదాంబుజము
కడుకొని బ్రహ్మలోకముదాఁకఁ జాఁపఁ, గడువేగమున వచ్చి కమలసంభవుఁడు
తలకొన్నభక్తితోఁ దనకమండలువు, జలములఁ దత్పాదజలజములఁ గడిగెఁ
బొగడొందఁ దజ్జలంబులు నభోవీథి, దగిలి వర్తించు మందాకిని యనఁగఁ
గావున నీవింకఁ గమలసంభవుని, భావించి తపమతిభక్తిఁ గావించి
కడకమై నాకాశగంగఁ దోడ్తెచ్చి, తడయక భస్మముల్ తడిపినఁగాని
పరలోకసుఖములు పడయరువారు, గురుబుద్ధిఁ దురగంబు గొనియేగుమనినఁ
దురగంబుగొనిపోయి తొడరియంతయును, దరమిడి యాతఁడు తమతాతతోడఁ
జెప్పిన శోకించి చేయఁ గైకొన్న, యప్పుణ్యమఖము సమాప్తంబుచేసి
కామించి యాకాశగంగ నీయుర్వి, కెమ్మెయి దెత్తునో యేనంచుఁ జింత

---

1 దిగ్గజముల. 2 సగరమహీప, తనయులవొ భస్మతతుల వీక్షించి, జనకులవె యంచు స్వాంత మందెంచి.

విడువక ముప్పదివేలేండ్లు తపము, పుడమినెంతయుఁ జేసి పోయెను దివికి
నారాజమనుమఁడయ్యంశుమంతుండు, ధారణి గంగకుఁ దపమొప్పఁబూని
వరుస ముప్పదివేలవర్షము ల్నలిపి, పరలోకగతుఁడయ్యెఁ బదపడి యతఁడు
అతనిపుత్త్రుఁడు దిలీపావనీనాథుఁ, డతినిష్ఠతోడ జాహ్నవిఁ దెత్తుననుచు
విడువక ముప్పదివేలేండ్లు తపము, గడపియు నతఁడు రోగములచేఁ జచ్చె
ననఘుఁడాతనిపుత్త్రుఁ డగుభగీరథుఁడు, దనరాజ్యమరయఁ బ్రధానుల నిల్పి
సారథర్మజ్ఞులు సద్గుణోజ్జ్వలులు, శూరులు నగునట్టిసుతులను గోరి
యెల్లపాపంబుల నిలమీఁదఁ బాప, దెల్లంబుగాఁ గంగఁ దెచ్చెద ననుచుఁ
గరమర్థిఁ దపము గోకర్ణాశ్రమమున, నరుదుగాఁ బదివేలయబ్దము ల్సేయ
ననుపమంబుగసాగు నాతపంబునకు, వనజసంభవుఁ డంత వరదుఁడై వచ్చి
యడుగుము వరమన్న నాభగీరథుఁడు, కడుభక్తి బ్రహ్మకుఁ గరములు మొగిచి
భారతీనేత ప్రపంచనిర్మాత, సారలోకత్రాత సత్యసంఘాత
ధాత మాతాత లుదగ్రులై వచ్చి, యాతతకపిలుకోపాగ్నిచేఁ గ్రాగి
నూఱువేలేండ్లు సన్నుతగతిలేక, నాఱుడిపడి భస్మమై యున్నవారు
కడఁగి యాభస్మముల్ గంగోదకములఁ, దడుపక గతిలేదు దయసేయుమనిన
హరుఁడొక్కరుఁడు దక్క నన్యులాగంగ, ధరియింపనేరరు దగిలియెన్వారును
నీవింక హరుఁగూర్చి నిష్ఠమైఁ దపము, గావించి ప్రార్థింపు గంగ ధరింప
ననిపల్క మదిలోన నతఁడు ప్రార్థించు, తనయులనిచ్చి యద్ధరణీశుకొఱకుఁ
దనరంగ నాగంగ ధరకేగుననుచుఁ, జనియె పద్మజుఁడటఁ జని భగీరథుఁడు
అంగుష్ఠమొక్కటి యవనిపై మోపి, యంగజహరుఁగూర్చి యతిఘోరతపము
[1]దలకొనిచేయఁ బ్రత్యక్షమై శివుఁడు, తలఁదాల్తుఁ దెమ్ము మందాకిని ననియె
నంత భగీరథుం డర్థిఁ బ్రార్థింప, నంతరిక్షస్థలమందుండి గంగ
గగనమండలము నక్షత్రమండలముఁ, బగుల లోకములెల్లఁ బగుల మ్రోయుచును
గులపర్వతములతోఁ గుంభినితోడ, బలసి మహాదేవుఁ బాతాళమునకుఁ
గొనిపోవుతెఱఁగున ఘోరమై పర్వి, చనుదెంచు నురవడి జగములు బెదర
వచ్చునాగంగగర్వముఁబాప శివుఁడు, పొచ్చి జూటముఁబెంచె నింతలో గంగ
వచ్చి మహాదేవు వరజటావీథిఁ, జొచ్చి వెల్వడుత్రోవ చొప్పడకున్న

భగీరథుఁడు గంగను దెచ్చుట.

హరుజటాజూటమహాటవిఁ జిక్కి, తిరుగుడుపడుచు వర్తించుచునుండె
నంత భగీరథుం డతులప్రవాహ, మంతయు నిష్పు డెందరిగెనో యనుచు
వెఱగంది మఱియును విషకంధరునకు, దఱిగొని యత్యుగ్రతపమాచరింప
నపరిమితప్రీతి నాభగీరథుని, తపమంత మెచ్చి కందర్పహరుండు
లోలతఁ దనమాళిలోనున్న గంగ, భూలోకమున కింకఁ బొమ్మని యనుప
వలనొప్పుజూటంపువాకిలి వెడలి, పొలుపొందఁ బాతాళమునఁ జూపు నిలిపి

---

1 దలకొని చేయంగఁ దావచ్చి శివుఁడు.

తనదివ్యదృష్టి మందాకిని కపిలుఁ, గని మునిమహిమకుఁ గడుఁజోద్యమంది
తగిలి నిన్న లఁచినదారుణాకృతుల, సుగతికిఁ బంప వచ్చుచు నున్న దానఁ
గినియకు మీవని కేల్దిమొగిచె, ననఁ బద్మముకుళంబు లమరఁ జూపఱకు
నడరు నమ్మునికిన్క- నటుపోవవెఱచి, సుడివడు తెఱఁగున సుడులొప్ప మిగుల
మామీఁదఁజనుదెంచు మలయుచుగంగ, యేమెక్క-డికిఁబోదు మిటమీఁద ననుచుఁ
బఱ తెంచి సగరులపాలిపాపములు, మొఱవెట్టుచున్న వి ముక్క-ంటి కనఁగ
నోలిఁ బంకజముల నుండరాకున్నఁ, దూలి యాకసమునఁ దుమ్మెదల్తోయ
భూతాధిపతి జూటముననుండి ధరణి, కే తెంచుగంగకు నెండగాకుండ
గొడుగులువట్టినకొమరున హంస, లుడువీథి సుడివడి యొప్పారుచుండఁ
దొడరి సాగరులవో దోషోత్క-రములు, కడఁకమైఁ బోఁదొడుకరములో యనఁగఁ
గమనీయతరములై ఘనతరంగముల, గము లంతకంతకుఁ గరమొప్పుమిగులఁ
దనవారిలోపలఁ దగ భగీరథుఁ, కనుపమసితకీర్తి లందందఁ బుట్టి
నెఱసి భూతలమెల్ల నిండనే తెంచు, వరుసన నుఱువులు వఱలంగ గంగ
యప్పటప్పటికిని నతులఘోషంబు, లుప్పొంగియుప్పొంగి యుడువీథి ముట్టి
బ్రహ్మాండభాండము ల్వగులఁ బెల్లుబ్బి, బ్రహ్మాదిదేవత ల్భక్తితోఁ బొగడ
శివుఁడుధరించిన శ్రీగంగ యఫుడు, భువిఁ బామరులకెల్లఁ బుణ్యంబునీయ
వచ్చితినని గంగ వరుసగాఁ జెప్ప, వచ్చినవిధమున వరుస ఘోషించి
సురలుఖేచరులును సుముఖులై చూడ, గరుడగంధర్వులు గరము భూషింపఁ
జనుదెంచి బిందువన్సరసిలోఁ జొచ్చి, యెనయఁ బ్రవాహంబు లేఱులైపాఱి
యనఘాత్మపావనిప్లోదినినలిని, యనఁ బ్రవాహములు మూఁడరిగెఁ దూర్పునకు
సీత సుచక్షువు సింధువు నాఁగ, భ్రాతితోఁ మూఁడేగెఁ బడమటిదెసకు
నడరుచు నుప్పొంగి యందులో నొకటి, కడఁగి భగీరథక్ష్మాపాలు పిఱుఁద
ఘనతరవిశదోదకప్రవాహంబు, వినువీథి శరదభ్రవిభ్రమం బెసగ
దివికేగ మదిలోనఁ దివురుభూజనుల, కవిరళనిశ్శ్రేణి లమరుచందమున
నిలయనింగియుమ్రోఁగునెడఁ బ్రవాహంబు, గలయ నానామాలికలు వీచులమర
నీభంగిఁ ద్రిప్పుదు నెల్లపాపముల, నాభంగిఁ జూడుఁడీ యన సుడులొప్పఁ
జెలిమిఁ దారలతోడఁ జేయఁజన్క-రణిఁ, బెలుచ నింగికి నంబుబిందువు లెగయ
ధర్మాత్ములగువారి ధర్మకీర్తులకు, నిర్మలస్థానమై నెఱిఁ బొల్తు ననుసుఁ
గేలి నయ్యాపగాకీర్తులు నవ్వ, లీల డిండీరమాలిక లుల్లసిల్లఁ
బెక్కు-గన్నులఁజూతుఁ బృథివి పెంపెల్ల, మక్కు-వననుభంగి మత్స్యములొలయఁ
జరియించుకొమరారు జలచరావళులు, పొరినొప్పనే తెంచె భూలోకమునకు
నంత శీతార్క-మై యమరుచందమునఁ, గాంతిమద్భవరత్నఖచితంబులైన
నిజభూషణంబుల నింగివెలుంగ, గజవిమానాదులు కర మర్థినెక్కి
యమరగంధర్వసిద్ధాదులు చూడ, నమరంగ నే తెంచి రజుఁడు నే తెంచె
నటమహానాగంబు లా ప్రవాహంబు, చటులవేగముచూచి సరిమ్రొగ్గుటనును

అంతియ్యు నానిర్జరాదులు చూచి, చింతించి జపములుచేసి రాలోన
నానదిగట్లనే యవగాహమంది, యానందమును బొంది యాడి రచ్చరలు
అమరముసీంద్రాదు లంత సంతోష, మమరగాఁ బుష్పల నర్చించి రెలమి
నాపుణ్యనదిలోన నతిపావతులు, శాపదగ్ధులు కృతస్నానులై దివికిఁ
జనుచుండ సురలు నచ్చరులు గంధర్వ, దనుజపన్నగయక్షదైత్యరాక్షసులు
కిన్నరాదులు నాభగీరథరథము, వెన్నాడి కనుఁగొంచు వేడ్క నేతేరఁ
బెరిగి పర్వతములు భేదించుకొనుచు, నరుగ జహ్నుడుయాగ మాత్రోవఁజేయి
వరదగా నటువచ్చి వలగొని గంగ, సరి చుట్టుముట్టిన సరగున నపుడు
యాగోపకరణంబు లవివెల్లివోయి, యాగవిఘ్నంబైన నతఁడాగ్రహించి
నింగికి నుప్పొంగి నెఱనేగుదెంచు, గంగ నాకర్షించి కలుషించి క్రోలె
అనిమిషమునివరు లాభగీరథుని, గనుఁగొని పల్కిరి కరమర్ధ మీఱ
నీమహాగంగని ట్లీమునీశ్వరుఁడు, ఈమాడ్కిఁ గ్రోలెనే యిప్పుడె నీవు
కోపంబులేకుండఁ గోరి యీమౌని, నీపట్ల వేడిన నిచ్చును గంగ
ననియిట్లు దేవత లందఱుఁ జెప్ప, వినయంబుతోఁ బోయి వేడ్క నమ్మౌనిఁ
గనుఁగొని మ్రొక్కుచుఁ గరములు మొగిచి, వినయసంభరితుఁడై వేడ్క నిట్లనియె
వినవయ్య మునిచంద్ర విమలచారిత్ర, ఘనమైనగంగను [1]గడుసుగ్రతపముఁ
జేసి యుర్వికి గంగఁ జెలగుచు నిపుడు, వాసిమైఁ దెచ్చితి వరుసనిచ్చటను
మోసమై మీచేత మొనసి కోల్పడితి, నోసంయమీశ్వర యోపరబ్రహ్మ
దయచేసి విడిపింపు ధన్యచారిత్ర, దయచేయు సంయమీ దయచేయుమనుచు
వినయంబుతోఁ బల్క వినీవరుఁడు, మనమునఁ గృపవుట్ట మఱియు నిట్లనియె
నోభగీరథచంద్ర యోమహారాజ, యీభంగి గంగను నిలకుఁ దెచ్చుటకు
నీమహత్త్వంబును నీతబోమహిమ, నేమని చెప్పుదు నీక నీదుకీర్తి
విడిచెద గంగను విడిచెద నిపుడు, పుడమిలో నాకీర్తి పొలుపొందు ననుచు
నుమిసి యొంగిలిసేయనొల్లక యతఁడు, రమణమై దనకర్ణరంధ్రంబునుండి
వెడలింప నెప్పటివిధమున గంగ, యడరుచు జాహ్నవి యనుపేరఁ బరఁగెఁ
బురుషపురాకృతపుణ్యంబునడుమ, దొరకొన్న విష్ణుంబు ద్రోచియే తెంచు
వెరవున నారాజు వెంటనే వచ్చి, శరనిధిఁ జొచ్చి యాజాహ్నవీదేవి
దిగి రసాతలమునఁ దిరిగి యందున్న, సగరజభస్మము ల్సరినిండఁ బాతె
నంత నంబుజగర్భుఁ డాభగీరథుని, సంతసంబునఁ జూచి జననాథ వినుము
జలనిధి నెందాఁక సలిలంబులుండుఁ, దలఁప నీసగరునితనయు లందాఁక
దివ్యభూషణముల దివ్యాంబరముల, దివ్యమాల్యంబుల దివ్యగంధముల
దివ్యమూర్తులనొప్పి దివిజలోకమున, దివ్యభోగముల వర్తించుచుండెదరు
అడరంగ నిదిమొద లనఘు నీపేర, నడుచు భాగీరథీనామ మీనదికిఁ
ద్రిపథయనంగ వర్తిలువరదయన, నృప జాహ్నవియనంగ నెగడు లోకములఁ

---

1 ఘనమైన తపముఁ.

దగఁ బితలకుఁ దిలోదకములు నడిపి, జగములన్నిట సత్యసంధుఁడవగుము
అనఘ మీసగరుండు నంశుమంతుండు, ఘనుఁడు దిలీపుఁడు నైకొన్నవ్రతము
నెఱపఁజాలమి నీవు నెఱపంగఁ దివిరిఁ, తెఱఁగొప్పనీగంగఁ దెచ్చితికాన
గంగాంబునిర్మలకమనీయపదము, మంగళచిరకీర్తి మహితుండ వగుము
కాకుత్స్థకులజుల గౌరవశ్రీల, కాకరం బగుతనయావళిఁ గనుము
లలితధర్మముల మూలస్తంభమైతి, పొలుపార నింక నీపుణ్యోదకముల
వెలయఁ దీర్ధస్నానవిధు లొప్పఁ దీర్చి, ఫలము నైకొనుమంచుఁ బద్మసంభవుఁడు
తనలోకమున కేగెఁ దదనంతరంబ, తనర నాగంగఁ గృతస్నానుఁడగుచు
నఱువదివేవ్వుర కాభగీరథుఁడు, నెఱిఁ దిలోదకములు నిష్ఠతో నిచ్చె
నాతిలోదకముల నమరులై సగరు, లాతని దీవించి యరిగిరి దివికి
ననఘుండు మఱియయోధ్యాపురంబునకుఁ, జనిభగీరథుఁడు రాజ్యమునేయుచుండెఁ
గలుషఘ్ను మీయుపాఖ్యానంబు భక్తి, చెలువారఁ జదివినఁ జెప్పఁగా వినిన
నొనరఁ బుణ్యముల నాయుష్మంతులగుచు, ధనధాన్యకీర్తులఁ దనరుచునుందు
రెప్పుడు వారల కెల్లదేవతలు, నొప్పఁ బ్రసన్నులై యుండుదు రెలమి
నమరంగ సిద్ధించు నఖలకార్యములు, సమకొను నంచితస్వర్గభోగములు
వెనుపారఁగా వారిపితృగణంబులకు, ననుపమసద్గతు లనిశంబుఁ గలుగు
ననిన రాఘవుఁడు గంగావతారంబు, విని కౌశికునిఁ జూచి వినుతులునేసి
నేఁడు విశ్వామిత్ర నీచేత వింటిఁ, బోఁడిమి నీగంగ భూలోకమునకు
వచ్చిన తెఱఁగును వారితెఱంగు, నచ్చెరువడరంగ నని ముదంబంది
యారాత్రి యందుండి యఖలలోకముల, నారూఢికెక్కిన యానది గ్రుంకి
యాహ్నికకృత్యంబు లన్నియుఁ దీర్చి, జాహ్నవి దాఁటి విశ్వామిత్రుతోడ
నుత్తరతటమునం దున్నసంయములఁ, జిత్తంబులలరఁ బూజించి వీడ్కొనుచుఁ
జనిచని యెదుట విశాలయన్పురము, కనుగవ కింపైన గాధేయుఁ జూచి

దేవత లమృతంబు వడయుట.

యీపురివే రేమి యేరాజవంశ్యుఁ, డేపుమై బాలించు నెఱిగింపు మనిన
ఘనుఁడుకౌశికుఁడు రాఘవుఁజూచి పలికె, వినుమింద్రకడమున్ను విన్నాఁడనేను
దితిసుతులైన దైతేయులు నదితి, సుతులైనసురలు భాసురలీలఁ దొల్లి
నోలి రసంబులు నోషధుల్ నించి, పాలసముద్రంబు పరువడి ద్రచ్చి
క్రమమొప్ప నమృతంబు గైకొందమనుచు, సమమైత్రి నాసుధాజలరాశి డాసి
కవ్వంబు తరిత్రాడుగా మందరంబు, నవ్వాసుకిని జేసి యమృతాబ్ధిఁ బరువ
వెలయంగ నటఁ బుట్టె విషముగ్రమగుచుఁ, గలయలోకంబుల గాఱించిమించఁ
బరఁగ రోషానల పరుషంబునైన, హరుఁ డదిగొని మ్రింగె నంత సుమియుట
సురగములధరియించె నోలిఁ దద్విషము, మఱిమఱి తరువంగ మఱియుసు బుట్టె
వంచన మన్మథావాప్తి లోకముల, ముంచియెత్తఁగఁజాలు మురిపెంబులమరఁ
గాంచీఝణత్కారఘననితంబములు, నించుకనడుమును నెఱియుఁజన్నవలు

చంచలతనులతల్సరిదంతచయము, మించుకన్నవయును మెఱయుమోవియును
గోమలభూ్రలతాకోదండుఁ డైన, కాముని విలువిద్యగతి చూప నొప్పి
కడుఁగంటిచూపులఁ గఱుదీధితుల, వెడలించు భుజలతావిశేషములను
అమర నూతనయూవనాభిరామముల, నమరనర్వదికోట్ల యప్సరోగణము
లీలమై నచ్చరలేమలనెల్ల, నోలి దేవతలు దైత్యులును గైకొనిరి
వారక దరువ నావరుణాత్మజాత, వారుణి ప్రభవించె వైభవం బలర
నాసుర దితిసుతు లపు డొల్లకున్న, నసురులై వర్తిల్లి రవని నెల్లెడల
సుర నాదితేయులు సొరిదిఁ గైకొన్న, సురలనఁబ్రఖ్యాతి శోభిల్లి రపుడు
సంతసంబున రమాసతి తురంగంబు, కాంతిమిన్నగుదంతి కౌస్తుభమణియు
నమృతాంశుఁడును బుట్టె సమృతంబు సురభి, నమరసుధాపూర్ణ మగుకమండలువు
కలిగి ధన్వంతరి కరమొప్పఁ బుట్టె, వెలయంగ మఱి పుట్టె వింతవర్తువులు
అంత సురాసుర లమృతంబుకొఱకు, నెంతయుఁ దమలోన నేచి దర్పమున
ననుపమస్థితిఁ బోర నసుర సురలఁ, గనుఁగొని సురలపైఁ గరుణించి మించి
మానినీరూపమై మధుమర్దనుండు, తానమృతముఁ బంచి తగనిచ్చువేళ
రాహుకేతువు లనురాక్షసులప్పు, డూహించి పంక్తిలో నొగిఁ గూరుచుండి
[1]చెయి జాచి పట్టినఁ జెలఁగుచు సుధను, మెయిచాయఁ జూడక మెలఁత యిచ్చుటయు
రవిచంద్రులప్పు డారమణిని జూచి, కవగూడి యిద్దఱుఁ గళవళం బంది
కనుసైగ నటుచూపఁ గనలుచు విష్ణు, వనువొందఁ జక్రంబు నటు ప్రయోగించి
శిరములు ఖండించి సృష్టిలోపలను, కఱకురాక్షసుతలల్ కడుగ్రహంబులుగ
నామింట నిలిపె నయ్యమృతంబు ద్రావ, నేమియుఁ జెడకుండ నెప్పుడు వారి
నాదిగానెప్పు డయ్యాదిత్యుఁ జంద్రు, బాధించుచుందురు పర్వంబులందు
నసుర గనుఁబ్రామి యమృతంబు సురల, కొసఁగి వారికి జయం బొసఁగె యుద్ధమున
దైతేయకోటియందఱుఁ ద్రుంచి యింద్రుఁ, డాతఱిఁ ద్రిజగంబులర్థిఁ బాలింప
దితి యంతఁ దనసుతుల్దెగుటకుగొగిలి, పతియైన కశ్యపుఁ బ్రార్థించి యింద్రుఁ
జంపఁజాలిన మహోసత్త్వప్రతాప, సంపన్ను నొకనిఁ బ్రసాదింపు మనిన
నంగీకరించి సహస్రవర్షంబు, లంగన ఘనశుచివై యుండఁ గల్గు
మాఁడులోకంబులు మొగి గెల్చువాని, వాడిమిమై నింద్రు వధియించువాని
గనియెద నొకపుత్త్రుఁ గాంత నావలన, ననిపల్కి దితిమేను హస్తాంబుజమున
నయమారఁ బరిమార్జనముసేసి మఱియు, దయజూచి యతఁడేగెఁ దపమాచరింపఁ
జనియె నాదితియును సమ్మదంబెసఁగఁ, జని యుగ్రతపమొప్ప సల్పుచునుండె
నంతట మఘవంతుఁ డత్తెఱం గెఱిఁగి, చింతించి దితిఁ జేరి శిష్యుండువోలె
పాయక కుశసమిత్ఫలమూలభవ్య, తోయాదు లతిభక్తితోడఁ దెచ్చుచును
జరణంబులొత్తుచు సత్కృతుల్మఱియుఁ, బరిపాటి సేవయుఁ బరిచర్యసేయ
నేవేళ నెచ్చట నేమి గావలయుఁ, గావలసినవెల్లఁ గనుసన్నఁ దెచ్చి

---

1 చేయి చాపినఁ గాంచి చెలఁగుచు

యుపచరించుచు వేడ్క-నుండెఁ బెక్కేండ్లు, నపుడొక్క-నాఁ డింద్రు నాదితి చూచి
యలరుచు మది రహస్యము డాఁపలేక, బలభేది వినుము నాపల్కు-నీవొకటి
తనయునిఁ గోరి మీతండ్రి నేనడుగ, వినుము వెయ్యేండులు వెడలినపిదప
నిచ్చితి సుతునంచు నింపార నాకు, నచ్చుగా వరమిచ్చె నటుగాన నీకు
నిటమీఁదఁ బదియేడు లేగినపిదపఁ, బటుశక్తి తమ్ముఁడు ప్రభవింపఁగలఁడు
అలరంగ నీవును నాతండు గూడి, పొలుపార నేలుఁ డీభువనత్రయంబు
వినుతకీర్తుల మీరు విలసిల్లుచుండుఁ, డని పల్క- నంత మధ్యాహ్న కాలమునఁ
దలనిడి కాల్గడ దలయంపిగాఁగ, నలతమై నిద్రించు నాదితిఁ జూచి
శతమన్యుఁ డెంతయు సంతోషమంది, వితతవైఖరి నిదే వేళ నాకనుచు
దితిగర్భ మతియోగధీశక్తిఁ జొచ్చి, శతకోటిచేఁ దనశత్రువౌ శిశువు
నేడుతున్క-లునేయ నెలుఁగెత్తి బాలుఁ, డేడువ దితియు నయ్యెడ మేలుకాంచె
మఘవుఁడు మారుదో మారుద యనుచు, లఘురీతిఁ బలుక బాలకుఁ జంపవలదు
వలదనియెడు దితివాక్య మాలించి, వెలువడి గర్భ మవ్వేళ వాసవుఁడు
కరములు ముకుళించి కలకచిత్తమున, తిరమైనభక్తిచే దితితోడఁ బలికెఁ
దనరంగ గాల్గడ తలయంపిగాఁగఁ, గొని ముక్తకేశివై గూర్కు-టఁజేసి
యరసి నీవశుచి వైతివిగానఁ దెగువఁ, గార్యంబుకొఱకేను గడుపులోఁ జొచ్చి
గొనకొని నినుఁ జంప కోడి గర్భంబు, దునిమితి నే నేడుతునియలుగాఁగ
సన్నకుసన్న నాశత్రుండుగానఁ, జిన్ని పాపనిఁ బరిచ్ఛిన్నుఁ జేసితిని
జనని ధర్మజ్ఞవై సైరింపవలయు, ననిన దుగిఖింపుచు నాయింద్రుఁ జూచి
నానేరమంతయు నాకలోకేశ, నీనేర మదిలేదు నిక్కువం బరయ
నని పల్క- మరుదాఖ్యలమరఁ దేజంబు, లెనయంగ ఖండంబు లేడ్వురునగుచు
నిమ్ముల నాపుత్త్రు లెలమి నెల్లెడల, సమ్మదమింపారఁ జరియింపనిమ్ము
సప్తఖండంబులై సరినొప్పుమీరి, సప్తమారుతగణస్కంధనాయకులఁ
గావింపుమని వేడఁగా నట్లు నేసి, దేవేంద్రుఁ డమరావతికిఁ బోయె నంత
వారును దేవతావల్లభుచెలిమి, మారుతగణసంజ్ఞ మఱి దివ్యులైరి
దేవేంద్రుఁ డతిభక్తి దితికి శుశ్రూష, గావించె నీపుణ్యగణ్యదేశమున
నీపుణ్యధరణి మున్ని క్ష్వాకునృపతి, భూపవర్యుం డలంబసయందుఁ గన్న
కొడుకు విశాలుఁడన్ను-వలయాధిపుఁడు, పుడమినేలి విశాలపురి యిందొనర్చె
నావిశాలునిపుత్త్రుఁ డై హేమచంద్రుఁ, డావిర్భవించెను నతఁడు సుచంద్రు
నతఁడు ధూమ్రాశ్వుని నతఁడు సృంజయుని, నతఁడంత సహదేవు నతఁడు కుశాశ్వు
నాతండు సోమదత్తాఖ్యుఁ గాకుత్స్థుఁ, డాతని కెంతయు నమరంగ సుమతి

సుమతి యనురాజు విశ్వామిత్రుని వెదుక్కొనుట.

భావింప నెప్పుడు పరమధర్మముల, నీవిశాలాపురం బేలెడి రాజు
లనఘు వైశాలికు లన వీరు జగతి, వినుతికెక్కిరి ధర్మవిభవసంపదల
నిచ్చల రఘునాథ యిచట నీరాత్రి, బుచ్చి వేగినఁ జూడఁబోద మిజ్జనకు

ననునంత గా ధేయుఁ డటవచ్చు లెఱిఁగి, మనమున సంతోషమగ్నుఁ డై సుమతి
తనపురోహితులును దనబంధుజనులు, తనతోడఁ జనుదేరఁ దనపట్టణంబు
వెలువడి చనుదెంచి విహితమార్గమున, నెలమితో నాసంయమీంద్రుఁ బూజించి
కరములు ముకుళించి కడుభ క్తిఁ బలికె, ధరణిలోపల నేఁడు ధన్యుఁడనైతిఁ
జరితార్థమయ్యె నాజననంబటంచుఁ, బరమప్రియంబునఁ బలికి యొండొరుల
నమరంగఁ గుశలంబు లడిగినపిదప, సుమతి విశ్వామిత్రుఁ జూచి తాననియె
మునినాథ యసమానమూర్తి లీఘనులు, ఘనభుజు లనిమిషక్రమపరాక్రములు
కరిరాజగమనము ల్కంరిరవములఁ, బురుడింపఁజాలిన భుజస త్త్వములును
లలితంబులైన ఫుల్లసితారవింద, దళములఁదెగడు నేత్రములు జెన్నొందఁ
గరవాలములుఁ గార్ముకంబులు దొనలు, ధరియించి దమసుపదన్యాసములను
జగతి నారవిచంద్రసంచారలీల, మగునాకసమువలె నలరించువార
లిరువురు దమలోన నెల్లచందముల, సరియగుచున్నారు జనులచూడ్కు లలకు
నీకుమారకులెవ్వ రెవ్వరీసుతులు, నాకు నేర్పడ గాధినందన చెపుమ
యనిన విశ్వామిత్రుఁ డాతనిఁ జూచి, వినిపింపఁదొడఁగెను వీను లుబ్బంగ
నోరాజకులచంద్ర యోసుగుణాబ్ధి, వీరివృత్తాంతంబు నినుము దెల్పెదను
సరయువుపాంతఁ గోసలదేశమునను, నరుదొప్పఁగ నయోధ్య యనుపురి యొప్పు
నాపురినేలుచు నాదశరథుఁడు, నేఫుమై మనుజుల నెల్లఁ బాలించు
నాతనివరపుత్రుఁ డైననీరాముఁ, డితనికి ననుజాతుఁ డీలక్ష్మణుండు
మఖమునేయుటకునై మఱి నేను వేఁడ, సుఖమున నిచ్చెను సుతులనిద్దఱిని
మావెంట వేంచేసె మఖమును గాచి, వేవేగఁ దాటక వెస సుబాహువును
ఆటోప మొప్పంగ ననిలోనఁ గూల్చి, మాటమాత్రంబున మారీచుఁ దోలి
యాగంగనట దాటి యటు మిథిలకును, నేగంగఁ దలఁచుచు నిటకు వచ్చితిమి
ఈరాజశీతాంశు లినవంశకులులు, వీరిసామర్థ్యంబు వినఁగఁ బోద్యంబు
ననిన విశ్వామిత్రు నమలవాక్యములు, విని చాల సుమతియు విస్మయంబంది
యారాఘవుల నప్పు డర్ధిఁ బూజింప, వారును బూజలు వగుసఁ గైకొనుచు
నారాత్రి యందుండి యాప్రభాతమున, నారాజు తముఁ బంప నర్థితోఁ జనిరి
చనిచని గౌతమాశ్రమము రాఘవుఁడు, కనుఁగొని పలికె నాగాధినందనుని
సలలితపల్లవసంపద ల్గలిగి, వెలయు మామిళ్లును వేఱుపనసలు
నారంగ జంబీర నారికేళములు, పారిభద్రంబులు బదరికాతతులు
మాతులుంగ లవంగ మంజీరతరులు, శ్రీతరు చంపక సింధువారములు
పొన్నలు పొగడలు పోకమ్రాకులును, నెన్నంగ నరటుల నెఱియుపుప్పొళ్లు
చిత్తజాంబకములై చెలఁగునశోక, లత్తుక దాడిమ లలితమల్లికలు
తిందుకంబులు శివతిలకకొల్మలులు, చందన కర్పూర సహకారములును
భల్లాత గుగ్గులు బ్రహ్మ కౌశికము, లెల్లచో నల్లినయేలకీలతలు
అల్లినమొల్లలు నలరుచేమంతి, చల్లనిపుప్పవాసనలఁ జెన్నొందు

కాసారములచేతఁ గడురమ్య మగుచు, భాసిల్లుపఱుల పటురవంబులును
సమధిక మిట్టియాశ్రమభూమి సకల, రమణీయమయ్యె నిర్జన మేటికయ్యె
మున్నిందుఁ దపమున మునివర్యుఁడెవ్వఁ, డన్నియు నెఱిఁగింపు మనిన నిట్లనియె
గౌతముం డిక్కడఁ గడఁకతోఁ దొల్లి, యాతతనిష్ఠ నహల్యతోఁ గూడి
యతిఘోరతపము నేయఁగ నింద్రుఁ డెఱిఁగి, యతనితపంబు దానంతయుఁ జెఱుపఁ
గుక్కుటంబై పోయి కుటజంబు నేరి, కొక్కొరో యని కూయఁ గొమరొప్ప మౌని
మనమునఁ జింతించి మమత చెట్టింప మని నిజానుష్ఠానమునకుఁ బోవుటయు
గౌతమాకారంబు గైకొని వచ్చి, యాతనిసతి నహల్యాదేవిఁ గదిసి
ఋతుకాలమనరు కోరికగలవారు, మతిఁ దలంపఁగఁ బ్రొద్దు మఱి చాలఁగలదు
పొలఁతుక నీతోడి భోగేచ్ఛ నాకు, వలయుటఁ దలపోసి వచ్చితి ననిన
నెఱిఁగి యహల్య నీవింద్రుండవగుట, యెఱుఁగుదు గాకేమి యిందు రమ్మనుచు
జలజాక్షి తనపర్ణశాలలోపలికి, బలభేదిఁ గొనిపోయి పరఁగఁ గ్రీడించె
సురనాథుఁ డప్పుడు స్రుక్కుచు భీతి, నరుగుచో గౌతముఁ డంతలో వచ్చి
యొరి పాపాత్మక యుచితమే నీకు, నారూపు గైకొని నాపత్నిఁ గవయ
నీపాపఫలమున నీ వముష్కుండ, వై పొమ్ము పొమ్మని యంత శపించె
గౌతముశాప మఖండమై తాఁక, నాతనియండంబు లంతలోఁ దెగియె
నడరి గౌతముఁ డహల్యాదేవిఁ జూచి, పడఁతి పాషాణమై పడియుండు మీవు

గౌతముఁ డహల్యకు శాప మిచ్చుట.

కరముగ్రమగునెండ గాలిపెంధూళి, బొరలుచు నెందును బొడఁగానఁబడక
అనిన శాపమున కెయ్యదితుది నాకు, ననిన నహల్య కిట్లనియె గౌతముఁడు
వైకుంఠధాముఁ డవాప్తకాముండు, లోకరక్షణకళాలోలచిత్తుండు
రాముఁడై వచ్చి పురాణపూరుషుఁడు, భూమివై జన్మించి పొగడు దీపించి
చనుదెంచి కౌశికుజన్నంబుఁ గాచి, యినకులాధీశ్వరుఁ డీత్రోవ వచ్చి
తొలఁగిపోవక నిన్నుఁ ద్రొక్కినఁ జాలు, జలజలోచన నీదుశాపంబు దీఱు
నని చెప్పి శీతాద్రికరిగె గౌతముఁడు, మునిపత్ని ఘోరూపమునను నంత
సురరాజు దనపాటు సురలతోఁ దెల్పఁ, దరమిడి పితృదేవతల వారు వేఁడి
వెరవరులై మేషవృషణముల్ దెచ్చి, సురలు సంధించిరి సురలోకపతికి
నతులపుణ్యాత్మకు లదియాదిగాఁగ, గ్రతువుల [1]ఁజంపుదుర్కుఁడఁగి మేషముల
నాఁడాదిగా మునినాథుశాపమునఁ, బోఁడిమిచెడి యీతపోవని నున్న
యాయహల్య నతుల్య హతమనశ్శల్యఁ, జేయవే శ్రీరామ చిరపుణ్యధామ
యని చెప్పి గౌతమునాశ్రమంబునకుఁ, జనుదేర శ్రీరామచరణంబు సోక
మొగులెల్ల విరియ సోమునికళనోలెఁ, బొగ యడంగిన హవ్యభుక్కీలవోలెఁ
గలఁకఁ దొలంగిన కమలినివోలె, బలుమట్టు గడిగిన బంగారువోలె
శ్రీరామపాదరాజీవపరాగ, దూరీకృతాఘసందోహయై యపుడు

---

1 వధియింత్రు కడఁగి.

వెలఁది యంతయు శిలావేషంబు మాని, తిలకించి తనతోఁటిదేహంబు పూని
మునిపతిచేత రామునిమహత్త్వంబు, వినినదిగాన నావేపండయాన
యీమహామహునకు నాతిథ్యమొసఁగి, శ్రీమాఱు నిటకు విచ్చేసితిగానఁ
జరితార్థనైతి మీచరణపద్మములు, దరి నిచ్చి రఘునాథ త్రైలోక్యనాథ
మీపాదతీర్థమా మిన్నేరు భువన, పావంబు లెడఁబాఁప బాల్పడె ననఁగ
నిలయెల్ల నొకట మిన్నొక్కటఁ గొలిచి, బలి మెట్టి బ్రహ్మాండభాండంబు ముట్టి
వేదశిరోవీథి విహరించు నీదు, పాదముల్ నాయుశాపముఁ బాచుటపుడె
య్యని రాము వినుతించె నంత గౌతముఁడు, సనుదెంచి రఘురామచంద్రుఁ బూజించి
ప్రాకట జన్మసాఫల్య నహల్యఁ, గైకొని తొల్లింటిగతి విలసిల్లేఁ
గ్రొవ్విరిజడివాన కుంభినిఁ గురిసె, నవ్వేళ దేవతూర్యంబులు మొరసె
ఘనపుణ్య లందుండి కదలి మిన్నంటి, తనరు ప్రాకారసౌధములయూథముల
నమరిక రత్న గేహాముల వాహాముల్, రమణీయరాజమార్గముల దుర్గముల
వలనొప్పు శృంగారవనుల జవ్వనులఁ, బొలుచు సంతతశుభంబుల నిభంబులను
ననువొందు వైరివర్గాశిధిలకును, జనకుని మిథిలకుఁ జనుదెంచి రంతఁ
గాళింగ నేపాళ కర్ణాట లాట, మాళవ సౌవీర మగధ పాంచాల
కురు పాండ్య బర్బర కుంత లావంతి, మరు తురుష్కాభీర మనుజవల్లభుల
ఘనతర యాగోపకరణభారములు, ననురూపపశుగణాయతనయూపములు
భూరి దధిక్షీరపూర్ణకుంభములు, సారసమిద్భారచారుదేశములు
నడరి ఘోషించు సామాదివేదములు, నుడుగక చనుదెంచుచున్న తాపసుల
నుడువీథినుప్పొంగు హోమధూమములు, నడరెడు దేవతాహ్వానరావములఁ
బూజలునైకొన్న పుణ్యసంయములఁ, బూజింపసొలయని భూసురోత్తములు
నరుదైన జనకునియజ్ఞవాటంబు, కరమర్థిఁ జొచ్చె నగ్గాధినందనుఁడు
అంత నాజనకమహారాజవర్యుఁ, డెంతయు [1] మర్యాద నెదురుగా వచ్చి
మునినాథునకు మ్రొక్కి ముదమొప్పఁ దోడు,కొనిపోయి పూజించి కుశలంబులడిగి
నీవు వచ్చితిగాన నేఁడు నే మిగులఁ, బావనాత్ముఁడనైతిఁ బ్రబలె నాక్రతువు
లని చాలఁ గొనియాడి యమ్మునిచంద్రు, వెనుకనె వినతులై విలసిల్లుచున్న
గురుతరస్థితవటులఁ గాకపక్ష, ధరుల మహాధనుర్ధరుల శ్రీకరులఁ
గోమలాంగుల నభంగురయశోనిధుల, భూమి జరించువేల్పులఁ బోలుఘనుల
సభయాంతరంగుల సతతప్రసన్న,వదనుల భువనపావనచరిత్రులను
చారుప్రభాభానుచంద్రసన్నిభుల, ధీరుల నయశ్వికదేవతాకృతుల
నాజానుబాహుల నతులవిక్రముల, రాజీవనేత్రుల రామలక్ష్మణులఁ
జూచి యాశరచాపశోభితాకారు, లీచతురాత్మకు లెవ్వరివార
లీపల్లవారుణ మృదుపాదపద్ము, లేపగిదిని వచ్చి రిచటికి నడిచి
యనిన విశ్వామిత్రుఁ డనఘులు వీరు, జననాథ దశరథజనపాలసుతులు

---

1 మహిమతో

నాయతశక్తి నాయాగంబు గాచి, యాయహల్యను బ్రోచి యనుకంప నేచి
నిరుపమతరశక్తి నీయింటనున్న, హరునిచాపముఁ జూడ నరుదెంచిరనుడు
మునినాథుమాటకు ముదమంది జనకుఁ, డనునయంబున వారినర్థిఁ బూజించెఁ

శతానందుఁడు విశ్వామిత్రప్రభావంబుఁ దెల్పుట.

గౌశికుఁ గనుఁగొని గౌతమసూనుఁ, డాశతానందుఁ డిట్లనియె రాగిల్లి
నీవు రాముని దెచ్చి నెమ్మి మ్మేలి, తీ విశ్వవిభుఁ దేర నెవ్వరితరము
అడరి మాతల్లి యహల్యపాపములు, కడుగ రాముని పాదకమలరేణువుల
గౌతమశాపదుర్గతి నిస్తరించి, గౌతముఁ గ్రమ్మఱఁ గలిసె మాతల్లి
రామచంద్రునిపాదరాజీవమహిమ, లేమందునని రాము నీక్షించి పలికె
నీకౌశికుఁడు పుణ్యుఁ డీక్షోణిమీఁద, నీకు రక్షకుఁడఁట నీకేమి కొదువ
యరయ విశ్వామిత్రునతులప్రభావ, మరిది ప్రస్తుతిసేయ నైనను వినుము
దశరథాత్మజ బ్రహ్మతనయుండు కుశుఁడు, కుశుఁ డర్థితోడుతఁ గుశనాభుఁ గనియెఁ
గుశనాభునకు గాధి కొమరుఁడై పుట్టెఁ, గుశపవిత్రుఁడు గాధికొడుకయ్యె నితఁడు
అతిధర్మనిరతుఁడై యఖిలంబు పొగడ, నితఁడు మహీచక్ర మేలుచునుండె
నొలసినవేడుక నొకనాఁడు దన్నుఁ, బలిసి యక్షౌహిణీబలములు గొల్వ
వెడలి కాననముల వేడ్కలుసల్పి, పుడమియంతయుఁ జరింపుచుఁ జాల బడలి
బహుగంధబంధుర ప్రసవమంజరుల, బహుఫలంబులనొప్పు పాదపావళుల
బహుపక్షిరవముల బ్రహ్మఘోషములు, బహుసరోవరముల బహుళవేదికల
నలరుచు జాతివైరాదులు లేక, మెలఁగు నానావిధమృగసమూహాముల
ననిలాంబుజీర్ణపర్ణాశులై తపము, నొనరించుతపసుల యోగిపుంగవులఁ
బన్నగఖేచరప్రముఖగంధర్వ, కిన్నరాదుల బాలఖిల్యాదిమునులఁ
గడునొప్పి బ్రహ్మలోకము వోలె మిగుల, నడరు వసిష్ఠునియాశ్రమంబునకు
నతిముదంబున వచ్చి యావసిష్ఠునకు, నతినిష్ఠ మ్రొక్కిన నతఁడు దీవించి
యుచితాసనంబున నునిచి పూజించి, ప్రచురరసస్వాదుఫలమూలతతుల
వరుసతో నిచ్చిన వానిఁ గైకొనుచుఁ, గరములు ముకుళించి కడుభక్తిఁ బలికె
ననఘాత్మ తపసులు నగ్నిహోత్రములు, జనలోకనుతములై జరగుచున్నవియె
మీరును శిష్యులు మీయాశ్రమమున, నారంగ వీరు వారన కెల్ల వారు
ముదమున నున్నారె మునినాథ యనిన, నొదవుసమ్మదమున నున్నార మేము
నీతితోఁ జేయుదె నీవు రాజ్యంబు, ప్రీతిమై భరియింతె భృత్యవర్గముల
ముదమొప్ప రాజ్యాంగములు పరీక్షింతె, వదలక నిర్జింతె వ్రాలుశాత్రవులఁ
గుశలమే సర్వంబు కుశలమే నీకుఁ, గుశలమే నీపుత్రకులకుఁ బత్నులకు
నని పల్క మీకృప నఖిలంబు కుశల, మనియెఁ గౌశికుఁ డంత నవ్వసిష్ఠుండు
కరమర్థి మాయింటికడ విందు గుడిచి, యరుగుమ యీవని యతనిఁ బ్రార్థింప
నందుకు కౌశికుం డనుమతించుటయు, విందుసేయుటకునై వేగంబ యతఁడు
తనహోమధేనువు దలఁచి రప్పించి, జననాథవరునకు సకలసేనలకు

వివిధభక్ష్యంబులు వివిధభోజ్యములు, వివిధభంగుల విందు వేడ్కఁ గావింప
వలయుఁగావున నీవు వలయువస్తువులు, గలిగింపుమనవుడుఁ గామధేనువును
గలమాన్నతతులు శాకములు భక్ష్యములు, గలవంటకిము లూరుఁగాయలంబళ్లు
ఫలవిశేషంబులు పాయసాన్నములు, చెలువారు వెన్నలు చీనిచక్కెరలు
సద్ఘృతములు రసాయనంబులును, మద్యవిశేషముల్ మాంసభేదములు
వావిరి మఱియు నెవ్వారికి నేమి, కావలె నవి యడుగకయె కల్పింప
నాధేనుమహిమ కత్యాశ్చర్యమొంది, గాధేయుఁ డప్పుడు కడిమూడనేయఁ
గుడిచి నేనలు దానుఁ గోర్కిదీపింపఁ, గడుఁ దృప్తినొంది యాగాధితనూజుఁ
డీకామధేనువు నెబ్బంగినైనఁ, జేకొందు నసుచు వసిష్ఠునిఁ జేరి
లక్షగుఱ్ఱంబులు లక్షధేనువులు, లక్షయేనుఁగులు వేలక్షలు మణులు
నిచ్చెద నీధేను విమ్ము నాకనిన, నిచ్చలో మునినాథుఁ డెంతయు వగచి
యిది నాకు జీవనం బిది నాకుఁ బ్రాణ, మిది నాతపంబులకెల్ల సాధనము
హవ్యకవ్యంబులు నతిథిసత్కార, మవ్యాహతముగ నీయావుచే నడుచు
నీపుణ్యధేనువు నీఁజాల ననిన, నాపూర్ణబలుఁడు విశ్వామిత్రుఁ డలిగి
యిమ్మని బతిమాలి యే వేడనేల, రమ్మని భటసహస్రంబులుఁ దాను
గోవు నుద్ధతిఁ బట్టికొనిపోవఁ బోవఁ, బోవక యది మునిపుంగవుఁ జూచి
యనఘ వసిష్ఠసంయమిచంద్ర నన్నుఁ, గొనిపోవుచున్నాఁడు క్రొవ్వి కౌశికుఁడు
వారింపవకట దుర్వారుండవయ్య, నూరక తగునయ్య యొప్పింప నన్ను
ననఘాత్మ నీయెడ నపరాధి గాను, నను నుపేక్షించుట నాయమే నీకు
ననుడు ధేనువుమాట కావసిష్ఠుండు, మనమునఁ గృపపుట్టి మఱుమాటఁ బలికె
నేనేల విడుతు నిన్నెంతయు బలిమి, భూనాయకుఁడు గొనిపోయెడుఁగాని
క్షత్త్రియు లుద్దండచారిత్రు లైన, ధాత్రిసురోత్తము ల్ధారెంతవార
లీక్షోణి కధిపతి యీగాధితనయుఁ, డక్షౌహిణీబలం బతనికిఁ గలదు
ఏవిధంబున గెల్తు నితని నే ననిన, నావసిష్ఠునితోడ నాధేను వనియె
మునినాథ నృపతేజమునకంకె నెందు, వినుతింప నెక్కుడు విప్రతేజంబు
గావున నీకంకెఁ గౌశికుఁడెక్కు, డేవెంటఁ గాకుండు టే నెఱుంగుదును
బనుపుము నన్ను నీబలములనెల్ల, మునుకొని యడఁచెద మునినాథ యనిన
నావసిష్ఠుఁడు ధేను వపుడు సైన్యములఁ, గావించు బలముల ఖండింపుముఱక
నన విని హుంకారమడరించుటయును, గనుఁగొని ధేనుహుంకారంబునందు
ఘనవాలలతయందుఁ గర్ణంబులందుఁ, దనురుహంబులయందు దంతంబులందు
ఖురమధ్యములయందుఁ గొమ్ములయందు, నురులోచనములందు నూర్పులయందు
మొనయ జంఘలయందు మోఁకాళ్లయందఁ, ననువొందఁ దొడలందు నధరంబునందు
గాఢతరం బైన గంగడోలునను, రూఢిగాఁ గూడిన రోమకూపములఁ
గెరలు రంకెలను సక్థిప్రదేశమునఁ, బొరి నుద్భవించిరి భువనభీకరులు
కైరాత పల్లవ కాంభోజ యవన, వీరులు పెక్కుండ్రు విషమవిక్రములు

చిత్రరూపాఢ్యులు చిత్రాయుధులును, జిత్రవిలోచనుల్చిత్రహుంకృతులు
నై వీరులై ధీరులై మహాోదారు, లై వారు సేనాసహాయులై మఱియు
హరులతోఁ గరులతో నందందఁ గడిమిఁ, బరఁగి విశ్వామిత్రుబలములఁ ద్రుంపఁ
జూచి యాకౌశికసుతుల నూర్వరను, నేచి నానాహేతిహేతులు నిగుడ
వచ్చి వసిష్ఠుని వధియింపఁ గడఁగి, యచ్చట భస్మమై రతనిహుంకృతికి
నంత విశ్వామిత్రుఁ డఖిలసైన్యంబు, లంతకువీటికి నరుగుట చూచి
యతులపరాక్రము లగుచున్నతనదు, సుతులచావును జూచి శోకించి యంతఁ
దనరాజ్యమున నొక్కతనయుని నునిచి, చని హిమాచలమునఁ జలమున నిలిచి
త్రిపురారిఁ గూర్చి యతిప్రయత్నమునఁ, దపమొనరింపఁ బ్రత్యక్షమౌటయును

కౌశికుఁడు ఈశ్వరునిచేత నస్త్రాదులు వడసి వసిష్ఠునితోఁ బోరుట

హరుచేత వివిధశస్త్రాస్త్రము ల్వడసి, యురవడిఁ జనుదెంచి యుగ్రుఁడై కడఁగి
మొగి వసిష్ఠాశ్రమంబున వహ్నిశిఖలు, నెగయఁ బెల్లెగసె నాగ్నేయబాణముల
నప్పుడు బాణాగ్ని లాశ్రమంబెల్లఁ, గప్పి మండుటయును గని వసిష్ఠుండు
కాలదండముఁ గొన్న కాలుండొ యనఁగఁ, గేల దండము దాల్చి కినుకతో వెడలి
యొరి విశ్వామిత్ర యొరి పాపాత్మ, భూదిపుణ్యాశ్రమంబులు గాల్పఁ దగునె
యెనయ నీవెక్కఁడ నేనెక్కఁడనిన, ఘనరోషచిత్తుఁడై కౌశికుం డప్పు
డతనిపై రౌద్రంబు నైంద్రంబుఁబాశు, పతము వైష్ణవము జృంభణము శోషణముఁ
జటులమోహనమును సంతాపనంబుఁ, బటుతరవజ్రంబు బ్రహ్మపాశంబుఁ
గనలుపైశాచంబు కాలపాశంబు, ఘనవిష్ణుచక్రంబు కాలచక్రంబు
వారుణ గాంధర్వ వాయవ్యసార, ఘోరాస్త్రకోటులు క్రూరుఁడై యేయఁ
గలయంగ విస్ఫులింగంబులు చెదర, బలువిడి నుగ్గాడె బ్రహ్మదండమున
నలుక విశ్వామిత్రుఁ డంత బ్రహ్మాస్త్ర, మలవడ సంధించి యార్చి యేయుటయు
సకలగీర్వాణులు సకలసంయములు, సకలగంధర్వులు సకలపన్నగులు
సకలభూతంబులు సకలదిక్పతులు, సకలతారాగ్రహచంద్రసూర్యులును
సకలలోకంబులు చలనంబునొంది, సకలదిక్కులు మండఁ జండవేగమున
బ్రహ్మాండభాండంబు బలువిడినెగడి, బ్రహ్మదండము దాఁటి పఱతేరఁ జూచి
బ్రహ్మాదులకు నడ్డపడరానియట్టి, బ్రహ్మాస్త్ర మవలీలఁ బట్టుక మ్రింగెఁ
సురుచిరబ్రహ్మతేజోమూర్తి వెలుఁగ, నరుదార నమ్మునియంగరోమముల
నెఱిమంటలెగయ ననేకబాణంబు, లఱిముఱి వెడలి విశ్వామిత్రుఁ దాఁకి
చుఱపుచ్చుదొడఁగినఁ జూచి కౌశికుఁడు, నెఱిచెడి యెంతయు నిజసత్త్వమెడలి
తరమిడి యాబ్రహ్మదండమొక్కటను, వరశస్త్రకోటులు వమ్ములై పోలిసె
నత్రస్తమచల మీయనబ్రహ్మబలము, ఋత్రబలంబది గాల్పనే యనుచు
చెనటియై మగిడి కౌశికుఁ డాలు దాను, జని ఘోరతపమర్థి సలుపుచునుండె
అటమీఁద సుతుల విశ్వామిత్రమౌని, పటుసత్త్వవంతులఁ బడసె నల్వురను
వినుము దుష్యంద హవిష్యందనాము, లన దృఢనేత్ర మహారథు లనఁగఁ

జలము డింపక పెక్కు సంవత్సరమ్ము, లలఘునిష్ఠలఁ దపం బటుసేయ మెచ్చి
వనజసంభవుఁడంత వచ్చి కౌశికునిఁ, గనుఁగొని యెంతయుఁ గరుణించి పలికె
నీతపంబున మెచ్చి యిచ్చితి నీకుఁ, బ్రీతిమై నిట రాజఋషిపదం బనఘ
యని పోవ గాధేయుఁ డతిదీనుఁడగుచు, నెనయంగ నీతపం బెంత చేసినను
గడపట బ్రహ్మర్షి గానేరనైతి, నెడపడి చెడిపోయి యీయుగ్రతపము
ఈరాజఋషిపదం బే నొల్ల ననుచు, ఘోరతపంబు గైకొని సేయుచుండె
అంత నిక్ష్వాకుకులాగ్రణియైన, సంతతకీర్తి త్రిశంకుఁ డక్కరాజు
తనువుతోడను గూడి తానాకమునకు, నొనరంగఁ జనుజన్న మొసరింపఁ దలఁచి
భక్తి వసిష్ఠునిపాలి కేతెంచి, యుక్తమార్గంబున నుపచరించుచును
దివిజలోకమున కీదేహంబుతోడ, సవనంబు గావించి చనఁ గోరెఁ నాకు
ననుర క్తిఁ గావింపుఁ డనఘు నాచేత, ముసుల రప్పింపుఁడు ముదమొప్ప ననిన
నరనాథ యొడలితో నాకలోకమున, కరుగ నసాధ్య మీయవనీశులకును
అనవుడు రాజన్యుఁ డట దక్షిణమున, ఘనునిష్ఠఁ దపమర్థిఁ గావించుచున్న
చిరపుణ్యులైన వసిష్ఠపుత్త్రులకుఁ, గరమర్థిఁ బ్రణమిల్లి కరములు మొగిచి
దేవలోకమున కీదేహంబుతోడఁ, బోవచ్చుయాగంబు పూని నాచేతఁ
జేయింపుఁడనిన వసిష్ఠుఁ డీతెఱఁగు, నేయుఁడీ యనెనేని చేయింతుమనుడు
నారాజచంద్రుఁ డిట్లనియె వసిష్ఠుఁ, డేరాజులును జేయ రీక్రతువనియె
మీకడనిటు రాక మీరైన నన్నుఁ, జేకొని యజ్ఞంబు సేయింపవలయు
నరయఁ బురోహితు లగువారు గారె, ధరణీశులకు సర్వధర్మసాధకులు
అనిన వాసిష్ఠు లాయవనీశుఁ జూచి, ఘనుఁడు వసిష్ఠుండు గాదన్న తెఱఁగు
నిర్మలమతి నొరుల్ నేర్తురే సేయ, దుర్మతి వగునీకుఁ దోడుదుగాక
యనిపల్క నిర్విణ్ణుఁడై సంయమీంద్రు, తనయులఁ జూచి యాధరణీశుఁ డనియె
మీతండ్రి నిరసించె మీరును జేయ, రైతి రేతెఱఁగుననైన నీక్రతువు
హితబుద్ధిలేనిమీ రేల నా కింక, నితరులచేతఁ జేయించెదఁగాక
యనినఁ జండాలుండవగుమంచునలుకఁ, గనుఁగొని పల్క రాఘనపుణ్యులంత
భాసురంబగు భూమిపాలుతేజంబు, వాసిష్ఠకోపాగ్ని వడిఁ గాలె ననఁగ
నారయ నీలదేహంబును నీలి, చీరయు జుంజురుశిఖయును దనర
నంట నశుద్ధంబులైన మాలిన్య, మంటించు నీరూప మనుభంగి దోఁపఁ
బ్రణుతవర్ణసూచ్యర్థిఁ బరఁగిన కనక, మణిభూషణము లోహమయములై తనర
నోజమైఁ గష్టనామోక్తిభేదముల, నాజాతి కనురూపమైన రూపమున
జననాథుఁ డతిఘోరచండాలభావ, మొనరంగఁ జేడ్పడియున్న నీక్షించి
పౌరభృత్యామాత్యబంధువర్గంబు, లారాజు వర్జించి రంత నారాజు
నొదవినభయమునననొయ్య మెట్టుచును, నొదుకుచు జనులకు నోసరించుచును
జని మహామహుని విశ్వామిత్రుఁ గనిన, గనికరంబొదవ నాగాధితనూజుఁ
డిల నయోధ్యాపురం బేలెడినీకు, నెలమిఁ జండాలత్వ మేల పాటిల్లె

నేతలంపున వచ్చె నెఱిఁగింపు మనిన, నాతండు ముకుళితహస్తుఁడై పలికె
నిరవొంద బొందితో నింద్రలోకమున, కరుగఁజొప్పడునట్టి యాగంబు మున్ను
చేయింపుఁడనిన వసిష్ఠుఁ డీతెఱఁగు, నేయింపరాదని చెప్పెను త్వరము
నావసిష్ఠునిపుత్త్ర లగువారు నతఁడు, గావింపఁగాదన్నఁ గాదని పలికి
రితరులచేతఁ జేయింతునన్నాట, కతిరోషమున మాల వగుమన్న నైతి
ననఘ నాచేసెద నన్నయధ్వరము, నొనరింతు నామాట కొగి బొంకులేదు
ఇట్టియాపదయందు నిటమీఁదనైన, నెట్టన సత్యంబు నెగడఁ బాలింతుఁ
బెక్కు-ధర్మంబులు పెక్కు-జన్నములు, పెక్కు-వతోఁ జేసి పెంపు గైకొంటి
గురులఁ బూజించితి గురులు నావలనఁ, గరుణచాలమి ధర్మకార్యంబు నిలిచి
పౌరుషం బది దేవ ఫలము లేకున్న, నేరమి వాటిల్లు నిక్కువం బరయ
నేవిధంబుననైన నీవు నాపాలి, దైవమై రక్షింపఁ దగుదు నాకనియె
ఖనీన షిశ్వామిత్త్రుఁ డతని వీక్షించి, జననాథ నీవింక సంతాపముడుగు

త్రిశంకునికై కౌశికుఁడు యజ్ఞంబుచేయ నారంభించుట

దీనునిఁ జేపట్టితిని ద్రిశుద్ధిగను, మానుల రప్పించి మఖము సేయించి
ద్దేహంబులోడనే తివిరి నేఁ బలుక,పోహంబు గాకుండఁ బుచ్చెద గివికి
విను నిన్నుఁ బరమపవిత్త్రుఁ గావింతు, ననిపల్క- శిష్యుల నందఱఁ జూచి
మునులార మీ రెల్ల మునుల ఋత్విజులఁ, గొనిరండు వే త్రిశంకునియాగమునకు
నని నియోగించిన నట్ల వారేగి, మునివరేణ్యులనెల్ల మొగిఁ దోడితెచ్చి
కలయ విశ్వామిత్త్రుకడకు నే తెంచి, చలమేమి నిల్చిరి సంయమీశ్వరులు
వారు వసిష్ఠునాశ్రమవాసులెల్ల, వారలు దక్కంగ వచ్చిరందఱును
ఆవసిష్ఠునిపుత్త్ర లాడిరి కొన్ని, యాపాక్యములు వినుమంచు వారనిరి
మతి విచారింపక మఖము నేయించు, నతఁడు రాజఁట మాలఁడఁట నేయువాఁడు
చండాలుమఖమున సకలమునీంద్ర, లుండి భోజనము లే యుక్తిఁ జేసెదరు
ఆడకే మొగముల నరుగుదెంచెదరు, వేడుక సురలు హవిర్భాగమునకుఁ
బరఁగ విశ్వామిత్రపాలితుండైన, నరుఁ డెట్టులొందెడు నాకలోకంబు
విన విస్మయంబని వెలయ దూషించి, రనిన విశ్వామిత్త్రుఁ డగ్నియై మండి
కడునిష్ఠఁ దపమిట్లు గావించు నన్ను, నడరి దూషించు పాపాత్ములిందఱును
నూతనగతి నేడునూఱుజన్మముల, బాగుగాఁ గ్రవ్యాదభావంబుఁ దాల్చి
మానవశునకాదిమాంసముల్దినుచు, హీనులై చరియింపనిమ్ము లోకముల
నసమునన్నాఁడు నామహోదయుఁడు, వసుధ నిషాదుఁడై వర్తింపనిమ్ము
అని శపియించి సంయముల వీక్షించి, మునులార యీరాజముఖ్యుఁ ద్రిశంకు
నున్నతకులశీలు నురుకీర్తిలోలు, సన్నుతధర్మజ్ఞు సత్యప్రతిజ్ఞుఁ
గ్రతువు నేయింపుఁడు గాత్రంబుతోడ, నితఁ డింద్రపురికేగు నిరవొప్పనిన
నాఋషిమాటల కమ్మహామునులు, దారు విచారించి తమలోన ననిరి
గాధిసూనునిమాట గాదంటిమేని, క్రోధించి శపియించుఁ గ్రూరవాక్యములఁ

గానఁ జేయింతము క్రతుపు కౌశికుఁడు, మానుగాఁ జెప్పినమహితమార్గమున
నని పల్కి మునులెల్ల నధ్వరకర్మ, మొనరింప నామంత్ర యోగాదులమర
నాగాధితనయుండు యాజకుండగుచు, యాగభాగములకు నమసులఁ బిలిచెఁ
బిలిచిన రామంచుఁ జేరెలుంగెత్తి, పలికిరి సురలటు పలుకఁ గౌశికుఁడు
కుశపవిత్రముచేత గొని స్రువంబెత్తి, దిశలరోషానలదీప్తులు నిగుడ
నాకేంద్రలోకంబునకుఁ ద్రిశంకుండ, నీకోరినటువలె నిన్నుఁ బుచ్చెదను
నడరంగ నే బాల్య మాదిగా నియతి, విడువక తపనుఁ గావించితినేని
బొందితోడనె కూడఁ బోయి స్వర్గంబు, నందుము పొమ్మన్న నాత్రిశంకుండు
తత్తపోబలమునఁ దడయక యెల్ల, సత్త్వము లేగెడి సరణిఁ బోవుటయుఁ
జండాలుఁడవు నీవు స్వర్గలోకమున, నుండనీనని యింద్రుఁ డుపరి త్రోపింపఁ
గడఁక విశ్వామిత్ర కావవే యనుచు, వడిఁ దలక్రిందుగా వచ్చుచునున్న
శరణార్థియైన త్రిశంకునిఁ జూచి, కరుణావిధేయుఁడై గాధేయుఁ డపుడు
జననాథ నీవాకసమునందె నిలువు, మని పల్కి నిలుపుచు నటఁ దక్షణమున
నలుకఁ ద్రిశంకున కమరేంద్రతోడి, చలమున వేఱొక్కస్వర్గంబు నేసి
లలినందు సప్తర్షి లనుదారకలను, నలవడఁ గల్పించి యానాకమునకు
వేఱుదేవతలఁ గావింప నింద్రునకు, మాఱేంద్రుఁ గల్పింప మదిఁ దలంచుటయుఁ
జాల భీతిలి సర్వసంయము ల్సురలు, నోలి విశ్వామిత్రునొద్ద కేతెంచి
యిలలోన మునినాథ యీత్రిశంకుండు, దలపోయ గురుశాపదగ్ధుండుగానఁ
దగ నాకముననుండఁ దగదన్నమాట, తగవుగాఁ గొని గాధితనయుండు పలికె
సురలార యీతని సురలోకమునకు, నరిగెడు మేనితోనని పల్కినాఁడ
నామాట నిజముగా నైన నీనాక, మీమహీనాథున కిటు చెల్లనిండు
ప్రభనొప్ప లోకముల్పరఁగునందాఁక, నభమునఁ బొలిచి యీనక్షత్రములను
గలయనచ్చరవీధి కంఱెను మీఁదఁ, దొలఁగని తేజంబుతోఁ జెలువొంది
బృందారకస్తూర్తి పెంపొందు శిరసు, క్రిందై త్రిశంకుండు కృతపుణ్యుఁడగుడు
కరమొప్ప నీతారకలకును నడుమ, సురుతరకీర్తిమై నుండనిం డనిన
ననుమతించుచు నప్పు డాయనుగ్రహముఁ, గొనియాడి ముని వీడుకొని సుర్లనులు
లలి నిజస్థానంబులకు నేగి రంత, నెలమిఁ గౌశికుఁడు మునీంద్రులఁ జూచి
యిమ్ముగానటమీఁద నిది తపంబునకు, సమ్మర్ద మిక్కుడఁ జాలంగఁ గలుగు
మునులార మనమింక ముదము చిత్తమునఁ,దనర నొక్కెడకుఁ బోదము రండటంచుఁ
గడఁకనక్కడఁ బాసి కదలి విశాల, కడకేగి యందుఁ బుష్కరతీర్థమాడి

అంబరీషుఁడు యజ్ఞపశువుగా శునశ్శేపునిఁ గొనిపోవుట.

యంబుఫలాహారి యగుచుఁ బేక్కేండ్లు, పంబిననిష్ఠఁ దపంబు గావించె
నంబరీషుం డయోధ్యాపురివిభుఁడు, శంబరరిపుమూర్తిసముఁ డట్టియెడను
వెలయంగఁ గ్రతువు గావింపఁగాఁ బూని, బలభేదిచే యాగపశువుఁ గోల్పోయి
యరసి లేకున్నఁ బ్రాయశ్చిత్తవిధికి, నరపశు వడుగుచు నానాశ్రమముల

నరయుచు నందంద నటనొక్కమౌని,వరునింటికడకు భూవరుఁ డేగుదెంచి
భృగుతుంగవాసియై వేదయై నియతిఁ, దగనున్న రుచికునొద్దకుఁ బోయి మ్రొక్కి
కరుణాఢ్య యేను యాగము నేయఁగోరి, పరికింపనేరక పశువుఁ గోల్పడితి
గొనకొని యొకలక్షగోవులఁ బుచ్చు, కొని యాగపశువుగాఁ గొడుకు నాకిమ్ము
నావుడు నాతండు నాపెద్దకొడుకు, పై వేడ్క నేయుదుఁ బశువుగా నీను
నావుడు మునిపత్ని నాపిన్నకొడుకు, పై వేడ్కనేయుదుఁ బశువుగా నీను
అని యిరువురు వూని యాడువాక్యములు, విని శునశ్శేపుఁ డుర్వీపాలుఁ జూచి
తనపెద్దకొడుకు మాతండ్రి పాటించుఁ, దనపిన్నకొడుకు మాతల్లి పాటించు
వారలు నీకేల వచ్చెద నేను, గోరి వీరలకిమ్ము గోసహస్రముల
ననిన నట్లు యెనర్చి యమ్మునిపుత్రుఁ, గొని రథంబెక్కించుకొని శీఘ్రవృత్తి
జననాథుఁ డెంతయు సంతోషమొప్పఁ, జని చని పుష్కరాశ్రమభూమిఁ జేరె
నచట శునశ్శేపుఁ డతితపోనిష్ఠ, నచలుఁడై యున్న విశ్వామిత్రుఁ గాంచి
తనమేనమామ యాతఁడుగానఁ బ్రేమ, ననలో త్తనుచిత్ప్రణామముఁడై పలికె
ననుఁ దలిదండ్రు లీనరవరాగ్రణికి, ననఘాత్మ పశువుగా నమ్మి పొమ్మనిరి
చెలువొప్ప నీరాజు నేయజన్నంబు, ఫలియింపఁజేసి నాప్రాణములిచ్చువు
దల్లియుఁ దండ్రియు దైవంబు గురువు, నెల్లచుట్టములు నాకీవేళ నీవె
యని దైన్యపడఁగ విశ్వామిత్రమౌని, దనతనూభవుల నందఱఁ జూచి పలికెఁ
బ్రాకటంబుగఁ దమపరలోకమునకు, నైకదా సుతులఁ బుణ్యాత్ములు గనుట
పరలోకమిదియ నాపాలికి నన్ను, శరణంబుఁ జొచ్చె నీసంయమిపుత్రుఁ
డితఁడు నామేనల్లుఁ డితని రక్షింపుఁ, డితనికై ప్రాణంబులిడుఁడు మీరొకరు
అడిగెద మిమ్మన్న నటు సేయఁ గొడుకు, లొడఁబడమన్న నత్యుగ్రుఁడై మండి
శునకమాంసము దించు సొరిది వేయేడు, లనుభవింపుఁడు దుఃఖమని శాపమిచ్చి
కౌశికుఁ డత్యంతకారుణ్యబుద్ధి, నాశునశ్శేపు నొయ్యనఁ జేరఁ బిలిచి
యేను మంత్రములు రెండిచ్చెద నీకు, వాని ననుష్ఠింపు వదలక నీవు
అవి నిన్ను రక్షించు నంబరీషునకు, సవనతంత్రంబును సఫలంబు నేయు
నని చెప్పి మంత్రంబు లవిరెండు నిచ్చె, ననుపమభక్తితో నతఁడు గైకొనియె
మఱునాఁడు వచ్చి యమ్మునుజవల్లభుఁడు, వఱలెడు తనయజ్ఞవాటంబుఁ జొచ్చి
విశసింపఁ బూని యావిమలాత్ముఁ దెచ్చి, పశుపూజచేసి యూపమున బంధించె
నంత శునశ్శేపుఁ డమ్మంత్రజపము, శాంతుఁడై చేయుచుఁ జలియింపకున్న
నచటి కింద్రోపేంద్రు లర్థితో వచ్చి, సుచరిత్రు నంబరీషునిఁ జేరఁ బిలిచి
క్రతుపూర్ణఫలమిచ్చి కడనున్న రుచికు, సుతుఁ జిరాయువుచేసి సురలతోఁ జనియె
అరుదైనతపమున నంత వెయ్యేండ్లు, జరపిన బ్రహ్మ విశ్వామిత్రుఁ గదిసి
నీకు ఋషిత్వంబు నీతపశ్శక్తి, జేకూడెనని యొప్పఁ జెప్పి విచ్చేసె
నంతటఁ దనియక యత్యుగ్రతపము, సంతతనియతితో సలుపుచు నుండఁ
గాముదీమములీలఁ గైకొననేర్చు, కామునిబాణంబు కమనీయకంబు

విశ్వామిత్రుఁడు మేనకను గూడుట.

చెలువొందునప్సరస్త్రీమూ ర్తి దాల్చి, మెలఁగెడుగతితోడ మేనక యపుడు
లలితయౌవనకళాలావణ్యగణ్య, జలకేళిఁ దేలనాసతిజారుకొప్పు
చికిలిచూపులు నునుఁజెక్కులముద్దు, మొకము కెంపులమోవి మొలకనవ్వులును
బొంగారుకుచకుంభములు పదార్వన్నె, బంగారుపొడిరాలుబాహుమూలములు
చిన్నారినూఁగారు సింగంపుఁగౌను, పొన్నపూపొక్కిలి బొదలెడుపిఱుఁదు
లూరులతీరు నోరూరఁగాఁ జూచి, వేరువాడి మరుండు వెళవెళనార్వ
థ్యానంబు మానంబుఁ దపముఁ బోకార్చి, మేన గళల్లగ్గిమ్ము మేనకఁ జూచి
నన్నుఁ గాయజుకేళి నలినాక్షి పొందు, మన్న నామాటకు నంగీకరించి
పదియేండ్లు మది సోలి భావజుకేళి, సదమదంబుగ సౌఖ్యసరసిని దేలి
మఱి వివేకము పూని మానిని యెంతేని, దఱుగని తనతపోధనము పోవుటకుఁ
బరితపించుచు మది పదిలంబుచేసి, సురలోకమునకు నాసుదతి వీడ్కొలిపి
యింద్రునియత్నంబు లివి యంచుఁ దెలిసి, యింద్రియజయశుద్ధి యేఁ గాంతుననుచు
శీతాద్రికరిగి కౌశికిచెంతఁ జేరి, యాతపంబునను మహాతపం బపుడు
వర్షముల్ పెక్కైన వచ్చి విరించి, హర్షించి నీవు మహర్షివై తనిన
నీరజాసన నన్ను నీవు నీచిత్త, మారంగ బ్రహ్మర్షి యన్నంతఁబాఁకఁ
జరియింతుఁ దపమన్నఁ జరియింపు మనుచు, నరవిందభవుఁడేగె నంతఁ గౌశికుఁడు
బ్రహ్మదేవుఁడు పోవఁ బరమపావనత, బ్రహ్మర్షితను నేను బడసెద ననుచు
నూరుపు వుచ్చక యూర్ధ్వబాహుండు, మారుతాహారుండు మానియు నగుచుఁ
బనివడి వేసవిఁ బంచాగ్నిమధ్య,మున వానకాల మిమ్ముల బట్టబయల
మంచుకాలంబున మడుఁగులయందు, నించితంబుగఁ జేసె నత్యుగ్రతపము
నీళంగి వెయ్యేఁడు లేగినపిదప, సౌభాగ్యవతి రంభ జంభారి చూచి
యెలమిమై దేవతాహితకార్య మొకటి, చెలువార నే నీకుఁ జెప్పెద వినుము
సురహితంబుగ గాధిసూనుతపంబు, సురుచిరంబుగ మాన్పు సుందరి యనుడుఁ
గ్రూరతపంబు గైకొనియున్నతనిఁ, జేర నాతరమె శచీనాథ నీకు
మ్రొక్కెద నమ్మహామూర్ఖునిదిక్కు, నిక్కి చూడఁగనోప నీపాదమాన
నాక్షేప కోపించు నన్ను శపించు, నాకౌశికుని సైఁపనని జాలిఁ బడుచు
నెఱఁగి యెఱఁగి తారెట్టివెంగలులు, కొఱవిచేఁ దలఁ గోకుకొనువారు గలరె
యన విని యింత భయంబేని నీకు, మనసిజమాధవు ల్మరి సహాయముగ
వత్తురు చనుమన్న వనితయు నతని, చిత్తమెఱింగి చెచ్చెర భూమికరిగి
గాధిసూనుండున్న ఘనతపోవనము, మాధవమన్మథుల్మఱి సహాయముగఁ
గీరకోకిలసమాకీర్ణమయూర, శారికానిజసఖీసహితయై చొచ్చి
యారంభయను మనోహరలాస్యగరిమ, నారంభ మొనరింప నలిగి కౌశికుఁడు
పదివేలవర్షముల్పాషాణభావ, మొదవంగఁ గైకొని యుండి యామీఁద
సురుతపోనిధియైన యొకవిప్రువలన, సరసిజానన పొందు శాపమోక్షంబు

నని పల్కఁ బాషాణమయ్యె నారంభ, మనసిజుండును నేఁగె మతి భీతుఁడగుచుఁ
దనతపం బొక్కింత దఱిగిననంతఁ, దనలోన నగ్గాధితనయుఁ డూహించి
యపుడు కామంబున నడఁగె నాతపము, నిపుడు క్రోధంబున కిచ్చితి నచుచు
మదిలోన వగచి కామంబు క్రోధంబు, వదలి నిరాహారవంతుఁడై నియతి
విజితేంద్రియుండునై వేయువత్సరము, లజుఁడు మెచ్చఁగఁ దపంబతినిష్ఠఁ జేసి
యనయంబు బ్రహ్మర్షి ననిపించుకొందు, ననియుత్తగము వాసి యటఁ దూర్పు దెసకు
నెనసి వెండియును దేవేంద్రుండు నేయు, ఘనవిఘ్నకోట్లకుఁ గదలక నిలిచి
యరుదెంచి యంత సిద్ధాశ్రమభూమి, సురు ఘోరతపము సేయుచునుండఁ గలిగె
వరతపోనియతియై వర్షసహస్ర, మరుగఁ బారణనేతుఁడని యున్నచోట
నివ్వరిబియ్యంబు నెఱనెఱఁ దెచ్చి, యవ్వి యన్నియుఁ బొకయత్నంబుచేసి
యారయ దేవతార్పణముగాఁ జేసి, వారవి భుజియింప వడిఁ దలంచుటయు
బలభేది యొకముదిబాహుఁడై వచ్చి, నిలిచి గ్రాసము వేఁడ నెమ్మితో నిచ్చె
నాయమరాధీశుఁ డడరి భోజనము, చేయుచో నన్నంబు శేషింపకున్న
మఱియును వెయ్యేండ్లు మౌనియై నిలిచి, తఱుగని నిష్ఠతోఁ దపమాచరింప
నప్పుడు మునినాథునౌదలఁ బుట్టి, కప్పె లోకముల నుత్కటమైన పొగయుఁ
గలఁగెఁ బయోధులు కంపించె ధరణి, కులగిరు లదరె దిక్కులు చిక్కువడియె
నమరులు గంధర్వ లక్షలసంయములు, కమలగర్భునిఁ బ్రీతిఁ గని మ్రొక్కి యనిరి
యాయతచిత్తు లై యత్యుగ్రతపము, చేయుచునున్నాఁడు చెలఁగి కౌశికుఁడు
అతనిమనోరథం బర్ధి సిద్ధింప, మతి మెచ్చి తప మింక మాన్పకయున్న
నఘు విశ్వామిత్రునత్యుగ్రమైన, ఘనతరవహ్నిచే గాలు లోకములు
అన విని వారితో నప్పుడు కదలి, వనజాసనుఁడు వచ్చి వరదుఁడై నిలిచి
వినుము కౌశిక యింక విపరీతతపము, పనిలేదు చాలింపు బ్రహ్మర్షివైతి
వనిన గౌశికుఁడు బ్రహ్మాదిదేవతలఁ, గనుఁగొని పల్కె నక్కజమైన భక్తి
బ్రహ్మర్షిపదమేను బడసితినేని, బ్రహ్మపుత్త్రుఁడు లోకపావనమూర్తి
చిరపుణ్యశాలి వసిష్ఠుఁడు వచ్చి, యరసి నఁ బ్రహ్మర్షి వనకున్న నమ్మ
ననిన వసిష్ఠుని నబ్జసంభవుఁడు, ననిమిషులును బిల్వ నర్థితో వచ్చి
బలితంపుదపమున బ్రహ్మర్షివైతి, తెలిసితి మింక సందేహంబు లేదు
ముదమొప్పఁ జనుమన్న ముని వసిష్ఠునకుఁ, బదిలుఁడై మ్రొక్కి సద్భక్తిఁ బూజించె
నంత విశ్వామిత్ర నఖలదేవతలు, నెంతయు దీవించి యేగిరి దివికి
నారూఢపదుఁడు విశ్వామిత్రమహిమ, లారయ నిట్టిమహాద్భుతక్రియలు
అని పల్క రాముఁడు నాలక్ష్మణుండు, జనకాదులును సభాసదులు మోదించి
రిల్లడ జనకునియింట ను గ్రాఱు, డెల్లరెఱుంగ మున్నిడిన చాపంబు
కడఁకమై విఱిచి రాఘవుఁ డేపుమెఱసి, కడుమోదమున సీతఁ గైకొనునెల్లి
నని రసాతలమున కంతయుఁ జెప్పఁ, జనిన చందమున భాస్కరుఁ డస్తమించె
జనకు వీడ్కొని గాధిసంభవుఁడొక్క, యునికిపట్టున రామయుక్తుఁ డైయుండె

ననుపమ ప్రీతితో నా రా త్రి గడపి, యినుపొడుపున నిత్యకృత్యములు దీర్చి
జనకుచెంతకు రామసహితుఁడై పోయి, యనియె విశ్వామిత్రుఁ డంతయు వినఁగ
నినకోటిసమతేజు లీవిశ్వమూర్తు, లనఘుకీర్తులు వీ రనన్యగోచరులు
ఈపుణ్యధనులు నీయింటిలోనున్న, చాపంబు చూడంగఁ జను దెంచినారు

జనకుండు శివునిచాప మెఱిఁగించుట.

ఆవిల్లు దెప్పింపుమనవుడు జనక, భూవరుం డప్పు డద్భుతమంది పలికె
భవుఁ డంధకాసురభస్మాసురాది, దివిజారివరుల సాధించె నావింట
నుల్లోకుఁడై శివుఁ డుగ్రదానవులఁ, దొల్లి యనేకులఁ ద్రుంచె నావింట
విపులకోపాటోపవిభవుఁడై హరుఁడు, త్రిపురదుర్గములు సాధించె నావింట
నావింట మఱి దక్షయాగంబుఁ జెఱిచె, దేవేంద్రముఖ్యులఁ ద్రిదశులఁ దోలి
నియతాత్మ మాతాత నిమిచక్రవర్తి, నయనయాన్వితునకు నాఅవతరము
నగుదేవరాతుచే హరుఁడిచ్చెఁ దొల్లి, యగణితబలమైన యావిల్లు పిదప
నవియాదిగా నుండుననఘు మాయింట, విదితమై యావిల్లు వినుతులనొప్పి
జన్నంబుగావింప సమకట్టి యేను, సన్నుతనియతి భూస్థలిశుద్ధికొఱకుఁ
గ్రతుశాల దున్న నాఁగటిచాలులోన, నతులితంబుగఁ జాలునం దొప్పుమిగిలి
మందసంబును రాఁగ మది నుబ్బి చూచి, మందసంబును నేను మమత దీయంగ
నతివైభవంబుగా నందులో నపుడు, నతివ యొక్కఁతె పుట్టె నాశ్చర్యలీలఁ
బ్రీతితో సీతయఁ బేరొప్పఁ బెట్టి, యాతన్వి నాకూఁతురని పెంచుచుండ
నిల వసంతంబులనెలతీఁగెఁ బోలి, నళినారికళఁ బోలి నానాఁటఁ బ్రబలి
యింతయై యంతయై యెలజవ్వనమున, వింతయై యాయింతి వెలయుటఁ జూచి
తలకొని తరుణికై ధరణివల్లభులు, బలియులై యేతెంచి పడుచును దమకు
నడిగిన వారల కంటి నేనప్పు, డుడురాజబింబాస్య కుంకున గలదు
హరునివిల్లిది దీనినతిసత్త్వయుక్తిఁ, బెరిగి యేతెంచి మోపెట్టినఁ జాలు
నతనికి నాకూఁతు నబ్జాక్షి నిత్తు, నతిమోదమున నన్న నన్న రేశ్వరులు
నెత్తిన కడకతో నేతెంచి చాప, మెత్తఁజాలకపోదు రెందఱేనియును
ధనువెత్తఁజాలని ధరణీశులెల్లఁ, దనరారు సిగ్గునఁ దలలెత్తలేక
కూఁతు నిచ్చెదనని కోదండ మొకటి, బ్రాఁతిగా నెపమిడి భ్రమియించె మనల
జనకుఁ డాతని నింక సకలయత్నముల, నని నేసి సాధింతమని విచారించి
చనుదెంచి కోటపై సంవత్సరంబు, ఘనసైన్యములతోడఁ గడిమిమై విడియఁ
దగ మున్ను గూర్చిన ధాన్యాదులెల్ల, నొగిఁ దీఱు మదిలోన నొకటి చింతించి
వడి దేవతలఁ గొల్చి వారిచే నపుడు, వడసిన చతురంగబలముఁ గైకొనుచు
విడిసినబలమునై వీఁకతో నడువఁ, దొడరఁజాలక భీతితో కొంద ఱుడుగఁ
గొందఱు మాతోడ ఘోరాజిచేసి, చిందరవందరై చెడి వార లోడి
రక్కజమగుశక్తి నావిల్లు రాముఁ, డెక్కుపెట్టినఁ గూఁతు నెలమి నిచ్చెదను
విల్లున్నమందస వేగ హైమ్మనుచు, బల్లిదు లగువారిఁ బదివేఱఁ బనిచె

నది లోహమయమును నత్యాయతంబు, విదితాష్టచక్రంబు విపులంబు నగుచు
నమరెడుమందస మావింటితోడ, తమతమ సత్త్వము ల్దగఁగొని వాయ
కనకాద్రితోఁ గూడఁ గమలజాండంబు, గొనివచ్చుగతి నీడ్చుకొనివచ్చుదాని
జనకునంతఃపురచారులౌవారు, పనివడి దాదులు పఱతెంచి వేగ
జానకి నూర్మిళ జనకునిదేవి, కానంగఁ జనుదెంచి కని చెప్పి రెలమి
వినవమ్మ చెలులార విన్నపం బొకటి, మనరాజుసభలోన మఱి ముసులుండ
గాధినందనుఁడైన కౌశికు వెనుక, నరవరోత్తముల నాజానుబాహుల
నమరంగ దేవగంధర్వులకన్న, గొమరైనతేజంబు గొమరొప్పువారి
చెలువైనతేజంబు చెలఁగి వీక్షించి, యల వీరు లెవ్వార లని జనకుండు
అడిగినఁ గౌశికుఁ డతిహర్ష మాత్మ, నడరంగ దశరథు నాత్మజుల్వీరు
హరుచాప మెక్కిడ హర్షించి రిటకు, ధరణీశ తెప్పింపు తగువారిఁ బనిచి
యన నిట్లు కౌశికుననుమతిమీఱఁ, దనమంత్రులను బిల్చి ధనువు దేఁ బనిచె
సోరణగండ్లలోఁ జూడఁగవచ్చు, నారయ వేగ రండని నాతి పిలువ
కులము శౌర్యము రూపుగుణమును బొగడ, చెలఁగి చెవుల సుధ చిలికినట్లుండఁ
భ్రేమ వెగ్గలమైనఁ బృథ్విజకపుడు, రోమాంచమయ్యె నారూఢమై మేనఁ
బ్రియమును భయమును బిరిగొని పొదల, నయమెంచి తలవాంచి ననఁబోణియుండె
అలివేణి సిగ్గున నటఁ బల్కకున్నఁ, జెలువకుఁ బరిచర్యచేసిరి సఖులు
పన్నీట కుంకుమపదనిచ్చి యొకతె, చెన్నార మకరికల్చెక్కిళ్ల వ్రాసెఁ
దట్టుపునుంగును దగుచందనంబు, దట్టంబుగాఁ బూసెఁ దరళాక్షికొకతె
నుదుటఁ గస్తురిలేఖ నుతముగాఁ దీర్చె, నెపుటనద్దముఁ బెట్టె నెలనాగయొకతె
కుపులు నున్నగ దువ్వి కొప్పమప్పుచును, వియలందు నొకతన్వి వింతఁగాఁ దురిమె
వాసించుబొగాలు వడి నాకుమడుపు, లాసతీజనమణి కందిచ్చె నొకతె
అలినీలవేణికి నందంబుగాను, మొలనూలిగంట లిమ్ముల మ్రోయనిడియొఁ
గులుకుఁబొలిండ్లపై గొప్పనుత్యముల, విలసిల్లు హారముల్ వేసె నొక్కరితె
కాంత గట్టిన చంద్రకావిపల్వలను, వింతగానెఱి నొప్ప వెసఁ దీర్చె నొకతె
యీమాడ్కి చెలికత్తె లెలమిఁ గైసేయ, హేమపీఠంబున నెలమితోఁ నుండ
నప్పుడు కల్యాణి నవనినందనను, తప్పక వీక్షించి తల్లి దానపుడు
కనకసౌధగవాక్షకలితగా నపుడు, వనజాక్షిఁ దోడ్కొని వచ్చె నాయెడకు
నెప్పుడు వీక్షింతు మినవంశజాతు, నెప్పుడు గనుఁగొందు మేము రాఘవుని
అని వారలందఱు హర్షంబుతోడ, ఘనగవాక్షములందుఁ గనుఁగొనిరంత
రాముని లోకాభిరాముని దివ్య,ధామునిఁ గన్గొని తరలాక్షు లపుడు
ఘనశౌర్యరూపములో గలిగినవానిఁ, గనకచేలునిమాడ్కిఁ గళలొప్పువాని
శోకపుష్పలవిల్లుఁ బొనిపినవాని, జ్యాకిణాంకితహస్తజలజుఁడౌవాని
రూపంబులొక్కట రుచిరవర్ణముల, నేపార వేఱుగా నెన్నఁగవచ్చు
శ్రీపతియంశజుల్ క్షితిపాలసుతులు, భూపాలరత్నము ల్పాలుపాఱటెర

జనకజ దగు రామచంద్రున కిరవు, ఒనరు సౌమిత్రికి నూర్మిళ యనుచుఁ
దనుఁ గాకని వారు దగనెన్నికొనుచు, ననుపమప్రేమతో నటఁ జూచుచుండ
నమరేంద్రసభఁ బోలు నాసభనడుమ, నమరంగ మందసమటఁ జేర్చిరపుడు
సభలోన ననుపంగ జనకభూవిభుఁడు, శుభమూర్తినగ్గాధిసుతుని వీక్షించి
కిన్నరగంధర్వగీర్వాణయక్ష, పన్నగరాక్షసప్రభృతు లెవ్వరును
నెక్కు-వెట్టఁగఁజాల రీచాపమనినఁ, దక్కి-ననరులకుఁ దలపంగఁ దరమె
కౌశిక రామలక్ష్మణులకుఁ జూపు, మీశరాసన మన్న నెలమి నమ్మునియు
రామచంద్రుని జూచి రఘువంశవర్య, యీమహాధనువెత్తి యెక్కిడి తివియు
మాదివరాహమై యవలీల గోట, మేదినీతలమెత్తి మెఱసిననీకుఁ
దనర నీవిల్లెంత తలపోయ ననఘు, యని యిట్లు మునివరుఁ డానతిచ్చినను
మనువంశతిలకుఁడు మఱి వేగపుత్తు, నని మునిసభలోన నారాజు క్రియను
సౌమిత్రియును దాను జయ్యన లేచి, ప్రేమయుఁ దమకంబు పెనఁగొనుచుండఁ
జెలఁగుచుఁ దనమీఁదిచెఱఁగు రాఁదిగిచి, మొలనూలు బిగఁజుట్టి మోహనాకృతులఁ
దిరముగా నిగ్గులు దిశల శోభిల్ల, నరవింబలోచనుం డసమసాహసుఁడు
మొలనూలిగంటలు మురువుమించగను, మలఁగుచు నవరత్నమాలికల్వారల
బాహుపుర్లుంగరాల్పటుకంకణములు, బాహువులంగుళావళికాంతులీన
నమరంగఁ గర్ణభూషాదులకాంతి, కొమరారుచెక్కిళ్లు గుదిగొని మెఱయ
అలకలు పెడతలనట నృత్యమాడి, తళుకొందు బంగారుతనుకాంతులీన
కోటిమన్మథలీలఁ గొమరుదీపింప, నీటుగా నటువచ్చి నెఱయెల్ల రెఱుఁగ
జనకజుసభలోన జనుతంబైన, మనువంశతిలకుండు మందస దెఱచి
ధరణీతలంబెల్లఁ దనమీఁదనునిచి, చిరనిద్రసుఖయించు శేషాహి యనఁగఁ
గాలమేఘములోనఁ గదలనిరుచులఁ, దూలకపొలుచు విద్యుద్దండ మనఁగ
నిరుపమాకారత నిండారి యందుఁ, గర మొప్పు విల్లెత్తి గవిసెన వచ్చి

శ్రీరాములు శివునివిల్లు విఱుచుట.

గర్వించి తనునెత్తఁ గడఁగి యే తెంచు, నుర్వీశబలము లాహంతులుగ మ్రింగ
నరుణరత్నప్రభయనుమంటలొలుకఁ, బెరుఁగుచు నిలుచున్న పెనుచిచ్చువోలె
నక్క-జమగుశక్తి నావిల్లు రాముఁ, డెక్కు-వెట్టుచునుండ నెఱిఁగి కౌశికుఁడు
హరునిచాపము రాముఁ డతిసత్త్వయుక్తిఁ, బెరిగి నేఁడిదె యెక్కు-వెట్టుచున్నాఁడు
అదరకు భూదేవి యాత్మలో నీవు, చెదరి చలింపకు శేషాహి నీవు
కడఁక ధరింపుము కమఠేంద్ర నీవు, కడునేమరకుఁడు దిక్కరులార మీర
లని యని పల్కఁగ నామేటివిల్లు, గొనయమెక్కించి కైకొనక రాఘవుఁడు
తనబాహుసత్త్వంబు దర్పంబుమెఱసి, జనకునికనియె నాచాపంబు చూచి
యిది చాలఁ జులకన యిది చాలఁ బ్రాఁత, యిది చాల నిస్సార మిది చాల నలఁతి
తెగఁగొన నిలువదు దీని నాయెదుటఁ, బొగడితి పలుమాఱు భూపాలయనుచు
సురలు ఖేచరులు భూసురులు కిన్నరులు, నఘలును నృపతులు నలిఁ బర్వి చూడ

నెడపక తనజయం బెల్లెడఁ జాటు, వడువున విలు గుణధ్వని చెలంగించి
సీతగుణంబులు చెవిసోఁకెననఁగఁ, జేతివింటిగుణంబు చెవిసోక దిగువ
వడి రక్కసులపట్టు వదలెనన్నట్టు, పిడిపట్టు వదలినఁ బెకలి వేఁటు త్తి
వెళ వెళధ్వనులును బెటబెటధ్వనులు, కలయ దిక్కులద్రువఁగాఁ బెల్లు విఱిగె
విఱుగ రాజన్యులవిపులమానములు, పఱియలువాతె భూభాగమంతయును
జిదిసె దిగ్గజములు శేషాహి మ్రొగ్గె, బెదరె భూతములు కంపించె లోకములు
జనకుఁడు రామలక్ష్మణులును గాధితనయుండు దొగిఁ దక్కుఁ దక్కినవారు
బిట్టుల్కి మూర్ఛిల్లి పృథివిపైఁ బడిరి, నెట్టనఁ బొడము నానిష్ఠురధ్వనికి
జనకభూవిభుఁ డంత సంతోషమంది, ఘనవిస్మయము నొంది కౌశికుఁ జూచి
నామాట దప్పక నాముద్దుకూఁతు, నీమహితాత్మున కిచ్చెద నింకఁ
దడయక పెండ్లికి దశరథాధీశుఁ, గడుసంభ్రమమున నిక్కడికి రప్పింతు
నని దశరథునకు నత్తెఱంగెల్ల, వినుపించి తోడ్తెర వేడ్కతో నపుడు
తనయాప్తమంత్రులఁ దడయక పిల్చి, పనిచిన పనివూని పరువడి నేగి
జవనాశ్వములమీఁద సాకేతపురికి, దివసత్రయమున నెంతే వేగ వచ్చి
తనయులనేమంబు దలపోసిపోసి, వనపుచునున్న యవ్వసుధేశుఁ గాంచి
వినతులై జనకభూవిభుఁ డంపినట్టి, జననుతవస్తువుల్ సన్నిధి నునిచి
నీకుమారుఁడు శౌర్యనిధి రామచంద్రుఁ, డాకౌశికునియాగ మర్థితోఁ గాంచి
జనకుజన్నము జూడఁ జనుదెంచి యందు, మునులు రాజన్యులు ముదమంది చూడ
ధర సురాసురులకు ధరియింపరాని, హరువిల్లు మోపెట్టి యవలీల విఱిచె
విఱిచిన జనకభూవిభు. డిచ్చె సీత, నఱలేక తనకూఁతు నారాఘవునకుఁ
బ్రియమునఁ బెండ్లికిఁ బిలువఁ బఁ త్తెంచె, రయమున విచ్చేయు రాజన్యచంద్ర
యనవుడుఁ దనమది నానందమంది, జనపతి పెండ్లికిఁ జాటింపఁ బనిచి
జనకుమంత్రులకు నుత్సవమొప్ప నిచ్చె, ఘనరత్నభూషణకనకాంబరములు
అఱ లేనికులగురుఁ డైనవసిష్ఠుఁ, దెఱఁగొప్పఁ దా వామదేవు జాబాలి
ఘనునిఁ గశ్యపుని మార్కండేయు నత్రి, దనరు బాంధవులను దనయమాత్యులను
నిమ్ములఁ బిలిపించి యిట్లని పలికె, సమ్మదం బడర విశ్వామిత్రునొద్దఁ
దేజంబుతోడ విదేహదేశమున, రాజిలుచున్నారు రామలక్ష్మణులు
అందు రాముఁడు రాజులందఱు చూడ, నెందు నసాధ్యమౌ నిందుశేఖరుని
చాపంబు విఱిచిన జనకుండు సీత, నేపార రామున కీనిశ్చయించి
యెలమిఁ బెండ్లికిని మిమ్మేగుదెమ్మనుచుఁ, బొలుపార నిట వీరిఁ బుత్తెంచినాఁడు
జననుతం బగుఁగదా జనకుసంబంధ, మనిన నందఱు మెచ్చి రమ్మనినాఁడు

దశరథుఁడు మిథిలకుఁ బోవుట.

మొగి వసిష్ఠాదిసమ్మతులతోఁ గూడఁ, దగు బంధురాజన్యతతులతోఁ గూడ
రమణీయదివ్యాంబరములతోఁ గూడ, విమలమౌక్తికవజ్రవితతితోఁ గూడఁ
గరిరథభటతురంగములతోఁ గూడఁ, బరమాప్తవరమంత్రిపతులతోఁ గూడ

వినుతపుణ్యాంగనావితతితోఁ గూడ, ననుపమవైభవంబలరఁ గైసేయఁ
గరమొప్ప రథమెక్కి కల్యాణమునకు, నరనాథతిలకుఁ డానందముప్పొంగఁ
గడుఁగొలంకుల గజస్కంధంబులందుఁ, గొడుకులు ముత్యాలగొడుగులనీడఁ
బరమసమ్మదమున భరతశత్రుఘ్నుల్, లిరువురు గొల్చి రా నేపుదీపింపఁ
గ్రందుగా నిండి మంగళతూర్యకోటు, లందంద మొఱయ మహాభూతి మెఱయ
నెడనెడ విడుచు లనేకవస్తువులు, నడపింప మంత్రులు నాల్గుదినములఁ
జనియెను మిథిలకు జనకుండు నంత, నినకులాధిపునకు నెదురుగా వచ్చి
కొనిపోయి వేడ్కలు కొమరొత్తనపుడు, జనపతి కుచితోపచారములు సేసి
మునివరనివహంబు ముదమందనప్పు, డనియె మహానందమలర నాతనికి
నాహూతు దశరథనరనాథ యేను, నీకుమూయనికిచ్చి నెమ్మిఁ బెండ్లికిని
నిటు పిల్వఁబంచిన నీవు విచ్చేసి, తటుగాన నేను కృతార్థుండనైతి
నీవసిష్ఠమహాముసీంద్రుఁ డీవాఁ, దేవాదిమునులు నే తెంచుటఁజేసి
నాకోర్కి సిద్ధించె నాజన్మ మలరె, నాకులం బతిపావనంబయ్యె నేఁడు
రవికులోత్తములైన రాజులతోడి, యవిరళసంబంధమది నాకుఁ గలిగె
నెల్లి పెండ్లికి లగ్న మిష్టులఁ బిలిచ, తెల్లంబుగాఁ బ్రవర్తింపుఁడు ప్రీతి
ననవుడు దశరథుం డట్ల గాకనుచు, ననురాగ మొంది యత్యంతము ప్రీతి
జనకుఁడమర్చిన సదనరాజమున, ననుర్కి వసియించె నంత నచ్చటికిఁ
గడుఁ బ్రీతిరామలక్ష్మణులతోఁ గూడ, నడరి విశ్వామిత్రుఁ డరుగుదెంచుటయు
ననఘుండు దశరథుం డమ్మహాముసికి, వినతుఁడై పూజించి వినయంబుతోడఁ
దనరార నీదయ ధన్యుండనైతి, ననఘాత్మ యన విని యక్కౌశికుండు
అకలంకచరితుండవైన నీవనఘ, సుకృతంబు గావించి శుద్ధుండవైతి
రవికులోత్తముఁ డైనరాముండు పుత్త్రు, డవుట విశేషించి యధికపుణ్యుఁడవు
క్రతురక్షణార్థమై కడఁగి రాఘవుల, హితబుద్ధి నీవె మాకిచ్చితి నాఁడు
నెమ్మదినున్నారు నీసుతుల్వీరె, నెమ్మిఁ గన్గొనుమన్న నృపతి కాసుతులు
నాలోన మ్రొక్కిన నలరి దీవించి, యాలింగనము చేసె ననురాగమెసఁగఁ
జనకుండు నాదివసంబున నంతఁ, దనయాగకర్మ మంతయు నెఱవేర్చి
యలరువేడుక నినుఁ డస్తాద్రికరుగఁ, బొలుపొంద నారాత్రి పోయినపిదప
మఱునాఁడు కల్యాణమండపవేది, నెఱయ మంత్రులతోడ నిండుఁ గొల్వుండి
యిమ్ములఁ దనపురోహితు శతానందు, సమ్మదంబునఁ జూచి జనకుండు పలికె
ననఘాత్మ మాతమ్ముఁ డగుకుశధ్వజుఁడు, కనుఁగొనవలయు నీకల్యాణమతఁడు
తిరముగా నిక్షుమతీతీరభూమిఁ, బొరినొప్పు సాంకాశ్యపురి నున్నవాఁడు
అతనిఁ దోడ్తేర నీవరుగు మనంగ, నతిజవాశ్వములతో నమరుతేరెక్కి
యతివేగముగ నేగి యాకుశధ్వజుని, నతులితంబుగఁ గని యర్థిమైఁ జెప్పి
జనకపుత్రికి నేఁడు జననాథవర్య, మనువంశచంద్రుఁడౌ మనరామునకును
ఘనముగఁ బెండ్లియాఁ గడువేడ్కతోడ, జనకుండు యత్నంబు జరపంగఁ గోరి

పతి నిన్నుఁ దోడ్తేరఁ బనిచె నన్నిపుడు, సతులతో హితులతో సకలసైన్యయుతిఁ
గదలుద మిప్పుడే ఘనత మిథిలకుఁ, బదమని చెప్పినఁ బరఁగ నందఱును
దనరారువేడుకఁ దగ రథంబెక్కి, తనయాద్వయముతోడఁ దానేగుదెంచి
యనఘమానసుఁడు శతానందునకును, జనకభూవిభునకు సవ్వడిమ్రొక్కి
యెలమి నమ్మానవాధీశుసమ్మతిని, నలువొప్ప సింహాసనమునఁ గూర్చుండె
నంత సుధామాఖ్యుఁ డనుమంత్రి జనకుఁ, డెంతయు ముదమున నీఱుంచి నీవు
చని వసిష్ఠునితోడ సచివులతోడఁ, దనయులతోడ నాదశరథేశ్వరుని
వెరవారఁ దోడ్కొని వేగ రమ్మనిన, నరిగి యాతఁడు భ్రీతి నమ్మహీపతికి
వినతుఁడై యిట్లను వేడ్కతో నన్ను, జనకుఁడు పుత్తెంచె జనలోకనాథ
నీయుపాధ్యాయులు నీతనూభవులు, నీయమాత్యులు నీవు నేతేరవలయు
ననిన నాదశరథుం డందఱితోడఁ, జని సుఖాసీనుఁడై జనకుతో ననియెఁ
బరఁగ వసిష్ఠుండు పరమదేవతయు, గురువు నీయిక్ష్వాకుకులమున కెల్ల
సర్వజ్ఞుఁ డగుట నీసంయమీశ్వరుఁడు, సర్వకార్యములకుఁ జాలు మాకనిన
నప్పుడు దశరథునన్వయక్రమముఁ, జెప్ప భావించి వసిష్ఠుఁ డిట్లనియె
నరనాథ విను నిర్గుణబ్రహ్మమైన, హరి సగుణైకలీలాకృతిఁ దాల్చి
నిజలీలకై నాభినీరజంబందు, నజునిఁ గల్పింపంగ హరి కజుఁ డొదవె
భూమీశ బ్రహ్మకుఁ బుట్టె మరీచి, యామరీచికిఁ బుట్టె నవనిఁ గశ్యపుఁడు
నతని కర్కుఁడు సుతుఁ డాజగదాప్తమతికి వైవస్వతమనువు నందనుఁడు
నతనికి నిక్ష్వాకుఁ డనురాజరత్న, మతనికిఁ గుక్షినా నాత్మసంభవుఁడు
కుక్షిఁబుట్ట భూనాథుకొడుకు వికుక్షి, యక్షరాత్ముఁడు బాణుఁ డతనినందనుఁడు
నతనికి ననరణ్యుఁ డతనికిఁ బృథుఁడు, చతురమానసుఁడు త్రిశంకుఁ డాతనికి
నతనికిఁ దనయుండు నాహరిశ్చంద్రుఁ, డతనికి లోహితాస్యాఖ్యపుత్త్రుండు
అతనికి దుందుమారావనీనాథుఁ, డతనికి యువనాశ్వుఁ డనునరేశ్వరుఁడు

వసిష్ఠుఁడు యువనాశ్వునివృత్తాంతముఁ జెల్పుట.

నతనికిఁ బ్రియభార్య లతిరూపవతులు, సతు లిద్దఱుకుఁ బుత్త్రసంతతి లేమి
నంతట నారాజు నఖిలసస్తునుల, సంతతికొఱకునై సరగ రప్పించి
యామహాత్ములకెల్ల నర్ఘ్యపాద్యములు, ప్రేమముతో నిచ్చి ప్రియవాక్యములను
ఘనులార నన్నును గణనించి మీరు, దనయుల నాకును దయసేయవలయ
ననిన విన్నవించిన నారాజునకును, ననువొంద నమ్మును లఘు డిట్టు లనిరి
వింద్రయాగము సేయు మవనీశ భక్తి, సాంద్రంబుగాఁ బుత్త్రసంతతి గలుగు
నన జన్నమున కప్పు డఖిలవస్తువుల, ననువొందఁ దెప్పించె నాఋణంబునను
నైంద్రయాగంబను నామఖం బఘుడు, సాంద్రానుమోదుఁడై సంయమీశ్వరులు
పుత్త్రలాభంబునై పొలుపొంద నంత, జిత్రయజ్ఞము దారు సేయఁగ నందు
జలములు మంత్రించి జలకుంభములను, నలరార నియతిచే నటు దాఁచియుండ
ధరణీశుఁ డారాత్రి దప్పితో నంత, మఱుపొంది యాయజ్ఞమందిరమందుఁ

గలశంబులో నీళ్లు గ్రక్కునఁ ద్రావ, జలహీన మగుకలశంబును జూచి
యెవరు ద్రావిరి జలం బెటుపోయెననుచు, ప్రవిమలాత్ములు వారు భావనిరీక్ష
నరసి యాభూపతియే యానీరు ద్రావ, టకుఁగి చోద్యంబంది యిది దైవమాయ
యని చూచుచుండంగ నానృపాలకుఁడు, ఘనమగుగర్భంబు కడువేగ దాల్చె
గర్భమంతటఁ బడి కడుచోద్యమలర, నర్భకుం డుదయించె నారాజు చచ్చెఁ
గడఁగుచు ఋషులెల్లఁ గడుదుఃఖమంది, సడలని యమ్మంత్రసామర్థ్యములను
బనివడి యువనాశ్వ బ్రతికించిరంత, ననుపమశుభమూ ర్తి యై యుండి యతఁడు
వరుసతోడుతఁ జక్రవర్తిచిహ్నంబు, లరుదార నుండెడి యాపుత్రుఁ జూచి
యితఁ డేడుదీవులు నేలునటంచు, చతురత ఋషులెల్ల సంతోషపడిరి
అలయువనాశ్వుండు నామానిజసుల, కెలమితో ధనరాసు లిచ్చినఁ జనిరి
తల్లియే లేనికతంబున బాలుఁ, డల్లన నాఁకొని యట నేడ్చుచుండ
సుస నాయింద్రుండు వచ్చి తానప్పు, డరయంగ నాశిశు వాఁకలిదీరఁ
బెనుపొందఁగా నోరఁ బెనువ్రేలు వేగ, ననిచిన నమృతంబు నొయ్యనఁ ద్రావ
సుధ గ్రోలుటయుఁ జేసి శుభయుతు వేరు, బుధులతో మాంధాత భూమీశుఁడ
నతనికి నామధేయంబటు చేసి, యతివేగమునఁ బోయె నాబిడౌజుండు [నుచు
అంత నామాంధాత యలపూర్ణచంద్రు, నంతటి ప్రభతోడ నతిశయిల్లుచును
రూఢిగా యీవసనారూఢుఁ డైనంత, గాఢశౌర్యస్ఫూర్తిఁ గడుఁ దేజరిల్లి
రావణాదుల బహుచరణముల గెలిచి, భూవలయంబెల్లఁ బొందుగా నేలి
విష్ణునిభక్తుఁడై వెలసి యాగములు, జిష్ణుబలంబునఁ జేయుచునుండె
నారాజునకు విమలాంగి యన్సతికి, భూరితేజోయుతుల్పుత్రరత్నములు
నరయంగ ముచుకుందుఁ డాసుసంధియును, దరుణు లేబండ్రును దగ జనియింప
సుతుల ప్రాయంబు సొరిదివచ్చినను, ముదమున సౌభరిమునిపతికిచ్చె
నతివలకగ్రజుఁ డగుముచుకుందుఁ, డతివేగ హరిభక్తుఁ డై యేగె దివికి
నాతనిసోదరుం డాసుసంధియును, నాతతపుణ్యాత్ముఁ డై భువి నేలె
నతనికి ధ్రువసంధి యనురాజు పుట్టె, నతఁడు ప్రసేనజి!త్తనురాజుఁ గనియె
దొరయఁ బ్రసేనజిత్తుకు భరతుండు, నరయ నాభరతున కసితుండు పుట్టె
నతఁడు రాజ్యమునేయ నాతనిశత్రు, లతులపరాక్రములైన హైహయులు
దారుణాకారులు తాళజంఘులును, నారంగ నేనబిందనువాఁడు గూడి
యతిఘోరయుద్ధంబు నత్తఱిఁ జేసి, యతనినె యనిలోన హతుఁజేసి చనిరి
అంత నాతనిసతు లతిదుఃఖమంది, మంత్రులరాజ్యంబు మఱిఁ దీర్వనునిచి
మేలిమినుండిరి మెలఁతలిద్దఱును, కాళిందియనుసతి గర్భమైయున్న
మేలోర్వలేక యామెలఁతలందొకతె, చాలంగ సవతిమచ్చరమునఁ జేసి
గర్భిణి యైయున్న కాళిందికపుడు, గర్భంబుఁ జెరుప నొక్కఁట విచారించి
యోర్వక విషము ప్రయోగించె నంత, నావిషమున గర్భమట వీడిపడక
తా వేగి వేదన తల్లడంబంది, యావనితయుఁ దుషారాద్రికిఁ జనుచు

చ్యవనుని గాంచి యాసంయమీంద్రునకు, నవిరళభక్తితో నల్లన మ్రొక్కి
తనదు వృత్తాంతంబు తగ విన్నవింప, వినియు నాపుత్త్రివి వెఱవకు మనుచుఁ
బొందారఁ గరుణతోఁ బూఁబోడి నెత్తి, కందువదృష్టిని గడఁగి లోఁజూచి
ప్రతిపక్షదమనుండు పరమధార్మికుఁడు, నతులతేజుండు మహోత్సుండు నగుచు
వరకీర్తివంతుండు వంశవర్ధనుఁడు, పరమరూపంబున భాసిల్లు జగతిఁ
బొగడొందఁ గరముతోఁ బుత్త్రుండె నీకు, నగుఁగాక గాళింది యనుచు దీవించె
వలగొని యమ్మునీశ్వరునకు మ్రొక్కి, యెలమితోఁ దనయింటి కేగి యాయువతి
యతిముదంబునసున్న యాశుభాంగికిని, సుతుఁడుదయించెను శుభముహూర్తమునఁ
గరమొప్పఁ బుత్త్రునిఁ గాంచి కాళింది, గరము సమ్మదమందెఁ గడుసంభ్రమమున
నాతండు శత్రులనణఁచి రాజ్యంబు, చేతోముదంబునఁ జేయుచునుండ
సతతంబు విలసిల్లె సగరుఁడ ట్లేర, నతనికిఁ దనుజస్తుఁ డసమంజసుండు
అతనికి సుతుఁడయ్యె నంశుమదాఖ్యుఁడు, డతనిపుత్త్రుండు దిలీపావనీనాథుఁ
డతనికున్న తపుణ్యుఁ డగుభగీరథుఁడు, సుతుఁ డాతనికిఁ గకుత్స్థుండను రాజు
నతనిసూనుఁడు రఘువనమహీపాలుఁ, డతనిపుత్త్రుండు పురుషాదకుం డగుచుఁ
గమనీయసితకీర్తి కల్మాషపాదుఁ, డమర శంఖణుఁ డయ్యె నతని కాతనికి
సుతుఁడు సుదర్శనక్షోణీతలేశుఁ, డతనితనూజస్తుఁ డగ్నివర్ణుండు
అతనికి ఋతుపర్ణుఁ డతనికి మరువు, అతనికి శీఘ్రగుం డతనికి మనువు
సుతుఁడయ్యె నంబరీషుం డనురాజు, సుతుఁ డాతనికి జనస్తుత్యుండు నహుషుఁ
డతనికి సుతుఁడు యయాతి యట్టేటి, యతనికి నాభాగుఁ డాతని కజుఁడు
అతనికి దశరథుఁ డనఘు నీపుణ్యు, సుతుఁడయ్యె సఫలనిస్తులమనోరథుఁడు
రాముఁ డీదశరథరాజతనూజుఁ, డేమని వర్ణింతు నింక నేనధిప
యితనికి నీకూఁతు నీఁగంటి వీవు, కృతకృత్యుఁడవు శుభాంకితమయ్యెఁ గులము
అని యిట్లు రఘువంశ మభిసుతిసేయ, విని శతానందుండు విమలమానసుఁడు
జన కానుమతి సభాసదులెల్ల వినఁగ, మునివసిష్ఠునిఁ జూచి ముదమొప్పఁ బలికె
మునినాథ మీచేత ముదమార వింటి, ననఘాత్ము దశరథుననన్వయక్రమము
సన్నుతికెక్కఁ నే జనకునన్వయము, చెన్నగు మీకేను చెప్పెద దాని

శతానందుఁడు జనకునివంశక్రమంబు చెల్పుట.

సద్విజపరమహంసప్రతిపాద్యుఁ, డద్వితీయబ్రహ్మ మైనయచ్యుతుని
నాభిసరోజంబునను బ్రహ్మ పుట్టెఁ, నాభూతనిర్మాత యగుథాతవలనఁ
బుట్టె మరీచి యాపుణ్యవర్తనుని, పట్టియై కశ్యపబ్రహ్మ జనించె
నతనికి దిననాథుఁ డాత్మజుండయ్యె, మతిమంతుఁ డతనికి మనువు జన్మించె
నమ్మను వచ్యుతధ్యానకాలమునఁ, దుమ్మగ వైవస్వతుఁడు తుమ్మువలన
నిర్మలాచారుఁడు నీతికోవిదుఁడు, ధర్మశీలుఁడు జగద్ధరితమానితుఁడు
విమలమూర్తి త్రిలోకవిశ్రుతకీర్తి, నిమి యనురాజు మానితతేజుఁ డొప్పె
నతనిపుత్త్రుఁ డుమిథి యతనికి జనకుఁ, డతని కుదావసుం డమ్మహీజాని

తనయుండు నందివర్ధనుఁడు సుకేతుఁ, డనువిభుఁ డతనికి నమ్మహాత్మునకు
రాజర్షియగు దేవరాతుఁ డెల్లెడల, రాజిల్లె మఱి బృహద్రథుఁడు తత్సుతుఁడు
నతనినందనుఁడు మహావిభుఁ డతని, సుతుఁడయ్యె సుధృతి యాసుధృతికి ధృష్ట
కేతుఁ డాతని కురుకీర్తి హర్యశ్వుఁ, డాతనికిని మరుం డామరువునకు
సుతుఁడు ప్రతీంధకక్ష్మోణిశుఁ డతని, సుతుఁడు కీర్తిరథుండు సుతుఁడావిభునకు
దేవమీఢుండు తదీయుఁడౌ విబుధుఁ, డావిబుధునిపుత్రుఁ డామహీద్రునకుఁ
గీర్తిరాతుఁడు వానికిని మహారోముఁ, డార్తిమారుఁడు వాని కాస్వర్ణరోముఁ
డాస్వర్ణరోముండు హ్రస్వరోమాఖ్యు, భాస్వరగుణశాలిఁ బడసె నాతనికి
జనకభూపాలకుశధ్వజుల్వీరు, జనియించి రిపువురు సౌజన్యధనులు
జనకుఁ డంతట మహీజనులఁ బాలింపఁ, గని యొక్కనాఁడు సాంకాశ్యభూవిభుఁడు,
ధన్యవిక్రముఁడు సుధన్వుఁడన్వాఁడు, సైన్యసమేతుఁడై చనుదెంచి మిథిల
సీతాసమేతంబు శివునివిల్లడుగ, దూతఁ బుత్తెంచినఁ ద్రోపించె వెడల
పైవచ్చి హరునిచాపంబు సీతయును, గావలెనని ఘోరకలహంబుఁ జేయ
జనకుండు సంగరస్థలి వానిఁ గూల్చి, తనతమ్ముఁ బూన్చె నద్ధరణికి ననుచు
జనకుఁ డాదిగ వంశజాతులందఱికి, జనకనామము ప్రశస్తము ధాత్రిలోన
నిమివంశమునఁ బుట్టు నృపతులందఱును, సమధికయోగవిజ్ఞానసంపదల
స్థిరజీవులటుగానఁ జెచ్చెరవీరి, తరమును గొంచెమై తగును లెక్కకును
జనకునివంశంబు సద్వర్తనంబు, గొనియాడి యాసీతగుణమును బొగడి
విశదప్రతాపుని విమలభాషణుని, దశరథుఁ గనుఁగొని దశరథాధీశ
నీతనూజునిరాము నిత్యాభిరాము, సీతతోడుతఁ బెండ్లి చెలువొప్పఁజేసి
యలఘుకీర్తులఁ బొందుమను శతానందు, పలుకుల దశరథపతి యుత్సహించి
ఘనుఁడావసిష్ఠుని గాధినందనునిఁ, గనుఁగొని వారితోఁ గడువేడ్కఁ బలికె
చారువిచారు నీజనకభూదారు, మీరడుగుండు సౌమిత్రి కూర్మిళను
బ్రకటగుణోత్తరు ల్భరతశత్రుఘ్ను,లకుఁ గుశధ్వజనృపాలకునికూఁతులను
అన వారు జనకున కత్తెఱంగెల్ల, వినిపించి యనుమతి వేవేగ పడసి
జనకునివాక్యము ల్సకలంబు వేడ్కఁ, దనరారఁ జెప్పి రాదశరథుతోడ
ననురాగముప్పొంగ నామనునాఁడు, ఘనశుభగ్రహదృష్టి గలుగుటఁజేసి
పనివడి యుత్తరఫల్గునియందె, జనకుండు లగ్ననిశ్చయము నేయించి
పురమును దనమంతిపురముఁ గైసేయఁ, బరిచారకుల వేగ పంపిన వారు
గంధకస్తూరికాకలితాంబుపూర, గంధిలసకలనూర్ధరాంగణంబు
చీనిచీనాంబరశ్రేణివితాన, నానామణితోరణధ్వజాంచితము
ఫలభారకమ్రరంభాస్తంభపూగ, కలితప్రతిద్వారకదళీంతరంబు
సాంకవలిప్తవిస్తారవితర్ది, కాంకితరంగవల్ల్యాదిశోభితము
మణిశాతకుంభకుంభవితర్కితార్క, గణసౌధగోపురోత్కరశిరోగ్రంబు
దీపితమాణిక్యదీపసాంద్రాణి, ధూపపుష్పకలాపధూర్వహణంబు

నై పురమెల్లెడ నలరఁ గైసేసి, నైపుణి మెఱసి యంతగపురంబంతఁ
గరమొప్పఁ గైసేసి కల్యాణవేది, విరచింపుఁడన శిల్పవేదులంతయును
బచ్చతాజగతిపైఁ బసిడికంబములు, మెచ్చుగా నిల్పి యామీఁద నీలంపు
బోదెలు కురువించుముల దూలములును, పాదుగా నిడి తీరుపడఁ జొక్కఁడంపఁ
గోమేధికంబుల కొణిగెలు బరివి, గామల్చి పై వజ్రకాండమొసంగి
హాటకమణిమయాయతకవాటములు, వాటంబుగా నాల్గువాకి ళ్లమర్చి
అందుల బంగరుహారువుచిత్తరువు, లందంబుగాఁ దీర్చి హరినీలమణుల
గమిగమిచిన పటికంపుసింగముల, గమకమా సోపానగతులేర్పఱించి
కలితలామజ్జకకాయమానములు, కలువడంబులు డంబుగాఁ జుట్టి కట్టి
యాలోననే కాండమా బలుపచ్చ, మేలిపెండ్లియరుఁగు మృగనాభి యలికి
ముత్తెంపునిగ్గుల ముగ్గులేర్పఱిచి, చిత్తజజనకలక్ష్మీవివాహంబు
గుజరాతికెంపులగోడ లిఖింపఁ, బ్రజలకుఁ గన్నులపండువై యుండె
అంత వసిష్ఠవిశ్వామిత్రమునుల, సంతతపుణ్యుల జనకుండు చూచి
మీర లయోధ్యకు మిథిలకుఁ గర్త, లేరూపమునుచితమా నిటమీఁదిపనులు

దాశరథుల నలంకరించుట.

అది నేయుదురుగాక యనవుడు వారు, చదురొప్ప దశరథజనపాలచంద్రు
కొడుకుల నల్వురఁ గొమరొప్ప నప్పు, డెడతెగనట్టి యాయెల్ల వాద్యములఁ
బాటలు పాడుచుఁ బరఁగనంగనలు, తేటగా నందఱు తెచ్చి పీఁటలను
గూర్చుండఁ దలలంటి కుదురుగ వార, లేర్చినల్వులుపెట్టి యెంతయుఁ బ్రీతి
స్నానముల్ సేయించి చక్కఁగా నుదుట, మానితతిలకంబు మఱి భూషణములు
చీనాంబరంబులు చెలువొప్ప నిచ్చి, నానావిధంబుల నలువుగఁ బొంగి
దశరథుభార్యలు దశరథేశ్వరుఁడు, విశదప్రతాపుండు వేడ్క నుప్పొంగి
సకలభూషణములు సరసతఁ బెట్టి, యకలంకమతితోడ నంతటనుండి
యాయతశుభమైన యభ్యుదయంబు, సేయింప నర్థితోఁ జేసె నవ్విభుఁడు
ఎక్కుడుసంతోష మెసఁగఁ జిత్తమున, నొక్కొక్కసుతున కభ్యుదయంబుకొఱకు
వెలయంగ నన్నియు వేదోక్తయుక్తి, గలయఁ బదాఱులఱేలధేనువులను
గలధౌతఖురములు కనకశృంగములు, తలకొని చెలువొందు తామ్రపుచ్ఛములు
దొరయమించిన కాంస్యదోహళంబులును, వరుస వేష్టించిన వరవస్త్రములును
గలిగి సవత్సలై కరమొప్పువాని, లలిభూసురోత్తములకు భక్తి నిచ్చి
మఱియు నసంఖ్యాతమహిత హేమములు, తఱుచుగా నంతట దక్షిణ లొసఁగి
భూదానవసుదానములు మొదలైన, వేదోక్తదానము ల్వోర్వోఱ నొసఁగెఁ
దదవసరమున యుథాజిత్తు ప్రేమ, తుదమీఱఁగా భరతునిమేనమామ
తనతండ్రి కేకయధరణీశ్వరుండు, మనుమని భరతుని మైత్రిఁ దోడ్తేరఁ
దను నంపఁగా నయోధ్యకు వచ్చి యచటఁ, దనయులపెండ్లికి దశరథేశ్వరుఁడు
జనకునివీటికిఁ జనుట యెఱింగి, యనుక్తి వేవేగ యచటి కేతేర

దశరథుం డతని నాదృతిని బూజించి, కుశలంబులెల్లఁ బేరొక్కనుచుండె నంత
మఱునాఁడు స్నాతకమహితకృత్యములు, తఱితోడఁ గావించి తమ్ములుఁ దాను
రాముఁడత్తఱి దశరథునొద్ద నిలువ, శ్రీమాఱు నతనిఁ గైసేయింప నృపుఁడు
నారామునౌఁదల నమరెఁ గిరీట, మారోహణాద్రిశృంగాగ్ర మో యనఁగ
బద్ధకంకణుఁ డయ్యె భక్తులఁ బ్రోవ, సిద్ధమన్నట్లు దాల్చెను గంకణములు
ఎద మున్ను పుట్టిన యిందుదీధితులు, పొదలె నేఁడన హారములు చెన్ను మీఱఁ
దనకనకాంబరత్వము భూమిఁ దెల్పె, ననఁ గనకాంబరం బలరారెఁ గటిని
గట్టరావణునిచేఁ గాసిల్లినట్టి, యష్టదిక్పాలురయశము లిర్వంక
మాఁక్తికచ్ఛలమున మనవులు దెల్పు, యుక్తిమైఁ జొక్కట్టు లొప్పె వీనులను
వదనశృంగార మీవైఖరి నొప్పఁ, బొదలినఁ గస్తూరిబొట్టు చూపట్టెఁ
బదపడి లక్ష్మణభరతశత్రుఘ్ను, లుదయార్కతేజు లొండొరులు వేర్వేఱఁ
గుండలకేయూరకోటీరహార, మండనావళి సుకుమారదేహములు
గైసేయ నందు దిక్పతులమధ్యమున, వాసవుండన రామవల్లభుం డొప్పె
అంత నక్కడ జనకావనీనేత, కాంతిమై నలువురఁ గన్యకామణులఁ
గైసేయ సైరంధ్రికలఁ బంప వారు, భాసురమణిపీఠిపై వారి నునిచి
వేరటాండ్రొగిఁ బాడు పెండ్లిపాటలకు, శారికాకీరము ల్సందడిసేయఁ
గుంకుమకస్తూరిగోరోచనంబు, సంకుమదంబువాసనగంధవడియు
నలుగురికొక్కట నలుఁగులు పెట్టి, కలమృదుధ్వనులఁ గంకణములు మెఱయ
కురుల సంపెఁగనూనెఁ గూర్చి యింపొంద, హరిచందనంబుల నటకలు పెట్టి
ఘనసారసురభినఖంపచాంబువుల, జనకపుత్రికలకు జలకముల్దీర్చి
జిలుఁగులఁ దడియొత్తి చెంగావివన్నె, చలువపావడలపై జాళువాసరిగె
కొంగులనొప్పుదుకూలముల్గట్టి, శృంగారములు గుప్పఁ జేసిరో యనఁగ
గొప్పగా నొప్పుగాఁ గొప్పలమర్చి, విప్పుగా జాజిక్రొవ్విరు లందుఁ దుఱిమి
పచ్చకప్పురముతోఁ బన్నీటితోడ, పచ్చికస్తురికలపము గూర్చి యలఁది
బంగారుసరిగె గన్పడు కుట్టుపసుల, కంగులఱయికలు కనుపట్లఁ దొడిగి
చనుకట్లమీఁదఁ బచ్చలబన్నసరము,లును హారహారంబులును బొందుపఱిచి
ముద్దుమోములకొక్క ముఱువుగాఁ గోర, దిద్దుచుఁ గస్తూరితిలకముల్దీర్చి
చెక్కుల మకరికల్చిత్రించి గొప్ప, ముక్కర ల్నాసాగ్రములఁ గీలుకొల్పి
మగరాలతళుకుఁగమ్మలును గట్టాణి, బొగడలు చుఱుకుఁగెంపులబవిరెలును
బచ్చలకడియము ల్పత్తరాగములు, గ్రుచ్చిన మొలనూళ్లు గోమేధికముల
యందియల్ మొదలైన హారభూషణము, లందంబుగాఁ జేర్వ నపుడు కన్యకలు
శారదపూర్ణిమాచంద్రునికళలొ, చారువసంతవాసనపుష్పలతలొ
సానదీఱిన మంచిజాతిరత్నములొ, శ్రీనిండఁ బటిక నార్చినకుందనంపుఁ
గమ్మలో కఱిఁబులుగడిగిన ముత్తి,యమ్ములో నెఱితావి నలరుగంధంపుఁ
గొమ్మలో యనఁ బెండ్లికూఁతు లొప్పారి, రమ్మక్కయని సతులక్కజంబంద

వారిలో సీత లావణ్యవిఖ్యాత, సారగుణవ్రాత జగదేకమాత
యాదిమలక్ష్మి దానై పుట్టెఁ గాన, నాదేవిచెలువ మింతంతని తెలిసి
భూషింపశక్యమే భూషణంబులకు, భూషణంబై యొప్పె భూదేవికరణి
మెఱసి రత్నాకరమేఖల యగుచు, మఱి గంధవతి వసుమతియుఁ దానగుచు
అంత వసిష్ఠసంయమి లగ్నసమయ, మంతయు జనకున కరసి యే లెంచి
దశరథుతో సమస్తము దెల్ప నతఁడు, కుశికపుత్రవసిష్ఠగురులతోఁ గదలి
యమరేంద్రవిభవుఁడై యర్హ్యాయనములఁ, గొమరొప్పఁ గైసేసి కొడుకులు నడువ
శృంగారములు సేసి చెలువలు నడువ, సంగడిఁ గొలిచి రాజన్యులు నడువఁ
గ్రంతలు గొని పుణ్యకాంతలు నడువ, నంతంతఁ బొగడుచు నర్థులు నడువఁ
గైసేసి హయమత్తగజములు నడువఁ, గైసేసి మంత్రివర్గంబుతో నడువ
వేదనాదములతో విప్రులు నడువ, మోదంబుతో మునిముఖ్యులు నడువ
నడచి యజ్ఞనగరొప్పఁ జొచ్చి, పుడమిఱేఁ డప్పుడు పుత్రులు దాను
వనజలోచనలు నివాళులొసంగ, జనకుఁ డెదుర్కొని సంభ్రమం బెసఁగ

శ్రీసీతారామకల్యాణము.

ఖచితతోరణవరత్నకల్యాణవేది, సుచితపీఠంబున నున్నచోఁ బ్రీతిఁ
దనపురోహితునితోఁ దడయక జనకుఁ, డనలుఁ బ్రతిష్ఠించి హైమవేదికను
వేదోక్తగతి హోమవిధు లాచరించి, యాదేవకన్యక లనరొప్పు తనదు
కన్యకామణుల నగణ్యలావణ్య, మాన్యల నలుపుర మైత్రి రావించి
జనకుండు మధుపర్కసమయంబుఁ దీర్చి, తన కూర్మిపుత్రి సౌదామనీగాత్రిఁ
గామినీజనమణిఁ గమలాక్షి సీతఁ, గోమలిఁ దెరమఱుంగున వేడ్క నిలిపి
రామాభిరాముఁ డారామచంద్రునకుఁ, గామితసిద్ధిసంకల్పపూర్వముగ
శ్రీరామ నాపుత్రి సీత సద్ధర్మచారిణిఁ గొను మగ్నిసాక్షిగా ననుచు
దారవోసెను దేవతాపుష్పవృష్టి, ధారతో దివ్యవాద్యధ్వనుల్ మీఱఁ
బ్రమదంబుతోడ దీపములపల్లెములు, సమదయానలు మహాసంభ్రమంబునను
దలఁబ్రాలు బంగరుతబుకుల నునిచి, కెలఁకుల రమణులు కెరలుచుఁ బట్ట
గుడముతో జిల్కఱిఁ గూర్చి యిద్దఱకు, వడి శిరస్సులమీఁద వలనొప్ప నుంచి
రంతట సుముహూర్తమని తెఱ దీయఁ, గాంతనెమ్మోము మున్గనుఁగొని యలరె
రామునికనుఁగవ రాకాసుధాంశు, గోమున నలరెడు కుముదంబు లనఁగ
భామచూపులు నిల్చెఁ బతిపాదయుగళిఁ, దామరలై తేటితండంబపోలె
నింతిలావణ్యాబ్ధి కెదురెక్కుమాన, సంతానమై రామచంద్రుచూపడరె
వరుదేహకాంతిప్రవాహమధ్యమునఁ, దరుణిచూపులు పద్మదళములై గ్రాలె
సతిచూపుఁ బతిచూపు సరసతఁ జూపు, రతిరూపురతిమనోరమణునిరూపు
నెలమి నొండొరులు మేనెఱుఁగ రాకుండఁ, గళలంట దాఁకినగతిఁ గొంతసేపు
వెలసె నంతట రఘువీరకుంజరుఁడు, చెలికేలుఁగెందమ్మి చెలువునఁ బట్టి
యొండొరు ల్పులకించి యొక్కపీఠమున, నుండి హోమము సేయుచుండిరి ప్రీతి

ఊరువయోధన్య నాయూర్మిళాకన్యఁ, గరము సంప్రీతి లక్ష్మణకుమారునకు
వలనొప్ప నాకుశధ్వజకూఁతులందు, నలినాయతాక్షి మాండవి భరతునకు
నత్రిజబింబాస్య యగుశ్రుతకీర్తి, శత్రుఘ్నునకు నిచ్చె జనకుండు ప్రీతి
నిగమోక్తవిధినిఁ బాణిగ్రహణములు, తగిలి కావించి రాదశరథాత్మజులు
తలఁబ్రాలు వోసి రందఱు లాజహోమ,ములు దీర్చి కాంచిరి ముసులదీవనలు
దివినుండి ఘూషించె దేవదుందుభులు, భువి నిండ వర్షించెఁ బుష్పవర్షములు
అప్పు డానందించి రఖిలదేవతలు, నప్పు డానందించి రఖిలసస్తుసులు
పాడిరి గంధర్వపతు లుత్సహించి, యాడిరి సంప్రీతి నమరకన్యకలు
అపుడు వసిష్ఠుఁ డాయవనీశసుతుల, నుపమింప వై వాహికోక్తమైనట్టి
హోమాంతమున వారినుచితకృత్యములు, నేమంబుతో నగ్ని నెఱిఁ బ్రదక్షిణము
సేయించి స ప్తర్షి సేవలొనర్చి, యాయతంబుగ దీక్షనలరుచు నపుడు
కూర్చుండి రందఱు కుదురుగా నందు, నేర్పుచు మానులు నెసఁగు భూసురులు
సరగున నందఱు సంతోషమెసఁగ, వరఁగ దీవనలిచ్చి పరమపావనుల
శుభలక్షణంబుగా సుందరీజనుల, విభవసమృద్ధిగా విలసిల్లి రప్పు
డాయతంబుగ దీక్షనలరి మోదమునఁ, జేయించి మఱునాఁడు చెలఁగి సభస్సు
గావించి సంతోషకలితులై యపుడు, దీవించి రందఱు దివ్యచిత్తములఁ
దెఱఁగొప్పగాఁ బెండ్లిదినములు నాల్గు, నెఱయ నిత్తెఱఁగున నిండి యుండుటయు
అన్ని శోభనములు నన్ని తేజములఁ, గన్నులపండువుగాఁ జూచి ప్రీతిఁ
దరణివంశాధీశు దశరథాధీశు, శరధిసన్నిభశీలు జనకిభూపాలు
వెఱవొప్ప దీవించి వేడ్క వారనుప, నరిగెఁ గౌశికుఁడు హిమాచలంబునకు
నప్పుడు మిథిలేశుఁ డానందకేళి, నుప్పొంగి నిజవిభవోన్నతి మెఱసి
ధరణీశులకుఁ జాలఁ దద్దాత్రిజయుగము, వరభూషణంబులు వస్త్రంబు లొసఁగఁ
దమదేశములకును దగఁ జనిరంతఁ, గ్రమమున నర్థార్థిగణములకెల్ల
నపరిమిత ద్రవ్య మటులిచ్చి పనిచి, నృపయగ్ర మొప్పెను నెనరొప్పఁగాను
గరమొప్ప బుద్ధులు గఱపి కూఁతులకు, వరరత్నభూషణావళులు విచిత్ర
చిత్రాంబరములు దాసీజనంబులును, నేర్తోత్సవంబుగా నెమ్మితో నొసఁగి
కరిరథహయభటగణభూషణాదు, లరణంబుగాఁ దనయల్లుండ్ర కిచ్చి
యావసిష్ఠాదిసంయములకు దశర,థావనీశునకు ననర్ఘ్యమాణిక్య
భూషణంబు లొసంగి పూజించి వినయ, భాషణంబుల యుక్తపద్ధతి ననుపఁ
గొడుకులఁ గోడండ్ర గొమరొప్పఁ గొనుచుఁ, గడఁకతో దశరథక్ష్మాపతి గదలి
యడరి యయోధ్యకు నరుగుచోఁ ద్రోవ, వడిఁ బేర్చి ప్రతికూలవాయువుల్వీచెఁ
బడయక దుర్నిమిత్తము లనేకములు, పొడచూపినప్పుడు భూపతి కలఁగి
యేలొకో మునినాథ యిబ్భంగిఁ గడఁగి, పోలనిశకునము ల్పొడచూపఁ దొడఁగె
ననవుడు దశరథు ననుకంపఁ జూచి, యనియె వసిష్ఠసంయమి నిశ్చయించి
యుర్వీశ ముందఱ నొకమహాభయము, పర్వి యాలోననే పాయ నోడకుము

అనుచుండ వాయువు లంబంద విసరెఁ, గనుకను పెంథూళి గప్పెఁ గప్పుటయుఁ
గరులు జోదులుఁ దురంగములు రాహుతులు, విరథులై రథులు నివ్వెఱపాటువడిరి
నేనలు నల్దెస ల్చీకాకువడియె, భానుమండలమునఁ బ్రభమాసె నంత
నిరువదియొక్కమా ఱేచి రాజులను, దరిమిడి చంపిన ధన్యవిక్రముఁడు
క్రమ్మినజడలలోఁ గాఁపున్నగంగ, చెమ్మనా నుదుటను జెమట లుప్పొంగ
ఘోరమై మండెడు కుత్తుకవిషముఁ, గ్రూరదైత్యులమీఁదఁ గోపించి యుమిసి
పరమేశ్వరుఁడు దనభాలనేత్రమునఁ, బెరిగి మండుచునున్న పెనుమంటఁ బుచ్చి
తనరెండుకన్నులఁ దగఁ బంచిపెట్టు, కొనివచ్చుపగిదిఁ గన్గొనలఁ గెంపెసఁగఁ
దెగి లోన మండెడు తీవ్రకోపాగ్ని, యెగసి మై సుడిగొన్న యెఱమంటలనఁగ
వెలసి కెంజాయల వెదఁజల్లుజడలు, బలిసి జూటంబున భాసిల్లుచుండఁ
దమకించి భుజలక్ష్మి తాఁబట్టి యూడు, విమలనాళముతోడి విరిదమ్మి యనఁగఁ
బరశువు మూఁపున భరియించి వచ్చు, పరశురాముని జూచి భయమున నలఁగి
రయమున దశరథరాజు స్తుతులు, భయనివారణమంత్రపరతంత్రు లగుచు

పరశురాముఁడు శ్రీరాము నెదుర్కొని భంగపడుట.

ననఘులై యెదురుగా నర్ఘ్యపాద్యములు, గొనిపోవ వానిఁ గైకొనక రౌద్రమున
దశరథభూపాలు దర్పించి చూచి, దశరథరాము ముందఱ వచ్చి నిలిచె
నిలిచిన భార్గవునిజమూర్తిఁ జూచి, తలయూచి మెచ్చి సద్భక్తితో మ్రొక్కి
చక్కఁ గట్టెదుట హస్తము లొప్ప మొగిచి, యొక్కింత భయమున నున్న వీక్షించి
నీవెంత మ్రొక్కిన నిన్ను మన్నించి, పోవ నాతోఁ బోరు భూపాల యనుడు
భూసురోత్తమ కశ్యపుఁడు మొదలయిన, భూసురోత్తములకు భువినెల్ల నిచ్చి
యతిజితేంద్రియవృత్తి నడవుల నుండ, నతులతపోరాశి వగుటను జేసి
యొనర నీకెఱఁగుట యుచితంబు గాన, మునినాథ యే నీకు మ్రొక్కితిఁ గాన
వెఱచి మ్రొక్కుట గాదు వెరవరి నన్ను, నుఱక బోనాడుట యుచితమే నీకు
ననవుడుం దాపసుం డని నన్నుఁ బలికి, తనిలో సహస్రబాహార్జునుఁదొట్టి
యిరువదియొక్కమా ఱేచి రాజులను, దరమిడి చంపితి ధరణిపైఁ దొల్లి
నెఱఁదిలోదకములు నెత్తుట నొసఁగి, లెఱఁగొప్ప మాపితృదేవతలెల్ల
భూపాలశవములఁ బొంగొంద దివికి, సోపానములు చేసి సొరిదిదైవ చనిరి
అట్టి భార్గవరాము ననఘు నన్నెఱఁగ, కిట్టేల రాముఁడై యిలఁ బుట్టితీవు
రాజన్నఁ బొరిఁ గొందు రామనాములను, రాజుల నైతునే రణభూమి నేను
రాజకులుండవో రాముని నిన్ను, నాజి మన్నింతునే యదియునుగాక
రాజని మీతండ్రి రణమునఁ ద్రుంప, నాజికి వచ్చిన నాకును నోడి
స్త్రీలమఱుంగునఁ జెలువొప్ప నున్న, కాలవశంబునఁ గాచితి నతనిఁ
దాన గర్వాంధుఁడై తద్ధయు నిపుడు, మానక యున్నాఁడు మఱి యబ్బి యిచట
మఱుగుఁ జొచ్చిన నైన మననీయ ననుచు, వెఱపక పల్కిన వెఱపుతో నపుడు
అనవుడు దశరథుఁ డతిభీతుఁ డగుచు, వినయోక్తి భార్గవు వీక్షించి పలికె

నీవు బ్రాహ్మణుఁడవు నీకు రోషంబు, గావింప నేటికి ఘనముగా నాదు
తనయులు బాలురు తగదు కోపంబు, వినుతశాస్త్రపురాణవిఖ్యాతిఁ గనుట
నెఱుఁగనే భార్గవ యెఱుఁగవే నీవు, యెఱుఁగని మర్మంబు లెండైనఁ గలవె
నీతోడఁ బోరాడ నిన్నెదిరింప, నాతతంబుగ నుండు నాభవుం డైన
నోపునే భార్గవ యొరు లెదిరింపఁ, బాపవే యీతఁడఁ బరమపావనుఁడ
దేవేంద్రుఁడైన నీతీవ్రప్రతిజ్ఞ, భావించి యడుపంగ భవ్యుండు గాఁడు
మన్నించి రక్షించి మమ్ము నందఱను, జెన్నుగాఁ జనుమని శిరసును వంచి
మన్నింపు మని వేఁడి మఱియు మ్రొక్కి–నను, గన్నుల కోపంబు గడునొప్పి యుండె
నని తన్నుఁ గొనియాడు నతనివాక్యములు, విని యాదరింపక విపులరోషమునఁ
గనలుచు నత్యంత కరినుఁడై యపుడు, దమియింతు నని మదిఁ దలఁచి యిట్లనియెఁ
గర మొప్ప విలువిద్యఁ గడిమిమై నేను, హరునితోఁ దొల్లి యభ్యాసంబు సేయ
నాఁడు కుమారుండు నాతోడఁ దొడరి, పోఁడిమి చెడి యోడిపోయినఁ జూచి
నాపెంపు మెచ్చిన నాగకంకణుని, చాపంబు విఱిచిన సైతునే మఱియు
అనిన నారఘురాముఁ డారాముఁ జూచి, యనియె నిశ్చలవృత్తి నతిసమ్మదమున
నేను వినోదమై నెక్కిడి తివియఁ, గా నది విఱిగెనుగాక దానట్లు
నాతెగ కేల పినాకివి ల్లిలుచు, నాతతభుజసత్త్వ మట్టిదె నాకు
నెసఁగ యుద్ధములందు నిక్ష్వాకులులు, పసుల బ్రాహ్మణులఁ జంపఁ దలంప రెందు
నీ వెన్ని పలికిన నీకవి చెల్లె, నీవు బ్రాహ్మణుఁడవు నినుఁ జంపనొల్ల
నిదె నాదు కంధర మిదె నీదు పరశు, వదరక యుచితకృత్యము సేయు మింక
ననవుడు రఘురాము నలుకదీపింపఁ, గనుఁగొని పలికె భార్గవరాముఁ డడరి
భావింప నాకు నీపలుకులఁ జూడ, నీవు క్షత్రియుఁడవు నేను బ్రాహ్మణుఁడ
ననుగర్వ మున్నది యటుచూడవలదు, వినుతవిక్రమశక్తి వేఁడిఁ జూపెదను
వఱలు నజ్జనకభూవరునింట నీవు, విఱిచినవిల్లు నీవిల్లును దొల్లి
యర్మిలి నిండార నమరులు విశ్వకర్మచే నొక్కటఁ గావించి రెలమిఁ
బురములు నిర్జింపఁ బోయెడునాఁడు, హరునకుఁ దగనిచ్చి రందులో నొకటి
నావింట త్రిపురంబు లణఁచి రుద్రుండు, దా వీరగర్వముద్రారతుఁ డగుచు
నసహాయమున నేను నసురత్రయంబు, వసుధపైఁ గూల్చి తెవ్వరు నాకు నీడు
నని పల్కఁ జక్రి బుద్ధాకృతిఁ బూని, తునిమించెఁ గాక రుద్రునికి శక్యంబె
యని యాడకాడకు నమరులు మునులు, సనకాదిహరిపార్శ్వచరులును బలుక
విని రుద్రగణములు వినుపింప శివుఁడు, విని రోషమునఁ బోర విష్ణునిఁ బిలువ
సురగరుడోరగవరులెల్లఁ గూడి, సరసిజాసనుఁ జేరఁ జని విచారించి
హరిహరసత్త్వంబు లరయుద మనుచు, మురవైరి కపుడు కార్ముకరాజ మిచ్చి
యిరువుర కెంతయు నెఱుక సేయుటయు, హరియు రుద్రుఁడుఁబోరి రరుదుగా నపుడు
నారాయణునితీవ్ర నారాచఘోర,ధారచే శివునికోదండంబు సగము
విఱిగి పేఱొత్తిన వీక్షించి రఘుడు, హరిశక్తి ఘనమని యమరు లందఱును

ఇరువుర మాన్పి రాయిశుఁ డవ్వేళ, సురలచిత్తస్థితిఁ జూచి యావిల్లు
రయమున నాదేవరాతున కిచ్చె, జయధన్యుఁ డాతండు జనకున కిచ్చె
వనజలోచనుఁడును వలనొప్ప నిచ్చెఁ, దనచేతిచాప మత్తఱి రుచికునకు
జమదగ్ని కిచ్చె నిశ్చలమతి నతఁడు, జమదగ్ని నాకిచ్చె సదయుఁడై దీనిఁ
బెనకువ నది తొల్లి వేఱొత్తియుంటఁ, గని నీవు విఱుచితిగాక భూనాథ
ఆవింటితోడిదె యరయ నాచేతి, యావిల్లు నిదె చూడు మినవంశతిలక
నెలకొని యావిల్లు నీవెక్కువెట్టి, తలకొని బాణసంధానంబు నేసి
కడిమి చూపక నిన్నుఁ గదలనీ ననినఁ, దడయక రోషించి దశరథాత్మజుఁడు
కన్నుల ఘనవహ్నికణములు దొరుఁగఁ, దన్నెఱుంగని జామదగ్నితో ననియె
నిరుపమనిజశక్తి నీకుఁ గల్గుటయుఁ, దరమిడి రాజులఁ దరిమి చంపుటయు
నెఱుఁగుదు నన్ను నీవితరునిమాడ్కి, వెఱపక పలికెదు వీరంబు మెఱసి
నీవెఱుంగవు నాదు నిజబాహుబలము, నీవెంతవాఁడవు నీచాప మెంత
తెమ్మని విలుఁ దీసి తెగువ మోపెట్టి, క్రమ్మఱ నత్యుగ్రకాండంబు దొడిఁగి
నీకాళ్లు దెగవేసి నీగర్వ ముడిపి, నీకోప మడఁచెద నేఁడన్నఁ దలఁకి
యురుసత్వగర్వంబు నుబ్బును దూలి, పరశురాముఁడు రాముఁ బ్రార్థించి పలికె
నేను గశ్యపునకు నిల నిచ్చినాఁడఁ, గాన రాత్రులు నిల్వఁగా నేర నిచట
ననుదినంబును మహేంద్రాచలంబునకుఁ, జనవలె నటుచేయఁ జరణము ల్వలయు
నాకాళ్ల నేయక నాపాలిపుణ్య, లోకమార్గంబు లాలోకింప నేయు
నన్ను రక్షింపుము నరనాథచంద్ర, మన్నింపవే రామ మనుజలోకేశ
యనవుడు రఘురాముఁ డాజామదగ్ని, ఘనపుణ్యలోకమార్గము నేసెనంత
జడురీతి నిలుచున్న జమదగ్నిరాముఁ, గడునుగ్రుఁ డైయున్న కాకుత్స్థరాముఁ
జూచుచు నుండిరి సురసిద్ధసాధ్య, ఖేచరు లద్భుతక్రీడలఁ దగిలి
వలనొప్పఁగాఁ బుష్పవర్షము ల్గురిసె, నలినగర్భాదులు నానందమంది
పొగడిరి రామునిఁ బొందుగా సురలు, మిగులు తేజంబున మిన్ననుండి
యంత భార్గవరాముఁ డారాముఁ జూచి, యంతరంగంబున నతని భావించి
యనఘు నీసత్త్వమే నాత్మలోఁ జూచి, నిను వివేకించితి నీవు విష్ణుఁడవు
కాకుత్స్థ యటుగానఁ గదనంబునందు, నీకు నోడుట నాకు నింతగా బెందు
నాబలంబును నీవె నాయాత్మ నీవె, నాబంధువులు నీవె నారామచంద్ర
నామాట లన్నియు నాత్మ నుంపకయ, రామ రక్షింపవే రఘుకులాధీశ
యనుచుఁ బ్రస్తుతి సేసి యానందమంది, మనమున రఘురామమహిమ లెన్నుచును
వరుస శ్రీరాముని వలగొని భక్తి, గరములు ముకుళించి కరము సంప్రీతి
వినయవిధేయుఁడై విభునటు చూచి, మనమునఁ గృపపుట్ట మఱి యిట్టులనియె
నెలవిమ్ము రాఘవ శ్రీజానకీశ, నెలవిమ్ము పోయెద నెలవిమ్ము నాకు
నాతప్పు లెన్నక నన్ను మన్నించి, నీతఱి రక్షించి యింపుగాఁ బనుపు
మనసునేకముచేసి మదివెల్లుఁ గనుచుఁ, గనుమూసి నినుఁగూర్చి కదలక తపము

లొనరంగఁ జేసిన నొయ్యన మునులు, మనముల నానందమగ్ను లై యుండు
రనుచుఁ బ్రస్తుతిఁజేసి యభినుతుల్ చేసి, యనుపమప్రీతితో నప్పుడే కదలి
నిరుపమతరశ క్తి నీశ క్తియనుచు, నరిగె రాముఁడు మహేంద్రాచలంబునకుఁ
బరశురాముని విల్లు ప్రార్థింప నొసఁగె, వరుణుచేతికి రఘువర్యుఁ డాఱుణమె
యప్పుడు వాయువు లనుకూలగతుల, నొప్పె నుత్సాహంబు లొదవె సేనలకు
నరుదరుదని సుర లభినుతిసేయ, వరజయశ్రీ గూడి వచ్చి రాఘవుఁడు
తనతండ్రి దశరథధరణిపాలునకు, ననఘవసిష్ఠున కతిభ క్తి మ్రొక్కె
మ్రొక్కిన దీవించి మొగిఁ గౌఁగిలించి, యక్కున నందంద నొదలఁ జేర్చి
పరమసమ్మదమునఁ బార్థివేశ్వరుఁడు, సరస్తోక్తి నేఁ బునర్జాతుండ నైతిఁ
గొమరొప్ప నీవంటి కొడుకును గనుట, నమరేంద్రు భోలితి నవనిలో నిపుడు
పరమపావనుఁడైన పరశురాముండు, పరమేశుపగిదిని బరఁగ నిచ్చటికి
వచ్చుట నేఁ గాంచి వఱువెల్ల వడఁక, నిచ్చలో భయమంది యిఁక నేది త్రోవ
యనుచు భయంబున నాతనితోడ, మనవిగాఁ జెప్పిన మఱి వినకున్నఁ
బరవశత్వంబొంది పలుకనేరకయ, పరమమైత్రికి నేను బాల్పడి యుంటి
నతని గెల్చుటయె నా కాశ్చర్యమయ్యె, నతులితవైభవం బందితి నేను
బాసెను భయమెల్లఁ బ్రౌఢి నీచేత, వాసికెక్కితి నిల వైభవం బబ్బె
ననుచు రాముని జాల నభినుతిచేసి, మునివసిష్ఠాదుల ముదమునఁ గూడి
పరమసమ్మదమున బలములుఁ దాను, నరిగె నయోధ్యకు నవనివల్లభుఁడు

దశరథుఁడు పుత్త్రులం దోడ్కొని అయోధ్య కేగుట.

పుణ్యచిహ్నములతోఁ బుణ్యులతోడ, బుణ్యమంగళతూర్యములు మ్రోయ నరిగి
తానును గొడుకులు దశరథాధీశుఁ, డానందమున నయోధ్యాపురిఁ జొచ్చి
రాజితాలంకారరమణఁ జేపట్టు, రాజమార్గంబున రా రాజముఖులు
సఖులుఁ దానును గేళిసౌధంబు లెక్కి, సుఖతరాకృతుల రాసుతులఁ గన్గొనుచు
నేసలు చల్ల నాశీర్వాదమెల్ల, భూసురు లొసఁగ విస్ఫురణఁ బెంపెసఁగ
నగణితశృంగార మైయొప్పు దనరు, నగరుఁ బ్రవేశించె నరనాథుఁ డంతఁ
గౌసల్య కేకయక్ష్మాపాలపుత్రి, యాసుమిత్రాదేవి యాదిగాఁ గలుగు
నంతఃపురాంగన లందఱు నప్పు, డెంతయుఁ బ్రీతితో నెదురుగా వచ్చి
చేరివారలమీఁద నేసలు చల్లి, నీరాజనంబులు నెఱి నిచ్చి రంతఁ
గొడుకు లందఱు మ్రొక్కఁ గొడండ్రు మ్రొక్కఁ, గడుఁబ్రీతి దీవించి కౌఁగిటఁజేర్చి
సీతాదికాంతలచెలువంపుబుద్ధి, చాతురి కన్నుల చల్లగాఁ జూచి
తనరారుచుండిరి దశరథుం డపుడు, తనయులు నలుగురు తను భజియింప
నాల్గుచేతులనొప్పు నలినాక్షుఁ డనఁగ, నాల్గుకొమ్ములు గల నాకేభ మనఁగ
సకలజనానందచతురుఁ డై రాజ్య, మకలంకరక్షకుఁ డై యేలుచుండి
యొకనాఁడు దశరథుం డుచిత మెఱింగి, ప్రకటితశుభరతు భరతు నీక్షించి

ఘనుఁడు మీమామ కేకయరాజు దోడు,కొనిపోదు నిన్నని కోరియున్నాఁడు
గాన శత్రుఘ్నుతోఁ గదలి మీమామ,తో నేగి యతని సంతోషంబు నెఱపు
తాతకు నప్పకుఁ దగ మేనమామ, కాతతభక్తితో ననిశంబు మ్రొక్కు
సురలకాఁ దలఁచి భూసురులకు వత్స, పరమప్రియంబునఁ బరిచర్యనేయు
వారలచేత నవారణస్యంద,నారోహణములు శస్త్రాస్త్రవిద్యలును
నెఱి వేదశాస్త్రము ల్నీతిశాస్త్రములు, నురుకళావిద్యలు నొగి నభ్యసింపు
మేకక్షణంబును నెడపక నియతిఁ, జేకొని నీమేలు చెప్పి పుత్తెమ్ము
అనవుడుఁ దల్లుల కవనిపాలునకు, వినతుఁడై రఘురామవిభునకు మ్రొక్కి
తాను శత్రుఘ్నుండుఁ దన మేనమామ,తోన యిమ్ముల భరతుఁడు పుణ్యరతుఁడు
రాజగృహంబున రమణీయమైన, రాజధానికి నేగి రఘుకుమారకులు
తాతకుఁ దమరాకఁ దగ నెఱిఁగింపఁ, బ్రీతిమైఁ బుచ్చు నాపృథ్వీవరుండు
పట్టణంబునఁ దీరువడ తోరణములు, గట్టించి బహుపతాకలు కల్పఁడములు
కలయంగ నెత్తించి గంధోదకములు, పొలుపొందఁ జల్లించి పుష్పధూమములు
కరమొప్ప రాజమార్గమున వాసింపఁ, బరిచారకులఁ బంచి బలయుతు లగుచు
వనితలు నిజమంత్రివర్గంబుతోడఁ, జనుదేర నెంతయు సంభ్రమం బెసఁగ
వరుస నానాగీతవాద్యనృత్యములు, పరమశుభాచారభంగుల నడువఁ
బ్రీతి నెదురొక్కని ప్రియమొప్ప వంది,సూతమాగధజనస్తుతు లోలిఁ జెలఁగ
మనుమలఁ దోడొక్కని మహిమతో వచ్చెఁ, బనిగొన్నభక్తితో భరతుండు నంతఁ
దమ తాత మొదలుగాఁ దగినపెద్దలకుఁ, గ్రమము దప్పక నమస్కారము ల్చేసి
పొలుపొంద వారిచేఁ బూజితుం డగుచుఁ, దళుకొత్త వేడుకఁ దాతతో ననియె
నార్యక నాకు విద్యాభ్యాస మింకఁ, గార్య మాచార్యులై ఘనులైనవారి
కప్పగింపుఁడు నన్ను ననిన నారాజు, చెప్పినవారిచే శిక్షితుం డగుచు
నమర విద్యాభ్యాసమంతయుఁ జేసి, విమలైకమతి నొకవిప్రునిచేతఁ
దమతండ్రి యగుచున్న దశరథేశునకు, సముచితస్థితి మేము సకలవిద్యలును
జెలువంబుగా నభ్యసించితి మింకఁ, దలఁపుపుట్టెడు మాకుఁ దముఁ జూడవలయు
నని చెప్పుమన నయోధ్యాపురంబునకుఁ, జనుదెంచి యతఁడు నాజననాయకునకు
రాజపత్నులకు నారామలక్ష్మణుల, కోజ నెంతయుఁ జెప్పె నుల్లంబు లలర
నంత శ్రీరాముండు యౌవరాజ్యమున, నెంతయుఁ జతురుఁడై యెల్లవారలకుఁ
బ్రాకటంబుగ నొండుబాధ లేకుండ, నేకప్రబుద్ధిగా నిటఁ దండ్రిఁ గొలిచి
ధారణీప్రజలకు దయయొప్పఁ జేసి, వీరు వారన కతివిశ్రుతకీర్తి
సమచిత్తుఁడై ధర్మచరితంబుఁ బూని, యమరేంద్రవిభవుఁడై యారామవిభుఁడు
సీతయుఁ దానును జెలువొప్పఁ గూడి, నూతనరతిసుఖార్ణోరాశిఁ దేలి
చంద్రశాలలఁ గేళిసౌధవీధికలఁ, జంద్రకాంతాతివిశాలవేదికల
గాజుటోవరుల బంగరుపడకిండ్లఁ, జాజిపూఁబాన్పులఁ జంపకక్రముక
నారికేళరసాలనారంగరంగ, నారామములఁ గృతకాద్రిసానువులఁ

గొలఁకుల కెలఁకులఁ గుంజపుంజములఁ, జలువచప్పరముల సైకతస్థలులఁ
జాతురి మెలఁగుచు సకలభోగములు, నాతతసౌఖ్యంబు లందుచునుండె
అని యాంధ్రభాషాభాషాధీశవిభుఁడు, వినుతవాక్యాగమవిమలమానసుఁడు
పాలితాచారుఁ డపారధీశరధి, భూలోకనిధి గోనబుద్ధభూవిభుఁడు
దమతండ్రి విట్ఠలధరణీశుపేరఁ, గమనీయగుణధైర్యకనకాద్రిపేర
నలఘునిశ్చలదయాయతబుద్ధిపేర, లలితనిర్మలగుణాలంకారుపేర
నాచంద్రతారార్కమై యొప్పు మిగిలి, భూచక్రమున నతిపూజ్యమై యొప్పు
నసమానలలితశబ్దార్థసంగతుల, రసికమై చెలువొందు రామాయణంబు
పరఁగ నలంకారభావన ల్నిండఁ, గరమర్థి నీబాలకాండంబుఁ జెప్పె
నారూఢి నాశ్లేయమై యాదికావ్య, మై రసికానందమై యల్లనాఁడు
నివ్వసుమతి నొప్పు నీపుణ్యచరిత, మెవ్వరు చదివిన నెవ్వరు వినిన
సామాదిబహువేదచయధామరామ, నామచింతామణి నవ్యభోగములు
పరహితాచారముల్ ప్రభువిచారములు, పరిపూర్ణశక్తులు ప్రకటరాజ్యములు
నిర్మలకీర్తులు నిత్యసౌఖ్యములు, ధర్మైకనిష్ఠలు దానాభిరతులు
నాయురారోగ్యంబు లైశ్వర్యములును, బాయనిశుభములు పాపక్షయములు
వరపుత్రలబ్ధియు వైరినాశనము, సరినొప్పు ధనధాన్యచయసమృద్ధియును
నేవిఘ్నములు లేక యిండ్లలో నధిక, లావణ్యవతులైన లలనలపొందు
కొడుకులతో నెప్డుఁ గూడియుండుటయు, నెడగాఁగ నాపదలెల్లఁ బాయుటయు
సమ్మదంబున బంధుజనులఁ గూడుటయు, నిమ్ములఁ గామ్యంబు లెడపకుండుటయు
సతతంబు దేవతాసంతర్పణంబు, పితృగణతృప్తియుఁ బెంపారుచుండు
వ్రాసినవారికి వరశుభోన్నతులు, వాసవభోగాదివాసులఁ జేయు
నెందాఁక కులగిరు లెందాఁక జలధి, యెందాఁక రవిచంద్రు లెందాఁక దిశలు
ఎందాఁక వేదంబు లెందాఁక ధరణి, యెందాఁక భువనంబు లేపుదీపించు
నందాఁక యీకథ యక్షతానంద, సందోహదోహళాచారమై పరఁగు

బాలకాండము సమాప్తము

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః

శ్రీరంగనాథరామాయణము

అయోధ్యాకాండము.

శ్రీలీల దశరధోర్వీపాలుఁ డవనిఁ, బాలించుచుండి చొప్పడ నొక్కనాఁడు
సుతులు నల్వురలోన శుభతరమూర్తి, యతుల యశోనిధి యగుచున్న వాని
ననుదినంబును బేద లగువారినెల్ల, మనమున ముదమంద మన్నించువాని
హితబుద్ధి యగువాని నెల్లభూతముల, హితమును గరుణ[1] నన్వేషించువానిఁ
బోలఁ జతుర్విధపురుషార్థగతుల, నోలి చిత్తంబున నూహించువాని
ననిశంబు సంతుష్టుఁ డైయుండువానిఁ, గొనియాడఁదగిన సద్గుణములవానిఁ
దప్పని కోపంబు దగుప్రసాదంబు, నొప్పగుప్రభుశక్తి నొనరెడువాని
గజహయారోహణక్షముఁ డగువాని, విజయలక్ష్మీసమన్వితుఁ డగువాని
వెరవరి యగువాని విహితకార్యంబు, నరయ ననాలస్యుఁడై చేయువాని
మానసనిరోషంబు మదిలేనివాని, మానుగా భృత్యుల మన్నించువాని
నతిరభసుఁ డగువాని [2]ననసూయవృత్తిఁ, బ్రతిదినంబును బుద్ధిఁ బొటించువానిఁ
గరుణాసముద్రుఁడై కడుమించువానిఁ, బరులగుణంబులు పాటించువాని
బుద్ధి బృహస్పతిఁ బురుడించువాని, నిద్ధతేజంబున నినుఁబోలువాని
నమితప్రజానంద మలరించువానిఁ, గుముదబాంధవుభంగిఁ గొమరొందువాని
వెలయ ధనుర్వేదవేదశాస్త్రములు, వలయు విద్యలయందు వలనొప్పువాని
న్యాయమార్గంబున నర్థార్జనంబు, పాయక నేయ నేర్పుఱి యగువాని
సైరణ ధరతోడ సరివచ్చువాని, భూరిగుణంబులఁ బొలుపొందువానిఁ
గోదండదీక్షైకగురుఁ డగువాని, నాదిమపురుషుఁడై యలరారువాని
శ్రీరాముఁ బట్టాభిషిక్తునిఁ జేసి, ధారణిఁ బాలింపఁ దలపోసి యంతఁ
దలకొన్న కడకతో దశరథేశ్వరుఁడు, కొలువుకూటమునకుఁ గొమరొప్ప వచ్చి

దశరథుఁడు వసిష్ఠాదులతో రామునకుఁ బట్టముఁగట్ట నాలోచించుట.

యందు వసిష్ఠాదు లగుమహామునులు, నందు సుమంత్రాదు లగుమంత్రివరులు
చేరువ నృపతులుఁ జెలులుఁ జుట్టములు, పౌరవర్యులు జానపదులు నాశ్రితులు
సారవివేకులు సామంతనృపులు, ధీరులు రాజనీతిజ్ఞులు మొదలు
వారల రావించి వారిదనినద, చారుగంభీరసుస్వరమునఁ బలికె

---

1 చే నెంచెడువాని. 2 ననసూయ గల్గి.

మాపెద్ద లిచ్ఛ్వాకుమనుజేశముఖ్యు, లీపృథ్వీతల మేలి రించెసఁగ
వారలరీతి నవారితనీతి, నీరాజ్య మంతయు నే నోపినట్లు
నిజకులాగతధర్మనిరతుండ నగుచుఁ, బ్రజల నేలితిని మీప్రాపునఁ జేసి
యిదియంతయును మీర లెఱిఁగినయదియ, విదితంబుగా నింక వినుఁ డొక్కమాట
నఱువదివేలేఁడు లవనిఁ బాలించి, నెఱసి తచ్ఛత్రంబునీడనే యుండి
ముదిసితి భూభారమునకంటె ఘనతఁ, బొదలు జరాభారమును దాల్చుకతన
నామేను వికసితనలినషండంబు, కౌముదితోఁ బోరి గర్వంబు దక్కెఁ
గావున నారామముఁ గల్యాణరాము, దేవతాహితకాము ధీగుణస్తోము
నిందీవరశ్యాము ననకోటితాము, సౌందర్యజితకాము జగదభిరాముఁ
బ్రజలఁ బాలింపఁగఁ బట్టంబు గట్టి, సుజనులు గొనియాడ సుఖకరంబైన
యూరటఁ గోరుచు నున్నాఁడ మీకు, నీరీతి సమ్మతియే యంచుఁ బలుక
ఘనగర్జితంబు లాకర్ణించి యలరు, వనమయూరములన వారుత్సహించి
మొగిఁ గలకలశబ్దముఖరితస్వాంతు, లగుచు భూసురముఖ్యు లగుభూమిప్రజలు
దమలోనఁ దాము మంతనమాడి కూడి, కమలాప్తకులున కుత్కంఠత ననిరి
మీరానతిచ్చిన మేలిమిమాట, వారు వీరన కెల్లవారికి హితమె
హృదయరంజకము నభీష్టదం బయ్యె, నదిగాక సకలజనానందకరము
రాజనీతిజ్ఞు నిర్మలధర్మనిపుణుఁ, దేజోజగద్బంధు దీనైకసింధు
సత్యసంపన్నుఁ బ్రశాంతిసంపన్ను, నిత్యవిప్రార్చనానిరతు సచ్చరితు
నీతియుఁ బ్రీతియు నేర్పును నోర్పు, ఖ్యాతియు భూతియుఁ గాంతియు దాంతి
శాంతియు మొదలగు సద్గుణావళుల, నెంతయు నీకన్న నెక్కుడై యున్న
రాముని లోకాభిరాముని నీవు, భూమికి రాజుగాఁ బూన్చుట తగదె
త్రైలోక్యమైన నాతం డేలఁజాలు, నీలోక మేలుట యెంతమాత్రంబు
నీసుతాగ్రణి రాజ్యనిరతుఁడౌ నేని, భూప మాచేసిన పుణ్యంబుగాదె
కావునఁ బట్టంబు గట్టు మీవతని, కేవేళ మేమును నిదియె కోరుదుము
అనుచు బద్ధాంజలు లై విన్నవింప, విని తనమదిలోన వేడ్క రెట్టింప
భూమీశుఁ డప్పు డుప్పొంగి వసిష్ఠ, వామదేవులఁ జూచి వలనొప్పఁ బలికె
నీమధుమాస మభీష్టదం బగుట, రాముని సకలసామ్రాజ్యలక్ష్మికిని
రాజుఁ జేయుదము తద్ద్రవ్యవస్తువులు, యోజించి తెప్పింపుఁ డుచితవైఖరిని
నని పల్క వారు నయ్యభిషేకయోగ్య, ఘనవస్తువులు గూర్పఁగాఁ బంచి రంత
స్త్రీవల్లభుండు సుమంత్రాదిమంత్రి, కోవిదులను బంధుకోటి వేర్వేఱ
రావించి చెప్ప వారలు సమ్మతించి, వేవేగ రఘురామవిభుని రప్పించి
తనచూపులను సుధాధారలు దొరుగ, జననాథుఁ డారామచంద్రుతో ననియెఁ
బెనుపొందఁ గడిమిమైఁ బెద్దకాలంబు, జనులెల్లఁ బొగడ రాజ్యముచేసి యేను
దానముల్ ధర్మముల్ తగిన యాగములు, నూనిన నిష్ఠతో నొగిఁ జెక్కుచేసి
కడపటి నీయట్టి కల్యాణశీలుఁ, గొడుకుగాఁ బడసితిఁ గోర్కి రెట్టింప

నేనింక భూభార మిబు మోయఁజాలఁ, గాన నీ బట్టంబు గట్టెదఁ బ్రీతి
చెలువారఁ బట్టాభిషేకంబు సేయ, లలితపుణ్యోదయలగ్న మెల్లుండి
యొనర సీతయు నీవు నుపవాసముండుఁ, డెనసినభక్తితో నెల్లి సంప్రీతి
నని పల్కుటయు రాముఁ డవనీశుఁ జూచి, వినయంబు ధైర్యంబు వెలయ నిట్లనియె
జననాథ నాకు నీచరణపద్మములు, గొనకొన్న భక్తితోఁ గొలుచుటకంటెఁ
గడచినరాజ్యంబు గలదె లోకముల, నుడుగు మీపలుకు లయోగ్యంబు లసుడు
ననఘుచారిత్రుఁడ వతిసత్త్వధనుఁడ, వినకులరత్నంబ వీవుండ నింకఁ
దగువార లెవ్వరు ధరణిపాలనముఁ, దగిలి కావింపుము త్రైలోక్యవీర
యని పల్కుటయు రాముఁ డట్లకా కనుచుఁ, దననగరికిఁ బోయెఁ దదనంతరంబ
పౌరుల రాజుల బంధులనెల్ల, వారల వీడ్కొని వనజాప్తకులుఁడు
అంతఃపురంబున కరిగి శ్రీరాము, చెంతనున్న సుమంతుఁజేఁ బిలిపించి
తనసమీపమున నాతనయుఁ గూర్చుండఁ, బనిచి యానందబాష్పము లుప్పతిల్ల
మనమలరఁగఁ జూడ మహిపున కపుడు, మనమున దిగులొత్త మఱియశుభములు
కనుపట్టె నంతటఁ గడుభయమంది, తనపుత్త్రకునిఁ జూచి తద్దయుఁ బలికె
నాపాలిభాగ్యంబ నానిధానంబ, నాపుణ్యసారంబ నాతపఃఫలమ
నాపుత్త్రరత్నంబ నాకలలందు, దీపించె నశుభపరిహతనిమిత్తములు
ఘనదుర్గ్రహముల నుల్కాపాతములను, గనుఁగొంటి మనసు వైకల్యంబు నొందెఁ
గావునఁ బుష్యయోగము నీకు లెస్స, నీవు పట్టముఁ బూన నిండు నాకోర్కి
యాలస్యమేల నీయభ్యుదయమున, నీలోకమంతయు నెపుడుఁ గాంక్షించు
నన విని దశరథునానతి యియ్య,కొని మ్రొక్కి తండ్రి వీడ్కొని రామవిభుఁడు
తనతల్లికిని సుమిత్రకు నట్టివార్త, జనకనందనకు లక్ష్మణునకుఁ జెప్పి
వారల సంతోషవార్ధిఁ దేలించి, యారామవిభుఁడు శీతాంశుసన్నిభుఁడు
తననగరికి వచ్చెఁ దాను సీతయును, ఘనమైన హృదయవికాసంబునొంద
నంత వసిష్ఠుతో ననియె భూవిభుఁడు, సంతోష మెసఁగంగఁ జని రామవిభుని
మునినాథ యుపవాసమునకు సంకల్ప, మొనరింపఁజేయుము యుక్తమార్గమున
ననవుడు బ్రహ్మరథారూఢుఁ డగుచుఁ, జని వసిష్ఠుఁడు రామచంద్రునికడకుఁ
దనశిష్యు నొక్కనిఁ దడయక పనిపి, తనరాక మున్నుగాఁ దగనెఱిఁగించి
యమ్మాడువాకిండ్లయందాఁకఁ బోవ, నిమ్ముల రాఘవుం డెదు రేగుదెంచి
యవతీర్ణరథునికిఁ నతిభక్తి మ్రొక్కి, సవినయంబుగ సంతసంబున నపుడు
లోనికిఁ దెచ్చి యాలోకవంద్యునకు, మానుగ సత్కృతుల్ మనసారఁ జేయఁ
బుణ్యాహవాచనంబులు నుపవాస, పుణ్యసంకల్పంబు పొసఁగఁ జేయించి
వెలయ రాముఁడు పదివేలధేనువుల, నెలమి దక్షిణగాఁగ నిచ్చినఁ గొనుచు
వచ్చి వసిష్ఠుఁడు వసుమతీపతికి, నచ్చుగాఁ జెప్పి గృహంబున కరుగ
నంతఃపురంబున కరిగె భూవిభుఁడు, నంత నక్కడ రాముఁ డానందమంద
జానకితోఁ గృతస్నానుఁడై విష్ణు, మానుగాఁ గూర్చి హోమంబుఁ గావించి

యాహవిశ్లేషంబు నమరఁ బ్రాసించి, యూహా విష్ణుధ్యాన మొనరఁజేయుచును
విశదనిశ్చయబుద్ధి విష్ణుగేహమునఁ, గుశశయ్యపైఁ బొల్చి కులగురుండైన
యావసిష్ఠుఁడు చెప్పినట్టిచందమున, ధీవరిష్ఠుఁడు రామదేవుండు నిష్ఠ
నుపవాసముండె నయోధ్యలో నంత, విపులసమ్మదమున విలసిల్లువారు
కొలఁదిమిత్యముల మ్రుగ్గులువెట్టువారు, చెలువార గృహములఁ జిత్రించువారు
కలయఁ గస్తూరిరేఖలు దీర్చువారు, నలివీఁటి మణితోరణము లెత్తువారు
విరులచప్పరములు విరచించువారు, పురవీధిఁ గేతనంబుల నిల్పువారు
కలవడంబులు మేలుగాఁ గట్టువారు, కలిమి నొండొరు లర్థిఁ గైసేయువారు
నభిషేకసుముహూర్త మలరించువారు, విభుఁడైన దశరథు వినుతించువారు
నిలువేల్పులకుఁ బూజ లిచ్చెడువారు, కలకొద్ది దానము ల్గావించువారు
పురరాజవీధి గుంపులు గూడువారు, సరసకథాగోష్ఠి సలిపెడువారు
రాముఁడే రాజుగాఁ బ్రార్థించువారు, రామునిఁ గొలువ సంభ్రమపడువారు
రామకీర్తనముల రంజిల్లువారు, నై మహోత్సవకోటు లటుచేయుచుండ
నప్పుడు మంథర యనుకైకదాసి, తప్పక దనమేడఁ దానెక్కి చూచి
యిదియేమిచందమో యీపురలక్ష్మి, పొదలుచున్నది మహాద్భుతవైభవములఁ

మంథర కైకకు దురుక్తులు బోధించుట

బొరులందఱును నపారశృంగార, చారుశరీరులై సంతసించెదరు
కౌసల్యనగరిలోఁ-గలకాంత లెల్లఁ, గైసేసియున్నారు కడువేడ్కతోడ
నేలొకో కౌసల్య యెదనుబ్బియుబ్బి, వేలసంఖ్య ధనంబు వెచ్చపెట్టిడిని
నసుచుఁ బ్రమోదాది యగురాముదాదిఁ, గనుఁగొని యడిగి యక్కామినివలన
రాముఁ బట్టము గట్టి రాజుగావించు, నామహోత్సవకోటు లని నిశ్చయించి
పనివడి రాముఁడు బాల్యంబునందుఁ, దనకాలు విఱిచినతప్పు సాధింప
నిది నాకు తఱియని యిచ్చుఁ జింతించి, యది వచ్చి కైకతో నంతయుఁ జెప్ప
వచ్చి తత్కలినివాసంబుఁ జొచ్చి, మచ్చిక నుయ్యెలమంచంబుమీఁదఁ
బ్రవిమలమృదులతల్పంబుపై వేడ్కఁ, బవళించియున్న యప్పద్మాక్షిఁ జూచి
లెమ్ము లెమ్మో భామ లీలాభిరామ, ఇమ్మెఱుంగవు కార్య మేమియు ననుచుఁ
గొనరెట్టఁ బట్టి గ్రక్కున లేవనెత్తి, తననేర్పుమాటలఁ దరుణి కిట్లనియె
వసుధాధిపతి నాకు వలచు నాభాగ్య, మసమానమని చెప్పు టది బొంకు సుమ్ము
అది యెట్టులనఁ బెద్దయాలికి వెఱచి, మదిరాక్షి నిసు వేఁడ మఱి మోసపుచ్చి
భరతుని నొకవంకఁ బరభూమిఁ బంచి, పరికింప రఘురాముఁ బట్టంబు గట్టఁ
దలఁచుచు నున్నాఁడు దశరథేశ్వరుఁడు, నెలఁత యిట్టిదియైన నీకేటిబ్రతుకు
రాజుల మది నమ్మరాదు నీకేల, వేజాడలను విజ్ఞులీఁగెదో బాల
యిట్టి మోహావిదూరు నిట్టి వంచకుని, నిట్టి బూమెలవాని నెందు నేఁ గాన
మగఁడె యాతఁడు మైత్రి మానినయట్టి, పగవాఁడుగాక యీపట్టున నీకు
సవతికుమాయని జగతికంతటికి, ధవునిఁగా జేసిన ధవళాయతాక్షి

నీకుమారునకును నీకును నాకు, శోక మబ్బుటకాక సుఖమేల కలుగు
నీకరణంబుగా నీతండ్రి యనుపఁ, జేకొన్నప్రేమ వచ్చినదాన నేను
నీలెస్స నాలెస్స నీకైనలేమి, నాలేమి గాన నానావిధంబులను
హితముఁ జెప్పితి నీకు నిందునిభాస్య, మతి నీదుపుత్త్రుండు మనుట దలంపు
మనుట వేడుకఁ బూని యాకైక దాని, వినుతించి కౌఁగిట వేగంబ చేర్చి
శ్రీరాముపట్టాభిషేకోత్సవంబు, చేరి నాకెఱిఁగించి చెవులకుఁవిందు
చేసితి వేమందుఁ జెలువ నీపాందు, వాసిగా ఫలియించె వక్రోక్తి లుడుగు
భరతునకంటె నాభరతాగ్రజుండు, తిరమైనభక్తి విధేయుండు నాకు
నీమేలువార్తకు నేను మెచ్చితిని, భామరో యనుచు నేర్పడఁ గొంతసొమ్ము
ఘనతరనవరత్నఖచితమై యొప్పు, తనచేతికడియంబు దానికి వేగ
కొమ్ము కొమ్మని యొసఁగుటయు నాసొమ్ము, లమ్మాయలాఁడి యల్లటు పాఱవైచి
పాపంబు హృదయతాపంబు కోపంబు, దీపింపఁ బలికెన త్తెఱువతో మఱియు
నిది మేలుగా నుబ్బి తిచ్చలో నిప్పు, డిదియేమి మెచ్చుగా నిచ్చితి నాకు
నిదియేమి కైక యీహితముఁ గైకొనక, పదరి పల్కితి నీతి భావింపలేక
వలనొప్ప నేమనవచ్చు నీగుణము, కలకాల మీతీరుగాఁ జనఁదొడఁగెఁ
దన్ను మాలినయట్టి ధర్మంబు గలదె, కన్నుఁబోయెడునట్టి కాటుక గలదె
జగతిలో నెందైన సవతినందనుల, కగపడుశుభముల కాత్మఁ గోరుదురె
సవతికుమారుండు సామ్రాజ్యమునకు, ధవుఁడైన సకలభూధవులు బాంధవులు
ప్రజలు మంత్రులు రాముపంపు నేయుదురు, గజహయాదిబలంబు కైవసంబగును
దశరథునకు స్వతంత్రము లేదు పిదప, శశిముఖియైనకౌసల్య సంపదల
విట్టివీఁగఁగ సరివెలఁదివై యుండి, వెట్టిదానవె యెట్లు వేఁగించె దీవు
నది యిది యేల నీ వావధూమణికి, నొదుఁగుచు దాసివై యుండఁగవలయు
భరతుండు నారఘుపతికి భీతిలుచు, వెఱపున భృత్యుఁడై విహరింపవలయు
రాజదేవి యటంచు రమణి సీతకును, నీచిన్నికోడ లెన్నిక గొల్వవలయు
నెలఁత యిట్టిదయేని నీకేటి బ్రతుకు, కల దుపాయం బిది కార్యంబునకును
వనదుర్గముల రాము వసియింపఁ బనుపు, పనివడి భరతునిఁ బట్టంబుగట్టు
మనవుడు కైకేయి యక్కటా నాకు, జననాథుఁ డింతటి చనువిచ్చెనేని
ఆరాజు నేమని యడుగుదు దీని, నీరెండు దశరథుఁ డేల నాకిచ్చు
నెక్కడిమాట నీ వేమిచెప్పినను, నిక్కార్యఘటన నాకేరీతిఁ బొసఁగు
శ్రీరాము నడవులఁ జేరఁ బొమ్మనుచు, నేరీతిఁ జెప్పుదు నెలనాఁగ నేను
ననుచున్న కైకతో నాయుపాయంబు, తనకీడు మెఱయ మంథర చెప్పఁదొడఁగె
బడఁతుక తొల్లి శంబరుఁడు నింద్రుండు, దొడరి పోరాడ నింద్రునకు నై ప్రీతి
నినుఁ దోడుకొని సైన్యనివహంబుఁ దాను, జని రాత్రి మార్కొన్నశంబరుతోడఁ
బోరాడ దశరథభూపాలుమీఁద, నారాతిసుఁడు మాయ లలుకఁబన్నుటఁగు
ధవళాంగుఁ డనుమునిదయ నీవుగన్న, నవిరళంబగుమాయ నామాయ లడఁచి

నీవిభు నాదైత్య నిశితాస్త్రనిహతిఁ, జావకుండఁగఁ గాచి సంప్రీతుఁజేసి
వసుధేశుచే రెండువరములు నాఁడు, మసలక పడసితి మఱచితే వాని
ఈవె నాకీకథ లెఱిఁగించి మఱియు, నీ వాత్మ మఱచిన నేనేల మఱతుఁ
బట్టంబు నెడఁబాసి పదునాలుగేండ్లు, గట్టిగా మునివృత్తిఁ గౌసల్యకొడుకు
దారుణకాంతారధరణి యేలుటకు, ధారణీతలము నీతనయుఁ డేలుటకు
నా రెండువరములు నవనీశు నడిగి, యీ రెండు తెఱఁగుల నిటునేయఁ బనుపు
మడుగుచో నతఁ డెంత ప్రార్థించెనేని, జడమతితోఁగాక సత్యంబు మోపి
విడువక నీకార్యవిధము సాధింపు, తోడినకార్యంబు దొఱుకు నెల్లెడలఁ
బతి బొంక వెఱచు నీపై నెయ్య మెక్కు, డతకరింపఁడు నేయు మనిన రాగిల్లి
నీవంటిప్రియురాలి నీవంటిసఖుని, నీవంటి నయగుణనిధి నెందుఁ గాన
నీవు నాచే విన్న యీవరద్వయము, గారవంబునఁ జేయఁగా వరారోహ
ఈవెంచినటువలె నీభూమికెల్ల, నావరతనయుండు నాయకుండైన
బాగుగా నపరంజి బంగారుచేత, నీగూను పొదిగించి నీముఖేందువునఁ
దిలకంబు కస్తూరి దిద్ది నీమేను, వలనొప్ప భూషణావళులు నైసేసి
నటియించు మరునియందపుగొమ్మ యనఁగఁ, గుటిలకుంతల నీవు గ్రుమ్మరుచుండ
సఖులెల్ల నీమాట జవదాటకుండ, సఖియ నిన్నలరింతు సతత మే ననుచుఁ
నైక మంథరకు సత్కారములఁ చేసి, యేకాంతమునఁ దనయింటికిఁ బోయి
పెట్టినసొమ్ములు పెట్టెలోఁ బెట్టి, దట్టమా కస్తూరి తలపట్టు పెట్టి
మలినవస్త్రము గట్టి మదినల్క దొట్టె, చలము చేపట్టి భూస్థలిఁ బండెనంతఁ
దనలోన నూహించి తనుఁ గొల్చి వచ్చి, మనమారనున్న యామంథరఁ జూచి
జననాయకుఁడు రామచంద్రునిఁ బిలిచి, వనమున మునివృత్తి వర్తింపఁ బనిచి
భరతుని దగురాజ్యపదమునకెల్లఁ, గరమర్థిఁ బట్టంబు గట్టినఁగాని
యన్న పానములొల్ల నాభరణమ్ము, లెన్ని యిచ్చిననొల్ల నేమియు నొల్ల
నిట లేచి రానింక నేనంచు నలుక, నటు పూని మదిలోన నలయుచున్నంతఁ

దశరథుఁడు కైకయింటికిఁ బోవుట.

నైకేయితోడ రాఘవునిపట్టాభి,షేకోత్సవంబెల్లఁ జెప్పెద ననుచు
నారాత్రి దశరథుఁ డచటి కేతెంచి, చారుమాణిక్యకాంచనఘగర్భగిత
కనకరత్నకవాటకవ్యంతరముల, ఘనసారచందనకర్పూరగంధ
కలితనానారత్నకాంతిశోభితముఁ, దులకించు సౌధవేదుల వేగ కడచి
కేళీగృహంబునఁ గేకయపుత్రిఁ, బోలంగఁ బరికించి పొడగాన కపుడు
దావారికుని జూచి దశరథుఁ డడుగఁ,గా వాఁడు వగచుచుఁ గరములు మొగిచి
దేవ యాకోపమందిరములోపలికి, దేవి విచ్చేసె నే తెఱఁగొకో యెఱుఁగ
నని వాఁడు పల్కిన నామాటలకును, ధనుర్గ్రటంకారదారుణం బగుచు
వీనులఁ బడి మోము వెలవెలఁబాఱ, మానవాధీశుండు మానసంబునను
ప్రేమానుబంధంబు ప్రీతి రెట్టింప, నామందిరంబున కల్లన వచ్చి

యనిమిషపురిసుండి యచ్చరలేమ, చనుదెంచి పడియున్నచందంబు దోప
నూరకే ధరణిపై నున్నయావికచ, నీరజాననఁ జూచి నివ్వెఱగంది
వెరవెరపాటున వేదనఁ బొంది, తెఱవదగ్గరఁ జేరి దీనుఁడై మీఱి
యీయింతియొడలెల్ల నంటి చూచుచును, గాయజవివశుఁడై కడువేడఁ దొడఁగె
నిందీవరాక్షి పూర్ణేందునిభాస్య, ఇందిందిరాలక యేల యీయలుక
పవళింప నేలనే బాలేందుభాల, యవిరళమృదులపర్యంకంబులుండఁ
గోమలమృదులదుకూలంబులుండ, నీమైలచీర నీవేల కట్టితివి
పసిఁడిశిలాకతోఁ బ్రతిమైనమేనఁ, బొసఁగ భూషణములఁ బూన వేమిటికిఁ
జలపట్టి వెన్నెలచందమౌ నుదుటఁ, దలపట్టు లేల నీతలఁపెట్టు పుట్టె
నీలాలకంబుల నిగ్గులుదేర, నేల పాపటదీర్ప విన్నాళ్లరీతిఁ
గెమ్మోవి కినుమడి కెంపుసంధిల్లఁ, గమ్మతమ్మల మేల గైకోవు బాల
జిలుఁగువెన్నెలతేట చిఱునవ్వు మొలక, మొలపింపవేటికి ముఖచంద్రునందు
నిది యేమి కైక నీవిటు చిన్నవోయి, మది దూలి నీకింత మఱుఁగ నేమిటికి
నెవ్వరు నీదెస నెగ్గులు వలికి, రెవ్వరు మాటాడి రెదిరి నీతోడ
వారి నెఱఁగింపు వారిజనయన, వారి వారింతు నెవ్వారలనైన
నని పల్కి కన్నుల నందందఁ గ్రమ్ము, ఘనబాష్పపూరముల్ కరములఁ దుడిచి
లేమ నీవొకదిక్కు లేనిచందమున, భూమిపై నిట ధూళిఁ బొరల నేమిటికి
గాము సోఁకెనొ యొండు ఘనమైనరోగ, మేమి పాటిల్లెనో యెఱఁగింపు నాకు
వెజ్జులు వచ్చిన వేగ మాన్పెదరు, లజ్జింపనేటికి లలితాంగి నీకు
నటుగాన నీతలంపైన నొండరయ, నిటునేయుమని పల్కి మేను జేసెదను
వనిత నీకొఱకు నవధ్యులుగాని, యనఘుచరిత్రుల నైనఁ జంపెదను
జంపఁగఁదగిన దుర్జనకోటినైనఁ, గంపించి నీమాటఁ గాచిపుచ్చెదను
నీకుఁ బ్రియంబైన నిరువేదనైనఁ, జేకొని రాజుగాఁ జేసెద నెలమి
భామిని నీదయఁ బాసినయట్టి, శ్రీమంతునైన దరిద్రుఁ జేసెదను
నేను నావారు నీహితబుద్ధి నడువఁ,గా నీకు నిట్లుండఁ గారణమేమి
లేమ నామాట లాలించి నీవిపుడు, మోమెత్తి నామది ముచ్చటదీర
నడిగిన నాప్రాణ మైన నీకిత్తు, నడుగుము నీవన్న నానందమంది
యన్నాతి విభునినెయ్యంబు నెఱఁగి, సన్నపుఁబెలుఁగున జనపతి కనియె
దేవ నీచెప్పిన తెఱఁగున నీవు, గావింతునని బాస గావింతువేని
మఱి యెఱఁగింతు నమ్మాట నీకనినఁ, దెఱవతో దశరథాధిపుఁ డిట్టులనియె
వీరుఁ డెవ్వఁడు మేటివిలుకాండ్రలోన, సార మెవ్వఁడు ధర్మసమితిలోనెల్ల
నెవ్వనిఁ జూడక నేనుండఁజాల, నెవ్వఁడు ననుభక్తి నేప్రొద్దుఁ గొలుచు
నట్టి రాఘవునితో డతివ నీకోర్కి--, నెట్టనఁ గావింతు నేనన్న నలరి
మరుదగ్నిశశిభోమణిముఖ్యులైన, సురల వేర్వేఱ సాక్షులుగా నొనర్చి
ధరణీశుమదిలోని తమకంబు దెలిసి, కరుణను నెడఁబాసి కైకేయి పలికె

నొలసి దేవాసురయుద్ధంబునందు, వలనొప్ప నిచ్చితి వరములు రెండు
భూవర మఱచితే బుద్ధిఁ జింతింపు, మావరద్వయము నిన్నడిగెద నిపుడు
నాదిత్యకులజుండ వగుమహారాజ,వాదిరాజులకంటె నధికపుణ్యుఁడవు

కైకె తన కిచ్చినవరముల నడుగుట.

తప్పాడవాడినఁ దప్పవు నాకుఁ, దప్పక వరములు దయ నిచ్చితేని
ధరణికంతటికిని దగ రాజుగాఁగ, భరతుఁ ఒట్టముగట్టఁ బనుపు మొక్కటికిఁ
బరఁగఁ దాపసవృత్తిఁ బదునాలుగేఁడు, లురుదుర్గముల రాము ననుపు మొక్కటికి
నని పల్క నిర్ఘాతమై వచ్చి చెవుల, గొనకొండ మూర్ఛిలి కుంభిని ద్రెళ్లి
పెలుకురి భూపతి పెద్దప్రొద్దునకుఁ, దెలివొంది కైకేయిదెసఁ జూచి పలికె
కోమలి కేకయకులమునఁ బుట్టి, యీమాటలాడ నో రెట్లాడె నీకు
నడవులపాలు గమ్మని రాముఁ ద్రోవ, నెడపక తొల్లి నీ కెగ్గేమి చేసెఁ
గౌసల్యకంటె నిఁ ఘనతగాఁ జూచు, నీసేవ లొనరించు నీపంపుసేయు
నటువంటిసుగుణాఢ్యుఁడైన శ్రీరాము, నెటువలెఁ బొమ్మంటివే దయమాలి
ఆడవుల కతని నీ వంపు మటన్న, నెడ చూచి చూచి నే నెటులు పొమ్మందు
నామహాత్ముని రాము నడవుల కనిచి, యీమేనఁ బ్రాణంబు లెట్లు నిల్పుదును
నృపపుత్రి వని నిన్ను నెమ్మి గైకొంటి, చపలలోచన కాలసర్పంబ వైతి
నారాజ్యమైనఁ బ్రాణములైన నిత్తు, నారాము విడిచిపొమ్మని పల్కఁజాల
నను వృద్ధుఁ దీను ననాథు దుర్బలుని, మనికితపడకుండ మగువ రక్షింపు
చక్కఁగా నీపాదజలజంబులకును, మ్రొక్కెద నేను రానుని [1]నదాటమునఁ
జెలువ యీపాపంబు నేయఁ జింతింప, వలదనఁ గోపించి వామాక్షి పలికె
రాజేంద్ర సత్యపరాక్రమస్ఫూర్తి, పూజితకీర్తివై బొంకంగఁ దగునె
ఇట్టి దేవతలంద రెఱుఁగంగ నొట్టు, పెట్టి తప్పెద వెట్టి పృథ్వివిపాలుఁడవు
ఒకిగువ్వకై తనయొడలిమాంసంబు, నొకడేగకును శిబి యొసఁగఁడె మున్ను
క్షోణిదేవున కలర్కుం డనురాజు, త్రాణతో నొసఁగఁడె తనలోచనములు
చెలరేఁగి జలధియుఁ జెలియలికట్ట, బలిమి దాఁటక లోను బడియుండలేదె
యది యటులుండె నీయన్వయభవులు, మదిలోన నవ్వులనూటలకైన
కలలోన బొంక రిష్వాకుండవయ్య, వెలయఁ గౌసల్యకు వెఱచి బొంకెదవు
బొంకెడువాఁ డొక్కపురుషుఁడే యనుచు, బొంకితి ననుఁబొంద బుద్ధిగా దింక
విచ్చలవిడి నేను విషమైన మ్రింగి, చచ్చెద నటమీఁదఁ జంపింపు భరతుఁ
బావనుఁ డగురాముఁ బట్టంబు గట్టు, నీవు కౌసల్యయు నెమ్మది నుండు
మని పల్కుటయు శోక మాత్మ రెట్టింప, జననాథుఁ డెంతయు సంతాపమంది
వెలవెలఁబోయి వివేకహీనతను, గలిగి యాకైకతోఁ గ్రమ్మఱఁ బలికె
యేల కైకేయి నీకిట్టిపాపంబు, బాలిశత్వంబును బ్రాపించె మదిని
నన్నయుండఁగఁ దమ్ముఁ డవినీతితోడ, నిన్నేల నేలునే యిన్నియు నేల

---

1 హరాత్తుగను.

నీకుమారుఁడు ధర్మనిరతుండు భరతుఁ, డీకలుషోక్తికి నెట్లొడిగట్టు
మాకులాగతమైన మర్యాదఁ దలఁపు, శోకార్తు ననుఁ దెగఁజూడక మనుపు
మెప్పుడు నిల్లాలు హితము భక్తియును, దప్పక సఖురీతిఁ దల్లిచందమున
దాసివైఖరి సహోదరి తెఱుంగునను, నాసేవ లొనరించు నానావిధమున
నట్టి కౌసల్య మోహాపుఁబట్టిఁ బాసి, పట్టినధృతి నెట్టు ప్రాణములప్పట్టు
సౌదామనీలతాసంకాశ దేహా, వైదేహి యేరీతి వగల వేఁగించు
నాసుమిత్రాపుత్రుఁ డతనితల్లియును, ఈసోద విని శోక మెట్లణంచెదరు
శ్రీరామపట్టాభిషేకంబు గోరి, పౌరులందఱు వేడ్కఁబడియుండుచోట
నారామ నడవుల కనిచితినేని, ధీరాత్మకులు నన్నుఁ [1]దిట్టకుండుదురె
కావున నెల్లలోకములకుఁ గీడు, గావించి చేసౌఖ్యగతు లందెదేవు
యిది యేలొకో కైక యింకొకమాట, ముదిత చెప్పెద నిక్కముగ నీవు వినుము
కలువరేకులఁబోలుకన్నులవాని, మొలకనవ్వులమోము మురిపెంబువాని
బలువైన యూజానుబాహులవాని, వలరాజుఁగేరు చెల్వముగలవాని
నలరుఁ గల్వలకాంతి నగుమేనివాని, జల్లచూపులు వెదఁజల్లెడువాని
సుధ లొల్కు తియ్యనిసుద్దులవాని, బుధులకు హిత మాత్మఁ బూనెడువాని
వలచి నాకెపుడు నేవలునేయువాని, నిలువెల్ల ధర్మమై నెగడెడువాని
సత్యనిత్యుండయి చరియించువాని, నిత్యానురక్తిచే నెగడెడువాని
రాముని జితభృగురాముని గాంతి,సోముని సద్గుణస్తోముని కీర్తి
కాముని సౌందర్యకాముని శాంత,ధాముని రవిసమధాముని బాసి
నిమిషమాత్రంబైన నేనోర్వఁజాల, గమలాక్షి నీవెఱుంగవె యిట్టివాని
నాయుత్తమోత్తము నడవుల కనుప, బోయెఁ బ్రాణంబులు వోవు నాక్షణమె
యెంత పాపిష్ఠివే యెంత కట్టడివె, యెంత మూఢాత్మవే యెంత రాక్షసివె
కరినాత్మురాల యీకల్మషం బేల, శరమతిఁ గోరెడు సాధ్వివై యుండి
యూలవై ప్రాణాపహారంబు సేయ, కాళరాత్రివిగాక కాంతవా నీవు
నడచి రాముఁడు కాననమున కెట్లరుగు, నడవుల నెట్లుండు నందఱు దొఱఁగి
మెత్తనిపాన్పున మేనెత్తుభోగి, యెత్తెఱుంగుననుండు నిలఁ దృణశయ్యఁ
బంతినిష్టాన్నములో బంధులు దాను, నెంతయు నియతితో నిట నారగించు
కడుపుణ్యదేహికిఁ గందమూలములు, నెడపక భుజియింప నెటు సమ్మతించు
నతివ నీకతిభక్తుఁ డైనరామునకు, మతిఁ గీడు దలఁపకు మన్నింపు మనుచు
నడరు శోకంబున నడుగులమీఁదఁ, బడిన మ్రొక్కొల్లక పాదములో దిగువ
భూకాంతుఁ డిలఁబడి పౌరలఁ గైకొనక, కైకేయి దళరథుఁ గని యిట్టు లనియెఁ
జాలుఁజా లీవట్టి జగజోలిమాట, చాలింపు మీపట్టి జాడ లేమిటికి
ధర్మంబు మాని సత్యము వీటిఁబుచ్చి, నిర్మలయశ మెల్ల నీటిలోఁ గలిపి
యీవరద్వయము నా కీలేదటంచు, భూవర బొంకి నీపుత్రుండు నీదు

---

1 దెగఁదిట్టకుండ్రె.

దేవులు నీవు వర్ధిల్లుము నేను, నాచరసుతుఁడుఁ బ్రాణములఁ బాసెదము
అనునంత మాఱాడకయ వేగి విభుఁడు, తనమది శోకించి తలవాంచియుండె
నంత వేగుటయుఁ దూర్యంబులు మ్రోయ, నంతంత వందిజనావళి పొగడఁ
గలగొని గర్పూరగంధములఁ జల్లి, జలముల జలకంబు చదురొప్ప నాడి
పరఁగ దివ్యాంబరాభరణములఁ బూని, చిరకీర్తి రాముఁడు సీతతోఁ గూడి
తెఱఁగొప్ప శచితోడ దేవేంద్రుఁ డొప్పు, తెఱఁగున సంపూర్ణ తేజుఁడై యొప్పె
మఱి యంత నభిషేకమండపంబునకు, నెఱి వసిష్ఠాదులు నిండ నేతెంచి
యాయరుంధతి మొదలగుపుణ్యసతులు, నాయతమతులగు నామంత్రివరులు
తగవొప్ప మకుటవర్ధనచక్రవర్తి, లగుమహారాజుల నందు రప్పించి
పంచపల్లవములు పంచవల్కలములు, పంచామృతంబులు పట్టవేసుంగు
నెనమండ్రుకన్యలు హేమఋక్షంబు, నొనర నౌదుంబరయోగ్యపీఠంబు
గంగాదితీర్థోదకము లాదిగాఁగ, మంగళవస్తుసామగ్రి రప్పించి
వరరత్నభూషణావళులఁ దెప్పించి, తరమిడి వేదోక్తిదానములఁ జేయ

కైకయింటికి దశరథుని బిల్వ సుమంత్రుండు పోవుట

నొకలక్షకన్యల నొకలక్షగోవు, లొకలక్షయష్ట్రంబు లొప్పఁ దెప్పించి
జపములు సెయించి శాంతిసేయించి, విపులహోమంబులు వేడ్క సేయించి
యనుపమం బగులగ్న మాసన్న మైన, మనుజేశుఁ బిల్వ సుమంత్రు నంపుటయుఁ
గైకేయినగరికిఁ గడఁకతోఁ బోయి, వాకిట నిలుచుండి వలనొప్పఁ బలికె
దేవ సూర్యుఁడు పొడ తెంచుచున్నాఁడు, వేవేగ మీరట వేంచేయవలయు
శ్రీరాముపట్టాభిషేకంబుసేయ, నారూఢమగులగ్న మాసన్నమయ్యె
మనుజేశ యభిషేకమండపంబునకు, మునులు రాజులు మహోత్సులు వచ్చినారు
పౌరులు బుధులును బంధువుల్ గూడి, మీరాక గోరి యిమ్మెయి నున్నవార
లన విని దశరథుఁ డావార్తలెల్లఁ, దనకుఁ గేవల మనస్తాపంబుఁ గూర్ప
వనట నీవును నొంప వచ్చితె యనుచు, వినియు నిద్రించిన విధమున నుండె
నాసమయంబున ననియెఁ గైకేయి, యోసుమంత్రుఁడ వేగ యుర్వీశుకడకు
రాముని దోడ్తెమ్ము రాజుపంపనుడు, నామాట విని యతఁ డప్పుడే పోయి
శీతపటీరాంబుసిక్తాంగణంబు, కేతనాన్వితము నికేతనాంచితము
చందనాగరుధూపసౌరభాన్వితము, మందానిలాలోలమాలికాయుతము
ప్రతిగృహద్వారరంభాస్తంభవర్గ, మతులితమణితోరణాభిరామంబు
పౌరజనాదిసంభ్రమదుర్గమంబు, నౌరాజమార్గంబు నపుడు గన్గొనుచు
నింద్రగేహము హసియించు నాకిన్న, రేంద్రమందిరముతో నీడుజోడాడి
సాంద్రవైభవరమాసహితమౌ రామ,చంద్రునినగరికిఁ జనుదెంచి లోనఁ
జనువరులైయున్న జనులచే వేగ, తనరాక యెఱిఁగించి తదనుజ్ఞ వడసి
చిత్రాఖ్యతారతో సిరులుల్లసిల్ల, మైత్రియొప్పెడు చందమామచందమున
సీతాసమేతుఁడై చెలువొందురామ, భూతలనాథునిఁ బొడఁగాంచి మ్రొక్కి

రాదేవ మిము దశరథచక్రవర్తి, యీదేవి కైకగృహంబున నుండి
యీదటఁ బిలిచి తెమ్మనిపించె ననుడు, మోదించి చిఱునవ్వు మొలకలు నిగుడ
భరణిజ నటనుంచి తాను లక్ష్మణుఁడు, కరమర్ధి రథమెక్కి కడకతోఁ గదలి
చతురంగబలము లసంఖ్యలు గొలువ, నతులవాద్యములు మిన్నంద్రి మ్రోయంగ
వందిబృందములు కైవారము ల్సేయఁ, జెంది పుణ్యాంగన ల్సేసలు చల్ల
పురజను లానందమున జయవెట్ట, నరనాథునగర కున్నతగతి వచ్చి
యరదంబు డిగి రాముఁ డపుడు కైకేయి, వరమందిరముఁ జొచ్చి వలనొప్పవచ్చి

శ్రీరాములు కైకయింటిలో నున్నదశరథుని బొడగాంచుట.

వదనంబు వాంచి వైవర్ణ్యంబు మించి, పెదవులు దడపుచుఁ బెంపెల్ల నుడిగి
యుడుగక కన్నీరులొలుక శోకాగ్నిఁబడి కాలు దశరథపతి చేరఁబోయి
కరము భీతిలి మ్రొక్కి కైకకు మ్రొక్కి, కరములు ముకుళించి కడువిస్మయంబు
వెఱవెఱపాటును విహ్వలత్వంబు, వెఱపును మఱపును వీడిజోడాడ
పరిపరివిధములఁ బలుమాఱు నెమకి, పరమపుణ్యుఁడు రామభద్రుండు పలికె
నోదేవి యిదియేమి యుర్వీశ్వరుండు, నాదెసఁ జూడఁడు నాతప్పులేమి
యీవిన్నఁదనమును నిట్టిదుఃఖంబు, నీవిచారము రాజు కేమిటఁ గలిగె
ననవుడు నాకైక యధిపుచందంబు, వినుపింతు నీవు గావించెదవేని
నని పల్క రఘురాముఁ డది యేమి తెఱఁగు, వినుపింప వోయమ్మ విశదంబుగాఁగఁ
దండ్రివాక్యములకై దారుణశిఖల, వేండ్రమౌనగ్నిలో విషధిలోనైనఁ
బడియెద విషమైన భక్షించువాఁడ, జడియక వినుపింపు సత్య మీమాట
యనవుడు కైకేయి యారాముఁ జూచి, మనమునఁ గృపమాలి మఱి చెప్పఁదొణఁగెఁ
గరుణ దేవాసురకదనంబునందు, వరములు రెండు భూవరుఁడు నాకొసఁగె
నవనీశు నారెండు నడిగి మాభరతు, నవనికిఁ బతిఁజేయు మంటి నొక్కటికి
నెడపక పదునాలుగేండ్లు నిన్నంపు, మడవుల కాపుండ నంటి నొక్కటికి
ననుటయు నౌఁగాక యని యిచ్చి నీకు, వినుపింప మీతండ్రి వెఱచుచున్నాఁడు
కావున జడలు వల్కలములు గట్టి, నీవింకఁ దపసివై నృపవేష ముడిగి
చనుదెమ్ము దశరథజనపతి బొంకఁ, డనిపింపవలతేని యడవుల నుండు
పొమ్మన్న విని మొగంబునఁ జిఱునవ్వు,గ్రమ్మ మాటల నొండు కసటు లేకుండఁ
గరుణయుఁ దెగువయు గరిమంబు దోఁప, బరమపుణ్యుఁడు రామభద్రుండు పలికె
నిటుసేయమన్న వాఁ డినకులాధీశుఁ, డటఁట నాసహోదరుఁ డగురాజ్యకర్త
యటమీఁద నీకోర్కి యడపడ నేల, కటకటా కైకేయి కడుముగ్ధవై తి
వింతమాత్రమునకై యినవంశజుండు, చింతింపనేటికిఁ జిత్తంబులోనఁ
దనజనకునిమాట దాఁటినవాఁడు, తనయుఁడే తలపోయ దాయాదిగాక
యే నేమి నాతమ్ముఁడేమి యీభూమిఁ, బూసుటకును బుణ్యపురుషుఁడై యున్న
భరతునిదెస నాకుఁ బ్రాణంబులైన, సరకుగావనిన రాజ్యము నాకు సరకె
యనవుడు ముదమంది యాకైక పలికె, మనుజేంద్రతనయ యామాట కేనిపుడు

భరతుని దోడ్తేరఁ బనిచెద నింక, నరుగుము వనముల కరుగునందాఁక
కుడువఁడు పలుకఁడు గూర్చుండఁ డిట్లు,పడియుండు నృపుఁడంచుఁ బల్కఁబల్కుటయు
కటకటా తగునె యీకరినోక్తు లనుచుఁ, బటుమూర్ఛతో నేలఁబడియె నారాజు
నయ్యెడ నారాముఁ డవనీశచంద్రు, నొయ్యనఁ బట్టి శైత్యోపచారములఁ
దెలిపియంతయును బోధించుచు మఱియుఁ, బలికె కైకను జూచి పరమహర్షమున
నింతయేటికిఁ జింత యిదియెంత నాకు, నంతరంగంబున ననుమానపడకు
పరికించి ధర్మంబు పాటింతుఁగాని, కరమర్థి వ్యర్థంబు గావింప నేను
వేయేల విభునాజ్ఞ వినఁబడకున్న, నీయాజ్ఞ గడవను నిక్కువం బరయఁ
జారుల శీఘ్రసంచారుల ఘోట, కారూఢులుగఁజేసి యనిచి వేవేగ
కరమర్థి నీలగ్నఘటికలయం దె, భరతునిఁ బిలిపించి పట్టంబుగట్టు
మిదె యరణ్యములకు నేఁగెద ననుచు, వదనాబ్జ మలరంగ వలఁగొని వచ్చి
తనతల్లికిని సుమిత్రావధూమణికి, జనకనందనకు నీచంద మంతయును
వినిపించి వారల వెస నూఱడించి, చనుదెంతు నోయమ్మ సందియపడకు
మని రాజునకు మ్రొక్కి యాకైక కెరఁగి, తనుఁగొల్చి సౌమిత్రి తగిలిరాఁ గదలి
చెలువార పట్టాభిషేకంబుకొఱకు, లలినమర్చిన మంగళద్రవ్యములకు
నుచితప్రదక్షిణ మొనరించి చిత్త, మచలమై యవికార మై వికసింప
రాజ్యపట్టము మాని రాముండు లోక,పూజ్యుండు కాననభూమి కేగెడిని
ఆమహాకలకలం బంతగపురమున, వినఁబడ దశరథువెలఁదులు గలఁగి
యేభక్తి కౌసల్యయెడను గావించు, నాభక్తి మనయందు నట్ల కావించు
నాగుణాలంకారు నామహోదారు, నాగిరివరధైర్యు నాశౌర్యధుర్యు
నాపుత్రరత్నంబు నకట కానలకు, భూపాలుఁ డేమని పొమ్మనేర్చె
వీఱడియై రాము విపినవాసమున, కాఱడిఁబుచ్చుంగ నౌనమ్మ యనుచు
మీఱినవగలతో మేదినీనాథు, దూఱుచు శోకింప దొడఁగి రందఱును
ఆసమయంబున నారామవిభుఁడు, కౌసల్యయింటికిఁ గడఁకతో వచ్చి
యటమున్న దొడఁగిన యభిషేకమునకుఁ, బటువిఘ్ను మొరలు సంపాదింపకుండ
జపములు శాంతులు సాధుహోమములు, విపులైకనిష్ఠఁ గావించుచుఁ బ్రేమఁ
గరమర్థినేమమ్ము గైకొని భక్తి,పరత జనార్దనుఁ బ్రార్థించుచున్న
కౌసల్య రాముఁ రాకకు సంతసిల్లి, భాసిల్లు వరపుణ్యభామలుఁ దాను
నెలమి నేసలు గొంచు నెదురుగా వచ్చి, వెలయ శుభాచారవిధు లాచరింప
నంత నాకౌసల్యయడుగులకెఱఁగ, సంతోషమున రామచంద్రునినెత్తి
యాలింగనముసేసి యాయువుయశము, భూలాభమునుబొందు పుత్ర నీవనుచు
దీవించు తనతల్లిఁ దెఱఁగొప్ప రామ, దేవుఁడు వీక్షించి దీనుఁడై పలికె
నేకార్యమును మీర లెఱుఁగరు తల్లి, మీకు సుమిత్రకు మిథిలేంద్రసుతకుఁ
గడుభీతిపుట్టించు కార్యంబు పుట్టె, విడువక ధృతిఁబూని వినుము చెప్పెదను
వసుధేశుచే రెండువరములు తొల్లి, యసమానగతిఁ గైక యాజిలోఁ బడసెఁ

గొడుకుఁ బట్టముగట్టఁ గోరె నొక్కటికి, అడవికి నఁపుఁ బంప నడిగె నొక్కటికి

కౌసల్య ప్రలాపించుట

నడిగిన దశరథుఁ డధికశోకమునఁ, బడుటయు మాతండ్రిపలుకు రక్షింప
నడవులఁ బదునాలుగబ్దంబు లుండఁ, గడఁగి వచ్చితి ననఁ గౌసల్య మఱిని
గలఁగి నివ్వెఱగంది కడుఁ జిన్నవోయి, పలుక నేరక మ్రానుపడి యుస్సురనుచు
ముడిగొన్నవగలతో మొదలంటఁ ద్రవ్వఁ,బడియున్న లతఁబోలెఁ బడిమూర్ఛవోయె
నడలుచు రఘురాముఁ డప్పు డాతల్లి,యెడ నతిభక్తితో నెత్తి నెమ్మోన
గమియ నంటినధూళిఁ గరములఁ దుడిచి, కొమరారుగద్దియఁ గూర్చుండనునిచి
శ్రమము దీఱంగ లక్ష్మణుఁడును దాను, సముచితగతి నుపచారముల్ సేయ
నొదవిన వగలతో నొయ్యనఁ దెలిసి, పెబవులు దడుపుచు బింబోష్ఠి పలికె
ననఘ రాఘవ నిన్నుఁ నడవులనుండు, మనుపల్కు విన నెందు నపదు వీనులకు
పెలుచ నొక్కట నిన్నుఁ బిలిపించియట్లు పలుక నెమ్మెయిఁజాలఁ బొర్లిపోవేశ్వరుఁడు
ధరణి కింతటికిని దగురాజు గాఁగ, భరతు పట్టముగట్టి పతినేయుఁ గాక
కడుఁగృపశూన్యుఁడై కాకుత్స్థతిలకుఁ, డడవికి నిన్నుఁ బొమ్మనకున్న నేమి
యవివేకిగా నొండె యధమముఁడుగాఁడు, సవతిమాటలు వినఁజనునయ్య తనకు
నిదిధర్మ మిదికార్య మిది లెస్స యనుచు, మదికెక్కుహితులైన మఱిమంత్రులైనఁ
గులగురుఁడైన లోకులు మెచ్చు రతనిఁ, దెలుపలేరైరి నీదెస మైత్రిఁగూడి
యింత నేరముచేసె నెన్నఁడు నాథుఁ, డింతపాపముఁజేసె నెన్నఁడు నైక
యడవులనుండు పొ మ్మని నిన్నుఁజూచి, నుడువఁగఁ గైకకు నో రెట్లులాడె
ననువునఁ జేరి ప్రాణములైన నడుగు, జననాథునకుఁ దాను చనవురా లైనఁ
గైకకుఁ బుట్టి లోకము లేలకీవు, నాకేల పుట్టితి నారామచంద్ర
నీవు నాకడుపున నిటఁ బుట్టకున్న, నీవిషాదము నాకు నేల పాటిల్లుఁ
గొడుకులులేని యాగొడ్రాలికంటెఁ, గడలేనిశోకంబు గలిగె నా కకట
పెద్దకాలమునకు బిడ్డలులేక, తద్దయుఁ బ్రీతి నిఁ దనయుఁగాఁ గాంచి
యూఱడియుండుచో నుండలేదయ్య, నాఱడిచెడిపోయె నకట నాతపము
నరనాథనందన నడించి నీవు, కరము తెంపున ఘోర కాంతారములకు
నరిగి నప్పుడె నాకు నారసిచూడ, మరణంబు దప్పించి మఱియొండు లేదు
నన్నెట్లు విడిచి కానల కేగె దింక, నన్న నే నేమిట నడలార్చుకొందు
నెలమిమై నిరుపమితేనువత్సరము, లలర పెంచితి నిన్ను నఖిలంబు నెఱుఁగ
నట్టి న న్నిట డించి యెట్లుపోయెదవు, పట్టి నీకొఱకునై పాలించినట్టి
వివిధవ్రతంబులు వివిధదానములు, చవుట వి త్తనములు చల్లిన ట్లయ్యె
భరతుండు రాజైనఁ బరివారజనులు, కరుణమాలినయట్టి కైకకు వెఱచి
ననుఁ గొల్వవత్తురే నరనాథునందుఁ, జనవు లేకుండెడు చందంబుఁ జూచి
వాసియు వన్నెయు వైభవం బెడలి, యీసవతులలోన నెట్లు వర్తింతుఁ
గైక రాజసము నేకరణి సహింతు, నీకార్య మిట్లౌట నెఱుఁగలే నైతి

వీనుల నీవార్త వినుటకు మున్నె, యే నేల చావనో యివవంశతిలక
కడఁగి యీరాజ్యంబు గైకొని కైక, కొడుకు పట్టముగట్టుకొని యేలుఁగాక
భూరిదుర్గములకుఁ బోవ నేమిటికి, నూరకె నాయొద్ద నుండవే తండ్రి
యావసిష్ఠాదిసంయములు బాల్యమున, భావించి చూచి నీపాదపద్మములు
జలజాతహలకులిశధ్వజకలశ,ములు మొదలగుచిహ్నములు విలోకించి
యీవిశ్వమంతయు నితఁ డేలు ననిరి, యీవార్తఁ గైక నేఁ డనృతంబు చేసె
నని పెక్కుతెఱఁగుల నడలుకౌసల్య, గని లక్ష్మణుండు శోకము కోప మెసఁగ
ముడివడుబొమలతో మొగము కెం పెసఁగ, నుడుగక రోషాగ్ను లొగి మండుచుండ
రాముమాతను జూచి రామునిఁ జూచి, సౌమిత్రి యడిదంబు జళిపించి పలికె
మగటిమి దిగనాడి మానంబు విడిచి, తగు నుత్తమక్షత్రధర్మంబు వదలి
వాలినతేజంబు వమ్ముగాఁ జేసి, యేలకో దీనోక్తు లిట్లాడ నీకు
నక్కటా వీతజ్ఞుఁ డగుతండ్రి పనుపు, స్రుక్కక ధిక్కరించుట కాదుకాక
కామాతురుఁడు పాపకర్ముండు వృద్ధుఁ, డేమిటి కీరాజు నింత పాటింపఁ
గైకేయి కిచ్చి బొంకఁగ నేరననుచు, నీకిచ్చి యొడక నేఁ డెట్లు బొంకె
నడరి వసిష్ఠాదు లందఱు వినఁగ, కడఁగి నిట్ట బట్టంబు గట్టెదనన్న
పలుకు సత్యంబుగాఁ బాటింపవలదె, తలఁపంగ నదియసత్యముగాదె తొలుత
నెక్కడి దశరథుం డెక్కడి వరము, లెక్కడి భరతుండు నెక్కడి కైక
విను మేను నిజముగా విల్లెక్కువెట్టి, కొనియున్న నన్ను మాఱొక్కన నెవ్వఁడోపు
భరతునిమొదలుగాఁ బగవారిఁ జంపి, నెరసి యీపుర మెల్ల నీయు గావింతు
హరిహరబ్రహ్మాదు లడ్డమైరేని, తరమిడి తోలి యుద్ధము సేయువాఁడఁ
గమనీయకేయూరకంకణాలంకృతములు మనోజ్ఞచందనచర్చితములు
నగు నాభుజమ్ముల నభిషిక్తుఁ జేసి, పగతురఁ జంపుదుఁ బొల్పుడి యిపుడె
పాటింప నావంటిబంటు గల్గియును, నేటికి సామ్రాజ్య మెల్ల వర్జింప
నడవులకేఁగెద ననునట్టి బుద్ధి, విడిచి కౌసల్యకు వేడ్క లుప్పొంగ
నెట్టనఁ గడిమిమై నిజశక్తిమెఱసి, పట్టంబుఁ బూనుచుఁ బ్రజలఁ బాలింపు
మనవుడు రాఘవుం డనుజన్ముఁ జూచి, మనమునఁ దలపోసి మమత నిట్లనియె
సౌమిత్రి శూరత సమయంబుగాదు, ఈమాట మెచ్చదు హితబుద్ధి నిలువు
చాలుఁజా లీపట్ల జగములేలఁగను, పోలంగ మనకబ్బె బొనఁగుకార్యములు
శూరత నిక్కడ చూపంగనేల, వైరులయందును వర్తింతు గాని
యనిన కౌసల్యయు నారామముఁ జూచి, వినుము నీతమ్ముని విమలవాక్యములు
శౌర్యంబు చేపట్టు జనులెల్లఁ బొగడ, నార్యసమ్మతముగా నవనిఁ బాలింపు
సవతిమాటలకు రాజ్యము మాని యడవి, నివసింపఁబోవుట నీకు ధర్మంబె
నాయింట నుండుము నాదుశుశ్రూష, నేయు మింతటికంటె ఋతిధర్మ మెద్ది
జనకువాక్యము నేయఁ జాలిన నీకు, జననివాక్యం బెన్న సన్నమే యన్న
యని పెక్కువిధముల నడలుచునున్న, తనతల్లినూరార్చి తలఁపెల్లఁ దెలిపి

ఏమిటి కీమాట లింత శోకింప, నేమిటి కని రాముఁ డేర్పడఁ బలికె
బలువిడి తమతండ్రిపనుపునఁ దొల్లి, చలమునఁ దమతల్లిఁ జంపె భార్గవుఁడు
తఱుగని కినుకమైఁ దమతండ్రి పనుప, సరగున నొకగోవుఁ జంపె గుండినుఁడు
తనమనోహరమైన కారుణ్య మొసఁగి, తనతండ్రిముదిమియుఁ దాల్చెఁ బూరుండు
తమతండ్రిపనుపునఁ ద్రవ్వరే తొల్లి, తమకించి సగరనందను లంబునిధిని
గడఁగి తండ్రిదిపంపుఁ గైకొని నాకు, నడవులనుండుట యది యెంత పెద్ద
నీవల్ల భునిమాట నీకును నాకు, భావించి నేయుట పరమధర్మంబు
ఈలక్ష్మణుఁడు బాలుఁ డేమియు నెఱుఁగఁ,జాలఁడు వీరవిచారంబె కాని
యని నవ్వుచును రాముఁ డనుజన్ముఁ జూచి, తనలోన శాంతమంతయుఁ దోఁపఁ బలికె
నీవిక్రమంబును నీభుజాబలము, నీవిలువిద్యయు నీదుబుద్ధియును
నీమగతనమును నేటికి యకట, సౌమిత్రి నాయెడ సవ్వక్తి కిదియె
యెంత సాహసము నీవిపుడు కోరితివి, ఎంతటిబుద్ధి నా కీవు చెప్పితివి

శ్రీరాములు కౌసల్యకు నీతిఁ జెల్పుట.

కొనకొని యిటువేఁడుకొన్నది తల్లి, యనుకంప లేక పొమ్మన్నాఁడు తండ్రి
యిలయెల్లఁ జేకొని యీరాజ్యపదము, నలినేలువాఁ డిక నాసహోదరుఁడు
బలువిడి యెవ్వరిపై నల్గె దీవు, బలగర్వములు చూపఁ బాడియే నీకు
నర్మిలి తండ్రివాక్యము నేయుకంటె, ధర్మంబు గలదె యీతండ్రివాక్యంబు
త్రోయుటకంటెను దురితంబు గలదె, వేయువిధంబుల వెదకి చూచినను
జనకునిపను పవశ్యము నీకు నాకు, జననులకును జేయ సహజధర్మంబు
గాన నాతనిపంపు గైకొని నేను, కానల కేగుట కా దనవలదు
పరమపావనులైన భానువంశజుల, చరితంబు నీకు విచారింపవలదె
కావలసినపనుల్ గాఁకేల మాను, డైవయత్నము లివి దాఁటంగఁ దరమె
యవిన లక్ష్మణుఁ ఱెప్పు డాటోప ముడిగి, తనరఘురాముని తలఁపెల్ల నెఱిఁగి
జడిసి యూరకయుండె సాధ్వి కౌసల్య, కొడుకు తెంపునకు మిక్కుటమైన వగలఁ
బొగులుచుఁ గళలచేఁ బున్నమచంద్రు, దెగడు రాముని మోము దృష్టించి మఱియు
నాకులభూషణ నాముద్దులయ్య, నాకూర్మి కొమరుండ ననుఁగన్నతండ్రి
క్రేపుఁ బాసినయావుక్రియ నిన్నుఁబాసి, యీపదునాలుగేం డ్లిందుండఁజాల
ననుఁగూడి చనుదెంతు నిష్ఠురాటవుల, కని ప్రలాపించు నయ్యంబ నూరార్చి
యనునయాలాపదీనాస్యుఁడై రాముఁ, డనియె నోయమ్మ యిట్లాడంగఁ దగునె
పతియె ప్రాణపదంబు పతియె చుట్టంబు, పతియె దైవత మాత్మఁ బరికింప నట్టి
పతిఁబాసి నావెంటఁ బఱతెంతు ననుట, మతిఁ దలంపఁగ ధర్మమా తల్లి నీకు
వసుధేశునానతి వసుమతిభార, మెసఁగ నాభరతున కిచ్చుట తప్పె
నవనీశుఁ డిచ్చెద నన్నవరంబు, లవిచెండు కైకేయి యడుగుట తప్పె
ననృతంబునకు నోడి యకట రాజేంద్రుఁ, డొనరంగ వరము నిట్లొసఁగుట తప్పె
మాతండ్రియానతి మది నిర్వహించి, యే తెఱంగునఁ బూను టిది నాకు తప్పె

చేకొని పతిపంపు చెల్లింపకున్న, నీకైన తప్పదు నిక్కువం బరయఁ
బోనికానల కేను బోయిన మిగుల, దీనుఁడై పొగలు పార్థివుని నీవెపుడు
ననునయించుచు సపర్యలు నొనర్చుచును, మసలునుమ్మలికంబు మాన్పంగవలదె
దురితదూరుండు బంధుననీతిరతుఁడు, భరతుండు నాకన్న భక్తి నిన్నరయు
నీవు శోకింపకు నీకలనైన, భావింప దశరథ పతియొప్పుఁ దనకు
నైకేయి విడువక కలిసి వర్తింపు, నాకు నేమముగోరి ననుఁ వీడుకొలుపు
మని పల్కి మ్రొక్కిన నారామచంద్రుఁ, గనుఁగొని కౌసల్య కౌగిటఁజేర్చి
క్రమ్మెడుశోకాశ్రుకణము లందంద, వెమ్ముచు రఘురాము వీపున రాల
నడవికిఁబోయెదే యకట నీవనుచుఁ, గొడుకుమై నివిరి డగ్గుత్తికఁబెట్టి
యొక్కింత ధృతిఁబూని యుల్లంబులోనఁ, జెక్కిటఁ గన్నీరు చెతఁ బోఁ దుడిచి
పావనజలములఁ బ్రక్షాళితాస్య, యై వచ్చి పుణ్యాహ మపుడు సేయించి
సురలును ఖేచరుల్ శ్రుతులును యతులు, తరులును గిరులును దాంతియు శాంతి
నదులును నిధులు నర్ణవము నాకసము, నుదకంబు మారుతం బుర్వియు నగ్ని
దిక్పాలకులు దశదిశలు చంద్రార్క, వాక్పతిప్రముఖులు వలనొప్ప నీకు
స్వస్తి యెల్లప్పు డొసంగుదు రనుచుఁ, బ్రస్తుతిజేసి యా భామాలలామ
పొలుపొంద వేల్పులఁ బూజించి రాము, వలచేత నొకరక్ష వలనొప్పఁ గట్టి
యలిగి వృత్రాసురు ననిఁ జంపఁబోవు, బలభేది యగువజ్రపాణికిఁ దొల్లి
యేమంగళము లిచ్చి రెల్లదేవతలు, నామంగళములు నీ కగు రామచంద్ర
యరుదుగా దివిసున్న యమృతంబుఁ దేరఁ, గర మొప్ప నరగెడు గరుడున కర్థి
నేమంగళములిచ్చె హితమతి వినత, యామంగళములు నీకగు రామచంద్ర
దేవరాజ్యంబును దిరుగ నార్జింప, నావామనుఁడు పోవునపుడు సంప్రీతి
నేమంగళంబుల నిచ్చె నయ్యదితి, యామంగళములు నీ కగు రామచంద్ర
యని రాముఁ దీవించి యక్కునఁజేర్చు,కొని మస్తకంబు మూర్కొని నిండుమదిని
అనిపినఁ దనతల్లియడుగుల కెఱఁగి, యనుజన్మసహితుఁడై యచ్చోటు వెడలి
యభిషేకవిఘ్నవృత్తాంతంబు దెలిసి, సభనుండురాజులు సచివులు సకల
పౌరులు శోకింపఁ బాదచారమునఁ, జారుచామరసితచ్ఛత్రములు మాని
యనురాగమందుచు నంత రాఘవుఁడు, తననగరికి వచ్చి తగవొప్ప మెఱసి
యంతఃపురంబున కరుగుచో సీత, యింతలు దానును నెదు రేగుదెంచి
తనుఁజూచి మది విన్నఁదనముఁ గైకొన్న, ఘనుని రాఘవుఁ జూచి కడుఁజిన్నవోయి
యిదియేమి యిట్లు నాహృదయేశ నీదు, వదనాంబుజము కడు వాడుపాటొనది
గట్టిగాఁ బుష్యయోగము దప్పకుండఁ, బట్టంబుగట్టునే పార్థివేశ్వరుఁడు
సోమమండలముతో జోడగు గొడుగు, నీమోముఁదమ్మికి నీడుగా డేల
చామరద్వయము పార్శ్వంబులఁ దనరి, యే మొకో మనపట్ట వేసుంగు రాదు
శ్రీరామ నీమౌళి నేసఁబ్రాలెవ్వి, పౌరులు నినుఁగొల్చి బలసిరా రేల
దుందుభీపటహాది తూర్యఘోషములు, వందిమాగధులకై వారంబు లెవ్వి

యభిషేకదినము నేఁ డధిప నీయందు, శుభరాజచిహ్నాముల్ చూడంగలేవు
సౌమిత్రిమోమునఁ జాల దుల్లాస, మేమిచందమొ నాకు నెఱిఁగింపుఁ డిప్పు
డని పల్కుసీత ముగ్ధాలాపములకు, మనమునఁ గుంది యామానినిఁ జూచి
మునులకు నృపచిహ్నాములగొడ వేల, వినుమది యెట్లన్న వివరింతు నీకుఁ
గైక మాతండ్రి సత్కారించి తొల్లి, గైకొన్నవరములు కాంక్షించి నేఁడు
కొడుకుఁ బట్టముఁగట్టుకొని రాజ్యమేల, నడవుల నన్నుండ నడిగెఁ గావునను
ధరణిఁ బాలింప నాతమ్ముని భరతుఁ, గరమొప్ప పట్టంబుఁ గట్టెద ననియెఁ
బనివడి యడవులఁ బదునాలుగేండ్లు, జనకుశాసన మేను జరపంగ వలసెఁ
దల్లిదండ్రులమాట తప్పక నేయు, బల్లిదునకును సంపదయును గీర్తి
నాకలోకాది నానావిధపుణ్య, లోకంబు లరచేతిలో నుండు గాదె

సీతతో రాజ్యాభిషేకభంగ మెఱిఁగించుట

కావునఁ బతియాజ్ఞ కానల సలిపి, యేవచ్చునంచాఁక నిందీవరాక్షి
గుసుగులు వగలచేఁ గుందకయుండఁ, బరిచర్యలొనరించి భక్తితోఁ గొలువు
చిత్తంబులోన నాసేమంబు గోరు, ముత్తమశీలవై యుచితధర్మములు
వనిత యమ్మలమ్రోల వర్తింపు మనిన, జనకజ యారామచంద్రునిఁ జూచి
కదలినమతి భీతి గాలిచేఁ గదలు, కదళిచందంబున గడగడ వణఁకి
బెదరి డగ్గుత్తికఁబెట్టి పెన్వగలఁ, జెదరి యంతంతకుఁ జెలువేది పలికె
ఇదియె నిశ్చయమైన నేను మీవెంట, వదలక పయనమై వత్తు నీక్షణమె
నిసుఁ బాసి యే నిల్వనేరఁ బ్రాణములు, ననుఁబట్టనేరవు నాప్రాణనాథ
యడవుల కేనును నర్థితో వత్తుఁ, దోడుకపొమ్మనఁ దూలి రాఘవుఁడు
కమలాక్షి యడవులఁ గందమూలములు, నమలి రానేలల నడచుచు నీవు
నారచీరలు గట్టి నడచుచు వగలఁ, గూరుచుఁ బేరెండకును గాలి కోర్చి
నేలలఁ బవళించి నిచ్చలు పర్ణశాలలలో నుండఁజాలుదే యకట
కోమలదేహవు గోలవు బేల, వేమియు నేపాటు నెఱుఁగవు నీవు
తలఁప నక్కజమైన దంతులు పులులు, నెలుఁగులు తోఁడేళ్ళు నిట్టులు కరులు
పాములు గాములు పైఁబ్రాకు నెట్టి,చీమలు గిరిగుహాసీమల దరుల
ఝరులనిమ్నుల లతాశ్చర్యమార్గముల, విరసకంటకలతావృక్షమార్గములఁ
దలఁప నక్కజమైన దారుణాటవుల, మెలఁగుట యక్కటా మేదినీతనయ
కావునఁ గౌసల్యకడనుండు మీవు, నేవింపు మాసాధ్విచిత్తంబు వడసి
గృహదేవతలఁ గొల్వు కీర్తింపు నన్ను, నహరహంబును మామయడుగులకెఱఁగు
భరతుండు నిను మాతృభావంబు గొలుచుఁ, బరుసంబు లాతనిఁ బలుకకు మబల
యిదెపోయి పదునాలుగేండ్లు నిండించి, ముదమొప్పఁ జనుదెంతు ముగుద చింతిలకు
మనవుడుఁ బ్రణయశోకార్తియై రాముఁ, గనుఁగొని సీత నిక్కము విన్నవించె
పతులు గావించిన భాగ్యంబులైన, సతులను రక్షించు సమ్మదం బెసఁగ
నాపాలివిభుఁడన్న నాదైవమన్న, నాపుణ్యగతియన్న నరనాథ నీవె

ఘనతపస్స్వర్గభోగము లనేకంబు, లనుభవించుటకంటె నతిభ క్తితోడ
నిచ్చలు మనమాన నీపదాంబుజము, లచ్చుగాఁ గొలుచుట యది నాకు సుఖము
నృపవర్య నీవున్న నిష్ఠురాటవుల, యుపవనంబులు నాకు నూహించి చూడ
జగతీశ వినుఁ విష్ణుసము డవౌ నీవు, జగదేకవిక్రమశాలివై పరఁగఁ
గరమొప్ప నీరక్షఁ గలిగిన నన్ను, సురరాజు తలయెత్తి చూడంగ వెఱచు
నారచీకలు గట్టి నడచి నీతోడ, నారంగఁ జనుదెంతు నట నీవు చూప
నమరంగఁ జూచెద నద్రులు నదులు, కమలాకరంబులు కడువేడ్క-తోడ
పాయ నిన్నెందును బరఁగ నూహైన, వేమైనఁ గానిమ్ము విపినంబులందు
నన్నుఁ దోడ్కొనిపొమ్ము నరనాథ యనిన, నన్నాతిఁ గనుఁగొని యతఁ డిట్టులనియె
అనిశంబు నతిదురంతాయాసమైన, వనవాస మేటికి వనజాక్షీ నీకు
నీయందుఁ జిత్తంబు నిలిపి నిన్ను నిచ్చి, పోయి కావించెద భూపాలు పనుపు
వనమేడ నీవేడ వనిత నిన్నేడఁ, గొనిపోయి దుర్గముల్ కుటిలమార్గముల
నారామవనకేళి కర్హంబుగాని, ఘోరాటవులయందుఁ గ్రుమ్మరఁ దగునె
వెల్లు క్రూరవృకాళి పృథుపుండరీక, భల్లూకసింహాది బహుమృగావళులు
ఘూకకాకానేకఘోరవాంకార, కాకోలఝిల్లికాకర్కశధ్వనులు
మానక వర్తించు మఱి భయంబొదవ, నీనీడతళుక్ నీ వెందున వలదు
నావుడు విని సీత నరనాథుఁ జూచి, నీవుండఁగా నాకు నిర్భయం బధిప
వనభూమిఁ దిరుగుదు వరుసతోఁ గూడ, నని నాకుఁ జెప్పినా రావేదవిదులు
కాన నీవిధమునఁ గాంతారమునకు, భానుకులేశ నీపాదముల్ గొలిచి
వచ్చెద నన్ను రావల దనవలదు, వచ్చిన మదిని నాభక్తియుఁ జూడు
మని పాదములఁ బట్టి యడలంగ వగచి, యనుమతింపమిఁ జూచి యతిదీన యగుచు
యెఱిఁగి నేఁ జేసితినే మున్ను తప్పు, మఱచి చేసితినేని మన్నింపు నన్ను
పటుశిలాకంటకప్రచురదేశములు, నట నిన్నుఁ గొలిచిరా నలతయు లేదు
కరుణమై నీవిచ్చుకందమూలములు, నరుదార నమృతంబులవియును నాకు
భావించి చూచినఁ బ్రాణబంధుఁడవు, నీవె కావున వత్తు నీతోడఁ బ్రీతి
జనకుఁడు చింతింప జనని చింతింప, చనునిష్టులగు బంధుజనుల చింతింప
జననాథ సహధర్మచారిణియందు, జనకునిచే నగ్నిసాక్షిఁ గైకొంటి
జనలోకనుతుఁడవు సత్యసంధుఁడవు, నను డించి నికుఁ గానలకేగఁ దగునె
యెన్ని దుఃఖములైన నెన్నికఁగాదు, అన్నియు సౌఖ్యంబులగును నీదయను
ఈవాడ లీమేడ లీబంధుబృంద, మీవస్తుసంపద లీ జీవనంబు
నీవు లేకున్నచో నిస్సారములగుఁ, గావున నిచట నేకరణి వేఁగింతు
సావిత్రి యనుపుణ్యసతి తనపతిని, సేవించినట్టి యా చెలువున నేను
నీవెంటఁ జనుదెంతు నీనీడఁబోలె, నావంటిసాధ్వికి నదియె ధర్మంబు
నినుఁ బాసి యిచ్చట నిమిషమేనోర్వ, వనముల నినుఁ గూడి వర్తింపనేర్తుఁ
బదునాలుగేం డ్లేల పాసెద నిన్నుఁ, గదిసి వెయ్యేం డ్లైనఁ గడువేడ్కఁ గొలుతు

సతులకుఁ బతులకు జను లెంచఁదగిన, మతము ప్రతిక్షింపు మఱి వేయునేల
నీవరణ్యములకు నిట నన్నువిడిచి, పోవుట నిజమైనఁ బోవుఁ బ్రాణములు
నలుకమైఁ గాదేని యగ్నిచే నైన, జలముచే నైన విషంబుచే నైన
నేచినవగలతో నిటఁ జత్తు నేను, నామూపు డించిపో ననుదించిపోకు
మని ప్రలాపించుచు నడుగులమీఁద, జనకజఁ బడియున్న చందంబు చూచి
కరుణతో నల్లనఁ గరపల్లవముల, ధరణీశతనయుఁ డాతనుమధ్య నెత్తి

సీత వచ్చుటకు శ్రీరాములు సమ్మతించుట.

యలివేణి నినుఁ బాసి యావనంబులను, నలువంద విహరింప నాకిచ్చలేదు
నినుఁ దోడుకొనిపోదు నీవు నావెంటఁ, జనుదేరఁ గుశలంబు సకలంబు నాకు
నిమ్ముల నీచిత్ర మెఱుఁగంగఁ దలఁచి, యిమ్మాట లాడితి నేతెంతుఁ గాని
యనుచు నారఘురాముఁ డతికృపామూర్తి, జనకజరాకకు సమ్మతించుటయు
వలయుదానంబులు వరుసఁ గావింపు, నెలఁత నీవనవ్రుడు నెమ్మనం బలరఁ
గాంచనరత్నాదికంబు లైనట్టి, యంచితదానంబు లమ్మహీతనయ
వరుసఁ బ్రియంబగువారలకెల్లఁ, గరమర్థి నందంద గావించె నంత
ధరణీశుఁడును సుమిత్రాపుత్రు జూచి, చేర రమ్మని రామచంద్రుఁ డిట్లనియె
నాతోడ నీవు కాననకు వచ్చెదేని, నాతోడ నినుఁ బాసి నానావిధముల
మిడుకు కౌసల్యసుమిత్రల నెవ్వ, రుడుకార్చి పోషింతు రొప్పెడుభక్తి
మనమిద్దఱముఁ జన్న మనతండ్రి భక్తి, ననుదినంబును నెవ్వ రరయువా రిచట
మొదలనే సవతిపై మ్రొగ్గుఁ గైకేయి, మదిలోన నీరాజ్యమదమింక నొదవుఁ
జేర్మి చూపుచు దుగిఖపెట్టునో కైక, ధర్మంబు తలపోసి తగవేల నడుపు
నటుఁగాన నే వచ్చునండాక నీవు, నిటనుండఁ దగునన్న నెంతయుఁ గనలి
యావేళ లక్ష్మణుఁ డన్ననిశ్చయము, భావించి తనపాణిపద్మముల్ మొగిచి
యప్పుడు నన్ను రా నానతియిచ్చి, యిప్పుడు వలదను హేమికారణము
కౌసల్యకృపరక్ష గాక నారక్ష, యాసుమిత్రకు నేటి కాతేజ మరయఁ
బదివేవ్రురకు నున్కిపట్టు నీవెలుఁగు, నిదియేల చింతింప నిట రామచంద్ర
భరతుండు నీదెస భయమునఁజేసి, తిరముగాఁ గౌసల్యదేవికి భక్తిఁ
గరము సుమిత్రకుఁ గావించు నటుల, నిరవొందనటుఁగాన నేనిందు నిలువ
బాణబాణాసనపాణినై వెనుకఁ, దూణీరములుఁ బూని దుర్గమాటవులఁ
బొందుఁగా మిమ్ము నిమ్ములఁ గొల్వవలయుఁ, గందమూలాదులు కడఁకఁ దేవలయు
నటఁ దృణపర్ణాదు లరసి మీరుండు, కుటజము పజ్జగాఁ గూర్పంగవలయుఁ
బదునాలుగేండ్లను బగలునురేయి, నిదురవోవక సేవ నెఱి నేయవలయు
వచ్చెద నేనన్న వసుధేశుఁ డతని, నిచ్చమైఁ గైకొని యింపుదళుక్కొత్త
వలయుబంధులనెల్ల వరుస వీడ్కొనుము, వలనొప్పగా మున్ను వరుణదేవుండు
మనతండ్రికిచ్చిన మహితచాపమును, ఘనశరశ్రేణులు గలకవదొనలు
కరమభేద్యంబగు కవచంబు పసిఁడి, పరుజులఁ జెన్నొందు పటుకృపాణములు

కొనిరమ్ము నానేగి కొమరార బంధు,జనుల వీడ్కొని శస్త్రశాలకు నరిగి [జూచి
యాయుధంబులు గొంచు నరుగుదెంచుటయు, నాయతాత్ముఁడు రాముఁ డనుజన్ముఁ
తమ్ముఁడ విను మెల్లధనముల నేను, నెమ్మి నిచ్చెద ధరణీసురవరుల
మహితపురస్థుల మనకింపులైన, సహజభృత్యుల నర్థిజనుల రావింపు
మా వేళ నర్హుండు నఖిలజ్ఞుఁ డైన, యావసిష్ఠునిపుత్రుఁ డయినసుయజ్ఞు
మొదలైనపుత్రుల ముదము చిత్తమునఁ, బొదలంగ నతిభక్తిఁ బూజింపవలయు
మఱియుఁ దక్కినవారి మన్నింత మెల్ల,తెఱఁగుల నక్కఱ తీఱ నర్థులకు
ననవుడు లక్ష్మణుం డొఁగాక యనుచు, మునిపుత్రునింటికి ముదముతోఁ నరిగి
రామువాక్యముఁ జెప్పి రమ్మన్న నతఁడు, నేమంబులన్నియు నిష్ఠతోఁ దీర్చి
సౌమిత్రిసహితుఁడై చనుదేరఁ గాంచి, రాముఁడు వినయాభిరాముఁడై తాను
నెలమిమై సీతతో నెదురుగా వచ్చి, యలఘుతేజోమూర్తి యైనమునీంద్రుఁ
గొనివచ్చి గద్దియ కొమరారనునిచి, వినుతార్ఘ్యపాద్యములు వేడ్కతోఁ నిచ్చి
హారకుండలవలయాంగదకటక, చారుకోటీరాది సకలభూషణము
మాతులుండొసఁగిన మవగజేంద్రంబు, ఖ్యాతి శత్రుంజయాఖ్యము మొదలైన
కరిసహస్రంబును కమనీయరత్న, సురుచిరదివ్య వస్తువులెల్ల నొసఁగి
బహుభూషణములిచ్చి పయిపయితోన, మహనీయరత్నముల్ మానుగా నిచ్చి
పసిఁడియేర్పడఁబుచ్చి పదికోటులొసఁగి, యసమానవస్తువు లన్నియు నొసఁగి
యిచ్చినఁ గైకొని హృదయంబులోన, నచ్చెరువడరంగ నధికమోదమున
నారాజమిథునంబు నతఁడు దీవించె, నారంగ రఘురాముఁ డప్పుడు మఱియు
నెడపక భండార మెల్లఁ దెప్పించి, తొడరి దీనులకు నర్థులకుఁ బేదలకు
చెలిమి నగస్త్య కౌశికు లనువారి, కిల రత్నరాసు లనేకంబు లొసఁగి
మొగి వసిష్ఠాదిసస్తునిజనంబులకుఁ, దగుతపస్వులకు నర్థము లొప్పనిచ్చి
వందిమాగధులకు వరదానశక్తు, లెందును బొగడంగ నిలుచూర నిచ్చి
వేదసాదలకును బృథ్వీదేవతల, కాదట బంధుమిత్రాశ్రితావళికిఁ
బన్నుగానిబ్భంగి బహుదానతతులు, సన్నుతమతినిచ్చి సౌమిత్రిఁ జూచి
నీవును దానంబు నెమ్మిఁ గావింపు, నావుడు నారాజనందనుం డలరి
ఘటజన్ముఁ గౌశికు గార్గ్య శాండిల్య, నటకు రప్పించి వెక్కర్థంబు లిచ్చి
వీరువారన కెల్లవిధములవారు, నారంగ నెవ్వరే మడిగిన నిచ్చె
ధరణీశుఁ డాతనిఁ దనబుద్ధియలరఁ, గరమొప్ప నతిమహాకల్యాణి యైన
యాయరుంధతికి సుయజ్ఞునిసతికి, నాయతంబగుభక్తి నప్పుడు సీత
తనభూషణములిచ్చి తనయర్ధ మిచ్చి, తనయింటఁగల వస్తుతతులెల్ల నిచ్చె
నప్పు డరుంధతి యకట యిట్లాకు, లిప్పాటు పడుచుంట నిటు చూడఁదగునె

శ్రీరాములు త్రిజటాఖ్యునకు గోవుల నిచ్చుట.

యని భర్త నడుగంగ నమ్మహామాని, తనబుద్ధినెంతయుఁ దలపోసి చూచి
యేరూపమునఁ బోవదిది దైవయోగ, మూరకుండుము చూచుచుండుద మనియె

ఆవేళఁ ద్రిజటాఖ్యుఁ డనువిప్రుఁ డడరి, జీవనస్థితికినై చేను దున్నుచును
ఘోరంపులేమిచేఁ గుందుటఁజేసి, పేరాసఁ దత్సతి బిడ్డలఁ గొంచు
నతిసంభ్రమంబున నచ్చోటి కరిగి, తతిగొన బనిసేయు తద్భర్తఁ జూచి
యేల యీనాఁగేలు హృదయంబుచివుర, నేలయీగుద్దలి యిటఁ బాఱవైచి
రమ్ము చెప్పెద నేఁడు రామచంద్రుండు, సమ్మదంబున నర్థిజనులకునెల్ల
ద్రవ్యతండంబులు దయతోడ ధనము, నెవ్వ రేమడిగిన నిచ్చుచున్నాఁడు
నీకుటుంబము చెప్పి నీపేరుచెప్పి, కాకుత్స్థపతిచేతఁ గామితార్థంబు
వేవేగఁ జని నీవు వేఁడుకొ మ్మనిన, నావిప్రుఁ డూహలు నందంద నిగుడఁ
జనుదెంచి యారామచంద్రు నీక్షించి, తనరంగ దీవించి తా నిట్టులనియె
పేదవాఁడను సుతుల్ పెక్కండ్రు గలరు, లేదు ద్రవ్యంబును లేశమాత్రమును
నను నీవు రక్షింప నరనాథ వలయు, ననిన నారఘురాముఁ డావిప్రుఁ జూచి
యాపులమందలయ్యా యున్నవిపుడు, నీవు నీచేమున్ని నిజశక్తి మెఱసి
యెంచాఁక పేసితి వీలోనిపశులమంద నీకె యటన్న మది సంతసిల్లి
యఱచి దోవతి మొల నంటబిగించి, కుఱుచైనశిఖముఁ గొని యాడుఁగఱచి
నరములఁ బ్రాణముల్ నలినంటఁబట్టి, కరమునఁ బాషాణకలితుఁడై యపుడు
శ్రీరమాధవు నెంచి శ్రీరాము నెంచి, బిరబిర తనముష్టిఁ బెట్టుగా ద్రిప్పి
యురమున జండెము నుజ్జుతాలూఁగ, సరయువ్రజాఁక విచ్చలవిడి నేసె
బ్రతుకుజీవనమని బ్రాహ్మణుం డట్టి, మొచపులఁగొన్న రాముఁడు చోద్యమంది
మఱి వేయుగోవుల మహితవస్త్రముల, నఱలేక యిచ్చెద నడుగుమీ యనిన
జన్నంబునకు నీవు చాలినయర్థ, మెన్న నెక్కుడుగాను నిమ్మంచు నడుగఁ
దనియంగ నిచ్చినఁ దద్దయు నలరి, తనపత్నితోఁ గూడ ధనములు గొనుచు
సంతోషమున నటఁ జనేఁ ద్రిజటుండు, నంతట రఘురాముఁ డనురాగమెసఁగఁ
గృతకృత్యుఁడై వచ్చి గృహదేవతలకుఁ, జతురుఁడై మునులకు సద్భక్తి మ్రొక్కి
యీరీతి రఘురాముఁ డెల్లవస్తువులు, కోరినవారికిఁ గోరిన ట్లొసఁగి
మును జనకునియజ్ఞమున వరుణుండు, తనకొసంగిన తనుత్రాణకోదండ
ఘనతరతూణీరఖడ్గాయుధములు, తనకులగురునింట దాఁచుటఁ జేసి
యనుజుఁజేఁ దెప్పించి యవి ధరియించి, జనకజాలక్ష్మణసహితుఁడై వెడలి
రాజునొద్దకు వేగ రాజచిహ్నంబు, లోజఁ గానక పౌరు లుల్లంబు లలర
రాజవీథులనుండి రచ్చలనుండి, రాజితోన్నతసౌధరాజివై నుండి
పుట్టినశోకాగ్ని పొగులుచుఁ గొంద, ఱట్టిదుర్దశ కర్హుఁడే రాముఁ డనుచు
నెందు రాముఁడునోయె నింకనందఱము, నండె పోదమురాక యని కొంద ఱురుగ
కొందఱు రాజన్యకుంజరువెనక, మందిరంబులు డించి మనమెల్లఁ జనగ
నేపార సొంపెల్ల నెడలి పాడైన, యాపట్టణము కైక నేలని మ్రానుచుఁ
బరికించి కొందఱు ప్రజ లీపురంబు, పొరిపొరి నెలుఁగులు పులులు సింగములు
నక్కలు వఱుళులు నలి పిశాచములు, పెక్కుభూతంబులు ప్రేతసంఘములు

పాయనియడవిలో పతిరాముఁడున్న, యాయరణ్యము పురంబగునంచుఁ బలుక
క్రందయ్యె బహువిధాక్రందనరవము, నందంచ వినిపింప సధికధైర్యమున

శ్రీరాములు సీతాలక్ష్మణసమేతుఁడై దశరథునియొద్దకు వచ్చుట

జగతీశునగరికిఁ జనుదెంచి మఱియుఁ, బగ సుమంతునిఁ గాంచి ధరణీశసుతుఁడు
వినిపింపు మారాక విభునితో ననిన, జని శోకమునఁ జాల సంతాపమందు
రాజేంద్రుఁ గనుఁగొని రామలక్ష్మణులు, పూజితచరితయౌ భూతనూభవయు
వచ్చినారని చెప్పఁబడి మూర్ఛవోయి, చెచ్చెఱఁ దెలివొంది చెందిననగల
నల్లన గద్దియ నాసీనుఁ డగుచు, నుల్లంబులో ధైర్య మొక్కింత నిలిపి
వత్తురగాక నావనితలు నింక, వత్తురుగాక నీవరపుత్రుఁ జూడ
ననుచు డగ్గుత్తిక నల్లనఁ బలుక, విని యాసుమంత్రుండు వినయంబుతోడ
నంతఃపురంబుల కరిగి యారాజు, నింతుల మున్నాటయేఁబండ్రఁ దెచ్చె
మఱి పోయి యారాము మహనీయతేజు, లెఱుఁగొప్పఁ దోడ్కొనితెర నిఱింని
యాలింగనముసేయ నర్ధితో లేచి, యాలోన రాలేక నవనిపైఁ బడియె
నంత నాశ్రీరాముఁ డారాజుఁ బట్టి, యెంతయుఁ బ్రేమచే నెసఁగంగఁ దిగిచి
తొడలపైనిడికొని దుఃఖింపఁ గొంత,వడికి చైతన్యంబు వచ్చి కూర్చుండి
తనుఁ జూచుచున్నయాతండ్రి నీక్షించి, జనసుతుండగు రామచంద్రుండు పలికె
ననఘాత్మ నీదుసత్యము నిల్ప నేను, వనభూములకుఁ బోవువాఁడ నౌటఁగి
యీసాధ్వి జనకమహీపాలతనయ, యీసుమిత్రాపుత్రు లిద్దఱు మిగుల
వలదని యేనెంత వారింప వినక, నలరి తామును రాఁగ నైయున్న వారు
గాన వీరలు నేను గానలకేగ, నానతిమ్మనుటయు నానరేశ్వరుఁడు
మదిదూలి కైకేయిమాటకు నిన్ను, నదయతఁ బొమ్మంటి నకట కానలకుఁ
జేకొని నామాట నేయంగనేల, నీకెట్లు నందన నీవు నీయంతఁ
జెనొ్నంద రాజ్యంబునేయుదు గాక, యన్ననామాటకు హస్తముల్ మొగిచి
తలపోయ గురుఁడవు ధారణీపతివి, ఎలమిమై రక్షింప నిలబొంధవుఁడవు
నటుగాన నీవాక్య మర్ధితోఁ జేయ, నిట నాకు నానతి యిచ్చి నన్ననుపు
సత్యసంధుఁడవైన జనలోకనాథ, నిత్యంబుగా నేలు నిఖిలలోకములు
ననిన దీర్ఘాయువు నత్యంతశుభము, వినుతయశంబును విమలవిక్రమము
నకళంకధర్మంబు నమరంగఁబొందు, మొకబాధయును లేక యుండు మోపుత్ర
యారంగ నన్నును నరయ మీతల్లి, నీరాత్రిచూచి నీవెల్లి పొమ్మనిన
నేఁడేమి యెల్లేమి నిలువంగఁదగదు, నేఁడు పోయెదమన్న నెమ్మి వీడ్కొలుపు
నరనాథ నాయొగి నాతమ్ముఁడైన, భరతుండు వసుమతిఁ బాలింపనిమ్ము
వగపు నీవిధి మీకు వలదన్న రాము, లెగువకు దశరథాధిపుఁడు శోకించి
నీవంటిసత్పుత్రు నిష్ఠురాటవుల, కీవెంటఁ బొమ్మన నెట్లు నోరాడు
కైకేయిమాటలఁ గడుమోసపోతిఁ, గా కటకట యని కరుణఁ దానేడ్వ
నంతఃపురాంగన లందఱునడల, నంతఁ గౌసల్యయు నాసుమిత్రయును

వంతలవ్రాలుచు వగలఁ దూలుచును, వింతగా భువిఁజేరి విలపించుచుండ
నపుడు సుమంత్రుఁ డయ్యతివలయెడ్పు, నృపుశోకమును జూచి నిట్టూర్పుబుచ్చి
ఘనతరశోకసంకలితుఁడై కైకఁ, గనుఁగొని పలికె నుత్కటకోపుఁ డగుచు
నీయత్నమునఁగదా నృపునకు మాకు, నీయవస్థలు వచ్చె నేమనఁగలను
పతిహితం బెమియుఁ బరిశింప వెట్టి, సతివైతి వగట రాఁకసివి నీవరయ
నీతల్లియట్లనే నీపు ప్రాణేశ,ఘాతివయ్యది యెట్టిగతియన్న వినుము
సకలభాషలు నీదుజనకుఁ డెఱుంగు, నొకనాఁడు మీతల్లియును దాను శయ్య
నొఱపుగాశయనించి యొకకీటవార్త, యెఱిఁగి యాతఁడునవ్వ నెద సంశయించి
యిదియేల నవ్వితి వెఱిఁగింపు మనిన, నది చెప్పినను బ్రాణహానియగు నిపుడు
ననవుడు నీప్రాణహాని కేవెఱవ, వినుపింపు మనిన వివేకించు నతని
నదియె తప్పని వెళ్లనడఁచె మీతల్లి, యదిగాన నాచండి కాత్మజవైన
నీకైల కలుగు మానితపతిహితము, ఓకైకయనిన నాయువిద యెంతయును
దలవాంచి కొండొకతడవు చింతించి, పలికె నాదశరథపతిఁ జూచి యపుడు
మున్ను మీకులమున ముఖ్యుఁడై సగరుఁ, డున్నతకీర్తియై యుర్విఁనేలుచును
నసమంజసుండను నగ్రనందనుని, గొసరక పురివెళ్లఁ గొట్టఁగాలేదే
రామచంద్రుని నీవరణ్యభూములకుఁ, దామసింపక పంపఁ దప్పేమి దీన
నన విని దశరథుం డధికశోకాబ్ధి, మునిఁగి ప్రత్యుత్తరంబున కోపకున్న
నపుడు సిద్ధార్థకుం డనుమంత్రివరుఁడు, కపటాత్మురాలైన కైక కిట్లనియె
అసమంజసుండు దర్పాతిరేకమున, నెసఁగ పట్టణములో నెల్ల బాలురను
సరి పట్టికట్టి యాసరయువులోనఁ, బరువడి వైవంగఁ బొరులందఱును
సగరునితోఁజెప్ప జనహితంబునకుఁ, దగవు చింతించి యాతనయుఁ బోనడఁచె
వీరామునం దొక్కయెగ్గేనఁ గలదె, చారువర్తనగుణసౌజన్యుఁ డితఁడు
నావుడు సత్యంబు నాతోడఁ బలికెఁ, గావునఁ దండ్రివాక్యమునేసె సుకృతి
యగుఁగాక రఘురాముఁ డనవుడు కైక, తెగువకు దశరథాధిపుఁడు శోకించి
చాల సంతాపించి జడిగొన్నవగలఁ, దూలుచు నాసుమంత్రుని జూచి పలికె
ధనముల మణుల గోధనముల బంధు,జనముల నవరోధజనముల హితుల
విజయచిహ్నంబుల విలసిల్లుచున్న, గజముల రథముల ఘనతురంగముల
నిజముగా వెఱకు నేర్చుధీవరులఁ, బ్రజల మంత్రుల రామభద్రుని వెనుక
వెడలింపుమీ రిత్తవీడు కైకేయి, కొడుకుఁబట్టము గట్టుకొని యెలుఁగాక
యనియిట్లు దశరథుం డాడువాక్యములు, విని కైక గోపించి విభుఁ దూఱి పలికె
రాజపుంగవ నీవు రామచంద్రునకు, రాజిల్లు నీసర్వరాజ్యసంపదలు
నిచ్చి పాడైయున్న యీపురంబేల, యిచ్చెదు భరతున కిపల్కులేల
సౌమిత్రియును దాను జనకనందనయు, రాముఁడు నారచీరలుగట్టి ప్రీతి
నేను జూచుచునుండ నెల్లభోగములు, మాని దుర్గములఁ గ్రమ్మరఁ బోపకున్నఁ
బొసఁగదు నీయీవి బొంకు నీపలుకు, వసుధేశ నీవిచ్చువరము నేనొల్లఁ

దప్పితి వీవన్న దశరథాధీశుఁ, డప్పుడు మూర్ఛిల్లి యవనిపైఁ ద్రెళ్లె
ధరణిపై నట్లున్న తండ్రిని జూచి, పరితాప మందుచుఁ బలికె రాఘవుఁడు
ఏలమ్మ నీకేయి యిమ్మహారాజు, తూలఁబోఁ బలుమాఱు దూఱనాడెనఁట
గురుఁడును రాజు నాకూరిమితండ్రి, పరమదైవం బిట్టిపతి సన్నుఁ బనుప
విషమైన మ్రింగుదు విఫులాగ్నినైన, విషధియైనను జొత్తు వేడ్కతో నేను
వనమున ముసులతో వర్తింపుమన్న, ననుమతించుట నాకు నదియెంతపెద్ద
యన విని దశరథుఁ డావాక్యములకు, మనమునఁ గడుదూలి మఱి కైకఁ జూచి
విను మేను రాజ్యంబు విడిచి యీరాము, వెనుకఁ బోయెదను నీవిభవంబుతోడ
భరతు నయోధ్యకుఁ బట్టంబుగట్టి, ధరణి యేలుదుగాక తగవేల యనఁగ
నామాటలకు రాముఁ డధిపుతోననియె, భూమీశ నిర్జనభూమియై పరఁగు
నవ్వనంబును నాకు నర్హమైయుండు, నెవ్వరు నాతోడ నేటికితేర
నారచీరలు దెచ్చి నాకిండు దాని, నారంగ ధరియించి యడవులలోనఁ
బదునాలుగేండ్లును బరఁగ నీయాజ్ఞ, వదలక వర్తించువాఁడను నేను
దే నారచీరలు దేవి నాకనిన, నానాతి నిర్లజ్జయై తానె యపుడు
ముదమంది మదిలోన మొగమోటలేక, మది చలింపక సభామధ్యంబునందు
నారచీరలు దెచ్చి నరనాథపుత్ర, గారవంబున నీవు కట్టుకొమ్మనుచుఁ
బేరెలుంగున బల్కఁ బ్రియముతో రాముఁ, డారాజుసభయును నారాజు నడల
నాతల్లిచేసున్న యవి పుచ్చుకొనుచు, భాతిగా మున్ననున్నపటములు విడిచి
నారచీరలు గట్టె నయముతోనపుడు, నారంగ ధరియించె నాలక్ష్మణుండు
సీతకు నానారచీరలు రెండు, చేతనిచ్చినఁ గొని చిత్తంబులోనఁ
గలఁగి రాముని జూచి కాంతారవాసు, లెలమిమ్మై నీచీర లెట్లుఁ గట్టుదురో
మునులంచు నొక్కఁటి మూపుపై వైచి, తనరారనొక్కఁటి తనకేలఁ దాల్చి
కట్టనేరక మదిఁ గలఁగ నారాముఁ, డట్టిచందముఁ గాంచి యాపువ్వుఁబోణి
ఘననితంబమునఁ బొంకమునిమాఱుఁ గట్ట, గని రాజసుతులు రాఘవుని వీక్షించి
నారచీరలు గట్టి నరనాథపుత్ర, యీరాజవరపుత్రి నీసీత నెట్లు
దారుణగతినిట్లు తాపసిఁ బోలి, ఘోరాటవికి నీవు కొనిపోవఁ దగునె

వసిష్ఠుఁడు కైకతో కరినోక్త లాడుట.

మామాట మన్నించి మాయొద్దనునిచి, సౌమిత్రియును నీవుఁ జనుఁడు కాననకు
ననఁగ వసిష్ఠుండు నలుకతోఁ గైకఁ, గనుఁగొని కులనాశకారిణివీవు
భూపాలకుని మోసపుచ్చితి కాన, నీపాపమరయంగ నెందును గలదె
రాజపత్నులయొద్ద రఘురామునాజ్ఞ, నీజనకజ నుండని మ్మట్లుకాఁగ
వలదననేల యీవై దేహి చనఁగఁ, గలయఁ బొరులతోడఁ గాననంబులకు
నేమును జనువార మింతియే కాదు, రామచంద్రునిఁగొల్వ రమణీయలీల
భరతశత్రుఘ్నులు బలసి వచ్చెదరు, పరికింప నీవు నీపాడూఱ నుండు
పోవంగ రాముఁడు పుణ్యశీలుండు, లీలనున్నది యూఱు లేనిది పాడు

పతినిట్లు వంచించి పాపంబు దలఁచి, యతిలోభమున రాము నడవులకనిచి
భరతు నయోధ్యకుఁ బట్టంబుగట్టి, చిరలీల రాజ్యంబుసేయఁ జూచెదవు
పతియాజ్ఞ దప్పఁడు భరతుండు తండ్రి,ప్రతినిధి నారామభద్రునిఁ జూచు
నీమాట విని ధర్మనిష్ఠుఁ బోవిడిచి, రామునడంచి యీరాజ్యంబుఁ గొన్నఁ
దలపోసి చూడఁగ దశరథేంద్రునకు, పొలుపారనతఁడు తాఁ బుట్టెనేమైన
నీతప్పు నీమీఁద నెఱపినమీఁద, మాతగాఁ దలఁచునే మదిలోన నిన్నుఁ
గరమర్థి రాముఁ డాకాన వర్తింప, భరతుఁ డీసామ్రాజ్యభార మెట్లోపు
నెఱుఁగవు భరతునిహృదయమేమియును, మఱియీతెఱఁగు విన్న మండు నీమీఁద
నెవ్వరికైనీకు నీనిష్ఠురంబు, నివ్వెంటభరతున కియ్యకో లగునె
కావున నిది మేలుగా నెన్నవలదు, నీ వదియనుగాక నిష్ఠురవృత్తి
శ్రీరామునకు మఱి సీతకు నార,చీరలిచ్చుటకు నీచేతు లెట్లాడె
నారచీరలు మాని నవరత్నఖచిత, చారుభూషణములు సరసంబులైన
చీనాంబరంబులు చెలువారఁ బూని, జానకిఁ దనపరిచారకుల్ గొలువఁ
జనుగాక యనుచు నాసంయమీశ్వరుఁడు, వినుతభూషాంబరవితతు లిచ్చుటయు
ననయంబు మదిలోన హర్షముప్పొంగ, గొని యవి ధరియించె గురునియానతిని
సీత యప్పుడు నారచీరలు మాని, యాతతప్రీతితో నట్లున్నఁ జూచి
కైక నందఱు దిట్టఁగా రాజు వినుచు, నాకాంతఁ దెసఁ జూచి యలుకతోఁ బలికె
తక్కక పాపంబు తలఁచి రామునకు, నక్కటా వనవాస మడిగితి కాక
మేదినీసుతయు సౌమిత్రియు నార, లాదరంబునఁ గట్ట నడిగితే నన్ను
నీమానవతి సీత యింతకుఁ దగునె, యేమి చేసితి నీకు నీతెంపు సేయ
రాముని వినయాభిరాముఁ గాంతార,భూమికిఁ దపసియై పొమ్మనుకంటె
మఱియొండుపాపంబు మదిలోనఁ గలదె, తరమఁజేసియు నేల తండ్రవై తి
పాపజాతికి నీకుఁ బతియైననాకుఁ, బాపంబు కడమానె పరికింప ననఁగ
నామాట విని రాముఁ డధిపుతోననియె,భూమిశ ననుఁ బాసి పొదలుశోకమున
మాతల్లి కౌసల్య మదిఁ గుందకుండ, భీతిగాఁ గృప మీరు పరఁగ రక్షింపుఁ
డనుడు నాదశరథుఁ డావాక్యములకుఁ, దనరారుశోకాగ్నిఁ దనచిత్త మెరియ
నెట్టిపాపము తొల్లి యేఁ జేసినాఁడఁ, బట్టి నాకనుభవింపకపోదు నేఁడు
తల్లులబిడ్డల దయమాలి పాప, నుల్లంబులోపల నోర్వంగఁ గలనె
కైక మాటకునిన్నుఁ గాంతారభూమిఁ, బైకొని యదయతఁ బడ నేగుమంటి
హాపుత్ర హారామ యనుచు మూర్ఛిల్లి, భూపాలుఁ డప్పుడు బోధింపఁ దెలిసి
వారక పదునాల్గువత్సరంబులకు, నారఁగఁ బరిపూర్ణ మగునట్లుగాఁగ
మెచ్చినతొడవులు మేలువస్త్రములు, నచ్చుగా జానకి కవనీవిభుండు
వలనొప్పఁగాఁ దెచ్చి వరుస నిప్పించె, వలువలు గట్టి యావరభూషణములు

కౌసల్య సీతకు పతిధర్మము చెప్పుట.

జనరంగ జానకి ధరియించె నంత, జనకజఁ జూచి కౌసల్య శోకించి

యడరంగనితఁడు మహాచక్రవర్తి, కొడుకని మీతండ్రి కోరి నిన్నిచ్చెఁ
గడుకొని దైవయోగంబునఁజేసి, కడపట మఱి యిట్టిగతియయ్యె నేఁడు
తాపసవృత్తిమైఁ దగిలి కాననకు, నీపతితోఁగూడి నీకేగవలసె
దీనికి వగవకు తివిరి రాఘవుఁడు, ఈనిఖిలోర్వియు నేలెడి మగుడి
పతి వేదవాఁడైనఁ బాయంగరాదు, సతులకు నిదియు విచారించి నడుపు
చేకొని పతిపంపుసేయుపత్నులకుఁ, గైకొను నుభయలోకములందు శుభము
ననఁగను గౌసల్య నాసీతఁ జూచి, వినుతంబుగాఁ బల్కె వినయంబుతోడ
అనుకూలనై పతి నతిభక్తిఁ గొలిచి, తనర వర్తించెద ధర్మమార్గమున
మానుగాఁ బతిలేనిమగువ చక్రంబు, లేనితేరును దంత్రి లేనివీణెయును
బోలెఁ బుత్రులుగలపుణ్యరాలైనఁ, జాలంగ కొఱగాక చనునట్లుగానఁ
బతికిఁ బ్రియంబును బ్రాణంబునైన, హితబుద్ధి వంచింపకిత్తు నే ననిన
నాదేవి వైదేహి నలరారఁ జూచి, భూదేవిపుత్రివై పుట్టిన నీవు
నీగుణంబులు తగు నెలమి లక్ష్మణుని, నీగుణోజ్వలు రాముహితుని మన్నింపు
మనిన సీతాదేవి యాఁగాక యనుచుఁ, దనకు మ్రొక్కిన నెత్తి తగఁ గౌఁగిలించి
దీవించెనప్పుడు తెఱఁగొప్ప రామ, దేవునితోడ నాదేవి యిట్లనియెఁ
బృథులాటవులయందుఁ బృథివీశపుత్ర, మిథిలేంద్రసుతను సౌమిత్రి నేమరకు
మనిన మీయాయానతి నది వింటి జనని, యీనర నాదక్షిణభుజము లక్ష్మణుఁడు
నానీడ జానకి నాకునెబ్బంగి, మానసంబున వీరి మఱువంగనగునె
యేను విల్లండిన నెందు నేభయము, గానేలవచ్చు ముక్కంటి పైఁబడిన
నదిగాన నీవింక నడలకు మాకు, వదలను ధర్మంబు వగవంగ నీకు
భూనాథునకుఁ గరాంబుజములు మొగిచి, తాను సీతయు సుమిత్రానందనుండు
అమ్మలు దీవింపుఁ డందఱు ననుచు, నిమ్ముల మున్నూటయేఁబండ్రులకును
సరి ప్రదక్షిణముగాఁ జనుదెంచి మనసు, లెరియంగ నాతల్లులెల్ల శోకింప
వినుచు సుమిత్రకు వినతులై రంత, కనుఁగొని యద్దేవి కౌఁగిటఁ జేర్చి
శ్రీరాము దీవించి సీత దీవించి, ధారణిపతినేత తలపోసి వగచి
మెలపొందనపుడు సుమిత్ర లక్ష్మణుని, బిలిచి యింపార గంభీరోక్తిఁ బలికె
రాముని దశరథరాజుగాఁ జూడు, భూమిజ ననుఁగా బుద్ధిఁ జింతింపు
మడవి నయోధ్యగా నాత్మలోఁ దలఁపు, కడుభక్తియుక్తి రాఘవు గొల్చియుండు
మాయతజయసిద్ధి నభివృద్ధిఁ బొందు, పోయిరమ్మని ప్రీతిఁ బుత్రు దీవించె
రామచంద్రుని జూచి రఘువీర నీకు, నేమాఁబు దలఁచి నీచిత్తంబులోన
నరలేనిసఖుఁడన్న ననుజన్ముఁడన్న, నెరయనీతఁడెకాక నిక్కువంబరయ
నటుగాన లక్ష్మణు నరసి రక్షింపు, మడవులలోనన్న నౌఁగాక యనుచు
రాముఁ డాదశరథరాజు నీక్షించి, యామహితాత్మతో నచలుఁడై పలికెఁ
బదునాలుగేండ్లును బ్రకటదుర్గములఁ, బదునాల్గుదినములపగిది వర్తించి
ధరణీశ వత్తు సంతాపింపవలదు, భరతుండు నాకంటె భక్తుండు మీకు

నతనిఁ బట్టముగట్టుఁ డాత్మఁ గై కేయి, కృతకంబులకు నింకఁ గింకిరిపడకు
మాతల్లి నీకు నెమ్మది నేఁ జేయు, నాతల్లి మీరును నరయుఁడు ప్రేమ
నని ప్రదక్షిణముగా ననుజుండుఁ దాను, జనకజయును గడుసన్న్యస్తి మ్రొక్కి
రప్పుడు రఘురాముఁ డడవికిఁ బూని, దప్పక వెడల నాదశరథాధిపుఁడు
మదిలోనఁ దలఁచి సుమంత్రునిఁ జూచి, యదె రాముఁ డడవుల కరుగుచున్నాఁడు
గొనిపొమ్ము రథమన్నఁ గువలయాధిపుని, పనుపునఁ గొనిపోయి భక్తితో మ్రొక్కి
రథమిదె పుత్తెంచె రాజు మీకర్థి, రథమెక్కి వేంచేయు రఘురామచంద్ర
యనవుడు దశరథునాజ్ఞకు వెఱచి, మును సీత నెక్కించి మొగి నాయుధములు
తనరు జోడును బెట్టి తాను లక్ష్మణుఁడు, ఘనమైనరథ మెక్కి కదలె రాఘవుఁడు
అంతఁ బౌరులు వృద్ధు లాప్తులు మంత్రు, లింతులు పౌరులు హితులు నాశ్రితులు
వంత బ్రాహ్మణరాజవైశ్యశూద్రులును, అంతంత నలుఁగడ నడలుచు వెడలి
ముందట నిరుపార్శ్వములఁ బిఱుందటను, సందడించుచు మది జడిగొన్నవగల
నరనాథ పుత్త్రుఁ డెన్నఁడు గానరాఁడు, సురుచిరస్థితి నేఁడు చూత మింపారఁ
జంద్రు తేజము నవ్వఁజాలు నీరామ,చంద్రు మోమును జూడఁ జనుదెంచువారు
కడఁగి యిక్ష్వాకులగౌరవంబెల్ల, నడఁచెనే మంథర యని తిట్టువారు
తగవేది రఘురాముఁ దపసిగాఁ జేయ, నగునమ్మ కైకేయి కని దూఱువారు
దాలిమి దిగనాడి దశరథాధీశుఁ, డాలికి వెఱచునే యని రోయువార
చనువెల్లఁ జెడి రామసౌమిత్రు లంత, ననదలై పోదురె యని వేఁగువారు
పనిగొని తమతండ్రిపనుపునఁగాని, పొనుపడి యిట్లేల పోదురన్వారు
ఈపదునాలుగేం డ్లెట్లు వీరడవి, నాపద వేఁగింతు రని పొక్కువారు
ఈనోము నోచెనో యిమ్మహీపుత్రి, తానంచు మదిలోనఁ దలపోయువారు
నతిమృదుగాత్రి యీయతివ భూపుత్రి, పతిఁ బాయలేదని ప్రణుతించువారు
ఈసుతుఁ బాయంగ నెట్లోర్చె నట్టి, కౌసల్య మది యెంత గట్టనువారు
ధర్మము పాడయ్యె ధరనిప్పుడనుచు, నర్మిలి రాముతో నరిగెడువారు
నై రామునరదంబు నందందఁ గదిసి, భూరిశోకాగ్నులఁ బొగలుచుఁ బోవ
నంతఁ గౌసల్యయు నాసుమిత్రయును, జింతాపరంపరఁ జిక్కి శోకించి
వారిశిరంబులు వలనొప్పనూఁది, వారిపై వ్రాలుచు వగలఁ దూలుచును
గలయ నంతగిపురకాంతలు దన్ను, గొలిచిరా దశరథక్షోణిపాలకుఁడు
భూరిలోచనబాష్పపూరముల్ దొరఁగ, హారామ హారామ యని పలుమాఱు
నెలుగెత్తి యేడ్చుచు నేచినవగల, నలిఁ దూలి పొగలుచు నగరంబు వెడలె
అప్పుడు రవిదీప్తి లణఁగె నల్దిసల, నుప్పొంగెఁ దమము వహ్నులు మండవయ్యె
ధరణి బీటలువాఱెఁ దారలు రాలె, విరసించి గ్రహములు వినువీథిఁ బాఱె
నెలమిమై మహథార లింకె దంతులకుఁ, గలయ నశ్వములకుఁ గన్నీరు దొరఁగె
నావులు చన్నియ్యవయ్యెఁ గ్రేపులకు, నావీడు కడుశూన్యమై తోఁచెఁ బ్రజకు
వారు వీరన కెల్లవారు నెల్లెడలఁ, బౌరులయేడ్పు లంబరమెల్ల నిండె

సురవర కామినీశోకావములు, పొరిఁబొరి వినవచ్చెఁ బురజనంబులకు
నప్పుడు దశరథుఁ డారామురథము, చొప్పు బొప్పములుచేఁ జూడఁ జొప్పడక
చంద్రబింబముతోడ సరియైనరామ, చంద్రుని మొగ మొకసారి చూచెదను

దశరథుఁడు రథము నిల్పుమని సుమంతునిఁ బిలుచుట.

ఓసుమంత్రుఁడ రథ మునుపవే యనుచు, నాసుమంత్రుఁడు విన నట్లు చీరుచును
వెనుకొని పురి దాఁటి వెస నేగుదేర, మనుజేశుఁ జూచి సుమంత్రుతో ననియె
నిదె వచ్చుచున్న వాఁ డినకులేశ్వరుఁడు, పొవపొవ పోనిమ్ము పోనిమ్ము రథము
అని యని రఘురాముఁ డందంద దఱుమ, మొనసి యాతఁడు రయంబున దేరుఁ
నంత వసిష్ఠుఁ డయ్యవనీశుఁ జూచి, యంతరంగంబున నడలుచుఁ బలికె [బఱపె
ననఘ శోకించుచు ననుపఁగారాదు, మనుజేశ నీవింక మరలు మిచ్చోట
ననవుడు దశరథుఁ డటు పోక నిలిచి, తనసూనురథమును దప్పక చూచి
యదియుఁగానక ధూళి నటుచూచి చూచి,యదియుఁగానక బయ లటుచూచి చూచి
హాయని యెలుగెత్తి హారామరామ, హాయని మూర్ఛిల్లి యవనిపైఁ ద్రెళ్లి
పొరలుచుఁ గెంధూళిఁ బుడమి కంపింపఁ, గరముగ్ర మగుదృష్టిఁ గైకేయిఁ జూచి
నీపాప మెఱుఁగక నిన్ను మన్నించి, నాపుణ్యపుత్రరత్నముఁ గోలుపోతి
నిన్నుఁ బెండ్లాడి నే నీచుఁడనైతి, నన్నిట మేటినై యల్పుండనైతి
నడరు నిందలకెల్ల నాధారమైతిఁ, గడపటఁ జెఱిచితిఁ గాకుత్స్థకులము
నినుఁ జూడఁగారాదు నిను ముట్టరాదు, చెనటి నీతోడ భాషింపఁగారాదు
అని దశరథుఁడాడ నాపౌరజనులు, గనుఁగొని తనుఁ దిట్టఁ గైకేయి వినుచుఁ
దలవంచుకొనియుండె దశరథుం డంత,నలయుచు నపు డయోధ్యాపురి జొచ్చి
పాడువాఱిన యట్టిపట్టణవీధి, నాడాడ నిలుచుచు నడలు కౌసల్య
నగరంతఁ జొచ్చి యానగరాళితోడఁ, బొరలుచు సెజ్జపైఁ బొరలుచు మిగుల
నలయుచు సొలయుచు నసుగసు రనుచు, నలుదెస లూర్చుచు నాలుక యెండ
హారామ హారామ యనుచు దైవంబు, దూఱుచు దనుఁదానె దూషించుకొనుచు
నేపాటు నేదుఃఖ మెఱుఁగనియట్టి, నాపుత్రరత్నంబు నాదుకోడలును
ఎంతద వ్వరిగిరో యెందున్నవారొ, యెంతతోఁ గుందివా రెట్టులేగెదరొ
కందమూలములు శాకములు నేరితిఁ, దిందురో యెట్లు వర్తింతురో యడవి
ననియని వారలయాయాసములకుఁ, దనమది నడలుచుఁ దలపోయుచుండెఁ
గౌసల్యయును నంతకంటె శోకింప, నాసుమిత్రాదేవి యడలార్పుచుండె
నంత రాముఁడు పౌరులందఱు గొలువఁ, గొంతదవ్వేగ పేర్కొని వారిఁ బలికె
ననఘాత్ములార మీరందఱు మగుడి, చనుఁ డయోధ్యకు నాకు జయముగోరుండు
భరతునియాజ్ఞ లోపలను వర్తించి, పౌరయుఁడు సౌఖ్యముల్ పొందు మీకనిన
వారలందఱు నేకవాక్యులై పలికి, రోరామ యిట్లాడ నుచితమే నీకు
భరతుఁ డేటికి మాకుఁ బట్టణం బేల, వరమందిరము లేల వాహము లేల
యప్పరిగలు నేల యువిదలు నేల, చప్పరములు నేల సౌధంబు లేల

మేడలు మాకేల మేలమైనట్టి, వాడలు మాకేల వలదు నీవరుగ
వత్తుము నీవెంట వలదంటివేని, చత్తుము దీనికై సందేహ మేల
అని యిటుపలుకుచు నఖిలభూప్రజలు, తనుఁ గొల్చిరా రఘూత్తముఁడు నాఁడేగి
తమసానదీతటస్థలమున విడిసి, తమసలో సాంధ్యకృత్యము లెల్లఁ దీర్చి
తగుసౌధమున మృదుతల్పంబునందు, మొగిఁ బవ్వళించు నామోహనమూర్తి
తరుమూలమునఁ బర్ణతల్పంబునందు, ధరణీసుతయుఁ దానుఁ దగ విశ్రమించెఁ
దనచుట్టు పౌరులు తమయిండ్లు మఱచి, తనయులభార్యలఁ దగులుఁ బోవిడచి
వనములఁ దమవెంట వచ్చువా రనుచు, నినుపార దప్పితో నిద్రింపఁ జూచి
వారల మగుడించు వలనొండులేక, నారాత్రిమధ్యంబునందు సుమంత్రుఁ
దేరాయితమునేసి తెమ్మని పనిచి, పౌరుల వంచించుభావ మాతనికిఁ
దెలిపి యయోధ్యకై తెరువుఁ బోనిచ్చి, తలకొని మగుడించి తమస దాఁటించి
తృణశిలావృతభూమి తెరువుఁ దోలించి, గణుతింపరానివేగమునఁ బోవుచును
దమరాకయును మహీధవునిసేతయును, దమకించి మదిలోనఁ దాపంబునొంది
తెరువు పల్లెలవారు ధృతిదూలి యేడ్వ, బరుసంపుకొలుఁగులు పలుమాఱు వినుచు
వనతరుల్సీతకు వరుసఁ జూపుచును, ఇనకులమణియైన యిక్ష్వాకునకును
మనుపు మున్నొసఁగినమహిమఁ గన్గొనుచుఁ, జని వేగవతి దాఁటి సరయువు దాఁటి
నరనాథుఁ డమ్మఱునాఁడు మాపటికిఁ, గరము వేగమున గంగానదిఁ జేరి
తడయక హింగుదీతరుసమీపమున, విడిసి యచ్చటఁ బ్రీతి విశ్రాంతినొందె
నారయఁ దమసలో నట నిద్రనోయి, పౌరులందఱును బ్రభాతంబునందుఁ
గరమర్థితో మేలుకని నాల్గుదెసలఁ, బరికించి నివ్వెఱపడి శోకమునను
రామునిఁ గానక రథముచొప్పరసి, రాముఁ డయోధ్యాపురమున కీరాత్రి
యవనినాథుఁడు పిల్వనంపిన మఱల, భువనభారముఁ బూనఁబోనోపు ననుచు
నని యయోధ్యకు వచ్చి యచ్చోట రాముఁ, గనుఁగొనఁజాలక ఘనశోకవహ్ని
ననయంబుఁ బొగులుచు నకట రాఘవుఁడు, మఱల వంచించి క్రమ్మఱఁ బోయె ననుచు
నారామకృపయు సత్యంబు ధర్మంబు, చారువర్తనము నిచ్చలు నుతించుచును
నితరవస్తువులపై నిచ్చలు మాని, యతనిఁ దలంచుచు నతనిఁ బొయుటకు
నంతరంగంబున నలయుచుండ, నంత నక్కడ గుహుం డనుచెంచురాజు

శ్రీరాములు గుహునిఁ జూచుట.

శృంగిబేరం బేలు చిరపుణ్యశాలి, గంగాతటమున రాఘవుఁ డుండుఁ జెఱిఁగి
చనుదెంచి రామలక్ష్మణులకు మ్రొక్కి, ననమూలఫలములు వలయువస్తువులు
కనకాంబరాదులు కానుకలిచ్చి, వినయవిధేయుఁడై వినుతు లొనర్చి
యచ్చెరువుగ రామునాకృతిఁ జూచి, యిచ్చలో వెఱఁగంది యిదియేమి దేవ
నీవరణ్యములకు నిఖిలంబు విడిచి, యీవిధి విచ్చేయ కేమి కారణము
నలినాప్తకులనాథ నాయట్టిబంటు, కలుగ నీవేషంబు గలిగెనే మీకు
చెనటియై మిమ్మిట్లు చేసిననీచు, ననిఁ బట్టి చంపెద ననిన రాఘవుఁడు

నతనిసద్భక్తికి నతనిశక్తికిని, నతనిధీరోక్తుల కానందమంది
యతనిఁ గౌఁగిటఁ జేర్చి యాదరం బెసఁగ, నతనితోఁ దనచువృత్తాంతంబు దెలుప
నంతయు విని గుహుం డాత్మలోఁ బొద్ద, చింతించి కైకేయినేతకు వగచి
దశరథునేరమి తలపోసిపోసి, దశరథాత్మజులదుర్దశకు శోకించె
రాముఁ డప్పుడు కృపారసమగ్నుఁడగుచు, సౌమిత్రియును దాను సముచితభణితి
గుహుశోక ముడుప నర్కుఁడు గ్రుంకుటయును,విహితసంధ్యాకాలవిధులొప్పఁదీర్చి
గంగోదకముల నాకలిదీర్చి సూత, శృంగిబేరాధిపు ల్చేరి సేవింప
ధరణీతనూజయుఁ దాను లక్ష్మణుఁడు, ధరణిపైఁ దృణశయ్యఁ దగ విశ్రమించె
శరచాపహస్తుఁడై సౌమిత్రియంతఁ, గరమొప్పఁ దమయన్నఁ గాతు నబ్బుద్ధిఁ
బదునాలుగేండ్లును బగలును రేలు, నిదురవోవకయుండ నియమంబుచేసి
తమయన్న సెజ్జకు దవ్వుల నిలిచి, యమలమానసుఁ డప్పు డటు కొల్చియుండె
నారాత్రి నిద్ర మాయాయరూపు దాల్చి, ధీరుఁ డాలక్ష్మణదేవునిఁ జేరి
యేను నిద్రాదేవి నేర్పడఁ దెల్పు,మా నాకు నింకెట్లు మానాథ్యయంత
విధి విధించెను వెంటవెంట వక్తింప, విధమేది నిన్ను నే విడుచుట కింక
అనిన నూర్మిళయందు నహారహంబులును, జనియుండు మంత నీసమయంబు దీర్చి
వచ్చినఁ గైకొందు వరుస నిన్ననిన, నిచ్చ నౌఁగాకంచు నేగె నిద్రయును
అలరుచు నీదేవతానుగ్రహంబు, గలిగె నాకనుచు లక్ష్మణదేవుఁడుండె
సుకుమారతారుణ్యశోభనాకృతులు, ప్రకటితధైర్యసంపన్నులైయున్న
నారామసీత లత్యంతదుఃఖములఁ, గూరెడు తెఱఁగెల్ల గుహునకుఁ జెప్పి
హంసతూలికశయ్యయందుండుభోగి, పాంసుపల్లవములఁ బవళించి యిపుడు
కఱకురాళ్లొత్తంగఁ గళవళపడుచు, గురువెట్టి నిద్రచేఁ గూర్కియున్నాఁడు
అడరి కౌసల్యయు నాసుమిత్రయును, బడియెడిశోకంబు పలుమాఱుఁ జెప్పి
సొరిది నిద్దఱుఁ గూడి శోకించుచుండ, నరుణోదయంబయ్యె నంత రాఘవుఁడు
నేమంబులన్నియు నిష్ఠతోఁ దీర్చి, నేమమేర్పడ గుహుఁచే మట్టిపాలు
దెప్పించి కోమలదీర్ఘకేశములు, విప్పి యావై దేహి వివశయై తూల
ఆమట్టిపాలచే నందంద దడిపి, సౌమిత్రియును దాను జడలొప్పఁ దాల్చి
ఘనుఁడు రాఘవుఁడు వైఖానసవృత్తి, ననుజుండు దాను పాయనినిష్ఠఁ బూని
అనఘు సుమంతు రమ్మని చేరఁ బిలిచి, తనరార రథమెక్కఁ దగదు మాకింక
నరదంబు గొని యయోధ్యకు నీవు వేగ, మరలిపొమ్మధిపు నెమ్మదిఁ గొల్చియుండు
పార్థివేశ్వరునకుఁ బరఁగఁ దల్లులకు, నర్థితో మ్రొక్కితమని చెప్పుమనుడు
యేమిటి కీమాట లిటమీఁద ననుచు, సౌమిత్రి యధికరోషమున నిట్లనియె
భూమీశుఁ డాలిపంపున నీతిమాలి, యేమియుఁ బరికింప కిటుచేసె మమ్ము
తనయాలు దానును దనకూర్మికొడుకు, ఘనరాజ్యభోగముల్ గైకొనుఁగాక
యని యేను బల్కితి ననిచెప్ప మీవు, చనుమన విని రామచంద్రుండు గినిసి
మాను సౌమిత్రి సుమంత నీవింక, భూనాథుతో నీవు పుట్టింపవలదు

ఆనృపు డిదివిన్న నధికదీనాయ, మానమానసుఁడునై మఱి పొక్కఁకున్నె
యనిన సుమంతుఁ డత్యంతశోకమున, మునిఁగి భీతిల్లి రాముని జూచి పలికెఁ
గానల మిముఁ ద్రోచి కడుదీనవృత్తి, నేనయోధ్యాపురం బేమని చొత్తు
నేమని చెప్పుదు నీవార్తఁ బ్రజకు, నేమని కొనిపోదు నీశూన్యరథము
నేమని కౌసల్య నేనూఱడింతు, నేమని కైకమో మేను వీఱింతు
వనముల కేనును వత్తునుగాక, యనిన రాముఁడు నవ్వి యాతనిఁ జూచి
కడఁకతో నేము గంగానది దాటి, యడవులఁ జొచ్చితి మనువార్త కైక
నీవు చెప్పినఁగాని నిజముగాఁ గొనదు, నీవు శోకింపక నెమ్మది బొమ్ము
నామాఱుగా నీవు నయవాక్యసరణి, వేమాఱు దెల్పి భూవిభుఁ గొల్చియుండు

సుమంతుఁడు అయోధ్యకు రగ్గముదెచ్చుట.

మనవుడు రథమెక్కి యతిదీనుఁడగుచుఁ, జనియె సుమంతుండు సాకేతపురికి
అంత రాఘవుఁ డయోధ్యాపురి కపుడు, నంతరంగంబున నతిభక్తి మ్రొక్కి
గుహుఁడు పెట్టినయోడ కొమరొప్పనెక్కి, యహిమాంశుకులు నంత నాగంగదాట
నడుమ జానకి గంగ నటుచూచి మ్రొక్కి, కడువేడ్కఁ బ్రార్థించి కరములు మొగిచి
దశరథేశ్వరునాజ్ఞ ధరణి వర్ధించి, దశ చెడి రాముఁడు దండకాటవిని
బదునాలుగేడులు భవ్యవృత్తులను, విదితంబుగా నేను వీనితోఁ గూడ
సంచరించియు రాముసౌమిత్రు లంత, నంచితశుభముచే నలరువేడుకల
వచ్చిన నీకును వలనొప్పఁగాను, నిచ్చెద గోవుల నేకముల్ వస్త్ర
దానమృష్టాన్నాదిదానంబులమర, గాను భూసురులకుఁ గానుక నిత్తు
సురఘటల్ వేయింటి శుద్ధాన్నమాంస, మరయఁ బెట్టెదనమ్మ యని భక్తిఁ గొలిచి
భవభంగధవళాంగభవమాళిసంగ, నవనిజ యాగంగ నర్థిఁ బ్రార్థించె
గుహుని సంభావించి గుహు వీడుకొలిపి, గుహుఁడు మార్గజ్ఞులఁ గొందఱఁ గూర్పఁ
ముందఱఁ గూర్తిమ్ముఁడు వెన్కఁ దాను, సుందరి నడుమచక్కఁ జూపట్టఁ గదలి
వనచరమృగములవరుస జానకికిఁ, గనుపట్టఁ జూపుచు ఘనుఁడు రాఘవుఁడు
చని యొక్క మానియాశ్రమమును జేరి, మునిపతి కతిభక్తి మ్రొక్క నామాని
వారలఁ గన్గొని వల్కలాదికము, గారవంబును బెంచఁగాఁ బల్క నిట్టు
లేనెఱింగితి మీరలిటవచ్చుపనిని, ఈదిన మిందుండి యెల్లి పోవలయు
రఘుకులోత్తంస యీరమణీయమైన, యఘునాశమైన యీయాశ్రమభూమి
నిలుతురుగాక యనిన రఘూత్తముఁడు, పలికెఁ గ్రమ్మఱ మునిపతి కిట్టులనుచు
నిక్కడ మాకుండనేల పోయెదము, అక్కట మునినాథ యదియునుగాక
మాతల్లిదండ్రులు మాపురవాసు, లేతెంచి మముఁ జూడ నిట వత్తురన్న
నామాట కలరి యిట్లనియె నమ్మాని, యీమాట నిశ్చయంబే రామ యిపుడు
పదమని నెలవిచ్చి పరమపావనుఁడు, వదలనిముదమున వారలకనియె
జననాథ మూఁడుయోజనములు నడువ, ననువొందఁ జిత్రకూటాఖ్యఁ జెన్నొందు
ననవుడు రాఘవుఁ డొంగాక యనుచు, జనకజాసౌమిత్రిసహితుఁడై యప్డు

చనిచని మూఁడుయోజనములు గడచి, చని సుధర్మదయనుపసి నాఁడుండి
యాఁకాత్రి భూపుత్రి యతిమృదుగాత్రి, కాకడవిని యొంటిగా శయనించి
యున్న చందంబు తానున్న చందంబు, కన్నతల్లులకైన కష్టశోకంబు
కైకేయి కోర్కులు కడముట్టుటయును, భూకాంతుసత్యంబు భూప్రజవగయుఁ
గన్నీరుదొరుగ రాఘవుఁడు లక్ష్మణుని, కన్నియుఁ జెప్పఁగా నటవేఁగె బ్రొద్దు
మనువంశతిలకు లామఱునాఁడు కదలి, మునుమిడి యోజనంబులు మూఁడు గడచి
అనఘు గంగాయమునలుగూడి యునికిఁ,గనుఁగొని యటఁ బ్రయాగకుఁబోయియందు
మునిలోకనుతుఁడైన ముని భరద్వాజుఁ, గని నమస్కారముల్ గావించి తనదు
వృత్తాంతమంతయు విన్నవించుటయు, నత్తపోధనముఖ్యుఁ డారాఘవులను
దీవించి రఘురామదేవువర్తనముఁ, భావించి యచ్చెరువ్వపడి తత్త్వమెఱిఁగి
కందమూలఫలాదికంబుల వారిఁ, బొందుగా సంతుష్టిపొందించి ప్రేమ
నమ్ముని పూజింప నారాత్రి యందు, నెమ్మి దీపింపఁగ నిల్చి మర్నాఁడు
ఘననిష్ఠ సంధ్యాదికర్మముల్ దీర్చి, మునులయాశీర్వాదములు చాలఁ బడసి
యరుదైన చిత్రకూటాద్రికిఁ దెరువు, వరపుణ్యుఁ డగుభరద్వాజుచే నెఱిఁగి
యరుగుచో రాముఁ డయ్యడవులనడుమ, నురుచాపరవమున కుపకుచుఁ బాఱు
మృగములఁ జూపుచు మేదినీసుతకు, నగవుఁ బుట్టించుచు నడతెంచునడల
నలసి డస్సినచోట నవనీరుహాముల, నిలిచినచోటనే నిలిచి దోడ్కొనుచుఁ
గరమర్థిఁ బెక్కుదుర్గంబులు గడచి, వరపుణ్య లట సిద్ధవటము నీక్షించి
సీత యప్పుడు కార్యసిద్ధులు గోరి, యాతరువరమున కంజలిచేసి
ప్రార్థింప నప్పు డాపార్థివతనయు, లర్థితో యమునమహానది దాఁటి
యాఁకాత్రి యందుండి యమ్మఱునాఁడు, ఘోరాటవులు చొచ్చి కుశలమార్గమున
వలనొప్పఁ జని మాల్యవతిచుట్టుబాఱి, యలఘుసంయములకు నాటపట్టగుచు
సలలితతరులతాసానుకూటములు, చెలువు వాటించిన చిత్రకూటాద్రి
గని యొక్కి యందున్న ఘనతపోధనులఁ, గని మ్రొక్కి మిగుల సత్కారమువ్వడసి
యమ్మునీంద్రులచేత ననుమతి వడసి, తమ్ముఁడు దాను నత్తఱి మహీజముల
కొమ్మలు ఖండించి కొంత వింతగను, సమ్మదంబునఁ బర్ణశాలఁ గావించి
కృష్ణసారముఁ జంపి గృహశాంతిహోమ, ముష్ణాంశుకులుఁడు శాస్త్రోక్తిమైఁ జేసి
యందుఁ బ్రవేశించి యాపర్ణశాల, చందంబు మెచ్చుచు సాధ్వియుఁ దాను
మునుల సేవించుచు మునులెల్లఁ బొగడ, మునిచరిత్రంబుల మోదించుచుండెఁ
దనతోడ నొకనాఁడు తలయంపిగాఁగ, నునిచి రాముఁడు గూర్క నుర్వీసుతనూజ
యొగిఁ గందమూలాదు లుపహారమునకుఁ, దగ నాయితముసేయుతఱి భీతిలేక
కడఁకతో నొకదుష్టకాకంబు శాల, నొడియుచు గాసిసేయుచు నున్నఁ జూచి
సీత యాకాకంబుఁ జెచ్చెరఁ జూప, నే లెఱుంగునఁ బోవ కీడాడఁ జూచి
చనుగవనడుచక్కిఁ జంచునఁ బొడువ, ఘనశోణితం బొల్కఁగా నిద్ర దేరి
కడునల్గి రాముఁ డాకాకంబుఁ జూచి, వడి నిషీకముఁ బుచ్చి వైచె వైచుటయు

విడువక యది దాని వెనువెంటఁ దగులఁ, బడయక యది జగత్త్రయమెల్లఁ దిరిగి
కావుఁడీయనుచు దిక్పాలుర బ్రహ్మ, దేవుని నమ్మహాదేవుఁ బ్రార్థింప
వారలు తమచేత వారింపఁబడునె, శ్రీరామశరమన్న శీఘ్రంబు మగుడఁ
జనుచెంచి మఱి తన్ను శరణు చొచ్చుటయు, ఘనమైనకృపతోడఁ గాకంబుఁ జూచి
నాయస్త్ర మెందు నెన్నఁడు రిత్తవోదు, నీయంగ మొకటి దానికి నిచ్చి పొమ్ము
అనవుడుఁ దననేత్ర మయ్యస్త్రమునకు, ఘనభక్తితో నిచ్చి కాకంబు చనియెఁ
జెలఁగి రాఘవుఁ డంత సీతచే నున్న, ఫలములు దేవతార్పణములునేసి
యాయున్న ఫలముల నలవడఁ దృప్తు, లైయుండి రిమ్ముల నంత నక్కడను
రామువర్తనము నారయ మూఁడునాళ్లు, నేమించి గుహుఁచెంత నిలిచి మర్నాఁడు
మలగనివగల సుమంత్రుండు చాల, నలయుచుఁ జని యయోధ్యాపురిఁ జొచ్చి
సహజవైభవములు సర్వంబు నుడిగి, రహిఁచెడియున్న యారాజమార్గమున
నరుగుచోఁ బురజను లారథధ్వనులు, పరికించి యిదె రామభద్రుండు వచ్చె
నని సుమంత్రునిఁ జేర నరుదెంచి రథము, కనుఁగొని రఘురాముఁ గానక వచ్చి
క్రూరకర్ముఁడు రాముఁ గొనిరాక డించి, యీరిత్తరథమేల నిటఁ దెచ్చె ననుచు
గుంపులు గుంపులు గొని తన్ను దూఱ, సొం పేది రామునిసుద్ది చెప్పుచును
రాజగేహముఁ జేరి రథమంత డిగ్గి, రాజున్న యంతఃపురంబున కేగి
ధూళిగప్పినమేనితో బాష్పపూర, లోలనేత్రములతో లోలోనఁ బొదలు
కడలేనివగలలోఁ గౌసల్యయింటఁ, బడి ప్రలాపించుభూపతిఁ గాంచి మ్రొక్కి
భూమీశ మీపుణ్యపుత్రరత్నంబు, రాముఁడు సత్యపరాక్రమశాలి
సౌమిత్రియును దాను జడలొప్పఁ దాల్చి, తామసింపక గంగ దాఁటి కాల్నడల
ననఘుఁడై చిత్రకూటాద్రికిఁ బోయె, ననవుడు దశరథుఁ డాత్మ శోకించి
యనఘు సుమంత్ర మ్మని చేరఁ బిలిచి, తనయునిచరితమంతయుఁ దప్ప కడిగి
గౌరవమతి నీవు గల్గితికాన, మారామభద్రునేమములెల్ల వింటిఁ
గన్నులకఱవు శోకంబును దీఱు, చెన్నార నతనిఁ జూచినఁగాని యకట
తనువునఁ బ్రాణము ల్ధరియింపఁజాలఁ,గొనిపోయి రఘురాముఁ గూర్పవే యనిన
వినవయ్య శ్రీరామువెంటనేఁ బోవఁ, గని ప్రజ శోకించుఁ గైక దూషించు
నిది విచార్యంబుగా దిది బుద్ధిగాదు, మది నింత వగవకు మనుజేంద్ర నీవు
ధైర్యంబు పరికింపు ధర్మంబుఁ బూను, మార్యులు గొనియాడ ననఘుండ వగుము
అఱలేక నడవుల నఖిలభోగములు, మఱచి నీసుతులు నెమ్మదినున్న వారు
అని పల్కి లక్ష్మణుం డన్న వాక్యములు, వినుపించుటయును భూవిభుఁడు శోకించి
సౌమిత్రిమాట నిజంబౌనె యట్టి, కామాంధుఁడను క్రూరకర్ముండఖలుఁడ
నని సుమంత్రుని వేగ యటు వీడుకొలిపి, తనమది శోకించు ధరణీశుఁ జూచి
హారామ హారామ హారామ యనుచు, శ్రీరాము పలుమాఱుఁ జింతింపనేల
ఏల నటించెద వేల యీశోక, మేల తాల్చెద వంత యెఱుఁగనే నేను
నీవు లోకములలో నిందకు వెఱచి, ఆవల కైకేయి కన్నియుఁ గఱపి

రాముఁ బట్టముగట్టి రాజుఁ గావించి, భూము లేలించెదఁ బొగడొంద నుచు
నడవిఁ ద్రోపించితే నాలిచేఁ బనిచి, కడుఁగష్టుఁడవు నీకుఁ గలవె ధర్మములు
తిట్టుపాటునకోడి తివిరి నాకొడుకు, పట్టంబు మాన్పింపఁ బనిచెఁగా కధిప
సొంపేది రాముని స్రుక్కక నైక, చంపుమన్నను బట్టి చంపవే నీవు
పెద్దకాలము నాకు బిడ్డలులేక, పెద్దయు శోకించి పెక్కులు నోచి
కడపట నొక్కనిఁ గని యేను గొంత, యుడుకారియున్న చో సుండనీవైతి
వని దూఱుకౌసల్య నధిపతి చూచి, తనపూర్వకథయెల్లఁ దాఁ జెప్పఁ దలఁచి
నీవు చెప్పినదెల్ల నిజముగాఁ గలదు, భావింప నేనట్టిపాపకర్ముఁడను
ఒడల బ్రాణము లికనుండవు నాకుఁ, గడుఁబెట్టిదములాడి కాతేంపవలదు
కౌసల్య నాతొంటికర్మభోగంబు, లొనరించినవి యవి యూరకేఁబోవు
దైవంబులకునైనఁ దమకర్మఫలము, భావించి కుడువక పాయరా నెందు
నది యెట్టిదనినను నదిచెప్పఁ జోద్య, మది తెల్లముగ వినుమని చెప్పదొడఁగె

దశరథుఁడు కౌసల్యకు తనశాపము చెల్పుట.

నాడెల్ల నేలేడునాఁడు నాపిన్న, నాఁడొక్కనాఁ డేను నడుచేయిఁ బోయి
యరుదైనవేటల నాసక్తిఁ బొంది, శరచాపములు పూని సరయువుచెంత
రేసిచూడఁగరాని రేవుచక్కటికి, డాసినపొదలలో డాగి యేనుండ
నతిమునీ మృగకోటు లయ్యేటినీరు, పఱతెంచి క్రోలుశబ్దములు నచ్చటికి
వీనుల వీక్షించి వెస శబ్దవేధు, లైనబాణము లేసి యందందఁ జంపి
తనియక కాపున్న తఱి యజ్ఞదత్తుఁ, డను నొక్కమునిపుత్రుఁ డమ్మహానదికి
తిరమైనవిధి తన్నుఁ దెచ్చిన వచ్చి, కరమర్థి నచ్చట కలశంబు ముంప
గుడియక యటమ్రోయ గుటగుటధ్వనులు, అది మత్తగజుని యడరి యేయుటయు
నాతీవ్రశరమప్పు డదరంటదాఁక, హాతాత హామాత యసునార్తరవము
పొరిఁబొరి నామర్మములు గాడిపాఱ, వరమునిసుతుఁ డుర్వి వ్రాలి యిట్లనియెఁ
గ్రమమెప్ప నడవులఁ గందమూలములు, నమలుచుఁ దపసినైననుఁ గన్నగురులఁ
గొలిచి యేరికిఁ గీడుగోరని నాకుఁ, గలిగెనే నేఁడిట్టి కష్టంపుఁజావు
ఎట్టిపాపాత్ములు నీరాత్రులందు, నెట్టన చంపరు నెఱుసి జంతువులఁ
బగళుల రతికేళిఁ బాయక మెలఁగు, మృగములఁ జంపరు మెయినోటులేక
యెవ్వఁడొకో నన్ను నీనడుచేయి, క్రొవ్వాఁడిశరమునఁ గూల్చినవాఁడు
వాఁడేమిగతిఁ బోవువాఁడొకో యింక, వాఁడేమినేయును వఱులు నామృతికి
నక్కటా వృద్ధులై యంధులై తమకు, దిక్కెవ్వరును లేక దీనులై యున్న
తల్లిదండ్రులు నేఁడు తమకైనవగల, వెల్లియు నెబ్బంగి వెడలనీదెదరొ
కడుఁ బ్రొద్దువోయె నొక్కఁడుఁ బోయి తడసె, కొడుకని మది నెంత గుందునో తల్లి
ననుఁగన్నతల్లికి నారామిఁ జెప్పి, యనుమానపడి యెంత యడలునో తండ్రి
యాటలమరిగి రాఁడని చూతురొకొ్క, నీటికందువలేమి నిలిచినాఁడొకొ్క
యేమని వగతురో యీచావు విన్న, నేమిగాఁగలవారొ యిటమీఁద వారు

ఎవ్వారు నుదకంబు నిచ్చెద రింక, నెవ్వారు ప్రోచెద రిటమీఁద వారిఁ
గడఁగి యీబ్రాణ మొక్కఁటనె ముప్పురముఁ, బడితి మింకేమని పలవింతు విధికి
నని విలాపించుచో నావిలాపములు, విని యెప్పుడెప్పుడు విరియునో తమము
ఎప్పుడు చూతునో యిమ్మహాపురుషు, నిప్పాటు పాటిల్లెనే నేఁడు నాకు
ననుచుండ నుదయించె నంతఁ జందురుఁడు, వనధిలో నాశోకవనధియప్పాంగ
చందురుఁ డుదయింప సరయువు దాఁటి, యందు నస్త్రీరంబునందును వెనుక
తనచేతికలశంబు ధరణిపై వైచి, తనచెక్కుకలశమస్తకమునఁ జేర్చి
యురమున వీపున నొండొండనెడలు, నురుర క్తధారలు నొడలెల్లఁ దోఁగి
వీడినజడలతో విశిఖవేదనల, వాడినమోముతో వసుధపై వ్రాలి
శరముపదేశమై చనఁజొచ్చి లోనఁ, బరికించి దేహసంబంధంబు లణఁచి
యేకర్మములయందు నీడాడనీక, నైకొని యింద్రియగతు లుజ్జగించి
కడపటియోగంబు గని తన్ను మఱచి, పడియున్న యోగికైవడి నూరకున్న

దశరథుఁడు యజ్ఞదత్తుని జూచి చింతించుట.

మునికుమారుని జగన్మోహనాకారుఁ, గనుఁగొని బ్రాణంబు గని యేను బెదరి
యన్నదీజలములు నప్పుడు తెచ్చి, కన్నులు దుడిచి యంగములెల్లఁ దుడిచి
యక్కట మునినాథ యడరి నాశరము, దిక్కఱి దాఁకి వధించెనే నిన్ను
నీనదీజలముల కేల విచ్చేసి, తేనింక నీపాప మేమిటఁ గడతు
ననుచుండఁ దనకన్ను లల్లన విచ్చి, ననుఁ జూచి తనుఁ జూచి నాభీతిఁ జూచి
నీవేమినేయుదు నీకేల వగవ, నీవెవ్వఁడవు నాకు నికృతి గావింప
నైవయోగంబున ధరణీశ నాకు, నీవిధియయ్యె నీకేల శోకింప
నేనుఁగే యనుబుద్ధి నేసితిగాని, పూని నాదెసఁ గోపమున వేయవీవు
ఏను బ్రాహ్మణుఁడఁగా నెలమి వైశ్యునకు, భూనాథ శూద్రికిఁ బుట్టినవాఁడ
నటఁగాన నిది బ్రహ్మహత్యయుఁ గాదు, పటుదోషఫలము నీ బ్రాపింపలేదు
నరనాథ తలఁకకు నాచావుఁ జూచి, యరిగి నాగురులున్న యచటికిఁ బోయి
నాచావుఁ జెప్పకున్నను యోగదృష్టిఁ, జూచి భావించి యచ్చుగఁ గాంచిరేని
కోపించి నన్నగురులు నీబట్టి, శాపింప రఘుకులశ్రేయము గాఁగలదు
భూపాల యీకొండపొంత పశ్చిమపుఁ, గోపున నొకమట్టి కొమరొందుచుండు
నావటవృక్షకోటరమందు రేయి, కావడిఘటియించి కడుసంతసమున
గురుతుగా నేను నాగురుల నందుంచి, యరసి పోషణసేయ నందున్న వారు
కరమొప్ప గురువుల గ్రక్కున డించి, పరితాపమొందక భయపడకీవు
కావున వారికిఁ గలశోదకములు, వేవేగఁ గొనిపోయి వినుపింపు మీవు
మనుజేశ నీయస్త్రమరణంబు నాకు, ననుచిత మీబ్రాణ మల్లనఁ బెఱుకు
మీశరవేదన నేనోర్వఁజాల, నాశరీరమునఁ బ్రాణము లుండ వింక
ననవుడు నేనప్పు డల్లనఁ జేరి, ఘనమైనశోకాగ్నిఁ గ్రాలుచు వగచి
యమ్మఁబెఱుకఁ బూని యటు ముట్టవెఱచి, క్రమ్మఱఁ దెగువమైఁ గలఁగి కంపించి

పనిగొనువగలతో బాణంబు వెఱుక, మునికుమారుఁడు ప్రాణములు వాసె నంతఁ
గలఁగుచు నేను నాకలశంబుతోడి, జలములు గొని తదాశ్రమభూమి కరిగి
యతివృద్ధులై యంధులై తారనన్య, గతికులై నిజసుతాగమన ముల్లముల
నెడపకఁ గోయచు నెఱుకలు విఱిగి, పడియున్నపక్షులపగిది నట్లున్న
ఘనపుణ్యులగువారిఁ గన్గొని చెఱఁ, జనుదేరఁ జూఁ గాలిచప్పు డాలించి
యోపుత్ర యిటు తడవుండుదువయ్య, మాపట్టి రాకేల మసలెనో యనుచు
దలఁకుచుండితిమి మీతల్లియు నేను, నిలుతువె యొకచోట నీవింత ప్రొద్దు
తనయ నీవెక్కఁడ తడసితివయ్య, కసుఁగొనఁగా మాకుఁ గన్నులు నీవ
అతివృద్ధులకు మాకు నాధారమీవ, గతిలేని మాకు సద్గతియును నీవ
యిదియేల పలుకవో యేమంటి నిన్ను, నుదకముల్ తెమ్మంటి నోకుమారకుఁడ
యనిపల్కఁ మునిపల్కఁ లంతరంగమునఁ, బెనఁగొన్నశోకంబు భీతియుఁ బెనుపఁ
చెక్కెక్కి కావిడి శీఘ్రంబ డించి, యట్టిట్టు వడఁకుచు నతివేనవృత్తిఁ
జెప్పెద నన వచ్చి చెప్పరాకుండి, చెప్పకపోదని చెప్పనూహించి
చలియించి గద్గదస్వరముతో వెడలు, పలుకులఁ దడబాటుపడుచు నిట్లంటిఁ
దాపసోత్తమ యేను దశరథమేది,నీపాలకుఁడఁగాని నీపట్టిఁ గాను
నీచకర్ములు విన్న నిందించునట్టి, నీచకర్మము నాకు నేఁడు సిద్ధించె
నేయుగంబులయందు నెవ్వరు నిట్లు, నేయనిపాపంబుఁ జేసి మీకడకు
వచ్చితి నేమని వాక్కువ్వనేర్తు, దెచ్చె దైవం బిట్టిలెంపునేయుటకు
సరయువుపొంత నిశావేళ వేఁట, దిరుగుచు మృగము లేతెంచుచక్కటికి
వీనుల దృష్టించి వెస శబ్దవేధు, లైనబాణము లేసి యందందఁ జంప
నీరుకందువనుండి నీకుమారుండు, నీరు నింపఁగఁ గుంభనినద మాలించి
యేనుఁగుతలఁపున నేసితిఁగాన, నానతి నాకేమి యనఘు మీతనయు
ప్రాణముల్ గొనియె నాపటుబాణ మనినఁ, బ్రాణముల్ ఝల్లనఁ బడిమూర్ఛవోయె
నామునిపత్నియు హాపుత్ర యనుచు, భూమిపైఁ బడి రిత్తవోందునట్లున్న
నప్పుడే నడలుచు నల్లనఁ దెలుపఁ, దెప్పరి వారు నాదెస మోములెత్తి
యేలయ్య దశరథ యేల శోకాగ్ని, గ్రాల మాతనయు నెక్కఁడ దాఁచితీవు
అడవులఁ దపసులై యంధులైయున్న, బడుగులఁ,జంపి పాపముఁ గట్టుకొంటి
యడరి నీదగుబాణ మదరంటగొన్నఁ, బడునప్పు డేమని పలికెనో కొడుకు
పాయనివేదనఁ బ్రాణముల్ విడిచి, పోయెనో విడువకఁ బొదలుచున్నాఁడో
మృతికైన నొండునిమిత్తంబులేదె, యతిసుతుఁ డఁట బాణమఁట చావువిధియు
బుడమి వానప్రస్థుఁ బొలియించెనేని, చెడునింద్రుఁడైనను జెడఁడె భూవిభుఁడు
అవనీశ మాపుత్ర నజ్ఞానబుద్ధి, తవిలియేసితిగానఁ దగదు నిన్నలుగ
మాకుఱ్ఱఁ జూడక మమఁ గొని క్రాలు, శోకాగ్నులారవు చూపవే వాని
ననియని శోకించు నాతపోధనులఁ, గొనిపోయి వీఁడె మీకొడుకనుటయును
వేఁడి పయోధారవిమలమానసుఁడు, వేఁడి తపోధనవిపులపుణ్యుండు

వేఁడి సుధీజనవితతవ ర్తనుఁడు, వేఁడి నిరంతరవేదతత్పరుఁడు
అనుచుఁ జేతులు చాచి యందంద వెదకి, తనయునిపైఁ బడి తల్లి శోకించి
తొడలపై నునిచి నెత్తుటఁ దోగియున్న, జడలలోఁ దలఁజేర్చి సంతాపమంది
యోవిమలాత్మక యోయజ్ఞదత్త, యోవిశ్రుతాచార యోధర్మనిపుణ
యెందు నాతోడ నీవిటఁ జెప్పికాని, యెందునుబోవ వీవిదియేమి నేఁడు
నాకలోకమున కున్నతిఁ బోవుచుండి, నాకేల చెప్పవు నావంశతిలక
కడవఁజేసెడుపాపకర్మరాశైతి, నడురేయి నిన్గడువడిని బొమ్మంటి
నేచినగురుభక్తి నెల్లలోకములఁ, గాచినకొడుకు నిక్కఁడఁ జంపుకొంటి
నాకేటితప మింక నాకు నీతోడి, లోకంబె కాకింక లోకైకవినుత
యెక్కడి నీప్రాణ మెక్కడిబొణ, మెక్కడ దశరథుం డెక్కడ నీవు
ఇన్నియు నొడఁగూర్పఁ గీటు నేఁడు గలిగి, నిన్ను ద్రెక్కొనియెనా నీకర్మఫలము
అని తల్లి శోకింప నమ్మునీశ్వరుఁడు, తనయునిపైఁ బడి తద్దయు వగచి
నీవు నాకడ కతినిష్ఠతో వచ్చి, కావింతు ప్రీతిసత్కారముల్ తొల్లి
యేను నీకడ కిప్పుడే తెంచియున్న, నేనెయ్యములునేయ వీటు నీకుఁ దగునె
కొడుక నీనిర్మలగుణకలాపములు, వెడలెనే యీబొణవివరంబునందు
నెవ్వనిఁ జదివింతు నింక వేదములు, నెవ్వనిఁ జదివింతు నింక శాస్త్రములు
నెవ్వని వినిపింతు నింక ధర్మములు, ఎవ్వని కెఱఁగింతు నింకఁ గావ్యములు
ఫలములు జలములు పరికించి మాకు, నలయకుండఁగ నెవ్వ రరసి పెట్టెదరు
దీర్ఘాయివని నిన్ను దీవింతుగాని, నిర్ఘాతపటుబొణనిహతి వల్కితినె
జమునైనఁ బుత్రభిక్షము వేఁడుకొనెదఁ, గొమరార నచటికిఁ గొనిపోఁగదయ్య
పనివడి యెందును బరలోకవిధులు, తనయు లొనర్తురు తల్లిదండ్రులకుఁ
బరపాటి దప్పించి పరలోకవిధులు, మరలించి విధి నీకు మముఁజేయఁ బనిచె
నీకలదినములు నిష్ఠపెంపొందఁ, జేకొని మమ్మురక్షించితి వీవు
నీయట్టికొడుకును నిజముగాఁబూని,యేయుగంబులఁ గందు నింక నే ననఘు
దురితదూరుఁడవు బంధురతపోనిధివి, గురుభక్తుఁడవు నీవు గురుభక్తియుతులఁ
బరలోకపరులార్యపరులు ధర్మైక, పరులెందు నిజశౌర్యపరులార్తిహరులు
అన్నదానాదిమహాదానపరులు, గన్నలోకంబులు గసుము నీవనుచుఁ
గరమొప్ప నగ్నిసంస్కారాదివిధులు, తరమిడి చేసిరి తమతనూజునకు
నమరుఁడై యతఁడంత నాకాశవీథి, నమరవిమానంబు నందుండి పలికె
ఓగురులార యేను త్తమలోక, భోగభాగ్యుఁడనైతిఁ బుణ్యుండనైతి
కరమర్థి మిముఁగొల్చుకతమున నాదు, మరణంబునకు మీరు మలఁగకుఁ డింక
నేకాల మేత్రోవ నేది గావలయు, నాకాల మాత్రోవ నది గాకపోదు
అయ్యెడుకార్యంబు లగుఁగాక మాన,వయ్య మీరితనిపైఁ నలుగకుఁ డనుచు
ననిమిషపురికేగ నతఁ డంత వారు, తనయునిపైఁ గూర్మి ధరియింపలేక
పోయెద మేమిదె పుత్రశోకమున, మాయట్ల నీవును మరణంబునొందు

మని ఘోరమగుశాప మలిగి నాకిచ్చి, తనువులు విడిచి రత్తఱను లచ్చోట
నగ్నిసమానుల నాపుణ్యధనుల, కగ్నిసంస్కారాదు లట నేను జేసి
చేకొన్నవగల వచ్చితిఁ బురంబునకు, నాకర్మఫలమిదె యాసన్నమయ్యె
ధీరతచెడి బుద్ధి తిరుగుచున్నదియు, నోరెండఁజొచ్చెఁ గన్నులు గానవయ్యెఁ
బలుకులు వినరావు ప్రాణంబు లింక, నిలువ వీ యొడలిలో నిలుపంగ లేను
నాపాలికల్పద్రు, నాధీసముద్రు, నాపరాక్రమరుద్రు నాగుణోన్నిద్రు
నాభాగ్యపదభద్రు, నారామభద్రు, శోభనగుణముద్రుఁ జూడలేనైతి

దశరథుఁడు ప్రాణముల విడుచుట.

నీరాత్రితోఁ గూడ నేడునాళ్లయ్యె, శ్రీరాముఁ బాసి నాజీవ మెట్లుండు
నని ప్రలాపించుచు హారామరామ, యనుచు నంతనె మృతుండయ్యె నారాజు
వనటలఁ గుంది భూవరుఁడు నిద్రించె, నని తాను నిద్రించె నంతఁ గౌసల్య
పరికించి యంతఁ బ్రభాతమాటయును, గరమర్థి వందిమాగధులు నుతింప
దొరకొని మంగళతూర్యముల్ మ్రోయఁ, బురిసుండువారెల్ల గిరికొని వచ్చి
ధరణీశదర్శనోత్కంఠులైయుండ, నిరవొప్ప నేఁడేల యిన్నాళ్లరీతి
దొర మేలుకొనఁ డంచు దొరకొన్నచింతఁ, బరిచారకులు వచ్చి పతిసెజ్జ డాసి
ధరణీశుఁ డున్న చందము పోలదనుచు,నురుభయంబును బొంది యూరుపు లలర
యడుగులు చేతులు నంటంటి చూచి, యొడలఁ బ్రాణములు లేకునికి భావించి
యందఱుఁ బెలుచ మహారోదనంబు, లందంద నేయ దిగ్గన మేలుకాంచి
యదరి కౌసల్యయు నాసుమిత్రయును, బెదరి యందఱుఁ జూచి పృథ్వీశుఁ జూచి
హాయని యెలుగెత్తి హాప్రాణనాథ, పోయితే దశరథభూనాథ యనుచు
విలపింపఁ గైకేయి విని రాఁగఁ జూచి, పలుమాఱు గైకేయిపై మోదుకొనుచుఁ
గైక నీకోర్కులు కడమ్ముట్టె నేఁడు, కైకేయి కలఁచితే కాకుత్స్థకులము
నడవులపాలు గమ్మని రాముఁ ద్రోచి, సడికోర్చి దశరథేశ్వరుఁ జంపుకొంటి
నెలకొని యిటమీఁద నీవు నీసుతుఁడు, నిలయెల్లఁ గైకొని యెలమి భోగింపుఁ
డనుచు నాకౌసల్య యాచిగాసతులు, తనుఁ జేరికొని యేడ్వఁ దలవంచుకొనుచు
నలిదూలి చనుదెంచి నాథుపై వ్రాలి, పలుదెఱంగులఁ గైక పలవించుచుండె
నాసమయంబున నడలు దీపింప, గౌసల్య దశరథుఁ గనువిచ్చి చూచి
ధరణీశ నీయట్టి ధర్మస్వరూప,చరితున కీచావు సమకూరఁ దగునె
మోసపోయితి నిన్ను ముదలింపలేక, నీసత్యసంపద నిన్నింతచేసెఁ
గడుకష్టమతియైన కైకేయిఁ జూచి, యడవికి రాముఁ బోనడచినవగపు
పరికించి నీకేను బరిచర్యనేయ, భరయింపలేనైతిఁ బార్థివోత్తంస
నీయిచ్ఛలోనుండ నీపంపుఁజేసి, పోయి సతీపుత్రులు పొందె రాఘవుఁడు
నెలకొన్నసత్యంబు నీవు పాటించి, బలసి నిలింపసంపదలు గైకొంటి
ధరణీశ నాకు నుత్తముఁడైననిన్నుఁ, బసుసంబులాడినఁ బాపంబు దక్కె-
నని చాలఁ బలవింప నాసుమిత్రాది,వనితలు గొంతెత్తి వాపోవుచుండ

నంతట నీవార్త లందంద మ్రోసెఁ, గాంతలయేడ్పు లాకసమెల్ల నిండె
నంత సూర్యోదయంబయ్యె నాటయును,ఎంతయు భయముతో హితులు బాంధవులు
చేరువ నృపులు వసిష్ఠాదిమునులు, ధారణీసురులు ప్రధానులు వచ్చి
భూరిశోకంబునఁ బొగులువసిష్ఠుఁ, డారూఢమతిమంతుననుమతిఁ బడసి
తడయక దశరథధరణీశుమేను, గడఁకతోఁ దైలపక్వంబు సేయించి
చెలువై నమణిమయసింహాసనమునఁ,గొలువున్న తెఱఁగునఁ గూర్చుండఁబెట్టి
మంత్రులు సకలసామంతులు రాజ,తంత్రజ్ఞులనుగూర్చి తగవునఁ బలికె
నీరాజు సామ్రాజ్యమెల్లఁ బాలించి, స్వారాజునగరికిఁ జనియె నేఁడకట
ఇతనిపూనికఁదీర్ప నింతియుఁ దాను, హితమతియైు రాముఁడేగెఁ గానలకు
భరతుండు తమమామపట్టణంబునకు, నరిగె శత్రుఘ్నుసహాయుఁడై మున్నె
మనము రామునిఁ బిల్వ మరలిరాఁ డతఁడు, తనపూనికి దీర్పకి ధర్మవర్ధనుఁడు
కావున భరతు వేగమె పిలుపింపఁ, గావలయును రాజ్యకార్యముల్ దీర్ప
రాజులేకున్నఁ బురంబు రాష్ట్రంబు, రాజిల్ల దెల్లవర్ణంబులుఁ గలయ
దండనీతిక్రియల్ ధానధర్మములు, మెండొడిచెడిపోవు మింతురు రిపులు
జారులు చోరులు సంచడింపుదురు, కోరి నొంతురు సాధుకోటి దుర్జనులు
దొరలు సామంతులు దుర్దాధిపతులు, నరిది కప్పము లియ్యరని నిశ్చయించి
అలఘుమానసుఁడు జయంతుండు మొదలు, నలుగురుమంత్రులు నయబుద్ధిఁ బిలిచి
పలువన్నెచీర లాభరణముల్ గొనుచుఁ, బొలుచు గిరివ్రజపురమున కేగి
ఈవార్త లాతని కేమియుఁ దెలుప, కావసిష్ఠుండు రమ్మనె మిమ్మటంచుఁ
గడువేగ భరతు నక్కడనుండనీక, తొడుకొని రమ్మన్నఁ దోరంపుఁగడక
వారలు హరులు దువాళిగానెక్కి, సారె నానాపురజనపదంబులను
నదములు నదులు కాననములు గిరులు,పొదలు పెక్కులు దాటి పొదలినధాటి
కరము చెన్నొందఁ గేకయరాజపురికి, నరుగ వారంత నేడవనాఁటిరాత్రి
బలమేది గోమయపంకమధ్యమునఁ, దల విరియఁగఁబోసి తండ్రి గూలుటయు
జలనిధి శూన్యమై సంపూర్ణచంద్రుఁ, డిలఁ గూలుటయుఁ బట్టపేనుంగుకొమ్ము
విఱుగుట మొదలైనవిషమంపుఁగలలు, తఱుచుగాఁ గని లేచి తద్దయు భీతి
తనయిష్టసఖులతోఁ దత్ప్రకారంబు, వినుపించి వగలమై వెనుఁబడుచున్న
భరతుసన్నిధికేగి ప్రణమిల్లి నిలిచి, కరమర్థిఁ దమచేతికానుక లిచ్చి
యావసిష్ఠుఁడు కార్య మక్కడగలిగి, దేవ మిమ్మిట తోడితెమ్మన్న వాఁడు
విచ్చేయమనవుడు వెస దూతచేష్ట, లచ్చుగాఁ గనుఁగొని యతిభీతినొంది
తనమామకడకేగి తత్ప్రకారంబు, క్రమమొప్పఁ దెలిపి సత్కారముల్వడసి

భరతుఁ డయోధ్యకు వచ్చుట.

యతఁడంపఁ గదలి రథారూఢుఁ డగుచుఁ, జతురంగబలములు సచివు లేతేర
నతులితచింత నేడవనాఁడు వచ్చి, యతిరయంబున నయోధ్యాపురిఁ జొచ్చి
పతిలేనిసతి నిశాపతిలేనిరాత్రి, గతి నెంతయును భోగకళలకుఁ బాసి

కన్నుల కాపురి కడు వాడుపాఱి, యున్న చందము చూచి యుల్లంబు గలఁగి
యిదియేమివిధమొకో యీపట్టణంబు, తుదిమొట్ట శూన్యమై తోఁచుచున్నదియుఁ
బౌరులు ననుఁ జూచి బాష్పము ల్దొరుగఁ, దూఱుచు దవ్వులఁ దొలఁగిపోయెదరు
అంగళ్ల సకలసామగ్రివస్తువులు, పొంగారవేటికి పురములో ననుచు
నగరివాకిట సమున్నతి రథంబు డిగి, మొగిచెడి తాను దమ్ముఁడు శూన్యమైన
యంతఃపురంబున కరుగఁ గైకేయి, యెంతయుఁ బ్రియముతో నెదురుగా వచ్చి
కౌఁగిలించుటయును గరమర్ది గైక, కవిరళభక్తితో నప్పుడు మ్రొక్కి-
యిచ్చమైఁ దమమామ యిచ్చినతొడవు, లిచ్చి వారలనేమ మేర్పడఁ జెప్పి
యెంతయు శూన్యమై యిదియేమి నగరు, వింతయై యున్న ది విభవంబు దఱిఁగి
రామలక్ష్మణులకు రాజవర్యునకు, నేమమే యనవుడు చింతించి కైక
భరతునిఁ జూచి సంభ్రమము రెట్టింప, దరహాసవదనయై తగవేది పలికెఁ
దలకొని తొల్లి మీతండ్రి నాకర్థి, వలనుమీఱఁగ రెండువరము లిచ్చుటయు
నొకటికి భరతుని నుర్వినేలింప, నొకటికి రఘురాము ననుపఁగానలకు
నని వేఁడుటయుఁ దండ్రియానతిఁ బూని, జనకజాలక్ష్మణసహితుఁడై మునుల
యనుపున రఘురాముఁ డడవికిఁ బోయెఁ, దనయుని నెడఁబాసి ధరణీశుఁ డీల్గె
నీసున నీకుఁ గా నీయుపాయంబు, చేసితి రాజ్యంబు చేకొను మింకఁ
బ్రజలఁ బాలింపు సంపదలఁ దేలింపు, భుజశక్తినేలుము బుద్ధినొం డనక
ననవుడు మూర్ఛిల్లి యవనిపైఁ ద్రెళ్లి, ఘనరోషదృష్టిమైఁ గైకేయిఁ జూచి
కైక నాతల్లివై కరుణకుఁ బాసి, యీకష్టవర్తన మేల కైకొంటి
మునివేషమున వనంబున రాము నుండు, మని పల్క నెట్లు నోరాడెనే తల్లి
యరయ నిర్మలధర్మ లైనరాఘవుల, చరితంబు నీకు విచారింపఁ దగదె
యేనింక మాతండ్రి కేమని వగతు, నేను రాముని మొగం బెటువలెఁ జూతు
నెంత లోఁగుండెనో యిచ్చలో రాముఁ, డెంత కోపించెనో యేచి లక్ష్మణుఁడు
యెంత దూఱెనో కానకేగుచో సీత, యింత కేమయ్యెనో యింతి కౌసల్య
యంతఃపురాంగన లాసుమిత్రయును, వంతచే నేమని వగచుచున్నారొ
వీరలకడకేగి విలపింప నాకు, నోరెద్ది యెట్లు మనోవ్యథఁ దీర్తు
నింక నీపురమేల యీభోగమేల, శంకింప కడవియే శరణంబు నాకు
ఘనపాపరతిఁ జేసి కడఁగి మీతల్లి, నిను నొక్కరక్కసునికిఁ గననోపుఁ
గాని కేకయరాజుఁ గన్నకూఁతురవు, గానేర వేమందుఁ గైక నీతోడ
ననుమాటలన్నియు నల్లనఁ బొంచి, వినుచున్న మందర వెసఁ జూచి ప్రజలు
ఇన్ని పాపంబులు నిదియ చేయించె, నన్న శత్రుఘ్నుఁడు నావృద్ధవనిత
గూనుడొంకులు దీఱ క్రొమ్ముడి జాఱ, మేనిసొమ్ములు వీడ మెలఁతలు చూడ
కడకాలుఁ బట్టి యాకసమునఁ ద్రిప్పి, పుడమిపై వ్రేసె నప్పుడు చాల నలిగి
కైకేయిసతులెల్ల కనుకని చెదరఁ, గైకను వధియింపఁ గడఁగిన నంత
భరతుండు చూచి యీపాపాత్మురాలిఁ, బొరిగొని పాపంబుఁ బొందనేమిటికి

పెనుపేది తల్లిఁజంపిన నీచులనుచు, మనలఁ జూడఁగ రోయు మది రామవిభుఁడు
అటుగాన వలదని యతని వారించి, యటు పోయి కౌసల్యయడుగుల కెఱఁగి

భరతుఁడు కౌసల్యయొద్దకుఁ బోవుట

తాను దమ్ముఁడు శోకదందహ్యమాన, మానసుఁడై పలుమాఱు తెలుఁగెత్తి
పలవింప నప్పు డాభరతునిఁ జూచి, యలిగి కౌసల్య యిట్లని దూఱి పలికెఁ
బతిఁబాసి సుతుఁబాసి బహుళదుఃఖముల, మతి మాకు శోకింప మఱిఁ దగుఁగాక
నీకేల శోకింప నెలకొని యింత, నీకోరినట్లెల్ల నీతల్లి చేసె
నన్ను నీవింక రాజ్యము నేయుచుండు,మన్నఁ జేతులు మోడ్చి యతఁడు భీతిల్లి
పెనువెన్క దిగియ నవ్వెలఁది కౌసల్యఁ, గనుఁగొని వాక్కాయకర్మచిత్తముల
శ్రీరామునకుఁ గీడుఁ జేసితినేని, ధారణి నేనేల దలఁచితినేని
నేను గైకతలంపు నెఱిఁగితినేని, నే నొకకీడైన నెఱిఁగితినేని
వినుము మద్యంబు ద్రావినవానిగతికిఁ, బెనుపేదవిప్రుఁ జంపినవానిగతికిఁ
దెగి గురుపత్నిఁ బొందినవానిగతికి, జగతిపైఁ దానోడిచనువానిగతికి
చెనఁటియై పసిఁడి మ్రుచ్చిలువానిగతికి, నెనసి గోహత్య చేసినవానిగతికి
న్యాయంబుదప్పిన నరనాథుగతికి, నేయెడఁ గొండెగాఁ డేగెడుగతికి
శరణార్థుఁ బ్రోవనియరితాత్ముగతికి, వరధర్మవిక్రయవాంఛితుగతికి
గురువులఁ దిట్టిన కుటిలాత్ముగతికి, నరయ స్వామిద్రోహి యగువానిగతికిఁ
దల్లిదండ్రులఁ దిట్టుతనయునిగతికిఁ, గల్లలాడెడు పాపకర్తనిగతికిఁ
బరధనంబుల కాసపడువానిగతికిఁ, బరసతిఁ గలసినపాపాత్ముగతికిఁ
జనువాఁడ నిందుకు సాక్షి దేవతలు, ఈపాపకర్తరా లిటుచేసెఁగాక
యేను రాముని కేల యెగ్గు గావింతు, నీనీచకర్మంబు లేడ నేనేడ
నని యేడ్చుభరతు శోకాగ్నులపెంపుఁ, గనుఁగొని కౌసల్య కడుభీతిఁ బొంది
యిటువంటిపుణ్యాత్ము నేల దూఱితిని, గటకటాయని పొక్కి కౌఁగిటఁ జేర్చి
భరతుశత్రుఘ్నులపై వ్రాలి తూలి, పరితాపమొందుచుఁ బలవించుచుండె
నంత వసిష్ఠసంయమి వారిఁ గొనుచు, నంతఃపురంబున కడలుచుఁ బోవఁ
గనుఁగొనఁగారాదు కైకేయిగన్న, తనయుండు వీడని తనమీఁద నలిగి
పెనుపొంద మాణిక్యపీఠిపై నొరిగి, తనుఁ జూడనొల్లని తలఁపున రోసి
కనుఁగవమూసినగతి నున్నతండ్రిఁ, గనుఁగొని భరతుండు కడుమూర్ఛఁబొంది
తెలిసి క్రమ్మఱఁ జూచి తీవ్రంపువగల, వెలువరింపఁగరాక విలపింపఁ దొడఁగె
వసుధేశ కేకయావనిపాలుచేత, నసమానమణిభూషణావళి నీకుఁ
గొనివచ్చినాఁడఁ గైకొన నొల్లవేమి, ననుఁ జూడ వదియేమి నాతప్పులేమి
కడుఁబాపమతియైన కైకేయిగన్న, కొడుకని ననుఁజూడఁగూడదో కాక
ధరణీశ యాసుమిత్రాపుత్రుఁ జూడు, పురపురఁ బొక్కుచుఁ బొరలుచున్నాఁడు
కడఁగి నీహస్తపంకజములఁ బట్టి, తుడువ వేమిటికి శత్రుఘ్నుపైఁ ధూళి
నితనిఁ గటాక్షింపు మితనితోఁ బల్కు, మితనిఁ గౌఁగిటఁ జేర్చు మితఁడేమిచేసె

నీమంచితనమును నీదయాగుణము, నీమొగమోటము నేఁడెందుఁ బోయెఁ
గైకేయి నీబుద్ధి గలఁచెనే తండ్రి, నీకిట్టిమరణంబు నేర్చెనే కలుగఁ
జాలరే నృపులెందుఁ జత్తురుకాక, లేవుకా కిట్టివి లేవుగా యెందుఁ
బడఁతులు మెప్పించి ప్రాణవల్లభుల, నడుగరె యీయీవు లడుగరుకాక
యీకష్టవర్తనం బేమిటఁ గడతుఁ, జేకూరె నీకనేమి సేయుదు ననుచుఁ
బలుమాఱు విలపించుభరతునిఁ జూచి, తెలిసి వసిష్ఠుండు తెఱఁగొప్పఁ బలికె
అనఘాత్మ మీతండ్రి యవనినంతయును, వినుతింప నఱువదివేలేండ్లునేలె
మనుమార్గనియతి ధర్మములెల్లఁ జేసె, గొనకొని మీయట్టికొడుకులఁ గనియెఁ
గావున నీవు శోకము మానుమింకఁ, గావింపు మగ్నిసంస్కారాదివిధుల
ననవుడు నౌఁగాక యని మఱునాఁడు, మునుల రాజుల మహాత్ములఁ బిలిపించి
వలనొప్ప దశరథేశ్వరుకళేబరము, కలఁగొని తీర్థోదకము లార్చి తెచ్చి
వరవస్త్రభూషణావళులఁ గైనేసి, తరమిడి వేదోక్తదానములు నేసి
పరఁగ విమానంబుపైఁ దెచ్చి పెట్టి, యయదైన మంత్రపూతాగ్నిఁ జేపట్టి
తనతమ్ముఁడును దాను దగ వసిష్ఠాది, మునులతో భరతుండు ముందఱ నడువ
నావిమానమునకు నందందఁ గదిసి, వావిరి యేడ్చుచు వగలఁ దూలుచును
మునుకొని కౌసల్య మొదలుగాఁగలుగు, వనితలందఱుఁ గూడి వరుస నేతెర
సరయువుచేరువ శవభూమియందుఁ, దిరముగా సొదఁబెర్చి త్రేతాగ్ను లునిచి
యొలసినభక్తి వేదోక్తమార్గమున, నెలకొని దశరథనృపతి దహించి
తగురీతి మఱి తిలోదకములు వోసి, తగవుతోఁ బిండప్రదానములిచ్చి
నగరికి వచ్చి యున్నతి భూసురులకుఁ, దగఁ బితృప్రీతిగా దానములిచ్చి
తెఱఁగొప్పఁ బండ్రెండుదినములు వలయు, తెఱఁగుల నడిపి వర్తించుచో నంతఁ
గొనకొని యిక్ష్వాకుకులగురుండైన, మునివసిష్ఠుఁడు కార్యములు విచారించి
తాను రాజన్యులు తగుమంత్రివరులు, భానుసన్నిభతేజు భరతునిఁ జూచి
వరతేజ మీతండ్రి పరలోకమునకు, నరిగె శ్రీరాముఁడు నరిగెఁ గాననకు
నుర్వికి రాజు లేకున్న కార్యములు, నిర్వహింపఁగరాదు నిల్వరు ప్రజలు
ధారణి చలియించు ధర్మంబు లణఁగు, వైరులు మింతురు వర్ణములల్లలియు
నవని యరాజకమై యుండఁ దగదు, ప్రవిమలమతి నీవు పట్టంబుఁ బూను
మని బుద్ధిచెప్పిన నమ్మునినాథుఁ, గనుఁగొని భరతుండు కరములు మొగిచి
యిదియేమి మునినాథ యింతమూఢుఁడనె, మదినింతయెఱుఁగనె మాకులక్రమము
నన్నఁ గాననఁద్రోచి యక్కటా నన్నుఁ,గన్నతండ్రినిఁ జంపెఁ గడఁగి మాతల్లి
యింత చాలదె నాకు నింక రాజ్యంబు, చింతింతునే యేను జెప్పకు మింకఁ
గైకేయికొడుకని కడఁగి పల్కఁదవ్వు, గాక యీతలఁపులు గలవె నాయందు
నిట్లున్నరూపున నేను మారాము, పట్టంబు గట్టెదఁ బ్రార్థించి తెచ్చి
కాకున్న మాయన్న గైకొన్ననియతిఁ, గైకొందుగా కొండు గలుగునే మాకు

భరతుఁడు రామునివద్దికిఁ బోవుట.

నని నిశ్చయముచేసి యపుడు మంత్రులను, గనుఁగొని మాయన్నఁ గానఁబోవలయు
తెరువులు చక్కఁగా దిద్దింపుఁ డఖిల, పురజనులకు నేగఁ బొసఁగినరీతి
నెడనెడ విడుదు లనేకవస్తువులు, కడుసమగ్రములుగాఁ గావింపుఁడనిన
ననుకూలమతి వార లట్ల చేయించి, రనుపమోత్సాహులై యమ్మనునాఁడు
వందిమాగధులును వరమంత్రివరులు, సుందరీనటనర్తసుకుమారవరులు
నవసహస్రములు దంతావళఘటలు, జవనాశ్వకోటి లక్షయు శతాంగములు
నఱువదిలక్షలు నమితపదాతి, తఱుచుగా నడువ నత్తఱిఁ బౌరజనుల
జనపదస్థుల నెల్ల జాతులవారి, ధనరత్న రాసులు తగ వసిష్ఠాది
మునుల రాజుల మంత్రిముఖ్యులఁగొనుచుఁ, దనతమ్ముఁడను దాను దల్లులందఱును
ననువుగాఁ జతురంతయానంబు లెక్కి, వెనుక రా భరతుఁ డవ్విధమునఁ గదలి
పోయి గంగాతీరమున దండువిడియ, నాయతభుజశీలుఁ డగుగుహుం డెఱిఁగి
కడఁగి రామునిమీఁదఁ గై కేయికొడుకు, నడచుచున్నాఁడు సేనలతోడ ననుచు
నలవుమైఁ గోపించి నావ లాగించి, బలములతో వచ్చి భరతునకనియె
భరత రాముఁడు రాజ్యపదము నీకిచ్చి, యరుదుగా మునివృత్తి నడవుల నుండ
నీవు సేనలఁ గూడి నిజశక్తి మెఱసి, పోవుచున్నాఁడవు పోలునే నీకు
నేను రామునిబంట నేనంప నిన్నుఁ, బోనీసు నీబలంబుల సంహరింతు
నడరి నీతోడఁ బోరాడి ప్రాణములు, విడిచిన మఱి రామవిభునిపైఁ బొమ్ము
అని రోషమున గుహుఁ డాడువాక్యములు, విని భరతుఁడు నవ్వి వినులుఁడై పలికెఁ
బరమాత్ముఁ డగురాముఁ బ్రార్థించి తెచ్చి, పరఁగ నయోధ్యకుఁ బట్టంబుగట్టఁ
బోవుచున్నాఁడ నాబుద్ధిలో నొండు, భావించి నీవిట్లు పలుకంగవలదు
అని పల్కనాతని నక్కునఁ జేర్చి, తనమది పొగుల నాతనిచిత్త మెఱిఁగి
యనురక్తి భరతేశునడుగులకెఱఁగి, యనుపమవన్యంబు లైనవస్తువులు
కని దనియఁగఁ బెక్కుకానుక లిచ్చి, కొనిపోయి గుహుఁడు కాకుత్స్థుండు తొల్లి
విడిసినచోటున విడిచి సంప్రీతి, జడలుగట్టినచోటు చనిచని చూప
జనులును మునులును సచివులు దానుఁ, గనుఁగొని భరతుండు కడుశోకమంది
సీతరాముండును జేరి పరుండ, నాతతతృణశయ్యలందుఁ గన్పడెడు
తరుచైన కనకవస్త్రములచిహ్నములు, పొరిఁ గనుఁగొని మదిఁ బురపురఁ బొక్కి
ఘనశోకమునుబొంది కడుదీనుఁ డగుచు, మునురాఘవుఁడు జటల్ మొనసిధరించె
నెక్కడ నని భరతేశ్వరుం డడప్పు, డక్కడకేమును ననువుగా జటలు
పనువుచు మఱి మట్టిపాలు దెప్పించి, తనతమ్ముఁడును దాను ధరియించె జడలు
భరతుండు మునినాఁడు బ్రాహ్మికకర్మ, పరుఁడునై గుహుఁడురాఁ బన్నించినట్టి
యేనూఁబలునావ లెక్కి వేర్వేఱఁ, దానుఁ దల్లులు ముసుల్ తగ మంత్రివరులు
సకలసేనలుఁగూడ జాహ్నవిదాఁటి, యకళంకుఁ డగుగుహు నపుడు తోడ్కొనుచు
నతఁడు చూపిన త్రోవ నటఁ బోయిపోయి, క్రతుహోమతతధూమకబళితవ్యోమ

కృతకాంబుదస్తోమ కేవలముదిత,కృతలాస్య విపినబర్హిణబర్హ్మజాల
రచితాంతరాంతరరత్నవిచిత్ర, ఖచితతోరణపదక్రమమునై యొప్పు
నాభరద్వాజసంయమియాశ్రమమున, కాభరతుఁడు పోయి యనతిదూరమునఁ
జతురంగబలములఁ జతురత నిలిపి, యతులపుణ్యాత్మకుం డగుభరద్వాజుఁ
గని భక్తితో నమస్కారము ల్సేయఁ, గని యమ్మహాముని కడునల్లి పలికె
భరత యీచతురంగబలములఁ గొనుచు, భరితసన్నాహసంభ్రముఁడవై నీవు
కడుశాంతవృత్తి రాఘవుఁ డరణ్యములఁ, బడియుండ నాతనిపైఁ బోవనేల
ననుచున్న మునికోపమంతయు నెఱిఁగి, వినతుఁడై భరతుండు వెఱచుచుఁ బలికె
జానకీవల్లభ సకలరాజ్యంబు, పూనుము నీవని పోయెదఁగాని
యొండుభావమునఁ బోనోమునినాథ, యొండుగాఁ దలఁపకు ముల్లంబులోన
ననిన సంతోషించి యమ్ముని పలికె, ననఘాత్మ నీవు నీయఖలసైన్యమును
మనమూర నాయాశ్రమమున నేఁడుండి, వినుతి మే మొనరించు విం దారగింపు
మని విశ్వకర్మను నటకు రప్పించి, ఘనచిత్రపురి యొండు గల్పించి యందు

భరతుఁడు భరద్వాజాశ్రమంబుఁ జేరుట.

వారువీరన కెల్లవారికిఁ దగిన, మేడలనిండ్లు నిర్మింపు మీ వనిన
నైదుయోజనముల నతఁడొక్కపురము, భూదేవిచరణనూపురము నిర్మించె
నందుఁ గాంచనమయం బొనొక్కరాజ,మందిరంబమరెఁ దన్మందిరంబునను
శ్వేతాతపత్రోరుసింహాసనమునఁ, జాతురి నొకసభాసదన మింపొందె
నప్పుడు మునియాజ్ఞ నట భరతుండు, విప్రైనగృహము ప్రవేశించి యందు
సింహాసనముగాంచి శ్రీరామనృపతి, సింహాసనంబంచుఁ జేతులు మొగిచి
యాసమీపంబున నపుడొక్కపీరి, నాసీనుఁడై మిత్రులందఱు గొలువ
నున్నచో మునియాజ్ఞ నొక్కట వచ్చి, కిన్నరగంధర్వఖేచరాంగనలు
నచ్చట నచ్చర లాటలుపాట, లచ్చెరువుగఁ జూపి రతనిసన్నిధిని
నీరీతి సకలజనావళియిండ్లు, నారూఢి వెలసె నాట్యప్రసంగములు
నిలమీఁద దివిమీఁద నేయేవిశేష,ములు కలవన్నియు మునియాజ్ఞ వచ్చె
జానపదు ల్పౌరజనములందఱును, స్నానముల్ గావించి చలువలుగట్టి
మందారపుష్పదామంబులు పూని, చందనంబలఁది భూషణములు పెట్టి
వేవేలతెఱఁగుల వింతగా వేల్పు, టూపు చతుర్విధాహారంబు లొసఁగఁ
బరితృప్తులై దివ్యభోగములు దమకు, సురతవిశేషముల్ సొక్కుచుఁ దెలుప
జన్మసాఫల్యంబు సమకూరె ననుచుఁ, దన్మయావస్థలఁ దగిలి క్రీడింప
నమ్మునియాశ్రమం బటుచూడ నొప్పె, నిమ్ముల నాస్వర్గ మేవగించుచును
ఈరీతి భరతెశుఁ డెల్లసైన్యములు, నాబుషిఁ బొగడుచు నారాత్రిదీర్చి
మఱునాఁడు పురము తన్మందిరావళులు, తెఱఁగంటిచెలులు నదృశ్యమౌటయును
భరతుఁ డత్యాశ్చర్యభరితుఁడై యుండి, వరతపోనిధి భరద్వాజునిఁ జేరి
ప్రణమిల్లి మీతపోబలమహత్త్వములు, ప్రణుతింపఁదర మె యాపరమేష్ఠికైన

నేనింక రఘురాము నినకోటిధాముఁ, గానఁ బోయెదనంచుఁ గన్నతల్లులను
నవ్వేళ మ్రొక్కింప నతఁడు వీరెవ్వ, రెవ్వరు వేర్వేఱనెఱిఁగింపు మనుఁడు
ధీరాత్మ నృపుపెద్దదేవులై యెల్ల, వారిలో వానియు వన్నెయుఁ గాంచి
కడుపుచల్లఁగ రాముగాంచియు వగల, నుడుకుచున్నది తద్వియోగాగ్ని శిఖలఁ
బరిచితజన్మసాఫల్య కౌసల్య, పరికింపుమిదె మునిపతిసార్వభౌమ
కౌసల్యసతివామకరమంటఁబట్టి, కైసేతలుడిపోయి గతపుప్పకర్ణి
కారశాఖయుఁబోలి కైవ్రాలియున్న, యీరామ శ్రీరామునెడఁబాయలేని
యాలక్ష్మణునిఁ గన్న యట్టిపుణ్యాత్ము, రాలు సుమిత్ర పరాకు మునీంద్ర
యేతల్లికైన కానకేగె మాయన్న, యేతల్లికతమున నీల్గె మాతండ్రి
యేతల్లికోర్కి నన్నింతకుఁ దెచ్చె, నీతల్లి మాతల్లి హితపుణ్యపాక
కైక గన్గొనుమంచు గద్గదకంఠుఁ, డై కడపట శోకమగ్నలం బైన
నూరకయున్నచో నూరార్చి యతని, నాబుషి భావికార్యముఁ జూచి పలికె
నీకైక లోకైకహితము గావించె, మీకెల్ల తెల్లమిమీఁదనౌననుచు
మఱి రాముఁ డున్నట్టిమార్గంబు దెలిపి, తెఱఁగొప్పనవ్వాని దీవింప వెడలె
సింధురబృంహితసేనానులాప, సైంధవహేషితస్యందననేమి
రవములకలికి యరణ్యమృగాళి, తివిరినభీతి నద్దెసలకుఁ బాఱ
బలరణోద్ధూతవిపాంసుసంఘాత, మలినీకృతాదిత్యమండలుం డగుచు
నాచిత్రకూటాద్రి కర్థితో భరతుఁ, డేచి సేనలుఁదాను నేగుచో నంత
నటఁ జిత్రకూటాద్రియందు రాఘవుఁడు, కుటిలకుంతలసీత గూడి మోదమున
గనుఁగొంటివే యన్న గంబు బింబోష్ఠి, కనుదమ్ములకు విందుగావించె మనకు
నిన్నగమహిమఁ దానెన్నఁగ వశమె, పన్నగపతికైన భామాలలామ
గుఱుతైన సెలయేటిఘుమఘుమధ్వనులు,ఉఱుములటంచుఁ బెల్లుబ్బి నీకుఱలు
పురుడింపఁ దనగొప్పపురివిచ్చి నెమలి, పొరిఁబొరియాడెడుఁ బూఁబోఁడి చూడ
కాంతరో యీచెంచుకాంతల కంఱె, దంతికుంభంబులు తమచన్నుఁగవకు
నెనవచ్చుకెట్లని యిభకుంభదళన, మెనరించి తన్మణులొప్పఁ దాల్చెదరు
దివ్యులసంకేతదేశంబుగాన, దివ్యవాసనలు సంధించె నీకోన
పదతలాలక్తకభాసురంబైన, పొగఁ జూడ గంధర్వభోగగేహంబు
కిన్నరకంఠి యీగిరిగహ్వరంబు, కిన్నరకిన్నరీగీతసద్దోష్మి
కలకంఠరవసహకారపల్లవము, కలకంఠి యీసహకారంబుఁ జూడు
పరిపరివిధముతోఁ బరువంపువిరుల, పరిమళంబులు గదంబముగఁగూర్చుచును
మలయానిలుండు కోమలయానలీల, మలయుచున్నాఁ డిదె మనపైన నబల
యల్ల దె చూచితె హల్లకనికర, ఫుల్లకైరవకుంజపుంజరంజితము
సాలతమాలరసాలతక్కోల, తాళహింతాలకుద్దాలకూలములు
అమలినపులినమథ్యాసనాసీన, సముచితమునిబృందసండీష్టమైన
మందాకినీనదిమణికన్నులలరె, మందయాన విలాసమథితమరాళ

యనియనిపలుకుచు నవనీరుహాములఁ, గనుపట్టుబొదరిండ్ల ఘనకందరముల
శైలశృంగంబుల సానుదేశముల, నోలి వినోదించుచున్న చోఁ గడఁగి
బలువిడి చనుదెంచుభరతసైన్యముల, కలకలస్వనము లాకర్ణించి బిట్టు
కలఁగి నల్దడఁ బాఱు కరివరాహాది, బలమృగంబులఁ జూచి బలధూళిఁ జూచి
యిట ధూళి దివిఁ బర్వ నేమికారణమొ,యటఁబోయి యరసిరమ్మనిన లక్ష్మణుఁడు
వేవేగ నొకమహావృక్షాగ్ర మెక్కి, భావించి యుత్తరభాగంబునందు
బలములఁ బొడగాంచి భానువంశజుల, బలుబిరుదులతోడఁ బడగలు గాంచి
యిచ్చలో భరతేశుఁ డిట రాముమీఁద, వచ్చుచున్నాఁడని వడి నిశ్చయించి
పటువజ్ర మద్రిపైఁ బడుభంగి దోఁప, జటులసత్త్వమున వృక్షము డిగ్గనురికి
వారక రోషదుర్వారుఁడై వచ్చి, యారామవిభుఁ జూచి యనియె లక్ష్మణుఁడు
అడవికి నిన్నుఁబోనడచి నీరాజ్య, మడరి యంతయుఁ గొని యంతటఁ బోక
ఘనశక్తి నీమీఁదఁ గైకేయికొడుకు, చనుదెంచుచున్నాఁడు సబలుఁడై నేఁడు
యదె చూడు కోవిదారాదిధ్వజంబు, లదె చూడు భటులవీరాలాపములును
శరచాపకవచముల్ సరి పూని నీవు, భరతుని కెదురుగా బలువిడి నడువు
నిలువుము కాదేని నీవు సీతయును, దొలఁగుము నీశాంతి తుది నింతఁజేసె
నేనింక సైరింప నిట వచ్చెనేని, వీనిఁ జంపెదనన్న విని రాముఁ డనియె
నాకుఁ దమ్ముఁడవయ్య నాతోడఁ బుట్టి, నీకిట్టియవినీతి నేఁడేల పుట్టె
భ్రాతృవత్సలమూర్తి పరమపావనుఁడు, నీతికోవిదుఁడు మానితధర్మపరుఁడు
భరతుండు నీకంటె భక్తుండు నాకు, భరతునిదెస నొక్కపాపంబు లేదు
మనల నయోధ్యకు మగుడఁ బ్రార్థింపఁ, జనుదెంచుచున్నాఁడు సందేహముడుగు
కడవకుమనుఁడు రాఘవునాజ్ఞ పెంపు, కడవ భీతిల్లి లక్ష్మణుఁ డూరకుండె
భరతేశుఁ డంతటఁ బౌరులహితుల, దొరల సమస్తయోధుల నొక్కచోట
విడియించి తల్లులు వెనుకఁ దోడ్తేర, గడక వసిష్ఠునిఁ గట్టడచేసి
గురుభక్తి సూతుండు గుహుఁడు తోడుగను, నరిగి తమ్ముఁడుఁ దాను నగ్గిరి నెక్కి
వరుస నయ్యడవి త్రోవలు తెలియుటకుఁ, గరమర్ది సౌమిత్రి గట్టినయట్టి
గుఱుతులు గొన్ని కన్గొనుచు నల్దడల, నెఱిఁగి బరికించుచు నిఖిలాస్త్రశస్త్ర
జాలపాలితనూత్న శాలాంగణములఁ, జాలఁ జెన్నగు పర్ణశాల కేతెంచి

భరతుఁడు మునివేషధారు లైనరామలక్ష్మణులఁ బొడగాంచుట.

మునివేషమునఁ జాల ముదమందురాముఁ,గను గొని యాత్మలోఁ గడఁగి శోకించిఁ
బొలుచు కాంచనగృహంబుల నుండువాఁడు, లలిదూలి పర్ణశాలల నున్న వాఁడు
పొగడొందు పూలపాన్పున నుండువాఁడు, జగతిపై బూరిసెజ్జను నున్న వాఁడు
నెఱసి కిరీటంబు నెఱిదాల్చువాఁడు, తఱుచైనజడ లర్ధిఁ దాల్చి యున్నాఁడు
నోలి రాజులు గొల్వ నుండెడివాఁడు, లోలత మృగములలో నున్న వాఁడు
మేలిచందనమును మెయిఁబూయువాఁడు, ధూళిదూసరితుఁడై తూలియున్నాఁడు
మొనసి దివ్యాంబరంబులు పూనువాఁడు, మునివృత్తి వల్కలంబులు గట్టినాఁడు

రసరసాన్నములను మెసవెడువాఁడు, కసరుఁగాయలఁ బ్రొద్దు కడపుచున్నాఁడు
చూచితే శత్రుఘ్ను శుభమూర్తిరాముఁ, డీచందమున దుఃఖ మీదుచున్నాఁడు
కైకేయిపాపంపుఁగడుపునఁ బుట్టి, యీకష్టదుర్దశ నేఁ జూడఁగలిగె
ననుచుఁ దమ్ముఁడుఁ దాను నారామవిభునిఁ,గని మ్రొక్కుటయు వారిఁ గౌఁగిటఁ జేర్చి
కన్నుల హర్షాశ్రుకణములు దొరుగ, వెన్నులు నివిరి భావించి దీవించె
అహిమాంశుకులునకు నాసుమంతుండు, గుహుఁడు మ్రొక్కిరి భక్తి కొనసాగనపుడు
ధరణిజకును సుమిత్రాతనూజునకు, భరతశత్రుఘ్నులు ప్రణమిల్లి కొలువఁ
గుశపీరముల నిల్వఁగోరి రాఘవుఁడు, దశరథునేమంబు తల్లులశుభము
పలుమాఱు నడుగుచు భరత నీవేల, యిలయేల కింతద వ్వేగుచెంచితివి
భూతలాధీశుపంపున రాజ వగుచు, నీతితోఁ జేయుదే నీవు రాజ్యంబు
దశరథేశునకు సత్యప్రకాశునకు, విశదపుణ్యునకుఁ గావింతువే పూజ
తల్లులనెల్ల నాదర ముల్లసిల్ల, నుల్లంబు చల్లఁగా నూఱడింపుదువె
కోవిదు మత్కులగురు తపోనిధిని, నావశిష్ఠు గరిష్ఠు నర్చించి నీవు
అగ్నిహోత్రముల సంధ్యాకాలనియతి, భగ్నంబుగాకుండఁ బాలింతె నీవు
సుజనులౌ మంత్రులచొప్పెల్లఁ దెలిసి, విజయంబు నామంత్రవిధి యెఱుంగుదువె
యపరరాత్రుల లేచి యర్థచింతనము, నిపుణతఁ జేయుదె నీవు నిత్యంబు
నరసి యుత్తమమధ్యమాధమజనుల, వెరపుతోఁ బనిగొందువే తగినట్లు
తనవారియెడనైన దగవునఁ దండ, మనురక్తిఁ జేయుదె యపరాధ మెఱిఁగి
మతిమంతు సకలసమ్మతు స్వామిహితుని, వితతవిక్రము సైన్యవిభుఁ జేసినావె
కొలిచినవారికిఁ గోరి జీతములు, నిలువఁ గాకుండ నిచ్చలు నొసంగుదువె
చారులవలన రాష్ట్రినులవర్తనము, వైరుల తెఱఁగు సర్వము నెఱుంగుదువె
జాలిఁ దూలెడి పేదసాదలమొరలు, వాలాయముగ వింటువా గర్వముడిగి
యర్మిలి వర్ణాశ్రమాచారవిహిత,ధర్మంబు లరయుదె తడఁబడకుండఁ
జోరుల జారుల సుడియంగనీక, వారల దండింతె వదలక పట్టి
చతురంగబలములసన్నాహపటిమ, నతియుక్తిఁ జూతువె యప్పటప్పటికి
ధనధాన్యవస్తుసద్ఘటసమేతముగ, మునుపుఁగాఁ గడిదుర్గముల నుంచినావె
యన్యాయములునేసి యర్థముల్ గొనక, మాన్యతఁ బ్రోతువె మఱి కాపుజనుల
నర్ధలోభమున విప్రాగ్రహారముల, నర్ధమెత్తవు గదా యఱవీసమైన
నెపుడు గో బ్రాహ్మణహితము గోరుచును, నిపుణుండవై ధర్మనిష్ఠ నుండుదువె
క్షత్రియంబును షడ్గుణంబులును, క్షితపంచాంగముల్ చతురుపాయములు
పదునాల్గు రాజపాపంబులు దెలిసి, సదయుఁడై మనుధర్మశాస్త్రసంగతిని
దేవతాపితృమహీదేవతాపూజ, గావించి స్వర్గంబుఁ గాంచు భూవిభుఁడు
నీవును నారీతి నీతిరాజ్యంబు, గావింతువే యంచుఁ గాకుత్స్థుఁ డడుగఁ
గరములు మొగిచి గద్గదకంఠుఁ డగుచు, భరతుండు రామభూపతి కిట్టులనియె
నీధర్మసరణి నాకేదియుఁ దెలియ, దోధర్మనిపుణ యింకొకవార్త వినుము

నృపకులాధీశ్వర నిన్నుఁ గానలకుఁ, గృపమాలి పిలిచి కైకేయి పొమ్మనినఁ
దడయక మీరిటు తాపసవృత్తి, నడవికి విచ్చేయ నియమించిగాఁగ

దశరథనిమృతి రామలక్ష్మణు లెఱుంగుట.

నలతలఁ దూలి యేడవనాఁడు మిమ్ముఁ, దలఁచుచు మృతుఁడయ్యె దశరథేశ్వరుఁడు
ఏనును పితృమేధమెల్లను జేసి, కానల మీరుండఁ గానవచ్చితిని
అనుపల్కు నిశ్చితమై వచ్చి రామ, జనపతి మూర్ఛిల్లి జగతిపై వ్రాలె
మేదినీసుతయు సౌమిత్రియుఁ దూలి, మేదిని వ్రాలిరి మృతులైనపగిది
నొలసినధృతి రాముఁ డొక్కింత దెలిసి, పలుమాఱు విలపింప భరతుఁ డిట్లనియెఁ
గృతమతివయ్యుఁ బ్రాకృతునిచందమున, నతిశోకమును బొంద నగునయ్య నీకు
దేవ లక్ష్మణుఁడు వై దేహియు మీరు, వేవేగ దశరథోర్వీనాథమణికిఁ
బరలోకవిధులెల్ల భక్తితోఁ జేయుఁ, డరయంగ నది యుక్తమనిన రాఘవుఁడు
మందాకినికి వచ్చి మది నిష్ఠ వెలయ, నందుఁ గృతస్నానుఁడై తండ్రికపుడు
మొనసి తిలోదకములు వోసి వగలు, పెనఁగొన మఱి గారపిండిచేఁ బుణ్య
ధనుఁ డర్ధిఁ బిండప్రదానమొల్చేసి, ఘనతరశోకసంకలితుఁడై మగుడి
సన్నుతగతిఁ బర్ణశాల కేతెంచి, యున్నచో రఘురాముఁ డున్న సన్నిధికిఁ
బౌరవర్గముతోడ బంధులతోడఁ, జారువర్తనులైన సచివులతోడ
ఘనుఁడు వసిష్ఠుండు కౌసల్య మొదలు, జననులఁ దోడ్కొని చనుచెంచుటయును
నూనినశోకాగ్ని లొలుక రాఘవుఁడు, తాను సీతయు సుమిత్రాతనూజుండు
వారియంఘ్రులమీఁద వ్రాలి శోకింప, వారును శోకింప వారించె నంత
నావసిష్ఠమునీంద్రుఁ డమలవాక్యముల, నావేళఁ గౌసల్య యవనినందనను
వనవాసకలితవివర్ణాంగిఁ జూచి, తనమది విధిఁ దూఱి తద్దయుఁ బొగుల
గిరిమీఁద వర్తించుకిన్నరయఙ్న, గరుడోరగామరకాంతలు వచ్చి
రామునిసతి దశరథరాజుకోడ, లీముగ్ధ జనకమహీపాలుపుత్రి
వివిధసంకటముల వేఁగుచున్నదియు, భువిఁ బోద్యములుగావె పొలఁతి యీవిధికి
నని సీతఁ బేర్కొన నారామచంద్రుఁ, డనఘుఁడై నవసిష్ఠునడుగుల కెఱఁగి
జననులఁ జుట్టాల సచివుల హితుల, మునులను గుశపీఠములనుండఁ బనిచి
తనతమ్ముఁడును దాను దర్భాసనముల, జనలోచనోత్పలచంద్రుఁ డైయుండె
నావేళ భరతునియాకృతిఁ జూచి, యోవత్స జడలును నురువల్కలములు
నీవేల తాల్చెదు నృపునాజ్ఞఁ బూని, వేవేగ జనమహీవిభుఁడవై యుండు
మని పల్కుటయు రామునాననాంబుజముఁ, గనుఁగొని భరతుండు కరములు మొగిచి
దేవరాఘవ నైక ధృతిదూలి మిమ్ము, భావింపనేరక పాపంబుచేసి
యడవులనుండు పొమ్మన్నమాటలకుఁ, దడయక జనుదేరఁ దగునయ్య మీకు
మిముఁబాసి దశరథమేదినీపతియు, నమరలోకంబున కరిగె నీఘోర
పాపంబు మాతల్లి పచరించె నరక, కూపకోటుల నింకఁ గూలకయున్నె
యేను మీదగురాజ్య మిమ్ములఁ బూనఁ, గానేర నాచేతఁగాదు భూనాథ

నీవయోధ్యకు నింక నేఁడె విచ్చేసి, పావనమతితోడఁ బట్టంబుఁ బూను
వల్లభు నెడఁబాసి వగలఁ బెల్లెడలు, తల్లుల నూరార్చి తక్కినహితుల
సచివులఁ జుట్టాల సకలపౌరులను, సుచరిత్ర కృపతోడఁ జూచి పాలింపు
నన్ను నీబంటు మన్ననజేసి నాదు, విన్నపం బాలింపవే దయామూర్తి
యని పాదముల వ్రాలి యటులేవకున్న, తనదుతమ్మునినెత్తి తమిఁ గౌఁగిలించి
భరత నీవిదియేమి బాలుండవైతి, కరుణఁ బల్కెదు ధర్మగతిఁ దప్పనాడి
యూరకైక నేల పోనాడెదు తండ్రి, పోకకు నీవేలఁ బొగిలె దీవేళ
ఢాకతో నదిని గాష్ఠంబు కాష్ఠంబు, జోకమైఁ బాసినచొప్పుదీపింపఁ
బుత్రమిత్రకళత్రములు వాయుడాయ, మైత్రి ఋణానుసంబంధరూపములు
నవనిపైఁ బుట్టినయప్పుడె చావు, ధ్రువము జీవున కని రూపింప నరుఁడు
తనకులోచితమైన ధర్మమార్గమున, మనినవాఁ డిహపరమాన్యుఁడై యుండుఁ
గావున మనతండ్రి కమనీయసత్య, భావుఁడై నీతితోఁ బ్రజలఁ బాలించి
ఘనయాగదానసత్కారముల్ సెక్కు,లొనరించి రాజ్యసౌఖ్యోన్నతి మించి
మనవంటితనయుల మనమారఁ గాంచి, జనులెల్లఁ గొనియాడ స్వర్గస్థుఁడయ్య
నతనికై వగచుట యనుచితం బింక, నతనివాక్యము మనమటుచేయఁదగును
పితృవాక్యకరణంబు ప్రియధర్మమందు,సుతునకు నటుసేయసుతుఁడు విశ్రుతుఁడు
వనములఁ బదునాల్గువర్షముల్ నన్నుఁ, ఘనరాజ్యభోగమున్ గైకొని నిన్నుఁ
నుండఁ గట్టడచేసె నుర్వీశుఁ డట్ల, యుండుట మిందుకు నొండాడవలదు
అని తెల్పుచో నంత నర్కుండు గ్రుంకె, ననుపమప్రీతిమై నారాత్రి దీర్చి
మఱునాఁడు సంధ్యాసమాధు లొనర్చి, మఱి వసిష్ఠాదులు మంత్రివర్గములు
విశదంబుగాఁ బరివేష్టించి కొలువఁ, గుశపీఠమున రఘుకుంజరుఁ డుండె
నాసభామధ్యంబునందుండి భరతుఁ, డాసమయంబున హస్తముల్మొగిచి
దేవ మీయానతి తెఱఁగున నీతి, భావించి పితృవాక్యపద్ధతిఁ బుడమిఁ
గైకొంటినాభూమి కడపట యేను, మీకిత్తు నందుకేమియు ననవలదు
సర్వసర్వంసహాచక్రభారంబు, పర్వి తాల్పఁగ ఫణిపతి యోపుఁగాక
యసలడింపక జలవ్యాళ మెట్లోపు, వసుధేశ యేనట్టివాఁడ బాలుఁడను
ఈధారణీభారమేడ నేనేడ, సాధురక్షణమేడ చర్చించి చూడ
బాలార్కుచేనొప్పు ప్రథమాద్రియందుఁ, బోలింప మిణు గురుఁబురుగున్న యట్లు
శ్రీనిధి నీవుండు సింహాసనమున, నేనుండఁ గనుపట్టు నీభూమిప్రజకుఁ
గావున మానిలక్షణములు మాని, నీవయోధ్యకు వచ్చి నీతివహించి
యెల్లవారలకోర్కు లీడేర రాజ్య, మెల్లఁ బాలింపు మింకేమియు ననక
నొనరు నీవిటుచేయనొల్లవై తేని, వినుమేను నీయొద్ద విడుతుఁ బ్రాణములు
కాకున్న సౌమిత్రిగతి నిన్నుఁ గొలిచి, కాకుత్స్థతిలక యిక్కడ నుండువాఁడ
నని దర్భశయనుఁడై యవనిపైనున్న, యనుజన్మునెత్తి యిట్లనియె రాఘవుఁడు
ఇదియేమి భరత నీవిట్లాడఁ దగునె, మదిఁ దలపోయవో మనతండ్రియాజ్ఞ

దశరథేశునకు మీతల్లిని మున్ను, విశదంబుగా నిచ్చువేళ మీతాత
నాహూతునకుఁ గల్గునందను నఖిల, భూకాంతుగా నీవు పూన్పుమీ యనుచు
నమ్మికవడసి వెన్కనుబెండ్లిచేసె, నమ్మాటపట్టున నమరవై తేయ
యుద్ధంబులో విభుం డొసఁగినవరము, బుద్ధిఁదప్పక కైక భూమీశు నడిగె
ధారణి నీకుఁ గాంతారంబు నాకుఁ, గోరిన దశరథక్షోణిపాలకుఁడు
సత్యంబుదప్ప కీజాడగావించె, నిత్యకీర్తులు గాంచి నెగడె నిందు
మనమున మనుజేంద్రుమాట పాటించి, ఘనకీర్తిసుకృతముల్ గైకొంద మెలమి
నరుగఁడే గయశొక్కఁ డైనకన్యకను, బరఁగ దానముచేసి వఱలఁడే యొకఁడు
విడువఁడే యొకఁడైన వృషభ మటుంచుఁ, గొడుకులఁ గాంచుట కోరి పితాళ్లు
ధాత్రిఁ బున్నరకసంత్రాతయౌకతనఁ, బుత్త్రుఁడై యొప్పు నీపుణ్యంబు లెఱిఁగి
యిరవొందఁ దండ్రిప లిక్కటునేయకున్న, నరయ దండ్రులమాట లవియెట్లుసాగు
ధర 'యథా రాజా తథా ప్రజా' యనెడు, నరుదారసామెత నరుఁడు దానరుగు
వరబుద్ధి గైకొన్న వ్రతము నిండించి, యరుదెంచె దేను నీవాగ్రహం బుడుగు
నామాటలాలింపు నాపంపుమీఁద, భూమికిఁ బతి గమ్ము పురి కింకఁ బొమ్ము
అనిన రావణుఁ డింక నాజిలోఁ గూలు, ననినిశ్చయముఁ జేసి రందున్నమునులు
సురలు దిగ్వరులు భాసురధర్మనిరత, భరత రామునిమాట పాటింపు మనిరి

జాబాలి యనుమని శ్రీరామునకు నీతిఁదెల్పుట.

యప్పుడు జాబాలి యనుమానినాముఁ, దప్పకఁ గనుఁగొని తగవేసి పలికె
రామ యిదేమి నిరర్థకబుద్ధి, నేమించి మునిపోలె నృపవేష ముడిగి
రాజోపభోగమా రాజ్యంబు విడిచి, యిఁజాడ నుండుట కేమికారణము
యెక్కడితలిదండ్రు లెక్కడిసత్య, మెక్కడిసుతధర్మ మిదియెల్ల కల్ల
తలిదండ్రు లొండొరుల్ తమసౌఖ్యమునకుఁ, గలయుచో శుక్లర క్తము లైక్య మొంది
యోజఁ బిండాకృతి నుదయించె నరుఁడు, బీజమాత్రము తండ్రి వెక్కు లై యింక
నిమురుక నారిపోయినదీపమునకుఁ, జమురువోసినయట్లు చచ్చినయట్టి
వారికిఁ బరలోకవైదికకర్మ, మూరక జనులు సేయుటయు వ్యర్థంబు
గావున నామాట గైకొని రామ, నీవయోధ్యకువచ్చి నృపుఁడవైయుండు
మని యిట్లు జాబాలి యాడువాక్యములు, విని కోపమున రఘువీరుఁ డిట్లనియె
నిట్టి నాస్తికబుద్ధి యెవ్వరికైనఁ, బట్టి బోధింపు జాబాలిమునీంద్ర
మాకు మాపెద్ద లేమర్యాద నడచి, రాకైవడి మెలంగ నదియె సమ్మతము
సత్యమాలంబులు సకలధర్మములు, సత్యంబుకంటె నెంచఁగ ధర్మ మెద్ది
యట్టిసత్యముదప్ప కనఘు మాతండ్రి, పట్టినధృతి నన్నుఁ బనిచెఁ గానలకుఁ
గాన నాతనియాజ్ఞ గడచినఁ బుణ్య,హీనుండు నాకన్న నితరుండుగలఁడె
సత్యంబు ధర్మంబు శమమును దమము, నిత్యభూతదయయు నీతివిక్రమము
ప్రియవాక్యమును దేవఋషిత్పప్రపూజనము,రయమొప్ప స్వర్గమార్గము లండ్రుబుధులు
ఇవియెల్లఁ గల్లగా నీవు బోధించి, తవునవు నీవెట్టి యగ్రజన్ముఁడవు

నిన్ననఁ బనియేమి నిన్ను నా స్తికుని, మన్నన నరసిన మాతండ్రి నసుట
యని రామవిభుఁ డాడునట్టివాక్యములు, వినిఁ బ్రీతి జాబాలి వెండియు ననియె
నన్ను నా స్తికునిగా నరనాథచంద్ర, యెన్ని తయోధ్య కెళ్లని విచ్చేసి
భూమియేలుదు వనుబుద్ధి నిట్లంటి, రామ యోర్వుమటంచుఁ బ్రార్థనచేసె
నంత వసిష్ఠసంయమి సూర్యవంశ, మంతయు నిట్లొకుఁ డాదిగా నెన్ని
యనఘు మీకులమున నగ్రజులుండ, ననుజుండు రాజౌట నరసిన లేఁడు
కావునఁ బెద్దలక్రమమున నీవు, భూవలయంబెల్లఁ బూనుట లెస్స
యెంతైనఁ బితృవాక్యమే దాఁట ననుచు, నింతగా నిశ్చయం బిట్టిదయేని
యాచట నినుఁ గొల్చినట్ల నీదైన, పాదుకాయుగళంబు భరతుండు గొలిచి
నెమ్మదినుండెడు నీపాదుకంబు, లిమ్మన్నఁ దల్లులు హితులు నాశ్రితులు
పౌరులు మంత్రులు బాంధవు లప్పు, డోరామ యిటుసేయు టుచితమటంచుఁ
బలుకంగ వేవేగ భరతుండు హేమ, విలసితపాదుకాద్వితయంబు రాము
ముందర నిడిన సంఘుల్లారుణార,విందపల్లవగర్భవిభవభేదములు
యతివధూతిలకశాపాపనోదములు, శ్రుతిశిరోభవనవిశ్రుతవినోదములు
తనదుపాదుకలు సంతతసనకాది,మునివివాదములు రాములు మోపి యొసఁగఁ
జేకొని యవిరెండు శిరమునఁ దాల్చి, కైకేయికొడుకు రాఘవున కిట్లనియె
నీవేషమున నేను నృపవేష ముడిగి, తావకపాదుకాద్వంద్వంబునందుఁ
బదిలంబుగా రాజ్యభారంబు మోపి, పదునాల్గువర్షముల్ పాలించువాఁడ
నామీఁద మీరయోధ్యకు రాకయున్న, స్వామిపాదములాన వహ్నిఁ యేఁజొత్తు
ననిపల్కి యన్నకు నతిభక్తి మ్రొక్కి, ననుజుని దీవించి యక్కునఁ జేర్చి
తల్లుల నూరార్చి ధన్యులౌ మానిని, వల్లభులను మంత్రివరుల బాంధవుల
నెల్లవారలఁ బ్రియం బెసఁగ వీడ్కొలుప, నుల్లంబులో శోక ముప్పొంగుచుండ
భరతుఁ డప్పుడు రాముపాదుకంబులకు, సరి ప్రదక్షిణనమస్కారముల్ చేసి
పట్టంపుటేనుంగుపై నొప్పఁ దెచ్చి, పెట్టె లోకములెల్లఁ బ్రీతిఁ గీర్తింప
ఛత్రచామరములు సరిదాల్చి పొలిచి, శత్రుఘ్నుఁడును దాను సద్భక్తిఁ గొలిచి
చెలఁగి నల్దిక్కుల సేనలు గొలువఁ, గులపవిత్రుఁడు చిత్రకూటంబు డిగ్గి
యిబ్భంగి భరతేశుఁ డింపార నరిగి, యబ్భరద్వాజునియడుగుల కెఱఁగి
యతనితో నట్టివృత్తాంతంబు దెలిపి, యతఁ డంతఁ బనుప సైన్యంబులు దాను
నట పోయి గంగామహానది దాఁటి, యట శృంగిబేరంబునందు నాగుహుని
ఘటయశోధనుని సంభావించి నిలిపి, యటపోయి మఱియయోధ్యాపురిఁ జొచ్చి
తడయక నగరిలోఁ దల్లుల నునిచి, కడుమూలబలముల గాపుగాఁ బెట్టి
మణిలేనిపెట్టియమాడ్కి నాకాశ, మణిలేనిపగలింటిమాడ్కిఁ జూడ్కి కిని
చతురపుణ్యుఁడు రామచంద్రుఁడులేని, యతిశూన్య మగునయోధ్యాపురిఁ జూచి
యాయతశుభశీలుఁ డందుండ రోసి, పోయి నందిగ్రామపురిని వసించి
పనివడి రఘురాముపాదుకాయుగళ,మున రాజ్యభార మిమ్ముల నావహించి

శ్రీరామునకుఁబోలె సేవచేయుచును, నారచీరలు జడల్ నవయుచుఁ దాల్చి
యారాఘవునిపునరాగమనంబుఁ, గోరుచు నతనిసద్గుణము లెన్నుచును
సరససజ్జనమంత్రిసమ్మతితోడ, భరతుండు మహియెల్లఁ బాలించుచుండె
యిది యయోధ్యాకాండ మెల్లలోకముల, విదితమై బుధలోకవినుతమాఁగాక
అని యాంధ్రభాష భాషాధిశనిభుఁడు, వినుతకావ్యాగమవిమలమానసుఁడు
పాలితాచారుఁ డపారధీశరధి, భూలోకనిధి గోనబుద్ధభూవిభుఁడు
తమతండ్రి విట్టలధరణీశుపేరఁ, గమనీయగుణధైర్యకనకాద్రిపేరఁ
బని బూని యరిగండభైరవుపేర, ఘనుపేర మీసగండనిపేర
నాచంద్రతారార్కమై యొప్పుమిగిలి, భూచక్రమున నతిపూజ్యమై వెలయు
నసమానలలితశబ్దార్థసంగతుల, రసికమై చెలువొందు రామాయణంబు
పరఁగ నలంకారభావనల్నిండఁ, గరమర్థి నయోధ్యకాండంబుఁ జెప్పె
నారూఢి నాశ్లేయమై యాదికావ్య, మై రసికానందమై యలనాఁడు
నివ్వసుమతి నొప్పు నీపుణ్యచరిత, మెవ్వరు చదివిన నెవ్వరు వినిన
సామాదిబహుదేవచయథామరామ, నామచింతామణిసవ్యభోగములు
పరహితాచారముల్ ప్రభువిచారములు, పరిపూర్ణశక్తులు ప్రకటరాజ్యములు
నిర్మలకీర్తులు నిత్యసౌఖ్యములు, ధర్మైకనిష్ఠలు దానాభిరతులు
ఆయురారోగ్యంబు లైశ్వర్యములును, బాయనిశుభమును పాపక్షయంబు
వరపుత్రలబ్ధియు వైరినాశనము, సరినొప్పు ధనధాన్యచయసమృద్ధియును
యేవిఘ్నములు లేక నింట్లలో నధిక, లావణ్యవతు లైనలలనలపొందు
కొడుకులతో నెప్పు గూడియుండుటయు, నెడగాక యాపదలెల్లఁ బాయుటయు
సమ్మదంబున బంధుజనులఁ గూడుటయు, నిమ్ముల కామ్యంబు లెపుడుఁ గూడుటయు
సతతంబు దేవతాసంతర్పణంబు, పితృగణతృప్తియుఁ బెంపారుచుండు
నిది మోక్షసాధనం బిది పాపహరము, యిది దివ్యమిది భవ్య మిది శ్రీకరంబు
వ్రాసినవారికి వరశుభోన్నతులు, వాసవభోగాదివాసులఁ జేయు
నెందాఁక కులగిరు లెందాఁక తార, లెందాఁక రవిచంద్రు లెందాఁక దిశలు
ఎందాఁక వేదంబు లెందాఁక ధరణి, యెందాఁక భువనంబు లేపుదీపించు
నందాఁక యీకథ యక్షతానంద, సందోహదోహళాచారమై పరఁగు

అయోధ్యాకాండము సంపూర్ణము.

శ్రీ ర స్తు

శ్రీ రంగనాథరామాయణము

ఆ ర ణ్య కా ం డ ము.

శ్రీచిత్రకూటమా చిత్రకూటమున, వాచంయమశ్రేణి వర్ణింపనుండి
యంత రాముఁడు భరతాగమనంబు, చింతించి యిచట వసింపరాదనుచు
నిచ్చట నేనున్న నెల్లపౌరులును, ముచ్చటపడి దినంబును వత్తురనియు
దంతిరథాశ్వపదాతివర్గముల, నెఱతయుగాసిలు నీవనం బనియు
ఖరదూషణాదిరాక్షసకోటిబాధ, పరిహరింపుమటంచుఁ బరమసంయములు
చెంతలఁ జేరి సూచించినారనియుఁ, జింతించి మఱునాఁడు చిత్రకూటాద్రి
మునులవీడ్కొని యత్రిమునియాశ్రమమున,కనురాగమున నేగ నమ్మహామాని
తనశిష్యులును దాను దగ నెదురేగి, కొనిపోయి పలుతెఱంగులఁ బూజచేసె
నమ్మునిపత్ని యానసూయ ప్రీతి, నమ్మహీతనయకు నాతిథ్య మొసఁగి
లెఱుఁగొప్పఁ గొన్నిపతివ్రతాగుణము, లెఱిఁగించి రఘురాము నెడఁబాయలేక
తనబంధుజనుల నందఱ నెడఁబాసి, వనముల కాసీతవచ్చుట పొగడి
పిమ్మట ననసూయ ప్రీతితోఁ దాను, నమ్మహీతనయకు నంగరాగములు
వాఁడనిపువ్వులు వరుసఁ దొడ్తొడఁ, గూడమాయనిమణుంగులు తా నొసంగి
రమణి నిన్ను స్వయంవరమున రాఘవుఁడు, క్రమమొప్పఁ గైకొన్నకథఁ జెప్ప
జిలిబిలిసిగ్గును జిఱునవ్వుఁ దొలుకఁ, బలికె జానకి తనపతిని వీక్షించి [మనిన
వినవమ్మ మిథిలకు విభుఁడైనయట్టిఁ, జనకుఁ డొక్కఁడె యాగశాల దున్నింపఁ
గలిగితి నే నది కారణంబునను, కలితసీతానామకమున నొప్పితిని
అనపత్యుఁ డౌట నయ్యవనిపాలకుఁడు, దయమీఱ నన్ను మోదంబునఁ బెనిచె
నంత యానవతి యగునన్నఁ జూచి, చింతించి తనయింటిశివునిచాపంబు
నెక్కుఁబెట్టినవాని కెలమిఁ బెంపెక్క, నిక్కన్యకామణి నిత్తు నేననుచు
వరబుద్ధిమై స్వయంవరము చాటింప, ధరణినాయకులెల్లఁ దారటవచ్చి
శైలజారమణునిచాప మెత్తంగఁ,జాలక మోపెట్టఁజాలక చనిరి
అంత రాఘవుఁడు విశ్వామిత్రుఁ గొలిచి, కొంతకాలంబునకును నటవచ్చి
కరి యిక్షుకాండంబు ఖండించునట్లు, హరువిల్లు విఱిచి చయ్యన వరియించె
నని తనవెండ్లివార్తను నంత దాను, వినిపింప ననసూయ విని ముదమంది
నప్పుడు రవి పశ్చిమాంబుధి మునుఁగఁ, దప్పక సాంధ్యకృత్యములెల్లఁ దీర్చి

శ్రీరాముఁ డత్రి పూజింప సద్దోష్ణి, నారాత్రి గడపి సంధ్యాక్రియల్ దీర్చి

శ్రీరాముఁడు దండకారణ్యమునకుఁ బోవ్రు

ముద మొప్ప నయ్యత్రిమునిని వీడుకొలుపఁ, గదలి యమ్మునినాఁడు కమలాప్తకులుఁడు
సరళతాలతమాలసాలహింతాల, కురువకాగరువటకుటజగణ్యంబు
చండాంశునిభమౌనిజనశరణ్యంబు, గండకహార్యఋగవయవెదండ
గండభేరుండాపిఖగమృగోదగ్ర,దండకారణ్యంబు చరియింగఁ జొచ్చి
వేదనాదములచే విస్తారమహిమ,వేదులచేతఁ బవిత్రంబులైన
పర్ణశాలలచేతఁ బవనాంబుజీర్ణ,పర్ణాశు లగుచుఁ దపంబుగావించు
మునులచే మిగుల సమున్నతి నొప్పు, జనచుతతాపసాశ్రమములు చెక్కు-
కనుఁగొంచు వారలు గావించుపూజ, లనుభక్తిఁ గైకొంచు ననుజుండు దాను
నరుగుచో నాదండకారణ్యవీథి, నురుపర్వతాకారుఁ డుగ్రలోచనుఁడు
ఘనవక్త్రనాసుండు కఠినవిగ్రహుఁడు, ఘనుఁడు విరాధుఁడర్ద గడిచి రాక్షసుఁడు
అట్టహాసముచేసి యాకసం బొదువ, చెట్టుగా వనమెల్ల భేదిల్ల వచ్చి
గరుడుండు బాలనాగము బల్మి నొడిసి, యిరవొప్ప నద్దివి కెగయుచందమునఁ
బటుశూలముఖచంచుబాహుఁడై సీత, కుటిలకుంతల నెత్తుకొని మింటికెగసి
జనకజదెసఁ జూచి చాల చింతించు, ఘనుల శ్రీరామలక్ష్మణుల వీక్షించి
యోరి వీరులవలె నోడక వచ్చి, యీరసంబునఁ జొచ్చి యేనున్నయడవి
శరచాపహస్తులై చరియింప నెంత, బిరుదులై భుజశక్తిఁ బేరొక్కన్న నెంత
తల్లి శతహ్రద తండ్రి జయుండు, తొల్లి యాయుధముల ద్రుంగక యుండ
బ్రహ్మచే వరములు వడసినవాఁడ, బ్రాహ్మణాశస్తుఁడ విరాధుఁ డన్నవాఁడ
నేనల్లె చూచిన నింద్రాదిసురల, నైనను మ్రింగుదు నట మర్త్య లెంత
యీయింతి నొప్పించి యీకాన విడిచి, పోయి మీమీప్రాణములు గాచికొనుఁడు
కాదేని నాచేతిఘనశూలహతికి, నాదట నతీమి రండని పేర్చి పలుక
సౌమిత్రి యప్పుడు జనకజభయము, నామహారాక్షసునదటును జూచి
యోరి రామునిదేవి నురుపుణ్యసాధ్వి, ధారణినందనఁ దగదోరి నీకుఁ
గొనిపోవ నెక్కడఁ గొనిపోయె దింక, నినుఁ బట్టి వధియింతు నేఁడు నాకడిమి
నని బాణసంధాన మలుకమైఁ జేసి, ఘనబాణతతుల వక్షము గాఁడ నేయ
నరుదుగా వాఁ డట్టహాసంబుచేసి, కెరలుచు శూల మంకించి వ్రేయుటయు
ఘనఘనాఘనముసంగడిఁ బాసి పిడుగు, చనుదెంచుకరణి రా జానకీవిభుఁడు
నది రెండుశరముల నలవుమైఁ ద్రుంప, పదరి వాఁడట సీతఁ బడవైచి బడమి
నారాక్షసునిఁ బాసి యాకాశవీథి, ధారణీసుత సీత తల్లడిల్లుచును
జలదంబు నెడఁబాసి చనుదెంచు మెఱుము, చెలువునఁ జనుదేరఁ జెచ్చెఱఁ జూచి
గరుడాస్త్రమున డించెఁ గడఁగి రాఘవుఁడు, వరబాణములు చెక్కు- వాఁడేయుట
నవి లెక్క-సేయక యట్టహాసంబు, భువనభయంకరంబుగ బిట్టొనర్చి [యును
కరముల రామలక్ష్మణుల నిద్ధజినిఁ, గరమర్ధిఁ బట్టి రక్క-సుఁ డుక్కు-మీఱి

మూపున నిడి రయంబునఁ ద్రోవఁబట్టి, చాపుగా నడచుట జనకజ గాంచి
వాపోవ నటఁ గొంతవడి పోయిపోయి, ప్రాపితకోపులై రామలక్ష్మణులు
మెఱుఁగుఁదీఁగెలరీతి మెఱయుఖడ్గంబు,లొరలూడ్చి వానిబాహులు రెండు దునుమ
గిరివ్రజమునఁ గూలుక్రియ దిక్కు లదుర, నురువడి నొరలుచు సుర్విపైఁ గూలి
యసువులు విడువ నయ్యసుర యుండుటయు, నసమానపదముష్టిహతుల నందంద
ముద్దగాఁజేసి సముద్ధతిఁ జంపి, రద్దిరా యని మును లాశ్చర్యపడఁగ
నతఁ డంత గంధర్వుఁడై రాముఁ బొగడి, యతులవిమానంబునందుండి పలికె
నేను గంధర్వుఁడ నేను తుంబురుఁడ, భూనాథ మును రంభఁ బొంది కొల్వునకు
రానిగర్వ మెఱింగి రాక్షసాకృతిగ, నేను గుబేరుచే నిటు శాపమంది
నేఁడు మీభుజశక్తి నీశాపముక్తి, పొడిగాఁ గాంచితిఁ బోయెద నింక
నిరవొప్ప నాదేహ మిటఁ బూడ్చి చనుఁడు, శరభంగమౌనియాశ్రమమున కనుచుఁ
బోయె మ్రొక్కుచువాఁడు పొలుపొంద వాని, కాయంబు ధరఁబూడ్చి కడుభయం
ధరణీతనూభవ దగఁ గౌఁగిలించి, పరమసమ్మదమున భయమెల్ల మాన్పి [బందు
తలకొన్న ప్రేమతోఁ దమ్మునిఁ జూచి, యిలమీఁదఁ గల్గునె యిట్టి దుర్గములు
కావున వేగ మీగహనంబు దాటి, పోవలె మనము భూపుత్రిఁ దోడ్కొనుచు
నని యంత శరభంగుఁ డనుమునిచంద్రుఁ, గను గొనుతలఁపునఁ గాకుత్థ్సకులుఁడు

శ్రీరాముఁడు శరభంగాశ్రమంబుఁ జేరుట.

చనుచోట నుదయార్కసంకాశ మగుచు, నొనర నమ్మునియాశ్రమోపాంతవీథి
హరితహయాకీర్ణమై సితచ్ఛత్ర,పరివృతంబై దేవభరితంబు నగుచు
నకళంకమణిరోచు లందందఁ బర్వ, నొకవిమానము గాంచె నుడువీథినంతఁ
గని విమానములోని కమనీయశీలుఁ, గనుఁగొనుతలఁపునఁ గదియవచ్చుటయు
నది యదృశ్యంబయ్యె నంత రాఘవుఁడు, ముదమంద శరభంగమునిఁగాంచి మ్రొక్కి
మునిచేత దివ్యాస్త్రములు చాలఁ బడసి, యనురాగమునుబొంది యతని కిట్లనియె
నేము నిన్నిటఁజూడ నేతెంచుచోట, నోమునీశ్వరచంద్ర యొకవిమానంబు
చదలెల్ల వెలుఁగ నిచ్చటనుండి పోయె, నది యెందులకు వచ్చె నది యెందుఁ బోయె
నావిమానములోనియతఁ డెవ్వఁడనిన, భూవరునకు మునిపుంగవుఁ డనియె
దేవేంద్రుఁ డాతఁడు దేవేంద్రవంద్య, దేవ నాకడకును దివినుండి ప్రీతి
ననిమిషులును దాను నర్థి దీపింప, నను బ్రహ్మలోకంబునకుఁ బిల్వ వచ్చె
వచ్చిన నోమహీవరచంద్ర నీవు, విచ్చేయు టిచ్ఛ భావించి నేనిపుడు
నెఱసినకడిమిమై నిన్నుఁ బూజించి, మఱిపోవువాఁడనై మది నిశ్చయించి
యంతకు రానని యతనిఁ బొమ్మంటి, చింతించి వజ్రియు శ్రీరాము నిన్నుఁ
గాంతారఖన్ను నిక్కడఁ జూడఁ గలిగె, నింతలో విచ్చేసి తినకులాధీశ
ధరణీశ నీప్రసాదంబునఁ దపము, నరుదార నొకవిఘ్నమైనను లేక
సలిపితి నిష్ఠలు సఫలంబులయ్యె, నెలకొని శ్రీరామ నినుఁ జూడఁగంటి

ననఘ సుతీక్ష్ణసంయమి నింక నీవు, కనుఁగొని యతనిచెంగట నుండుమేను
బనివినియెద నింక బ్రహ్మలోకమున, కని చెప్పి రాముసమక్షంబునందు
ననలముఖంబున నమ్మునీశ్వరుఁడు, తనమేను మంత్రపూతముచేసి వేల్చి
యెడపక యింద్రాదులెల్లను గొలువఁ, గడునొప్పు బ్రహ్మలోకమునకుబోయె
నాయాశ్రమావాసు లైనసంయములు, వాయుభక్షకులును వైఖానసులును
వాలఖిల్యులు మానవంతులు పర్ణ, శాలావిహీనులు స్థండిలశయులు
మననశీలు రుదాత్తమానసు లేకాంతు, లనశనవ్రతులుఁ బంచాగ్నిమధ్యగులు
మొదలైనతాపసుల్ మూఁకలుగట్టి, సదయాత్ముఁ డగురామచంద్రునిఁ జేరి
పితృవాక్యపాలనప్రియుఁడవు సత్య, రతుఁడవు నీవు నిర్మలయశోధామ
రామ నీయంతటిరాజు గల్గియును, నేము రాక్షసబాధ నిట గుందఁ దగునె
వ్రతము రక్షించునృపతికిని గల్గు, నతనిపుణ్యములోన నాలవపాలు
ఈతఱి దైత్యులనెల్ల ఖండించి, మాతపోవ్రతములు మైత్రి నిండించు
సొరిది నీశరణంబుఁ జొచ్చితి మనిన, శరణాగతత్రాణసదయుండుగాన
నాయాశ్రమంబులయందుండుమునుల, కాయతమతిరాముఁ డభయంబులిచ్చి
మాయనుగ్రహమున మేటిరక్కసుల, దాయల ఖండింతు దలఁకకుఁడనుచు
వారి వీడ్కొని ఘోరవననీమ కరిగి, యారూఢమతి సుతీక్ష్ణాశ్రమంబునకు
వచ్చి యామునిచంద్రు వలగొని వేరు, గ్రుచ్చి సద్భక్తిపైకొని మ్రొక్కుటయును
వారల కెదురుగా వచ్చి సుతీక్ష్ణుఁ, డారాము దీవించి యర్ఘ్యం బూజించి
యనఘాత్మ చిత్రకూటాద్రికి నీవు, మునివృత్తి వల్కలంబులు గట్టి వచ్చు
నునికి యాకర్ణించి యుల్లంబులందుఁ, గొనకొని మీరాకఁ గోరుచుండుదుము
నీవు విచ్చేసితి నినుఁ జూడఁగంటి, మేవిధంబుల నింక నేము ధన్యులము
ఆయతభుజసత్త్వ లైనరాక్షసులు, మాయాశ్రమములకు మత్తులై వచ్చి
హోమవేదులఁ గాల్చి యూపముల్ గూల్చి, సోమపానము గ్రోలి సురలఁ బోదోలి
తపములు చెఱచి పాదపములు విఱచి, జపమాలికలు ద్రెంచి శాటికల్ చించి
ఫలములు డుల్చి పుష్పము లెల్ల రాల్చి, కొలఁకులు కలఁచి పెక్కులు గాసిచేసి
పెక్కండ్రమునులఁ జంపిరి దురాత్మకులు, దిక్కులే దీపాటు దీర్ప నేర్తురవ
నేచిన దనుజుల నేము కోపించి, చూచిన నీఱుగాఁ జూడ నోపుదుము
నెలకొని మహిమీఁద నీయట్టిరాజు, గలుగుటఁజేసి యెక్కడ నల్ల మేము
కావున దుష్టరాక్షసుల మర్దించి, నీవు మాతపములు నిష్ఠఁ బాలింపు
మనిన రాముఁడు రాక్షసాధీశవరుల, ననిలోనఁ జంపెద ననియూఱడించి
శరభంగునాశ్రమస్థలమున మునుల, కిరవొప్ప నభయంబు నిచ్చుట తెలిసి
రక్కసులను జంపఁ బ్రతినలు పలికి, యక్కడ సుఖగోష్ఠి నారాత్రి నిలిచె
మఱునాఁడు పెక్కండ్రు మౌనులువచ్చి, మఱియును దమయాశ్రమములకుఁ బిలువ
దిననాథకులుఁడు సుతీక్ష్ణు వీడ్కొనుచు, మునులపుణ్యాశ్రమంబులు చూడఁగోరి
చనుచోట రఘురాము జానకి చూచి, యనఘ రాజ్యముమాని యడవికి వచ్చి

సముచితవృత్తిమై జడలును వల్క-,లములు ధరించి మెలంగుచు నుఱక
యసురులదెస మీకు నలుగ నేమిటికి, పొసగ వీమాటలు బుద్ధిఁ జింతింప
ముసులతో రాక్షసముఖ్యులఁ ద్రుంతు, నని యూఱడించిన నంతనుండియును
గలఁగుచున్నది మది కాకుత్స్థతిలక, వల దీతెఱంగులు వర్జింపవయ్య
ప్రాణులఁ జంపఁ బాపమురాదె తొల్లి, ప్రాణేశ యొకమని బహుతపోనిష్ఠ
నుండుచో భటరూపయుక్తుఁడై వజ్రి, యొండుఖడ్గము మౌనియొద్ద దాఁపుచును
ఇదె పోయివచ్చెద నేనని చనియె, తదనంతరమున నాతఁడు ఖడ్గమంది
యూరకుండక తీవ లాకటసృక్షముల, సారెఁ ద్రుంపుచును హింసారతుం డగుచు
జడమతియై తపశ్చర్యకుఁ బాసి, కడపట నతఁడు దుర్గతిఁ గూలెఁ గాన
తపమేడ మఱి రాజధర్మంబు లేడ, విపులాయుధము లేడ విడువవే దేవ
యనవుడు విని నవ్వి యధిపతి సీతఁ, గనుఁగొని విప్రమార్గంబు నీపలుకు
క్షత్రమార్గముగాదు సాధ్వి నావలని, మైత్రి బలెక్కదవు నామత మెఱింగియును
తరుణి యుత్తమరాజధర్మైక్యపరులు, శరచాపములు దాల్చి చరియించుఁ బెల్ల
శరణాగతులఁ గావఁ జర్చింపఁగాదె, పరికింప వెయ్యేల పరమధర్మములు
నమ్మహామునులతో నాడినప్రతిన, యిమ్మెయిఁ గావింతు నిదియె నిశ్చయము
విడుతుఁ బ్రాణమునైన విడుతు నినైన, విడుతుఁ దమ్మునినైన విడువనే ప్రతిన
ననిన నూరకయుండె నవనిజ యపుడు, విని లక్ష్మణుఁడు చాల విస్మయంబందె
నటమీఁద నొక్కొకయాశ్రమంబునను, బటుధర్మనిధి రామభద్రుండు ప్రీతి
మూఁడేసినెలలు నిమ్ముల నాల్గునెలలు, పొడిగా నిలుచుచుఁ బుణ్యాశ్రమముల
ధీయుక్తిఁ జూచుచు తెరువున యోజ,నాయతం బైనమహాతటాకంబుఁ
గని గీతవాద్యమంగళనినాదములు, దనర నయ్యుదకమధ్యమున మించుటయుఁ
గడుఁ జోద్యపడి తటాకముచేరి దానిఁ, గడుధర్మరతుఁడు తాఁ గని మ్రొక్కి పలికె
నిదియేమి మునినాథ యీతటాకంబు, నుదకంబులో ఘోష ముబ్బుచున్నదియుఁ
గడుఁజిత్ర మనుడు రాఘవుఁ జూచి పలికె, నడరెడువేడుక నాధర్మరతుఁడు
కదలక మును మందకర్ణియ-మౌని, యుదకమధ్యంబున నురునిష్ఠ నిలిచి
యెనసినమహిమ ననేకవర్షములు, తనియక యత్యుగ్రతప మాచరింప
నాతపంబునకు నింద్రాదిదేవతలు, భీతిల్లి మునిపతి పెంపెల్లఁ గలఁగ
నస్తునికడ కేఁగి రప్సరస్త్రీలఁ, నిమ్ములఁ బుత్తేర నేతెంచివార
లతనికి భార్యలై యంబుమధ్యమున, నతఁడు నిర్మించిన హైమసౌధముల
మునినాథుముందఱ ముదమొప్ప నిలిచి, యసుర-క్రి వారిప్పు డాడుచున్నార
లదిగానఁ గొలను పంచాప్సరంబయ్యె, నిది వారిబహువాద్యహృద్యశబ్దములు
అనవుడు విని రాముఁ డతిభక్తితోడ, ఘనపుణ్యుఁ డగుమందకర్ణికి మ్రొక్కి
మఱియు మహాటవిమార్గంబునందు, నెఱసినకడిమిమై నెఱి నేగునపుడు
మునులకు మ్రొక్కుచు మును లున్నపుణ్య, వనులకుఁ జొక్కుచు వనజకల్హార
సరసులఁ దేలుచు సత్కథాలాప, సరసుల నేలుచుఁ జల్లనిగాలి

రాకలఁ బొగడుచు రణితర్షుల్లికల, జోకలఁ జెగడుచు శుకమయూరాది
ఖగములఁ బట్టుచుఁ గరివరాహాది,మృగములఁ గొట్టుచు మేఘాస్త్ర మేసి
తపములు నడుపుచుఁ దముఁ జూచువారి,భవములు నడపుచు పసువంపులతల
పువ్వులు చిదుముచుఁ బొదలు తుమ్మెదల, నవ్వలఁ గదుముచు నభమంటఁ దాఁకు
శైలంబు లెక్కుచు జానకి యలయ, మేలంబు దక్కుచు మృదురీతి గుహల
మెల్లనె దార్పుచు మెలఁతకు నెక్కు, డల్లన నేర్పుచు నచటి చెంచెతల
బీరముల్ మెచ్చుచు భేదింపరాని, యీరముల్ చొచ్చుచు నిరర్శ్మలేని
కోనలఁ గానలఁ గ్రుమ్మరు చట్లు, జానకి తాను లక్ష్మణుఁడ కొన్నేండ్లు
పుణ్యతీర్థంబులు పుణ్యవాహినులు, పుణ్యతపోవనభూములఁ గలయఁ
దిరుగుచుఁ బదియేండ్లు దీఱినపిదప, మరలి సుతీక్ష్ణాశ్రమమునకు మఱియు
వచ్చి యమ్మునియొద్ద నిచ్చుఁ గొన్నాళ్లు, మచ్చికనుండి రామక్షితీశ్వరుఁడు

అగస్త్యులఁ గాంచుట.

నొకనాఁడు ఘనునగస్త్యునిఁ జూడఁగోరి, యకళంకభక్తి సంయమికి నిట్లనియె
నెందు నగస్త్యమునీశ్వరుఁ డుండు, నందు నెందొక్కొ తదాశ్రమభూమి
తెలుపవే యనిన సుతీక్ష్ణుండు గుఱుతు, లలవడఁ దన్మార్గమంతయుఁ దెలిపి
దీవించి యనుప గాదిలితమ్ముతోడ, దేవితో దక్షిణదిక్కుకై నడచి
చనిచని నాల్గుయోజనములు దాఁటి, వనముల ఘనశైలవాహినుల్ దెక్కు
గనుఁగొంచు నరిగి యగస్త్యానుజస్తు, నసహాశ్రమంబున కరిగి సంప్రీతి
నాయతీశ్వరచంద్రునడుగుల కెఱిఁగి, యాయాశ్రమంబున నారాత్రి నిలిచి
మునితోడ సుఖగోష్ఠి మొగిఁ జేయుచుండి, యినకులాధీశ్వరుం డిట్లని పలికె
నియ్యగస్త్యమహామునీశుండు దొల్లి, యియ్యెడ వాతాపి నెబ్బంగిఁ జంపె
ననిన నమ్మునిచంద్రుఁ డారామచంద్రు, గనుఁగొని యాపుణ్యకథ చెప్పదొడఁగె
నురుతాపి వాతాపియును నిల్వలుండు, ధరణిపై నిరువు రుద్దండరాక్షసులు
గలరందు వాతాపిఘనమేషమూర్తి, యిల్వలుండును నొక్కఋషియునై నిలిచి
యిచ్చటఁ బెనుత్రోవ కెదురేగి మిగుల, దచ్చనఁ దమయింటఁ దద్దినం బనుచు
మునులను నియమించి ముదమొప్పఁ దెచ్చి, యెనయంగ మేషంబు నేర్పడఁ జంపి
ప్రీతిఁ గూరలుచేసి పెట్టి భుజింప, వాతాపి రమ్మని వడిఁ జేరఁ జీరఁ
దడయక యపుడు వాతాపి యమ్మునుల, కడుపులు వ్రచ్చి యగ్గలికతో వెడల
నీవిధి మునుల ననేకులఁ జంపి, రావికృతాకారు లడరి యందుండఁ
గొనకొని యొకనాఁడు కుంభసంభవుఁడు, చనుదేరఁ గపటభోజన మొప్పఁ బెట్ట
వాతాపిఁ బిల్వ నిల్వలుఁ జూచి నగుచు, వాతాపి యెందుండి వచ్చు జీర్ణించె
నని యగస్త్యుఁడు పల్క నాయిల్వలుండు, కనలి రక్కసుఁడయి కదియవచ్చుటయుఁ
గలశసంభవుఁడు హుంకారమాత్రమున, బలియు నిల్వలుఁ జూచి భస్మీకరించి
మునులకునెల్లఁ బ్రమోదంబుచేసె, వినుఁ మదియునుగాక వింధ్యం బణంచె
సరిగాఁగ దక్షిణాశాస్థలి నిలిచె, నరుదుగా నంబుధి నాపోశనించెఁ

బెనుఁబొమ్ముగాఁగ శపించె నానహుషు, మునిమాత్రుఁడే పుణ్యమూర్తికుంభజుఁడు
మునివేషమున నున్నముక్కంటిగాక, యన విని రఘురాముఁ డానందమంది
మఱునాఁడు మునిపతి మార్గంబుఁ జూప, తెఱఁగొప్పఁ బూజించి దివింప వెడలి
చని చని యొక్కయోజన ముత్తరించి, పనసదాడిమశమీబదరికాశ్వత్థ
సాలప్రియాళురసాలతమాల,మాలూరఖర్జూరమందారతరుల
తరులఁ గ్రిక్కిరిసిన తావిక్రొవ్విరుల, విరులతేనియలాని వెలయుతుమ్మెదల
మెదల నింపగునట్టి మేటిపూపొదలఁ, బొదలలోఁ బగలేక పొదలుమృగములఁ
గలకంఠకలకుహూకారనాదముల, విలసిల్లు బహుళశ్రవేదనాదములఁ
జెలఁగుచుఁ గిన్నరసిద్ధగానముల, కలిమి దీపించు నగస్త్యనాశ్రమము
గనుఁగవవిందుగాఁ గాంచి యందొక్క, మునిచేతఁ దమరాక మునికెఱిఁగించి
చని చొచ్చి యమ్మునిచరణపద్మముల, కనురాగమున మ్రొక్కి నక్కునఁ జేర్చి
దీవించి వేవేలు తెఱఁగుల భక్తి, భావించి సంతుష్టిపరులఁ గావించి
యోరామ శుభనామ యుత్పలశ్యామ, క్రూరదానవభీమ గుణధామ నీవు
మునులభాగ్యంబున మునివృత్తిమోచి, వనమునఁ దపసివై వర్తింప వచ్చి
యరుదారఁ జిత్రకూటాద్రి కేతెంచి, వరమతి నొక్కసంవత్సరంబుండి
శరభంగమౌనియాశ్రమము కేతెంచి, శరణుచొచ్చిన మునీశ్వరులను గాచి
దనుజులఁ జంపెదఁ దలఁకకుఁడింక, ననిప్రీతి మునులకు నభయంబు లిచ్చి
కరుణించితని విని కాకుత్స్థతిలక, పరమసంతోషసంపన్నుఁడనైతి
ననియర్థిఁ బూజించి యతులదివ్యాస్త్ర, ఘనశస్త్రకోదండకవచాదు లిచ్చె
నిచ్చినఁ గైకొని యినకులాధీశుఁ, డచ్చట సుఖగోష్ఠి నారాత్రి నిలిచె
ఘటసంభవుఁడు భావికార్య మూహించి, పటుతరవాక్కుఁడై పలికె నిట్లనుచు
శ్రీరామ గోదావరీసరిత్పుణ్య,వారిశీతలగంధవాహకుమార
ఘటితనర్తనవనాంగణలతాతటికి, జటికృతపూజధూర్జటికి నాపంచ
వటికిఁ బొమ్మన రఘువంశుఁ డచ్చటికి, ఘటసూతి వీడ్కొని కదలిపోవుచును
నడుత్రోవ నొకపక్షినాథునిఁజెక్క, లుడివోనికులగిరులో యని చాలఁ
గని దైత్యుఁ డనుబుద్ధిఁ గదసి నీవెవ్వఁ, డనుటయు ముదమంది యాపక్షి వలికె
గరుడాగ్రజాతుండు కశ్యపతనయుఁ, డరుణసారథియైన యరుణుండు ఘనుఁడు
మాతండ్రి నుతియు సంపాతి మాయన్న, మితండ్రిసఖుఁడ సుమీ యేను రామ
యితరుండఁగాను మీహితకార్యపరుఁడ, నతులసాహసుఁడ జటాయువన్నాఁడ
నీవనంబును నసురేంద్రసేవితము, గావున వై దేహి గావుఁ డేమఱక
ననవుడు శ్రీరాముఁ డట్లుగా నతని, మనమున మోజించి మైత్రిఁ బూజించి
యట పంచవటికేగి యందున్న మునుల, బటుతపోధనుల సంభావించి మ్రొక్కి
కరమర్థి వారు సత్కారముల్ సేయ, ధరణీతనయఁ జూచి తమ్మునిఁ జూచి
పొలుపొంద నెందును బుణ్యాశ్రమములు, గలయఁ బెక్కులు పొడగందుము కాక
యీగౌతమీగంగ యీసరోవరము, లీగిరు లీతరు లీయాశ్రమములు

ఎందును బొడగంటిమే యిటఁ గ్రింద, నిందుండెదము మనకింపొందు ననుచు
నానందమునుబొంది యందున్న మునుల, యానతిఁ గైకొని యా ప్రొద్దె కదలి
తాను లక్ష్మణుఁడును దగుపర్ణ శాల, యూనిన క్రమముతో నొప్పారఁ గట్టి
తమ్ముఁడు దానును దానిఁ బూజించి, యమ్మహీసుతఁ గూడి యనురాగ మెసఁగ
నాపర్ణ శాలలో నందాఱునెలలు, దీపించుపేర్మి వ ర్తించుచునుండె
అంత నీహారధరా క్రాంతదశ ది, శాంతమై హేమంత మవనిఁ బర్వుటయు
వేకువ నొకనాఁడు వెలఁదియుఁ దాను, తేకువ గౌతమిఁ దీర్థమాడంగఁ
జనుచుఁ రాముఁడు మైత్రి సౌమిత్రిఁ జూచి, కను గొంటివె శీతకాలంబుమహిమ
దిశ లెల్లఁ జలికి భీతిలి వెలిపట్లు, ముసుకుఁ బెట్టినయట్లు ముంచె హిమంబు
హేమంత మనుమేఘ మెల్లెడ నిండి, వామిగా వడగండ్లు వర్షించె ననఁగఁ
గురిసినపెనుమంచు కుంభినియెల్ల, నెరసి యొప్పారె ఘనీభవించుచును
ఉర్విపై నామంచు నొక్కొక్కచోట, దూర్వాంకురంబుల తుదలఁ జూచితివె
పచ్చమిన్నసలాక పొజ్జపై వేడ్క, గ్రుచ్చినముత్యాలక్రోవలై యొప్పెఁ
గామునస్మోహనకాండంబు లనఁగ, హైమయుగ్వాయువు లలితమై సోక
వెఱపున వణఁకెడు విరహిణు లనఁగఁ, దెఱఁగొప్పఁ గదలు పూదీఁగె వీక్షింపు
మంచున జారుతామరలకన్నీరు, ముంచినవిరహులమోములఁ గేరు
పొదిగొన్న యకరువుల్ పొట్టుగా మీఁదఁ, గదలు తేటులపొగల్‌గా చలికొన్న
కొలను దేవతలకుఁ గుంపట్లఁబోలె, విలసిల్లు కెందమ్మివిరులఁ జూచితివె
యడవియేనుఁగులు నీరాసనీనదికిఁ, దుడిఁదుడి వచ్చి తత్తోయంబు దొడరి
అడరి గిట్టునుచు దుండములు వేవేగ, ముడిచి పాఱెడిని తమ్ముఁడ విలోకింపు
ఇట్టికాలంబున నేనున్నయట్ల, పట్టంబు నామీఁది భ క్తిమై మాని
నారచీరలు జడల్ నవతమైఁ దాల్చి, నారాకఁ గోరుచు నమ్మహీపునుఁడు
పరమపావనుఁడు సౌభాగ్యత్రభావనుఁడు, వరపితృవాక్యమద్వాక్యతత్పరుఁడు
చిరకీర్తినిరతుఁ డాశ్రితలాభరతుఁడు, భరతుఁ డుపగికాలపరిచితి నెట్లు
స్నానంబుసేయునో సరయువులోన, మానియై యెట్లొకో మహిఁ బవ్వళించు
నాతండ్రిసత్యంబు నాపూన్కి యతని,చేత నింతయుఁ బ్రకాశించె లోకముల
నేతల్లిపనుపున నెల్లసంయములఁ, చేత దీవెనలు గాంచితి నీడ నేను
అట్టికైకను నొవ్వ నాఁడునో తెలియ, దశ్టేల కావించు ననఘాత్ముఁ డతఁడు
పట్టంబు దొలఁగి తాపసి నైతి నేను, బట్టంబు గలిగి తాపసి యయ్యె నతఁడు
అన్నదమ్ములపాడి యాపుణ్యఁ జూచి, యెన్న నెవ్వరికైన నిఁక నేర్వవలయు
నట్టియాభరతుని యనుఁగుఁ దల్లులును,చుట్టాల నెన్నఁడు చూతుమో మనము
అని వారిఁ దలఁచుచు ననివారితముగఁ, దనివార నిష్ట గౌతమివారిఁ గ్రుంకి
యినునకు నర్ఘ్యంబు లెత్తి గాయత్రి, పనుపున జపియించి బ్రహ్మయజ్ఞంబు
తమ్ముఁడు దాను సీతయుఁ బర్ణశాల, కిమ్మెయిఁ జనుదెంచి హితగోష్ఠి నుండె
నొకనాఁడు లక్ష్మణుం డుదయకాలమున, నకళంకచిత్తుఁడై యన్నకు మ్రొక్కి

కందమూలఫలాదికములు దెచ్చుటకు, నందంద వనముల నరయుచు నరిగి
యున్నతం బగుచున్న నొకగిరిఁ గాంచి, మిన్నక యచ్చోట మెలఁగుచున్నంత
మహియెల్ల దేదీప్యమానమై వెలుఁగ, నహిమాంశుకల్పితం బగుఖడ్గ మొకటి
భీషణజలదగంభీరఘోషముల, ఘూర్ణించుచును వచ్చి కో యని పలికె
నందుకొ మ్మింక వై త్యాధీశతనయ, పొందుఁగా నీతపంబునకును మెచ్చి
బానుండు పనిచె నీవగిదిగ నన్ను, మానక కొనుమన్న మఱి వాఁడు పలికె
మెల్లనే తావచ్చి మెచ్చి నాకీక, యెల్లబోకలుచేసె నొల్లఁబో నిన్ను
నలఘుతపంబెల్ల నవనిపైఁ గలసె, వలసినకడఁకేగు వనజాప్తుహోతి
యని పల్కి తొల్లిటి యచలసమాధిఁ, దనరంగ నుండె నంతట లక్ష్మణుండు

సౌమిత్రి ఖడ్గము గొనుట.

విపులాద్భుతం బంది వెసఁ దానిఁ జూచి, యుపమతో డగ్గరి యొడిసి చేపట్టి
నిపుణుఁడై పరికించి నృపకుమారుండు, తపసులకెల్ల నాధారమైనట్టి
ఫలవృక్షములు ద్రుంపఁ బొడిగా దనుచుఁ, గలయఁ గ్రుమ్మరుచు నగ్గలిక మై నచట
భావించి భావించి బాగొప్పఁ జూచి, భావంబునందును భ్రమదంబుఁ గొనుచు
నీఖడ్గ మిందుండ నేమికారణమొ, యీఖడ్గ మిచ్చటి కేల వచ్చినదొ
యనియని ఖడ్గంబు నాదృతిఁ జూచి, పనిగొని దానిఁ జేపట్టుచు మఱియు
విలసిల్లు నొకగొప్ప వెదురుజొంపంబు, మలసి ఖండింపఁ దన్మధ్యభాగమునఁ
దెగియొకమాని మేదినిఁ గూలుటయును, నిగిడెడు మూర్ఛమునింగి సౌమిత్రి
యటఁ గొంతసేపున కల్లనఁ దెలిసి, కటకటా సకలలోకములు నిందింప
బ్రాహ్మణుఁ జంపితిఁ బరికింపలేక, బ్రహ్మహత్యాదోషభరితుండనైతి
నేనేల వచ్చితి నింతదవ్వులకు, నేనేల యీఖడ్గ మిట్లు నైకొంటి
ననుపమధర్మాత్ముఁ డగురామచంద్రు, ననుజుండ నగునాకు నధికపాపంబు
సమకూరె నీమునీశ్వరుఁ డెవ్వఁడొక్కొ, సమయఁ జేసితి నింక జానకీవిభుఁడు
విని నన్ను నేమని విడనాడునొక్కొ, పెనువేది మునులు శపింతురో పట్టి
చెప్పకుండఁగరాదు చెప్పకపోదు, తప్పెఁ గార్యముత్రోవ దైవమా యనుచు
నడలుచు నల్లన నడుగులు వణఁక, సుడివడి భ్రమయుచుఁ జొప్పుఁ దప్పుచును
నడతెంచి దశరథునకు గురుభక్తుఁ, బడనేసి చంపిన పాపంబువచ్చెఁ
దండ్రికివలెనె నందనునకు వచ్చె, నంద్రు భూపతులెల్ల ననితల్లడిలుచుఁ
దమయన్నఁజేరి గద్గదకంఠుఁ డగుచుఁ, గ్రమమేది వగచుచుఁ గడగి మ్రొక్కుటయు
ననుజుని నెత్తి యెయ్యన గారవించి, కనుఁగవకన్నీరు గ్రక్కునఁ దుడిచి
యనుకంప మదిఁబర్వ ననియె రాఘవుఁడు, అనఘ యేఁగలుగ నీకడల నేమిటికి
ధర్మవర్తనుఁడవు దానశూరుఁడవు, నిర్మలాత్మకుఁడవు నీతిమంతుఁడవు
దశరథక్షోపాలతనయమాన్యుఁడవు, పశుపతివిక్రమప్రకటశౌర్యుఁడవు
అన్న నీముఖమేల యటు చిన్నవోయె, నున్నది యేర్పడ నొగిఁ జెప్పుమనిన
జయశాలి యైనలక్ష్మణుఁ డిట్టులనియె, భయనివారణ నీదుపంపునఁ బోయి

వనమూలఫలములు వలయునన్నియును, గొని యేను మెలఁగుచోఁ గ్రూరఖడ్గంబు
నొక్కటి మింట రా నొడిసి చేపట్టి, వెక్కసంబగు నొక్కవెదురుజొంపంబు
నఱికితి దాన నున్నతుఁ డొక్కమాని, యొఱలుచు ధరఁగూలె నుగ్రుఁడో యనఁగ
నానేరమికిఁ గుంది నరనాథచంద్ర, రానేరకుండియు రానేర వలసె
ననపుడు రఘురాముఁ డాశ్చర్యమంది, యొనరకార్యము మది నూహించుచుండె
నంత నక్కడిమును లందఱుఁ గూడి, యెంతయు నత్తెఱం గెఱిఁగింత మనుచుఁ
జనుదెంచి రఘురామచంద్రు దీవించి, ఘనతరమృదువాక్యగరిమ నిట్లనిరి
అఖిలేశ వినుము నీయనుజస్తుఁ డిప్పు, డఖిలలోక ద్రోహి యైనరావణుని
చెలియలికొడుకగు జృంభుని నేఁడు, తులువను నిర్జించె దోషంబు లేదు
మునులెల్ల సంతసంబును బొందిరధిప, అనవుడు రఘురాముఁ డనియె మౌనులకు
నేవేల్పుఁగూర్చి వాఁ డిట్టితపంబు, గావించె ఖడ్గ మెక్కడనుండి వచ్చె
చీటికి మాటికిఁ జెడుదురే బుధులు, నాటికి హితుఁడుగా నజుఁడేల వ్రాసె
నెంతకాలముచేసె నీయుగ్రతపము, సంతుష్టుఁడయ్యెనే సరసిజాప్తుండు
అంతయు నెఱిఁగింపుఁ డనిన నాభూమి,కాంతునితో మునిగ్రామణు లనిరి
తొల్లి దశాస్యుండు దోర్బలశక్తి, నెల్లదిక్కులు గెల్వ నెచోట్ల మదిని
సొరిది నమ్మగలేక సోదరిమగని, నురుపరాక్రమని విద్యుజ్జిహ్వుఁ బిలిచి
మన్నించి లంక యేమఱకుమీ యనుచు, సన్నుతిగావించి చనియె నంతటను
ఏను మాయలు నేర్చి యే దశకంఠు, రానీను లంకాపురంబు గైకొందు
ననుచు విద్యుజ్జిహ్వుఁ డపుడు పాతాళ,మున కేగి రాక్షసముఖ్యులదండ
పాయక వారిచె బహుళంబులైన, మాయలు నేర్చుచు మదవృత్తినుండి
అచ్చట రావణుం డఖిలదిక్పతుల, విచ్చలవిడి గెల్చి వెస లంకఁ జొచ్చి
ఘనత విద్యుజ్జిహ్వకథలెల్లఁ దెలిసి, కనుఁగవలను నిప్పుకణములు రాల
నాయాజ్ఞనుండక నలిరేగి వీఁడు, పోయి మాయలు నేర్వఁబోలుఁ గాకేమి
మాయలన్నియు నేఁడు మాయమైపోవఁ, జేయుదు ననుచు నజేయుఁడై యరిగి
అస్మయనగరవాసాసురుల్ బెగడ, విస్మయకోపుఁడై వెస హేతిఁ బెఱికి
మఱుఁది నాచెలియలిమగఁ డీతఁడనక, తఱిమి విద్యుజ్జిహ్వుతలఁ ద్రెళ్లనేసి
క్రమ్మఱ వేగ లంకకు నేగుదెంచి, రమ్మని చెలియ శూర్పణఖ నూరార్చి
యనియె నీవిచ్చావిహారిణి వగచు, మనమున నీకు సమ్మతమైనపురుషుఁ
బొందుము వెఱవక వూని లోకముల, యందుఁ జరింపు పొమ్మనిన నార్నెలల

మునులు జాంబునితపఃప్రభావంబు చెల్లుట.

గర్భిణియై యున్నకతనఁ బైనెలలు, నిర్భరగతినుండి నెలఁతుక గాంచె
చటులోగ్రబలుఁ డైనజంబుకుమారు, నట వాఁడు పెద్దయై యాతల్లిచేతఁ
దనజనకునిచావు తప్పక దెలియ, విని తండ్రిపగ దీర్ప వెరవుఁ జింతించి
బ్రహ్మనుగూర్చి తపంబుఁజేసినను, బ్రహ్మ వరం బీఁడు భవునిఁ గోరినను
అతఁడు భక్తుఁడుగాన నలుగఁ డాతనికి, నతులితగతి విష్ణు నర్థింతునేని

చాల నాతఁడు మెచ్చి చనుదెంచి వరము, పాలించు నెపుడు నాపగదీరు నెపుడు
అరయఁ ద్రిమూర్తుల హరిహర బ్రహ్మ, లరవిందహితరూపమై యుండునండ్రు
కావున రవిఁగూర్చి కడునిష్ఠఁ దపము, గావించి మెప్పించి కదనరంగమున
దనుజనాయకుఁ డైనదశకంఠుఁ ద్రుంతు, ననియెంచి తపముసేయఁగఁ బూనునంత
వనరుహాప్తుఁడు మెచ్చి వరఖడ్గ మొకటి, పనిచె దానవ్రనకుఁ బగదీఱుటకును
దానిఁ గైకొనఁడయ్యె దర్పాంధు డగుట, నానిమిత్తమున నీయనుజునకబ్బె
నాహేతి యటుగాక యసురచేఁబడిన, సాహసంబున నేఁచు జగములన్నియును
దైవకృతంబున దైత్యుండు మడిసె, నీవిచారం బేల యినవంశతిలక
కలన రావణుఁ గెల్చేఁ గార్తవీర్యుండు, చలమొప్ప నాతనిఁ జంపె భార్గవుఁడు
నట్టి భార్గవరాము ననిలోనఁ బట్టి, కొట్టితి బీరంబు క్రొవ్వెల్లనణఁగ
నట్టి నీచే రావణాదిరాక్షసులు, గట్టిగా దురమునఁ గడతేరఁగలరు
అనవుడు రఘురాముఁ డాశ్చర్యమంది, వినతుఁడై మానుల వేడ్కతో ననిచె
నంత శూర్పణఖ నిత్యము దెచ్చినట్లు, వింతగా నన్నంబు వివిధభక్ష్యములు
పొసఁగ నించినబోనపుటికె చేఁబూని, వెస వచ్చి తునిసినవెదురుజొంపంబు
నడుమ ఖండంబులై నలిఁ బడియున్న, కొడుకుఁ గనుంగొని కుంభిని వ్రాలి
తెలిసి యత్తునుకలు దృఢముగాఁ గూర్చి, పలవించి పలవించి పడఁతి యిట్లనియె
నోకుమారకచంద్ర యుచితమే నన్నుఁ, గైకొన వదియేమి కన్నులు దెఱచి
తగుమామ యనక ప్రతాపలంకేంద్రుఁ, డగురావణునిఁ జంప నాత్మఁ గోరినను
నీకొనఁగూడునే నేరవై తకట, యాకార్తవీర్యుచే నణఁగెనే యతఁడు
అనరణ్యశాపాగ్ని నణఁగెనే యతఁడు, వనజసంభవుచాపవహ్నిచేఁ దెగెనె
నలకూబరునిచేత నడఁగెనే యతఁడు, అల నందికోపానలార్చులఁ బడెనె
శాండిల్యమానిరోషంబునఁ జెడెనె, యెండేల ధననాథుఁ డుండెనే లంకఁ
బగ వలదన్న నాపల్కుఁ గైకొనక, తెగితి రావణుఁ డేలఁ దెగును నీచేత
ధర్మదేవతమాట తల్లిమాటండ్రు, నిర్మలాత్మక వినవేరవై తకట
తపము పండె ననంగఁ దగనీకు బుద్ధి, గపటించె దైవంబుకత లేల యింక
ననియని శోకించి యక్కుమారకునిఁ, గనుఁగొని యగ్నిసంస్కారంబుచేసి
యనతిదూరంబున నచలసమాధిఁ, దనరుచు నున్న పెద్దలఁ జేరఁ బోయి
యోరి కన్నులుమూసి యుడుగక నిష్ఠ, ఘోరతపంబు గైకొని నేయురీతిఁ
దలను మోపెడుజడల్ ధరియించి బూది,యలఁది జన్నంబున నందఱుఁ గూడి
తొలఁగక మేకపోతులమెడల్ విఱిచి, పొలుపార నుడికించి పొట్టలనిండ
నెట్టన నమలి యెండినకళాసములు, గట్టి యేమియు నెఱుంగనియట్లయుండి
క్రొవ్వి నాశిశువును గుమతులై పట్టి, యెవ్విధిఁ జంపితి రెఱిఁగింపకున్నఁ
దాపసాధములార తాపంబు దీర, వే పట్టి మ్రింగుదు విడువక మిమ్ము
నని యహహారావ మడర డగ్గఱిన, మును లెల్ల భీతిల్లి ముదిత కిట్లనిరి
విను శూర్పణఖ మునివేషుఁ డొక్కరుఁడు, చనుదెంచి నీపుత్రు సమయంగఁజేసి

ఫలములు గొని యల్లపర్ణశాలకును, జలియింప కేగి యచ్చట నున్న వాఁడు
ముక్కు-మో మేర్పడ మునికార్యమునకు, దిక్కు-గల్గితిగాన తెఱఁగ యందరుగు
మని చూపి చెప్పిన నాదుష్టబుద్ధి, కనలుచు నపుడు లక్ష్మణుఁడు చన్నట్టి
యడుగులచొప్పున నరుగ నమ్మునులు, పొడమినభీతిచేఁ బులి నాకి విడచెఁ
దప్పకఁ దీనికిఁ దగినట్టిబుద్ధి, చెప్పి పంపుదు రింక చెలఁగి రాఘవులు
నాదట సకలదైత్యక్షయంబునకు, నాపికారణ మిదియని ముదమంద
నత్తఱి దరివేచి యసురేంద్రు చెలియ, లుత్తుంగ నాసియు నుగ్రభావంబు
గురువిలోచనములు కోఱదొడలును, పఱపైన కడుపును బల్లవెండ్రుకలు
తెఱనోరు కరిమేను దీర్ఘజిహ్వయును, వికటమైన రూపును విషమదృష్టియును
నరుదార ధరియించి యాఁడురూపమునఁ, గరముగ్రముగ వచ్చు గరళమో యనఁగ
నొడిసి లోకములెల్ల నొగి మ్రింగఁజాలి, పొడమిన నొకమహాభూతమో యనఁగఁ
దఱిలేచి దైత్యసంతతినాశకాల, మెఱిఁగి భూస్థలిఁ దోఁచు మృత్యువో యనఁగ
నడచుచు వెస శూర్పణఖ యనునాతి, కడఁకతో రాముడగ్గరఁ జేరఁబోయి

శూర్పణఖ రాముని జూచి మోహించుట.

యిందీవరశ్యాము నినకోటితేజాము, సౌందర్యజితకాము జగదభిరాము
రాముఁ దైతేయవిరాము వీక్షించి, కామభూతము సోకఁ గనుఁగొనరాక
తామసగుణమేచి తన్ను లోకాభిరామఁగాఁ దలఁచి యూరక్కసి నిక్కి-
తనపెద్దమొగము నాతనిముద్దుమొగము, తనమహోదరము నాతనితనూదరము
తనతప్పుఁ గన్ను లాతని గొప్పకన్ను, లెనయంచుఁ దన కితఁడే తగునంచు
మొగము చాటంతగా ముసిముసినగవు, లిగురింప రఘురాము నీక్షించి పలికె
శరచాపములు పూని చరియింపనేల, యరుదైన యడవుల నతివయు నీవు
నీవేషమునసుండ నేమి కారణము, నీవెవ్వఁడవు మఱి నీకుఁ బేరేమి
యనవుడు రఘురాముఁ డల్లన నవ్వి, దనుజకామినితోడఁ దగనిట్టు లనియె
రామాభిరామ యోరామ నాపేరు, రాముఁడు దశరథరాజు మాతండ్రి
యాపర్ణశాలవాఁ డతఁడు నాతమ్ము, డీపద్మలోచన యిల్లాలు నాకు
నేను దండ్రియుఁ బంప నీయరణ్యములఁ, బూని చరింతుఁ దపోవృత్తి నిపుడు
నీవెవ్వతెవు మఱి నీకుఁ బేరేమి, నివేల వచ్చితి నేఁడు మాకడకు
నీవిలాసంబును నీవయోరూప,లావణ్యమును నింతులకు నెందుఁ గలదు
నావుడు నాశూర్పణఖ రాముఁ జూచి, హావిరిఁ బల్కె- దుర్వారయై నిలిచి
యావిశ్రవసుకొడు కఖిలకంటకుఁడు, రావణుఁ డుగ్రవిక్రమయశోధనుఁడు
నాపటుసత్త్వన కనుఁగొఁజెల్లెలను, నాపేరు విను శూర్పణఖ యండ్రు తెలియ
నీరూపురేఖ లన్నియు సరిచూచి, కూరిమి నీకు నాకును దగునంచు
కామించి వచ్చితిఁ గడునొప్పురూపుఁ, గామించినప్పుడె కైకొననేర్తు
నెండైనఁ జననేర్తు నేవస్తువైనఁ, బొందుగాఁ దేనేర్తు భోగింపనేర్తు
నున్నదియేల నాయొప్పు భావించి, నన్ను పాణిగ్రహణంబు గావింపు

మిది కులగుణహీన యిది వికృతాంగి, యది నీకు మఱి తగునే యటుగాన
నీమెలఁతుకఁ బట్టి యిప్పుడే మ్రింగి, రామ నీకోరినరతి సల్పుదాన
ననవుడు తనుఁ జేర నాసీతఁ దిగిచి, కొని రాఘవుఁడు దానికోర్కికి నవ్వి
కొంత హాస్యముఁజేయఁ గోరి యాదనుజ, కాంతవికారంబుఁ గనుఁగొని పలికె
నేనింతగలవాఁడ నిది నన్ను నమ్మి, పూని నాతో వనంబునకు నేతెంచెఁ
దగిలి నీకొప్పింపఁ దగ దీలతాంగి, పగగొని సవతితోఁ బడఁజాల వీవు
ఈనాతి లేకున్న నింతకుమున్నె, యే నినుఁ గైకొందు నిప్పు డేమాయె
వాఁడె నాతమ్ముఁడు వరతపోధనుఁడు, వాఁడు నాకంఱెను వరరూపధరుఁడు
తన కొక్కచక్కని చరలాయతాక్షి, ననుకూలవతిని నిత్యముఁ గోరుఁ గాన
నినుఁబొంద నాతఁడు నేర్చునం దరుగు, మనవుఁడుఁ గాఁబోలునని డాయఁబోయి
నెలకొని లక్ష్మణ నిన్నుఁ గామించి, కలయ వచ్చితి నన్నుఁ గైకొను మనుఁడు
నారాముసుద్యోగ మతఁడును దెలిసి, ధీరుఁడై చానితోఁ దెఱుఁగొప్పఁ బలికె
మెలఁత మాయన్నఁ గామించితి తొలుతఁ, దలఁపున నటుగానఁ దగదు నిఁకొందఁ
సీత నిఁ బోలదు చెలువంబునందు, నీతఱిదీటును నీమురిపెంబు
భాతి నింకొకసారి పరికించెనేని, సీత నొల్లక నిన్నుఁ జెందు రాఘవుఁడు
రాముసన్నిధికి నోరమణి పొమ్మనిన, సౌమిత్రిమాటలు సత్యంబు లనుచుఁ
దామసి తనరోఁత దలఁపక మఱియు, రామునికడ కేగి రతికిఁ బ్రార్థించెఁ
వలవ దాతనిపొందు వనిత నీవనిన, జలజాక్షి మఱియు లక్ష్మణునిఁ బ్రార్థించె
దమ్ముఁ డన్నను నన్న తమ్మునిఁ జూడఁ, ద్రిమ్మరి తనకోర్కి తీదీపులాడ
మఱి మన్మధునిసూత్రమహిమచేఁ దిరుగు, తెరబొమ్మయో యనఁ దిరిగెఁ బేరాస
విరసవర్తనముల వెలఁది యిబ్బంగి, నిరువురసన్నిధి కెడ దాఁకి తాఁకి
వేసరి యన్యోన్యవివశవర్తనల, గాసిల్లి యెంతయుఁ గడునల్గి పలికె
నోరి మానవులాన యొకపేదరాలి, గాఱంచు తెఱఁగునఁ గాఱింపఁదగునె
యేను గోపించిన నింద్రాదిసురుల, నైనను మ్రింగుదు నట మర్త్య లెంత
పొందివి యీయింతితో భువనంబులెల్ల, జదిమి మ్రింగుదు నని సంరంభ మెసఁగ
నది మృత్యువును బోలి యట్టహాసంబు, పొదలి డగ్గరవచ్చువానికఁ జూచి
జానకి దలకెడి సౌమిత్రి యింక, దీనిమేలము చాలు దీనిశిక్షింపు
మని రాఘవుఁడు పల్క నాలక్ష్మణుండు, విని పర్ణశాలకు వెలుపల నిలిచి
పడఁతి నీకింత కోపం బేల రమ్ము, కడముట్ట నీకోర్కిఁ గావింతు నిపుడె
యని లక్ష్మణుఁడు పల్క నాశోర్పణఖయుఁ, దనమది నుప్పొంగి డగ్గఱఁజేర
ఘనవిషజ్వాలోరగముపుట్ట వెడలు, ననువున నొరఁబాపి యదరులు చెదర
దనఖడ్గ మంకించి దానవురాలి, ఘననాసికము చెవు ల్దరమునఁ బట్టి
యేసీమసరసమో యిదియన నతఁడు, మాసీమసరసమో మగువరో యనుచుఁ
జేయొడ్డివలసివచ్చినఁ జెవుల్తక్కు, పోయెనఁ సామెత పుడమిఁ బుట్టించి
ముక్కును జెవులును మొదలంటఁ గోయ, వెక్కుచు వేసారి వివశాత్మ యగుచు

శృంగంబుపగిలిన జేవ్రుగొండ, భంగి ర క్తములొల్క భయమంది పాఱి
చని చతుర్దశసహా స్రనిశాచరేంద్ర, జననవిరాజితస్థానంబునైన
ఖరునియాస్థానంబుకడకు వచ్చుటయు, ఖరుఁడును దానియాకారంబుఁ జూచి
వెఱగంది యిదియేమి వెలఁది నీరూపు, వెఱవక యెవ్వఁడు వికృతంబుసేసె
నెవ్వఁడు కాలాహి నెఱిగియుఁ ద్రొక్కె, నెవ్వఁడు మృత్యువు నిత్తఱిఁ జెనకె
వాని నెఱింగింపు వానిర క్తములు, వానిమాంసంబులు వడి నీకు నిత్తు
నని వేర్చి ఖరుఁడు తన్నడిగినఁ జూచి, విసుటకు వ్రేఁగైన వికృతస్వరమున
మునుకొన్నసిగ్గున మోమఱవాంచి, వినిపింపఁ దొడఁగె నవ్వలఁది యేఁడ్చుచును
విను మరణ్యమునందు వెఱవక యేను, చనుచోట నాజనస్థానంబునందు
నాసుతుఁ డైనట్టి నాకేశవదృశుఁడు, డాసూర్యనింగూర్చి యట నిష్ఠనుండ
వాని వధించిరి పౌరుష మొప్ప, వానికిఁ గర్మముల్ వడిఁ జేసి పిదప
విను మరణ్యమునందు విపులసాహసులు, మునివేషధారులు మోహనాకృతులు
రామలక్ష్మణులను రాజనందనులు, కామించి యేను డగ్గఱుటయుఁ జూచి
పటుశక్తి నన్నంటఁబట్టి నావేష, మిటుచేసి విడిచిన నేను దుగిఖించి
నినుఁ గానవచ్చితి నీవింకఁ బోయి, యెనసినకడఁకమై నిద్దఱుఁ జంపి
వారిమాంసంబులు వడి నాకు నిచ్చి, వారకి నాలోనివగలార్పు మనుడు
నింతమాత్రమునకై యేనేల వారి, పంతమదెంత నాపంపుఁ గైకొమ్ము

ఖరుఁడు సేనలఁ బంపుట.

అని పదునలువుర నంతకోపముల, ననలోగ్రతేజుల నప్పుడు పిలిచి
యీశూర్పణఖవెంట నేగి యానరుల, నాశంబునొందించి నాసహోదరికి
వారిశోణితము ద్రావఁగఁజేయుఁడనిన, వారును దుర్వారవారివాహములు
గాలితో వచ్చినకరణి నాజంత,తో లోలశూలకాంతులు మించులట్ల
చనుదెంచి రామలక్ష్మణసూర్యచంద్రు,లను గప్పి గర్జితాలాపముల్ చూప
దినకరకులుఁ డంత దేవీప్యమాన, ధనురాదిసాధనోద్ధాముఁడై యెదిరి
వారును దనమీఁద వైచినయశని, దారుణశూలముల్ ధారణిఁ గూల్చి
వారినందఱి భూరివజ్రానుకారి, నారాచములఁ గంరనాశముల్ చిదుమఁ
బరిపక్వఫలశిరోభాగములాస్వి, నిరుపమాశుగహతి నిట్టఱొళ్లనఁగఁ
బుడమిపై గెడసి రప్పుడు చుప్పనాతి, మఱెమెత్తుపరువున మఱియును బాఱి
ఖరునకు లోకభీకరునకు వారి, మరణంబు రఘురాముహితరణంబు
నుగ్గడించుటయు నాహుతి వెగ్గలముగ, బగ్గుబగ్గునమండుపావకుఁ డనఁగఁ
గోపించి యపుడు మిక్కుటమైనకడిమి, దీపించి దూషణత్రిశిరులు మొదలు
వీరులు పదునాల్గువేలరాక్షసులు, ఘోరసత్త్వులు గొల్వఁ గోమరుదీపించి
తెరలిన సురలతో దివి తల్లడిల్లఁ, బొరలిన గిరులతో భువి వెల్లగిల్ల
రణభేరి వ్రేయించి రత్నశైలాభ,గణనీయశబళాశ్వకలితవైడూర్య
మణికూబరసువర్ణమయచక్రదశక, రణజయప్రదధనుర్బాణాసిపూర్ణ

రణితకింకిణి యైనరథమెక్కి వెడలె, రణబలోద్యుక్తుడై రఘురాముమీదఁ
ద్రిశిరుండు కంకపత్రశరుండు విలసదశనికల్పుఁడు దిక్కు లదర నార్చుచును
వాసవవారణోజ్వలభాసమైన, భాసురరాసభప్రకరసంభరిత
హాటకస్పగితశతాంగంబు నెక్కి, మేటికయ్యమునకు మేనుబ్బి వెడలె
బర్హ్మాణవర్ణనిబర్హ్మాణపవన, గర్హ్మాణచణకాంతిభుసవేగతురగ
సందోహసంభృతస్యందనోత్తమము, ముందుగాఁ దోలించి ముదము గీలించి
సేనాముఖంబునఁ జెలఁగి దూషణుఁడు, నానాముఖంబుల నలువొప్ప డించె
ప్రేమతో మఱిపృథుగ్రీవుండు సైన్య, గామియు నవ్విహంగముఁడును మేఘు
మాలియు నగు మహామాలియు మఱియు, నాలోకభీకరుం డగుమహాసర్ప
ముఖుఁడును గాలకార్ముకుఁడు దుర్జయుఁడు, మఖశత్రవుండును మఱి పరుషుండు
కారుణ్యదూరుఁ డాకరవీరనేత్రుఁ, డారుధిరాశనుండన నొప్పువాఁడు
ద్వాదశదైత్యు లత్తఱి ఖరుఁ గొల్చి, ద్వాదశాదిత్యప్రతాపులై చనిరి
త్రిశిరుండు మఱిప్రమాథియు రణోద్యగ్ర, యశమునఁ బెప్పుమహాకపాలుండు
స్థూలాక్షుఁడును రణోద్యోగులై నేన, నాలుగుముఖముల నడచి రేమఱుక
భీషణకరిఘటాబృంహితతురగ, హేషారథస్వనానేకపదాతి
పటుతరహుంకారపటహభాంకార, పటుకేతుపటపటస్ఫారనాదములఁ
గ్రుంగె భూతలము దిక్కులు వ్రక్కలయ్యె, పొంగెఁ బయోధులు భూతములవ్రణఁకె
బలములకెంధూళి భానుమండలము, కలఁపు లేదనఁ గప్పె గగనంబు నిండ
ఖరునికేతనముపై గ్రద్దలు వ్రాలెఁ, దురగముల్ మ్రగ్గి నెత్తురువాన గురిసె
నక్కలు వాపోయె నభము భేదిల్లెఁ, జుక్కలు డుల్లెఁ బఱులు చుట్టునఱచె
మఱియు నుత్పాతము ల్మహినాకసమునఁ, దఱచుగాఁ దోఁప నింతయు భీతిలేక
ఖరుఁ డేతెఱంగునఁ గడఁకతో నడచి, యరుదైన యాదండకాటవిఁ జొచ్చె
ననుపమాకృతి రాముఁ డక్కలకలము, విని పర్ణశాలకువెలుపల నిలిచి
యవనిపై దివముపై నవశకునములు, వివిధముల్గనుఁగొంచు వెసఁ దమ్ముఁ బిలిచి
సౌమిత్రి సమరసూచకనిమిత్తములు, భూమిపైఁ బెక్కులు పుట్టుచున్న వియ
రట్టడి ముక్కడిరక్కసి మఱియు, దిట్టయై బలములఁ దెచ్చెఁ గావలయు
నదె సైన్యఘోషంబు లట్లకానోపు, నదె మహాబలధూళి యఖలంబుఁ గప్పె
నవమైన రణమబ్బె నా కటుగాన, నవహితమతిఁ బూని యాలస్య ముడిగి
జనకజ నిక్కడఁ జన దుంచ నింకఁ, గొనిపోయి యగ్గిరిగుహా నుండుమనిన
నినవంశవల్లభ యేనెట్లు పోదు, నిను డించి యటుగాన నీవు సీతయును
బర్వతగుహాఁ జేరి పరికింపు మేను, దుర్వారదనుజులఁ ద్రుంతు మీకృపను
అన విని వీరితో నాలంబుసేయ, నెనసె వెడుక నాకు నీవుండవలదు
జనకజ తలఁకెడుఁ జనుమన్న సీతఁ, గొనిపోయి పర్వతగుహాఁ జొచ్చియుండె
అంత రాముఁడు ప్రళయాంతకుపగిది, నెంతయుఁ గోపించి యేపుదీపించి
యమితమునిత్రాణ మగుకృపాణంబుఁ, గ్రమమొప్పఁగా వజ్రకవచంబుఁ బూని

శరశరాసనములు చతురుఁడై తాల్చి, యురుతరతూణీరయుగళంబుఁ బిగిచి
కొండపొల్లుగవచ్చు కుండలికుండ, లుండన విల్లు పెల్లుగ నెక్కు-పెట్టి
యగణితధ్వనుల మిన్నంతయుఁ బగుల, తగిలి చాపము గుణధ్వనిచేయుచుండె
నింద్రుండు మొదలుగా నెల్లదేవతలు, సాంద్రరత్నవిమానసహితులై యపుడు
చదలెల్ల నిండి యెంచఁగ రాముఁ డొకఁడు, పదునాల్గువేల నప్రతిమనిక్రమల
ఖరదూషణాదిరాక్షసుల నేరీతిఁ, బొరిఁగొనునో చోద్యముగఁ జూత మనుచు
గనుఁగొనుచుండిరి కపటదానవుల, ఘనుఁడు రాముఁడు ద్రుంచుగాకంచు సారె
దేవర్షిగణములు దివినుండి తాము, దీవించుచుండిరి దివిరి పల్మాఱు
పదివేలకోటులభానుతేజములు, పొదిగొని లోకము ల్వొదివినయట్లు
రామునితేజ మరణ్యభూజములు, భూమియు నభము నబ్ధులు గప్పుటయును
జడమతులై సర్వసంభ్రమం బుడిగి, మిడుకుచుఁ గన్నులు మిఱుమిట్లుగొనఁగ
కడు నంధు లైనరాక్షసులను జూచి, కడఁకలోఁ బల్కె నాఖరుఁడు దూషణుని
ఇదియేమి దూషణ యీసేన నడవ, దెబిచెనో పరసేన యేఱుడ్డపడెనొ
యనిన దూషణుఁ డేగి యటఁ జూచివచ్చి, దనుజేశ రాముసుద్దండతేజంబు
కలయఁ బర్వుటయును గతిదప్పె ననుఁడు, నలుకమై ఖరుఁడు సైన్యములఁ దిట్టుచును

ఖరునిసేనలు రాము నెదుర్కొనుట.

నరద మత్యుగ్రత నటఁ దోలుకొనుచు, నరుగుచో రాక్షసులందఱుఁ గూడి
భుజబలాటోపవిస్ఫురితప్రతాప, గజరథభటవాజికలితులై యకట
మండుకార్చిచ్చువై మలయుచు మిడుత,తండంబు లొక్కటఁ దారొక్కొన్నకరణి
గడు నుగ్రవేగులై, కాకుత్స్థరాము, వడిఁ జుట్టు ముట్టి దుర్వారులై కదిసి
శరచాపపట్టసశక్తిత్రిశూల, కరవాలకుంతముద్గరభిండివాల
పరశుతోమరగదాప్రాసఖడ్గములు, గురిసి యార్చిరి దేవకోటి భీతిల్ల
నప్పుడు రఘురాముఁ డంబుదపంక్తిఁ, గప్పిన చండాంశుగతిఁ గానఁబడక
కొంతసేపునకు రక్షోగణము క్ష,కుంతాదిబహుశస్త్రకుటిలాస్త్రతతులు
నన్నియు మాయించె నైంద్రజాలమునఁ, జెన్నునఁ దను సురశ్రేణి కీర్తింప
మఱియుఁ దోడ్తో దైత్యమండలి గురియుఁ,దఱుచగు నస్త్రశస్త్రములఁ ద్రుంచుచును
ముందట నిరుపార్శ్వముల పిఱుందటను, సందడించిన దైత్యసైన్యంబుమీఁదఁ
గరలాఘవము మీఱఁ గవదొనలోన, శరములన్నియు నొక్కసారె సంధించి
పదియు నూఱును వేయుఁ బదివేలు లక్ష, పదిలక్షలటుకోట్లు పదినూఱుకోట్లు
మండితపరివేషమధ్యందినార్క-, మండలపరివేషమహితానుకారి
కుండలీకృతచండకోదండదండ, భండనాత్యుత్సాహబాహుఁడై వ్రేయఁ
దునియు గంభీరవేదులును జోదులును, దునుకలై పడెడువీరులును రౌతులును
ద్రుంగెడుబహుపదాతులును హేతులును, ముంగలఁ బడుశరంబులు శిరంబులును
మ్రొగ్గెడు యోధాంగములు రథాంగములు,మ్రగ్గెడు సగుణధర్మములు వర్మములు
తూలెడు రథికజాతులును సూతులును, గూలెడి వెలిగొడుగులుఁ బడగలును

నలినైన మాంసఖండములు మొండెములు, గలిగి లోకైకభీకరమయ్యె రణము
అంత భానునిదీప్తి కంధకారంబు, పంతమంతయుఁ బటాపంచలైనట్లు
అతులవిక్రమధాముఁ డగురామునకును, హతశేష మగునైన్యమంతయు విఱిగి
ఖరునకు శరణన్న ఖరుఁడును వారిఁ, బురికొల్పి దూషణుఁ బోరికై పనుప
వాఁడును హతశేషవాహినుల్ దాను, వేడిమి సూపుచు వేవేగఁ బొదివి
తాలసాలశిలావితానానేకాస్త్ర,జాలవర్షము రామచంద్రునిపైఁ గురిసెఁ
గురిసిన తనమేనఁ గ్రొన్నెత్తు రొలుఁ, నరుణారవిందాక్షుఁడై రాముఁ డలుక
గాంధర్వశరము రాక్షసులపై నేయ, సైంధవసింధురస్యందనసుభట
వీరుల కష్మహావిశిఖరాజంబు, తేరిచూడఁగరాక దేదీప్యమాన
తారాకరాళమై దనుజవర్గముల, గాఱించి నొంచి చీకాకు గావించి
దండించి ఖండించి తల లుత్తరించి, చెండాడుచో రణక్షితియెల్ల నిండి
యెందుఁ జూచిన తురంగేభఖండమ్ము, లెందుఁ జూచిన నింగి కెగయు మొండెములు
నెందుఁ జూచినఁ బ్రేవు లెఱుచియు మెదడు, నెందుఁ జూచిన నెత్తురేర్లు నైయుండె
శాకినీభూతపిశాచభేతాళ, డాకిను లంతఁ దండంబులై యపుడు
నేనుంగుతలకాయ లెసఁగఁ గుండలుగఁ, బూని యందలిమత్స్యములు దండులముగ
దండి రామునిరణధర్మసత్రమున, వండినా రిదె రండు వరుస భుజింప
నని వేడ్కఁ బైకొన్నయధికారముద్ర, గొని రొదగాకుండఁ గూర్చుండఁబెట్టి
రక్తచందనమును రక్తాక్షతములు, రక్తసంకల్పపూరంబును దాల్చి
శరవహ్నిపక్వమాంసంపుటన్నములు, పొరలినమెదడుపప్పును గొవ్వులందు
వరదలై యాజ్యప్రవాహముల్ కండ, లెరిగి కారిజము లనేకశాకముల
పాలప్రేవులు శాపపాశముల్ మేలి, వాలుగుండెలు పిండివంటలు మఱియు
నెత్తుమ తియ్యనినీరుగాఁ దలఁచి, యత్తఱి విప్రయోగ్యాహార మగుచు
నానందతృప్తులై యధికసమ్మదము, చేనూని సభగూడి శ్రీరామచంద్ర
'ధీవిజయోస్తు'ని దీవించి కొన్ని, యావలఁ గొన్ని 'తథాస్తు'ని పల్క
నింతలో మఱికొన్ని యేనుంగు జీవ, దంతముల్చేతను తాళము ల్పూని
పొలసు మ్మెలు సంకుపూసలవేర్లు, కళుకు కామాక్షులుగా దరియించి

శ్రీరామునితో ఖరదూషణులు పోరుట.

కరఘంటికాతాళగతుల కుబ్బుచును, దరిఁ జేరి కాపు లత్తఱిఁ జూపెఁ గొన్ని
అంత దూషణుఁడు మత్తారిభీషణుఁడు, వంతనొందుచుఁ దనచెంతయోధులను
విజయశీలుర నైదువేలఁ బంపుటయుఁ, ద్రిజగము ల్వాఁక నెదిర్చి వారపుడు
చాపవిద్యాప్రౌఢి సకలంబుఁ జూపఁ, జూపులఁ గోపంబు చూపుచు నృపుఁడు
నొక్కొక్కశరమున నొక్కొక్కదనుజుఁ, దక్కక ద్రుంచి విదారించి విభుఁడు
కొందఱి నందందఁ గుదులుగాఁ గ్రుచ్చి, యందఱిఁ దెగటార్చి యార్చినఁ జూచి
దూషణుం డత్తఱి దూరుఁడై పరుష, భాషణుండై రాముపైఁ దేరు,బరపి
దశదిగంతంబులు దట్టంబుగాఁగ, నశనికాలాహితుల్యంబులై యొప్పు

నమ్ములు నిగుడింప నవి ద్రుంచి నాలు,గమ్ముల రథమును హయములఁ ద్రుంచి
వెరవొప్ప నొకకోల విలుద్రుంచుటయును, దురమున విభుఁడై దూషణుం డలుక
దారుణపాణివిదారణవిజయ, కారణాంతకగదాకల్పమై యొప్పు
పరిఘంబుఁ ద్రిప్పుచుఁ బఱతేర రాముఁ, డురుశరద్వయమున నురుబాహాయుగము
నరుదుగా దెగనేసి యామ్యబాణమున, నురమేయుటయు దైత్యుఁ డొరలుచుఁ
దంతము ల్విరిగిన దారుణభద్ర,దంతావళేంద్రంబు ధరఁ గూలినట్లు [గూలె
కూలినఁ జూచి ముగ్గురుదండనాథు, లాలోఁ బ్రమాథిమహాకపాలుండు
స్థూలాక్షుఁడును బరశువు త్రిశూలంబు, కేలఁ బట్టసము లంకించి వైచుటయు
వారిశస్త్రంబులు వారిమస్తకము, శ్రీరాముఁ డొక్కఁడె చెండిబెండాడె
నప్పుడు ఖరుఁడు సేనాధినాయకుల, ముప్పరిగొనురోషమునఁ బురికొల్పె
వారుపన్నిద్ధ రవార్యశౌర్యమున, వీరరాఘవుఁ దాఁకి వేర్వేఱు బోరఁ
గులిశధారాకారఘోరబాణములఁ, గలిమిఁ జూపుచు సైన్యగామి నుక్కణఁచి
కాలకార్ముకుఁ ద్రుంచి కరవీరనేత్రుఁ, దూలించి సర్పాస్యత్రుళ్లడంగించి
యావిహంగము నొంచి యజ్ఞశత్రవుని, చేవ యడంచి శిక్షించి దుర్జయుని
కేలి మహామాలిఁ గెడపి యామేఘు, మాలిని వధియించి మర్దించి పరుషుఁ
బృథుకంఠకంఠంబు పృథ్వినై గూల్చి, రుధిరాశనుని జంపి రోషంబు మిగుల
దిక్కిది ఖరుఁడును ద్రిశిరుండు దక్కఁ, దక్కినవారినందఱ నేలఁ గూల్చె
నీలీల రాముచే నెల్లసైన్యములు, గాలిచేఁ గూలినకారాకు లనఁగఁ
గూలినఁ గోపంబు గొని కాలత్రిశిరుఁ, డాలోన రాముపై నరదంబుఁ బఱపి
సింహనాదముఁ జేసి సింధురోత్తమము, సింహంబు నెదిరిన చెలువున నెదిరి
గుణనాద మెసఁగ రక్షోవీరుఁ డకట, గణనాపరంపరల్ గడవ నందంద
నతులబాణము లేయ నలిగి రాఘవుఁడు, ప్రతిబాణతతులచే బలువిడిఁ ద్రుంచె
వాఁడును మఱిపేరువాఁడి వాఁడిమిని, మూఁడుబాణముల రామునిభ్రూలమేసె
నావాఁడిబాణంబు లళికంబు దాఁక, నప్పుచుఁ గినుకమై నళినాప్తకులుఁడు
త్రిశిరుని నేసినఁ ద్రిశిరము ల్కుసుమ, దళదాల్చె నిఁకఁ జతుర్దశభువనములు
దూఱిన నిసుఁబట్టి తునుమాడునట్టి, దారుణతరచతుర్దశసాయకముల
నేనేయువాఁడ సహింపుమీ చనుచుఁ, దానేసెఁ బదునాల్గుదారుణాస్త్రములు
అవి తొమ్ము గొని గాడి యవ్వల వెడల, నవనీస్థలముగాఁ నంత రాఘవుఁడు
అరదంబు మఱినాలు గమ్ముల విఱిచి, యురువడి పదియింట సురమేయుటయును
సురవైరి కోపించి శూలంబు వైవ, నరనాథుఁ డది ద్రుంచె నాలుగస్త్రములఁ
ద్రుంచి మూఁడమ్ముల దుదమూఁడుతలలఁ, ద్రుంచినఁ ద్రిశిరుండు దురమునఁ గూలె
మూఁడుకొమ్ములతోడ మొదలంటఁ ద్రవ్వి, పోడిమిచెడి కూలుభూజంబుపోలెఁ
ద్రిశిరుండు గూలఁగ దృష్టించి ఖరుఁడు, దశరథరాముచేతకుఁ జోద్యమంది
మఱిచాలఁగోపించి మహనీయరథము, దఱిమి యుగ్రాస్త్రసంతతు లేయఁజూచి
శరలాఘవము మెచ్చి జానకీవిభుఁడు, ఖరునిపై బ్రతిసాయకములు వేయుటయు

ఖరునిబాణములు రాఘవునిబాణములు, ధరణీతలము వియత్తలమును బొదివె
నప్పు డర్కునిదీప్తు లన్నియు మాసెఁ, గప్పెను నిబిడాంధకారంబు దిశల
ఖరుని రాఘవుఁడు రాఘవుని నాఖరుఁడు, సరకుగాఁ గొని రాజి జయకాము లగుచుఁ
గాసరయుగళంబు కలభద్వయంబు, కేసరియుగళంబు కెరలి యొండొండఁ
బోరెడుగతిఁ దోఁప భుజబలాటోప, భూరిప్రతాపులై పోరాడుచోట
ఖరుఁ డప్పు డలిగి రాఘవుచేతివిల్లు, సరిద్రుంగు వెస నర్ధచంద్రబాణమునఁ
ద్రుంచి జోడును ద్రుంచఁ దోడ్తోడ మఱియు, ముంచె రామునిదేహమున నంప
నాయంపతండంబు నాతఁడు సరకు,సేయక తను సురశ్రేణి కీర్తింప [వెల్లి
నుష్ణాంశుకులుఁ డగస్త్యునిచేతఁ గొన్న, వైష్ణవచాపంబు వడి నెక్కుఁ వెట్టి
శింజిని మ్రోయించి శితసాయకముల, భంజించె రాక్షసప్రవరుకేతనము
మఱివాఁడు రాముమర్మము లుచ్చిపాఱఁ, గఱుకుటమ్ములు నాల్గు గద్దించి యేయ
రక్తసిక్తాంగుఁడై రాఘవుం డంత, నక్తంచరుని నొంచె నారాచనిహతిఁ
బటుబాణమొకటఁ జాపము ద్రుంచివైచె, నటు నాలుగిట వాని హయములఁ జంపి
సారథిఁ బడవేసి సాయకవహ్ని, కారథం బపుడు పూర్ణాహుతిచేసె
విలుగోలుపడి యిట్లు విరథుఁడై ఖరుఁడు, ప్రళయకాలాంతకప్రతిముఁడై కేలఁ
జలమున గద గొంచుఁ జనుదెంచుటయును, జలియించె గిరులతో జగతియంతయును
నప్పుడు రఘురాముఁ డాదుష్టదైత్యుఁ, దప్పకఁ గనుఁగొని దర్పించి పలికె
నోరిరాక్షస వినరోరి నాచేత, శూరత నీకేల చొప్పడు నింక
నీబలంబులు సచ్చె నీవారు తెగిరి, నీబాణసంపద నిర్మూలమయ్యె
నరుదుగా నీదండకాటవిఁ దొల్లి, వెరిగి సన్మునులఁ జంపినపాపఫలము
కుడువఁ గాలమువచ్చెఁ గుడుతుగా కింక, నడరి వధింతు ఘోరాజిలో నిన్ను
ననవుడు ఖరుఁ డప్పు డారాముఁ జూచి, కనలుచుఁ బలికెఁ దోర్గర్వంబు మెఱసి
యేల రాఘవ నీకు నింత గర్వింప, నాలంబులోఁ గొంద ఱల్పులఁ జంపి
కెలయుచు నిను నీవె కీర్తించుకొనెదు, కులజుండు తనుఁబానెఁ గొనియాడుకొనునె
ఇదె గదాధరుఁడనై యేఁ దెంచినాఁడ, కదిసి పోరాడు నాకడిమియుఁ జూడు
దేవతలకునైన దీరదు గెలువ, నీవు నాముందఱ నిలువ శూరుఁడవె
యొండొండఁ గడఁగి నీయొడలిమాంసములు, చెండాడి నేఁడు నాచెలియలికిత్తు
నని మహాగదఁ ద్రిప్పి యడరి వైచుటయు, ననిలునివేగంబు నర్కుతేజంబు
ననలునివేడిమి యశనిచెట్టిదము, ఘనగదారూపమై కదసినయట్లు
చనుదేర నుద్దండచండకాండములఁ, గనల కారాముఁ డాగదఁ ద్రుంగనేసి

ఖరుఁడు శ్రీరాముల నెదుర్చుట.

యొారి నీగర్వోక్తు లుబ్బును మదము, దీరెనె బింకముల్ దీరెనే యనుడు
గద్దించుచును వాఁడు కడువడితోడ, నద్దనుజుండు మహారోషమునను
గ్రక్కున వృక్ష మొక్కటి పెల్లగించి, చిక్కినభుజశక్తిఁ జిరజిరఁ ద్రిప్పి
చావుమటంచును జయ్యన వైవ, నావృక్షమును ద్రుంచి యఘుడు రాఘవుఁడు

ఖరునిపై ఖరకరకరసహస్రాభ,శరసహస్రము లేసి చాల నొప్పింప
నొచ్చియు వాఁడు తనూరక్తధార, పిచ్చిలఁ దెచ్చుకోల్బీరంబు మీఱి
నెదురుగాఁ జనుదేర నీక్షించి రాముఁ, డదయుఁడై భువనంబులన్నియు వణఁక
నురవడి నైంద్రాస్త్ర మొకట సంధించి,యుర మేయుటయు దైత్యుఁ డుబ్బెల్లఁ బొలిసి
పిడుగడచినకొండ పృథివిపైఁ గూలు, వడువున ఖరుఁ డంత వసుధపైఁ గూలె
ననిముహూర్తము ముహూర్తార్ధంబులోన, దను నెదిర్చిన చతుర్దశసహస్రముల
ఖరదూషణాదిరాక్షసుల నీరీతిఁ, బొరిగొనుటయు రాముఁ బొగడిరి సురలు
మునులు దీవించిరి మొగిఁ బుష్పవృష్టి, యనిమిషు ల్లురియించి రారాముమీఁద
ఘనశైలగుహనుండి కడఁకతో నంత, జనకజఁ గొనివచ్చి సౌమిత్రి మ్రొక్కి-
యభినుతు లొనరించి యప్పు డారామ, విభునిచే శోభిల్లువిల్లందుకొనియె
నూనినసంతోష ముల్లంబు నిండ, జానకీపతి పర్ణశాల కేతెంచి
కలహించి తెగినరాక్షసుల భూమిజకుఁ, దెలియఁ జెప్పుచు వినోదించుచునుండె
అప్పు డకంపనుఁ డఖిలకంపనుఁడు, విప్రులా ర్తి లంకకు వేగంబె పోయి
యారావణునిఁ గాంచి యసురాధినాథ, వీరులు పదునాల్గువేలరాక్షసులు
ఖరదూషణాదులు కాకుత్స్థరాము, శరవహ్ని నీఱైరి సత్యంబటన్న
అక్కజంబునుబొంది యాయకంపనుని, దిక్కుచిక్కనిరోషదృష్టిఁ జూచుచును
నేమేమి యిదివింత యెట్లురా యోరి, రాముఁ డెవ్వఁడు రాజరాజొ స్వారాజొ
యమరాజొ వారైన నామహాఖరుని, సమరానఁ ద్రిశిరదూషణులను గెల్వఁ
జాల రట్టిప్రతాపశాలుల నొక్కఁ, డేలీలఁ గెల్చె మాకెఱిఁగింపు తెలియ
నిదె యభయంబు నీకిచ్చితి ననినఁ, బదరక మఱి యకంపనుఁడు రాఘవుని
చరితంబు ధైర్యంబు శౌర్యంబు నతఁడు, ఖరదూషణాదుల ఖండించుటయును
సౌమిత్రియందంబు జానకియంద, మామూలముగఁ జెప్ప నతఁడు రోషించి
యుద్ధంబుసేయ నుద్యోగింప నతఁడు, బద్ధమైత్రిని నకంపనుఁ డిట్టులనియె
రాక్షసేశ్వర వినుఁ రఘురాముఁ గెలువ, పక్షివాహనశూలపాణుల వశమె
మాటమాత్రంబున మహియు నాకసము, మీటను నాట నమ్మేటియే నేర్చుఁ
గార్చిచ్చునైననుఁ గరువలినైన, నార్చను గూర్చను నాతఁడే నేర్చు
భువనంబులన్నియు బూదిగావింప, నవి బోదిగావింప నాతఁడే నేర్చుఁ
బొల్పడ బ్రహ్మాండభాండంబునైన, నిల్పఁ బగుల్ప నానిపుణుండె నేర్చు
నదిగాన నాకయుపాయంబును గలదు, కదనంబు వలవ దాకాకుత్స్థకులుని
దేవి లావణ్యవార్ధిని దెచ్చితేని, యావియోగాగ్నిచే హతుఁడగు నతఁడు
నావిని రాక్షసనాయకుఁ డదియ, భావించి యాతనిఁ బదినోళ్లఁ బొగడి
హాటకరథమెక్కి యాయబ్ధి దాటి, తాటకేయుని మంత్రిథారేయుఁ జేరి
యతనిలో ఖరదూషణాదిరాక్షసులు, హతులౌటయును దాను నారాముదేవి
సీతఁ దెచ్చుటకు నాసించివచ్చుటయు, ప్రీతిఁ జెప్పుటయు మారీచుఁ డిట్లనియె
నిదియేమి రావణ యెల్లభోగములు, కొదలేక సుఖమునఁ గుడిచి కూర్చుండి

యిట్టిదుర్బుద్ధి నీ కెట్లొకో పుట్టె, నెట్టిదుర్మతియు నీ కీబుద్ధి చెప్పె
వాని నీవటు పగవానిగా నెఱుఁగు, మే నీకుఁ బోరానిహితమతిగాని
యితరుండఁ గాను నీ కీబుద్ధిగాదు, ఋతిఁ బతివ్రతల కాశించుట తగదు
ఆశించితేని నీయన్వయంబెల్ల, నాశమాఁగాన దానవనాథ నీవు
చనుము లంకకు సుప్రసన్నుఁడ వగుము, గనుము సౌఖ్యము నీదు కాంతలవలన
ననిన మారీచువాక్యంబు లప్పటికి, విని లంక కేతెంచె వింశతిభుజుండు
అంత నాఖరదూషణాదిరాక్షసులు, పంతంబుచెడి రాముబాణాగ్నిఁబడుట
యంతయు నటచూచి యాచుప్పనాతి, సంలోష మెడలినఁ జనిలంకఁ జొచ్చి
యాసుధర్మాస్థానమందుఁ జింతామ,ణీసింహపీఠినుండెడియింద్రుఁ డనఁగ
మానితం బగుసభామంటపవేదిఁ, బూర్ణ సింహాసనంబున నున్న వాని
గరుడోరగామరగంధర్వయువతు, లురుమతిఁ గొల్వఁ గొల్వున్న రావణుని
ఐరావతోగ్రదంతాగ్రసంఘట్టి, తోరస్థ్సలస్థగితోరుభూషణుని
సకలలోకైకభీషణుని సంగ్రామ,వికటభాషణుని విద్వేషదూషణునిఁ
గని మ్రొక్కి- యేడ్చుచుఁ గరములు మొగిచి, తనలోనిఘనవిషాదము తోఁపఁ బలికె
అసురేంద్ర లోకంబు లన్నిటియందు, నసమానసత్త్వుండ ననుకొందువీవు
కడిమిమై మూఁడులోకంబుల రిపులఁ, గడఁగి చంపితినని గర్వింతువీవు
కడఁక నారాజ్యమకంటకం బనుచు, నొడివి వెల్లుబ్బి వినోదింతు వీవు
చాపలయందును జనవరులందుఁ, గోరి బొక్కసమందుఁ గోరికలందు
గూఢచాపలయందు గుప్తంబులందు, రూఢిగాఁ దెలియుచు రూపించువాఁడె
సకలలోకములకు స్వామినాఁబడును, వికటంబులైన నీవిద్యలకలిమి
నీవిక్రమంబును నీభుజాబలము, నీవిభవంబులన్నియు మున్నె కాక
యింకఁ జెల్లునె యిది యెట్లంటివేని, కొంకక విను భానుకులపావనుండు
తనతండ్రి దశరథధరణివల్లభుఁడు, తనుఁ బంప రాముఁడు తాపసవృత్తిఁ
దనకు గాదిలిసహోదరుఁడు లక్ష్మణుఁడు, తనదేవి సీతయుఁ దాను నేతెంచి
మును దండకావనంబునకును వచ్చి, యనుకంప మునులకు నభయంబు లిచ్చి
వచ్చి యిమ్ములఁ బంచవటి నున్న చోట, నిచ్చలోఁ గామించి యేను డగ్గఱినఁ
గరమల్లి నన్నిట్లు గాసిసేయుటయు, ఖరునితోఁ జెప్పిన ఖరుఁడు బిట్టలిగి
రోషించి లయకాలరుద్రుండువోలె, దూషణత్రిశిరులతో దండువెడలి
నరభోజనులు పదునాలుగువేలు, వరవీరభటులతో వడి నేగుదెంచి
బలువడి రఘురాముబాణాగ్నిశిఖల, బలములు దానును భస్మమై మడిసి
రటుగాన నాభంగమంతయు నీగ, నిట నీవెకాక దిక్కెవ్వరు గలరు
ఇదె నాదుముఖభంగ మీక్షింపు నాదు, కొదువ నీకొదువగాఁ గోర్కిభావింపు
మనిన నచ్చెరువంది యాత్మ భావించి, దనుజాధినాథుఁ డాదానవి కనియె
జ్ఞాతివధంబు నీచన్నవిధంబు, ఖ్యాతి వింటిని గంటి నది యటులుండె
నోరామ యారామునురుసత్త్వ మెంత, యేరూప మే ప్రాయ మెంతటివాఁడు

అతనితమ్మునిరూప మవి యెట్టి దతని, సతియైనసీత యేచందంబురూపు
చెప్పుమా నీవు చూచిన తెఱంగెల్లఁ, దప్పి తెరుతు ర క్తధారల నీకు

శూర్పణఖ శ్రీరాములరూపాతిశయముఁ జెల్పుట.

నావిని యాశూర్పణఖ యిచ్చఁ బొంగి, రావణుతోడ నేర్పడ నిట్టులనియె
నున్న తోన్నతవక్షుఁ డుత్పలశ్యాముఁ, డిన్ని లోకములకు నెక్కుడువాఁడు
మిగులఁ జక్క నివాఁడు మిహిరమండలముఁ, దెగడుతేజమువాఁడు ధీరవర్తనుఁడు
నాజానుబాహుఁ డుదగ్రవిక్రముఁడు, రాజీవనేత్రుండు రామచంద్రుండు
అతఁడెపో ఖరదూషణాదిరాక్షసులఁ, గృతమతి నొంటిగా గెలిచినజోదు
హేమవర్ణుఁడుగాని యిన్నిచందముల, సౌమిత్రి రఘురాముచందంబువాఁడు
వాఁడెపో నా కీయవస్థ గావించి,నాఁ డింక సీతసౌందర్యంబు వినుము
తెఱఁగొప్పఁ జూచితి దేవకామినులఁ, దఱిగొని చూచితి దనుజకన్యకలఁ
గేలిమైఁ జూచితిఁ గిన్నరాంగనలఁ, బోలించి చూచితి భోగికామినులఁ
గలయంగఁ జూచితి గంధర్వసతుల, నలవడఁ జూచితి యక్షకామినులఁ
జూచితిఁ బార్వతిఁ జూచితి రతినిఁ, జూచితి భారతిఁ జూచితి లక్ష్మిఁ
జూచితి రంభను జూచితి శచిని, జూచితి భూలోకసుదతులనెల్ల
మునుకొని చూచితి మునికన్యకలను, బనివడి చూచితి బ్రాహ్మణస్త్రీల
నాచన్ను లాకన్ను లాముద్దుపల్కు, లాచెక్కు లాముక్కు లాసోయగంబు
లాతీరు లాకురు లావాలుచూపు, లాతోడ లాయొడ లాయొయ్యారంబు
లామందహాసంబు లావిలాసంబు, లామృదుగమనంబు లాసుమనంబు
నేముందు పొడగాన నేయింతులందు, భూమిజ నేమని భూషింతుఁ జెపుమ
నెగడ లోకములేలు నీయట్టిపతికిఁ, దగుఁగాక యాయింతి తగునె యన్యులకు
నాయిందుబింబాస్య యాచకోరాక్షి, యాయెలజవ్వని యాకుందరదన
యామత్తగజయాన యాలతకూన, యామానినీమణి యాపద్మగంధి
యాయింతి నీయింతి యైయుండెనేని, నీయాన దనుజేశ నీరాజ్య మెప్పు
ననిన రావణుఁడు కామాతురబుద్ధి, మును నకంపనుమాట ముద్దియమాట
విన నొక్క తెఱఁగంచు విస్మయంబంది, గొనకొన్నప్రేమమైఁ గొలువు చాలించి
తనపాలివిధి తన్నుఁ దగిలి ప్రేరేఫ, జని యేకతంబున సారథిఁ బిలిచి
యరదంబుఁ దెమ్మన్న నతఁ డట్ల నేయ, ఖరకరసృశంబు కామచారంబు
ననుపమాయుధపూర్ణ మగురథంబెక్కి, దినకరకోటీరదీప్తుడై మెఱసి
గగనమార్గమున సాగరమధ్యవీథిఁ, దగినవస్తువిశేషతతులు చూచుచును
దమకించి వడి సముద్రము దాఁటి పోయి, క్రముకమరీచికాగరునారికేళ
సాలతక్కోలరసాలవిశాల, వేలావనంబులు వెడక్కఁ గన్గొనుచు
గరుడుండు ముసు సుధాకలశంబు దేరఁ, గరమర్థిఁ బోవుచో గజకచ్ఛపముల
భక్షించుకొఱకునై పదమూదినట్టి, వృక్షంబు పక్షీంద్రవృతలక్షణంబు
శతయోజనాయతశాఖంబు మాని, వ్రతము సుభద్రాఖ్య వెలయువటంబు

సుముఖుఁడై కనుఁగొంచు సురుచిరమహిమ, నమరిన యాసుచంద్రాశ్రమభూమిఁ
గ్రమమెప్ప జడలు వల్కలములు దాల్చి, సమచిత్తుఁడై కడుసౌమ్యభావమున
భూరితపోనిష్ఠఁ బొలుపారుచున్న, మారీచుఁ జేరి సన్మానంబు వడసి
యతిదీనవదనుఁడై యాపంక్తికంఠుఁ, డతనితోఁ దనదుకార్యముఁ జెప్పఁదొణఁగె
మారీచ నీవాప్తమంత్రివిగాన, వారక మఱియును వచ్చితి వినుము
తరణివంశుఁడు రామధరణివల్లభుఁడు, ధరణి యేలఁగనీక తండ్రి పొమ్మనిన
ననుజస్తుడును దాను నతివయుఁ గూడి, వనమునఁ దపసులై వర్తింప వచ్చి
తనసత్త్వమునఁ జేర్చి దండకారణ్య, ములకు నభయ మిమ్ముల నిచ్చి వచ్చి
నడుకక మనశూర్పణఖ ముక్కుఁజెవులు, కడునల్కఁ గోసె నక్కట యకారణము
ఖరదూషణాదిరాక్షసుల ఖండించె, దరమిడి మఱి చతుర్దశసహస్రములఁ
దెగినబంధులకుఁ బ్రతీకార మేను, నెగడి సేయకయున్న నెంజిలి పోదు
నీవు ముఁ గఱపిననీతి నట్లున్న, నావల నభిమానహాని గాకున్నె
తగదటుగాన నాతనిదేవి మాయఁ, బొగడొందఁ గొనితెరఁ బోవుచునుండి
యలవడ నొకయుపాయము గంటి నేను, దలకొన్న నది నాకుఁ దగిలి సిద్ధించు
నడరెడుకడఁకతో నాపర్ణశాల, కడకేగి మాయామృగంబవై నీవు
చెలఁగుచు వర్తింప సీత నిఁజూచి, మెలుపొంద రామసౌమిత్రులఁ బిలిచి
నినుఁ బట్టి తెమ్మన నీవును వారిఁ, గొనిపోయి మృగవృత్తిఁ గుశలత మెఱసి
పోయి దుర్దాంతరంబుల గాడుపఱచి, మాయమై నీయాశ్రమము వచ్చి చొరుము
ఏనును జానకి నిట లంకలోని, కూనినవేడ్కమై నొగిఁ దెచ్చుకొందు
నారామునుడును విరహాగ్నిచేఁ గుందుఁ, గోరి యేనును గోర్కి కొనసాగియుందు
నిది యిట్ల కావింపు మేను నారాజ్య, పదవిలో సగఁబాలు పంచి నీకిత్తు
ననవుడు మారీచుఁ డానీచుఁ జూచి, ఘనభీతి నెంచి శోకసముద్రవీచి

మారీచుఁడు శ్రీరామునిప్రభావముఁ దెల్పుట.

మునిఁగి మూర్ఛిలి లేచి మోమోట ద్రోచి, దనుజేశ మఱియు నీతలఁపెట్టు పుట్టెఁ
గూడునే యిటు పల్కఁ గోరి యీత్రోవ, యోడక నీకెవ్వఁ డుపదేశమిచ్చె
సుకసుకంబుననుండి సుతసోదరాది, సకలబాంధవులతోఁ జావఁ గోరెదవు
కటకటా యెవ్వనిగాఁ జూచినావు, కుటిలరాక్షసలోకకులభీముఁ రాము
నేను బాల్యంబున నెఱుఁగుదుఁ గొంత, యానిత్యకల్యాణుఁ డసమసాహసుఁడు
అడరి విశ్వామిత్రుయాగంబు గావఁ, గడగి యాతఁడు వచ్చి కాపున్నచోట
బలిమిమై నేను సుబాహుండు పోర, నలుక సుబాహు నొక్కమ్మునఁ ద్రుంచె
నొకకోలఁ బుచ్చి పయోధిమధ్యమునఁ, బ్రకటితగతి నన్నుఁ బడవైచె నుఱక
నక్కశాస్త్రుఁడై బాలుఁడై పిన్ననాఁడె, యకలంకుఁ డిట్టి శౌర్యముఁ జూపినాఁడు
నేఁ డస్త్రబలశౌర్యనిధిరామచంద్రు, వాఁడిమిఁ జెనకి యెవ్వరు నిల్చువారు
ఇప్పటిశౌర్యంబు నెఱుఁగుదు కొంత, తప్పక విను ముగ్రదానవాగ్రణుల
నిరువురతోఁ గూడి యేఁ బూర్వరోష, భరమున వ్యాఘ్రరూపముఁ దాల్చి యేచి

తపమునఁ గృశుఁగాఁగఁ దలఁచుచుఁ బోవ, నప్రుడేమిచెప్ప మూఁడంబకంబులను
ముగ్గురినేసిన మ్రొగ్గి యిచ్చఅును, మ్రగ్గి రాయు శ్లేషమహిమ మెట్టిదియొ
యే నొక్క-విధమున నిక్క-డఁ గూలి, ప్రాణంబు లుండుటఁ బట్టి చూచుకొని
యంతనుండియు రామునతులవిక్రమము, చింతించి నాలోనిచెవఁ బోవిడిచి
రవమన్న రథమన్న రమణీయమన్న, రవియన్న రతియన్న రత్నంబులన్న
మఱియు రేఫాదినామము లెవ్వి విన్నఁ, దఱుచైనభీతి నాతనిగ నెన్నుచును
ఈవిధిఁ దపసినై యిట్లున్న వాఁడ, రావణ యెఱుఁగవు రాముపౌరుషము
తలఁపక తరరోత దలఁప కింతయును, నలిమాఱి మనఃపూర్ణభయ తాఁబోయి
యనుపమగుణధాము నభిరాముఁరాముఁ, గనుఁగొని యీరీతి కామింపఁదగునె
తనకు నీవేషంబు తానె కావించికొనియె నిందుకు మఱిఁ గ్రోధించి పోయి
పరుషత రఘురాముబాణాగ్నిశిఖల, ఖరదూషణాదిరాక్షసులు నీవైరి
వీరికై నీవేల విపరీతబుద్ధి, శ్రీరాముఁ బగఁగొని చెడఁ దలంచెదవు
ఇది విచారంబుగా దిది బుద్ధిగాదు, ఇది నీతిగా దింక నీతలం పుడుగు
నీవు లంకకుఁ బోయి నెమ్మదినుండు, పోవ రామునిచేతఁ బోవుఁ బ్రాణములు
ఏను నీకపకార మెన్నఁడుఁ జేయ, నే నేమి చెప్పిన హితముగాఁ గొనుము
ఒచ్చె మెంచకఁ గార్య మొనరించితేని, యిచ్చెద రాజ్యార్ధ మీవంటివిభుడు
చెచ్చెర రఘురాముఁ జెనకి యే బ్రతికి,వచ్చుట కిందు కెవ్వఁడు పూట చెపుమ
యని యిట్లు మారీచుఁ డాడువాక్యములు, విని రావణుఁడు క్రోధవివశుఁడై పలికె
లోకైకభర్త త్రిలోకభీకరుఁడ, నా కెక్కు-డని యొకనరునిఁ జెప్పెదవు
కడుఁ బ్రాణభయమునఁ గారులాడెదవు, విడువక నాకొక్క-వెఱపు చెప్పెదవు
నన్ను రాజనుచు మనంబునఁ గొనవు, చిన్నఁబుచ్చెద వేను జెప్పినపనులు
నీ వేమిటికిఁ దోడు నినుఁ దోడు వేఁడ, నీవిధివచ్చెనే యిప్పుడు నీకు
నని చంపఁ దొణఁగిన నతనిరోషంబు, కనుఁగొని మదిలోనఁ గడువిచారించి
మారీచుఁ డీనీచమరణంబుకంటె, నా రాముచేఁ జచ్చుటది యొప్పుననుచు
దనుజాధిపతిఁ జూచి తగునీతి నీకుఁ, గొనకొని చెప్పినఁ గోప మేమిటికి
మఱి బుద్ధిచెప్పిన మంత్రులఁ బట్టి, నఱకఁ దలంచు భూనాయకుల్గలరె
నీవేమిచెప్పిన నీచెప్పినట్లు, గావింపఁగలవాఁడఁ గడమట్ట ననఘ
నసురాగమునుబొంది యతని మన్నించి, తనరథం బెక్కించి తద్దయుఁ బ్రీతి
నసమానవేగుఁడై యతఁడును దాను, నసురాధిపతి వచ్చె నటఁ బంచవటికి
అట్టిదకాదె కామాతురబుద్ధి, యెట్టును జెడుత్రోవనే పడఁద్రోయు
నాయెడ నూరిచుఁ డరదంబు డిగ్గి, యాయసురాధిపుఁ డపుడు ప్రార్థింప
మాయావిగాన నమానుషమహిమ, మాయామృగాకృతి మదివిచారించి
మేలైన కనకంబుమేనును రుచిర, నీలనీలాయతనేత్రయుగ్మంబు
పవడంపుబొమలును భాసిల్లు వజ్ర,నివహకర్ణంబులు నీలవాలములు
పొలుచు పచ్చనిశృంగములు ముత్తియంబు, తొలుకుల రత్నబిందువులైనపొడలు

రాజిల్లు నవపద్మరాగోదరంబు, రాజితఖురములు రమణమై యమర
జగతిపై రోహణాచల మొప్పు మిగిలి, మృగరూపమైవచ్చి మెలఁగుచున్నదియొ
కాదేని రాక్షసక్షయముఁ గావింప, నాదట చింతించి యబ్జసంభవుఁడు
మెఱుఁగులెల్లనుగూర్చి మృగముగాఁజేసి, కఱటియై పుత్తెరఁగా వచ్చినదియొ
జానకినెఱివేణి శక్రనీలములు, నానాతిదంతంబు లాణిముత్యములు
భామినికెమ్మోవి పవడంపులతలఁ, గామినిచెక్కులు కడిమివజ్రములు
వై దేహితనుకాంతి వైడూర్యమణుల, నా దేవినూగారు హరితరత్నములు
భామపాణిద్యుతుల్ పద్మరాగములఁ, గోమలిముఖకాంతి గోమేధికములఁ
బటుతేజమున చాలఁ బ్రహసించుటయును, నటుల గీడ్పడివచ్చి యఖిలరత్నములు
రత్నగర్భత్వజారత్నంబు నలఁప, యత్నంబుతో మృగంబై వచ్చినవియొ
సీతకై తనవిల్లు చేకొని విఱిచె, నీతఁడె రఘురాము నెలయింతు ననుచు
హరుఁడిచ్చు పుత్తెరఁగా నాతనిచేతి, హరిణ మిచ్చోటికై యరుదెంచినదియొ
సీతమోమున కోడి సీత భ్రమింప, శీతాంశుఁ డనుప వచ్చినమాయలేడొ
యని చిత్రవర్ణంబు లైనదీధితులఁ, బెనఁగొని యందందఁ బేర్చి శోభిల్లఁ

మారీచుఁడు మాయామృగరూపధారియై వచ్చుట.

గఘటసారంగమై కదియ నేతెంచి, యుపమింప నరుదైనయొప్పుల నొప్పి
శుకుచుఁ బులుమేయు నిజవాలరుచుల, రమణమై వనమయూరముల నాడించుఁ
దఱుమిడి యొకమాటు తనపార్శ్వరుచుల, బఱపైన వనమెల్లఁ బసిఁడిగావించుఁ
గుదియక యొకమాటు కుప్పించి దాఁటి, త్రిదశేంద్రచాపంబు లెఱుఁగుగావించు
నొకమాటు చెంగున నుప్పరం బెగసి, ప్రకటించు నతులశంపాలతారుచులఁ
దఱిగొని యొకమాటు తనపార్శ్వరుచుల, నెఱిచంద్రకాంతముల్ నీరుగావించు
మృగయూథములఁగూడి మెలఁగుచు మేయ, మృగములఁ బెదరించు మెల్లనెడాగు
నంతంతఁ బొడచూపు నటఁ జేరవచ్చు, నంతలో బెదరి చుట్టదరి కుప్పించుఁ
దరులనీడలకుల్కుఁ దగఁ బర్ణశాల, జొరబాఱునంతనె స్రుక్కి క్రేళ్లుఱుకు
వసుధ మూర్కొనిచూచు వాల మల్లార్చు, దెసలకుఁ జెవిచేర్చు దెలియనాలించుఁ
గంచుమించై పాఱఁ గ్రమ్మఱఁ జేరుఁ, గుంచితాకృతిచెవికొనఁ గదలించుఁ
బచ్చికపట్లపైఁ బవళించి లేచు, మచ్చిక నచ్చోట మానులఁ జేరు
ఖురములఁ జెవిగోకుఁ గొమ్ములతుదల, విరులతీఁగె గదల్చి విరులెల్ల రాల్చు
నందంద నందమై యాపర్ణశాల, ముందట మృగ మిట్లు మోదించుచుండె
నావేళ సీతయు నలరులు చిదుమ, లావణ్యశీల యల్లన పర్ణశాల
మంజుళ శింజానమంజీరరవము, రంజిల్ల వెడలి సౌరభములఁ బొదలు
పొదలఁడాయుచు విరుల్ పొసఁగఁ గోయుచును, మదికి విస్మయమంది మాయంపులేడిఁ
గనుఁగొని వైదేహి కడుఁ జోద్యమంది, యినకులాధిపుఁ జేరి యిట్లని పలికెఁ
జూపుల కింపారఁ జొంపు గల్పింప, నేపారి యున్న దిదేమి చోద్యంబు
నీపొంత వింతయై యిదియొక్కమృగము, భూపాల చూచితె పొదలుచున్నదియు

నెన్నఁడుఁ బొడగాన మిన్నిచందముల, వన్నెలమృగముల వనభూములందు
జగతీశ యీమృగచర్మంబునందుఁ, దగిలి సుఖింప నెంతయు వేడ్క పుట్టె
దిననాథకులనాథ దీని వెఱ్ఱిదగిలి, చని వేసి వెస దీనిచర్మంబు దెమ్ము
అదియేల నీయుపాయంబున దీని, చెదరక పట్టి తెచ్చెద వేని మిగుల
మంచిది ప్రాణేశ మనవనవాస, మెంచఁగ నిచి తీర్చె నీవైఁడిమృగముఁ
బురికి వేడుకఁ గొనిపోయి యత్తలకు, భరతాదులకు వేడ్కపఱుపంగవచ్చు
నని సీత ప్రీతిమై నాడువాక్యములు, విని లక్ష్మణుఁడు రామవిభుఁ జూచి పలికెఁ
మృగరాజునకు నిట్టిమేను లేదుర్వి, మృగమాత్రమున కిట్టిమే నెందుఁ గలదు
మాయామృగము దీని మఱి నమ్మఁ దగదు, మాయావులసురలమాయ గానోపు
నదిగాక యిచటిసంయములు మారీచుఁ,డదయుఁడై మాయావియై యిందు మెలఁగు
నని పల్క వినమె యాయసుర గాఁబోలు, మనల భ్రమింప నీమాఁక్కి నే తెంచెఁ
జిత్తంపు దీనిపైఁ జేరిచి మీర, లుత్తలపడి పట్ట నూహింపవలదు
ఆరయ వైదేహి యతిముగ్ధయైన, మీరలు ముగ్ధలే మేదినీనాథ
యనిన రాముఁడు సీత యాననాంబుజము, కనుఁగొని నవ్వి లక్ష్మణుఁ జూచి పలికెఁ
జలియింపనేటికి సౌమిత్రి యింత, యిల రాక్షసులమాయ లెదురునే నన్ను
మృగమేని కొనివత్తు మేటిరక్కసులఁ, దెగ నేను పోలివుత్తుఁ దెలిసి యీరెండు
మగుడ నెక్కడఁబోవు మాయామృగంబు, దెగువమై లక్ష్మణ దీని వెఱ్ఱిదగిలి
చంపి చర్మముఁ దెచ్చి జానకి కిత్తు, నింపార లక్ష్మణ యిప్పుడే దీని
యిన్ని నాళ్లకు సెల వీకోర్కి వేఁడఁ, జిన్నఁబుత్తునె సీత చెప్పినచేత
హితమతివై పూని యీపర్ణశాల, నతివ నేమఱుకు మీవని యొప్పగించి
యల్లన రఘురాముఁ డనుజుచేనున్న, విల్లంది మోపెట్టి వెరవొప్పఁ గదలి
యాగమృగంబు మున్నర్థి వెన్కొనిన, యాగజాసురవైరి యనఁ జెన్నుమిగిలి
కొంకుచుఁ బొదమఱుంగునఁ బొంచి పొంచి, క్రుంకుచు నంతంతఁ గూడ దాఁటుచును
మగిడి చూచుటయును మఱుగున నిలిచి, తగులున బట్టంగఁ దమకమందుచును
విల్లు నమ్ములు వెన్క వ్రేలిచి పట్టి, యల్లన చరణంబు లవనిపై నిడుచుఁ
జప్పుడుగాకుండఁ జనుచుఁ బట్టుటకుఁ, జొప్పుడు నొప్పను జూచి డాయుచును
నదె చేరి పట్టెద నదె చేరె ననుచు, నదియె లోఁబడియె నాకని చెలంగుచును
నివ్విధంబునఁ బోవ నేచి యామృగము, దవ్వులఁ బొడచూపుఁ దనుఁ జేరవచ్చుఁ
బట్టఁబోయిన మిట్టిపడి పాఱిపోవుఁ, గట్టల్ల రాముని గన్నంత నిలుచుఁ
బలుదెసలకుఁ బాఱు బాళితోఁ గూడి, సెలవుల పులురాల్చుఁ జేష్టలు మాను
నెసఁగి వీక్షింపఁ బై కెగసి క్రేళ్లుఱుకుఁ, బసమించి మిన్నులపైఁ బాఱుచుండఁ
గుప్పించి దాఁటుఁ జెంగునఁ దీఁగమెఱుఁగుఁ, ద్రిప్పినగతి జిహ్వాద్రిప్ప నందంద
కొఱవిద్రిప్పినరీతిఁ గుమ్మరిసారె, తెఱఁగున బ్రమసి దిర్దిరఁ దిరుగుచును
బడలినగతి మ్రొగ్గుఁ బజ్జ కేతేర, వడి సాళువంబుకైవడి మింటి కెగయు
నలసి రాముఁడు వెఱఁగంది నిల్చుటయుఁ, గెలఁకులఁ బొడచూపుఁ గికురించి మెలఁగుఁ

దెగియేయఁ దలఁప నదృశ్యమైపోవు, మగిడిరాఁ దలఁచిన మఱి మ్రోల నిలుచుఁ
గలగొని యీభంగిఁ గాకుత్స్థముఖ్యు, నలయించి యలయించి యవలకు నవలఁ
గొనిపోయి పోయి యాఘోరదుర్గములఁగనుఁబ్రామి యటఁబోవ గడఁగినఁ జూచి
మాయామృగంబని మఱి రాముఁ డెఱిఁగి, దాయ నీవెక్కడ దప్పిపోయెదవు

మాయామృగము రామునిచేఁ గూలుట.

ఎగపడితంచు బ్రహ్మాస్త్రంబు దొడుగ, నగములు వడఁకెఁ బన్నగభర్త దలఁకె
జగములు బెదరె దిక్చక్రంబు లదరెఁ, దెగఁగొని దృష్టి సంధించి యేయుటయు
నాలోన నొఱలుచు నారూప ముడిగి, హాలక్ష్మణా యనునార్తరావమున
దెసలద్రువఁగ మహాదీర్ఘదేహమున, నసువులు పెడవాసి యసురయై పుడమిఁ
గూలె రాక్షసలక్ష్మి గూలె రావణుఁడు, గూలె లంకాపురి గూలె నన్నట్లు
అంత మాయామృగ మవనిఁ ద్రెళ్లుటయు, సంతోసమున దాని జానకీవిభుఁడు
గనుఁగొని మారిచుఁగా నిశ్చయించి, తనతమ్ముమాటలు దలఁచి మెచ్చుచును
సౌమిత్రి సీత యీచపలరాక్షసుని, యీమహారవమున కెంత వేఁగెదరో
యని తలంకుచునుండ నాయార్తరవము, విని సీత భీతిల్లి వెస నుర్వీ ద్రెల్లి
తెలిసి దిక్కులు చూచి ధృతి దీఱ డించి, లలిఁ దూలి యెలుఁగెత్తి లక్ష్మణుఁ జూచి
సౌమిత్రి యిది యేమిచందమో నేఁడు, రాముఁడు నిన్నార్తరవమునఁ జీరె
ననఘ నీవాపలు కాలింపలేదు, వినవొల్లవో కాక వినరాదొ నీకు
నులుకవు భీతిల్ల వొకకొంత గలఁగ, వలయవు శోకింప వదియేమి నీవు
నానావిధంబుల నాయంతరంగ, మూనినవగలఁ బెల్లుడుకుచున్న దియు
నడవులకొంటిమై నటు పోయినాఁడు, తడవాయె రాఁడు యుద్ధంబున నేఁడు
కడిఁది రక్కసుల కెక్కడఁ జిక్కినాఁడొ, తడయక పోవన్న ధరణీశు వెదుక
నని యశ్రుపూరంబు లందందఁ దొరఁగు, జనకనందనకు లక్ష్మణుఁ డిట్టులనియెఁ
దల్లి నీవేటికిఁ దలఁకెదు రామ, వల్లభునకుఁ గీడు వచ్చుట లేదు
ఎఱుఁగవే నీకుఁ గూర్మిహృదయేశుమహిమ, లెఱిఁగి యీవెడమాట లిట్లాడఁదగునె
నివ్వటిల్లెడివగ నిన్నింత గలఁప, నెవ్వఁడో రాక్షసుం డిటు చీరెఁగాక
యినకులాధిపుఁ డేడ నీదైన్యమేడ, జనకజ నీవేల చంచలించెదవు
దలమీఱఁ బో రఘురామధరణీశుఁ దొడరి, పొలియక నిలుతురే పోర రాక్షసులు
మిడుతలు కార్చిచ్చుమీఁద గర్వించి, పడి నిల్వనేర్చునె భస్మంబుగాక
కావున రామాజ్ఞఁ గడఁచి నిఁ డించి, పోవఁజూచుట నాకు బుద్ధిగా దింక
నీకానలోపల నే డించిపోవ, నేకీడు వచ్చునో యే బోవ వెఱతు
నలయక నామాట లాత్మలో నమ్ము, తలఁకకు మనవుఁడు ధాత్రీతనూజ
యొలసినకోపాగ్నులొగి మండుచుండ, నలయుచు సౌమిత్రి నటుచూచి పలికె
నీవు రామునిదెస నెఱయ భక్తుఁడవు, నీవేల నేఁడింత నీచుండవైతి
శ్రీరాముఁ డిట నిన్నుఁ జీరుట వినియు, దారుణమతిఁ బగదాయచందమున
నెమ్మది నున్నావు నీకిది దగునె, తమ్ముఁడు ప్రాజ్ఞుఁ డుత్తముఁ డీతఁడనుచు

భూపతి నిను నమ్మి పోయినచోట, నీపాపవర్తన మేల కైకొంటి
వగునెఱింగితి రాముఁ డసుపులచేతఁ, దెగుట నిక్కముగాఁగఁ దెలిసి నీవర్ధి
నసుచితమతిఁ బూని యాలస్య ముడిగి, ననుఁబొందఁ దలఁచెదో నాన వోపిడిచి
కాదేనిఁ గొనిపోయి కైకేయి సుతుని, కాదట నొప్పింతునని తలంచెదవొ
ఏను నాదగుజీవ మిశరీరమునఁ, బూనఁదలంచుట బుద్ధిగా దింకఁ
దడయకపోయి గోదావరిలోనఁ,బడి ప్రాణము ల్విడ్తుఁ బలుకు లింకేల
యని బెడిదపుమూట లవనిజ వలుక, విని లక్ష్మణుఁడు చాల వేదనఁబొంది
రాముఁ బేరొక్కని కర్ణరంధ్రముల్ మూసి, దీనసంబున నాల్గుదిక్కులు చూచి
తెలియ వింటిరె వనదేవతలార, పలుమఱు పాపముల్ పలుకుచున్న దియు
మిఱుఁదఱుసు సాక్షి మేదినీతనయ, ఘోరభాషల నన్నుఁ గ్రూరతఁ బలికె
నని బొప్పలోచనుండై లక్ష్మణుండు, తనమది నిఁక నిల్వఁ దగవుగా దనుచుఁ
దల్లి యే నిదెపోయి తడయక నీదు, వల్లభుఁ గొనివత్తు వగవకు మనుచుఁ
బర్ణశాలకుఁజుట్టుఁ బరులేడు వ్రాసి, వర్ణించి యీబరుల్ వడిదాఁటకమ్మ
ఎవ్వఁడే నీబరుల్ వెసదాఁటివచ్చు, నవ్వీరవరుతల లవియు నాశ్రమ మె
యనిపల్కి యనలుని నపుడు ప్రార్థించి, వనిత నేమఱుకు నీవని యొప్పగించి
జగతీతనూజకు సద్భక్తి మ్రొక్కి, పొగలుచు రాముచొప్పునఁ బోయె నంత
నత్తఱి రావణుం డరుదార వేచి, యత్తలంబునఁ జిత్త ములుకుచునుండఁ

రావణుఁడు భిక్షుకవేషధారియై సీతాదేవియొద్ది కేతెంచుట.

గరమున దండంబు ఘనకమండలువు, నురులలాటంబున నూర్ధ్వపుండ్రంబు
కొలఁదులౌ వ్రేళ్లను గుశపవిత్రములు,పొలుపొందువేరురంబున జన్నిదములు
నరుదార వలకేల నక్షమాలికయు, సరిఁబూనియున్న కాషాయవస్త్రములు
తులసిపూసలవేర్లతోడ ముందఱికి, వలనొప్ప నొకకొంత వ్రాలినమెడయు
బడుగుదేహంబును బొవలు చింపి,గొడుగును వెడముడిగొన్నట్టి శిఖయు
నలవడఁ గపటసన్న్యాసివేషంబు, విలసిల్ల వెడవెడ వ్రేళ్లెన్నికొనుచుఁ
గొన్నిమంత్రంబులు గొణుగుచు మునులు, తన్నెఱుంగెదరని తత్తఱించుచును
దలకొన్నముదిమిచేఁ దలవడంకంగ, నలయుచు నొలయుచు నసుయసు రసుచు
నంతంత నిలుచుచు హరిహరి యనుచు, శాంతిఁ బొందుచుఁ బర్ణశాల కేతెంచు
తనుఁజూచి వనదేవతలు జగద్భీహి, చనుదెంచె వీఁడని సభయులై యొదుగ
నిక్కపుమునివోలె నిలిచినఁ జూచి, యక్కటాత్తు సంయమిఁగాఁగఁ దలఁచి
గ్రక్కున వైదేహి కడుభక్తి మెఱసి, మ్రొక్కి హస్తాంబుజంబులు ముకుళించి
సౌమిత్రి వ్రాసిన చక్కనిబరులు, నమరంగఁ గడఁచియు నతిభక్తితోడఁ
బొలఁతి యభ్యాగతపూజ గావించి, కలఁగుచు నట్లున్నఁ గల్యాణిఁ జూచి
యోభామ నీవిట్టియుగ్రదుర్గముల, నేభంగిఁ జరియించె దిట్లొంటి నిలిచి
రతివొ శ్రీసతివొ భారతివొ కాకున్న, క్షితి మర్త్యసతుల కీచెలువంబుగలదె
నీమోము పండువెన్నెలపిండుఁ దెగడు, నీమోవి కెంపుఱానిగ్గులఁ దెగడు

నీమేను సౌదామినీలతఁ గాదు, నీమాట సుధతేటనీటులఁ దేరు
నీవేణి జలదవేణికలఁ బోఁదరుము, నీవిలాసంబు వర్ణింప నాతరమె
తరుణి నీకౌఁగిటఁ దవిలి సుఖించు, పురుషుఁడే తలపోయఁ బురుషోత్తముండు
కామిని నీపొందుగలవాఁడె పూర్ణ,కాముఁ డాతఁడు నిత్యకల్యాణుఁ డరయ
నిచ్చట నీయున్కి కెంతయు వగపు, నచ్చెరువయ్యెడి నజ్జాఱి మాకు
నెలఁత నీవెవ్వరు నీవేల యింత, నలఁగెద వికారనములోన నిలిచి
యంతయు నెఱిఁగింపు మనిన నాసీత, యెంతయు భక్తితో నిట్లని పలికె
ననఘాత్మ రఘురాము నతివ మాతండ్రి, జనకుండు దశరథేశ్వరుఁడు మామామ
నావేరు సీత యున్నతకీర్తి రామ,భూపతి తమతండ్రి పొమ్మన్న వెడలి
కాననంబులనుండఁ గడఁగివచ్చుటయు, నేను లక్ష్మణుఁడు తోడేగుదెంచితిమి
ఈయాశ్రమంబున నేము ముప్పురము,పాయనినియతిఁ దాపసుల మైయుండ
నొలసి మాముందఱ నొకపైడిమృగము, పొలయుచుండఁగఁ జూచి భూనాథుతోడ
దాని నాకేగతినైనఁ దెమ్మనినఁ, బూని రాముఁడువోయెఁ బోయినపిదప
హాలక్ష్మణా యనునార్తరావంబు, శూలమై నాచెవి సోఁకి గాడుటయుఁ
బొగిలి లక్ష్మణు నేను బొమ్మన్నఁబోయె, మగిడిరాఁ డిదియేమి మాయయో యెఱుఁగ
ననిపల్కి మునిఁ జూచి యనఘు నీవేరు, వినుపింపు మిందేలవిచ్చేసి తనినఁ
గొంకక తనదైనకుహకత్వ ముడిగి, లంకాధినాథుఁ డాలలన కిట్లనియె
వనజాక్షి విను మేను వనధిమధ్యమున, నెనయ లంకాపుర మేలెడివాఁడ
రాక్షసాధిపుఁడ విశ్రవసునందనుఁడ, యక్షేశుననుజుండ నఖిలదిగ్జయుఁడ
రావణుం డనువాఁడ రణములోపలను, దేవాసురులనైనఁ దెగటార్చివైతు
వనిత నీరూపలావణ్యసంపదలు, విని చూడవచ్చితి వేడ్కలుప్పొంగ
నవయుచుఁ బేదమానవునితోఁగూడ, నువిద నీకడవుల నుండనేమిటికి
నారాజ్యమంతయు నలినాయతాక్షి, కోరి యేలుచు నీవు కొమరుదీపింపఁ
బొగడొందుపెనుపునఁ బుష్పకంబొది, యగువిమానములందు హర్మ్యంబులందు
సురగరుడోరగాసురసిద్ధసాధ్య, వరకన్యకలు గొల్వ వర్తింతుకాక
నీయంఘ్రిరుచులు నానిలయభూములకు, మాయనిమణికుట్టిమము లగుఁగాక
చెలియ నీచూపులసపలు నామేడఁ, గలువలతోఁ జాలఁ గలహించుఁగాక
నీమందహాసంబు నిత్యంబు నాదు, ప్రేమాంబునిధికిఁ జంద్రికలగుఁగాక
రమ్ము నాలంకాపురంబున కనుడు, నమ్మాట విని సీత యతిభీత యగుచు
ధీర గావున వానిఁ దృణముగాఁ జూచు, తీరునఁ దనచేతితృణము చూచుచును
సాపతివ్రతాచారగా యనక, యోరి నన్నిటులాడ నుచితమే నీకు
ననిమిషయోగ్యపూర్ణాహుతి శునక,మునకు దుర్లభమైనహోల్కి భావింప
శ్రీరామచంద్రునిఁ జెందిననన్నుఁ, గోరి కామింప నీకును నెన్నితలలు
పొమ్ము గుట్టున నీదుపురవరంబునకు, నెమ్మదిఁబోక దుర్నీతి నేమేని
దలఁచితివేని నాథవుఁడు రాఘవుఁడు, విలసితశస్త్రాస్త్రవిదితలాఘవుఁడు

హరచండకోదండహరణవినోది, ఖరదూషణాదిరాక్షసశిరశ్ఛేది
నిన్ను నీవంశంబు నీఱుఁగావించు, నెన్నఁగ నీకు నాయినకులాగ్రణికి
నక్కఁకు సింహంబునకును దోమకును, దిక్కరికిని బయోధికిని గాల్వకును
వాయసంబునకును వైనతేయునకు, నేయంతరము పెద్దలేర్పఱించుదురొ
యాయంతరముగల దటుగాన నీవు, ధీయుక్తి లంకకుఁ దిరిగిపొమ్మింక
నన విని రావణుం డాగ్రహోదగ్ర, జనితోగ్రదృష్టియై జానకిఁ జూచి
యనుపమాటోపుఁడై యారూప ముడిగి, తనమనోవీథిఁ గందర్పుండు వెలుఁగఁ
బదియవస్థలు దోఁచి భాసిల్లుపగిదిఁ, బదితలల్ మణిజూటపంక్తులనొప్ప
నాయవస్థలఁ గోర్కులవి యిన్మడింపఁ, బాయనిగతినొప్ప బాహు లిర్వదియుఁ
గొన లిన్మడింపఁ గోర్కులు పల్లవించె,ననఁ బద్మరుచులైన హస్తంబు లొప్ప
లలిదోఁచుకోర్కి పల్లవముల బుప్ప,ములఁబోలు నాయుధంబులు పొల్పుమిగులఁ
బరఁగ దివ్యాంబరాభరణౌఘకాంతు, లరుదార మదనాగ్నులై మండుచుండ
నతిభీకరాకారుఁడై నిల్చుటయును, ధృతి దూలి సీత భీతిల్లి మూర్ఛిల్లి
వడిగాలిఁ బడియున్న వనలతవోలెఁ, బడియున్నఁ గనుఁగొని పజ్జికంధరుఁడు
గ్రమ్మి యశ్రువులొల్క గౌఁదిగయుల్కఁ,గ్రొమ్మిడి ముడివీడఁ గుచము లల్లాడ
నందంద దెగి రాల హారరత్నములు, పొందిన భయశోకముల మేనువడఁక
నచ్చారులోచన నదయుఁడై యెత్తి, తెచ్చి రథంబుపైఁ దెఱఁగొప్పఁబెట్టి
వైవంబు ప్రేరేపఁ దనపాలిమృత్యు,దేవతఁ గొనిపోవు తెఱఁగు దీపింప
నమరారి గొనిపోవ నాకాశవీథిఁ, గమలలోచన దేరి కనువిచ్చి చూచి
పెదవులు దడపుచు బిగిచన్ను దోయిఁ, బ్రిదిలిన పయ్యెద బిగియఁ జేర్చుచును
నెలుఁగెత్తి కొదమకోయిల గూసినట్లు, పలుమాఱు విధి దూఱి ప్రాణేశుఁ జీరి

జానకి శోకించుట.

యలతయుఁ గోపంబు నతివిషాదంబు, వెలవెలపాటునై విలపింపఁదొడఁగె
నోరాఘవేశ్వర యోరామచంద్ర, నీరజహితవంశ నీదేవి నన్ను
ననదచందంబున నక్కటా యిపుడు, గొనిపోవుచున్నాఁడు కుటిలరాక్షసుఁడు
వేవేగ చనుదెంచి వీని మర్దించి, కావవె నాలజ్జ కావవే నన్ను
నేలరా రాక్షస యీనింద నీకు, నీలంక నేలరా నీవె కాల్చెదవు
తగదురా నీకు నీదారుణక్రమము, దెగటార్చురా నిన్నుఁ దివిరి రాఘవుఁడు
కనకమృగము నేల కనుఁగొంటి నేను, నినవంశవల్లభు నేల పొమ్మంటిఁ
గాదన్నపలుకేల కైకొననైతి, మేదినీవిభుఁడేల మృగము జేబోయె
జగతీశులావేల చర్చింపనైతిఁ, బొగిలి లక్ష్మణు నేల పొమ్మంటిఁ దిట్టి
నాపాలివిధి యేల ననుఁబోవనిచ్చు, నీపల్కు లేటికి నిటునేయకున్న
నన్న లక్ష్మణ నిన్ను నభిమానధన్యుఁడ, గన్నతల్లిగ నన్నుఁ గరమర్థి నెన్ను
నున్నతగుణమాన్యు నుదితసౌజన్యు, నన్ని తెఱఁగుల నాడినఫలము
గుడిచితి వేవేగ కోపంబుననచ్చి, కావవే నన్ను

నక్కటా కైక నీవడిగినవరము, లిక్కడఁ జేకూరెనే యిటమీఁద
నీకుమారుండును నీవునుగూడి, యే కాతపత్రత నేలుఁ డీవసుధ
నని రామవిభుఁజీరి యనురేశు దూఱి,తనశాంతి బొగడి యాదైవంబుఁ దెగడి
కాకుత్స్థులకు లక్ష్మణుఁ గొనియాడి, కైకఁ బోనాడి శోకంబున మఱియు
మిధిలేశుకూఁతుర మేదినిఁ బంక్తిరథునకుఁ గోడల రామునిదేవి
వలఁతులై కావ నెవ్వరులేనిచోటఁ, బొలదిండి చెఱుఁగొనిపోవుచున్నాఁడు
తరులార నాసహోదరులార మీరు, ధరణీశ్వరునితోడఁ దగఁజెప్పరయ్య
సురలార మీరైన సురవైరిఁ దాఁకి, వెరవొప్ప నాచెఱ విడిపింపరయ్య
నిండినభక్తితో నిన్నాశ్రయించి, యుండితి ననుఁగావ నుచిత మీవేళఁ
దగిలి నీవైన గోదావరీదేవి, జగతీశ్వరునితోడఁ జని తెల్పవమ్మ
ప్రల్లదుచేఁ జెఱఁబడి చిక్కువడితిఁ, దల్లి నీవైనను దగఁగావవలదె
భూదేవి రఘురామభూపాలమణికి, నీదురవస్థపెం పెఱిఁగింపవమ్మ
వీరు వారనక యివ్విధమునఁజీర, నోరెండె ధృతిఁదూలి నొచ్చెఁ బ్రాణములు
ననుఁ గావరయ్య కిన్నరులార పుణ్య,తనులార ఘనులార తాపసులార
కృతులార హితులార ఖేచరులార, వ్రతులార యతులార వనపశులార
కరులార హరులార గంధర్వులార, నరులార సురలార నాగేంద్రులార
యని పెక్కుభంగుల నష్టహీతనయ, పొనుపడి శోకింప భూదేవి వడఁకె
గౌతమి పాఱక గ్రక్కున నిలిచె, నాతఱి సకలభూతాక్రోశ మెసఁగె
నన్యాయ మన్యాయ మని ముసుల్ కపట,సన్న్యాసి రావణుచందంబు దెలిసి
పొగిలిరి శోకాశ్రపూరముల్ దొరుగ, మృగములు వినుచుండి మేతలు మఱిచెఁ
బక్షులు వాపోయెఁ బవనంబు లడఁగె, వృక్షముల్ వాడె నావిలమయ్యె నభము
దిక్కులు పగిలె నాదినమణి నొగిలె, దిక్కేది యని ధర్మదేవత పొగిలె
వనదేవతలు చాల వగచిరి సాధు, జనులెల్ల నేడ్చిరి జానకిఁ జూచి
యత్తఱి విహగేంద్రుఁ డరుణతనూజుఁ, డుత్తమసాహసుం డొకకొండనుండి
యొక్కలుం డగుజటాయువు బిట్టు వినియె, నక్కట రఘురామ యనునార్తరవము
విని సంభ్రమించి నివ్వెఱఁగంది దిశలు, గనుఁగొని మొగమెత్తి గగనంబుఁ జూచి
యదయుఁడై రావణుం డారాముదేవి, పొదివి యిమ్ములఁ గొనిపోవుచున్నాఁడు
నాఁ డీవనంబున ననుఁగన్న మొదలు, పోడిమి ఘనమైత్రిఁ బ్రోచు రాఘవుఁడు
తగదింక వర్జింప దైత్యు నిర్జించి, తెగువమై వైదేహిఁ దెత్తు నొండేని
యినకులాధిపునకు నింకఁ బ్రాణముల, ననిమొన నొప్పింతునని నిశ్చయించి
కులిశంబుధారతాఁకునకు నెభంగి, నలవిగా కెగయు మహాద్రిచందమున
నురుశక్తిమైఁ బెంచి యంకించి యెగసి, పొరిఁబొరి గిరిశృంగములు నుగ్గుగాఁగ
మరలించి పుక్కిటిమాంసఖండములు, ధరణిపై నుమిసి యుదగ్రభావమున
ఖరనఖంబుల నున్నకరిసింహశరభ, శిరము లంతంత కచ్చెరువుగాఁ దొరుగఁ
బటుతుండరోచులు పక్షదీధితులు, చటులకోపాగ్రలోచనములు ధనరఁ

బఱుపొనిలంబులఁ బర్వతాగ్రముల, వృక్షము ల్విఱిగి దిగ్విపరములో నిండఁ
బరఁగు రావణుతమఃపటలంబు నడఁప, నరుదెంచు మధ్యందినాదిత్యకరణి
నాసన్నబలరావణాదిత్యు మ్రింగ, రాసియుగ్రతవచ్చురాహుచందమున
వడిఁబోర్చి కదియు రావణరాహుమ్రింగఁ, దడయక చనుదెంచుతార్క్ష్యనిభంగి
నిలు నిలు నిలు పోకు నిలు పోకు పోకు, నిలు నిలు రఘురామ నృపచంద్ర దేవిఁ
గుటిలరాక్షస యెందుఁ గొనిపోయె దింక, నెటుపోయె నెటుపోయె దెందుఁబోయెదవు
పోయినఁ బోనీను బోనీను నిన్ను, వ్రేయుదు ఖండింతు విదళింతుఁ ద్రుంతు
దండింతు దండింతుఁ దల లుత్తరింతుఁ, జెండు బెండుగ నంచు సీత నీక్షించి
యోడ కోడకు దేవి యుగ్రరాక్షసుని, నీడాడి నీచెఱ నేవిడిపింతు
ననిన నాపల్కు మహానిదాఘమున, వనమయూరికి ఘనధ్వనియనుబోలె
వేడుక కొంతగావింపఁగా నలరి, వాడినమోమునతో వగలఁ గుందుచును
నానీతపల్కు జటాయువా నన్ను, నీసురకంటకుం డెత్తి యుద్వృత్తి
మాయచే రామలక్ష్మణుల వంచించి, యోయన్న కొనియేగుచున్న వాఁ డిదిగో
యనిపల్కు విని యంత నరుణనందనుఁడు, ఘన్నమైనకోపంబు కడిమియుఁ దోడ
నలుకమై రథమున కడ్డంబువచ్చి, ప్రళయాభ్రనిర్ఘోషపటుభాషణములఁ
బలుమాఱు దశకంఠుభర్జించు చలుక, నిలిచి యిట్లనియె నూనినధైర్య మెసఁగఁ
బరమపావనుఁడైన బ్రహ్మమనుమఁడు, వరపుణ్యనిధివిశ్రవసుతనూజుఁడవు
ధనదానుజుండవు దానవాగ్రణివి, వినుమిట్టికృత్యంబు విహితమే నీకు
జగదేకపతి రామజననాథుదేవిఁ, దగదోరి కొనిపోవఁ దగదోరి నీకు
ముదలించి తేక రాముని డాఁగురించి, సుదతి నీభంగిఁదెచ్చుట బంటుతనమె
నీలంకయును నిన్ను నీబంధుజనులఁ, గాలుచు రోరి రాఘవకోపవహ్ని
యెఱిఁగియు విషమిట్టు లేల క్రోలెదవు, ఎఱుగొన్న పెనుఁబాము నేల త్రొక్కెదవు
అఱువదివేలేండ్ల యతివృద్ధు నన్ను, నెఱుఁగుదో యెఱుఁగవో యేజటాయువును
నీపుణ్యసాధ్వి నీవిప్పు డొప్పించి, పోపొమ్ము పోకున్నఁ బొరిపుత్తు నిన్నుఁ

రావణునితో జటాయువు పోరుట

దుండాగ్రమున విల్లు తునుకలుచేసి, మండితవర్మమర్మములు భేదించి
యడరి నీవైన ప్రాణాభిమానములు, విడిపించి జానకి విడిపింతు ననిన
నరదంబు నిలిపి యుదగ్రుఁడై దైత్యవరుఁ డల్గి విలు గుణధ్వనిఁజేసి వేర్చి
ఘోరబాణము లేయఁ గోపించి విహగవీరుఁడు తద్బాణవితతులు విఱిచి
యురుపక్షయుగమున నురము ధట్టించి, పొరి భాలములు చీఱి భుజములు దన్ని
తరమిడి ఖరనఖతతుల నొప్పించిఁ, గరము గోపించి రాక్షసకులేశ్వరుఁడు
ఖగరాజు నెఱకలుగాఁడ నుగ్రంబు, లగుబాణము ల్పది యడరియేయుటయుఁ
దుండాగ్రమున విల్లు తునుకలుచేసి, ఖండించి వడిఁ బతాకలు నేలఁగలిపి
దనుజేశుమకుటముల్ ధరడొల్ల వ్రేసి, పెనఁచి సారథిఁ జంపి ప్రేవులు చీల్చి
తలమీఱి దనుజురథ్యములఁ జెండాడి, చలమొప్ప నరదంబు చదియమోఁదుటయు

విరథుఁడై రాక్షసవిభుఁడు కంపించి, ధరణిపైఁబడి లేచి ధరణిజఁ గొనుచు
మాయాబలంబున మఱి మింటికెగసి, పోయె బోయినఁ జూచి పోనీక వేర్చి
యడ్డగించి జటాయు వాకాశవీథి, నొడ్డినగతిఁ దాఁకి యోరిపాపాత్మ
జుణిగి యేలోకంబుఁ జొచ్చిననైనఁ, దృణముగాఁబట్టి వధింతు నిన్ననఁ
దిరిగి రోషమున దైతేయవల్లభుఁడు, గరముగ్ర మైనముద్గరము వైచుటయు
నది తుండమునఁ ద్రుంచి యతనిమస్తకముఁ, జదియంగనడిచి కేశములు ద్రెంచుటయు
సురవైరి కోపించి స్రుక్కక కడిసి, యురవడిఁ బక్షీంద్రు నొడిసిరాఁ దిగిచి
మొగిఁబట్టి చుందంద ముష్టిఘట్టనలఁ, దగిలి నొప్పించె నుద్ధతశక్తి మెఱసి
దనుజేంద్ర విహగేంద్ర దారుణయుద్ధ, మనిమిషాదులు చూచి యాశ్చర్యపడిరి
యరుదైన కడిమిచే నంత రావణుఁడు, కరముగ్ర మగునట్టి ఖడ్గ మంకించి
యెఱుకలు పదములు నెగసి త్రుంచుటయు, నెఱిఁదూలి ఖగపతి నేలకు వ్రాలె
వ్రాలిన వై దేహి వగ నొక్కవృక్ష,మూలంబు చేరి రాముని బేరుకొనుచు
వాపోవుచుండ రావణుఁ డంకసీమ, నాపరమపతివ్రతాంగన నునిచి
యంత సంతోషించి యాకాశవీథి, నెంతయు రయమున నేగె రావణుఁడు
అప్పుడు బ్రహ్మాదులగుసురల్ మునులు, తప్పక రాముచే దశకంఠుఁ డీల్గు
మనమనోరథములు మనకు సిద్ధించు, ననిచెప్పుకొని యుబ్బిరందఱు ప్రీతి
ననిమిషపథమున కంత రావణుఁడు, చన రయంబున సీతచరణనూపురము
సురవైరి కుత్పాతసూచకం బగుచు, నురువడిఁ జనుదెంచి యుల్కయై పడియె
జగతిపై జాహ్నవి జలధార లొలుకు,పగిది నయ్యాకాశపథముననుండి
చెలువకుచంబులఁ జెందుహారములు, దెలియ కందంద మేదినిఁ దెగిపడియె
నాలోన సీత హాహారవంబంది, లోలోనఁ గడునడలుచుఁ బోయిపోయి
యట ఋశ్యమూకంబు నందు వానరులు, పటుసత్త్వ లేఖరఁ బరికించి కాంచి
తనవస్త్రమునఁ గొంత తగఁ జించి పుచ్చి, తనభూషణంబులు దానె బంధించి
వీరైన రామభూవిభున కీవార్త, లారయఁ దెలుపరే యనుబుద్ధి నపుడు
పడయక రాముచే దశకంఠుఁ డింకఁ, జెడునంచు ముడియు వైచినవిధంబునను
వారిమధ్యంబున వైచుచుఁ బోవ, వారును దాఁచిరి వడిఁబుచ్చి దాని
దనుజాధిపతి యంత దశరథాత్మజులు, తనవెంట వత్తురఁ దల్లడం బొదవ
వెలవెలఁ బాఱుచు వెనుకఁ జూచుచును, దలఁకుచు వడి సముద్రము దాఁటిపోయి
జడిగొన్న మరణసూచకనిమిత్తములు, పొడచూపఁ గని రయంబున లంకఁజొచ్చి
యనుపమ వివిధభోగాస్పదంబైన, తననగరికివచ్చి తగురాజసమున
జనకపుత్రికిఁ దనసకలసంపదలు, మునుకొని యెంతయు ముదముతోఁ జూపి
యివె నానివాసంబు లివె నాథనంబు, లివె నాతురంగంబు లివి నాగజంబు
లివి యేను దివిజులనెల్ల భంజించి, తివుటమైఁ గైకొన్న దివ్యభూషణము
లిదె కుబేరునిగెల్చి యేను గైకొన్న, మదికింపుగావించు మణిపుష్పకంబు
వీరె నాకుడిగముల్ వేర్వేఱఁజేయు, చారణామరసిద్ధసాధ్యకామినులు

వారె నామాట గర్వమునఁ గైకొనక, కారాగృహంబుల గాసిల్లుసతులు
అవె నాట్యశాల లల్లవె క్రీడావనము, లివి చంద్రశాలలో యిందీవరాక్షి
కరమర్థి నింతకుఁ గర్తవై నీవు, నరుదార భోగింపు మఖిలసంపదల
ననవుడుఁ దృణఖండ మతివ చేపట్టి,కొని పల్కెఁ- వానిఁ గైకొనక యెంతయును
యోరి నీ కీపాప మూరకపోదు, ఘోరాగ్నియై నిన్నుఁ గొని కాల్చుఁగాని
నిడివిగాఁ బ్రతుకరు నీవు నీవారు, చెడిపోవఁగలవారు సిద్ధమీపలుకు
రాముబాణానలరాశిలో మునిఁగి, నీమేను వడిఁ గాలి నీయుగాకున్న
ఘనమైన యీపాతకము లెట్లు దీయు, ననిపల్కెఁ- వైదేహి యందందఁ బొగిలి
యిట్టి మద్వాక్యంబు లీవు నాచెవులఁ, బెట్టితి నేఁడు నాపెఁపెల్లఁ బొలిసె

జనకజను అశోకవనమునం దుంచుట.

నామాన మిటుచేసె నన్నింతచేసె, నేమని విలపింతు నింక నావిధికి
నని మహాక్రోదన మందందఁజేయఁ, దనమదిఁ గోపించి దనుజవల్లభుఁడు
తెఱఁగొప్ప నప్పుడు త్రిజటాదులైన, తెఱవలఁ బిలిచి ధాత్రీపుత్రిఁ జూచి
యెందు నేమఱక మీరందఱు గాచి, పొందుగా ననుఁబొంద బోధింపుఁ డనుచు
నెనసినకడఁక నియ్యింతి నశోక,వనములో నిడుకొని వర్తింపుఁ డనుచుఁ
బనిచి కాఁపులువెట్టి పంక్తికంధరుఁడు, దనమది మదనాగ్నిదగ్ధుఁడై యుండె
మాయామృగముఁజంపి మఱిరామవిభుఁడు, ఆయెడ మఱియొకయన్యమృగంబు
జంపి తన్మాంసంబుఁ జర్మంబు గొనుచు, నింపొంద మరలి తానేతెంచుచోట
మ్రోయుజంబుకరవంబులకుఁ గుందుచును, నాయాసమందుచు నటవచ్చివచ్చి
రామభూపాలుఁ డరణ్యమధ్యమున, సౌమిత్రిఁ బొడఁగని చాల భీతిల్లి
యకట లక్ష్మణుఁడ నాయాజ్ఞ గైకొనక, వికలధైర్యమున వివేకివైయుండి
యత్తన్విసీత నయ్యడవిలో డించి, వత్తురే యిట్లేల వచ్చితి వీవు
జగతిపైఁ గలుగురాక్షసులెల్ల మనకుఁ, బగయాట యెఱుఁగవే పరికించిచూడఁ
గులహాని గుణహాని గురుధర్మహాని, తలపోయవలదొకో తమ్ముఁడ నీవు
అనవిని లక్ష్మణుం డతిభీతిఁబొంది, యనయంబు కంపించి హస్తముల్ మొగిచి
జగతీశ నాకిటు చనుదేరఁదగదు, తగకున్కి యెఱుఁగుదుఁ ద్రైలోక్యనాథ
మాయామృగాకృతి మఱిమిమ్ముఁ ద్రిప్పి, పాయక మీదివ్యబాణాగ్నిశిఖలఁ
గూలుచునుండి యాకుటిలరాక్షసుఁడు, హాలక్ష్మణా యన్న యార్తరావంబు
సీతామహాదేవి చెవిసోఁక మిగుల, భీతిల్లి మీరైన పెంపెల్ల మఱచి
యన్న మీయన్న చొప్పరయఁ బొమ్మన్న, నెన్నఁడు నెఱఁగింపఁ డిదీనవృత్తి
సౌమిత్రి యనవుడు జానకిఁ జూచి, యామహీతనయ కిట్లంటి నేనపుడు
పనివడి మనయందు భయముఁ బుట్టింతు, నని రాక్షసుఁడు క్రూరుఁడై చేరెఁగాక
యినకులాధిపుఁడేడ నీదైన్యమేడ, జనకజ నీవేల చంచలించెదవు
అనవుడుఁ గోపించి యద్దేవి నన్ను, వినరానిపలుకుల వెస దూఱి పఱుక
నేను నామదిలోన నెంతయు వగచి, దానికి వనదేవతల సాక్షిఁజేసి

యిట కేగువచ్చితి నిక్ష్వాకుతిలక, యటుగానఁ దప్పుగా నవధరింపకుము
అని బాష్పలోచనుండై మ్రొక్కియున్న, యనుజుని కరముల నల్లననెత్తి
కనుఁగవఁ దొరఁగెడుకన్నీరు దుడిచి, యనయంబు వగచి యిట్లనియె రాఘవుఁడు
ఆజన్మశుద్ధుఁడై యఖలజ్ఞుఁడైన, యాజనకునిపుత్రియై వార్తకెక్కు-
నాపుణ్యవతియు నిట్లాడుట యెల్ల, నాపదలకు మూలమని విచారించి
నిలువక వత్తురే నీయంతవాని, కలుగంగఁ దగునయ్య యతివమాటలకు
ననుచుసౌమిత్రినూరార్చి యెంతయును, జననాథుఁ డట నిజాశ్రమభూమిఁజొచ్చి
యిదియేమి లక్ష్మణ యీయాశ్రమంబు, తుదముట్ట శూన్యమై తోఁచుచున్నదియు
వనదేవతానందవచనఘోషములు, వినరావు వినరావు విహగనాదములు
ఏలొకో మునివరు లిట సంచరింప, రేలొకొ సీత నాకెదురుగా రాదు
కడుదీనమై బుద్ధి గలఁగెడు నాకు, నెడమకన్నదరెడు నేమొకో నేఁడు
ఇక్కానలోపల నేనును నీవు, నక్కట యేదుఃఖ మనుభవించెద మొ
అని పర్ణశాలకు నటు చేరవచ్చి, దినకరురుచి లేనిదినలక్ష్మివోలి
రేరాజుకళలేని రేయును బోలి, శారికలేని పంజరమును బోలి
యెనయుకోయిలలేని యెలమావిఁబోలి, కనుఁగొన విన్ననై కడువాడఁబాఱి
యున్నచందముఁ జూచి యుల్లంబు గలఁగి, విన్ననై ధృతిఁదూలి వెలవెలఁబాఱి
పన్నిశోకరసంబు ప్రవహించె ననఁగఁ, గన్నులబాష్పాంబుకణములు దొరుగ
బెదవులు దడపుచు భీతిఁ బ్రాణములు, చెదరఁ దమ్మునిఁ జూచి శ్రీరాముఁడనియెఁ
బోలఁజూచితి నేను భూమిజ పర్ణశాలలోపల నున్నచందంబు లేదు
పొదలఁ బూవులుగోయఁ బోయెనో లేక, వెదుక నొండొకజాడ వెడలెనో కాక
సరసులఁ గ్రీడింపఁ జనియెనో కాక, కరముగ్ర మగుభీతిఁ గ్రాఁగెనో కాక
డాసినఫలులకై డాఁగెనో కాక, యీసునఁ గొనియొక్కఁ డేగెనో కాక
యేచందమో నాకు నింతయుఁ దెలియ, దేచందమున సీత యిందులో లేదు
అని వితర్కించుచు నాపర్ణశాలఁ, జనఁ జొచ్చి లోపల సకలంబు వెదకి
జానకి నాపర్ణశాలలోపలను, గానక ప్రాణముల్ కలఁగి కంపించి
మనసెల్ల చెడి మేను మ్రాన్పడి బోధ, మనురవిశోకాబ్ధి నస్తమించుటయు
భ్రాంతియ చీఁకటి ప్రబలమై పర్వి, యంతరంగము గప్పి యక్షులు గప్పి
మరలెడిధృతిఁ గప్పి మానంబుఁ గప్పి, నెరసిన వికలుఁడై నేలకు వ్రాలి
వదలక సీతకై వగచెడి నన్నుఁ, బ్రిదిలిపోనీక నొప్పించె నీవగలు
యీవల నాకిపు డేత్రోవవచ్చె, నేవెంట ధరియింతు నింక నీవగల
నేమెయి వచ్చితి మిక్కాననముల, కేమాటలాడుదు నితనితో నింక
నేనన్న నితనికి నితఁడు నాతమ్ముఁ, డేను నీతఁడుగూడి యెట్లు వ్రేఁగెదము
అని విచారము బుద్ధి నణుమాత్రమైన, నునుపనేరక రాముఁ డుల్లంబుఁ గలఁగి

శ్రీరాముఁడు ప్రలాపించుట.

మదనవేదనల నున్మత్తుచందమునఁ, బెదరి చూచుచుఁ దనపెంపెల్ల మఱచి
తనుమధ్య నీవింత తడవెందుఁ బోయి, తని చూచు నిందు రమ్మని చేరఁబిలుచుఁ [చు
బ్రియ మొప్పఁ బైఁబడుఁ బెనచిరాఁ దిగుచు, బయలు కౌఁగిటఁ జేర్చు బలుమాఱువగ
నొయ్యన నూరార్చు నొకకొంతవడికి, నొయ్యనఁ దనలోన నొకకొంత దెలియు
నక్కటా సౌమిత్రి యవనీతనూజ, యెక్కడఁ బోయెనో యేమైన యదియెయి
వెలఁది యడ్డులచొప్పు వెదకియుఁ గాన, జలజాక్షి యీపర్ణశాలలో లేదు
ఏదెసఁ బోయెనో యిందీవరాక్షి, కాదొకో యిది దండకావనభూమి
యీదెస గాదొకొ యిది పర్ణశాల, కాదొకో రాముఁడఁ గానొకొ నేను
ఐన నాప్రాణంబు లకట యీబొంది,లోన నెట్లున్నవి లోలాక్షిఁ బాసి
పూని యీయెడఁ బ్రాణములతగుల్ రోసి, తానును దివి కేఁగఁ దలఁచితినేని
వ్రతము చెల్లింపకవచ్చె వీఁడెట్టి, సుతుఁ డంచు ననుఁ గణించునె దశరథుఁడు
కాదేని వ్రతము సాంగంబుగాఁ దీర్చి, మేదిని పాలింప మిన్నక పురికిఁ
జనినచో మిథిలుఁ డచ్చటికి రానతనిఁ, గనుఁగొనఁగా సిగ్గు గాదొకో నాకు
నటుగాన నన్ను నీయడవిలో విడిచి, పటుబుద్ధిఁ బురికేగి భరతుని గాంచి
తనయనుమతి సర్వధరణిఁ బాలింపు, మని చెప్పి కైకకు నాసుమిత్రకును
గౌసల్యకును జనకజ చన్న తెఱఁగు, నాసుద్దియును దెల్పు ననుఁ మది నిల్పు
మని రాఘవుఁడు తొప్ప లల్లన వ్రాల్చెఁ, జనకజ మును పర్ణశాలలోనుండి
పోయినగతి మనంబుననుండి వెడలి, పోయెడు నని యడ్డముగఁ జేర్చె ననఁగ
నప్పుడు లక్ష్మణుఁ డన్న చందంబుఁ, దప్పక చూచి యెంతయు శోకమంది
యేతల్లిపని నేతు నేతల్లిఁ గొలుతు, నేతల్లిఁ దల్లిగా నిటమీఁదఁ జూతు
ననకులాధిపుశోక మేత్రోవ మాంతుఁ, దనదుతల్లులకును దనసహోదరుల
కెనయ నీతనితోడిదే లోక మగుట,ఘనువంశమంతయు మడిసెఁ బొమ్మనుచు
నందంద విలపింప నంతలో రాముఁ, డొందినమూర్ఛ దానొయ్యనఁ దెలిసి
తలకొన్నవగలలో దండకావనము, కలయ నాలోకించి కన్నీరు నించి
వనజాక్షి చింతింప వగలు రెట్టించి, తనమది శోకించి ధైర్యంబు డించి
పోయితే సీత యీబొందితోఁ బాసి, పోయితే ననున్ను నీబొందితో డించి
పోరి సురాసురలోకపూజార్హ మనక, హరువిల్లు విఱిచితి నతివ నీకొఱకుఁ
బరుఁడని తలపోసిఁ బ్రాహ్మణుం డనక, పరశురాముని భంగపఱిచితిఁ గడఁగి
నీరజలోచన నీకునై పూని, యీరెండునిందల నేను గైకొంటిఁ
గడపట నినుఁ బాపెఁ గష్టదైవంబు, పడఁతి నిందలఁబడఁ బాలైతి నేను
నీవేడుకలు చూచి నీకు నేప్రియముఁ, గావింతుమని పోయి కపటమృగంబుఁ
జంపి తెచ్చితి దానిచర్మంబు గడఁగి, యింపార నెవ్వరి కిత్తునే నింక
మది నెల్లసుఖములు మఱచి కానలకు, వదలక ననుఁ నమ్మి వచ్చినచోట
నినుఁ గావలేనైతి నీచన్నత్రోవఁ, గని రయంబున వచ్చి కడియలేనైతిఁ

బరువడి జగమెల్లఁ బాలింపఁజాలు, వరశక్తిగలిగినవానిచందమున
మునుకొని శరచాపములు దాల్చి ఘోర,వనదుర్గభూముల వర్తింప వచ్చి
వెడమతి మావారిపెంపెల్ల మఱచి, పడఁతుక నినుఁ గోలుపడితినే నేఁడు
ఏణాక్షి నినుఁ బాసి యీశరీరమునఁ, బ్రాణంబు లెబ్బంగిఁ బట్టుదు నింక
మేదినీతనయ యిమ్మేదినిఁ బాసి, యే దెస భరియింతు నీదేహ మింక
నెలఁత నీవిరహాగ్ని నీదులావణ్య, జలరాశి మునుఁగక చల్లార్పఁ రాదు
తగిలి యీశోకాబ్ధి దాఁటఁ నీమేను, తగుతెప్ప లేకెట్లు తరియింపవచ్చు
మగువ నీపాలిండ్లమఱుఁగు లేకున్న, నొగిఁ గాముశరవృష్టి కోర్వంగరాదు
నన్నట్లు గొని చనె నళినాక్షి పిదప, నిన్నిట్లు కొనిపోయె నేఁ డింక మనల
నిరువురఁ బాపిన యీదైవమునకు, నరుదెందుఁ గల దసాధ్యము లెందుఁ గలవు
కోమలి నిన్నెత్తికొని పోవునప్పు, డేమని పలవించి తేమంటి నన్ను
నేదేశముల కేగి తెందున్నదాన, వేదుగిఖముల వ్రేఁగె దేమి చేసెదవు
ఎవ్వరు గొనిపోయి రేత్రోవ బోతి, వెవ్విధి వాటిల్లెనే నేఁడు మనకు
నీయట్టిచదురాలు నీయట్టిముగ్ధ, నీయట్టిలావణ్యనిధి యెందుఁ గలదు
కలనొకో యొకనాఁడు గరమర్ది నిన్నుఁ, గలిసి వినోదింపఁ గమలాక్షి నాకు
జలజాక్షి నినుఁగూడి సాకేతపురము, గలవాఁడ ననికాని కాన నొండొకటి
కలకంరి నినుఁగూడి కనకహర్మ్యములు, గలవాఁడ ననికాని కాన నొండొకటి
అలివేణి నినుఁగూడి యఖిలభోగములు, గలవాఁడ ననికాని కాన నొండొకటి
నెలఁతుక నినుఁగూడి నిఖిలసౌఖ్యములు, గలవాఁడ ననికాని కాన నొండొకటి
యిది మహారణ్యమై యిప్పుడు తోఁచె, నిది పర్ణశాలయై యిప్పుడు తోఁచె
నిది నాకుఁ దపముగా నిప్పుడు తోఁచె, నిది నాకు దుగిఖమై యిప్పుడు తోఁచె
నేలె మహీపుత్రి యేలె మృగాక్షి, యేలె సరోజాక్షి యేలె లతాంగి
యేలె వధూమణి యెన్నిచందములఁ, గ్రాలుచు నున్నాఁడఁ గటకటా యనవు
అలసయానములబా గంచల కిచ్చి, లలితాంఘ్రిరుచి ప్రవాళంబుల కిచ్చి
వరకుచోన్నతిచక్రవాకుల కిచ్చి, కరములకెంపు పంకజముల కిచ్చి
మెయిచాయఁ గ్రొక్కారు మెఱుఁగుల కిచ్చి, నయనవైభవము మీనములకు నిచ్చి
చల్లనిముఖదీప్తి చంద్రునకిచ్చి, తెల్లనినగవు చంద్రికలకు నిచ్చి
చెలువంపుఁబలుకు రాచిలుకల కిచ్చి, యలకలనునుఁగాంతి యళులకు నిచ్చి
సన్నపునడు మాకసంబున కిచ్చి, నిన్ను దైవము మ్రింగెనే నేఁడు సీత
హా వామలోచన హా పద్మగంధి, హా వారిజానన హా సీత యనుచు
వివశుఁడై రామభూవిభుఁడు పల్వగలఁ, దవిలి దీనతఁబొంది తమ్మునిఁ జూచి
యే దెసఁ బోయెనో యిందీవరాక్షి, పోదమా లక్ష్మణ భూమిజ వెదుక
నొలసి యీపొదలలో నున్నదో పోయి, పిలుతమా లక్ష్మణ పృథ్వీతనూజ
నేతరుచాటుల కేగెనో యింతి, చూతమా లక్ష్మణ శుకమంజువాణి
యిత్తమ్మికొలఁకుల కేగెనో సీత, పత్తమా లక్ష్మణ వనజాక్షి నరసి

యని యిట్లు పలుమఱు నతిదీనవృత్తి, మనమునఁ గొని జాలి మఱిమఱి తూలి
ధరియింపరానివేదనలతో రామ, ధరణివల్లభుఁడు గౌతమి చేరఁబోయి
యోలోకపావని యోలోకమాత, యీలోకపావని నెఱుఁగవే సీత
నోలోకబాంధవ యోకర్మసాక్షి, యేలీలనైన నీవెఱుఁగవే సీత
నోసర్వసంచార యోజగత్ప్రాణ, యీసీత నెఱుఁగవే యనఘ నీవైన
నెలదీఁగ కానవే యెలదీఁగబోఁడి, జలజంబ కానవే జలజాతగంధి
హరిమధ్యఁ గానవే హరిరాజ నీవు, కరిరాజ కానవే కరిరాజగమన
హరిణంబ కానవే హరిణాయతాక్షిఁ, బరభృత కానవే పరభృతవాణి
నళినాథ కానవే యలినీలవేణిఁ, దిలకంబ కానవే తిలకాంచితాస్య
ననుచు విభ్రాంతుఁడై యటులనందందఁ, జని చని వెదకుచు జాలిఁ దూలుచును
నెడపక నిబ్బంగి నెందు వైదేహిఁ, దడవి కానక జనస్థానంబు నెడలి
విన్నవై విరహార్తి వివశుఁడైయున్న, యన్న నీక్షించి యిట్లనియె లక్ష్మణుఁడు

లక్ష్మణుఁడు రాముని శాంతిపఱుచుట.

అన్న నీ వఖిలలోకాధ్యపరుఁడ, వున్నతచిత్తుండ వురుబలాఢ్యుఁడవు
ఇంతికై వెనుఁబడి యిన్నిచందముల, నింత శోకింతురే యినకులాధీశ
యీమోహశోకంబు లిట నీకుఁగలవె, తామసమోహనార్ధముగాదె జగతి
నరుగుగా నీదు విల్లందితివేని, సురలైన నీదిక్కు చూడ నోడుదురు
అసమానసత్త్వుండ వఖిలేశ నీవు, వసుధేశ నాయంతవాఁడు నీబంటు
అక్కటా నీకసాధ్యము లెందుఁ గలవు, దక్కుఁగ నీవేర్మి దలఁపవుగాక
అనిన రాముఁడు శోకమంతయు నుడిగి, తనమదిఁ దెలివొంది తమ్మునిఁ జూచి
యేనింక నిటమీఁద నెన్నిచందముల, జానకి నెడఁబాసి సైరింపఁజాల
వారక నాదుదుర్వారబాణముల, ధారణీతలము విదారించి చించి
పాతాళవాసులఁ బట్టి సాధించి, శీతాంశుముఖియైన సీత సాధింతుఁ
గాదేని సప్తసాగరములు గలఁచి, మేదినీధరముల మెదిచి నుగ్గాడి
యీరసంబున దిగ్గజేంద్రకుంభములు, దారించి మేదినీతనయ సాధింతుఁ
గాదేని నఖలదిక్పాలమర్మములు, భేదించి యాదిత్యబింబంబుఁ ద్రుంచి
పారిఁబోరి నక్షత్రముల డుల్లనేసి, ధరణిఁ జీకటిఁజేసి తరుణి సాధింతుఁ
గాదేని సకలరాక్షసుల భస్మంబు,గా దివ్యబాణముల్ కడఁకతో నేసి
యవనియరాక్షసమై యుండఁజేసి, తివుటమై నేఁడు వైదేహి సాధింతుఁ
గాదేని బ్రహ్మలోకంబెల్లఁ గలఁచి, యాదిమబ్రహ్మసంహారంబుచేసి
బలసి జీవులకెల్ల భయముఁ బుట్టించి, నెలకొన్నకడిమిమై నెలత సాధింతు
నీరీతి భుజశక్తి నేఁ జూపకున్నఁ, జేరి మిన్నక సురల్ సీతఁ జూపుదురె
యదెచూడు నాదుబాణానలశిఖలు, పొదలుచునున్నవి భువనంబు లదర
నదె చూడు వైదేహి నని విజృంభించి, త్రిదశులు మెచ్చు సాధించెద ననుచు
నొదవి లోకములకు నుత్పాతహేతు, వుదయించె నన బొమలుఱుక నిక్కించి

బలసి జీవులతోడ బ్రహ్మాండమెల్ల, నలిఁజేయుసంకర్షణస్వరూపంబు
రూపించులయకాలరుద్రుండువోలెఁ, గోపించి విల్లందుకొన్నమాత్రమునఁ
దలఁకె జీవములు భూతలమెల్ల వడఁకెఁ, గలఁగె లోకంబులు గగన మల్లాడె
బ్రహ్మాండభాండంబు పగిలినట్లయ్యె, బ్రహ్మమంత్రము దప్పె రవి దప్ప నడచె
నక్షత్రములు డుల్లె నభవుండు వెఱచె, యక్షదేవాసుర లాత్మఁ జెడ్డపడిరి
అత్తఱి సౌమిత్రి యారాముఁ జేరి, చిత్తంబు భయమందఁ జేతులు మొగిచి
కాకుత్స్థ నీ వతికారుణ్యనిధివి, లోకరక్షణకళాలోలచిత్తుఁడవు
జనకజకొఱకునై సకలలోకములు, మునుమిడి నిర్మూలములు సేయఁదగునె
యొండొండ వనముల నొగి సముద్రముల, నిండినపురముల నిఖలదేశముల
నలయక వైదేహి నరసి లేకున్న, చలముపెంపున మఱి సాధింతుఁగాని
యని లక్ష్మణుఁడు వల్క నతఁడును బ్రీతి, విని కోప ముడిగి తా విల్లెక్కుఁడించి
యఖలేశుఁ డగురాముఁ డట దక్షిణాభి,ముఖుఁడునై తానుఁ దమ్ముఁడు వోవుచుండె
నాతఱిఁ దెరువున నందంద మెఱసి, సీతకొప్పునసుండి చిందినవిరులు
ఆతన్వివక్షోజహారరత్నములు, నాతతమణిమయం బైనయానాతి
పదనూపురము లుర్వి బడియున్నఁ జూచి, ముదము శోకంబును మూర్ఛయుఁగదుర
నప్పుడు రఘురాముఁ డాత్మఁ జింతించి, తప్పదెవ్వఁడో క్రూరదానవుం డొకఁడు
కుటిలకుంతల నెత్తుకొనిపోయినాఁడు, గటకటా యని త్రోవ గనుఁగొంచుఁబోవ
నంతంత రాక్షసునడుగులచొప్పు, నంత నాతెరువున కనతిదూరమున
నరయుచు నరయుచు నందంద పోయి, కరమర్ధిఁ జూచి రాకమలాప్తకులులు
రాలినయెఱుకలు రక్తపంకమున, గూలినసూతుపైఁ గూలినతేరు
దేరుక్రిందటఁ బడి లెగినయశ్వములు, ధారణిఁ బడిన పతాకఖండములు
విఱిగి ముందటనున్న వింటితొక్కులును, నఱిముఱి బడియున్నయస్త్రశస్త్రములు
గనిలక్ష్మణుడు చూపఁ గడుఁజోద్యమంది, ఘనులెవ్వరో యిందుఁ గదనసౌఖ్యంబు
లనుభవించినవారలని యవ్విధంబు, గనుఁగొనుతలఁపునఁ గాకుత్స్థకులుఁడు

జటాయువునకు అగ్నిసంస్కారముసేయుట.

దెరువంతకంత శోధించుచు ముంద, అరుగుచో రఘురాముఁ డాసమీపమున
నెలమి నెంతయుఁ దూలి యెఱుకలు విఱిగి, కలయ నెత్తుటఁ దోగి కాళ్లును దునిసి
పవిచేతఁ గూలిన భర్మాద్రివోలి, వివశుఁడై పడియున్న విహగేంద్రుఁ గాంచి
సౌమిత్రి చూచితే చపలరాక్షసుఁడు, భూమిజ మ్రింగి తాఁ బొడచూప వెఱచి
చలియించి పక్షివేషమున నున్నాఁడు, బెలుకుటే వీనిఁ జంపెదనంచుఁ గడఁగి
ఘనచాపహస్తుఁడై కదసిన రాముఁ, గని పక్షివిభుఁడు గద్గదకంఠుఁ డగుచు
నెత్తురుఁ గ్రక్కుచు నిట్టూర్పు లెసఁగఁ, గుత్తుకఁ బ్రాణముల్ గుదివడఁ బలికె
ధరణీశ యేను మీతండ్రికి సఖుఁడఁ, బరఁగంగఁ గశ్యపబ్రహ్మపౌత్రుఁడను
నరుణనందనుఁడ జటాయువన్వాఁడఁ, జరియింతు నడవుల శైలశృంగముల

నని నాదువృత్తాంతమంతయు నీకు, వినుపింపనే మున్ను విశదంబుగాఁగ
నట్టివానికి నిట్టి యాపద యెట్టు, పుట్టె నటన్న నోపుణ్యాత్మ వినుము
వలనొప్ప నేఁడు రావణుఁడు నీదేవి, నెలమి మ్రుచ్చిలి కొని యేగుచో నేను
బోనీక యడ్డమై భూరిసత్వమున, వానిలోఁ బోరాడి వసుధఁ గూలితిని
ఇదె వానికేతుసమేతసూతాశ్వ, విహితరథం బాజి విఱిగె నాచేతఁ
జలమున దివినంతఁ జపలరాక్షసుఁడు, నెలఁతుకఁ గొనిపోయె నీవు రావైతి
వేను నీ కీవార్త యెఱిఁగింపఁగంటిఁ, బూని నీశుభమూర్తి పొడఁగానఁగంటి
నతిపుణ్యకృతినైతి ననని విన్నవింప, మతిలోన శోకమిన్మడిగ రాఘవుఁడు
విల్లటు పడవైచి వివశుఁడై ధరణిఁ, ద్రెల్లి సౌమిత్రి బోధింపఁగాఁ దెలిసి
యయ్యో మహాత్మా జటాయువా నీకు, నియ్యవస్థలువచ్చెనే మదర్థముగ
నని జటాయువుదేహ మందంద తడవి, తనుర క్తమంతయుఁ దానె తుడ్చుచును
దమ్మునిఁ జూచి యీతఁడు మనకొఱకు, నిమ్మాడ్కి రావణు నెదిరిపోరాడె
నిటువంటిపుణ్యాత్ముఁ డెందైన గలఁడె, యటుగాన దివి కీతఁ డరుగకమున్నె
రావణుఁ డేలెడిరాజధానికిని, ద్రోవయు వానిబంధురపరాక్రమము
నన్నియు నడుగు మీవన్న లక్ష్మణుఁడు, క్రన్నన రఘురామకార్యసహాయు
నాజటాయుని నిర్జరాదివిధేయు, నోజఁ దద్విధమెల్ల నుచితోక్తి నడుగఁ
గొన్నిమాటలు వేరుకొనుచుఁ గుత్తుకకుఁ, గ్రొన్నెత్తురొలుకఁ బల్కుల కెడలేక
యతులఘృణోద్యమం డగురాముఁ జూచి, మతిలోన నతనిసంస్మరణ మేమఱక
మోక్షపథానందమునఁ బులకించి, పక్షివల్లభుఁ డంతఁ బ్రాణముల్ విడిచె
ధరణీశసుతు లంత దశరథాధీశు, మరణంబుకంటెను మదిఁ జాల వగచి
విహగవల్లభునకు వేదోక్తయుక్తి, దహనాదికృత్యముల్ దగ నాచరించి
యంత వేవేగ క్రౌంచారణ్యమునకు, నెంతయుఁ గడఁకతో నేగి యచ్చోట
నానాలతావృక్షనగమృగోద్గ్ర, మైనట్టి యొకకోన నరుగుచో నచట
నెఱసినకురులును నిడుదకోఱలును, బఱవైనకడుపును బడబాకినోరు
మిడిగ్రుడ్లకన్నులు మీఁగాళ్లదాఁక, విడిబడ్డచన్నులు వెట్టిచిన్నెలును
నలర నయోముఖి యనుదైత్యవనిత, కలితసౌందర్యలక్ష్మణుని లక్ష్మణునిఁ
గనుఁగొని కామించి కరమంటఁ బట్టి, తనుఁ బొంద రమ్మని తరితీపుసేయ
జుప్పనాతికి నెట్టిసుఖమిచ్చె దాని, కప్పాట నసిధార ననువార నొసఁగె
దుందుభిపటహాదితూర్యనాదముల, క్రందునకంటె నగ్గలముగా నపుడు
ముందఱి నొకమ్రోత మోయంగ దాని, చందంబు గనుఁగొనఁ జనుచు రాఘవులు
యోజనాయతబాహుఁ డొగిఁ బారసాచి, యేజంతువులనైన నేపుమై నొడిసి
యతిముఖీ మ్రింగుచు నావలించుచును, జుఱువుచ్చి మస్తకశూన్యఁడై నిలిచి
యుదరంబు నోరుగా నున్నకబంధు, విదళితబహుజీవితతకబంధుఁ
ద్రిదశనిర్బంధు సంతిష్ఠమథాంధుఁ, గదిసి రాముఁడు చూచి కడుఁజోద్యమంద
వాఁడును దనకరద్వయమున వారి, వేఁడిమిచెడఁ బట్టి వేవేగ దిగువ

నన్నను జూచి యిట్లనియె లక్ష్మణుఁడు, నన్ను వీనికి భక్షణముచేసి మీరు
సీత నన్వేషించి చేకొని సకల, భూతల మేలంగఁ బొండన్న నతఁడు
చింతించుచును వానిచేతుల వెంటఁ, గొంతదూరమువోయి కూర్మితమ్ముఁడును
దానును బుద్ధినెంతయు విచారించి, వానికమీఱ గొబ్బున నొఱల్ వెఱికి
కడువాడిఖడ్గముల్ గైకొని వానిఁ, గడఁగి చేతులు రెండు ఖండించుటయును
నుబ్బెల్లఁ జెడి డైత్యుఁ డొఱలుచుఁ దూలి, గొబ్బునఁ దెలివిగైకొని వారిఁజూచి
మీ రెవ్వ రనుడు సౌమిత్రి సర్వంబు, శ్రీరామచరితంబు చెప్పిన దాని
వినుటచే నంతట విజ్ఞానమొదవఁ, దనదువృత్తాంతమంతయుఁ జెప్పఁదొడఁగె
దనువను దివ్యుండ ధరణీశ యేను, ఘనమైన మునిశాపగతి నిట్టులైతిఁ
గనకగర్భునిచేతఁ గామరూపత్వ,మును జిరంజీవిత్వమును గాంచి క్రొవ్వి
యిట్టిరూపము దాల్చి యెల్లసంయములఁ, బట్టి బాధింపఁగఁ బరమకోపనుఁడు
స్థూలశిరుండన శోభిల్లు మునికి, నీలోకమునఁ దొల్లి యెగ్గుఁ గావించి
యతిఘోరరూపుఁడ నై యేను మరల, నతనిఁ బ్రార్థించిన నతఁడు మీవలన
నతులశాపవిముక్తి యగునంచుఁ బలుక, మతిలోన నదియెల్ల మఱువక పిదప
నదియాచిగా నిట్టి యాకృతిఁ బూని, త్రిదశేంద్రునాజి కేతెమ్మన్న నతఁడు
కంఠంబు తలతోడఁ గడుపులోఁబోవ, గుంరితంబుగ వ్రేసె గులిశపాతమున
ననిన రాఘవుఁడు దశాననుచంద, మనఘు నీవెఱుఁగుదె యనిన వాఁడనియె
నెఱుఁగుదుఁగాని మాఁనీంద్రుశాపమున, నెఱుక చాలదు నాకు నీశరీరమున
ననలంబు దరికొల్పుఁ డామీఁద మీకు, వినుపింతుఁ దెలియ నివ్విధమన్న వారు
దనువుశరీరంబుఁ దగసంస్కరింప, ననలుని కాదేహ మాహుతియయ్యె
నతఁ డంత దివ్యుఁడై యాకాశవీథి, నతులవిమానంబు నందుండి పలికె
నోరఘురామ యాయోధనోద్దామ, కారుణ్యతారుణ్యగాంభీర్యధుర్య
కాకుత్స్థవర్య నీకారుణ్యదృష్టి, వైకొన నాతొంటిపదమందఁ గంటి
విను మింక రావణువిధమెల్ల నేను, వినుపింతుఁ దేటగా వివరించి యతఁడు
ధనదానుజుఁడు పులస్త్యబ్రహ్మకూర్మి,మనుమండు తనతపోమహిమ మెప్పించి
నలువచే వరము లున్నతిఁ గాంచినాఁడు, చెలఁగి దిగ్విజయంబుచేసినవాఁడు
తొలివేలుపులకెల్ల దొరయైనవాఁడు, కలవేలుపులకెల్ల గంటైనవాఁడు
బలుతలల్ పదియును బాహు లిర్వదియుఁ, గలవాఁడు లవణసాగరశ్వేయమైన
లంకాపురంబు పాలననేయువాఁడు, బింకాన రజతాద్రిఁ బెఱికినవాఁడు
అనిచెప్పి రావణుం డాసీతఁ గొనుచుఁ, జనినమార్గముచెప్పి సరగ నాదనువు
మఱి త్రోవ గుఱుతులు మార్గంబుచెప్పి, తఱుచైనవస్తువుల్ తప్పక చెప్పి
మేరఁగాఁ బంపాసమీపంబునందు, నారూఢమతిమతంగాశ్రమంబొప్ప
నమ్మునిశిష్యురా లయినట్టిశబరి, మిమ్ముఁ బూజించు నమ్మెలతయున్నెడకు
మీరలు వోవ నమ్మిహిరసూనునకుఁ, గూరిమిచెల్మి గల్గును దానివలన
జానకిఁ బొందెదు సామ్రాజ్యపదవిఁ, బూని కాంతువటంచుఁ భోయె నద్దివికి

దనువటు దివ్యవచంబున కరుగ, మనుచంశతిలకులు మఱునాఁడు కదలి
పంపాసరోవరపశ్చిమస్థలిని, సంపూర్ణతరులతాసంచయం బొదలి
ప్రబలి పుణ్యములకుఁ బట్టైనయట్టి, శబరియాశ్రమవనస్థలికిఁ బోవుటయు

రామలక్ష్మణులు శబరిని గాంచుట.

నెదురుగా వచ్చి యయ్యింతి సచ్ఛక్తిఁ, బదముల కటు సాగఁబడి లేచి మ్రొక్కి
దశరథవరపుత్ర తాటకాజైత్ర, కుశికసంభవయాగకుశలప్రయోగ
చిరమునిధ్యేయ శిక్షితతాటకేయ, పరమగంగాతీరపావనంచార
పదరజోనైర్మల్యపాలితాహల్య, విదళితహరచండవిపులకోదండ
భీమభార్గవరామ బిరుదాభిరామ, కామితపితృవాక్యకరణసుశ్లోక
ప్రకటాపరాధవిరాధనిరోధ, సకలమునిత్రాణ సత్యప్రవీణ
ఖరదూషణాదిరాక్షసశరశ్చేది, మరణార్ధిమారీచమర్దినారాచ
సీతావియోగసూచితమోహరాగ, ఖ్యాతఖగాధ్యక్షకల్పితమోక్ష
యలఘువిక్రమధామ యతిపుణ్యనామ, నెలకొని రఘురామ నినుఁ జూడఁ గంటిఁ
బరికింప నాతపఃఫల మంచఁగంటి, నరుదైనపుణ్యంబు లన్నియుఁ గంటి
గాకుత్స్థ తెరువునఁ గడుడస్సి తెందుఁ, బోక మాయాశ్రమంబున నేఁడు నిలువు
అనఘాత్మ మాగురుఁ డైనమతంగ, మునిచేత నీకథ మును వినియుందు
నీవాద్యుఁడవు సర్వనిగమవేద్యుఁడవు, గావున నిను నుతుల్ గావింపఁదరమె
యిది యామతంగమునీంద్రునాశ్రమము, విదితతపశ్చర్యవిశ్రాంతికరము
అని యామహాత్ర్యంబు లన్నియుఁ దెలిపి, వనమూలఫలములు వలనొప్పఁ దెచ్చి
యిచ్చిన భుజియించి యెలమి నారాముఁ, డచ్చటఁ బ్రీతిమై నారాత్రి నిలిచి
ఘనజటాబంధైకకబరి నాశబరిఁ, గనుఁగొని మఱునాఁడు కాకుత్స్థుఁ డనియె
దరమిడి మిగుల సీతావియోగాగ్ని, దరికొన నెంతయుఁ దలఁకుచున్నాఁడ
నొకచోట నిలువలే కులుకుచున్నాఁడ, వికచాబ్జముఖసీత వెదుకఁబోవలయుఁ
బనివినియెదనన్నఁ బరమసంతోష,మునుబొంది శబరి రాముని జూచి పలికె
దనువనుఘనుఁడు ముందఱఁ జేయఁదగిన,పను లెల్లఁ దెలిపె నేర్పడ వేడ్కతోడ
నైనను మఱియు నేనదియె తెల్పెదను, మానవనాథ నీమది కెక్కునట్లు
రావణుఁ జంపెదు రామ నీకూర్మి, దేవిఁ గూడెదవు సందేహంబు వలదు
ఐనను నేకాకులై పోవఁ దగదు, భానుకులాధీశ పరఁగఁ బైనిపుడు
ఇనకులాధిప యింక నిట బుళ్యమూక, మనుపర్వతంబున కరుగుము నీవు
సునిశితమతిసూర్యసుతుఁడు సుగ్రీవుఁ, డనువానరాధిపుఁ డాకొండనుండుఁ
దనవధూరత్నంబు తనరాజ్యపదము, తనయన్న వాలిచేఁ దాఁ గోలుపోయి
యతఁడు శోకాతురుఁ డైయున్నవాఁడు, అతనికిఁ గపిసేన లప్రమాణములు
అతనికి విశ్వాస మాత్మఁ బుట్టించి, యతనికి నుపకార మలవడఁ జేసి
యతఁడు నీవునుగూడి యటు లంక కరిగి, యతిసత్త్వరావణు ననిలోనఁ జంపి
బలవిక్రమంబులు ప్రస్తుతికెక్కఁ, జెలువొప్ప నీదేవి సీతఁ గైకొనుము

అని యొప్ప శబరి కార్యములెల్లఁ దెలిపి, తనగురువాక్యంబు తలఁచి యాక్షణమె
యనలంబు దరికొల్పి యయ్యగ్నిలోనఁ, దనశరీరము వేల్వఁ దా సమకట్టి
యాసమయంబున నంతరిక్షమున, వాసవప్రముఖగీర్వాణులందఱును
మణిభృణిదేదీప్యమానవిమాన, గణసమారూఢులై కనుఁగొనుచుండ
నారదసనకసనందనప్రముఖ, సారమునీంద్రులు సంతోషమందఁ
బరముఁ బరంధామముఁ,బరమకల్యాణుఁ, బరిపూర్ణుఁ బరమాత్ముఁ బరమేష్ఠివినుతు
నవ్యయు నవికారు నఖిలాంతరాత్ము, నవ్యక్తు నఖిలేశు నాద్యంతరహితు
భవముఖామరవేద్యు భవరోగవైద్యు,రవికులాంబుధిచంద్రు రఘురామచంద్రుఁ
దనమది నిలిపి యత్తఱి వలగొనుచు, వినుతించి శబరి యావిభునిసన్నిధిని
ననలునియందు రామార్పణంబుగను, దనశరీరము వేల్చి దైవతానీక
మానితదివ్యవిమానంబునెక్కి, నానావిధముల వర్ణనసేయ సురలు
దేవలోకమున కెంతేవేడ్కఁ జనియె, దేవదుందుభులు ధింధిమి యని మ్రోయ
ననలముఖంబున నారీతి శబరి, యనిమిషసౌఖ్యంబు లందినఁయంత
రమణీయమూర్తులు రామలక్ష్మణులు, నమితబలోద్రిక్తు లచ్చోటు వెడలి
యనవరతాలోకమతిగుణానేక, మునిలోక మగుబుశ్యమూకంబుఁ గనిరి

శ్రీరాములు ఋష్యమూకమును జూచి హర్షించుట.

త్రైలోక్యవిభులైన తమరాక చూచి, యాలోలమతి పొంగి యానందమంది
యనయంబు నొప్పెడునశ్రువారంబు, లన సెలయేరుల నమరినదాని
నిల మేరుమందరహిమశైలపతుల, నలిమాఱి నగియెడి నగవులో యనఁగ
సాంద్రంబులై యెందుఁ జరులదీపించు, చంద్రకాంతోపలచ్ఛాయలదాని
సరసిజాసనుఁడు భూచక్రంబుమీఁదఁ, బరగఁ బర్వతరాజపట్టంబు గట్టి
శిరసునఁబెట్టిన నేసఁ బ్రాలనఁగ, నురుశృంగములఁ జుక్కలొప్పెడిదాని
నురుమతిఁ దనుఁ జొచ్చియున్నసుగ్రీవుఁ, బరిభవించినవాలిపై మండుచుండు
గతి సూర్యకాంతముల్ గలయ వెలుంగ, నతులప్రతాపోగ్రమై యున్నదాని
మెఱుఁగులు కొమ్మలై మెఱయ నేతెంచి, నెఱయుసానువులందు నీలమేఘములు
పొలుపొందు మదగజంబులుగాఁగఁ దలఁచి, మలయసామజముల మానైనదాని
నంగజహరుమాళి నలరు నాకాశ, గంగయై యొప్పులఁ గరమొప్ప నొప్పి
యాయెడఁ గ్రీడించు హంసమాలికలు, మాయనివిధుశిరోమాలికల్ గాఁగ
బహుశృంగభూరుహాపల్లవచయము, విహితజటాజూటవిభవమై యొప్ప
నాసన్నులై సిద్ధు లర్థి సేవింప, నాసదాశివమూర్తి యననొప్పుదాని
బలభేది మొదలుగాఁ బరఁగుదేవతలు, కలయనంబుధి ద్రచ్చి కన్నవస్తువులు
పనివడి తమలోనఁ బాలుపోకున్న, నునిచిరో యమృతపానోన్మత్తు లగుచు
మఱచిరో యంతయు మంచితావగుటఁ, దెఱఁగొప్ప దాచిరో దీనిపై ననఁగఁ
గల్పవృక్షంబులఁ గామధేనువుల, వేల్పుకన్నియలను వివిధౌషధములఁ
జింతామణుల నెందుఁ జెడనిపెన్నిధుల, సంతానతరువుల సరినొప్పుదానిఁ

గని దానిమహిమకుఁ గడుఁ జోద్యమంది, యినవంశవల్లభుం డెంతయుఁ బొగడి
యఱలేనిభక్తితో ననుజుండు గొలువ, మెఱయు నాశ్రమసమీపంబునందుఁ
దఱుచైనతొగలనెత్తమ్ములతోడ, వఱలు పంపాసరోవరమున కరిగి
యందును నియతితో నాసరోవరము, నందుఁ గృతస్నానుఁడై రామవిభుఁడు
కలయఁ గనుంగొని కడుఁ జోద్యమంది, విలసిల్లుకొక మావివృక్షంబునీడ
అలసట దీరంగ నపుడు లక్ష్మణుఁడు, సలలితశ్రీతోఁ బ్రచారములఁ జలుప
నీక్షించి రఘురాముఁ డేపుదీపించి, వృక్షంబుఁ బరికించి వేడ్క నిట్లనియె
వనవాస మిటు తుదవచ్చినమొదలు, ఘనమైనయద్రులు ఘనపుణ్యనదులు
దరమిడి కంటిమి ధారణి నిట్టి, తరువెందుఁ గాన మీతరువ్రకు సవతు
సురపతి మొదలగు సురలెల్లఁ గూడి, కరమర్ధి నీతరు గావించి రొక్కొ
యజుఁడె యీతరువున కాయవుఁబోసి, నిజముగా నిచ్చట నిలిపినాఁడొక్కొ
రవిసుతుతపమున రాగిల్లి బ్రహ్మ, భువిని నీతరువును బుట్టించినాఁడొ
సేవించి యమృతంబు చేకొని సురలు, భావించి రవిసుతుషఱంబు గలిగి
యరయంగ మేలైన యమృతంబుతోడఁ, బురణింపఁ దరువుగాఁ బుట్టించినారొ
యినునితో నిష్టంబు లింపొందఁజేయఁ, జనుధర్మమననుండి శాఖలున్నతము
లష్టదిక్కులకును ననువందఁ బాఱి, యిష్టఫలంబుల నీఁగోరినట్లు
పఱచుశాఖలరుచిప్రభ నొప్పుమీఱి, తెఱచి పర్ణంబులు తేజంబు లొప్ప
రవిదృష్టి చొరనీదు రాత్రులఁ బెర్మి, దవిలి యాశశిదీప్తి దనుఁ గాననీదు
ఫలము లాయమృతపుఫలములకంటెఁ, గలశతగుణములఁ గడునొప్పుదాని
తరురాజపట్ట మీధాత్రిపై వేడ్కఁ, గరమర్ధి దివిజులు గట్టరో ప్రీతి
నని తమ్మునికిఁ దెల్ప నగుఁగాక యనుచు, వినయోక్తి నారామవిభుచిత్త మెఱిఁగి
యాలోన సౌమిత్రి యన్నకు భక్తి, శాలియై మృదుపర్ణశయ్య గావింప
సముచితస్థితి మృదుశయ్య రాఘవుఁడు, విమలచిత్తంబున వేడ్క శయింప
సౌమిత్రి రఘురాముచరణంబు లొత్త, శ్రీమాఱు నిద్దఱు చెలఁగుచునుండ
ననఘుని రఘురాము నట లక్ష్మణుండు, గని వెండి యెలుఁగెత్తి గ్రక్కునఁ బలికెఁ
గైకొందు చెలినని కలయంగ రొప్పి, చేకొని చిఱుతరాచేరువఁబట్టి
యెల్లెడ శుభములె యెసఁగు నీకనుచు, బల్లి దీప్తంబుగాఁ బలికెఁబో చెవికి
భానునిపైఁ బఱపురుసున నెలుఁగు, మానుగాఁ గూర్చెద మహిపుత్రి నీకు
ననియు నించుక చేరి యంతయు రొప్పఁ, దనయాత్మఁ గడు మెచ్చి తమ్మునిఁ జూచి
యినవంశవల్లభుం డిట్లని పలికె, వనచరాధీశుండు వడి నేగుదెంచి
ఘనభక్తి మనలను గలయ నిచ్చటను, చనుదుము లంకకు సరగున మనము
గూలురావణుఁ డాజిఁ గూడును సీత, యేలుదు లోకంబు లెలమిఁ బెంపొంద
నన రామసౌమిత్రు లధికసంతోష,మునుబొంది సుఖగోష్ఠి ముదమొప్పనుండి
రారణ్యకాండ మింపారంగ నుతుల, నారవితారార్కమగు సుర్విమోద
నని యాంధ్రభాష భాషాధీశవిభుఁడు, వినుతకావ్యాగమవిమలమాననుఁడు

పాలితాచామం డపారధీశరధి, భూలోకనిధి గోనబుద్ధభూవిభుఁడు
తమతండ్రి విట్ఠలధరణీశుపేరఁ, గమనీయగుణధైర్యకనకాద్రిపేర
నాచంద్రతారార్కమగు నొప్పుమిగిలి, భూచక్రమున నతిపూజ్యమై వెలయ
నసమానలలితశబ్దార్థసంగతుల, రసికమై చెలువొందు రామాయణంబు
పరఁగునలంకారభావనల్గండఁ, గరమర్థి నారణ్యకాండంబు చెప్పె
నారూఢి నాశ్లేయమై యాదికావ్య, మై రసికానందమై యెల్లనాఁడు
ఇవ్వసుమతి నొప్పు నీపుణ్యచరిత, మెవ్వరు చదివిన నెవ్వరు వినిన
సామాదిబహువేదచయధామరామ, నామచింతామణి నవ్యభోగములు
పరహితాచారముల్ ప్రభువిచారములు, పరిపూర్ణశక్తులు ప్రకటరాజ్యములు
నిర్మలకీర్తులు నిత్యసౌఖ్యములు, ధర్మైక్యనిష్ఠలు-దానాదిరతులు
నాయురారోగ్యంబు లైశ్వర్యములును, బాయక వినుచున్నఁ బాపక్షయంబు
వరపుత్రలబ్ధియు వైరినాశనము, సరినొప్పు ధనధాన్యచయసమృద్ధియును
నేవిఘ్నములు లేక యిండ్లలో నధిక, లావణ్యవతులైన లలనలపొందుఁ
గొడుకులతో నెప్డు గూడియుండుటయు, నెడగాఁగ నాపదల్లెల్లఁ బాయుటయు
సమ్మదంబున బంధుజనులఁ గూడుటయు, నిమ్ముల కామ్యంబు లెడపకుండుటయు
సతతంబు దేవతాసంతర్పణంబు, పితృగణతృప్తియుఁ బెంపారుచుండు
వ్రాసినవారికి వరశుభోన్నతులు, వాసవలోకాధివాసతఁ జేయు
నెందాఁక కులగిరు లెందాఁక తార, లెందాఁక రవిచంద్రు లెందాఁక దిశలు
ఎందాఁక వేదంబు లెందాఁక ధరణి, యెందాఁక భువనంబు లేపుదీపించు
నందాఁక నీకథ యక్షయానంద, సందోహదోహళాచారమై పరఁగు

ఆరణ్యకాండము సంపూర్ణము

శ్రీ ర స్తు

శ్రీ రంగనాథరామాయణము

కి ష్కి ం ధా కా ం డ ము.

శ్రీరాముఁ డయ్యెడ శీతలవారి, వారిజోత్పలకైరవంబులకొప్పు
పంపయు మధుమాసఫలితతత్తీర, చంపకసహకారచాయకాంతార
సంపదయును జూచి జానకీవిరహ, కంపితుం డగుచు లక్ష్మణున కిట్లనియె
సౌమిత్రి యీపంప సకలనిలింప,కామినుల్ జలకేళి కరముఁ గాంక్షింప
నొప్పు నీసరసితో నుపమాన మరసి, చెప్పంగ శక్యమే శేషాహికైన
ననుకూలమలయానిలాహతి దీన, జనియించుఁబో బిందుసరము లెనైన
దీనిమహత్త్వంబుఁ దెలిసినచోట, మానసంబును నణుమాత్రంబుగాదె
పావనజీవనాస్పద మైనదీని, కావేల్పుడిగ్గియ యైన సమంబె
యున్నాళికస్ఫురితోరుకర్ణికలఁ, దిన్నగా విరిసిన తెల్లనెత్తమ్మి
మరకతస్తంభనిర్మలహేమకుంభ, భరితాతపత్రమై పార్శ్వద్వయమునఁ
దేటితెక్కలఁ గ్రమ్ము తెమ్మెరవలన, నూటాడుతరగల నుయ్యెలలూఁగు
విప్పారుతెక్కల వెలయురాయంచ, లొప్పారఁగా వైచు నుభయచామరము
లింపొంద నీపంప యీక్షింప నొప్పె, శ్రీపూర్ణపట్టాభిషిక్తునికరణి
నామని జవ్వనం బలరినరుచుల, చే మించు చిన్నారి చిగురుమానికపు
సొమ్ములు దాల్చుచుఁ జుట్టును గ్రమ్మి, కొమ్మ లీనిద్దంపుఁగొలఁకుదట్టమున
నిక్కి నీడలు చూచి నిజవిలాసముల, కొక్కింత యూఁచల లూఁచుచందమునఁ
గొండొకగాలిసోఁకుల తుదల్లదల, నొండొంటిఁ బొగడుచు నున్నచందమునఁ
గీరశారిక లర్ధిఁ గెరలు నిచ్చోటి, తీరవనీవాటి దృష్టింప నిపుడు
తాపంబు మునిప్రతాపంబుకరణి, దీపించె నామేన ధృతి నటుగాన
సౌమిత్రి యిది వనస్థలి గాదు చూడఁ, గాముని యాయుధాగారంబుగాని
చింతింప నివి మావిచిగురులు గావు, కంతుని క్రొవ్వాడి కత్తులుగాని
భావింప నివి పూవుబంతులు గావు, భావజాతుని వాఢిబాణములు గాని
యీయెడ భృంగఝంకృతు లివి గావు, డాయు మన్మథుచాపటంకృతుల్గాని
వర్ణింప నివి పికధ్వనులు గావతను, కర్ణకఠోరహుంకారములుగాని
యటుగాన నావంటి యంగనారహితు, లెటువలె వేగింతు రీకాననమునఁ
గలకంఠకలకుహూకారనిస్వనము, చెలఁగించు వనము గర్జిలు ఘనాఘనము

గులుకుపుప్పొడిమించు గ్రొక్కారుమించు, దలిరుఁగొమ్మలు శక్రధనువులయనువు
వసుధ రాలెడివిరుల్ వర్షోపలములు, ముసరు తేనియసోన మించినవాన
గా నొప్పుచు వసంతకాలంబుఁ జూడ, వానకాలముఁ బోలి వసుధ నొప్పెడిని
జిగురాకుశిఖలతోఁ జిట్టాడుతేటి పొగలతోఁ బొగడపుప్పొడిబూదితోడ
బూరుగుపూవునిప్పకలతో నెగడి, యూరఁయు విరహుల కగ్నియై నిగుడి
కంతుప్రతాపాగ్నికంఱెను గడఁగి, యెంతేని నాచిత్త మెరియింపఁ దొడఁగె
నేమిచేయుదు నింక నెట్లు వేఁగింతుఁ, గామినీమణి సీతఁ గాంతు నెన్నఁటికిఁ
బంపాసరోవరప్రాంతకాంతార, సంపదతోడ వసంతంబు గూడి
చెలువైనచందాన సీతతోఁ గూడఁ, గలుగునే నాకు నొకానొకనాఁడు
ఈపంపలోఁ దమ్ము లే చూచినట్లు, భూపుత్రివదన మెప్పుడు చూచువాఁడ
నిందు మీనవిహార మీక్షించినట్లు, నిందువదనచూపు లెప్పుడు చూతు
జలపక్షు లిచ్చట జత గూడినట్లు, జలజాక్షి నెన్నఁడు జతఁగూడువాఁడఁ
దేటి యిచ్చటఁ దమ్మితేనె గ్రోల్కరణి, బోటికెమ్మోవి నెప్పుడు గ్రోలువాఁడ
నెక్కఁడి తలపోత లెక్కఁడి సీత, యెక్కఁడ వెడనేత లివి యెట్లు పొసఁగుఁ
దమ్ముఁడ నీవయోధ్యకుఁ జను మింక, నెమ్మేనఁ బ్రాణంబు లిక నిల్పఁజాల
నని యనాథునిక్రియ నందంద వగవ, విని లక్ష్మణుఁడు రామవిభుఁ జూచి పలికె
నిదియేమి రఘురామ యెల్లలోకములు, ముదలింపఁ బురుషోత్తముఁడ వైననీవు
ఈమోహశోకంబు లేల తాల్చెదవు, కామిని వంచనఁ గైకొని చనిన
రావణుఁ జంప నారంభంబుసేయు, మీవని లెలుపుచో నెంతయుఁ బ్రీతిఁ
గనుబంటి యెలుఁగిచ్చె గబ్బిల్లు బలికెఁ, గనుఁగొని తచ్చెలి కలయంగ రొప్పె
చేకొని చిఱుత దాజేరువఁ బెట్టెఁ, గైకొందు చెలినని కలయంగరొప్పె
నెల్లెడ శుభములు నిత్తు మీకనుచు, బల్లి దీప్తంబుగాఁ బలికెఁబో చెవికి
భానుపై వామాక్షిపరుసనియెలుఁగు, నాని యించుక చెవి యంతయురొప్పెఁ
దనయాత్తఁ గడు మెచ్చి తమ్ముని జూచి, యినవంశవల్లభుఁ డిట్లని పలికె
వనచరాధీశుండు వడి నేగుదెంచి, ఘనభక్తి మనలను గలయంగఁ గలఁడు
కూలు రావణుఁ డాజిఁ గూడును సీత, నేలుదు లోకంబు లెలమి ధరింప
నని రామసౌమిత్రు లధికసంతోష,మునుబొంది సుఖగోష్ఠి ముదమందుచుండ
నాలోన సుగ్రీవుఁ డాబుష్యమూక, శైలసానువులందుఁ జరియించుచుండి
యాపంపచేరువయం దున్న రామ,భూపాలు లక్ష్మణుఁ బొడఁగాంచి వెఱచి
యచలఁబుపైకి గుండనక చెట్టనక, కిచకిచధ్వనులతోఁ గిచకొట్టుకొనుచు
నెగఁబ్రాకి యెక్కుచో నేకాంతమందు, నగచరులకు వారి నట చూపిచూపి
విలువూని యిద్దఱు వివిధశస్త్రాస్త్ర,కలితులై యదె పంపకడ నున్న వారు
వినుఁ డిందుఁ బ్రచ్ఛన్నవేషులై వాలి, పనుపున మనలఁ జంపఁగ వచ్చినారు
కాదేని మునులకు ఖడ్గతూణీర,కోదండశరముల గొడవ యేమిటికి
వినుఁడు పావనులైన వీరివేషములుఁ, గనుఁగొని నాబుద్ధి గలఁగుచున్నదియు

నెక్కడికైనను నేగుట కార్య, మిక్కడ నుండుట యిది బుద్ధిగాదు
అనుచు మంత్రులతోడ నాడువాక్యములు, విని హనుమంతుండు విమలుఁడై పలికె
వూని వీరలఁ జూడఁ బుణ్యమానసులు,గాని కానేరరు కపటమానసులు
ఆరవిచంద్రులో యననొప్పు వీరు, కారుణ్యపురుషులు కడు విచారింప
నేరూపమున వచ్చి యింపున్న వారో, వీరిపెం పెఱుఁగక వెఱవ నేమిటికి
ననిన సుగ్రీవుఁడు హనుమంతుఁ జూచి, విను వాలిపనుపున వీర లిచ్చటికిఁ
జనుదెంచి రనుశంక జనియించెఁగానఁ, గినిసి యేవేళ నే కీడెంచునొక్కొ
తనపగతుని నమ్మఁ దగదటుఁగానఁ, జని నీవు వారలఁ జతురతఁ గదిసి
వీరేల వచ్చిరో వీరి లోఁతెఱిఁగి, వీరితో భాషించి వేవేగ వచ్చి

శ్రీరాములపద్దికి హనుమంతుఁడు వచ్చుట

పవనజ నాలోని భయమెల్ల మాన్పు, మవిరళగతినేగు మని వీడుకొలిపి
యలమెడుభీతిమై నందుండ వెఱచి, మలయాద్రి కటువోయె మంత్రులు దాను
అత్తఱి హనుమంతుఁ డతిశౌర్యవంతుఁ, డుత్తమగుణశీలుఁ డురుబాహుబలుఁడు
ఖరకరతేజుండు కమనీయమూర్తి, తరుచరులకు రక్ష ధర్మార్థమోక్ష
యతులకు గురుభక్తి యభినవయుక్తి, శ్రుతకీర్తి యంజనాసుతుఁడు తా వేడ్క
నమరలోకమునకు నావాలిఁ బనుప, రమణమై సుగ్రీవు రాజుగా నిలుప
వావిరి సురులను వరభక్తిఁ బ్రోవ, రావణుజయలక్ష్మి రామున కొసఁగ
నవనిజ ఘనశోక మంతయు మాన్ప, రవిసూనుమనసెల్ల రాణింపఁజేయ
వచ్చెనో యనఁగ నవ్వానచరేశ్వరుఁడు, అచ్చుగా నాగిరి నల్లన డిగ్గి
వటువేషధారియై వాయునందనుఁడు, అటు పంపకడకుఁ దా నర్థితోఁ బోయె
ననుపమం బగుశౌన్యహస్తంబుతోడఁ, జని మహోత్తులఁ గానఁ జనదుగాన
నలరామునకు నియ్య నర్హమైనట్టి, ఫలమొక్క టపుడు చేపట్టి వేడుకను
అనుదెంచు ననిలజు నపుడు తాఁ జూచి, ధరణీశుఁ డిట్లనె తమ్మునితోడఁ
గనకపువన్నెయుఁ గరమొప్పుముంజి, ఘనరత్నకుండలకలితకర్ణములు
నురుతరహారంబు లొంటిజన్నిదము, కరమొప్పు గోఁచియుఁ గరకంకణములు
నుపమింప నరుదైన యొప్పులనొప్పు, గపిరూపు మనుజుఁడు గైకొనె నొక్కొ
ఈరూపురేఖయు నిల గోరి రుద్రుఁ, డారూఢిగా నితఁడై పుట్టినాఁడొ
గాక యీవసుధపైఁ గపిమాత్రమునకుఁ, బ్రాకటంబుగ శుభప్రభ యేల గలుగు
నని యిట్లు కొనియాడు నవనీశుఁ జూచి, తనమేను పులకించి తడయక వచ్చి
యురుమతి సీతశిరోరత్న మెలమి, గురుతుగాఁ దెచ్చి గ్రక్కున యిత్తునన్న
కరణి నాఫలము రాఘవమహీపతికి, గరిమెతో కానుకగా సమర్పించి
నీవ శరణ్య మీదృష్టి నన్ సోకె, నైనవి నాభూషణావళు లింక
నేను గృతార్థుండ యేను ధన్యుండ, నేను మీభృత్యుండ నెలమితోడుతను
నని పల్కి హనుమంతుఁ డనుపేరివాఁడ,నినతనూజునిమంత్రి నేవాయుసుతుఁడ
నాంజనేయుఁడ భిక్షుకాకృతి నిపుడు, నంజక మీచంద మరయ వచ్చితిని

వినుఁడు సుగ్రీవుఁడు విశ్రుతకీర్తి, వనచరులకు రాజు వరబలాధికుఁడు
భానుసూనుఁడు బృహద్భానుతేజుండు, మానభూషణుఁ డసమానవిక్రముఁడు
అన్న యీ వాలిచే నపహృతరాజ్య,ఖిన్నుఁడై యిప్పు డిగ్గిరి నున్న వాఁడు
ఆర్తుఁడు మీసఖుఁడై యుండఁజేయ,నేర్తు నావుడు రామనృపుచిత్త మెఱిఁగి
కరమర్థి రామలక్ష్మణులకు మ్రొక్కి, కరములు ముకుళించి కడుభక్తిఁ బలికె
నవని నింద్రోపేంద్ర లర్థినశ్వినులు, రవిచంద్రులన రూపరమ్యతతోడ
నెగుబుజంబులతోడ నిందుబింబంబు, నగుమొగంబులతోడ నళినపత్త్రములఁ
దెగడుకన్నులతోడ దివిజులు మెచ్చి, పొగడు విక్రమకళాభుజశక్తితోడ
నరుదైన రాజచిహ్నములతో మీరు, శరచాపహస్తులై చనుదెంచినారు
భూరితపోవేషములు మీకు నేల, మీ రెవ్వ రిచటికి మీరు రానేల
నని సుధామధురవాక్యంబుల నధిక, వినయవిధేయుఁడై విన్నవించుటయు
నతని వాక్శుద్ధికి నతని బుద్ధికిని, నతని చమత్కృతి కతని యాకృతికి
నతని మనఃప్రీతి కతని నీతికిని, మతి సంతసిల్లి రామక్షితీశ్వరుఁడు
దమ్మునిఁ జూచి యీతని యట్లు వలుకఁ, దమ్మిచూలికిని నాతనివధూమణికిఁ
దగుఁగాన నొరులకుఁ దరమె వ్యాకరణ,నిగమశాస్త్రంబు లన్నియు నేరఁబోలు
నితని సల్లాపంబు లితని రూపంబు, నతులలక్షణలక్షితానురూపంబు
ఇటువంటిదూత నాకిపు డబ్బెనేని, ఘటియింపకున్నె మత్కార్యంబు లెల్లఁ
గావున మత్కార్యగతుల నీతనికిఁ, గోవిదాత్మక పూసగూర్చినరీతిఁ
జెప్పు మేర్పడనన్న శ్రీరాముతమ్ముఁ, డప్పుడు ప్రియమంది హనుమంతుఁ జూచి
మేమున్న దమ్ముల మిక్ష్వాకుకులుల, మీమహోత్ముఁడు రాముఁ డేను లక్ష్మణుఁడ
దశరథరాజనందనుల మిద్దఱము, దశరథుపనుపునఁ దపసుల మౌచు
దండకావనమునఁ దవిలి వర్తించు, చుండ రాముని దేవి సుర్వీతనూజ
మము డాఁగురించి దుర్మదుఁడు రావణుఁడు, క్రమమేది కొనిపోయెఁ గపటమార్గము
వాని పోయినజాడ వదలక వెదకి, కాననమడుమ నొక్కట వచ్చి వచ్చి
శబరి సుగ్రీవునిచరితంబు చెప్పఁ, బ్రబలుఁ డాతఁడు మాకు బంటుగాఁగోరి

హనుమంతుఁడు తనజన్మప్రకార మెఱిఁగించుట.

వచ్చితి మిచటి కెవ్వఁడవు నీవింక, నచ్చుగా నెఱిఁగింపు మనఘు నీతెఱఁగు
ననవుడు హనుమంతుఁ డారఘుకులుల, గనుఁగొని మ్రొక్కి తక్కి విన్నవించె
నెలమి మాతల్లికి నెలమి జన్మించి, వలనొప్ప నొకకొన్నివర్షము ల్చనఁగ
నొకకారణమునకై నొక బ్రహ్మగూర్చి, ప్రకటితమతి నేతపంబుసేయఁగను
పరికించి సరసిజభవుఁ డేగుదెంచి, వరము వేఁడుమటన్న వలగొని మ్రొక్కి
వే వేలువిధముల వినుతులుచేసి, యో విమలాత్మ యీయుర్వి పై నాకు
గతిమోక్షకామ్యార్థకారణంబులకుఁ, బతియెవ్వఁ డతనినే ప్రార్థించి కొలుతు
నని విన్నవించిన నబ్జసంభవుఁడు, తనమనోవీథిని దలపోసి చూచి
యొనరంగ నీమేనియురుభూషణములు, కనుఁగొన్న యాతఁడె గతియును బతియు

ధాతయు మన కిష్టుడైవంబు సకల,భూతజాలములకు భువికెల్ల కర్త
నతఁ డెవ్వఁడనిన వాఁ డతఁడె విష్ణుండు, అతఁడె నీగతి యని యది యాత్మఁదెలియు
మని బ్రహ్మ చనియె నే నదియునుగాక, ఘనబుద్ధి చరియింతుఁ గలయ లోకముల
భూపాలతిలక నాభూషణావళులు, దీపించఁ గానరు దివిజులందఱును
మఱియును సౌమిత్రి మారుతిఁ జూచి, తెఱఁగొప్ప నతనితో ధీరుఁడై పలికె
విను రాఘవుఁడు లోకవిఖ్యాతసత్వుఁడు, డనుపమదివ్యాస్త్రుఁ డతులసాహసుఁడు
కరుణాపయోధి యగాధమానసుఁడు, శరణాగతత్రాణసద్ధర్మపరుఁడు
జగదేకనాథుఁ డశరణశరణ్యుఁడు, డగణితగుణగణ్యుఁ డధికతేజుండు
అతిలోకవిక్రముం డతిసత్యవాది, హితుఁడనై బంటనై యేను వర్తింతుఁ
గావున రాఘవక్ష్మాపాలమణికి, లే వసాధ్యంబులు లెక్కింప నెంతుఁ
గుటిలరాక్షసుఁ డున్నగుఱుతు మున్నెఱిఁగి, యిట సీత సాధింప నేము చాలుదుము
అలపుమై నేకాకులై పోవఁ దగదు, దలపోయ నది రాజధర్మంబు గాదు
గాన నీసుగ్రీవుఁ గైకొనుతలఁపు, మానవాధీశ్వరుమదిలోనఁ గలదు
ఇటమీఁద నీకార్య మేవెంటనైన, ఘటియింపు మనవుడు కరువలిసుతుఁడు
నెఱయ సంతసమంది నిజమూర్తిఁ జూపి, మఱేదన్ను రామలక్ష్మణులు మన్నింపఁ
దనుఁ గృతకృత్యుఁగాఁ దలఁచె నాబలులు, వనచరరాజునె వరుస నెన్నుచును
గనుఁగవ హర్షాశ్రుకణములు దొరుగఁ, గొనియాడి కొనియాడి కోర్కె దీపింప
మనమున సంతోషమగ్నులై, యపుడు, అనిలజు వీడ్కొల్పనతిసంభ్రమమున
నిక సూర్యసూనుని నేలింతురాజ్య, మకలంకమతి రాముఁ డనుఁగుసఖుండు
గాఁగ నేకొదువలు కల్గునె జగతి, వేగమ పోయెద వింతమై ననుచు
నరిగి రాఘవులవృత్తాంత మంతయును, దొరకొని సుగ్రీవుతోఁ జెప్పఁదొడఁగె
రమణీయమూర్తులు రామలక్ష్మణులు, కమనీయగుణములు గలిగి వర్తింత్రు
జగతిపై నతిశోకసాగరమగ్నుఁ, డగునీకు రఘురాముఁ డనుతెప్ప దొరకె
బ్రదికితి సుగ్రీవ పగయెల్లఁ దీఱె, దుదముట్టఁ గలిగె సంతోషంబు నీకు
నాదశరథపుత్రుఁ డాసుచరిత్రుఁడు, డాదయాపరమూర్తి యాసత్యవాది
యామహాభుజశాలి యామహా*బలుఁడు, శ్రీమహావిష్ణుండు శ్రీనివాసుండు
ఆపుణ్యనిధి రాముఁ డట నీకుఁ గర్త, నీపుణ్య మేమన నేర్తు సుగ్రీవ
యామహాత్ముఁడు తండ్రియానతి దండ, కామధ్యమున నుండఁగా దశాననుఁడు
దనదేవి మ్రుచ్చిలితనమున నెత్తి, కొనిపోవ వాని మార్కొని త్రుంచివైవఁ
జింతించి నీతోడి చెలిమి వాటింప, నెఱయుఁ దలపోసి యే తెంచె నిటకు
ననిన సుగ్రీవుండు హర్షంబునొంది, యనిలనందనుఁ జూచి యర్థితోఁ బలికెఁ
బవనజ నాలోని భయమెల్ల నడఁగెఁ, దవిలి యేఁజేసిన తపమెల్లఁ బండె
నలవడ నాకు నీయట్టియంజనము, గలుగుటఁ గంటి రాఘవనిధానంబు
గలఁగక నీవంటి కర్ణధారుండు, గలుగ నీశోకాబ్ధి గడతేరఁగంటిఁ

* ధీరుఁడు, డామాన్యచరిత్రుఁ డసదృశగాత్రుఁ, డాపుణ్యనిధి.

గడఁకతో ఋశ్యమూకమునకు వారిఁ, దోడ్తెచ్చి నాలోని తొందఱ మాన్పు
పొమ్మనవుడు వాయుపుత్రుండు వోయి, నెమ్మితో రఘురామనృపతికి మ్రొక్కి
దేవ సుగ్రీవుండు దేవరసఖుఁడు, దేవ నిఁ దర్శింపఁ దివురుచున్నాఁడు
విచ్చేయుఁ డని విన్న వించిన రాముఁ, డిచ్చలో హర్షించి యింపుసొంపొందఁ
హనుమంతుఁ గొనియాడి యతిపుణ్యులగ్ను,మున హనుమంతునిమూఁపులమీఁదఁ
దనతమ్ముఁడును దాను దమి ఋశ్యమూక,మునకేగి యానందమును బొందె నపుడు
హనుమంతుఁ డంత నేకాంతంబునందు, మనుజేశ్వరులఁ బెట్టి మలయాద్రికరిగి
శ్రీరామదర్శనోద్ధ్రీవు సుగ్రీవుఁ, జేరి నీకోరిక చేకూఁతె నింక
రా దేవ వచ్చిరి రామలక్ష్మణులు, ఆదట ఋశ్యమూకాద్రికి ననుడు
నినతనూజుఁడు ప్రీతి నిచ్చలో నుబ్బి, మనుజవేషముఁ బూని మకుటకేయూర
ఘనతరశృంగారకలితుఁడై మగిడి, తనమంత్రులును దానుఁ దడయ కేతెంచి
డక్కినభక్తితో డాసి రామునకుఁ, జక్క సాగిలి మ్రొక్కి సంప్రీతినొంది
ముకుళితహస్తుఁడై ముందఱనున్న, యలంకసుగ్రీవ నధిపతి చూచి
యాలింగనముచేసి యప్పు డిట్లనియె, నాలోన దరహాస మమృతమై తొరుగ
నీవాయుపుత్రుచే నినసుత యేను, నీవిక్రమంబును నీభుజాబలము
విని ప్రీతినొందితి వెఱవకు మింక, నెనసినపగవాని నేనె చంపెదను
నాకాప్తబంధుండు నమ్మినసఖుఁడు, నీకంటె నొకఁడు గణింపఁగఁ గలఁడె
యని యూఱడించిన నర్కనందనుఁడు, ననిచినబంటుగా నన్నుఁ గైకొంటి
దేవ నీకారుణ్యదృష్టి నక్కసోక, నేవెంట ధనుష్కుఁడ నేనెపో యింక
నలినాప్తకులనాథ నాయట్టిబంటుఁ, గలిగె నీకటుగానఁ గడిమిమై నింకఁ
దివిరి రావణుని వధించితిఁ గడఁగి, యవనిజఁ గైకొంటి నని నిశ్చయింపు
మని రామసుగ్రీవు లనోన్యభాష, లనలుసన్నిధిఁ జేసి యకలంకులైరి
అట నంగదుండు నుదంచితాంగదుఁడు, ఆటప్రాయముగాఁగ నప్పు డావనుల
గిరులను గనవచ్చు క్రియనాఁడుచుండి, యారామసుగ్రీవు లనోన్యముగను
నెన్నఁగా ననలుసన్నిధిఁ బల్కుపల్కు, లన్నియు విని వచ్చి యాతారతోడ
విన్న వించిన మది వేఁగుచునుండి, కొన్నిదుశ్శంకలఁ గుందుచునుండె
నపు డర్కసుతునకు నారాఘవునకు, విపులభూరుహశాఖ విఱిచి వాయుజుఁడు

సుగ్రీవుఁడు జనకజతొడవు లిచ్చుట.

ఆసనంబును వైవ నందుఁ గూర్చుండి, యాసక్తిఁ బరిణామ మరయుచున్నంత
నహిమాంశునందనుం డంత రాఘవుల, గుహలోపలికిఁ దోడుకొనిపోయి ప్రీతి
భూమిజ మును వైచిపోయినతొడవు, లా మెయిఁ గొనితెచ్చి యప్పు డిట్లనియె
దనుజుండు నీదేవి ధరణీతనూజ, వనసీమలోపల వంచన మిమ్ముఁ
గనుఁ బ్రామి గగనమార్గంబున నెత్తి,కొనిపోవఁ బోవ నీకొండపై మమ్ముఁ
గనుఁగొని మిముఁ బెక్కుగతులఁ జీరుచును, జినుఁగుపయ్యెదకొంగుఁ జించి బంధించి
తనతొడవులు వైచి తరలాక్షి పోయె, నని చెప్పి యిచ్చిన నధిపతి చూచి

మున్నుగా వగలను మున్నీట మునిఁగి, కన్నీట నాసొమ్ము కసఁకొల్లఁ గడిగి
యందంద యురమున నాభూషణములు, బొందించి పొందించి భూమిజఁ దలఁచి
పెలుకుఱే లక్ష్మణుఁ బేర్కొని పిలిచి, పలికెఁ బల్కులఁ దొట్రుపాటు రెట్టింపఁ
గంకు లక్ష్మణ సీత కైసేఁతలెల్ల, మంటిపాలయ్యె నిమ్మాడిఁ నేమందు
నీతొడవులు వైవ నేమికారణమొ, యీతొడవులతోడ నేమైన యదియొ
యిది నాకుఁ బ్రాణనాయిక యైనసీత, కుదురునిండిన గబ్బిగుబ్బలమీఁదఁ
బాయని యీజిల్గు పయ్యెదచీర, కీయవస్థలు వచ్చె నేమనవచ్చుఁ
బన్నీట నాపాదపద్మముల్ గడిగి, యున్నతిఁ దడియొత్తు నొప్పుగ దీన
సురటిగావించి భాసురలీలతోడ, భరితశ్రమాంబువుల్ పలుచగాఁజేయు
మెఱుగారుమైఁదీగ మెఱయుచుండంగ, మఱి యడుగులకును మడుగులు వైచు
నని యని శోకించు నశ్రులు నించు, ననయంబు మూర్ఛిల్లు నంతలోఁ దెలిసి
ప్రియభక్తి వినమితగ్రీవు సుగ్రీవు, నయత నాభుఁడు రఘునాథుఁ డిట్టించి
నాదేవిఁ గొనిచన్న నాకేశవైరి, యేదేశమున నుండు నెద్ది పురంబు
చెప్పుమా సుగ్రీవ సీత సాధింతు, నిప్పుడ దైత్యుని నేపడఁగిఁతు
నావిని యూరవినందనుం డనియె, దేవ యూద్రోహిమందిరము నే నెఱుఁగ
నెఱుఁగకుండిననేమి యిటమీఁద వాని, నెఱుఁగుతెఱుంగెల్ల నేను గావింతు
నీవె శోకముమాని నిశ్చలధైర్య, భావగుణాస్పదపరుఁడవు గమ్ము
అతిపరాక్రమశాలి యగువాలిచేత, హృతకళత్రుండనయ్యె నేనింత వగవ
నాపద యనువార్ధి కాత్మధైర్యంబు, దేప నేయునరుండు దెలివిమైనుండు
మావంటిప్రాకృతమనుజులయట్ల, నీవును శోకింప నీతియె దేవ
యనుడు సుగ్రీవునియూహ్యవాక్యములు, విని ధీరుఁడై రఘువీరుఁ డెంతయును
ఇంతివోయినజాడ నెఱిఁగినపిదప, నంతరంగంబున నడలుచు ననికి
మగపాడి గాదని మది నిశ్చయించి, జగతీశుఁ డంతట సంతాప ముడిగి
సరసిజాననఁ బూని సాధించుపనికిఁ, బరికించి మును వీని పగదీర్తు ననుచు
మీనాశితోడివు సౌమిత్రికి నిచ్చి, భూనాథుఁ డట నర్కపుత్రు నీక్షించి
యాపదమున సఖుఁ డైనట్లు చుట్ట, మాపాటి గానేరఁ డారసి చూడ
గుణవంతుఁడైనను గుణహీనుఁడైన, గణియింప సఖుఁడె సద్గతి యండ్రు బుధులు
గావున నీచెల్మి గలిగిన నాకు, నేవెంటఁ గొదువలే దిది నిశ్చయంబు
నీపత్నిఁ గైకొని నినుఁ జంపఁగోరు, పాపాత్ముఁ డగువాలిఁ బరిమార్తు నిపుడు
అన్నదమ్ములమైత్రి నలరుటకంకె, నున్నదా సౌఖ్యమా యొరిమెకు మాని
యగచరాధిపుఁడ నీయన్నకు నీకుఁ, బగయైనవిధము దప్పక చెప్పుమనిన
నోరామ వాలికి నొగి నాకు నైన, వైరానుకథనంబు వర్ణింతు వినుము
కడఁగి మంథరగిరి కవ్వంబుఁజేసి, తడయక వాసుకిఁ దరిత్రాడుచేసి
మమ్ము దేవతలెల్ల మన్ననసేయఁ, గ్రమ్మినలెలివిమై ఘనభుజాబలిమి
వాలియు నేనును వడినొక్కవంక, వ్రాలితి మొకవంక వ్రాలిన వారు

సురగరుడోరగాసురసిద్ధసాధ్య, వరులందఱును క్షీరవారిధిఁ దరువ
గరళంబు పుట్టి లోకము లెల్లఁ గాల్ప, హరుఁ డదియును ద్రింగ నద్భుతంబనఁగ
అలరంగ జ్యేష్ఠయు నం దుదయింపఁ, గలిరాజు దానిని గైకొనెఁ బ్రీతిఁ
బ్రస్తుతి కెక్కుచు బహుళంబులైన, వస్తుచయంబు లవ్వారిధిఁ బుట్టెఁ
దమతమకోర్కెలుఁ దగినవస్తువుల, నమరంగఁ గైకొని రందఱు ప్రీతి
నలిఁ బుట్టె నైరావణము మేఘమహిష,ములు మకరకరేణువులు హయవృషభ
మవి జనియింప నింద్రాదిదిక్పతులు, వివిధయానములుగా వేడ్కఁ గైకొనిరి
మహనీయసౌభాగ్యమహిమలు తనకు, సహజంబులై లక్ష్మి జనియింపఁ జూచి
యామహాలక్ష్మి నారాయణుం డపుడు, కామించి తనదేవిగాఁగఁ గైకొనియెఁ
జంద్రుఁడు దేవతాసతు లుదయింప, నందఱిలోఁ దార యనునాతి మాకు
దేవత లిచ్చినఁ దివిరి గైకొంటి, మావిధంబున మఱి యందఱుఁ దరువ
జనియించె నమృతంబు సకలదేవతలు, ననురాగమునుబొంది యానుథారసము
కామధేనువు కల్పకములాదిగాఁగ, సోమునిఁ గొని తమచోటికిఁ జనుచు
నమరులు మ్రమ్మంప నర్థితో వచ్చి, కమనీయపదమునఁ గాంతతోఁ గూడి
కలిసియుంటిమి కొంతకాలంబుదనుక, అలయసుషేణుని యనుఁగుఁగూఁతురును
జెలువొప్పఁ బెండ్లియై చెలఁగువేడుకల, వలనొప్ప రుమగూడి వర్తించుచుండ
మాతండ్రి తర్వాత మంత్రులు పెద్ద, యీతఁ డంచును వానరేంద్రపట్టంబు
వాలికిఁ గట్టి రావాలియు నన్నుఁ, జాల మన్ననచేసి సంప్రీతి నడుప
నతనికి బంటనై యహరహం జేను, బిత్రసమానునిగాఁగఁ జేర్మి నేవింతు
నీరీతి ననోన్యహితులమై మెలఁగ, శ్రీరామ యొకనాఁడు చిరవైరమూని
తొడరిన కడఁకతో దుందుభిగన్న, గొడుకు మాయావియ్ ఘోరరాక్షసుఁడు
నడురేయి కిష్కింధనగరంబు చెఱర, వడి నార్చి గర్వదుర్వారుఁడై వేర్చి
యని నేయఁ బిలిచిన నలుక దీపింప, ననుపమజయశాలి యగువాలి వెడలి
ననుఁ గూడి యున్నసన్నద్ధుఁడై కడఁగి, తనమీఁద నడువ నిద్దఱుఁ జూచి వాఁడు

వాలి మాయావితో యుద్ధముచేయుట.

అనినేయ మది భీతుఁ డై పాఱిపోయి, తనగుహఁ జొచ్చిన దర్పించి వాలి
యధికగరోద్ధతుం డగుహానిఁ బట్టి, వధియించి వత్తు నే వచ్చునందాఁక
నిచ్చట నేమఱు కీవు వేఱొకఁడు, చొచ్చిరాకుండ నిచ్చో నుండుమనుచు
గుహావాత నన్నుంచి గుహలోనఁ జొచ్చి, గుహలోన నొకయేఁడు ఘోరయుద్ధంబు
కడఁకతోఁ జేయ రక్తము వెల్లివిరిసి, యుడుగక గుహావాత నుబ్బినఁ జూచి
కనుఁగొని యార్చు రాక్షసునియార్పులను, విని వాలి రాక్షసవిభునిచేఁ జచ్చె
నిచ్చట నేనుండు టెఱిఁగిన వెడలి, వచ్చి యాదైత్యుండు వధియించు నన్ను
నని నిశ్చయముచేసి యప్పుడే పోయి, కొనివచ్చి యొకకొండ గుహావాత మునిచి
యచ్చట వాలికి నటఁ దిలోదకము, లిచ్చి కిష్కింధకు నేను వచ్చుటయు
వాలి వోయినతరువాత నీరాజ్య,పాలనంబున కీవె ప్రాప్తుండ వనుచు

వదలక మంత్రులు వానరరాజ్యపదమున ననుఁదెచ్చి పట్టంబు గట్ట
వానరకులచక్రవర్తినై యేను, నూని రాజ్యము నేయుచుండితి నంత
మనుజేశ మఱి వాలి మాయావిఁ జంపి, ననుఁ జీరి చీరి యంతట గుహఁ నేను
పెనిచి వైచినకొండ పిండిగాఁ దన్ని, చనుదెంచి నేలేమిఁ జాలఁ గోపించి
కినుకతో మఱి వాలి కిష్కింధఁ జొచ్చి, తనకు నేఁజేయు వంచనము గైకొనక
యొరి తమ్ముఁడవని యూఱడి నమ్మి, పోరాడఁ బగరపైఁ బోయినచోట
ననుఁ డించి చనుదెంచి నారాజ్యపదము, గొని ప్రీతి నేలుట కూడునే నీకు
కడుఁ బాపబుద్ధివి గావున నిన్నుఁ, దొడరి చంపిన నాకు దోసంబు లేదు
అనవుడు నేవాలి యడుగుల వ్రాలి, వినయంబు భయమును వెలయ నిట్లంటి
నొకయేఁడు మాయావియును మీరుఁ బోరఁ, బ్రకటించి రక్తపూరము గుహావాత
వెడలిన భయమంది విపరీతబుద్ధి, వడిఁ బాఱి యిచటికి వచ్చినఁ జూచి
రట్టడిమంత్రి లీరాజ్యంబు నాకుఁ, గట్టి రింతియకాని కపటమే నెఱుఁగ
నాకు నీయాగమనంబె శోభనము, నీకపిరాజ్యంబు నీవె గైకొనుము
వావిఁ దమ్ముఁడఁగాని వాలి నీకేను, నేవకుండ సుతుండఁ జెప్ప నేమిటికిఁ
గరుణాఢ్య నాయెడఁ గల్ల గల్గినను, గరుణింపుమని పెక్కుగతులఁ బ్రార్థింప
నంతకంతకు మండి యనుజునిపట్ల, నింతేల యని మంత్రి లెంత దెల్పినను
అనయుఁడై నాపత్ని యగురుమఁ బుచ్చు,కొని రాజ్యమును బుచ్చుకొని చంపఁగడఁగె
వెఱచి యే కాకినై వెనుకొని వాలి, తరుమ భూలోక మంతయు నేను దిరిగి
యేపటి పఱతెంచి యిందున్న వాఁడ, నీపర్వతము వాలి కెక్కరాకునికి
ననిన రాముఁడు వెఱగంది యీకొండ, యినతనూభవ వాలి కెట్లెక్కరాదు
వినుపింపు మనవుడు వినతుఁడై నిలిచి, యినతనూజుఁడు ప్రీతి నిట్లని పలికెఁ
దొల్లి దుందుభి యనుదుష్టరాక్షసుఁడు, బల్లిదుఁడై వరబలము రంజిల్ల
ముల్లోకములు తనమొనకు భీతిల్ల, మల్లడియై కారుమహిషమై పోయి
తఱిమి సముద్రుని తనతోడ ననికి, నఱమి పిల్చుటయు నయ్యంబుధి గలఁగి
ఘనరత్నకోటులు కానుక లిచ్చి, తునియక బల్మి నీతోను బోరాడ
ఘనుఁడైన వింధ్యాద్రిగాని యేఁ బూని, యనిసేయఁజాలఁ బొమ్మనిన నేతెంచి
జంభారిదోస్తంభసంభావితోగ్ర,దంభోళినైశిత్యదర్పభంగముల
నతులశృంగముల వింధ్యాద్రిఁ గోరాడ, నతిభీతుఁడై పర్వతాధీశుఁ డనియె
నీసరివాఁడనే నిల్చి నీతోడ, నోసరింపక పోర నోర్తునే యేను
నీలోకమున నిన్ను నెదిరి పోరాడ, వ్రాలినభుజశక్తి వాలికిఁ గలదు
బలియుఁడై కిష్కింధపాలించు నతఁడు, కలహాంబునై వాంఛ గలదేని నీకు

వాలిదుందుభులయుద్ధము.

నలఘువిక్రమ యింక నందేగుమనినఁ, జెలఁగి రాక్షసుఁడు కిష్కింధ కేతెంచి
విలయకాలాభీలవేళ గర్జిల్లు, జలదంబుగతి నార్చి సరిఁ దనతోడ
నాలంబుసేయ రమ్మని తనుఁ బిల్వ, వాలి కోపించి వెల్వడి వచ్చి యార్చి

దుందుభిగతి మ్రోయు దుందుభిఁ దాకి, యెందుఁ బోవఁగవచ్చు నింక నీకసుచు
శిలలు పాదపములు చెచ్చెర నువ్వి, తలముష్టిహతులఁ గొందలమందఁజేయ
వాఁడును వానరేశ్వరునివఱుంబు, వాఁడికొమ్ములఁ గ్రుమ్మ వాలి కోపించి
అతిఘోరుఁడై పేర్చి యచలంబు వైవ, గతిదప్ప నురికి రఘుసుఁడును వైవ
గండశైలము బుచ్చి కపిరాజు వైవ, నొండొండఁ గొమ్ముల నోహరించుచును
అరిగ్రమ్మికొని వాలి నదరంట వ్రేయ, తరిమి వృక్షంబునఁ దరువరుం డదవ
మాటున నసుర క్రమ్మఱ వచ్చి తాఁక, మోట తానెత్తుక మోఁదె నావాలి
కదిసి కొమ్ములఁ జిమ్మఁ గపిరాజు నిలిచి, కదలనిముష్టివక్త్రంబునఁ బొడువ
రక్కసుఁ డొడువ మర్కటరాజుఁ బొడువఁ, దక్కక యిరువురు దర్పించి పేర్చి
కొనకొని నూఱేండ్లు ఘోరయుద్ధంబు, మనువంశవల్లభ మఱి చేసి వాలి
శ్రీశైలరికియుఁ బిడికిటఁ దోఁకఁబట్టి, యెల్లెడఁ గుదియించి యెడపక త్రిప్పి
వడి దూలి యసురయు వాపోవ వైవఁ, గడఁగి మర్మముఁ గాంచి కడువడిఁ బొడిచి
బలిమిఁ గొమ్ములు పట్టి పడవైచి చంపి, తలకొన్నలావుమై తన్నెఁ దన్నుటయు
ముక్కునఁ జెవుల మోమున నెత్తురొలుక, నక్కులిశాహతి నద్రియోలె
నాయుగ్రదైత్యమహాకళేబరము, పోయి యోజనమాత్రమునఁ దూలి పడియె
నైరికనిష్ఠురాకారంబు లగుచు, నారక్తకణము లయ్యద్రివైఁ బడిన
నారసి యిచట నిత్యము తపంబున్న, దారుణశక్తి మతంగుఁడు గినిసి
యీపర్వతము వాలి కెక్కరాకుండ, శాపంబు గావించె జగదేకనాథ
కాన నీబుశ్యమూకమునందు వెఱవ, కేను గావుండుదు నెల్లకాలంబు
కడగి యీదుందుభికాయంబుఁ బుచ్చి, పుడమిపై యోజనంబును బాఱవైవ
వలనైన భుజశక్తి వాలికిఁగాని, తలపోయ నొరులకుఁ దరముగా దధిప
నైకొని నీవంతకంటె దూరముగ, నీకళేబర మిప్పు డిట మీటకున్న
నెనసిన మీసత్త్వ మిచ్చ నే నమ్మ, ననవుడు రఘురాముఁ డల్లన నవ్వి
యీదుందుభిశరీర మవలీల మీటి, నీదుసందేహంబు నేఁడు వాపెదను
ఇనతనూభవ దాని నేర్పడఁ జూపుఁ, మనవుడు సుగ్రీవుఁ డర్థితోఁ జూప
ఘనమేరుమందరాకారమైయున్నఁ, గని కళేబరము డగ్గరకు నేతెంచి
గొనకొని దానిఁ నైకొనక నంగుష్ఠమునఁ బదియోజనంబులు మీటివై చె
వైచిన రఘురామువరశక్తి పేర్మి, జూచియు నమ్మక సుగ్రీవుఁ డనియె
నెలమిమై నిది వాలి మీఱెడునాఁడు, దలమైనరక్తమాంసములతోనుండు
మనుజేశ నేఁ డస్థిమాత్రమైయుండఁ, గని నీవు మీటితి గాక యొక్కింత
వడిఁ బేర్చ నీలావు వాలిలావునకుఁ, గడు నెక్కుడని నమ్మఁగారాదు దేవ
యతఁ డిదియునుగాక యలవొప్ప మీటు, ఋతిధరంబులు పుట్టచెండులమాడ్కిఁ
జతురంబునిధులందు సంధ్యలు వార్చి, శితికంఠపదముల శిరమర్ధిఁ జేర్చు
వాయువుకన్న జవంబు హెచ్చుగను, దోయధు లన్ని దోడ్తో దాటివచ్చు
వాలికి నిర్జరేశ్వరదంతి హేమ,మాలి కెవ్వరు సాటి మఱియొండు వినుము

ధరణీశ యియ్యేడుతాళ్లును దొల్లి, వరశక్తియుక్తిమై వాలి బిట్టెగసి
కరముల నొక్కటిగాఁ గూడఁబట్టి, తరమిడి వానిపత్రములెల్లఁ ద్రుంచు
నడరి తాళంబుల నందొక్కఁజాలఁ, వడిఁ గదల్పఁగలేరు వాసవాదులును
దలకొని యొకకోల తాళంబు లేడు, నిలువక గాఁడిపో నేసితివేని
వసుధేశ నీలావు వాలిలావునకు, నసమానగతి నెక్కు డని నమ్మవచ్చు
ధరణీశ యీసప్తతాళంబు లొక్క,శరమునఁ దెగవ్రేయు శౌర్యంబు గలుగు
పురుషునిచే వాలి బొలియు నటంచు, నరయ నాకు మరుత్తుఁ డనుమని చెప్పె
నన విని రఘురాముఁ డల్లన నవ్వి, వనచరాధిప తాళ్లు వదలక చూపు
మనవుడు సుగ్రీవుఁ డారాము వేగ, కొనిపోయి యాతాళ్లగుఱి తెఱిఁగింప
నళినిసంకాశమై యసదృశంబైన, నిశితాస్త్ర మరివోసి నిపుణుఁడై నృపుఁడు
ముంచి యొక్కట పంక్తిముఖునాళ్లతాళ్లు, ద్రెంచినగతిఁ దాళ్లు తెగనేయుటయును
నవనిపై వక్రంబు లైయున్న తాళ్లు, నవిరతంబుగఁ బడినవి గాడిపాటి
చేరువగిరి దాఁటి చెచ్చెర మీఁటి, ధారణి దూఁటి పాతాళంబుఁ జేరి
యలయక తీవ్రత నమ్మహాశరము, తొలఁగక రఘురాముదొన వచ్చి చొచ్చె
నతులితం బగురవ మాకాశవీధి, నతులవిమానంబునందుండి పలికె
పరమాత్మయే సురపతికడ నుండుఁ, గరుణావతి యనెడు కన్నికఁ దొల్లి
నిరతంబు దుర్వాసు నిందించుటయును, గరమల్లి శాపంబు గావించె నిట్టి
రూపమై ధరణీశ రూఢి నీకతన, శాపమోచనమయ్యెఁ జనియెద నింక
నని చెప్పి యాలేమ యమరేంద్రపురికిఁ, జనుటయు రఘురాముశరము తాఁ దూణి
జొచ్చినఁ గనుఁగొని సుగ్రీవుఁ డప్పు, డచ్చెరువును బొంది యానందమంది
సప్తపాతాళసంసక్తమూలములు, సప్తార్ణ్వమండలాచ్ఛాదిపత్రములు
నగుసప్తతాళంబు లస్త్ర మొక్కటనె, తెగనేసె నాదు సందేహంబు వాయ
వాలి రాఘవునిచే వడిఁ జచ్చు నింక, నేలితి లోకంబు లేలితిఁ దార
నేలితిఁ గపిరాజ్య మేనని పొంగి, యాలోనఁ గపివీరు లానందమందఁ
కమలాప్తకులనాథుఁ గాకుత్స్థుఁ జూచి, కమలాప్తసుతుఁ డంతఁ గరములు మొగిచి
దేవ దేవరమూర్తి దృష్టించి లావు, భావింపలేనైతిఁ బశుబుద్ధి నైతి
నినజుండ నేను నీవినవంశభవుఁడ, వని సమబుద్ధినై యపరాధి నైతి
నీలోకమునకెల్ల నేలిక వీవు, పాలింపు నన్ను నీబంటుగా నేలు
నాశత్రుఁ దెగటార్చి నారాజ్య మిచ్చి, నాశోక ముడుపవే నరనాథచంద్ర
యనవుడు సుగ్రీవ నతికృపాదృష్టిఁ, గనుఁగొని మన్నించి కాకుత్స్థుఁ డనియె
చెచ్చెఱ నీవు కిష్కింధకుఁ బోయి, యచ్చట వాలితో ననిసేయుచుండు
మవలీల నొకకోల నావాలిఁ జంపి, ప్రవిమలకపిరాజ్యపదము నీకిత్తు
వెఱవక సుగ్రీవ వేగ పొమ్మనిన, నఱలేనికడఁకతో నప్పు డుప్పొంగి
నలుఁడు నీలుఁడు నంజనాతనూభవుఁడు, బలియుఁ డాతారుండు బలసి తోనడువ
నాఁడికి సన్నద్ధుఁడై బల్మి మెఱసి, రాజిల్ల వెనుక నారామలక్ష్మణులు

వచ్చి కిష్కింధ కవ్వల నున్నవనము, చొచ్చి గూఢముగ నచ్చోఁ దన్నుఁ బనుప
వడిఁ బోయి కిష్కింధవాకిట నిలిచి, యడరి సుగ్రీవుఁ డుదగ్రుఁడై యార్చి

వాలిసుగ్రీవులు పోరుట.

తడయక తనతోడఁ దగిలి పోరాడ, వడి నేగుదెమ్మని వాలిఁ బిల్చుటయుఁ
గరిబృంహితంబు లాకర్ణించి వెలుచఁ, గరివైరి కోపించుకరణిఁ గోపించి
శితికంరుచరణరాజీవాలి వాలి, కృతబంధరావణగ్రీవాలియైన
వాలి సుగ్రీవుని వడి వచ్చి తాఁకె, వాలిసుగ్రీవు లవక్రవిక్రములు
చెలరేఁగి పూర్వపశ్చిమసముద్రమ్ములు, బలువిడి పోరాడుభంగిఁ బోరాడ
సమరూప సమకోప సమజవాటోప, సమసుప్రతాపులై జానుజంఘోరు
జత్రువక్షోనాబిజఘనదేశములు, చిత్రవైఖరి నొంచి చించి చెండాడ
నాయెడ భృతి రాముఁ డమ్ము సంధించి, యేయ నుద్యోగించి యిరువురఁ జూచి
వదనముల్ రదనము ల్వాలము ల్వాహు, లుదరంబు లధరంబు లూరులు బరులు
కఱుము ల్వఱుము ల్కాళ్లును వ్రేళ్లు, వీఁపులు శిఱులు వేషభాషలును
జెక్కులు ముక్కులు శిరము లంసములు, ప్రక్కలు పిక్కలు పాదయుగ్మములు
కర్ణము ల్వర్ణము ల్కరము లంగములు, నిర్ణయింపఁగ నొక్క నెరియైనఁ జూచి
యే తెఱుంగునఁ జూడ నిరువురయందు, నీతఁడు సుగ్రీవుఁ డీతఁడు వాలి
యని యేర్పఱింపంగ నలవిగాకున్న, దనలోన వెఱగంది దశరథాత్మజుఁడు
ఎడపక యేసిన యీయమ్ముచేతఁ, దొడిఁబడి యెవ్వండు త్రుంగునో యనుచు
నమ్ము విడువకుండె నంత సుగ్రీవుఁ, డిమ్మెయిఁ గడు నొచ్చి యే వెల్లఁ బొలిసి
వలఁతియై పోరాడి వాలికి నోడి, బలమేది యాతని బలుముష్టిహతుల
గుల్లలతిత్తియై కుట్టూర్పు లెసఁగ, చెల్లఁబో నేనేల శ్రీరాము నమ్మి
వచ్చితిఁ బదివేలు వచ్చోఁ జాల్నాకు, వచ్చినత్రోవఁ బోవఁగవలె ననుచు
మెలుకువచెడి తోఁక మెడమీఁద వైచి, సొలసి కెలంకులఁ జూచుచుఁ బాఱి
తనబుళ్వమూకంబు తడయక యెక్కి, తనమది శోకించుతఱి రాముఁ డరుగ
నలఘువిక్రమధాముఁ డగురాముతోడఁ, దలవంచుకొని యర్కతనయుఁ డిట్లనియె
వసుధేశ నిను నమ్మి వాలితోఁ గదిసి, యసమానబలరూఢి నడరి పోరాడ
న న్ను వేఁటించితి నసుఁ గావవైతి, మిన్నక చూచితి మేకొనవైతి
జగతిపై సూర్యవంశంబునఁ బుట్టి, తగునయ్య నీకిట్లధర్మంబు సేయ
దేవ నీసత్యంబు తేజంబు నమ్మి, యే వాలిఁ దొడరితి నింతియే కాని
యతఁ డేడ నేనేడ యాహవం బేడ, బ్రతికి వచ్చుట యేడ భావించి చూడ
నేమిభాగ్యముననో యెప్పటియట్ల, రామ యీపర్వతాగ్రము చేరఁగలిగెఁ
బగతునిచే భంగపాటు లీరీతి, నగుఁబాటు నొదవె నిన్నమ్మినకతన
దగవును గృపయును ధైర్యంబు శక్తి, మిగుల నీయెడఁ జూచి మెచ్చి నమ్మితిని
అనవుడు సుగ్రీవ యాత్మలో నింత, యనుమానపడనేల యకట నావలనఁ
దప్పు లేశము లేదు బాయకు నిన్ను, నొప్పగింతునె విను మొకమాటఁ దెలియ

విశ్వమోహనరూపవిఖ్యాతు లైన, యశ్వికుమారులయట్ల యేపట్ల
వరరూపరేఖలు వాలికి నీకుఁ, బెరసిన సమములై భేదింపరాక
నేనేయ వెఱచితి నిట నమోఘంబు, గాన నీకిది కీడుగాఁ జూడవలదు
కరమొప్ప నింక నీగజపుష్పమాల, ధరియించి పోయి యుద్ధమునేయుచుండు
బెదరక వాలిఁ జంపెద నిశ్చయింపు, కదలుము కిష్కింధకడకు నీవనుచు
గాదిలితమ్ముచే గజపుష్పమాల, నాదట తెప్పించి యతనికంఠమునఁ
జొక్కంబుగాఁ జేర్చ సుగ్రీవుఁ డొప్పెఁ, జుక్కలు పెనఁగొన్న సోముఁడో యనఁగ
సరిబలాఢ్యతోడి సంధ్యాభ్ర మనఁగ, మెఱసి యంతయుఁ గడు మీఱి యేతేర
నంతఁ గాకుత్స్థుఁడు ననుజుండు దాను, సంతతంబును యుద్ధసన్నద్ధు లగుచు
నలనీలతారాంజనాతనూభవులు, కెలఁకులఁ గొల్వ సుగ్రీవుఁ దోడ్కొనుచు
నదులు పూపొదలు పున్నాగ నారంగ, కదళికాసహకారకాంతారములును
భాసుర కైరవ పద్మకల్హార, వాసితబహుసరోవరవిశేషములు
కాసరకేసరికరివరాహములు, నాసక్తిఁ గనుఁగొంచు నటఁ బోయి పోయి
దీప్తవైశ్వానరతేజు లై యొప్పు, సప్తజనాహ్వయసంయమీశ్వరుల
యాశ్రమ మీక్షించి యంతయుఁ దెలిసి, సుశ్రీమహత్వంబు సుగ్రీవుచేత
బలిశాలి యగువాలి పాలించుసిరుల, విలసిల్లు కిష్కింధ వీక్షించి నృపుఁడు
తొల్లింటిచందాన దురమొనరింపు, బల్లిదుఁ డగువాలిఁ బరిమార్తు ననుచుఁ
గృతమతి నంత సుగ్రీవు మన్నించి, యతనిఁ బొమ్మని పంచి యాసమీపమున
ననుజుఁడు సౌమిత్రి యటు చేరియుండి, మనుజేశుఁ డొకమానిమాటున నుండె
నహమాంశునందనుం డంత కిష్కింధ, గుహ లెల్ల భేదిల్ల ఘోషించి యార్చి
తనతోడ ఘోరయుద్ధమునకు నింద్ర,తనయుఁబిల్చుటయు నెంతయు బిట్టుగినిసి
మానక వీడొక్క మగవాఁడుపోలెఁ, బూనినభుజశక్తిఁ బొంగుచున్నాఁడు
వీని సైరించుట వెరపు గాదింక, వీనిఁ జంపెదనని వెస నిశ్చయించి

తార సుగ్రీవునితోఁ బోరవద్దని వాలి నడ్డగించుట.

యతిసత్త్వజయశాలి యగువాలి వెడలఁ, బతిఁ జూచి వెస నడ్డపడి తార పలికె
దేవేంద్రనందన దినపజుమీఁద, నేవిచారము లేక యేల పోయెదవు
నతఁడు నీతో నిష్ప డనిచేసి నొచ్చి, మతిచెడి పాఱి క్రమ్మఱ వచ్చుచెల్ల
నెగడినకడిమిమై నీకంఁ టె నెక్కు, డగుసహాయము లేక యతఁ డిందు రాఁడు
అనిమిషేశ్వరపుత్ర యదియునుగాక, యెనర నంగదుచేత నొకమాట వింటిఁ
బనివడి తమతండ్రిపనుపునఁ జేసి, వనవాసమున నుండ వచ్చినచోట
దశరథ్రరాముఁడు తనధర్మపత్ని, దశకంధరునిచేతఁ దాఁ గోలుపోయి
తనతమ్ముఁడును దాను దడయక వెదక, నని వారు ఋశ్యమూకాద్రికి వచ్చి
పనిగొని సుగ్రీవు బంటుగా నేలి, యని నిన్నుఁ జంపెద నని వచ్చినాఁడు
ఆరాఘవుఁడు విష్ణుఁ డంబుజోదరుఁడు, వైరంబుగొని గెల్వ వశముగా దతని
ననసుతునకుఁ బ్రీతి నీరాజ్య మిచ్చి, చని నీవు రఘురాము సంధిగావింపు

వినుమదిగాదేని వీర్యంబు విడిచి, మునివృత్తిఁ జని ప్రాణమును గాచికొనుము
అని తార పలికిన నావాలి గినిసి, విను నాకు పత్నివై వెఱపేల యింత
బలశాలియైనట్టి బలియుననైనఁ, గలన జయంబు నేఁ గైకొందుఁగాని
పరులకు నేనోడఁ బగవాఁడు వచ్చి, పెరిగి యుద్ధమునకుఁ బిలిచినచోట
ధీరత దొఱఁగి సంధికి నియ్యకొనుట, వీరధర్మము గాదు వెలఁది నాకింక
నలినలోచన విను నాయంతవాని, బలియుఁ జెప్పట్టక పట్టె సుగ్రీవుఁ
గాన రాముఁడు నీతిగలవాఁడుగాఁడు, గాన రామునిపొందు గావింపఁదగదు
తెరలి సుగ్రీవుండు దిక్కులేకున్న, నరిగి రామునకు బంటై చేరెఁగాక
నాకేల రాముఁడు నాకేల సంధి, నాకేమిటికి వేఁడ నలి దూలి యొకని
నామహితాత్మకుం డతిధర్మపరుఁడు, రాముఁడు నన్ను నూరక యేల చంపుఁ
బోల వీమాటలు పోయి సుగ్రీవు, వాలాయముగఁ గ్రూరవజ్రప్రహార
మూలమై యొప్పు నాముష్టిఘట్టనల, నేలఁ గూలిచి వత్తు నెమ్మదినుండు
మని తార మరలిపొమ్మని వీడుకొలిపి, యనిమిషేశ్వరపుత్రుఁ డగువాలి వెడలెఁ
గలఁగొనచుట్టిన కర్మపాశములు, నెలకొని దిగిచిన నిలువరాకున్న
వెడలుచందంబున వెరవును లావు, కడిమియుఁ దెంపు నుత్కటముగా వెడలి
శరధులు గలఁగ భూచక్రంబు వడఁక, గిరు లొడ్డగిల్లఁ గిష్కింధ ఘూర్ణిల్ల
గర్జించి చనుదెంచి కదిసి సుగ్రీవు, తర్జించి చూచి యుదగ్రుఁడై పలికె
నాతోడఁ బోరాడి నాకోడి పాఱి, యే తెంచితివె యిప్పు డిటు లజ్జ మాని
యే తెంచితేనేమి యిప్పుడే జమునిఁ, వాఁతికి నిను నుత్రవడియం బొనర్తు
బెదరక చెదరక బెట్టుబీరములు, వదరక యొక్కింతవడి నిల్వు చాలు
నాలంబులో ముష్టిహతి నిన్ను నేలఁ, గూలిచి ప్రాణము ల్గొందు నేననుచు
నుఱుమనిపిడుగుతో నుల్లసంబొడు, కఱకైన తనముష్టి గట్టిగాఁ బట్టి
పరతెంచి పొడిచిన భానుతనూజుఁ, డొరగి నెత్తురు గ్రక్కి యొయ్యనఁ దెలిసి
ధీరుఁడై నిలిచి గర్దించి యింద్రజుని, కేరడంబొడి సుగ్రీవుఁ డిట్లనియె
నన్నవు నాకుఁ బూజార్హుండ వనుచు, నిన్నాళ్లు సైచితి నింతియేకాని
విగ్రహంబున కేను వెఱతునే తొంటి, సుగ్రీవుఁడను గాను జూచి పోరాడు
వాలి నిన్నిప్పు డవశ్యంబు చంపి, పాలింతుఁ గపిరాజ్యపదము నేననుచుఁ
గడునల్లి సాలవృక్షము వేగ దెచ్చి, వడినార్చి వైచిన వాలి కంపించి
పుడమివైఁ బడి మూర్ఛఁబొంది యొక్కింత, వడిఁ దేఱి గర్వదుర్వారుఁడై; మిగుల
ధీరుఁడై శూరుఁడై దివిజు లుప్పొంగ, నారవిజుని వైచె నడరి శైలమున
నదరక సుగ్రీవుఁ డడఁచె వాలమునఁ, బదములఁ నొప్పించె బలియుఁడై వాలి
కరనఖంబుల వ్రచ్చెఁ గడఁగి సుగ్రీవుఁ, డురుముష్టి నొప్పించె నుగ్రుఁడై వాలి
యంతటఁ దనియక నార్పులు నిగుడ, నంతకంతకు లావు లడరి యిద్దఱును
ఘనపదాపది కచాకచి నఖానఖని, జెనసి ముష్టామముష్టి చెలఁగి పోరుచును
హుమ్మని మ్రోయుచు నూర్పు లొండొండఁ, గ్రమ్మ నంగముల రక్తంబులుబ్బుచును

వాలము ల్బాహులు వరుస నొండొండఁ, గీలించి పెనఁగుచుఁ గినిసి తాఁకుచును
బొయుచు డాయుచు బలిమి నొండొరుల, ప్రేయుచుఁ ద్రోయుచు విపులసత్త్వముల
దూటుచు దాఁటుచుఁ దోడ్తోనఁ బగలు, చూటుచు మీఁటుచు సాంద్రమర్మముల
నిరువురు కడిమిమై నిబ్బంగిఁ బోఁక, సురలోకనాయకసుతునకు లోఁగి
తరణితనూజుఁ డత్తఱిఁ జాల నొచ్చి, గరువంబు దక్కి సంగరభూమిఁ జిక్కి
పెదవులు దడపుచుఁ బెంపెల్లఁ బొలిసి, కుదిసి భీతిల్లి దిక్కులు చూచుచుండె
నిగ్రహానుగ్రహానిధి రాముఁ డంత, సుగ్రీవుఁ డలవడ స్రుక్కుటఁ జూచి

అమోఘాస్త్రమచే వాలి గూలుట.

యీలోననే వాలి నే నేయకున్న, వాలి సుగ్రీవుని వధియించు ననుచు
జలనిధు లేడును జగము లీరేడు, కలఁగి భూతలమెల్లఁ గడఁగి కంపింప
గుణనాద మెనరించి కోరిమిఁ బెంచి, తృణముగా దృష్టించి తెగఁ దీసి బోసి
వెస నమోఘాస్త్రంబు వింట సంధించి, యసమానబలశాలి యగువాలి నేసె
నేయుడు నబ్బాణ మినవహ్నిరుచుల, మాయించి వడి నభోమండలి నిండి
యురుతరానలకీల లొలుక నొండొండ, గరుడోరగామరగంధర్వ లదరఁ
దనపుత్రు రక్షింప దాయ శిక్షింప, నినుఁ డిట్టి యస్త్రమై యే తెంచె ననఁగఁ
దపనపుత్రుఁడుగాన దండధరుండు, కృపఁ దమ్ముఁడైన సుగ్రీవునిఁ బ్రోవఁ
దనకేల దండ ముద్ధతి వాలిమీఁదఁ, బనిచెనో యన మహాపవనవేగమున
నురవడిఁ జనుదెంచి యురమున నాటఁ, దరుచరపతి గూలె దర్పంబు దూలి
కెరలి దిక్కరులతో గిరులతోఁ బెలుచఁ, దరులతో నందంద ధరణి గంపింప
నురముగాడినబాణ ముఱువడి వెడలి, ధరఁగాడె నత్తఱిఁ దరుచరేశ్వరుఁడు
నవిరళరక్తసిక్తాంగుఁ డై వాలి, యవనిఁ ద్రెళ్లిన పుష్పితాశోక మనఁగఁ
బ్రళయకాలంబునఁ బ్రభ లెల్ల మాని, యిలమీఁద వ్రాలిన యినునిచందమున
నవశుఁడై యవనిపై నమ్మతో నుండ, నవనీశుఁ డగురాముఁ డటఁ జేరవచ్చె
వచ్చిన రఘురాము వాలి వీక్షించి, యిచ్చ లోపలికోప మెసఁగ నిట్లనియె
నోరాఘవేశ్వర యోరామచంద్ర, ధారణిపై నిన్ను ధర్మాత్ముఁ డండ్రు
దమమును శమమును దయయు సత్యంబు, సమబుద్ధి నీతియు సౌమనస్యంబు
మొదలైన షడ్గుణంబులరాశి యగుచు, పొదవిన నీపెంపు పొల్లుగాఁజేసి
యెనసి సుగ్రీవుతో నేను బోరాడ, ననుఁ నేయ నగునయ్య నడుఁజొచ్చి నీవు
ఏను నీ కపకార మెన్నఁడు నేయ, నేను నీకును దోష మిచ్చుఁ జింతింప
నీకు శత్రుఁడగాను నీశత్రుఁ గూడ, నీకు శత్రులు లేరు నిక్కతు లేనెఱుఁగ
నెఱిఁగి యుపేక్షింప నిటునేయఁదగునె, నెఱిఁగియు నెఱుఁగవై తినవంశతిలక
శరభకంఠీరవశార్దూలకోల, కరిహరిణాదుల ఖండింపఁ గోరి
వసుధ రాజులు వేటవత్తురుకాక, యెసఁగఁ గోతులఁబట్టి యెందుఁ జంపుదురు
అర్కసూనుఁడు మేము నన్నదమ్ములము, కర్కశమతిఁ బూని గారవం బెడలి
యడర మేమెఱ్ఱైన నైతిమికాక, కడఁగి నీవిటు చంపఁ గారణం బేమి

కుండేలు నుడుమును గూర్మంబు నేదుఁ, బందిశాలువయును భక్ష్యములు గాని
వంచనఁ జంపి యిూప్లవగంబుఁ దినరు, పొంచి నన్నిట్లేసి పొలియించి తేల
మనుజేశ యింక నామాంసరక్తంబు, లనుభవింపుము నీవు ననుజుండుఁగూడి
విశదకీర్తుల జగద్విఖ్యాతుఁడైన, దశరథు పనుపున ధర్మంబు వూని
వనములఁ దపసివై వర్తింప వచ్చి, జననాథ జీవహింసకు రోయవైతి
ధరణివై మే మొక తప్పుచేసినను, భరతుండు తగుఁ గాక పట్టి శిక్షింప
నీకుఁ గారణమేమి నీవు భూపతివె, చేకొని యిట్లేల చేసితి నన్ను
నీదేవిఁ గొనిచన్న నీచరావణుని, వాదట సాధింతు నని యేగుదెంచి
నను డించి నీ వర్కనందనుఁ బట్టి, తనయంబు నీతి బోలైతి లోకముల
నీవార్త నీవు నా కెఱిఁగించితేని, జేవ నీదేవి సాధింపనే యేను
నాతతబలశాలి యై యేగుదెంచి, సీతామహాదేవి చెఱఁగొని చనిన
వానిని మున్ను నా వాలరోమములఁ, బూని బంధించి యంబుధులెల్ల ముంచి
కరుణించి విడిచిన ఘనబాహుశక్తి, సొరిది లోకములను సుగ్రీవుఁ డెఱుఁగుఁ
బెలుకుర నన్నుఁ జంపెడివాఁడ వకట, బలిమిమై నాదృష్టిపథమున నిల్చి
ననుఁ బేరుకొని పిల్చి నను మందలించి, జననాథ కడిమిమైఁ జంపలే వైతి
చలము గైకొని డాగి చంపితి నన్ను, దలపోయ నిది రాజధర్మంబె యనిన
వాలిమాటలు విని వసుధేశుఁ డనియె, వాలి యీమాటలు వలవదు నీకుఁ
గపివంశమునఁ బుట్టి కపులతోఁ బెరిఁగి, చపలుఁడవై ధర్మశాస్త్రంబు తెఱఁగు
తెలియక నీవు నాదెసఁ దప్పు మోపి, పలికెద విది ధర్మపద్ధతి గాదు
నీవన్నపలుకు లన్నిటికి యుక్తముగ, నావాక్యములు కొన్ని నయబుద్ధి వినుము
అనుజునిఁ దనుజస్తు నట్లగ్రజుండు, మనుపంగవలె నండ్రు మహి ధర్మవిదులు
ఆమేర దప్పి నీవపరాధహీనుఁ, డామరసాప్తనందనుఁ బురి వెడల
నడఁచి వానిని గోడ లై యొప్పు నతని, పడఁతిని రతిఁ బట్టి బల్మి భోగించు
కామాంధుఁ డెంతైనఁ గలఁడె నీవంటి, పామరుఁ డొకఁడుదప్ప జగత్త్రయమున
నది యటులుండని మృతఁడును నేను, కదిసి సఖ్యముసేయుకతమున నీవు
జగతిపై నామిత్రశత్రుండ వగుట, దెగి నాకు నిన్ను వధించుట తగవు
అకలంకులై వేటలాడెడివారు, నొకటి దీమమునొడ్డి యొకటి నెయుదురు
ఉరుశక్తిమాటున నుండి వేయుదురు, పరికింప దీనఁ బాపము లేదు నాకుఁ
గావున శాఖామృగం బగునిన్ను, నేవిధిఁ జంపిన నెగ్గేల కలుగు
చతురబాహుశక్తి జగతి నంతటికిఁ, బతియైన భరతునిపంపున వచ్చి
దుష్టమృగంబుల దుష్టరాక్షసుల, సృష్టింపై మేము శిక్షించుచుండుదుము
నీతమ్ముఁ డగువాని నెలతఁ గైకొన్న, పాతకుఁడవుగానఁ బట్టి చంపితిని
రాజదండితుఁడు నారకబాధఁ బొడయఁ, డోజమైగాన·నాయుగ్రాస్త్రనిహతి
మనికితపడక నిర్మలుఁడవై యింక, ననిమిషరాజ్యసౌఖ్యముఁ బొందుమీవు
అనియొప్ప రఘురాముఁ డాడువాక్యములు, విని వాలి కనుమూసి వివశుఁడై యుండి

కొంతనేపునకుఁ బేర్కొని రామచంద్రు, నెంతయుఁ గనుఁగొని యిట్లని పలికె
ఓరామగుణధామ యుగ్రాంశుధామ, తారాధిపానన తార నాదేవి
దేవరశౌర్యంబు దెలిపి నేఁడనికిఁ, బోవలదన్న దుర్బుద్ధి పాటించి
విధివిహితంబున వెనకనే వెడలి, యధిప కయ్యమున నిట్లవనిపైఁ బడితిఁ
బడినకోపమున దుర్భాషలు కొన్ని, జడమతిఁ బల్కితి నైరింపవయ్య
తనపాటు చింతింపఁ దారకు వగవఁ, దనయు నంగదునకై తలఁకెద నధిప
నింత కేమగుదురో యింతియు సుతుఁడు, ఇంతటిదురవస్థ యే వచ్చు నెఱుఁగ
నని శోకమోహంబు లనుపయోరాశి, మునిఁగి మూర్ఛిలియుండె మూఁగచందమున
అంతఁగిపురంబున కావార్తపోవ, నంతలోఁ దారాదు లైనకామినులు
వాలి గూలినమాట వజ్రమై తమదు, వాలుగుండెలు నాట వసుధపైఁ గూలి
యంతలోఁ దెలియుచు హా యని వారు, నంతలోఁ దారుచు నచట సోలుచును
హా యంగదా నేఁడు నావాలి దివికిఁ, బోయెఁగదా యంచుఁ బొగలంగఁ గ్రుంగ
నంగదుఁ దోడ్కొని యతులశోకమునఁ, బొంగియుఁ బొంగి యేడ్పులు నింగిముట్ట
వేవేగ కిష్కింధ వెడలిరా నడుమఁ, ద్రోవ వారల నెదుర్కొని కపు లనిరి
వాలి రాఘవుచేత వసుధపైఁ గూలె, నేలపోయెదరు పోయినఁ బ్రమాదంబు
రాకమానదుసుమీ రామసుగ్రీవు, లేకమైయుంట మీ రెఱుఁగరే మొదల
నీయంగదునిఁబట్టి యేమి నేయుదురో, దాయల మదినమ్మఁ దగదటుకాన

తార ప్రలాపించుట

నితనిచేఁ గపిరాజ్య మేలింత మింక, మతిమంతు లగుకపు ల్మనకు నున్నారు
పోవలదన్న నప్పుడు తారతగవు, భావించి వెస వారి పలుమాఱు దూఱి
యేటి కంగదుఁడు మీరేటికి రాజ్య, మేటికి నాకుఁ బ్రాణేశ్వరుఁడైన
వాలిఁ జూడక యంచు వారి వారించి, యాలోనఁ దార తారాధిపవదన
తనమదిలో వాలిఁ దలపోసి పోసి, ఘనశోకమునఁ జనుఁగవ చూచి చూచి
యమరేంద్రసుతురాక యల్లంతఁ జూచి, సమకట్టి డాయుచు సత్కృతిఁ గోరి
రాసిగ నాసురరాజేంద్రసుతునిఁ, బాసితి రింక నీఫలము చేఁజేతఁ
గుడువు డింతటనుండి కుచములారనుచుఁ, గడునల్క వెస నుగ్రగతిమోదుకొనుచుఁ
బుడమి గంపింప నద్భుతశోకమడర, నెడపక నిబ్బంగి నేతేరఁ దార
హారములో దెగి రాల నలివేణి దూల, భారంపుఁజనుఁగవ పయ్యెదజాఱ
నీరజంబునను దేనియగారినట్టు, తోరమై కన్నీరు దొరుగ నందంద
బలువిడి నేతెంచి పవనవేగమున, లలిఁ దూలిపడు పుష్పలతికయుఁబోలె
నావాలిపైఁబడి యందఱుఁ బొగుల, లావేది తార ప్రలాపింపఁదొడఁగెఁ
గపికులాధీశ్వర కపిరాజచంద్ర, కపిరాజశేఖర కపిసార్వభౌమ
సకలసురాసురసంఘంబులందు, నకలంకసత్త్వండ వధినాథ నీవు
అటిమిుటి వింధ్యాది లగుమహాగిరులు, పెటికి వేఁటాడిన బిరుదవు నీవు
బలియుఁడై త్రిభువనపాలుఁడై వెలయు, కులశైలభేదికిఁ గొడుకవు నీవు

కోలంబుఁ డనుపేరి క్రూరగంధర్వు, నేలఁ గూల్చిన రణనిపుణుండ వీవు
నీవు మానవునిచే నీచేతఁబొంది, యీవిధిఁ బడితింక నేమనఁగలను
ఇనతనూజుఁడు నిన్ను నెదుర లావేది, యనిలోన నినుఁ గెల్తునని రాముఁ దెచ్చె
రాముని ననిఁ గెల్వరాదని యంటి, నామాట వినవైతి నామన్ని గొంటి
వామహాత్ముఁడు విష్ణు వటుపోకుమంటి, భీమశౌర్యుఁ డతండు బిరుదేల యంటి
నినుఁ జంపవచ్చిన నీపాలిమృత్యు, వనక రాముని చేత నారడిపడితి
వొలసి దేవాసురు లొగిఁ దర్చితర్చి, బలమతి యటఁ బాయఁబడియున్నఁ జూచి
యడరి వాసుకి మందరాద్రికిఁ జుట్టి, వడి సముద్రముదీర్చు వరశక్తిపేర్మిఁ
ద్రిజగంబులందును దీపించునట్టి, భుజములు పెంపూళి బ్రుంగనే నేఁడు
అతిసత్త్వుఁ డగురాక్షసాధీశుఁ బట్టి, ధృతి విలపింప నీదృఢముష్టిఁ గట్టి
మునుకొని వార్ధుల ముంచి ముంచెత్తు, ఘనవాల మిట ధూళిఁ గలిసెనే నేఁడు
కఱకంఠ శ్రీపాదకమలంబుమీఁద, తెఱఁగొప్ప నీమూళి తేటియై వ్రాలు
నట్టి నీమస్తకం బకట యిచ్చోట, వట్టినేలను గూలవలసె నేమందు
హృదయేశ నినుఁబాసి యేనిల్వఁజాల, గలిసి నీవున్న లోకమునకు వత్తు
వేదన నిటుమీఁద వేగ పాలైతి, నాదిక్కు లేమికి నాకేమి వగవ
గోత్రారినందన కోరి నీకన్న,పుత్రు నంగదుఁ జూచి పొక్కెదఁగాని
దూలితోఁబాఱి నీతొడలపైఁ బొరలు, బాలు నంగదు నేలి పాలింపవయ్య
యురమునై దొడలపై నుంచి మన్నించి, శిరము మూర్కొని ముద్దుచెక్కిళ్లపుణికి
కరము ముద్దాడి నీగారాపుఁబట్టి, వరుస నంగదు నేల వారింప వధిప
యని ప్రలాపించుచు నతివ సుగ్రీవు, గనుఁగొని పల్కె శోకము వెల్లివిరియఁ
దలకొని వాలిముందఱ నిల్వలేక, పలుమారు దెసచెడి పందవై పాఱి
గతిమాలిపోయి రాఘవుఁ దోడితెచ్చి, కృతకజయంబునఁ గిష్కింధఁ గొంటి
నీకొరినట్లయ్యె నీపగదీఱెఁ, గైకొని భోగింపు కపిరాజ్యపదవి
నెడమాటలాడ నాయినవంశుతోడఁ, గడక నీహానుమయుఁ గలిగెనే నీకుఁ
బలునూఱు బుద్ధులు పరికించి చెప్ప, నలనీలతారు లున్నారులే నీకు
ననిపల్కి రఘురాము నబ్జాక్షి చూచి, జననాథ యీవాలిఁ జంప నేమిటికి
మెఱసి నిన్నిటుచేయ మీతండ్రితోడ, గఱపెనే రఘురామ గణుతింప వాలి
వెరవొప్ప నీరాజ్యవిభవంబుగొన్న, భరతుఁడే రఘురామ పరికింప వాలి
చెనటియై నీదేవిఁ జెఱగొని చన్న, దనుజుఁడే రఘురామ తలపోయ వాలి
వాలి నకారణ వైరంబుఁ బూని, యేలయ్య తెగటార్చి తిబ్బంగిఁ గడఁగి
నీయట్టి సుకృతికి నీయట్టి పతికి, నీయట్టి కారుణ్యనిధి కిట్లు తగునె
జనకజతోఁగూడి చనియెనో యెఱుక, ఘనమైనవిరహాగ్నిఁ గ్రాగెనో యెఱుక
భూమీశ నేఁడు నాపుణ్య మిట్లుండె, నేమిసేయుదు నింక నేమందు విధిని
నీవాలి నెడఁబాసి యేనుండఁజాల, దేవ నన్నునుబట్టి తెగటార్పవయ్య
యని యురంబును మోము నందంద మోది,కొనుచు వాలిని బోరుకొని ప్రలాపింప

నావేళ హనుమంతుఁ డట తారఁ గదిసి, నీవెఱుంగనిధర్మనియతులు గలవె
దైవయత్నములంచుఁ దాఁబలుమాఱు, ధీవిచక్షణుఁ డిట్లు తెలుపుచునుండె

వాలి సుగ్రీవునకు హేమదామ మిచ్చుట.

నంతలోఁ గనువిచ్చి యమరేంద్రతనయుఁ, డింతింత యనరాక యింతిశోకింప
నంతకంటెనుమించె నంగదు వగపు, నంతయు నటుచూచి యర్కజుఁ జూచి
పూని రాముని చేత భువనంబు లెఱుఁగ, భానుజ నేఁడు నీపగ సాధ్యమయ్యె
ఋతిమీఁద రాజులకృప నమ్మఁదగదు, మతినుబ్బి చెడక యేమరక వర్తింపు
మడర రాముని తోడ నాడినిప్రతిన, యెడపక గావింపు మిటమీఁద నీవు
పాయక నాతోన బలిమి పోరాడి, మాయావి కడిమిమై మడసిన మెచ్చి
పూనినవేడ్కతోఁ బురుహూతుఁ డిచ్చె, మానైన యీ హేమమాలిక దొల్లి
యిది నీవు ధరియింపు మీకపిరాజ్య,పదమున కిది నీకుఁ బరఁగుచిహ్నంబు
లీయంగదునిశోక మింక వారింపు, నాయట్ల గొనియాడు నన్మఱింపు
మాసుషేణునిపుత్రి యైనయీతార, ధీసార దీని బుద్ధిని బ్రవర్తిలుము
ఏను జేసినతప్పు లెల్లను మఱువు, మూని నామెయిఁ బ్రాణములు నిల్పవింకఁ
గైకొను మీమాలికారత్న మనుచు, శోకానతగ్రీవు సుగ్రీవుఁ బిలువ
నతఁడును రఘురాము నానతివడసి, యతిభక్తిఁ దాల్చె నాహేమదామంబు
అనువొప్ప మఱి వాలి యంగదుఁ జూచి, తనమదిలోనున్న దయతోడఁ బలికె
నోకుమారక శోక ముడుగుము నీవు, శోకింపనేటికి సుగ్రీవుఁ డుండ
నలినాప్తసూనుండు నాకంటె నిన్ను, లలిఁ బెంపుతో నుపలాలింపఁగలఁడు
సుగ్రీవుఁ డెక్కడ శూరతఁ జూపె, నగ్రణి వైయుండు మన్న నీవచటఁ
జిరతరకీర్తులు సిద్ధించు నీకు, నురుతరసౌఖ్యంబు లొగిఁ బొందు నీకుఁ
బరఁగఁ గిష్కింధకుఁ బట్టంబుగట్టి, యరయుచునుండఁ బుణ్యము సేయనైతి
ననిమిషపురమున కరిగెద నింక, ననిచెప్పి రఘురాము నర్థితోఁ జూచి
యోరామ యేనిట్లు లోబడి సుగ్రీవు,తో రాసిబోరాడ తుది పథ్యమయ్యె
నారంగనంగదుం డబల యేమైన, నేరములే చేసిన నేర్పుగాఁ గొనుము
ఇనసుతుతర్వాత నితని రాజుగను, మనువంశతిలకుండ షహి నిల్పవలయు
వేదశాస్త్రంబుల వెదకి నిన్గాన, రాదిమధ్యాంతంబు లవిలేవు నీకుఁ
జనుదెంచి ప్రాణావసానకాలమున, నొనర నాకిదె తోఁచుచున్నాఁడ వీవు
అటుపోయె ననియెడి యామూర్తిఁ గంటి, నటుగాన నేను గృతార్థుండనైతిఁ
బంకజహితవంశ పరమకల్యాణ, యింక ప్రాణములుండ వీయమ్ముఁ బెఱుకు
మనిన రాముని యాజ్ఞ నాదివ్యశరము, పొనుపొంద నీలుండు పెఱికివైచుటయుఁ
గరమొప్పఁ దనబాహ్యగతులు బంధించి, మరలినపవనుతో మనసు సంధించి
యీమెయిఁ బరమమై యింపారురామ, శ్రీమూర్తి మనములోఁ జెలువొప్పఁ జేర్చి
బ్రహ్మపదానందపరుఁ డైనవాలి, బ్రహ్మరంధ్రంబునఁ బ్రాణము ల్విడిచె
నావేళఁ దారాదు లైనకామినులు, నావాలివైఁబడి యందంద వగవ

నంగద సుగ్రీవు లచ్చటిప్లవగ,వుంగవుల్ హావాలి పోయితే యనుచు
విలపించుచుండ నావేళ సౌమిత్రి, నలినాప్తసుతుని నందఱే విచారించి
హనుమంత నీవింక నంబరమాల్య,ఘనగంధసారాదికములు దెప్పింపు
శిబికఁ దెప్పింపుము శీఘ్రంబె తార, నిబిడహాటకరత్ననిర్మితంబుగను
అని పంప వారెల్ల నట్ల కావింప, వనచరులందఱు వచ్చిరచ్చటికి
మఱితార మొదలైనమగువలయడలు, తెఱఁగొప్పవారించె దిననాథసుతుఁడు
నాలోన రఘురాము ననుమతివడసి, వాలికిఁ బరలోక వైదికక్రియలు
చేసి యాదశరాత్రశేషకృత్యములు, భాసురగతిఁ దీర్చి పరిశుద్ధిఁ బొంది
యంగదుండును దాను హనుమదాదులును, సంగతి నారామచంద్రుఁ గాంచులయు
విపులసంతోషంబు విలసిల్ల నంతఁ, గపినాయకులకు రాఘవుఁ డిట్టు లనియె
మీరింక నాయాజ్ఞ మీఱకపోయి, శ్రీరమ్యముగను గిష్కింధఁ గైసేసి
స్థిరమైన కపిరాజ్యసింహాసనమునఁ, బరఁగ సుగ్రీవునిఁ బట్టంబుఁగట్టి
యొందంగ నంగదు యువరాజ్యపదము,నందఁ బట్టము గట్టుఁడని యొప్పఁబలుకఁ
దడయక వానరదండనాయకులు, కడుఁగూడి కిష్కింధ కప్పు డేతెంచి
నూత్నశృంగారమనోహరాగార, రత్నవితర్దికారమణీయహార
రంగవల్లీహార రంజితద్వార, రంగధ్వజోదార రమ్యపటీర
నీరపూరితమార్గ నిరుపమాకార, పౌరసంచార సంభరితంబుగాఁగఁ
జెలఁగి యాపురము గైసేయించి నగరు, కొలువుకూటంబు మిక్కుటమైనసిరికిఁ
గారణంబుగ నలంకారం బొనర్చి, వారిధి నదనదీవారియు మఱియుఁ
దగుమంగళద్రవ్యతతులుఁ దెప్పించి, మొగినిండ శుభతూర్యములు మ్రోయుచుండఁ
బుణ్యాంగనామణు లొప్పులపొందఁజాలఁ, బుణ్యాహవాచనపూర్వకంబుగను
సింహచర్మంబునఁ జిహ్నితంబైన, సింహపీఠిని గపిసింహంబు నునిచి
సురపతిఁబోలె భాసురలీలఁ బ్లవగ,వరు లభిషేకపూర్వంబుగాఁ గదిసి
లలితపుణ్యోదయలగ్నంబునందు, బలియు సుగ్రీవునిఁ బట్టంబుగట్టి
యురుసత్త్వనంగదు యువరాజ్యమునకుఁ, గర మొప్పఁ బట్టంబుగట్టిరి ప్రీతి
నంగదు యువరాజ్యమందును నిలుపఁ, బొంగె వేడుక లంతిపురవరంబునను
అల నీలతారాంజనాతనూభవులు, కలబంధువులు పొడఁగనిరి సుగ్రీవు
నితరవానరనాథు లెల్లఁ గేల్మోగిచి, రతిమోదమునఁ గొనియాడిరి ప్రీతి
అంత సుగ్రీవుఁ డుదాత్తసంపదల, నెంతయుఁ బెంపొంది యింపుసొంపొంది
వనచరబలముతో వడి నేగుదెంచి, ఘనరత్నకోటులు కానుకలిచ్చి
యాదటఁ బెంపొంది యారామచంద్రు,పాదపద్మములకు భక్తితో మ్రొక్కి
కరములు ముకుళించి కడుఁ బ్రేమ నిలిచి, పరమసమ్మదమున భానునందనుఁడు
ఇచ్చోట నేటికి నింక నాపురికి, విచ్చేయుదురుగాక విశ్వలోకేశ
యనవుడు సుగ్రీవునాననాంబుజము, కనుఁగొని ప్రీతి రాఘవుఁ డిట్టులనియెఁ
దపసులు పురమునఁ దగదు వర్తింప, దపనజ కిష్కింధ తగదు మాకింక

మహిమీఁద నాషాఢమాసంబు వచ్చె, నహితులపైఁ బోవ నను వు గాదింక
వానకాలము మాల్యవంతంబునందు, నేనుండఁగలవాఁడ నెబ్బంగి నైన
ఇనతనూభవ నీవు నీవానకాల, మెనరఁ గిష్కింధలో నుండుము పోయి
తలకొని మఱి శరత్కాలంబునందుఁ, బొలుపొందఁ బగరపైఁ బోదము కడఁగి
యనిచెప్పి మన్నించి యతని వీడ్కొలిపి, యనుజన్ముఁడును దాను నచ్చోటు వాసి

శ్రీరాములు మాల్యవంతముఁ జేరుట.

వసుధేశుఁ డమ్మాల్యవంతంబునందుఁ, గునుమకోమలిసీతగుణము ప్రాయంబు
నసమానరూపవిలాస మెన్నుచును, అసమానశోకార్తుఁ డై యుండెనంత
ధరణిజ నెడఁబాసి తలఁకెడురాముఁ, బొరిపొరి దుఃఖము ల్పొదుపుచందమున
నఱిముఱి దివినుండి యంబుజమిత్రు, మెఱయనీ కందంద మేఘము ల్వ్యాపించె
రావణురాజ్యంబు రఘురాముచేత, నీవిధి చలియించు నింక నన్నగిది
నొలసి యొండొండ విద్యున్నికాయములు, జలదంబులందుండి చలియింపఁబోడఁగాఁ
గైకొని యింక నిక్ష్వాకువల్లభుఁడు, నాకారిపైఁ దండు నడుపుచున్నాఁడు
అని సురలకుఁ జెప్ప నరిగెనో ధాత్రి, యన వాయువులతోడ నట ధూళి యెసఁగె
నాలంబులో నై తృణ మణఁగింపుమనుచుఁ, గాలుఁడు తనచేతి కాలదండంబుఁ
బొనర రాముని కిచ్చి పుత్తెంచె ననఁగఁ, దనరార దివి నింద్రధనువొప్పెఁ జూడ
నమరులు రామునకై దండువెడలఁ, గొమరార భేరులు ఘోషించుపగిది
నున్నతధ్వనులతో నొండొండఁ బర్వి, మిన్నెల్ల భేదిల్ల మేఘుంబు లుఱిమె
నలరు ప్రావృట్కాల మనుపురుషుండు, లలిమీఁద నాకాశలక్ష్మితోఁ గదియ
నొగి సరుల్దెగి రాలుచున్నముత్యముల, పగిదిఁ దొల్కినుకులు పడియె నందంద
యగపడి చెఱువోయెనని కూఁతుఁ దలఁచి, వగచి నిట్టూర్పులు వడిఁ బుచ్చుకరణి
వెఱపున నావులు వెడలె నందంద, ధరణి నెల్లడల నుదగ్రంబు లగుచుఁ
జనుదెంచి రామలక్ష్మణపయోదములఁ, గనుఁగొని సురచాతకము లుబ్బుపగిదిఁ
గనుఁగొనఁ బర్వెడుఘనపయోదములఁ, గనుఁగొని దివి చాతకము లుబ్బుదొడఁగె
ధిమిధిమి యనుచు మద్దెల మ్రోయుపాట, లమరనదీమణులాడుచందమునఁ
ఘుమఘుమ మనుచు మేఘుండు గర్జింప, నమరఁ గేకాస్ఫూర్తి నాడె నెమళ్లు
రాఁకసాంగములపై రాముబాణములు, లక్ష్యింపఁబడునిట్టి లాగునన్నట్లు
పర్వతాగ్రములపై భయదఘోషములు, పర్వి నిర్ఘాతము ల్వడియె నందంద
బ్రకటంబుగా నై తృపతిమేనిమాంస, శకలంబు లిటు రణస్థలి నిండుననిన
పరుసున నింద్రగోపము లంతకంత, నరుణారుణంబులై యవనిపైఁబడియె
రావణుఁ జంపుచో రఘురాముమీఁద, దేవతల్తలలూచి దివ్యపుష్పములు
నెడనెడ వర్షింతు రీక్రియ ననిన, వడుపున మహి రాలె వర్షోపలములు
రావణుకీర్తి పరంపర లణఁగి, పోవు నింకిట రామభూపాలుచేత
ననినచందమున రాయంచలపిండు, చని క్రౌంచగిరిమీఁదఁ జయ్యన నడచె

ననిమొనఁ దనపుత్రుఁ డైనసుగ్రీవుఁ, డనిమిషాధిపసూను నకట చంపించె
నలుగు నాపై నింద్రుఁడని సూర్యుఁడున్న, బలితంపుఁగోటన్నఁ బరివేషమొనరెఁ
గుదియనికడఁకతోఁ గోరి యాకాశ, నదినాడఁబోయిన నాగకన్యకలు
చనిచని మగుడ రసాతలంబునకుఁ, జనుదెంచుగతి వర్ష జలధార లమరె
వాసిగాఁ దమకు జీవనము లవ్వారి, గా సమర్పించిన ఘనుని వేనోళ్లఁ
బొగడుచందమున నద్భుతవృత్తిభేద, మనుచు మండూకంబు లఱచె నందంద
వలయమేఘములు ప్రావృడ్వధూమణికిఁ, గలయ మైఁబూసినకస్తూరి యనఁగ
ధరణినెల్లెడలను దనుపుసొంపెక్కి, పరఁగ నీలచ్ఛాయ పంక మొప్పారు
వారాశి నొడఁగూడి వలనేది రాము, ఘోరబాణాగ్నిఁ గ్రాగుట విచారించి
చఱచిపో వెఱచిన చాడ్పున వరద, లఱిమిఱిఁ జెఱువుల నందంద నిలిచె
లోకకంటకదైత్య లోఁబెట్టుకొంటిఁ, గాకుత్స్థుఁ డిదె నిన్ను ఖండించుననుచు
సుడిఁబడి మొఱవెట్టుచును భానుకరణి, వడిమ్రోయుచును జొచ్చె వార్ధిఁ బెన్నదుల
నంత వానలు నిల్చె నవనిపై నపుడు, నంతంత్ర దివినున్నయభ్రము ల్విరిసెఁ
దెలివొంది కిరణము ల్దిశలెల్ల నిండెఁ, జెలువొంద రవి ప్రకాశించె లోకముల
ధరణి నిష్పంకమై తనరె నెంతయును, గరమొప్పఁ గొలఁకులఁ గమలంబు లమరె
గూలము ల్మదకరుల్ గ్రుచ్చి గోరాడెఁ, దేలు నక్షత్రచంద్రికలు పెంపారె
వచ్చె నంచలు సరోవనికిఁ గాపురము, మెచ్చె దామరతూండ్లు మెలత లుల్లమున
చెఱుకు రాజనమును జేనులపంట, తఱుచయ్యె వృషభయూథముఁ రంకెవ్రేసెఁ
గలక నంతయుఁ బాసి కనుపట్టె జలము, ఇలఁ దెరువరులకు నిచ్చె సౌఖ్యంబు
చదల నిర్మలములై జలదంబు లొప్పె, నదులెల్ల నింకి కాల్నడలయ్యె నంత
అటమున్నె హనుమంతుఁ డర్కజుఁ గదిసి, యిట శారదాగమం బేతెంచె నింక
శ్రీరాముకార్యంబు సేయంగవలయు, వారువీరన కెల్ల వానరాధిపుల
రప్పింపు మనపుడు రవిసూనుఁ డలరి, యప్పుడే పడవాలుఁ డగునీలుఁ బిలిచి
వివిధపర్వతసరిద్వీపాధిపతులఁ, బ్లవగగోలాంగూలభల్లూకపతుల
రావింపు మొకఁడైన రాకున్న నాజ్ఞ, కావింపు మని యన్నిఁ గడఁకమై నిచట
తమ్ముఁడు చెయ్యూత తనతాల్మి కొసఁగ, క్రమ్మినవగ వానకాలంబుగడపి
రామభూవరుఁడు శరత్కాలమైనఁ, గోమలిఁ జింతించి కోర్కులు మెదలి
మదనాతురుండునై మదిఁ జాల భ్రమసి, యుదయాద్రిపై నున్నయుడురాజుఁ జూచి
యిదియేమియుత్పాత మిదియేమిచంద, మిదియేమి యీరాత్రి యినుఁడేల పొడిచె
నామేనితాప మిన్నడిగాఁగఁజొచ్చె, సౌమిత్రి ననుఁ దరుచ్ఛాయలఁజేర్చు
మనినఁజంద్రుఁడుగాని యర్కుండుగాడు, జననాథహరిణలాంఛన మదె చూడు
మని లక్ష్మణుఁడు పల్క హరిణాంకుఁడోయె, నని సీతఁ బేర్కొని యట మూర్ఛబోవ
దశరథాత్మజునకుఁ దమ్ముఁ డాలోన, శిశిరోపచారము ల్చేసి తేర్చుటయు
ఱుఱే వివేకమునూని మనుజవల్లభుఁడు, తఱి లంకపై నింక దండెత్తవలయు
సౌమిత్రి చూచితే జలజాప్తసూనుఁ, డేమని భాషించె నేమని పోయె

వానకాలముఁ బుచ్చి వచ్చెదననియె, వానకాలము వోయె వచ్చుట లేదు
ఒదవి నాచేసిన యుపకారమెల్ల, మదిలోన మఱచి యున్మత్తుఁడై వాఁడు
తారతో రతికేళిఁ దగిలియున్నాఁడొ, యారాజ్యమున మత్తుఁడై యున్న వాఁడొ
కాకున్న మత్కార్యగతులు భావింపఁ, డీకృతఘ్నుత కోర్చి యేటికిఁ దడయ
మతి నుపకారంబు మఱచినవాఁడు, ప్రతినదప్పినవాఁడు పాడిమైఁ దనదు
చెలికానికార్యంబు సేయనివాఁడు, తలపోయ మానవాధముఁడండ్రు బుధులు
అలవుమై నటఁ బోయి యర్కజుఁ బిలువు, పిలిచిన రానని బిరుదాడెనేని

లక్ష్మణుఁడు కిష్కింధకుఁ బోవుట.

యని వాలిఁ జంపిన యమ్మెందుఁ బోయె, ననిరమ్ము పొమ్మన్న నన్నకు మ్రొక్కి
కనుఁగవఁ బ్రళయాగ్నికణములు దొఱుఁగ, ఘనశరచాపముల్ గైకొని వెడలె
నేల యల్లలనాఁడ నిడుజంగ లిడుచు, గాలివేగమున వృక్షములెల్లఁ గూలఁ
గృతమతి నటఁ బోయి కిష్కింధఁ జేరి, యతిభీతులై కపు లందందఁ బరఁగ
నాపురద్వారస్థు లగుకపు లప్పు, డే పఱు తెంచి వీఁ డెవ్వఁడో యనుచుఁ
గోటవాకిళ్లు గ్రక్కున వేసి ప్లవగ, కోటి గావలిపెట్టి కోరి యత్తెఱఁగు
వడి రాజు కెఱిఁగింపవలెనని వారు, కడుభీతులై పాఱి కరములు మొగిచి
వడి తారపరిచార వనితలతోడఁ, దడయ కాచందమంతయుఁ దెల్పి వారు
ఇది వేళగాదన్న నెలమి నంగదుని, కదిసి సాగిలి మ్రొక్కి కరములు మొగిచి
వినవయ్య యువరాజ విఖ్యాతతేజ, మనవీటివాకిట మానివేషంబు
గనపడ జడలు వల్కలములు దాల్చి, తనకేల బాణకోదండములూని
యొకఁ డంతకుని బోలియున్నాఁడు వచ్చి, యకలంకసత్త్వుఁడై యనిన నంగదుఁడు
నారామునసుజన్ముఁ డని నిశ్చయించి, తారాతనూజుఁడు తడయక వచ్చి
సౌమిత్రి పొడఁగన్నఁ జండకోపమునఁ, దామరసాప్తనందనున కంగదుఁడు
నారాక చెప్పు నా నతఁడును బోయి, మారవికారాబ్ధిమగ్నుఁడై మిగుల
గారవంబునచేరి కరపల్లవముల, నారుమసతి యంఘ్రిల్లనఁ బిసుకఁ
దారామృదూరులు తలగడగాఁగ, నూరక సుఖయించుచున్న సుగ్రీవుఁ
గనుఁగొని వాఁడె లక్ష్మణుఁ డున్న వాఁడు, మనవీటివాకిట మండుచు ననిన
మది సంశయించుచు మంత్రులఁ బిలిచి, యిదియేమి సౌమిత్రి హితమైత్రిదప్పి
యీరీతి వచ్చుట కేమికారణము, నేరము నావల్ల నెమకిన లేదు
అని వితర్కింపఁగా నాంజనేయుండు, దిననాథసుతుతోడఁ దెలియ నిట్లనియె
ఆమహేంద్రకుమారు ననిఁగూల్చి నీకు, నీమాఁడ్కిఁ గపిరాజ్య మిచ్చినయట్టి
రామునికార్య మారడివుచ్చి యిట్లు, కామోపభోగసౌఖ్యంబులఁ బొదలి
యుందురే యందుకై యుగ్రభావమున, సందేహ మేటికి సౌమిత్రి యిటకు
వచ్చినాఁ డమ్మేటి వాకిట నుండ,వచ్చునే లోకైకవంద్యుఁ డాఘనుఁడు
రావింపు నేవింపు రాముకార్యంబు, గావింపు భావింపు కడఁగి నీప్రతిన
నావిని యారవినందనుండట్ల, రావింపఁ బంచిన రామానుజుండు

భర్మగోపురహర్మ్యపటలంబు విశ్వకర్మనిర్మితచిత్రకరకౌశలంబు
శైలాసశైలసంకాశసౌధంబు, కేళీసరోవరాంకితవనాంతరము
దేవగంధర్వావతీర్ణప్లవంగ,సేవితాగ్రంబు కిష్కింధపురంబు
చొచ్చి యచ్చోట నిస్తులవస్తుమహిమ, కచ్చెరువందుచు నటఁ బోయి పోయి
ఇంద్రగేహాముతోడ నెనయైనవాన,రేంద్రగేహాము సొచ్చి హెచ్చినకినుక
నచ్చరకొమిరెల నందచందములు, మెచ్చనిమెలఁతల మిసిమిపాటలను
వారివీణావేణువాద్యమృదంగ,భూరిభూషణరవస్ఫూర్తియు వినుచు
నంతకాకారుఁడై యతికోపుఁ డగుచు, నంతగిపురద్వార మటుచేరి నిలువ
నారాక విని యొంటిఁ దారాక యపుడు, తారాసమేతుఁడై తడయక వచ్చి
యతనికోపంబును నతనిరూపంబు, నతిభీతిఁ గనుఁగొంచు నర్క-నందనుఁడు
అలరెడుభక్తిమై నడుగుల కెఱిగి, వలయు నర్చనము లీవచ్చినఁ జూచి
యొరి రామద్రోహి యొరి కృతఘ్ను, యొరి నీయర్చన లుచితమే నాకు
జానకీపతితోడ సఖ్యత్తుతోడ, వానకాలముఁ బుచ్చి వచ్చెదనంటి
రావైతి తప్పితి రఘురామునాజ్ఞ, భావింపలేవైతి పరిశుద్ధివైతి
వాలిఁ జంపినరామవసుధేశశరము, కాలాగ్నికణములు గ్రక్కుచున్నదియు
నిను నీఱునేయక నిలుచునే యింక, వనచరాధమ వెట్టివాఁడవై చెడితి
ననిన తారాదేవి యతిభీతిఁ బొంది, యనఘు మీదాసుఁ డీయర్క-నందనుఁడు
ఈరాజ్యసంపద లీభోగకోటు, లారయ మీరిచ్చినవియె యీతనికి
మీరుపెట్టినచెట్టు మిహిరనందనుఁడు, వైరంబునకుఁ నెంతవాఁడు మీకితఁడు
రణవిశారదుఁ డైనరామునియాజ్ఞ, గణుతింపకున్నాఁడుగా యర్క-సుతుఁడు
పొలుపొందఁ గార్తిక పున్నమనాఁటి, కిలమీఁదఁ గపిసేన నెల్లనుగూర్పఁ
బడవాలు నీలునిఁ బంచి తాఁబోవ, నడరెడుప్రేమతో ననియున్న వాఁడు
గాఁడు రామద్రోహి గాఁడసత్కుండు, గాఁడు కృతఘ్నుండు గాన మీరితనిఁ

లక్ష్మణుఁడు సుగ్రీవుని మన్నించుట.

గరుణింపుఁ డనవుడు గలుషంబుబదక్కి, నరనాథసుతుఁ డర్చనములు గైకొనియె
గైకొన్నపిమ్మటఁ గనకపీఠమున, రాకొమారునినుంచి రవితనూభవుఁడు
తదనుజ్ఞఁ గైకొని తాను గూర్చుండి, మృదుమధురోక్తుల ముదమొప్పఁ బలికెఁ
సౌమిత్రి రాఘవస్వామికార్యంబు, నేమఱుతునె యిపు డెల్లవానరులఁ
దెచ్చెద వైదేహి దిక్కులవెదుకఁ, బుచ్చెద వచ్చెదఁ బొండు మీవెనుక
నేశరంబున వాలి యిలమీఁద వ్రాలె, నేశరంబునఁ గూలె నేడుతాళములు
నాశరంబే చాలు నఖిలదానవుల, నాశంబు నొందింప నాతి సాధింప
నైనను రఘురాము నతిభక్తి గొలిచి, యేను గీర్తులకెల్ల నెక్కుడై పొలుతు
ననిపల్కి హనుమంతు నతినీతిమంతుఁ, గనుఁగొని మనవీటఁ గలకపికోటి
చాటించి వెడలింపు సమకట్టి కపులఁ, బాటించి యెడసేయఁ బాడిగా దింక
మనమిప్పు డారామమను జేశుఁ గానఁ, జనవలెనని పల్కి సంభ్రమం బెసఁగఁ

దరణినందనుఁ డంతఁ దారాదిసతుల, వెరవొప్ప నప్పుడు వీడ్కొనివచ్చి
కలయ దిక్కులనున్న కపిముఖ్యపతుల, బలములఁ బిలిపించి పయనంబుచేసి
మేదినీభాగంబు మిన్నును దిశలు, భేదిల్లఁ బ్రస్థానభేరి వేయించి
ప్రబలకాంచనరత్నరమ్యమౌ యొక్క, శిబికపై లక్ష్మణుఁ జెలిమి నెక్కించి
చామరద్వయసితచ్ఛత్రచిహ్నములు, నామహాత్మునిమ్రోల నరుగ నేమించి
సబలుఁడై తానును సౌమిత్రి వెనుక, శిబిక యొక్కటి యెక్కి చిత్రవైఖరిని
ముందుగా శుభతూర్యములు బోరుకలుగఁ, గ్రందుగా వందిమాగధనుతుల్సెలఁగ
నెడనెడఁ గపినాథు లేతెంచి తన్నుఁ, బొడఁగన నుడుగణస్ఫురితేందుపగిది
సకలవానరవీరసైన్యసన్నాహ, మకలంక మైయొప్ప నప్పుడే కదలి
యరుదైనపేర్మితో నవని గంపింపఁ, గరము సొంపెక్కి లక్ష్మణుఁ గొల్చి నడచె
అట మాల్యవంతంబు నందున్న రాముఁ, డట మ్రొయుకలకలం బప్పు డాలించి
యవె వచ్చెఁ గపిసేన లని కోప ముడిగి, రవితనూజునిమీఁద రాగిల్లుచుండె
అందమై మణికాంచనాంచితంబైన, యాందోళికాద్వయం బల్లంత డిగ్గి
తామరసాప్తనందనుఁడు సంప్రీతి, సౌమిత్రియును దానుఁ జనుదెంచి మ్రొక్కి
యవిరళం బగుభక్తి హస్తములు మొగిచి, యవనివల్లభున కిట్లనియె నర్కజుఁడు
దేవ సేనలఁ బిల్వ దెసలకుఁ బంపి, వారిరి నివి గూడి వచ్చునందాక
దండెత్తి యిటకురాఁ దడసితిగాని, యొండొక వెంటమై యున్నాఁడఁ గాను
అనిన నర్కజు రాముఁ డతికృపాదృష్టిఁ, గనుఁగొని మన్నించె గడఁకతో నంతఁ
గైలాసగిరియందుఁ గనకాద్రియందు, నీలాచలమునందు నిషధాద్రియందు
ద్రోణాచలమునందుఁ దుహినాద్రియందు, శోణాచలమునందు సోమాద్రియందు
వృషభాచలమునందు వింధ్యాద్రియందుఁ, బుషభాచలమునందు బుష్కరాద్రియందుఁ
బారియాత్రమునందుఁ బ్రాగ్గిరియందుఁ, ఆరత్నగిరియందు నస్తాద్రియందు
మలయాచలమునందు మందాద్రియందు, గలగొని వర్తించు ఘనబాహుబలులు
పవమానసూనుండు పనసుఁ డంగదుఁడు, గవయుండు నీలుండు గంధమాదనుఁడు
పావకాత్ముఁడు కాలపాశుఁ డుగ్రధనుఁ, డావేగదర్శియు నగ్గవాత్ముండు
నలుఁడు మైందుఁడు మహానాథుండు ధూమ్రుఁ, డలఘుండు జంఘాళి యగ్గిరిభేది
సుముఖుండు కేసరి జ్యోతిర్ముఖుండు, వినుఖుండు శారుండు వినతుండు గజుఁడు
జాంబవంతుండును సంపాతిరంభుఁ, డంబురాశితనూజుఁ డగు సుషేణుండు
శతబలిహరుఁడును సన్నాథు లనఁగ, నతివీరవరులు వీరాదిగా కపులు
తమ సుతుల్ తమ హితుల్ తమ సహోదరులు, తమ చుట్టములు తాము దట్టమై కూడి
యివి పదు లివి నూఱు లివి వేలు లక్ష, లివి కోటు లవ్వల నివి శతకోటు
లనరాక పద్మ మహాపద్మ ఖర్వ, మనఁగఁ బర్వినసంఖ్య లన్నియుఁ గడచి
యెలమి సొంపున నేల యీనినయట్లు, చెలఁగి యేదిక్కు చూచిన వెల్లివిరిసి
యీమెయి కొలఁదిగా కేపుదీపించి, భూమియు నాకసంబును నిండఁ గప్పి
కరముగ్రగతిఁ గ్రాలు కాలదండముల, వరుసను దీపించు బాహుదండములు

కెడఁబెర్చుబడబాగ్నికీలలఁ బోలి, వడిఁ బర్వి దివి రాయు వాలపాశములు
పొరిఁబొరిఁ గాలాభ్రములకాంతుఁ లనఁగ, సురవడిమైగ్రాలు సుగ్రదంష్ట్రములు
అలరెడు ప్రళయకాలాదిత్యబింబ,ములఁ బోలి మండెడుముఖగహ్వారములు
లోలాబ్ధివిపులకల్లోలఘూషములఁ, బోలి ఘూషించునార్పులు వెల్లివిరియ
బలములతోఁ గూడ ప్లవగవల్లభులు, కలగొనవచ్చు నగ్గలికలు చూచి
యిచ్చలోపల నప్పు డిక్ష్వాకుకులుఁడు, నచ్చెరువడి చూచి హర్షించుచుండె
ఆవేళ సుగ్రీవుఁ డధిపతిఁ జూచి, దేవ నానేన లేతెంచుచుండంబు
లవధరించితిరె వీరం దొక్కరొకరె, తివిరి మీపనులు సాధింపనోపుదురు
అని చెప్పి వారల యలవులపేళ్లు, జననములు జాతులు సత్వసంపదలు
తనువులు వర్ణము ల్తగుభోజనంబు,లును గులదేశంబు లోలి వర్ణించి
బడబాగ్నిముఖమునఁ బడియున్నవైనఁ, గడువేగఁ జని యుగ్రగతి యొప్పుమిగిలి
వడిఁ బెర్చి యార్చి దుర్వారులై కదిసి, పుడమియు నభము నబ్ధులు చొచ్చియైన
నట మృత్యువక్త్రంబునం దున్నవైన, నెట నందుఁ బోరాని యెందున్నవైన
నావానరాధీశులం దొక్కరొకరు, దేవ నీదేవి వైదేహిఁ దెచ్చెదరు
ఆనతియిమ్మన్న నర్కజుఁ దిగిచి, భూనాథుఁ డాదరంబునఁ గౌఁగిలించి
బలసంపదలయందు భానుజ నీకుఁ, దలపోయ మఱియసాధ్యము లెందుఁ గలవు
పూని నీపౌరుషంబులు చూచికాక, యేనేలఁ గైకొందు నిటఁ గ్రిందు నిన్ను
అని పల్కి వైదేహి నరసిరాఁ బనుపు, మనవుడు హర్షించి యర్కనందనుఁడు

వానరవీరుల సీతను వెదకఁ బంపుట.

ఒనర నుత్తమమైన యొకలగ్నమందు, వినతుఁ డన్వానరవీరునిఁ బిలిచి
యేవంక నెచ్చోట నెందు నేమఱుక, నీవు నేనలఁ గూడి నెఱిఁ దూర్పు నడచి
యామహీతనయనయ్యమునలో వెదకి, యామినీగిరి చూచి యటమీఁదఁ బోయి
సురనదిలోఁ జూచి శోణనదంబు, కరమర్థి నరసి యాకౌశికి వెదకి
యల సరస్వతి జూచి యట సింధువరసి, పొలుచు పౌండ్రవిదేహభూములు వెదకి
మాళవ కోసల మాగధబ్రహ్మ, మూలాఖ్యశైలంబు మైథిలి నరసి
జలధితీరముఁ జూచి చని మందరాద్రి, నిలయకిరాతులనిలయము ల్వెదకి
తివుటమై నట నవద్వీపంబుఁ గడచి, యవల జంబూద్వీప మటమీఁద దాఁటి
చెచ్చెర నటఁ బోయి శీతాద్రి వెదకి, యచ్చోటఁ గాకోల మనుమడుగరసి
తనరు లోహితసముద్రము దాఁటిపోయి, చని కూటశాల్మలిచ్ఛాయల నరసి
మఱివోయి గరుడాశ్రమంబున వెదకి, వఱలు గోశృంగపర్వతము శోధించి
అందలి శృంగంబులందు వర్తించు, మదయుక్తరాక్షసమండలి నరసి
యట దుగ్ధసాగర మవలీలఁ గడచి, యట సుదర్శనమను నద్రిలో వెదకి
వలనొప్ప శుద్ధార్ణవము దాఁటిపోయి, బలువైన జాతరూపశిలాద్రి వెదకి
యందు వేదలలతో నాసీనుఁడైన, యిందువర్ణ ననంతు నీక్షించి మ్రొక్కి
యొగిఁ బదునాల్గువేయోజనంబులకు, మిగిలి యవ్వలనున్న మేధువు వెదకి

యామేపగిరిచుట్టు నర్కునకెరఁగి, యామెయి వాలఖిల్యాదుల కెరఁగి
యావల నుదయాద్రియందు శోధించి, రావణునిలయ మూరసి వార్తఁ దెండు
రవిలేనియంధకారము గ్రమ్ముకతన, భువిలోన నవ్వలి భూము లేనెఱుఁగ
నివిడి నీవటఁబోయి నెలలోన రమ్ము, అవమతి రాకున్న నాజ్ఞ గావింతు
నావుడు లక్షవానరులతోఁ గూడ, వేవేగ వినతుండు వెడలెఁ దూర్పునకు
నినతనూభవుఁ డంత హితశీలు నీలు, హనుమంతు నంగదు నట జాంబవంతు
గజుగంధమాదను గవయు గవాక్షు, విజయుని మైందుని ద్వివిదుని దారుఁ
దగఁ బిల్చి మీరింక దక్షిణంబునకుఁ, దగువానరులఁ గొంచుఁ దడయక పోయి
యర్మిలి వింధ్యాద్రి యాచిగాఁ దొడరు, నర్మదయు దశార్ణనగరంబు వెదకి
దండకారణ్యంబు తప్పక వెదకి, దండిగా నవల గోదావరి నరసి
వలనొప్ప నట వేత్రవతిలోన వెదకి, నెలకొని కాళింగనిషధదేశముల
నారసి కర్ణాటకాంధ్రచోళేంద్ర, చేరకేరళపాండ్యసీమలనెల్ల
నరసి యమ్మలయాద్రి నరసి కావేరి, నరసి యగస్త్యునియాశ్రమం బరసి
యమ్మహాత్మునిఁ గాంచి యతనియనుజ్ఞ, నెమ్మితోఁ దామ్రపర్ణినది దాఁటి
జలధివేలావనస్థలముల వెదకి, పొలుపొందు నాహేమపురములో వెదకి
యెదిరినకడఁక మహేంద్రాద్రియందు, వెదకి యవ్వలనున్న వృషభాద్రిఁ జూచి
యావలఁ బుష్పాద్రియందు శోధించి, క్రేవఁ గుంజరమను గిరిఁ బరీక్షించి
యచటియగస్త్యగేహము విశ్వకర్మ, రచితమై తగునందు రమణి శోధించి
యంజనానది దాఁటి యవ్వలమణుల, రంజిల్లుఫణులచే రక్షింపఁబడిన
వదలక యాభోగవతిలోన వెదకి, వెదకి యవ్వలనున్న విషమాబ్ధి కరిగి
యందుపై గంధర్వ లప్సరల్సురలు, నుందు రాచోటుల నోడక వెదకి
తలఁగక యరిగి వైతరణి లంఘించి, పొలుచు వైవస్వతపురమున కరిగి
యందు నాసమవర్తి యనుమతి వడిసి, పొందుగాఁ బితృలోకమును గలయంగ
వెదకి సీతాదేవివృత్తాంత మరసి, పదిలులై నెలలోనఁ బ్రతివార్త దెండు
ఆవల నంధకారావృతం బగుట, దేవతలకునైనఁ దీఱదం దరుగ
ననిన నాకపినాథు లందఱుఁ గూడి, యనుమోదరసవార్ధియందు నోలాడి
దిననాథతేజుఁడై దీపించురామ, జననాథులోఁ దమసత్త్వము లైఱసి
జానకి నెబ్బంగి సాధించికాని, మానవేశ్వర రిత్త మగిడిరా మేము
అని పల్కి రాముఁ డాహనుమంతుఁ జూచి, యనువుగా భావికార్యము నిశ్చయించి

శ్రీరాములు హనుమంతునిచేత తనముద్రిక నిచ్చుట.

తనదయాదృష్టి యాతనిమీఁదనుంచి, యనిలజ యిందు రమ్మని చేరఁ బిలిచి
జనకజఁ గనుఁగొనఁ జాలుదు వీవె, యనఘు నీచేతఁ గార్యము నిర్వహించు
నీవంతవాఁడవు నీబాహుబలము, భావింప నట్టిదె పవమానతనయ
యిదె నాదుముద్రిక యిది సీతకిచ్చి, సుదతిచిత్తములోని శోకంబు మాన్పి
సీతకు మేమున్న క్షేమంబు చెప్పి, సీతక్షేమముఁ గొంచుఁ శీఘ్రంబె రమ్ము

అని ముద్రికిచ్చిన ననిలనందనుఁడు, తనమస్తకంబున ధరియించి మించెఁ
దనశార నుదయాద్రి తనదుశృంగమున, దినమణిఁ దాల్చి యెంతే నొప్పుకరణి
నంత నాహనుమంతుఁ డానందమంది, గంతులు వ్రేయుచుఁ గరములు మొగిచి
యినకులాధీశ్వర యెంతదవై వ్నఁ, జని సీతయున్నెడ సాధించి వత్తు
సోమసూర్యులఁ బట్టి శోధించినైన, భూమియు నభము నబ్ధులఁ జొచ్చినైన
నామహీసుత నింక నారసి వత్తు, నీమహిలోపల నెచ్చటనున్న
నసమాన మగుసత్త్వ మభిగుతికెక్క, వసుధేశ రావణువాసంబుఁ జొత్తు
నరిగెదనని మ్రొక్కి యట దక్షిణమున, కరిగె వాయుజుఁ డంగదాదులతోడ
మఱి సుషేణునిఁ బిల్చి మర్కటేశ్వరుఁడు, వఱుల నీవొకలక్షవానరుల్గూలున
సౌరాష్ట్రదేశంబు చని చొచ్చి వెదకి, ధీరులై బాహ్లీకదేశంబు నరసి
శ్రీకరమై యొప్పు సింధుసౌవీర, కేకయదేశము ల్కృతమతి వెదకి
వలనొప్పఁ బున్నాగవనములో నరసి, తెలిసి పశ్చిమవార్ధి దృష్టించి చూచి
నలి నారికేళవనంబు శోధించి, యలయక పోయి వజ్రాద్రి శోధించి
పారియాత్రనగంబు పరికించి యచటఁ, గూరిమి గంధర్వకోటులఁ దెలిసి
బలియు హయగ్రీవుఁ బంచజనాఖ్యుఁ, గలన ఖండించి శంఖంబు చక్రంబు
చక్రి యచ్చోఁ దొలి జతఁగాంచినట్టి, చక్రవంతం బనుశైలంబు వెదకి
తరణి యెచ్చోట నస్తము గాంచునట్టి, చరమాద్రి నీక్షించి సౌవర్ణి నరసి
వెలయంగ నెనుబదివేలసంయములు, గలకాంచనాద్రులఁ గలయ వీక్షించి
చరితార్థుఁడగు మేరుసావర్ణిమానిఁ, బరికించి నెలలోనఁ బ్రతివార్త దెండు
అర్కహీనము నమర్యాదంబుగానఁ, బోరొక్కన నవ్వలిపృథివి యేనెఱుఁగ
ననిన సుషేణాదు లగుమహోకపులు, ఏనిఁబూని పోయిరి పడమటిదెసకు
జలజాప్తసుతుఁ డంత శతబలిఁ బిలిచి, నలి నీవు లక్షవానరులతోఁ గూడ
మొదటఁ బులిందభూములు సొచ్చి పోయి, చెదరక యాసారసేనంబు వెదకి
భరతభూములనెల్లఁ బరికించి యవన, ధరణీశుదేశంబు తడయక వెదకి
కడగి కాంభోజకొంకణభూము లరసి, యెడపక యటఁ బోయి హిమవంతమరసి
సోమాశ్రమంబున జొచ్చి శోధించి, శ్రీమించుకాళాఖ్యశిఖరి నీక్షించి
యామై సుదర్శన మనునద్రి వెదకి, కామించి యట బోయి కనకాద్రి వెదకి
కైలాసగిరియును గౌబేరవనము, నాలోలనయన మీర లలయక వెదకి
ధనదునిపురము నాతనిసరోవరము, ననుమోదభరము పాయక విలోకించి
యందుఁ గుబేరుని నడిగి క్రౌంచాద్రి, యందు మీరందఱు నవనిజ వెదకి
చని యట మైనాకశైలంబు గడచి, యనఘు వైఖానసం బనుకొల నరసి
తనరుశైలోదాఖ్యతటిని లంఘించి, గొనకొని యుత్తరకురుభూము లరసి
యచ్చట గంధర్వ లప్సరల్ సురలు, నిచ్చలు నుందురా నెలవులు వెదకి
నిలువ కుత్తరపయోనిధి దాటిపోయి, సొలయక యటమీఁద సోమాద్రి వెదకి
యచట బ్రహ్మాయు శివుఁ డర్థి వర్తింతు, రచలితగతి మీర లందుండి మరలి

యొకనెలలోపల నుర్వీశుకడకుఁ, బ్రకటంబుగా మీరు ప్రతివార్త దెండు
అనవుడు శతబలి యవనీశు వీడుఁ,గొని యుత్తరంబు దిక్కునకేగె నంత
అప్పుడు రఘురాముఁ డర్కజుఁ జూచి, యెప్పుడు జూచినా వీభూము లెల్ల
నా విని వాలికి నాఁడేను వెఱచి, వేవేగ యతఁడు నావెనువెంటఁ దగులఁ
గలగొన గుఱుతులుగా మహియెల్ల, నలుదిక్కులను చూచినాఁడ నేననియె
ననిన నచ్చెరువంది యటఁ గొంతకాల, మినజానుజులు గొల్వ నినకులుఁ డుండెఁ
దగపూర్వపశ్చిమోత్తరములు చూడ, జగతీశుపనుపునఁ జనినవానరులు
నినరశ్మి లేందాక నిలమీఁదఁ బర్వ, ననుపమసత్త్వులై యందాఁకఁ దిరిగి
నలినాక్షి నెందుఁ గానక వచ్చి పతికిఁ, జెలువేది ప్రతివార్త చెప్పి రందఱును
అటరామసుగ్రీవ లంగదముఖ్యు, లిటమీఁదఁ బ్రతివార్త లేమి చెప్పెదరొ
యదియేమిచందమోయని వారిరాక, కెదురుచూచుచునుండి రెంతయు వగచి
అంత నంగదముఖ్యు లగుమహాకపులు, పంతంబులాడుచుఁ బరమహర్షమున
సంతతజవసత్త్వసంపద లెఱసి, మంతుకెక్కిన హనుమంతుండుఁ దాము
చెదరక రవిజుండు చెప్పినయట్ల, మొదల వింధ్యాచలంబున కేగుదెంచి
యందలిగుహాల మహాగహనముల, నందంద వైదేహి నరయుచుఁ గదలి
యదియాదిగా దక్షిణంబున కరిగి, పొదలఁ బూపొదలందు భూజంబులందు
నదులందు గిరులందు నగరంబులందు, వెదకి జానకిఁ గాంచువెరవు లేకునికి
చింతాసమాక్రాంతచిత్తులై పోయి, యంతంత గుమురులై యటఁ బోయిపోయి

అంగదాదులు కణ్వాశ్రమముఁ జేరుట.

పదియేండ్ల తనకూర్మిపట్టి యచ్చోటఁ, గదలి నీటను బడి కాలునిపురికిఁ
బోయినఁ బొగలుచుఁ బుత్రశోకాగ్నిఁ, బాయక పడి కాలి పలవించుచున్న
కణ్వమహాముని ఘనశాపవహ్ని, మండి నిర్మృగము నిర్మానుష్య మగుచు
నుండ నీడయుఁ ద్రావ నుదకంబు లేక, పండక బహుశోన్యపథమైనయడవి
చొచ్చి యెంతేనియు సొలసి లోదారి, నచ్చోట నుదకంబు నరయుచున్నంత
నందొక్కరక్కసుం డగచరాధిపుల, ముందఱి నీలాభ్రమో యన నిలిచి
యొరి వానరులార యుర్వైై నేను, మారీచతనయుండ మహితవిక్రముఁడ
దేవగంధర్వులు తివిరి యేనున్న, యీవని దృష్టింప నెవ్వరు వెఱతు
రిందేల వచ్చితి రిందఱుఁ గూడి, యెందుఁ బోవఁగవచ్చు నిఁక నాచేతఁ
జావక మీకంచు సంరంభ మెసఁగఁ, గోయని యార్చినఁ గుపితుఁడై యపుడు
అంగదుం డాదైత్యు నదరంట వ్రేయ, పొంగి రక్తము వాత బొడబొడ వెడల.
వసుధపైఁ బడె నంత వానరులెల్లఁ, బొసఁగంగ నొకమహాభూజంబునీడ
నలసి కూర్చుండి తోయంబు లెచ్చోటఁ, గలవొకో యని దప్పిగదుర నున్నంత
దరమిడి యొకబిలద్వారంబు వెడలి, యురువడి జలపటు లొండొండ నెగయఁ
గనుఁగొని యుదక మిక్కుడ నుండఁబోలు, నని వచ్చి బిలములో నందఱు డిగఁగఁ
గలగొని విపులాంధకారమై తెరువు, తెలియ కొండరులను ధృతిఁ జీరికొనుచు

ననుపమసత్త్వులై యటఁ బోవఁబోవఁ, గనుఁగొని యయ్యంధకారంబు విరిసి
యరుదుగా జగదద్భుతాకారమైన, పుర మొక్కఁ డచ్చోటఁ బొడఁగాంచి వచ్చి
పసిఁడిగోపురములు పసిఁడిమేడలును, పసిఁడియట్టళ్లును పసిఁడికోటలును
పసిఁడివృక్షంబులు పసిఁడిపూపొదలు, పసిఁడిపర్వతములు పసిఁడితామరలు
నైచూడ నాపురం బతిరమ్యమైనఁ, జూచి యెంతేనియుఁ జోద్యంబునొంది
ప్రకటసంపదలచేఁ బరఁగుచుండియును, నకట నిర్మానుష్య మైనది పురము
ఏలొకో యీపురం బిట్లయ్యె ననుచు, నీలీల వెడలుచొ ప్పెఱుఁగంగలేక
చాలఁ జింతిలుచు నచ్చటఁ గొన్ని నాళ్లు, పోలఁ జరించుచు పురమధ్యవీథి
మిన్నులతో రాయు మేదినియందు, నున్నతం బగుచున్న యొకమేడఁ గాంచి
కని దానిమీఁదికిఁ గపులెల్లఁ బ్రాకి, కనిరి తపోవృత్తిఁ గర మొప్పు గాంచి
హరిణాజినాంబరయై యొప్పుదానిఁ, దరుణేందుకళఁ బోలి తనరారుదాని
నొకపుణ్యకాంత నయ్యువిదకు మ్రొక్కి, యకలంకచిత్తుఁడై హనుమంతుఁ డనియె
ఓతన్వి నీవెవ్వ రొంటిమై నిచట, నీతపం బొనరింప నేమి కారణము
ఏమహాత్మునిపురి యీ హేమనగర, మేమెన్నఁడును గాన మిట్టిచిత్రములు
అనిన నక్కోమలి హనుమంతుఁ జూచి, తనపూర్వకథ లెల్లఁ దాఁ జెప్పఁ దొడఁగె
దగఁ దొల్లి మయుఁ డనుదానవేశ్వరుఁడు, తగిలి పద్మజుఁగూర్చి తప మాచరించి
పసనొప్పు నిర్మాణపటుశక్తి వడసి, పసిఁడిగోపుర మిట్లు పరఁగ నిర్మించె
నవిరళగతిహేమ యనుదివ్యవనిత, గవిసి యాతఁడు పెద్దకాల మిందుండ
నాతనివజ్రథారాహతుఁజేసి, యాతన్విఁ గొనిపోయె నమరవల్లభుఁడు
ఆతరలాక్షి నెయ్యపుఁజెలిక త్తె, మాతండ్రి సావర్ణి మహితమానసుఁడు
నాయింతిపనుపున నతితపోనిష్ఠఁ, బాయకుండుదు స్వయంప్రభ యనుదాన
నని చెప్పి కందమూలాదు లందఱికిఁ, దనివిదీఱ నొసంగి తాపంబు దీర్చి
యనఘు మీ రెవ్వ రిందరుగుదేనేల, యనిమిషులైన నిం దరుగుదేరాదు
వినుఁ డిందు మీర లెవ్విధిని జొచ్చితిరి, యన విని హనుమంతుఁ డతివ కిట్లనియెఁ
దనతండ్రిపనుపున దండకాటవికి, మునివృత్తి రాముఁ డిమ్ముల వచ్చియుండ
వనజాక్షి నారామువరపత్నిఁ గొనుచుఁ, జనినరావణు వెంటఁ జని చనిదేము
జనకజ వెదకుచు జలశూన్యమైన, ఘనమైన దప్పిచేఁ గడుడస్సి యొక్క
బిలములోపలఁ జొచ్చి పెద్దచీఁకటికిఁ, దలఁకక యొక్కఁట దైవయత్నమున
నీయాశ్రమంబున కేతెంచి వెడలి,పోయెడుమార్గంబు పొడగానలేక
తిరుగుచున్నారము ధృతిఁ బెక్కుదినము, లురిఁబడియున్నార మొకదిక్కులేక
యనిన రామునికార్యమై వచ్చినారు, అనఘులు పుణ్యాత్ము లని భక్తిఁజేసి
మీకెద్ది యిష్ట మిమ్మెయి వేఁడుఁ డనిన, మా కీబిలద్వారమార్గంబు వెడలఁ
జేయుము వేవేగ సీతను వెదకఁ, బోయెదమనుడు నుప్పొంగి యామగువ
మొగి మీరు కన్నులు మూసికొండనుచుఁ, దగఁ బుచ్చి వారలఁ దనతపశ్శక్తి
నెలఁతుక యవలీల నిమిషమాత్రమున, బిలముఖమునఁ దెచ్చి పెట్టి తాఁ బోయె

బోయిన కపిభల్లపుంగవులెల్ల, నాయింతి పొగడుచు నటఁ బోయి పోయి
యాయతోన్నతబలు లందొక్కసరసిఁ, బాయక జలములు బలువిడి త్రావి
యంత నందఱు మహేంద్రాద్రికిఁ బోవ, నంత నంగదుఁడు నిట్లనుచు శోకించె
ఇనజునిమితి దప్పె నినవంశుదేవి, వనజాక్షిఁ బొడగన్నవారము గాము
ఆజ్ఞాధురంధరుఁ డైనసుగ్రీవుఁ, డాజ్ఞ దప్పిరి వీర లంచును మనలఁ
బొడగన్నయప్పుడే భూపతి మెచ్చు, నడిమికి రెండుగా నఱికించు మనలఁ
గావున మనమింకఁ గపిరాజుఁ గానఁ, బోవుట తగవును బుద్ధియుఁ గాదు
వెలువడి మనమిట్లు వెనవచ్చినట్టి, బిలములోపలఁ జొచ్చి వేర్మి నుండుదము
అది యష్టదిక్పాలకాభేద్యమార్గ, మది పక్వఫలభరితారామ మరయఁ
బొందుగా నచటఁ గాపురమున్నమనల, నెందు నెవ్వరికైన నెఱుఁగఁబొప్పడదు
అనఁ గొంద ఱగచరు లాపని కియ్యకొని రంత మారుతి కోపించి పలికెఁ
బెద్దబుద్ధివి నీవు పినతండ్రి పనుప, గద్దరివై రాముకార్యమై వచ్చి
కపులతోఁ గూడి యాగంభీరబిలము, చపలతఁ జొచ్చి యచ్చట నుండినపుడె
భానుజుతో మళ్లఁ బడునదిగాన, దాను నీలుండును తారుండు నలుఁడు
దీని కెవ్విధి సమ్మతింపము దక్క, వానరు ల్తమబంధువర్గంబుఁ బాసి
నినుఁ గొల్చియుండంగ నేరరు సుమ్ము, వినుఁ మదియునుగాక వృత్రారి తొల్లి
యర్మిలి తనవజ్రహతిని బిలంబు, నిర్మించె నిటువంటి నిశితవజ్రాస్త్ర
కోటి లక్ష్మణునకుఁ గొలది నగ్గలము, మాటమాత్రమున నీమర్కటాధముల
నిన్ను నీబలమును నీఱుగాఁజేయు, నున్నయీదుర్బుద్ధు లొక్కట విడిచి
యవనిజ పొడగాన మైతి మటంచు, రవిజునికడ కందఱము పోయి మ్రొక్కి
విన్నవింతము జగద్విఖ్యాతి నతఁడు, నిన్నును మమ్ము మన్నించు మోమోపి
యామీఁద మీతల్లి కనుర క్తుఁ డగుట, నీమీఁద నలుగఁడు నీవు పుత్రుఁడవు
కావునఁ గడు నిన్నుఁ గట్టు పట్టంబు, నావిని యావాలినందనుం డనియెఁ
బితృసమానుని వాలిఁ బృథ్వినైఁ గూల్చి, యతనిభార్య వరించి యామీఁదఁ దనకు
నుపకారి యగురాము కుద్యోగమెల్లఁ, జపలుఁడై మఱచి లక్ష్మణుఁ డాగ్రహింప
మఱి గాదె చనుదెంచె మాపినతండ్రి, యెఱుఁగవే యాతనిహీనవర్తనము
అట్టికామాంధుని నట్టికృతఘ్నున్, నెట్లు నమ్మఁగవచ్చు నిదియది యేల
శ్రీరాముకార్యంబు సేయకపోయి, యారవిసూనుచే నటఁ జచ్చుకంటె
నీయెడఁ జచ్చుట యిది లెస్స మనకుఁ, బ్రాయోపవేశనపరులు గండనుచు
వారును దానును వరదర్భశయను, లై రాక వృథ యని యాత్మఁ జింతించి
తెవులును ముదిమియుఁ దీవ్రవేదనయు, నవతయులేని ప్రాణంబులు గావ
లేచియు మఱి పవ్వళించియు దిశలు, చూచియుఁ దమతమ చుట్టాలసతులఁ
దలఁచియు బాపురే దైవమా యిట్లు, చలపట్టి మము వృథా చంప నిచ్చోట
సమకట్టితే యంచు సకలవానరులు, గుమురులు గుమురులై కూడి యొండొరులు

నలినా ప్తకులుఁడు కానలకు రానేల, కులభామ నసురచేఁ గోల్పడ నేల
యిరసి దైత్యుఁడు జటాయువుఁ జంపనేల, ధరణీశుఁ డరుణనందనుఁ గననేల
ధరణిజవా ర్త యాతఁడు చెప్పనేల, తరణివంశులు పంప దరికి రానేల
సుగ్రీవుకడకు రాసుతులు రానేల, సుగ్రీవుఁ డాతని సొమ్ము గానేల
వలనొప్ప వాలి భూవరుఁ డేయనేల, బలిమితోడుతఁ గపిబలము రానేల
యినతనూజుఁడు మమ్ము నిటు పంపనేల, పనివడి మనకు నీపాటు రానేల
డూనిన ప్రాణంబు లురకపోనేల, పోనేల యక్కటా భువి కైకవరము
మనువంశ యుతముగా మనవంశ మణఁచె, ననియ శోకించి యలయుచున్నంత

అంగదాదుల సంపాతి చూచుట.

నాయెడ సంపాతి యనుపక్షినాథుఁ, డాయత దేహుఁ డత్యంతవృద్ధుండు
ప్రాయంబు తొక్కలు బలిమియు లేమి, నాయద్రిగుహనుండి యల్లన వెడలి
మెల్లనఁ జనుదెంచి మృతిఁగోరి ధరణిఁ, ద్రెళ్లిన వనచరాధిపుల నీక్షించి
దైవంబు కృపచేసెఁ దనకు నాహార, మీవేళ ననిచేర నేతేరఁ గపులు
చపలులై మరణనిశ్చయబుద్ధి వగవ, నపు డాంజనేయుతో నంగదుం డనియె
నిది పక్షిగాదు మమ్మిందఱఁ జంప, నదయుఁడై యముఁ డిట్టు లరుదెంచినాఁడు
ఆజటాయువు నరనాథునిదేవిఁ, బోడిమి చెఱగొని పోవు రావణుని
దాక నాతనిఖడ్గధారచేఁ జచ్చి, తేకువఁ బడయఁడే దివ్యపదంబు
రాముకార్యార్థమై ప్రాణము ల్మనము, నీమహాపక్షికి నిచ్చుట లెస్స
యనుచోట నామాట లాలించి యరుణ,తనయుండు శోకగద్గదకంయుఁ డగుచు
నాకపివీరుల నటఁ జేరఁ బోయి, యోకపులార యెందుండి వచ్చితిరి
యాజటాయువు నాకు నర్మిలితమ్ము, డాజటాయువు నేను నరుణపుత్రులము
నిశితోగ్రనఖుఁడు మానితమహామహుఁడు,దశరథసఖుఁడు సంతతసత్యధనుఁడు
నతఁ డేమిటికిఁ జచ్చె ననవుడు వాలి, సుతుచేత నంతయుఁ బొప్పడఁ దెలిసి
యెంతయు శోకించి యిచ్చలోఁ జాల, వంతనొందుచునున్న వనచరు లెత్తి
చెంతనున్నపయోధిఁ జేర్చిన నందు, సంతాపమునఁ గృతస్నానుఁడై వచ్చి
విపులశోకముతోడ వివాగవల్లభుఁడు, కపులతోఁ దనపూర్వకథఁ జెప్పఁదొడఁగె
ఆలోలగతుల జటాయువు నేను, గైలాసగిరియందుఁ గవగూడి యుండ
ఘనజవసత్త్వము ల్కడిమిమై మెఱసి, మొనసి మేమిద్దఱమును మచ్చరించి
యుడువీథి కిద్దఱ ముదయకాలమునఁ, గడఁకతో నెగసి సంగడిఁ బోయిపోయి
పరువడి నట పట్టపగలింటికొలఁది, కిరువురు దడసితి మినమండలంబు
ఉగ్రాంశుకిరణంబు లొండొండఁ దాఁకి, యుగ్రుఁడై యాజటాయువు మండుటయును
బదిలమై వాని నాపక్షంబులందుఁ, బొదివిన నాపక్షములు గాలిపోయె
నెఱకలుగాలిన నేపెల్లఁ బొలిసి, మఱివచ్చి యీయాశ్రమంబునఁ బడితి
నాపక్షినాథుఁ డెం దరిగెనో యెఱుఁగ, నీపల్కు మీచేత నిట వింటి నేను

వీనుల మీవార్త వినియున్నవాఁడ, హీనబలుండనై యెఱుకలులేమి
పఱుముల్ తొల్లింటిపగిది నాకున్న, దఱుత నింతకుఁ దనసహోదరుని
పగదీర్చి శ్రీరామభద్రునిదేవి, మగఁటిమిఁ దేనేర్తు మాటలకేమి
నావిని భల్లూకనాథుఁ డిట్లనియె, నావాయుజుఁడు నంగదాదు లుప్పొంగ
నాజటాయువుతమ్ముఁ డఁట నీకు మొదల, నీజగంబులలోన నెదు రెందుఁ గలదు
నీవు చూడనియట్టి నెలవులు లేవు, రావణుఁ డిప్పుడు రఘురాముదేవి
నెందు దాఁచినవాఁడొ యెఱిఁగింపు మనిన, సందేహ మెడఁబాయ సంపాతి పలికెఁ
దనతనూభవుఁడు దుర్దమపరాక్రముఁడు, ఘనుఁడు సుపార్శ్వుండు కడుభక్తియుక్తి
తొక్కలు గాలి యీక్రియనున్నవాకు, నక్కఱతోఁ దెచ్చి యాహార మొసఁగు
నతఁ డొక్కనాఁడు నాకళనంబు దేక, దడసి వచ్చిన నేల తడసితి వనిన
నోతండ్రి నీకునే నుపహార మరయ, నాతతగతి మహేంద్రాద్రిసముద్ర
తీరమార్గమున నెంతయుఁ బొంచియుండ, నారవిప్రభవంటియంగనఁ గొంచుఁ
గాటుక నడకొండకైవడి నొకఁడు, థాటినైై చనుదెంచి తనకుఁ బ్రియంబుఁ
జెప్పి యేఁ దెరువియ్యఁ జెచ్చెరఁ జనియె, నప్పు డచ్చటిమాను లందఱు నన్ను
సంతసించుచు నేఁడు చావుకుఁ దప్పె, నంతకుం డగురావణాసురుం డతఁడు
చెఱగొని లంకకు శ్రీరాముదేవి, నుఱకఁ గైకొని పోవుచున్నవాఁ డనిరి
అందుకై తడసితినని వాఁడు పలికె, సందేహ మేటికి జనకతనూజ
బలసి రాక్షసవధూపరివృత యగుచు, జలదమాలికలోనిచంద్రికఁ బోలి
యున్నది లంకలో నొగి శతయోజ, నోన్నతి నాదృష్టి యుర్వీఁ జరించు
తెల్లంబుగా మనోదృష్టియు నాకు, నెల్లపఱులకంటె నెక్కుడై పరఁగు
నని పల్కి మఱియు నిట్లనియె సంపాతి, తనపక్షయుగళంబు దగ్ధమైనపుడు
ఏవచ్చి మూర్ఛిల్లి యిచ్చోటఁ ద్రెళ్లి, చావునఁదప్పి యెంచఁగరానిదప్పి
కుట్టూర్పు లెసఁగంగఁ గొన్నేండ్లు గడపి, గట్టిగా నాభాగ్యగతి నొకనాఁడు
ఘననిషధపమిందుఁ గావించు సకల,జనతాపహరుని సాఱొన్ని శాకరుని
నానిశాకరుని నొయ్యనఁ గాంచి మ్రొక్కి, భానుదీప్తులచేతఁ బక్షములల్లాలి
తనువున్న చందమంతయు విన్నవింప, మునిశిఖామణియును మున్ను నన్నె ఱుఁగుఁ
గావున నెంతయుఁ గరుణించి మీఁదు, భావించి యాశ్రియఃపతి పరాత్పరుఁడు
విష్ణుండు దశరథవిభునకుఁ బుట్టి, యష్టాంశకులుఁ డంత నుగ్రాటవులకుఁ
జనుదేర నాతనిసతిని రావణుఁడు, కొనిపోయి చెఱనుంచుకొని యున్నయపుడు
అమృతాన్న మాయింతి కమృతాంశుఁ డిడిన, లెమలక యాహారతృష్ణలు వాసి
యుండునంతట రాముఁ డొయ్యనవచ్చి, చండాంశజునిఁ గాంచి శక్రజుఁ ద్రుంచి
యాలోలగతి సీత నరయ వానరుల, నాలుగుదిశల కున్నతిఁ బంపఁగలఁడు
ఆరాము నిజదూత లగువారితోడ, చేరి నీ వీకథ చెప్పిననాఁడు
ఘనపక్షయుగళము గలుగుపాత్మనుచు, మును నిశాకరుఁ డనుమునిఁ చెప్పిపోయె

నతఁ డానతిచ్చినయట్లు మీతోడ, హితమతి నీకథ యెఱిఁగింపఁగంటి
నివె పచ్చములువచ్చె నిదె చూడుఁ డనుచుఁ, దివిరి కుప్పించి యద్దివికి లంఘించి
వడి లంకచేరువ వనములో సీతఁ, బొడగాంచి యదె సీతఁ బొడగంటి ననుచు
నదె శతయోజనం బైనదూరమున, నదె లంకలోపల నదె పుణ్యసాధ్వి
చాలుఁ బ్రాయోపవేశన మింక లెండు, పాలస్త్యపతి లంక పరికింపఁ బొండు
అని లంక కటుఁబోవ నటఁ ద్రోవఁ జూపి, చనియె హేమాద్రికి సంపాతి యపుడు
అంత వానరవీరు లందఱుఁ గూడి, సంతోషచిత్తులై జవమొప్పఁ బోయి
చండవాతాహూత జాతడిండీర,గండూషితాశావకాశనీకాశ
వీచీసమీచీనవిహరమాణాది,వైచిత్రకరవాలవరవాలములను
ఘోరనక్రగ్రాహకోటి లుప్పాంగఁ, బోరాడుచున్న యంభోరాశి డాసి
అందు నిశ్చేష్టితులై కొంతతడవు, గుందుడెందములతోఁ గూర్చుండి యపుడు
ఈసముద్రము దాఁట నెవ్వఁడు చాలు, నీసత్వ మెవరికి నిందులోఁ గలదు
అని యిట్లు చింతింప నంత నంగదుఁడు, వనచరుల్ తాను నవ్వనధితీరమున
నారాత్రి వేఁగించి యమ్మఱునాఁడు, వీరవానరుల వేర్వేఱ నీక్షించి
ఈరీతి మీరెంతలేసివానరులు, పౌరుషంబులు నేలపాలుగాఁ జేసి
జలరాశిలోపల శతయోజనములు, కొలఁదిదాఁటుట కిట్లు గుందెదరేని
అపకీర్తి కెనయిది యగణితాంభోధిఁ, గపివర్యులార యేకరణి దాఁటెదరు
మీమీజవంబులు మీదాఁటుకొలఁదు, లీమాత్రమని పల్కుఁ డెఱుఁగంగ నాకు

వానరవీరులు తమతమసత్త్వములఁ దెలుపుట.

ఘనులార యొక్కఁ డొక్కఁడుచెప్పుఁడనుచుఁ, గినిసిన నందఱుఁ గృతమతులగుచుఁ
దమతమసత్త్వముల్ తగ విచారించి, అమితసత్త్వోన్నతు లందఱుఁ గూడి
నలి మీఱి పదియోజనంబులు దాఁటఁ, గలవాఁడ నేనని గజుఁ డందుఁ బలికె
ఇలమీఁద లావుమై నిరువది దాఁటి, సొలయ నేనని గవాక్షుఁడు వేర్చి పలికె
మొనసినకడిమిమై ముప్పది దాఁట, ఘనశక్తి గలదని గవయుండు పలికె
నాలావు పెంపున నలువది దాఁటఁ,జాలుదు నేనని శరభుండు పలికెఁ
బనిగొని జలధి యేఁబదిదాఁటువాఁడ, నని, గంధమాదనుం డలవుమైఁ బలికె
నస మెంతడింపక నరువది దాఁట, మసలక బోదని మైందుండు పలికెఁ
దెగఁబడి కడిమిమై డెబ్బది చాఁటఁ, దెగువ కోపుదునని ద్వివిదుండు పలికె
నెనుబది దాఁటుదు నేపుదీపింపఁ, దనియక నేనని తారుండు పలికె
నోపినతమలావు లొకఁడును దాఁప, కేపుమై నందఱు నిటు పల్కుచుండ
భల్లూకనాథుండు బహుకాలవృద్ధుఁ, డుల్లోకవిక్రముఁ డొకమాట పలికె
చిన్ననాఁటిబలంబు చెప్పవచ్చినను, గ్రన్నన హాస్యకారణము లిప్పటికి
అయినను వినుఁడు మున్నమృతంబుకొఱకు, దానవుల్ సురలు యుద్ధములు గావింప
నమరులకై సహాయంబుగా వచ్చి, యమృతంబు ద్రావితి నర్ధి వారొసఁగ

నుదధు లేడును దాఁటనోపి యస్తాద్రి, కుదయాద్రిపైనుండి యొకజంఘుయిడుచు
ఎల్లలోకముల నాకెదు రెందులేదు, బల్లిదుఁ డగుబలిబంధంబు నాఁడు
ఇర్వదియొక్కమా ఱిలఁ బ్రదక్షిణము, లివిరి త్రివిక్రమదేవునిఁ గొలుచు
తరిఁ గొండకాలిలోఁ దనరార వితిగి, పరిఁబోయిమణి జరాభారంబు నొదవె
నరయంగఁ గడునృద్ధు నైతి నిప్పటికిఁ, బరికింప నేను తొంబదిగాని చాల
పొలుపొంద నీత్రోవఁ బోయెడుపనికి, వలతి గానని జాంబవంతుండు పలికె
తొంబదియేడు దోడ్తో దాఁటువాఁడ, నంబుధి ననినీలుఁ డత్తఱిఁ బలికె
నామాఱుతాత్మజుఁ డాత్మపౌరుషము, లేమియుఁ బలుక కయ్యెడ నూరకుండె
వాలినకడిమిమై వడి నూఱు దాఁటఁ, జాలుదు మగిడిరాఁ జాలనుగాని
యని యంగదుఁడు పల్క నాజాంబవంతుఁ, డనఘు మాకందఱ కధిపతివీవు
వాలితనూజ యీవారాశి దాఁటఁ, జాలుదు మగిడి రాఁజాలవు నీవు
యువరాజ వీకపియూథంబులకును, రవితనూజునియట్ల రాజవుగానఁ
దగ మమ్ముఁ బనిగొనఁ దగుఁగాక యిట్లుఁ, దగునయ్య నీకింత దైన్య మేమిటికి
రామకార్యపరుండు రవిజునిమంత్రి, యీమర్కటావలి కెల్లఁ బ్రాణంబు
తక్కక పవమానతనయుండు గలుగ, నక్కటా నీకసాధ్యము లెందుఁ గలవు
వలదని వారించి వాయునందనునిఁ, బిలిచి యాతనితోడఁ బ్రియములు పలికి

జాంబవంతుఁడు హనుమంతుని ప్రార్థించుట.

మాపతి యీపని మామీఁదఁ బెట్టి, యీరకున్నాఁడవే యుచితమె నీకు
లలితలావణ్యవిలాసరూపముల, వలనొప్ప నప్సరోవనితలయందుఁ
బుంజికస్థలియనఁ బొలుచు మీతల్లి, యంజన యటఁ దొల్లి యగ్నిశాపమున
వానరవనితయై వసుధఁ గేసరికి, మానినియైయుండి మఱియొక్కనాఁడు
వనగిరిస్థలులందు వర్తింపుచుండ, ననిలుఁ డాయంగన యలసయానంబు
తొడలచెడంగను దోరంపుబిరుదు, లుడురాజబింబంబు నోరయు నెమ్మోము
కలదు లేదనుకొను గబ్బిగుబ్బలును, దలచుట్టివచ్చు బిత్తరికన్నుఁగవయుఁ
గనుఁగొని మోహంబు గడలుకొనంగ, మనసిజశరభిన్నమానసుం డగుచుఁ
జెలరేఁగి కదియుచుఁ జెలువమై డాసి, యాలింగనముసేయ నంజన యలిగి
నాదుపాతివ్రత్యనైపుణి చెఱుప, నేదుష్టమతియొకో యిటు సమకట్టె
నావిని యలుగకో నాతి నేవాయు, దేవుండ నీదుపాతివ్రత్యమునకు
భంగంబుగాకుండఁ బరికించి హృదయ,సంగంబు సలిపితి జలజాక్షి దీనఁ
బలువేగ విక్రమపౌరుషశౌర్య,ములు గలతనయుఁ డిమ్ముల నీకుఁ బుట్టు
ననిపల్క చనుటయు నావధూమణియు, మనమున నలరుచు మఱి వాయుదేవు
ప్రవిమలకృప నిన్నుఁ బడసెఁ గావునను, భువిని వాయువుతోడి భూరిసత్త్వుఁడవు
వేగ విక్రమకళావిసూక్ష్మార్థియందు, నాగరుడునికంటె నధికుండ వీవె
వరుసఁ బంకజగర్భవరమునఁజేసి, మఱి నీకు నాయుధమరణంబు లేదు

నీసమానులు లేరు నిఖిలలోకముల, నీసత్త్వ మెఱుఁగుదు నిజముగా నేను
జలనిధి లంఘించి జనకజఁ గాంచి, కలఁకమై నిటు రామకార్యంబుఁ జేసి
కపులప్రాణములు రాఘవులప్రాణములు, కపినాథుప్రాణము ల్గరుణతోఁ గాచి
తడయక యోజగత్ప్రాణనందనుఁడ, పడయు ముత్తమలోకపదములు నీవు
అనవుడు హనుమంతుఁ డొఁగాక మీరు, పనిచినఁ జేయుదుఁ బతికార్య మెనర
నగచరు ల్మాడుఁడు నాశక్తి నేఁడు, జగదేకహితయుక్తి జలధి లంఘించి
పఱతెంచి సుర లడ్డపడిన సాధింతు, నెఱసి లోకములెల్ల నీఱుగావింతు
నక్కజం బగుశక్తి నటు లంకఁ జొత్తు, స్రుక్కక వైదేహిఁ జూచి నే వత్తు
నాలంకయైనను నగలించి తెత్తు, వాలాయముగ సీత వసుధేశుఁ గూర్తుఁ
గాకున్న జలధులు గలఁతు నొండేని, వీఁకతో నమరాద్రి విఱుతు నొండేని
పుడమి తత్తుమురుగాఁ బొడుతు నొండేని, తొడరి మృత్యువునైనఁ ద్రుంతు నొండేని
దీవులన్నియును శోధింతు నొండేని, చేవమీఱఁగ లంకఁ జెరి యచ్చోట
దుష్టాసురులనెల్లఁ ద్రుంతు నొండేని, సృష్టి చీఁకటిచేసి చెఱుతు నొండేని
కాని యూరక రాను గడఁగి మీకెడకు, నేనని పూని మహేంద్రాద్రి యెక్కి
యుదధులతోఁ గూడ నొగి సృష్టి గ్రుంగఁ, గదిసినలయకాలకాలుఁడో యనఁగ
వెసఁ ద్రివిక్రముఁడైన విష్ణునిరీతి, నసమానదేహుఁడై యందందఁ బెరిఁగి
యంగదాదులచేత ననుమతి వడసి, యంగమంతయుఁ బొంగ నంతరంగమునఁ
దనతండ్రిపవమానుఁ దలఁచి శ్రీరామ, జననాథుపదపంకజము లాత్మ నిలిపి
యడుగులు తరముగా నద్రిపై మోపి, మెడయెత్తి యొక్కింత మెయి గ్రుంగ నిలిచి
బొమలెత్తి కలయ నంభోరాశిఁ జూచి, యమరారిపురిమీఁద నటదృష్టి నిలిపి
వఱలంగ నిలమీఁద వాల మల్లార్చి, నెఱి కర్ణములు రెండు నిక్కించి పొంచి
యట నద్రిశిలమీఁద హస్తంబు లూఁది, పటుజవంబున దాఁకొఁ బవమానసుతుఁడు
అల సుధాహరణార్థమై వైనతేయుఁ, డిలనుండి మును దివి కెగయుచందమున
నారభసంబున నద్రిశృంగములు, భూరేణుపులకంబొఁ బొడియునై రాలె
నారావణుండు మున్నార్జించినట్టి, భూరికీర్తులపెంపు పొడియైనయట్లు
నాయరవడి మ్రాఁకు లతనితో నెగసి, తోయధిలోఁ జొచ్చి తునియలై రాలె
భావిసేతువున్నకై పవననందనుఁడు, తా వచ్చి శంకువు స్థాపించె ననఁగ
వెసఁబేర్చి యచ్చట విషమవాయువులు, దెసలకుఁ జెడిపాఱెఁ దివిరి మేఘములు
వక్రించె లంకపై వాయుజుం డనుచు, శక్రాదులకుఁ జెప్పఁ జనినచందమున
నావడి నబ్ధినీ రంతయు నెగసి, యావలి పాతాళ మటుఁ గానవచ్చె
జనకజఁ దెచ్చి నాజలములో దాఁపుఁ, డని మాయతికిఁ జూపె నంభోధి యనఁగఁ
దనపతిహితకార్యధైర్యశౌర్యములు, తనవేగలాఘవోదాత్తసత్త్వములు
చూచి యింద్రాదులు సొరిదిఁ గీర్తింప, నీచందమున దాఁటి యేగుచున్నంత
నీనిత్యకృతి జగద్ధితముగాఁ బూని, పూని యెంతయు దవ్వు పోవుచున్నాఁడు

ఇతనికి విశ్రాంతి యిచటఁ గావించి, యితనిఁ బుచ్చెదనని యిచ్చలోఁ దలఁచి
యప్పుడు మైనాకు నంబుధి పిలిచి, యిప్పుడు హనుమంతుఁ డేతెంచె నిటకు
నొప్పార నాతిథ్య మొసఁగు నీవనుచుఁ, జెప్పి పొమ్మనుటయు శీఘ్రంబె యరిగి

హనుమంతునకు మైనాకుఁ డాతిథ్య మొసఁగుట.

యురుతరనిజపక్షయుగళసంజాత, మరుదుచ్ఛలద్వార్ధిమధ్యంబు వెడలి
శ్రీకరకాంచనశృంగసంకలిత, నాకమై యొప్పు మైనాకపర్వతము
ఎదుటఁ దోఁచినఁ జూచి యిది దైత్యమాయ, కదిసి నాపనికి విఘ్నముసేయఁగోరె
దానికి నేమి నాదర్పంబుపేర్మి, దీనిఁ ద్రుంచెదఁగాక తెగి యంచు నడరి
వరవజ్రకఠినమౌ వక్షంబుచేత, నురవడి హనుమంతుఁ డుదరి తాఁకుటయుఁ
గరువలి సుడిఁగొన్న కాకాకువోలెఁ, దిరమేది ధృతి దూలి దిర్దిరఁ దిరిగి
మనుజుఁడై పొడసూపి మైనాకశిఖరి, యనిలనందనుఁ జూచి యర్థితోఁ బలికె
అనిలజ నేను నీ కపకారి గాను, వనరాశిపంపున వచ్చితిఁ గాని
యమ్మహాత్ముఁడు నీకు నాతిథ్య మొసఁగు, పొమ్మన్న వచ్చితిఁ బూర్వకాలమున
పర్వతంబులకెల్ల పక్షములల్లిగి, గర్వించి మెలఁగ నాఖండలుం డలిగి
పవిధార నొక్కటఁ బక్షము ల్దునుమఁ, బవనుఁడు మీతండ్రి పరికించి నన్ను
నవలీల నీలవణాంబుధిలోనఁ, గవియించి పక్షము ల్గాచి రక్షించెఁ
గాన మీవాఁడను గాని యన్యుఁడను, గాను శీతాచలాగ్రణికుమారుండ
నేను మైనాకుండ నీవు నాయందుఁ, బూని యీఫలమూలములఁ దృప్తిఁబొంది
బడలికలును బాసి పవనకుమార, కడులావు మీఱి లంకాపురంబునకు
నరుగుము నీవన్న నమ్మహాబలుఁడు, వెరవుగా దిప్పుడు విశ్రమించుటకు
జలనిధినడుమ నెచ్చట నిల్వ ననుచుఁ, జెలఁగి మున్ను ప్రతిజ్ఞ చేసినవాఁడ
నిట రాముకార్యార్థ మేగుచున్నాఁడ, నటుగాన నిల్వరా దద్రీశ నాకు
నని పాణితలమున నయ్యద్రిఁ దడవి, యనఘాత్మ నీపూజ లన్నియు వచ్చె
నని పల్కి పోవుచో ననిలనందనుని, ఘనశక్తికమలు కడుఁ జోద్యమంది
నానావిధముల నానందించి రంత, మైనాకగిరి కింపుమై నాకవిభుఁడు
కనుఁగొని శ్రీరాముకార్యమైయేగు, హనుమంతునకుఁ బ్రియం బొచరించితివి
యటుగాన నీకు నే నభయమిచ్చితిని, ఇటు సుఖస్థితినుండు మీవంచుఁ బలికె
నప్పుడు గంధర్వ లమరులు మునులు, తప్పక యంజనాతనయుఁ జూచుచును
ఇతనిలావెట్టిదో యెఱుఁగుద మనుచుఁ, జతురులై సురసనాఁజను దేవదూతఁ
బనిచిన రాక్షసభావంబు దాల్చి, యనిలసూనునకుఁ దానడ్డమై పలికె
నీవార్థిలోనుండి యే నిన్నుఁ గంటి, దైవయత్నంబునఁ దానింకమంటి
అనిలజ యాఁకొంటి నటనిటఁ జనక, మునుకొని నావక్త్రమున వచ్చి చొరుము
నీవనవుడు రామనృపుకార్యమునకుఁ; బోవుచున్నాఁడను బొలఁతి రారాదు

ధరణీశుకార్య మంతయు నెఱవేర్చి, తిరిగి యేతెంచుచోఁ దీర్థ సీకోర్కి-
పోయివచ్చెద నంత బొంకుగా దనిన, నాయింతి కోపించి యటుఁ గ్రమ్మి నిలిచి
చనసీను నిసుఁ బట్టి చంపుదుఁ గడిమి, నని నోరు దెఱచిన ననిలనందనుఁడు
తనమేనుఁ బెంచెను దశయోజనంబు, లినుమడిగాఁ బెంచె నింతి యాననము
ముప్పదియోజనంబులు పెంచె నాతఁ, డప్పుడు నలువది యదియును బెంచె
నొండొరు లిటు శతయోజనంబులుగ, దండిమైఁ బెంచిరి తనువు వక్త్రములు
నంత నాహనుమంతుఁ డసమానబుద్ధి,మంతుఁడై యంగుష్ఠమాత్రగాత్రమున
నతిసూక్ష్ముఁడై వచ్చి యాయింతివదన, మతిరయంబునఁ జొచ్చి యవలీల వెడలె
ముడిగొన్న సంసారమోహబంధములు, విడఁదన్ని సుజ్ఞాని వెడలినమాడ్కి-
వెడలి సీకోర్కి- గావించితి నింక, కడలి దాఁటెదనన్నఁ గపికులోత్తముని
బుద్ధి కెంతయు మెచ్చి పొగడుచుఁ గార్య,సిద్ధి నీకయ్యెడు శీఘ్రంబె యనుచు
నట దివ్యవనితయై యాయింతి ప్రీతిఁ, బటుసత్త్వనిలజుఁ బరఁగ దీవించె
నతఁ డంతఁ బ్రణమిల్లి యటఁ బోవుచుండ, నతిరయంబున వచ్చి యాతనిఁ గదిసి
యొలసి దేహచ్ఛాయ లొడిసిరాఁ దిగిచి, చెలఁగి జీవులమ్రింగు సింహిక గదిసి
పదియోజనంబుల పరపును నూఱు,పదులయోజనములై పరఁగెడునిడుపు
నగుమాన మాతని నలమి చేఁబట్టి, తిగిచి మ్రింగుచునుండ ధీరుఁడై యతఁడు
ప్రతికూలవాతూలపవనసంఘాత, హతుల నోడయుఁ బోలె యటు జోక నిలిచి
యెడద ఛాయగ్రాహి యిదియని తెలిసి, మడవక యటమీఁద మకరివక్త్రంబు
చొచ్చివత్తు నటంచు సూచించినట్లు, అచ్చెరువంది యింద్రాదులు చూడఁ
గడుసూక్ష్మరూపుఁడై కదలక దాని, కడుపులోపలఁ జొచ్చి కడిమిమై వ్రచ్చి
యాదుష్టరాక్షసి నబ్ధిలో వైచె, నాదట సురలెల్ల నానందమంది
వినుతించి వరపుష్పవృష్టులు గురియ, వననిధి నవలీల వడి దాఁటి పోయి
యాసమీరజుఁ డనాయాసంబుతోడ, నానువేలాచలం బవలీల నెక్కె-
నని యాంధ్రభాషభాషాధీశవిభుఁడు, వినుతకావ్యాగమవిమలమానసుఁడు
పాలితాచారుం డపారధీశరథి, భూలోకనిధి గోనబుద్ధభూవిభుఁడు
తమతండ్రివిట్టల ధరణీశువేరఁ, గమనీయగుణధైర్యకనకాద్రివేరఁ
బనిబూని యరిగండభైరవ్రవేర, ఘనుపేర మిాసరగండనివేర
నాచంద్రతారార్క- మై యొప్పుమిగిలి, భూచక్రమున నతిపూజ్యమై వెలయ
నసమానలలితశబ్దార్థసంగతుల, రసికమై చెలువొందు రామాయణంబు
పరఁగు నలంకారభావనల్నిండఁ, గరమర్థిఁ గిష్కింధకాండంబుఁ జెప్పె
నారూఢినార్షేయమై యాదికావ్య, మై రసికానందమై యెల్లనాఁడు
నివ్వసుమతి నొప్పు నీపుణ్యచరిత, మెవ్వరు చదివిన నెవ్వరు వినిన
సామాదిబహువేదచయధామరామ, నామచింతామణినవ్యభోగములు

పరహితాచారములప్రభువిచారములు, పరిపూర్ణశక్తులు ప్రకటరాజ్యములు
నిర్మలకీర్తులు నిత్యసౌఖ్యములు, ధర్మైకనిష్ఠలు దానాభిరతులు
ఆయురారోగ్యంబు లైశ్వర్యములును, బాయనిశుభములు పాపక్షయంబు
వరపుత్రలబ్ధియు వైరినాశనము, సరినొప్పు ధనధాన్యచయసమృద్ధియును
ఏవిఘ్నములు లేక యిండ్లలో నధిక, లావణ్యవతులైన లలనలపొందు
కొడుకులతో నెప్డు గూడియుండుటయు, నెడగాగ నాపదలెల్లఁ బాయుటయు
సమ్మదంబున బంధుజనులఁ గూడుటయు, నిమ్ముల కామ్యంబు లెడపకుండుటయు
సతతంబు దేవతాసంతర్పణంబు, పితృగణతృప్తియుఁ బెంపారుచుండు
వ్రాసినవారికి వరశుభోన్నతులు, వాసవభోగాదివాసులఁ జేయు
నెందాఁకఁ గులగిరు లెందాఁకఁ దార, లెందాఁక రవిచంద్రు, లెందాఁక దిశలు
నెందాఁక వేదంబు లెందాఁక ధరణి, యెందాఁక భువనంబు లేపుదీపించు
నందాఁక నీకథ యక్షరానంద, సందోహదోహళాచారమై పరఁగు.

కిష్కింధాకాండము సంపూర్ణము.



శ్రీ ర స్తు.

శ్రీ రంగనాథరామాయణము

సుందరకాండము.

శ్రీరాముకార్యంబు సేయంగఁ బూని, వారిధి పిల్లకాల్వయుఁ బోలె దాఁటి
చారుశృంగంబుల సానుదేశముల, భూరిభూరుహాలతాపుంజకుంజములఁ
గలిమిచే నొప్పు లంకాసమీపమున, వెలయు సువేలాద్రి వేడ్క-మై నెక్కి-
యంత నాహనుమంతుఁ డాయద్రిమీఁద, నెంతయుఁ గడకతో నేపుమై నిలిచి
యట దక్షిణము చూచి యప్పు డిట్లనియె, నటఁ ద్రికూటాద్రిపై నమరెడుదానిఁ
గదలక ధర్మార్థకామము ల్మాడు, పొదిగొన్నసిరివోలెఁ బొలుపొందుదాని
నమరావతీపురం బబ్ధిమధ్యమునఁ, గమనీయగతినొప్పు గలిగినదాని
నలక కుబేరుతో నలుకమై నచట, నెలకొన్నకైవడి నెగడెడుదానిఁ
గలకాలమును నధోగతి నుండలేక, తెలివిమై భోగవతీనగరంబు
జలరాశి వెలువడి సరిత్త్రికూటమున, వెలసినకైవడి విలసిల్లుదాని
నంబుధియావరణాంబువుల్లాఁగఁ, బంబినప్రభనొప్పు బంగారుకోట
బ్రహ్మాండవిధముగాఁ బరికింపనొప్పు, బ్రహ్మాద్యభేద్యమై పరఁగెడుదాని
మొనసి లోకములకు మొనయెక్కు- డగుచుఁ, నసుపమాకృతితోడ నమరెడుదానిఁ
బొలుపొంద బహుదివ్యభోగసంపదల, నలిమిఁ నెక్కఁడై యందంద వెలుఁగ
నలినసంభవుగేహ మననొప్పునట్టి, లలితమై యొప్పెడు లంకాపురంబు
కని చాల వెఱగంది కనుదెప్పఁబెట్ట, కనిలతనూభవుం డందందఁ జూచి
యెల్లలోకంబులు నెక్కటఁ గెలిచి, బల్లిదుఁడై నేర్చు పంక్తికంధరుఁడు
ఇట్టిసంపదలచే నెనయునీలంకఁ, బట్టాభిషిక్తుఁడై బ్రతికిపాలేది
సకలశోకుఁడగు రామచంద్రునిదేవి, వికలుఁడై కొనివచ్చి వీఁడేల పాలిసె
నని వానిదూషించి యాలంక చొరఁగ, ననువు విచారించియాసత్త్వధనుఁడు
తగ లంకయుత్తరద్వారంబుఁ జేరి, తగవును నీతియుఁ దలపోసి మఱియు
యీసముద్రము కపు లెట్లు దాఁటిరు, వాసి దాఁటిననైన వాసవాదులకు
సాధింప మిగుల నసాధ్య మీలంక, సాధింప నలవియె సకలయత్నముల
భీమసాహసమునఁ బేర్చు రావణుని, రాముఁ డెట్లు జయించు రణములో నెదిరి
యని మహార్థము తనయాత్మఁ జింతించి, మనమున శ్రీరాముమహిమంబుఁ దెలిసి
యీసముద్రం బెంత యీలంక యెంత, యీసురారియు నెంత యినకులేశ్వరున

కని తిరస్కారంబుగాఁ దలపోసి, యనలేనిపాడవైన యా మేనితోడఁ
బగటున నీపురిఁ బగలు చొచ్చినను, బగలౌను రాక్షసభటులకు నాకు
జానకిఁ బొడగానఁజాల నేనట్లు, కాన సూక్ష్మాకృతిఁ గైకొని పోయి
యీలంకదైత్యుల నెల్ల వంచించి, వాలాయమునఁ గాంతు వైదేహి ననుచు
మదిలోన సూర్యాస్తమయ మొప్పఁ దలఁచి, పదిలుఁడై యెంతయుఁ బరికింపుచుండ
నవిరళసత్వుఁడై యఖిలేశుదేవి, నవనీతసూభవ నరసిపో వచ్చె
నేనున్న ననువుగా దీలంక చొరఁగ, వీనికి నన్నట్లు వెసఁ గ్రుంకె నిుఁడఁ
అనిలనందనునకు నసమిచ్చి దైత్య, ఘనపాపములు వూని కలఁగొనఁ బర్వె
ననఁ బర్వెఁ గలయ ఘోరాంధకారంబు, ఘనమైన దైత్యులకలకలం బణఁగె
నంత నాకలకలం బణఁగుట నాత్మ, నంతయుఁ బరికించి యనిలనందనుఁడు
మనమున రఘురాము మఱువక నిలిపి, తనతండ్రి వాయువుఁ దప్పక వేఁడి
మార్జాలమాత్రుఁడై మఱి లంకజొచ్చి, కర్జ మూహింపుచు ఘనుల రాఘవులఁ
దలఁచుచు మెలఁగ నత్తఱి విస్మయముగఁ, గలితభయంకరాకారంబుతోడఁ
బెన్నిధి సాధింపఁ బ్రీతిమై నరుగు,చున్న సాధకునకు నొగినడ్డపడఁగ

హనుమంతుఁడు లంకాపురిఁ జొచ్చుట.

వడి మహాభూతంబు వచ్చుచందమున, నడరి లంకిణివచ్చి యడ్డమై నిలిచి
యట్టహాసము చేసి యనిలనందనుని, ధట్టించి పలికెఁ గ్రోధంబు రెట్టింప
నీవెవ్వఁడవు మఱి నీకుఁ జేరేమి, నీ వీపురంబులోనికి వచ్చు టెట్లు
ఎవ్వరు పంచినా రెఱిఁగింపుమనిన, నవ్వాయునందనుం డచలుఁడై పలికె
నీ వెవ్వతెవు మఱి నీకుఁ జేరేమి, నీవేల యడ్డమై నిలిచితి నాకు
మున్ను నీవెఱిఁగింపు ముదిత యావెనుక, నున్నట్లు నా తెఱం గొప్పఁ జెప్పెదను
అని పల్క నేను దశాననునాజ్ఞఁ, బనిఁబూని యీపురి బలిమి రక్షింతుఁ
బేరు లంకిణి యండ్రు వెఱవారిఁ గన్న, బోరనఁ బొరిగొందుఁ బోనీక యనిన
హనుమంతుఁ డయ్యింతి కనియె వెండియును, వనిత యీపురి జూచువాఁడనై యేను
జనుదెంచితిని వేగ చనఁగ నిమ్మనినఁ, గనలుచుఁ గోపంబు కఱుకురక్కసియు
నెక్కడఁ బోయెద వింక నాచేతఁ, జిక్కితి గాకంచు చెలఁగి మైఁ బెంచి
కఱకటి నిుఁ బట్టి కదిసి నీమేను, దఱిగి నీరక్తము ల్గ్రోవుదు ననుచుఁ
గడుకోప మెసఁగ నక్కపినాథుఁ డొత్తు, పొడిచిన పొలఁతి జంపుట పాపమనుచుఁ
దడయక మారుతి దానివక్షంబు, పిడికిటఁ బొడిచిన పెంపెల్లఁ బొలిసి
యిలఁ గూలి మిక్కిలి హీనస్వరమునఁ, బలుమాఱు హనుమంతుఁ బ్రార్థించి పలికెఁ
గపికులోత్తమ నన్నుఁ గరుణింపవయ్య, నిపుణుఁడై యీపురి నిర్మించునాఁడు
వనజాసనుఁడు నాకు వరమిచ్చినాఁడు, వనచరుఁ డొక్కఁడు వచ్చి నిన్నెదిరి
యెన్నఁడు నొప్పించు నిల నదిమొదలు, క్రన్నన రాక్షసక్షయమగు ననుచుఁ
గాన నీతలఁచిన కార్యసంసిద్ధు, లౌనంచు దివించి యాయింతి చనియెఁ
దనమది మారుతి దానిమాటలకు, ననువొంద నుబ్బి మిన్నంది పెల్లార్చి

చెడవలె రాక్షసుల్ శీఘ్రింబటంచు, నెడమక ల్తున్నగా నిల నడుగిడుచుఁ
గడుసూక్ష్మరూపంబు గైకొనిపోయి, యడరుకోటలు దాటి యడలకఁ బేర్చి
వడి కోటవాకిలివారు తలార్లు, పొడగానకుండ నప్పుడు గూఢవృత్తి
వీథులు పరికించి విపణిమార్గములు, శోధించి రచ్చలు సొరిని నీక్షించి
ఘనగోపురము లెక్కి గజశాల లరసి, మునుమిడి వరహర్మ్యముల సంచరించి
దేవాలయంబులు తిరిగి యిల్లిల్లు, భావించి గొందులు పరికించి చూచి
యుప్పరిగెలు గాంచి యొసరు ల్నెక్కుకి, చప్పరంబులు డాసి సౌధము ల్వేదకి
చాలఁ జెన్నగు రథశాలలు వాజి,శాలలు శస్త్రాస్త్రశాలలుఁ దడవి
మాడువు ల్పరికించి మణిమయంబైన, మేడలవాడల మిగుల చెన్నైన
మంత్రులయిండ్లు సామంతులయిండ్లు, తంత్రిపాలురయిండ్లు దైవజ్ఞులిండ్లు
నావిభీషణు గేహ మతికాయగృహము, దేవకాంతునియిల్లు త్రిశిరుమందిరము
గంభీరమగు కుంభకర్ణునినెలవు, కుంభనాలయము నికుంభసద్మంబు
శ్రీమించు నయ్యింద్రజిత్తునినగరు, నామహోదరుగేహ మాదిగానయిన
దనుజనాథులనికేతనపంక్తు లచటఁ, గనుఁగొంచు నద్భుతక్రాంతుఁడై వారి
యంతఃపురంబుల నంతయు వెదకి, కాంతాజనంబులఁ గలయంగ నరసి
వెండియు దనుజులవేశ్మముల్ గలయ, నొండొండఁ గనుఁగొంచు నొక్కొక్కచోట
నొకకన్ను నొకచెవి యొకకేలుగలుగు, వికృతవేషులఁ జూచి వెఱఁగుఁబొందుచును
బహుపాదబహుభుజబహుమస్తకోరు, సహితులఁ గొందఱ సారె గన్గొనుచు
జపతపస్స్వాధ్యాయసత్కర్మనిష్ఠఁ, దపసులౌ దానవోత్తములఁ జూచుచును
మకరతోరణబద్ధమాల్యజాలములఁ, బ్రకటితధూపసౌరభవిశేషముల
రత్నముక్తాఫలరంగవల్లికల, నూత్నేందుకాంతబంధురవితర్దికల
మణిగణహాటకమయకవాటముల, గణనాధికోగ్రవిష్కంభసూత్రముల
స్ఫుటవజ్రకలితకపోతమాలికల, ఘటితేంద్రనీలప్రకాశదేహళుల
మరకతస్ఫటికనిర్మలగవాక్షములఁ, గురువిందసందీప్తకుట్టిమస్థలుల
మహనీయతరవిద్రుమస్తంభతతుల, బహుశిరోగృహముల భవనపాళికల
నాయుధోజ్జ్వలహస్తులైనరాక్షసులఁ, బాయక యేప్రొద్దు బలసినయట్టి
రావణునగరు చేరఁగఁ బోయి యచటఁ, గావలివారలఁ గలయ శోధించి
పెక్కువాకిండ్లు నిర్భీతిమైఁ గడచి, యక్కొల్వుకూటంబు లన్నియు వెదకి
యంతఃపురము చేర నరుగు నావేళఁ, గంతునిమామ సత్కళలకుసీమ
కలువలపైఁ బ్రేమ గలచందమామ, కలితబింబలలామగతి నుదయించి
జలరాశిఁ దేలించి జలజషండముల, గలవాసి దూలించి గబ్బిజక్కవల
విరహార్తి నెలయించి వెడవింటివాని, వరకీర్తి నలయించి వాడినకలువ
మొత్తము నలరించి ముగ్ధజారిణుల, చిత్తంబు లదరించి చిమ్మచీకటుల
పంతంబు దరలించి పదునైనచంద్ర, కాంతంబుఁ గరఁగించి ఘనచకోరముల
విందులఁ దనియించి విటవిటీజనుల, పొందుల నలయించి పూర్ణచంద్రికల

దిక్కులకెల్లను దెలివిదీపించి, చుక్కలగమిగాఁడు చూపట్టె మింట
పావని వీడెల్లఁ బరికింపవలసి, దేవతలెత్తిన దీపమో యనఁగ
నట్టిచందురుఁ జూచి యంతరంగమునఁ, దొట్టినవేడ్క వాతూలనందనుఁడు
అఱయోజనము వెడలైప్ప యోజనంబు, విరివియౌ నొకయిల్లు వేగ కన్గొనుచు
నంతఃపురంబెల్ల నరయుచు రత్న, కాంతవంతము విశ్వకర్మనిర్మితము
కామచారము చిత్రకరకౌశలంబు, సోమార్కనిభమునై సురలోకవైరి
యాకుబేరునిఁ దొల్లి యాజిలో గెలిచి, గైకొన్న మణిపుష్పకంబు వీక్షించి
యావిమానంబులో నంగనామణులు, రావణు సౌఖ్యవారాశిఁ దేలించి
పానాభిరతికేళి పరవశ లగుచు, మేనుదీఁగెలు సోల మిసిమిపెందొడల

పస బయల్పడి నీవిబంధముల్జార, వసివాళ్లువాడిన వదనంబు లడరఁ
గమ్మనిట్టూర్పులు గ్రమ్మఁ గెమ్మోవు, లెమ్మెయిఁ గైవ్రాల నెలనవ్వుదేర
నరమోడ్పుఁగనుఁగవ లంగజుకేళి, పరవశత్వముఁ దెల్ప బాదపద్మముల
నందియల్ రొదనేయ నమ్మోములందుఁ, జందనతిలకముల్ శ్రమవారిఁ గరఁగ
వేణీభరము వీడ విరిదండ లూడ, నాణిముత్యముపేరు లత్యంతకరిన
వక్షోజపర్వతద్వయి చిక్కువడఁగ, నతులాసమదాలసతఁ జెన్నొందఁ
గటినైకతంబులఁ గచశైవలముల, స్ఫుటనాభిసరసుల భ్రూతరంగముల
స్తనచక్రములవిలోచనమీనతతులఁ, గనుపట్టి సుఖసుప్తిఁ గైకొన్ననడుల
కైవడి నిద్రించు కామినీమణుల, నావాయునందనుఁ డందందఁ జూచి
యిట్టిట్టి సతులుండ నీరావణుండు, కట్టడియై రాముకాంతను దెచ్చెఁ
బరవధూమర్మము ల్పరికించుటకును, బురపురఁ బొక్కుచుఁ బుణ్యమానసుఁడు
స్వామికార్యార్థమై సతులమర్మముల, నీమాడ్కిఁ గనుఁగొంటి నింతియకాని
కానినేతల వీరిఁ గనుఁగొన్నవాఁడ, గానింతి నీయింతిగమిలోన వెదుక
వలనుగాదనుచు భావమున నెన్నుచును, కలయఁ దావెదకుచుఁ గానక యెచటఁ
జప్పుడు గాకుండఁ జనుచు ముందఱను, విప్పైన యొకరత్నవేదికమీఁదఁ
బువ్వుపాన్పున నిద్రఁబోయెడువాని, నవ్వాసపునిభోగమణఁగించువాని
సంజకెంపులతోడ జలదంబువోలె, రంజితగంధాంగరాగంబువాని
నీలైన సెలయేర్ల నీలాద్రివోలెఁ, జేటముత్యపుసేర్లు దీపించువాని
నైదుమస్తములభూరాహులఁబోలెఁ, బ్రోదినంగుళిరమ్యభుజములవాని
జిలుఁగువెన్నెలతోడి చీఁకటివోలెఁ, జలువదుప్పటి మేన జతనొప్పువానిఁ
వెడఁదయొమ్ములన్ వేల్పు వేల్పుచేనుంగు, కడిదికొమ్మునపోటు కైపులవానిఁ
గర్పూరమణిదీపకళిక లిర్వంక, నేర్పుమైఁ గదలించు నిట్టూర్పువాని
మకుటకుండలదీప్తిమయమూర్తివాని, సకలారిగర్వనిస్త్రావణుండైన
రావణుఁ డనువాని రాక్షసాధిపుని, భావించి యాతనిపార్శ్వభాగముల
నడపంబుగట్టియు నాలవట్టములఁ, గడువేడ్కఁ బట్టియుఁ గరకంకణములు
ఛాయంగ వింజామరములు వైసియును, హాయిగాఁ బాడియు నాడియు వీణ

మాటియు మద్దెల ల్మృదుమార్దలీల, సూటి వాయించియు సొక్కి యొండొరులు
తమసాధనంబులు తగఁ గౌఁగిలించి, తమి నిద్రఁబోవు గంధర్వకామినుల
దేవకామినుల దైతేయకామినుల, భావించి యంత నా పరమపావనుఁడు
గగనమండలి చంద్రకళయనుబోలె, మొగులుచెంత మెఱుంగు మొలకయుఁబోలె
నారావణునిశయ్య నభినవయౌవ,నారూఢయై దేవతాంగనకరణి
నున్నమందోదరి నొయ్యనఁ గాంచి, యన్నెలఁతుక సీత యని నిశ్చయించి
యవనిజ నేఁ గంటి ననుచు నానంద, వివశుఁడై గంతులు వ్రేయుచు నచటి
కంభము ల్భీకుచుఁ గలితవాలాగ్ర, చుంబనం బొనరింపుచును నటింపుచును
గావేయజాతివికారము ల్గాంత,నేపిటు చూపుచుఁ జిత్తంబులోన
మఱి వివేకముఁ బూని మనుకులేశ్వరుని, తెఱవ పతివ్రతాతిలకంబు పరమ
పావని జనకభూపాలునిపుత్రి, దేవదేవుని రామదేవునిఁ బాసి
రావణుఁ గోరునే రాగిల్లి మధువు, ద్రావునే యిచ్ఛల తనబుద్ధి భ్రమసె
నానావిధంబుల నాకుఁ జూచినను, దానవిగాని యీతరళాక్షి సీత
గాదని దెలిసి యక్కడ నుండ కవల, మేదురపరికరాప్రేడితామోద
మానితాసవరక్తమధుమాంసయుక్త, పానశాలాపరంపర లెల్లఁ జూచి
గరుడోరగామరగంధర్వసిద్ధ, వరసతు ల్చెఱలున్న వాడలు చూచి

హనుమంతుఁడు ఉద్యానవనంబుఁ జూచుట.

వారిదుఃఖంబులు వారియాపదలు, నారంగ వీక్షించి యాత్మలో వగచి
వెఱవకుం డిటమీఁద వినుఁ రాముఁ డింక, నెఱే రావణునినాజి నిర్జించి మిమ్ము
విడిపించు నందఱు వెఱవకుఁ డింక, దడవులేదని వారిఁ దగ నూఱడించి
నీడల నందంద నిలిచి యేకాంత, మూడెడువారల నటఁ జేరఁబోయి
యిది నాకుఁ జొరబోలు నిది నాకుఁ బోల, దిది నాకుఁ జొరవచ్చు నిది నాకు రాదు
అనక లంకాపుర మంతయు వెదకి, మనుజవేషముతోడ మగువ నెబ్బంగి
నెందును బొడగాన కిచ్ఛలో వగలఁ, బొందుచు నటఁ బోయి పురసమీపమునఁ
బసిఁడికోటలచేత భాసిల్లుచున్న, యసమానమైన యుద్యానంబుఁ గాంచి
మెల్లన నటఁబోయి మెలఁగ వీక్షించి, యల్లనల్లనఁ బ్రాఁకి యాకోట లెక్కిఁ
చందనపున్నాగసహకారతరుల, మందారఖర్జూరమాతులుంగములఁ
బనసపిప్పలినింబపాటలీవకుళ, ఘనసారసౌవర్ణకర్ణికారముల
మల్లికామాలతీమాధవీలతల, సల్లకీకురవకజంబీరతరులఁ
దాలతమాలహింతాలరసాల, నాళికేరాశోకనాగవల్లరుల
నేడాకుటరటుల నేలాలవంగ, దాడిమినారంగతక్కోలతరులఁ
గదళికాకేతకీక్రముకపూగములఁ, బదనైననో స్తనీఫలగుళుచ్ఛములఁ
బరిపక్వబహుపుష్పపరిమళమిళిత, భరితమై వాయుసంపదల నించెక్కి
కలకంఠశుకనీలకంఠారికలఁ, జెలువొందునళులచేఁ జెలు వగ్గలించి
కమలాకరంబులఁ గరము శోభిల్లి, కుముదషండంబులఁ గొమరుదీపించి

శశికాంతవేదుల సన్నుతికెక్కి, విశదచంద్రికలచే వేడ్కసొంపెక్కి
సికతాతలంబులచేఁ జెన్నుమీఱి, సకలర్తువిహరణస్థానమైమిగుల
రమణమైనది చైత్రరథమన మించి, యమరేంద్రునందనమనఁ జూడనొప్పి
యలరు రావణవినోదారామభూమి, గలయంగఁ గనుఁగొని కడుచోద్యమంది
యొప్పునావనభూమి కొయ్యన డిగ్గి, చప్పుడు కాకుండఁ జరణంబు లిడుచుఁ
గొలఁకులయందును గూలంబులందుఁ, బులినదేశములందుఁ బొదరిండ్లయందుఁ
గేళీగృహములందుఁ గృతకాద్రులందు, శైలశృంగములందు సానువులందు
సుర్వీరుహములందు నోలంబులందు, సుర్వీతనూభవ నుడుగక వెదకి
ఆవనమధ్యంబునందు రేఁబగలు, కావలియుండు రాక్షసకోటి కెప్పుడుఁ
దావలంబై మిన్ను తలఁదన్నుపొడవు, చేవెలుంగుచు మేరుశిఖరాళిఁగేరు
పసిఁడికంబములచేఁ బసమీఱి వేయు, పసిఁడికంబములచే పఱపుదీపించి
వరరత్నతోరణావళుల శోభిల్లి, యురుతరం బగుచున్న యొకమేడఁ గాంచి
యా మేడలోపల నంతయు వెదకి, భూమిజఁ గానక బుద్ధిలో వగచి
యినవంశవల్లభుఁ డేకతంబునను, మును నన్ను రమ్మని ముదమొప్పఁ బిలిచి
జనకజ పొడగానఁ జాలుదు వీవ, యనిచెప్పి నాచేతి కానవా లిచ్చెఁ
బనిబూని వచ్చితి బంటనై యేను, గనుఁగొనలేనైతిఁ గమలాక్షి నెందు
నీదురాత్ముఁడు సీత నిటఁ దెచ్చుచోట, వేదనప్రాణము ల్విడిచెనో యింతి
యంబరగతిభీతి నరుదెంచుచోట, నంబుధిఁ బడియెనో యసురచేఁ దప్పి
యిచ్చటిదనుజుల నీక్షించి బెదరి, చచ్చెనో విరహాగ్ని సమసెనో లేక
కమలాక్షి నొరులకుఁ గానరాకుండ, భ్రమపెట్టి మాయలు పన్నెనో వీఁడు
ఒండుదేశంబుల నునిచెనో కాక, దండించి చంపెనో తరలాక్షి నసుర
యేమని మగుడుదు నేమందుఁబోయి, యేమిచేయుదు నింక నిటమీఁద నేను
వామాక్షిఁగానక వచ్చితి ననిన, రాముఁ డప్పుడె పాయుఁ బ్రాణవాయువుల
నన్నచై సౌమిత్రి యడుగు నీవార్త, విన్నంత భరతుండు విడుచుఁ బ్రాణముల
నతనిచై శత్రుఘ్నుఁ డఖలబాంధవులు, హతులౌదు రినవంశమంతట సమయ
నదిచూచి సుగ్రీవుఁ డాయంగదుండు, మొదలైనకపివంశమును నాశమొందు
గాన వానప్రస్థుగతి మహాటవుల, నేను గాపుండుదు నిదియుఁ గాదేని
సొదఁ బెర్చుకొని యగ్నిఁ జొత్తునొండేని, యుదధులఁ బడి చత్తు నుసురాసఁ దక్కి
యక్కట సంపాతి యూడినమాట, నిక్కంబుగా నమ్మి నీరధి దాటి
యిచ్చటికొంటిమై యే వచ్చుటెల్ల, నచ్చుగా వృథయయ్యె నౌఁగాకయేమి
త్రిదశులతోఁ గూడఁ దెగువమైఁ బేర్చి, త్రిదశేంద్రుఁ బట్టి బాధింతునొండేని
చెలఁగి కీలలతోడ శిఖి నీటముంచి, యిలఁ బ్రాణి ప్రభలు మాయింతునొండేని
క్రందుగా జమునిఁ గింకరులతోఁ బట్టి, డెందంబు బగుల దండింతునొండేని
చలమొప్ప నిర్ఋతిరాక్షసులతోఁ గూడఁ, బెలుకురఁ బట్టి నొప్పింతునొండేని
కరువలి నయ్యేఁడు గాడ్పులఁ బెనచి, కెరలి యందంద శిక్షింతునొండేని

నలిరేగి ధనదుఁ గిన్నరులతోఁ బట్టి, చెలువేది కూల భర్జింతునొండేని
యెనయఁ బ్రమథులతో నీశానుఁ బట్టి, చెనసి యొండొండ శిక్షింతునొండేని
కుతలంబుఁ గిరులతోఁ గుమ్మరసారె, గతిఁ ద్రిప్పి త్రిప్పి యుక్కడఁతునొండేని
యీలంకదైత్యుల నీయబ్ధి ముంచి, లీలమైఁ గలఁచి కాఁతొనొండేని
యేనింతచేసిన నెల్లదేవతలు, నానతులైవచ్చి యతివఁ జూపెదరు
కాకున్న రాఘవు ల్కరుణమైఁ దామె, యీకీడు వలదని యింక మాన్పెదరు
అని నిశ్చయముచేసి యామేడశిఖర, మనిలనందనుఁ డెక్కె నాసమీపమున
వాయువు నెండగు వడిఁ జొరరాని, యాయశోకవనాంతరావళిలోన

హనుమంతుఁడు సీతను జూచుట.

నెలమి జొంపరిగూడ హేమవర్ణమున, విలసిల్లు శింశుపావృక్షంబు క్రింద
వ్రతములఁ గడుడస్సి వనటులగ్రుస్సి, యలిదుఃఖములఁ గుంది యాత్మలో గంది
విపులాశ్రువుల దోఁగి విరహాగ్నిఁ గ్రాగి, కపటవృత్తులఁ జిక్కి కడుముట్ట స్రుక్కి
జీవంబుపైరోసి చెలువంబుఁ బాసి, యావిధి మది దూఱి యలసత మీఱి
చెక్కిటఁ జెయిఁజేర్చి చింతలకోర్చి, దిక్కులేమి దలంచి ధృతిదూరడించి
యినరశ్మి వాడిన యెలదీఁగెఁబోలె, ఘనధూమయుతదీపకళికయుఁ బోలె
జలదమాలికలోని శశికళవోలెఁ, బలుమంచుఁ బొదివిన పద్మినివోలె
చెలఁగి పిల్లులలోని చిలుకయుఁ బోలె, బులులలో నావునుబోలె దుర్వార
ఘోరరాక్షసవధూగోటిలోనున్న, నారీశిరోమణి నలినాయతాక్షి
మలినాంగి యలివేణి మాతంగగమన, కలితభూషణజాల గద్దదకంఠి
జనితోష్ణనిశ్వాస సతతోపవాస, జనకతనూజాత జగదేకమాత
నిఖిలసన్నుతపూత నిర్మలఖ్యాత, యఖిలగుణోపేత యయినయాసీతఁ
బొడగని సీత గాఁబోలుఁ బొమ్మనుచుఁ, గడుభక్తి రామలక్ష్మణులకు మ్రొక్కి
కడువేడ్క సురలను గడఁగి వేడుచును, నడరెడుముదమున నామేడ డిగ్గి
మదినుబ్బి యంగుష్ఠమాత్రుఁడై కదిసి, పదిలుఁడై యాశింశుపావృక్షమెక్కి
బాలుఁడై యల వటపత్రంబునందు, వేలీల గ్రీడించు విష్ణుఁడుపోలె
శాఖామృగేంద్రుండు జడిగొన్నదాని, శాఖలలో డాగి చతురుఁడై యుండెఁ
బావనచరితుఁ డాపద్దాయతాక్షి, భావించి భావించి పలుమాఱుఁ జూచి
కడఁకతో ఋశ్యమూకమునందుఁ గన్న, తొడవులు నీయున్నతొడవులు జూడ
నేకప్రకారంబు లీపద్మనయన, కాకుత్స్థసతి సీత గాఁబోలు ననుచు
మఱియును బఱికించి మారుతాత్మజుఁడు, నెఱిసినబుద్ధిమై నెలఁత నీక్షించి
శ్రీరాముఁ డానతిచ్చినప్రకారమున, నారమణీమణి యవయవశ్రీలు
కర్ణవేష్టనములు కరకంకణములు, స్వర్ణాంబరంబును సరిఁ బరికించి
వలవంతఁబడి వ్రేగువారిచిహ్నములు, వలనొప్పగల పతివ్రతలచిహ్నములు
చదురుగల్గిన మర్త్యసతులచిహ్నములు, చెదర కన్నియుఁ జూచి చింతించి మఱియు
గొనకొని రాముఁ బేరొక్కని ప్రలాపింప, గనుఁగొని మఱి సీతగా నిశ్చయించి

యా విన్ననగుమోము నాకృశాంగంబు, నావిరిసినవేణి యాయున్నయునికి
యాదురవస్థయు నావిలాపంబు, నాదైన్యమును జూచి యాత్మ శోకించి
చంద్రునిఁ బాసినచంద్రికరీతి, చంద్రాస్య యారామచంద్రునిఁ బాసి
యుండునే యీయింతి నొగిఁబాసి రాముఁ, డుండునే యిచ్చోద్యమూహించిచూడఁ
గులశీలదాక్షిణ్యగుణవయోధర్మ, లలితరూపము లొక్క లాగౌటఁజేసి
యారామువిభున కీయంగనామణియు, నీరామ కారామనృపతియుఁ దగును
ఈకాంతకై కాదె యినకులేశ్వరుఁడు, శ్రీకందు విలుద్రుంచెఁ జెఱకుచందమున
దొలుతఁ బట్టినయంతఁ ద్రుంచె విశాధు, నలిఁ గోసె నాశూర్పణఖముక్కు చెవులు
ఖరదూషణాదిరాక్షసుల ఖండించె, మరణంబునొందించె మారీచునీచు
వాలి నొక్కమ్మున వధియించి కపుల, నాలుగుదిశల కున్నతశ్రీఁ బనిచె
వారిలోపల నన్ను బలవంతుఁ డనుచు, నారూఢిగతి నంగదాదులఁ గూడి
ఘనపుణ్యనిధియైన కాకుత్స్థునెదురఁ, బనిబూని వచ్చితిఁ బంతంబు మెఱసి
నాపుణ్యవశమున నాకోరినట్లు, లీపుణ్యవతిఁ గంటి నిచ్చోట వచ్చి
దారుణాసురవధూతతినట్టనడుమఁ, గారణాకృతిఁ జిక్కి గలఁగు నీసతికి
నెబ్భంగిఁ జూపుదు నింక నారూపు, నెబ్భంగి భాషింతు నీయింతితోడ
నెబ్భంగి నూరార్తు నీపుణ్యసాధ్వి, నెబ్భంగి నిబ్భంగు లెఱిఁగింతు సతికి

రావణుఁడు సీతాదేవివద్దికి వచ్చుట.

నని యిట్లు చింతింప నంత రావణుఁడు, జనకజఁ జింతించి సంతాపమంది
వేకువజామున వేగ మేల్కాంచి, తేకువ మనసిజాధీనచిత్తమున
దివ్యమాల్యంబులు తెఱఁగొప్ప ముడిచి, దివ్యగంధంబులు తెఱఁగొప్పఁ బూసి
దివ్యాంబరంబులు తెఱఁగొప్పఁ గట్టి, దివ్యభూషణములు తెఱఁగొప్పఁ బెట్టి
తనకిరీటప్రభాతతు లెందుఁ బర్వ, ఘనచంద్రహాససంకలితుఁడై పేర్చి
కరమణికంకణక్వణనము ల్మెఱయ, సరసనచ్చరలు వింజామర లిడఁగ
ఘనకుచహారము ల్గ్రాల గంధర్వ, వనితాజనము లాలవట్టముల్పట్ట
గొడుగును ధరియించి కుచమూలరుచుల, నడయాడుచున్న కిన్నరసతుల్ల డువ
బాహుపార్శ్వంబులఁ బరఁగంగ హస్త, వాహికలై యక్షవనితలు నడువఁ
బరిమళోదకపానపాత్రికల్పట్టి, గరుడకామిను లిరుగడల నేతేర
నెడనెడ సందడి నెడఁగల్గ జడిసి, కడఁగి ముందట నాగకన్యకల్ల డువ
విద్యాధరస్త్రీలు వీణాదివాద్య, హృద్యసంగీతంబు లింపుగాఁ బాడఁ
దనగుణోన్నతు లొగిఁ దగ సిద్ధసాధ్య, వనితలు చేరి కైవారము ల్సేయ
బాగొప్ప వరఖడ్గపాణులై కదిసి, రాగిలి వెనుక నారాక్షసస్త్రీలు
కలగొనఁ గరదీపికాసహస్రములు, వెలుఁగ మండోదరి వేడ్కఁ దోడ్కొనుచు
మెఱుఁగుల వెనుకొనుమేఘంబుపోలె, మఱియును గలసతు ల్మలసి తన్గొలువ
నురుపాదహతినోలి నుర్వి గంపింప, బరిహాసరవము లంబరమును గప్ప
మంజీరమేఖలామణిభూషణాది, శింజితంబులు విందుసేయ వీనులకు

నాయశోకారామ మఖుడు సొత్తెంచె, వాయుసూనుడు దన్ను వాంఛతోఁ జూడ
నిద్రావశేషఘూర్ణితదృష్టితోడ, భద్రకేయూరాంకబాహులతోడ
వసుధపై జీరాడు వలెవాటుతోడ, వసివాళ్లు వాడినవదనంబుతోడ
ఘనతరభీషణాకారంబుతోడ, జనకజ ముందఱఁ జనుదెంచి నిలిచె
నిలిచిన భీతిల్లి నివ్వెఱగంది, తలఁపులో రఘురాముఁ దప్పక నిలిపి
యూరులు నుదరంబు నురుకుచద్వయము, చారుహస్తంబులఁ జక్కఁజవరించి
ఫుల్లిఁ గన్న లేడిని బోలె చిత్తమునఁ, గలఁగు చున్నట్లున్న కల్యాణిఁ జూచి
వనితలలోన దుర్వారగర్వమునఁ, దను దైవమాడింపఁ దగవేది పలికె
నింతి నీతనుమధ్య మిఁక దాఁచనేల, కాంత నీనెమ్మోము గ్రైవ్రాలనేల
పొలఁతి బల్మిని బట్టి భోగించువాఁడ, నెలఁత యీగుణముల నెఱిఁగనుంగొనుము
వనిత యీగుణముల వఱలెడుననున్నఁ, గొనుము నీయనుమతిఁ గోరియున్నాఁడ
మానక కైకొందు మగువ నిన్నింకఁ, గాన నామాటలు గైకొని వినుము
ఈరూపమునసుండ నేమి కారణము, దారుణాటవి దాఁటి తమ్ముఁడుఁ దాను
వనిత రాముఁడు వచ్చి వనధి బంధించి, పనిచినకడిమిమైఁ బద్దు సాధించి
గొనకొన్న వేడ్కతోఁ గొనిపోవు నిన్ను, ననివిచారించెద వాత్మలో నీవు
అమరేంద్రయమవరుణాదులకైన, సమరంబులో నన్ను సాధింపరాదు
ఈబేలతనమేల యిందీవరాక్షి, నాబాహుశక్తికి నరు లెంతవారు
అడవుల నాకులు నలములు నమలి, యిడుములు పడుచున్న హీనమానవుని
పొందేల కోరెదు పొలఁతి నగ్రబొంది, పొందనొల్లవె రాజ్యభోగంబు లకట
యనిమిషాధిపుఁడైన నంతకుఁడైన, వినుఁ జలాధిపుఁడైన విత్తేశుఁడైన
ననలనైరృతివాయుహరిహరులైనఁ, జనుదెంచి యీలంక సాధింపలేరు
లంక మానవులకు లక్ష్యింపఁ దరమె, యింక నెక్కడిరాముఁ డిందెటు వచ్చు
వచ్చి లంకాపురవర మెట్లు చొచ్చుఁ, జొచ్చిన నెబ్బంగి స్రుక్కక యెదురు
నెదిరి నగ్ర బొడఁగని యెబ్బంగిఁ గదియు, గదిసి నాసత్త్వ మేగతి సైపఁజాలుఁ
జాలుట యెందాక సమకూరఁ బోలుఁ, బోల వీమాటలు పోవిడు వింతి

జానకి రావణుని తిరస్కరించుట.

అని యిట్లు పలుమాఱు నరమి రావణుఁడు, వినరానిపలుకులు వెసదూఱి పలుకఁ
గడునల్లి గద్గదకంఠంబుతోడఁ, బుడక ద్రుంచి యవశ్యమును రాముచేతఁ
జెడుదు వీవని చాటి చెప్పినరీతిఁ, బడతుక తృణము చేపట్టి యిట్లనియె
పాపాత్మ నీవు నాపతి డాఁగురించి, యేపున లంకలోనికి నన్నుఁ దెచ్చి
యిదియొక్క కడిమిగా నేల గర్వించె, దిదియొక్కమేలుగా నేల ప్రేలెదవు
పరవధూరతిగోరు పాపాత్మకులకు, సిరియు నాయువు కీర్తి చెడునటుకానఁ
దగవును ధర్మంబు తలపోసి నన్ను, మగుడ రామునకిమ్ము మనఁ గోరితేని
కాదేని దుర్బుద్ధి గైకొంటివేని, కోదండదీక్షాదిగురునిచే రామ
జననాథుచే నీవు చచ్చుట నిజము, వనవాసకృశుఁడు కేవలదుర్బలుండు

ననద రాజ్యవిహీనుఁ డసహాయుఁ డతఁడు,మనుజమాత్రుఁ డటంచు మదినెన్నవలదు
దండకాటవి చతుర్దశసహస్రోగ్ర,చండరాక్షసకోటిఁ జంపఁడే తొల్లి
దండధరోద్దండదండంబు నొడిసి, చండాంశుకిరణోగ్రసంరంభ మణఁగ
గణనాపరంపరల్గడచి యందంద, రణభీషణములైన రాముబాణములు
పరువడి నీలంకపైఁ బాఱునాఁడు, తరమిడి నీయురస్థ్సలి గాడునాఁడు
మునుకొని నీశిరంబులు ద్రుంచునాఁడు, మునుమిడి నీరక్తములు గ్రోలునాఁడు
రావణ నీలావు రఘురాములావు, నీవు చూచెదుగాని నేనేల చెప్ప
నెండతోఁ బ్రాలేయ మెదిరించినట్లు, కొండతో దగరు మార్కొనినచందమున
మదహస్తితో దోమ మార్కొన్నకరణి, నుదధితోఁ గాల్వ మెండొడ్డినపగిది
శ్రీతర్వతో వేము శ్రీశుతో జోగి, ధాతతో విప్రుండు ధనికుతోఁ బేద
జాతిరత్నముతోడ సరి గాజుపూస, భూతలంబున సరిపోల్చినయట్లు
తెగువమై రాఘవాధిపునకు నీకు, మగఁటిమి మదహస్తిమశకాంతరంబు
మిగుల నోరులుగల్గి మీఱి పల్కెదవు, జగతి రాముని తోడ సరియె రాక్షసుఁడ
ఒకలంక యేలుచు నుబ్బెద వీవు, సకలలోకములకు స్వామి రాఘవుఁడు
అఖలకంటకుఁడ వీ వన్నిలోకముల, నఖలలోకారాధ్యుఁ డారాఘవుండు
వేదచోరుఁడ వవివేకివి నీవు, వేదంబులకునెల్ల వేద్యుం డతండు
కర్మవూరితఘనకాయుండ వీవు, నిర్మలగుణయశోనిధి రాఘవుండు
సర్వజీవాళిభక్షకుఁడవు నీవు, సర్వజీవులకును సముఁడు రాఘవుఁడు
ఉన్నతోన్నతుఁడైన యుర్వీశునకును, ఎన్ని సారెలపెట్ట నెఱుఁగంగ నీవు
ఇందుసూర్యాగ్నిసురేంద్రులు గారు, ఇందుధరార్చితుం డినవంశజుండు
నిన్నిట మర్దించి నీరూపమణఁచి, నన్నుఁ దోడ్కొనిపోవు నమ్ము మింతటికి
నాకు నీకును సాక్షి ననుఁ దెచ్చునపుడు, నైకొని యెఱుకపఱ్చి కడఁగి యేతెంచి
నీలావుశక్తియు నీపరాక్రమము, నేలపాలుగఁజేసి నెఱి వ్రేసి నిలుపఁ
గపటభాషలు పల్కి ఘనపక్షినాథు, నపుడు ఖండించిన యథముఁడ వీవు
తరమెఱుంగక రామధరణీశుతోడఁ, దొరలితే భస్మమై త్రుంగెదుగాక
యేమిటి కెదురుద న్నెఱుఁగనిమాట, లేమిటి కీగర్వ మినకులేశ్వరుఁడు
ఈమూఁడుజగముల నెందు డాఁగినను, ఈమెయి నిన్నేల యిట్లుండనిచ్చు
ననిన రావణుఁడు మహారోషదృష్టి, జనకజ మఱిఁ జూచి చలముతో ననియెఁ
బరమేష్టిఁ దపమునఁ బరఁగ మెప్పించి, వరశక్తి నతనిచే వరములు గాంచి
సురపతి మొదలుగా సురలనోడించి, గరళకంధరుతోడఁ గైలాసమెత్తి
కడిమిమై నూర్ధ్వలోకములు సాధించి, వడిఁ బేర్చి పాతాళవాసులనోర్చి
సకలోన్నతుండనై సడిగన్ననన్ను, వెకలియై తమతండ్రి వెడలంగఁ ద్రోవ
నతిహీనసత్త్వుఁడై యడవులలోన, బతిమాలి ఫలములఁ బర్ణాశనముల
వికృతాంగుఁడై తపోవృత్తిమై నన్ను, నొకవేదమానవుఁ డోపునే చెనక
నని రాము నిందింప నందంద భొగిలి, మనమున నొగిలి యుమ్మలికంబు మిగిలి

ఘనశోకగద్గదకంఠయై యప్పు, డినకులాధిపుదేవి యెలుఁగెత్తి యేడ్చె
ధృతి దూలి నలుగడ దేవగంధర్వ, సతులెల్ల నేడ్చిరి జానకిఁ జూచి
రావణుగర్వంబు రమణిశోకంబు, భావించి కోపతాపంబులు నిగుడ
ననిలతనూభవుఁ డప్పు డాదుష్ట, దనుజుపై లంఘింపఁ దలపోసి చూచి
బిరుదనై వీనిఁ జంపితినేని పతికి, ధరణిజనేమంబుఁ దగఁ జెప్పఁగలను
అమరారిచేత నాయసువెల్లఁ బొలసి, సమరంబులోపలఁ జచ్చితినేని
లంక దిక్కెఱుఁగక లలన నెవ్వగల, నింకుచు నిందున్కి యెఱుకచొప్పడక
యేను జచ్చుటయును నేర్పడ వినక, భానుకులాగ్రణి ప్రాణముల్విడుచు
నింతచేసినచేత లేమియుఁగాక, నంతయుఁ జెడిపోవు నధిపుకార్యంబు
ఎడపక నిటమీఁద నీదైత్యతోడఁ, గడఁగి కయ్యము సేయఁగలవాఁడఁగాను
దనుజుతోఁ బోరాడి దర్పించి గెలుతు, నని తలంచిన గెల్పు నదిగానరాదు
అని నిశ్చయముచేసి యాత్మలో మున్ను, దనుజుతోఁ బోరుట తగవు గాదనుచు
నెలఁతను దర్శించి నిష్ఠతోఁ బిదపఁ, గలకార్యములు సేయఁగలవాఁడఁగాని
అనిసేయ నిది సమయము గాదు నాకు, నని ధీరుఁడైయుండె నా మ్రానిమీఁద
మఱియు రావణుఁడు కామంబు ప్రేమంబు, వెఱపును నొఱపును వెఱగును గదుర
నాడినమాటల కన్నిటికాత్త, నోడక యతినిష్ఠురోగ్రవాక్యముల
వనితలందఱు విన వసుధాతనూజ, తను దూరఁబల్కిన దనుజేశుఁ డంతఁ
గుటిలభావమున భ్రూకుటిలసన్నిటల, చటులరక్తాస్యుఁడై జాజ్వల్యమాన
లోలకీలాభీలలోకసంహార, కాలాగ్నిరీతి నాగ్రహమున మండి
ఘోరహుంకారుఁడై క్రూరుఁడై నీతి, దూరుఁడై యాసీతఁ దొడరి భర్జించి
చంద్రహాసంబెత్తి జానకినేయ, నింద్రారి గమకించునెడఁ గేలుఁ బట్టి

మండోదరి రావణునికి నీతిఁ జెల్పుట.

యమలమందోదరి యడ్డమై నిలిచి, కొమరొప్పఁ బలికె నాకుమతి యావిభుని
దండిమై నెసరిన ధరణిపాలకుఁడె, ఖండింప నీకు నీకాంత దైత్యేశ
యెన్ని చెప్పిన విన వేమి సేయుదును, నిన్ననఁ బనియేమి నీపురాకృతము
మ్రుచ్చిలి పరసతి మునుఁ దెచ్చుటొకటి, చెచ్చెఱ భువి నిందఁ జెందుట రెండు
తెగువతోడుతఁ బట్టి తెచ్చినమొదలు, పగఁగొనియుండు శేర్పరుపఁగా మూఁడు
ఒనర దుర్బుద్ధి నాయువిదను గూడి, యనుభవించెదనను టారయ నాల్గు
కనను త్తమస్త్రీలఁ గడఁగి పల్మాఱు, వినరానిపల్కులు వెసఁ బల్కఁ జేను
గామ మణఁపలేక కామినిఁ జంపఁ, దామదినెంచుట దనుజేశ యాఱు
తగ వెంచనేర కెంతయుఁ జేసి తుదిని, మగఁటిమివోపుల మఱియును నేడు
నేఁడు చేటులు నయ్యె నీయింతివలన, నేఁడు గడపఁగరాదు నిజముగానెన్నఁ
బొరి పాతకంబులఁ బుట్ట యీమేను, దొరఁగిన సద్గతి దొరకునె నీకు
నభిమానవతి మానవాంగనసీత, కభిలాషపడి యింత కలుగంగనేల
నీయంతిపురమున నెలఁతలలోన, నీయింతి చింతింప నెవ్వారిఁ బోలు

ననుఁ గూడి క్రీడింపు నాథ యీచెంత, నినువంటివానికి నీతి గాదెందుఁ
బొలిసెనే నీబుద్ధి పోపొమ్మటంచుఁ, బలిమిఁ దొలంగించె బలికేలువాలు
కడు సిగ్గుపడి చాల కలుషించి సీత, కడనున్న దుష్టరాక్షసవధూజనుల
నతిదీర్ఘతనుల భయంకరాకృతుల, సతతనిష్ఠురవాక్యసమరకర్కశుల
వినతనయోముఖి వికటహేమాస్య, యనుదాని హరిజటి యనుదానిఁ ద్రిజట
ప్రభుసమహోదరిఁ బాటించి పిలిచి, లఘువృత్తిఁ బలికె నిర్లజ్జుఁడై నిలిచి
ప్రియనయోక్తులచేత బెదరించియైన, భయదచేష్టలనైన బాధించియైన
మానసవ్యయంబున మగువ నాసొమ్ము, చేసి తెం డిటుమీరు సేయలేకున్న
నంతటిమీఁద నయ్యబ్జాక్షిఁ జంపి, యింతలింతలు కండ లిందఱు గొనుఁడు
అని యశోకారామ మాప్రాంత కదలి, తననగరికిఁ బోయె దనుజవల్లభుఁడు
అపుడు జానకి దానవాంగనలెల్లఁ, గృపమాలి తమతమకృతకవాక్యముల
బోధించి రావణుఁ బొందు మీవనుచు, బాధించుతఱి శూలపాణియై యొక్క-
రక్కసి బెదరించి రాముఁ డీలంక, దిక్కు-చూడఁగలేఁడు తెఱవ యీయాస
విడుమంచు నొకయింతి వెడనీతిఁ బలుకు, నిడుమలఁ బడియుండ నేల నీకిట్లు
వరియించు దానవేశ్వరునిఁ గాదేని, పొరిగొందు నని యొక్కపొలఁతి భర్జించుఁ
దెండు ఖడ్గము తల తెగఁగొట్టి దీని, కండలు కమ్మగాఁ గల్లుతో నద్ది
చవి చూత మని యొక్క జంతమారొలయు, నవునవు నటు సేయుఁ డని యోర్తుపదురు
నీరీతిఁ బెదరింప నిందీవరాక్షి, ధారణీతనయ కొందలమంది కుంది
కన్నీరు దొరుఁగ గద్గదకంఠ యగుచుఁ, దన్ను గాఁజేసె దైత్యస్త్రీల కనియెఁ
దలఁప మానవులకు దానవులకును, గలుగునే దాంపత్య గౌరవశ్రీలు
ఇంబలు దుర్భాష లిట్లాడనేల, చంద్రునిఁ బాయని చంద్రికవోలె
భానునిఁ బాయని ప్రభయును బోలె, నేను శ్రీరఘురాము నెడఁబాయఁజాల
నానృపాలుఁడు దీనుఁడైనను రాజ్యహీనుఁడైనను నాకు నిష్టదైవంబు
జలధికన్యకరితి శర్వాణిభాతిఁ, బలుకుఁదోయ్యలిమాఁడ్కిఁ బౌలోమిమాఁడ్క
రోహిణిసరణి నరుంధతికరణి, స్వాహాంగనాగతి సావిత్రిమతిని
రతిచందమునఁ బతివ్రతనిష్ఠఁ బొందలి, పతియైన రఘురాము భజియించుదానఁ
జంపిన జంపుఁడు శాతాసి శిరము, తెంపినఁ దెంపుఁడు ధృతి రాముగాని
యితరుల నేనొల్ల నిటువంటికల్ల, మతముల నేనొల్ల మానుఁ డింకనిన
మండుచు వార లామాటకు మిగులఁ, గండ్రొవ్వునఁ బెక్కుగతులఁ గాఁదింప
ధూలిధూసరితయై తూలి లో దారి, నీలాహిబోలిన నెఱివేణి చెదర
నేలపైఁ బడి వేడినిట్టూర్పునిగుడ, హాలక్ష్మణా యంచు హారామ యనుచు
హాయత్త కౌసల్య యనుచు నెల్లెత్తి, యాయుత్తమాంగన యార్తియై నేడ్చె
అంత నాత్రిజటయు నవనితనూజ, సంతాప మటుఁ జూడఁజాలక తొలఁగి
నెలకొని యొకచోట నిద్రించి లేచి, కలఁగని రాక్షసకాంతలఁ జూచి
యొకకలఁ గంటినే నోయింతులార, ప్రకటించి చెప్పెదఁ బాటించి వినుఁడు

రాముఁ డేనుఁగునెక్కి రాఁ జూడఁగంటి, సౌమిత్రిభృత్యుఁడై చనుదేరఁ గంటి
నామహాగజముపై యవనీతనూజ, కోమలి నెక్కించుకొని పోవఁ గంటిఁ
బట్టాభిషిక్తుఁడై బ్రహ్మాదిసురలుఁ, గట్టిగాఁ గొల్వ రాఘవుఁ డుండఁ గంటిఁ
గమనీయ మగుపుష్పకముమీఁదనుండి, బ్రమసి రావణుఁ డుర్విపైఁ గూలఁ గంటిఁ
గూలినరావణుఁ గ్రూరాసి యొకతె, నీలాంబరముతోడ నెటోఁ జేరఁగంటి
చేరి రావణుతల ల్చెలువేది కూల్చి, భూరిగార్ధభములఁ బూనినరథము
నందుగ్రమున వైచి యామ్యదిక్కునకుఁ, గొందలపడి యెత్తుకొనిపోవఁ గంటి
గురుతరోష్ట్రము నెక్కి కుంభకర్ణుండు, తిరమేది దక్షిణదిశ కేగఁ గంటిఁ
దనరారు తోరణతతులతోఁ గూడ, వనధిలోపల లంక వడి గూలఁ గంటి
నతికాయ మకరాక్షు లాయింద్రజిత్తు, ప్రతనవిక్రము లుర్విపైఁ గూలఁ గంటిఁ
గనకపీఠంబుపైఁ గారుణ్యమూర్తి, యొనర విభీషణుం డుండంగఁ గంటి
రావణుమరణంబు రఘురాముజయము, నీవిధంబున సిద్ధ మిటమీఁద నింక
నటుగాన మీర లీయవనీతనూజఁ, బటుదుష్టభాషల భర్జింపవలదు
తొలఁగిహిం డనవుడుఁ దొలఁగి నిద్రించి, యలసి రాక్షసభామ లందఱున్నంత
నాసమయంబున నవనీతనూజ, గాసిల్లి భయశోకకంపిత యగుచుఁ
దన్ను రెణ్ణెలలకు దయమాలి చంపు, నన్న రావణుమాట లందందఁ దలఁచి
శోకంబు గ్రమ్మ నశోకంబుకొమ్మ, యాకొమ్మ యూతగా నటు లేచి నిలిచి

రాక్షసస్త్రీలబాధలకు జానకి పలవించుట.

లోలత నడవులలో నొంటిఁబడిన, బాలికయనుబోలెఁ బలవింపఁ దొణఁగె
అక్కటా దైవంబ యదయత నన్ను, నిక్కడఁ జెఱఁబెట్టి యిటు లేఁచఁదగునే
ఖలదైత్యుచేఁ జావఁ గలవు నీవనుచు, నలినసూతి లిఖించినాఁడొ నానొసటఁ
గాకున్న మఱి దండకావనంబునకుఁ, గాకుత్స్థకులుఁడు రాఁ గారణంబేమి
పైడిమృగంబు నఁ భ్రమియింపనేల, వీఁడిటు చెఱఁదెచ్చి వెతఁబెట్టనేల
నాకేమి చింతింప నాకూర్మివిభుఁడు, లోకరక్షణకళాలోలమానసుఁడు
రాకేందువదనుండు రామచంద్రుండు, నాకుఁగా ఘోరకాంతారమధ్యమున
సౌమిత్రియును దాను జాలిమై దూలి, యేమి గాఁగలవాఁడొ యెట్లున్న వాఁడొ
యెన్నఁ డాఘనశౌర్యుఁ డిటకెత్తివచ్చు, నిన్నీచదైత్యుల నెన్నఁ డుక్కణఁచుఁ
దుది నన్ను నెన్నఁడు దోడ్కొనిపోవు, నది యెన్నటికిఁగాడు నది యెట్లు పొసఁగు
నీదురాత్మునిచేత నిటు చచ్చుకంటె, చేదు మ్రింగుట మేలు చేదును నాకు
మాలినదయ నిచ్చువా రిందు లేరు, హాలక్ష్మణాగ్రజ హాధర్మనిరత
నీకైన యేకపత్నీత్వంబు నేఁడు, చీకాకుపడి హత్యచేఁ జచ్చుననుచుఁ
గెరలెడు తనదీర్ఘకేశపాశముల, నురిపెట్టుకొని చావ నూహించె నంత
ఆలోన నెడమక న్నదరె నాసతికి, వాలుమీనులచేత వనజంబువోలె
వలపుఁదెమ్మెరచేత వనలతఁబోలెఁ, బొలఁతికి మఱి వామభుజమును నదరె
నయ్యెడ ముదహాస్తిహాస్తంబుపోలెఁ, దొయ్యలి దాపలితొడయును నదరె

శుభసూచకంబు లీవొప్పున నడువ, నిభరాజగమన యయ్యెడఁ దెంపుమాని
జనకుని శ్రీరామచంద్రుని నతని, యనుజులనత్తల నటఁ దలంచుచును
దనుజులచేతిబాధలఁ జాల నలసి, తనదిక్కులేమికిఁ దరళాక్షి వగవ
సుదతిచిత్తములోని శోకంబు మాన్ప, నిది నాకు తఱియని యిచ్చఁ జింతించి
రవికులక్రమమును రామపౌరుషము, వివిధభంగుల వేడ్క వినుతిసేయుచును
మానిమీఁదనె యుండి మారుతాత్మజుఁడు, వానరభాష గీర్వాణభాషయును
ఈనాతి యెఱుఁగునో యెఱుఁగదో యనుచు, మానవభాషల మగువ కిట్లనియె
ఓమహినందన యోపుణ్యసాధ్వి, యీమెయి శోకింప నేటికి నీవు
మగువ నీవిభుఁడు నేమముగ నున్నాఁడు, జగదేకనిధి రామజనపాలవిభుఁడు
వనధి బంధించి రావణు సంహరించి, నినుఁ దోడుకొనిసోవు నిక్క మీపలుకు
సహజస్ముఁడైన లక్ష్మణుఁడు తక్కగొలువ, మహనీయమహిమతో మాల్యవంతమున
నున్నాఁడు కపిసేన లొగి ననేకములు, తన్నర్థిఁ గొల్వఁగా దశరథాత్మజుఁడు
అనవుడు నిది యొక్కయాకాశవాణి, యని శింశుపావృక్ష మవనిజ చూడఁ
బన్నిన నీలాభ్రపటలంబులోనఁ, గ్రొన్నెలగతి మెఱుంగునుబోలెఁ జూడ
సన్నమై యామ్రానిశాఖలనడుమ, నున్నమర్కటరూప మొయ్యనఁ గాంచి
కలలోనఁ బ్లవగంబుఁ గంటి నేననుచుఁ, గలఁగి యాకలకీడు కాకుత్స్థజులకుఁ
గాకుండుఁ గాకంచు ఘనుల దేవతల, నాకాంత గొనియాడి యటఁ దెలివొంది
కంటకాసురకోటి గాఱించుకతనఁ, గంటికి నిదుర నేఁ గాన రేఁబగలు
గాన నిద్దుర లేని కల యెందుఁ గలదు, వూని యింకొకసారి పోలంగఁ జూతు
నని తనవదనాబ్జ మల్లన నెత్తి, హనుమంతు మఱియును నందందఁ జూచి
యెందుండి వచ్చెనో యీమ్రానిమీఁది, కెందును గడుజిత్ర మిది యొక్కకోతి
చెలువొప్ప నరుఁడు భాషించుచందమున, నలినాప్తకులము నానాఘనేమంబు
నలవడఁ దెలుపుచు నమృతంబు లొలుకఁ, బలుమాఱు ప్రియములు పలుకుచున్నదియు
వానరజాతి కీవార్తలు గలవె, నానావిధంబుల నాకుఁ జింతింప
కడఁగి రాఁకుసమాయగాఁబోలు ననుచుఁ, బడఁతి యీరకయుండెఁ బ్రతిభాషలుడిగి
అనిలనందనుఁ డంత నవనీతనూజ, మనసులోఁ దన్ను నమ్మమిఁ జూచి యెఱిఁగి
యాతరు వటుడిగ్గి యతిభక్తియుక్తి, నాతికి దండప్రణామములొసి
కరములు మోడ్చి యోకల్యాణి నన్నుఁ, బరికింపు మేను నీపతిసూర్చుబంట
జనపతి నీకు విశ్వాసంబు పుట్టు, ననియిచ్చి పుత్తెంచె నంగుళీయకము
అని చూపి మ్రొక్కిన నవనీతనూజ, హనుమంతుఁ గనుఁగొని యతని కిట్లనియె
అడరెడుదనుజమాయల ననుకలము, నుడుకులఁబడి వ్రేగుచుండుఁదుఁగాన
ననఘాత్మ రఘురామునంగుళీయకము, గనియు విశ్వాసంబు గలుగదు నాకు
నీవెవ్వఁడవు మఱి నీకుఁ బేరేమి, భూవరునకు నీకుఁ బొందెటు లయ్యె
ఇనకులాధిపువేష మెట్టిది యతని, యనుజుండు సౌమిత్రి యతఁ డెట్టివాఁడు
గాకుత్స్థుఁ డిప్పు డెక్కడ నున్నవాఁడు, నీకు నేమని చెప్పి నిన్నుఁ బుత్తెంచె

నేచందమున వచ్చి తీవార్ధి దాటి, నాచిత్త మూరడ నాతోడఁ జెప్పు
మనియొప్ప నడిగిన నవనినందనకు, హనుమంతుఁ డంతయు నటఁ జెప్పఁదొణఁగె

హనుమంతుఁడు సీతకుఁ దనజన్మము చెల్పుట.

వనజాక్షి వాయుదేవతవరంబునను, ఘనుఁడు కేసరి యను కపికులాగ్రణికి
ననుఁ బుత్త్రుగా నంజనాదేవి గనియె, హనుమంతుఁ డనుపేర నమరినవాఁడ
వసుధ సుగ్రీవుఁడ న్వానరేంద్రునకు, నసమానమతి మంత్రినై మెలంగుదును
ఆతనిరాజ్యంబు నాతనిపత్ని, నాతనియగ్రజుం డగువాలి గొన్న
మదమేది నలుగురుమంత్రులు దాను, నదిమొదల్ ఋశ్యమూకాద్రిపైనుండఁ
బటుసత్వమునఁ బోర్చి పట్టి-కంధరుఁడు, కుటిలుఁడై నిన్నెత్తికొని పోవునపుడు
ఒకవిన యాక్రోశ మారక వినుచు, సుదతి నిద్దలెత్తి చూచుచుండితిమి
నెలఁత యప్పుడు మము నీవును జూచి, తొలఁగక నీమేనితొడవులు పుచ్చి
నీవస్త్రమునఁ గట్టి నేలవైచుటయు, నావేళ సుగ్రీవుఁ డవి పుచ్చి దాఁచి
యచ్చుగా రఘురాముఁ డట నిన్ను వెదుక, వచ్చి పంపాసరోవరతీరభూమి
దానుతమ్ముఁడు నుండుతఱి నంత నర్క-,సూనుండు వారలఁ జూచిరమ్మనుడు
నేనేగి రాముని నెఱిఁగి యే తెంచి, భామజు రామభూపాలుఁ గాన్పించి
యన్నరనాథున కర్క-నందనుఁడు, కన్నసొమ్ములు సూపి కడుభక్తి మ్రొక్కి
నాతొడవులఁ జూచి హర్షించి రాముఁ, డాతని నిజశత్రుఁ డగువాలిఁ జంపి
యుపకారశీలుఁడై యొప్పసుగ్రీవుఁ, గపిరాజ్యపదమునఁ గరమొప్ప నిలిపె
నతిభక్తి సుగ్రీవుఁ డంత రాఘవునిఁ, బలియుఁగా నిజభృత్యభావంబుమోచి
అక్షీణబలధన్యు లైనవానరుల, లక్షల రెండేసి లక్షలకపుల
గర్వాంధు లగుదైత్యకటకంబు లరసి, యుర్వీతనూభవయన్న చోఁ జెఱిఁగి
మసలక నెలలోన మరలి రండనిన, నసమునఁ గపు లేగి రన్నిదిక్కు-లకుఁ
బటుశక్తి దక్షిణభాగంబు వెదక, నిటు నంగదుఁడు మొద లేమ కొందఱము
చనుదెంచి వెక్కు-దేశంబులు వెదకి, నినుఁ గానరేరక నివ్వెఱఁగంది
శోకింప నరుణునిసుతుఁడు సంపాతి, మాకు లంకాపురిమార్గంబు జూపెఁ
జూపుటయును నిన్నుఁ జూడ నర్థించి, యేపునఁ బఱతెంచి యే నబ్ధి దాటి
మఱి యంత సూర్యాస్తమయమున నితరు, లెఱుఁగకుండగవచ్చి యీలంకఁ జొచ్చి
విలసిల్లు నామహావేషంబు దాఁచి, సొలవక నిన్నెల్లచోటుల వెదకి
యెందును బొడగాన కిటులేగుదెంచి, యిందు నిఁ దర్శింప నేర్పడఁ జూచి
రవికులోత్తముఁడైన రామునిదేవి, యవునొకొ కావొకో యని విచారించి
సృష్టీశుచే విన్నచిహ్నంబు లెల్ల, దృష్టించి పిదప సందేహంబు వాసె
వలనెది యిప్పుడు వచ్చి రావణుఁడు, తలఁకక మిముఁ బల్కుతఱి నున్న వాఁడ
ఘనశక్తి వానితోఁ గయ్యంబుచేసి, యని వానిఁ జంపెద ననిన విచారించి
వూని నిఁదర్శించి పొందొంద నీకు, నీనాథుసేమంబు నిజముగాఁ జెప్పి
దనుజుఁ బిమ్మటఁ జంపఁ దలపోసికాని, వనిత నాప్రాణము ల్వంచించి కాదు

అనిచెప్పి రఘురామునలవుప్రాయంబు, కనుఁగవచెలువంబు గళముసోయగము
నగుమోమునళయును నఖములతీరు, నెగుబుజంబులబాగు నెరికొనులాగు
వెడఁదయొమ్ముబెడంగు వీనులరంగు, నడలయందంబును నాభిచందంబు
ఘనజఘనముపెంపు కరములకెంపు, తనువ్రతలక్షణమును దప్పక చెప్పి
యాశౌర్య మాధైర్య మాబ్రహ్మచర్య,మాశాంతి యాదాంతి యామహాక్షాంతి
యాశక్తి యాయుక్తి యాపితృభక్తి, యాశీల మాలీల లన్నియుఁ జెప్పి
రూపించి లక్ష్మణురూపెల్లఁ జెప్పి, యాపుణ్యఁ డంగుళీయక మప్పుడిచ్చె
యిచ్చినఁ గైకొని యిపుడు ప్రాణములు, వచ్చెఁగా యనుచు నెవ్వగ నూరడిల్లి
రాముఁ జూచినకంట రామ రాగిల్లి, నేమ మేర్పడ భద్రసింహాసనమునఁ
బ్రేమతోఁ గూర్చుండఁబెట్టినకరణి, నామణిముద్రిక నక్కునఁ జేర్చి
యనుర క్తి నర్ఘ్యపాద్యము లిచ్చినట్లు, కనుఁగవ హర్షాశ్రుకణములు దొరుఁగ
ధూపంబు దీపంబుఁ దోడ్తోడ నొసఁగి, యేపార సాష్టాంగ మెఱుఁగినపగిదిఁ
బులకించి తిలకించి పొలఁతి మూర్ఛిల్లి, తెలిసి యాహనుమంతుఁదెసఁ జూచి పలికెఁ
గపివంశవర్య రాఘవకార్యధుర్య, యుపకారనిరత లోకోన్నతచరిత
పవమానసుత నాకుఁ బ్రాణదానంబు, తవిలి చేసితి నీకుఁ దగఁ జేయలేను
గాకుత్స్థతిలకంబుకరుణ సీవింక, నాకల్పముగనుండు మనుచు దీవించె
నలఘువిక్రమశీలుఁ డగువాయుసుతుఁడు, చెలువ జానకిఁ జూచి చేతులుమొగిచి
హరునకునైన నింద్రాదులకైనఁ, బరమేష్ఠికైనను బడయఁ జొప్పడని
నీకృప వడసితి నినుఁ జూడఁగంటి, నాకింత చాలదె నలినాయతాక్షి
అనిన సీతాదేవి యనియె వెండియును, మనుజేశునేమంబు మఱుదినేమంబు
మనమార నడుగుచు మమత రెట్టింప, ననఘాత్మరఘురాముఁ డభిరామబలుఁడు
ననునెడఁబాసియున్నాఁడె ధైర్యమున, ననుజుండు దానును నప్పటప్పటికి
దయ నన్నుదలఁతురే దండెత్తి యిటకు, రయమున వత్తురే రణకాంక్ష ననిన

హనుమంతుఁడు సీతతో శ్రీరాములక్షేమము దెల్ప శిరోరత్నము గొనుట.

వినవమ్మ నీప్రాణవిభునినేమంబు, నినుఁ బాసినది మొద ల్నిత్యవేదనల
నేలపైఁ బవళించు నిద్రయెఱుంగఁ, డోలి మాంసాహార మొల్లఁడెన్నఁడును
వాసిమై దండకావనములో నిన్ను, మోసపోవుట లెంచు మోమరవాంచు
నిట్టూర్పు నిగుడించు నించుఁ గన్నీరు, నెట్టన మూర్ఛిల్లు నేలపైఁ ద్రెళ్లుఁ
దెలివిమై లేచు నల్దిక్కులు చూచు, గలకునివ్వెఱగందుఁ గళవళంబందు
హాసీత హాసీత యని ప్రలాపించు, నాసుమిత్రాపుత్రుఁ డది చూచి వగచుఁ
గావున మీర లిక్కడ నుండువార్త, వేవేగ నాచేత విన్నంతఁ గదలి
నాకంబె ఘనులైన నగచరాధిపుల, భీకరాకృతుల నభేద్యవిక్రముల
నగశృంగతరుసంఘనఖముఖాయుధుల, నగణితబలుల దేవాంశసంభవుల
సుగ్రీవ నల వాలిసుతు లాదియైన, యుగ్రవీరులఁ గూడి యుదధి లంఘించి
యొల్లభంగుల వచ్చు నింతి నీవిభుఁడు, తల్లి నిన్గొని యయోధ్యాపురి కేగు

రాముచే రణమున రావణుఁ డీల్గు, నీమదికోర్కులు నీకు సిద్ధించు
నైన నీతడవేల యఖిలైకమాత, యేను నావీపున నిడికొని ప్రీతి
నొదవినగడఁకలో నుదధి లంఘించి, యుదయవేళకుఁ బోదు నుర్వీశుకడకు
విచ్చేయు మనవుడు వెలఁది వాయుజుని, సచ్చరిత్రమునకు సంతోషమంది
యోసమిత్రాత్మజ యోపుదు వీవు, నీసత్త్వ మిట్టిది నిజము చింతింప
ననఘాత్మ యేఁబెండ్లి యైనదిమొదలు, జనలోకనుతురామచంద్రునిఁ గాని
పొలువేదఁగా నన్యపురుషాంతరములఁ, గలలోన నైనను గదిసి యేనెఱుఁగ
నీనీచమతి నన్ను నిటఁదెచ్చుచోట, వీని నంటుట కేను వ్రేగుచుండుదును
వెఱవక బలిమిమై వీఁడంకొఁగాని, మఱి యన్యపురుషుల మదినంట నేను
నానాథునకు నీవు నమ్మినబంట, వైనను నిను నెక్కి యరుదెంచు టొల్ల
తనదేవి మ్రుచ్చిలి దైత్యుండు చనిన, నినకులుం డూరితి నేతెంచె నండ్రు
ఇది విచారముగాదె యినకులేశ్వరుఁడు, కొదలేక మును చిత్రకూటంబునందు
నొకనాఁడు తనతొడ నొఱిగి నిద్రింప, గ్రకచోగ్రముఖ మొక్కకాకంబుచేరి
చంచుపుటంబునఁ జనుఁగవనడుమ, పొంచి చించిన రక్తపూరంబు దొరుఁగఁ
గాకుత్స్థతిలకుఁ డొక్కఁడ నిద్రదేరి, కాకంబుపై నిషీకము ప్రయోగింప
నదియు బ్రహ్మాస్త్రమై యఖిలలోకైక, విదితోగ్రశక్తిమై వెనువెంట నంట
నాకాకి యేకాకియై యెందుఁ దిరిగి, కైకొని తనుఁ గావు కావు మటంచు
మరలి క్రమ్మఱఁ దనమఱుఁగుఁ జొచ్చుటయు, శరణాగతత్రాణచరితుండుగాన
దానినేత్రము నిజాస్త్రమున కిప్పించె, నానిమిత్తంబుగా నలినాప్తకులుఁడు
నాటి నాపైప్రేమ నాటియస్త్రంబు, నేటికి మఱిచెనో యిది హెచ్చరింపు
పదివేలభంగుల బాధలఁబోర్చి, పదినెలల్గడపితిఁ బతిఁ బాసి యేను
నాయన్నిఁ జూచితి నాపాటుగంటి, యేయుపాయంబుల నిందోర్వరాదు
ఉడుగనివగలతో నొక్కొక్కదినము, గడచు టొక్కొకవార్ధి గడచుట నాకు
నరనాథు మదిలోన నామీఁదఁజాలఁ, గరుణపుట్టెడునట్లుగా విన్నవింపు
మాతండ్రి జనకుండు మహిమీఁదఁ దన్ను, నేతెఱంగున వీరుఁ డితఁడని నమ్మి
తనకు నిచ్చినఁ దెచ్చి తగదు నన్వీడువ, నని యేను బల్కితినని పల్కు మీవు
విలసిల్లు కల్యాణవేదిపైనుండి, వలనొప్ప నగ్ని దేవరసాక్షిగాఁగఁ
గరమొప్ప నన్నెల్లకాలంబు విడువ, నరసి రక్షించెద ననితెచ్చి నన్ను
నరయ కువేఱించి యనదఁగాఁజేసె, పరికింపుఁడని విన్నపము నేయు మనఘు
తనయింతి నొకనిచేఁ దాఁ గోలుపోయి, మన నిచ్చుఁజేయఁట మగపాడిగాదు
అటుగానఁ దనకిది యపకీర్తిగాన, ఇటు విన్నవించితి నింతయే కాని
కలఁగక నామనోగతులప్రాణంబు, లొలసి తన్నెడఁబాయకున్నది యనుము
చతురాత్మ మఱి నీవు సౌమిత్రిఁ జేరి, యతనితో నొక్కమాటాడుము తెలియ
నను దల్లిగాఁ జూచు నాపాటుఁ జూడ, తన కెన్నిభంగులఁ దగదని చెప్పు
వావిరి దండకావనములోఁ బరమ, పావనుఁడగు తన్ను పలికినఫలము

కుడిచిలినని చెప్పు కొదవలేకుండ, తడయకుమని తెల్పు దయబుట్టఁ జెప్పు
నవసరోచితముగా నంగదుతోడ, రవిజుతోఁ దక్కు మర్కటకోటితోడ
వినయములవ్వలికి యెవ్విధినైన వారి, నినకులులను వేగ నిటకుఁ దోడ్తెమ్ము
మిక్కిలి తెగువమై మీరాక తెలిసి, యొక్కమాసము చూతు నుండలేనవల
ఈలోన రఘురాము నెబ్బంగినైన, వాలాయముగఁ దెమ్ము వడి నింకఁ బొమ్ము
అని సీత పల్కువాక్యము లెల్లఁ దెలియ, విని హనుమంతుండు విమలుఁడై పలికె
అవ్వఁగాక చెప్పెద నన్ని కార్యములు, నువిద నీమదిలోన నూరడు మింక
నచ్చుగా రఘురాముసంగుళీయకము, తెచ్చి యొప్పించితి దేవి నీకర్ధి
ధరణిజ రిక్తహస్తంబులతోడ, మరలుట దూతధర్మము గాదు నాకు
అతివ ముద్రారత్న మూనతిమ్మనిన, నతనితోఁ దెలియ నయ్యవనిజ పలికె
నీవు విచారింప నిసుమంతగాని, లేవు సముద్ర మేలీల దాఁటితివి
యారూఢబలవిక్రమాస్పదంబయిన, నీరూప మెట్టిదో నిజముగాఁ జూపు
మేను నీనిజరూప మేర్పడఁ జూచి, కాని నాతలమానికము నీకు నీను
అనిన నాహనుమంతుఁ డాకాశమెల్లఁ, దనమేను నిండ నుద్దండుఁడై పెరిగి
మాలతీమల్లికామాల్యమై మెడకు, నాలోలతరహారమై కటిని
గలధౌతమయఘుంటికాదామ మగుచుఁ, బళుకుచుక్మలపిండు తనమేననలమ
నతిభీషణాకారుఁడై నిల్చుటయును, నతివ చిత్తములోన నతిభీతిఁ బొంది
యసమానగాత్ర యోయంజనాపుత్ర, విసువక నీరూపు వెస దాఁచుమనుచు
హనుమంతుఁ గొనియాడి యతని దీవింప, దనవిశ్వరూపంబు తగఁజూచి సురలు
వినుతింప నది దాఁచు వెన్నుండువోలె, ననిలజుఁ డెంతయు నలఁతియై నిలిచె
నిలిచిన హనుమంతు నెమ్మిమై జేరఁ, బిలిచి లోఁగొంగున బిగిచుంగఁ గట్టి
యున్నశిరోరత్న మొయ్యన విడిచి, యన్నాతి ప్రీతిమై నపుడొసంగుటయు
వనితశిరోమణి వలనొప్ప నంది,కొని మ్రొక్కి సీత వీడ్కొని వేడ్క నరిగి
పంతంబు తానింక పంక్తికంరునకు, నింతటఁ దనరాక నెఱిఁగింతు ననుచుఁ
దల్లి నేనాఁకొంటిఁ దనరఁగ వనము, నెల్లెడ ఫలములు నేను గైకొందు
ననవుడు సీత యాహనుమంతుఁ జూచి, యనె రాక్షసావళి యల్లకావుండుఁ
గ్రమ్మి రాలినపండ్లు క్రమముతో నమలి, పొమ్ము వేగయటంచుఁ బొందుగా ననుపఁ
దనమదిఁ గొండొకతడవు చింతించి, వనభంగ మొనరించువాఁడునై పెరిఁగి
తొడలందుఁ బొడము వాతూలఘుట్టనలఁ, బడుగుఁబోకయుఁ బోలెఁ బడమహీజములు

హనుమంతుఁడు అశోకవనమును జెఱుచుట.

అనిత్యమతి యశోకారామభూమి, మానైనహార్మ్యము ల్మహిఁ గూలఁ దన్ని
యొనర కేళీగృహంబులు నుగ్గుఁజేసి, వనమహీరుహములు వడి నేలఁ గలిపి
కొమ్మలు ఖండించి కుసుమము ల్రాల్చి, కమ్మతెనెలు చల్లి కాలువ ల్చెఱిచి
పూవుఁదీఁగెలు ద్రెంచి పొదరిండ్లు చదిపి, బావులు గలఁచి దోర్బలకేళిఁ దేలి
కలకంఠబకబిసకంరికాక్రౌంచ, కలహంసశుకశారికామయూరాది

వనపశు లార్తరావములతోఁ బాఱి, వనపాలకులు భీతి వడి మేలుకాంచి
హనుమంతునేతకు నగ్నులై మండి, యనుపమకరవాలహస్తులై కదియఁ
దనవేరు తనరాక తనపరాక్రమము, వినఁ జెప్పి శ్రీరామవిభుకూర్మి బంట
నొక్కొక్కరాక్షసు నుద్దండవృత్తి, నొక్కొక్కతరువుతో నొగిఁ గూలనేసి
ప్రథమసంగరకళాప్రారంభుఁ డగుచుఁ, బృథివిపైఁ బీనుఁగుపెంటలు గాఁగ
భూరిసత్త్వంబులఁ బొలుపొందువారి, వీరుల నెనిమిదివేలరాక్షసులఁ
బవమానతనయుఁ డప్రతిముఁడై వేర్చి, యవలీలఁ దెగటార్చి యార్చినఁ జూచి
యేపఱి ధృతి దూలి యినవంశదేవి, కాపున్నఘోరరాక్షసభామ లరిగి
రావణు లోకవిద్రావణుఁ గాంచి, దేవ నేఁ డొకకోతి తెగువమై వచ్చి
తొలితొలి వైదేహితో మాటలాడి, కలగొన వనమెల్లఁ గాసిలఁ బెఱికి
వెనుఁదన్ని యెనిమిదివేలరాక్షసుల, వనపాలకులఁ జంపి వ్రాలుచున్నాఁడు
వాఁడు రాఘవుఁ డంప వచ్చినవాఁడు, కాఁడేని యాసీత గాపుగానున్న
తరు వొక్కటియుఁ దక్క తావకవనము, కరమల్లి పెఱుకంగఁ గారణం బేమి
వానితెఱుఁగేమి వైదేహి నడుగఁ, బానెఱుంగ నటంచు దాఁచుచున్నదియు
నాపుడు నల్లి దానవలోకవిభుఁడు, రావణుఁ డుగ్రనిగ్రహదృష్టిఁ జూచి
దీపాగ్రనిర్గతదీప్తశైలంబు,లై పావకజ్వాల లతులఁ దొఱుఁగఁ
దనకింకరులఁ బంచె దండి రాక్షసుల, నెనుబదివేవుర నిర్ధవిక్రములఁ
బనిచినఁ బనిబూని బలియులై వారు, ధనుర్వ్రశూలముద్గరభిండివాల
ఘనగదాకరవాలకలితులై వేర్చి, యనికి సన్నద్ధులై యార్చుచు వెడల
నంత సూర్యోదయం బయ్యె నౌటయును, నెంతయుఁ గడఁకతో నేపగ్గలించి
యకలంకగతిఁ బర్వతాకారుఁ డగుచు, మకరతోరణమెక్కి మారుతాత్మజుఁడు
తనుఁదాఁకి శస్త్రాస్త్రతతుల నొప్పించు, దనుజవీరులఁ జూచి దర్పించి పలికె
నోరి రాక్షసులార యుర్విపై నేను, శూరత విలసిల్లు సుగ్రీవుబంట
రామునిదూత నారాముసేమంబు, భూమిజతోఁ జెప్పి పోవుచున్నాఁడ
హనుమంతుఁ డనువాఁడ నతిబలాధికుఁడ,నినతనూజునిమంత్రి నేవాయుసుతుడ
పూని లంకాపురంబున నున్నమగల, కేనంతకుండనై యిట వచ్చినాఁడఁ
జెడఁగోరి నన్నేల చెనకెద రనుచు, వడిఁ బేర్చి యాభీలవాలంబునందుఁ
బదులనూఁబులవేల బలియుఁడై పట్టి, త్రిదశారివరుల బంధించి బంధించి
యారూఢవిక్రమాహవకేళిఁ దేలి, తోరణస్తంభంబుతో వ్రేసివ్రేసి
పూని యొక్కనినైనఁ బోరిలో బ్రదికి, పోనీక నిశ్శేషముగఁ జంపివైచె
నంతలో ఫణిహారు లమరారికడకు, నెంతయు భీతులై యేతెంచి మ్రొక్కి
దనుజేశ వినుఁ కోతి తనదువాలమున, నెనుబదివేవుర నేపుమైఁ జంపి
మలయుచు నున్నాఁడు మకరతోరణము, తలదన్ని రణబలోద్గ్రుఁడై యనిన
ఆపంక్తిముఖుఁడు కాలాంతకుపగిది, కోపించి పింగళాక్షుని దీర్ఘజిహ్వ
వక్రనాసుని నశ్మవక్షుని వైరి, చక్రభీకరుఁడైన శార్దూలముఖుని

వేవేగ రప్పించి వీరులై మీర, లావానరునిఁ దెగటార్చి రమ్మనుచుఁ
బనిచిన నేఁపురు ప్రబలసైన్యములు, గొని రథారూఢులై క్రూరులై వెడలి
పరువడి నార్చుచుఁ బవనజుఁ డాఁకి, శరవృష్టిఁ బొదవినఁ జలియింప కాతఁ
డాతోరణంబుపై నార్చుచుఁ బేర్చి, వాతూలసుతుఁ డేఁచి వాలమంకించి
రథముల విఱిచి సారథుల నుగ్గాడి, రథతురంగంబుల రణవీథిఁ ద్రుంచి
వారణంబులఁ గూల్చి వాజుల గెడపి, యారాక్షసులసేన నట రూపుమాపి
ధరణికిఁ లంఘించి తనదువాలమున, నురుశక్తి గళములఁ కుఱిగా బిగించి
యురువడి కనుగ్రుడ్లు నుఱుకంగఁ ద్రిప్పి, సురుఁగక వక్రనాసుని వ్రేసి చంపెఁ
జంపి యంతటఁబోక సమయనికినుకఁ, దెంపుసొంపును బెంపుసొంపు దీపింప
బెడఁబెడ నార్చుచుఁ బిడుగునకంఁటె, బెడిదమై కనుపట్టు పిడికిటిచేతఁ
బుడమిపై నురర క్తములు గ్రక్కి కూల, వడి నశ్మవర్షునివక్షంబు పొడిచె
పొడిచి బాహాగర్వమున మాఱులేక, కడఁకఁ గనుంగొని కఱకురాక్షసుల
మొగిద్రుంచి శార్దూలముఖులలాటంబు, పగులంగ గదద్రిప్పి పడవైచి చంపె
నటుచంపి క్రోధాగ్ని లందందనిగుడఁ, గుటిలరాక్షసకులక్షోభంబుగాఁగఁ
గ్రూరుఁడై పింగళాక్షుని తోఁకఁ గట్టి, కారాకుసుడిగాలి గడుపడిఁ ద్రిప్ప
తీరున వాని దిర్దిర మింటఁ ద్రిప్పి, తోరణస్తంభంబుతో వ్రేసి చంపె
వాని నిమ్మెఁ జంపి వరశక్తియుక్తి, భూని దానవసైన్యములఁ జొచ్చి కలఁచి
యురవడి దీర్ఘజిహ్వాని వచ్చి తాఁకి, యురుముష్టిసంహతి నుర్విపైఁ గూల్చి
యాలోనఁ బవనజుఁ డసమానవిజయ,లోలుఁడై వానినాలుక పీకి చంపె

హనుమంతునిమీఁదికి రక్తరోముఁడు మొదలైనరాక్షసుల రావణుఁడు పంపుట.

నంతఁ దక్కినదైత్య లటఁ బాఱిపోయి, యంతయుఁ జెప్పిన నద్దశాననుఁడు
సోమించి నిజమంత్రిసుతులైనరక్త,రోముని శతజిహ్వా రుధిరలోచనుని
స్తనితహస్తుని శూలదంష్ట్రు దుర్ముఖుని, ఘనుఁడగు నవార్యప్రకబళునిఁ బిలిచి
యిది యొక్కవానరుఁ డేఁచి రాక్షసులఁ, బొదవి పెక్కండ్రఁ జంపుచు నున్నవాఁడు
ఆమర్కటునిఁ జంపుఁడని భూని పనుప, నామహాబలగర్వ లార్చుచు వెడలి
చతురంగబలము లసంఖ్యలు గొలువ, నతులరథారూఢు లై పేర్చి వచ్చి
మకరతోరణముపై మాఱు లేకిట్లు, నకళంకుఁడైయున్న హనుమంతుమీఁద
వరదివ్యశస్త్రాస్త్రవర్షము ల్గురియఁ, బరమపావనుఁడైన పవమానసుతుఁడు
అప్పు డాదైత్యులయస్త్రశస్త్రములు, దప్పించుకొనుచును దను డాఁకకుండఁ
దననఖాగ్రంబుల దంతకుంతముల, ఘనపాదకూర్పరకరఘట్టనములఁ
జెలరేఁగి వడి మహాశిలల వృక్షముల, బలముల నలుగడఁ బఱపి నుగ్గాడి
కంఠీరవంబును గజములపైకిఁ, గుంఠితగతిఁ డాఁకి కుప్పించుకరణిఁ
బటుమాంసమస్థిమ్రక్కావారము ల్చెదర, కుటిలోగ్రనఖములఁ గుంభములఁ ద్రిచ్చి
లేఁ గ్రొవ్వి బలి చొకళించినపగిదిఁ, ద్రుళ్లుగుఱ్ఱములఁ దోడ్తో రూపుమాపి
జంతుపారణసేయు జమునికైవడినిఁ, బంతంబుతోఁ గ్రాలు బలము మాయించి

కులశైలములఁ దాఁకి కులిశాయుధంబు, పెళపెళధ్వనులతో భేదించినట్లు
బలువిడి రథములపైకి లంఘించి, పొలుపార రథరథ్యములు నేలఁ గలపి
రథులఁ జెండాడి సారథుల నుగ్గాడి,పృథుశక్తియుక్తిమైఁ బెఱికి వేటాడి
మునుమున్ను రక్తరోమునిఁ నేలఁగూల్చి, స్తనితహస్తునిఁ ద్రుంచి శతజిహ్వానణఁచి
రుధిరాక్షుఁ జంపి దుర్ముఖు విదారించి, కదనవిక్రము వ్యాప్రకబళు ఖండించి
శూలదంష్ట్రు వధించి శూరత మించి, కాలపాశాభీలకరవాలుఁ డగుచు
నురవడి నిబ్బంగి నొక్కొక్కఁ తెగువ, తరమిడి పెలుచ నుద్దండరాక్షసుల
బలములతోఁ గూడ భస్మంబుఁజేసి, తలఁకక మాయతాత్మజుఁ డున్నఁ జూచి
పోరిలో నిలువక పోయినవారు, వారిచావులు చెప్ప వడి కోప మెచ్చి
యటఁ బ్రహస్తునిపుత్రుఁ డగుజంబుమాలి, చటులప్రతాపసంచలితాంశుమాలి
కుటిలారిపర్వతక్రూరదంభోళిఁ, బటుబాహుబలశాలిఁ బనిచె రావణుఁడు
పనిచిన నాదైత్యపతికి మ్రొక్కుచును, అనురక్తిరక్తమాల్యాంబరోదగ్ర
సమరోగ్రశస్త్రాస్త్రసన్నద్ధుఁ డగుచు, నమితరథారూఢుఁడై యేగి యపుడు
శింజినీటంకారసింహనాదములఁ, గంజజాండము హల్లకల్లోలముగను
హరిఁ దాఁకు నున్నత్తహస్తిచందమున, నరుదైనకడిమిమైఁ హనుమంతుఁ దాఁకి
కెరలి మేఘము మహాగిరిఁబోలె దివ్యశరవృష్టి గురిసినఁ జలియింప కతఁడు
పెనుశిల దైత్యుపైఁ బెఱికి వైచుటయుఁ, గని దాని శరదశకంబుచేఁ దునిమి
హనుమంతు వదనాబ్జమర్ధచంద్రాస్త్రమున నొంచి పదిబాణముల బాహుయుగము
నాటించి యొకశక్తి నడునెత్తి పగుల, మేటియై యేసిన మిగుల రోషించి
పవమానతనయుండు బాహుదర్పమున, నవలీల నొకసాల మగలించి వైవ
నాలుగమ్ములఁ దాని నడుమనె త్రుంచె, నాలోన హనుమంతుఁ డాదైత్యరథము
పదములఁ బడఁ దన్ని పట్టి దంష్ట్రములఁ, గదిసి విచారించి గర్జించి వ్రేసి
పొడివి మహావాలమున నశ్వసమితిఁ, జదిపిన విరథుఁడై జంబుమాలియును
బలుకయు నడిదంబు బలువిడిఁ గొనుచు, నలవుపెంపును గూడ నార్చుచు వచ్చి
పవమానతనయునిఫాలంబు వ్రేయ, నవశుఁడై మూర్ఛిల్లి యంతలోఁ దెలిసి
పిడుగుతో సరిపోలు పిడికిటఁ బొడిచె, పొడిచి భంగముఁజేసి పోనీక కదిసి
యొడిసి వైదువఁగొని యుగ్రుఁడై కదిసి, తడయక యాదైత్యుతలఁ ద్రెవ్వనేసె
భృతిదూలి యతఁ డుర్వి ద్రెళ్లెఁ ద్రెళ్లుటయు, హతశేషు లతనిపాటంతయుఁ దెలుపఁ
గడుఁజోద్యమంది రాక్షసమంత్రివరులఁ, దడయక పిలిపించి తగఁ గొలువిచ్చి
దనుజనాథుఁడు గొంత తడవు చింతించి, యనిమిషేంద్రునినైన నాజి నైకొనని
యలఘువిక్రము విరూపాక్షు యూపాక్షు, గలహదుర్ధరుభాసకర్ణాఖ్యుఁ బ్రఘసు
నదయులఁ బంచసేనాగ్రనాయకులఁ, గదనకర్కశుల నొక్కటఁ జూచి పలికె
ఏలోకముననైన నిల మర్కటులకు, నీలావు గలదె వీఁ డెవ్వఁడో తెలియ
రాదు మీరేవురు రణబలోద్యుక్తు, లై దర్పమేర్పడ నాత్మ నేమఱక
యగణితసైన్యసహాయులై వానిఁ, దెగువమై నిటఁ బట్టి తెండు పొండనిన

వారును బహురథవారణతురగ, వీరభటత్యులతోడ వేవేగ కదలి
ప్రాగ్గిరిపైనుండు భానుండుపోలె, దిగ్గగనాంతరతీర్ణతేజమునఁ
దోరణంబెక్కి బంధురబలత్యవరులతో రణం బొనరింప దొరఁకొనువాని
ననిలసూనుని డాఁకి యవనియు దిశలు, చినుగంగఁ గూయుచు సింహనాదముల
నందఱు దివ్యశస్త్రాస్త్రములుర్వియ, నందులో దుర్ధరుం డను పేరువాఁడు
ఐసుబాణంబుల ననిలజునురము, భేదించుటయు రోషభీషణుం డగుచు
కపివీరుఁ డార్చి యాకసమున కెగయ, నపుడు దుర్ధరుఁ డంత నతనితో నెగసి
విలునారి సారించి విలయకాలోగ్ర,జలదంబుకైవడి శరవృష్టి గురియ
నాయుగ్రశరవృష్టి నడచి వాయుజుఁడు, నాయెడఁ బొడవుగా నట మింటికెగసి
పడివడిఁ బఱతెంచి వానిపైఁబడినఁ, బొడిపొడియై కూలెఁ బుడమి రక్కసుఁడు
అదిచూచి యావిరూపాక్షు యూపాక్షు, లదయుల్లై ముద్గరహస్తులై కదిసి
యాకసంబున నిల్చి యార్చి వేర్చుటయు, నాకరువలిపట్టి యటఁ దాను నెగసి
వారితోఁ బోరాడ వారును నతని, ఘోరముద్గరములు గొని వ్రేయుటయును
జగతిపైఁ బడి లేచి సాలభూరుహము, నగలించి మఱియును నార్చుచు నెగ
చిక్కనిభుజశక్తిఁ జిరచిరఁ ద్రిప్పి, యొక్కదెబ్బనె వారి నుర్విపైఁ గూల్చె
భాసకర్ణుండును బ్రఘసుండు నంత, నాసమీరాత్మజు నదరంటఁ డాకి
పటుశూలపట్టస ప్రహతుల నొంప, నట రక్తసిక్తాంగుఁడై వాయుసుతుఁడు
శోపించి మిక్కిలి కులశైలసదృశ, మాపర్వతం బెత్తి యసురులమీఁద
స్రుక్కక వైచినఁ జూర్ణమై పడిరి, శొక్కులు వడగంటఁ గూలుచందమున
వాయునందనుఁ డంత వారిసైన్యముల, నాయంతకుఁడువోలె నణఁగించె నపుడు
పడుకరుల్చెడుహారు ల్పరచుకాల్బలము, కడతేరుతేరులు కలఁగుశూరులును
మడియు మహారథు ల్మగ్గురుసారథులు, పొడియైనశస్త్రము ల్పొలియునస్త్రములు
కడికండలైన చక్రప్రాసములును, మడిసినగుఱ్ఱము ల్మగ్గుకాల్బలము
కూలెడుమావుతు ల్మగ్గురావుతులు, తూలెడుగొడుగులు తుంగుపడగలు
పఱచు నెత్తుటేర్లు బహుమాంసములును, నఱుక్రమ్ము భూతంబులై రణంబొప్ప
ఘడియమాత్రమున వారిఁ జంపి వాయుజుఁడు,రణకాంక్ష మఱియుఁ దోరణ మెక్కియుం
బంచసేనాగ్రజు ల్పంచత్వమొంది, రంచును హతశేషు లయ్యెడఁ దెలుప [డెఁ

హనుమంతునిమీఁదికి అక్షకుమారుఁడు వచ్చుట.

రాక్షసపతి యంత రణబలోదారు, నిక్షుచాపాకారు నిద్ధవిచారు
నక్షీణదోస్సారు నసహాయశూరు, నక్షకుమారు మహావీరుఁ జూచి
యలవుమై నాకోతి ననిలోనఁ జంపి, తలగోసి తోరణస్తంభంబునందుఁ
గట్టి రమ్మనవుడుఁ గడఁకతో నతఁడు నెట్టన శస్త్రాస్త్రనిచయంబుతోడఁ
దురగాష్టకముతోడ ధ్వజగతితోడ, బిరుదుఁ బొక్కెముతోడ బృథుకాంతిఁబొదలి
యుదయార్కనిభమైన యొకరథంబెక్కి, కదలి భూభాగంబు గంపింప నడచె
నరదంబుమ్రోతయు హయహేషితములు,కరిబృంహితములు రక్కసులయార్పులును

దనమహాకార్ముకధ్వనియు నొండొండ, ఘనములై యాశావకాశముల్నిండఁ
దోరణారూఢుఁడై తొలఁగక చెలఁగు, మారుతి నఱకుమారుండు దాఁకి
త్రిజగములల్భీతిల్ల దిశలు ఘూర్ణిల్ల, భుజశక్తి పుంఖానుపుంఖంబు గాఁగ
ఘనబాణతతుల నక్కజముగాఁ బొదువ ననిమొన మఱి బాలుఁడని యెంచరాదు
ఘనపరాక్రమకళాఖని వీఁడటంచు, హనుమంతుఁ డచలుఁడై యాబాణతతుల
వాలముఖంబున వడిఁ ద్రుంచివైవ, మేలని హనుమంతు మెచ్చుచు వాఁడు
బాణత్రయంబునఁ బావనిశిరము, శోణితంబులు గార సూటినేయుటయు
కీలాలధారలు కిరణముల్గాఁగ, బాలభానుఁడువోలెఁ బరఁగఁ జూపట్టి
యాలోనఁ బ్రళయకాలాగ్నియై మండి, శాలవృక్షమున రథ్యములు ద్రుంచుటయు
నేలపదాతియై నిలిచి వాఁడతని, ఫాలంబు శరములఁ బదియింట నొంప
నవశుఁడై తెప్పిరి యతఁడు వాలమునఁ, దవిలించి యఱునితనువు నొప్పింప
నఱుండు గదగొని యనిలతనూజు, వక్షంబు వ్రేసిన వడిఁ దూలి తెలిసి
కదిసి యగ్గదఁ బుచ్చి కడువడినేయ, బెదరి వాఁడొకవింటఁ బెట్టొనరించి
తప్పించుకొని వియత్తలమున కెగసె, నప్పుడు పలుకయు నడిదంబుఁ గొనుచు
నలవుమై నంతలో నావాయుసుతుఁడు, తొలఁగక నాసైత్యతోడనే యెగసి
గదవ్రేయుటయుఁ జూచి ఖడ్డమంకించి, గద రెండుతునుకలుగా వ్రేసి డాసి
తొడలు వ్రేయుటయు వాతూలనందనుఁడు, పుడమిపైఁ బడి నభంబునకు బిట్టెగసి
ఖగనాథుఁ డురగంబు కబళించినట్లు, లొగి వానిచరణంబు లొడిసిరాఁ దిగిచి
తెగువఁ గుమ్మరసారెతీరునఁ ద్రిప్పి, జగతిపై వ్రేసిన జవమెల్లఁ దూలి
పొలుపరి తలనున్న బొమిడికమూడి, కలభూషణము లుర్వీ గనుకని చెదరఁ
గుండియ పగిలి వ్రేగులువాతదొట్టి, కండ లెల్లెడరాలి కనుగ్రుడ్లు చెదరి
యగలి యద్దానవునంగంబులెల్లఁ, బగిలి నెత్తురు గ్రక్కి ప్రాణము ల్విడిచె
వానిచా వటుచూచి వాసవాద్యమరు, లానందభరితాత్ములై తన్నుఁ బొగడ
నంత నాహనుమంతుఁ డసమానవిజయ,వంతుఁడై యార్చి దుర్వారుఁడైయుండ
చెదరినదనుజు లచ్చెరువుగాఁ బాఱి, త్రిదశారిసభఁ జొచ్చి దీనులై నిలిచి
బలియుఁ డావానరపతిబాహుబలము, తలఁప నచ్చెరువెందు దానవాధీశ
పొలిసిరి వనపాలపుంగవు ల్లింక,రులు గీటణంగి రారూఢవిక్రములు
శతజిహ్వుఁడునుగూలె శార్దూలముఖుఁడు, గతజీవుఁడయ్యెఁ బింగళనేత్రుఁ డీల్గె
స్తనితహస్తుఁడు చచ్చె శార్దూలకబళుఁ,డనిఁ ద్రుంగె మృతుఁడయ్యె నట జంబుమాలి
సోమించి వక్రనాసుఁడు మ్రగ్గె రక్తరోముండు లయమయ్యె రుధిరాక్షుఁ డణఁగె
దళములతో హేలదంష్ట్రుఁడు మడిసెఁ, జెలువేది మది దీర్ఘజిహ్వుండు దెగియె
రూపఱిపోయె దుర్ముఖుఁడు దుర్ధరుఁడు, ప్రాపించె మరణంబు ప్రఘసుఁడు పడియె
నుఱుమయ్యె భాసకర్ణుండు యూపాక్షుఁ, డొరిగె విరూపాక్షుఁ డుసురుతోఁ బాసె
నఱుండు దెగటారె హతుఁడయ్యె నశ్మ,వఱుండు మడిసె దుర్వారసైన్యములు
ఇంక నావానరు నింద్రాదిసురలు, శంకింప ననిమొన సాధింపలేరు

ప్రళయాంతకునినైనఁ బట్టి నిర్జింపఁ, జలమెక్కి- యసమానసత్త్వుఁడైనాఁడు
నావుడు వెఱఁగంది నాకారివగల, భావించి యతనునిఁ బలవింపఁ దొడఁగె
హాకుమారక యక్ష వీరవర్య, హా కపిచే నీవు నణఁగితే యనుచుఁ
దలఁకుచుఁ బలవించుతండ్రిని జూచి, తొలఁగక యింద్రజిత్తుఁడు చేరి పలికె

ఇంద్రజిత్తు తండ్రి నూరార్చి హనుమంతునిపైకిఁ బోవుట.

దేవ నీకేటికి ధృతి దూలి వగవ, నావానరాధము నవలీలఁ దాఁకి
వారక యటఁ జంపి వచ్చెద నొండె, ధీరత నిటఁబట్టి తెచ్చెద నొండె
నావిని తనయగ్రనందనుఁ జూచి, రావణుఁ డనియె ధైర్యస్ఫూర్తి నిగుడఁ
బిరకాల మమరేంద్రు చెఱఁబెట్టినావు, పరమమాయాచరణప్రౌఢుండ వీవు
నాకంటె విక్రమోన్నతి మించినావు, నీకెదు రెవ్వరు నిఖిలలోకముల
నసమున నటులయ్యు నావానరేంద్రు, నసదుగా వదలక నాత్మ నేమఱుక
బహుదివ్యబాణప్రభావములఁ జూపి, సహజశౌర్యంబున జయముఁ గైకొనుము
అనఁ దండ్రివీడ్కొని యా మేఘనాదుఁ, డనలార్క-సంకాశ మగురథం బెక్కి-
యగణితనిజధనుర్జ్యాఘోషమునకుఁ, బొగిలి దిగ్గజకర్ణపుటములు పగుల
జగములు బెదర దిక్చక్రబంధములు, పగుల నార్పుచు వచ్చి పవనజుఁ దాఁక
నాసమయంబున నమరులు మునులు, వాసవప్రముఖదిగ్వరులు కిన్నరులు
నుప్పరంబుననుండి యొదిగి వీక్షింప, నప్పం క్తికంధరు నగ్రనందనుఁడు
నడరి యాతనిదేహ మణుమాత్రమైనఁ, బొడవడకుండ నద్భుతశితాస్త్రములు
గురియ నయ్యస్త్రము ఘ్లోరవాలమునఁ, దరమిడి చదియుచుఁ దప్పించుకొనుచు
శరవేగ లక్ష్యగోచరుఁడుగా కిట్లు, దురమొనరించె నద్భుతపౌరుషమున
రావణి నిర్జిత్తై రావణి యంతఁ, బావని యసమానబలవేగమునకు
నరుదంది మఱియు దివ్యాస్త్రంబులేయఁ, బరువడి ఖండించి పవనజుఁ డతనిఁ
దరుశైలముల వైవ దర్పించి యతఁడు, శరములనాటి జర్జరితము ల్చేసెఁ
జేసినఁ గని యింద్రజిత్తుపై నలిగి, యాసమిరాత్మజుం డవలీలఁ దన్ని
మొనయుచు రథరథ్యములు నుగ్గునేయ, ననిమొన విరథుఁడై యాయింద్రజిత్తు
హనుమంతుకడిమికి నచ్చెరువంది, విసుతోగ్రబలవాయువీర్యాస్త్ర మేయ
వాయుపుత్రుఁడుగాన వానరాధీశుఁ, డాయస్త్రమునఁ దూల కచలుఁడైయున్న
నరుదైన రౌద్రాస్త్ర మతనిపై నేయ, నెరిగి యాతఁడు రుద్రబీజంబుగానఁ
గదలక నిలిచినఁ గని యింద్రజిత్తు, మఱిలోనఁ గోపించి మాయతిమీఁద
సురసిద్ధసాధ్యులు చూచి నిందింపఁ, బరమదుర్జయమైన బ్రహ్మాస్త్ర మేయ
నాయస్త్రరాజంబు నవనీయు మిన్ను, రాయుచుఁ దనమీఁద రా వాయసుతుఁడు
బ్రహ్మాస్త్రమునఁ బ్రాణభయము లేకుండ, బ్రహ్మచే వరములు వడయుటఁ జేసి
బలువిడిఁ బఱతెంచు బ్రహ్మాస్త్రమునకు, దలఁకక బ్రహ్మమంత్రము లుచ్చరింప
నది చంపఁజాలక యతని బంధించి, కుదియించి పడవైచెఁ గుంభినిమీఁదఁ
బడినమారుతిఁ జూచి పట్టుఁడు కట్టుఁ, డడవుఁడు బొడుఁ డంచు నఖలరాక్షసులు

సుట్టుముట్టి కఠోరసూత్రజాలములఁ, గట్టిగాఁ గట్టిరి కట్టల్క-నిగుడ
నంత నాహనుమంతుఁ డవశుఁడై యున్న, నెంతయు రయమున నింద్రారిఁజేరి
నలువబొణంబుచే నాళంబుకాక, బలియుఁడై యటు పట్టువడియున్నయపుడె
యెనయ నీవానరుం డెవ్వఁడో వీని, ననిమొనఁ జంపరాదని నిశ్చయించి
అమితసత్త్వోన్నతుఁ డై పట్టితెచ్చి, తమతండ్రిముందఱఁ దడయక పెట్టఁ
దనమంత్రివరులును దాను వేర్వేఱఁ, దనయులావునకుఁ దద్దయు సంతసించి
కినుఁగవఁ బ్రళయాగ్నికణములు దొరుగ, హనుమంతుఁ జూచి యిట్లనియెరావణుఁడు
ఓరి వానరుఁడ నాయున్నపట్టణము, శూరత నొంటిమైఁ జొచ్చుట యెట్లు
నీ వెవ్వఁడవు మఱి నీకుఁ బేరేమి, యే వెరపున వచ్చి తీవార్ధి దాఁటి
హరుఁడు పంచినవాఁడొ హరి పంచినాఁడొ, పరమేష్ఠి నిన్నిటఁ బంచినవాఁడొ
సురగరుడోరగాసురవియచ్చరులు, నరసిద్ధసాధ్యులు నావేరు విన్న
వెఱతురు నీవిట్లు వెఱపక వచ్చి, తెఱఁగంటిదొరకైన దృష్టింపరాక
వఱలెడు నాపుర వంచనఁ జొచ్చి, పెఱికితి వనమెల్ల బీఱంబు మెఱసి
బడుగురక్కసుల దుర్బలులఁ గొందఱఁని, మడియించితివి మేటిమగవాఁడవోలె
నిప్పు డీనేరంబు లిన్నియుఁ గాతుఁ, దప్పక నీరాక తగఁ జెప్పితేని
యనిన నాహనుమంతుఁ డద్దశకంఠుఁ, గనుఁగొని యెంతయుఁ గనలి యిట్లనియె

హనుమంతుఁడు రావణునితో తనరాక యెఱిఁగించుట.

నోరి రాక్షస వినరోరి నీచాత్మ, దూరీకృతాచార దుష్టమానసుఁడ
విశదకీర్తులు మున్ను విశ్వంబు నిండ, దశరథేశ్వరునకుఁ దనయుఁడైపుట్టి
యరిగి విశ్వామిత్రయాగంబు గాచి, హరువిల్లు విఱిచి మహాశక్తి మెఱసి
పరశురాముని బట్టి భంజించివిడిచి, ఖరదూషణాదుల ఖండించె మఱియు
నీపెంపు గుడియించి నినుఁ దోఁకఁ గట్టి, యేపున నిన్నభ్ధి నీడ్చినవాలిఁ
బొలుపార నొకబాణమునఁ గూలనేసి, బలియుఁడై సుగ్రీవుఁ బట్టంబుగట్టి
యక్షీణశక్తిమై నతులకోదండ, దీక్షాగురుండనఁ దేజంబు మెఱసి
తగిలి రాక్షసకులాంతకుఁ డైనరామ, జగతీశునిజదూత చతురమానసుఁడ
హనుమంతుఁ డనువాఁడ నర్కజుమంత్రి, నినవంశనిధిరాముఁ డిట నన్నుఁ బనుప
ముదమెప్పు బ్రతివ్రేలిముద్రికగొనుచు, నొదవినకడిమిమై నుదధి లంఘించి
వచ్చి నీపురిఁ జొచ్చి వై దేహి నరయ, నెచ్చటఁ బొడగాన కెంతయుఁబోక
యవనిజ వనములో నారసి కాంచి, యవనీశుఁ డిచ్చిన యానవాలిచ్చి
దేవి నీపురినున్క- తెఱఁగొప్ప రామ,భూవరునకుఁ జెప్పఁబోవుచునుండి
యెనసి నారాక నీ కెఱిఁగింపఁగోరి, పెనిచిన వనమెల్లఁ బెఱికిపోవైచి
వనపాలు రగుదైత్యవరులఁ గింకరుల, నెనుబదివేవుర నేపుమైఁ గడఁగి
మడియించి మునుమిడి మంత్రినందనుల, మడియించి యతనుని మడియించి పిదపఁ
దగిలి నీయున్న చందము లెల్లఁ జూచి, మగిడిపోయెదనని మఱి పట్టుపడితి
నారాము నిజభృత్యుఁడైనసుగ్రీవు, భూరిసైన్యములలోఁ బొలుపుదీపింప

నలవుమై నాకంటె నతిబలాధికులు, కొలఁదిఁబెట్టఁగరాని కోటు లున్నారు
అదిమి బ్రహ్మాదులనైన సాధించు, మదయుతు ల్నీవన్న మండుచుండుదురు
గొనకొని యావీరకోటులతోడ, వననిధి బంధించి వచ్చి రాఘవుఁడు
లంకపై విడిసి చలంబు పెంపెక్కి, కిక్కమై నసుతుల గీటణంగించి
నీతల ల్నుగ్గాడి నిను సంహరించి, సీతఁ దోడ్కొనిపోవు సిద్ధ మీపలుకు
నెలకొని నీవింక నీతిమార్గమునఁ, దొలఁగక బుద్ధిమంతుఁడ వైన వినుము
సీత నొప్పించి యీ శ్రీతలోకపారిజాతంబు రఘురాము శరణంబుఁ జొరుము
వలవదు వైరంబు వసుధేశుచేతఁ, బొలియక నీ ప్రాణములు గాచికొనుము
అని బుద్ధిచెప్పిన హనుమంతుఁ జూచి, కనలుచుఁ బెంపుమొక్కలమును గదుర
ఘనఘనాఘనమేఁచి గర్జించినట్లు, తనియక భర్జించి దశకంఠుఁ డలిగి
వెఱవక చనుదెంచి వీఁడు నాయెదుట, నఱ్ఱగ్రమ్మి దుర్భాషలాడుచున్నాఁడు
కొనిపోయి చంపుఁ డీ కోతికీటంబు, నని ప్రహస్తునిఁ బంప నసురేశుఁ జూచి
వినయభూషణుఁడు వివేకభూషణుఁడు, ననఘుపోషణుఁడు మత్తారిభీషణుఁడు
నావిభీషణుఁడు కార్యము దీర్ఘచింత, భావించి చూచి యేర్పడ విన్నవించె
మగువల బ్రాహ్మల మఱిబాలకులను, దగదు దూతలఁ జంప దనుజాధినాథ
వలనొప్పఁ బతిపను ల్వచ్చినదూత, లలవుమై నేమైన నాడుచుండుదురు
అది దూతలకు ధర్మ మది విచారించి, మదిలోనఁ గోపంబు మట్టు గావింపు
తుద దూత లెందు వధ్యులుగారుగానఁ, బొదివి యీకోతిఁ జంపుట పాటిగాదు
చలము కోపము రామసౌమిత్రులందు, వెలువరింపుము వీని విడిచిపోనిమ్ము
మగుడక కిక్క నీమదినుండునేని, దగినదండము కొంత దండించి పుచ్చు
మని నీతిచెప్పిన నతనివాక్యములు, విని రావణుఁడు దైత్యవీరులఁ జూచి
కోతులకెల్లను గుఱుతువాలంబు, బ్రాతిగా నటుగానఁ బ్రజలెల్లఁ జూడ
వీనివాలము గాల్చి వీధులఁ ద్రిప్పి, పోనిండు నావుడుఁ బొదివి రక్కసులు
బలుమోకు లొగిఁ దెచ్చి పవనజుఁ గట్టి, బలిమి చేతులుకాళ్లు బంధించి తెచ్చి
మనవారి పెక్కండ్ర మడియించినట్టి, చెనఁటికీటము లెస్స చిక్కెరా యనుచు
బురవీథులందుఁ ద్రిప్పుచు నంతకంత, వరుస తూర్యంబులు వాయించికొనుచు
నెల్లెండ మెలఁగ నయ్యెడ వాయుసుతుఁడు, కల్లరిదనుజుల కలయఁ గ్రేగంట
గనుఁగొంచు మఱియు లంకాపురంబెల్లఁ, గనుఁగొనుతలపున గాసికిఁగోర్చి
హీనసత్త్వుఁడుపోలె నిటునటు దిరుగ, నానావిధంబుల నగుచు రేగుచును
ఆబాలగోపాల మతని వ్రేదగుల, నాబూమెలకుఁ బుణ్య లాత్మలో వగవఁ
దలకొని యెంతయు దైతేయవరులు, చలమునఁ జీర లసంఖ్యముల్దెచ్చి
కాలసర్పాకృతు ల్గాతిరుల్దాల్చి, లోలత నవి నూనెలోఁ దోఁచి తోఁచి
యిది యశోకారామ మెల్ల ఖండించె, నిది దానవేంద్రుల నెందఱు జంపె
దీనికిఁ దగుశిక్ష దేవారి పెట్టె, దీనిఁ గాల్పుఁ డటంచుఁ దెగువ నొండొరులు
నొదవిన లంకలో నుత్పాతహేతు, వుదయించెనని పేర్చుచున్న వాలమున

నచ్చలంబునఁ జీర లన్నియుఁ జుట్టి, చిచ్చుఁ దగిల్చి రచ్చెరువుగా మండ
దనుజులు సింహనాదములు సేయుచును, వెనువెంటఁ దగుల నావృత్తాంతమెల్ల
తప్పక దనుజకాంతలు చూచి పోయి, చెప్పిన నప్పుడు సీత శోకించి
యక్కటా నీతిజ్ఞుఁ డైన నీకిట్టి, యిక్కుపాటును గల్గెనే తండ్రి యనుచు
జలములు దడవి సుస్థలమున నిల్చి, చెలువొప్ప నగ్నికిఁ జేతులు మొగిచి
యారామవిభుఁడు ధర్మాత్ముఁడౌనేని, వారిధి నాకుఁగా వడి దాఁటునేని
యీరావణుని రాముఁ డిలఁ గూల్చునేని, వారక నే పతివ్రత నౌదునేని
జనకభూపతి సర్వసముఁ డగునేనిఁ, దనరు వేదములు సత్యము లగునేని
పవమానమిత్ర యోపరమపవిత్ర, సవకేకిశరదదోషాహ్రదద్విరద
వరద వైశ్వానర వానగోత్తముని, పరమశీతలుఁడవై పాలింపవయ్య
యని సీత ప్రార్థింప ననిలసూనునకు, ఘనవాల మసుపేరి కాలాహితలను
గనుపట్టు మాణిక్యకళికన మెఱసి, యనలుండు కడుఁజల్ల నైయుండె నంత
ఆవిధంబునకుఁ దా నాశ్చర్యమంది, పావని తమతండ్రి పావకసఖుఁడు
గావున నన్నగ్ని కరుణించె నొక్కొ, దేవతలెల్లఁ బ్రార్థించిరో రామ
దేవువిక్రమమెం యేదియుఁ గాదు సీత, దీవెన యిది యంచు తెలివిమైనుండి
ప్రవిమలసత్త్వైకపరులై నజనుల, భవపాశములు వీడు భావన దోఁప
బ్రహ్మమంత్రములు తప్పక యచ్చరింప, బ్రహ్మపాశములూడెఁ బవనసూనునకు
అంత నాహనుమంతుఁ డసురేశులంక, యంతయుఁ గాల్పఁగ ననువు చింతించి
యలవడ దనకునై యగ్ని సూక్తములు, జలములలోఁ గ్రుంకి జపియింపవలయు
ననిపోయి మునిగిన ట్లపరాంబురాశి, నినుఁ డస్తమించిన నేచి వాయుజుఁడు
కనకమహీధరాకారమై యెప్పు, తనమేనుఁ బెంచి బంధములెల్లఁ ద్రుంచి
కీడాచరించుచు గేలిసేయుచును, వేడుకతోఁ దన వెనువెంటఁ దిరుగు

హనుమంతుఁడు లంకఁ గాల్చుట.

దనుజుల నిర్జించి దనుజేశుఁడున్న, ఘనమైనమేడ కుత్కటముగా నెగసి
తనవాలవహ్ని లంతటఁ దరిగొల్ప, దనివి యంతంత కుద్గ్రంబు లగుచు
భుగులున పొగలొప్పే బొగలకుమున్నె, నిగిడి పెన్మంటల నిండె నాకసము
నాకసమున మంట లడరి మండుటయుఁ, బైకొని యట మున్నె పర్వె నుల్కాములు
అడరు నయ్యుల్కాలకట మున్నె తొలఁగి, వడి దిక్కులకు బాఱు వరవిమానములు
నప్పుడు హనుమంతుఁ డడరి యొండొండ, గుప్పించి మఱికొల్వకూటముల్గాల్చి
వరశస్త్రశాలలు వడి నీఱుచేసి, యిరవంద భండారపిండ్లును గాల్చి
పరువడి సౌధము ల్భస్మంబుఁ జేసి, సొరిది చప్పరములు చూర్ణంబుఁ జేసి
మణిచంద్రశాలలు మసిగా నొనర్చి, ప్రణుతశయ్యాగేహపటలి దహించి
రమణీయగజవాజి రణశాలలోగి, కమలిచి దగ్ధముల్గాఁ జేసె నప్పుడు
ఎడపక యెగసిన యెఱమంటతునుక, లుడుగక సుడువీథి నొండొండఁ బర్వి
ఖచరోరగామరగణవిమానములు, ప్రచురవిభ్రాంతైకపరతఁ జలింప

సొరదిమై రావణాసురచేటు దెల్వఁ, దొరగు నుల్కాలయట్లు దోఁచెఁ బెల్లుగను
రాజన్యుఁడగు రఘురామభూపాలుఁ, డోజమై దండెత్త నుద్యుక్తుఁ డగుచు
బలువిడి లంకలోపలఁ బ్రతాపాగ్ని, యెలమిమై నిర్గమ మిడియెనో యనఁగ
దహనుండు నిర్భరధ్వనుల బ్రహ్మాండ, కుహరంబు నిండి మిక్కుటముగాఁ బర్వె
రావణుఁ డట ఘోరరణకళాక్రీళి, కావళుఁ డగుచు దిక్పాలురనెల్ల
పఱచిన తొల్లింటిభంగము ల్మాఱు, పఱుపకపోఁ డనుభంగిని నెగసి
బలసి విభీషణుభవన మొక్కటియ, వెలిగాఁగ పురమెల్ల వ్రేల్మిడిలోన
దరికొని మండునత్తరి దైత్యవరులు, కరము భయభ్రాంతిఁ గంపించువారు
తలలును జీరలు దరికొని మండ, బలమేది నలుగడఁ బాఱెడువారు
తమతమవారలు తమబంధుజనులు, కమలుటఁ జూచి శోకము నొందువారు
హాహానినాదంబు లడరించువారు, నాహానుమంతుపై నలిగెడివారు
నావిష్ణుఁ డారామముఁ డతనికి నెగ్గు, గావించె నీపాపకర్ముఁ డన్వారు
అట్టికీ డొనరించినట్టిరావణుని, కిట్టియాపద వింతయే యనువారు
ననుచుండ నెంతయు నత్యుగ్రుఁ డగుచు, వనచరవీరుండు వడిఁ జెలరేగి
యొకచోటఁ దప్పక యుండ నాలంక, సకలంబు గాల్చి యుత్సవకేళిఁ దేలి
యెడపక పైవ్రాలు నెఱమంటతునుక, లుడుగక మ్రోయుచు నొగి దూలి తూలి
సోలి సురాపానసుఖసుప్తి మునిఁగి, కాలుట యెఱుఁగక కాలెడువారు
నాయెడ మృదులశయ్యలయందు నిదుర, పోయి పోయినయట్ల బొందులు కమలి
తెలివికి నెడమీక తీవ్రాగ్నిశిఖల, మెలఁగి మిడుగులేక మృతిఁబొందువారు
తమతమబంధులఁ దమవధూమణులఁ, దమతమబిడ్డలఁ దమప్రాణసఖులఁ
దమతమవారలఁ దగఁ దోడుకొనుచు, గుమురులుగట్టి యేగుచు మ్రగ్గువారు
తెగి యిండ్లసరుకులు దిగిచి తేఁబోయి, మగిడి రానేరక మ్రగ్గెడువారు
సతులఁ గౌఁగిటఁజేర్చి సరితెచ్చి తెచ్చి, ధృతిదూలి వాకిండ్లఁ ద్రెళ్లెడువారు
నైలంకఘూర్ణిల్ల నంతంతఁ గలయ, నాలోకభయదంబు లై మీఱెమీఱె
యురుసింహములఁ బోలెఁ నుగ్రతఁ బట్టి, కరికుంభవిదళనగతి మండిమండి
యోజపెంపారు నాహనుతులచందమున, వాజులమీఁదికి వడి దాఁటి దాఁటి
తగిలించు వరవిటోత్తములచందమున, మొగి కామినీకుచంబులఁ బ్రాకి ప్రాకి
భావించి యన్యులఁ బ్రహసించువారు, కైవడి నాలుక ల్గఱచియుఁ గఱచి
తగిలి సంతాపంబు దలకొన్న వారు, మిగిలి యుబ్బెడుగతి మిన్నందియంది
బెలుకుఱి పఱతెంచు భీతులపగిది, తొలఁగక నిగుడి గొందుల దూరి దూరి
వాలుచు నిబ్బంగి వాయునందనుని, వాలాగ్ను లొగి లంక వడిచుట్టుఁ గాల్పఁ
గాల్చిన నుబ్బి దిక్పతులు దేవతలు, మేల్చుట్ట మితఁడని మెచ్చి తనొబ్బగడ
హనుమంతుఁ డంతట నంతరంగమున, జనకజభీతిమై శంకించి బెదరి
యీలంకతోఁగూడ నినవంశుదేవిఁ, గాలిచితిని గన్ను గానక క్రొవ్వి
యేనింక రఘురాము నేమని కాంతు, జానకిసేమ మేసరణిఁ దెల్పుదును

దప్పెఁ గార్యమటంచుఁ దల్లడంబంది, యప్పుడు తనమది నట వివేకించి
యేతల్లిదీవెన నీఘోరవహ్ని, నాతోఁక రోమమైనను గాల్ప వెఱచె
నట్టి సీతాదేవి కగ్నిచే భయము, పుట్టునే యిదియేటిబుద్ధి యటంచు
ధరణిజమదిలోనఁ దాపాగ్నులార్పు, వెరపున వాలాగ్ని విషధిలో నార్చి
వెస నశోకారామవీథికిఁ బోయి, యసురకాంతలు భయమంది వీక్షింప
దనుజకాంతలచేతఁ దనసేమమెల్ల, విని మున్నె సంతోషవివశయైయున్న
జనకపుత్రికి మ్రొక్కి సన్నిధి నిలిచి, తనపౌరుషములెల్లఁ దగ విన్నవించి
యిదె పోయి తెచ్చెద నినకులేశ్వరుని, మదిలోన నీకు నుమ్మలికంబు వలదు
అని యింకఁ బనివిందు ననుచు సీతకును, వినయంబుతో మ్రొక్కి వీడ్కొని కదలి
తడయక పశ్చిమద్వారంబునందు, వెడలుచు పావని వెసనేపు మిగిలి
తలుపులు పడఁదన్నఁ దలుపులు విఱిగి, యిల గూలె రాక్షసులెల్ల భీతిల్ల
నురవడి నాలుక యొకటఁ గంపింపఁ, బరవసంబునఁ బెర్చి పదిలుఁడై వెడలి
వరుసతో నట్టల్లు వడిఁ గూలఁదన్ని; యలరి సువేలాద్రి నవలీల నెక్కి
కలయ లంకాపురిఁ గలదైత్యులెల్ల, బెలుకురి భీతిల్లఁ బెల్లార్చియార్చి
కడఁగి పానుపులు భగ్నంబులైయబ్ధి, చెడి కూలవడి మహాశిలలెల్ల డుల్ల
నంగదమ్మిఁ బెంచి యద్రిశృంగములు, క్రుంగి కుంభినిఁ గ్రుంగఁ గుప్పించి దాఁటి
యటుదాఁటి బలువిడి యాకాశవీథిఁ, బటుసత్వదేహసంపద వచ్చి వచ్చి
యరుదైనపేర్మితో నబ్ధిమధ్యమునఁ, బరఁగు మైనాకుఁడన్ పర్వతాధీశుఁ
గని యందుఁ దనమేనఁ గలదప్పిఁ దీర్చు,కొని పర్వతుని వీడుకొని యట వచ్చి
పాలుపొందు తనజవంబును పెంపుసొంపు, తలకొని జలధియుత్తరతీరభూమి
నతిసత్త్వసంపన్నుఁ డై వచ్చి నిలువ, నతనిసంతోషచిహ్నము లెల్లఁ జూచి
యంగదుఁ డాదిగా నగచరాధిపులు, సంగతి నెదురుగాఁ జని కౌఁగిలించి
ప్రకటించి యందంద పరిణామ మరసి, యొకచోట నందఱు నోలిఁ గూర్చుండి
పోయినకార్యంబు పాలుపొంద నడుగ, నాయన్నతోన్నతుం డందఱఁ జూచి
కపులార యేను మీకరుణమ్మిఁ జేసి, యుపమింప నరుదైన యుదధి లంఘించి
యగణితవైభవం బగులంకఁ జొచ్చి, తగిలి శోధించి సీతాదేవిఁ గాంచి
యినకులాధిపుఁ డానతిచ్చినత్రోవ, జనకనందనతోడ సకలంబుఁ జెప్పి
యింతికి ముద్రిక నిరవంద నిచ్చి, యింతిశిరోమణి యిదె పుచ్చుకొనుచు
వచ్చితి నేనన్న వనచరాధిపులు, నిచ్చలో హర్షించి యింపు సొంపొంది
హనుమంతు నందఱు నన్నిచందములఁ, గొనియాడి కొనియాడి కోర్కులఁదేలి
యున్నచో నంగదుఁ డురుపరాక్రముఁడు, క్రన్నన నుత్సాహకలితుఁడై పలికె
జనకజ మనమింక సాధించి తోడు,కొనిపోయి రఘురాముఁ గూర్చుట లెస్స
యటుగాన నిప్పు డియంబుధి దాటి, పటుపరాక్రముఁ డైనపక్షికంధరుఁడు
సుతులతో హితులతోఁ జుట్టాలతోడ, నతిరయంబునఁ జంపి యవనిజ గొనుచు
వత్తము లెండను వాలిసూనునకు, నత్తఱి బుజ్జెఱుఁ డనియె భావించి

మనల సుగ్రీవుండు మైథిలి వెనుకఁ, బనిచినపను లెల్లఁ బావనివలన
ననఘాత్మ సఫలంబు లయ్యె నీమీఁద, ననకులాధిపునితో నీవార్త్తఁ జెప్పఁ
బోవుట తగునన్న బుద్ధి నొండొరులు, భావించి దాని కేర్పడ సమ్మతించి
వనచరు ల్నాఁడెల్ల వనధితీరమున, ననిలసూనుఁడు దాము నర్థితోనుండి
బహుమూలఫలములఁ బరితృప్తిఁ బొంది, మహితసత్త్వాధికు ల్మఱునాఁడు కదలి
ధరణిపై మేరుమందరములకంకెఁ, బరమైన దర్దరపర్వతంబునకుఁ
జనుదెంచి యగ్గిరిసానుదేశముల, వనమూలఫలములు వడి నాస్వదించి
యాయద్రిపతిమీఁద నారాత్రి నిలచి, యాయతభుజబలు లంత వేగుటయు

ఆంగదాదులు మధువనంబునకు వచ్చుట.

మనమింక సుగ్రీవుమధువనంబునకు, నెనసినకడఁకతో నేగి రుందఱము
తనివోవఁ దేనియ ల్ద్రావికయున్న, మనదప్పి పోదని మది విచారించి
యినకులాధిపుపను లెల్ల సాధించి, చనియెద మటుఁగాన జలజాప్తసుతుఁడు
మనమీఁదఁ గోపించి మర్దింప వెఱచు, నని నిశ్చయముఁజేసి యందఱుఁ గూడి
హనుమంతు నంగదు నపుడు ప్రార్థించి, యనుకూలముగ వారియనుమతి వడసి
యాతతబలులు మధ్యాహ్నంబుకొలఁది, నేతెంచి మధువనం బేపుమీఱ జొచ్చి
దిక్కులవెదచల్లు తేనెతావులకు, గ్రుక్కిళ్లు మ్రింగుచు గునిసియాడుచును
గొనచెవు ల్నిక్కించి కొక్కరింపుచును, గినిసి యొండొరులఁ దర్కింపుచు వేడ్క
నెనయంగఁ దమతమ కిష్టంబులైన, వనభూములకుఁ బారి వనచరాధిపులు
ధీనిధుల్మఱి పువ్వుతేనియల్జుంటి, తేనియలును బుట్టతేనెలునైన
పలుతేనె లొగిద్రావి ఫలములు నమలి, కలయఁబువ్వులు రాల్చి కాయలు డుల్చి
తలిరుకొమ్మలు ద్రుంచి తరుకోటి వంచి, మలయుచుఁ గొమ్మకొమ్మకు సూటి దాఁటి
యొలసి పూఁదీఁగెల నుయ్యెల లూఁగి, కొలఁకులఁ గ్రీడించి గూడి వర్తింప
నాలోన దధిముఖుఁ డనఁగ నావనము, పాలింపుచుండెడి ప్లవగుఁ డొక్కరుఁడు
అసమానకోపుఁడై యందఱఁ గినిసి, వెసఁ దమ్ము భర్జించి వెడలిపో మ్మనుచు
వనపాలకులచేత వరుసఁ ద్రోయింప, వనచరు ల్వెసఁ బాఱి వారి వారించి
వడి నంగదుండును వాయునందనుఁడు, తడయక దధిముఖు ధరణిపై లీల
గెడపి పెట్టుక మోము క్రిందుగానీడ్చి, పొడిచి త్రోచుటయును బొలుపేది వాఁడు
కోపించి మొఱపెట్టుకొనుచును బోయి, యాపత్సహితసూనుసడుగుల కెఱఁగి
దేవదానవులకు దృష్టింపరాని, దేవ నీవనమెల్లఁ దెజంబు మెఱసి
పెనఁగొని వనచరు ల్పెక్కండ్రతోడఁ, జనుదెంచి యసమానసత్త్వులై కూడి
యామరుత్తనయుండు నావాలిసుతుఁడు, నీమధువనములోనికి నేగుదెంచి
తగిలి మ్రాఁకులు ప్రాఁకి తరుశాఖ లలమి, తిగిచి పండులు తిని తేనియల్గ్రోలి
యిది రాజవనమని యిచ్చ భీతిలక, కుదియక యంతఁ గైకొనకున్నఁ జూచి
యెడపక జంకించి యేను మీయాన, బొడిచి త్రోచుటయును బొడిచిరి నన్ను
నని వాఁడు మొఱయిడ నలిగి సుగ్రీవుఁ, డెనసి మర్దింప నూహించినఁ జూచి

యంత నావృత్తాంత మంతయు నెఱిఁగి, సంతతజయశాలి సౌమిత్రి పలికెఁ
దొలఁగక యంగదాదులు మహాకపులు, నెలకొని సుగ్రీవ నీయొక్కవనము
తలఁకొకింతయు లేక తమయంతఁ జొచ్చి, నలిఁదేనెఁ ద్రావుచున్నారేని వినుము
ఆతతబలసత్వు లగువారిచేత, సీతాధిపతిపను లిద్ధింపనోపుఁ
గాకున్న నీయాజ్ఞ గడవ నోపుదురె, గైకొని పిలిపింపు కడఁకతో వారి
నని బుద్ధిఁజెప్పిన నర్కనందనుఁడు, తనబుద్ధి గైకొని దధిముఖుఁ జూచి
శ్రీరాముకార్యంబు చేసిరిగాన, వారిచేసినసేత వారికిఁ జెల్లె
నూరక యీశోక ముడిగి నీవింక, వారిఁ బుత్తెమ్మన వాఁడంత నరిగి
హనుమంతు నంగదు నాజాంబవంతుఁ, గని మ్రొక్కి నాతప్పు గాచి మన్నించి
వనచరోత్తములార వడినేగుఁ డింక, వనములోపలనుండ వలవదు మీరు
మిమ్ము బుత్తెమ్మని మిహిరనందనుఁడు, నిమ్ముల నాకాన తిచ్చి పుత్తెంచె
ననువార్తఁ జెప్పిన నందఱు నుబ్బి, యినసూనునాజ్ఞకై యెదకొన్న వాలి
తనయుని నూరార్చి తడయక పేర్మి, వనచరాధీశులు వనభూమి వెడలి
యుప్పొంగుకడకల నుప్పరం బెగసి, యప్పుడు మేఘుంబు లట్ల మ్రోయుచును
వారక చనుదెంచువారిచిహ్నములు, దూరంబులందు సంతోషించి చూచి
యినజుండు కపిసేన నెదురుగాఁ బంచి, యనుర క్తి రప్పింప నర్థితో వచ్చి
జగదీశుఁ డగురామచంద్ర నంఘ్రులకు, నగచరు ల్దండప్రణామము ల్చేసి
తదనంతరంబునఁ దగ లక్ష్మణునకుఁ, బిదప నర్కజునకుఁ బ్రీతితో మ్రొక్కి

హనుమంతుఁడు సీతను చూచినతెఱం గెఱిఁగించుట.

యందఱుఁ గొనివచ్చి హనుమంతు నపుడు, ముందఱ నిడికొని ముదము దీపింప
శ్రీరామచంద్రునిసింహాసనంబు, చేరువ నోలి యాసీను లైయుండ
వలనొప్పఁ దమపోయి వచ్చినతెఱఁగుఁ, దలకొని వినఁగోరు ధరణీశుతలఁపు
హనుమంతుఁ డెంతయు నాత్మలో నెఱిఁగి, ఘనమైనభక్తితోఁ గరములు మొగిచి
కమలాప్తకులనాథ కంటి వైదేహి, ప్రమదాశిరోమణిఁ బరమకల్యాణి
ధరణీశ మీయాజ్ఞ తలమోచికొనుచు, నరుదైనదేశంబు లన్నియు వెదకి
చిరభక్తి సంపాతిచేఁ ద్రోవ యెఱిఁగి, యరిగి సముద్ర మే నవలీల దాఁటి
యొనర దక్షిణదేశమున మహామహిమఁ, దనరు త్రికూటాద్రిఁ దద్దయు నొప్పి
దానవకులపాలితం బైనలంక, యేనొక్కరుఁడ చొచ్చి యెల్లచో వెదకి
ధరణిజఁ గానక తద్దయు వగచి, యరిగి రావణునియుద్యానంబు గాంచి
పరికించి రాక్షసభామలు దన్ను, తిరిగి చుట్టుచునుండ దేవ మీ దేవి
యుపవాసముల డస్సి యొకమానిక్రింద, విపులదుఃఖంబులవెల్లిలో మునిఁగి
చెక్కిటఁ జెయ్యూది చిత్తంబుచూపు, నొక్కొక్కన్నవగలతో నీయందె చేర్చి
దనుజుండు చనుదెంచి తనుఁదెచ్చుతెఱఁగు, తనదిక్కులేమికిఁ దలపోసి చూచి
యుడుగనికన్నీరు లున్నంతప్రొద్దుఁ, బడియు నిట్టూర్పులు వడిఁ బుచ్చిపుచ్చి
మాసినచీరతో మలినయై ధూళి, ధూసరితాంగియై తూలికై వ్రాలి

తలయూచి తలయూచి తలకొన్నవగలఁ, బలుమాఱు వ్రేగుచుఁ బలవింపఁ జూచి
మీనాక్షిచిహ్నము ల్మీరు నాతోడ, నానతిచ్చినత్రోవ లన్నియుఁ జూచి
క్రమమున మరి సీతగా నిశ్చయించి, కమలాక్షిఁ బిదప దగ్గఱఁబోయి మ్రొక్కి
తామరసాక్షితోఁ దగుమాటలాడి, లేమకు మీయంగుళీయక మిచ్చి
మగుడశిరోమణి మఱేఁబుచ్చుకొనుచు, మగుడక యారామమంతయుఁబెఱికి
కమలాకరంబులఁ గలఁచి నిర్దలఁచి, కమలాప్తసుతునాజ్ఞఁ గడుమది నెంచి
కరిబృందములఁబట్టి కలఁచుసింహంబు, తరి వనపాలకతతి రూపుమాపి
తరమిడి తమతండ్రి తలఁపుదీపింప, నరుదెంచినట్టి యాయక్షయుఁ ద్రుంచి
చెలఁగి రాక్షసవీరసేనలఁ జంపి, యల యింద్రజిత్తుతో నచటఁ బోరాడి
రావణిచేఁ జిక్కి రాక్షసేశ్వరుని, కావర మణఁచంగఁ గడఁగి నే వాని
వరమందిరముఁ జేరి వలయువాక్యములఁ, బరువడి నేఁదెల్ప వాఁడు నన్గనలి
వాలమగ్నిఁ దగిల్చి వడి నేగుమనినఁ, గాలిచి లంకను గడువడిఁ గదలి
యగణితం బైనట్టి యంబుధి దాటి, మగుడ నిఁ గాంచఁగ మదిఁ దలపోసి
వచ్చితి నేనని వసుధాధిపతికి, నచ్చుగా సతివియోగాగ్నికీలలకు
మచ్చిది యననొప్ప మాణిక్య మిచ్చె, నిచ్చిన నారత్న మేర్పడఁ జూచి
యనురాగమున దాని నల్లనఁ బుచ్చు,కొని డెందమునఁ జేర్చుకొని మూర్ఛఁబోయి
యొకకొంతప్రొద్దున కొయ్యనఁ దెలిసి, ప్రకటధైర్యంబునఁ బ్రాణము ల్నిలిపి
నృపతిబాష్పాకులనేత్రుఁడై చూచి, కపినాథు ననిలజుఁ గరమర్ది బలికె
భానుజ నాప్రాణపదమైనయట్టి, మానినీమణిశిరోమణిఁ జూచినపుడె
నామది గరఁగుచున్నది లక్కవోలె, నీమణి మామామ కిచ్చె నింద్రుండు
యాగసంతృప్తుఁడై యఖిలంబు నెఱుఁగ, నాగుణనిధి జనకావనీవిభుఁడు
నట్టి యీమణి సీత యాదలవేడ్కఁ, గట్టి పెండ్లియొనర్చెఁ గరమర్ది నాకు
నన్నులతలమిన్న యైనయాసీత, నెన్నఁడు నెడఁబాయ దీమణి నేఁడు
నాతిని నన్ను మున్ననఁ గూర్పవచ్చు, దూతిక యనసిరు ల్దులకింపవచ్చె
ననియని యందంద యక్కునఁ జేర్చి, హనుమంతు మఱియును నటఁజూచి పలికెఁ
బరమపుణ్యాత్మక పవనజ నీవు, మరలి యే తెంచుచో మగువ యేమనియెఁ
జెప్పు మేర్పడనన్న శ్రీరాముఁ జూచి, చెప్పంగఁదొణఁగె నంచితసత్త్వధనుఁడు
ఎడపనివగలతో నేనొకభంగిఁ, గడపితిఁ బదినెల ల్కాకుత్స్థుఁ బాసి
చలమాదిరెండుమాసములకుఁ బిదపఁ, బెలుకుర నన్ను జంపెదనన్నవాఁడు
రావణుఁ డటుగాన రామభూపతికి, నేవిధంబునఁ బ్రాణ మిటమీఁదనిల్వ
దని విన్నపముసేయు మనఘు నాతండ్రి, తనుసత్యధనుఁడని తగనిచ్చె నన్ను
విలసిల్లు కల్యాణవేదిపైనుండి, వలనొప్ప నగ్నిదేవత సాక్షిగాఁగఁ
గరమర్థి నన్నెల్ల కాలంబు విడువ, కరసి రక్షించెద నని తెచ్చి నన్ను
నరయ కుపేక్షించి యనదగాఁ జేసి, పరికింపఁడని విన్నపముసేయు మనియె
వక్కఁగఁ జనుదెంచి తనధర్మపత్ని, నొక్కఁ డెత్తుకపోవ నూరక యునికి

మహిలోన వీరధర్మము కాదుగాన, విహిత మంతయు విన్నవించితిఁగాని
వలనొప్ప నామనోవాక్కాయకర్మ,ములు పూని తనయండె పొంది వర్తించు
నెనయంగ నాయొడ లెందుండెనేని, యని విన్నపమునేయు మనియె మీదేవి
తనుచిత్రకూటాద్రి దగ నొక్కకాకి, చెనకుటయును మనశ్శిలచేత మీరు
లీలతో మకరికల్లిఖియించుటయును, శీలించి గుఱుతుగాఁ జెప్పె నన్నియును
నీతిదప్పిన లోకనియతులు దప్పు, నీతియే తొడవగు నిఖిలనృపులకు
నని విన్నపమునేయు మనియె నాదేవి, యినవంశుతోఁ జెప్పి యిప్పుడే దండు
అనువొంద వెడలింపుమని విన్నవించె, నని లక్ష్మణునితొడ నర్కజు తోడ
జనకజపలుకులు సకలంబుఁ జెప్ప, ఘనశోకమును మానె ఘనుఁడు రాముండు
చెప్పినఁ గపివీరసింహంబులెల్ల, నప్పుడు దమలోన హర్షించి రంతఁ
గరమొప్ప సుందరకాండంబు నతుల, ధరఁబర్వి లోకసుందరమయ్యెఁ గృతుల
నని యాంధ్రభాషాభాషాధీశవిభుఁడు, వినుతకావ్యాగమవిమలమానసుఁడు
పాలితాచారుఁ డపారధీశరధి, భూలోకనిధి గోనబుద్ధభూవిభుఁడు
తమతండ్రివిట్టల ధరణీశుపేరఁ, గమనీయగుణధైర్యకనకాద్రిపేరఁ
బనిఁబూని యరిగండభైరవుపేర, ఘనుపేర మీసరగండనిపేర
నాచంద్రతారార్కమై యొప్పుమిగిలి, భూచక్రమున నతిపూజ్యమై వెలయు
నసమానలలితశబ్దార్థసంగతుల, రసికమై చెలువొందు రామాయణంబు
పరఁగ నలంకారభావనల్నిండఁ, గరమర్థి సుందరకాండంబు సెప్పె
నారూఢినార్షేయ మై యాదికావ్య, మై రసికానంద మై యెల్ల నాఁడు
నివ్వసుమతినొప్పు నీపుణ్యచరిత, మెవ్వరు చదివిన నెవ్వరు వినిన
సామాదిబహువేదచయధామరామ, నామచింతామణి నవ్యభోగములు
పరహితాచారమల్పరిభవిచారములు, పరిపూర్ణశక్తులు ప్రకటరాజ్యములు
నిర్మలకీర్తులు నిత్యసౌఖ్యములు, ధర్మైకనిష్ఠలు దానాభిరతులు
నాయురారోగ్యంబు లైశ్వర్యములును, పాయనిశుభములు పాపక్షయంబు
వరపుత్రలబ్ధియు వైరినాశనము, సరినొప్పు ధనధాన్యచయసమృద్ధియును
వీవిఘ్నములు లేక యిండ్లలో నధిక, లావణ్యవతులైన లలనలపొందుఁ
గొడుకులతో నెప్పుఁ గూడియుండుటయు, నెడగాఁగ నాపదలెల్లఁ బాయుటయు
సమ్మదంబున బంధుజనులఁ గూడుటయు, నిమ్ముల కామ్యంబు లెడపకుండుటయు
సతతంబు దేవతాసంతర్పణంబు, పితృగణతృప్తియుఁ బెంపారుచుండు
వ్రాసినవారికి వరశుభోన్నతులు, వాసవభోగాధివాసము గలుగు
నెందాఁక కులగిరు లెందాఁకఁ దార, లెందాఁక రవిచంద్రు లెందాఁక దిశలు
నెందాఁక వేదంబు లెందాఁక ధరణి, యెందాఁక భువనంబు లేపుదీపించు
నందాఁక నీకథ యచ్యుతానంద, సందోహదోహళాచారమై పరఁగు.

సుందరకాండము సంపూర్ణము.

శ్రీ ర స్తు.

శ్రీ రంగనాథరామాయణము

యు ద్ధ కా ం డ ము.

శ్రీరామచంద్రుఁ డాశ్రితహితోదయుఁడు, వారిజబాంధవవంశవర్ధనుఁడు
ప్రియములయందెల్లఁ బ్రియమైనయట్టి, ప్రియవాక్య మంజనాప్రియసుతుచేతఁ
బ్రియమున వినఁగోరి ప్రియసీతయునికి, ప్రియము రెట్టింపంగఁ బ్రీతితో ననియె
హనుమంతుచేసిన యంతకార్యంబు, చనునె నేయంగ నిర్జరులకునైన
నరిది సత్త్వమున నీహనుమంతుఁ డొండె, కరువలి యొండె నగ్గరుఁడుండు నొండె
వనధిదాఁటఁగఁజాలు వారలుగాక, మనమునఁ దలపోయ మఱియెవ్వఁడోపు
దేవగంధర్వులై తేయకిన్నరులు, భావించి చూరరాదు పగలును రేయు
రాక్షసానీకవిరాజితబాహు, రక్షితమా లంక రమణమై జొచ్చి
ప్రాణంబుతోడనే బ్రతికి క్రమ్మఱును, ఏణాంకధరుఁడైన నెట్లు రానోపుఁ
గడుమోదమున బుద్ధకార్యంబుపతికి, వడిఁజేయు నెవ్వఁడు వాఁడుత్తముండు
ఏలినపతికార్య మెడరైనయెడను, వాలూర నటునేయువాఁడు మధ్యముఁడు
పలుమాఱు మాల్గుచుఁ బతిపంపుపనికిఁ, దొలఁగఁబాఱెడువాఁడు దున్నేవకుండు
ఈముప్ప రందురు నెక్కువయైన, యామేటివాఁడునై యఱియింతలేక
యనురాగమునఁ బెద్దయైనకార్యంబు, ననుపమంబుగఁజేసె ననిలనందనుఁడు
కావునఁ బ్రత్యుపకార మీతనికి, నేనిధంబునఁజేయ నే నేర్చువాఁడ
నాలింగనంబె నాయర్థమం చతని, నాలింగనముసేసె నప్పు డవ్విభుఁడు
ఈభంగి మెచ్చిన నినసూతి వినఁగ, నాభవ్యుఁ డనియె నాయాంజనేయునకు
ననిలతనూజ నీ వంబుధి దాఁటి, జనకజఁ గని రాఁగ సంతోష మొదవె
నిట నాకుబొడమిన యీముదంబెల్ల, నిటమీఁద మఱి తుది యెట్టిదో కాని
యది యెట్టి దంటేని యగ్గలంబైన, యుదధిలంఘింపంగ నోపెడినెఱవు
కపిసేన కెబ్బంగిఁ గలుగునో యనుచుఁ, గపినాథ నామది గలఁగంగఁజొచ్చె
ననిపల్క యటమీఁద నాస్యంబు వంచి, మనుజేశుఁ డేమియు మఱిపల్కకున్న
శ్రీరామదేవుని చిత్తంబుకలఁక, యారవిజుఁడు మాస్తు నని విచారించి
యిదియేమి దేవ నీవితరులభంగి, మదిలోన శోకంబు మానవయ్యెదవు
దాఁటరా దననేల దాఁటెద వబ్ధి, దాఁటి సువేలయు దాఁటి యాలంక
సాధించి రావణుఁ జంపి లోకముల, బాధ మాన్పెదవు భూపాలక చూడు

మర్వీశ కపులెల్ల సుద్యోగయుతులు, దోర్విజయాఢ్యులు దుర్జయక్రములు
వీరుండ రాఘవోర్వీనాథ నీకు, వారక యిబ్బంగి వగవ నేమిటికి
సుద్యోగి వగుము సముద్యోగి కెందు, సద్యర్థిఫలంబులు సకలకార్యములు
ఉత్సాహి యగువాని కులుకుదు రహితు, లుత్సాహరహితున కులుకరుగాని
యని యతం డిబ్బంగి నాడువాక్యములు, విని హనుమంతుతో విభుఁ డర్థిబలికె
వేఁడెదఁ గాదేని వెడలు నాయంప, వాడిమినైనను వార్ధి నింకింతు
బంధింతుఁ గాదేని పవనతనూజ, కంధిదాఁటుట కెంత గగనంబు నాకు
నదియెంత పని విను మనిలతనూజ, పదిశిరంబులవానిపట్టణంబునకు
నెన్నికోటలు బల మెంత వీక్షింప, నన్నిటగవనులు నవి యెవ్విధములు
కావలియుండురాక్షసు లెంద ఱందు, భావింపఁ దద్గృహపంక్తు లే తెఱఁగు
చూచి వచ్చితిగాన చూచిన తెఱఁగు, నీచేత వినియెద నిక్కంబు చెప్పు

హనుమంతుఁడు లంకాప్రభావము దెలుపుట.

మునిన నంజలిమోడ్చి యాంజనేయుండు, వినయోక్తు లెసఁగ నవ్విభున కిట్లనియె
ఉడుగనిమదధార లొలుకుచునుండ, కడుఁగ్రొవ్వి పర్వతాకారంబు లగుచు
రౌద్రంబు మోముల రంజిల్లుచుండు, భద్రదంతావళప్రతతు లగ్గలము
పెక్కాయుధంబులఁ బెఱిగి చూడ్కులకు, నక్కజంబై ఘోరమై కనుపట్టు
గొడుగులఁ బడగలఁ గొమరారుచుండు, నడియాలముల కొక్కియంబులు గ్రాలు
భానుబింబప్రభాపటలంబుకరణి, మానైనమణిదీప్తి మహిమ వెలుంగు
రథము లెక్కుడు దశరథరాజతనయ, రథికసారథిమనోరథమ్ములై యుండు
ఘనవీరరసవారికరడులో యనఁగఁ, దనరారి యెంతయుఁ దఱుచువన్నియలు
మెఱసినచూడ్కులు మిఱుమిట్లుగొనఁగ, వఱలినహేషారవంబులు చెలఁగ
హరిఘోటకంబుల నైనవేగమున, హరియింప నోపిన హరిశక్తి గలిగి
హరు లెంతయును మనోహరములై యుండు, హరిహరాదులు మెచ్చునట్టియగ్గలము
పిడుగులతోడఁ బ్రబ్బినవల్లమొగులు, అడరి దానవరూప మయ్యెనో యనఁగ
నేర్చి రౌద్రంబుతో నెనసి యంగంబు, గూర్చిన నల్లనికొండలో యనఁగఁ
గాదేని హరుఁడుమ్రింగిన నాఁటిగరళ, మీదైత్యకోటియై యెసగెనో యనఁగఁ (?)
బ్రళయకాలమునాఁటి పావకధూమ, మలవడ రాక్షసులై రొకో యనఁగఁ
గలిగినయట్టి రాక్షసులకు సంఖ్య, గలుగదు దేవ రాఘవ ధరాధీశ
దట్టమై యట్టహ్లఁ దనరి చూపట్టు, నిట్టికకోటయు నిరవైనఖాతి
కోటయుఁ బొడవునఁ గొమరొందు నినుప,కోటయు నట యుక్కుకోటయుఁ గంచు
కోటయు మఱివెండికోటయుఁ బసిఁడి,కోటయు ననుఁ నేడుకోట లొప్పారుఁ
గాలునివక్షంబు కరణిఁ బొల్పెక్కి, మేలైనతలుపులు మెఱసి యెంతయును
అక్కోట లన్నిటియందును జూడ, మిక్కిలి దీప్తుల మిక్కుటం బగుచు
నఖిలరత్నముల మేలైనవాకిళ్ల, నఖిలావనీనాథ యరయ నాల్గేసి
వరమంత్రవిధుల దివ్యంబులైనట్టి, శరచాపచయము లసంఖ్యలై యుండు

నాకోటచుట్టును నఖిలలోకేశ, భీకరమకరసంభృతములై పరఁగు
నాలుగగడ్తెలు నాల్గుదిక్కులను, జాలంగఁ బాతాళ సమితి నొప్పారు
దేవ యానాలుగు తెరువులయందుఁ, గావలియుండు రాక్షసకోట్లు దఱుచు
అమితశిలాబాణయంత్రజాలములఁ, దమతమయంతనే దాయలఁ జంపు
ధాత్రీశ యింటింటఁ దప్పకయగ్ని,హోత్రము లున్నవి యోంకార మెసఁగ
ననవుడు విని యతఁ డతిచోద్యమంది, మనమునఁ జింతింప మారుతి యనియె
సత్యంబు ధర్మంబు శౌచంబు దయయు, నత్యంతశూన్యంబ యసురులయందు
ననిపల్కుటయు సాధ్యమౌనని లంక, జనపతి ముదమందఁ జతురుఁడై పలికె
నవియెల్ల నిట్టిట్టివని యెన్ననేల, యవనీతలేశ మహావైభవమున
వారక సేనతో వాహ్యాళివెడల, నారావణుండు నిత్యము తోడుచూచు
వాలినమదమున వడిఁ గయ్యమునకుఁ, గాలుద్రవ్వుచునుండుఁ గమలాప్తవంశ
యగ్గలికయు లావు నడర వైరులకు, లగ్గఁబట్టఁగరాదు లంక భూనాథ
జలవనకృత్రిమస్థలశైలదుర్గములు నాల్గునుండు సముద్రంబులోన
నవి యెల్లకాలంబు నైనను గాల, కదియఁబోవఁగ రేవు కానంగరాదు
మృత్యుజిహ్వాయుఁబోలె మెఱుఁగులతోడి, యత్యుగ్రశూలంబు లనిశంబుఁబట్టి
కడు నుగ్రరాక్షసు ల్కాచి యుండుదురు, పడమటివాకిటఁ బదివేలసంఖ్య
లక్షులై తేయు లాలంకాపురంబు, దక్షిణద్వార ముద్ధతిఁ గాతు రెపుడు
నటఁ దూర్పువాకిట నమరారియుండుఁ, బటుతరచతురంగబలసమేతముగ
నగణితశస్త్రసహాయులై యుండుఁ, దగ నొక్కలక్ష యుత్తరపువాకిటను
చాల రాక్షసులు లక్షయు నిర్వదేను, వేలు తత్పురమధ్యవీథి నుండుదురు
ఆలంక మీకృప నర్కకులేశ, యే లీలఁ జొచ్చితి నింతఁ గైకొనక
వడిఁజొచ్చి యట్టిల్లు వడిఁగూలదన్ని, యడరి కోటలఁబ్రాకి యగడితల్పాడ్చి
యచ్చెరువుగ లంకయంతయుఁ గాల్చి, వచ్చి మీశ్రీపాదవనజము ల్గంటి
నడరి యక్కడికార్య మంతయు వింటిఁ, దడయ నేటికి యబ్ధి దాఁటుద మింక
దాఁటినయప్పుడే దశకంఠులంక, మీటివై చెదరు వ్రేల్మిడిలోనఁ గపులు
అనవుడు రఘురాముఁ డర్కజుఁ జూచి యిటనుత యాలస్య మేటికి నింక
వెడలింపు కపిసేన విజయలగ్నమునఁ, గడులెస్స మధ్యాహ్నకాలంబు మనకు
నాయస్త్రమునుదక్క నరభోజనునకు, నేయుపాయముగల దెందు దాఁగెడిని
అని నీలుదెసఁ జూచి యర్కవంశజుఁడు, వినుమని బుద్ధిగా వివరించె నపుడు
కడునింపుదనమును కడునిర్మలంబు, కడుతీపునీరును గలుగంగఁ జూచి
పరిపక్వఫలముల భరితంబులైన, తరువులు నజ్జాడ తఱుచయ్యెనేని
నడుపుము ముంగలి నడుచొరనీక, వడిఁ బరికింపు మొప్పని లాతివారి

సుగ్రీవుఁడు కపిసేనల వెడలించుట.

ననిన నారాముని నానతియెల్ల, విని నీలుఁ డట్ల కావించె శీఘ్రమున
నప్పుడు సుగ్రీవుఁ డఖిలవానరుల, దప్పకుండఁగఁ బిల్చి దండెత్తఁ బనిచెఁ

బనిచినఁ దమతమపటురభసమున, ఘనగుహాలందుండి కపిసేన వెడలె
భూరిపదాఘాతములఁ దల్లడిల్లి, ఘోరరావంబుల గుహలు ఘూర్ణిల్ల
వీరగర్జనములు వీరహాసములు, వీరనాదంబులు వెస నింగిముట్టఁ
బెల్లునఁ గోపించి పెడబొబ్బ లిడుచుఁ, ద్రుళ్లుచుఁ బటుశక్తితో ఁాటువారు
కొందఱు పండినకుజములు మూఁపు,లందిడి నమలుచు నరిగెడివారు
రావణుతోఁగూడ రాక్షసప్రతతి, నేవిధంబునగైన నేమె చంపుదుము
రామభూపాలక రణమున ననుచు, రామునిముందఱ రాగిల్లువారు
కెరలి పైకుఱుకుచుఁ గేక వైచుచును, వెరవారఁ దోఁకల విసరియాడుచును
జెచ్చెఱ పర్వతశిఖరంబు లెక్కి, ఇచ్చుఁ గొందఱు బొబ్బ లిడువారు నగుచు
నప్పుడు కపివీరు లందఱు చెలఁగి, యప్పరమేశ్వరుఁ డానంద మొంద
నారవంబున మ్రోసె నాకాశవీధి, నారవంబున భూమి యటునిటుపడియె
నారవంబునఁ బెల్చ నద్రులు వణఁకె, నారవంబున మ్రొగ్గె నాదిగ్గజములు
నారవంబున భార మయ్యె శేషునకు, నారవంబునఁ గూర్మ మణఁచె శిరంబు
ఇటు సేన నడవంగ నెగసినధూళి, పటలంబు మిన్నంది బహువర్ణములను
ఆరవంబున భార మై యిల నెసఁగు, తోరంపునిశ్వాసధూమంబు లనఁగ
నప్పుడు ముంగలి యై నీలుతోడ, నొప్పు సైన్యంబు లత్యుగ్రతుండముగ
నిరుదిక్కులందును నేపారినడుచు, తరుచరబలము లుద్ధతపక్షములుగ
స్ఫురణ మెప్పఁగ మధ్యమునవచ్చువారు, ధరణీతలేశుఁడు తనయాత్మ గాఁగఁ
గడఁగ సొంపారి చక్కఁగ వెన్కఁ గాచి, వడివచ్చుసైన్యంబు వాలంబుగాఁగ
నురగపాశంబుల నొందంగ నున్న, తరణివంశజు నవస్థలు తొలఁగింప
గరుడుండు భూస్థలిఁ గైకొని నడచు, కరణి నొప్పారె మర్కటమహాసేన
సరిప్రజంఘుండు కేసరి దధిముఖుఁడు, పరువడి సుదడిఁ బాయవ్రేయగను
విరళమై శ్రీరాము వెల్లువ నడువ, పరమసంతోషసంభరితాత్ము లగుచు
గవయుండు తారుండు గంధమాదనుఁడు, పవమానసూనుఁడు పనసుఁ డంగదుఁడు
శరభుండు నలుఁడును జాంబవంతుండు, హరుఁడును మైందుండు నాదిగాఁగల్గు
వనచరపతులెల్ల వడి నేగుదేర, జనుదెంచి రఘుపతి సహ్యపర్వతముఁ
గని యందు విడిసె లక్ష్మణసమేతముగ, ఘనతతో నపుడు నగ్గలముగా నందుఁ
బెంపారువనములఁ బెఁదటాకముల, నింపారునీడల నిరవైనయెడల
విడుదులు గైకొని వెలయు నబ్బలము, విడిసె సుగ్రీవుండు విడియంగఁ బనుప
మఱునాఁడు నెప్పటిమాడ్కి లక్ష్మణుఁడు, దొరలు మహీపతి త్రోచియేగగను
నురువీరరసమున నుప్పొంగి పొంగి, భరితస్వనంబునఁ బరిపొంది యొంది
తనుకాంతికరడులఁ దనరారి యారి, ఘనమైనమ్రోత నాకస మంది యంది
మునుకొని వనశైలముల నొప్పి యొప్పి, మనువంశచంద్రుచే మదినుబ్బి యుబ్బి
యాసముద్రము పెంపు నడఁగింప నడచె, భాసురం బగుకపిబలసముద్రంబు
ధైర్యాఢ్యు లామహీధవులభ్రమధ్య, సూర్యచంద్రులమాడ్కి శోభిల్లి రంత

నదులలోఁ జొచ్చి వానరసేన నడువ, నెదురునొట్టుచు నుబ్బి యెసఁగి యానీరు
సహ్యాద్రిమలయాద్రిసంధులనడుమ, సహ్యమై కపిబలసమితితోఁ బొడము
చిఱుగాలిచేఁ దరుశిఖరాగ్రసమితి, నొఱపైనకొమ్మ లొండొంటితో రాసి
యగచరావళిమీఁద నలరులు రాల్చెఁ, దగనట్టిదే కాదె తలపోసి చూడ
వనలక్ష్మి శ్రీరామవల్లభుఁ జూచి, యెనయఁ బుష్పాంజలు లీకేల మాను
నప్పుడు కపివీరు లయ్యయియెడల, నొప్పెడుకొలఁకుల నురవడిఁ జొచ్చి
యానిర్మలపునీరు లారంగఁ గ్రోలి, యానందమును బొంది యందందఁ గదిసి
కమనీయమృదుకరకమలయుగ్మములఁ, గమలము ల్దుర్గింతురు కమలంగఁ బట్టి
కమలాకరంబులఁ గమలాప్తకులుఁడు, కమలారియును బోలి కమలముల్ నొంచుఁ
గ్రమ మెప్పఁగా దశకంధరువదన, కమలంబులని తెల్పుకరణిఁ జెలంగి
తొగలు వెట్టింతుము దుష్టారిసతుల, తొగలు జానకి యింకఁ దొలగంగవైచుఁ
దొగలార యిఁకమీఁదఁ దొగయెట్టిదనుచుఁ, దొగలెల్ల జిదిమివైతురు వెచ్చువెరిగి
బిరుదులై యసురులప్రేఫులు వెరుకు, కరణిఁ బెరుకుదురు ఘనమృణాళములు
ఇటు వినోదింపుచు నెల్ల వానరులు, తటములమీఁది కుద్ధతశక్తి దాఁటి
గిరులెక్కి పణములఁ గ్రిక్కిరియంగఁ, బెరలలేనియలాని ప్రేలరింపుచును
గడునుత్సహించి యుత్కటబలాధిపులు, నడిచిరి వానరనాయకోత్తములు

శ్రీరాములు మహేంద్రాద్రిఁ జేరుట.

ఇనవంశుఁ డపుడు మహేంద్రాద్రి యెక్కి, యనతిదూరంబున నంబుధిఁ గనియె
కరిమకరంబులు కరిసమూహములు, తరగలు గుల్ఫపుదళములుపెల్లు
కమఠకర్కటములు ఘనరథావళులు, సమదజలార్ద్రకసమితిభటాళి
పొలుపార ఫణిఫణంబులు కేతనములు, లలిఁ జొరమీనవాలము లడిదములు
చలదురు మీనాళి చామరప్రతతి, పొలుపొందు నురువు నొప్పఁగ ఛత్రసమితి
పెనుపైనఘోషంబు భేరీరవంబు, వినుతింపఁగా నీరు వీరరసంబు
గానున్నఁజేరిన కడిఁది రావణుని, నేనేల చంపంగ నిత్తునన్నాడ్కిఁ
దనరిన క్రూరసత్త్వస్థితిఁ బేర్చి, తనకెదురై మహోద్ధతి నున్నదానిఁ
గని పెద్దవెఱగంది గాంభీర్యధనుఁడు, వనధితీరముఁ జేర వచ్చి రాఘవుఁడు
ప్రకటంబుగా సర్వబలముగూడుటకు, నొకమంచిచంద్రకాంతోపలస్థలిని
జలధితీరంబునఁ జరియించుచున్న, బలితంపురావణపారీనవరుని
ననుపమం బగుతన యంపగాలమునఁ, గొని తివుచుటకునై కూర్చున్నపగిది
నాసీనుఁడైయున్న యర్కకులేశుఁ, డాసన్నుఁడైయున్న యర్కజుఁ బలికె
వచ్చితి మిమ్మహి వారిధిఁజేర, నెచ్చొప్పు ఘటియింత మిది దాఁట మనకు
నాయుపాయము మఱి యాత్మచింతింత, మీయగచరకోటి నెందుఁబోనీక
యింపైనయెడ విడియింపంగఁ బనుపు, సొంపారఁగాఁ దోడుచూడంగవలయు
నని రాఘవేశ్వరుఁ డర్కజుఁ బలుక, నినసుతుండును నీలు నిటుసేయఁ బనిచె
నీలుండు నప్పుడు నిరతంబుగాఁగ, వాలినసేనల వడి విడియించె

వనచరారవము నావలనను గలిగి, వనచరారవము నీవలననుఁగలిగి
యునికి సహింతునే యోసముద్రుండ, యని యప్పు డావార్ధి నదరించుమాడ్కి
విడియు వానరసేన వెడలెడుమ్రోత, నడచుపెల్లైన యాయంబుధిమ్రోత
నటరెండువేలంబు లై యాపయోధి, తటవనభూములఁ దరుచరుల్వీడియ
నప్పుడు రాముఁ డేకాంతంబునందు, నొప్పెడులక్ష్మణు నొయ్యనఁ బలికె
సౌమిత్రి వింటె యీజలనిధికైన, నీమెయిఁ దుద నిశ్చయింపంగవచ్చు
నివి యంత యింతని యెన్నంగరాదు, తుదలేదు నామనోదుఃఖవారిధికి
నని రామవిభుఁడు శోకాంబుధిలోన, మునుఁగుచుండఁగ మూఁడుమూర్తులు గలిగి
యతనితోడిదె లోక మనినచందమున, నతివేగమున నినుఁ డపరాద్రిఁ గ్రుంకె
నినుఁడు గ్రుంకుటయును నెల్లలోకములు, పెనుపొందమణిలేని పెట్టియఁబోలె
మనసిజానలతీవ్రమానసు రాముఁ, గనుఁగొని యనువుగాఁ గప్పటకొఱకు
చెలివోలు నపరాశ చెంగావిచీర, నెలమి నిచ్చినక్రియ నెరసంజ యొప్పె
నినవంశచంద్రుచే నింద్రారిమోము, ననిశంబు నిటువాఁడు ననినచందమున
దళమున బిగువెల్లఁ దప్పి యందంద, లలిఁ దక్కుచును గమలంబులు మొగిడె
చెలువుగా రాముని శీతలక్రియకు, నలిరేఁగి యాశాంగనలు గూడవైచు
లలితతమాలపల్లవరాసు లనఁగఁ, గలయంగ బలువుచీఁకటు లగ్గలించె
దిననాథకులుదేవిఁ దెచ్చిమోదించు, దనుజనాథునిమోము దమ్ములు విరియు
ననిగెయిడిమూడ్కి నప్పు డందంద, తనువొందఁగాఁ గుముదంబులు విరిసె
శ్రీరామదేవునిశితమార్గణముల, నారత్నములుదక్క నంబుధిఁ గ్రుంకె
నీరూపమునసుండు నిక ననుమాడ్కి, తారకావళిచేతఁ దనరారె మిన్ను
యానిశీథిని రాము నంగతాపమున, కై నిబిడంబుగా నమరించియున్న
సారంబు మల్లికాశయ్యన నొప్పెఁ, దారల ప్రతిబింబిశం బైనయబ్ధి
విరహంబుచే రామవిభుఁడును నరిగె, నరిదియే విరహులమాటమే మనుచు
వెసలకుఁజెప్పెడి లెఱుఁగునఁబాసి, వెస మఱిమఱి చక్రవాకములనియె
రాజనై యేను వారాశి యుబ్బింతు, రాజవై నీవు వారాశి యింకింపఁ
దలఁచుట పాడియే ధరణీశవర్య, విలసితసత్కళాన్వితుఁడగు నీవు
నటు చేసితేని దోషాకరత్వంబు, పటువృత్తి నీయందుఁ బ్రభవించు నంచు
దూఱవచ్చినమాడ్కిఁ దోచెఁ జందురుఁడు, మీఱినకరములు మిన్నులమ్ముట్టి
జనకజకై రామజననాథతిలక, ననుఁ దలఁ దాల్చి మన్ననఁజేసినట్టి
హరువిల్లు విఱిచిన యాదోషమునను, విరహివైతివి సీతవెఱపున ననుచుఁ
జందురుఁ డట్టహాసముచేసె ననఁగ, నందందఁ జంద్రిక లతిశయమొందె
శరనిధి సురువను చందనంబర్ధిఁ, గరమొప్ప వీచికాగణములగల్చి
కరములు పుచ్చి దిక్కాంతలమేనఁ, బొరిపొరి యారాజు పూసెనో యనఁగఁ
దలకొని మఱియును దట్టమై పర్వి, వెలయంగ వెచ్చనివెన్నెలయొప్పె
నప్పుడు వేడుక నాచకోరములు, నొప్పుచిత్తములఁ బెంపొలయంగఁ గదిసి

పొరిఁబొరిఁ దమచంచుపుటములు చాచి, నిరేతంబుగాఁగ వెన్నెల పుక్కిలించి
లలితోడఁ దమప్రియులకు నిచ్చి యిచ్చి, యెలమితో నవియంది యీగోలి గోలి
మలసియాడుచుఁ బలుమఱు సోలిసోలి, పొలుచు వెన్నెలరసంబులఁ దేలి తేలి
గమిచాసి యడుగులు గనతారితారి, కొమరారియింతులఁగూడి యుండుటయుఁ
గనుఁగొని మదనమార్గణవర్ధిన్నతనుఁ డైన రాముఁ డాధరణిజఁ దలఁచి
యంతకంతకు మదనాగ్ని చేఁ గుంది, యంతరంగంబున నడలుచునుండె
అప్పుడు లక్ష్మణుం డన్న సంతాప, ముప్పొంగుటయుఁ జూచి యొగిమాన్తుననుచు
నిదె యబ్ధి దాఁటుద మిదె దాఁటిపోయి, పదిశిరంబులవాని పటుశక్తి నాజి
భంజించి మిథిలాధిపతికూర్మిపుత్రి, గంజాస్యయగుసీతఁ గైకొనె దధిప
వనుధేశ నీవింక వగవ నేమిటికి, నసమానవీరుండ వారూఢకృతివి
యనవుడు తమ్మునియనునయంబులకు, జననాథుఁ డెంతయు సంతోషమంది
ఆదట వెన్నెలయ్యందు వానరులు, మోదంబుతోడ నిమ్ములనెల్లెడల
నారామదేవుగుణాంకంబు లింపు, లారంగఁ బాడుచు నాడెడువారు
కూడి యాజలనిధికూలంబునందు, వేడుకతో నుబ్బి విహరించువారు
హరియవతారంబు లన్నియుఁ గథల, వెరవుగా నింపుగా వినుచుండువారు
కడఁగి యాయాచంద్రకాంతోపలముల, వడలుసొంపారఁగాఁ బవళించువారు
నై ప్రొద్దుగడపి ప్రియంబును బొదల, రయమున నంతఁ బూర్వమున కింపెసఁగ
జలనిధి రాఘవేశ్వరుఁ డేయునపుడు, బలుశిలీముఖములఁ బడుదునో యనుచు
కడువేగ తొలఁగి యాకంపంబు నొంది, బడబాగ్ని యుదయాద్రిఁ బ్రాకెనో యనఁగ
రాముబాణాగ్ని వారాశి దహించు,చో మిన్నుముట్టి యర్చులు పర్వె ననుచు
వెఱచి తొలంగిన విధమునఁ గ్రుంకె, నెఱసినచుక్క లన్నియుఁ దోడుతోడ
నిదియేల దడసెద వీయబ్ధిఁ గట్టి, వదలక చంపు రావణు రాఘవేంద్ర
యని మనుమనికిఁ దోడ్తై రేఖకడను, జనుదెంచె ననఁగ భాస్కరుఁ డుదయించెఁ
గమలా ప్తకులుని రాఘవుని సద్విజయ, కమలయుఁ దద్రాజ్యకమలయుఁ గీర్తి
కమలయు నని మేలుకనినచందమునఁ, గమలంబులెల్ల నొక్కట మేలుకనియె

రావణుఁడు మంత్రులతో నాలోచించుట.

నప్పుడు తగినసంధ్యాదికృత్యములు, నొప్పంగ సలిపి రాయుర్వీశు లంత
నక్కడ రావణుఁ డఖిలమంత్రులను, తక్కఁగ రావించి తగవారి కనియె
మంత్రికోవిదులార మర్కటుం డొకఁడు, జంత్రంబుఁ జూపిన చందాన వచ్చి
లంకిణి నొంచి యీలంక శోధించి, పంకజానన సీతఁ బరికించి కాంచి
నావసంబుఁ బెఱికి నాసుతుఁ జంపి, నావిక్రమము మీఱి నాపురిఁ గాల్చి
పెక్కువ నసురులఁ బెక్కండ్రఁ జంపి, చిక్కియు మనచేతఁ జిక్కకపోయె
నదె లెచ్చె రాముని నావానరుండు, పదిలుఁడై యంబుధిప్రాంతంబునకును
భల్లూకబలములు ప్లవగసైన్యములు, వెల్లువలై వచ్చి విడిసిరి వార్ధి
స్థిరముగా నీవార్త తెఱఁగెల్ల దెలియఁ, జరజను ల్చెప్పిరి సకలంబు నాకు

నినకులుఁ డీయబ్ధి యింకించియైనఁ, దననేనఁ బంచి యుద్ధతిఁ గట్టియైన
దాఁటివచ్చిన మఱితప్పుఁ గార్యంబు, దాఁటకమున్నె మీ ర్తద్జ్ఞతమెఱసి
యిదికార్యమని చెప్పు డిందఱుగూడ, నదియె నేయుదము మేలగు తెఱఁగైన
నని యడిగిన రాక్షసాధీశుతోడ, ననిరి మంత్రులు కడునల్పజ్ఞు లగుచు
దివ్యులకైనను దృష్టింపరాని, దివ్యాస్త్రములు వెక్కు దేవరయందుఁ
గ్రక్కునవిషములు గ్రక్కంగఁబట్టి, యక్కడంగించితి వురగాధిపతిని
రుద్రునిసఖుఁ గుబేరునిమదం బణఁచి, భద్రకం బైనపుష్పకముఁ గైకొంటి
మయునిప్రఖ్యాతుని మర్దించి యతని, ప్రియసుతఁ బెండ్లియుఁ బేర్మితోనైతి
నంతకు నెక్కుడై యంతకుఁ గిట్టి, యంతకునకు నీవ యంతకుఁ డైతి
వారనిబళుఁడైన వరుణునియాత్మ, నీఱు గావించితి నిర్జరారాతి
చక్రవర్తులరాజ్యచక్రము ల్దొరిపి, చక్రము ల్గొంటి రాక్షసచక్రవర్తి
శూలాయుధునిఁ గిట్టి శూరత మెఱసి, మూలకుఁబొనుపవా ముక్కంటి యనక
వాసవు నన్నాకవాసులతోడ, వాసిదప్పింపవా వాసికి నెక్కి
వేఁడికిఁ బలుమాఱు వేఁడిమిఁ జూపి, వేఁడిమిఁ బాపవా వేఁడికోననలు
బలియునిఁ గోణాధిపతిదైత్యనాథు, నలిగి మర్దింపవా యధికశౌర్యమున
నిలిచినచోటను నిలువంగనీక, పలుమాఱుఁ దూలవా పవనునిదూత
మనుజుఁ డాతఁడు నీపు మనుజాశనుఁడవు, మనుజుండు నీచేత మనుచేల కలుగు
విశ్వరుఁగూర్చి మహేశ్వరక్రతువు, శాశ్వతకీర్తిమై సలిపె నీసుతుఁడు
సాంద్రానుమోదియై సఫలత నొంది, యింద్రుని భంజింప నింద్రజిత్తయ్యె
నాయింద్ర జెఱఁబెట్ట నజుఁడు వేఁడుటయు, నాయజునకు విడ్వఁ డాయింద్రజిత్తు
ఆతఁడు చాలఁడే యాలంబు గెలువ, దైతేయకులనాథ తగదు చింతింప
అని మంత్రులాడుచో నధికదర్పమున, ఘనమైనలాపులు గలదైత్యవరులు

రాక్షసాధిపులు రావణునితో ప్రతాపము చెల్పుట.

ప్రళయకాలాంతకబలులైనవారు, సులభశౌర్యుఁడు ప్రహస్తుఁడు నింద్రజిత్తు
శతమాయుఁడును బలశాలి దుర్ముఖుఁడు, అతికాయుఁడును మకరాక్షుఁడు ఖడ్గ
రోముండు వృశ్చికరోముండు సర్ప,రోముండు మఱియు విరూపాక్షకుండు
అక్షీణబలుఁడు ధూమ్రాక్షుఁడన్వాఁడు, అక్షతోన్నతుఁడు యూపాక్షుఁడన్వాఁడు
రమణీయబలశాలి రశ్మికేతుండు, అమితవిక్రమపూర్ణుఁ డగ్నివర్ణుండు
వజ్రదంష్ట్రుండును వజ్రకేతుండు, వజ్రదేహుఁడు బలవంతుఁడైనట్టి
సుప్తఘ్నుఁడగు మఱి శోణితాక్షుండు, ప్రాప్తశౌర్యుఁడు మహాపార్శ్వుఁ డన్వాఁడు
ఒనర కుంభుఁడు నికుంభుఁడు సూర్యనేత్రుఁడును నగ్నికోపనుఁడును మహోదరుఁడు
దివ్యుల గెలిచిన దేవాంతకుండు, నవ్యవిక్రమశాలి యానరాంతకుఁడు
కడునుగ్రుఁ డగుమహాకాయుఁడన్వాఁడు,నడరి విద్యుజ్జిహ్వుఁ డనువాఁడు మఱియుఁ
గంపనుఁడును మహాఘనుఁ డకంపనుఁడు, పెంపారుచున్న యభేద్యవిక్రముఁడు
నాదిగాఁగలుగుమహాదైత్యవరులు, నాదైత్యవల్లభు నగ్రభాగమునఁ

గన్నులఁ గోపంబు గడలుకొనంగ, మిన్నులు ముట్టంగ మీఁజే పల్కుచును
బ్రళయావసరమహాపవననిర్ధూత, కులపర్వతములనఁ గుంభిని యదర
నొండొరుఁ జూచుచు నుద్దండవృత్తి, నొండొరు మెచ్చుక యుగ్రత మెఱసి
యూర్పులు నిగుడ నత్యుగ్రతమ్రగ్గు, సర్పంబులును బోలె సరభసవృత్తి
శూలంబు లంకించి సురియలు బిగిచి, వాలము ల్జళిపించి వరతనుత్రాణ
సబళంబు లమరించి చక్రము ల్ద్రిప్పి, ప్రబలంబులగు భిండివాలము ల్దిగిచి
పట్టసం బెసఁగించి ప్రాసము ల్ద్రిప్పి, గట్టివిండ్లును గుణకంపము ల్సేసి
యుడుగక యెలుగు లొండొంటితో రాయ, మిడుగురు ల్మంటలు మిక్కుటంబుగను
బండొరువిపులకేయూరంబు లొరయ, నొండొరుమకుటంబు లుగ్రతరాల
భాసురమాత్రికప్రకరము ల్చెదర, రాసినవహేమరజములు దొఱుగ
సందడింపుచు మహాసంరంభ మెసఁగ, బృందారకారితోఁ బోర్చి యిట్లనిరి
దేవగంధర్వ దైతేయకిన్నరులు, దేవ నిఁజూడ భీతిల్లుదు రనిన
నరు లెంతవారు వానరు లెంతవారు, సురవైరి నినుఁ జూచి స్రుక్కక నిలువ
నేము నాడొఁకకొంత యేమఱియుండ, నామర్కటాధముఁ డడ్డ్లెగెఁగాక
యింక మాముందఱ నీలంకఁ జొచ్చి, శంకింప కెవ్వరు చనఁగలవారు
వానరు లనియెడి వార్తలేకుండఁ, బూని నిర్జించి యిమ్ముల మహీధవులఁ
జంపి యే తెంతుము చయ్యన మమ్ముఁ, బంపు దానవనాథ పలుకు లింకేల
యని గర్వదుర్వారు లైపల్కుచున్న, దనుజుల నందఱఁ దప్పక చూచి
యురవడింపకుఁడు యోహో మానుమానుఁ,డరసి కార్యము చూత మని విభీషణుఁడు
చిత్తంబులోనఁ జేర్చినయింద్రియముల, నొత్తి యడంచిన యోగియుఁ బోలె
బరఁగ గర్జించు నుత్పాతమేఘముల, నిరుపునఁబెట్టిన యింద్రునిభంగి
ననువొంద నెప్పటియట్లకూర్చుండఁ, బనిచి కార్యముమ్రుట్టఁ బలికె వారలకుఁ
బెనుపొందఁగా సామభేదదానములఁ, గొనరానికార్యంబు గొనకొనెనేని
మఱిగదాదండంబు మాయలఁ బెనచి, నెఱిపుట మున్నె దుర్నీతి యేమిటికి
నెనయంగ శాత్రవుఁ డేమఱియుండ, మనకిఁక నేమఱి మనుటకుఁ దోఁచు
నాతల కొకశత్రుఁ డతనిపై విడియ, నే తెఱంగున నేన నెత్తిపోఁజనును
దానిపై నతనికి దైవశక్తియును, హీనమైయున్న నీయింతయుఁ దగును
యెన్నఁడు నేమఱుఁ డెదురెందు లేదు, మున్నె దైవంబు రాముఁడుగాఁడె మఱియు
హరువిల్లువిఱిచిన యట్టిసాహసుఁడు, పరమవివేకి దోర్బలజయాధికుఁడు
మీచేత సాధ్యుఁడే మిహిరకులేశుఁ, డేచి మీరతనిపై నెన్నియాడినను
గడలేని యీవార్ధి కాలువకరణి, వడి దాఁటిరాఁడె యీవాయునందనుఁడు
వచ్చి యీలంకలో వలసినమాడ్కి, నచ్చెరువంది మీ రందఱుఁ జూడ
నేమేమిచేసెనో యెఱుఁగరా మీరు, రామునివింటిశౌరత్వంబు చూప
నతఁ డొక్క వానరుఁడా యెన్నిచూడ, నతనికి నెక్కు డైనట్టివానరులు
నావానరుల కెక్కు డైనవానరులు, భావింపఁగా లెక్క పరఁగంగరాదు

మీరు రాఘవుని నెమ్మెయి నోర్చువారు, వారనికోపంబు వలననేపారి
యెదిరిని దన్నును నెఱుఁగక పలుకు, టిది వివేక మె దానవేశ్వరులార
రామలలో నభిరామ యాసీత, రామునిదేవి నరణ్యమధ్యమున
భయమున రామునిఁ బలుమాఱుఁ జీర, రయమునఁ దెచ్చె నీరాక్షసేశ్వరుఁడు
మదిలోనఁ దలపోయ మనకీడెకాక, యితనికిఁ జేసిన యొగ్గేమి యతఁడు
ఖరదూషణాదుల కడిఖండములుగ, ధరణిపైఁ గూల్చెఁ గదాయని మీరు
తలఁచెద రతనిపై దైత్యులపోక, తలఁపుచు వారిపై దాడిపోదగునె
తమనేరముల వారు ధరణిపైఁగూలి, యమరలోకము కేగి రదిచెప్పనేల
మేటివానరు లిట మీఱుకమున్నె, కోటలు వారిచేఁ గూలకమున్నె
సౌమిత్రిబాణవర్షము రాకమున్నె, రామునికోపాగ్ని రాఁజకమున్నె
యాయగ్నిచే లంక యడఁగకమున్నె, యీయసురావళి యీల్గకమున్నె
సీతఁ బుచ్చుఁడు వేగ శ్రీరాముకడకు, సీతఁ దెచ్చినకీడు చేఁజేతఁ గుడుపు
ధర్తాత్తుఁడౌ రామధరణీశ్వరుండు, ధర్మంబువలననే తగనుండు జయము
అని పెక్కుభంగుల నావిభీషణుఁడు, దనుజవీరులఁ బల్కి దశకంఠుఁ జూచి
తలపోయ సుఖమును ధర్మంబుఁ జెఱుప, వలతియై పరఁగు దుర్వ్యసనంబు విడుపు
సుఖము కీర్తిని జేయు సురుచిరధర్మ, మఖిలనీతిజ్ఞుఁడ వగుచుఁ గైకొనుము
చలము మానుము సుప్రసన్నుండ వగుము, కులమెల్ల రక్షించుకొనఁ జూచితేని
జనకజ విడువుమా జననాథుతోడ, మనకేల వైరంబు మదిమదినుండి
యని విన్నవించిన నతనివాక్యములు, విన బుద్ధిపుట్టక వెసఁ గొల్వు విడిచి

విభీషణుఁడు రావణునియొద్దకుఁ బోవుట.

రావణుఁ డంతఁగిపురంబున కరిగె, నావిభీషణుఁ డంత నామఱునాఁడు
ప్రథమసంధ్యావిధు ల్వరిపాటిఁ దీర్చి, రథమెక్కి నల్దడ రాక్షసుల్ గొలువ
రమణీయచిత్రతోరణరాజవీధి, కమనీయశిల్పము ల్గనుఁగొంచు వచ్చి
పటుహేషితంబులు పటుబృంహితములు, పటహశంఖాదుల బహునినాదములు
సేవాగతాంగనాశింజితంబులును, సావాసు లడరించు చండహుంకృతులు
సూతమాగధవందిశుభకీర్తనములు, నాతతభటసంకులాలాపములును
మాతంగనిశ్వాసమారుతోద్ధూత, కేతనాంశుకపటాత్కృతులోలిఁ జెరయ
బధిరదిగ్భాగమై బహుళోర్మిజలధి, విధమున మ్రోయంగ విశ్వాసమొదవ
రాక్షసవీరులరక్షచే నమరి, నక్షత్రపరివృతనవసౌధ మనఁగఁ
డెఱుపిలే కిభములు తేరులు హరులు, గిరికొన్న నగరివాకిటఁ దేరు డిగ్గి
ఆజ్యపాత్రాదుల నర్పితు లగుచుఁ, బూజ్యగుణంబుల భూసురోత్తములు
పుణ్యాహవాచనపూర్వకంబైన, పుణ్యశాంతులునేయఁ బోరిఁ గన్గొనుచు
మనసింపనాస్థానమంటపంబునకుఁ, జనుదెంచి యన్నకు సద్భక్తి మ్రొక్కి
యలమి నాతఁడు చూప నర్హపీఠమున, నెలమితోఁ గూర్చుండి యేకాంత మెఱిఁగి
మంత్రులసన్నిధి మహనీయమంత్ర,తంత్రజ్ఞుఁ డనియె నాదశకంఠుతోడ

అవధరింపుము దేవ యసురాధినాథ, యవనిజఁ దెచ్చినయంతనుండియును
దుర్నిమి త్తంబులు తోఁచుచున్న వియు, నిర్ణయింపఁగరాదు నిక్కువం బరయ
హోమగుండంబుల నున్నత్రేతాగ్ను, లేమియు వెలుఁగ వీయీదివసముల
నాగుండములఁ జొచ్చి యలమిఁ జుట్టియును, సాగిలబడియుండు సర్పములెక్కు-
నుడుగనిమదముల నొలయుతుమ్మెదలు, కడునొప్పు నమ్మదకరులెల్ల నిపుడు
కడుమేనుడిల్ల మైకంబులతోడ, మెడలెత్తుకొని స్రుక్కి మెదలకున్న వియు
నున్నతస్థితిగల నుత్తమాశ్వములఁ, గన్నులనీళ్లును గాఱుచున్న వియుఁ
గవణంబు నీరును గడ్డియు నుడిగి, జవసత్త్వములు దూల సడలియున్న వియు
వానితోఁకలయందు వడినగ్నిశిఖలు, మానుగా నలుగుల మంటలు వెడలు
నరదాలపై నగ్ను లట రాలుచుండుఁ, బొరిపొరియుల్కము ల్బ్బవి బడఁ దొణఁగె
జడిగొని వీరమ స్తములవాయసము, లడరుచుఁ బురములో నాడంగఁ దొణఁగె
ఖ్యాతిగా శిఖలతోఁ గడఁగి కూపముల, భాతిగా మండూకపతు లుద్భవించె
దేవగేహాముల భూదేవగేహాముల, భావింప శిథిలాధిపబ్బుఁలు పుట్టె
ఇంద్రధనుస్సులు నిట రాత్రులందుఁ, జంద్రథారికైన జయము లేదండ్రు
వూని చూడఁగ శుభంబులుగావు మనకు, వీని విచారించి విగ్రహం బుడుగు
మటుఁగాన నిన్నిటి కసురాధినాథ, శతమేల వినుమొక్క శాంతి చెప్పెదను
శ్రీరామునకు నిమ్ము సీతఁ గొంపోయి, నేరమిఁ బట్టఁడా నృపకుంజరుండు
ఎందు నీతిజ్ఞుల కిది లెస్సకార్య, మిందఱు నెఱుఁగరా యిది బుద్ధి యనుట
దనుజేశ నీచిత్తధర్మంబు నూఁది, వినుమని చెప్పంగ వెఱతురుగాక
నాకుఁ బోరాదు దానవనాథ గాన, నీకుఁ జెప్పితి నిట్లు నీతిమార్గంబు
అని బుద్ధిచెప్పిన నవ్విభీషణుని, వినుతవాక్యంబులు వీనులఁజొరక
నెవ్వరిదిక్కున నేభయం బెఱుఁగ, నెవ్విధంబున సీత నేను రామునకు
దుర్జయుం డగునాకు దురములో నెదిరి, నిర్జరుల్తోడైన నిలుచునే యనుచుఁ
గోపంబు దీపింపఁ గొలువెల్ల విరిసి, వేపోయె దానవవిభుఁడు లోపలికి
మఱునాఁడు లేచి క్రమ్మఱ రావణుండు, మఱువక సంధ్యాసమాధులు దీర్చి
యనుజునివచనంబు లాత్మఁ జింతించి, తనప్రధానులు దాను దలపోయఁ దలఁచి
భానుమండలసమప్రభగలయట్టి, మానైనదివ్యవిమానంబు నెక్కి
కమనీయబహురత్నకలితంబులగుచుఁ, గొమరారఁగాఁ బైడికుంభముల్ మెఱయ
వెన్నెలచూలన విరచించినట్టి, యున్నతచ్ఛత్రంబు లొప్పారుచుండఁ
గంకణఝణఝణాత్కారము లెసఱు, నంకించి చామర లతివలు వీవఁ
బెక్కుతూర్యంబులు పెల్లుగా మ్రోయఁ, బెక్కండ్రు సుభటులు పెంపారి కొల్వ
వందిమాగధులు నై వారంబునేయ, సందడిజడియ నైశ్వర్యంబు మిగులఁ
జనుదెంచి బహుమంత్రిసహితంబుగాఁగ, మనుజాశనుడు సభామంటపంబునకు
నర్కవంశునిశిరాహతిఁ దెగి పిడప, నర్కబింబముఁ జొత్తు నని తెల్పుకరణిఁ
జొచ్చి సింహాసనస్థుండునై పిలువఁ, బుచ్చె నాయకుల నప్పుడు పడవాళ్లఁ

వారును దమరథావళులపై నెక్కి, వారణంబుల నెక్కి వాజుల నెక్కి
చారుచామీకరచ్ఛత్రంబు లొప్ప, వారక భీషణాకారంబు లొప్ప
తమతమతూర్యనాదములతో వచ్చి, క్రమమున మంటపాంగణములయందుఁ
దమవాహములు డిగ్గి తనరుసింహాములు, కొమరారగా గిరిగుహాఁ జొచ్చుకరణి
నామంటపముఁ జొచ్చి యాదానవేంద్రు, చే మన్ననలు గాంచి చిత్తంబు లలర
నుచితాసనంబుల నుండిపఁడాలు, రుచితంబు లెఱిఁగింప నుత్తమం బనుచు
దేవ నేఁడెంతయుఁ దెలిసియున్నాఁడు, దేవరతమ్ముఁ డుద్దీపితబలుఁడు
ఘనుఁడగు నాకుంభకర్ణుండు నాఁగ, విని పిల్వఁ డనవుడు వేగ వారేగి
దేవారి సభకు నేతెంచి కొల్వుండి, దేవ నిన్బిలువఁ బుత్తెంచె నావుడును
కొడుకులు కుంభనికుంభులు గొలువఁ, గడువేగమునఁ గుంభకర్ణుఁ డేతెంచి
మణిమయంబై దివ్యమహిమలు గలిగి, గణికాసమూహంబు గాననాదముల
నెంతయు నింపార నెసఁగినమంట, పాంతరంబునను సింహాసనస్థలిని
నున్న యన్నకు మ్రొక్కి యొగిఁ గొల్వుఁజొచ్చి, యున్న తాసనమున నున్న యావేళ
నన్నతోడనె వచ్చి యావిభీషణుఁడు, క్రన్ననఁ గూర్చుండెఁ గనకపీఠమున
నప్పు డారావణుం డమరవల్లభుని, యొప్పెల్లఁ గైకొని యుండి ప్రహస్తుఁ
గనుఁగొని పలికె లంకాపురంబునకుఁ, బనుగొనఁ బెట్టుము బలువైనకాపు
మతి నేమఱకు మెల్లమార్గంబులందుఁ, బ్రతిదివసంబులోపలను వేల్పులను
నని దానవాధీశుఁ డాకుంభకర్ణుఁ, గనుఁగొని పల్కె నుత్కంఠ దీపింప

రావణుఁడు కుంభకర్ణునితో రామునిరాక యెఱిఁగించుట.

విను కుంభకర్ణ నీవిన నిది యొకటి, జనపదంబునకేగి చయ్యన నేను
రామునిదేవి ధరాసుత సీతఁ, గామించి తెచ్చితిఁ గంజదళాక్షి
మఱిమొన్న నొకహనుమంతుఁడర్ధకోతి, పఱతెంచి సీతకుఁ బరిణామ మొసఁగి
దేవి నీపతి రామదేవుండు వచ్చు, నావిని మదిలోన నమ్మి మోదమున
నున్నది యాసీత యుద్దండవృత్తి, నన్నరుండును నబ్ధి కవ్వల విడిసె
వనములలోఁగల వనచరావలిని, బెనుమూఁకగాఁ గూడఁ బెట్టుకేతెంచె
సురనాథసురలను స్రుక్కించినాఁడ, హరుఁడున్న కైలాస మగలించినాఁడ
శంభుచేఁ జంద్రహాసము గొన్న వాఁడ, నంభోజభవు వరం బడిగికొన్నాఁడ
దానిపై నీలావు తవిలియున్నాఁడ, మానవుండే నన్ను మర్దించువాఁడు
రాముఁ డెన్నఁడు గెల్చు రణభూమి నన్నుఁ, గోమలి నెన్నఁడు గొనిపోవు నతఁడ
అనవుడుఁ గోపించి యాకుంభకర్ణుఁ, డనియె రావణుతోడ నందఱు వినఁగ
రాము వంచించి యారామునిదేవి, నేమఱియుండంగ నెత్తి యుద్వృత్తిఁ
దెత్తురే యిటులేల తెచ్చితి కడఁగి, చిత్తంబులో నీతి చింతింపవైతి
ధర్మమార్గము నీవు దలపోయవైతి, వర్మిలి కులమెల్ల నడఁగఁజేసితివి
సీతఁ దెచ్చినయట్టి చెడియె నీలంక, నీతెఱంగునవైన నిదియ నిశ్చయము
ఎట్టిననేమి యీ యినకులేశ్వరుని, నెట్టనశరములు నెఱిగాడకుండ

బ్రతికివచ్చితి నీదుభాగ్యంబుకతన, నిదిమేలు కీడని యెన్నంగ నేల
పోవచ్చునా యింకఁ బూనుదుగాక, రావణ యింతకార్యము చక్కఁబెట్ట
నామీఁదఁబడియె వానరుల రాఘవుల, నేమియుఁ దలఁపక యింక సుఖంపు
మని పల్కుచుండ మహాపార్శ్వ డనియె, ఘనభుజ యెల్లలోకములకు నీవ
పతివఁట యాసీత బలువునఁ బట్టి, రతిసల్పనేరవా రాక్షసాధీశ
యనవుడుఁ జిత్తంబునందు మోదించి, దనుజాధినాథుఁ డాతనిఁ జూచి పలికె
విను మహాపార్శ్వ యే వేధ కొల్వునకుఁ, జనుచోటఁ బుంజికస్థల యనునాతి
వలువూడిపడఁ బట్టి వడఁ గుదియించి, బలిమి భోగించితి నైఁబడి తొల్లి
యా మేరలెల్లను నబ్జజుం డెఱిఁగి, నామీఁదఁ గోపించి నయమింతలేక
యోరిరాక్షస కడు నుచితంబుదప్ప, నారీజనమునెడ నయమింతలేక
బలిమి నెవ్వతెనైనఁ బట్టి భోగింపఁ, దలఁతు వెప్పుడు నీదు తలలప్పు డవిసి
వారక యిలనూఁ బ్రయ్యలై రాలు, పోరోరి యనుచు శపియించి విడిచె
నదికారణంబుగా నంగనాజనుల, హృదయంబె కదియక యేనెందుఁ గదియ
నాలావుగొనక వానరులతోఁగూడి, యీలంకపై రాముఁ డిటవచ్చుఁ బొల్లి
నిద్రించుసింహంబు నిరిమేలుకొల్పు, భద్రదంతావళప్రతతివిధంబు
అని పల్కుటయు నవ్వి యవ్విభీషణుఁడు, దనుజనాథునితోడఁ దగవిన్నవించె
మొనయు నిట్టూర్పులె మ్రోఁగుటగాఁగ, ఘనమైనచింతయె గరళంబుగాఁగఁ
గోపంబు చలమును గోఁపులు గాఁగ, నేపరియుండుఁ బో యెరగొంటకాఁగ
నమరంగఁ జెక్కున హత్తినచేయి, కమనీయతరఫణాకారంబుగాఁగ
నిజనఖంబులు మణినికరంబుగాఁగ, భుజయుగమధ్యంబు భోగంబుగాఁగ
దారుణంబైన సీతాకాలసర్ప, మేరూపమునైన నేలపోనిచ్చు
నపకీర్తియటఁ పాపమటఁ సుఖంబునకు, విపరీతమటఁ యిట్టివిత మేల యుడుగు
మని యన్నతోఁ బల్కి యంతటఁబోక, సునిశితమతిఁ బ్రహస్తునిఁ జూచి పలికె
నెఱిపిడుగులఁబోలు నృపునిబాణములు, గఱులాని నీదువక్షముగాడునాఁడు
ఎఱిఁగెదు గాకేల యిట్టట్టుపడెదు, కఱకులాడెడుమాడ్కి గాదుమీఁదటను
ఈకుంభకిర్ణుండు నీనికుంభుండు, నీకుంభుఁడును మఱి నీమహోదరుఁడు
నీమహాపార్శ్వుండు నీయింద్రజిత్తు, రాముని గెల్చువా రారణంబునను
ఏపుచూపక యప్పు డెందుఁబోయెదరు, ప్రాపులై మీరడ్డపడెదరుగాక
కడఁగి యింద్రుఁడు వచ్చి కాచిననైన, గడునడ్డపడి సుర ల్గాచిననైన
కాలాగ్నిరుద్రుండు గాచిననైన, గాలమృత్యువు వచ్చి కాచిననైన
రావణుఁ జంపకా రామభూపాలుఁ, డేవిధంబునననైన నేల పోనిచ్చు
దనుజేశుఁ నై విల్లు ధరియించునపుడు, మనచేతఁబోవునే మనుకులేశ్వరుఁడు
పిడికిట నడఁగునే వేర్చుకాలాగ్ని, పుడిసిట నడఁగునే పొంగారుజలధి
పట్టంగ నలవియే పాతాళతలము, గట్టింప నలవియే గగనభాగంబు
తెంపంగవచ్చునే దిగ్వితానంబు, త్రుంపంగవచ్చునే ధూర్జటివాలు

నఱచేత నడఁచిన నడగునే సూర్యుఁడు, డెఱుఁగని మీతోడ నిట్లాడనేల
కడుమూర్ఖు నాకారికామాతురుండు, మడియఁడె మీయట్టి మంత్రులు గలుగ
నాబుద్ధి వినునె యీనాకేళ వైరి, మీబుద్ధిఁ జెడుగాక మిక్కిలి క్రొవ్వి
యని మొగమోడకయాడఁ బ్రహస్తుఁడు, డనువాఁడు నైకొన కావిభీషణుని
నురగులతోఁబోరి యోడ మెన్నడును, సురలతోఁ బోరాడి స్రుక్కఁ మెన్నడును
యక్షులతో గిట్టి యలయ మెన్నఁడును, రాక్షసావళిచేతఁ గ్రాగ మెన్నఁడును
నరుఁడైన యారామనరనాయకునకు, దురములో నేమోడుదుమె విభీషణుఁడ
యేచందమున వారి నెఱుఁగుదోకాని, నీచేత వింటిమి నేఁడింత వింత

ఇంద్రజిత్తు విభీషణునికి తనలా వెఱఁగించుట.

దనుజులలావంత తక్కువే యనినఁ, జనియె నాగ్రహమెత్తి జంభారిజిత్తు
తోరమైవేర్చిన దుర్మదగ్రంథి, యారామతమ్ము శరాగ్ని చేఁగాలఁ
గారణం బటమీఁదఁ గలుగుటఁజేసి, యేరూపమున నీతి నిచ్చలో నిడక
విను విభీషణ నీవు వెఱచెదుగాక, మనయందు రాక్షసమహిమ లూహింప
హీనుఁడైనను నోపు నింతటిపనికి, మానక రామలక్ష్మణుల మర్దింప
మూఁడులోకములు నిమ్ముల నేలువానిఁ, వాఁడివజ్రముగల వాసవుఁబట్టి
చెఱఁబెట్టినా వాని సితకరిఁబట్టి, విఱువ నాకొమ్ములు వింతయే నీకు
ననలు గాఱించి యయ్యంతకు నొంచిఁ, దనుజుఁ దూలించి యాతఱి పాశి నొడిచి
గాలిఁ దూలించి యక్షుని మర్దించి, శూలి నోడించి నిష్ఠురతఁ వాటించి
యేచిన నాచేత నీనరుల్చావ,రా చెప్పె దుబ్బి వారలఁ బెద్దచేసి
కలఁతునా సప్తసాగరములు సొచ్చి, మలపుదునా మేరుమందరంబులను
దాఁటుదునా ధరాతలమెల్లగడవ, మీటుదునా నేలమింటితో నంటి
వంతునా జగములు వనచరకోటి, నుంతునా బెగడొంద మున్నీటిలోనఁ
బుడమిమోచిననాగపుంగవుఁ బట్టి, పిడుతునా విషమెల్లఁ బిచ్చిలివోవ
నొక్కఁట దుండంబు లొడిసిరాఁదిగిచి, దిక్కరీంద్రుల నీడ్చి తెత్తునా భూని
భూమితో నిప్పుడు భుజశక్తి మెఱసి, ప్రాముదునా చంద్రభానుబింబముల
వనచరకోటుల వైతునా పట్టి, దినకరబింబంబు దిక్కులు గడవ
నాలంబులో వానరాలిరక్తములు, గ్రోలింతునా భూతకోటులచేతఁ
గప్పుదునా యంపగములచే మిన్ను, నిప్పుడమియు దిక్కులన్నియుఁగూడఁ
గడునొగల్కలములఁ గబళించి త్రిప్పి, యడఁతునా నేలతో నర్కునిరథము
పెడచేతలోచేతఁ బృథివియు మిన్ను, నడఁతునా పొడిపొడి యై రాలిపోవ
దనుజాధినాథుని తమ్ముఁడవగుట, నిన్ను నొండనక మన్నించితిఁ గాక
యెరుఁడైన సైఁతునే యూరకయుండు, వెరవిడిమాటలు వేయాడనేల
ననవుడుఁ గోపించి యావిభీషణుఁడు, గనుఁగొని పలికె నుద్ధాఢవాక్యముల
నెవ్వనిగాఁ జూచి తినకులేశ్వరునిఁ, గ్రొవ్వులు పలికె దీకొలువులోపలను
గణుతింప నింద్రుండు గాఁడు నీకోడ, రణభీషణుండగు రాముండుగాని

గణుతింప ననలుండు గాఁడు నీకోడ, రణభీకరుండగు రాముండుగాని
గణుతింపఁ గాలుండు గాఁడు నీకోడ, రణమహోగ్రుండగు రాముండుగాని
గణుతింప నిర్ఋతి గాఁడు నీకోడ, రణవిశారదుఁడగు రాముండుగాని
గణుతింప వరుణుండు గాఁడు నీకోడ, రణజయోన్నతుఁడగు రాముండుగాని
గణుతింప ననిలుండు గాఁడు నీకోడ, రణనిపుణుండగు రాముండుగాని
గణుతింప ధనదుండు గాఁడు నీకోడ, రణకౌశలుండగు రాముండుగాని
గణుతింపఁ బశుపతి గాఁడు నీకోడ, రణవిచక్షణుఁడగు రాముండుగాని
వారి కోర్చినరీతి వచ్చునే యోర్వ, నారామవిభునకు నాలంబులోనఁ
దలముకప్పినయట్టి తలఁపులు దలఁచి, తలక్రిందువడియెదు తద్దయుఁ గ్రొవ్వి
కులనాపకుండవు కొడుకవా నీవు, వలయురావణు పగవాఁడవుగాక
పావకనిభరామబాణఘట్టనకు, రావణుండే యోర్చు రణములో నిలిచి
యీ రావణుఁడు తనహితులతోఁగూడ, నారామభూపాలు నడుగుల కెరఁగి
మణులతో వారణమణులతోఁ దురగ, మణులతో మానినీమణి నిచ్చుటొప్పు
ననవుడు రావణుం డావిభీషణుని, దనరోషదృష్టులఁ దప్పక చూచి
పగవానితోనైనఁ బాయక కూడి, మిగిలినయేపుతో మెలఁగంగవచ్చుఁ
బటువిషం బొలికెడుపాముతోనైనఁ, జటులనిర్భరవృత్తిఁ జరియింపవచ్చుఁ
దనవానివలెనుండి దాయలఁ గూడి, మనువానితోఁగూడి మనరాదుకాక
వారక నీ వట్టివాఁడవుగాన, వైరుల నాయొద్ద వర్ణించె దుబ్బి
తమ్ముఁడవని చంపఁ దగదుకా కీవు, తమ్ముఁడవా పగదాయవు కాక
యనవుఁడు బ్రహ్మశాపాతిశయంబు, గొనకొనుట యెఱిఁగి కుంభకర్ణుండు
తమ్మునిమాటలు తగవనలేక, యెమ్ములాడెడినన్న నెట్టనరాక
యగ్గౌరవముతోడ నన్నకు మ్రొక్కి, దిగ్గున గుహకు నిద్రింపంగఁ జనియెఁ
జనినపిమ్మట విభీషణుఁడు రావణుని, కనియెఁ జిత్తంబున నలుక రెట్టింప
నన్నవుగాన నీ యాపదకులికి, యిన్నియుఁ జెప్పితి హితవని నీకుఁ
బొసఁగదు బహుముఖంబులు గాన నీకు, ననుచేశ చెప్పిన యాప్తులబుద్ధి
హితవుచెప్పెడిమంత్రు లెందును గలరు, హితవని వినురాజు లెందు గల్గుదురు
తగు నాకుఁ జెప్పుట తగు నీకు వినుట, తగసీత నిచ్చుట తగు నీతి నీకు
బలమెంతగలిగినఁ బరికించిచూడ, నలవెంతగలిగిన నదియేమిసేయుఁ
బురుషునివెరవునఁ బోనీకపేర్చి, పరికింప దైవంబు ప్రతికూలమైన
దైవంబనానొండు దైవంబు గలదె, దైవంబు దశరథతనయుండు గాక
యని విభీషణుఁడాడ నారావణుండు, విని బొమల్ ముడివడ వికృతాస్యుఁడగుచు
మిన్నందఁ గోపించి మీసంబు లదర, గన్నుల మంటలు గ్రమ్మ నిట్లనియె
నెన్నెదు రాముని నిటు దైవమనుచు, నన్నరుఁడే దైవ మయ్యెడునేని
వెడగయి తండ్రిచే వెడలంగనోటు, వడి యడవుల నేల పడి మ్రగ్గి స్రుక్కి-
విను మాకు నలమును వేరువెల్లంకి, దినియెడివానినే దేవర యండ్రు

నను దాకవలదె క్రన్నన నెదిరించి, తనదేవిఁ గొనిరాఁగ దైవంబయేని
నలసి తమ్ముఁడు దాను నడవులలోనఁ, బలవించి పలవించి పలుమాఱుఁ దిరిగి
వచ్చి సుగ్రీవు డన్వానరుమఱుఁగు, చొచ్చుట దైవంబుచొప్పులే తలఁపఁ
బలుమఱు నేటికా పందమానవునిఁ, జెలఁగి నాతో సరి చేసి చెప్పెదవు
అనిన రావణుతోడ ననియెఁ గ్రమ్మఱును, దనలోన నవ్వుచుఁ దగవిభీషణుఁడు
ఎసఁగి దివ్యులఁ జెంప ఋషుల రక్షింప, నసురుల శిక్షింప నవనిఁ బాలింప
నాదినారాయణుం డర్క–వంశమున, నాదశరథునకు నమర జన్మించె
వనజాసనాదులు వర్ణింపలేక, సనకాదులును గూడి చర్చింపలేక
ఆమహామహిమ నీకలవియే తెలియ, రాముఁడు మర్త్యుండె రాక్షసాధీశ
కాన రాముని గని కంజాస్య నిమ్ము, దానవేశ్వర మనఁ దలఁచెదవేని
యలుగక యర్ధకామంబులవలనఁ, దలఁ పగ్గలంబైన ధర్మ మెక్కఁడిది
నీవొల్ల వెన్నఁడు నీతిమార్గంబు, నీవారు నొల్లరు నీకంటె మున్న
కానఁ గార్యాకార్యగతి యిట్టిదనిన, దానవేశ్వర నీకు ధర్మంబు గలదె
వాతూలసుతుచేత వనముచెడ్డట్లు, సీతచే లంకయుఁ జెడఁగల దింక
వచ్చెద రగచరు ల్వారిధి దాఁటి, వచ్చి యీ రాక్షసవనితల నెల్ల
మోడ్చినకరముల ముందలల్వట్టి, యీడ్చెద రటువలె నీడ్వకమున్నె
యొప్పింపు మాసీత నుర్వీశ్వరునకుఁ, దప్పక చెప్పితి దానవాధీశ
మండెడినగ్ను లమాడ్కి రాఘవుని, దండిబాణంబు లుద్దండత వచ్చి
నీయొమ్ముకొనికాఁడ నేర్తునె చూడ, నీరాజ్యగతిచూడ నేర్తుఁగాకేను
ప్రళయానిలము ఘనపర్వతశిఖర,ములు ద్రోచుపగిది రాముఁడు భండనమున
నీతల లందంద నేలపైఁ గూల్ప, నేర్చును వీక్షింప నిర్జరారాతి
యనుడు విభీషణు నదరంటఁ జూచి, మునుకొని పదిమొగంబులు జేగురింపఁ

రావణుఁడు విభీషణుని దన్నుట.

గటము లుప్పొంగ నొక్కట నూర్పు లెసఁగఁ,బటుధూమములతోడి పావకుం డనఁగఁ
బదహతి మేదినీభాగంబు వగుల, నదలుపుబెట్టున నాకసమగల
నద్దిరా యితనికోపావేశ మనఁగ, గద్దియమీఁద డిగ్గన డిగ్గనురికి
యడిదంబు జళిపించి యటు వ్రేయఁ బూని, యడిగి విభీషణు నుగ్రతఁ దన్నెఁ
దన్నిన వజ్రంబు తాఁకునఁగూలు, నున్నతగిరివోలె నుర్వీపై బడియెఁ
బడినవెండియు వ్రేయఁబూఁబ్రహస్తు, డెడచొచ్చి వలదని యెడలించె వారు
కొలువెల్ల నాతని కోపంబుఁ జూచి, తలకొని యెంత వింతలు పుట్టె ననఁగ
ననలార్చునడుల నడర దైతేయుఁ, డనియె నిర్దయత ప్రహస్తునిఁ జూచి
వీనిదురుక్తులు వింటె ప్రహస్త, వీనినమ్మెడిది యెవ్విధి నమ్ముఁ డనుచు
వెడలంగఁ ద్రోయుము వేగంబె వీని, నెడచేసి మొగమోడితేని నాయాన
యనినఁ బ్రహస్తుండు నవ్విభీషణునిఁ, గనుఁగొని పలికె నాగ్రహవృత్తిదోఁప
వలదిట నీవుండవలసినయెడకు, వెలువడి యరుగు మివ్వీటికిఁ బాసి

యనిన విభీషణుం డతికోపుఁ డగుచు, ననలుండు నలుఁడును హరుఁడు సంపాతి
యనువారితోఁగూడి యసురేంద్రుతోడ, ననియె నుద్భటగదాహస్తుఁడై నిలిచి
మదనాతురుండవు మఱిపాపములకుఁ, గుమ్మరైనవాఁడవు క్రూరకర్ముఁడవు
మున్నెకదా నిన్ను మూఁగునిఁబాయ, నున్నాఁడ నిది క్రొత్తయును గాదు నాకు
నా ర్తరక్షకునిఁ గృపాంబుధి దివ్యమూ ర్తి జగద్ధితంబుగఁ బుట్టినట్టి
సత్యసంధుని రామజనపాలచంద్రు, నిత్యయశోనిధి నిర్మలాత్మకుని
శరణని పోయెద శరణన నతఁడు, కరుణతోఁ బ్రోచు నెక్కాలంబునందు
నేను పోయిననైన నిటమీఁద నెఱిఁగి, మానైన నీతితో మను దానవేంద్ర
యట్టునుగాదేని యగచరుల్లంకఁ, జుట్టిన యపుడైనఁ జొనుపు నాబుద్ధి
యట్టునుగాదేని యర్కవంశజుఁడు, దట్టించునపుడైనఁ దలఁపు నాబుద్ధి
నొండేనిరఘురాము నుగ్రబాణములు, దండించునపుడైనఁ దలఁపు నాబుద్ధి
నని పల్కి యన్నకు నవనతుం డగుచుఁ, దనతల్లినగరి కుద్ధతగతిఁ బోయి
చెలఁగినసింహంబుచేఁ బడి తప్పి, మలుగనివగతోడి మదకరివోలె
భీకరాకారసంస్థితుఁడై వచ్చి, చేకొని పిడుగడఁచినయద్రివోలెఁ
జని యటఁ గైలాస సదృశమైనట్టి, ఘనతరంబగు విశ్వకర్మచేనైన
గృహమున నుపవాసకృశమైనమేన, మహితశుక్లాంబరమానిత యగుచు
వెన్నెలరసమున విదళించి తివిచి, మిన్నేటినురువున మెఱుఁగిడ్డకరణి
నరసినబొమలును నరసినశిరము, గరమొప్పఁ బెద్దయు గౌరవం బొప్పఁ
బన్నుగా ముదుకకుప్పసములు, దొడిగి, చెన్నార బ్రద్దలు చేతులఁ బట్టి
ముదిసినవిప్రు లిమ్ముల నెందఱేని, వదలక చేరి సావాసులై కొలువఁ
గరుణాప్రవాహంబుగా వచోభంగి, సరళత్వమూర్తులచందంబుగాఁగఁ
బొలుపారుశమదమంబులు తటంబులుగ, గలసరులెల్లఁ జొక్కపు నుర్వుగాక
వెలసిన తనయొద్దివేదఘోషములు, సలలితం బగుచున్న జలఘోషములుగ
వినుతబహుద్విజవితతులు చెలఁగఁ, గనుపట్టుజాహ్నవి గంగనాఁబొప్పి
బహుపురాణంబులు బహువేదములును, బహుశాస్త్రములు పెక్కు బ్రహ్మరాక్షసులు
బహుభంగిఁ జదువంగ బహుభక్తి వినుచు, బహుళనిర్మలశుభప్రభఁ దేజరిల్ల
నుండియు రావణు నొప్పమిఁ దలఁచి, కొండంతవగపు చేకొనియున్నతల్లిఁ

తల్లియొద్దకు విభీషణుఁడు వచ్చుట.

గాంచి దండముపెట్టి కన్నుల నీరు, నించి దుఃఖితుఁడైన నివ్వెఱగంది
కైకేసి నందనుఁ గరములనెత్తి, కైకొని యక్కునఁ గదియంగఁ జేర్చి
లోపలియిండ్లు నాలోకింపరాని, యాపద ల్పుట్టెనో యటుకాక మఱేయ
బ్రాహ్మణవధయుఁ జొప్పడియెనో కాక, బ్రహ్మ కోపించెనో పరికించి చూడ
హరి యల్గెనో హరుఁ డల్గెనో రాముఁ, డరుదారఁ గ్రోధసమ్మర్దుఁడైనాఁడో
యిదియేమి నాపుత్ర యింతశోకింప, నిదియేమి తెఱఁగు నా కింతయుఁ దెల్పు
మడిగెద నదివిన్న యంతకు నాకు, నొడలిలోఁ బ్రాణంబు లుండవయ్యెఁజిని

అనిపల్కి తల్లికి నావిభీషణుఁడు, మునుకొని కరములు మొగిచి యిట్లనియె
నవధారు దేవి నీయగ్రనందనుఁడు, రవికులాధీశ్వరుశాకకు నేఁడు
మంత్రులు దానును మంత్రకూటమున, మంత్ర మిట్టిదియని మదిఁ జర్చనేయ
నిన్నివిచారంబు లేల రామునకు, నెన్నిభంగుల సీత నిచ్చుట లెస్స
యీకున్న రాఘవుం డీయబ్ధిఁ గట్టి, యీకులం బడపక నేల పోనిచ్చు
నని యొత్తిచెప్పిన నాపంక్తికంఠుఁ, డనలుండు మండిన యాకృతి మండి
తన్నె గద్దియతోడ ధరఁబడ నన్నుఁ, దన్ని యంతటఁ బోక తాలిమి దక్కి
యడిదంబు జళిపించి యటువ్రేయఁబూనఁ, జెడక నేబ్రతికి వచ్చితి నాకభంగిఁ
బోయెద నారామభూపాలుఁగానఁ, బోయి యాతనికృపఁ బొంది యుండెదను
ఈవీట నాకింక నెవ్వరుఁ గలరు, భావింపఁగా నాప్తబంధువు లొరులు
అనవుండు నతిభీత యై మూర్ఛ నొంది, ఘనమైన ధైర్యంబుకతమునఁ దెలిసి
కైకేసి నందనుఁ గనుఁగొని పలికె, నీకథ మున్ను నే నెఱిఁగినదాన
నది యెఱింగించెద నమరులు మునులు, త్రిదశేంద్రుఁడును బ్రహ్మదేవుఁడుగూడి
యమృతాబ్ధికడకేగి యచ్యుతుఁ గాంచి, తమపడునిడుములు తా మెఱింగింప
నీరసంబున మిమ్ము నేచుచునున్న, క్రూరుల రావణకుంభకర్ణులను
జంపుటకై యుర్వి జనియించువాఁడ, సొంపారవర్తించు సూర్యవంశమున
నని దేవుఁ డాడిన నావార్త నాకు, వినుపించె మాతండ్రి విశదంబుగాఁగ
విని యేను వెఱచి మద్విభున కిట్లంటి, నెనయంగ నీకులం బెవ్వఁడు నిలుపు
నీపుత్రకులలోన నిక్కంబు చెపుమ, ఆపుణ్యుఁ డెవ్వఁడో యనఘ నాకనిన
సత్యంబు ధర్మంబు శౌచంబు గలిగి, నిత్యయశోనిధి నీకడఁగొట్టు
కొడుకు రామునికృపఁ గోరి యీలంక, కడునొప్పఁ బాలింపఁగలవాఁడు మీఁద
ననిచెప్పి తపమున కరిగె మాతండ్రి, యెనర నమ్మేరునగోపాంత్యమునకుఁ
గాన నాతఁడు హరి కంజాప్తకులుఁడు, మానిని యాసీత మహనీయలక్ష్మి
విశ్రవసునిమాట వేఱొక్కటగునె, విశ్రుతకీర్తి యేవిధములనైనఁ
జనుము రామునిఁ గని శరణని మ్రొక్కి, మనుము రాక్షసకోటి మనుట చింతింపు
ఆయువును శ్రీయు నగుఁగాక నీకు, నాయన్న పొమ్ము శ్రీనరనాథుకడకు
నని యక్షతలుపెట్టి యర్మిలిఁ బేర్మి, తనయుని దీవించి తగ వీడుకొలుప
నతఁడును తల్లికి నవనతుం డగుచు, మతిలోనఁ బొంగుచు మంత్రులు దాను
రావణుతనువునఁ బ్రాణంబు లైదు, నీవిధంబునఁ బోవు నిఁక ననుమాడ్కి
వేగంబె యాకాశవీధికి నెగయ, నాగుణాఢ్యునిఁ జూచి యాలంకవారు
తమతమవీథులఁ దమదమలోగిళ్లఁ, గుమురులుగాఁ గూడుకొని పల్కి రపుడు
ధర్మంబు దిగనాడి తగఁ దమ్ముఁడనక, వేర్మివోఁ బల్కి విభీషణు విడిచె
నీలెఱుంగున నిపు డీరావణుండు, నీతియు ధర్మంబు నేర్పుఁ గోల్పోయెఁ
జెడియె గా కీలంక చెప్పనే లనుచు, నుడుగనివగలతో నుండెడువారు
ఈలంక యీతఁడె యేలుఁ బొమ్మనుచుఁ, బోలించి తమమనంబుల నెంచువారు

గోరి యీతఁడు రాముఁగూడుఁ గాకేమి, యీరావణుఁడు మ్రగ్గునే యనువారు
నరనాథుఁ డీతని నమ్మునే యచటి, కరిగిన ననివార లనుచు నుండఁగను

విభీషణశరణాగతి.

అంత విభీషణుఁ డాకాశవీధి, సంతసంబున మంత్రిజనులతో నెగసి
వచ్చుటఁ గనుఁగొని వనచరులెల్ల, నచ్చెరువడి చూచి రటు తలలెత్తి
యెత్తినరాముచే నింద్రారి యింక, నెత్తఁడు దలలుపేడెత్తుఁ దత్క్షణము
ఎత్తినభయమువో నిటసురలార, యెత్తుఁ డాత్మలతల లెత్తుఁ డన్నాడ్క
నప్పుడు సుగ్రీవుఁ డగచరాధిపులఁ, దప్పక వీక్షించి తగవారి కనియె
వనచరులార యీవచ్చు రాక్షసునిఁ, గనుఁగొనుం డదె వాఁడఖండవిక్రముఁడు
ఘనమైన పర్వతాకారంబువాఁడు, ధనురాదిశస్త్రముల్ దాల్చినవాఁడు
మిక్కిలి పొడవున మెఱసినవాఁడు, స్రుక్కక యిటకు వచ్చుచు నున్న వాఁడు
ననవుడుఁ గడఁగి యయ్యగచరాధిపులు, ఘనపర్వతములు వృక్షములు చేఁబట్ట
మముఁ బంపు సుగ్రీవ మముఁ బంపు దేవ, సమరంబులో దైత్యుఁ జంపెద మనఁగ
నావిభీషణుఁ డనె నగచరులార, మీవాఁడ నిటు సంభ్రమింపంగవలదు
రావణుతమ్ముఁడ రాక్షసేశ్వరుఁడ, భావింప నేను నిష్పాపమానసుఁడ
శరణని యారామజనపాలుఁగాన, నరుగు దెంచినవాఁడ నట లంకనుండి
రావణుతో నేను రామభూపాలు, దేవి నిమ్మని పెక్కు లెఱఁగుల నంటి
ననవుడు నామాట కతఁడు కోపించి, తనసభలోపలఁ దన్నె నన్నిట్టు
తన్ని యంతటఁ బోక తనవీటిలోన, నున్నఁ జంపుదునని యోటిలకాఁడె
నేనును వెలువడి యీరామచంద్రుఁ, గానంగవచ్చితిఁ గానఁ జింతింపఁ
గపటుండఁగాను నిష్కపటమానసుఁడఁ, గపులార నాయెడఁ గపటంబులేదు
సభయుండ నగునాకు సంప్రీతి వెలయ, నభయ మిప్పించుఁడీ యవనీశుచేత
ననవుడు సుగ్రీవుఁ డారాముకడకుఁ, జని విన్నపముచేసె సవినయుం డగుచు
రావణుతో నల్లి రాయిడి వుట్టి, దేవ వీఁడొక్కఁ డే తెంచియున్నాఁడు
మెత్తంబుతో నభంబున నున్న వాఁడు, చిత్తంబు మీదెసఁ జేర్చినవాఁడు
అమరారితమ్ముఁడ ననుచున్న వాఁడు, విమలవాక్యంబుల వెలసినవాఁడు
ఆదిత్యకులనాథ యభయమి మ్మనుచు, మోదవాక్యంబుల మొనసినవాఁడు
మీకృపకలిమి యెమ్మెయి నున్నయదియొ, నాకుఁ జూడఁగ వీని నమ్మంగరాదు
నరనాథ కపటంబునకుఁ బుట్టినిల్లు, లరయ రాక్షసులుగా కన్యులు గలరె
దనుజాధినాథునితమ్ముఁ డేమిటికిఁ, జనుదెంచు నీనీచుఁ జంపంగవలయు
ననవుడు నంతట నాంజనేయుండు, వినయసంభరితుఁడై విభున కిట్లనియె

రామునకు విభీషణునియోగ్యత నాంజనేయుం డెఱిఁగించుట.

దనుజాధినాథుఁ డుద్దండకోపమునఁ, దను సభలోపలఁ దన్నె నన్నాట
లఖలంబు నెఱుఁగంగ నాడె నీయసుర, నిఖలేశ యీమాట నిజముగానోపు
నుడుగక మనలక్ష్మి నుచితమాడుటయు, వెడలఁ ద్రోచినవాని విడిచివచ్చుటయుఁ

గలుగనోపునుగాని కపటంబుగాదు, వలవదు శంకింప వసుధేశ యితనిఁ
గపటమానసులెట్టి క్రమమునసున్నఁ, గపట మింతటిలోనఁ గానంగవచ్చు
నితనిమాటలలోన నేమాటయైనఁ, గృతకమై తోఁపదు కీడనరాదు
మనుజేశ దనుజులమర్మజ్ఞుఁ డితఁడు, మనదెస నుండుట మానైననీతి
నను రావణుఁడు పట్టి నాఁడు బంధించి, యెనలేనిబాధల నేచుటఁ జూచి
యితఁడు నాకై పెక్కుహితవులు పల్కె, నితనిచిత్తస్థితి నెఱుఁగుదుఁ గొంత
యనినమాటలు దనయాత్మకు నెక్కి, వనజాప్తసుతుఁ జూచి వసుధేశుఁ డనియె
నర్కజ దీన మే లౌటఁ గీడౌటఁ, దర్కించ నేటికి ధర్మంబుత్రోవ
శరణని వచ్చిన శత్రువునైనఁ, బరికింపఁగా రాచపాడి రక్షింప
నొకకపోతము డేగ యుద్ధతి తఱుమ, వికలభావంబున వేగంబె వచ్చి
శిబిమాటు సొచ్చెఁ బొంచినడేగ యడుగ, శిబి తనువిచ్చి చెచ్చెర గువ్వఁగాచె
నపకీర్తి బొందక నార్తుఁ జేకొన్న, కృప యశ్వమేధసత్క్రియఫలం బిచ్చు
నీవిభీషణుఁ డేల యేచినయట్టి, రావణుండైన గర్వము దక్కి వచ్చి
శరణన్నఁ గాతు నేచందంబునైన, మరియాద లిట్టివి మాకులంబునకు
నభయ మిచ్చితివేగ నర్కజ పోయి, సభయుని నవ్విభీషణుఁ దోడితెమ్ము
అనవుడు సుగ్రీవుఁ డారామకృపకుఁ, గనువ్రాల్చి యటు శిరఃకంపంబుఁ జేసి
పరికింప నీవేళఁ బగవానితమ్ముఁ, డరయంగ శరణన్న నలరి రక్షింప
నీకె కాకెందునే నృపులకుఁ జెల్లు, కాకుత్స్థతిలక నిక్కము ధాత్రిలోను
నని పల్కి సుగ్రీవుఁ డాకాశమునకుఁ, దననేనతో సముద్ధతగతి నెగసి
చేకొని యభయంబు శ్రీరాముఁ డిచ్చె, నీకు విభీషణ నిక్కంబు నమ్ము
రమ్మని కపిరాజు రాక్షసరాజు, నిమ్ములఁ గౌఁగిట నెనయంగఁజేర్చి
తోడ్కొని వచ్చి సంతోషంబు గృపయు, వేడ్కయు నొసఁగ నవ్విభుఁ గానుపించె
నిండ నానందించి నృపుఁ జూచి యభుడు, దండప్రణామము ల్దగఁజేసి పలికె

విభీషణుఁడు శ్రీరామచంద్రు నుతించుట.

నిత్యసత్యత్రాణ నిత్యకల్యాణ, నిత్యజగత్త్రాణ నిత్యగీర్వాణ
జగదన్వయాకార జగదేకవీర, జగదుదయాకార జగదబ్ధిపూర
సర్వసంగాతీత సర్వానుభూత, సర్వజగత్పూత సర్వసమేత
గురులఘుక్రమరూప గురుబోధదీప, గురుమధురాలాప గురుచారుచాప
పద్మసన్నిభనేత్ర బహుజీవసూత్ర, పద్మాకలితగాత్ర పరమపవిత్ర
కవిమనస్సంవేద్య కరుణాసవద్య, వివిధశాస్త్రపాద్య వేదాంతవేద్య
పరమాత్ముఁడవు నీవ పరమంబు నీవ, పరమవిద్యయు నీవ పరికింప నెందు
భువనకర్తవు నీవ భువనంబు నీవ, భువనహర్తవు నీవ భువనైకవీర
యాగభోక్తయు నీవ యాగంబు నీవ, యాగఫలప్రదుఁ డరయంగ నీవ
చంద్రార్కులును నీవ జలధులు నీవ, యింద్రాదులును నీవ యిలయును నీవ
శబ్దార్థములు నీవ శబ్దముల్ నీవ, శబ్దముల్ భేదించు శ్రవణముల్ నీవ

మూఁడుమూర్తులు నీవ మూఁడుమూర్తులకుఁ, బోడిమి నవ్వలిపాడవును నీవ
ఱురమును నీవ యఱురమును నీవ, ఱురసాఱి వీవ యఱురసాఱి వీవఁ
ద్రిభువనవందిత దేవాదిదేవ, యభయ మీదేవ నాకఖిలాధినాథ
జయజయ శతకోటిజలజా ప్తతేజ, జయజయ సంసారసర్పసుపర్ణ
లలితాగమస్తోత్ర లక్ష్మీకళత్ర, విలసద్దయాపాత్ర విబుధారిజైత్ర
దినకరశశినేత్ర దివ్యచారిత్ర, యనుపమశుభగాత్ర యఖిలైకసూత్ర
వేయునోరులభోగివిభుఁడైన నుతులు, నేయంగనోపునే శ్రీరామ నిన్ను
నప్పద్మసంభవుండైన నీమహిమ, యెొప్పెల్ల నుతియింప నోపునే తెలియ
నే నిన్ను నుతియింప నెంతటివాఁడ, దానవుండను వృథాతరళచిత్తుఁడను
భూనాథ నీవాదిపురుషోత్తముఁడవు, కాన నిన్నితరులు గానఁగ లేరు
నరనాథ యార్తుని నన్ను రక్షింపు, పరమదుర్జనదైత్యపతి ద్రుంచివైపు
మఖిలశరణ్యుండ వైననీమఱుఁగు, సుఖమని యే వచ్చి చొచ్చితిఁ బ్రీతి

శ్రీరామచంద్రుఁడు విభీషణు ననుగ్రహించుట.

ననవుడు నతని కృపాంబుధిలోన, మనుజేశ్వరుండు క్రమ్మఱ నోలలార్చి
నమ్ము విభీషణ నాకేశవైరి, తమ్ముఁడవా నాకుఁ దమ్ముఁడ వింతె
మఱువకు మింక లక్ష్మణుకంటె నిన్ను, నఱలేనివానిగా నాత్మఁ గైకొంటి
నని భయం బుడిపి దయార్ద్రవాక్యముల, జననాయకుఁడు విభీషణు నాదరించి
నెయ్యంబుతోడ నానృపుఁ డప్పు డితని, చెయ్యూదుకొని వార్ధిఁ జేరంగఁ బోయి
మాకు నిక్కముచెప్పు మావిభీషణుఁడ, నాకారిశక్తియు నమ్మినబలము
ననిన విభీషణుం డారామచంద్రుఁ, గనుఁగొని మ్రొక్కి నిక్కము విన్నవించెఁ

విభీషణుఁడు రామునకు రావణునిబలం బెఱిఁగించుట.

దోయజదళనేత్ర తొల్లి నారదుఁడు, వాయువుకడ నాగవరులావుఁ బొగడి
ఫణిరాజు ముందఱి బవమానులావుఁ, బ్రణుతించి వారికిఁ బగనేయుటయును
రాసిలావులకు వారలు మత్సరించి, భాసురహేమాద్రి ఫణిరాజు చుట్టి
పట్టంగ దానిఁ గంపమునొంద వీతు, నెట్టన నేనని నియమించె గాలి
తనసత్త్వమంతయుఁ దగఁబూనిశేషుఁ, డనిమిషగిరిఁ జుట్టి యసదృశలీల
వేయుషణంబుల వేశిఖరముల, నాయతభుజశక్తి నంటంగఁ బొదివి
చలమునఁబట్టిన సప్తవాయువులు, వెలయంగఁ బవనుండు వీవఁగఁ దొడఁగె
శేషుని భేదింపఁ జేకూఱకున్న, భీషణగతి వీచెఁ బేర్చి వాయువులు
ఆగాలి నచలంబు లన్నియు విఱిగె, నాగాలి భువనంబు లన్నియు వణఁకె
నాగాలిఁ జలియించె నర్కునిరథము, నాగాలి భూతంబు లన్నియు నఱచెఁ
గదిసిన లోకసంకట మెల్లఁ జూచి, యిది మహాపద వచ్చె ని త్తఱి ననుచు
నర్ధిమై బ్రహ్మాదు లచటికి వచ్చి, ప్రార్థించి పవను మాన్పఁగ లేకపోయి
పరమసాత్త్వికుఁడైన ఫణిరాజుఁ గదిసి, యురగేంద్ర నీవైన నోర్వంగవలయు
మీమచ్చరంబుల మిహిరుండు గూలె, మీమచ్చరంబుల మేదిని గ్రుంగె

మీమచ్చరంబుల మితిమీఱె నబ్ధి, మామాట లాలించి మమ్ము మన్నించి
గాలిని గెలిపించి కరుణ వాటించి, కేళిమై మమ్ము రక్షింపవే యనిన
సురలప్రార్థనకు శేషుఁడు శాంతి బొంది, కరువలికిని వీవఁగా ననువిచ్చి
యించుకయొకక్షణం బెత్తినఁ జొచ్చి, మించినబలిమి సమీరుండు ద్రోయఁ
జెలువేది యంచొక శిఖరంబు విఱిగి, తలకొన్న గాలిచే దవ్వుగాఁ దూల
గురుతరగతి నద్రికూటంబుగాఁగ, ధరణీశ యబ్ధిమధ్యంబునఁ బడియె
దేవ యాసింహళద్వీపంబునందు, దేవేంద్రుపనుపున దేవతాశిల్పి
కరకౌశలమున లంకాపురం బనెడు, పురము నిర్మించెఁ దత్పురవరంబునకుఁ
గోట లేడొప్పు నకొ్కటగోటకును, వాటమై నాల్గేసి వాకిళ్లు గలవు
తఱుచైనయట్టి కొ త్తడములతోడ, నిఱువైన ముందఱి యిట్టికకోట
పడమటిద్వార మేర్పడఁ గాచియుండు, రెడపక రాక్షసు లెనుబదికోట్లు
దానవు లుత్తరద్వారంబు గాచి, యేనూటడెబ్బదియేడుకోట్లుండుఁ
దూర్పువాకిలియందుఁ దొలఁగ కేప్రొద్దు, దర్పించియుందురు తగనూఱుకోట్లు
దక్షిణద్వార ముద్ధతిఁ గాచియుందు, రక్షిణదానవు లఱువదికోట్లు
అరయ నాలోపలి యూఱుకోటలను, నరనాథ యిరువదినాల్గువాకిళ్ల
వరుస నీచెప్పిన వడువున నెపుడు, దరిగాచి యుందురు ధరణీతలేశ
తిరమగు చున్నట్టి డిడ్డివాకిళ్ల, నురుసత్త్వ లుండుదు రొకొ్కక్కకోటి
పురమధ్యవీధి నెప్పుడుఁ గాచియుందు, రఱువదిలక్షలు నార్నూరుకోట్లు
కుంభకర్ణునినిద్రగుహఁ గాచియుండు, జృంభణ మొప్ప వసిం చాఱుకోట్లు
మొనసి యారావణు మొగసాలఁ గాచి, కొనియుందు రొకలక్షకోటిరాక్షసులు
ఒనర నావాకిట నుండురాక్షసులు, వినవయ్య యిఱువదివేలకోట్లెలమిఁ
జెలువంబుగా నింద్రజిత్తువాకిటను, బలవంతు లుందురు పదివేలకోట్లు
ఘనులైన యాయతికాయాదివీర, దనుజులవాకిళ్లఁ దరలకుండుదురు
ఎన్నికతో మఱి యినకులాధీశ, యెన్న రాదానేన యెంతయు ఘనము
వాసవాంతకులావు వర్ణింపఁదరమె, యీసునఁ గైలాస మెత్తినవాఁడు
వనజజుం డతనికి వరమిచ్చినాఁడు, దనుజులచేత గంధర్వులచేత
నమరులచేత నయ్యక్షులచేత, సమరంబులోపలఁ జావు లేకుండ
సమరంబులేల యేచందంబులందు, సమయింపరాదు రాక్షసలోకనాథు
నతఁడు మీచేతన యనిఁ జచ్చుగాని, క్షితినాథ యితరులచే నసాధ్యుండు
కుంభకర్ణుండు చేకొనఁడు చీరికిని, జంభారినైనను సమరంబులోన
నెత్తినమదమున నెఱుఁగఁడే భయము, చిత్తంబులో నింద్రజిత్తనువాఁడు
హరునకుఁ బ్రియముగా యాగంబుఁజేసి, వరశక్తిఁ బడసెను వజ్రకవచము
నరుదుగా మాయావియై విల్లువట్టి, యరుల నాకాశంబునందుండి గెలుచు
నతిసత్త్వధనుఁడు ప్రహస్తుఁడన్నవాఁడు, చతురుండు రావణసైన్యపాలకుఁడు
ఖండేందుధరుచెలికాని సామంతు, భండనంబున మాణిభద్రుని నోర్చె

దనుజపీరులు మహోదరమహాపార్శ్వ, లనువారు నతికాయుఁ డనువాఁడు దేవ
బలిమిఁ గైకొనిన దిక్పాలురనైన, గెలుతురు రణమున గిట్టిన యపుడె
యనిమిషకంటకు లైనబల్లిదులు, దనుజేశునకు లక్షితనయులు దేవ
జ్ఞాతులతో బందుసమితి లెక్కింప, ధాతకు నైనను దరముగా దధిప
యరయఁ గుబేరాదు లరిగాపులన్న, విరచింపవచ్చునె విభవంబుకొలఁది
నెత్తుట మెదడున నెట్టనఁ దనిసి, మత్తులై సంగరోన్మత్తులై చాల
నదరొక్కినట్టిమహాదైత్యవరులు, పదివేలకోటులు బలియు లుండుదురు
వారిలావునఁజేసి వసుమతీనాథ, యీరావణుఁడు గెల్చె నఖలదిక్కులను
అనవుడు రాఘవుం డతనితో ననియె, విను విభీషణ మున్ను విన్నాఁడ నేను
మీయన్న యెంతయు మిక్కిలిబంటు, పాయక యాతనిబలము నట్టిదయ
వాఁడెంతవాఁడైన వచ్చి నాయెదుర, వాఁడిమి వాటింప వాఁడెంతవాఁడు
హరిహరబ్రహ్మాదు లాదిగాఁగల్గు, సుర లడ్డగించినఁ జూర్ణంబు చేసి
వానిఁ జంపుదు ని న్నవశ్యంబు లంకఁ, బూని యేలింతు నిమ్ముల దానవేశ
యనిన విభీషణుం డారామముఁ జూచి, వినయంబుతో మ్రొక్కి విభున కిట్లనియె
నీరావణుం డెంత యీలంక యెంత, శ్రీరామ నీబాణశిఖపర్వనపుడు
లంకకోటలు ద్రోసి లగ్గలుపట్టి, కిన్కతో ననుయుల గిట్టినయపుడు
నాలావుచూడుము నరనాథచంద్ర, కాలాగ్నిరుద్రునిగతిఁ బేర్చువాఁడ
ననవుడుఁ బతి వాని నాలింగనంబు, ఘనముగాఁజేసి లక్ష్మణునకు ననియె
నీసముద్రమునీట నినజుండు నీవు, భూసురాశీర్వాదపుణ్యనాదములఁ

శ్రీరాముఁడు విభీషణునకు లంకాభిషేకము సేయుట.

గట్టుము వేగ లంకారాజ్యమునకుఁ, బట్టంబు వానికిఁ బ్రతి విభీషణుని
అని యానతిచ్చిన నతఁడును నతని, వననిధిజలములు వనచరుల్దేర
నభిషేక మొనరించి యసురులకెల్ల, ప్రభుఁడవు గమ్మని పట్టంబు గట్టి
తలపోయ నాచంద్రతారార్కముగను, సలలితంబుగ రామచంద్రునికీర్తి
యెంతకాలము గల్గు నిలవిభీషణుఁడ, యంతకాలంబు రాజ్యమునేయు మనుచు
నార్చె వానరకోటి హర్షించి యంతఁ, బేర్చి రాఘవుఁడు విభీషణుఁ జూచి
యీయబ్ధి దాఁటంగ నేయుపాయంబు, నేయుచ మనవుఁడుఁ జేతులు మొగిచి
యీవార్ధిఁ గట్టక యింద్రాదులకును, దేవ యెమ్మెయి దాఁటఁ దీరదుకాన
నిది గట్టుటకునైన నినకులాధీశ, పదిలంబుగా వార్ధిఁ బ్రార్థింపవలయు
నని పల్కుచుండంగ నట దశగ్రీవు, ననుమతి శార్దూలుఁ డనుదూత వచ్చి
కపిసేనకొలఁదియుఁ గపులమాటలను, గపులతో నాడురాఘవునిమాటలును
అరసి క్రమ్మఱఁ జని యసురేశుఁ గాంచి, కరములు మొగిచి నిక్కము విన్నవించె
నుత్తుంగయశులును నుత్తుంగభుజులు, నుత్తుంగసత్త్వులు నుత్తుంగమతులు
నగురామలక్ష్మణు లలవుమై విడిసి, రగచరసేనతో నబ్ధితీరమున
గణుతింపనగు నుడుగణముల నైన, గణుతింపఁదగు వృష్టికణములనైన

గణుతింపనగు నభ్రికరడులనైన, గణుతింపఁగారాదు కపిసేనసంఖ్య
నుచిత మీవేళ సామోపాయమునకుఁ, బచరింపఁ బంపు నేర్పరులైనవారి
ననవుఁడు శార్దూలుఁ డనువానిమాట, విని శుకునకు వైత్యవిభుఁ డర్థిఁ బలికెఁ
జని నీవు వానరసైన్యంబుఁ జొచ్చి, యినసూనుతోఁ బ్రియం బేర్పడఁ బలికి
పగ లేమిఁ దెలిపి యాభానునందనుని, మగుడించి రమ్ము సమ్మతి లెమ్ము పొమ్ము
అనవుడు నతఁడేగి యర్కజుఁ గాంచి, యనియె రావణు చెప్పి నంతయుఁ దెలియ
వైరంబుసేయ రావణుతోడ నీకుఁ, గారణంబేమి యర్కజ నాకుఁ జెపుమ
వాలి మీయన్నన వలవదు వినుఁడు, వాలికి నీకును వైరంబు గలదు
వాలి యూదానవేశ్వరుపగవాఁడు, చాల రావణుతోడి సంధి నీకొప్పు
రావణుం డీరాముఁరామఁ దెచ్చుటకు, నీవిటు రాఁదగునే కపిరాజ
యనిఁ గుబేరుని గెల్చి యతనిపుష్పకము, గొనినరావణు నెఱుఁగుట లెస్సగాదె
అట్టేల హరునితో నయ్యద్రి యెత్తి, నట్టి రావణుఁ డల్పుఁడా కపిరాజ
దేవేంద్రుఁడాదిగా దివిజులనెల్ల, నావిధంబున గెల్వఁడా వానరేంద్ర
కొలఁదిమీఆహవహోమగుండంబులందుఁ, దలలు ఖండించి యుద్ధతగతి వ్రేల్చి
జలరుహసంభవుఁ జాల మెప్పించి, వెలయంగఁ ద్రైలోక్యవిజయంబు గొనఁడె
హీనమానవుతోడ నేటిసఖ్యంబు, దానవేశ్వరుతోడఁ దగఁజేయు సంధి
యనవుడుఁ గోపించి యగచరులెల్ల, వినువీథి కెగయుచు వెస వానిఁ బట్టి
బెడిదంబుగాఁ బెక్కుపిడికిళ్లఁ బొడిచి, కడుమీఱి మసగి రెక్కలు ద్రెవ్వఁ గొట్టి
ముక్కును జెవులును మొగిఁ గ్రోసివైచి, యొక్కట గడఁగిన నుదరి రాఘవుఁడు
దూత నేటికి నింత దొసఁగులఁబెట్టఁ, బ్రీతిగా వీని నేవక పోవనిండు
అనవుడు రాఘవు నాజ్ఞకు నులికి, వనచరులందఱు వాని విడ్చుటయు
వినువీథి కెగసి యావినువీథినుండి, యినసూతితో శుకుం డేర్పడఁ బలికె
రావణుతోఁ గపిరాజ యేమందు, నావుడుఁ దారాధినాథుండు గినిసి
తానెంచ ద్రోహి యీధరణీశ్వరునకుఁ, గాన నాద్రోహిని గని నైఁప ననుము
సారిది నేలోకంబుఁ జొచ్చిననైన, బొరిగొందుఁ గాని యేపోవనీ ననుము
పటుకార్ముకంబె యూపంబుగా నిలిపి, చటులాస్త్రములు పరిస్తరణములేసి
పరఁగఁ గెంధూళ్లను బ్రభలుగాఁజేసి, తరుచరస్రుక్స్రువతతులు చేపట్టి
సమరభూవేదికాస్థలమున నిలిచి, యమరులకెల్లఁ బ్రియం బెక్కుచుండఁ
గరమొప్ప వీరాంగకములఁ బెల్లుబ్బి, తొరఁగుచునున్న నెత్తురునెయ్యివోసి
మహితగుణధ్వనుల్ మంత్రములుగాఁగ, బహురాక్షసశ్రేణి పశుకోటిగాఁగఁ
దనరిన విరహనాదంబులవేర్మి, యనిమిషావలికి నాహ్వానంబుగాఁగఁ
విడువనికాహళవితతులమ్రోత, కడునింపుగా సామగానంబుగాఁగ
ఘనమైన రామలక్ష్మణులకోపంబు, మునుకొని నాకోపమును మండుచుండ
ననుపమాగ్నిత్రయంబైయుండ నందుఁ, దనదుప్రాణముల నత్తఱి నాహుతులుగ
రణమునఁ దనవీరరస మడంచుటయుఁ, బ్రణుతింపఁగా సోమపానంబుగాఁగఁ

బ్రకటరాక్షసవీరపశుపలలముల, సకలభూత వ్రాత సంతృప్తి లేసఁగ
విడువక సంగ్రామవిపులయజ్ఞంబు, గడునొప్పఁ జేయు రాఘవసోమయాజి
యటుగాక మున్నె సీతాంగనఁ దెచ్చి, యిటయిచ్చి బ్రదుకుట యిది బుద్ధి యనుచు
అని వేర్చి సుగ్రీవుఁ డాడువాక్యములు, విని శుకచాయుండు వేగంబె పోయి
యంత నావృత్తాంత మారావణునకు, మంతనంబునఁ జెప్పె మఱి రాముఁ డిచట
వనధితీరంబున వనదర్భశయ్య, యొనరించి తాత్పర్య మొప్పారుచుండ
నమృతపయోధిలో నహిశయ్యమీఁద, నమలచిత్తంబున నానందమంది
మున్ను న్న తనయాదిమూర్తిచందమున, నన్నరనాయకుం డతికౌతుకమున
నవరత్నకటకమండనమండితంబు, వివిధోర్మికామణి విపులరావంబు
నుర్వీతనూజామృదూపధానంబు, గర్వితాహితభిదాకాలదండంబు
ఘోరప్రతాపకుంకుమచర్చితంబు, సారంగమదలేపసంవాసితంబు

శ్రీరాములు దర్భశయనము సేయుట.

నిరతమహాదాననిపుణతానకము, ధరణీభరణధుర్యతాసమం బగుచుఁ
బొలుపొందు దక్షిణభుజశాఖ దాన, తలగడగాఁ జేసి ధరణీశ్వరుండు
ఏవిధంబుననైన నిటుదాఁటి పోవఁ, ద్రోవ నాకిమ్మని తోయధి ననుచు
రామభూవరుఁడు వారక సుపవాసి, యై మూఁడుదివసంబు లటు శయనించి
తెలిడెందమున జలదేవత నిలిపి, పలుమఱు నిష్ఠతోఁ బ్రార్థనఁ జేసె
కడగానరాని నీకడిఁదిచిత్తంబుఁ, బడయుటకై యేను బడియున్న వాఁడ
నీకేను మాన్యుండ నీరధి వేగ, నాకిమ్ము త్రోవ యానాకారిఁ జంప
నని వేఁడుకొనుటయు నారాము నెదురఁ, దనరారి యంతకంతకుఁ బొంగి పొంగి
తోరంపుఁదెరలఁ జేతులు విచ్చి విచ్చి, బోరన సురువు లెల్లున నవ్వి నవ్వి
ఘనమీనరుచినాలుకలు గ్రోసి క్రోసి, చనుమ్రోత నట్టహాసము చేసి చేసి
తుది నిరుదిక్కులతోఁ జెప్పి చెప్పి, కదిసినసుళ్ళ వక్రతఁ జూపి చూపి
యుదధి యారాముని నొక్కింతగొనఁడ, యది యట్టిదయొకాదె యారసి చూడ
జడుఁడైనవాఁడు దుర్జనుఁడైనవాఁడు, కడుఁ గ్రూరజీవసంగతినుండువాఁడు
మలుగక తనలోన మండెడువాఁడు, కులగోత్రమైనఁ జేకొని మ్రింగువాఁడు
నెదురెంతవేఁడిన నెఱుఁగునే పెద్ద, వదరుచు నంతంత వడినుబ్బుఁగాక
కదియంగవచ్చుచోఁ గడిఁదిచిత్తంబు, చెదరంగ విషముపైఁ జిలికించుఁగాక
యడఁగక తనప్రార్థనంబు నైకొనక, జడధి వొంగినఁ జూచి జానకీవిభుఁడు
నిడుదకన్నులక్రేవ నిప్పులుఁరాల, ముడివడి బొమలు గ్రమ్ముచుఁ గోప మెసఁగ
జలధిదిక్కునుఁ మఱి సౌమిత్రిదిక్కుఁ, బలుమాఱుఁ జూచుచుఁ బలికె భూవిభుఁడు
వీనిగర్వము గంటివే లక్ష్మణుండ, నేనెంత వేఁడిన నింతఁ నైకొనక
పొడచూపకున్నాఁడు పొడచూపకున్నఁ, బొడవడఁగింపక పోనేల యిత్తు
నెడపక క్రోలియు నింకింపలేని, బడబానలంబె నాబాణానలంబు
అటుచూచుఁ గాక నాయస్త్రంబుకొలఁది, పటుతరమకరసర్పములు మీనములు

గండకంబులు కూర్మకర్కటంబులును, మండూకముల నీరుమానిసుల్ పశువు
లురవడి నొండొంటి నొరయంగఁ బాఱి, కెరలెడి తిమితిమింగిలతద్దిలములు
దండిరాక్షసులును దఱుచు నెగళ్లు, కొండలు మునదూరుకొని రూపుమాపి
పరఁగుచునున్న నాబాణాగ్నిశిఖల, నెరసినతనలోని యెమ్ములో యనఁగ
జలములఁ గప్పి యాజలచరకోటి, మెలఁగుట మాన్పించి మీఁదఁ దేలించి
చిప్పలు గుల్లలు చిక్కంగఁ దన్న, నిప్పుడ ధూళిగా నింకించువాఁడ
సిరితండ్రి యనిపెద్దఁ జేసితిఁగాని, హరిమామ యనుచుఁ బొలార్చితిఁగాని
యిందుకుఁ దనువేఁడ నేటికి నాకుఁ, బొందెఱుంగక తేర్చి పొంగెడుజలధి
నన్నశక్తునిగా మనంబునం దలఁచి, యిన్నిచందంబుల నేఁచె సౌమిత్రి
తే విల్లునమ్ములుఁ దెగి పొంగియున్న, యీవార్ధి నాచేత నింకుటఁ జూడు
వనధిలో జగములు వడిఁ జూఱబుత్తు, ననుచు రాఘవుఁడు విల్లంపుమాత్రమున
బలశోధి వణఁకె దిగ్భాగంబు వగిలె, జలధులు గలఁగె నాశాకరు లడఁగె
ధారణి గ్రుంగె భూధరములు గూలె, నీరజాసనుఁడును నివ్వెఱగందె
చుక్కలు డుల్లె శేషుండు భీతిల్లె, దిక్కులు ద్రెళ్లె నద్దివి యొడ్డగిల్లె
నినకులాధీశ్వరుం డేపు దీపించి, వినుతులు శోభిల్ల విల్లెక్కుపెట్టి
సమవర్తి సంవర్తసమయదండంబు, సమమైనవాని సుజ్జ్వలమైనవానిఁ
బ్రళయకాలానలప్రభ నొప్పువాని, విలయోగ్రచండాంశువిధమైనవాని
సాయకంబులు వెక్కు సంధించి పేర్చి, తోయధిలోపలఁ దొడరి యేయుటయుఁ
గడఁకఁ బొంగితి నన్నుఁ గరుణింపు మనుచుఁ, జెడక వారిధి యోరసిల్లెడునూడ్కిఁ
గడుమ్రోసి పర్వతాకారంబులగుచుఁ, గడువేఁగఁ దరఁగ లాకస మప్పళించె
బలితంపురామభూపాలునిబాణములు వెక్కునాఁట సముద్రునినోట
క్రమ్మెడులాలలకైవడి నురువు, లమ్మహావీచులయందుఁ బెల్లెసఁగి
సొరిది నేలోకంబు జొత్తు నన్నాడ్కి, ధరియింపరాక యెంతయుఁ దల్లడిల్లె
జలనిధియుదక మాస్వాదింపవచ్చి, మలుగకరామాస్త్రమహిమకు నులికి
మొగుళొళ్ళమగిడి వెమ్ముచుఁ బోవుభంగిఁ, బొగలెడఁ ద్రవ్వక పొరిపొరి నెగసె
నొఱయుచు రాకుసు లొఱలుటఁ జూపు, తెఱఁగున నొఱలె నెంతే జంతుసమితి
మనుకులవల్లభు మార్గణవహ్ని, తునుకసొచ్చిన సముద్రునిచిత్తవృత్తి
ఘనతరంబగు నహంకారాదులెల్లఁ, బెలుపేది నిలువక పెడఁబాయుకరణి
దైతేయులెల్లఁ బాతాళంబు విడిచి, భీతిల్లి పాఱిరి పెక్కుదిక్కులకుఁ
దనచేతి నింకక తనరినవార్ధి, ననయంబు నింకింతు నని వచ్చుచున్న
యినకులబాణాగ్ని కెదురుగా వచ్చి, యనువుగా నాలింగనము చేసె ననఁగ
నుడుగ కంతయు వడి నొడఁగూడిలోని, బడబాగ్ని వారిధిపై మండఁ జొచ్చె
నప్పుడు లక్ష్మణుం డంతకుభంగి, నుప్పొంగి రౌద్రసంయుక్తుఁడై యున్న
యన్నచందముఁ జూచి యళుకుచు వచ్చి, మున్నీటి కెడసొచ్చి మోడ్పుకేలమర
మానవేశ్వర యిది మథనంబుసేయ, రానికాలునివీరరసవార్ధిగాదు

మానవేశ్వర యిది మథనంబునేయ, రానిర్దుర్నిరోషరసవార్ధిగాదు
ఈనీరు నిబ్బంగి నెఱయింపఁదొడఁగె, మాన కిప్పుడు నీదుమార్గణవహ్ని
వెలికి నేతెంచి దిగ్వితతితోఁగూడఁ, గలయ లోకంబెల్లఁ గాల్చునో తగదు
సర్వజగద్ధితచరితంబుఁ బూని, యుర్వీశ యీకోప ముపసంహరింపు
నీకోపమునకు నీ నీరధి యెంత, తేకార్ముకం బింకఁ దెగఁగొన కధిప
యని విల్లువట్టిన నతఁ డీక కోప, మినుమడింపఁగఁ గను లెఱుపును బొంది
యంబకం బేల నాయంబకంబులనె, యంబుధి నింకింతు ననినచందమునఁ
గ్రూరదృష్టులఁ గనుఁగొని యాడుగఱచి, యోరిసముద్రుండ యోడవు నాకు
నీనీరు నింకించి నీయందుఁగలుగు, వానినన్నింటిని వడి నీఱుఁజేసి
భర్జింతు నీవింక బంటవై నిలువు, దుర్జనత్వమునను దొడరి నాయెదుట

శ్రీరాములు సముద్రునిపై బ్రహ్మాస్త్రమేయుట.

యిదె తొడిగెద బాణ మేనారి ననుచు, నదలించి యపుడు బ్రహ్మాస్త్రంబు దొడుగ
బ్రహ్మయు నింద్రుండు భ్రమఁ గానరైరి, బ్రహ్మాండమెల్లను బగిలినట్లయ్యె
భువనంబులెల్లఁను బొగిలినట్లయ్యె, భువనత్రయములోనిభూతంబు లఱచెఁ
గలయంగ దిశలఁ జీఁక ట్లగ్గలించె, వెలుఁగవు రవిచంద్రవిపులబింబములు
అశనులు వడియె మహానీల మడరె, నశరీరి యొఱలె మథ్యాగ్నులు నెగసె
నుడుగక యొకమ్రోత యూరక మ్రోసె, జడధి యప్పుడు గ్రాహసమితియుఁ దానుఁ
బొంగెల్ల నెక్కఁడఁబోయెనో యనఁగ, దుంగఫేనము లెందుఁ దూలెనో యనఁగఁ
బటుఘోష మెమ్మెయిఁ బాసెనో యనఁగఁ,జటులోగ్రవిష మెందు సమసెనో యనఁగఁ
బెంపెల్ల నెక్కఁడఁ బెట్టెనో యనఁగ, సొంపెల్ల నెక్కఁడఁ జొచ్చెనో యనఁగఁ
భంగంబు లేకయుఁ బరికించిచూడ, భంగంబునకుఁ దాన పట్టనం బరఁగి
సత్త్వంబుచెడియు నాశ్చర్యంబుగాఁగ, సత్త్వసమగ్రుఁడై చలనంబునొంది
భ్రమణంబులేకయు భ్రమణంబునొంది, యమితవేగంబున నధికతదక్కి-
యారాముచేతి బ్రహ్మాస్త్రంబు దనకు, బీరంబుచెడి వచ్చి బిందువై యుండె
వరమునఁ బెరుగు రావణుమస్తకములు, కరమరుదార నొక్కఁటఁ ద్రుంచుకొఱకుఁ
గడఁగి రాఘవుఁ డంపగమివాఁడిసేయఁ, బడబాగ్ని నిడి నీటఁ బదనిడుకరణిఁ
జింతింప దేవ నాజీవనం బెంత, యింతియకాకని యిబ్బంగి మఱియు
నాసముద్రుం డిప్పు డఖిలంబు చూడ, భాసురరత్నప్రభాయుక్తుఁ డగుచుఁ
బ్రజ్వరిల్లెడుఁ బెనుపడగలతోడ, నుజ్వలదహికోటి యొక్కఁటఁ గొలువ
గంగాదినదులెల్లఁ గడఁకతో నడువ, మంగళబహుపుష్పమాలిక ల్మెఱయఁ
దలకొని జలచరతతులోలి నడువ, జలనిధి సనుదెంచి సాష్టాంగ మెఱఁగి
కరపద్మములుమోడ్చి కడుసంభ్రమమున, నరవరాగ్రణికి సన్నుతి విన్నవించె
నేను మీమాయలుకకు నెంతటివాఁడ, భూనాథ నీవాదిపురుషోత్తముఁడవు
వాయుభూజలనభోవహ్నులాదిగను, నీయాజ్ఞలోనివి నిక్కువం బరయ
నీయందు నున్న వానికి లెక్కలేవు, నీయధీనంబులు నిఖిలలోకములు

తప్పు సేసితినని దండింపవలదు, చెప్పు మేపనియైనఁ జేసెదఁ గాని
యని విన్నపమునేయ నంత నారామూ, గనుఁగొని యప్పుడు గంగాదినదులు
ధరశిరములు మ్రోవ దండము లెట్టి, కరములు ఫాలభాగంబునఁ జేర్చి
శరణార్థులము రామజగదభిరామ, కరుణింపవే మమ్ము కరుణాసముద్ర
యభయంబు వేఁడెద మయ్య యిందఱము, నభినవంబుగను నీ యబ్ధిశుఁ గాచి
శుభతరమంగళసూత్రము ల్నిలుపు, త్రిభువనాధీశ్వర దీనమందార
యపరాధిఁ గాచుట యదియె నీగుణము, కృపఁ జూచి రక్షించు గీర్వాణవంద్య
నీమహిమల నెంచనేరవు శ్రుతులు, నేమెంతవారము యిట మిమ్ముఁ బొగడ
దేవతామయుఁడవు దేవదేవుఁడవు, కావను బ్రోవను గర్తవు నీవ
భూమిశ లోకేశ భూరిప్రకాశ, భూమిజాహృదయేశ పుణ్యస్వరూప
యని యిట్లు నదులెల్ల నభినుతుల్ సేయ, విని యప్పు డారామవిభుఁడు వారలను
మన్నించి భయమెల్ల మానుఁడటన్న, నన్నరనాథున కబ్ధి యిట్లనియె
సరసిజోదర మానిజననుతచరణ, శరణాగతార్తరక్షకదివ్యమూర్తి
తరుచరసేన యుద్ధతి నేగునపుడు, కరిమకరాదులఁ గదలంగనీను
ఉప్పొంగి కయ్యల కొత్తి బెల్విరిసి, తప్పింప నస్మారుతముఁ జూచి మ్రోయఁ
గడలేక మిగుల నగాధమైయుండు, సుడివోడమింప నాసొంపువాటింప
నలరి సేతువుఁగట్టి యైనను నడుపు, మలఘువిక్రమ యూరకైనను నడుపు
మనిన రాఘవుఁ డమోఘాస్త్ర మబ్ధిశు, పనుపున మరుభూమిపైఁ బ్రయోగింప
విలసిల్లు నయ్యంపవేడిమిచేత, సొలవకందులనీరు శోషింపఁజేసి
యామరుభూమి కుదాత్తుఁడై సర్వకామసమగ్రంబుగా వరంబిచ్చె
నది మరుదేశమై యంతనుండియును, వదలక యమ్మాడ్కి వర్తించుచుండె
మగుడంగఁ జనుదెంచె మనుజేశుశరము, తగనబ్ధిపూర్వవిధంబుననుండె
నప్పు డంభోనిధి యనియె రామునకు, నుప్పొంగునయమున నొప్పువాక్యముల
మీతండ్రి దశరథమేదినీశ్వరుఁడు, వైతేయదేవయుద్ధమునఁ బెంపొంది
నన్న యోధ్యకుఁ గొని నరనాథపోయి, మన్నించి యప్పుడు మగుడ వీడ్కొలిపి
పుత్తేరవచ్చితి భూతలాధీశ, యిత్తెఱంగున మీకు నేఁ దక్కినాఁడ
దొరకొని కట్టు సేతువు రాఘవేంద్ర, తరుచరసేన నుద్ధతి నడపింపు

శ్రీరాములు సుగ్రీవునితో సేతువు గట్ట నాజ్ఞాపించుట.

మనవుడు రఘురామూ డర్కజుఁ జూచి, పనుపుసేతువుగట్టఁ బ్లవగపుంగవుల
రయమున నప్పుడు రవినందనుండు, ప్రియమునఁ బంచె వారిధిఁ గట్టుఁ డనుచుఁ
జని రంగదుండును జాంబవంతుండు, ఘన్నులైనయనిలజ గజగవాక్షులును
పనసుండు నలుఁడును పావకనేత్రుఁడును గంధమాదనుండును గవయుండు
కరమెప్ప నీలుఁడు ఘనుఁడు తారుండు, శరభుండు ఋషభుండు శతబలిబలుఁడు
హరిరోమవంతుండు నట సుషేణుండు, సొరిదిఁ గేసరియును జ్యోతిర్ముఖుండు

దధిముఖుండును వేగదర్శియు మఱియు, నధికులు కపిసైనికాధిపు లెల్ల
మ్రాకులు గొండలు మల్లటిగొనఁగ, వీకతోఁ గొనివచ్చి విషధిలో వైవ
నొకటియు వీటిపై నుండక మునుఁగ, వికలురై కపులెల్ల వెఱగంది వచ్చి
పతికిఁ జెప్పుటయు భూపతి యాత్మలోన, నతివిస్మయంబంది యబ్ధి కిట్లనియె
నిదియేమి కపివరు లిబ్బంగిఁ దెచ్చి, వదలక తరులు పర్వతములు వైవ
నొకటియు నీటిపై నునికిలేదనిన, సకలాధిపతికి నాజలధి యిట్లనియెఁ
బరమేశ వినుము లోపలి కవివోవఁ, బొరిపొరి జలచరంబులు మ్రింగెనవియు
నమరంగ శతయోజనాయతం బగుచుఁ, దిమి యనుమత్స్యంబు దిరుగు నాలోన
మ్రింగు నామీను దిమింగిలంబోటి, మ్రింగు నామత్స్యంబు మిగుల దద్దిలము
ఇటుపలె నొండొంటి నెఱిగొనుచుండుఁ, జటులసత్వంబు లసంఖ్యముల్ దేవ
యనవిని యట్టి మహాంబుధిఁ గట్ట, ననువేది చెప్పవే యబ్ధీశ యనుడు
నినకులాధీశ్వర యీనలుఁ బనుపు, ఘనుఁడైన యీవిశ్వకర్మనందనుఁడు
భానుకులేశ యుపాయజ్ఞుఁ డితఁడు, దానంతయును దమతండ్రిచే నేర్చె
వడి వానిచేదప్ప వనినిధిఁ బట్టు,వడ దది యెట్లన్న వసుధేశ వినుము
శిశువేళ వింధ్యాద్రిచేరువ నడవిఁ, బశుకణ్వుఁ డనుమని పజ్జనాడుచును
ముని యనుష్ఠాన మిమ్ములఁజేయఁబోవ, మునివేల్పులనుబట్టి మోరతోపునను
వనధిలోపలఁ బాఱవైచె నీనలుఁడు, చనుదెంచి యమ్మని చయ్యన నెఱిఁగి
చాలంగఁ గోపించి శపృుఁ గావింప, బాలుండు తగఁడని పరఁగఁ జింతించి
తనసొమ్ముపోకుండఁ దాఁదెచ్చుటకును, ననువుఁజింతించి యాయర్భకుఁ జూచి
తనతపోమహిమ నత్తాపసోత్తముఁడు, ఘనతరం బగునొక్కకట్టడనేసె
నీయబ్ధిలోపల నేతృణంబైనఁ, బాయక పీఁడేమి పట్టివైచినను
అవి దేలుగాకని యవ్వారంబియ్య, నవి యంతలోఁ దేల నతఁడు గైకొనియె
నదిగాన దేలెడు నతనిచే గిరులు, వదలక నేఁ గట్టువడియెద నిపుడు
ధరణీశ యీవారిఁ దగఁగట్టునంత, కురుభక్తిమై గొల్చి యుండెద నలుని
రప్పింపు మనవుడు రఘుకులోత్తముఁడు, రప్పించి యత్యాదరంబునఁ జూచి
యోవనచరరాయ మోమహావీర, నీవిక్రమంబెల్ల నీరధి నెప్పేఁ
గాన నీవిపు డబ్ధిఁ గడకతోడుతను, బూనికఁ గపులచేఁ బొంకంబుమీఱఁ
దరుగిరులందఱు తార తెచ్చెదరు, వెరవొప్ప నసదృశవిద్య యేర్పడఁగఁ
గట్టు మంభోరాశిఁ గడకతో నీవు, నెట్టన నీలావు నేర్పున మెఱసి
యనవుడుఁ గరయుగం బర్థితో మొగిచి, వినయంబుతో రామవిభునకు ననియె
నుర్వీపై నేనిట నుదయ మొందుటకు, నుర్వీశ కలిగెఁ బ్రయోజనం బిపుడు
దేవ యీజలధి బంధించెదఁ బనుపు, మావెరవెల్లను మాతండ్రిచేత
ధారణీతలనాథ తగనేర్చినాఁడ, నారాయ దేవర యానతీఁజేసి
నానేర్పు మీయొద్ద నరనాథ చెప్పఁగానేల యిపుడు సాగరము బంధించి
చెచ్చెర దేవరచిత్తంబు వడసి, మెచ్చించువాఁడ నమ్మికఁ బంపుమనుడు

నలినాప్తకులమణి నలునిఁ బంపుటయు, నలునితోఁగూడ వానరసేనలెల్ల
నేలయు నింగియు నిఖలదిక్కులును, వాలినయూర్పుల వ్రయ్యఁజేయుచును
ఆయతశైలవృక్షావళి వైచి, తోయధిఁ గట్ట నుద్యోగించి రఘుడు
రామచంద్రుండను రాజు గణేశు, డామదిలోపలఁ దలఁచి మ్రొక్కుచును
అరయోజనంబైన యద్రి సుగ్రీవుఁ, డురవడిఁ గొనివచ్చి యుర్వరపగులఁ
గలయంగ దేవతాగణములు వొగడ, నలవునఁ దొలి తొలి నలుచేతికిచ్చి
దొరకొని నలుఁడును దోయధియందు, వెరవార నిలిపె నవ్విపులశైలంబు
తనచేయు సేతుబంధమునకు రాము, ననుపమకీర్తికి నావిభీషణుని
వినుతపట్టమునకు విశదప్రభాతిఁ, దనరారుశాసన స్తంభంబుమాఁడ్కి-
నంత వానరవీరు లాశావితాన, మంతయుఁ దారరై యద్రులుఁ దరులు
నవలీలఁ బెఱుకుచు నవిదెచ్చి నలున, కవసరోచితముగా నందియిచ్చుచును
ఒకకొండపైనుండి యొకకొండపైకిఁ, బ్రకటజవంబు లొప్పంగ దాఁటుచును
గెరలుచు నొకకొన్ని గిరులెత్తి కొన్ని, గిరులఁ గ్రిందలఁ బెల్లగిల్ల వైచుచును
గొండలు తలనెత్తి గునిసియాడుచును, దెండని కొందరఁ దిట్టి నవ్వుచును
గొండపైఁ గొండ యాకొండపైఁ గొండ, నొండొండ డొల్లక యుండఁ బేర్చుచును
నిమ్ముల గిరులంది యిరుచేతులందు, నిమ్మపండులమాఁడ్కి నెగరవైచుచును
నొకడు కొండలమోచి యురవడి నడువ, నొక డది పడఁద్రోచి యుబ్బియార్చుచును
దాఁటి యాకొండ లుద్దండతఁబట్టి, మీటుదునా నీవు మెచ్చంగ ననుచు
నీతరు లీగిరు లింత వేగిరమె, త్రోతునా నలునియొద్దకుఁ బాఱ నిపుడు
అని బాసలిచ్చుచు నగ్గించుకొనుచు, వనచరు లిబ్బంగి వడిఁ దెచ్చి తెచ్చి
తరువులు నగములు తగనిచ్చుచుండ, దొరకొని నలుఁడు సేతువుగట్టఁదొడఁగె
ముందటిచందాన మునుఁగకయుండె, నందొక్కఁ డైన నయ్యంబుధిలోన
నట్టిచందంబున నాకపికోటి, గట్టెను గటాకటా కష్టజీవనము
గలిగె నాకనిమది గలఁగెడుమాఁడ్కిఁ, గలయ నంభోరాశి గలఁగె నెంతయును
నలుఁడు నిమ్మెయిఁ బదునాల్గుయోజనము, లలవడఁ దొలినాఁడె యబ్ధి బంధించె
నంత సూర్యుఁడు గ్రుంక నాసేతువునకు, నెంతయు బలుకాపు లిడి వలీముఖులు
వచ్చి వేలముల నివాసస్థలములఁ, జొచ్చి యెంతేనియు సొంపుతోఁ నుండఁ

చంద్రోదయవర్ణనము.

గృతకృత్యుఁ డగురాము కీర్తిపుష్పములు, చతురతమై వెదచల్లినయట్లు
కరమొప్పఁ జుక్కలు గాన్పించె నంతఁ, జిరకాలములసీమ శిశువులమామ
పొలుపొందుకలువల పోరానివిందు, కలసినజక్కవకవఁబొమ్మందు
పాలవెల్లిని ద్రచ్చి పడసినవెన్న, తొలియాదలపూవు చుక్కలనవ్వ
నెరిచకోరములకు నెలనెలపంట, యుపవేది విరహుల నుడికించుమంట
గగనంబుతొడవు దొంగలగుండెదిగులు, నొగినబ్ధిఁ బొంగించు నూరటవట్టి
హరిహర బ్రహ్మల యానందదృష్టి, సరసిజరిపుఁడైన చంద్రుఁడు వొడిచె

నినుపారి కలశాంబునిధి వెల్లివిరిసె, ననఁగ వెన్నెల పర్వె నట నిద్ర లేక
యెన్నండొకో నేతువేము గట్టెదము, ఎన్నండొకో లంక యేము సూచెదము
యెన్నండొకో దానవేంద్రుండుఁ గూలు, నెన్నండొకో సీత యీరాముఁ గూడు
నెప్పుడు వేగునో యీరేయి యింక, నప్పుడు వచ్చితి మాత్తలో సొలసి
యేల వచ్చితిమి రేయెల్ల నందుండి, యోలి నేతువ్రుఁ గట్టుచుండక మనము
అనుచు నవ్వానరు లందఱు నట్లు, మనమునఁ జింతించి మక్కువల్ దక్కి
యారేయి గడపి సంధ్యాదులు దీర్చి, చారుతరంబుగా సకలవానరులు
నొండొరుఁ జీరుచు నుత్సాహమొప్ప, నొండొరుఁ గడువంగ నురవడితోడ
బృధివీధరంబులు పృధివీజములును, బృధులసత్వంబునఁ బెఱికి యేతెంచి
యంబుధిలో వైవ నపుడు సుగ్రీవుఁ, డంబరవీధికి నరిగి వేగమున
వెరవారఁగాఁ బట్టి వింధ్యాద్రిశిఖర, మరయోజనము నిడుపైనది విఱిచి
యాసుషేణునిచేతి కందిచ్చుటయును, నాసుషేణుం డిచ్చె నానలుచేతఁ
దారాతనూజుండు దర్దురశైల, మారూఢగతిఁ దెచ్చి యబ్ధిలో వైచె
మలయాద్రిశృంగంబు మ్రాఁకులతోడ, నలునకు నీలుఁ డున్నతగతి నిచ్చె
ద్వివిదుండు మైందుండు దెచ్చి యావార్ధి, గవగూడి వైచిరి గ్రావంబు లెత్తి
గజుఁడు గవాక్షుండు గంధమాదనుఁడు, భుజబలాఢ్యుఁడు శరభుండును గవయు
డిల చలియింప మహేంద్రాద్రిశిఖర,ములు దెచ్చి వైచిరి మున్నీటిలోన
నవియెల్ల మునుఁగక యావేళ నలుఁడు, తవిలి యంబుధిఁ గట్టఁ దరుచరు లిట్లు
ప్రకటించి తెచ్చు పర్వతములు దరులు, నొకకేల నంది పయోనిధియందు
ననుపంగఁ గనుఁగొని యుగ్రకోపమునఁ, గనలుచుఁ బలిమిమైఁ గరువలిసుతుఁడు
చయ్యన నేడు యోజనములకొండ, నయ్యెడఁ గొనితేర నది రాముఁ డెఱిఁగి
యనయంబు నిరుగేల నందననుజ్ఞ, యొనరింప నట్లని యొనరించె నలుఁడు
అప్పుడు కపినేన యార్పులమ్రోత, యుప్పొంగి వారాశి యుబ్బెడు మ్రోత
తరుగిరు లొండొంటిఁ దాకుడు మ్రోత, తరుచరు లొండొరు ల్తగఁ బిల్చు మ్రోత
కుదిసి భూతంబులు ఘూషించు మ్రోత, వదలి దిగ్గజములు వాపోవు మ్రోత
కడునగ్గలంబుగా గగనంబు ముట్ట, నుడుగక పెల్లైన యురవు చింతింప
బృందారకాసురబృందంబు లెత్తి, మందరగిరి యెత్తి మథియించునాటి
యమృతాబ్ధిమ్రోత యో యనఁగ నామ్రోత, కమలభవాండది క్కటమును నిండె
నంతట మధ్యాహ్న మైన వానరులు, శాంతిఁ బుచ్చుటకు వృక్షంబులు చేరి
పలుతెఱంగుల మంచిఫలములు నమలి, నెలవులఁ జల్లని నీళ్లొప్పఁ ద్రావి
నీడల నొక్కింత నిలిచి క్రమ్మఱను, వేడుక రెట్టింప వేలంబు మిగుల
వాకొండ లెత్తి తే నరుగుండు కొంద, ఱొకొండలను వేగనెత్తి తెండనుచు
పెకైక్కినతరువులు పెకైక్కిన గిరులు, పెక్కు మొత్తంబులై పెక్కునఁ దెచ్చి
యూరక నలునకు నొప్పించువారు, వారిధిలోపల వైచెడువారు
నట నెదురేగి పెల్లందుకొన్నారు, నిటఁదెచ్చి చేరువ నిడియెడువారు

నలుఁ డందుకొనఁగ వానరు లంది యొసఁగఁ, బలుతరుగిరులు నిబ్బంగి మర్కొఁడు
ఆసేతు విరువదియాఱు యోజనము, లీసున బంధింప నిసుఁ డస్తమించె
నప్పుడు సుగ్రీవుఁ డాదిగాఁ గపులు, చెప్పి రప్పను లెల్ల శ్రీరాముతోడఁ
జెప్పి వేలమునకుఁ జెచ్చెర నేగి, యొప్పెడుసుఖనిద్ర నుండి యారాత్రి
గడపుటయును రేపకడ వలీముఖులు, వడి నందఱునుగూడి వారిధిఁ గట్ట
నేమేమె తెచ్చెద మెల్లభూజముల, నేమేమె తెచ్చెద మెల్లకొండలను
నని పాఱి తరువులు నద్రులుఁ దెచ్చి, వనధిలోపలఁ బడవై చెడివారు
కొందఱంతయుఁ గనుఁగొనుచుండువారు, కొందఱు నీడలఁ గూర్చుండువారు
కొందఱు సేతువు గొలపెట్టువారు, కొందఱు నిద్రలఁ గూఁకొడువారు
కొందఱు తెలినీరు గ్రోలెడివారు, నందఱు నీక్రియ నలసులైయుండ
నప్పుడు రవి చంద్రుఁడై తనువొగసఁగె, నప్పు డింద్రుఁడునించె నమృతంపువాన
యప్పుడు చల్లగా ననిలుండు వీచె, నప్పుడు సౌరభం బానంద మొసఁగెఁ
దరుచరులంత నుత్సాహులై శైల,తరువు లంబుధి మహోద్ధతిఁ దెచ్చి వైవ
నారభసంబున కతిభీతినొంది, వారిధిలోన జీవంబు లన్నియును
దెరలుచు నొరలుచు దిరుగఁబాఱుచును, నెఱయుచు నటఁ దలలెత్తి చూచుచును
ముందటిపగిది నమోఘబాణంబు, మ్రందింపఁ వచ్చునో మమ్మెల్ల ననుచుఁ
దలఁచి యంతటిలోనఁ దగిలినభీతిఁ, దెలిసి సేతువు గట్టు తెఱఁగు నానెఱిఁగి
మఱిసంతసంబులు మదిలోనఁ గలిగి, వఱలు నిజేచ్ఛల వర్తించుచుండెఁ
బంధురంబుగఁ గపిపతులు నాఁడబ్ధిఁ, బంధించి రెలమి నేఁబది యోజనములు
రవి గ్రుంకె నంత మర్కటనాథులెల్ల, నవిరళలీల సంధ్యలు వార్చిరంతఁ
బంతంబు మెఱయంగఁ బదియోజనంబు, లింతియ గట్టుట యెల్లి యీజలధి
నని మాటలాడుచు నరిగి వేలముల, ననుపమలీల నిద్రానంద మొంది
యుదయావసరమున నుర్వీశుఁ జేరి, ముదమునఁ గపిరాజముఖ్యులు మ్రొక్కి
పని విన్న వముచేసి పరవసంబొప్పఁ, జని తరువులు మహాశైలంబు లెత్తి
యనుపమలీలమై నతిశీఘ్రవృత్తిఁ, గొనివచ్చి నలునకుఁ గొమ్మని యొసఁగ

శ్రీరాములు సేతువును జూచి సంతోషించుట.

నప్పుడు శ్రీరాముఁ డాసేతువెల్లఁ, దప్పక కనుఁగొను తాత్పర్య మొప్ప
వనధీశ్వరుండును వనచరాధిపుఁడు, దనుజనాయకుఁడును దనుఁ జేరి కొల్వ
సౌమిత్రికరముపై సౌభాగ్యలీల, వామహస్తముఁ జేర్చి వడిఁ గట్టమీఁద
నన్నపురహఃసచంద్రికల్ వొలయ, నన్నరనాయకుం డటఁ జూచువేళఁ
దరుచరేశ్వరులెల్లఁ దరువులు గిరులు, బిరుదులై వడిఁ జేర్చి పెకలించి తెచ్చి
నలుచేతి కొసఁగ నానలుఁ డవిపుచ్చి, తలకొని కట్ట నాతఁడె యొక్కయుడుత
గొబ్బున సేతువు గొనసాగవలయు, నిబ్బలియులకుఁ దో డేనె గావింతు
ననుచు శ్రీరాముని యడుగుఁదామరలు, మనమునఁ జేర్చి యమ్మనుజేశునెదుర
నచ్చపుభక్తితో నల వార్ధి మునిఁగి, వచ్చి తా నిసుకలో వడిఁ బొరలాడి

తడయక చనుదెంచి తనమేనియిసుక, వడిఁ గట్టపై రాల్చి వనధిలో మునిఁగి
తేలి గట్టున కేగి తిరుగంగఁ బొరలి, వాలినభ క్తితో వచ్చి విదుల్చు
నివ్విధంబుననుండ నినకులాధిపుఁడు, దవ్వులఁ బొడఁగాంచి తమ్మునిఁ జూచి
పొందుగా లక్ష్మణ పొర్లదే చూడు, ముందఱ నొకతరుమూషకం బెలమి
నామీఁదభ క్తి యున్నతగతిఁ బూని, తా మేను జలములఁ దడిపి గట్టునకుఁ
జని వేగ నిసుకపైఁ జల్లాడి తిరుగఁ, జనుదెంచి కొండలసందున రాల్చి
కరమొప్పుచున్నది కపికులాధీశు, లురుభ క్తిఁ దరుగిరు లొగిఁ దెచ్చుచోటఁ
దానెంతయని మది దలఁపక ప్రేమఁ, బూని సహాయమై పొదలుచున్నదియుఁ
గనుఁగొంటివే యనఁ గమలా ప్తవంశ, కనుఁగొంటి భవదంఘ్రికమలయుగ్మమును
నెవ్వఁడు మది నిల్పి యెసఁగుఁ దృణంబు, నవ్వోల్పుగిరిబోలు ననినఁ గాకున్నె
కావున భ క్తియ కారణం బనఘ, ననవుడు ముదమంది నలినా ప్తసుతునిఁ
గనుఁగొని మఱి దానిఁ గనుఁగొనువేడ్కఁ, బెనఁగొనుచున్నది ప్రేమ నిచ్చటికిఁ
దెమ్మన్న వేగంబె దెచ్చి సుగ్రీవుఁ, డమ్మహాత్మునిచేతి కంది యిచ్చుటయుఁ
బలుదెఱంగులఁ జాలఁ బ్రస్తుతిఁజేసి, కలితదక్షిణకరాగ్రమున దువ్వుటయు
నలయుడుతకు వెన్క నమరేంద్రరేఖ, చులుకనై చూడ్కుల సుఖకరంబుగను
నెంతయు సంతోష మినుమడింపంగ, నంత లక్ష్మణుఁడును నబ్ధినాయకుఁడు
దనుజేశ్వరుండును దరుచరాధిపులు, ననయంబు సంతోష మతిశయింపంగ
నందందఁ గైకొని యలరుచునుండఁ, జందన మందార చంపక క్రముక
పున్నాగ సహకార భూరుహ ప్రతతు, లున్నచో విడిపించె నుర్వీశుఁ డంత
హనుమదంగదనీలహరిరోమకుముద, పనసాదివానర ప్రముఖులు గూడి
కనుఁగొన నాశ్చర్యకరమైనయట్టి, ఘనతరంబైన యాకట్టపై నిలిచి
బాపురే! యెంత నేర్పరియొకో! నలుఁడు, రూపింపఁ బెద్దయు రూఢికి నెక్కి
యరుగుదీర్చినమాడ్కి నలవడఁ దీర్చె, దొరకొని సేతువు దుదిదాఁక ననుచుఁ
దనబాహుబలమునఁ దనవిద్యకలిమి, ఘనమైన సేతువు గట్టె నీనలుఁడు
అది శతయోజనం బైనట్టినిడుపు, పదియోజనంబుల పరపును గలిగి
వెలసినమలయసువేలాచలముల, నొలసి యెంతయుఁ జూడ నొప్పువహించి
మెలఁగి యాడెడుగండుమీనమైరుచులు, వెలిఁగెడుచుక్కలవిధముననుండ
నిరుదెస నల్లనై యేపారు నబ్ధి, కరమొప్పుచున్న యాకాశంబుగాఁగఁ
గలయంగ దీపించె ఘనసేతు వపుడు, వెలసిననక్షత్రవీథిచందమునఁ
దనునట్లు గాంచిన తనవేర్మిఁ జూచి, తనరార మన్నింపఁ దగునని రామ
విభుఁ డాసముద్రుని వేఁడుకతోడ, నభయపట్టము గట్టె ననమించి మఱియు
నప్పుడు దేవత లామింటనుండి, యప్పారుపముఁ గన్నులారంగఁ జూచి
నిక్కంబు నిట్టిద నీచుమ్మదూ క్తి, జక్కనేలగు దండసాధ్యుండు గాక
యటు వేఁడుకొనుటయు నబ్ధిఁ గైకొనమి, నిటు సేయనేరఁడే యినకులేశ్వరుఁడ
చేకొని యెవ్వఁ డీసేతువుఁ జూచుఁ, జేకొని యెవ్వఁ డీసేతువుఁ దలఁచు

నతనికి విజయంబు నతులకీర్తియును, వితతపుణ్యంబులు వేవేగఁ గలుగు
నెంతకాలంబేని నీసేతు వుండు, నెంతకాలంబేని నీయబ్ధి యుండు
నంతకాలము రాఘువాధీశుకీర్తి, యంతంత కెక్కుచు నానందమొసఁగు
నని మదిలోపల హర్షించుకొనుచుఁ, దనువునఁ బులకలు తఱుచుగా నెగయఁ
బువ్వులవానలు పొరిఁబొరిఁ గురిసి, రవ్వేళ దేవతూర్యంబులు మ్రోయ
నప్పుడు రఘురాముఁ డానందమొంది, యొప్పునేతువుఁ జూచి యొనర నిట్లనియె
నెలమితో నీసేతు వెల్లకాలంబు, నలువేర సేతువు నానొప్పుఁ గాత
అనుటయు రఘురామునానతి నలునిఁ, గనుఁగొని పొగడిరి కపివీరులెల్ల
ముదముతో నపుడు సముద్రుండు రాము, సదనంబునకు సైన్యసహితంబుగాఁగఁ
బొలుపార దోడ్కొనిపోయి దివ్యాస్త్ర,ములును దివ్యాంబరములు భూషణములు
నొకవజ్రకవచంబు నురుభక్తినిచ్చి, యకలంకచిత్తుఁడై యారాముఁ జూచి
రామభూపాలక రాజపుత్రులకు, నీమునివేషంబు లేల యుద్ధములఁ
జారువస్త్రములు భూషణములు నిపుడు, మీరు ధరింపుఁ డిమ్మెయి నుచితంబు
అనవుడు దివ్యాంబరాభరణంబు, ననుపమగంధమాల్యాదులు దాల్చి
చారుతేజముల భాస్వరమూర్తు లగుచు, నారవిచంద్రులో యన వెలుంగుచును
వననిధి యవుడు దీవనలతో ననుప, ననిలజనీలురయంసంబు లెక్కి
సకలదేవతలును సన్నుతిసేయ, సకలలోకంబులు జయవెట్టుచుండ
సకలతరంగిణీశ్వరు వీడుకొలిపి, సకలేశ్వరుం డనుజస్తుండుఁ దాను
రమణీయమైనట్టి రాక్షసలక్ష్మి, సీమంతవీధిపైఁ జెలఁగెడుమాడ్కి
మునుకొని లంకాభిముఖుఁడునై నడిచె, ఘనమైన సేతుమార్గంబున వేడ్కఁ
దగవిభీషణుఁడు గదాహస్తుఁ డగుచు, మొగిఁ గపిసేనకు ముందఱ నడిచెఁ
దనమంత్రులును దాను దర్పంబు మెఱసి, వినుతవిక్రముఁడు సువేలాద్రినుండె
మిగుల మొత్తంబులై మిన్నందియంది, నగచరసేనలు నడువంగఁ జూచె
వడిఁగొని సేతుక్రేవల వచ్చువారు, విడువక త్రోవల వెస వచ్చువారు
వేడుకతో వినువీధిఁ జన్నారు, నాడకాడకు గుములై యేగువారుఁ
దోయధిలోన నీదుచు వచ్చువారుఁ, బొయలుగాఁగూడ పఱుగిడువారు
నప్పుడు సేనలయార్పులమ్రోత, యుప్పొంగి వారాశి యురుఘూష మడఁచె
దివియుఁ బాతాళంబు దిక్కులు భువియు, నవిరళగతిచేత నల్లలనాడ
గడునొప్పసేతువుఁ గడచి యబ్ధంగి, విడిసె రాఘవుఁడు సువేలాద్రియందుఁ

శ్రీరాములు సువేలాద్రి చేరుట.

దడయక వనచరదళము లేతెంచు, కడుసంభ్రమముఁ జూచి ఘనధనుర్ఘోష
మడరింప బ్రహ్మాండ మవిసినట్లయ్యె, నుడువీధి జుక్కలు నుఱలె మ్రోయుచును
బెడిదంబుగా భూమి బెగడొంది యడరె, నుడుకారి వై దేహియుల్లంబు చెలఁగె
ఖండపరశు శిరఃకంపంబుఁ జేసె, దండి రాక్షసులెల్లఁ దల్లడపడిరి
చాయలచే రామజననాథురాక, యారావణుఁడు విని యఖిలరాక్షసులఁ

బిలిపించి నవరత్న పీఠంబునందుఁ, గొలువుండె నసురులు గొలువఁ బెక్కండ్రు
అంత నావృత్తాంత మంతయు నెఱిఁగి, చింతించి కైకేశి చిడిముడితోడ
వంతఁ గుందుచు మాల్యవంతునిఁ బిలిచి, యెంతయుఁ బొగలుచు ననియె నాతనికి
అలఘువిక్రమశీలుఁ డారామవిభుఁడు, చలమున వానరసైన్యంబుతోడ
విడిసెను వేలాద్రి వినుమింక లంక, చెడును దప్పదు బ్రహ్మశివులు గాచినను
బడుఁ డింక మనము నప్పజ్జికంరునిని, విదితంబుగా సీత విడుమని బుద్ధి
చెప్పి వ త్తము నీతి శిక్షింప యిపుడు, చెప్పిన మనబుద్ధి చెవియాని వినునె
యైనను తలిదండ్రు లైనట్టివారు, తనయుండు ధర్మంబు దప్పి నడిచినను
దగ బుద్ధిసెప్పుట తగవు ధర్మంబు, లగునంచుఁ జెప్పుదు రనఘాత్మ బుధులు
విను మున్నె నాకు నావిశ్రవసుండు, వినిపించె నంతయు విశదంబుగాఁగ
ననుచు దేవరహస్య మతనికిఁ జెప్ప, విని మాల్యవంతుండు వెఱగంది కూఁతుఁ
గనుఁగొని యది యట్ల కాకేల పోవు, మనబుద్ధి వినఁడని మానంగరాదు
అమ్మ నీవును నేను నద్దశాస్యునకు, నిమ్మహామంత్రంబు లిన్నియుఁ దెలియఁ
జెప్పుదు మనము మిాస్థితిగతులెల్ల, నిప్పుడె గదలుద మిది వేళగాన
వలనొప్ప నావిశ్రవసునియాపలుకు, దలగ బ్రహ్మాదులు దప్పింపలేరు
చెప్పుము నీవు నేర్చిననీతులెల్ల, నొప్పుగ ననవుడు నువిద యాఋణమె
పసిఁడిపల్లకిమిాఁదఁ బరఁగఁ గూర్చుండి, యసముతో నచ్చరయతివలు మోయ
ధవళాంబరంబులు తగునట్లు గట్టి, ధవళచామరములు ధవళమాల్యములు
ధవళగంధంబులు ధవళాక్షతములు, ధవళభూషణములు తలకొన్నప్రేమ
నవిరళంబుగఁ దాల్చి యతివై భవమునఁ, దవిలి దివ్యాంగనాతతివెంటనడువ
సుతభృత్యహితబంధుసోదరుల్ నడువ, వ్రతధర్మగుణచారువర్తనుల్ నడువ
శ్రుతిపాఠతంత్రులు సూనృతోన్నతులు, వ్రతధర్మగుణచారువర్తనుల్ నడువఁ
గిన్నరగంధర్వగీర్వాణసిద్ధ, పన్నగాసురయక్షభామలు నడువ
వంకృతియనుమాల్యవంతునివనిత, సంకృతి యనుమాలిసతి కేతుమతియు
మానినియైన సుమాలియింతియును, దానవాంగనలు గొందఱు వెండ నడువ
ముగ్గురుతల్లులు ముందఱ వెనుక, డగ్గరి నడువంగ ధవళచామరలు
గరుడగంధర్వాదికాంతలు వీవ, నరుగుచో నాట్యంబు లచ్చరల్ సేయ
బంధురంబుగ మిత్రభార్గితలైనట్టి, బంధుజనంబులు బలిమితో నడువ
యూపాక్షుఁ డతికాయుఁడొగి విరూపాక్షుఁ, డేపున ముందఱ నేచితో నడువ
ముదుకకుప్పసములు ముదముతోఁ దొడిగిఁ, ముదిసినరాక్షసముగ్ధలు నడువ
సందడిజడియంగ సాహో యటంచు, ముందఱ ఫణిహారముఖ్యులు నడువ
గురుతరబహువేదఘోషంబుతోడ, సరిలేని యాబ్రహ్మసభతోడఁ గదిలి
చంద్రదీధితులతో శారదాదేవి, యింద్రుమందిరమున కేతెంచుకరణి
మందారచంద్రికా మల్లికాశ్వేత, కందలహిమశైల కర్పూరహార
చందనగోక్షీర శరదిందురుచుల, నందమై విలసిల్లు నభినవస్ఫురణ

మందాకినీదేవి మఱి దివినుండి, బృందారకులు, దాను పృథివి కేతెంచి
విలసిల్లువిధమున వీక్షింప నొప్పెఁ, గలితనవీనమై కైకేశికొలువు
వరరత్నమణిగణవలయంబు లెలమిఁ, గరమొప్ప ముక్తాలకంరహారములు
వెఱపొప్పఁ దనమేన విలసిల్ల నమరి, మెఱుపులఁ దగుశుభ్రమేఘమో యనఁగ
దీపించు దేదీప్యతేజంబుగాగ, నేపారి యంతయు నిభములు నడువఁ
బ్రబలనీలాంబుదపటలంబుభంగి, నిబిడమై రాక్షసనిచయంబు నడువ
రథసింధుఘోటక రాజినైన్యములు, పృథివి బీటలువాఱఁ బెల్లుగా నడువ
వనజోదరునిపుత్రి వాహినుల్ గొలువ, నెనయంగ నజుసభ కేతెంచె ననఁగ
నమృతవారిధి వొంగి యఖిలదిక్కులకు, విమలమై యటు వెల్లివిరిసెనో యనఁగ
నరిది నక్షత్రంబు లన్నియు వచ్చి, గురిగాఁగ నొకచోటఁ గూడెనో యనఁగఁ
గుదధిముత్యములెల్ల నొక్కటై వచ్చి, పొదిగొని లంకలోఁ బొడమెనో యనఁగ
దిగ్గని వెన్నెలదీవియో యనఁగ, నిగ్గైన గొడుగులనిచయంబు మెఱయ

నీభంగి నప్పు డయ్యింద్రారిసభకుఁ, బ్రాభవస్ఫురణమైఁ బరఁగ నేతేర
విభవశుభాచార వినుతులు చెలఁగ, శుభలీలఁ గైకేశిఁ జూచి రావణుఁడు
ముదముతో గద్దియ మొగి డిగ్గి వచ్చి, ముదితకు నందంద మ్రొక్కి కైదండ
ప్రమదంబుతో నిచ్చి పల్లకి డించి, యమరారిఁ గొనివచ్చి యాస్థానమునకు
దనభద్రపీఠంబు దరియఁగ నొక్క, కనకాసనం బిడి కైకేశి యందుఁ
గూర్చుండఁ దల్లులఁ గూర్తిసోదరులఁ, గూర్చినభక్తితోఁ గూర్చుండుఁ డనఁగ
నంతరాంతరముల నందఱు నంత, నంతంతఁ గూర్చుండి రర్ఘ్యపీఠముల
నంత నాకైకేసి యనుమతిఁజేసి, చింతామణీభద్రసింహాసనమున
దానవేంద్రుండును తత్ప్రీకారమున, నూనినసంతోష మొప్పఁ గూర్చుండి
యచలితమతిమంతు నస్మాల్యవంతు, నుచితాసనంబున నుండంగఁ బనిచి
యావేళ రావణుం డమరవల్లభుని,భావంబు గైకొని భాసిల్లుచుండె
నలయుమ్రోతయులేని యంబుధికరణి, యలబలం బుడిగె నాయసురేశుకొలువు
ఆలోన నమరారి హస్తము ల్మొగిచి, కైలాసనిభకేళి కైకేశి కనియె

జనయిత్రి యిబ్భంగి జననులతోడ, నెనయంగ నాసభ కెన్నఁడు రావు
చాలంగ నామది సంతోషమయ్యె, నేల విచ్చేసితి వెఱఁగింపు మనిన
నప్పుడు కైకసి యస్మాల్యవంతుఁ, దప్పక కనుఁగొని తగునీతి మెఱసి
ప్రాభవస్ఫురణాఢ్యుఁ బ్రజ్ఞాకంధరుని, శోభనగుణశీలఁ జూచి యిట్లనియెఁ

కైకేశి రావణునకు బుద్ధి సెప్పుట.

దెలియంగ మీతండ్రి దివ్యరహస్య, మెలమిఁ జెప్పినవార్త లెఱఁగింతు వినుము
సురలు బ్రహ్మాదులు సొరిదిమై మునులుఁ, దరగనిభీతిచే దనుజారి చేరి
తమతమయిష్టములఁ దమపాటులెల్ల, దానవాంతకుతోడఁ దామొప్పఁజెప్పి
రావణకుంభకర్ణాదిరాక్షసుల, నేవగనైనను నేపడఁగించి
కావవే దీనులఁ గరుణచే ననుచుఁ, గమలజాసనుఁ డాదిగా సురలెల్ల

నభయదానము వేఁడ నతికృపాంభోధి, యభయంబు లిచ్చె నయ్యమరులకెల్ల
నినకులంబున జనియించి రాక్షసుల, ననిలోనఁ దునిమెద నవలీల ననుచు
వరమిచ్చి సకలదేవతల వీక్షించి, తరుచరులై మీరు ధరణి జన్మించి
యనిలోన నాకుఁ దోడగుఁ డని పలికె, నని చెప్పె మీతండ్రి యారీతి నిప్పు
డమరులు వానరులై పుట్టిరెలమి, నమరకంటక నిన్ను నణఁప శ్రీహరియు
వనజసంభవుఁ డిచ్చువరముఁ బొలించి, యినకులంబునఁ బుట్టి నిందఱుఁ బొగడఁ
జెనటితాటకిఁ జంపెఁ జిన్ననాఁడేచి, మునియాగరక్షణంబును జేసి కాచె
పదధూళిచే ఱాయి పడఁతిఁ గావించె, వదలక జనకభూవరువీటిలోన
నరుదరుదని జనం బభినుతినేయ, హరువిల్లు మోపెట్టి యవలీల విఱిచి
జనకభూపతి తనూజను బెండ్లియాడి, మొనచినపరశురాముని భంగపఱచి
తమతండ్రిపనుపునఁ దపసియై మునుల, కమితస త్త్వంబున నభయంబు లిచ్చె
ఘనువిరాధు గబంధుఁ గడువిక్రమమున, దునుమాడి విడువఁడే దోషాచరేంద్ర
వెఱపు చెప్పుటకాదు వేయుభంగులను, వెఱవకుండితివేని వేఁతేల నీదు
చెలియలిముక్కును జెవులును బట్టి, బలిమిఁ గోసిననాఁడె పగగెల్వరాదె
ఘనఖరదూషణు ఖండించుమాట, విని యూరకుండుట వెఱచుటగాదె
మారీచు నొకకోల మడియించునాఁడు, నూరకె యొకవంక నొరిగితి వీవు
రామునిముందఱ రమణిఁ దేలేక, యేమఱుపాటున నెలనాగఁ గొంచు
వెనువెన్కఁ జూచుచు వెలవెల నగుచు, నెనలేనిభీతిచే నెలమిఁ బాఱుచును
వచ్చితిగాక భూవరుల జయించి, వచ్చితివా యోడి వచ్చితిగాక
సచ్చరిత్రను రామచంద్రునిదేవి, మ్రుచ్చిలి తెచ్చుట మొగతనంబగునె
వాలంబునను జుట్టి వారిధి ముంచు, వాలిఁ ద్రుంచుట నిన్ను వంచుటకాదె
యిన్ని యెన్నఁగనేల యినకులేశ్వరుఁడు, మున్నీరు నొకకోల మొనకుఁ దేలేదె
నేఁడోడితే రామ నృపశేఖరునకు, నాఁడోడితివి గాదె నాకేశవైరి
మాటిమాటికి ఱేల మనుజు లటంచు, నేటికి నాడెద వెంతయునేచి
ఘనతపోమహిమచేఁ గరుణించి నీకు, వనజభవుఁడు మెచ్చి వరమిచ్చువేళ
నరుల నెన్నకయున్న నాటితప్పెల్లఁ, దరమిడి నేఁడిదే తలకూడె నీకు
గెలువేది యిఁక నీకు గీర్వాణవైరి, చలమునఁ గులమెల్ల సమయింతుగాక
యేటికిన్నియు వెంచ నిపు డొక్కకోఁతి, దాఁటి సముద్రం బుదగ్రుఁడై వేర్చి
లంకలోపలఁ జొచ్చి లంక శోధించి, లంకిణిఁ బరిమార్చి లలి శంక లేక
జానకిఁ బొడఁగాంచి జననాథునేమ, మూనినభక్తితో నొనరంగఁ జెప్పి
మరలిపోవుచు నీదు మధువనంబెల్లఁ, బెరికి కావలికాండ్రఁ బెక్కండ్రఁ జంపి
యక్షకుమాశతో నసురాధిపతుల, నక్షణంబున నెందజైనను త్రుంచి
బలిమినట్లనయుండి పచరించి మఱియు, బలుమరి లంకను భస్మంబుఁజేసి
యావిమానము లేక యసురేశ దివికిఁ, బోవఁగా సురవరుల్ పొరిఁ బొరి నగరె
యింతనేసియు మఱి యిటఁ బట్టువడెనె, యెంతయు నెదురులే కేర్చి పెల్లార్చి

నీవును నీవారు నెరి చెడి చూడఁ, బోవఁడె యల వాయుపుత్రుండు తొల్ల
గురుసత్వమున నిన్ను గొనిపోయి రామ, ధరణీశుముందటఁ దటుకునఁ బెట్టి
తెచ్చితిఁ బొమ్మన్న దేవేంద్రవైరి, యచ్చట నీసత్త్వ మదియేమినేయు
నటుగాక యీలంక నగలించి పట్టి, తటుకున ధరణిపై దాఁటించెనేనిఁ
జిందరవందరై చెదరి పల్వగల, నందఱు ద్రుంగరె యమరు లుప్పొంగ
నతనికి నోడితి వసురాధినాథ, యతనియేలిక గెల్వ నలవియే నీకు
వనచరులని కదా వ్రాలుచున్నావు, వనచరులను గెల్వ వశమె మున్వినుము
వనచరుచేఁ జేటు వచ్చుఁ బొమ్మనుచు, గొనకొని నంది దాఁ గోపించి నీకుఁ
బాయ కిచ్చినశాపఫలమెల్ల నీవ, వాయుపుత్రునిచేత వాలిచేఁ గనవె
ఘాలాక్షవాసవబ్రహ్మాదివిజు, లీలీల వైత్యారి యిష్టంబునొంది
నీలంకయును నిన్ను నిఖలరాక్షసులఁ, గూలఁద్రోయుటకునై ఘోరరూపముల
భూలోకమున వచ్చి పుట్టిరికాక, యీలాగు వనచరు లెందైనఁ గలరె
యలఘుబలుండవై యఖిలలోకములఁ, జలము పెంపున గెల్చి చనుదెంచునపుడు
కిన్నరగంధర్వ కింపురుషాది, పన్నగగుహ్యకపక్షీంద్రయక్ష
సురవరమునివర సుదతులనెల్ల, బిరబిరఁ జెఱలను బెట్టెడువేళఁ
బరమపతివ్రత ల్వడవడ వణఁకి, పరకాంతనెపమున భస్మమై నీవు
కులముతో బలముతోఁ గూలిపొమ్మనుచు, నలిగి శాపంబిచ్చి రది తలకూడె
వాలికి నెక్కు డవ్వాలినందనుఁడు, వాలికి నెక్కు డవ్వాయుపుత్రుండు
వారు నిక్ రణములో వధియింపలేరె, వారికి నెక్కు డవ్వాలితమ్ముఁడును
సమరంబునను బలసహితంబుగాఁగ, సౌమిత్రి నినుఁ బట్టి సమయింపలేఁడె
మఱియొక్కటియు విను మనుజాశనేంద్ర, యరయంగ నీవింక నెఱుఁగవుగాని
రామలక్ష్మణు లేల రవిసూనుఁ డేల, కోమలి యాసీత కోపానలంబె
యరుదుగా బ్రహ్మరుద్రాదిదేవతలు, వరదులై యిచ్చిన వరములతోడ
హరుఁ డొసంగిన చంద్రహాసంబుతోడ, నరయ మూడరకోటి యాయువుతోడఁ
గైలాస మెత్తిన ఘనశక్తితోడఁ, జలనంబు లేనట్టి సంపదతోడఁ
దక్కనిభుజబలదర్పంబుతోడ, దిక్కులు గెలిచిన తేజంబుతోడ
రాక్షసకులముతో రావణ నిన్ను, నీక్షణంబునఁ బట్టి యెరియింపలేదె
పరమపతివ్రత పతియాజ్ఞ మీఱి, వెఱచి యూరకయుండ వ్రేగెడుఁగాని
ధర్మపతివ్రతఁ దగదన కీవు, కర్మపాశంబునఁ గైకొని తెచ్చి
యఱిముఱి చెఱపట్టి యాపుణ్యవతిని, మొఱఁగిన సంకటమునఁ బుట్టు వహ్ని
నిన్ను నీకులమును నీవారినెల్ల, నెన్ని భంగులఁ గాల్ప కేల పోనిచ్చు
ననుచేశ యిది యెట్టి దనినను వినుము, విడువక నీవు దిగ్విజయంబుచేసి
యకలంకగతి పూని యమరుల గెల్చి, సకలలోకంబులఁ జరియించునపుడు
ప్రథమయుగంబున బ్రహ్మర్షివరుఁడు, ప్రథితోరుసుజ్ఞానపరమార్థవిదుఁడు
పరమసాత్త్వికగుణాస్పదకుశధ్వజుని, వరపుత్రి యగువేదవతియును దలఁప

బరమపతివ్రత పాపాత్మ నీదు, వరగర్వమంతయు వమ్ముగాఁ జేసి
సుతులతోఁ సతులతోఁ సోదర ప్రభృతి, హితులతోఁ భృత్యసంహతులతోఁగూడ
నమితవిక్రముఁడైన నతనిచే నిన్ను, సమరంబులోపలఁ జంపింతు ననుచు
నరిమురిఁగోపించి యాధర్మశీల, మరగుచు శపియించె మఱచితే తొల్లి
యాసతి యీసీత యైనశ్రీదేవి, భూసుతయై పుట్టె భువనరక్షకుఁడు
ఆదినారాయణుం డంబుజోదరుఁడు, వేదవేద్యుఁడు రామవిభుఁడైనవాఁడు

వైకేశి రావణునకు రామునిమహిమ చెప్పుట.

అసురుల మర్దింప నమరులఁ గావ, వసుమతి రక్షింప వచ్చె విష్ణుండు
ఎఱుఁగ నీవును నేను నెంతటివార, మెఱుఁగరు బ్రహ్మరుద్రాదిదేవతలు
పుట్టించుఁ బోషించుఁ బొలియించుఁ బిదప, నెట్టనుగాక తా నేకమైయుండు
నతఁ డందఱికి మేటి యాతనితోడఁ, బ్రతిపోల్పఁ దలచినఁ బాపంబుగాదె
చెదరి లోకములెల్లఁ జెడినపిమ్మటను, వదలక యుండెడువాఁడువో యతఁడు
శరణన్న వేగ నా సామజవరునిఁ, గరుణ లీలామతిఁ గాచె నీఘనుఁడు
మధుకైటభాదుల మహిరాక్షసులను, నధికతేజస్ఫూర్తి నణఁచె నీఘనుఁడు
సొచ్చి సోమకుఁ జంపి శ్రుతు లర్థితోడఁ, దెచ్చి బ్రహ్మకు నిచ్చి దీపించె నితఁడు
అమృతాబ్ధి దాఁ ద్రచ్చి యమృతంబు వడసి, యమరులకును నిచ్చెనరయ నీఘనుఁడు
భాసురంబుగ దైత్యుఁ బట్టి శిక్షించి, భూసతి నెత్తిన పుణ్యుఁ డీఘనుఁడు
కడఁగి బాలుని గావఁ గంబాన బొడమి, తొడరి హిరణ్యాక్షుఁ దునిమె నీఘనుఁడు
ధరణి మూఁడడుగులఁ దానర్థి వేడి, వెరఁగి యాబలిఁ జెరవెట్టె నీఘనుఁడు
రాజసంబున భృగురాముఁడై పుట్టి, రాజుల ద్రుంచిన రణదక్షుఁ డితఁడు
తప్పక చెప్పితి దనుజలోకేశ, యిప్పుడు దేవతాహితము చింతించి
రాముఁడై జనియించె రవివంశమునను, దామసగుణమేఁచి దనుజేశ నీవు
ఏమిపాపమొకాని యెఱుకచొప్పడదు, కామాంధునకు ధర్మగతు లేల కలుగుఁ
గొడుకుచేనైన ననుఁ గూతుచేనైన, నడరి కీర్తియకాని యపకీర్తిగాని
వచ్చు గోత్రమునకు వడిఁ బెద్దలకును, జెచ్చెర నని జను ల్చెప్పెడిదెల్ల
నరయ నిందలు రెండు ననురేశ చూడ, మఱియెవ్వరికి వచ్చె మనకుఁగా కిపుడు
అది యెట్టిదంచేని నంతయు వినుము, మదిఁ గొంత దలఁపక మనశూర్పణఖయు
ఆయన పరమాత్ముఁ డనక కామించి, పోయి ముక్కును చెవు ల్పోకార్చుకొనియెఁ
బరసతి యన కాసపడి పట్టి తెచ్చి, కరకరిఁ గులమెల్లఁ గాల్చెద వీవు
ఇంతకంటెను నింద యింక నెందుఁ గలదు, పంక్తికంధర యిట్టి పాపంబు లేల
బలసి రక్షోరాజ్యప్రముఖు లందఱును, నెలమి విష్ణునితోడ నెదిరించెకాదె
చక్రంబుఘాతకు సైరింపలేక, శుక్రశిష్యులు భువిఁ బొచ్చిరి వెఱచి
శంకలేటికి నీవు జన్మించువెనుక, గ్రుంకిన రాక్షసకులమెల్ల నెగడె
నని మనంబునఁ గొంత యలరుచుండంగ, దనుజేశ తలఁపులు దలకూడదయ్యెఁ

వైకేళి రావణునికి జలప్రళయము చెల్పుట

జేకొని లోకముల్ చెడినపిమ్మటను, యేకమై యుదకంబు లేపారుచుండ
మక్కువ నాజలమధ్యంబులోన, నొక్కఁడై తనకుఁ దో డెవ్వరు లేక
బాలుఁడై యట వటపత్రముమీఁద, లోలతఁ దేలాడు లోకరక్షకుఁడు
కమనీయ మగుసృష్టికార్యంబునందు, విమలచిత్తంబున వెసనున్న నంతఁ
గమలోదరునినాభిఁ గమలంబు పుట్టెఁ, గమలంబులోఁ బుట్టెఁ గమలసంభవుఁడు
కమలాసనుఁడు సృష్టికార్యంబుకొఱకు, నమర నవబ్రహ్మ లనువారిఁ బడసె
వరపుణ్యులైనట్టి వారిలోపలను, బరమాత్ముఁడయ్యె నాపాల స్వయంభుఁడు
గమలా ప్తనిభునకు ఘనయశోనిధికి, విమలాత్ముఁడై పుట్టె విశ్రవసుండు
నరుదార జన్మించి తతనికి నీవు, పరికింప నాలవ బ్రహ్మవుగావె
బ్రహ్మసంతతి యేడ పరదారలేడ, ఇమ్మహాపాతక మిటు సేయు టేడ
చెఱొని లోకము ల్చెఱిచెద వీవు, లోకరక్షణగుణలోలురు వారు
ధర్మభూతకుఁడవై తనరుదు వీవు, నిర్మలధర్మైకనిపుణులు వారు
మీఱి తాపసులను మ్రింగెద వీవు, వారు తాపసులను వడిఁ బ్రోతురెపుడు
చేరి పరస్త్రీలఁ జెఱుతువు వీవు, పరదారరక్షకు ల్పరికింప వారు
వేదబాహ్యుండవై విహరింతు వీవు, వేదార్థసత్కర్మవిహితులు వారు
ధర్మ మెక్కడనుండుఁ దగిలి దైవంబు, నిర్మలస్థితితోడ నిలుచు నక్కడను
ఎక్కడ దైవంబు లింపారుచుండు, నక్కడ విజయంబు లమరుచునుండు
వరమిచ్చి చెఱిచిన వనజజుతోడ, నురగకంకణుతోడ నురగులతోడ
సురసిద్ధఖేచరు ల్సుముఖులై వచ్చి, యరిమురి నీకుఁగా నడ్డంబు నిలిచి
కాచినానైనను గాకుత్స్థవంశుఁ, డేచిన నినుఁ జంప కేలఁ బోనిచ్చు
నొప్పదొప్పదు చల మొప్పదు విడువు, తప్పక చెప్పితి దనుజలోకేశ
వాలినవరగర్వవహ్ని లోపలను, నేల కాలెదు వడి యెంతయు నేచి
బద్ధవైరము మాని పరికించి నాదు, బుద్ధి నిర్మలమగుబుద్ధిలోఁ గొనుము
తల్లిదండ్రులబుద్ధి దలమోచుధర్మ,వల్లభునకుఁ గీడు వచ్చునే తలఁపఁ
దల్లి చెప్పినమాట తగదన కీవు, ప్రల్లదంబుల మాని పరికించి వినుము
అక్షరుండు మృత్యుండు నఖిలరూపుండు, పక్షీంద్రవాహుఁడు పరమపావనుఁడు
మోక్ష మియ్యఁగఁజాలు మోహనమూర్తి, రక్షకుం డురుకీర్తి రణకర్కశుండు
ఆదినారాయణుం డమరులఁ బ్రోవ, మోదంబుతో మునిముఖ్యులఁ గావ
భూదేవిభారంబుఁ బుచ్చిపోవైవ, నాదశరథునిక ట్లమరి జన్మించె
నేరాజు జలధుల నింకింపఁజాలు, నేరాజు హరువిల్లు నెలమి మోపెట్టి
తృణలీల విఱిచెను దివిజు లుప్పొంగ, గుణరత్నఘనఖని కోదండగురుఁడు
మనుకులాధీశుండు మాధవుం డరయ, ననవంశదేవియా యిందిరాదేవి
జగతీతనూజాత జగదేకమాత, నిగమసన్నుతపూత నిగమవిఖ్యాత
యమితగుణోపేత యైనయాసీతఁ, బ్రమదంబుతో నీతి పాటించి బుద్ధి

సకలభూషణమణిసహితంబుగాఁగ, సకలేశుఁ డగురామచంద్రుఁ బ్రార్థించి
యిప్పుడె కొనిపోయి యెలమి రామునకు, నొప్పించి నీప్రాణ మొగిఁగాచుకొనుము
తానొరువరములు దప్పించుఁగాని, తానిచ్చువరములు దప్పింపలేఁడు-
గురుధర్మపోషణగుణు విభీషణుని, హరిభక్తితోషణు ననఘుపోషణుని
సమరవిభీషణు సత్యతోషణునిఁ, గ్రమమొప్పఁ గనుటయుఁ గడుఁలెస్స నీకు
నతిమృదుభాషణు నావిభీషణుని, నతివేగ ప్రార్థించి యతని రావించి
పరఁగ లంకారాజ్యపట్టంబు గట్టి, శరణని మ్రొక్కు మాజననాయకునకు
శరణన్న నెటువంటి చందంబునందుఁ, గరుణతోఁ గాచు నాకరిగాచురీతి
నని పెక్కుభంగుల నధ్యాత్మవిద్య, ఘనమతియైనట్టి కైకేశి తనకు
నిర్మలతరపుణ్యనీతిమార్గంబు, ధర్మతత్పరబుద్ధి దగిలి చెప్పినను
దలలకెల్లను బెద్ద తలయైనయట్టి, తలతోడఁగూడ నాతలలెల్ల వంచి
దండప్రణామంబుఁ దగనాచరించి, నిండినభక్తితో నిలిచి రావణుఁడు
ఆసనత్నుతునిచే నట మున్ను విన్న, భాసురంబైనట్టి పరతత్త్వమెల్లఁ
దనకు సిద్ధించుటఁ దనలోనఁ దెలిసి, మనమున నెంతయు మగ్నుఁడై యపుడు
తలకొన్నవేడ్కతోఁ దలలెల్ల నెత్తి, తలఁపక యప్పుడు తల్లితో ననియె
నెఱుఁగుదు మున్ను నే నెఱిఁగినయట్టి, మొఱఁగులుగలవె యీమూఁడులోకములఁ
దరమిడి యీపరతత్త్వంబు తెఱఁగు, లెఱిఁగి యెఱుంగవు హృదయంబు చెదరి
తల్లి నీవెఱిఁగిన ధర్మశాస్త్రంబు, లెల్ల నిష్ఫలములై యిప్పుడు తోఁచెఁ
దల్లిదండ్రులపల్కు తప్పు లెన్నైన, నుల్లంబులో నాఁటి యుండవుగాని
యీమహాత్ముఁడు విష్ణుఁ డైనరామునకు, నీమేనితోఁ బోయి యే మ్రొక్కఁజాల
హేయపదార్థమై యెసఁగుచున్నట్టి, కాయంబు పెంచుట కష్టంబుగాదె
నరులు వానరులు నెన్నఁగ నెంతవారు, సురలకన్నను వారు శూరులే తలఁప
గెలుతు నవశ్యంబు గెలుపులేకున్న, నిల రాముశరముల నీల్గుదుఁ గాని
హీనమానవునకు నే మ్రొక్కఁజాల, మాను మిమ్మాట ముమ్మాటి కోయమ్మ
చాలు నీబుద్ధులు చాలు నీమమత, చాలించవై తేని జనని విచ్చేయు
గొనకొని నీపిన్నకొడుకుతోఁ గూడి, యెనలేనిసంపద నేలు మీలంక
ఈలోకసంపద లిన్ని నీకృపను, నాలోలమతి నేను ననుభవించితిని
బలిమిని గలిమిని భయమింత లేక, బలిసి లంకేలితిఁ బదిలఱేఁడు
లెలమి నాకును నెదు రెవ్వరు లేక, విలసిల్లు ప్రాభవవిభవంబు మెఱసి
విచ్చేయు నగరికి వేగంబ యనిన, నచ్చుగా రావణుం డాడుమాటలకుఁ
గైకేశి మదిలోనఁ గడుచోద్యమంది, యాకొడుకును జూచి యనియెఁ గ్రమ్మఱను
వరతపోనిధి విశ్రవసుఁ డానతిచ్చు, పరతత్త్వ మదియేల పడిపోవ ననుచు
వనిత యప్పుడు మాల్యవంతునిఁ జూచి, మనమెంత చెప్పిన మానునే యితఁడు
అన విని యిట్లనె నమ్మాల్యవంతుఁ, డెనయంగ నీవిప్పు డేల చెప్పెదవు
జడునకు నార్యులు చాటువాక్యములు, కడుబ్రీతిఁ జెప్పిన గాదని వినఁడు

గానఁ గానఁడు వీఁడు కార్యంబుతెఱఁగు, మానుము నీవింక మానిని లెమ్ము
అనవుడుఁ గైకేశి యట్లకాకనుచు, నెనయంగఁ జెడుత్రోవ యేటికిఁ దప్పు
నే తెఱంగునఁ బోవదిది దైవకృత్య, మోతండ్రి మననీతి యుచితమే యనుచు
దాతయుఁ దానును దలకెడువగల, భ్రాతలు దల్లులు బాంధవుల్ గలఁగఁ
జని యప్పు డాసభాసదనంబుఁ బొసి తననగరికిఁ బోయి ధర్మక్రమంబుఁ
దననిత్యకర్మంబు దప్పక యఫుడు, మనమునఁ దెలిసి సమ్మదమున నుండె
నట దశగ్రీవుండు నధికదర్పమునఁ, బటుతరనిస్సాణభాంకృతుల్ చెలఁగఁ
జేయించి రాక్షససేన రావించి, యా యోధనోద్యుక్తు లై యేపుమీఱి
యున్నమంత్రులఁ జూచి యుగ్రుఁడై పలికెఁ, గన్నులఁ గోపంబు కడలుకొనంగ
శ్రీరాముఁ డిప్పు డీసేతువుఁ గట్టి, వీరుఁడై వచ్చి సువేలాద్రి విడిసెఁ
బటుగతి నామీఁదఁ బగవాఁడు రాఁగ, నిట నిద్రవోవుట యేనేర్పు మీకు
మిమ్మేమి చేయదు మిము మంత్రు లనుచు, నమ్మిన వీఱిడి ననునండ్రు గాక
కాదుపో మీరుపేక్షపరులైన, నాదెస కీడొందునా యివ్విధమున
సామభేదంబులఁ జక్కఁ గాకున్న, రామునితోఁ బోర్చి రణమునేనెదను
అని రావణుండాడ నఖలరాక్షసులు, దనకినసిగ్గులఁ దలలెత్తలేక
యూరకుండిరి యూరకుండ నేలసుచు, ధీరుఁడై యావేళ దివిజారియైన
రావణుతోడ దర్పంబునఁ దనదు, చేవ దోపఁగఁ నింద్రజిత్తుండు పలికె
దేవ రావణ సర్వదేవసంఘముల, నావిధంబున గెల్చు నంతటినీకు
నిలయేలఁగాలేని యీరామలక్ష్మణులచేత నేకీడు నూల్కొను నింక
వలదు చింతింప నే వ్రాలినవాఁడ, నలవు చలంబు ధైర్యముఁ గలవాఁడ
నాగపాశంబుల నాకేశుఁ గట్టి, యాగతి నేపనా యసురాధినాథ
కాలకేయాదిరాక్షసవీరవరుల, దోలనా దానవోద్ధురసంగరముల
మనుజులఁ గృశులఁ దామసుల దుర్బలుల, దసుజేశ దశరథతనయుల నాకుఁ
జంపుట పెద్దయే సమరంబులోనఁ, జంపెద నీమది సందేహపడకు

రావణున కతికాయుఁడు నీతి చెప్పుట.

మన విని యతికాయుఁ డనువాఁడు పలికె, దనుజేశ్వరునితోడఁ దద్ జ్ఞులు మెచ్చ
విను దానవేశ్వర విశదనీతిజ్ఞుఁ, డనుపెంపుతోడ నీయఖలంబు నెఱుఁగఁ
బరులసొమ్ముల కాసపడక వర్తించు, నరనాథుఁ డిలయెల్లనాఁడును నేలు
నిది నీతిగతి యని యిచ్చుఁ జింతింప, కెదురెందు లేదని యేల చూచెదవు
ఇనకులోత్తముఁడు నీకెగ్గేమి చేసె, దనుజేశ నీకు నాతనిదేవి యేల
నీదైనలంకయు నిన్నును జెఱుప, నీదుష్టరాక్షసు లెత్తుకొన్నారు
గావున సీత రాఘవునకు నిచ్చి, యావిభీషణునకు నట లంక యిచ్చి
యూనినభక్తితో నూరకయుండి, మానితంబుగ బుద్ధిమంతుండ వగుము
అని పెక్కుభంగుల నతికాయుఁ డపుడు, తనతోడఁ బలుకంగ దనుజేశ్వరుండు
శుకసారణులఁ జూచి శూరుఁడై పలికె, నొకమానవుం డబ్ధి నుఱుక బంధించె

ఘనుఁ డిట్టివాఁ డెందుఁ గలఁ డది చిత్ర, మనయంబు రాముఁ డీయబ్ధిని దాఁటె
ననుచున్నవారు మీ రానేనఁ జొచ్చి, ఘనమతులై యెల్లక్రమము వీక్షించి
రండని పనిచిన రయమున వారు, దండి వానరవేషధారులై నచ్చి
వనములయం దుపవనములయందు, ననుపమలీల మహాద్రులయందు
వరసేతువందు నవ్వార్ధికవ్వలను, గురుగుహాంతరములఁ గొమరైనయెడలఁ
గలయంగ విడిసిన కపిసేనఁ జూచి, తలయూచి వెఱగంది తలకి యాచరులు
మేనులు గరుపార మెల్లనఁ జొచ్చి, వానరసేనలో వచ్చుటఁ జూచి
యెఱిఁగి విభీషణుం డేచి పట్టించి, యురక వాండ్రను రాముకొద్దకుఁ దెచ్చి
మనుజేశ రావణమంత్రులు వీరు, వనచరవేషులై వచ్చినవారు
శుకసారణులు వీరు సొచ్చి యివ్వీట, సకలంబుఁ గనుఁగొని చనఁగలవారు
అనవుడు వారలు నతిభీతినొంది, ముసుకొని చేతులు మోడ్చి మ్రొక్కుచును
దేవ రావణుఁడు పుత్తెంచినచరుల, మీవిభీషణుమాట లిన్నియు నిజము
ఏచి యారావణుం డెలమి మీసేనఁ, జూచిరమ్మనవుడుఁ జూడ వచ్చితిమి
అనుటయు నవ్వచ్చు ననియె రాఘవుఁడు, వినుఁడు రావణుమంత్రివిభులౌటఁ జేసి
మిమ్ముఁ జంపుట దగు మిముఁ జగపఁగాని, మిమ్ముఁ జంపఁగవచ్చు మేలేమి నాకు
నదిచెప్పనేల వీడంతయుఁ జూడుఁ, డదిచూడు మిదిచూడ మనక మీరిప్పు
డిట తెఱిఁగొనక వీడంతయుఁ జూడుఁ, డటఁ బోయి వెసఁ జెప్పుఁ డారావణునకు
నేలావు నమ్మి నీ విట సీతఁ దెచ్చి, తాలావుఁ జూప రమ్మనుఁ డాజిలోన
నెల్లి యీలంకయు నెల్లరాక్షసులఁ, ద్రుళ్లెడి నిన్నును దునుమాడు ననుఁడు
చనుఁడని రావణుచారులఁ బనిచె, జననాథుఁ డారామచంద్రుండు ప్రీతి
వారు విభీషణువలన నవ్వీట, వారక సకలసిబు వడిఁ జూచి పోయి
రావణుఁ గాంచి యారావణుతోడ, దేవ నీపంచినతెఱఁగునఁ బోయి
కపిసేనయంతయుఁ గనుఁగొనుచుండ, నెపమాత్రమున మమ్ము నీతమ్ముఁ డెఱిఁగి
పట్టించి కట్టించి భానుకులేశు, కిచ్చుదిరికిఁ దెచ్చెఁ గలుషంబుతోడఁ
జంపింపఁ దలఁచిన సదయుండుగానఁ, జంపింపఁడయ్యె నిక్ష్వాకువల్లభుఁడు
నీలంకయును నిన్ను నిఖలరాక్షసుల, నాలంబులోపల నడఁగించుటకును
రామభూపాలుశౌర్యముఁ జెప్పనేల, సౌమిత్రి యొక్కఁడే చాలు లంకేంద్ర
సురవైరి సేతువుఁ జూచితి మెందు, నెరసి వానరసేన నిండియున్నయది
అది శతయోజనం బైనట్టినిడుపు, పదియోజనంబుల పరపుగలిగి
కపిసేన నెంతయు గణుతింపరాదు, కపులాడకాడకు ఘనగిరులండు
విడిసినసేనయు విడియుసేనయును, విడిదలపట్లకు వెడకుసేనయును
నుదధికి నవ్వలనుంచుసేనయును, వదలక మఱియును వచ్చుసేనయును
నైయుండుటకు మాకు నాత్మలో వెఱఁగు, పాయనివెఱపును బ్రభవించె దేవ
యొక్కొక్కచోటన యున్నయాసేన, లెక్కించి బ్రహ్మయ లిఖియింపలేఁడు
కాన నారామునిఁ గని సీత నిచ్చి, దానవనాథ మోదంబున నుండు

మనవుడు రావణుం డామాటలెల్ల, విన నింపుగాక గ్రొవ్వినరోష మెత్తి
దేవగంధర్వ లెత్తిననైన సీత, నే విడుతునె యేల యీపందతనము
మిమ్ముఁ గోతులు పట్టి మెచిచిన మీరు, బమ్మరవోపుచుఁ బఱతెంచినారు
వలవ దోడకుఁడు దుర్వారులై మిమ్ము, దలఁచి కోఁతులు రారు దాడిమై వెనుక
నని ధీరుఁడై పల్కి యారావణుండు, చని తనతో శుకసారణుల్నడువ
మిక్కిలి పొడవైన మేడపై నెక్కి, యక్కపిబలముల నంతయుఁ జూచి
యచ్చెరువంది తాననియె వారలకు, నీచందమునన్న యీనేలలోన
నెవ్వఁడు ముంగల నేపారి నడుచు, నెవ్వఁడెవ్వఁడు వెన్క నేమఱకుండు
నెవ్వఁడు శూరుఁ డిందెవ్వఁడు వలఁతి, యెవ్వనిమాట లయ్యినసూతి నేయు
నెవ్వనితో రాముఁ డిష్టంబు పలుకు, నెవ్వనిచే నేన యేపారియుండు
నెవ్వరు రేపగ లీనేనఁగాతు, రెవ్వరు సామంతు లీనేలలోన
నెవ్వఁడు సుగ్రీవుఁ డెవ్వఁడు రాముఁ, డెవ్వఁడు లక్ష్మణుఁ డేరూపువాఁడు
చూపుఁ డేర్పడ మీరు చూచితిరేని, గోపింప నేవారి గుణములు విన్న
ననవుడు సారణుఁ డారావణునకు, వినుపింపఁ దొణఁగెఁ బ్రవీణత మెఱసి

దేవ పులిందానదీతీరవర్తి, పావకసుతుఁడైన ప్రబలు డీథాత్రి
వీఁడె యీలంకెల్ల వెసఁ బెల్లగిల్లఁ, బోడిమి నార్పులు బొబ్బలు చెలఁగఁ

రావణునకు శుకసారణులు కపిపుంగవులఁ దెలుపుట.

గురుతరకపినాయకులు లక్షగొలువఁ, దరుచరసేనముందఱ నున్న వాఁడు
అలము సత్వుఁడు నీలుఁ డసువాఁడు దేవ, జలజాప్తసుతునకు సైన్యపాలకుఁడు
వీకతో దిక్కులు వెసఁ బెల్లగిల్లఁ, దోఁకఁ దాటించుచు దుర్దమవృత్తి
వెఱగందఁజేయుచు వేయుపద్మములు, మఱి నూఱుసంఖ్యలు మర్కటోత్తములు
బలవంతులగువారు బలసి తన్గొలువఁ, గొలువున్న వాఁ డొక్కకొండయఁబోలె
వాలినందనుఁ డల్లవాఁడె యంగదుఁడు, వాలికంకెను బలవంతుఁడు వీఁడు
అడరంగ నాచందనాద్రివల్లభుఁడు, కడుఁ బ్రసిద్ధుఁడు విశ్వకర్మనందనుఁడు
వినుఁ ప్లవంగంబులు వెయుఁగోటులును, నెనుబదిలక్షలు నేపారి కొలువ
ఘనమైనసేతువుఁ గడఁకతోఁ గట్టి, వనచరసేన నవ్వలికి దాఁటించి
వ్రాలిననలుఁడుపో వాఁడు వైశ్యేంద్ర, వాలినందనున కవ్వలనున్న వాఁడు
తపచరయూథముల్ తనుఁ బెక్కుగొలువ, సురలోకకంటక సుతరుఁడన్వాఁడు
తనసేనతోఁ గూడ తానొక్కరుండు, మనలంక సాధింప మండుచున్నాఁడు
రజనీచరాధీశ రమణీయకాంతి, రజతాద్రి బోలుచు రవిపుత్రునెదుర
బలముల నన్నింటి బరిపాటి దీర్చు, వలతి యాశ్వేతుఁ డన్వానరుఁ జూడు
గురుబలాఢ్యులు వేయుకోటులు గొలువ, వఱలు నాతఁడు వెగవంతుఁ డన్వాఁడు
చూడుము మనదిక్కుఁ జూచుచున్నాఁడు, చూడుము లంకేంద్ర సుగ్రీవసఖుని
దగ వింధ్యశైలసుదర్శనముఖ్య,నగములకెల్లను నాథుండు వాఁడు
కోమరాడుసింగపుఁగొదమయుఁ బోలె, నమరినవాఁడు లంకాధీశ వినుము

గాంభీర్యవారిధి కపిలవర్ణుండు, రంభుండు ఘనకేసరంబులవాఁడు
బలువిడి నూటముప్పదిలక్షల లెలమి, గొలువనున్నాఁ డిదిగో చూఁడు దేవ
కుముదుఁ డన్వాఁడు సంకోచనాచలము, సమరంగఁ బొలించు సమరారి యతఁడు
పదికోట్లయగచరపతు లోలిఁగొలువ, మదమున మలయు నామక్కటుఁ జూడు
రమ్యశైలమునకు రాజైనవాఁడు, రమ్యోరువిశ్రుతోరస్థ్సలుం డతఁడు
నలువదిలక్షలు నాలుగువేలు, గొలువంగ లంకపైఁ గోపంబుమీఱఁ
గుదియక నిరుఁగెలంకులఁ జూచువాఁడు, త్రిదశారి యదె చూచితే శరభుండు
బలసి తన్నెప్పు డేఁబదికోట్లకపులు, గొలువ నున్నాఁడదే గురుసత్త్వధనుఁడు
పారియాత్రాచలపతి ఘోరసమర, ధీరుండు పనసుండు దేవేంద్రవైరి
లలినొప్పు డెబ్బదిలక్షలకపులు, గొలువ నున్నాఁడదె గురుబలోన్నతుఁడు
సింధురగతిఁ జాయ చెన్నగ్గలించి, యందమా క్రోధనుం డనువాఁడు దేవ
యేనె చాలుదు లంక నిలఁ గూలఁద్రోయఁ, గానని వూని యిక్కడఁ జూచువాఁడు
బలవంతులగుకపు ల్బలసి తన్నెపుడు, లలినొప్ప డెబ్బదిలక్షలు గొలువ
గవయుఁ డున్నాఁడదే కనుఁగొను దేవ, వివిధప్రతాపసంవృతుఁ డైనవాఁడు
కామరూపులు వీరు ఘనఘోరసత్త్వ, లీమెయి ననిలోన నెక్కుడౌవారు
తలపోయఁగా దేవదైత్యులకైన, గలఁగనివారు ముంగలివారు వీరు
నడుమ నెప్పుడును నేనాసమేతముగ, నడతెంచువారి దానవనాథ వినుము
ఋరుభుజు ల్వివిధవర్ణోజ్జ్వలు లద్రిచరులు నానాసహస్రంబులు గొలువ
నీతోడ నెక్కటి నెఱి బోరఁ దివురు, నాతండు హరుఁడను నగచరోత్తముఁడు
నలుపెంతయును మీఱు నానావిధముల, నెలుఁగులసంఖ్యలు నేపారి కొలువ
నతినీలమేఘమధ్యస్థుఁడై పొలుచు, శతమఖుఁ బోలి యుజ్జ్వలుఁడైనవాఁడు
నర్మదాతీరంబునకు ఋక్షనగముఁ, బేర్మితో నేలెడు పృథుబాహుబలుఁడు
వాఁడె ధూమ్రుఁడు జాంబవంతతమ్ముండు, వాఁడిమిఁ దనయట్టివారు తన్గొలువ
నీలశైలంబుల నెలవెల్లఁ దార, యై లీలనొప్పిన యాకృతుల్దలిగి
యుల్లసిల్లుచునున్న యొకకోటిసంఖ్య, భల్లూకములు గొల్వ బలసియున్నాఁడు
తొల్లి దేవాసురోద్ధురయుద్ధకేళి, నెల్లవరంబుల నింద్రుచేఁ బడసి
వ్రాలిన యాజాంబవంతుఁడు వాఁడె, దూలఁ డెన్నఁడు రణధూమ్రలోచనుఁడు
ఉక్కలుండిదె వీనియుభయపార్శ్వముల, నొక్కొక్కయోజనం బొడలిలోఁ బొడవు
గలపద్మసంఖ్యల కపిసేన గొలువ, సలలితుఁ డగువాఁడు సన్నాథుఁ డతఁడు
నాకారిబిరుదు వానరపితామహుఁడు, నాకేశుతోఁ బోరి యని గెల్చినాఁడు
దహనునివలన గంధర్వకన్యకకు, మహనీయమైన జన్మంబు దానొంది
పరమైన యాద్రోణపర్వతం బేలుఁ, దిరముగా జాంబూనదీతీరవర్తి
వేయుకోటులు కపు ల్వెడక్కఁ దన్గొలువ, నీయగచరుఁ జూడు మేచినవాఁడు
నీలునితమ్ముఁడు నిర్జరవైరి, చాలువాఁ డతఁ డింద్రజాలుఁ డన్వాఁడు
కుపితమర్కటు లాఱుకోటులు గొలువఁ, గపివీరుఁ డాతఁ డుగ్రధనుఁ డన్వాఁడు

కరము సంప్రీతి గంగాతీరమునను, జరియించువాఁడు శాశ్వతబాహుబలుఁడు
చిరతరలీలమై శిశిరాద్రి వేడ్క, నిరవొంద నెప్పుడు నేలెడువాఁడు
పదికోట్లనగచరు ల్బలసి తన్గొలువ, నదె చూడుమా గజుం డనువాఁడు దేవ
కోటికోటులవేయు కొమరుగాజమునిఁ, బాటి గోలాంగూలబలములు గొలువ
నదె గవాక్షుండను నతఁ డాలమునకుఁ, ద్రిదశారియాఁడులు దీటుచున్నాఁడు
ధవళవర్ణాంగు లుద్దండవిక్రములు, రవిసన్నిభులు రణరంగభీషణులు
వివిధరూపంబుల విఖ్యాతులైన, ప్లవగసామజములు బలిసి తన్గొలువ
నున్న కేసరి జూడు మొప్పారుకాంచన,నొన్నతశిఖరికి నొడయండు వాఁడు
బహువర్ణులై పటుభీషణధ్వనులు, మహిఁ గదలఁగ దంతమండలి వెలుఁగ
సింగంపుఁగొదమల చెన్నగ్గలించి, పింగళాక్షంబులఁ బెద్దయు మెఱసి
వేయకోటులకపు ల్వేడ్కతోఁ గొలువఁ, బ్రాయక రామకృపారసంబంది
తనప్రాణములు రామధరణీశ్వరునకు, ననయంబు నీఁగోరు నతులవిక్రముఁడు
అమరారి వాఁడె యత్యాయతబలుఁడు, సమరకర్కశుఁడైన శతబలిఁ జూడు
వీఁడె సుషేణుండు వేకోట్లకపులు, వాఁడిమిఁ దన్నుఁ గొల్వఁగనున్న వాఁడు
పదికోట్లయగచరపతు లోలిఁ గొలువ, నొదవు నాతని జూడు ముల్కాముఖుండు
ఇటఁ జూడుమా వీఁడె ఋషభుఁ డన్వాఁడు, భటముఖ్యు లతనికిఁ బదికోటు లధిప
వనచరశతకోటి వలనొప్పఁ గొలువ, దనరు నాతనిఁ జూడు దానవాధీశ
కనకాద్రిధైర్యుఁ డఖండవిక్రముఁడు, ఘనభుజస్కంధుఁడు గంధమాదనుఁడు
మొనకు వేకోట్లుగా ముయ్యేడుమొనలు, తనరఁ గల్గినవాఁడు దధిముఖుఁ డతఁడ
విను మిరువదియొక్కవేయుశంఖంబు,లును మఱి రెండువేల్నూఱుబృందములు
గలయల్ల మొన దివాకరసూనుమూల, బలమావలీముఖప్రముఖులఁ జూడు
మొలయఁ గిష్కింధలో నుండెడువారు, లలి దేవగంధర్వులకుఁ బుట్టినారు
కామరూపముల సంగరకౌతుకము ల, భీమవిక్రమములఁ బెంపారువారు
అనికి సన్నద్ధులై యార్ప్పుచున్నారు, కనుఁగొను వారి రాక్షసలోకనాథ
అమృతంబు బ్రహ్మచే నమరంగఁ బడసి, రమరులకంటెను నధికులు వీరు
వినుతింప మైందద్వివిదులనువారు, విను దేవ యేకాంగవీరులు వీరు
పదికోట్లప్లవగులు బలసి కొల్వంగ, నుదధితీరంబున నున్నారు దేవ
వీరులు సుముఖుండు విముఖుండు ననఁగ, ఘోరవిక్రములఁ గన్గొనుము లంకేశ
మృత్యువుకొడుకులు మిగిలినచేవ, మృత్యువుకంటెను మీఱినవారు
మిగిలిన తెగువతో మితిమేరలేని, యగచరుల్ తను భృత్యులై కొలువంగ
నున్నవాఁ డదెచూడు ముదధి లంఘించి, నిన్ను నీబలమును నీవారిఁ గానక
చనుదెంచి వనములో జానకిఁ గాంచి, వనమెల్లఁ బెఱికి నీవరసుతుఁ జంపి
లంక భస్మముఁజేసి లంకిణి నొంచి, జంకెతోఁ గ్రమ్మరఁ జన్నవాఁ డతఁడు
ఆవాయుసూనుండు హనుమంతుఁ డగుట, నీవును నెఱుఁగుదు నిర్జరారాతి
వినుచిత్ర మొక్కటి వీఁడు బాల్యమున, నినమండలం బుదయింపంగఁ జూచి

పెరిఁగిన యాకటివెల్లున దానిఁ, బరికించి ఫలబుద్ధిఁ బట్టంగఁ దివిరి
వేగంబుతో మూఁడువేలయోజనము, లాగగనంబున కపుడు బిట్టెగసి
యంతటనుండి పూర్వాద్రిపైఁ బడియె, నెంతయు రయమున నీవానరుండు
హనువు భగ్నంబయ్యె నంతనుండియును, హనుమంతుఁ డనునామ మయ్యె నీతనికి
వీరలందఱును బృథ్వీధరంబెల్ల, వారల యొక్కింతవడి గెల్చువారు
ఇట్టి కపీంద్రు లనేకులు దేవ, యెట్టని సంఖ్యగా నెన్నంగవచ్చు
నని సారణుఁడు పల్క నసురేంద్రుతోడ, సునిశితమతియైన శుకుఁ డర్థిఁ బలికె

శుకుఁడు శ్రీరాముల తేజోవిశేషములఁ దెల్పుట.

వారలకెల్ల జీవనమైనయట్టి, యారాముఁ జెప్పెద నసురేశ వినుము
నయమైన నీలవర్ణప్రభభాతి, మెయిచాయ నెంతయు మెఱసినవాఁడు
కమలంబులను బోలు కన్నులవాఁడు, విమలనీతిస్థితి వెలసినవాఁడు
ఆజానుబాహుండు నఖిలేశ్వరుండు, రాజతేజోనిధి రఘుకులోత్తముఁడు
సత్యంబులోపల సారమూవాఁడు, నిత్యధర్మంబున నెగడినవాఁడు
శస్త్రాస్త్రవిద్యావిశారదుం డఖిల, శాస్త్రజ్ఞుఁ డురుకీర్తిసంపదవాఁడు
తపసునినైనను దమతాత యనక, తపియింపఁ జేయుప్రతాపంబువాఁడు
చక్కాఁడు నభమైన శరజాలములను, వ్రక్కలుగాఁజేయు వసుమతినైన
నలిగిన నాతనియలుక వైరులకుఁ, దలఁపంగ మృత్యువు దశకంఠ వినుము
తెగువ నీ వాసీతఁ దెచ్చితిగాన, జగతీశుఁ డిబ్బంగిఁ జనుదెంచె ననికి
వరశరణాగతవజ్రపంజరుఁడు, బిరుదులకెల్లను బిరుదైనవాఁడు
శరణన్నఁ గాచు నేచందంబునందు, దొరకొన్న యలుకకుఁ దుదిలేనివాఁడు
మిక్కిలియైన నీమూఁడికోపమున, నక్కన్నులం దెట్టి యమరినవాఁడు
మూఁడులోకముల నిమ్ములనేలువాఁడు, వాఁడెపో రాముండు వనజాప్తకులుఁడు
వారక శుద్ధసువర్ణవర్ణాంగుఁ, డారామువలపట నటనున్న వాఁడు
చలమున నీరేడుజగములనైన, నలుకతో నిర్జించు నతిశక్తివాఁడు
ఆరామునకుఁ బ్రాణమైనట్టివాఁడు, ఆరాముతమ్ముఁ డుదగ్రవిక్రముఁడు
భావింప మమ్మేర్చి పట్టినవాఁడు, దేవ యాలక్ష్మణదేవునిఁ జూడు
మలుకమై నిన్ను నుగ్రాజిలోఁ గలఁచి, చలమొప్ప లంక నిశ్శంక నేలుటకుఁ
బట్టంబు రామభూపాలునిచేతఁ, గట్టించికొని ప్రీతిఁ గ్రాలుచున్నాఁడు
ఆవిభీషణుఁ జూడు మసురాధినాథ, భూవరు వెనుక నేపున నున్నవాఁడు
ఆరాముతమ్ముని యావిభీషణుని, చేరువ నవ్వలఁ జేరియున్నాఁడు
మహనీయతరధర్మమార్గంబువాఁడు, మహితనీతిస్థితి మరిగినవాఁడు
మానఘనాధీనమతినొప్పువాఁడు, పూని కిష్కింధ నెప్పుడు నేలువాఁడు
చిరకపిరాజ్యాభిషేచనహేతు, కరహేమమాలికాకలితవక్షుండు
గురుభుజుం డంతకఘోరవిక్రముఁడు, సురవైరి చూచితే సుగ్రీవుఁ డతఁడు
వీనికిఁ గలసేన వివరింతు వినుము, దానవనాథ చిత్తంబున నిలిపి

సంఖ్య వేకోటులై చను నూఱువేల,సంఖ్యలు మఱి మహాసంఖ్య నాఁబరఁగు
నవి లక్ష గూడిన నగు బృందసంఖ్య, యవి లక్ష గూడిన నగుఁ బద్మసంఖ్య
యవి లక్ష గూడి మహాపద్మమయ్యె, నవి లక్ష గూడిన నగు ఖర్వగణన
యవి లక్ష గూడిన నగు మహాఖర్వ, నవి లక్ష గూడిన నగు సముద్రంబు
అవి లక్ష గూడ మహాసముద్రంబు, నవి లక్షతో మహాదాఖ్యమై పరఁగు
నవి కోటిపో వాలియనుజునిబలము, వివరించి చూడుము విశదంబుగాఁగ
నిది తుద మొదలని యెన్నఁగ దీని, చదురుతనంబున సంఖ్య దేరాదు
కావున రాముతోఁ గదిసి పోరాడ, రావణ రాదు దుర్వార మాబలము
అని శుకుం డెఱిఁగింప నా రావణుండు, ఘనమైనకపిసేనఁ గలయంగఁ జూచి
తనలోన బడబొగ్గి దరికొనుచుండఁ, దనరారు వార్ధిచందంబున నపుడు
వెఱచియుఁ దనలోని వెఱపడఁగించి, వెఱవనిగతిఁ గోపవివశుఁడై పలికె
మంత్రి యేలికచిత్తమార్గంబు దప్పి, మంత్రంబుఁ జెప్పనే మనసెల్ల విఱుగ
నే లేఱుఁగెఱుఁగక యెదిరి నాయెదుర, నీ లేఱుఁగునఁ బల్కు టిది మీకుఁ దగునె
యనవుడుఁ దలలెత్త కచ్చోటు వాసి, చని రప్పు డాశుకసారణు లంత
జనినపిమ్మట నా ప్తసచివులు దాను, దనుజాధినాథుఁ డెంతయును జింతించి
వారి వీడ్కొల్పి దుర్వారుఁడై వైర, మారవిదుర్జిహ్వుఁ డనువానిఁ బిలిచి
రామునిధనువు శరంబును బోలె, నీమాయ నతివేగ నిర్మింపు మనిన
నతఁ డది నిర్మించి యర్థిఁ దెచ్చుటయు, నతనికి మెచ్చు ప్రియంబున నొసఁగి
సురుచిరంబైన యశోకవనమున, కరిగి యాదశకంఠుఁ డవనిజఁ గనియెఁ
బెల్లగు నీవగఁ బెట్టనేమిటికిఁ, దల్లి నన్నని వసుంధర దూరుకరణిఁ
దలవంచుకొని విన్నదనమునఁ దూలి, సొలవక ధాత్రిఁ జూచుచు నున్న దాని
నొడలఁ జిత్తములఁ బెంపొందవు దావాగ్ని, యుడికి పొంగుచు వెలికురుకుచునున్న
రాక్షసుపై రోషరసధార లనఁగ, నక్షీణబాష్పధారావళిదాని
పుత్రి యీదురవస్థ బొందితే యనుచు, ధాత్రి దానును బరితాపంబునొంది
యాలింగనముసేసి నట్టిచందమున, ధూలి గప్పినమేనితో నున్న దాని
రావణ నిన్ను నీరాక్షసకోటి, నేవిధంబునఁ ద్రుంప కేనేల పోదు
నని వానిక్రూరధర్తాధిదైవంబు, గొనకొన్నకైవడిఁ గూర్చున్న దాని
నమరార్థులను నీరసావనీజములఁ, దమికించి తావిటతాటంబుసేయు
నని దరికొను విలయానిలుపగిదిఁ, దనరు నిట్టూర్పులఁ దఱుచైనదానిఁ

సీతకు శాంబరీమాయచేఁ గల్పితంబైన శ్రీరాములశిరోధనువులను జూపి వెఱపించుట.

గని చెడఁ దలఁచిన కష్టదానవుఁడు, తనదిక్కుఁ జూడని ధరణిజ కనియె
వెరవుచాలని యవివేకి దానవుల, ఖరదూషణాదుల ఖండించె ననుచు
జనకనందన రాముశౌర్యంబు నమ్మి, నను గణుతింప వెన్నఁడుఁ జిత్తమునను
నసమునఁ గఫులతో నంబుధి దాఁటి, యసముఁడై యాసువేలా ద్రిపైనుండి
యలసి నిద్రింపంగ నగచరసేన, నలమి యీరాత్రి ప్రహస్తుఁ డన్వాఁడు

నాకూర్చుబంటు చూర్ణంబుగాఁజేసి, కాకుత్స్థునురుకార్ముకంబును దలయు
గొనివచ్చి రామునికూర్తిమ్ముఁడును, వనచరాధిపుఁడును వగచుచు నుండఁ
దప్పించుకొని పాతెఁ దా విభీషణుఁడు, చుప్పనాతినిముక్కు సురియఁజేఁ గోయు
నాపాపమునఁ బాతె నపుడు నీమఱఁది వాపోవుచును జాంబవంతుఁడు ఏఁచె
నూరక యంగదుం డూడంగఁ బాతె, దారితప్పునఁ బోయెఁ దారుండు భీతి
నీలుండు శరభుండు నిలిచి పోరాడి, వ్రాలిరి మేనులు వ్రయ్యలై జగతిఁ
బోక నిల్చి సమీరపుత్రుండు వడియె, మోఁకాళ్లు విఱిగి రాముని బాయలేక
నెత్తుఱు గ్రక్కుచు నేగె సుషేణుఁ, డుత్తలంబున ధూమ్రుఁ డుదధిలోఁ బడియెఁ
జెయ్యెత్తి మ్రొక్కఁ గూల్చిరి దధిముఖుని, మాయఁజేఁ గేసరి మయిదాచిపోయె
కుముదుండు తలఁ దెగఁగొట్టినఁ బడియె, సమసె మైందుఁడు వీగి చనియెను నలుఁడు
పనసుఁ డెఱింగి దబ్బరవచ్చె ననుచుఁ, బనసచెట్టునుఁ బోలి బ్రమసి తా నిలిచె
నాలంబులోపల నఖిలవీరులును, గూలుటయును జూచి కూడినభీతిఁ
జివ్వఁ జాలించి వచ్చినకపులెల్ల, నవ్వంగఁ బరుగెత్తె నలినాస్తసుతుఁడు
నేతువుఁ జూడ వచ్చినకపులెల్ల, భీతిచే నిల్లాండ్ర బిడ్డలఁ దలఁచి
ముగిసె కార్యంబని మొదలిపెంకులకుఁ, దగఁగొట్టఁ బాఱిరి దైత్యులు దరుమ
గానఁ గంజాస్య రాఘవునాస విడిచి, నానారులకునెల్ల నాథవైయుండు
నాయింట దాసీజనము లైదువేలు, పాయక మణిమయాభరణముల్దాల్చి
యచ్చెరు లున్నవా రతివ నీవేవ, కిచ్చెద నీమన సిమ్ము నాకిపుడు
విరిదోఁటలోఁ గల్పవృక్షంబులైదు, తరుణి నీముడిపువ్వుదండల కిత్తు
నమరభూధరరోహణాచలమణులు, రమణి నీకిత్తు నఁ రతులఁ దేలింపు
నామీఁదఁ గామధేన్వాదిధేనువుల, భామిని నీయింటి పాడి కేనిత్తుఁ
గొమ్ము మప్పదిరెండుకోట్లచేరువలు, నెమ్మి నందొక్కొక్కనికి వేయివేయి
[?] దానవబలపద్మ మాప్తంబు నాకు, దీనఁబో గెలిచితి దేవతాధిపుల
నాబలంబెల్ల నీయడుగులు గొలిచి, యీబాల యిటమీఁద నుప్పొంగఁగూర్తు
ననుచు విద్యుజ్జిహ్వుఁ డనువానిఁ బిలిచి, వనజాక్షిముందర వైవఁ బంచుటయుఁ
దనుమధ్య యిదె రాముతలయును విల్లు, నని యటు వైచి వాఁడరిగె నవ్వచును
దలకొని రామభూధవుఁ డిప్పు డసుర, తలలెల్లఁ ద్రుంచు నుద్ధతి రణస్థలిని
దలఁకకు నీపతితలయు నింపారు, నిల ధర్మగుణముతో నీక ననుమాఁడ్కిఁ
దరలాక్షి యాతల తప్పక చూచి, కరమొప్పు రాముని కన్నులు మోము
దలకట్టుమాళి రత్నప్రభావళియుఁ, బలువరుసయుఁ గర్ణభాతియు మోవి
తలపోసి రామునితలయకాఁ దలఁచి, బలుమూర్ఛబొల్పడి వడియె నాధరణి
యిది బొంకు నీపతి కేమియుఁ గాదు, సుదతి నీ కీమాయ చూడఁగాదనుచుఁ
దనయురస్థలికి నత్తన్వంగిఁ దివిచి, కొనియెనో కాక యాకుంభిని యనఁగఁ
బడి యంతఁ దనలోనఁ బడఁతుక దెలిసి, యడరెడుశోకాగ్నినలయుచుఁ బలికెఁ
గటకటా కైకేయికలహంబుఁ బన్ని, యిటు క్రుంగఁజేసితే యిక్ష్వాకుకులము

నీరాఘవేశ్వరుం డెగ్గేమినేసె, నూరక యడవుల నుండంగఁ బనుప
వనధి బంధించితి వచ్చి నీవింకఁ, గొనిపోయె దనియెడి కోర్కిఁదీపింపఁ
బెద్ద నమ్మితిఁగదా పృథ్వీశ నిన్ను, నిద్దెస నాఁడైవ మిటుసేయు టెఱుఁగ
నాకును నీకుఁ బ్రాణం బొక్కటగుట, గాకుత్స్థ యిటు బొంకుగాఁ జేయఁదగునె
పతికంటె ముందఱఁ బ్రాణముల్ విడుట, కతివగానైతినే నర్కకులేశ
యరుఁగుదుగాకేమి యడరి నీకడకు, నరనాథ పుత్తెంతు నాదుప్రాణముల
వసుధ నాతల్లి నావరుఁడవు నీవు, వసుధ కౌఁగిటఁ జేర్ప వావియే నీకు
జనకుచే నన్నగ్నిసాక్షిఁ జేపట్టి,కొనివచ్చి యిటు సేయఁగూడునే నీకు
నెట్టొకో రామ నీవిట నూరకున్న, గట్టడిప్రాణముల్ గ్రాఁగవయ్యెడిని
గ్రాఁగనియప్పుడే కారణం బీవు, గ్రాఁగుట నిక్కంబు గాకుండు ననుచు
నీవిధంబున సీత యేడ్చుచునుండ, దౌవారికులు వచ్చి దనుజేశుఁ గాంచి
దేవ కార్యంబు లెంతేని బుట్టుటయు, నీవరమంత్రులు నిన్నభాస్థలికి
నరుగుదెమ్మని ప్రహస్తాదులు వచ్చి, తరమిడియున్నారు ద్వారపట్టమున
నని విన్నవించిన నారావణుండు, చనియె శీఘ్రంబున సభకు నత్తఱిని
దనుజుండు చనఁగ నాతలయును విల్లు, విన విస్మయంబుగా వెస మాయమయ్యె
నారావణునిలక్ష్మి యంతలోపలనె, బోరన మాయమై పోవునన్నట్లు
ఇదె రాఘవుఁడు వచ్చె నెత్తిపై ననుచుఁ, ద్రిదశారి యెంతయు ధీరుఁడై కడఁగి
వేగులువారిచే విన్న వార్తలకు, వేగ నిస్సాణంబు వ్రేయంగఁ బనిచి
తనసేనఁ గూర్పఁ బ్రధానులఁ బనిచె, జనకనందన నంత సరమ వీక్షించి
యేల మాయమ్మ నీవిటు ప్రలాపింప, బోల దీవార్తలు బొంకుగానోపు
వనిత నీముందఱ వైచినశిరము, దనుజునిమాయగాఁ దలపోయవలదె
వనజాక్షి యసురదుర్వాక్యంబులెల్ల, విని యేను బోయితి వెనుకనే యరయ
నావార్త విను రాముఁ డనికెత్తెననుచు, దేవారి యెంతయుఁ దిరుగంగఁబడియె
నదె విను నిస్సాణహాననఘోషంబు, లదె వినుమా రాక్షసావళియ్యగ్ర
రథములమ్రోతయు రథికసారథుల, పృథులభాషణములు వెల్లుగా మ్రోసె
నటుఁగాన రామున కాపదలేదు, కుటిలకుంతల నీవు గుందంగ వలదు
అని చెప్ప నాలంక యగలనార్చుచును, వనచరసేనలు వచ్చుటఁ జూచి
యంతరంగమున బిట్టదరి రావణుఁడు, చింతించి మంత్రులఁ జెచ్చెరఁ బిలిచి
యదె రాఘవుఁడు వచ్చె ననికి మీరిపుడు, విదితవిక్రమశక్తి వేగంబు పోయి
మనుజుల నిద్దఱి మడియించి రండు, వనచరసేనల వధియించుఁడోలి
నరుగుఁడు లెండన్న నారావణునకు, వరనీతిమతి మాల్యవంతుఁ డిట్లనియె

మాల్యవంతుఁడు రావణునితో నీతి నెప్పుట.

నుచితకాలంబున నొప్పగు సంధి, యుచితకాలంబున నొప్పు వైరంబు
గాన నయోచితకార్యంబుసేయు, వానికి రాజ్యంబు వర్తించుచుండు
నధముతో విగ్రహ మధికుతో సంధి, బుధులమతంబునఁ బోనిచ్చుటొప్పు

వలవదు మనకంకె వనజా ప్తకులుఁడు, బలవంతుఁ డగువాఁడు బలవైరివైరి
దైవకార్యంబుగా ధరఁ బుట్టినాఁడు, దైవబలంబు నాతనియందె కలదు
ఆరయ ధర్మాత్ముఁ డది చెప్పనేల, వారక ఋషులదీవనలు గన్నాఁడు
సురల బాధించి భూసురుల మర్దించి, యురుపాపబుద్ధివై యుండుదు వీవె
గెలుపు ధర్మముదెసఁ గీలొ్కనుఁగాని, యిలనధర్మముదెస నేల వర్తించు
నక్కమలజుచేత నటునాఁడు వరము, తక్కినవారిచేతను జావకుండఁ
బడసితిగాని యిబ్భంగి నీమీఁద, నడతెంచునరుల వానరులను గెలువఁ
బడయవు నీవెన్ని భంగులనైనఁ, జెడుట తథ్యము వీరిచేతను నీవు
దాని కింతటికిఁ బ్రత్యక్షంబుఁ జూడు, మానైన విపులహోమములధూమములు
జడిసె రాక్షసులతేజంబులు మానె, నుడుగక మనవీట నొప్పములుల్వొట్టె
నటుగాన నాదినారాయణుం డతఁడు, ఇటునేయుటకుఁ బుట్టె నిద్ధరమీఁద
రామునితోడ విగ్రహమొప్ప దుడుగు, రామునిబాణపరంపరల్బెట్టు
వలదు రామునిఁ గని వనిత నొప్పించి, కులమెల్ల రక్షించుకొనుము లంకేంద్ర
యనవుడు దశకంధరుఁ డమ్మాల్యవంతుఁ, గనుఁగొని రోషసంకలితుఁడై పలికె
మిగులఁ దేజంబున మేటినై యెందు, నెగడిన నాయొద్ద నీపగవానిఁ
జెప్పెదు నిన్నేమి సేయుదు నింక, నెప్పుడు మానవయ్యెదు పందతనము
సీత నేమిటి కిత్తు సీత నిచ్చుటకు, భీతి నాకేమిటఁ బెర్చె నింతటనె
యని మీఁదఁ పలికిన నమ్మాల్యవంతుఁ, డనియె నామాట నీవాత్మ గైకొనక
యారామచంద్రుని నాలంబులోన, శూరత గెలువంగఁ జాతుముగాక
యెందుఁ బోయెద మని పెొచ్చి కంటకము, లందందఁ బలుకుచు నలుకమైఁ బోయెఁ
బోయినపిమ్మట బుద్ధిలోఁ దలఁచి, యాయసురేశ్వరుం డప్పుడు గడఁగి
యలఘుబలాఢ్యుఁ బ్రహస్తునిం బనిచెఁ, దొలి తొలి బలుకాపు తూర్పువాకిటికి
దక్షిణంబున మహోదరమహాపార్శ్వ, లక్ష్మీణబలయుతు లైయుండఁ బనిచె
వారక పడమటివాకిటనుండ, శూరత నటఁ బంచె సుతు నింద్రజిత్తుఁ
దనమాఱుగాఁగ నుత్తరపువాకిటికిఁ, జనియుండుఁ డని పంచె సారణశుకుల
నందఱికిని ముఖ్యుఁడై పురమధ్య, మందుండఁగా విరూపాక్షునిఁ బనిచె
నీవిధంబున లంకకెల్లఁ గాపిడుచు, రావణుం డంతఃపురంబున కరిగె
నంత నక్కడ రాముఁ డనుజు నర్కజుని, నంతకన్నను హితుం డగువిభీషణుని
వాలితనూజుని వాయునందనుని, వాలిన యాజాంబవంతు సుషేణు
నాలోన రప్పించి యందఱితోడ, నాలోచనంబునకై కూర్చి పలికె
నవగుణంబునకెల్ల నాలయంబైన, దివిజారిలంక యే తెఱఁగొకో యింకఁ
జూతమా యేర్పడఁ జూడుఁడా యొకని, చేతఁ దత్కులమెల్లఁ జెడుట సిద్ధంబు
నని పల్కి యారాముఁ డనుజుండుఁ దాను, నినసుతుఁ డాదిగా నెల్లవానరులుఁ
గొలువంగ వచ్చి యెక్కుడువేడ్కతోడ, నలరుచు నాసువేలాచలం బెక్కి
గుణములుగలవాఁడు గోత్రంబునందుఁ, బ్రణుతికి నెక్కునిబ్భంగి నన్నాడిఁ

గనియెరాఘవుఁడు లంకాపురం బపుడుఁ, దనచేతఁ గడక సాధ్యం బగుదాని
ననిలజుఁ బట్టినయంతనుండియును, దనరార లోపల దరికొన్న చిచ్చు
నాఁడు నేఁడును మండు నామణిప్రభల, బోఁడిమిగలుగు గోపురములదానిఁ
గడునొప్పు నారాముభూతకుఁ జొనుప, మిడికెడు రావణమృగముఁ బోనీక
విలయకాలుండను వేటకాఁ డర్థి, వెలివారు వారినవిధమునఁ జూడఁ
దనరారు పెద్దకొత్తడములతోడఁ, గనుఁగొన నొప్పుప్రాకారంబుదాని
రావణుఁ బొరిగొన రామ రక్ష్మనుచుఁ, జేవీచుపడగలఁ జెలువైనదాని
మహనీయతోరణమంగళసూత్ర,మహిమతో నంబరమణిసంగమమునఁ
దళతళవెలుఁగు నద్దంబుల నొప్పి, చెలువారఁగాదట్టు చేతులుగలిగి
పగలును రేయును బాయక కూడి, మగలచే నొప్పు కొమ్మలుగలదాని
నెసఁగ నారాము కట్టెదిరికిఁ గాలుఁ, డసురేశుఁ డనులులాయముఁ బట్టితేర
నొరపుగాఁ ద్రవ్విన యోదంబు లనఁగ, నెరసినపరిఘుల నెలకొన్నదాని
కైలాస మమరారి క్రమ్మఱఁ బెఱికి, మేలైనపేర్మి నిర్మించినమాడ్కిఁ
దనరారి యల మిన్ను దాఁకి తెల్పునను, గనుపట్టుమేడలు గలిగినదాని
ఘనలక్ష్మి నెదురుకోఁ గడఁగె రామునకు, ననిచెప్పనట్టి తూర్యధ్వనిదానిఁ
జిలుకలపలుకుల చెలువహింఛి, యళులనాదంబుల నానందమంది
కలకంఠరవములఁ గడుఁ బ్రీతిఁజేసి, పలికెడుశారికాస్ఫారత మెఱసి
పల్లవఘనచయపల్లవం బగుచుఁ, బల్లవంబుల రాగభరితంబు లగుచుఁ
గడివోనిపూవులగంధంబువలన, నెడపక నందంద నింపులు చూపఁ
జెప్పఁ బెక్కగుచు నేచినయట్టితరుల, నొప్పెడివనముల నొప్పారుదానిఁ
గమల కెందును మనగకమలంబులై న, కమలాకరంబులఁ గరమొప్పుదాని
నటు చోద్యపడి చూచు నారాఘవునకుఁ, బటుతరోద్యత్ప్రభాభాతి తానొసఁగి
యాకాశమణి గ్రుంకె నపరాబ్ధిలోనఁ, గాకుత్స్థమణి నమస్కారంబు నేయ
నారాముఁడును సువేలాద్రియందుండి, యారాత్రి గడతేర్చి యంత వ్రేగుటయుఁ
గపులు వినోదంబుఁగాఁ బెల్లురేఁగి, విపినంబులందెల్ల వెసఁ జొచ్చి చొచ్చి
యందలి శరభసింహాదులనెల్ల, నందందఁ దోలుచు నార్చుచుఁ దిరుగ
నట్టి కోలాహలం బంతయు లంక, ముట్టి రాక్షసుల నెమ్ములు పగిలింప
నదివిని రావణుం డదియేమిరవము, పొదుఁడని వచ్చి గోపుర మెక్కి చూచె
నప్పుడు గోపురం బతనితోఁ గూడ, నొప్పెఁ జూపరులకు నుజ్జ్వలం బగుచు
ధవళాతపత్రము ల్దఱుచుగాఁ బట్టి, ధవళచామరములు దఱుచుగా వీవఁ
బొరిపొరి సురదంతి పోటుల నమరు, నురమునఁ బతకంబు లొనరుచుఁ గ్రాల
నాయతరత్నసింహాసనానీనుఁ, డై యెంతయును బొలుపారె నెయ్యెడను
నపరాచలమువీఁది యర్కునితోడి, యుపమకుఁ బాత్రుఁడై యుజ్జ్వలుం డగుచు
బహువిధరాక్షసపరివృతుం డగుచు, మహితాయుధప్రభామండలంబులను
మెఱుపులు గలనీలమేఘుంబువోలెఁ, దఱుచుగా మెఱసి మదంబులుఁ గురియ

నెనఁగంగ నాదానవేశ్వరుం డప్పు, డసమానుఁడై యుండె నాగోపురమున
మహనీయరావణమహిమచేఁ జేసి, మహితవిద్యుత్ప్రభామండలంబైన
గోపురం బపుడు దృగ్గోచరంబైన, భూపాలతిలకుఁ డద్భుతమంది పలికె
రావిభీషణ గోపురంబున వచ్చి, యీవిధంబుననున్న యితఁ డెవ్వఁడొక్కొ
ప్రళయకాలమునాఁటి భానుబింబముల, వెలుఁగులపోదిపోలె వెలుఁగుచున్నాఁడు
అనుడు విభీషణుం డారామతోడ, ననియె నయ్యసుర మాయన్న రావణుఁడు
సురనాథసురలను స్రుక్కించువాఁడు, సురకామినులఁ జెరఁ జొనిపినవాఁడు
ముల్లోకములఁ దనమూర్తిచే హల్ల,కల్లోలమైపడఁ గావించినాఁడు
అనవుడు సుగ్రీవుఁ డారామతోడ, ననియె మీయెదుట నీయసుర గర్వించి

సుగ్రీవుఁడు రావణునితో మల్లయుద్ధము చేయుట.

వైభవ మిటుచూపువాఁడె శ్రీరామ, యీభంగినుండ నే నెట్లోర్తు ననుచుఁ
గుటిలవర్తనుఁడును గ్రూరుండు నగుచు, నటు తలలెత్తిన యసురారిమీఁద
నకుటిలశౌర్యసంపన్నుఁడై యపుడు, ప్రకటదివ్యాంగసువర్ణుఁడై వేర్చి
మస్తకకోటీరమహితశృంగముల, విస్తరోరస్థ్సలవిపులసానువుల
గురుకొని వాఁడొక్కకొండయైయున్న, బిరబిరఁ బడవచ్చుపిడుగుచందమున
వెస నగ్గలముగ సువేలాద్రినుండి, యసురేశ్వరునిమీఁది కర్కజుం డెగసి
దేవారిరావణుఁ దృణముగాఁ జూచి, రావణ వినుమేను రామునిబంట
మాకు నీవైభవమా చూపెదనుచు, వీకతో మకుటముల్ వెస డొల్ల వ్రేసె
వ్రేసిన నుఱుములై వెలుఁగుచు రాల, భాసురకోటీరపఙ్క్తి యొప్పారెఁ
గాలరుద్రుఁడు మిన్ను గదగొని వేయ, రాలుతారాగ్రహరాజిచందమునఁ
జాలఁ గోపించి దశగ్రీవుఁ డంత, వాలితమ్ముని బట్టి వడిఁ బడవైచె
నంతటిలోన నయ్యర్కతనూజుఁ, డెంతయు రయమున నేచి పెల్లెగసి
యసురచేతులలోన నడగంగఁబట్టి, దెసలు గంపింపంగ ధృతిదూలవైచెఁ
గటములు నుదురులు కంధరంబులును, విటతాటములునేసి వీఁపెల్లఁ జీరి
కడకాళ్లు దొడలతోఁ గదియంగఁబట్టి, వడి గోపురంబులో వైచి నొప్పించి
నిటుపోరుచో వార లిద్దఱు దప్పి, పటుగతి నేలపైఁ బడగ వచ్చియును
నానేల మోపక యతిలాఘవమునఁ, బూనిక నెఱపి గోపురముమీఁదటను
బెనఁగిరి పెనఁగుచోఁ బృథులస త్త్వములఁ,గొనినవిన్నాణమెక్కుడుగఁ ద్రోయుచును
డాసి మోఁకాళ్లు ఘట్టనలు సేయుచును, బాసి క్రమ్మఱ ముష్టిబలము జూపుచును
బదముల గుండెలు పగులఁ దన్నుచును, గదిసి మోచేతు లంగముల మెత్తుచును
గరవలయంబులఁ గడఁగి యూదలలు, పొరిపొరి నెత్తురుల్ పొడమ వ్రేయుచును
దడఁబడఁ బెక్కువిధంబులఁ బెనఁగి, కడఁగి యప్పటితానకములు గైకొనుచు
నుబ్బునూర్పులతోడ నొకకొంతసేపు, ఉబ్బరింపక పట్టి యూరకుండుచును
నిమ్మెయిఁ బోరుచో నిద్దఱిమేనఁ, గ్రమ్మెఁ బెల్లెగయు రక్తప్రపూరములు
జేగురుఁజెరులఁ జెలువైనగిరులు, బాగున నెంతయు భాసురు లగుచు

నున్నచో రావణుం డురవడి మాయఁ, బన్ని తన్నపుడు చంపఁగఁ జూచుటయును
నెఱిఁగి యాకసమున కెగసి వేగమునఁ, గఱుకురాక్షసులు వెక్కసమంది చూడఁ
గపులెల్ల మ్రొక్కఁ సుత్కటసంభ్రమమునఁ, గపిరాజు వచ్చి రాఘవునకు మ్రొక్కె
భక్తిమై రణరజఃపటలసమ్మిళిత, రక్తపంకము నిజోరస్స్థలం బంటఁ
గపిరాజు రాముఁడు కౌఁగిటఁ జేర్చి, కృప దళుకొత్త నీక్షించుచుఁ బలికె
వాసవాంతకుని రావణునిఁ గైకొనక, నీసాహసమునేయ నిట నీకుఁ జెల్లె
నే వానిఁ జంపెద నీవిభీషణుని, నావీట నిలిపెద ననుబాసకొఱకు
వానిఁ జంపక నీవు వచ్చుట లెస్స, యేను మెచ్చితి నిన్ను నినసూతి నీవు
వాలితమ్ముఁడవు రావణుని నిర్జింపఁ, జాలవే తలఁపంగ సైరించుకెల్ల
నది నాకుఁ బాలిడి యవని నాకీర్తి, వదలక చెల్లింప వచ్చితి వనుఁడు
దేవ యాద్రోహినిఁ దెఱఁగొప్పఁ జూచి, యేవిధంబునఁ గోప మేను సైరింతు
నని యర్కజుఁడు వల్క నతనిమాటలకు, మనమున హర్షించి మఱియు నిట్లనియె
స్ఫురితతారకము భాసురకృష్ణర క్త,పరివేషమున నగు భానుమండలము
వలన మంటలుదెగి వ్రాలుచున్నవియు, జలదము ల్పెక్కు రాక్షసరూపములను
జెలఁగుచు నెత్తురు ల్చిలుకుచున్నవియు, కలయంగ నొకట భూకంప మయ్యెడిని
మేటిగాడ్పులను భూమిధరకోటి, గూటము ల్ధరణిపైఁ గూలుచున్నవియు
బెగడక దినకరాభిముఖంబు లగుచు, నిగిడి వాపోయెడి నెరి జంబుకములు
సారెకు నిట్టు రాక్షసకుల ప్రళయ,కారణోత్పాతము ల్గానంగఁబడియెఁ
దిరముగా నాంగికాస్తికశుభ ప్రకర,వరసూచకంబు లేవలనఁ గన్పట్టె
మనకు జయం బనుమానంబు లేదు, ఒనఁగూడు నీకఁ దడయుటగా దటంచుఁ
గరువలిసుతునిపైఁ గరమొప్ప నెక్కి, వరపుణ్యనిధి జాంబవంతుఁ డంగదుఁడు
సౌమిత్రియును విభీషణుఁడును నలుఁడు, భీమవిక్రమకళాభేద్యులై కొలువ
నానగస్థలి డిగ్గి యతులవిక్రముఁడు, వానరసేనలు వడి తోడు చూప
దాను ముందర ధనుర్ధరుఁడునై నడిచెఁ, దోన యాలక్ష్మణాదులు చేరికొలువఁ
దక్కినసేన లుద్దండవేగమునఁ, బెక్కుభంగుల దొక్కపెల్లుగాఁ దోఁచె
నడువ నెంతయుఁ బెర్చి నలినాప్తకులుఁడు, కడుఘోరమైనరాక్షసకోటిచేతఁ
దనరినలంక యుత్తరపువాకిటను, విన విస్మయంబుగా విడిసె రాఘవుఁడు

శ్రీరాముఁడు వానరులచే లంక ముట్టడి వేయించుట.

ద్వివిదమైందులతోడఁ దెగువ నీలుండు, నవిరళభుజశక్తి నమరులు పొగడఁ
బరువడి కపిసేన బలసి తన్గొలువ, వరమతి విడిసె పూర్వద్వారమునను
గజుఁడు గవాక్షుండు గవయుండు భూరి, భుజుఁ డైనబుషభుండు పొంకంబుతోడఁ
దనతోడఁ గూడిరా దక్షిణద్వార,మున వాలి యవ్వాలిపుత్రుండు విడిసెఁ
బసతో సుషేణుని బవననందనుఁడు, వెసఁ గూర్చుకొని బాహువిక్రమంబొప్ప
వాఁడెపో యీలంక వడిఁ గాల్చినట్టి, వాఁడనఁ బడమటివాకిట విడిసె
మేటిగాఁ బెద్దనమ్మిన ముప్పదాఱు, కోటులకపినాయకులు తన్నుఁ గొలువ

విసువక వీరుఁడై విశదంబుగాఁగ, వెస రాము పడమట విడిసె నర్క–జుఁడు
పసగలభల్లూకబలములు గొలువ, నసమానబలయుతుం డై మహాబలుఁడు
అంబుధు లేడొక్క– టైనచందమున, జాంబవంతుఁడు రాముసన్నిధి విడిసె
మనుజేశుఁ డపుడు లక్ష్మణవిభీషణులఁ, గనుఁగొని పల్కె– నుత్కం ఠ దీపింప
వనచరావలుల నవారితబలులఁ, బనుపుఁడు మతీయనుఁ బైదళంబుగను
నెక్క–డ నేమియు నేమఱకుండ, నొకొ్కక్క–పద్మ మొకొ్కక్క–వాకిటను
ననవుడు నలుఁడును హరుఁడు సంపాతి, యనువారు మనము శస్త్రాస్త్రసంతతుల
మిగిలి రాక్షసకోటిమీఁదఁ బెల్లుగను, దగిలి యిక్క–డనె యుద్ధంబుసేయుదము
అని పల్క– రాముఁ డయ్యగచరాధిపులఁ, గనుఁగొని యపు డొక్క–కట్టడసేసి
క్రం దైనసందడి కయ్యంబునందు, నిందు నందును మన మెఱుఁగంగవలయు
కపిరూపములె కాని కామరూపములు, కపటరూపంబులు గాకుండుఁ డనుచు
నిటు రామునానతి నెల్లవానరుల, నటు లంక చుట్టు నత్యంతవేగమున
నిశ్చలచిత్తులై నెలకొని పూర్వ, పశ్చిమో త్తరయామ్యభాగము ల్నిండి
పదియోజనంబుల పరపున విడిసి, పదిలు లై యుండి రప్రతిమవిక్రములు
వికృతవాలంబులు వికృతాననములు, వికృతదంష్ట్రాంబులు వికృతనఖాళి
యమరంగఁ దరుశై లహస్తులై వేర్చి, సమరంబు సేయంగ సన్నద్ధులైవ
వారియదల్పులు వారియార్పులును, వారిహుంకారరవంబులు చెలఁగ
భీమమై లంకలోఁ బేర్చి యాదైత్య,భామినీజనులగర్భంబులు గలఁగె
నట్టి కోలాహలం బంతయుఁ జూచి, నెట్టన రాక్షసనికరంబు బెదరె
కమలా ప్తకులుఁ డప్డు కల్యాణరాము, డమితసత్త్వోన్నతుం డతిదయాశాలి
రావణునొద్దికి రాయబారంబు, పోవను నెవ్వని బుత్తెంత మనుచుఁ
గపికులో త్తముఁ డైన కంజా ప్తసుతునిఁ, గపిరాజుఁ బంపుట కార్యంబుగాదు
బల్లిదుం డగుజాంబవంతుఁ బంపుటకు, నెల్లవిధంబుల నెఱుఁగఁడు వాఁడు
పరమవిక్రమశాలిఁ బవమానసుతుని, మరలను బంపుట మర్యాద గాదు
భుజవిక్రమంబున భూరివేగమున, భుజగవైరికి సరిపోలునంగదుని
నంపుట మేలని యతివేడ్క–నెంచి, సంపద వెలయంగ సర్వజ్ఞుఁ డైన
మనుజేశుఁ డంతట మంత్రులతోడి, యనుమతిఁ గైకొని యంగదుఁ బిల్చి
యరిగి రావణుతోడ నజునిచేఁ గన్న, వరగర్వమున మునివరుల దేవతల
నడఁచి బాధించిన యటుగాదు నేఁడు, విడిసె నీపై రామవిభుఁడని పల్కు–
మేలావు నమ్మి నీ వెలనాఁగ దెచ్చి, తాలావు చూప రమ్మను మాజిలోన
సందీప్తరామాస్త్రచయఘట్టనలకుఁ, బందవై యెందును బాఱకు మనుము
అటు చాలవైతేని నవనిజఁ దెచ్చి, యిటనిచ్చి బ్రతుకుట యిదిబుద్ధి యనుము
పరఁగ లంకారాజ్యపట్టంబునకును, గరుణ విభీషణుఁ గట్టినాఁ డనుము
చంపెడు రాఘవేశ్వరుఁ డిదె నిన్నుఁ, జంపకమున్నె నీసకలబాంధవులఁ
జూడుము లంకయుఁ జూడు మేర్పడఁగఁ, జూడుము నీకూర్చుసుందరీజనుల

నీవు నీబంధువుల్ నిరవశేషముగఁ, జావంగఁగలవారు చచ్చిన మీఁదఁ
గార్యంబు నిష్ఫలకార్యంబు మనుట, కార్యంబు వినుఁ దశకంఠ నీవింక
ననుము పొమ్మని రాముఁ డానతిచ్చుటయు, మనమున హర్షించి మర్కటోత్తముఁడు
వినయంబుతో రామవిభునకు మ్రొక్కి, యనురాగమున నేగె నమ్మహాబలుఁడు

అంగదరాయబారము.

ఘనతరపర్వతాకారంబుతోడ, ననిమిషు ల్వ్రాగడంగ నాలంకఁ జొచ్చెఁ
గడుదుష్టరాక్షసగహనముల్ గాల్ప, నడరెడువిలయకాలాగ్నియుఁ బోలె
నెగసి యాకసమున నింద్రారిఁ జంపఁ, దగిలినమృత్యుదూతయుఁ బోలె నపుడు
దశరథాత్మజునాజ్ఞఁ దలమోచికొనుచు, దశకంయముందఱుఁ దడయక నిలువఁ
గనుఁగొని యపుడు రాక్షసకోటియెల్ల, నినజుండు క్రమ్మఱ నేలెంచె ననుచు
నాయోధనోద్యుక్తులై సంభ్రమింప, నాయసురులనెల్ల హస్తముల్ సాచి
వలవ దోహోయని వారణసేసి, పలికె నంగదునితోఁ బంక్తికంధరుఁడు
క్రొవ్వి వానరుఁడ యీకొలువులోపలికి, నెవ్వగ నొందక నేఁడు వచ్చితివి
ఎవరు నిఁ బంచినా రెవ్వండ వీవు, ఎవ్వనితనయుండ వేమి నీపేరు
నివ్వటిల్లెడులంక నీవిటు చొచ్చి, యెవ్వరిపనిఁబూని యేగుదెంచితివి
వనచర చెప్పరా వచ్చినకార్య, మని రావణుం డిట్టు లదలించి పలుక
విని క్రోధవివశుఁడై వికృతాస్యుఁ డగుచు, వనచరపతి యంత వాని కిట్లనియె
నీవెవ్వఁ డనిపల్క నెఱుఁగవే నన్ను, రావణ యేను నారాముని బంట
రాముఁ డెవ్వఁడు పరాక్రమమునఁ బరశు,రాముని గెలిచిన రణవిచక్షణుఁడు
అతఁ డెవ్వఁ డుద్ధతుం డై కార్తవీర్యు, నతివీరుఁ ద్రుంచిన యతులవిక్రముఁడు
అతఁ డెవ్వఁ డెఱుఁగవా యాజిలో నిన్ను, జితుఁ జేసికొనిపోయి చెఱనిడ్డవాఁడు
ఎవ్వనితనయుఁడో యెఱుఁగవా నన్ను, నివ్వటిల్లగఁబట్టి నినుఁ దోడఁ గట్టి
మెఱపెట్ట వార్ధుల ముంచి ముంచీడ్చి, కరుణించి విడువఁడే ఘనుఁడైనవాలి
యావాలి మఱచితే యకట యంతటనె, యేవాలి సుతుఁడౌట యెఱుఁగవా యోరి
యంగదుం డనువాఁడ నాహవవార్ధి, నంగద నిను ముంతు నాతండ్రివోలె
మాతండ్రి యెఱుఁగక మఱి నిన్నుఁబట్టి, యాతతంబుగ నీట నట ముంచెఁగాక
యనవుడుఁ గోపించి యసురేశుఁ డనియె, వనచరాధమ నీవు వచ్చినదూత
చెనకి నిన్నిట శిక్ష సేయరా దనుచు, ఘనముగా బెడిదంపుఁ గాఱు లాడెదవు
వలనుగా నిటమున్ను వచ్చినదూత, యలరుచు హనుమంతుఁ డనువాఁడ ననుచు
వలనొప్ప నిటవచ్చి వై దేహితోడఁ, గలవి లేనివి కొన్ని కాఱులు వల్కి
యీచతురోక్తు లనేకంబులాడి, మాచేత దండన మఱి పొంది పోయె
నోరి యావానరుఁ డున్నాఁడొ లేఁడొ, వెరవారఁగా నాకు వివరించి చెప్పు
మనవుండు నంగదుం డసుర కిట్లనియె, ఘనులు రామునిసేనఁ గప్పులెల్లఁ గినిసి
బలితహుంకారోగ్రపటుశక్తి మెఱసి, చెలఁగి యాహనుమంతు చెంపలుగొట్టి
యని రావణునితోడ నరమాటలాడి, పనివడి లంకకుఁ బనిపూని పోయి

యడరి యిం ద్రారిచే నాలంబులోన, వడిఁ బట్టువడి చిక్కి వనచర నీవు
తోఁకఁ గాల్పించుక తొలఁగి వచ్చితివి, వీఁకతో రాముని వీటిలోపలను
సరికపికులములో సడితెచ్చి తనుచు, వెరవిడి తోలిన వీటికిం బాసి
యటుఁ బంపకడకేగె నాహానరుండు, ఇట రాముసేనలో నిద్దఱి మమ్ము
నినజుండు వానరహీనులఁజేసి, పనివడి యిటువంటి పనులు నేయించు
నని యంగదుఁడువల్క నసురేశుఁ డంత, మనమున బెగడొంది మగ్నుఁడై యుండె
మలయుచుఁ జలము క్రమ్మఱ నూలుకొలిపి, యలఘుఁడై యంగదుం డప్పుడు పలికె
నేర రావణ రాము నెఱుఁగుదుగాక, యీరీతి గర్వింప నేటికి నీకు
లోకవిక్రముఁడు త్రిలోకభీకరుఁడు, లోకశరణ్యుండు లోకైకనుతుఁడు
లోకరక్షకుఁడును లోకశిక్షకుఁడు, స్ఫాకటచంద్రమోభానువీక్షణుఁడు
వేదాంతవేద్యుండు వేదగోచరుఁడు, నాదినారాయణుం డలిసత్యవాది
యసదృశుం డారాముఁ డభిరాముఁ డనఘుఁ, డసహాయశూరుఁడు నతులవిక్రముఁడు
ఆద్యంతరహితుండు నాచారపరుఁడు, నాద్యుండు పరుఁడును నగుదివ్యమూర్తి
దశరథరామభూతలనాయకుండు, విశదోరుసత్కీర్తి విదితశూరుండు
అడరి నీచెలియ లత్యాసక్తి డాయ, నడఁచిన నాశూర్పణఖముక్కుచెవులు
వడిఁ బట్టి కోసిన వరఖడ్గధార, వడియు నెత్తురుఁ దుడువఁగఁ గోసి వేసి
ఖరదూషణాంగరక్తంబులఁ గడిగి, కర మొప్పఁజేసిన కాకుత్స్థతిలకు
నెఱుఁగవా రాముని నేటికిఁ బ్రేలె, దెఱఁగెదు కాకేమి యెందుఁ బోయెదవు
మూఁడులోకంబులు ముట్టి గర్వమున, మూడించు నిన్ను నమ్మనుజవల్లభుఁడు
దునిమెడి నుగ్రత దొలఁగక నిలిచి, యనిసేయు బంటవై యంతియ చాలు
లంక నీవింక నేలఁగలేవు వినుము, లంకకుఁ బతి సుమ్ము లలి విభీషణుఁడు
తడయక నీమీఁద దయగల్గి యిపుడు, కడువేగమున నిట్టి క్రమమున మంచి
బుద్ధి నీకును జెప్పఁ బుత్తెంచె నన్నుఁ, బద్దురా రాక్షస వైదేహి నిమ్ము
మదిమదినుండి రామాధిపుతోడఁ, గదిసి కయ్యమునకుఁ గాలుద్రవ్వకుము
రాక్షసాధమ యోర రామునిదేవి, నీక్షితి మొఱిగి నీ విట్లు తేఁ దగునె
లోకపావనసీత లోకైకమాత, నీకుఁ దేఁ దగదోరి నీచ రాక్షసుఁడ
నినుఁ జెప్ప దోషంబు నినుఁ జూడరాదు, ఘనతరమగు పాపకర్ముండ వీవు
లోకంబులకుఁ దల్లి లోలాక్షి సీత, నీకుఁ దల్లియకాదె నిర్భాగ్య దనుజ
యవివేకమునఁజేసి యపకీర్తిపడితి, వివి కీర్తులా నీకు నెఱుఁగలేవైతి
వెడపక రఘురాముఁ డెగ్గేమినేఁడు, గడుగర్వి యన మీఁదుఁ గానంగలేక
యిహపరదూరుఁడ వీవేపుమాఱి, విహితమార్గం బింత వివరింపవైతి
వుడుగక రామాగ్ని యొడిఁ గట్టుకొంటి, పుడమిలో భస్మమై పోయెడికొఱకు
నీపాలివిధి పట్టి నీమెడఁ గట్టి, యీపాలుచేసె నిన్నీరసమెత్తి
నీవేమిసేయుదు నీవ్రాతఫలము, గావించి యజుఁ డిట్లు కట్టడసేసి
కడఁగి రాఘవునంపకార్చిచ్చులోనఁ, బడి శలభంబవై వ్రాలెద వెల్లి

చాల నొప్పినయట్టి సౌఖ్యత లంక, యేలుభాగ్యంబు లే దేమందు నిన్నుఁ
జెడకుము శరణని చేరు మారాముఁ, బుడమిలో నీప్రాణములు గాచికొనుము
నీపుత్త్రమిత్రాదినిఖలరాక్షసులు, నేపరి రాముచే నీల్గకమున్నె
కార్యంబు మునుపడఁ గైకొని బ్రతుకు, కార్య మొల్లక పోరు గావించితేని
చుట్టాల నింతుల సుతుల సోదరుల, నిట్టె యందఱుఁ జూడు మిఁకఁ జూడలేవు
ఎలమి నీమోహంపుటింతులనెల్లఁ, గలయ భోగింపుము కాంక్షలు దీర
వెలయంగ నీరాజ్యవిభవంబులెల్లఁ, బలుదెఱంగుల నేఁడె పాటించి చూడు
హరిహరబ్రహ్మాదు లడ్డగించినను, దురములోపల నిన్నుఁ ద్రుంచు రాఘవుఁడు
ఇన్నియు నేటి కాయినకులేశ్వరుని, కున్నతమతి సీత నొప్పించి బ్రతుకు
మిటు రామునానతి యెఱుఁగఁ జెప్పితిని, గుటిలరాక్షస యేమి గొబ్బునఁ జెప్పు

రావణుఁ డంగదునితోఁ దనపరాక్రమము చెప్పుట.

మన రోషచిత్తుఁడై యద్దశాననుఁడు, ననియె నంగదుతోడ నప్పుడు కినిసి
రాముఁజెప్పెదు పరాక్రమశాలి నన్ను, రాముఁ డెఱుంగఁడా రణవిజయుఁడుగ
దివిజేంద్రుఁడాదిగా దేవసంఘముల, బవరంబులోపలఁ బఱపినవాఁడ
హరుఁడున్నకైలాస మగలించినాఁడ, నెరియంగఁ గాలుని నెదిరించినాఁడ
వరుసతో జగములు వర్ణింప నలరి, సరవి లోకములెల్ల సాధించినాఁడ
వనజాసనునిచేత వరముఁగొన్నాఁడ, మొనసి దివ్యాయుధంబులు గలవాఁడ
నిట్టిపిమ్మటను నే నీరాముమఱుఁగుఁ, బట్టిన దేవతల్ పకపక నగరె
ఁయనుజుండు నాతోడ నలిగటుపోయి, జననాథుమఱుగు వంచనఁ జొచ్చెగాక
ఏనును జొచ్చిన హీనతగాదె, వానరాధమ నాకు వసుమతిలోన
మగపాడి దిగనాడి మానంబు విడిచి, పగవానిఁ గలయుట పంతమే నాకు
పగవాఁడు దండెత్తి పైవచ్చినంత, మగటిమి చెడి సంధి మఱి నేయునప్పుడె
జగతిరాజులు నన్ను సరకునేయుదురె, తగదురా సంధి యిత్తఱి వానరుండ
యనిన దశాస్యుని కనియె నంగదుఁడు, ఘనపరాక్రముతోడి కయ్యంబు వలదు
బానవ రఘురాముతర మెఱుంగకయ, పూనియున్నాఁడ విప్పుడు కావరమున
సురల గెల్చినమాడ్కి- శూరు రాఘవుని, దురములో నెదిరించి తొడరుట యెట్లు
బలమేది రఘురామపార్థివు నెదిరి, బలుముష్టి విల్లెట్లు పట్టంగవచ్చు
నొరులగెల్చినమాడ్కి- నోర్చి రాఘవుని, శరవృష్టి ముందఱ జరియించు నెట్లు
కణకతో నీవెత్తగా లేనివిల్లుఁ, దృణలీల విఱువఁడే త్రిజగంబు లెఱుఁగ
వెఱవేది రఘురామువిక్రమస్ఫురణ, మెఱుఁగనియవివేకి వేమందు నిన్ను
జనకనందన నిచ్చి శరణన్న లెస్స, యని యంగదుఁడు వల్క- నసురేశుఁ డనియె
నోరి వానరుఁడ నీవొడక యిపుడు, సారెకు రఘురాముశౌర్య మెన్నెదవు
ఆరాముపరాక్రమ మారాముకడిమి, యారాముభుజశక్తి యది యెంతపెద్ద
చలమునఁ దాటకఁ జంపె నంచేని, తలపోయ నాఁడుది దాని కెక్కింత
జనకునివిలువిర్చి జనకతనూజ, ఘనతఁ జేగొన్నట్టి ఘనుఁ డంటివేని

నావిల్లు నేఁటిదే యది చెప్ప నేల, కావున నది వీరకర్మమే మఱియు
జమదగ్ని రాముని సమరమధ్యమునఁ, గ్రమమున గెలిచిన ఘనుఁ డంటివేని
యని బ్రాహ్మణునిగెల్చు టది బంటుతనమె, వినఁబోల దీమాట విక్రమస్ఫూర్తి
నలఘున ఖరదూషణాదిరాక్షసులఁ, జలమున నొక్కఁడే చంపె నంచేని
నలర వారలు వృద్ధు లది చెప్పనేల, తలపోసి యెంచిన ధరణీశ్వరుండు
తెగువ మారీచు మర్దించె నంచేని, మృగమాత్ర మగువాని మేరయే దొడ్డ
ఎసఁగ వాలినిఁ గూల నేసె నంచేని, వసుధలోపలఁ గోతి వాఁడెంతదొడ్డ
జవసత్త్వమున వార్ధి శరముఖంబునకు, గవగొనితెచ్చిన ఘనుఁ డంటివేని
నావీరవరునకు నారాఘవునకు, నావార్ధిజలమాత్ర మదియేమి బలిమి
ఇవి బంటుతనములే యీ రాఘవునకు, నివియెల్ల గెలుపులే యిల రాజులకును
బూని నామముందఱఁ బొడవులు చేసి, వానర రఘురాము వర్ణించెవీవు
అని దశాస్యుఁడువల్క ననియె నంగదుఁడు, అనుపమోన్నతగుణోదయమునిరాఘవుని
సకలలోకారాధ్యు జగదభిరాము, సకలజగద్ధితచరితు శ్రీరాము
నకలంకవిక్రము నతివీరవర్యు, నకట దూషింపంగ నర్హమే నీకుఁ
జెలఁగు నీరఘురాముశౌర్యంబునకును, ఖలులగుక్రవ్యాదగణములే సాక్షి
గొనకొని వాలిని గోతంటి నందు, కనెద నిస్తుంచిన యంబుధుల్ సాక్షి
అలఘువిక్రమశాలి యైనరాఘవునిఁ, జెలఁగి దూషించిన జననాథుపెంపు
తప్పెనో నీకేమి ధన్యత వొడమె, నిప్పుడు రఘురాము నిట్లు దూషింప
నీరాజసంబును నీదుభోగంబు, దూరమా నాయువు దొలఁగును సిరియుఁ
దనర శ్రీరామునిఁ దలఁచినంతటనె, ఘనమైనపాపంబు గ్రక్కునఁ బాయు
రాముపాదము సోక ఱాయింతియయ్యె, రామ రామని బోయ రాశికి నెక్కె
రామనామస్తుతి రావణ నీకు, నేమిపాపముననో యెఱుకచొప్పడదు
అట్టి శ్రీరాముని యసురేశ నీవు, నెట్టన దూషింప నీకేది గతియొ
అని యంగదుఁడు వల్క ననురేశుఁ డనియె, వనచర రఘురామవసుధేశుశక్తి
యెఱుఁగుదు చెప్పఁగా నేల యాస్వామి, పరమైనతారకబ్రహ్మం బనంగ
నాడవలయుమాట లాడితికాక, పోడిమి రాముతోఁ బురుణింపఁగలనె
చలపట్టి రాముతో సమరంబునేయఁ, గలుగునో యని కోరి క్రాలుచున్నాఁడ
నిందునందును మెచ్చు నినవంశుతోడఁ, జెంది కయ్యమునేయ శివుఁ డెఱింగెడిని
అతనితోఁ బోరాడి యతనిచేఁ జచ్చి, ప్రతిలేనివైకుంఠపదవిఁ గైకొందు
నీలోకసౌఖ్యంబు లింతియ చాలు, నేల చెప్పంగ నే నెఱుఁగు దన్నియును
బలవంతుఁ డగురాముప్రాభవోన్నతులు, దెలియ చిత్తంబులో దివురుచున్నాఁడ
ననిచెప్పి దశకంఠుఁ డనియెఁ గ్రమ్మఱను, దనవివేకముచెడి తామసుం డగుచు
ధరణీతలంబెల్లఁ దమ్మునిచేతఁ, బరగంగఁ గోల్పోయి పడఁతియుఁ దాను
ననుజుండు గూడంగ నడవులఁబడుచుఁ, దనసతి నొకనిచేఁ దాఁ గోలుపోయి
వచ్చి సుగ్రీవాదివానరవరులఁ, జొచ్చియు నటమీఁద శూరతఁ జూపఁ

జనుదెంచె రాముఁడు సంగరస్థలిని, నను దాఁక నేర్చునే నరనాయకుండు
అటుగాన రఘురాముఁ డాలంబులోనఁ, బటుతరశౌర్యసంపన్నుండు గాఁడు
మనుజులు కోఁతులు మగఁటిమిచేతఁ, దనయొద్దఁ జెప్పకు తరుచరాధముఁడ
వనచరాధమ యోరి వాలికి నీవు, తనయుండవై తేని దశరథాత్మజుని
గొలిచితి బంటవై కొలయింగవైతి, చలమున నీతండ్రిఁ జంపినాఁ డతఁడు
అట్టి రాముని గొల్చి తధమవానరుఁడ, పుట్టి తిండ్రజుగర్భమున వృథా నీవు
చంపినపగవానిఁ జంపక రాము, పంపుసేయుచు నిట్లు బంటవై తిరిగి
యెలమిఁ గొల్చెదనన్న నీరాజెకాని, తలపోయ రాజులు ధరణిపై లేరె
గొనకొని పగవానిఁ గొలిచినవాని, నినుఁగాని యెవ్వరి నెఱుఁగ మెన్నఁడును
నీమగఁటిమికిని నీదుపెంపునకు, సీమవారెల్లను సీయని నగరె
కొడుకైనపిమ్మటఁ గులవైరమెల్ల, వడితోడ నీగనివాఁ డెట్టికొడుకు
ఈగతి బంధువై హీనమానవునిఁ, జేరి కొల్చుట యెట్లు చేవయులేక
నిను వాలికొడుకన్న నెటు నమ్మవచ్చు, వనచర యెవ్వరివాఁడవో కాక
విను బుద్ధిసెప్పెద వివరంబుగాఁగ, మనుజులఁ గొలుతురే మనుజులు నాకుఁ
బగవారు నీకునుఁ బగవారుగాక, నొగి దొత్త మిటుసేయుచుండుట దక్క—
నన్నుఁ గొల్చిన నిన్ను నంగద యిపుడు, వనచరులకునెల్ల వరప్రభుగాఁగ
ఘనభూషణంబులు ఘనవాహనముల, మనఁజేతు నిప్పుడు మహిమీఁద ననిన
దనుజాధిపతిఁ జూచి తారాసుతుండు, ఘనకోపమునఁ జాల గరిమ నిట్లనియె
నగణితోన్నతశక్తుఁ డైనరాఘవుఁడు, తగ నాదుతలిదండ్రి దాతవైవంబు
ఏమిగర్వము నీకు నెఱుకచొప్పడదు, భూమీశుతో రిపు ల్పురణింపఁగలరె
యరయలే కవివేకు లారామవిభుని, నరుఁడంచు నెంతురు నక్తంచరేంద్ర
యతఁడు మానవమాత్రుఁడా యసురేశ, యతఁడు లోకారాధ్యుఁ డతఁడప్రమేయుఁ
డతఁడు శ్రీవిష్ణుండు నతఁ డాదిమూర్తి, యితనికి సరిపోల్ప నెవ్వరు గలరు
సనకాదులును గూడి చర్చింపలేరు, ఏనజాసనాదులు వర్ణింపలేరు
దానవాంతకుఁడునై దశరథేంద్రునకుఁ, బూని జన్మించిన భూపాలుఁ డితఁడు
నితనికోపాగ్నికి నెవ్వఁడు నిల్చు, నితనితో డీకొని యెవ్వఁడు పోరు
నితనిబాణాహతి కెవ్వఁడు నోర్చు, నితని నెన్న వశంబె యింద్రాదులకును
నీవెఱుంగవు రామునిపుణవిక్రమము, కావరంబున నేల కాఱులాడెదవు
వరరాము నెఱిఁగెదు దురములో నెల్లి, కరమర్ది దురమునఁ గదలక నిలును
కర్మపంకములెల్లఁ గడతేర్చి వాలి, నిర్మలాత్మకుఁడయ్యె నృపుచేతఁ జచ్చి
పదపడి వైకుంఠపదముఁ గైకొనియె, నిది కీడుగా మమ్ము నెన్న నేమిటికి
నితనిఁ గొల్చిన నాకు నిహపరోన్నతులు, నతులితంబుగఁ గల్గు నమరులు పొగడ
నీమదంబును లావు నీరాజసంబు, రామచంద్రునిఘోరరణరంగమందు
బోయెడు నెబ్బంగిఁ బొలుపేది నీవు, వేయఁ జెప్పఁగనేల విధి నిన్నుఁ జుట్టి
కొనిపోవుచున్నది కుటిలరాక్షసుఁడ, మునుపటివరగర్వములు చెల్లవింక

నీన్నియు నేటి కాయినకులేశ్వరున, కున్నతమతి సీత నొప్పించి బ్రతుకు

రావణుఁడు తనభటులతో నంగదునిఁ బట్టి కట్టుండని నియమించుట

తొడరిన బలవంతుతో సంధి యగుట, పుడమి రాజులకెల్ల బుద్ధియె సుమ్ము
అనవుడుఁ గోపించి యారావణుండు, ఘనబాహుబలుని నంగదుఁ బట్టికట్టఁ
బనిచినఁ గొందఱు బలితంపుటసుర, లనయంబు నుద్ధతు లయి పట్టుటయును
సొలవక తనశక్తి చూపెడికొఱకుఁ, దొలఁగ నొల్లక యంగదుఁడు పట్టువడియె
నటు పట్టువడి యతఁడాకాశవీధిఁ, బటుశక్తి నెగసి యుద్భటవృత్తి మెఱసి
విద్రిచినఁ బదివేలవీరులు ధాత్రి, యద్రువంగ నుగ్గునూచై త్రెళ్లి రంత
నలిగి యంతటబోక యంగదుం డసుర, కొలువున్న యమ్మేడ గూలఁ దన్నుటయు
నది వజ్రహతిఁ దుహినావనీధరము, తుదిఁగూలుపగిదిఁ దుత్తునియలై కూలె
వెండియు నంగదు విడువక పట్టఁ, బొండని దైత్యులఁ బుచ్చె రావణుఁడు
పుచ్చిన వారును బొదివి యంగదుని, నచ్చెరువయియుండ నాకాశమునను
బరశుపట్టసభిండివాలశూలములఁ, గరవాలతోమరగదల నొప్పింపఁ
బిడికిళ్లతోడనే ప్రేవులు వెడల, బెడిదంబుగా నొంచి పృథివిపైఁ గూల్చి
యరుగుచు నున్నయాయంగదుఁ జూచి, ఖరసూతి సుకరుండు కార్ముకం బెత్తి
నిలు నిలు మంగద నీవెందుఁ బోవఁ, గలవాఁడ వని పేర్చి కాండంబు లైదు
నుదురు గాడఁగనేసి నొప్పించి మఱియుఁ, బదితీవ్రశరముల బాహువులేయ
నలుకతోఁ బిడికిటి నంగదుం డతని, తల పెక్కువ్రయ్యలై ధరఁ గూలఁ బొడిచె
దానికి దైత్యులు తల్లడమంద, దానవేశ్వరుఁడు చింతాముగ్ఁడయ్యెఁ
దారాతనూజుఁ డత్తఱి నేగుదెంచి, యారామచంద్రునియడుగుల కెరఁగి
యోజగదారాధ్య యోరామచంద్ర, భూజననుత రామభూపాలతిలక
దేవ మీయానతి ధృతితోడ నేను, రావణునొద్దికి రయమునఁ బోయి
చెప్పఁగాఁ గలవెల్లఁ జెప్పితి దేవ, చెప్పినమాటలు చెవిఁబెట్టఁడయ్యెఁ
గట్టిగాఁ జావుకుఁ గడుతెంపుచేసి, యుట్టిగట్టుక నూఁగుచున్నాఁడు దేవ
యినకులనాథ నీ వీదశ గ్రీవు, ననిలోన మడియింపు మఖిలలోకేశ
యనుచు నావృత్తాంతమంతయుఁ దెలియ, వినిపించె నంతయు విశదంబుగాఁగ
జననాయకుండును సంతసంబందె, ఘనతరంబైన యంగదస త్త్వమునకు
నట రావణునితోడ నసురులందఱును, బటుతరవాక్కులై పలికి రెంతయును
ఇదియేమి దేవ నీవిట్లూరకునికి, యదె కపినేనతో నారాఘవుండు
విడిసినాఁ డీలంక వేడించి యింకఁ, గడిమి నెన్నఁడు చూపఁగలవాఁడ వీవు
మముఁ బంపు రామలక్ష్మణులవానరుల, సమరంబులో గెల్చి చనుదెంతుమనుచు

రావణుఁడు యుద్ధసన్నద్ధుఁడై యుత్తరగోపురమునకు వచ్చుట.

వీనుల కరుదుగా విని దశాననుఁడు, భానుజాదులకును భయము పుట్టంగఁ
దనవైభవము రామధరణీశునకును, ఘనముగాఁ జూపెదఁ గాకంచుఁ దలఁచి
సాంద్రప్రతాపని స్తంద్రుఁడై తొల్లి, యింద్రనాగేంద్రధనేంద్రుల గెలిచి

కప్పముల్ గైకొన్న ఘనవస్తువితతిఁ, దెప్పించి మేలేర్చి దీధితు ల్నిగుడఁ
జీనాంబరంబులు చెలువారఁ గట్టి, నానాదిశల వాసనలు వెదచల్ల
మృగమదశ్రీగంధమిళితమనోజ్ఞ, మగుదివ్యచందన మర్థితో నలఁది
సరసమంజుళపారిజాతప్రసూన,విరచితమాలికావితతులు ముడిచి
పంకజరాగాదిబహుంరత్నకలిత,కంకణముద్రికాంగదభుజాభరణ
ఘనతరగ్రైవేయఘంటికానేక,వినుతహారంబులు విపులంబులైన
పదకంబు లాదిగా బహుభూషణములు, పదకశుద్ధిగ వన్నె పచరింపఁ దాల్చి
కుండలంబుల మెండుకొనుమణిప్రభలు, గండమండలములఁ గడలుకొనంగఁ
జండాశుమండలోజ్జ్వలములై దిక్కు, లొండొండ వెలిఁగించు నురుకిరీటములు
దశశిరంబులమించు దహనుఁడోయనఁగ, దశశిరంబులలీల ధరియించి మించి
సురవరానలయమాసురనాథవరుణ, మరుదర్ధనాయక స్మరసంహారులను
గండడంచి జయించి కైకొన్న బిరుదు, గండపెండెంబు డాకాల ధరించి
శరశరాసనపట్టసప్రాసచక్ర, పరశుతోమరబిండివాలత్రిశూల
కరవాలపాశ ముద్గరచంద్రహాస, పరిఘాదులగు వరప్రహరణశ్రేణు
లిరువదికరముల నేపారఁ బట్టి, పరిచారు లొగి వెంటఁ బలసి యేతేర
గొబ్బున నుత్తరగోపురంబునకు, గబ్బునుబ్బును గ్రాల ఖడ్గశూలాది
హస్తులై యెడగల్గి యాప్తరాక్షసులు, విస్తరంబుగఁ బరివేష్టించి కొలువ
స్ఫురితభూషణవస్త్రభూషితు లగుచు, నిరువంక మంత్రు లనేకులు గొలువఁ
దుదలేనిరత్నపంక్తులు దాపినట్టి, పెదపెద్దపసిడికుప్పెలు మీఁద నొప్ప
ప్రవిమలంబగు నెనుబదివేలసంఖ్య, ధవళాతపత్రముల్ దనుజులు పట్ట
నలశేషఫణములో యననన్ని వేల, సలలితవ్యజనముల్ సకియలు వూనఁ
దళుకువెన్నెలచందమున నాసంఖ్య, గలచామరంబులు కాంతలిర్వంకఁ
గంకణఝణఝణత్కారము ల్మెఱయ, నంకించి చామర లందంద వీవ
మరల గెల్చినజయస్ఫురణ లెల్లెడల, బిరుదు లెత్తుచు వందిబృందంబు వొగడ
మంద్రమధ్యమతారస్థమానభేదములఁ, జంద్రాస్య లెఱుఁగ మెచ్చుగఁ బాడవినుచు
సన్నుతమాణిక్యజాలప్రభాస, మున్నతసింహాసనోపరిస్థలిని
అపరాచలమువోలి యర్కునితోడి, యుపమకుఁ బాత్రుఁడై యొగి రావణుండు
వలనైన తనవైభవంబెల్ల మెఱసి, కొలువుండె నుత్తరగోపురంబందు
నాగొడుగులనీడ యాదిత్యుఁ గప్ప, వేగంబె చీఁకటి విలసిల్లుటయును
నావేళ మాయామృగాజినంబునను, దేవేంద్రమణికాంతి దీపించుమేని
వామభాగముమోపి వామభుజాగ్ర,సీమఁ గపోలమూర్జితముగాఁ జేర్చి
యుగ్రాంశుబింబసముజ్జ్వలుండయిన, సుగ్రీవుతోడలపై సొంపు సొందర్య
సంపద లొలుక రాజసముగా నొరగి, పెంపారుమహిమచేఁ బ్రియభక్తుఁడైన
పవనజుతొడలపై బొదపద్మములు, సవరణఁ జూప నిశ్చలభక్తి నతఁడు
మృదురీతి నొత్త నర్మిలి నంగదుండు, కదిసి దక్షిణభుజాగ్రం బిరుకేల

నంది యంగుళము లొయ్యనఁ బట్టుచుండ, వందిబృందమ్ములవైఖరి నిలిచి
నలనీలభల్లూకనాయకప్రముఖు, లలరుచు సకలలోకారాధ్యచరణ
జానకిహృదయాంబుజాతషట్చరణ, దీనార్తిహరణ కీర్తితకృపాభరణ
హరనుతనామ సూర్యకులాబ్ధిసోమ, యటిభీమ రఘురామ యని సన్నుతింపఁ
గందనిపూర్ణరాకాచంద్రుఁబోలు, మందస్మితాననమండలంబునను
నవిరళకరుణామృతాపూర్ణ మగుచు, భవళారవిందసౌందర్యంబుఁ దెగడు
తెలికన్నుఁగవకాంతి దెసలెల్ల నిండ, లలితావలోకవిలాసచంద్రికలు
వెదచల్లఁగాఁ గరద్వితయసన్నిహిత, వదనుండు రాక్షసవరమర్మవిదుఁడు
నగువిభీషణుతోడ నతిరహస్యంబు, లగుమాటలాడుచు నప్పటప్పటికి
రమణీయలీల శ్రీరాఘవేశ్వరుఁడు, అమరదక్షిణముఖుండై యున్న వాఁడు
గావున గోపురాగ్రమునఁ గొల్వున్న, రావణుఁ బొడగాంచి రఘురాముఁ డనియె
నోవిభీషణ చూడు మున్నతంబైన, యావిశాలపుగోపురాగ్రంబునందు
భోగియై యెంతయుఁ బొగడొందువాఁడు, బాగొప్ప వానికిఁ బట్టినయట్టి
శరదభ్రవిభ్రమచ్ఛత్రసంఘములఁ, బరఁగెడునీడ భూభాగంబుఁ గప్పె
నారూఢవైభవాయతవృత్తితోడ, నీరీతి నున్న వాఁ డితఁ డెవ్వఁడనిన
నారామముఁ జూచి యిట్లని విన్నవించె, నారావణునితమ్ముఁ డగువిభీషణుఁడు
దేవ రాఘవ వీఁడు దేవారియైన, రావణుఁ డమరవిద్రావణుం డఖిల
దివిజులచేఁ గొన్న దివ్యభూషణము, లవిరళంబుగఁ బూని యొప్పులై నట్టి
దనుజముఖ్యులు గొల్వఁ దనకు నిండారఁ, బనుపడఁగా నెనుబదివెలసంఖ్య
గలగొడుగులుపట్ట ఘనచామరంబు, లలవుమై వీవంగ నాలవట్టములు
పూనంగఁ దనదుపెంపును రాజసమును, దానిట్టిదనుచు మోదమున మీయెదుటఁ
జూపంగఁ దలఁచి భాసురవైభవమున, గోపురోపరిసీమఁ గొలువైనవాఁడు
నావిని నవ్వి మానవకులేశ్వరుఁడు, దేవారిగర్వంబుఁ దీర్పంగఁ దలఁచి

శ్రీరాములు రావణుని ఛత్రచామరంబులు బాణములతోఁ దెగనేయుట.

వెనుకొని లక్ష్మణ విల్లుఁ దెమ్మనుచుఁ, దనకుఁ బిమ్మటనున్న తమ్మునిచేతి
ధనువు డాచేత నెంతయు వెడ్డనంది,కొని దక్షిణాంఘ్రియంగుష్ఠాన వింటి
కొననంబుఁ బూని గ్రక్కున నెక్కుపెట్టి, కనదర్ధచంద్రమార్గణ మరివోసి
ధీలక్షితోల్లాసి తెగనిండదీసి, యాలీల నొఱగిన యట్లనే యుండి
యలచామరవ్యజనాతపత్రౌఘములమీఁదనేసె నద్భుతవృత్తి మెఱయ
శరమొక్కటియుఁ బదిశరములై నూఱు, శరములై పదివేలశరములై మఱియు
లక్షయై కోటియై లక్షించి చూడ, నాక్షణంబున సంఖ్య లన్నియుఁ గడచి
తాలవృంతంబులు దాల్చు చేడియల, మేలిచామరములు మెఱయించుసతుల
సంగీతములునేయు సరసిజముఖులఁ, బొంగుచుఁ గైవారములునేయుబోంట్ల
భవళాతపత్రముల్ ధరియించువైత్య, నివహంబులను గొల్చి నిల్చినభటులఁ
గరములు ద్రుంచక గళములు ద్రెంచ, కురములు నాటక యురుకిరీటములు

ధర డొల్లఁజేయక తలలు ఖండింప, కరుదరు దిదియని యమరు లుప్పొంగ
నాల వట్టంబులు నాతపత్రములు, చాలశోభిల్లు వింజామరంబులును
కత్రించికొనిపోయెఁ గంరమాత్రములఁ, జిత్రమై తనరిన సితచామరములు
నాలవట్టములు సితాతపత్రములు, దేలుచు ఝల్లని దివినిండ నెగసి
కొలువులోఁ గొన్ని దిక్కులయందుఁ గొన్ని, కొలువులోపలి దైత్యకోటిపైఁ గొన్ని
లంకలోఁ గొన్ని యాలవణాబ్ధిఁ గొన్ని, లంకేశుపైఁ గొన్ని లఘులీలఁ బడియె
నలవుమై నటుచేసి యాదివ్యశరము, పొలయిక రఘురాము పొదిఁ జొచ్చె నంత
మహితాతపత్రచామరతాలవృంత, రహితదండధరాసురశ్రేణినడుమ
నున్న రావణుఁ డప్పు డొప్పారెఁ జూడ, దన్నుఁ గొంపోవ సుద్ధతి వచ్చియున్న
దుర్వారులగు యమదూతలనడుమ, గర్వంబుచెడి యున్నగతినుండెఁ జూల
వెఱఁగంది రఘురాముపిలుపిదివ్యపెంపు, తఱిగొని తలపోసి తలలూచి యూచి
బట్టుకైవడి మెచ్చి పటుతరధ్వనుల, బెక్కొత్తి రఘురాముఁ బోక్కొని పొగడె
నల్ల యోరఘురామ నయనాభిరామ, విల్లువిద్యకు గురు వీరావతార
కరశరలాఘవక్రమకళానిపుణ, స్ఫురదురుచాపసంతోషితకృపణ
భుజసారదృఢముష్టి భువనవిఖ్యాత, విజితరిపువ్రాత విజయసమేత
మానవరాజకుమారకంఠీర, వా నవ్యదివ్యశస్త్రాస్త్రసంపన్న
స్థిరఘోరాక్షయబాణతూణీర, వీరాగ్రగణ్య యోవిశ్వశరణ్య
బాపురే ! రామభూపాల లోకముల, నీపాటివిలుకాఁడు నేర్పునే కలుగఁ
బాటించి పురములపైఁ బడ్డహరుని, యేటొప్పు నిందు నీయే టొప్పుఁగాక
అని యని పదినోళ్ల నందందఁ బొగడ, విని మంత్రు లాదైత్యవిభున కిట్లనిరి
పగవాని నీరీతిఁ బంతంబు విడిచి, పొగడుదురే దైత్యపుంగవ యిట్లు
పొగడిన భయమందఁబోలు నటంచుఁ, బగవారుఁ దనవారు బలుచగాఁ జూతు
రదికాన రాచకార్యంబు గాదనిన, మది నవ్వి యమరారి మంత్రుల కనియె
విలువిద్యపెంపును విక్రమక్రమము, కలికితనము బాహుగర్వరాజసము
లాదిగాగుణముల నధికుఁడైనట్టి, కోదండదీక్షాదిగురునితో రాజ
వరునితో రామభూవరునితో నొరులు, పరికించి చూడ నేపట్టుననైన
సాటియే యిమ్మూఁడుజగములయందు, మేటిశూరులపెంపు మెచ్చంగవలదె
యని నీతిచెప్పుచు నచ్చోటువాసి, దనుజేశ్వరుఁడువోయె దనుజనాయకులు
తెగిపడ్డగొడుగులఁ దెఱఁగొప్పఁ జూచి, మిగిలినభీతిమై మెల్లనఁ జనుచు
నటు రఘురామునియతులవిక్రమము, బటుగతిఁ బొగడుచుఁ బలుతెఱంగులను
ఆరాఘవుఁడు కరుణాంబుధిగాన, ఘోరబాణంబున గొడుగులఁ ద్రుంచె
నిటువంటియేసిన నిందఱితలలు, పటుతరంబుగఁ దెగి పాఱవే యనిరి
ఇట నంత నారాఘవేంద్రుండు కార్య,ఘటనాప్రయత్నసంగతచిత్తుఁ డగుచు
ననుజవిభీషణార్యమజాదులైన, తనవారియనుమతిఁ దగుముహూర్తమునఁ
బనిచె నప్పుడు లంకఁ బట్ట వానరులఁ, బనిచిన వానరబలములు లంక

ఘనభీతి నిక్కడక్కడఁ బడనార్చి, వనజా ప్తకులు రామవల్లభుఁ జూచి
దేవ మాశౌర్యంబు తెఱఁగొప్పఁ జూడు, మేవిధంబులఁ బ్రాణ మిత్తుము నీకు
నని పర్వతంబులు నవనిజంబులును, గొని వేలులక్షలు కోటానకోటు
లక్షౌహిణులు గుమురై కూడి వచ్చి, యాక్షణంబున ముట్టి రాలంకకోట
ముట్టిన గెల్పు రామునకు నౌననుచు, దట్టించి పేర్చి యుద్యగ్రులై కినిసి
బహుకాష్ఠపాషాణ పాదపావళుల, సహితదుర్వారులై యందందఁ గదిసి
తరమిడి యాయగడ్తలు పూడ్చునప్పు, డురుశక్తిఁ గపివీరు లున్నవిధంబు
పొలుపార నపుడు చప్పుడు గట్టమీఁద, దళముఁగా నున్న చందము నివ్వటిల్లెఁ
గుముదుఁ డత్తఱిఁ బదికోటులతోడ, సమతదూరుపు మొగసాలకు నరిగెఁ
బైదళంబైయుండ బలసి రాక్షసులు, పైద్రోచి రాకుండఁ బలిమిఁ జూపుచును
గొనకొని యెనుబదికోటులకపులు, తనలోడఁ బేర్చి యుద్దండత నడువ
ఘనబాహుబలుఁడు దక్షిణపువాకిటను, జనియుండె బలియుఁడై శతబలి యపుడు
పడమటిదెస కఱువదికోట్లకపులు, నడువ సుషేణుఁ డున్నతి నేగియుండె
రామలక్ష్మణులును రాక్షసేశ్వరుఁడు, నా మర్కటేశ్వరుం డయ్యుత్తరంపు
వాకిటనుండిరి వనచరోత్తముల, నాకోట లెక్కించి యడరి యార్చుచును
గజుఁడును గవయుండు గంధమాదనుఁడు, భుజబలాఢ్యుఁడు శరభుఁడును గ్రవృత్తి
దట్టించి కోట యంతటికిని లగ్గఁ, బట్టింపుచుండిరి పలుమాఱు దిరిగి
కోపించి వానరకోటులు గవిసి, యోపినంతంత నొండొరులఁ ద్రోయుచును
ఇది తోరణపుగోట యిది దానికొమ్మ, యిది యది యని యేమి యెఱుఁగ రాకుండ
వడిఁ గోటలెక్కి యాశ్వేరులపైకురికి, పెడబొబ్బలిడి తమపేరుఁ బాడుచును
ఉడుగక నిడుతోక లూడిసెల్లునేసి, వడి ఱాళ్లు లోనికి వైచి యార్చుచును
వ్రాకులతుదలు సమంబుగాఁ బట్టి, వీక లోపలియిండ్లు విఱుగ వైచుచును
గుడులునట్టళ్లును గోపురంబులును, బడఁదన్ని కోటపైఁ బరుగులెత్తుచును
అట్టళ్లతోడనే యసురవర్గములు, నెట్టనఁ గూలిన నిలిచి నవ్వుచును
ఇమ్ముల రూపించి యిదె చూడుఁడనుచుఁ, గొమ్ములు విఱుగంగ గుండ్లు వైచుచును
దోరణంబులును గైదువులు రాక్షసులు, చారుతరధ్వజచ్ఛత్రదండములు
కొమ్మలు కోటలు గూలుటఁ జూచి, క్రమ్మఱఁ దిక్కులు గలయనార్చుచును
ముంచికొండలు కరమ్ములఁ బెట్టువట్టి, దంచనాలకునివె దంచనాలనుచుఁ
గ్రచ్చఱ నట విఱుగంగ వైచుచును, మేచ్ఛరంబునఁ బలుమఱు నిట్లు కపులు
వడి వైచు తమతమ వాటులచేతఁ, గడుఁ జిత్రముగను లంకాపురిలోనఁ
గూలెడి మేడలు గ్రుంగు మేడలును, వ్రాలెడి గోడలు వ్రాలు మూఁపులును
నుఱుమైనయిండ్లును సుగ్గునూఁచైన, తఱుచుఁ గొమ్మలు చూచి తదనంతరంబు
దానవాధీశకరోత్సాహులై కపులు, వూని యంతయు భీతి బుట్టించుటయును
ఇటు గని యెఱుఁగమే యొన్నఁడుననుచుఁ, జటులతరాట్టహాసములు సేయుచును
నార్చువానరులపై నాదైత్యకోటి, పేర్చి యెంతయును గోపించి శూలములఁ

బొడిచియుఁ గరవాలములను దెంచియును, గడుబెట్టిదంబుగా గదల మోదియును
జొచ్చి తన్నియుఁ బరశువుల వ్రచ్చియును, గ్రుచ్చియగడ్డలఁ గూలఁ ద్రోచియును
దంచేనగుండ్లచేఁ దాఁకించి కడిమి, ముంచిన లగ్గ యిమ్ముల విడిపించి
యలరి రాక్షసులార్వ నాకపులార్వ, నిలయు దిక్కులుఁ జలియించె నెంతయును
నీగి దిక్కరులు ఘీంకృతులొనరించెఁ, గ్రాఁగిన యసురలగతి నబ్బు లింకెఁ
గులగిరులెత్తిన గుండులమాడ్కి, నిలమీఁద నందంద నెత్తిపైఁ బడియె
నురగాధిపతివిషం బొలికెఁ గూర్మంబు, గిరులునొండొంటికిఁ గ్రింపుమీఁదయ్యె
నాకారి యప్పుడు నడుచక్కి నున్న, భీకరసైన్యంబుఁ బిలిచి యుబ్బించి
కడిమి సొంపారంగఁ గపిసేన లంక, వెడలి తాఁకుండని వెసఁ బురికొలుప
భేరీరవంబులు భీకరకాహళారవంబులును శంఖారవంబులును
బటహారవంబులు బహుతూర్యరవము, పటుతరనిస్సాణభాంకారములను
తురగోగ్రహేషలు తోరంబులైన, కరిబృంహితంబులు ఘననేమిరవము
నత్తఱిఁ జెలఁగు భుజాస్ఫాలనములుఁ, జిత్తంబు లగలించు సింహనాదములు
నడరి యొండొండ బ్రహ్మాండంబు నిండ, సడలి దిగ్దేవతాసమితి భీతిల్లఁ
బలువిడి రాక్షసప్రవరసైన్యములు, వలనొప్ప నాలుగువాకిళ్ల వెడలె
నటు జాతవక్త్రంబునందుఁ దక్కంగఁ, బటుభీషణాకృతిఁ బ్రళయరుద్రునకు
నున్నముఖంబుల నుడుగక వెడలు, చున్నమంటలమాడ్కి నొక్కట మెఱసి

వానరరాక్షసుల ద్వంద్వయుద్ధము.

వెడలి వానరసేన వెసఁ దాఁకునపుడు, తడయక ద్వంద్వయుద్ధమునకుఁ జొచ్చెఁ
గడిమిమైనప్పు డంగదు నింద్రజిత్తు, గడుబెట్టిదంబుగా గదఁ గొని వ్రేసె
వజ్రంబుఁ బట్టి పర్వతముపై నలిగి, వజ్రి వ్రేసినక్రియ వారణ లేక
అంగదుండును బేర్చి యయ్యింద్రజిత్తు, సంగరంబున గిట్టి సమశక్తి మెఱసి
భూరిభూధరశృంగమున వైచెఁ బేర్చి, సారథిరథరథ్యచయములు గూల
వారక యేసె దుర్వారుఁడై మూఁడు, క్రూరాస్త్రములఁ బ్రజంఘుండు సంపాతి
విజయుఁడై యతఁడును వెసనశ్వకర్ణ, కుజమెత్తుకొని ప్రజంఘునిఁ బడవైచె
వినతుని రంభుని వెసనొంచెఁ బెక్కు, ఘనబాణముల నతికాయుండు వేర్చి
వాని యయ్యిద్దఱు భూరిశైలముల, వానిసేనల వాని వడి నొంచిరపుడు
దట్టింపుచును మహోదరుఁడు సుషేణు, గిట్టి యాతనిమీఁదఁ గినుకసొంపార
నడరించె బాణంబు లయిదును మూఁడు, వెడఁదవక్షంబున వెడఁదఫాలమున
వానిరథంబును వానిసారథిని, వానిరథ్యములఁ బర్వతమొక్కఁ బెత్తి
నలియంగఁజావఁ జూర్ణంబులైపోవఁ, జెలఁగుచునార్చి సుషేణుండు వైచె
మఱి జాంబవంతుండు మకరాక్షుమీఁద, బిరబిరఁ ద్రిప్పుచుఁ బెనుస్రుగు వైచె
నడుమనే యది ద్రుంచి నాటించె నతఁడు, కడుబెక్కుశరము లుగ్రస్ఫూర్తి మెఱసి
యతనిభుజంబుల నతనిఫాలమున, నతనివక్షంబున నతిలాఘవమున
నాజాంబవంతుండు నలుకమై వాని, భూజనంబుగఁ జేయు పర్వతం బొకటి

వైచిన రథమును వరరథాశ్వములు, చూచెడునంతలోఁ జూర్ణమై రాలె
శరములఁ బెక్కింట శతబలి గిట్టి, యురులాఘవమున విద్యుజ్జిహ్వుఁడేసె
నతనివక్షముఁ దాక నత్యుగ్రభాతి, శతబలి యొక్కవృక్షముఁ బూని వైచెఁ
బెక్కండ్ర దైత్యుల పీచంబులడఁచి, పెక్కుచందంబులఁ బేర్చినగజునిఁ
దప్పక విక్రమధనుఁడు కోపించి, విపైనవానరవిభునివక్షంబు
శూలంబుఁ గొని పొడుచుటయును వ్రేసె, సాలవృక్షమున రాక్షసుని నాగజుఁడు
వ్రేయంగ నతఁడును వెస మృతుండయ్యె, నాయెడ నగచరు లార్చి మోదింప
ననిఁ గుంభకర్ణునియగ్రనందనుఁడు, ఘనుఁడు కుంభుఁడు ప్లవంగములఁ బెల్లడరి
కుత్తుకలో వైచికొనఁగ నాధూమ్రుఁ, డెత్తి వృక్షంబులే డేపున వైచెఁ
గ్రూరుఁడై దేవాంతకుఁడు గవాక్షుండు, చారుతరోరువక్షస్థ్సలం బేడు
శరముల నేయవచ్చుట నొచ్చి యతఁడు, సరభసవృత్తిమై సాలవృక్షమున
వైచిన వాఁడేడు వాఁడిబాణములఁ,, బూచి యగ్గరినేసి పొడిపొడిచేసి
తొమ్మిదియమ్ముల దూపిడ్డవానిఁ, గొమ్మని గిరియెత్తికొని వైచె నతఁడు
ఋషభుని ముసలాన నేసె సారణుఁడు, వృషభుండు సారణువిపులవక్షంబు
వృక్షంబు గొని వైవ విల్లు నమ్ములును, నాక్షణంబున వైచి యతఁడు మూర్ఛిల్లె
గిరివోనిగజము నెక్కినత్రిశిరుండు, శరభునితల వ్రేసెఁ జని తోమరమున
శరభుండు గోపించి సాలవృక్షమున, హరి గిరి వ్రేసిన ట్లాత్రిమస్తకుని
వ్రేసి యగ్గజమును వ్రేసెఁ గూలంగ, రాసిరాక్షసునకు రాక్షసుం డగుచు
ననయంబుఁ బేర్చి నరాంతకుం డపుడు, పనసునిపైఁ దీవ్రబాణంబులేయఁ
బనసుండు నాతనిపై వృక్షమెత్తి, ఘనముగా వైచె నుగ్రతఁ జూపి యంతఁ
బరిఘుంబుగొని యకంపనుఁడు వ్రేయుటయు, ధరణిపై మ్రొగ్గి యుద్ధతశక్తినెగసి
కుముదుండు పిడికిటఁ గుపితుఁడై పొడువ, భ్రమసి చయ్యన నకంపనుఁడు మూర్ఛిల్లె
గిట్టి ధూమ్రాక్షుండు కేసరిమీఁద, నెట్టన నంపవెన్నీటను ముంప
వానినేనలను బర్వతములు నైచి, మానక నొప్పింప మఱి వాఁడు వితఁగె
మండితభుజగంధమాదను గిట్టి, ఖండనంబున మహాపార్శ్వుండు పెనఁగఁ
దరులను గిరులను దంష్ట్రల వానిఁ, గరము నొప్పించె నాగంధమాదనుఁడు
దఱుచుగా నావేగదర్శివై శుకుఁడు, నెఱి నాట నమ్ములు నిగిడించుటయును
వానిరథంబు దుర్వారుఁడై వేగ, వూనికమైఁ ద్రొక్కి పొడిపొడిచేసె
నడనకంపనుఁ డంత నలునకు నెదుర, నడతేరఁగా దొడ్డనగమున నతఁడు
ఊరవడితో గ్రుద్దు లురుకునట్లుగను, బెరిగి యాతనిమీఁదఁ బెట్టుగా వ్రేసె
వాఁడిబాణంబులు వడి నలుమీఁద, వాఁడేసె నేసిన వానివాలమున
గురుతరం బగుశక్తి గొని జంబుమాలి, యురుదుగ నురవడి హనుమంతునేసె
నెరిజవంబున నాంజనేయుండు గినిసి, యురక రథంబుపై నురికి యుగ్రతను
గిరివరశిఖరంబు క్రియనున్న వాని, శిరమరచే వ్రేసి చేసె వ్రయ్యలుగ
శరపరంపర విభీషణుని మిత్రఘ్నుఁ, డురవడి నెత్తురు లురలనేయుటయుఁ

గలుషించి యాతఁడు గదవ్రేయుటయును, దలకి మూర్ఛిల్లె మిత్రఘ్నుఁ డెంతయును
వనచరసేనల వారక పట్టి, కొని లీల మ్రింగు నికుంభుని గిట్టి
ఘూర్ణితారుణకటాక్షుండు నై సప్త, పర్ణవృక్షంబున భానుజుం డడఁచె
మొనసి యుద్ధతి వజ్రముష్టియన్వానిఁ, బెనుపార మైందుండు పిడికిటఁ బొడువ
నాలంకగోపురం బవనీస్థలమునఁ, గూలెనో యనఁ దన్ను కొని వాఁడు గూలె
వినువీధి సురలార్వ ద్వివిదుండు శైల,మున నళనిప్రభు మొనఁ గూలనేనేఁ
గరమల్లి నీలమేఘము సూర్యుఁ గప్పు,కరణి నందంద నుగ్రప్రకారమునఁ
బరఁగ దివ్యాస్త్రసంపదలచే నీలు, గురుభుజుండైన నికుంభుండు గప్పెఁ
గప్పిన నీలుండు గదిసి నికుంభుఁ, జప్పరించుచు రథచక్రంబు దెచ్చి
రయమున వైచి సారథిఁ దలద్రుంప, భయమంది వాఁడు విభ్రాంతుఁడై పాఱె
శరపరంపరలు లక్ష్మణుమీఁదఁ గినుకఁ, గురియు విరూపాక్షుఁ గొనఁక సౌమిత్రి
యొక్కబాణముఁ గొని యొగి వానినేయఁ, దక్కగ మార్చుచే ధరణివైఁ బడియె
రాముపై సుప్తఘ్నరశ్మికేతువులు, నామెయి నగ్నికోపాగ్నికేతువులు
కెరలి మేఘంబులక్రియ నంపసోన, గురిసిరి గుణరావఘోరగర్జనల
నలినాప్తకులుఁ డంత నాల్గుబాణముల, నలువురతలలును నలిఁ ద్రుంచివైచె

యుద్ధభూమివర్ణనము.

నక్కడి కయ్యంబు లటు చెల్లుచుండఁ, దక్కక విఱిగిన తఱుచైనవిండ్లు
చెదరినకరములు చిద్రుపలై పడిన, గదలును దునిసిన కరవాలములును
ముఱిసిన శక్తులు ముద్గరంబులును, పఱిసిన పరిఘలు పట్టసంబులును
గడికండ లైనచక్రప్రాసములును, బొడియైన సురియలు భూరిశూలములు
తుదలేక పడియున్న తోమరంబులును, చదిసిన రథములు సామజంబులును
గూలి చెల్లుగఁ దన్ను కొనుఘోటకములు, వ్రాలి మన్గఱచిన రథచోదకులును
రాలిన కోటీరరత్నపుంజములు, నేల మిట్టిడిబాహానిచయఖండములుఁ
జచ్చినయసురుల సమరభూభాగ, మచ్చెరు వయియుండె నప్పుడు చూడ
మర్దితారాతి రామఖడ్గేశ్వరుఁడు, దుర్దాంతశరములఁ ద్రుళ్లడంచుటయు
మలగొన్న యురుమీన మకరోరగాది,జలచరంబులు చిక్కి జలమెల్ల నింక
వశగతంబై రామవల్లభునెదుఱ, గృశమైన యంబుధిక్రియ నుండె రణము
అట్టివిధంబున నవనిజఁ దెచ్చి, నట్టిరావణునకు నట్టైవై శిరము
లట్టేల నిలుచు నన్నట్టిచందమున, నట్టలాకాశంబునం దాడెనపుడు
నెఱిగల్లు మజ్జంబు నెత్తురు ఱొంపి, తఱుచైన వెండ్రుకతండంబు నాఁచు
పునుకలు చిప్పలు పొరిఁ బొరి నున్న, ఘనములౌ పలుకలు కమఠతుండములు
తుమురులై పడిన కైదువులు విమానములు, రమణీయతరచామరములు హంసములు
కొమరారు తెల్లనిగొడుగులు నురుగు, లమరు భూషణచూర్ణ మందలియిసుక
యొడ్డనంబు నెగళ్లు నురుదంతిచయము, లొడ్డి పెంపారిన యుద్ధతుల్ గిరులు
తరుచరాసురదేహతతులు వృక్షములు, దొరిగినవ్రేవులు దుష్టసర్పములు

కొఅప్రాణములతోడఁ గుంభినియందు, నొఱగినరాక్షసు లొరలుట మ్రోఁత
కలఁగొన ఘనతురంగములు గ్రాహములు, నలి దూలుపడగ లున్నతినందు తెరలు
ఇవ్విధంబున మీఱి యేఱుల నెల్ల, నవ్వుచుఁ బటుర క్త నదులుబ్బి పాఱె
నారాయఁ బాపిష్ఠుఁ డగుఁ గాక యేమి, యారామునకు ద్రోహి యగుఁగాక యేమి
యతిలోకకంటకుం డగుఁగాక యేమి, యతులఁ జంపినపాపి యగుఁగాక యేమి
హితమతి నైయిప్పు డీడేర్పఁ దలఁచి, ప్రతిలేని రఘురాముబాణజాలముల
ధృతిదూలఁ గట్టి యాదేవకంటకుని, హితమతి నీదేహ మిటు విడిపించి
లోఁగొని వాని నాలోపల ముంచి, బొగొప్పఁ గలుగము ల్వాపి రక్షించి

సాయంకాలాదిరాత్రివర్ణనము.

ఖలుఁడైన యట్టియుత్కలుని రావణునిఁ, బొలుపార ముక్తికిఁ బుత్తునఁ మాడ్కి
సంగతి నొప్పారు జాహ్నవి యనఁగ, సంగరస్థలి మహాశ్చర్యమై యొప్పె
నప్పుడు లంకలో నాదైత్యకాంత, లుప్పొంగు శోకపయోధిలో మునిఁగి
గ్రద్దనఁ జేయునక్కయ్యంబునందు, బ్రొద్దు గ్రుంకినఁగాని పోఁడు రాఘవుఁడు
ఎప్పుడు గ్రుంకునో యినుఁ డింక ననుచు, నప్పటప్పటికిఁ బె ట్టడరుచునుండ
నంచితకఠినపుంఖాస్త్రాంశుతతుల, ముంచి రావణునితమోగుణం బణఁప
భీమప్రతాపసంస్ఫీతుఁ డైయున్న, రాముఁడే చాలు దుర్వారుఁడన్నాడ్కి
ఘనతరం బగుతనకరములు ముడిచి, వనజాప్తుఁ డపరదిగ్వనధిలో మునిఁగె
ఖలుఁడైన యద్దశకంరునిచేటు, వెలుపుటకై నిశీధిని కచభరము
విరళమై జల్లున విరిసెనో యనఁగఁ, బరపొంది చీఁకటి ప్రబలమై పర్వె
నప్పుడు బొబ్బలు నార్పులు వెట్టు, చప్పుడుల్ మల్లులు చరచునడిదము
లట్టహాసంబులు నడరి యొండొరులఁ, దిట్టెడి నెలుఁగులు దీవ్రహుంకృతులు
ఝుంకారరవములుఁ జప్పరించుటలు, నంకించుపలుకులు నాహ్వానములును
రథనేమిరవములు రధికసారథుల, పృథులవాక్యోద్ధూతభీమనాదములు
గుణనిస్వనంబులు గుంజరాగముల, ఘణిఘణిల్లని మ్రోయు ఘంటాస్వనములు
కరిబృంహితంబులు ఘనతూర్యరవము, తురగోగ్రహేషలు తోరమై పేర్చి
ప్రొద్దు గ్రుంకిననైనఁ బోవక చలము, పెద్దయై కపులును బేర్చి రాక్షసులు
నతినిబిడంబైన యంధకారమున, నతిభయంకరమైన యనిసేయునప్పుడు
పొడుపొడుఁ డన్నాట పోకు డన్నాట, విడువిడుఁ డన్నాట వ్రేయుఁ డన్నాట
చలము డింపక చంపు చంపుఁ డన్నాట, తోలఁగక తల ద్రుంచు త్రుంచుఁ డన్నాట
యిందురాలే దేడి యేడి యన్నాట, యిందు రానిమ్ము రానిమ్ముమాట
అటమీఁద హుంకృతుల్ హాసముల్ చెలఁగ, నిటుచెల్లు మాటలయెక్కువ లెఱిఁగి
పోరుచోఁ గెంధూళి బోరున నెగయ, వేర్చి యాచీఁకటి పెద్దయాటయును
భ్రమయుటఁజేసి యేర్పఱుపంగరాక, తమతమవారల తామె చంపుదురు
కోపించి వానరకోటు లుప్పొంగి, యాపాపకర్ముల నసురులఁ గిట్టి
రధికులఁ జంపి సారథుల గీటడఁచి, పృథులరథ్యంబుల పీఁచంబు లడఁచి

కడనొగ లెలమి యొక్కటఁ దేరులెత్తి, యడతురు సుగ్గునూచై నేల రాలఁ
దుమురుగా జోదుల త్రుళ్లడఁగించి, సమరవారణముల చరణంబు లెత్తి
యిరుల గేల నమర్చి యేచి తాటించి, వరుస నల్లటు పాఱువైతురు చంపి
చిదురలై దెసలందుఁ జెదరుగుట్టములు, గదసి తోఁకలతోడఁ గడకాళ్లు నొడిసి
పట్టి బెట్టుగఁ ద్రిప్పి వడి నేలతోడ, నెట్టిన వ్రేసి పెన్నెత్తురు లొలుక
గోలెమ్ము లురములు గుండెలు బరులు, వాలినభుజములు వదనదంష్ట్రలును
బుసుకలు మెదడును భువిమీఁదఁ జెదర, గనుఁగొని కాల్వురఁ గడఁగి చంపుదురు
అరదాలపెల్లున నడరు ధూళియును, దురగఖురోద్ధూతధూళియు నెగసి
దానవానీకంబు తలఁపులోనున్న, కానమినెల్ల నొక్కట వెల్లివిఱిసె
ననఁగఁ జీఁకటి కడు నగ్గలం బగుచు, వినువీథినడుమెల్ల విఫులమై నిండె
నసుమలయసువుల నగచరాధిపుల, యసువుల నొక్కట నపహరించుటకు
నామెయి నారాత్రి నసురేంద్రుచేత, రామునిచేఁ గాళరాత్రియై తోఁచె
దమవేళ యగుటయు దైత్యులందందఁ, గుమురులు గట్టి త్రికూటాచలంబు
దమయాఁపులకుఁ బ్రతిధ్వనులిచ్చుచుండ, సమరసన్నద్ధులై సరభసవృత్తి
మిగిలి యారాఘవుమీఁదను గదిసి, గగనంబు నిండ మార్గణము లేయుటయు
నారామవిభుఁడును నగ్ని బాణమునఁ, బేరినచీఁకటి పెంపెల్ల నడఁచి
తన్ను గిట్టిన మహోదరమహాపార్శ్వ,సన్నుతబలులైన సారణశుకుల
నటువజ్రదంష్ట్రమహాకాయు నేసెఁ, బటువేగమున నాఱుబాణముల్ దొడిగి
యార్వురుదైత్యులు ననిఁ బాఱి రఘుడు, పర్విన భీతిమై బ్రమసి దిక్కులకు
నటనున్న రాక్షసు లారామవిభునిఁ, బటుబాణశిఖి శలభంబులై పడిరి
అరదంబు సూతుండు హరులు నంగదుని, కరముక్తగిరిశృంగకఠినపాతమున
నవనిపైఁ గూలిన నాజి వర్జించి, సవనశాలకు వేగ చని యింద్రజిత్తు
తగుహోమసాధనతతులు రాక్షసులు, మొగిఁదేరఁ గైకొని ముఖ్యమార్గమున
వలనొప్పఁగా రక్తవర్ణంబులైన, తలచుట్టు నుభయవస్త్రములు మాల్యములు
ధరియించి వహ్నికిఁ దగ పరిస్తరణ,ముపతోమరంబులు నుగ్రవస్త్రములు
గరిలేనిశరములు గావించి నలుపు, గరిగొన్న పెనుమేకకంధర క్తమున
నొగిఁ దాడిసమిధల హోమంబునేయఁ, బొగలేక మండుచుఁ బొడవుగా నిక్కి
యెలమితో విజయంబు లెఱిఁగింపఁజాల, వలఁతియై దక్షిణ వలమానశిఖల
నొప్పుచు ననలుఁ డాహుతులఁ గైకొనియె, నప్పుడు నిష్ఠతో నయ్యింద్రజిత్తు
యుక్తక్రమంబున హోమ మొప్పార, భక్తితో నొనరించి పావకువలన
నాలుగుహయములు నానాస్త్రశస్త్ర,జాలంబు మహితకాంచనమయరథముఁ
బడసి యాతేరెక్కి బ్రహ్మాండ మగలఁ, గడువడి నార్చి యుత్కటకోపుఁ డగుచు
నింద్రాదిదేవతలెల్ల భీతిల్ల, నింద్రజిత్తుఁడు మఱి యేపుదీపించి
చెచ్చెర దానవసేనతోఁ గూడ, వచ్చి యదృశ్యుఁడై వడి దివినుండి
మసలక రామలక్ష్మణులపై నేసె, నసదృశకాండంబు లందందఁ బెల్లు

ఆరామలక్ష్మణు లాకాశమునకు, భూరిశరంబులఁ బోవనిచ్చుటయు
నందొకకైనను నయ్యింద్రజిత్తు, నందు దాఁకమి మఱి యాదైత్యవిభుఁడు

ఇంద్రజిత్తు మాయాయుద్ధము సేయుట.

దనుఁ గానరాకుండ దర్పంబు మెఱసిఁ, వినువీథిఁ గడుఁబెక్కువిధములఁ దిరిగి
కదిసి యంతటఁ బోక ఘనులగుకపుల, నవలీలఁ దనుమాడి యందందఁ బోర్చి
నలుచెస నేయుచో నగచరులకును, నలినాస్త్రకులునకు నలినాస్త్రకిరణ
నిభములై పరతెంచు నిష్ఠురాస్త్రములు, నభమున నెందుఁ గానఁగవచ్చుగాని
యరదంబు మ్రోఁతయు నాఘోటకముల, ఖురముల మ్రోఁతయు గుణము నిస్వనము
సారథిపలుకు కశాఘాతరవము, లారథికునియార్పు లతనిమూర్తియును
నారథంబును దాని యధికధ్వజంబు, లీరూపులని కని యెఱుఁగంగరాక
యావిధం బానేన కప్పుడు దోఁచె, నావాలిఁ దనుమాడి యసమునఁ బోర్చు
రామునిమీఁద సురప్రభుం డలిగి, రామణీయకమహోగ్రప్రకాండముల
నాతనయునిఁ గూల్చినాఁడనివేర్చి, యీతెఱంగున డాఁగి యేసెనో యనఁగ
నప్పు డాకపిసేన యంగంబులెల్లఁ, జిప్పలు చిదపలై చెదరంగఁ జూచి
జనలోకపతితోడ సౌమిత్రి పలికె, వినువీథి డాఁగిన వీనిచే నిట్లు
మనుజేంద్ర చూచితే మర్కటోత్తములు, మనకొఱకై వచ్చి మడియుచున్నారు
విస్మయంబుగ నింక వీనివంశంబు, భస్మంబు నేయుదు బ్రహ్మాస్త్రమేసి
యనవుడు రఘురాముఁ డనుజతో ననియెఁ, జనునె యొక్కరునికై చంపఁ బల్వురను
ఎఱుఁగవే రణధర్మ మెందు రాజులకు, వెఱచి డాఁగినవాని వెన్నిచ్చువాని
ముకుళితహస్తుఁడై మ్రొక్కినవానిఁ, జికిలాత్ముఁడై వచ్చి శరణన్నవాని
గదనంబులోఁ బూరి గఱచినవానిఁ, బిదప నాయుధములు ప్రిదిలినవాని
నిద్రవోయినవాని నిర్జింపఁదగునె, భద్రంబుగోరు నప్పరమపుణ్యులకు
నధికమాయలఁబేర్చు నయ్యింద్రజిత్తు, వధియింప నోపెడు వానరోత్తములఁ
గామచారులఁ బంపఁ గాలంబుగాని, సౌమిత్రి బ్రహ్మాస్త్రసమయంబు గాదు
అని నలు నంగదు ననిలనందనుని, ఘనుని గవాక్షుని గంధమాదనుని
భరితవిక్రమధామముఁ బనసుఁ గేసరిని, శరభుని ఋషభుని సన్నాథు గజుని
మఱి గవయుని నీలు మైందుని ద్వివిదు, నతిమురిఁ గోపించి యసురుఁడై బనిచె
నట రాఘవుఁడు పంప నగచరాధిపులు, పటుగతి మిన్నులపై కప్పు డెగసి
తరుశైలములు వైవ దర్పించి క్రూర,శరపంరపరల రాక్షసరాజసుతుఁడు
వారి నొప్పించిన వార లాదైత్యు, నేరూపమునఁ గాన కెప్పటిపగిది
వచ్చిరి రయమున వసుమతీస్థలికి, నచ్చెరువొందిరి యింద్రాదులు సూడ
విలయమేఘశ్యామ విపులగాత్రంబు, నలుకఁ గెంజాయల నడరునేత్రములు
గలఘోరరూపంబు గానరాకుండ, మెలఁగుచుఁ బలికె నమ్మేఘనాదుండు
నరనాథసుతులార నన్నుఁ గయ్యమున, నరుదు లఱిఁప సహస్రాక్షునకును
మీరెంతవారని మిన్నెల్ల నద్రువ, ఘోరంబుగా ధనుర్గుణము మ్రోయించి

యశనిసంకాశంబు లగుసాయకములు, దశరథాత్మజులపై దశముగాఁ బరపి
మఱియును నందంద మర్కటో త్తముల, గరులిచ్చిపోఁ బెక్కుకాండంబులేసి
యట నంతఁ బోవక యయ్యింద్రజిత్తు, చటులతరక్రూరసర్పబాణముల
నినకులేశ్వరులపై నేయఁగ వారు, ఘనబాణముల వాని ఖండించి మరియు
నిదె వచ్చె బాణంబు లిందేయు మనుచు, నదె వచ్చె బాణంబు లందేయు మనుచు
నేదెస బాణంబు లేతెంచుచుండు, నాదెసలందు సుదక్ష్ములై యేయ
సురగసమేతులై యుండుట మీకుఁ, గరమొప్పఁ దొల్లియుఁ గలదటుగానఁ
దరణివంశజులార తప్పక యిపుడు, సురగసమేతులై యుండుఁ డన్నట్లు
బంధురంబుగ నబ్జబాంధవకులుల, బంధించె వడి నాగపాశసంతతుల
వారును నాబ్రహ్మవరము మన్నించి, తారు రాక్షసుచేతఁ దద్దయుఁ దూలి
యాదినారాయణునంశజులైన, మేదినీనాథు లిమ్మెయిఁ గట్టువడిరి
నేఁడు రాముఁడుగాక నిక్క మూహింప, నాఁ డితఁడే వామనస్వరూపంబు
నటు దాల్చి భూదాన మడిగి యాబలిని, బటుకృతఘ్నుతఁ బట్టి బంధించినట్టి
ఫలము రామున కిట్లుప్రాప్తంబుఁగాక, పొలియునే మనుజుఁడై పుట్టియుండ గను
అని తమలోఁ దమయాత్మలఁ గుంది, యనిమిషుల్ ఋషులును నాశ్చర్యపడఁగ
ఖిన్నుఁడైయున్న సుగ్రీవునిఁ జూచి, సన్నుతమతి విభీషణుఁ డర్ధి పలికె
నిదియేల చింతింప నెట్టివారలకు, నొదవవే యాపద లొక్కొక్కచోట
నినకులేశ్వరులకు నేమయ్యె నిపుడు, ఘననాగపాశముల్ గట్టినంతటనె
యని పల్కి యతఁడు మాయాదృష్టిఁ జూచి, కనియె రావణసుతు గగనమార్గమునఁ
గని నీరు మంత్రించి కన్నులు దుడిచి, వనజాప్తసుతునకు వలనొప్పఁ జూపె
నారవిజుండును నవ్విభీషణుని, చారుమహామంత్రశక్తిచేఁ జేసి
యాయింద్రజిత్తుని నప్పుడు కాంచి, యాయతోన్నత మగునచలంబుఁ బెఱికి
యెగిసి వ్రేయఁగఁ జూచి యింద్రజిత్తుండు, మొగిఁ దిరిగించె నమ్ములవెల్లి పఱపి
యినజుండు తిరిగిన నినజుని రాక, గని మున్ను వెఱచు రాక్షసులు మోదింప
నప్పుడు విజయుఁడై యయ్యింద్రజిత్తు, ముప్పిరిగొను ముదంబునఁ దన్ను గొలుచు
వారును దానును వడి లంక కరిగి, యారావణునిఁ గాంచి యప్పు డిట్లనిరి
చంపితిఁ గపులను సర్పబాణములఁ, గంపింపఁజేసి తిక్ష్వాకువల్లభుల
నని వేడ్కతోఁ జెప్ప నంతరంగమునఁ, దనయునిమీఁద నెంతయు సంతసిల్లి
రావణుఁ డప్పుడు రయమునఁ ద్రిజట, రావించి యనియె ధరాపుత్రి నన్ను
నొల్ల దారాముని నొనఁగూడుకొనుట, కుల్లంబులో నమ్మి యుండుటఁ జేసి
నేఁ డింద్రజిత్తుచే నేలకువచ్చి, పోఁడిమిఁ జెడిన యాభూపాలునునికి
సీతఁ దోడ్కొనిపోయి చెచ్చెఱ జూపు, మీతఱిఁ బుష్పక మెక్కించి నీవు
అంత రాముని మీఁది యాసలు దక్కి, చింతింప కిట నన్నుఁ జేరును సీత
యనవుడు రావణుననుమతిఁ ద్రిజట, దనుజాంగనలు దాను ధరణీతనూజ
నెనయఁ బుష్పకముపై నెక్కించి వేగ, చనుదెంచి సంగరక్షితిఁ బడియున్న

ఇంద్రజిత్తుచే నాగపాశబద్ధులై యున్న రామలక్ష్మణులఁ జూచి సీత దుఃఖించుట.

కపులను రామలక్ష్మణులను జూపఁ, జపలాక్షియును నట్టిచందంబుఁ జూచి
కన్నీరు ధారలై క్రమ్మ నందంద, విన్ననై కడుఁ దూలి విలపింపఁ దొడఁగెఁ
గటకట! రామ నీకార్తకవిద్య, యెటుపోయె నీయందె యేపారియుండు
జామదగ్నినినైన సరకుగాఁ గొనవు, నీమెయిలావున నీభువి నీవు
సకలమునీంద్రులు సర్పముల్ నీకుఁ, బ్రకటితశయ్యఁగాఁ బలుకుదు రెందు
నట్టిసర్పంబులే యవనీశ నిన్నుఁ, గట్టంగఁ ద్రాడులై కదిసెనే నేఁడు
లాక్షణికులు నన్ను లక్షించి సకల,లక్షణంబులు మేన లలితంబు లగుచు
విలసిత రేఖారవిందంబు లంఘ్ర,తలమునఁ గలుగుటఁ దరళాయతాక్షి
పట్టాభిషేకంబు పతితోడఁ గల్గుఁ, బుట్టుదు రింపారఁ బుత్త్రులు నీకు
నైదువ యైయుండు దనుమాటలెల్ల, నాదిత్యకులనాథ యకట బొంకయ్యె
రోలంబకులనీలరుచిశిరోజములు, నీలమేఘముఁడాలు నెఱపుమై జిగియు
తొగలించుకయులేక తోరముల్ గాక, మిగుల వట్రువలునై మించుపెంకొడలు
కరములు నిటలంబు కన్నులు మోము, చరణముల్ రుచిరలక్షణసమేతముగ
వరకాంతి నునుపారి వట్రువ లగుచు, సరినొప్పునఖములు సంగతాంగుళులు
ఏచి చిత్రాకృతి నెనసి క్రిక్కిరిసి, నీచాగ్రమైనది నీకుచద్వయము
ఉరుతరస్నిగ్ధంబు లుదరపార్శ్వములు, కరమొప్పుచున్నది గంభీరనాభి
కమనీయతరదివ్యకాంతిఁ జెన్నగుచు, రమణీయమైనది రమణ నీమేను
సౌభాగ్యమున నీకు సరియెవ్వ రనెడి, నాభాగ్య మిట్లయ్యె నరనాథ కంటె
లలన లీపదియేను లక్షణంబులను, గలవార లత్యంతకల్యాణవతులు
అనిచెప్పు నారోక్తి లవియెల్లఁ దప్పె, మనుజేశ నాపుణ్యమహిమగా కిదియుఁ
గెందామరలభంగిఁ గెంజాయ మెఱసి, యందంబులై చూడ నఱచేతు లొప్పుఁ
బల్లవారుణకాంతిఁ బరఁగు పాదాగ్ర, పల్లవంబులు సమస్పర్శంబు లగుచు
నడుపొప్పు నెలుగొప్పు నగుమొగం బొప్పు, గడునొప్పు నివి కన్యకాలక్షణములు
పరికింప ననిపల్కు పలుకులు దప్పె, నరనాథ చూచితే నానోముఫలము
తలఁపులు దైవంబు తలకూడనీక, వెలయఁగ నిటు సంభవించెనే నాకు
ధరణీశ నను జనస్థానంబునందు, నురవడిఁ గొనిపోవు సుగ్రదానవునిఁ
బొరిఁబొరి వెదకి నాపోయినజాడ, కరముగ్రగతిఁ దెల్పి కపినేనఁ గూడి
జలనిధి బంధించి చనుదెంచి పిదపఁ, బొలుపేది గోష్పదంబున మునింగితివె
ఆరయ నతిఘోర మగుయామ్యశరము, వారుణబాణంబు వహ్నిసాయకము
నెరయ బ్రహ్మాస్త్రంబు నెఱిఁ బ్రయోగింప, మఱచితివే నేఁడు మనుజలోకేశ
పగవాఁడు మీదృష్టిపథములఁ బడినఁ, దెగి నేలఁబడుగాక తిరిగి పోఁగలఁడె
యిది దైవకృతముగా కెల్లచందముల, నెదురంగ శక్తులె యెవరైన నిన్ను
మేఘనాదుఁడు మాయ మెఱసి మిమ్మాజి, నీఘోరశరముల నిటుఁ గట్టె నేఁడు
కాలంబు కడిమిమైఁ గడప నెవ్వరికిఁ, బోలునే తలపోయ భూలోకనాథ

హానాథ హావీర హారామచంద్ర, యే నీకు శోకింప నిట నీకు వగవ
నీకుఁ బ్రాణములిచ్చి నిర్మలుండైన, కాకుత్స్థమణికి లక్ష్మణునకు వగవ
మనసు గుందఁగ నాకు మరుగుచునున్న, జననికి దుఃఖింప సతతంబు నీకుఁ
జిత్తంబులోపలఁ జింతించుచున్న, యత్త కౌసల్యకై యడలెద నధిప
ఎప్పుడు పదునాలుగేడులు చనునొ, ఎప్పుడు వచ్చునో యిటు రాముఁ డనుచు
నీతెఱంగున నీకు నెదురులు సూచు, నీతల్లియూసలు నిలిచెనే నేఁడు
హరిహరాదులనైన నడలించు నీదు, శరములగలశక్తి సమసెనే నేఁడు
నీదివ్యశక్తియు నీబాహుబలము, నీదుర్దమక్రమనిపుణవిక్రమము
నెక్కడఁ బోయెనో యేమందు నింక, నక్కటా విధి నీకు నలగెనే నేఁడు
చెలువొంద నేను నోఁచిననోములెల్ల, ఫలియించె నేమని పలవింతు విధికి
నని ప్రలాపింపంగ ననియె నాత్రిజట, జనకజ నూరార్చి సదయచిత్తమున
రాముని కొకకీడు రాదు నీవేల, నీమెయి శోకింప నిందీవరాక్షి
యట్టిదయైన యీయగచరనేన, యిట్లేల పెద్దయై యేచి వర్తించు
నదె చూడుమా దేవి యగచరేశ్వరులు, పదిలులై నీవిభు బలసియున్నారు
గాదుపో యీపుష్పకం బేల మోచు, మేదినీతనయ యిమ్మేదినిఁ బడక
కాన రామున కొండు గాదు చింతింప, మానిని నామాట మనసులో నమ్ము
లంకేశుఁ జంపి యీలంక సాధించి, పంకజానన నిన్ను భానువంశజుండు
నలిఁ దోడుకొనిపోవు నమ్ము నామాట, కలఁగకు నేఁడెల్లి కల్యాణి నీవు
అనవుడు సీత మాయామస్తకంబు, ననువు గాఁబోలని యాత్మలో నమ్మె
సుందరి త్రిజట యశోకవనంబు, నందుఁ గ్రమ్మఱఁ దెచ్చి యవనిజ నునిచె
మనువంశతిలకుండు మదిఁ దెలివొంది, తనకుఁ జేరువనున్న తమ్మునిఁ జూచి
నాతమ్ముఁ జూచితే నలినాప్తతనయ, యీతెఱంగునఁ గుంది యిట్లున్న వాఁడు
సీతఁ గోల్పడి సీత చెఱమాన్పలేక, యీతనిఁ గోల్పోవు టిటు సంభవించె
సౌమిత్రిఁ గోల్పడి జనకజ నాకు, నేమిటి కిటమీఁద నేల నాబ్రతుకు
యత్నంబుచేసిన యవనిజఁ బోలు, పత్ని నొండొకచోటఁ బడయంగవచ్చుఁ
గలరు కాంతలు సుతు ల్గలరు బాంధవులు, గలరె గాకెందును గలరె సోదరులు
తమ్ముఁ డన్మాత్రమే తలపోయ భక్తి, నిమ్ముల ననుఁ గొల్చు నిమ్మహాభుజుండు
అరయఁ గౌసల్యకు నాసుమిత్రకును, సరియకా వర్తించు సద్భక్తితోడఁ
దగ లక్ష్మణునికంటె దయతోడ నన్ను, మిగుల మన్నించు సుమిత్ర నావలన
వాత్సల్య మెప్పుడు వదల దాపుత్ర,వత్సల యగుతల్లి వగఁ బెట్టవలనెఁ
బురికింక నొకఁడును బోయితినేని, భరతశత్రుఘ్నులు భ్రాతృవత్సలులు
ఎట చిక్కె లక్ష్మణుం డేల రాఁడనిన, నట నేమి చెప్పుదు నకట తమ్ములకు
వనటమై నీవొంటి వచ్చుటఁ జూచి, మనములు గలఁగెడి మాకు నోతనయ
సౌమిత్రితో నేల చనుదేరవనిన, నేమని యుత్తరం బిత్తుఁ దల్లులకు
నేమని యూరార్తు నీమోముతోడ, నేమని యటుఁ బోదు నీమేనితోడఁ

బ్రా లేయశై లంబు పగిలిన నిసుఁడు, నేలఁ గూలిన నీరు నిశ్చలంబైన
వనధు లింకిన గాలి వ ర్తింపకున్న, ననలుండు కడుఁ జల్ల నై యున్ననైన
నామాట గడువఁడు నాకు నప్రియము, లేమాటలును నాడఁ డెన్నఁడు నితఁడు
ఇతనిచి త్తంబు నాయెడ నొక్కచంద, మితనిఁ బో లెడితమ్ముఁ డింకెందు గలఁడు
ఇతఁడె నాప్రాణంబు లితఁడె నాబంధుఁ, డితని నొక్కఁడఁ బుచ్చి యేనొంటినుండ
నితఁ డెందుఁ బోయిన నే నందుఁ బోదు, నితనితోడిదె లోక మీలోక మెల్ల
జనుదెంచె నాతోడ సౌమిత్రి నాఁడు, చనియెద నే నేఁడు సౌమిత్రి వెనుక
హితబుద్ధిఁ గార్యంబు నెఱుఁగక చేసి, తతులవిక్రమశాలి యవి నాకు నెక్కఁ
దరుచరో త్తమ వాలితనయుఁ దోడ్కొనుచు, గిరిచరసేనతోఁ గిష్కింధ కరుగు
మే లక్ష్మణునితోడ నేగినపిదప, బొలస్వ్యపతి మిమ్ము బాధింపఁ గలఁడు
జయశాలి యగుచున్న సౌమిత్రి లేని, జయము/నాకంధునిచంద్రోదయంబు
మద్భక్తుఁడై పూని మారుతపుత్రుఁ, డద్భుతకార్యంబు లవి పెక్కు సేసె
జలనిధి లంఘించి జనకజఁ గాంచి, కలనఁ బెక్కండ్ర రాక్షసుల మర్దించె
నీయంగదుండును నీసుషేణుండు, ధీయుతులైన యాద్వివిదమైందులును
నీగవయుండును నీగవాక్షుండు, నీగజుండును ర క్తి నెనయ నీలుండు
మెఱయ సంపాతియు మేటికేసరియు, మఱియుఁ దక్కిన వీరమర్కటో త్తములు
నాకొఱకై వచ్చి నలినా ప్తతనయ, చేకొని లావులు సేసి రందఱును
ఇక్కాల మిక్కఁడ నెబ్బంగి మమ్ము, ద్రెక్కొన్నవిధిఁ దాఁటఁ దీర దెవ్వరికి
రణభూమిఁ బలువుర రాక్షసపతులఁ, ధృణలీలఁ బొలియించి తీవ్ర బాణములఁ
బగతుచే నిబ్బంగిఁ బడి లోచనములు, మొగియుచు భూరజంబున బ్రుంగినాఁడు
వరతల్పమున నుండువాఁడు నేఁడకట, శరతల్పమున రణస్థలి నున్న వాఁడు
సంకీర్ణరవికులజలధి పొంగడఁచి, గ్రుంకెనే లక్ష్మణకువలయ ప్రియుఁడు
అనుచు విలాపింప నఖలవానరులు, మనముల శోకాబ్ధిమగ్ను లైరంత

ఇంద్రజిత్తు రెండవసారి యుద్ధమునకు వచ్చుట.

ననికిఁ గ్రచ్చుఱ వచ్చె నామేఘనాదుఁ, డనుబుద్ధి దూరస్థు లైనవానరులు
ఘనతరాంజనశైలకల్పుఁ డైయున్న, తను జూచి వెఱవ/గదాపాణి యగుచు
సైన్యమధ్యంబునఁ జరియించుకఫుల,సైన్యంబుఁ బాపుచుఁ దగ విభీషణుఁడు
ఏతెంచి రవిసూను నీఱించి పలికె, నీతెఱంగున మీకు నేల చింతింపఁ
గైకొని యిది యుద్ధకాలంబు కాని, శోకింప వేళయె సుగ్రీవ మనకు
దుర్నివారోర్మిబంధురమైనజలధి, కర్ణధారుఁడు లేని కలముచందమున
మనసైన్య మున్నది మన మింక వేగ, యనికి నుద్యోగించు టదియె కార్యంబు
అన విని యంగదుం డావిభీషణునిఁ, గనుఁగొని నీమాట కడును త్తమంబు
నరనాథతనయులు నాగపాశముల, నురవడిఁ బెనఁగొని యుర్విపై నొరగి
బాణక్షతంబుల బలువిడి వెడలు, శోణితంబుల బ్రుంగి సొరిది నున్నారు
ఈదాశరథుల మీ రేమఱకుండుఁ, డాదిత్యుఁ డుదయాద్రి కరుదేరమున్నె

యేను రాక్షసకోటి నెల్ల నిర్జించి, జానకిఁ దెచ్చెద జననాథుకడకు
హనుమంతుఁ డాదిగా నఖిల వానరులఁ, గొని కవాటములతోఁ గోటలతోడఁ
దోరణశ్రేణులతోఁ గూడ లంకఁ, దోరంపుఁబిడికిళ్లఁ దుమురునేనెదము
విస్మయంబుగ బంధువితతితోఁగూడ, భస్మంబుసేయుదు పజ్జికంధరుని
నావిక్రమంబును నాభుజాబలము, భూవరువలన నాపూనుభక్తియును
దెల్లంబుసేయుదుఁ దెగువతోఁ నెల్లి, యెల్లభూతంబులు నీక్షింపనిమ్ము
మలయజకేయూరమహితానుభూతిఁ, బలుమఱుగన్న నాబాహుదండములు
అనవరతంబును నధికదర్పమునఁ, దనరుచున్నవి రఘూత్తముకార్యమునకు
రావణు నిర్జించి రఘువీరుఁ డలర, నీవిభీషణు లంక నెలమి నిల్పెదను
గాదేని నాజి రాక్షసులచేఁ జచ్చి,పోదును సౌమిత్రి పోయినత్రోవ
ననవిని సుగ్రీవుఁ డంగదుఁ జూచి, తనయ నీవింక నీదశరథాత్మజులఁ
గొనిపొమ్ము కిష్కింధకును వేగ నేను, జని యింద్రజిత్తుని సకలరాక్షసుల
రావణు నిర్జించి రఘురాముదేవి, నేవిధంబునైన నేఁ దెత్తు వేగ
యని ధైన్యపాటుతోఁ నాడుసుగ్రీవు, గనుఁగొని ఖిన్నులై కపులు భీతిల్లి
మునుకొని శోకాబ్ధిమునుఁగ సుషేణుఁ, డనువాఁడు వల్కె నయ్యిందఱుఁ జూచి
యీనాగపాశంబు లిపుడు వాయుటకు, వానరేశ్వరులార వలను నెప్పెదను
తొల్లి దేవాసురోద్ధురసంగరమున, నెల్లదేవతలకు నివి గట్టియున్న
దేవత లప్పుడు దివ్యౌషధముల,చే వానిబాధ బాసిరి కట్లు విడిసి
యాయౌషధము లిప్పు డమృతాబ్ధికవలఁ, బాయకున్నది ద్రోణపర్వతస్థలిని
హనుమంతుఁ బుచ్చుఁ డీ యతఁడౌషధములు, గొనివచ్చు మీరిట గుందంగ వలదు

నారదుఁడు శ్రీరాములవద్దికి వచ్చుట.

అనునంత సూర్యసహస్రసంకాశుఁ, డననొప్పి కృష్ణమృగాజినంబమర
మెఱుఁగులతో శుభ్రమేఘమో యనఁగ, నెరయు బింగళజటానిచయంబు వెలుఁగ
బొనర నున్ననియూర్ధ్వపుండ్రంబుఁజెట్టి, తనరంగఁ గౌపీనదండముల్దాల్చి
రమణమై నొప్పు నారాయణమంత్ర, మమలతఁ దనవీణయందొప్పి మొఱయఁ
దనతోడియోగీంద్రతతి నాకసమున, నునిచి చిత్తంబున నుల్లాసమొదవఁ
బరమయోగీంద్రుండు పరతత్త్వవేది, పరమపావనమూర్తి పరమవైష్ణవుఁడు
నారదుం డారామనరనాథుఁ గాన, గారవంబునవచ్చి కరములు మొగిచి
వలగొనివచ్చి యవ్వసుమతీశునకుఁ, దలకొన్నభక్తితోఁ దగ విన్నవించె
దేవ నిఁ బ్రహ్మాదిదేవతలెల్ల, నావార్ధిమధ్యంబునం దొప్పఁ గాంచి
రావణబాధాపరంపరల్చెప్పఁ, గా విని వారిపైఁ గరుణించి నీవు
వారిఁ బ్రోచుటకు రావణునిఁ జంపుటకు, ధారణిఁ బుట్టితి దశరథేశునకు
నటుగాన నీవిటు లలమటనొంద, నిటు తగునయ్య మహీపాలవర్య
నీనామ మాత్మలో నిలిపినంతటనె, భూనాథ యజ్ఞానములు పొందవనిన
నీకు నజ్ఞానంబు నెపమైనఁ గలదె, చేకొని నిను నీవె చింతింతుగాక

నారాయణుఁడవు పూర్ణజ్ఞాననిధివి, చాపకౌస్తుభరత్నసహితవక్షుఁడవు
అనిశంబు లక్ష్మికి నాటపట్టైన, ఘనతరాంగంబులు గలుగు దేవుఁడవు
ఆదిదేవుఁడవు సర్వాంతరాత్ముఁడవు, వేదవేద్యుండవు విశ్వరూపుఁడవు
తలఁచు యోగీంద్రులధ్యానంబునందు, నలువొందు సచ్చిదానందరూపుఁడవు
ధరణి యంఘ్రులు వియత్తలము మస్తకము, పరమైననిటలంబు పద్మాసనుండు
కన్నులు చంద్రుండు కమలమిత్రుండు, నున్నతం బగుచున్న యూర్పు మారుతము
వదనంబు శిఖి సరస్వతి జిహ్వ యొప్పు, రదనప్రతతి వేదరాశి చింతింపఁ
జెలువైనగాయత్రి శిఖప్రణవంబు, వెలసినహృదయంబు వీనులు దిశలు
మహనీయధర్మంబు మనసు దేవతలు, బహుజయస్థితిగల బాహుసమృద్ధి
గొనకొన్న బ్రహ్మాండకోట్లు నీకుక్షి, తనరారుదొడలు మిత్రావార్ధిపతులు
ఆశ్వినేయులు జాను లాత్మలోఁ జూడ, విశ్వంబు నీరోమవితతి చింతింప
నిదె చూడుమా వీరె యెల్లదేవతలు, గదిసి కిన్నరయక్షగంధర్వపతులు
నాదిగా వచ్చి జయంబు నీదెసకు, మేదినీశ్వర కోరి మింట నున్నారు
అకలంకమతివి నీవజ్ఞాన ముడిగి, సకలరాక్షసులను సమయింప వేగ
వారక నరులైనవారు సంసార,పారంబుఁ జేరు నుపాయంబు లేక
బాళినాశాపాశబద్ధులై రేని, నీలీల నటియించు టింతియకాక
నీవేల యీసర్పనికరంబుచేత, భావింపఁగాఁ గట్టుపడుదు శ్రీరామ
నీవాదిమూర్తివి నీమూర్తి దలఁపు, నీవాహనంబైన నీకేతువైన
గరుడుండు వచ్చిన గరుడునిచేత, నురగపాశము లెల్ల నూడు నీక్షణమె
యని చెప్పి దీవించి యానారదుండు, చనియెఁ గ్రమ్మర సుధాసాగరంబునకు
నానారదుఁడు సెప్ప నారాఘవుండు, తా నాదిహరి యాటఁ దలపోసి చూచి
తెలిసి ధీరుని వైనతేయునిఁ దలఁచెఁ, దలఁచిన నతఁడును తలఁపుతోఁ గూడి
యారూఢమగు నమృతాబ్ధియుత్తరపుఁ, దీరంబునందుండి దిగ్గన లేచి
యానిమెట్టినపాదయుగముచే బయలు,గానంగ ధరణిలోపలిశేషుఁ డులుక(?)
గడుపెద్దయైన తొక్కలగాలి మిన్ను, సుడివడి దిక్కులు సొరవులై తూల
నమ్మోఘతపెల్లున నఖలలోకములు, నమ్రులై తమ చేతనము దక్కి స్రుక్కి
నెఱికలు విడ్రిచిన నెగసినధూళి, నెఱసి చీకట్లుగా నిఖలంబు గప్పఁ
జనుదెంచు సురువడి శైలంబు లురుల, వననిధి పిండలివండలై కలఁగఁ
బదివేలసూర్యులప్రభలెల్లఁ గూర్చి, మెదిచి చేసినక్రియ మెయి ప్రకాశింప
మెఱయు రెక్కలతోడి మేరువో యనఁగఁ,బఱతెంచె గరుడుఁ డంబరమున భేర్చి
పఱతెంచుటయు నాగపాశంబు లెల్ల, వెఱచి యాన్యపతుల విడిచి పెల్లురికె
నది యట్టిదయకాదె యనినఁ జింతింప, వదలు బంధంబు లేవ్వారలకైనఁ
దనుఁదానె చింతించి తనదుబంధములు, చన ద్రోవ రాముండు చాలఁడే తలఁప
ననుతుం డాదిగా నెల్లవానరులు, విన విస్మయంబుగా వెఱగంది చూడ
భానుకోటిప్రభాభవ్యతేజమున, నానందకరమూర్తి యమరులు పొగడ

హీరకిరీటంబు హేమాంబరంబు, గారుత్మతోజ్జ్వలగ్రైవేయకంబు
రత్నకుండలములు రాజీవరాగ, నూత్నమంజీరమనోహరాంఘ్రులును
మౌక్తికమాలికల్ మాణిక్యకవచ, సక్తమై మించు విశాలవక్షంబు
మరకతకేయూరమంజుబాహువులు, నరుణపల్లవకోమలాగ్రహస్తములు
దుందుభిస్వనము లత్తుకచాయమేను, మందరమేరుసమానగాత్రంబు
లలితోర్ధ్వపుండ్రలలాటపట్టికయు, నెలవులఁ దేరెడు చిఱునవ్వు లొలుక
వైనతేయుండును వలగొని వచ్చి, యానరపతులకు నందంద మ్రొక్కి
మెఱుగారుతెక్కుల మేనులు దుడిచి, నెఱి కరంబులు మోడ్చి నిలిచ్చి యిట్లనియెఁ
బాసె మీ కీనాగపాశబంధములు, వాసవాంతకుని రావణుఁ ద్రుంచివైచి
ధరణిజఁ గొని యయోధ్యకు వేగ చనుము, ధరణీశ యనుచుల దండించునపుడు
మాయలు పెద్ద యేమఱుక వర్తింపు, మేయుపాయంబుల నిక మోసపోకు
మని ప్రదక్షిణముగా నరిగి యానృపుల, వినుతించి దీవించి వెనఁ గౌఁగిలించి
మ్రొక్కి యాయమృతసముద్రంబుకడకు, గ్రక్కున గమనించెఁ గశ్యపాత్మజుఁడు
వాములకళ్లెల్లఁ బాయుటఁజేసి, రామలక్ష్మణులును రాగిల్లి రపుడు
వనచరు లారామవల్లభునెదుర, ననురాగరసమున నందందఁ దేలి
తనరుచు సింహనాదములు సేయుచును, వినువీధిఁ దోరకలు విసరి యాడుచును
గురువులు వారుచు గునిసి యాడుచును, నురవడి దాటుచు నుబ్బి నవ్వుచును
ఘాటించి శైలవృక్షము లెత్తి లంక, కోటలోకెత్తునఁ గొనఁ దలంచుచును
మిగిలినవారల మిక్కిలి రభస, మగలించె లంక పెల్లగలించె నభము
అంత సూర్యోదయ మగుటయుఁ జరుల, నంతయు నరయ దశాస్యుండు పనిచెఁ
బనిచిన నక్కోటపై నుండి వారు, గనిరి సుగ్రీవుండు కదిసి కొల్వఁగను
సవినయుండై విభీషణుఁడు సేవింపఁ, బ్రవిమలమతి కపిబలము రంజిల్ల
బోరికి నేనలఁ బురికొల్పుకొనుచుఁ, జారువిశృంఖలసమదేభయుగము
గతినున్న రామలక్ష్మణుల నిక్ష్వాకు,పతుల బంధంబులు వాసినవారిఁ
గని విన్ననై వారు క్రమ్మఱఁ బోయి, దనుజేశ్వరున కవ్విధం బెఱిఁగింప
విని ఖిన్నుఁడై కడువెఱఁగంది యపుడు, తనమంత్రివరులతో దశకంరుఁ డనియెఁ
బన్నగపాశాస్త్రిఁ బడియును మగుడఁ, గన్నయారామలక్ష్మణులచే నింకఁ
జెడగల దీలంక సిద్ధంబుగాఁగఁ, బడయవచ్చునె నాగపాశంబులూడ
జయమెక్కఁడిది నాకు సమరంబులోన, రయమునఁ జెడుఁగాక రాఁకుసలఱ్ఱి
గరుడుండు వచ్చెనో శాక లేకున్న, నురగపాశము లేల యూడు వారలకు
గరుడుండు నను గెల్చెఁ గాక లేకున్న, నరు లెంతవారు వానరు లెంతవారు
అనుచు మత్తేభరవానుకారముగ, ఘనమగునిట్టూర్పు గ్రమ్మ ధూమ్రాక్షుఁ

ధూమ్రాక్షుఁడు యుద్ధమునకు వచ్చుట.

బనిచె నగ్గలమైన బలములఁ గొనుచుఁ, జను వేగ రామలక్ష్మణులపై ననుచుఁ

బనిచిన నాదైత్యపతికి మ్రొక్కుచును, ననికెత్తి భూమ్రాకుఁ డప్పుడు వెడలె
వానిబలంబు వెల్వడఁ జొచ్చె నపుడు, నానావిధంబుల నలుగడలందు
వృకసింహాముఖముల వెలసినయట్టి, ప్రకటితస్ఫూర్తి తురంగంబు లొప్పఁ
బటపటూర్భటిఁ జెవుల్ పగిలించునట్టి, పటురవంబుల దిశాపటలంబు లద్రువ
వడి భయంకరము దివ్యంబైనదీప్తి, లడర భూమ్రాకునియరద మొప్పారె
భేరులు శంఖముల్ పృథుమృదంగములు, భూరిఘోషంబు లద్భుతముగా మ్రోయఁ
దురమున కటువచ్చు భూమ్రాకునకును, బరువడిఁ దోఁచె నొప్పనిశకునములు
నలినార్చి ముందఱ సడుచురాఁగసులు, నిలిచి యెంతేనియు నిశ్చేష్టులైరి
అయ్యును నిలువక నగ్గలంబైన, కయ్యంబుమీఁదను గవిసి యార్చుచును
వచ్చుభూమ్రాకుండు వారిధివోలె, నచ్చెరువైయున్న యగచరసేన
దాఁకిన నసురులఁ దరుచరేశ్వరులు, దాఁకిరి మిన్నులు దాక నార్చుచును
దానవావలి యడిదంబుల వ్రేయ, వానరావలి వ్రేసె వారి వృక్షముల
దానవేశ్వరులు కుంతంబులఁ బొడువ, వానరు ల్పిడికిళ్ల వారి మోఁదుదురు
దానవుల్ హరులఁ బంతంబునఁ దోల, వానరుల్ వానిని వ్రత్తురు గోళ్ల
దానవో త్తములు రథంబులు వఱప, వానరుల్ వానిని వ్రయ్యఁ దొక్కుదురు
దానవుల్ మదకరితతుల డీకొలుప, వానరుల్ వాని నుర్వరఁ గూల్తు రలుక
నివ్విధంబునఁ బోర్చి యిరువాగుఁ బోర, నవ్వనచరవీరు లసురులఁ గిట్టి
యంతకాకృతిఁ గాళ్ల నలమి మదోగ్ర, దంతుల నేలపైఁ దాటించి చంపి
వానిఁ జేకొని కడువడి వ్రేసి వ్రేసి, దానవానీకంబు దర్పంబు మాపి
గెడపి కొల్లాడిసి పక్కెరలతోఁ బట్టి, పుడమి బెట్టుగ గుట్టముల వ్రేసి చంపి
వానిఁ జేకొని కడువడి వ్రేసి వ్రేసి, దానవానీకంబు తనువులు చదిపి
యసమునఁ గడునొగ లలమి యందంద, వెసఁ ద్రిప్పి యరదముల్ విఱుగ దాటించి
వానిఁజేకొని కడువడి వ్రేసి వ్రేసి, దానవానీకంబు ధరఁ గూల్చి కూల్చి
యిరియుకాల్బలముల యెమ్ములన్నియును, నురుముగాఁ దన్ని పీనుఁగులుగాఁజేసి
వాని నేరొక్కాని కడువడి వ్రేసి వ్రేసి, దానవానీకంబు ధరమీఁదఁ గూల్చి [డాడి
మఱియుఁ గ్రందుగఁ జొచ్చి మహితదంష్ట్రములఁ, గఱకురాక్షసకోటి గఱచి యా
చాఁచినయట్టి శస్త్రంబులు విఱిచి, మోఁచేతులను వారిమొగములఁ బొడిచి
పడఁద్రోసి చేతుల బలిమిగా నదిమి, మెడలును గాళ్లును మిడుకంగఁ బట్టి
మోఁకాళ్లనూఁది యిమ్ముల దైత్యవరుల, వీఁక కోలెమ్ములు విఱుగంగఁ బొడిచి
కడువడి నిడుదతోఁకలు దవిలించి, యుడుగక మెడలకు నురులు గావించి
యఱిమముఱిఁ బరవశులై గ్రుడ్లు వెలికి, నుఱికి బెట్టుగఁ జావ నొగి బిగియించి
పెల్లుగాఁ బీనుఁగుపెంటలు సేయ, మల్లడిగొని త్రెల్లి మహిమీఁద నపుడు
ఇవి తల లివి కన్ను లివి వదనంబు, లివి చెక్కు లివి ముక్కు లివి కంధరంబు
లివి బాహు లివి మేను లివి జఘనంబు, లివి యూరు లివి జాను లివి చరణంబు
లని యేరుపడకుండ నసురవర్గముల, నెనడును మజ్జంబు నెత్తురు మెదడు

నెరసియుఁ బ్రేవులు నెమ్ములు తోలు, పురియలతోఁ బెనుప్రోవులై యుండె
నప్పుడు ధూమ్రాక్షుఁ డాకపిసేనఁ, జప్పరింపుచుఁ దాఁకి చతురత మెఱసి
తలలు వ్రయ్యలుగ ముద్గరముల వ్రేసి, సలలితుం డగుచుఁ బ్రాసంబులఁ బొడిచి
పరిఘంబులను భిండివాలశూలములఁ, గరవాలముల మహోగ్రతఁ బెంపుమీఱ
గడు నొచ్చి నెత్తురుల్ గ్రక్కుచుఁ బడిరి, కడిమికిఁ బెడఁబాసి కపులు పెక్కండ్రు
తక్కటికోఁతు లుదగ్రత దక్కి, దిక్కులఁ బఱచిరి ధృతిపెంపు దూలి
పఱచినఁ గోపించి పర్వతం బొకటి, యతిముఖుఁ గొని వైచె హనుమంతుఁ డలిగి
వైచిన గదగొని వారించి యప్పు, డాచావునకుఁ దప్పి యసుర దాఁటుటయు
నది దానవాధమునరదంబుమీఁదఁ, జదరంబుగా వచ్చి చదియంగఁ బడియె
నంతటఁ బోవక యనిలతనూజుఁ, డెంతయుఁ గడఁకతో నేపుదీపించి
యలుకతో జముఁడు బ్రహ్మాండంబు వగులఁ, బలువుర నుగ్గాడుపగిది రోషించి
తరుశైలపాషాణతతుల రాక్షసుల, శిరముల నుగ్గాడి సింహవిక్రముఁడు
అడరి వాండ్రను దోలి యగశృంగ మొకటి, తొడిబడ నైకొని ధూమ్రాక్షుమీఁదఁ
గడగి యేతేరంగ గదఁ గొని యతఁడు, మడియ మంచును హనుమంతుమస్తకము
వ్రేసిన ధూమ్రాక్షువీఁకయు లావు, నీసును శౌర్యంబు నింతఁ నైకొనక
హనుమంతుఁ డుగ్రత నరచేతనున్న, ఘనతరశైలశృంగం బెత్తి యార్చి
యేచి యద్దానవు నేపెల్లఁ దూల, వైచినఁ దల పెక్కు వ్రయ్యలై కూలె
నప్పుడు కొండ వజ్రాహతిఁ గూలు, చప్పుడు దోఁచె నజ్జగములకెల్ల
నటు వాఁడు మృతుఁడైన హతశేషులైన, కుటిలదైత్యులు గాలికొడుకున కులికి
భూచక్ర మగలంగఁ బొరిఁ బొరి మగిడి, చూచుచు వెస లంకఁ జొచ్చిరి పాఱి
యంత రావణుఁడు ధూమ్రాక్షుఁడు చచ్చు, టంతరంగము నెరియంగఁ జేయుటయు.

ఆకంపనుఁడు యుద్ధమునకు వచ్చుట.

గలన దేవతలకుఁ గంపింపకునికి, గలిగినవాని నకంపనాహ్వయుని
దివ్యాస్త్రశస్త్రప్రదీప్తులవాని, దివ్యరథోపరిస్థితి నొప్పువాని
వడి నాజికినిఁ బడవాళ్లను బనిచి, వెడలించె బహుబలవితతితోఁ గూడ
మొనసి కాలాంబుదమూర్తియై వాఁడు, దనరు భూషణదీప్తిథామంబు లడర
మణిదీధితుల సూర్యమండలం బగుచుఁ, బ్రణుతిగాంచిన హేమరథముపై నిలిచి
యిదె వచ్చె నాజికి నితఁడని తెల్పు, చదురునఁ గేతువు ల్పదల బెల్లడరఁ
గుటిలరాక్షసవీరఘోరనిస్వాన, పటహభేరీభూరిభాంకృతు ల్పెలఁగ
వితతంబుగా లంక వెడలంగఁ దోన, చతురంగబలములు చతురత వెడల
నగచరసేనయు నార్చుచుఁ దాఁకె, గగనంబు వగుల రాక్షససేనతోడ
నుభయబలంబు లిట్లుగ్రతఁ బేర్చి, రభసంబుతోఁ దాఁకి రణ మొనరింప
నెగసిన కెంధూళి యెల్లదిక్కులను, గగనభూభాగంబుఁ గప్పె నాలోనఁ
జీకటి మిగులఁ బేర్చినచంద మయ్యె, నాకపిసేనల కసురసేనలకు
నప్పుడు తమతమయడియాలములను, దప్పక రణము కొందఱు సేయువారు

పలుకులసన్నలఁ బరులని యెఱిఁగి, తలపడి పేర్చి కొందఱు పోరువారు
వారు వీరనక యెవ్వరినైనఁ దాఁకి, దారుణక్రీడఁ గొందఱు పోరువారు
తరుచరావలి వైచు తరులును గిరులు, నురుదైత్య లడరించు నుగ్రశస్త్రములు
పెరసి నల్దెసలందుఁ బెల్లుగాఁ బరచి, పొరిఁబొరి జలచరంబులభంగి నొంది
మానైనధూళి తమఃపటలమున, మానితాంభోనిధిమాడ్కిఁ గావించె
నప్పు డాయుభయసైన్యంబులనడుమ, నుప్పొంగుతనువుల నురులు రక్తములు
ధరణీపరాగంబు దక్కినదైత్య,తరుచరపతులు యుద్ధము వేడ్కఁ జేయ
నావానరులు కడు నగ్గలంబైనఁ, బ్రావకాకృతి నకంపనుఁడు కోపించి
నారి సారించి యున్నతసత్త్వుఁ డనియె, సారథితోడ నుత్సాహంబు మిగుల
మ్లేచ్ఛులఁ గొండల మర్కటసేన, వీడతో రాక్షసవితతి నొప్పించె
నాదిక్కునకుగా రయంబున దోలు, మా దర్పమున నీవు మనరథం బనుడు
వాఁడును బరపిన వాఁడు నగ్గలిక, వాఁడిమిఁ దాఁకి యవ్వనచరసేన
బెడిదంపుశరములఁ బెల్లేయుటయును, జెడి వలీముఖులు నిశ్చేష్టితులయ్యె
హనుమంతుఁ డడరిన నతనితోఁ గూడి, దనుజసైన్యంబులఁ దాఁకిరి బెట్టు
అప్పుడు మేరునగాకృతినున్న, యప్పవనజుమీఁద నయ్యకంపనుఁడు
వీరరసస్ఫూర్తి వెల్లువ దొట్టి, ఘోరంపుటూర్పు నిర్ఘోషమై చెలఁగఁ
గడుబెట్టుగా లయకాలమేఘంబు, వడువున నురుశరవర్షంబు గురియ
నవి గణింపక యట్టహాసంబుచేసి, పవననందనుఁ డంతఁ బ్రళయకాలాగ్ని
రుద్రునికైవడి రూక్షకటాక్ష, రౌద్రరసంబు ఘోరంబుగా నిగుడ
విగతభయుండునై వ్రేళ్లతోఁ గూడ, నగలించి పెఱికి మహాశైలమెత్తి
వైచి నముచిపయి వజ్రి వజ్రంబు, వైచినచందాన వారణలేక
దానవుం డర్ధచంద్రప్రదరమున, దాని నుగ్గాడె నుద్ధతశక్తి మెఱసి
మానితం బగుసత్త్వమహిమ దీపింప, గా నగ్నికణములు గన్నులఁ దొరఁగఁ
జని వేగ వేఱొకశైలంబుఁ బెఱికి,కొనివచ్చి యఱిముఱిఁ గ్రూరుఁడై యార్చి
కడుబెట్టిదముగ రాక్షసుమీఁద వైవ, వడిఁగొని తుమురుగా వాఁడది ద్రుంచె
దానికి మారుతతనయుండు గినిసి, వేనగంబునుబోలు వృక్షంబుఁ బెఱికి
యడుగులఁబెట్టున నవని కంపింప, మిడుగురుగనులు గ్రమ్మెఁబొకన్నులొప్ప
మసలక తక్కినమ్లేచ్ఛులు విఱుగ, విసరియాడుచు దైత్యవితతిపైఁ గవిసి
రథికులఁ జంపి సారథుల గీటడఁచి, రథరథ్యములను ధరాస్థలిఁ జదిపి
కొమ్ములు నెమ్ములు కుంభస్థలములు, నమ్మితాదిజోదులు నంకుశంబులును
మురియంగ ఘంటలు మొరయఁగ బెట్టు, చరణము ల్వెసఁబట్టి సామజప్రతతిఁ
దడఁబడగా వ్రేసి తరమి కొన్నింటిఁ, బొడిపొడిగాఁ జేసి పుడమిపైఁ గెడపి
తుమురుగా రౌతులతోను గుఱ్ఱముల, సమయించి కాల్వురఁ జదియంగ మోఁది
యంతకాకృతిఁ బేర్చు హనుమంతుమీఁద, నంతరంగమునఁ గోపావిష్టుఁ డగుచు
వాటంబుగా దైత్యవరుఁ డుచ్చిపాఱి, నాటించె నొకపదునాల్గుబాణములు

కరమునఁ గలయశ్వకర్ణవృక్షమున, మురియలుగావించి ముసుమిడియాఁ ద్రెచి
నప్పుడు నెత్తురు లడర నశోక, మొప్పఁ బూచినక్రియ నొప్పి యావేళ
హనుమంతుఁ డొకవృక్ష మవలీలఁ బెఱికి, తనర నకంపనుతలవ్రేయుటయును
లోకంబులు గలంగ లోగుచుఁ బర్వ్వతాకృతి బెట్టుగా నవనిపైఁ గూలి
పొరిఁబొరిఁ జెదరెడి పుసుకలతోడ, నరభోజనుండు ప్రాణంబులు విడిచె
వాఁడు గూలినయంత వానరోత్తములు, వాఁడిమి నార్చిరి వసుధ గంపింప
దనుజులు గనుకని తలలోలి వీడఁ, జని లంకఁ జొచ్చిరి సభసంబునను
అగచరేశ్వరులును హనుమంతు కడిమి, బొగడిరి తమమనంబులు మెచ్చి మెచ్చి
పరులచే నని నకంపనుఁడు గూలుటయుఁ, బరితాపమున విని పజ్రికంధరుఁడు
మనుజుల కపులను మడియించి వేగ, చనుదెమ్ము నీబలశౌర్య మింపార

మహాకాయుఁడు యుద్ధమునకు వచ్చుట.

నని మహాకాయుని నప్పుడె పనిచెఁ, బనిచిన వాఁడును బనిఁబూని యపుడు
రమణీయతరమయూరధ్వజం బొప్ప, నమితమణిప్రభ లఖిలంబు నిండఁ
బనిగొని శస్త్రాస్త్రపజ్జికలు మెఱయ, ఘనపిశాచానన గార్దభప్రతతిఁ
బూనిన యరదంబు బొలుపార నెక్కి, నానాస్త్రశస్త్రసన్నద్ధసైన్యములు
నడువంగ నిస్సాణనాదంబు లెసఁగ, నడియాలమైన తూర్యంబులు మ్రోయఁ
దనరిన దక్షిణద్వారంబునందు, వినుతవిక్రమశాలి వెడలె వేగమున
నప్పుడు గురిసెఁ బైనస్థులవాన, చొప్పడఁ బిడుగులు సోనలై పడియె
గొడుగులు పడగలుఁ గూలెఁ గూలుటయు, నడరి మహాకాయుఁ డవియెల్లఁ గొనక
కడిమి వానరసేనఁ గదిసి తాఁకుటయుఁ, బుడమి చలింప నప్పుడు వలీముఖులు
తరుశైలవితతులు తఱుచుగా మ్రీఁదఁ, గురియుచుఁ దాఁకిరి క్రూరదానవుల
నప్పుడు దానవు లానేనమ్రీఁద, నుప్పొంగు బీరంబు లొలుకుచునుండఁ
దడబడఁగా నరదంబులు వరపి, కడువేగమునఁ గరిఘటల డికొల్పి
తురగచయంబులఁ దోలి యుగ్రతను, దరముగా ముంచి పదాతి వ్రోచియును
గరవాలములఁ ద్రుంచి గదల నొప్పించి, సురియల నాటించి శూలాలఁ జించి
పరిఘుల విదళించి ప్రాసాల నొంచి, శరపరంపరలేసి చక్రము ల్వ్రచి
పట్టసంబులఁ ద్రుంచి పరశుల నొంచి, కిట్టి ముద్గరముల గినిసి ధట్టించి
మిగిలిన కపులును మేటిరక్కసుల, నగపాదపములవానల ముంచి రంత
నారభసంబున నవనీపరాగ, మారవిమండలం బంతయుఁ గప్పె
నారజఃపటలంబునం దిరువాగుఁ, బోరుచో నొండొరుఁ బొడగానరాక
తరువులు కొండలు దరుచు మ్రోయుచును, దెరలంగ మ్రీఁద నే తెంచుచక్కటికి
నురవడి నేయుదు రుగ్రదానవులు, శరపరంపర లాకసంబునఁ గప్పఁ
బరఁగు చక్రంబులు పట్టసంబులును, శరములు తోమరచయము ప్రాసములు
వడి మ్రోయుచును మ్రీఁదవచ్చు చక్కటికి, విడుతురు తరుశైలవితతులు గపులు
అంతఁ బోవక చెవులందును ధూళి, యెంతయు నిండిన నిరువాగువారు

మ్రోయుచక్కటికి నిమ్ముల విక్రమంబు,సేయు నేర్పులు దక్కి చేష్టలు మఱచి
కపులు వీరనక రాక్షసులు వీరనక, చపలత్వమునఁ బెల్లు చంపుదు రెలమి
నటుపోరఁ దనువుల నడరు రక్తములు, పటునదులై రజఃపటలంబు నణఁపఁ
దిమిరంబుఁ బాసియు దీప్తశౌర్యముల, నమరులు వెఱగంద ననిసేయు నపుడు
వెసనై త్యులకుఁగాక విఱిగి యాకపులు, కసిమసియై కనుకని పాఱుటయును
గని యంగదుఁడు పల్కెఁ గపివీరులార, కనుకని యిటు పాఱఁగానేల నేను
గలుగంగనని వారిఁ గ్రమ్మఱ ననికిఁ, దలకొనఁజేసి యుత్సాహంబుతోడ

రాక్షసులతో వానరులు ఘోరయుద్ధము సేయుట.

నొకమహాపర్వతంబును వడి నెత్తి, యకలంకుఁడై రాక్షసావలిమీఁద
నడువ నాతనితోడ నలి నార్చి యార్చి, నడచిరి వానరనాయకు లేచి
యంగదుండును బేర్చి యసురులఁ గట్టి, యంగంబు లవియఁగ నానేనరెల్ల
వెడచేతఁ బడఁ దాఁచి పిడికిళ్లఁ బొడిచి, యడరి ముంజేతుల నంగములోచి
మోఁచేతఁ బగులంగ మొగములఁ బొడిచి, పూఁచినశస్త్రాస్త్రములు పొడిసేయఁ
గఱకురాక్షసులు నంగదునకుఁగాక, విఱిగి హాహాకారవివశులై తూలి
నలుగడఁ బాఱ నున్నతశక్తి వారి, వలువ దోహో యని వారణసేసి
ఖ్యాతిమించిన మహాకాయనిమంత్రు, లాతతగతి రుధిరాశనుం డనఁగ
వ్రాలెడివాఁడును వజ్రనాభుండు, కాలదంష్ట్రుండును గాలకల్పుఁడును
మఱి వపాశుఁడు శతమాయుండు ధూమ్రుఁడఱేముఱి దుర్ధరుం డనువాఁడు గడఁగి
యట్టహాసములతో నగచరసేనఁ, గిట్టి నొప్పింప వీక్షించి పృథుండు
పనసుండు మేఘపుష్పకుఁడు గవాక్షుఁడును ఋషభుఁడు గజుఁడు క్రోధనుండు
శతబలి తారుండు సబలులై వారి, నతులితగతిఁ దాఁకి యనిసేయునపుడు
రుధిరాశనుం డంత రోషంబుతోడ, నధికబాణములు గవాక్షుపై నేయ
వేగంబె పర్వతవృక్షంబు లెత్తి, యాగవాక్షుఁడు రుధిరాశుపై వైచె
వైచిన నడుమనె వానినన్నింటి, నేచి చూర్ణములుగా నేసి గవాక్షుఁ
బడవేసె మూర్ఛచేఁ బడినగవాక్షుఁ, బొడగని తారుఁ డప్పుడు కలుషించి
ఘనమైన సాలవృక్షం బెత్తి వ్రేసె, ననువొంద రుధిరాశునరదంబుమీఁద
నారుధిరాశనుం డమ్మహీరుహము, బోరన నడుమనె పొడిపొడిచేసి
పదిబాణములఁ దారు బడనేసి మించి, కదిసి చలంబునఁ గపిసేన గిట్టి
కడునుగ్రుఁడై లయకాలంబునాఁడు, మిడుకలోకములెల్ల మ్రింగు నంతకుని
ఆకృతిఁ గైకొని యానేనలోన, భీకరవృత్తితోఁ బెచ్చుచు నుండె
నప్పు డొకింత గవాక్షతారులును, దెప్పిరి కనువిచ్చి తెలియంగఁ జూచి
యంతలో గద వ్రేసె నడరి గవాక్షుఁ, డంతకాకృతి రుధిరాశుమస్తకము
వ్రేసిన నసురయు వికృతాంగుఁ డగుచుఁ, బాసి ప్రాణములకుఁ బడియెఁ దత్తనువు
అని వజ్రనాభుఁ డుదగ్రుఁడై పృథునిఁ, గనుఁగొని పెల్లేసె ఘనసాయకములఁ
బృథివీధరము వైచె పృథుఁ డప్పు డలిగి, ప్రథితంబుగా నేసెఁ బదివ్రయ్యలుగను

పృథుఁడును రోషసంస్ఫీతుఁడై వాని,రథముపై కెంతయు రయమున నురికి
విల్లు ఖండములు గావించి గుఱ్ఱములఁ, డొల్లించి రథము బెట్టుగ నుగ్గునేసి
యనయంబుఁ గోపించి యవ్వజ్రనాభు, ఘనశక్తి వలకేలఁ గడకాలు వట్టి
వెసఁ ద్రిప్పి నేలతో వ్రేసి రోషమున, నసురులఁ బెడఁబొపి యాపృథుం డార్చె
బరువడి ఋషభునిపైఁ గాలదంష్ట్రుఁ, డురవడి గొల్చె మహోద్దండ దంతి
నటుమీఁదఁ చనుదెంచు నగ్గజంబునకు, నటు నిటుఁ దొలఁగక యాఋషభుండు
వేగంబుమైఁ బదద్వితయ మొక్కటిగ, లాగించి కుంభస్థలములఁ దన్నుటయు
మదకరి ఘింకృతి మానక నిగుడ, నది యొక్కవింటిపట్టరిగె వెనుకకును
మఱియును ఋషభుండు మానక మీఁదఁ, దరిమి యయ్యేనుఁగుదంతంబుఁ బెఱికి
బాగొప్ప వ్రేసి యప్పటుకరిఁ జంపి, లాగును వేగంబు లావును మెఱసి
కాలదంష్ట్రుని గిట్టి కాలొగిఁ బట్టి, కేళిమై ధర వ్రేసి గీటడఁగించె
నసురసైన్యములు హాహారవంబంద, నసమునఁ గపిసేన యార్చె నందంద
కాలకల్పుఁడు నగ్నికల్పబాణముల,పాలుగావించె నప్పనసునిఁ గిట్టి
పనసుఁ డయ్యరదంబుపైకి లంఘించి, మునుబెట్టుగా గుఱ్ఱములఁ జదియించి
సారథిఁ బడఁదన్ని సత్త్వ మేపార, నారథంబెల్ల నుగ్గై రాలఁగొట్టి

పిడికిట గళసంధి బెట్టుగాఁ గిట్టి, పొడిచె నకాలకల్పుఁడు దన్నికొనఁగఁ
బొడిచిన వాఁడు నప్పుడు పండ్లు డుల్లి, దొడదొడ నోట నెత్తురుఁ గ్రక్కుకొనుచు
మిడుకుచు గ్రుడ్డులు మిడుకప్రాణములు, విడిచె రాక్షసులెల్ల విస్మయంబందఁ
బలియుఁడై కపుల వపాశుండు గిట్టి, చలమున నేసి జర్జరితులఁ జేయ
వానిపైఁ బాషాణవర్షంబుఁ గురిసె, జానుగాఁ గజుఁ డాకసంబెల్ల నిండ
నావపాశుఁడు వాని నన్నింటి నడుమఁ, గావించెఁ దునియలుగా నంపగములఁ
గావించి మఱియును గజు నురుమాడఁ, బావకాభము లేదుబాణంబు లేసె
నేసి వెండియు గిట్టి యిరువదేనింట, నేసి నూఱింటమే నేసెఁ దూరంగఁ
గజుఁడు నైదస్తులఁ గడునొచ్చి వాని, నిజరథం బంతయు నెళనెళ విఱుగ
గరుడునివిధమునఁ గడువేగ దాఁకి, కరి గోపురాగ్ర ముగ్రతఁ ద్రోయకరణి
నావపాశునితల యట్టకుఁ బాపి, పోవైచె నప్పుడు భూమిపైఁ బడఁగ
రోషించి యపుడు ధూమ్రుండు దుర్ధరుఁడు, భీషణాస్త్రముల నొప్పించి వానరులఁ
దఱిమినఁ గినుకఁ గ్రోధనమేఘపుష్పు, లుఱుక రథంబుల కుఱికి యుగ్రతను
గరతలంబున మస్తకంబులు చరచి, దురమున గెడపి రద్భుతశక్తి మెఱసి
యటు వారు హతులైన యసురు లందఱును, బటురయంబునఁ జెడి పాఱిరి భీతి
నసురులు పాఱుట యప్పుడు చూచి, మసలక వడి శతమాయుండు వేర్చి
కవిసినఁ జే పరిఘం బమరించి, కవిసి యాతనిమీఁద గజుఁ డెదిరింపఁ
జలమొప్ప ఋషభుండు శతబలి పనసుఁ, డలుక గవాక్ష నలాంగదుల్ గూడి
కడఁగి వృక్షంబులు ఘనశైలములును, మడవక యాశతమాయుని వైవ
శరతోమరప్రాసచక్రగదాది,వరశస్త్రచయముల వర్షంబు గురిసి

వడి శతమాయుండు వనచరేశ్వరులఁ, బెడిదంబుఁగా నొంచి వేర్చి పెల్లార్చె
వానిచే నటు నొచ్చి వానరాధిపులు, మానక రోషసమ్యగ్రులై కదిసి
యడరి గవాక్షుండు హయములఁ జంపెఁ, గడిమి ఖండించె నంగదుఁడు పతాక
పటీయలుగాఁ ద్రొక్కెఁ బనసుండు రథము,నురుముగా ఋషభుండు నొంచె సారథిని
నలవొప్ప నలుఁడు శస్త్రాస్త్రములు విఱిచెఁ, జలమునఁ బిడికిట శతబలిఁ బొడిచెఁ
బిడికిటిపోటునఁ బిమ్మటఁ గొనక, కడులఘుత్వంబున గరుడుండువోలెఁ
బటుఖడ్గమును బెద్దపరిఘయుఁ గొనుచుఁ, జటులవేగంబున శతమాయుఁ డెగయఁ
బరవశంబున వాలువడియున్న బ్రద్ద, పటీయను గొని శతబలియుతో నెగసె
నెగసి భేరుండంబు లెడరెండుఁ గవిసి, యొగిఁ బోరుతెఱఁగున నురువడి మిగుల
వ్రేయుచుఁ దిరుగుచు వెసఁ దప్పకొనుచుఁ, బొయుచు డాయుచుఁ బాటవం బొప్ప
గెరలుచుఁ దెరలుచుఁ గ్రిందుమీఁదగుచుఁ, బొరిఁబొరి నాకసంబున బోరుతఱిని
శతమాయుఁ డడిదంబు జళిపించి ఫూన్చి, శతబలివిపులవక్షం బేయుటయును
సరభసుండై యప్డు శతబలి బ్రద్ద, పటీదప్ప నొడ్డి కృపాణోగ్రధారఁ
జలమునఁ దెగవ్రేసె శతమాయుతొడలు,.తలక్రిందుగా వాఁడు ధరమీఁదఁ బడఁగ
నవిసె దైత్యునితల యందందఁ జెదరి, యవనిపై గిరిశృంగ మవియుచందమున
శతమాయుఁ డపుడు చచ్చినఁ దోడికపులు, శతబలితోడ నచ్చట నార్చుటయును
ధరణి మిన్నును గుణధ్వని బీటు లెగఁయ, నరద మత్యుగ్రయంబునఁ బఱపి
యంగదు నపుడు మహానాదుఁ డార్చి, యంగదుమేన మూఁడమ్ములు గుచ్చి

మహానాదుఁ డంగదునితోఁ బోరి మడియుట.

మటీయును వెసనేయు మర్కటేశ్వరుఁడు, వఱలుకోపంబున వానిపైఁ గిట్టి
యోజనాయతగిరి యొకటి రథంబు,పై జవంబున వైవఁ బడకుండ వాఁడు
నడుమనే గదవైచె నగమెల్లఁ బొడిగ, వడిఁ ద్రుంపఁ గోపించి వాలినందనుఁడు
అతనిరథంబున కవలీల దాఁటి, చటులసత్త్వోన్నతిఁ జాపంబు విఱిచి
పట్టి రథంబుపైఁ బడవైచి ఱొమ్ము, మెట్టి గ్రుడ్డులు వడి ఖిలుక రోజఁగను
మెడనుల్చి త్రెంచి క్రమ్మిన నెత్తురొలుకఁ, బుడమిపై వైచె నప్పుడు వానిశిరము
తమ్ముఁడు చావ సుద్దండకోపమున, నెమ్ములు వగులంగ నేచి యార్చుచును
మటీయును గనలుచు మహానీయరథము, మెఱయుచు నలుగడ మెఱుఁగులువారఁ
గదలించి యమ్మహాకాయుఁ డుద్వృత్తి, మదమున సింహంబు మలయుచందమున
గుదులు గ్రుచ్చినమాడ్కిఁ గ్రూరబాణముల, నెదిరి ధారణిఁ గూలనేసె వానరుల
వనచరవీరులు వానికిఁగాక, హనుమదాదులపోరునచటికిఁ జనిరి
సారథిఁ జూచి యీచక్కటి మనల, వారక మార్కొనువారలు లేరు
బోరన రాముపైఁ బోనిమ్ము రథము, నేరుపువాటిల్ల నీవన్న వాఁడు
కడఁగి యుగ్యముల పగ్గములు వదల్చి, వడి నదల్పఁగను దీవ్రంబునఁ గదల
నాక్రూరతకుఁగాక నగచరుల్ పరువ, నోకోఁతులార మీకులుక నేమిటికి
శివునిచాపముఁ ద్రుంచి సీతఁ జేకొన్న, యవనీశుపైఁగాని యాజి నేనలుగఁ

బరశురాముని భంగపఱచినయట్టి, నరనాయకుఁడుగాని నాయీఁడుగాఁడు
ఆజిలోఁఖరుని నుక్కఁడఁచినయట్టి, రాజుమీఁదనెకాని రాదు నాయమ్ము
ధృతినమ్ము తుదకబ్ధిఁ దెచ్చినయట్టి, పతితోఁడఁ గాని యే బవరంబు సేయఁ
ద్రిజగంబులందును దీపించునట్టి, రజతాద్రియెత్తిన రావణసుతుఁడఁ
దుది నింక నింద్రజిత్తునికిఁ దమ్ముఁడను, నిదె మహాకాయుండ నేఁతెంచినాఁడ
ననుచుఁ జెప్పుచు రాగ నంబుదపటల,మున నున్న సూర్యుండు మొనసినమాడ్కిఁ
గపిరాజతనయుఁ డంగదకుమారుండు, కపిసేనలోనుండి కడఁగి యేతెంచి
వెనుకొని కోపంబు విలసిల్ల నపుడు, ఘనమైనకడిమితోఁ గలుషించి పలికె
నోరి మహాకాయ యుడుగక రజ్జు, లీరణస్థలమున నేల ప్రేలెదవు
మీతండ్రి గిరియెత్తి మెఱసె మాతండ్రి, మీతండ్రిఁ దోఁక నిమ్మెయిఁ గట్టి యెత్తె
నీకు నాకును దగు నిష్ఠురరణము, కాకుత్స్థనిధి యేల కపిముఖ్యు లేల
యని వ్రాఁకు గ్రొని మీఁదనడరింప నతని, తనువు నిండఁగఁ గప్పె దారుణాస్త్రములఁ
గదిసి వెండియు మహాకాయుఁ డంగదుని, గదగొని ప్రేసె నుత్కటకోపుఁ డగుచు
ప్రేసిన నెంతయు వివశుఁడై పడియె, నాసమయంబున నతఁడు మూర్ఛిల్లి
కుతలంబు పగుల నెకొ్కని దైత్యు లార్చి, రతఁడు మూర్ఛిల్లిన నగచరపతులు
కవిసి యందఱు మహాకాయులైఁ గవిసి, శిలలు భూజంబులుఁ జెచ్చెఱ వైవ
నవియెల్లఁ దనదుబాణావలిచేత, నవలీలఁ దునిమి గవాక్షునిం బదిటఁ
బృథుని నైదిట నూటఁ బృథుసత్త్వగజునిఁ, బ్రథితంబుగా శతబలి ముప్పదింట
నెనుబదియమ్ముల ఋషభునిఁ గినుకఁ, బనసుని డెబ్బది పటుసాయకముల
మెఱసి క్రోధనుని నమ్మేఘపుష్పకుని, నఱువదింటను నూట నదరంట నేసె
నిటు వానరుల నతఁ డేపడఁగింప, నటు మూర్ఛనొందిన యంగదుం డపుడు
దెలిసి మోమునఁ గ్రమ్ము దెంచుర క్తములఁ,బలుమఱుఁగరములఁబాయఁద్రోయుచును
నదరుచు నప్ప డయోమయంబైన, గదయెత్తికొని మహాకాయునిరథము
పయికి లంఘించి యుద్భటశక్తితోడ, జయశీలుఁడై వానిసారథిఁ జంపి
వెస విల్లుఁ బెల్లున విఱుగంగఁ గొట్టి, యసమున హయముల నన్నింటిఁ గూల్చి
తలప్రేసె ప్రేసిన దైత్యపుంగవుని, తలబొమిడిక యూడి ధరణిపైఁ బడఁగ
నామహాకాయుండు నరదంబు డిగ్గి, భీమగదాదండభీషణుం డగుచు
నంగదునంగంబు నదరంట ప్రేసె, నంగదుండును ప్రేయ నతఁడు దర్పించి
యంగదుమస్తకం బలుకతో మఱియుఁ, బొంగి గదాదండమున ప్రేసి డాసె
నాహూతమున నెత్తు రడరిననైన, రాఘవుబంటు శౌర్యం బింత చెడక
గదఁ బుచ్చుకొని మహాకాయుని ప్రేసె, నుదురు భగ్నముఁగాఁగ నురుశక్తి మెఱసి
యెదిరిన తనతండ్రి యీతనితండ్రి, విదితంబుగాఁ బట్టి వేమాఱు దొల్లి
మున్నీటిలోపల ముంచుటఁ దలఁచి, మున్నంటి పగకునై ముంచెనో యనఁగ
నసమేది దనుజుఁ డాయంగదుఁ బట్టి, వెసఁ బేర్చి నెత్తురువెల్లువ ముంచె
ముంచ రావణుఁ బట్టి మున్నబ్ధి వాలి, ముంచినగతి వాని ముంచె రక్తమున

నిటు మహాకాయుండు నిండ్రుమన్మడును, పటుగతిఁ బోరుచోఁ బరఁగురక్తముల
జేగురుఁటేరులఁ జెలువైనగిరుల, భాగున నెంతయు భాస్వరు లైరి
గదయును గదయు నుగ్రంబుగాఁ దాఁకి, చిదురుప లగుటయుఁ జెచ్చెఱ వారు
బలుఁడును నిర్జరపతియును దొల్లి, గలిసి వెనంగినకైవడిఁ దోఁపఁ

మహాకాయుఁ డంగదునితోమల్లయుద్ధము సేసి మడియుట.

బలుధూళి యిద్దరిపదహతి నెగయఁ, దలపడి మల్లయుద్ధము నేయుచోటఁ
జతురతమై వనచరవీరుఁ డీతఁ, డితఁడు రాక్షసుఁడని యెఱుఁగంగరాక
కీలుబొమ్మలు పోరు క్రియలును దోఁప, వాలిసుగ్రీవులవడువునఁ బోర
నాదటఁ గపులెల్ల నంగదుఁ జూచి, యీచుష్టరాక్షసు నేల పాలార్చి
వాలినందనుఁడవు వాలికైవడిని, వఱలినవాఁడవు వరభుజశక్తి
వాలి దుందుభియను వడిఁ బోరుచోట, వాలి దుందుభి నింత వడి నిల్వనీఁడు
వేవేగ చంపు నిలింపకంటకుని, నీవిక్రమంబున నిపుణత మెఱసి
యని జయశబ్దంబు లడరింప నతఁడు, దనుజునితల ముష్టిఁ దాటించిబెట్టు
పిడికిటఁ దాఁచిన బెట్టుగా విఱిగి, పడియు నద్దైత్యుండు బలముఁ జేలఁ

బడియున్న రాక్షసపతిఱొమ్ముఁ ద్రొక్కి, మెడనుల్చి తలఁ ద్రెంచి మీఁదికి వైచి
యంగదుం డార్చె నయ్యంగదుఁ జూచి, యంగదు నార్చి రయ్యగచరాధిపులు
విచ్చి దానవులును వెస నేగి లంకఁ, జొచ్చియు వారిధిఁ జొచ్చియు నాల్గు
దెసలకు నుఱికియు దీనతనొంద, నసమున నుతియించి రంగదుఁ గపులు
నుతియించి సీతాసమనోనాథుకడకు, నతనిఁదోడ్కొని చని యత్తెఱఁగెల్ల
వినిపింప రఘుపతి విని సంతసమున, ఘనముగా నుప్పొంగి కౌఁగిటఁ జేర్చి
కరుణాకటాక్ష మంగదుమీఁద నునిచి, సరసంపుమందహాసంబున నొప్పె
హతశేషులగు రాక్షసావలిచెప్పఁ, గతపడ్డ యమ్మహాకాయుని దలఁచి
విన్నవై తల వంచి వెఱఁగంది కుంది, కన్నీరు నించి రాక్షసకులేశ్వరుఁడు
అంతఃపురంబున కరిగి యారాత్రి, చింతించుచును నిద్రఁ జెందకయుండి
మఱునాఁటిరేపు సామంతులు గొలువ, మెఱుఁగారు నరదంబుమీఁదికివచ్చి
యరిగి పెంపారిన యాశ్వరి(?)నెక్కి, పరవైన తనకోటఁ బరికించి గాంచి
చూచి పాశెంబులు శోధించి మీఁది, నేచిన బలుగాపు లిడఁ బంచి యపుడు
ఆరావణుండు ప్రహస్తుతో ననియెఁ, బేరెక్కి యెందు నభేద్య మిక్కోట
యెట్టిశాత్రవులకు నెన్నఁడు డాయ, నట్టిదిగా దిప్పు డగచరప్రతతి
వచ్చి భేదించి దుర్వారమై యునికి, యచ్చెరువైనది యదియునుంగాక
శ్రీరాముభుజబలశ్రీ యెల్లచోట, నారూఢతరము ప్రహస్త కావునను
నీవొండె యటుఁగాక నేనొండె రణముఁ, గావింప నాకుంభకర్ణుండునొండె
తగువార మిందు నిద్రాసక్తి తనకు, మిగిలి నాతమ్ముఁడు మేల్కొనండయ్యెఁ
బోయెదవో యేను బోదునో యనుఁడు, నాయసురేంద్రున కతఁ డిట్టులనియెఁ
బోయెద నిదె నాదు భుజబలంబెల్ల, నాయమరులు మెచ్చ నరులఁ ద్రుంచెదను

డాసి భూతప్రేతడాకినీగణము, లాసవంబున నెత్తు రాని మోదింప
నటుచూడు మాజిఁ బ్రహస్తుండు కపుల, నిటునేయునే యన నెంతఁ బేర్చెదను
బోరికిఁ జనుమన్న బుద్ధులు సెప్ప, నారయఁ బొడిగా దైనను వినుము
దనుజేశ యొకమాట తగదన కింక, విను వినకుండు వివేకించి చూడు
దానికిఁ గాదన దనుజేశ మున్ను, మానైన బుద్ధులు మంత్రులు సెప్ప
వినవైతి విడనైన విను సీత రామ,జననాథునకు నిమ్ము సమరంబు వలదు
అనుచు రావణునిఁ బ్రహస్తుండు వీడు,కొనివచ్చి తాఁ దనకోలలవారిఁ
బనిచి యప్పుడు నాల్గు బలములవారిఁ, దనుగూర్చుకొని మహోద్దండభావమున
ఘనమైన కపివరాంగంబులగాలి, తనమీఁద వీచునంతకు మ్రోయుచున్నఁ
గొమకున జలదనిర్ఘోషంబుదాని, సమరంగవిహగేంద్ర లనఁగఁ బెల్లెగసి
తక్కక ద్రుంచు నంతకుఁ గ్రాలుచున్న, చక్కనియురగధ్వజస్ఫూర్తిదాని
మణిగణకింకిణీ మహనీయభూరి, రణనంబుఁ గలిగిన రథ మప్పు డెక్కి
పెక్కుతూర్యముల గంభీరరావముల, దిక్కులు ఘూర్ణిల్ల దివియొడ్డగిల్లఁ
జుక్కలు డుల్ల వసుంధరయెల్ల, వ్రక్కలువాఱఁ బూర్వద్వారమునను
గాలాంతకునిఁ బోలి కడగి యిబ్బంగి, నాలంబుసేయఁ బ్రహస్తుండు వెడలె
నప్పు డాదైత్యులయార్పులు నతని, యొప్పారఁ బేర్చిన యుగ్రమూర్తియును
నక్కజం బగుటయు నావిభీషణుని, కక్కడఁ జూపి రామావనీశ్వరుఁడు
తేజంబు బలమును దీప్తిశౌర్యమును, రాజిల్లుచున్న యీరాక్షసవరుని
వేరేమి సాహసస్ఫీతుఁడై కపుల, పైరాకఁ జెప్పఁ జూపఁగఁ బ్రోద్యమయ్యె
ననుడు విభీషణుం డర్కవంశునకు, ననియె దేవా యితం డారావణునకు
గలిగిన సైన్యసంఘములకునెల్ల, దళవాయి యీతనిదళములలోన
మూఁడవపాలిటు మూఁడులోకముల, వాఁడి వీరుండు రావణుమాతులుండు
ఖండేందుధరుచెలికానిసామంతు, భండనంబున మాణిభద్రుని నోర్చెఁ
దపనకులేశ యీదైత్యునితోడఁ, గపినాథులకు లెస్స కయ్యంబు గలుగు
నని చెప్పుచుండంగ నగచరులెల్ల, దనుజుల కెదురుగాఁ దరుగిరు లెత్తి
యార్చుచు వచ్చినయసురసైన్యముల, నార్చుచు మార్కొని యనిసేయునపుడు
ప్రళయకాలాగ్నికి బొడబొగ్గికిని, గలుషతఁ దలపోయఁ గలుగదుగాని
పొడిమిగా మిన్ను భువియు నొండండ, నోడక తాఁకుటయును లేదుగాని
మొనసి యా బ్రహ్మాండములు దమలోన, ఘనముగాఁ దాఁకుట గలుగదుగాని

ప్రహస్తునియుద్ధము.

గలిగిన నిబ్బంగిఁ గపిదైత్యనాథు, లులుకక పోరుట యుపమింపవచ్చుఁ
బావకనిభ భీషణపక్షుల దైత్య, లావనచరులపై నార్చుచు వైవ
నందు వెండియుఁ గొందఱసి గదా ప్రాస, సందీప్తముసలోగ్రచక్రములై వ్వవఁ
దరుచరబలములు దరులును గిరులు, మరల దైత్యులమీఁద నురువడి వైవ
ధరమీఁద డొల్లెడితలలును వ్రయ్య, నురములు నురుమైన యురుకంధరములు

దొరిగెడిప్రేవులుఁ దునియువాలములు, మురిసినయమ్ములు ముంచుర క్తములు
చెదరినమెదడు విచ్చిన్నంబులయిన, పదములు మిక్కిడు బాహుదండములు
ముడిగి ముద్దలభంగి మురియుపీనుఁగులు, నడుములు దెగినయున్న తదేహములును
ద్రెళ్లెడి మేనులుఁ దిరిగెడి గ్రుడ్లు, పెల్లుగా నెంతయు భీకరం బగుచుఁ
దలఁకక సంగరస్థలమునఁ బోరి, కలగొనఁబడిన రాక్షసులును గపులుఁ
గలఁగి యంతటబోక కలుషించి మించి, చల మగ్గలించి యుత్సాహంబు బెంచి
బెడిదంబుగా దైత్యబృందంబుమీఁద, నడచి యార్చుచుఁ గపినాయకోత్తములు
ద్వివిదుండు వైచెఁ బృథ్వీధరశిఖర, మవిరళశక్తి నరాంతకుమీఁద
నకలంకుఁడై కుంభహనుఁ బడవైచె, నొకవటంబునఁ దారుఁ డుగ్రవేగమున
వడిఁ బెద్దగిరి జాంబవంతుఁ డుగ్రతను, నడరించి మించె మహానాభుమీఁద
భూరిభూజంబునఁ బొరిగొలనేసె, ఘోరంబుగా దుర్ముఖుఁడు సమున్నతిని
వానరనాథుల వాటులచేత, దానవు ల్నలుగురు ధరణిఁ ద్రెళ్లుటయుఁ
దనప్రధానులచావుఁ దప్పక చూచి, యనయంబు నలిగి ప్రహస్తుండు కపుల
నొకటఁ బదుండ్రను నొకట నేఁబండ్ర, నొకటఁ బదార్వుర నొకట నూర్వురను
రథచిత్రగతులొప్ప రయమునఁ బేర్చి, పృథివియైఁ గూల్చినఁ బేర్చి వానరులు
ద్రుమశైలములఁ బ్రహస్తునిసేనలెల్ల, జమరనగతినుండఁ జంపిరి కడఁగి
యప్పుడు వెల్లువలయి పాఱఁజొచ్చె, జొప్పట మిన్నంటి శోణితనదులు
అందులోపలనుండి యసురులుఁ గపులుఁ, నందంద ననినేసి రార్చుచుఁ బేర్చి
యాయగ్గలికఁ జూచి యఖలదేవతలు, వేయువిధంబుల వినుతించి రంత
నాప్రహస్తుండు కాలాంతకాకారుఁ, డై ప్రతిలేక సొంపారి యావేళఁ
గరములు పదములు ఖండించివైచి, యురములు నుదురులు నుచ్చిపోనేసి
తలలును భుజములు ధరమీఁదఁ గూల్చి, తలఁగ నెమ్మలును దంతంబులు రాల్చి
మురియలుగాఁ జక్రముల ద్రుంచి త్రుంచి, పొరిఁబొరి నంకుశంబులఁ జించి చించి
కడు నుగ్రమగు పరిఘులఁ గొట్టి కొట్టి, ముడివడ ఘనపాశములఁ గట్టి కట్టి
లలిమీఱి బరశువులను వ్రచ్చి వ్రచ్చి, పొలుపార బలుశూలములఁ గుచ్చి గ్రుచ్చి
మునుమిడి పట్టసంబులఁ జిమ్మి చిమ్మి, గొనకొన్న కడిమి శక్తులఁ గ్రుమ్మి క్రుమ్మి
పలలంబు మెదడుఁ గుప్పలుచేసి చేసి, పొలవక యంపరాసులు వోసి పోసి
పటుభూతకోటికి బలి యిచ్చి యిచ్చి, పటపట దిక్కులు పగుల నార్చుచును
సమరవిక్రమకళాసంరంభ మెసఁగ, నమితుఁడై మెఱసి ప్రహస్తుఁ డేపొందె
నాకపిసైన్యంబు లడఁగుటఁ జూచి, భూకంపముగ మహాద్భుతవృత్తి నడఁచె
బెరిగి యుద్ధటరణాభీలుఁ డన్నీలుఁ, డురుతరహుంకారహుంకారుఁ డగుచు
ధీరుఁడై యపుడు ధాత్రీజంబుఁ బెఱికి, యారాక్షసునితేరి కవలీల దాటి
యరమి సారథి నొంచి హయములఁ గూల్చి, యురక యవ్విల్లు మహోగ్రత విఱువ
ముసలంబు గొని యార్చి ముదమెసప నప్పు,డసమున రథము బ్రహస్తుండు డిగ్గి
నీలునిముందఱ నిలిచె నెదిర్చి, నీలుండు నెదిరించె నిర్జింతు ననుచు

నొండొరుగెల్పునుదోర్యగంబులందు, గండుమీఱిన వృత్రకౌశికు లనఁగ
నలుక నీలునిపాల మడిచె వీక్షించి, లలిఁ బ్రహస్తుఁడు ముసలంబునఁ బగుల
నడఁచిన నందంద నడరు నెత్తురులు, దుడిచికొంచును బ్రహస్తుని బెట్టుగిట్టి
వ్రేసె నన్నీలుఁడు వృక్షంబుఁ ద్రిప్పి, వ్రేసిన ముసలాన వ్రేసె నయ్యసుర
వ్రేసిన సోలియు వృక్షంబు విడిచి, యాసమయంబున నందందఁ గదిసి
యార్చుచు నతఁడు ప్రహస్తుమస్తకముఁ, బేర్చి ప్రయ్యగ వైచెఁ బెనుగిరియొత్తి
యానీలువ్రేటున నాప్రహస్తుండు, మేనును శిరమును మెయిభూషణములు
చెదరి వృత్తారిచేఁ జెలువెల్లఁ బొలిసి, కుదిరి ధారణిఁ గూలు కొండచందమునఁ
బడుటయు నాకపిబలమెల్ల నార్చెఁ, జెడిపారి లంకఁ జొచ్చిరి దైత్యు లఘుడు
సురుచిరామృతవార్ధిసుతయును బోలె, హరియుక్తమైన నిజాంగంబు గలిగి
చారువసంతమాసంబును బోలెఁ, నారక్తపల్లవలతాశాఖి గలిగి
వరదానశీలు నివాసంబుఁ బోలెఁ, గరమొప్ప నధికమార్గణకోటిఁ గలిగి
దీపించు నేరేడుదీవియ పోలె, రూపింప నవఖండరూపంబుఁ గలిగి
వలచినపతియొద్ది వనితయుఁబోలె, సలలితరాగరసంబునుగలిగి
కడిదిదియై చొరరాని కాననయుఁ బోలెఁ, గడునొప్పు పుండరీకంబులు గలిగి
సడలనిమృడునివాసంబునుబోలెఁ, గడఁగి యాడెడు భూతగణములు గలిగి
కమలాప్తరుచినొప్పు గగనంబపోలెఁ, గ్రమముఁ దప్పినతారకంబులు గలిగి
సరభసంబైన వేసవియునుఁ బోలె, సురుచిరాంబరమణిస్ఫురణంబుఁ గలిగి
కలిసినశివ్రుఁడును గౌరియుఁబోలెఁ, దలపోయఁగా నర్ధతనువులు గలిగి
పెక్కుచందంబులఁ బెంపుసొంపడరి, యక్కజంబయ్యె రణావనిస్థలము
అంత నీలుఁడు రాఘవాధీశుకడకు, నెంతయు వెసఁ జని యెరఁగె నంఘ్రులకుఁ
బొగడొందఁ గపులెల్లఁ బొగడిరి నీలు, దెగనిరాక్షసులు భీతిలి పాఱి చెప్ప
విని రావణుఁడు శోకవివశుఁడై మంత్రి, జనులతో ననియెను జల మగ్గలించి
యేవీరు లరిగిన నిట రాకలేక, యావానరులచేత నాకట! మ్రగ్గెదరు
వైరులవలనిగర్వం బడంగింప, నేరూపమునైన నేనె పోయెదను
అని పేర్చి కనలుచో నామాట లెల్ల, వినియు మందోదరి వెస మాల్యవంతు
కరము చేపట్టి డగ్గరి దైత్యవనిత, లిరుదెసఁ గొలువంగ నెంతయు వేడ్క
నతికాయుఁడును దోడ నరుగుదేరంగ, ప్రతిహారులురువడి బలసి యేతేర
నాయుధహస్తు లంతంతటఁ గొలువఁ, బొయిక చామరప్రతతులు వీవ
సకలభూషణమణిజాలంబు వెలుఁగ, సకలమంత్రులుతోడ చనుదెంచుచుండఁ
గడునొప్పు నీలమేఘముఁ జొచ్చుమెఱుపువడుపునఁ జొచ్చె రావణసభాస్థలము
ఆసతి నప్పు డర్ధాసనాసీనఁ, జేసి రావణుఁడు విశేషప్రియోక్తి
నుచితపీఠంబున నుండంగఁ బనిచె, నచలితమతులగు నమ్మంత్రివరుల
మ్రొక్కినయతికాయుమోహంబుతోడఁ, దక్కక యునిచె నొద్దనె గద్దెమీఁద
నంత నకొకలువెల్ల నలబలంబడుగ, నింతితో నద్దానవేశ్వరుం డనియెఁ

గొలువులోపల కిట్లు కువలయనేత్ర, తలఁప నెన్నఁడు రానిదానవు నీవు
వడవడ వడఁకుచు వచ్చుటలెల్లఁ, గడుఁచోద్యమైనది కారణం బేమి

మందోదరి రావణునితో శ్రీరాములపరాక్రమము చెలుపుట.

యనిన మందోదరి యాత్తేశుఁ జూచి, దనుజేశ నాకురా దరవాయిగాన
వచ్చితి నేఁడు నావచ్చుటకెల్ల, నిచ్చలోపలఁ గడు నెగ్గు సేయకుము
అనిలోన ధూమ్రాక్షుఁ డాదిగాఁగలుగు,మనవారు దనుజేశ మడియుటకంటె
యల జనస్థానంబునందు రాక్షసుల, నలిఁ దునుమాడెఁ బద్నాలుగువేల
సరి ఖర త్రిశిరులఁ జంపినవాఁడు, నరుఁడు గాఁడంటి నానరనాథు రాముఁ
డలిగి వెండియు దండకారణ్యమందు, బలవంతుఁడైన కబంధు నిర్జించె
మారీచుఁ దునుమాడె మాయఁబోనీక, ఘోరాస్త్రమున వాలిఁ గూలంగనేసె
దేవహితార్థమై తివిరి రాఘవుఁడు, భూవలయంబునఁ బుట్టినవాఁడు
ఆదినారాయణుం డతఁడు గాఁడేని, మేదిని నింతటి మిక్కిలి నరుఁడు
కలుగునే మఱి కఱుకంరునిచాప, మలవొప్ప విఱిచెఁ బ్రఖ్యాతంబుగాఁగఁ
దమతండ్రిపనుపునఁ దపసియై సత్య, సమయంబుతో వనస్థలినుండ నతని
సీతఁ దెచ్చితి వీవు శ్రీరామచంద్రు, డే తెఱంగున నీకు నెగ్గేమి చేసె
రామలక్ష్మణులతో రణమొనరింప, నీమూఁడుజగముల నెవ్వరు గలరు
నలి సామభేదదానంబులు సూపఁ,గలిగిన దండంబు గాదు పాటింప
దండంబుఁ బాటింపఁ దలఁచెదవేని, దండింపఁబడుదురె దశరథాత్మజులు
దేవ రాముఁడు పరదేవతగాన, నీవు మ్రొక్కుటయొల్ల నిందగా దెందు
శరణన్నఁ జేకొను శరణన్ననీకు, నురుశుభం బగుఁగాని యొకకీడు రాదు
గుణరూపదాక్షిణ్యగుణగణకేళి, గణుతింప నలవియె కాకుత్స్థరాముఁ
డలిగిన నిలువ రింద్రాదిదేవతలు, దలఁప వయ్యెదు నీకుఁ దరముగా దెందు
వలదు వృథాగర్వవహ్నిఁ గూలకుము, చలమెప్ప నొప్పదు సంతాపముడుఁగ
నింకనైనను సీత నిచ్చుట మేలు, లంకేశ కులమును లంకయు నిలుపు
మహనీయవాహనమణిభూషణాది,సహితంబుగా నీవు జానకి నిచ్చి
యూపాక్షు నతికాయు నొగి మాల్యవంతు, భూపాలుపాలికిఁ బుచ్చు సంధికిని
మతిమంతుఁ డగుచున్న మనవిభీషణుఁడు, హితబుద్ధిఁ గావించు నీసంధి మనకు
వేయునేటికి కార్తవీర్యుతో సంధి, నేయవే యతని గెల్చినభృగురాము
గెలిచిన రాముఁడు కీర్తిధాముండు, తలపోయ సంధికిఁ దగఁడె చర్చింప
నని దైన్యపాటుతో నాడువాక్యములు, విని రావణుఁడు కడువేడి యూర్పడరఁ
గలయంగ నెట్టనికన్నులఁ గోప, మెలుకుచుసుండ మందోదరిఁ జూచి
హితమతివై నాకు నిన్నియుఁ జెప్పి, తతివ నీమాటలయం దొక్కటైన
మనసునఁ బట్టదు మగఁటిమి కలిమి, ఘనుఁడనై మూఁడులోకంబులు గెలిచి
దానవయక్షగంధర్వదేవాదు, లైనను వెట్టిసేయఁగ నున్ననన్నుఁ
దుదిఁబోయి యింకఁ గోతులమర్దసొచ్చి, బ్రతికెడినరునకుఁ బ్రణమిల్లుమనుచు

నిదియేమిమాటగా నీసభనాడి, తిది నీకుఁ బాడియె యిట్లొకుకులుఁడు
ఎఱిఁగి యెఱింగి మున్నెగ్గొనరించె, మఱి కదా తెచ్చితి మనుజేశుదేవి
జడమతి నతనితో సంధిచేసినను, గడఁగి ఖరాదులఁ గడతేర్చినట్టి
పగయు నీమఱుదలి బన్నంబునెట్టి, పగిది నీగఁగను జొప్పడు నటుగాన
భీమబాణముల విభీషణు నినజు, రామలక్ష్మణుల మర్కటములఁ ద్రుంచి
గెలుతు నవశ్యంబు గెలుపులేదేని, చల మొప్ప దురమున సమయుదుఁగాని
మానవేశ్వరుతోడ మఱి నేయ సంధి, జానకి నీను నిశ్చయ మిట్టి దతివ
యాయింద్రజిత్తుం డుదా త్తవిక్రముఁడు, నీయగ్రసుతుఁడుండ నీకేల వెఱపు
నాకెదు రెవ్వరు నాతనూభవులు, భీకరాకారు లభేద్యవిక్రములు
అన విని చింతించి యవనత యగుచుఁ, జనియె మందోదరి సభ నెడఁబాసి
నీచైనయట్టి దుర్నీతి చేపట్టి, యేచందమునఁ దన్ను నెఱుఁగునే యనుచు
రమణీయతరమైన రావణులక్ష్మి, క్రమమేది చనియెడి కైవడిఁ దోప
నారావణుండును నప్పుడు గడఁగి, వారక తనపగవాండ్రకు ననియెఁ
జిరకాలమేను నాచిత్తంబులోన, దొరకొన్న యలుకకుఁ దుదిసేయువాఁడ
నాతనిపాలికే నల్లరుద్రుండ, నాతండు నాపాలి కంధకాసురుఁడు
మునుకొని తూణీరమున వెలువడుచుఁ, దనరారు నాయంపతండంబుఁ జూడు
కుబునంబు లూడ్చిన క్రూరసర్పముల, నుపమింప ననువులై యొడియురాఘవునిఁ
గాలంబు ప్రేరేఁగపినేన నమ్మి, వ్రాలుగర్వంబున వచ్చియున్నాఁడు
ఉరుదివ్యశస్త్రాస్త్రయుక్తంబుగాఁగ, నరదంబు దెండు కయ్యంబున కనుడు
వారు నర్కప్రభావరథం బప్పు, డారూఢగతిఁ బన్ని యర్థిఁ దెచ్చుటయుఁ

రావణుఁడు యుద్ధమునకు వెడలుట.

దొలఁగక తనవైన దుర్మనోరథము, నెలమి నెక్కినక్రియ నెక్కి రావణుఁడు
దిక్కులమింటను దీప్తిజాలంబు, లక్కజంబై యొప్ప నరదంబుమీఁద
మెఱసినతోడపుల మీఱుట్లుగొనుచుఁ, దెఱఁగొప్ప నప్పు డద్దేవారియొప్పె
నారామబాణానలార్చులచేత, నారథంబును దాను నలిఁ గూలుకరణిఁ
బటుతరనిస్వానభాంకారములును, బటహభేరీశంఖభయదరావములు
హస్తిబృంహితములు నశ్వఘోషములు, ప్రస్తుతిపాఠకప్రకరరావములు
నరదాలమ్రోతయు నార్పులరవము, ధరణి గల్లెడు పదతాడనధ్వనులు
నడరి యొండొండ బ్రహ్మాండంబు నిండి, కడుభీకరంబులై కలయంగఁ బర్వె
లలిసముద్రమునకు నలుగుచందమున, నలిగె నిందును రాఘవాధీశుఁ డనఁగ
మునుకొని లంకాసముద్రంబులోన, ననువేది జీవంబు లఱచుచందమునఁ
గొనివచ్చితిమి దైత్యకోటి శ్రీరామ, కొసుమని యొప్పింపఁ గొంపోవుకరణి
భీమరథంబులు వేర్చి యందంద, రామచంద్రుని మనోరథములై నడిచె
రాముశిలీముఖరాజి మైనాటి, యీమదం బుడిపెడి నింతలోపలనె
త్రాగుచ మిమ్మదథారలన్మాడ్కి, మూఁగియాడెడి శిలీముఖములతోడఁ

గరములు కడు భయంకరములై రాము, కరముల కెందు దుష్కరములుగాక
కర మొప్పఁగా సముత్కరములై యపుడు, కరికోట్లు వసుమతిఁ గంపింప నడిచె
వలనెల్లఁ దప్పె రావణునకు రణము,వలన జయంబు మావలన నెక్కఁడిది
వలనేదికూలురావణుఁ డనుమాఁక్కి, వలనొప్ప హాయములు వ్రాలుచు నడిచె
వ్రాలిన రాఘువేశ్వరుని బాణాగ్నిఁ, గ్రాలుబలం బెల్లఁ గాలుబలంబు
అనిన చందంబున నార్చుచు నడిచె, ఘనతరం బైనట్టి కాలుబలంబు
కాలమేఘంబులకరణి నొప్పగుచు, శైలంబులో యనఁ జతురత మెఱసి
ప్రళయకాలమునాఁటి భానుబింబముల, కొలఁదిమీఱిన మిడిగ్రుడ్డులతోడఁ
గటములు నుదురులు ఘనదంష్ట్రములును,బటుకేశచయము నొప్పఁగఁ జూడ నపుడు
ప్రళయకాలునికైన భయముఁ బుట్టించు, చలమును వికృతవేషములును మెఱయఁ
బెక్కాయుధంబులుఁ బెక్కుమాయలును, బెక్కుతేజంబుల పెక్కువ గలిగి
యేమేమె రాము జయించెద మాజి, నేమేమె యని యస మెక్కినవారు
రాక్షసవీరులు రాక్షసాధిపులు, రాక్షసేశ్వరునితో రణబాస లిచ్చి
పరఁగంగ నార్చుచుఁ బటునినాదములు, నురువడి మ్రోయుచు నురుబలోన్నతిని
నడువంగ నప్పు డున్నతశక్తి మెఱసి, నడనడ వడఁకి వానరులెల్లఁ గలఁగ
నినవంశునకుఁ ద్రోవ యిచ్చుట కలిగి, వననిధి నింకింప వడి నేగుకరణి
నినుఁడ నీతనయుండు నీరాముఁ గూడె, నని యర్కుఁ గబళింప నరిగెడుమాఁక్కిఁ
దనయురవడి సముద్రంబులు గలఁగఁ, దనప్రతాపంబునఁ దపనుండు మాయఁ
దెగువయెల్లను ముఖదీప్తులఁ దోఁప, మగఁటిమి జయలక్ష్మి మఱిపొందుఁబాయ
నారవంబునఁ దాను నాజికి వెడలె, నారావణుం డట్టహాసంబు చెలఁగఁ
బెక్కాయుధంబులఁ బేర్చుదీధితులు, మిక్కిలి కన్నులు మిఱుమిట్లు గొలువ
పంబి వాయువులచేఁ బడగలు రెక్కి,యంబులు మిన్నంది యందంద గ్రాల
ఘనతరభీషణాకారంబుతోడ, ననయంబు నందంద నార్చుచు రాము
బాణానలంబునఁ బాల్పడనున్న, ప్రాణంబులను దృణప్రాయంబుచేసి
వారణలేకలు వచ్చుచునున్న, దారుణాసురసీమఁ దప్పక చూచి
రావణానుజుతోడ రఘురాముఁ డనియె, నీవచ్చుచున్నవాఁ డెవ్వఁడో వీఁడు
మిక్కిలి సత్త్వసమేతుఁడై కడిమి, పెక్కువ లింతయుఁ బేర్చినవాఁడు
అనిన విభీషణుం డారాముఁ జూచి, దనుజనాయకుల నందఱి వేఱువేఱ
వినుము శ్రీరఘురామ విన్నవించెదను, దనరంగనని వారిఁ దగఁజెప్పదొడఁగె
వాఁడె సింధురగంధవారణేంద్రంబు, వాఁడిమి నెక్కి యుజ్జ్వలుఁ డైనవాఁడు
ఉదయార్కబింబసముజ్జ్వలాస్యమున, నొదవిన ఘనరోష మొప్పినవాఁడు
పారిబోరి నంకుశంబున నియమించి, కరియని నేయింపఁ గడఁగెడువాఁడు
ఉరువడిఁ జనుదెంచుచున్నట్టి వీరుఁ, డురుబలాఢ్యనిగంఁటె యూపాక్షుఁ డతఁడు
కడునొప్పు భీకరఘంటారవంబు, లడరినరథ మెక్కి యావచ్చువాఁడు
పోమలఁ బెక్కండ్రఁ బొరిగొన్నవాఁడు, ధారణీశ్వర మహోదరుఁ డనువాఁడు

భరితరత్న ప్రభాపటలంబుతోడఁ, బరువైనయరుణంపుఁ బక్కెరవెట్టి
గరుడవేగంబున ఘనమైనయట్టి, తురగంబు నెక్కి యుద్ధురవృత్తితోడఁ
జనుదెంచువాఁడు పిశాచనాథుండు, ననికి నీతని కెదు రగువారు లేరు
మిక్కిలి కడిమిమై మెఱసి సింహంబు, నెక్కి శూలముఁబట్టి యేతెంచువాఁడు
అనిమీఁది వేడుక నలరినవాఁడు, దినకరకులనాథ త్రిశిరుఁ డన్వాఁడు
పృథులఘంటారావస్ఫీత మైనట్టి, రథమెక్కి వడి గుణారవము నేయుచును
ఘనసర్పకేతువు గలిగినవాఁడు, ఘననీలతనుఁడు రాక్షసుఁడు కుంభుండు
కనకమహామణిఖచితంపుఁ బడగఁ, దనరారు చిత్రరథంబుపై నెక్కి
యరుగుదెంచుచు నున్న యారాక్షసుండు, గురుశక్తియుతుఁడు నికుంభుఁడు దేవ
యనలసన్నిభమైన యరదంబు నెక్కి, ఘనగర్వమున మీఱి కయ్యంబుసేయఁ
గలవాఁడు వాఁడె యీకపిసేనదిక్కు, సొలవక విషదృష్టిఁ జూచుచున్నాఁడు
శరమటువింటితో సంధించుకొనుచు, నరుదెంచువాఁడు నరాంతకుం డధిప
భీషణరూపమై పేర్చువాక్యముల, రోష మెక్కెడి మిడిగ్రుడ్డులతోడఁ
గరివక్త్రములఘోటకపువక్త్రములను, హరివక్త్రములఁ గిటివ్యాఘ్రివక్త్రముల
నురగవక్త్రముల నుష్ట్రవక్త్రములఁ, గరముగ్ర మైనరాక్షసు లుత్సహించి
కొలువ భూతంబులు గొలువ ఫాలాక్షు, నలవొప్పువాఁడు దేవాంతకుం డధిప
ఘనమైన ఘోషంబు గలపైఁడిరథము, దనరార నెక్కి యుద్దండభావమున
నతితృణీకృతలోకుఁ డైగుణారావ, మతిశయిల్లఁగఁ బుట్టినంతనుండియును
నెన్నఁడు నోటమి యెఱుఁగని వీరుఁ, డన్నరభోజను నాత్మసంభవుఁడు
అరుణచందనము మేనలఁదినవాఁడు, తిరమైన యరుణంపుదృష్టులవాఁడు
సంధ్యాంబుదమువంటిచాయలవాఁడు, వింధ్యాచలమువోలె వెలసినవాఁడు
కోటానకోటుల గొడుగులచేత, మేటిచామరముల మెఱసినవాఁడు
అవధరింపుము దేవ యతికాయుఁ డతఁడు, అవనీశ యాజిలో నధికశూరుండు
భూరిసితచ్ఛత్రములు పదివేలు, చారుచామీకరచామరావళులు
పరగంగ సింగంపుఁబడగతోఁ గ్రాలు, పరఁపైనఘోటకప్రతతులనొప్పు
నరదంబుమీఁది గుణారవం బెసఁగ, భరితశస్త్రాస్త్రసంపదఁ దేజరిల్లి
యజునివరంబున నఖలదేవతల, భుజబలస్ఫీతుఁడై పోరిలో నేచి
సురపతి పురిఁబట్టి సొంపారునట్టి, వరగర్వమునఁ జాల వ్రాలినవాఁడు
నిచ్చట మనమీఁద నిడిన చూపడర, వచ్చుచు నున్నాఁడు వాఁ డింద్రజిత్తు
ఇంకఁ జూపెదఁ జూడు మినకులాధీశ, లంకాధినాథు నుల్లసితప్రతాపుఁ
గనకరత్న ప్రభాకలితతండముల, నొనరినచామరంబులు నుల్లసిల్ల
సొలవక పండ్రెండుసూర్యబింబములు, గలయంగ దశకంబుగాఁ గరఁగించి
చేసినపగిది విచిత్రరత్నాంశు, భాసురకోటీరపఙ్క్తి నొప్పారి
మహనీయతరమైన మణికుండలమున, మహిమ దిక్కులనెల్ల మట్టాడుచుండ
రోషమహాదృష్టిరోచులఁ జాల, భీషణాకారతఁ బెర్చినవాఁడు

హరుఁ డున్నకైలాస మగలించినాఁడు, సురకామినులఁ జేరఁ జొనిపినవాఁడు
లోకంబునెల్లఁ బెల్లుగఁ గెల్చినాఁడు, పాకశాసను ననిఁ బరపినవాఁడు
ఐరావతముదంత మూడినయురము, తో రమణీయమై తోఁచినవాఁడు
ముల్లోకములఁ దనమూ ర్తిచే హాల్ల,కల్లోలమై పడఁ గలఁచినవాఁడు
వాఁడు సేనామధ్యవ ర్తియైనాఁడు, వాఁడుపో దేవ రావణుఁ డనువాఁడు
అని విభీషణుఁ డోలి నందఱఁ జెప్ప, విని రాఘవుఁడు కడు విస్మయంబంది
హరిహరి చిత్ర మీయసురేశ్వరుండు, సరిలేనియట్టి తేజంబె రూపైన
యట్టిచందంబువాఁ డసురులయందు, నిట్టితేజోధనుం డెవ్వఁడు గలఁడు
కడుఁ గ్రూరకర్ముండు గాకుండెనేనిఁ, బుడమి కింతటికినిఁ బూజ్యుండు గాఁడె
పరికింప నిందఱు పర్వతాకృతులు, నురుశక్తిగలిగిన యోధులు క్రూర
చరితులు మఱి వీనిసైనికులెల్లఁ, గరము భీషణులు రాక్షసవీరు లనుచు
నుగ్రలోచనుపినాకోగ్రచాపంబు, నిగ్రహక్రమకళానిపుణుఁడై నృపుఁడు
ధరియించి కడఁకతోఁ దాను లక్ష్మణుఁడు, వరబాణచయములు వరుస నుప్పొంగఁ
గోపించియును ధర్మగుణముఁ జేపట్టి, రిపార్థివులకు నీఁ డెవ్వరు నాఁగ
నారావణుండును నఖలనిశాట,వీరుల వీక్షించి వినుఁడని పల్కె
నగరివాకిళ్ల నున్నతితోడఁ బెద్ద, మొగసాలలందును మోసంబు లేక
కడు సురక్షితముగాఁ గావలియుండుఁ, డడరి యీలంకలో నందఱుఁ బ్రీతి
నేనును మీరును నీకయ్యమునకు, మానుగాఁ బోయిన మఱి వలీముఖులు
లంకలోఁ జొచ్చిన లావేమినేయు, శంకింప వలవదు చనుఁడన్న వారు
చనిరి రావణుఁడును జటులవేగమున, ధనువును నస్త్రముల్ ధరియించి పేర్చి
కార్చిచ్చు వనము లుగ్రంబుగాఁ గిట్టి, యేర్చుకైవడిఁ దోఁప నిమ్ములఁ గిట్టి
జగతీతలము నాకసముఁ దాకుకరణి, నగచరసైన్యంబు నదరంటఁ దాకి
యిది ధరణీభాగ మిది వియత్తలము, ఇది దిశావలి యని యేర్పడకుండ
నతినిశితాస్త్రంబు లందందఁ బరపి, యతులబలోద్ధ్రుఁడై దశాననుఁడు
కలఁచి కొందలమందఁగాఁజేసి కపులఁ, జులుకఁగా ఖండించి చూర్ణంబుచేసి
నెమ్ములు మజ్జంబు నెరసియు మెదడు, గ్రమ్మి నెత్తురు నేలఁ గలయంగ నించి
తనరి యార్చుచు గుణధ్వని దిక్కులందు, నించి ఘోరాజిలో నెఱయఁబోర్చుటయుఁ
బడియెడువానరుల్ భ్రమయు వానరులు, మడియువానరులును మ్రగ్గువానరులు
నొరలు వానరులును నులుకు వానరులు, నరచు వానరులు రూపఱిన వానరులు
గలిగినసంగరాంగణభూమిఁ జూచి, తలఁకిరి సురలు చిత్తంబులు బెదరఁ
గాలకాలానలకాలదుర్వారకేళికరాళుఁ డక్షీణుఁడై యపుడు
పేర్చుకోపంబున భీషణుం డగుచు, నార్చుచు నున్నదశాననుఁ జూచి
యతనికి నెదురుగా నరిగి సుగ్రీవుఁ, డతిరయంబున నొక్కయగ మెత్తి వైచె
నారావణుండును నది మధ్యమునను, భూరిశరంబులఁ బొడిసేసి మఱియు
నొండొండ ఘనదీప్తి లొదవ నాకసము, నిండి మండుచు నుండ నిశితాస్త్ర మినజు

నురమూడనేసిన నుచ్చి యామమ్ము, ధరఁ గాడె నత్తఱి దానవు లార్వ్వఁ
దరుచరులెల్ల నుద్ధతి బొప్పథార, లురుళింప నర్క–జుఁ డొరలుచుఁ గూలె
భుజబలాఢ్యుఁడు శరభుఁడు ఋషభుండు, గజుఁడు గవాక్షుండు గవయుండు నలుఁడు
జ్యోతిర్ముఖుం డది చూచి కోపమున, నాతతగతిఁ బర్వతావనీజముల
నడరించి రతనిపై నవియెల్ల నతఁడు, నడుమనే తునిమి వానరుల నేడ్వురను
నొక్కొక్క–యమ్ముల నుర్వరమీఁద, గ్రక్కు–నఁ జచ్చినగతి నుండనేసె
నాలోన హనుమంతుఁ డాయోధపతులు, గూలుటయును జూచి కోపంబుతోడ
ననురాధినాథునియరదంబుమీఁది, కసమున లంఘించి యతనితో ననియె
దేవేంద్రుఁ డాదిగా దివిజులనెల్ల, రావణ మఱి యక్ష రాక్షసకోటిఁ
ద్రుళ్లడంచితి నని త్రుళ్లెద వీవు, చెల్లదు రోరి నీ చేవడఁగింతు
నున్నతిఁ జిరకాల ముర్వీపై బ్రతికి, యున్న నీమీఁద నాయున్నతంబైన
వలకేలు నేఁడు రావణ యిదె చూడు, మలమి సాగెడు దనయంతన పేర్చి
యిదె నిన్ను బొరిఁగొని యేచి యంతకుని, సదనంబు కనుపక సైఁపను నిజము
అనిపేర్చి పలికిన హనుమంతుమాట, విని రావణుఁడు క్రోధవికృతాస్యుఁ డగుచు
గలితనంబును లావు గలదేని నీవు, నలువొప్ప నుప్పొంగి నను మున్ను బొడిచి
పేరుగొ మ్మిటమీఁదఁ బేర్చిన నీదు, శూరతయును లావుఁ జూచి యేనేచి
పొడిచెద ననుడు నద్భుతశౌర్యుఁ డగుచుఁ, గడఁగి మారుతి దశకంధరునిఁ జూచి
దేవదేవుఁడు రామదేవుండు పనుప, నీవీటిలో మేదినీపుత్రి వెదకి
తడయక పొడగాంచి తగ విన్నవించి, వెడలి యేఁ బోవుచో విక్రమస్ఫురణ
నీతోఁట నుగ్గాడి నీలంకఁ గాల్చి, నీతనూభవుఁ జంపి నిన్ను దట్టించి
యుక్కున నిలిచి వైత్యులు చూచుచుండఁ, జక్క– నెప్పటిత్రోవఁ జన్న నాలావు
నేఁడు చూచెదనని నీవాఁడె దుబ్బి, నాఁ డెందుఁ బోతివి నాకారి నీవు
అనవుడు కోపించి హనుమంతువఱి, మనువొప్పఁ బొడిచె నయ్యసురేశ్వరుండు
పొడిచిన స్రుక్కి–యుఁ బోనీక యతఁడు, పిడికిట రావణుఁ బెట్టుగాఁ బొడిచెఁ
పెనుగాలి యడఁచిన బిట్టు కంపించు, ఘనవృక్షమును పోలి కంపించె నసుర
యంతట నొచ్చిన యసురేశుఁ జూచి, యెంతయు నార్చి రయ్యింద్రాదులెల్ల
దనుజాధిపతియు నంతనె మూర్ఛ దెలిసి, హనుమంతుఁ జూచి యిట్లను నీబలంబు
గడు మెచ్చువచ్చు నీఘనముష్టిహతిని, గడఁకతోఁ బ్రేతలోకముఁ జూచివచ్చె
దేవారి యనుడు నద్ధీరాత్ముఁ డనియె, రావణ విను మీవు ప్రాణంబుతోడ
నున్న వాఁడ విదేల యురక నాలావు, సన్నుతించెదు లజ్జ జనియింప నాకు
నని పల్కి– నీవు నన్నటు పిడికిటను, గొను మొనపోటన్నఁ గొనుమని యతఁడు
ననయంబు కోపించి యనిలనందనుని, ననుపమాశనికల్ప మగుముష్టినార్చి
వఱుంబుఁ బొడిచిన వడి మూర్ఛనొంది, యఱుణంబునఁ ద్రెళ్లె నవనిపై నతఁడు
నరిమురి హనుమంతుఁ డటు కూలుటయును, నెరసి రావణుఁ డంత నీలుపైఁ జనియె
హనుమంతుఁడును మూర్ఛ యంతలోఁ దెలిసి, దనుజుండు నీలుపైఁ దఱుముటఁ జూచి

యెటుఁ బోయెదని పిల్చి యెదురుగా నిలిచె, నటు తన్నుఁ గిట్టి పెల్లార్చుచునున్న
మనుజాశనునిమీఁద మలయశృంగంబు, గొనివచ్చి నీలుండు కోపించి వైవ
నడుమనె దునుమాడె నాకారి దాని, నెడపని కడఁకతో నేడమ్ము లేసి
వెండియు నీలుండు విపులకోపమునఁ, గొండలు దరువులు గొని వైచుటయును
వాని నన్నింటి రావణుఁడు చూర్ణములు,గా నిశితాస్త్రసంఘంబులఁ దునిమి
నీలుని మేనఁ గ్రొన్నెత్తురు లొలుక, వాలికయమ్ములు వడిఁ బెక్కు-లేసె
నేసిన నొచ్చియు నింత నైకొనక, గాసిల్లు నీలుండు కడులాఘవమున
ధారణి దైత్యులు దల్లడంబంద, వీరుఁడై దానవవిభుతేరి కురికి
పొలుపొంద నప్పు డద్భుతశక్తి మెఱసి, నిలిచి చలంబున నిగిడి యుప్పొంగి
వడిఁ బేర్చి దానవధ్వజమున కెగసి, పొడిచేసి చాపాగ్రమునకు లాగొప్ప
నెగసి చలంబున నెక్కె-డలించి, మగిడి రావణఘనమకుటముల్ ద్రొక్కి-
యురుభుజనిజవిక్రమోన్నతి మెఱసి, సురసిద్ధసాధ్యులు చోద్యంబునొంద
నొకమాళిపైనుండి యొకమాళి వ్రచ్చి, యొకమాళిపైనుండి యొకమాళి యూచి
యొకమాళిపైనుండి యొకమాళి డుల్చి, యొకమాళిపైనుండి యొకమాళి దన్ని
మకుటంబులన్నియు మట్టి మల్లాడి, యకలంకుఁడై నీలుఁ డంతటఁ బోక
వారక తనుఁ బట్ట వచ్చిన సూత్తు, మై రావణునిఁ జూచి యందంద నగుచు
గొడుగులు ద్రుంచి గ్రక్కు-న మీఁదఁ ద్రోచి, పొడిగాగఁ జామరంబులు ద్రుంచివైచి
విఱుగంగ నరదంబు వీక దాటించి, కరకరితోడ నుత్క-ంఠ దీపింప
దనుజేశు నురుముష్టి దాఁచి హారములు, పెనచి రాదిగిచి యాపృథులవక్షంబు
జరచి యందంద యుత్సాహంబు మెఱసి, యురక నీగతి నాడుచుండుటఁ జూచి
తరుచరసేనలు దైత్యసేనలును, బొరిఁబొరి నద్భుతంబుగఁ జూచుచుండ
వెఱగంది రాఘవవిభుఁడు లక్ష్మణుఁడు, మఱి రావణుం డంత మహితాగ్నిశరము
నయ్యెడ నారితో నలుక సంధించి, యయ్యగ్నిసుతుతోడ ననియె మండుచును
నీలాఘవము లెస్స నిన్ను మెచ్చితిని, నీలాఘవమె నాకు నెడపక చూపు
మిదె వచ్చె నాబాణ మినవహ్నిరుచుల, బ్రదికెడు చందంబుఁ బరికించికొనుము
అని యేయుటయు నీలుఁ డగ్ని బాణమునఁ, దనువెల్ల మండుచు ధరణిపైఁ బడియె
నగ్నిపుత్రుఁడు దాన నాతీవ్రశరపు, టగ్నిచేఁ జావక యవశుఁడై యుండె
నంత ధనుర్ఘోష మడర సౌమిత్రి, యంతకు గతిఁ బేర్చి యద్దైత్యుఁ దాఁక
నగ్గురణారావంబు నతనిసాహసము, నగ్గించి యతనితో ననియె రావణుఁడు
పిన్నవై యుండియుఁ బేర్చుచు ననికి, సన్నద్ధగతి నీవు చనుదెంచు టొప్పఁ
బుచ్చెద నంతకుపురికి లక్ష్మణుఁడ, యిచ్ఛందమున నిల్వు మించుకతడవు
అనవుడు విని రాఘవానుజుం డనియె, దనుజాధమఁడ యీవృథాగర్వమేల
డాసినవాఁడ మాటలు సెప్ప కిపుడు, చేసి చూపుదుఁగాక చెలఁగి నీలావు
అనిన సౌమిత్రి నేడమ్ముల నేసె, దనుజునియమ్ము లుద్ధతి లక్ష్మణుండు

నడుమనె త్రుంచిన నాకారి యప్పు, డడరెడుకోప ముదగ్రమై పర్వ
ఘనతరజ్యానాథ కలితంబుగాఁగ, ననయంబు నిగుడించె నమ్ములవాన
నయ్యంపతండంబు లందందఁ ద్రుంచి, వెయ్యేసిశరములు వెస నేసె నతఁడు
నాయస్త్రములకు మాత్రైనయస్త్రముల, నేయనేరక చానవేశ్వరుం డపుడు
తలకొని యొక్కబ్రహ్మదత్తబాణమున, లలితవక్షం బేయ లావెల్లఁ దూలి
విల్లూతగాఁ గొని వేగంబె తెలిసి, పెల్లుగా నార్చుచుఁ బేర్చి లక్ష్మణుఁడు
ఘనబాణ మొకట రాక్షసనాథువిల్లుఁ, దునిమి యంతటఁ బోక దోర్బలం బెసఁగ
మూఁడగ్ను లనఁబోలు మూఁడుబాణముల, వాఁడిమి మీఱంగ వడి వక్షమేసె
నేసిన మూర్ఛిల్లి యింతలోఁ దెలిసి, యాపన్నసత్త్వసమగ్రుఁడై కదిసి
తనవిల్లు విఱిచినదానికి నసుర, మనములోఁ జాల విస్మయమును బొంది
కలుషించి నిచ్చలు గంధపుష్పముల, నలవడఁ బూజింప నమరినదాని
నిలయ బ్రహ్మాండంబు నెల్లదిక్కులును, వెలుఁగొందుమంటల విలసిల్లుదాని
నడరెడుపదికోట్ల యశనులఁ బోలి, కడుబెట్టిదపుమ్రోత గలిగినదాని
నలినమిత్రునికిరణంబులకంటె, వెలుఁగొందు మంటలవేడిమిదాని
ననిమిషు ల్వెఱఁగంద నాబ్రహ్మశక్తి, గొనిలక్ష్మణుని వైచెఁ గ్రూరుఁడై పేర్చి
వైచినఁ గాలాగ్నివడువునఁ బెద్ద, యేచి వజ్రమునకు నెక్కుడై నిగిడి
యనిమిషావలియెల్ల నాహారవంబు, లొనరింపఁ బరతెంచు నుగ్రతఁ జూచి
వారింప నమ్ములవాన లక్ష్మణుఁడు, ఘోరతరంబుగాఁ గురియంగఁ ద్రోచి
యది వచ్చి భుజమధ్య మాడి లక్ష్మణుని, వదలక తాఁకిన వసుధపైఁ బడియె
నరిగి దశాననుం డంత లక్ష్మణుని, నిరువదిచేతుల నెత్తఁ జూచుటయు
సాతఁడు విష్ణుని యంశజుఁ డగుట, నే తెఱుంగున వాని కెత్తరాదయ్యె
నత్తఱి రావణుం డంతరంగమున, నెత్తరాకుండిన నేను గైలాస
మెత్తి త్రిలోకంబు లెల్లను నెఱుఁగ, నిత్తఱి నాసత్త్వ మెల్లను దరిగె
మఱియు మేరువునైన మందరంబయిన, నెఱయ నెత్తఁగనోపు నిజశక్తివాఁడ
వీఁడింత వ్రేఁగౌట విస్మయం బనుచుఁ, బోడిగాఁ గరములఁ బూని రావణుఁడు
అతులసత్త్వోన్నతి నందంద నెత్త, మతిలోనఁ గోపించి మారుతి గడఁగి
పఱతెంచి నిర్ఘాత పటుముష్టి నార్చి, కఱకురాక్షసుని వక్షస్థలిఁ బగులఁ [గను
బొడుచుటయును మూర్ఛఁబొంది రావణుఁడు,కడుమూలి యంత మోఁకాళ్లు మ్రోవఁ
బడియెఁ బితేండికిఁ బదమిడలేక, పడినరావణుని యప్పటిభంగిఁ జూచి
యార్చిరి దేవత లప్పుడు కపులు, పేర్చిరి రాక్షసు ల్భీతిఁ గీడ్వడిరి
పావని యట విష్ణుభక్తుండుగాన, రావణునకు నెత్తరానిలక్ష్మణుని
గురుసత్త్వమున నెత్తికొనిపోయి రామ, ధరణీతలేశుముందఱఁ బెట్టె నపుడు
రాముతేజమునఁ బరాజిత మగుచు, సౌమిత్రి నాటిన శక్తియు నూడి
యసురేశురథమున కరిగె సౌమిత్రి, యసమానబలశాలియై మూర్ఛ దేరె
నట రావణుండును నటు మూర్ఛ దెలిసి, చటులబాణాసనసన్నద్ధుఁడయ్యె

సౌమిత్రి యటు పరిశ్రాంతినొందుటకు, నామర్కటులు భీతి నడరి పాఱుటకు

రామరావణుల ప్రథమయుద్ధము.

రావణుఁ డేచి వైరాకకు రామ,దేవుండు కోపంబు దీపింపఁ బేర్చి
భీకరగుణరవస్ఫీతుఁడై వేగ, నాకారి కెదురుగా నడచుటఁ జూచి
యనిలతనూభవుం డనియె రామునకు, నినకులాధీశ్వర యీ రావణుండు
అరదంబుపైనుండి యాలంబునేయ, వెరవగునే నీకు విభుఁడ గాల్నడవ
నామీఁద వడినెక్కి నాకారి కెదుర, రామ విచ్చేయుట రాజధర్మంబు
అనవుడుఁ గడఁకతో హనుమంతు నెక్కి, యనిమిషకరిమీఁది యమరేంద్రకరణి
నొప్పి గుణధ్వని యొప్పారఁ జేసె, నప్పుడు కోపించి యాటోప మొప్ప
రావణుఁ డుగ్రుఁడై రాము నీక్షించి, పావకజ్వాలోగ్రబాణజాలములు
గురిసిన రాఘవక్ష్మాధీశుఁ డలిగి, యురుబాణతతులేసి యురువడి వాని
నింద్రారి తెగనేసే నేసిన రామ,చంద్రుఁ డుద్ధతి నర్ధచంద్రబాణమున
ధనుజేశుకోదండదండంబు ధనిమి, సునిశితభీకరాశుగపంచకమున
మర్మము ల్నొప్పించి మఱియును నొక్క,ధనువును జేకొని దశకంధరుండు
పటుబాణ మొక్కటఁ బవననందనుని, నిటలస్థలంబేసె నిపుణుఁడై మెఱసి
యనిలజుఫాలముగ్రాస్త్రంబు దాఁకఁ, గనుఁగొని కోపించి కాకుత్స్థకులుఁడు
భల్లంబు దొడిగి యాపజ్జికంధరుని, విల్లంతలోననె విఱుగంగనేసి
యొక్కట సారథి నొకట నశ్వముల, నొక్కట నరదంబు నొకటఁ బతాక
మొక్కట గొడుగును నొకట వస్త్రములఁ, గ్రక్కున నేసి చూర్ణములు గావించి
మనుజనాయకుఁడు సమంత్రకశరము, దనుజునివఱిఁబు దాకనేయుటయు
నారాముశరమున నారావణుండు, వారక కడు నొచ్చి వడవడ వడఁకి
యనికి నిశ్చేష్టితుం డగుదశకంఠుఁ, గని యర్ధచంద్రమార్గణ మరివోసి
దశదిశలందును దనరిన దైత్యు, దశ యడఁగించుచందముఁ జూపుకరణిఁ
ద్రిదశులు మెచ్చు నుద్దీప్తకోపమునఁ, బదిమకుటంబులు వడి డొల్లనేసె
నేసిన మదిలోన నెంతయు స్రుక్కి, భాసురమకుటప్రభావలిఁ బాసి
గ్రద్దనఁజేయు నక్కయ్యంబు దక్కి, తద్దయు నిశ్చేష్ట దశకంఠుఁ డుండె
నప్పుడు రాఘవుం డనియె రావణున, కిప్పుడు కపులతో నిబ్బంగిఁ బోరి
కడు డస్సినాఁడవు గాన నిఁ జంప, విడిచితి నీవింక వేగంబె చనుము
పోలంక కనుడు నప్పుడు చిన్నవోయి, యోలిన వేడినిట్టూర్పులు నిగుడ
మండెడికోపంబు మలఁగి చింతించి, దండిగర్వము దక్కి దశకంధరుండు
బలమెల్లఁ బొలిసి దర్పము పేర్మిదూలి, వెలవెలఁ బాఱుచు విరథుఁడై నడిచి
పెదవులు దడపుచు బిమ్మిటిగొనుచుఁ, గదరినభీతి గద్గదకంఠుఁ డగుచుఁ
జేరి యొండొరువుల చేతులు చరచి, బోరన నవ్వుచు భూతంబు లార్వ
గురువులు వారుచు గునిసియాడుచును, గెరలి వానరకోటి గేలిసేయంగఁ
గనుకెల్ల నుడిగి యొక్కరుఁడును వేగ, పఱచి యాలంకలోపలఁ జొచ్చెనపుడు

అటు లంకలోపలి కరిగి రావణుఁడు, పటుతరంబగు చింతపడి తల్లడిలుచుఁ
బంచాననంబుచేఁ బడియుఁ జావునకు, నించుక తప్పిన యేనుఁగుపగిది
గరుడుని కగపడి క్రమ్మఱ బ్రతికి, సురిగిపోయిన దందశూకంబువోలె
స్ఫీతవిద్యుత్ ప్రభాభీలకీలముల, నాతతబ్రహ్మదండాతిశయంబు
లగురాముబాణంబు లడరి ప్రాణములఁ, దెగటార్చుచునికి చింతించి చింతించి
యుడుగని వేడినిట్టూర్పులఁ బెల్లు, వడిగాలిఁ బోలి యవ్వలనైన సుడియఁ
దలకొన్నసిగ్గున ధైర్యంబు దూలి, కొలువులోపలి ధైర్యకోటి నీఱించి
నాలావుకలిమి దానవవీరులార, నేలతోఁ గలియుట నేఁడుపోఁ గలిగె
సహజపరాక్రమశాలి యొక్కఁడు, మహిమీఁదఁ బుట్టి రామక్షితీశ్వరుఁడు
సారిచి యుద్ధములందు సురసిద్ధసాధ్య,గరుడగంధర్వరాక్షసపక్షియక్ష
కిన్నరోరగమృగకింపురుషులును, నన్ను జయింప నెన్నఁడు లేకయుండ
వరము గాంచితి బ్రహ్మవలన నేనపుడు, సరకునేయను నరసమితి మోసమున
నామోస మెల్లను నాకుఁ బైవచ్చె, నేమని చెప్పుదు నీదురవస్థ
కోట మీ రేమఱకుండి వాకిళ్లఁ, బాటించి యెంతయుఁ బలుకాపు లిడుఁడు
దురములోపలఁ బ్రహస్తుఁడు మొదలైన, యురువీరులందఱు నొగిఁ బోరి పడిరి
మఱి యింక రామలక్ష్మణుల జయింప, నెఱవీరుఁ డెవ్వఁడు నిజగతి జగతి
బహుసంగరాంగణపరిణతుండైన, సహజశూరుఁడు రామజనపాలుమీఁద
నడువ నేర్చినయట్టి నాతమ్ముఁడైన, కడిఁది వీరుఁడు కుంభకర్ణుండుగాక
వినుతింప మఱియొండు వీరుండు గలఁడె, యనుచు నద్ధశకంయఁ డందఱఁ జూచి
నెఱయంగ నిరుమూఁడు నెలలు నిద్రించి, మఱి మేలుకొని సభామంటపమునకు
నలరి యేతెంచి మంత్రాలోచనంబు, పొలుపారఁగాఁజేసి పోయి క్రమ్మఱను
నేఁడు తొమ్మిదినాళ్లనిద్రమైనున్న, వాఁడు శత్రులనెల్ల వధియింపఁగలఁడు

కుంభకర్ణుని నిద్రమేల్కొనఁజేయుట.

ఆతని మేల్కొల్పి యతులవిక్రముని, నేతెఱంగుననైన నిటకుఁ దెండనిన
బహుగంధపుష్పము ల్బహుభోజ్యములు, బహువిధంబులఁ గొని బఱచి రాక్షసులు
ఆతతానంతభోగాస్పదం బగుచుఁ, బాతాళమును బోలెఁ బరఁగినదాని
మహనీయశతకోటిమహిమచే నింద్రు, మహితాలయము పోలె మానైనదాని
నిఖిలంబునందును నెగడుతేజమున, శిఖినివాసము పోలెఁ జెలువైనదాని
సమధికంబైన భీషణవృత్తిగలిగి, యమనివాసము పోలె నమరినదాని
వివిధమేదోమాంసవితతిఁ గ్రవ్యాదు, భవనాంగణము పోలి భాసిల్లుదాని
నిరుపమతరవారుణీయుక్త మగుచు, వరుణాలయము పోలె వ్రాలినదానిఁ
దిరమైన యాసుగంధీస్పర్శనమున, మరుదాలయము పోలె మానైనదాని
విలసితనిధులచే వెలసి కుబేరు, నెలవును బోలె వర్ణితమైనదాని
నురువిభూతికినెల్ల నునికిపట్టగుచు, హరునివాసము పోలె నమరినదానిఁ
గలిగినపద్మరాగప్రభావళుల, నలువయున్నెడ పోలె నలరినదాని

నఖిలదిక్కు-ల యోజనాయతం బగుచు, సుఖతరం బగుగుహాఁ జొచ్చి యచ్చటను
ఆవిపులపుటూర్పు లడరినఁ దూలి, లావున నెట్టకేలకుఁ జేరఁ బోయి
కడునొప్ప నెంతయు గరగరికైన, వెడలుపుగల హేమవేదికమీఁద
నంసంబుతోఁ గపోలాంగంబుఁ జేర్చి, హంసతూలికతల్పమందు శయనించి
యుడుగక తఱుచైన యూర్పులతోడఁ, బెడఁగైన యాఘర్మబిందులతోడఁ
గర మొప్పమోడ్చిన కన్నులతోడఁ, దఱుచైనకపురగంధపుఁబూఁతతోడ
నురమున నెంతయు నుజ్జ్వలం బగుచు, నెరసిన మణిహారనికరంబుతోడ
సల్లలితానందసంపదతోడ, నెల్లప్పుడును దన్ను నెఱుఁగమితోడ
సరసనిద్రాంగనాసంభోగకేళిఁ, బరిణమించినభంగి భాసిల్లువాని
పలుమఱు దివిజుల భంజించునట్టి, కలలర్ధిఁ గను కుంభకర్ణునిఁ గనిరి
కని యిట్టివానికి ఘననిద్రయుంచె, వనరుహాసనుఁ డని వగచుచు నపుడు
ఆతనిముందట నన్నరాసులును, బ్రీతిగా మహిషవరాహమాంసములుఁ
బోసి యంచితగంధపుష్పార్చనములు, నేసి ధూపంబులు చెలువొప్ప నిచ్చి
పొరిఁబొరి బహుదీపముల నివాళించి, కరములు మొగిచి పొగడ్తలు నెఱపి
పిడుగులుమ్రోసిన పెక్కు-వకంఠు, నెడప కార్చుచు బొబ్బలిడుచుఁ జీరుచును
నురువడి శంఖంబు లూఁదుచు బెట్టు, మొఱయంగ నిస్సాణములును భేరులును
జెంది వ్రేయుచుఁ దోన సింహారవంబు, లందంద చెలఁగింప నవ్మహారవము
దఱుతఁ బాతాళతలము దిక్కు-లను, నక్షత్రపథములు నాకంబు నిండె
నంతటఁ దెలియక యాకుంభకర్ణుఁ, డంతకంతకుఁ గడు నగ్గలంబైన
నిదురవోవఁగఁ జూచి నిఖలరాక్షసులు, గదలును ముసలముల్ ఘనముద్గరములు
బెనుపారఁ బట్టసభిండివాలములు, మునుమిడి యందఱు ముసరి వ్రేయుచును
బదివేలకుంతముల్ బరుల గ్రుమ్ముచును, వదలక కొండలు వైచియుఁ బోక
యురముపై నందంద నుఱికి పాదములఁ, గరము మెట్టియు మేలు కాన్పంగలేక
తడబడ సింహనాదములు సేయుచును, గడుబెట్టుగాఁగ శంఖంబు లూఁదుచును
బటునాదముల గ్రందుపటుకుంభవాద్య, పటహ భేరీభూరిబహువాద్యములును
దొడరి వాయింపుడుఁ దోడనె మఱేయు, నుడుగక పదివేలయుగ్రరాక్షసులు
క్రందుగా నిస్సాణఘనతరరావ, మందంద చెలఁగింప నారభసమున
నీలాద్రియునుబోలె నిశ్చలుం డగుచు,నాలోనఁ దెలియక యతఁడున్నఁ జూచి
కరులహయంబుల ఘనతరోష్ట్రముల, నురులులాయములచే నురము ద్రొక్కించి
కొంకక మేనెల్ల గుదియల మోఁది, యంకించి సకలవాద్యములు వాయింప
లంక గంపించి కోలాహలంబయ్యె, శంకించె నవ్వనచరసేనలెల్ల
నిటునేయనప్పుడు నేమియుఁ దెలియ, కటునిద్ర వోవంగ నఖలరాక్షసులు
కొందఱు దిక్కు-లు ఘూర్ణిల్ల భేరు, లందంద వ్రేయుచు నధికదర్పమునఁ
గొందఱు పర్వతగుహ లెల్ల నద్రువ, దందడి సింహనాదములు సేయుచును
గలయంగఁ గొందఱు కరములు పెనచి, పెలుచ శిరోజముల్ పెఱికివైచియును

గొందఱు ఘనకర్ణకుహరము ల్నొచ్చి, క్రందుగా గూబలు గఱచిపట్టియును
నటు ఘోరమగుబాధ లడరించి మఱియుఁ, బటుగదాముద్గర ప్రాసఖడ్గముల
ముసలంబులను బెట్టు మొగము సురంబు, మసల కందఱు పలుమఱు వ్రేయవ్రేయఁ
దననిద్ర యించుక దఱిగి యంతటను, మనుజాశనుం డొకమఱి యూపులింపఁ
దఱుచుగాఁ గన్నులు దరికొనవైచి, యిఱియ మ్రోకులసందు లెల్ల బంధించి
తెరలఁ గాచినయూనె దెచ్చి కర్ణములఁ, గరముగ్రముగ వేయిఘటములు వోసి
మునుకొని యాతని ముక్కు గోళ్లందు, ఘనమైనపారలు గనలఁ బెట్టియును
ఏకయత్నంబున హేమదండముల, భీకరగతి మ్రోయ భేరుల మ్రోసి
విడువక హాయకరివితతి సురంబు, గడఁగి త్రొక్కింప రాక్షసుఁడు శంకించి
చక్కఁ శేషోగ్రహస్తంబులు సాచి, యొక్కింత మేల్కొని హుమ్మని నీల్గి
బడబాముఖాభమై పరఁగెడినోరు, కడుఁ జూడ వికృతంబుగా నావులించి
యురవైనయట్టి సాయుజ్యపదంబు, నెరయంగ రాముఁడు నేఁడు నాకిచ్చు
నీరిత్తనిద్ర నాకేలని దాని, దూరంబుగాఁ బెడఁ ద్రోచెనో యనఁగఁ
గనువిచ్చి యసురులు కంపింప మేలు,కని కుంభకర్ణుఁ డుగ్రతను గూర్చుండెఁ
బ్రళయకాలమునాఁటి భానుబింబంబు, చెలువంబుతో మోము జేగురింపంగఁ
బటువింధ్యగుహలలోపల నుండివచ్చు, చటులానిలంబుల సరియూర్పు లెసఁగఁ
బ్రళయకాలాగ్నిబింబంబులఁ బోలి, కలయంగ నెఱ్ఱని కన్నులు మెఱయ
దానవు లిట్టు లాతనిమేలుకొల్పి, దానవేశ్వరునియొద్దకుఁ బోయి నిలిచి
దేవ నీతమ్ముఁ డెంతేనియు బాధ, గావింపఁగా మేలుకనియె నంతటను
నటు కయ్యమునకుఁ బొమ్మందుమోకాక, యిటు తోడితెత్తుమో యే తెఱంగనుడు
రాగిల్లి తోడొక్కాని రండు నావుడును, వేగంబె యాదైత్యవిభునాజ్ఞ వచ్చి
తనకట్టెదురనున్న దానవప్రతతిఁ, గనుఁగొని యాకుంభకర్ణుఁ డిట్లనియె
మీరేల నన్నిటు మేలుకొల్పితిరి, యీరావణునకుఁ గార్యం బేమి పుట్టె
నదియేమి చెప్పుఁడీ యనవుడు వారు, త్రిదశారిచేతనే తెలియంగ వినుము
నినుఁ దోడితెమ్మని నిర్జరారాతి, పనిచె నింతియకాని పనియేమొ తెలియ
దనవుడు జలక మింపారఁగా నాడి, చనుదెంచి యెంతయుఁ జతురత మెఱసి
చారువస్త్రములు భూషణములు దాల్చి, భూరికోటీరదీప్తుల నొప్పుటయును
నతిముదంబున నప్పు డాదైత్యులెల్ల, నతని కనేకభక్ష్యములు భోజ్యములు
మధువును సూకరమహిషమాంసములు, నధికంపుమెదడును నాజ్యభాండమును
ముదముతోఁ గొనివచ్చి ముందఱ నిడిన, మొదల మేదోమాంసములఁ బ్రీతి నమలి
రుధిరంబు మద్యంబు రూఢిగాఁ గ్రోలి, యధికసంతుష్టుఁడై యతఁడున్నఁ జూచి
మ్రొక్కి నిశాచరు ల్తొందఱ నిలువ, నక్కుంభకర్ణుఁ డిట్లనియె వారలకు
మీఱినసుతులకు మేటిబంధులకు, వారక రాక్షసేశ్వరునకు శుభమె
యెడరు పుట్టదు గదా యెవ్వరివలన, నడరి మీలంకకు నచ్చైన నిపుడు
నడచెద నభమైన నమరేంద్రుడైన, వడిఁ గిట్టి నాకంబువలనఁ బాపెదను

నాచ్చెదఁ గాలాగ్నినైనఁ బెంపొందవి, తేచ్చెదఁ బగవారితీవ్రదర్పములు
అనిన యూపాక్షుండు హస్తము ల్లొగిచి, కనుఁగొని యాకుంభకర్ణుతో ననియె
విను నిశాచరవీర విబుధులవలన, దనుజులవలన గంధర్వులవలన
నేభయం బెన్నండు నెఱుఁగని మాకు, నీభీతిఁ బుట్టించి రిప్పుడు నరులు
దివిజారి జానకిఁ దెచ్చుట కలిగి, రవికులో త్తనుఁడైన రామచంద్రుండు
కడిఁది విక్రములైన కపులతోఁ గూడి, విడిసినాఁ డీలంక వేడించి యిప్పు
డగచరుం డొక్కఁడె యఱుకుమాఱు, మొగిసేనతోఁ గూడ మున్ను నిర్జించి
లంక భస్మముచేసి లావుమైఁ జనియె, నింక నెవ్వఁడు గెల్చు నిమ్మహాకపుల
ననిలోన దేవాసురాదులకంటె, ఘనవిక్రమఖ్యాతి గలరాముతోడ
నురక కయ్యముసేసి యోడి రావణుఁడు, వెఱపునఁ బఱతెంచి వెస లంకఁ జొచ్చె
నని విన్న వించిన నన్నిశాచరుఁడు, కనుగవ విస్ఫులింగంబులు చెదర
యూపాక్షు నీక్షించి యుగ్రకోపమున, దీపించి యీడులు దీటుచుఁ బలికె
సమరంబులో నేఁడు సకలవానరుల, నమితవిక్రములైన యాదాశరథుల
మడియించి కపివీరమాంసరక్తములఁ, దొడరి రాక్షసకోటిఁ దృప్తిఁ బొందించి
రామలక్ష్మణుల యారక్తముల్ గ్రోల, కేమని వత్తునే నింద్రారికడకు
నటు చేసి వచ్చెదనన మహోదరుఁడు, నటమ్రొక్కి ముకుళితహస్తుఁడై పలికె
ఘనుని దశగ్రీవుఁ గని సేయవలయు, పనులెల్ల విని పోయి పగవారి గెలువు
మనవు డౌఁ గాకని యూహారకాంక్షఁ, దనయొద్దిరాక్షసతతిఁ జూడ వార
లిరవొందఁగా నప్పు డిరువదియొక్క,పురుషులమాంసంబుఁ బ్రోవుగాఁ బోసి
యెనుబదిమహిషంబు లెనమనూఅజము,లును వ్రేయుకోడంబులును నాల్గువేలు
ఘనశశకములు మృగంబు లార్నూరు, ననువొందఁగాఁ దెచ్చి యవి వేఱువేఱఁ
జంపి సుపక్వమాంసములుగాఁ దెచ్చి, యింపార నాతనియెదుటఁ బోయుటయుఁ
దనివోవఁ గుడిచి యుద్ధతి రెండువేల, ఘనఘటంబులనిండఁ గలమద్యమాని
పటపట దిక్కులు పగుల్వ్రేయుచును, జటులంబు లైనమీసములు దీటుచును
జనుదెంచు నురువడి జగము గంపింప, గనుదోయి ఘూర్ణిల్లఁగా గుహవెడలె
నల రావుపదనగహ్వారముననుండి, విలయకాలార్కుండు వెడలినమాడ్కి
బలుగిట్టి త్రాత్రియు బ్రహ్మాండతలము, వెలయ దర్పించు త్రివిక్రమునగిది
నాచందమున వికృతాకారుఁ డగుచు, నేచినపొడవుతో నేతేరఁ జూచి
కోట యవ్వలి కపికోటు లన్నియును, మేటిరాక్షసుఁ గని మిగిలినభీతిఁ
గొందఱు వెఱఁగందఁ గొందఱు డాఁగఁ, గొంద ఱట్టిటు పడఁ గొందఱు వెఱవఁ
గొందఱు మూర్ఛిల్లఁ గొందఱు జలధి, యందఱు వగఁగొంద ఱద్దిరా యనఁగఁ
గొందఱు రాముదిక్కున కొదుగంగ, నందఱఁ గనుఁగొని యాసమయమున
సౌమిత్రి విల్లును శరముఁ దెమ్మనుచు, రాముఁడు పలికె నారావణానుజుని
నదె యాకసంబును నవనీతలంబు, గదిసిన దేహంబు గలిగినవాఁడు
ప్రళయకాలాంబుదపటలంబుపోలెఁ, బొలయు భూషణరుచిఁ బొలుపైనవాఁడు

మూఁడులోకంబు లిమ్ముల మ్రింగునట్టి, వాఁడిమి దెరచినవదనంబువాఁడు
కాలుండొ యటుగాక కాలానలుండొ, కాలరుద్రుఁడొ లయకాలమారుతుఁడొ
కాలార్కుఁడొ మహాకాలాహిపతియొ, కాలమృత్యువొ లయకాలాబ్ధివిభుఁడొ
కాలకాలుఁడొ లయకాలభైరవుఁడొ, కాలరుద్రునకును గాలరుద్రుండొ
భీమంపురూపు విభీషణ యిట్టి, దేమెన్నఁడును జూచి యెఱుఁగము మున్ను
దానవుఁడొ వీఁడు దైత్యుండొ కాక, వీనికులం బేమి వీఁడెవ్వఁ డిందు
వాఁడె యాపురవీథి వడి నేగుచున్న, వాఁడెవ్వఁ డెఱఁగింపు వానివేరేమి
వీనిఁ గనుంగొని వెఱచిరి కపులు, వీనిచందముఁ జూడ వెఱఁగయ్యె ననుఁడు

విభీషణుఁడు శ్రీరాములతో కుంభకర్ణనిశాపప్రకారము చెలుపుట.

నావిభీషణుఁడు రామాధిపుఁ జూచి, దేవ యీదైత్యునితెఱఁగెల్ల వినుము
వరనందనుఁడు విశ్రవసునకు నితఁడు, కరము గ్రూరుఁడు కుంభకర్ణుఁ డన్నవాఁడు
రావణుతమ్ముఁడు రణవీథి గిట్టి, దేవసంఘంబుల దిక్పాలకులను
బలుమఱు దోలిన బాహుబలాఢ్యుఁడ, డలఘుశూలాయుధోద్ధతసత్వధనుఁడు
బ్రహ్మాండమయినను బగిలింపనోపు, బ్రహ్మాదులకుఁ బట్టువడఁడు సత్వమున
వీఁడు పుట్టిననాఁడె వికృతంపునోరఁ, బోడిమిచెడ జీవముల మ్రింగఁ జొచ్చె
మునుమిడి యటు భూతముల మ్రింగ మ్రింగ, విని వజ్రి కోపించి విపులవజ్రంబు
వీనిపై వైచిన వీఁడు గైకొనక, యానాకగజదంత మగిలించి వెఱకి
సురపతిపై వైవ సురసుర స్రుక్కి, సురపతి యప్పుడు సురలతో వచ్చి
యంభోజభవుఁ గాంచి హస్తము ల్మొగిచి, కుంభకర్ణుండను ఘోరరాక్షసుఁడు
పొలుపారఁ బ్రజలఁ జంపుచునున్న వాఁడు, సొలవక సురల నేచుచునున్న వాఁడు
గడఁగి పరస్త్రీలఁ గవయుచున్నాఁడు, తొడరి లోకములెల్లఁ ద్రుంచుచున్నాఁడు
ఈనీచు నీక్రియ నిటమీఁదనున్న, వీనినిగ్రహమున విశ్వంబు పొలియు
ననవిని యప్పు డయ్యంబుజాసనుఁడు, తనమనంబున నల్క తద్దయు మిగుల
రాక్షసావలినెల్ల రప్పించి యందు, వీక్షించె నప్పుడు వీనిరూపంబు
వీక్షించి యెంతయు వెఱఁగంది వీఁడు, భక్షించుఁ బోవెసఁ బ్రహ్మాండమైన
వీనిచందముఁ జూచి వెఱపు నాయందు, నూనెడు వీఁడింత యుగ్రుఁడై యున్న
వీఁ డాజిలోపల విదళింపకున్నె, మూఁడుకన్నులవేల్పు ముట్టిననైన
నని వీనితో నప్ప డనియె నాబ్రహ్మ, చనదని మిగుల నాజ్ఞాపింపఁ దలఁచి
యాఫలస్త్యనియత్తమాన్వయంబునను, నీపుట్టుఁ జెల్లను నిఖిలభూతములఁ
బొలియించుకొఱకు నాభువనంబులెల్ల, నలుకంగ నిట్టి శౌర్యము చూపెదనుచుఁ
జావుతో సరియైన శాపంబు నిచ్చె, నీవుడుగని యట్టి నిదురబొమ్మనుచు
జలిపిడుగునుబోలె శాపంబు దాఁకి, నిలువలే కెంతయు నిద్రితుండయ్యె
రావణుం డప్పు డాబ్రహ్మకు మ్రొక్కె, దేవ చూడుము కృపాదృష్టితో వీని
దారుణపెట్టినచెట్టుఁ దారె త్రుంపుదురె, యేరూపమున నితఁ డెంతకీడైనఁ
దగుబుద్ధిసెప్పుట తగవగువానిఁ, దగ దిటువలె శాపతప్తునిఁ జేయ

వీనినిద్రకుఁ దుది వివరింపుమనిన, దానవుతోడ ను త్తరమిచ్చె నజుఁడు
అక్కఁజంబుగ నిద్ర యాఁజేసినెలల, కొక్కొక్కపరిఁ దెలియుచునుండు ననుచు
నంతనుండియు నితం డవ్విభంబునను, జింతసేయక నిద్రఁ జెందు మేల్కాంచు
జేవ యిప్పుడు నీదు దివ్యబాణోగ్ర, పావకశిఖలఁ బొల్పడి సైఁపలేక
యవసరంబునను తా నాశావణుండు, తను మేలుకొల్పంగ దైత్యులఁ బనుప
దానును బేర్చి యుద్ధప్రసన్నుఁడు, డై నేఁడు నగరికి నరుగుచున్నాఁడు
వెస వీఁడు రావణు వీడొక్కని వచ్చు, నసమున మనమీఁద నంతకు మున్నె
వీనియాకృతిఁ జూచి వెసఁ బాఱకుండ, వానరసేనలో వడిఁ జాటఁ బనుపు
దనుజుండు గాఁ డిటుదారుయంత్రమున, నొనరంగఁజేసిన యుగ్రరూపనుచు
నిటు చాటఁగాఁ బంచి యెల్లవానరులఁ, బటుభీతియును బాపి భండనంబునకు
సన్నద్ధులుగఁ జేయు సకలాధినాథ, మున్నె యానతియిమ్ము మోహరింపంగ
ననవుడు నీలున కానతి యిచ్చి, జననాథుఁ డమ్మెయిఁ జాటుంగఁ బనిచె
నాకుంభకర్ణుండు నప్సురాంగనలు, చేకొని పూవుల నేసలు చల్లఁ
జని నిండువెన్నెలసదనమో యనఁగఁ, దనరారుచున్న యాస్థానంబుఁ జొచ్చెఁ
బరఁగిన ధవళాభ్రపటలంబుఁ జొచ్చు, సురుచిరకరుఁడైన సూర్యునిభంగిఁ
జొచ్చి యన్నకు మ్రొక్క సొంపార నతఁడు, గ్రుచ్చి కౌఁగిటఁ జేర్చి కూర్మిదీపింప
గనకాసనం బిడఁగాఁ బంచుటయును, దనుజాధినాథునితమ్ముఁ డందుండి
యన్న నాలోకించి యసురాధినాథ, నన్నుఁ దెల్పినకారణం బేమి యిపుడు
ఎవ్వఁడు నీయెడ నెగ్గొనరించె, నెవ్వనిఁ జంపుదు నెత్తెఱం గనుడు
నాకుంభకర్ణున కనియె రావణుఁడు, నీకుఁ బెల్లగుచున్న నిద్రపెంపునను
నేకార్యగతియును నెఱుఁగవుగానఁ, జేకొని యంతయుఁ జెప్పెద వినుము
రాముఁడు దశరథరాజనందనుఁడు, కోపించి నామీఁద కోతులఁ గూడి
వననిధి బంధించి వచ్చి యీకోట, వెనుకొని బలువిడి విడిసియున్నాఁడు
అనికిఁ జొచ్చుటయుఁ బ్రహస్తాదివీర,దనుజుల నందఱ ధరమీఁదఁ గూల్చె
వానరవీరు లెవ్వరుఁ జావ రందుఁ, గాన నారామలక్ష్మణుల భంజించి
యావిభీషణరవిజాదులఁ జంపి, లావునఁ జెడకుండ లంక రక్షింపు

రావణునకు కుంభకర్ణుఁడు నీతి చెప్పుట.

మని పెద్దకృపపుట్ట నాడువాక్యములు, విని కుంభకర్ణుఁ డవ్విబుధారి కనియె
మునునాఁటి యేకాంతమున మంత్రు లెల్లఁ, గనుఁగొన్న యాకీడెకాక చింతింప
వారక యిది నేఁడు వచ్చిన కీడె, యేరూపమున నిది యేటికిఁ దప్పు
మదముపెంపునఁ జేసి మఱియెవ్వఁడైనఁ, దుదిమొద లెఱుఁగక తొడరుకార్యంబు
వాడుగదా యెల్లవలనఁ జేటొందు, వాఁడని చెప్ప నెవ్వఁడు నీవె కాక
మతిగలమంత్రుల మంత్రానుమతులఁ, గృతకార్యములు పరికించునే విభుఁడు
ఒగిఁ బ్రభుమంత్రసముత్సాహశక్తు, లగణితఫలదంబులై వాని కమరఁ
బతి దేశకాలవిభాగంబు లెఱిఁగి, చతురజనద్రవ్యసంపద గలిగి

కార్యంబు మీఁదగు కార్యమూహించి, కార్యవిఘ్నప్రతీకారంబునేసి
ఫలసిద్ధిఁ గైకొని బహురాజ్యభోగములనిత్యుఁడై యుర్వి మోదింపవలయుఁ
బగవానిబలశక్తి భావించి సంధి, తగుబుద్ధిమైఁ జేయఁ దలపోయవలయు
రూపించి సమబలారూఢునితోడ, నేపుమై చని నిగ్రహింపంగవలయు
నటుకాక బలశూన్యుఁ డగుట చింతించి, పటుసత్త్వుఁడై శత్రుపై నెత్తవలయు
విడిసినబలిమి వివేకించి మీఁద, విడిచి మార్తుర గెల్వ వెస పూనవలయు
వైరు లసాధ్యులై వ్రాలుదురేని, లో రెండుపుట్ట విలోకింపవలయు
నతిసత్త్వులై వైరు లజితులై రేని, హితబుద్ధిమై నాశ్రయింపంగవలయు
నీయాఱుగుణముల నెఱిఁగి వర్తించు, నాయవనీశ్వరుఁ డభివృద్ధిఁ బొందుఁ
బూని యేపురుషుఁ డెప్పుడు సామభేద,దానదండము లుచితము దప్పఁజేయు
నెఱియవానికిగల నీతిశాస్త్రములు, కొఱమాలియుండు నిక్కువ మివ్విధంబు
పరధనపరసతీ పరచిత్తుఁ డెవ్వఁ, డరయ నాతఁడు కులం బంతయుఁ జెఱచు
నని కుంభకర్ణుఁ డిట్లాడువాక్యములు, విని రావణుఁడు క్రోధవివశుఁడై పలికె
నను నన్న యసుచు మనంబునఁ గొనక, కినిసి యిబ్భంగి శిక్షించెదు వచ్చి
యీవృథాజల్పంబు లింక నేమిటికి, నేవిధంబుననైన నీకార్యమేను
గడవందఁజేసితిఁ గాదన కీవు, కడిమిమై నిది చక్కఁగాఁజేయు మింక
ననవుడు విని యనె నాకుంభకర్ణుఁ, డని నేయఁ బోయెద నైనను నొకటి
విను దానవేశ్వర వేడుక నొక్క,దినమున నేనిద్ర దెలిసిననాఁడు
చేకొని కడుఁబెక్కు జీవుల మ్రింగి, యేకాంతమున నెమ్మి నేనున్నచోట
ననఘుఁడు నారదుం డరుగ నేఁ గూడఁ, జని విన్నవించితి సంయమితోడ
నెక్కడనుండి నీవిటుసంభ్రమమున, నెక్కడఁబోయెద వెఱిఁగింపు నాకు
ననవుడు కనకాద్రియందుండిరాక, వినుఁ వార్తలన్నియు వినుపింతు నీకుఁ
బంకజనాభుండు ఫాలలోచనుఁడు, పంకజాసనుఁడును పాకశాసనుఁడు
ననలుండు యమనైరృతాంబుధీశ్వరులు, ననిలుండు యక్షేశుఁ డగుకుబేరుండు
నోషధీపతియును సుష్ణకర్ణుండు, శేషగ్రహంబులు సిద్ధులు మునులు
కిన్నరగంధర్వగీర్వాణయక్ష, పన్నగగుహ్యకప్రముఖసంఘములు
సభగూడి మంత్రవిచారంబునేయ, శుభమతి నూహించి సురగురుం డనియెఁ
గ్రోధించి మనలఁ గైకొనక లోకముల, బాధించుచున్నాఁడు పద్మకంధరుఁడు
శుంభద్బలంబున సుడివడఁజేసి, జంభారి భంజించె సమరంబులోన
వడి నంతకునిదోలె వరుణు నోడించె, నొడిచెఁ గుబేరుని నురుబలోజ్జ్వలుని
గట్టల్లతో నతిగర్వంబు మెఱసి, పట్టి ధర్మాత్ములఁ బలువురఁ జంపె
దినకరచంద్రులతేజంబు లణఁచెఁ, దనయాజ్ఞ నడువంగఁ దట్టించి పనిచి
గ్రహముల నందందఁ గాఱేంచె మంత్ర,మహితంబు లగుచున్నమఖములు చెఱిచె
వఱలు మహోద్యానవనములు పెఱికెఁ, జెఱవెట్టె నుత్తమస్త్రీలఁ బెక్కండ్ర
నివిలోనుగా బాధ లిట్లు సేయుచును, భువనంబులకు భీతిఁ బుట్టించెఁ గాన

నడరి రాక్షసులతో నద్దశాననుఁడు, చెడునుపాయము మీరు చింతింపుఁ డింక
నని బృహస్పతి వల్క నామాటలెల్ల, విని బ్రహ్మ పలికె నావిబుధులతోడ
వర మిచ్చినాఁడ నే వానికి మున్ను, సురగరుడోరగాసురయక్షవరుల
చేనైనఁ జావమి సిద్ధంబుగాఁగ, దీనికి మాఱు చింతించితి వినుఁడు
దడవఁడు మనుజుల దైత్యుండుగానఁ, దడవ నేనును వరదానకాలమునఁ
గాన రావణుని సంగరభూమియందు, మానవు లోర్తురు మనుజలోకమున
జనియింపఁ బ్రార్థింపఁ జను నాదివిష్ణు, వనజనాభుని లోకవంద్యు ముకుందు
ననవుడు సురమును లట్ల కావింప, ననఘుండు హరి మర్త్యుఁ డై పుట్టెఁ బుడమి
నని చెప్పి నారదుం డరిగె నై తేశ, దినకరకులుఁ డాదిదేవుండుగాని
మనుజుండు గాఁడు రామక్షితీశ్వరుఁడు, జనకనందన నిచ్చి శరణము వేఁడు
వనచరులెల్ల దేవతలుగాఁ దలఁపు, దను జేశ నామాట తథ్యంబు నమ్ము
అనినమాటలు విని యద్దశాననుఁడు, తనలోన నధికసంతాపాగ్నిఁ గుంది
యొకకొంతవడి యూరకుండి నిట్టూర్పు, ప్రకటంబుగాఁ బుచ్చి బహుచింతతోడ
వెఱచియు వెఱవని విధమున నప్పు, డఱిముఱి కోపించి యనుజస్తుఁ జూచి

రావణుఁడు కుంభకర్ణుని దిరస్కరించుట.

సొలవక యెపుడు విష్ణుఁడు విష్ణుఁ డనుచుఁ, బలికెదు నీకింత భయమేల పుట్టె
విష్ణువై యుండిన వెఱవను నేను, విష్ణుండు మానవవేషుఁడై యున్న
వెఱతునే నన్నేల వెఱపించె దిట్లు, వెఱచెదేనియు నీవు వెఱతుగా కింక
నారాఘవుఁడు విష్ణుఁ డగుఁగాక యేమి, యారామునకుఁ దమ్ముఁ డైనసౌమిత్రి
యారయ శర్వుండె యగుఁగాక యేమి,యారవిసుతుఁ డింద్రుఁ డగుఁగాక యేమి
సురల యై యుండంగ సొరిది నే వెఱవ, నిరవొంద వీరికి నేనేల వెఱతు
నెఱయంగ నీవెల్ల నీతిశాస్త్రములు, నెఱుఁగుట నిష్ఫలం బిటు విచారింప
నతివిరోధముగొన్న యారామతోడ, నతిహీనమైత్రికి నాసచేసెదవు
సమరోర్వి మనలను సమయింప మునుల, నమరుల రక్షింప నటు విచారించి
యంచితదేవత్వ మటు మాని వచ్చి, వంచన నిట మానవత్వంబునొంది
జగదేకరక్షకై సరసిజోదరుఁడు, జగతిపై రాముఁడై జనియించినాఁడు
వైరంబుగొని మనవధకొఱకైన, నారామతో సంధి యది యేల పొసఁగు
వాలి దూలఁగఁబోయి వానరాశ్రితుని, నీసమయంబున నేమని కాంతు
బలిజన్ముననకు నీపంకజోదరుఁడు, పొలుచు వామనమూర్తి బొంది తా నరిగి
ధరణి మూఁడడుగులు దానంబు వేఁడి, యరుదారఁ గొని యప్పు డతని బంధించె
నొప్పార నుపకార మొనరించునతని, కప్పుడె కావించె నపకార మితఁడు
పగఁగొన్నమనలను బరిమార్ప కేల, మగుడ నెక్కడి సంధి మనకు రామునకు
నేను నీవును గూడి యింద్రలోకంబు, పైనెత్తి చని భుజాబలము లింపార
నిబిడవిక్రములైన నిర్జరేంద్రాది, విబుధులఁ దోల నావిష్ణుఁ డెందరిగె
నిను మేలుకొల్పుట నీతి నీచేత, వినఁ గోరిమే నీకు వెఱపేల పుట్టెఁ

బ్రాణభయంబునఁ బలుమాటలేల, ప్రాణంబు తీపైన బ్రదుకు నెమ్మదిని
ఘనమైన యాయువుఁ గరమర్ది గంటి, మునుమిడి గెలిచితి మూఁడులోకముల
ననుభవించితిఁ బెక్కు లగురాజ్యసుఖము, లనుపమం బగుతేజ మంతంత కెసఁగ
నతిహీనవిక్రముఁ డైనరామునకు, నితరులగతి నింక నే మ్రొక్కఁజాలఁ
బోరికిఁ జనుమన్నఁ బోనోప కీవు, వారక యూడెదు వక్రోక్తు లిట్లు
నిద్రవోవఁగఁ బొమ్ము నెమ్మది నీవు, నిద్రనోయెడివాని నిర్జింప రరులు
రామలక్ష్మణులను రవితనూభవుని, భీమవిక్రములైన బిరుదువానరుల
నేనె చంపెదఁ బేర్చి యెల్లదేవతల, నేనె చంపెద విష్ణు నేనె చంపెదను
నోలి నవ్విష్ణుని యొద్దిశూరులను, నాలంబులోపల నధికదర్పమున
నెద్దెసఁ గదిసిన నేనె చంపెదను, బెద్దకాలము నీవు పిఱికివై మనుము
అని పల్కి వెండియు నద్దశాననుఁడు, గనుఁగొని యాకుంభకర్ణుతో ననియెఁ
జెలువారఁగా నిటు సీతయై లక్ష్మి, యిలకు జనించుట యేనెఱుంగుదును
అరయఁగ రఘురాముఁ డావిష్ణుఁ డగుటఁ, బరికించి యెఱుఁగుదు భావంబులోన
వలనొప్ప దేవతల్ వానరు లగుచు, నిలమీఁద జన్మించు టేనెఱుంగుదును
రాముచే మరణంబు రణములో నాకు, నీమెయి సిద్ధించు టేనెఱుంగుదును
నెలమిఁ గామంబున నే సీతఁ దేను, బలిమిఁ గ్రోధంబునఁ బట్టి యేఁదేనుఁ
రణములోపల రఘురాముచే నీల్గి, ప్రణుతింప విష్ణుని పరమపదంబు
దక్కఁక పొందంగఁ దలఁచియే సీత, నిక్కంబు దెచ్చితి నింకేల దాప
నని పెక్కుభంగుల నాడు రావణునిఁ, గనుఁగొని యాకుంభకర్ణుఁ డిట్లనియె
నే నీకుఁ గలుగంగ నేల తూలెదవు, దానవనాథ మోదంబున నుండు
పగయడంచెద నని పలికి యాస్థాన, మొగినంతయును జూచి యుచితవాక్యముల
నేఁ డిందులో లేఁడు నిర్మలాచారుఁ, డేడి విభీషణుం డింద్రారి యనుడు
మనమీఁద రామలక్ష్మణు లెత్తివచ్చి, రనువార్త విని సభ నందఱుఁ గూడి
యాలోచనను సేయ నంతలో నీవు, వాలిన నిద్రవో వడి నేగుటయును
నిష్ఠతో రఘురాముని కిఁగాఁగఁ బెద్ద, నిష్ఠుర మతఁడు నానెరినాట నాఁడె
నాడినఁ దన్నితి నావిభీషణునిఁ, గూడదు నాకని కోపంబువేర్మిఁ
దన్ని యంతటఁ బోక తాలిమి దక్కి, యున్న జంపుదు నని యోటలే కంటి
ననవుడు ననుఁ బాసి యారామకడకుఁ, జని యిప్పుడావిభీషణుఁ డున్న వాఁడు
అని చెప్పుటయుఁ గార్య మది తుదముట్టె, ననికిఁ బోవుట యుక్తమని విచారించి
యింకఁ బోరాదని యింద్రారియెదుట, నంకకాఁడును బోలె నతఁ డిచ్చె బాస
కిట్టి భంజించెదఁ గీనాశునైనఁ, బట్టి మర్దించెదఁ బద్మజునయిన
జిఱుజిఱుఁ ద్రిప్పెద శేషునినయిన, వెఱఁగందఁజేసెద విహగేంద్రునయిన
బలువిడి మ్రింగెదఁ బ్రళయాగ్నినైనఁ, జలమునఁ గ్రోలెద జలనిధినైన
నేపారఁ ద్రోలెద నే విష్ణునైన, రూపఱుఁజేసెద రుద్రునినైనఁ
గడఁగి ఖండించెదఁ గాలునినైన, మెడ నుల్చివైచెద మృత్యువునైన

వడిచెడఁ జేసెద వరుణునినైనఁ, గడుపు చించెద నలకాపతినైనఁ
బిడికిలించెద రవిబింబంబునైనఁ, బడఁద్రోచి వచ్చెద బ్రహ్మాండమయినఁ
గోఁతులఁ బట్టి మ్రింగుదు ననుఁజెల్ల, లేఁత నాసమరకేళీసముద్ధతికి
నామర్కటులనెల్ల నద్రుల కనిచి, యామనుజులఁ ద్రుంతు ననురాధినాథ
నీమనం బలరంగ నెమ్మది నుండు, రాముఁడు నాచేత రణములోఁ బడిన
సీత యనాథయై చిక్కు నంతటను, సీతలంచినకోర్కి నీకు సిద్ధించు
ననిన మహోదరం డావాక్యములకు, ఘనభుజుం డగుకుంభకర్ణుతో ననియె
సత్కులంబున నీవు జనియించినాఁడ, వుత్కటం బగుకార్య ముచితమే నీకుఁ
దగ నయానయములు దలపోయ కిట్లు, పగతుఁ జంపెద నని పలుకునే ఘనుఁడు
కోపంబు దీపింప ఘోరసింహంపు, లీపున నున్నవాఁ డెసఁగు తేజమునఁ
గేవల మానవాకృతి గాఁడు రాముఁ, డావిష్ణుఁ డీరూపమై వచ్చినాఁడు
ఆవాలి నొకకోల నడఁచిన శూరుఁ, డావీరవరుఁ గెల్వ నలవియే నీకుఁ
బ్రకటవిక్రముఁ డైనభగవానిమీఁదఁ, నొకడ పోవ్రుట నాకు నొడఁబాటుగాదు
బలముతోఁ జని మహాబలుఁ డైనరాము, గెలువు మీవని దశగ్రీవుతో ననియె
నేము గల్గఁగ నీకు నేల చింతింప, నీమనోరథసిద్ధి నెఱపంగ లేమె
జానకికొఱకు విచార మేమిటికి, నేను సంపాతియు నీద్విజిహ్వుండు
గంభీరవిక్రమకలితబాహుండు, కుంభకర్ణునిఁ గూడికొని పోయి రాము
నెలమి గెల్చితి మేని నేయుపాయమున, వలనొప్ప సిద్ధించు వైదేహి నీకు
నటుకాక రామనామాంకితబాణ,చటులోగ్రపాతంబు నైరింపలేక
వడి భిన్నతనులమై వచ్చితి మేని, నడరంగ నేము నీయడుగుల కెరఁగి
ప్రణుతోగ్రవానరబలముతోఁ గూడ, రణభూమిలోపల రామలక్ష్మణుల
వధియించి భక్షించి వచ్చితి మనుచు, నధిప చెప్పిన మమ్ము నధికమోదమున
నాలింగనముచేసి యర్థి మన్నించి, పోలంగ నీవార్త పురములోనెల్ల
నీవు సాటించిన నిజముగా సీత, భావించి యటమీఁదఁ బతియాస విడిచి
మతిఁ బూని నీమాట మఱినేయుననిన, నతనిఁ గోపించి యయ్యమరారిఁ జూచి
యీబొంకు లగుమాటలెల్ల నేమిటికి, నాబాహుబలమేచి ననుఁ జూతుగాక
నిశ్చయంబుగ రాము నిర్జింతుఁ బోర, నిశ్చింతమనసుండు నీవిటమీఁద
నని కుంభకర్ణుఁ డుదగ్రుఁడై వలుక, విని రావణుఁడు గడువేడ్క దీపింపఁ
దనకుఁ బునర్జన్మసిద్ధి గలిగె, ననిచాల మోదించి యనుజన్ముఁ జూచి
చని యాజి రామలక్ష్మణుల నిర్జింతు, వని నమ్మినాఁడ నీయతులసత్వంబు
శౌర్యంబునందు నీసరియైన వీర,వర్యులు లేరు ధ్రువం బివ్విధంబు
మునుకొని శూలంబు మొదలుగాఁగలుగు, ఘనతరాయుధములఁ గయ్యంబుసేయు
మని ప్రీతిరెట్టింప నతనికి నిచ్చె, ననుపమరత్నమయాభరణములు
నారావణునితమ్ముఁ డాభూషణములు, వారక దాల్చి ప్రజ్వలితాంగుఁ డగుచుఁ
దనరారు పసిఁడికత్తళ మొప్పఁ దొడిగి, వినుతసంఖ్యంబుదావృతగిరివోలె

బహురత్న మేఖలాబద్ధుఁడై యొప్పె, నహిరాజబద్ధమంథాద్రిచందమున
నొప్పి రణోత్సాహ ముప్పొంగి పొంగి, యప్పుడు చనుదెంచి యసురపుంగవుఁడు
త్రిజగద్భయంకరదీప్తమై పర్వ, విజయసూచకభేరి ప్రేయంగఁ బనిచె

కుంభకర్ణుఁడు యుద్ధమునకు వెడలుట.

శూలిశూలముకంటె సొంపారి మొనల, వ్రాలినమంట లుజ్జ్వలములై నిగుడ
నిప్పులు చెదర మానితమైనపూజ, నొప్పి రత్నప్రభ నుజ్జ్వలం బగుచుఁ
బ్రతివీరశోణితభంజితంబైన, యతులశూలముఁ బట్టి యన్నకు మ్రొక్కి
యతనిదీవనలతో నాసభాంతరము, వితతసముద్యోగవేగుఁడై వెడలె
నీకష్టతనువులో నేమేల నిలుతు, మోకుంభకర్ణ రణోర్వర దీని
వైతువు రమ్మని వానిప్రాణంబు, లాతతగతి నీడ్వ నరుగుచందమున
నంత రాక్షసకోటి యాకుంభకర్ణు, నంతంతఁ గూడి కయ్యంబున కరిగెఁ
దురగంబు లెక్కి సింధురములనెక్కి, యరదంబు లెక్కి సింహంబుల నెక్కి
కాటుకకొండలగతిఁ దనరారి, మేటిదంష్ట్రంబుల మెఱుఁగులు చెదరఁ
గౌర్యమంతయుఁ గూర్చి కరులిడ్డకరణి, శౌర్యంబు రూపులై చరియించుభంగిఁ
గయ్యంబుసేతయే కార్యంబుగాఁగ, నయ్యయి తెఱఁగుల నాటోపమొప్పఁ
బరిఘపట్టసగదాప్రాసకోదండ, కరవాలకుంతముద్గరభిండివాల
పరశుచక్రాయుధపటుసాధనములు, పరఁగఁ బదాతి యుద్భటవృత్తి నడిచె
నీచందమునఁ గూడి యెల్లసైన్యములు, వేచనుదేర గర్వితచిత్తుఁ డగుచుఁ
బురకామినీతతి పుష్పవర్షములు, గురియ రణోద్యోగి కుంభకర్ణుండు
చంద్రమండలనిభచ్ఛత్రంబు లొప్పఁ, జంద్రబింబాస్యలు చామర లిడఁగఁ
దురగహేషలును సింధురబృంహితములు, వరరథనేమినిస్వనపరంపరలు
పటుతరనిస్సాణభాంకారములును, పటహభేరీశంఖపణవరావములు
ఘంటామృదంగఢక్కారవంబులును, మింట దిక్కులఁ నిండి మిగుల మ్రోయఁగను
వెడలినయపుడు పృథ్వీభాగమగలె, జడధులు గలఁగె దిశావలి వగిలె
గగనంబు వడఁకె దిగ్గజములు మ్రగ్గె, జగములు బెగడొందె శైలంబు లురిలె
దార్ఢ్యమున దుష్టదానవ నీవు, పర్జన్యనేచిన ఫల మింకఁ గుడువు
మని రాఘవునకుఁ దోడై వచ్చి పేర్చి, తనరార వాని నదల్చినమాడ్కిఁ
గలయంగ నప్పుడు కాలమేఘములు, పలుమఱు బిడుగులు పరఁగించి మ్రోసెఁ
దోరంబుగా నార్చి త్రుళ్ళెడు వీడు, ఘోరాహవక్షోణిఁ గుపితుఁడైనట్టి
తారాధిపతిచేతఁ దారూపఱుటకు, నీరాజవరునిచే నిటఁ గూలుటకును
దారు సాఱులమని తగఁ జెప్పకరణిఁ, దారలు మండుచు ధరణిపైఁ బడియె
ఘోరాజిలో నతిక్రూరుఁడై యసుర, దారుణాకారత దర్పముప్పొంగ
తసు మున్ను నొంచినదానికి ననిలుఁ, డనయంబు రామునియానతి వీనిఁ
బడవైతునని వేర్చి ప్రబలినమాడ్కి, వడిగొని ప్రతికూలవాయువుల్ వీచె
రాముఁడు చంప నీరాక్షసాధముఁడు, నామీఁదఁ బడువేళ నాకెంత బలువు

పుట్టునో యని భీతిఁ బుట్టి కంపించు, నట్టిచందంబున నవని గంపించెఁ
బఱపాతులమని పరికింప వలదు, రాఱసాధమ నీవు రాఘవేశ్వరుని
ఖగములచేఁ జావఁ గలవనుకరణి, ఖగములు సుడివడఁగాఁ బొఱిఁ జొచ్చె
నివియెల్లఁ గొనక సాహసము రెట్టింప, సవరణ యుడుగ కుత్సాహంబు మిగులఁ
జూపులచేతనే చూర్ణం బొనర్తు, గోపించి వానరకులమెల్ల ననుచు
మేటియై వచ్చుచో మీఱి కన్గొనియెఁ, గోటయవ్వలి కపికోటులనెల్లఁ
గపులును నాకుంభకర్ణునిఁ జూచి, విపరీతమారుతవిధుల మేఘముల
కరణిఁ బొఱిఁగఁ గుంభకర్ణుండు లంక, యురువడి వెడల మిన్నొరలంగనార్చె
నాయార్పు విని వానరావలియెల్లఁ, బొయనిమూర్ఛలఁ బొల్పుడి రంత
శరధి గలంగె భూస్థలి గంపమొందె, సురలకుఁ గడుభీతి సొచ్చెఁ జిత్తముల
నంత వానరవీరు లంతలోఁ దెలిసి, యంతకాకృతిగల యాకుంభకర్ణఁ

వానరవీరులు కుంభకర్ణునితో యుద్ధము సేయుట.

గిట్టి పాదపములు గిరులు శృంగములు, పట్టి బెట్టుగ నెదుర్పడి ప్రేసి యార్చి
పొరిఁబొరిఁ బోరుచోఁ బోనీక కదిసి, తరుచరసేనపై దానవసేన
యురవడిఁ గలన నిట్లుభయసైన్యములుఁ, బీరవసంబున దలపడియె నావేళఁ
బ్రళయకాలమునాఁటి పటుసాగరములు, దలకొని యొండొంటిఁ దార్కొన్నకరణి
నొడలును నెమ్ములు నూరులు బరులు, పొడిపొడిగాఁ జేసి పోనీక మఱియుఁ
దవిలి ప్రేవులు మెడల్ దలలు ఫాలములు, నవియంగఁబెట్టు రథ్యములఁ ద్రొక్కించి
కడలగలించిన కత్తులచేతఁ, గడికండలుగఁ జేసి కట్టల్కతోడ
నంతఁ బోవక భూనభోంతరాళంబు, నంతయుఁ గడువాఁడియమ్ములఁ గప్పి
వడిఁబేర్చి రథములవార లిబ్బంగిఁ, గడిమిఁ జంపిరి మహోగ్రముగ వానరుల
వానరులును రథావళులనుఁ గిట్టి, పూనిచి వెనుకకుఁ బోవఁ దన్నియును
గడునొగలలమి దిగ్గన నేలతోడ, నడచియుఁ జఱచి యల్లంత వైచియును
భయదంబుగాఁ జొచ్చి పదియుగళములు, రయమునఁ జదియ సారథులఁ ద్రొక్కియును
పెళపెళ నరములు పెనచి రాఁదిగిచి, తల లురువడిఁ ద్రుంచి ధాత్రి వైచియును
రథికులై పేర్చిన రాఱసాధిపులఁ, బృథుగతిఁ జంపిరి పెక్కుచందముల
నది గని రాఱసు లధికరోషమున, వదలక వానరావలిఁ జుట్టు ముట్టి
మదము పెంపునఁ బలుమఱు కరిఘటల, పదములసన్నలఁ బైగదియించి
కడకాళు లొడిసి యుత్కర్షలై పట్టి, యెడపక నేలపై నెత్తి ప్రేసియును
మెదడును బునుకలు మేదినిఁ గలయఁ, బదములఁ ద్రొక్కించి భయదంబుగాఁగ
నోలిఁ జూర్ణంబులై యుర్వి నొండొండ, రాల నుగ్రప్రదరంబు లేసియును
కరులపైనున్న రాఱసు లెపుమీఱి, యురవడిఁ జంపి రత్యుగ్రతఁ గపులఁ
గపులు నుగ్రంబుగాఁ గవిసి యెంతయును, గుపితులై గజములకొమ్ములఁ బట్టి
కుదిచి రూపణఁచియుఁ గుంభస్థలములఁ, బదములఁ బరియలువారఁ దన్నియును
బలలంబు రక్తంబు బహుళాస్థిచయము, గలయఁ గాళ్లసు బట్టి కడఁక ప్రేసియును

నాయేనుఁగులమీఁద నలవుఁ జలంబు, వేయుభంగులఁ జూపి వేగ దానవులఁ
బట్టినవిండ్లును బాహువుల్తలలు, నట్టలు మరువులు నవనిఁ గూల్చియును
నసమునఁ గపులు గజారూఢులైన, యసురులఁ జంపి రత్యంతరౌద్రమునఁ
గూడి దట్టముచేసికొని దైత్యవరులు, వాఁడిమూఁకలను గ్రొవ్వాడరంగఁ గదిసి
పలుదెఱంగుల బాణపంక్తులేసియును, నలుఁగుల నెలకట్టియలను వ్రేసియును
సునిశితఖడ్గవిస్ఫురణశోభిల్ల, మొనసొచ్చి నవఖండములుగ వ్రేసియును
ఊక్కలులైన రాహుతు లేపుమీఱి, తక్కక చంపిరి తరుచరాధిపుల
గిరిచరవరులును గిట్టి యశ్వములఁ, గరముల దోఁకలు గాళ్లును బట్టి
దెసలకు వైచియు దివికి వైచియును, వసుమతి వైచియు వ్రచ్చి వైచియును
బదఘట్టనంబులఁ బగులఁ దూఁచియును, బదలక యామీఁదివారి వ్రచ్చియును
రాహుతులైన యారాక్షసాధిపుల, సాహసంబున నేలఁ జరిమిరి కడిమి
నప్పుడు రాక్షసు లధికదర్పమున, నిప్పులు కన్నుల నివ్వటిల్లంగ
నమ్ముల వేసియు నడరి కుంతములఁ, గ్రుమ్మియు సురియలఁ గ్రుచ్చి త్రోచియును
శితఖడ్గసమితివ్రేసియు ముద్గరముల, వితతచూర్ణములు గావించియు మఱియుఁ
గలయాయుధముల నుగ్రతలు సూపియును, శిలలఁ బాదపములఁ జెదరఁ ద్రోచి
కడిమిసొంపున నిట్లు కాల్వురఁ బట్టి, బెడిదంబుగాఁగఁ జంపిరి తరుచరులఁ [యును
దరుచరపతులు పదాతియై గదిసి, పొరిఁబొరి నాయుధంబులు విఱిచియును
నెట్టనఁ బదకరనికరంబు లలమి, చట్టలు వాపియుఁ జమరి వైచియును
ఇరుచేతులందును నిరువురఁ బట్టి, యురవడిఁ దాటించి యురులవైచియును
అట్టలు శిరములు నమరంగఁ బట్టి, దిట్టతనంబునఁ ద్రెంచివైచియును
నుడుగక చంపి రత్యుగ్రవేగమునఁ, గడిమి దీపింపఁ బెక్కండ్ర రాక్షసుల
నివ్విధంబునఁ బేర్చి యిరువాగుఁ బోర, నవ్వనచరులందు నసురులయందు
నిండినసైన్యము నీళ్లభంగియును, గండలు నిండు చెంగల్వలమాడ్కి
మానితాస్యములు తామరలచందమున, నానేత్రములు కుముదావళిపగిది
తోరంపుఁబ్రేవులు దూడులతెఱఁగు, వేరిన మెదడును ఫేనంబురీతి
మెండువెండ్రుకలు తుమ్మెదలపోలికయు, దండిశోస్త్రంబులు దరగలవడువు
చామరావళులు హంసంబుల యొప్పు, భూమిపరాగంబు పుప్పొడిక్రమము
గైకొని యప్పుడు సంగరమహీస్థలము, భీకరంబయ్యెను బెద్దయు నొప్పె
ననిమిషారులపాలి యామృత్యుదేవి, గానకొని వర్తించు కొలనిచందమునఁ
గానఁగదా యికఁ గాకుత్స్థరాము, డూనెడు జయలక్ష్మి కునికిపట్టయ్యె
సురఖేచరులు మెచ్చి సొంపారి రఘుడు, దురమున నిరువాగుఁ దొడరి పోరాడఁ
గపికోటి నొచ్చినఁ గడఁగి యందంద, కపినాయకులు చూచి కపటరాక్షసులఁ
గెరలి క్రోధంబున గిరిమహీజములఁ, దరమిడి నొప్పింప దానవుల్ బెదరి
కడువేగమునఁ గుంభకర్ణునివెనుక, నడఁగి పాఱిరి శరణనుపల్కు లెసఁగ
నాకుంభకర్ణుండు నద్దైత్యవరులఁ, జేకొని దిక్కులు చెదర నార్చుచును

నోడ కోడకుఁ డని యూరడింపుచును, గూడి వైవైవచ్చు కోతులనెల్లఁ
జూపులచేతనే చూర్ణింతు ననుచుఁ, గోపించి శూలంబు గొని పెచ్చుపెరిఁగి
బలితంపుఁ గపికోటిపాలింటివిధియొ, కలుషత నేతెంచు కాలుఁడో యనఁగ
రావణుతమ్ముఁడు రాక్షసాధీశుఁ, డావనచరకోటి నడఁగింపఁ జొచ్చెఁ
గఱకైన యాకుంభకర్ణునియందు, నెఱవైనకడిమికి నిలువక కపులు
వడి మూర్ఛనొంది యుర్వరఁ బడువారు, కడువడి నెత్తురుల్ గ్రక్కెడువారు
వాతూలగతి దివి వడిఁ బ్రాకువారు, నేతువుత్రోవనే చెడి పాఱువారు
నగవానరులఁ జూచి యంగదుం డేపి, తగనప్పు డతిబలోద్రగ్రుఁడై పలికె
నేల వానరులార యిటు చెడిపాఱి, నేలినపతి డింటి యేపు పోకార్చి
వరకపీంద్రులు మహావంశవర్ధనులు, కెరలి పాఱుదురె ప్రాకృతులచందమున
రామునిముందర రణములోఁ బడిన, రామణీయకసురరాజ్యంబు గలుగు
నటుగాక బ్రతికిన నతికీర్తి గలుగు, నిటు మగుడుఁడు పాఱి నేల మీకనుచు
బుద్ధులు సెప్పుచు పురికొల్పికొనుచు, గ్రద్దన మగుడించెఁ గపికోటినెల్ల
నాకపు లంగదునతులవాక్యములు, నైకొని యొప్ప నాకర్ణించి మించి
ప్రాణంబు లిత్తుము రామున కతని, ప్రాణంబుకన్న మాప్రాణ మేలనుచుఁ
గొండలు గొనితెచ్చి కోయని యార్చి, కొండఁబోలినదైత్యుఁ గొండల వైవ
శూలంబు గొని కడుఁ జూర్ణంబుచేసె, నాలోన రాక్షసుం డాపర్వతముల
వదలక యంతఁ బోవక రౌద్ర మెసఁగ, గద చేతఁగొని త్రిప్పి కడఁగి వ్రేయుటయుఁ
బదియేఁడుకోటు లేఁబదియేఁడులక్ష, లదనము పదివేలు నార్నూరుకపుల
హుంకారరవముల నుగ్రత మెఱసి, కింకతో నారణక్షితిమీఁదఁ గూల్చెఁ
జెలఁగి యంతటఁ బోక చేతులఁ గపుల, బలువిడి కబళించెఁ బటురౌద్ర మెసఁగ
గరుడుండు వడి నురగంబుల మ్రింగు,కరణి నెంతయు భయంకరవృత్తి దోఁప
వీక్షించి యిరువదివేవురు కపుల, నక్షణంబున మఱి యార్నూరుకపుల
లక్షించి యెనిమిదిలక్షల కపుల, రాక్షసాధీశుండు రయమున మ్రింగె
మ్రింగి యంతటికంఱె మిక్కుటం బగుచు, సంగరాంగణమునఁ జరియింపుచుండె
నరభోజనుండు వానరభోజనుండు, ధరణిపైఁ దానయై దర్పించుచుండ
ఘూర్ణిల్లుచును ముక్కుగోళ్లందునోటఁ, గర్ణరంధ్రంబులఁ గపిసేన వెడలె
నంత నాతనిగదాహతిఁ బడ్డకోతు, లెంతయుఁ దమమూర్ఛ లెల్లను దెలిసి
యార్పులతోఁ దరు లద్రులు దెచ్చి, దర్పించి నిలిచిరి దానపునెదురఁ
గనలుచు ద్వివిదుండు గండశైలంబు, గొని యపుడసురవక్షోవీథిఁ బగుల
నడరింప నది దాఁకి యంతట మిట్టి, పడియె రాత్రించరబలములు జడియ
నప్పుడు హనుమంతుఁ డధికరోషమున, నిప్పులు రాలెడు నేత్రంబు లొప్ప
గిరిపాదపము లెత్తి గిఱికొన వైవ, నురువడి దైత్యుఁ డత్యుగ్రశూలమునఁ
దుమురుసేయుచును బైఁదద్రోచి రామకీయ, నమరులు మెచ్చంగ నాంజనేయుండు
నసురపై వైచె మహాపర్వతంబు, నసమానబలుఁ డని యందఱుఁ బొగడ

దానిచే నాదైత్యుతనువు గంపించి, మేనెల్ల నెత్తురు మిక్కుటం బయ్యె
దాన నెంతయు నొచ్చి దానవేశ్వరుఁడు, మానక మెఱుఁగులు మంటలు గ్రమ్మ
భూతలం బగల నభోభాగ మద్రువ, భీతిల్లి నిర్జరబృందంబు దలఁకఁ
గరము గ్ర మైనట్టి ఘనతరశూల, మురువడిఁ బూని సముల్లాసి యగుచు
మడవక శక్తి కుమారుండు వేర్చి, వడిఁ గ్రౌంచగిరిమీఁద వైచినకరణి
హనుమంతుపై నెత్తి యతిరభసమున, వనచరుల్ బెదరంగ వైచె నయ్యసుర
నటు వైవ దాన నయ్యనిలజునురము, పటుపటుఁ బగుల నప్పావని యపుడు
ఉరుకోపరసమెల్ల సుమియుచందమున, దురములోఁ బడియె నెత్తురులు గ్రక్కుచును
బ్రళయకాలమునాఁటి పటుమేఘురవము, బలువున నెంతయుఁ బరగ రోఁజుచును
గపులు గంపింప రాక్షసులు మోదింపఁ, గపిశేఖరుఁడు గూలెఁ గలలావు దూలి
యాలంబులో నప్పు డనిలజుపాటు, నీలుఁడు గనుఁగొని నెరయు కోపమునఁ
నైకొని వైచె రాక్షసులెల్ల బెదర, నాకుంభకర్ణు మహాపర్వతమున
వడితోడఁ బైఁబడ వచ్చుపర్వతము, బెడిదంబుగా వాఁడు పిడికిటఁ బొడిచెఁ
బొడిచిన నదియు నద్భుతముగాఁ జెదరి, యెడపక చిఱుమంట లెగసి నుగ్గయ్యె
నమరారిపై నప్పు డాగ్రహవ్యగ్రు, లమితబలోద్ధగ్రు లై మహాకపులు
చలమున ఋషభుండు శరభుండుఁ బేర్చి, కలుషత నలుఁడును గంధమాదనుఁడు
నగ్గవాఱుండును నధికరోషంబు, లగ్గలింపఁగ నప్పు డడరి పెల్లార్చి
తరమిడి వానిపైఁ దరులు వైచియును, గిరులు వ్రేసియుఁ బిడికిళ్లఁ బొడ్చియును
బదములఁ దన్నియుఁ బటునఖప్రతతి, విదళించియును బహువిధముల నొంచి
యేచిన నన్నియు నింత గైకొనక, యేచి యద్దానవుం డెసఁగు రౌద్రమునఁ
బటుతరంబుగ నేలఁ బడి తన్నుకొనఁగఁ, జటులతఁ బిడికిట శరభునిఁ బొడిచె
నురువడి ఋషభుని నొడిసి రాఁదిగిచి, కరములఁ గొని ముద్దగాఁ గబళించెఁ
గుదికిలఁబడి తన్నుకొని గుండె లవియఁ, గదిసి యన్నీలు మోఁకాళ్లు దాటించె
నసమున నిగుడు గవాక్షునిఁ గిట్టి, యసురేశుఁ డఱచేత నదరంటనేసెఁ
గ్రమ్మిన తెగువమై గంధమాదనుని, బిమ్మిటిగొని వ్రేళ్లఁ బెడచేత వ్రేసె
రయమున రణరాగరసములు గ్రక్కు, క్రియ నెత్తురులు గ్రక్కి కెడసిరి కపులు
శూలంబు ద్రిప్పి యార్చుచు నట్టహాస,లోలుఁడై యాలంబులోఁ దిరుగుచును
వితతవజ్రాభీలవృత్తారిభంగి, నతులదండోద్దండయమునిచందమునఁ
గడుభయంకరవృత్తి గాఁగఁ బెల్లార్చి, ముడివడ నెమ్మొగంబున నిప్పు లురులఁ
బ్రళయకాలమునాఁటి పటుశూలరుచులఁ, దొలుకాడునాదిరుద్రుని తెఱంగునను
మెఱసెఁ బొమ్మసుమాట మిక్కిలిగాఁగ, నెఱవార నందఱ నిర్జించెఁగాన
నప్పుడు సుగ్రీవుఁ డనిసేయ నాకు, నిప్పుడు తఱియని యిచ్చుఁ జింతించి
కులశైలపతిమీఁదఁ గోపించివచ్చు, బలభేదిపగిది నప్రతిమసాహసుఁడు
పొరిఁబొరి సర్వాంగములు పెంచి పేర్చి, పరుషరోషానలప్రభ లుప్పతిల్లి
కొండలకెల్లను కొండయైనట్టి, కొండనా నొకపెద్ద కొండ చేపట్టి

కోతులు నెత్తుటఁ గొమరొప్పఁ దోఁగి, మూతియుఁ దనువును ముదకయై తోఁచి
వీక్షింప నరుదైన వేషంబుతోడ, రాక్షసాధీశుపై రయమున వచ్చి
నన్నె అుంగవె యేను నలినా స్తసుతుఁడ, సన్నుతుఁ డగు రామచంద్రునిబంట
నీకు నాకును గాక నిష్ఠురయుద్ధ, మీకపికోటుల నేల చంపెదవు
అని పేర్చి సుగ్రీవుఁ డాడువాక్యములు, విని కుంభకర్ణుండు విఫులరోషమున
సుగ్రీవ కడు నిన్ను శూరుండ వందు, రా గ్రహింతురె శూరు లనివెలిగాఁగ
శూరత రణమునఁ జూపుదుఁగాక, యూరక వెడమాట లొప్పునే నీకు
నన రాక్షసునిమీఁద నర్క-నందనుఁడు, కినిసి తాఁ దెచ్చిన గిరియెత్తి వైచె
వైచిన నది వానివక్షంబుఁ దాఁకి, చూచు నంతటిలోనఁ జూర్ణమై రాలె
నాబెట్టిదమునకు నార్చె నిర్వాగు, నాబల్లిదునిచేత నసుర స్రుక్కియును
దడయక యత్యంత ధైర్యంబుతోడఁ, గడుభయంకరవృత్తిగాఁగఁ బెల్లార్చి
దిగులొంది యగ్గచకాధిపులగుండియలు, వగులంగ నిలువునఁ బ్రాణములో వోవ
జగతీతలము నాకసంబు దిక్కు-లును, నగల రాక్షసుఁ డట్టహాసంబుచేసి
హుంకారరవమున నుగ్రత మెఱయఁ, గింకిణీఘంటికాఘీంకారరవము
వాసికెక్కిన యిరువదివేలతలలఁ, జేసి గంధాక్షతార్చితమూర్తి నొప్పు
శూలంబు నిర్జరాసురులకు నైనఁ, దాలుప వ్రేఁగైనదాని నక్షణమె
సుగ్రీవుమీఁద వైచుటయును శూల, ముగ్రంపుమంటల నుజ్జ్వలం బగుచు
నేలయు నింగియు నిఖలదిక్కు-లును, జాలంగ దరికొని సాగి మండుచును
బదివేలపిడుగులపగిది మ్రోయుచును, వదల కర్క-జుమీఁద వచ్చుటఁ జూచి
ఘనవిషజ్వాలోరగప్రభుఁ గిట్టి, వినతాత్మజుఁడు ద్రుంచు వెరపుదీపింప
నెడసొచ్చి హనుమంతుఁ డేపార నొడిసి, కడుఁబెక్కు-వ్రయ్యలుగాఁ ద్రుంచివైచి
కుప్పించి దాఁటి యొక్కుఁడు పేర్మి నార్చె, నప్పుడు వానరు లందఱుఁ బొగడ
శూలంబు విఱుచుటఁ జూచి కోపించి, యాలోన వేగ నయ్యసురేశ్వరుండు
కనలుచు వచ్చి లంకామలయాద్రి, ఘనశృంగ మెత్తి యర్క-జుమీఁద వైవ
నుగ్రమ్ముగా నది యురముఁ దాఁకుటయు, సుగ్రీవుఁ డవుడు రోజుచు నేలఁ బడియె

సుగ్రీవుఁడు కుంభకర్ణునిచే మూర్ఛనొందుట.

నాతఁడు పడుటకు నఖలరాక్షసులు, చేతోగతులయందుఁ జెలఁగి యార్వఁగను
గుంభకర్ణుం డతిక్రూరుఁడై వచ్చి, కుంభినిఁ బడియున్న గురుసత్త్వధనునిఁ
గనుఁగొని తలపోయఁ గపిబలంబునకు, నినకులేశ్వరునకు నీతండె లావు
ఈతఁడు పడుటచే నెల్లవానరుల, భూతలంబునఁ బడి పొలిసినయట్ల
సుగ్రీవు మాయన్న చూచుఁగా కసుచు,నుగ్రుఁడై కొనిపోయె నొనర లంకకును
గాలానిలము వచ్చి కాలమేఘమును, గూలించి గుహకును గొనిపోవుకరణి
నట సురావళియెల్ల నకట సుగ్రీవుఁ, డిటు పట్టువడిపోవునే యని వగవ
నక్కు-ంభకర్ణునియలవుఁ జలంబు, దక్కక యందంద దనుజులు వొగడ
వెనుకొని రవిసుతు విడిపింపలేక, వనచరు లాహారవంబులు నేయ

శరభుండుబుషభుండుజాంబవంతుండు, శరభుండుధూమ్రుండు(?)సోముండుహరియు
గిరిభేది సుతరుండు కేసరి పృథుండు, హరిరోముఁడును పావకాత్ముఁడు హరుఁడు
ద్వివిదుండు మైందుండు వేగవంతుండు, గవయుండు శతబలి గజుఁడు దుర్ధరుఁడు
సుముఖుండు తాలపాశుఁడు గవాక్షుండు, కుముదుఁడు జ్యోతిర్ముఖుఁడు సుషేణుండు
దధిముఖుఁడును వేగదర్శి రంభుండు, గ్రధనుండు ధూమ్రుండు గంధమాదనుఁడు
తారుండు క్రోధనతపనప్రజంఘు, ఘోరాక్షజంఘులగోముఖవిముఖ
పనససన్నాద సంపాతీంద్రజాల, విసుత సుదంష్ట్రక శ్వేతదుర్ముఖులు
వీరాదిగాఁగల వీరవానరులు, దారుణాకారు లుద్యగ్రవిక్రములు
ధారణీధరములు తరువులుఁ గొనుచు, నారూఢభుజసత్త్వులై మింటి కెగసి
యట్టహాసంబుల నార్పుల దిక్కు, లట్టిట్టుగాఁగ బ్రహ్మాండంబు వగుల
నినసుతు విడిపింత మెత్తైన ననుచు, దనుజునిపైఁబడఁ దమకించునపుడు
కరమెత్తి వలదని కపివలి సుతుఁడు, వరనీతిమతిగాన వారి కిట్లనియె
భానుతనూజుఁ డుద్భటశౌరవర్యుఁ, డూనినమూర్ఖుచే నున్నాఁడుగాని
యామూర్ఖుఁబాసిన నాత్మలోఁ దెలిసి, యామహాత్ముఁడు వచ్చునటుగాన మనము
విడువని యసురచే విడుపించుకొన్నఁ, గడులాఘవంబునఁ గపికులేశ్వరుఁడు
మదిలోన నెప్పుడు మఱుగుచునుండు, నిది విచారము కాదు యించుక సైఁచుఁ
డటుచూడ నీలోన నతఁడు రాకున్నఁ, గుటిలంపురావణకుంభకర్ణులను
జటులవిక్రములైన సకలరాక్షసులఁ, బటుముష్టినిహతుల భగ్నంబుచేసి
హాటకదీప్తుల నలరెడు నేడు,కోటలు లంకయుఁ గూలంగఁ దన్ని
ప్రళయంబు నొందించి భానుజుఁగూడి, చలము కోపముమీఱఁ జనుదెంతమెలమి
నని యిటు హనుమంతుఁ డాడువాక్యముల, మనముల నలరి యామర్క-టేశ్వరులు
వినువీధి నత్యంతవేగులై దనుజు, వెనుకొనిపోవ నావిధ మెఱుంగకయ
అటఁ గుంభకర్ణుండు నర్క-జుఁ గొనుచుఁ, బటురయంబునఁ జొచ్చె బలియుఁడై లంక
రాజమార్గంబుల రామేడలందు, రాజిల్లు నాగోపురంబులయందు

సుగ్రీవుడు మూర్ఛచేసి కుంభకర్ణుని విరూపునిగాఁ జేయుట.

నొప్పెడిపుర కాంత లొగిఁ బుష్పవృష్టి, యప్పుడు కురియంగ నర్క-నందనుఁడు
దెలిసి యాపురవీథిఁ దెరగొని చూచి, వెలవెలనై కడు వెఱఁగంది కుంది
యిటు పట్టువడితినే యీదైత్యచేత, బటుతరమూర్ఛచేఁ బడి యింతతడవు
అని కరములఁ బట్టి యాదైత్యచెవులు, పెనచి తమ్మెలతోడఁ బెఱికికాఁ దిగిచి
బొటములతో ముక్కు-బోసి పోఁ గఱచి, పటుగతి మీఁదికి భానుజుం డెగయ
నిమ్ములఁ బోనీక నేచి రాక్షసుఁడు, క్రమ్మఱ నాతని కాళ్లొగిఁ బట్టి
నేలతో నేసిన నెగసి సుగ్రీవుఁ, డేలినపతికడ కేగె నయ్యెడను
సురలాకసంబునఁ జోద్యంబునొందఁ, దరుచరపతులెల్లఁ దనుఁ జూచి మ్రొక్క-
వారును దానును వచ్చి సుగ్రీవుఁ, డారామచంద్రునియడుగుల కెరఁగ
నాలింగనముచేసె నంత రాఘవుఁడు, నాలోనఁ గపులెల్ల నానందమంది

రాయసురేశ్వరుం డటు ముక్కుఁజెవులు, వోయిన నెంతయు బుద్ధిలో రోసి
మునుపు చెలియలి బన్నమునకు నైయాత్మ, నెనసినసిగ్గులు నెగ్గొనరింప
వనజా ప్తకులునితో వలవనివైర,మున మగఁటిమితోడఁ బోరాడుచున్న
నాకారికడకు మానము గోలుపోయి, యీకష్టతనువుతో నేమని పోదుఁ
బోరికి నుచితంబు జోవుట యనుచు, నార క్తపూరంబు లందందఁ గ్రమ్మి
తనువులనిండ నుద్దండవ ర్తసుఁడు, ఘనతరరోషంబు గడలుకొనంగఁ
జేవురుచాయల నెలయేఱు లమరఁ, గావచ్చు నీలాద్రికైవడిఁ దోఁప
నటుగాక వీఁడు యుగాంతంబునాఁటి, చటులాగ్ని యన రణస్థలికి నేతెంచి
యఱిముఱిఁ గోపించి యగచరసేనఁ, దఱిమి దానవుఁ డత్యుదగ్రుండై మెఱసి
కడు నుగ్రముగఁ గడకాల్లొగిఁ బట్టి, వడిఁ, ద్రిప్పి త్రిప్పి యుర్వర వ్రేసి వ్రేసి
బిఱబిఱఁ బ్రేవులు పిడికిటితోనఁ, బెఱికిరాఁ గొందఱఁ బిడికిళ్లఁ బొడిచి
నిబ్బరంబుగ దాచి నెరయ గుండియలు, ద్రొబ్బలు నురకంగఁ ద్రొక్కి పాదములఁ
బిడుగులఁబోలెడు పెడచేతు లెత్తి, కడు నుగ్రముగ మన్నుఁ గఱువంగనేసి
తనమీఁదఁ బ్రాకిన తరుచరావళుల, విన విస్మయంబుగా వె నిగ్రహించి
యగపడ్డరాక్షసునైనను బట్టి, తిరిచి వేగమునఁ గుత్తికలోన వైచు
ఝుంకారరవముల శవములునేఁయు, హుంకారరవముల సురులు వెఱుకు
దివిజవిమానముల్ దిరుగుడుపడఁగఁ, దివిచి మర్కటులమీఁదికి నెత్తివైచు
నెగసినకపులతో నేటుదాఁకంగ, నగచరావళిఁ బట్టి యందంద వైచు
నెమ్ములు నురుముగా నేపారఁ ద్రిప్పి, యిమ్ములఁ గొందఱ నెడగల్ల వైచుఁ
గొందఱ నిరుగేలఁ గుదియంగఁ బట్టి, యందందఁ దాటించి యల్లంత వైచు
నీవానరులఁ జూడుఁ డేర్పడ ననుచు, లావునఁ గొందఱ లంకలో వైచుఁ
బెంపార నినుగట్టి పేర్చినకపుల, ముంపుమీ యని యబ్ధి మునుఁగంగ వైచు
నివ్విధంబున దానవేశ్వరుం డెలమి, నవ్వానరుల దిక్కులందెల్ల వైచు
మేదినియందును మిన్నులయందు, నేదిక్కులందును నెడములేకుండఁ
బడిఁజచ్చు కపులును బడిదొర్లు కపులు, బడికూఁత లిడుకపుల్ భ్రమనొందు కపులుఁ
బడి తన్నుకొనుకపుల్ పడి రోఁజుకపులు, పడియున్నకపులును బడియెడుకపులు
నై రణస్థలియెల్ల నగచరాక్రోశ, మారాక్షసునిచేత నగ్గలంబయ్యె
నాకుంభకర్ణుని యత్యుగ్రభీష,ణాకృతి కాలాంతకాకృతియైన
నణఁగెఁ దారాపతి యణఁగె నంగదుఁడు,నణఁగె గవాక్షుఁ డున్నతిఁ దక్కి గజుఁడు
చలియించె ఋషభుండు శంకించె నలుఁడు, వెలుకురె నీలుండు బెగ్గిలె బృథుఁడు
వెఱఁగందె శరభుండు వెఱచె ధూమ్రుండు, నురుకంపమును బొందె నొగిఁ బనసుండు
కడుభీతి నొందెను గంధమాదనుఁడు, నడరి చూచుచునుండె ననిలనందనుఁడు
చూడ భయం బొందె జ్యోతిర్ముఖుండు, జాడ చేకొనిపాతె జాంబవంతుండు
ఉలికిరి వెండియు నున్నవానరులు, కలయ నంతటఁ గుంభకర్ణునిఁ జూచి
ఘనబాహుబలుఁడు లక్ష్మణుఁడు గోపించి, చనుమర నాటించి శరము లేడింటి

మఱియుఁ బెక్కింట లక్ష్మణదేవుఁ డేయఁ, గఱుకురాక్షసుఁడు లక్ష్మణుని గైకొనక
బలువిడిరాఁగ నాపాదమస్తకము, లలమి ప్రాకిరి కపు లాదైత్యమేన
నలిగి మీసములు నుయ్యాల లూఁగుచును, కలుషతఁ దోఁకలఁ గలయఁ జుట్టుచును
నఱిముఱిఁ గవిసి యన్యోన్యసంధులందు, వఱులంగ లాగులు వైచి హత్తుచును
జిందఱవందఱ చేసిన నసుర, డెందంబులోని కడిందికోపమున
పటుసత్త్వులై తనపైనున్నకపులఁ, జటులమత్తేభంబు జాడించుకరణి
జలకేళిఁ దనిసిన సమదసూకరము, వెలయ బిందులు రాల విద్రిచినభంగిఁ
బ్రళయకాలమునాఁటి బ్రహ్మాండతలము, డులడుల చుక్కల డుల్చుకైవడిని
దనమీఁదఁ బ్రాకిన తరుచరావళులఁ, దనువు గదల్చి యద్ధరణిపైఁ గూల్చె
నప్పుడు విస్మితుండై కుంభకర్ణుఁ, దప్పకఁ గనుఁ గొని తనకన్నుగవల
నిప్పులు రాలంగ నిగిడి కోపమున, నప్పన్న గాధీశునాకృతి గలిగి
కరమొప్ప కాంచనకార్ముకం బెత్తి, నిరుపమబాణతూణీరము ల్బిగిచి
భీమవిక్రమకళాభేద్యుఁడై కనలి, రాముండు నడుచు సంరంభంబుఁ జూచి
సమరమహారంభచతురు లొండొండఁ, దమకంబు నిండ నుద్దండవర్తనులు
పరుషాద్రిపాషాణపాదపావళులు, ధరియించి యుగ్రులై తరుచరాధిపులు
నొగి సప్తపాతాళములును భేదిల్ల, నొగిఁ గూర్మ మగలఁగ నుదధులు గలఁగ
దిగిభంబు లడరంగ దివి తల్లడిల్ల, నగచరాధీశుల కతిధైర్య మొదవ
నదిమి కుప్పించి మిన్నగలఁ బెల్లెగసి, యుదితవిక్రములు మహోగ్రభీకరులు
సురసిద్ధసాధ్యులు సొరిదిఁ గీర్తింపఁ, గరిమర్థి నడువ రాక్షసుఁ డెదుఱేఁగె
నాపతి ముందట నావిభీషణుఁడు, కోపంబుతో గదఁ గొని శౌర్యమునను
గడువేగమునఁ గుంభకర్ణునిమ్రోలఁ, బుడమి చలింప నప్పుడు వచ్చి నిలిచె
నావిభీషణుఁ జూచి యనియె నవ్వుచును, రావణుతమ్ముఁడ రాక్షసేశ్వరుఁడ
వను విభీషణ నీదు విక్రమంబునకు, ననువైనతఱి యిది యధిపతియొద్ద
నిన్నరనాథునిహృదయంబె పట్టు, మన్నదమ్ములపాడి యని స్రుక్కవలదు
పూని యెన్నఁడు నిన్నుఁ బొంద వాపదలు, భానువంశ్యునికృపఁ బడసితిగాక
నారాముదయగల దటుమీఁద నీవు, సారదయోదయశ్లాఘ్యచిత్తుఁడవు
లంక సద్గుణగణాలంకృతి నేల, నింక నెవ్వరు గల రిట నీవె కాక
సాహసబలమహోత్సాహంబు మిగిలి, యూహావంబున వేగ మడరి నాయెదుట
మగతనంబును బాడి మనసునఁ దలఁచి, తగ నీవు నాతోడఁ దాకుమటంచుఁ
బలికితిగాని యీపట్టున నిలువ, వల దొక్కఁడైనను వలయు వంశమున
ననిన విభీషణుం డన్నతో ననియె, దనుజకులంబెల్ల దగ్ధమైపోవు

విభీషణుఁడు కుంభకర్ణునికి నీతిఁ జెప్పుట.

ననుభయంబున మనయన్నతోఁ దెలియ, ఘనమైన నీతిప్రకారంబు లెల్లఁ
జెప్పితి నేను నేర్చినయంతవట్టు, చెప్పిన నామాటఁ జేకొనఁడయ్యె
నటుఁగాన నిన్నును నన్నును బాసి, యిటు వచ్చి శ్రీరాము నేఁ బొడగంటి

నని చెప్పుచును దనయంతరంగమున, దనుజేశునవినీతిఁ దలపోసి పోసి
కన్నీరు దొరఁగంగఁ గడుదుఃఖమంది, యన్నఁ జూడఁగ లేక యవ్వలఁ దొలఁగె
నారాఘవేశ్వరుఁ డనుజన్మయుక్తుఁ, డై రణోద్యోగుఁడై హరులతోఁ గూడ
ఘనరౌద్రరసమురాక్షసరూపుఁ దాల్చి, యనికి నేతెంచెనో యనఁదగువానిఁ
జారుకోటీరభూషణములవాని, వీరరసావేశ వేషంబువాని
ధీరుఁడై కపులను దెగఁజూచువానిఁ, దోరంపునెత్తుటఁ దోఁగినవాని
కనుఁగొని మదిలోనఁ గడువెఱఁగంది, మనుకులో త్తముఁడు రామక్షితీశ్వరుఁడు
నారికై పుట్టిన నాకోపమెల్ల, నారిచేఁ జూపెద నాకారి కనుచు
నార్చుచువచ్చు నయ్యసురకోపాగ్ని, నార్పెదశరవృష్టి నని బిట్టుఁ గవిసి
కడియాన నిజధర్మగతిఁ జెందుననెడు, కరణి దిక్కరులు ఘీంకారములీయ
నింక నీఱుగఁజేయు నీరామునలుక, లంకేశు నసుమూడ్కి లంక ఘూర్ణిల్ల
నెరయంగ జగములన్నియుఁ జెవుడ్పడఁగ, గురిలేనిరవముగా గుణము మ్రోయించె
నాగుణధ్వని విని యలుకమై నెదురు,గా గర్వమునఁ గుంభకర్ణుండు రాఁగ
మానైన దర్పంపుమాట లింపార, వానితో ననియె నావనజాప్తకులుఁడు
ఏరరాక్షస నీకు నెదురంగరాదు, ధీరుఁడవై యింకఁ దెగువ వాటించి
యమరులు మెచ్చంగ నమరి నాయెదుట, సమరంబు సేయంగఁ జక్కఁగా నిలువు
మటుఁగాక కపటుండవై మాయఁబన్ని, యెటుపోయినను నిన్ను నేల పోనిత్తుఁ
గావవే యని పోయి కమలజుఁగన్నఁ, గావ నాబ్రహ్మలోకము నాకు నెదురె
కావవే యని పోయి కఱకంఠుఁగన్నఁ, గావ నారుద్రలోకము నాకు నెదురె
కావవే యని వేర్చి కమలాక్షుఁగన్న, గావ నావిష్ణులోకము నాకు నెదురె
యని వేర్చిపలికిన నారామునలుకు, విని కుంభకర్ణుండు విపులంబుగాఁగ
దిగులొంది యగచరాధిపులగుండియలు, వగిలి నిల్వులతోడ బ్రాణములోవ
జగతీతలము నాకసముదిక్కులెల్ల, నగల రాక్షసుఁ డట్టహాసంబుచేసి
నలువొంద నారామనరనాథుఁ జూచి, పలికె నుద్భటరణప్రౌఢి దీపింప
వెడఁగుమాయల వన్ని వెఱచి నీచేత, మడియంగ నేనల్ల మారీచి గాను
రయమున నీచేత రఘురామచంద్ర, భయమునఁ జావఁ గబంధుండఁ గాను
గ్రమమొప్ప నీశరఘట్టనచేత, రమణమై గూల విరాధుండఁ గాను
అనిమొన నొకకోల నవనిపైఁ గూల, నినకులాధీశ్వర యే వాలిఁ గాను
చేతివిల్లిచ్చి నీచే భంగమొందఁ, బూతాత్ముఁ డగుబుషిపుత్రుండఁ గాను
రావణుతమ్ముఁడ రాక్షసేశ్వరుఁడ, దేవకంటకుఁడను దీప్తవిక్రముఁడ
నన్నెఱుంగవె రామ నగచరకోటి, క్రొన్నెత్తురానిన కుంభకర్ణుఁడను
యెఱుఁగక బ్రహ్మయ నింద్రుండు నిన్నుఁ, గఱపిన బేలవై గర్వించి పుట్టి
యీతరుచరు నమ్మి యినకులేశ్వరుఁడ, నాతోడియుద్ధంబునకు వచ్చితీవు
ఘనమైన పరుషరాక్షసభాషణములు, సనకాదియోగీంద్రసన్నుతుల్ గావు
ఉరవడిఁ బఱతెంచు నుగ్రదానవులు, పరిచారికామరప్రతతులుగావు

చలమున నార్చు రాక్షసభటో త్తములు, నలిఁబాడు తుంబురునారదుల్ గారు
వ్రాలుచు నీమీఁద వచ్చునాగాలి, యాలవట్టంబుల యనిలంబుగాదు
యుద్ధరంగం బమృతోదధిగాదు, యుద్ధంబు మఱికొలువుండుటగాదు
ఇట్టేల పుట్టితి వియ్యాజిలోన, నట్టిసౌఖ్యంబు నీకవనీశ కలదె
యది చెప్పనేల నిన్ననియెడిదేమి, యిదెచూడు నాగద యెట్టిదో రామ
దీనఁబో గెలిచితి దేవసంఘముల, దీనికి సాటియె దివ్యాయుధములు
బలమును శౌర్యంబు బాహువిక్రమము, గలదేని ఘోరాజిగదియుము నన్ను
నెఱయ నీయందలి నిజశక్తిఁ జూచి, మఱి నిన్నుఁ జంపెద మానవాధీశ

శ్రీరామునిచేఁ గుంభకర్ణుఁడు మూలుట.

యనుటయు రఘురాముఁ డలిగి వేగమున, ఘనశిలీముఖములు గడుఁబెక్కువేలు
నావాలి నేసినయట్టిబాణంబు, దేవకంటకుమీఁదఁ దివిరి యేయుటయు
జలబిందువులు గ్రోలు చాతకం బనఁగ, బలువిడి నాబాణపంక్తులు గ్రోలి
కరముగ్రమైన ముద్గరము ద్రిప్పుచును, బరువడి వానరపతులఁ దోలుచును
నెదురుగాఁ జనుదెంచు నింద్రారిఁ జూచి, మది లెక్కసేయక మానవేశ్వరుఁడు
కవిసి యుద్భటగదాకలితహస్తంబు, నవలీలఁ దెగనేసె ననిలబాణమున
దానిపాటునకుఁ గొందఱు తరుచరులు, నానావిధంబుల నలుదెసఁ బాఱ
నదిమీఁది పాఱంగ నలవిగాకున్నఁ, జిదిసి వానరులు చచ్చిరి దానిక్రింద
నున్నదాపలిచేత నొకపెద్దవృక్ష, మన్నరభోజనుం డవలీలఁ బెఱికి
యింద్రాదు లడరంగ నేతేర రాముఁ, డైంద్రబాణంబున నదియును ద్రుంప
నాభూరితరబాహులమరు లుప్పొంగ, భూభాగమగల నద్భుతముగాఁ దునిసి
పెక్కుండ్రు కపులు నిర్భిన్నులై క్రింద, నొక్కటఁబడి కూల నుర్వీపైఁబడియె
నిటు రెండుభుజముల నినకులేశ్వరుఁడు, పటుబాణములఁ ద్రుంప బలభేదిచేతఁ
గడిమి వజ్రమున రెక్కలు ద్రుంపఁబడిన, నడగొండయనుబోలె నలినార్చి యార్చి
చేతులు ముక్కును జెవులును లేక, యాతతంబున వికృతాకారుఁ డగుచు
నరుగుదెంచుచునున్న యాకుంభకర్ణు, నురవడిఁ గనుఁగొని యుర్వీశ్వరుండు
దురమున నీకష్టుఁ ద్రుంతు నేననుచు, సరభసంబున నర్ధచంద్రబాణములు
దెగనిండ రెండు సంధించి ఖండించె, జగములు మెచ్చుఁ దచ్చరణయుగంబు
పదములు దెగియును బాహువు ల్దెగియు, గుదియక యత్యుగ్రకోపుఁడై నడిచి
బడబాగ్నిచక్రంబుపగిది నాననము, కడువికృతంబుగాఁ గావించుకొనుచు
బలువిడి భాస్కరుఁ బట్టెడురాహు, నలవాటు గైకొని యారాముఁ గదిసెఁ
గదిసిన నాకుంభకర్ణునినోటఁ, బొదిగొన్ననిష్ఠుర భూరిబాణములు
ఇనకులేశ్వరుఁ డేయ నేర్పడ నొక్క, దొనకోల లాకదొన దూరనకరణి
ఘనమైన యాయంపగమి నోరునిండ, దనుజుఁడు సింహనాదము సేయరాక
యేపారువికృతపుకెలుఁగుహుంకృతులు, చూపులజంకెలు సూపుచువచ్చె
వచ్చిన యాదైత్యవల్లభుమేన, నచ్చుగా దృష్టించి యైంద్రాస్త్ర మేసెఁ

బ్ర దరమ్మెయి రఘుపతి యేయుటయును, నదియును మధ్యందినార్కు-చందమునఁ
దలపోయ నా బ్రహ్మదండంబుపగిది, వలతియై నిగుడుచుఁ బవనునికరణి
నెఱయ లోకములెల్ల నిండ నొండొండ, నెఱమంట లొలుకుచు నేపుతో వచ్చి
కుంభకర్ణునిఱొమ్ము గొని యుచ్చిపాఱి, కుంభిని నాఱె దిక్కు-లు మ్రోయుచుండ
నంతలో మఱియును నారాఘవేంద్రుఁ, డంతక బొణ మత్యంతవేగమున
సంధించి యేసిన సకలదిక్కు-లును, బంధురంబుగ మ్రోయ బ్రహ్మాండ మవియఁ
బ్రకటంబుగా భూమి పటపట పగుల, సకలభూతంబులు చైతన్య మెడలఁ
గలయంగ శతకోటికాలచక్రములు, బలుపెక్కి యొక్కఁటై పఱ తెంచుభంగి
వ్రాలినబడ బొగ్గి వడివచ్చుకరణిఁ, గాలకూటంబు మారణ మైనపగిది
విచ్చలవిడిఁ బర్వి వేగంబు మెఱసి, వచ్చి యాబొణంబు వడిఁ ద్రుంచి వైచెఁ
బటుసీలగిరిశృంగభాతితో నున్న, కుటిలరాక్షసుతల ఘోరంబుగాఁగఁ
బుడమిపై నాదైత్యపుంగవుశిరము, పడునప్పు లంకలోపల వడిఁ బడియెఁ
బొడవైన గోపురంబులును మేడలును, బొడ్డిపాడియయి రాలి పుడమిలోఁ గలయఁ
బదికోటు లగచరపతులోలి మ్రగ్గ, నుదధిలో జలచరయూథముల్ బెదర
వసుధపై సగమును వనధిలో సగము, నసురదేహముగూలె నద్భుతం బడర
నారవంబున నబ్ధు లన్నియుఁ గలఁగె, ధారుణి వణఁకె దిక్తటములు వగిలె
లంకాధినాథు సుల్లము వ్యయ్యలయ్యె, లంకలోనెల్ల కోలాహలం బయ్యె
జగములు మోదించె సంతోషవార్ధి, నగచరాధిపు లోలలాడి రందంద
రవికులాధీశ్వరు రఘురామచంద్రు, వివిధభంగుల సురల్ విసుతించి రపుడు
ఘనుఁడు రాముఁడు కుంభకర్ణుని జూచి, తనలోనఁ జిఱునవ్వు దళుకొత్తుచుండ
దేవసంఘమ్ములకు దిక్పాలకులకు, భావింప నెక్కు-డీ పడినరాక్షసుఁడు
ఇంక లోకములకు నెన్నండు నొండు, శంక లేదని మది సంతోషమంది
నప్పుడు కరమర్థి నాహవలక్ష్మి, నుప్పొంగి కైకొని యుజ్జ్వలుం డయ్యెఁ
గడు నుగ్రరాహువుఁ గబళించి పిదప, విడిచిన వెలుఁగొందు విమలార్కు-ఁ డనఁగఁ
దదనంతరంబ యాదానవకోటి, మదిలోన నెవ్వగ మల్లడిగొనఁగ
విన్ననై వదనము ల్వెలవెలఁ బోఁ, నున్న రావణుఁగాన సురవడిఁ బోఁ
దేవ నీతమ్ముండు త్రిదశాంతకుండు, వావిరి నగచరావళినెల్లఁ దోలి
దెసలు భూభాగంబు దివియు దా నగుచు, నసమసాహసబలాహవకేళి వ్రాలి
నెలకొని దుగ్ధాంబునిధి మందరాద్రి, గలచియాడెడు క్రియఁ గపికులాంభోధి
నిక్కడక్కడఁ జేసి యింద్రాదులెల్ల, వెక్కసపడఁ బోరి వివశుఁడై తూలి
యంత శ్రీరాముని యధికబాణాగ్ని, నెంతయు దగ్ధుఁడై యిలమీఁదఁ ద్రెళ్లె
నని కుంభకర్ణుఁ డయ్యనిలోనఁబడుట, దనుజులు చెప్ప నాదానవేశ్వరుఁడు
తనపాటు నింకఁ దథ్యం బన్నకరణిఁ, గొనకొన్న బలుమూర్ఛఁ గుంభినిఁబడియె
నతికాయుఁ డధికశోకాయత్తుఁడయ్యె, ధృతిదూలి శోకించె దేవాంతకుండు
దిక్కు-దప్పినమాడ్కిఁ ద్రిశిరుండు వడియెఁ, దక్కక యానరాంతకుఁడు మ్రాన్పడియె

దనుజవీరులు మహోదరమహాపార్శ్వులును మహాలోకవిలుంఠితు లైరి

రావణుండు కుంభకర్ణనిమరణమునకు శోకించుట.

బలుమూర్ఛనంతటఁ బాసి రావణుఁడు, పలుమాఱుఁ దమ్మునిఁ బలవింపఁ దొడఁగె
వడిఁదేర్చు రాఘవవైరాంబురాశి, నెడపక యేనింక నేతెప్ప గడతు
రామలక్ష్మణులను రణములోఁ జంపు, దేమెయి నీవని యేనున్నచోటఁ
జటులరాఘవమహాశరవహ్ని శిఖల, నిటు నేలఁగూలితి వేకాంగవీర
నిద్రారతుండవు నేఁడిట్లు దీర్ఘ, నిద్ర నైకొంటె నిర్నిద్రవిక్రముఁడ
కులిశధారకునైన నఁగూలనిమేను, యిల నరునేటున నిటుఁ గూలవలసె
నంతకునకు నీవ యఖిలంబు నెఱుఁగ, నంతకుం డన నుంటి వారూఢశక్తి
నంతటి నీకు నీ యవనిలో నిప్పు, డంతకుఁ డయ్యెనే యకట! రాఘవుఁడు
నిద్రమేల్కొని నీవు నిష్ఠురవృత్తి, రుద్రుఁడవై తమ్ము రూపడం తనుచు
నద్రివిద్రావణుం డాదిగా సురలు, నిద్రఁబో రెన్నఁడు నెరసినభీతి
నీవాజిఁ ద్రుంగుట నిర్జరు లింక, నేవిధంబున నన్ను నేల నైకొండ్రు
కులమెల్ల రక్షించుకొఱకు నాతోడఁ, జలమునఁ బలుమాఱు సద్బుద్ధి చెప్ప
వినక విభీషణు వెసఁదన్ని వెడల, చనుమన్న పాపంబు సైఁచునే నన్నుఁ
గడుకొని నీవాదిగా బుద్ధిమంతు, లుడుగక చెప్పిన యుచితోక్తు లెల్ల
నెమ్మితో వినినైతి నిన్నుఁ గోల్పడితి, నమ్మినజయలక్ష్మి నాకేల కలుగు
బలిమిమై నావలపలిమూఁపుభంగిఁ, గలహారంగంబునఁ గడిమి వాటించి
పటుబాహాబల మేది పడితి వీవాజి, నిటమీఁద దిక్కునా కెవ్వరు గలరు
అని కుంభకర్ణుని యందందఁ దలఁచి, వనట నిట్టూర్పులు వడిఁ బుచ్చి పుచ్చి
పరితాప మనియెడి బడబాగ్ని గలిగి, పెరిగెడిలాలయఁ ఫేనంబు గలిగి
వెడలు కన్నీరను వెల్లువగలిగి, కడలేనివగపను కరుడులు గలిగి
ప్రకటరోదనమను రావంబు గలిగి, చకితత్వ మనియెడి చలనంబు గలిగి
మునుకొని శోకసముద్రుఁడై పెద్ద, వెనుఁబడి యెంతయు వికలుఁడై యున్న
యారావణునిఁ జూచి యప్పు డొక్కింత, ధీరత వాటించి త్రిశిరుండు వలికెఁ
బదిలంబు దప్పి యిబ్భంగి శోకించె, దిదియేమి దేవ నీ వితరులమాడ్కి
నజాసనునిచేత వరమును గొన్న, ఘనశక్తి నీయందుఁ గలిగియుండఁగను
అవిరళమంత్రపూతాస్త్రము ల్వజ్ర, కవచంబు నీయందుఁ గలిగియుండఁగను
ఉరుతరగతిగల యుజ్జ్వలరథము, గరమొప్ప నీకును గలిగియుండఁగను
శోకింతురే నన్నుఁ జూడు మొక్కింత, నీకెదు రెవ్వరు నిర్జరవైరి
వేవేగ యవలీల వెడలి రాఘవుని, నీవిక్రమంబున నేలపైఁ గూల్పు
మిట శోక ముడుగు నీవింతయ చాలు, నట నేను బోయి మహాజిరంగమున
నతులవిక్రమకళాహంకారవృత్తి, నతిశూరుఁ డితఁడన నంతటఁ బేర్చి
గరుడుండు పాములఖండించుమాడ్కిఁ, దరుచరావళినెల్ల ధరణిఁ గూల్చెదను
సురపతి వృత్రుని స్రుక్కించుభంగి, హరుఁ డంధకాసురు నణఁగించుపగిది

రామునిఁ ద్రుంచెద రణములో నిప్పు, డీమెయిఁ బోయెద నెలమి నన్ననుపు
మనిన రావణుతోడ నప్పుడు కడఁగి, ఘనబాహుబలుఁ డతికాయుండు వలికె
యింత శోంకింపంగ నేటికి నీకుఁ, బంతంబుతో దైత్యబలములఁ గూడి
యేనుబోయెద నంపు మిటఁ జిత్రముగను, గాననంబులు గాల్చు కార్చిచ్చుపగిది
విపులబాణంబుల విశదంబుగాఁగఁ, గపులతో రామలక్ష్మణులఁ జంపెదను
అని పల్కునపుడు నరాంతకుఁ గూడి, యనుపమబలుఁడు దేవాంతకుఁ డనియె
నేమిద్దఱముఁబోయి యీక్షణంబునను, రామలక్ష్మణుల మర్కటులఁ ద్రుంచెదము
అనిన మాటలకు దైత్యాధీశ్వరుండు, దనశోక ముడిగి మోదంబున నుండి
తనయులతోఁగూడి తద్దయు నొప్పె, ననిమిషగణయుక్తుఁ డగునింద్రుమాడ్కి-
నవ్విధంబుననుండి యారావణుండు, నవ్వుచుఁ గొడుకుల నలువురఁ జూచి
రామలక్ష్మణుల మర్కటసైన్యములను, భీమాస్త్రములఁ జంపి వేర్చిరం డనుచుఁ
దనతమ్ము లగుమహోదరమహాపార్శ్వులను వీడుకొలిపె నాలము నేయుఁడనుచు
మాకతంబునను నీమనుజాశనుండు, చేకొని సీతకై శ్రీరాముఁ దొడరె
నని యరిషడ్వర్గమారావణునకు, మునుమున్నె రాము నిమ్ముల దాకఁబోవు
పగిది నాయార్వురు బ్రహ్మాండభాండ, మగలంగ నార్చుచు ననిఁ గేగునపుడు

అతికాయమహోదరులు మొదలగువీరులు యుద్ధమునకు వెడలుట.

భూరిశారదఘనస్ఫురణంబు గలిగి, యైరావతేభంబు నంశంబు గలిగి
తనరారుచున్న సుదర్శనేభంబు, నినుఁ డస్తశిఖరిపై నెక్కినకరణి
నెక్కి మహోదరుఁ డేపారి నడిచెఁ, దక్కక నిశితాయుధంబులు వెలుఁగఁ
బటుజవసత్త్వప్రభావము ల్గలిగి, చటులంబులైన యశ్వంబులఁ బూన్చి
యెసఁగు చాపంబును నింద్రచాపంబు, పసమీఱి సూర్యనిభంగి వెలుంగ
నరదంబుమీఁద నీలాభ్రంబపోలెఁ, దిరమైన వేడ్కతోఁ ద్రిశిరుండు వెడలె
వితతధనుర్వేదవిద్యాధ్యుఁడైన, యతికాయుఁడును నప్పు డధికతేజమున
శరచాపఖడ్గాదిశస్త్రాస్త్రసమితిఁ, గరమొప్పి సూర్యప్రకాశమై వెలుఁగఁ
దనరారు కనకరథం బెక్కి వెడలె, ఘనభూషణద్యుతిఁ గనకాద్రి యగుచు
సురవరభూటకస్ఫురణఁ జెన్నొంది, యురుభూషణప్రభ నుజ్జ్వలంబైన
యవదాతహయము నరాంతకుఁ డెక్కెఁ, బ్రవిమలతేజోవిభాసితుం డగుచు
శక్తి యుద్భటబాహుశక్తిమై దాల్చి, శక్తిపాణియుఁ బోలె సన్నుతికెక్కి-
దీపితగదఁ దాల్చి దేవాంతకుండు, రూపింప విష్ణునిరూపున నడిచె
గురుగదాపాణియై గుహ్యకేశ్వరుని, యరుదైనకడిమి మహాపార్శ్వుఁ డొప్పెఁ
గాలచక్రంబులగతి నుజ్జ్వలంబు, లైలీలఁ బైక్కొన యరదముల్ వెడలెఁ
గొండలవడువునఁ గోటానకోట్లు, గండుమీఱిన మదగర్వముల్ గలిగి
దండిమై వెడలె నుద్దండత హస్తదండంబు లొప్ప వేదండసంఘములు
హేషారవంబుల నెల్లదిక్కులను, ఘోషింపఁజేయుచు గుట్టము ల్వెడలెఁ
గాలకింకరసమాకారంబు లమరఁ, గాలుబలంబు లుగ్రత నేఁచి వెడలెఁ

జతురంగబలము లీచందంబునొంది, యతులితం బగుటయు నప్పుడు నడుమఁ
బ్రళయకాలార్కులభంగి నెంతయును, వెలుఁగొంది రాదైత్యవీరు లారుద్వారును
అతిశుభ్రమగు శరదభ్రంబు లొప్పు, గతివార పుండరీకంబు లొప్పారఁ
గడిమిమై గెలుతుము కాదేనిఁ జత్తు, ముడుగ మెబ్బంగి రణోత్సాహ మనుచు
నడచిరి కలనికి నానావిధముల, నెడపక పంతంబు లిచ్చుచు వారు
అప్పు డొండొరువులయూహ్వానములను, జెప్పఁ జోద్యం బైనసింహనాదముల
రథఘోషములను దురంగహేషలను, పృథులదంతావళబృంహితంబులను
గరముగ్ర మగుపదఘట్టనధ్వనుల, నిరుపమధ్వజకింకిణీనిస్వనములఁ
బటహభేరీశంఖభయదనాదములఁ, బటుతరనిస్సాణభాంకారములను
దిక్కులు ఘూర్ణిల్లె దివి పెల్లగిల్లెఁ, జుక్కలు డుల్లె వాసుకి యొడ్డగిల్లె
మేయవు గంపించె మేదిని వణఁకె, భారమోర్వక దిగిభములు చలించె
నటు దానవానీక మాకోట వెడలఁ, బటుభయంకరవృత్తిఁ బ్లవగవల్లభులు
భూనభోంతరము లాస్ఫోటనధ్వనులఁ,బూని యొక్కటు నిండ భూరిసత్త్వముల
దలకొని గిరులును దరువులు వైచి, చెలగించి రప్పుడు సింహనాదములఁ
జలమున దైత్యులు చటులభౌణములు, బలువిడి గురిసిరి ప్లవగులమీఁద
నసురావళికిమున్నె యాకపివరులు, నసురులఁ జంపంగ నడరి పెల్లార్చి
కపులకుమున్నె రాక్షసు లుగ్రవృత్తిఁ, గపులఁ జంపెదమని కడక వాటించి
యసమునఁ జలము పెంపార నొండొరుల, వసుమతిపైఁ బడవైతురు కినిసి
యసురులచేతిశస్త్రాస్త్రంబు లొడిసి, వెసఁ బుచ్చి పెళ్లున వియుతురు కపులు
కపిగోటిచేతివృక్షంబులు గిరులు, కుపితులై వియుతురు క్రూరదానవులు
కపులకాళ్లనుబట్టి కదిసి రాక్షసులు, కపులతోడనె మహోగ్రతను ప్రేయుదురు
అసురులకడకాళ్లు నలమి వానరులు, నసురులతోడనే యడఁతురు బెట్టు
అటుహోర జర్జరితాంగులై నేలఁ, గుటిలదైత్యులుఁ గపికోటులుఁ ద్రెళ్లి [టను
దురములోఁ బడియు నెత్తురులు గ్రక్కుచును, బొరిఁ బొరి మూర్ఛలఁ బొంది యంత
దెలిసి వానరులును దేవశత్రువులు, కలిసి కయ్యము సేయఁగా నందుఁ గపులు
దానవుతో నెత్తి దానవు వ్రేసి, యేనుఁగుతో నెత్తి యేనుఁగునేసి
తురగంబుతో నెత్తి తురగంబునేసి, యరదంబుఁగొని కరి నడరంటనేసి
కరి నెత్తుకొని తురంగముఁ బడవైచి, తురగంబు నెత్తి దైత్యుని డొల్లనేసి
యురుసత్త్వధీరులై యుగ్రతనార్చి, తరుచరవీరులు దర్పంబు మెఱసి
పొరిఁబొరి నిబ్భంగిఁ బొరిపుచ్చుటయును, సురరిపుల్గొందఱు స్రుక్కుటఁ జూచి
రయమునఁ గోపంబు రంజిల్లదైత్యచయమును వానరసమితిపైఁ గదిసి
ప్రదరంబు లేసి చక్రంబులనేసి, గదల నొప్పించి ఖడ్గంబుల ద్రుంచి
భిండివాలంబులఁ బీచంబు లణఁచి, ఖండించి సురియల గండలు బరులు
కుంతశూలంబుల గ్రుచ్చివానరుల, నింత లింతలుచేసి యెసఁగి యార్చుటయు
నంతటఁ బోవక యగచరు లార్చి, యంతంత కడరి దైత్యావళిఁ బట్టి

తరుషండములఁ బర్వతప్రకరముల, నురవడినెత్తి యత్యుగ్రత వైవఁ
బడియెడిదైత్యులు పాఱుదైత్యులును, నుడుగక యందంద నొరలు దైత్యులును
గలయంగ నెత్తురు గ్రక్కుదైత్యులును, పొలుపరి నేలపై బొరలు దైత్యులును
అందంద నట్టలై యాడుదైత్యులును, మ్రుందిప్రత్యగ్రుల మఱచు దైత్యులును
నెక్కినరౌతుల నిటునటుఁ బడఁగ, లెక్కసేయక కరాళించుగుఱ్ఱములు
పక్కర లూడంగఁ బఱచుగుఱ్ఱములు, దిక్కులు సుడివడఁ దిరుగు గుఱ్ఱములు
కీలెడలినక్రియ గెడయు గుఱ్ఱములు, కూలి కాళ్లను దన్నుకొనెడు గుఱ్ఱములు
వికలంబులై పోరు విచ్చుగుఱ్ఱములు, నొకరూపు నేర్పడ కుండుగుఱ్ఱములు
కరములు దునిసినఁ గంపించుకరులు, వెరవారఁ గొమ్ములు విఱిగినకరులు
మరలి లంకకు వెస మగిడెడికరులు, తిరమేది దిర్దిరఁ దిరిగెడుకరులు
కొండకైవడి వడిఁ గూలెడికరులు, ఖండతుండంబులై కలఁగెడికరులు
రథికసారథిరథ్యరహితరథములు, ప్రథితంబుగా భువిఁ బడురథంబులును
వారగండ్లనుబడ్డ వరరథంబులును, నారగఁ దలక్రిందు లగురథంబులును
కీళ్లెగ్గఁ దప్పి మ్రగ్గినరథంబులును, త్రాళ్లెల్లఁ ద్రెళ్లి పొందనిరథంబులును
చాలంగ నుగ్గునూచగురథంబులును, నాలంబులోఁ దఱుచగుటయుఁ జూచి
సురఖేచరాదికస్తోమంబు చోద్య,తరమని యాత్మలోఁ దద్దయు మెచ్చ
నప్పుడు కినిసి నరాంతకుం డార్పు, లొప్ప నిజాస్యంబు నుఱవడిఁ బఱపి
యసురుల నోడకుం డనుచు వానరుల, నసమునఁ గిట్టి బెట్టగలించి తాఁకి
నెలకొని యొక్కొక్క నిమిషంబులోన, నిలఁగూల్చె నేడు నూఱేసి వానరుల
సురపతిశౌర్యంబు సొంపారుచుండ, గిరులవ్రేయుచును నేగినత్రోవలోఁ
దరుచరకోటులుఁ దఱుచుగాఁ బడుట, నిరవొంద వాడు పోయినత్రోవ యొప్పె
నేవానరుండైన నేఁచి కోపమున, భావంబులోఁ దన్నుఁ బరిమార్పఁదలఁచు
నంతరంగముఁ జొచ్చి యరయుచందమున, నంతకుమున్నుతా నతని నుక్కణఁచు
నేకపియైనఁ దన్నెదురంగఁ దలఁచి, భీకరుండై గిరిఁ బెరుకంగఁ జూచు
నంతకుమున్ను తా నధికరౌద్రమున, నంతంత డగ్గరి యతని రూపణఁచు
నేబలీముఖుఁడైన నేపగ్గలించి, తాఁబెట్టుగాఁగఁ బాదపమెత్తఁ దలఁచు
నంతకంతకు హెచ్చి యతిభీషణముగ, నంతకుమున్నె తా నతని గీటణఁచు
నంతటఁ బోవక హాయముపైఁ బఱపి, యంతంత పెనుగుంపు లైనవానరుల
ప్రేవులు ద్రొబ్బలు పెల్లుగా నురుము,గా వివిధములైన గతులఁ ద్రొక్కించు
గుండెలు వగులంగ గోలెమ్ములగల, నొండొండఁ దాఁకించి యుర్వరఁగూల్చు
నలుకతోఁ బ్రళయకాలానలుపగిదిఁ, దలకొని యెందును దానయై నిండి
వానరవరసైన్యవనములు విఱుగ, మాన కుగ్రతఁ బవమానుఁడై మోద
వానిశౌర్యంబును వానిశక్తియును, వానరులెల్ల నోర్వఁగలేక యపుడు
వికలులై యుండిరి విస్మితు లగుచు, సకలదేవతలును జలియించి రపుడు
పటుభీతిఁబొందిన ప్లవగసైన్యముల, నటుపేర్చుచున్న నరాంతకుఁ జూచి

ఆంగదనరాంతకుల ద్వంద్వయుద్ధము.

యనయంబు కోపించి యంబుదపటల,మున నున్న సూర్యుండు మొనసినమాడ్కిఁ
గపిరాజతనయుఁ డంగదకుమారుండు, కపిసేనలోనుండి కడఁక నేతెంచి
యోరి నరాంతక యుగ్రతఁ గపుల, నీరసంబునఁ బేర్చి యేల చంపెదవు
ఇంతచేసినను నీవిటు బంటవై తె, యంతనీరుఁడవైన ననిఁ దాఁకు నన్ను
ననవుడు నవ్వి నరాంతకుం డనియె, వనచర నీవెంతవాఁడవు నాకు
నఖిలదిక్పాలుర నదటడంచితిని, నిఖిలదేవతల మన్నింప కేఁచితిని
అట్టినాతోడ నీవా యెదిరెదవు, పట్టి చట్టలుచీరి పాఱవై చెదను
ననుఁ జూతుగా కన్న నగుచు నంగదుఁడు, దనుజదశగ్రీవుదర్పంబు మాన్పి
పూనిన ఖరసూతిఁ బొరిగొని పిదప, నేనేగునపుడు నీవెఱుఁగవే నన్ను
ననుడు దానవుఁడు కాలాహిచందమున, మునుకొని యార్పులు మ్రోయంగవచ్చి
ఘనతరవిస్ఫులింగంబులు చెదర, ననయంబు తనశక్తి నంగదువైవ
గరుడునివక్త్రంబు గదిసినంతటనె, పరచిన కాలసర్పంబునుబోలె
నది వజ్రనిభమైన యతనివక్త్రంబు, గదసినయంతనే ఖండంబు లయ్యె
వజ్రాయుధంబున వరశైల మణఁచు, వజ్రిచందంబున వాలినందనుఁడు
అఱచేతనే వాని హయముమస్తకము, పటియలువాఱి నిర్భరవృత్తి నేసెఁ
జెచ్చెఱ వేయంగఁ జేట్పడి నోరు, విచ్చుచు నాలుక వెడలఁబెట్టుచును
వెరవిడి కాళ్లును వెసఁ దన్నికొనుచు, ధరమీఁదఁ బడి చచ్చెఁ దత్తురంగంబు
అటుతురంగమువడ్డ నన్నరాంతకుఁడు, చటులకాలానలజ్వలితాస్యుఁ డగుచుఁ
గెడయుమంచును బిడికిట మస్తకంబుఁ, బొడిచి యంగదు మూర్ఛఁబొందించుటయును
అంతనె తెలిసి నరాంతక నీకు, నింతశక్తియుఁ గలదే యని వేర్చి
పెరిఁగిన పిడుఁగైన పిడికిట వాని, వరశైలనిభమైన వక్షంబుఁ బొడిచెఁ
బొడిచిన నెత్తురుల్ పొరిఁ బొరి దొరఁగఁ, బొడిపొడియై ధరఁ బునుకిలు నెదరఁ
గడుఘోరమైన సంగరభూమిలోనఁ, బడి నరాంతకుఁ డంతఁ బ్రాణము ల్విడిచె
నార్చిరి దేవత లామింటనుండి, యార్చిరి వానరు లవనీతలమున
దనుజాధినాథునితనయునిపాటు, గని మహోదరుఁ డుగ్రకరిఁ బురికొల్పె
ననుజుండు వడఁటకు నడలుచు వాలి, తనయు నేచుటకు నుద్దండకోపంబు
ముప్పిరిగొనఁగ నిమ్ములఁ బరిఘుంబుఁ, ద్రిప్పుచుఁ బఱతెంచె దేవాంతకుండు
రవిమండలముబోలు రథ ముగ్రభంగి, నవని గంపింప నుద్ధతిదోలుకొనుచు
త్రిశిరముల్ త్రేతాగ్ని తెఱఁగున వెలుఁగ, త్రిశిరుండు గవిసె నుద్దీప్తకోపమున
నప్పు డంగదుఁడు శాఖాయుతం బగుచు, నొప్పెడు నొకవృక్షఁ మురవడిఁ బెఱికి
యడరంగ నార్చి దేవాంతకు వైవ, నడుమనె త్రిశిరుండు నలగఁగ నేసె
నేసిన మీఁదికి నెగసి యంగదుఁడు, గాసిల్లి శైలవృక్షంబులు మిగుల
నడరింప నపుడు దేవాంతకత్రిశిరు, లెడబడఁగాఁ ద్రుంచి యొంతయు మించి
పరగించి రతనివైఁ బటుతోమరంబు, లరుదారఁగాఁ జేరి యత్యుదగ్రతను

నంతటఁ బోవక యార్చుచు మఱియు, వింతగాఁ బొదువుచు వేగంబు మెఱసి
యావాలిసుతుమీఁద నధికరోషమున, దేవాంతకుఁడు వైచె దీపించి పరిఘ
దరమిడి సింహనాదంబు నేయుచును, చెరలక శరవృష్టి త్రిశిరుండు గురిసె
నురుదంతి గొలిపె మహోదరుం డేఁచి, పరఁగించె నతనిపైఁ ఒటుతోమరములు
ఎనసి మువ్వురు దమయేపు చూపుటయు, ఘనరోష మొదవ నంగదుఁడు కోపించె
దంభోళిక్రియ మహోదరునియేనుంగు, కుంభస్థలము ఁాకఁ గుధరశృంగంబు
గెరలి వ్రేసిననది ఘీంకార మెసఁగ, నొరలి గ్రుడ్డులు వెలి కురికి చచ్చుటయు
జయలక్ష్మి రాఘవేశ్వరుఁ బొందఁగోరి, ప్రియమునఁ గైసేయఁ బెట్టియఁ దెరిచె
ననఁగ నాకరితల యటు వ్రస్సి యొప్పె, ననుపమంబైన ముత్యంబులు సెదర
నంతటఁ బోక దేవాంతకు వ్రైసె, దంతిదంత మగల్చి తాఁ రాసుతుండు
అటు వ్రేటుపడి వాతహతిఁ జలియించు, పటుసాలవృక్షంబు పగిదిఁ దూగాడి
నెత్తురు గ్రక్కియు నెఱసాహసమునఁ, జిత్త మొక్కింతగాఁ జేసి యయ్యసుర
పరిఘంబు గొని వ్రేసెఁ బర్వతతటము, కరణి నొప్పారు నంగదునురస్థ్సలము
నంగదుండును దాన నవనిపై మ్రొగ్గి, యంగముతోడ ధైర్యము చిక్కఁబట్టి
కోపించి దేవాంతకునిమీఁద నడువ, దీపితాస్త్రంబులఁ ద్రిశిరుండు మూఁట
నావాలితనయుని నాత్మఁ గైకొనక, లావున ఘాలస్థలము నాట వేసె
నంత నీలుండును ననిలనందనుఁడు, పంతంబుతోఁ దోడుపడి రంగదునకు
నందు నీలుఁడును మహాశైల మెత్తి, యందందఁ ద్రిశిరుపై నార్చుచు వైవ

హనుమంతుఁడు మొదలగువారలు త్రిశిరాదిరాక్షసవీరులఁ జంపుట.

నళనిచందంబగు నస్త్రంబుఁ దొడిగి, త్రిశిరుండు నగ్గిరిఁ దెగ నేసె నడుమ
ధీరత వాటించి దేవాంతకుండు, వారియై యొప్పిన పరిఘుఁ ద్రిప్పుచును
బలియుఁడై చనుదేరఁ బవమానసూనుఁ, డలుకతో రాక్షసు నొదలఁ జూచి
బెడిదంబుగా వెసఁ బిడికిటఁ బొడిచెఁ, బొడిచిన నప్పుడు పొరిబొరిఁ బండ్లు
డుల్లంగ నోరుబెట్టుగఁ దెర్చుకొనుచుఁ, ద్రెళ్లె దైత్యుఁడు గ్రుడ్లు దిరుగవైచుచును
దేవత లార్చిరి దివినుండి యపుడు, దేవాంతకునిపాటు తెఱఁగొప్పఁ జూచి
త్రిశిరుండు కోపించి తీవ్రత నేసె, నళనివేగాస్త్రంబు లన్నీలుమీఁదఁ
దగ వెండియును మహోదరుఁ డుగ్రవేగ,మగునొక్క కరినెక్కి యార్చుచు వచ్చి
కులగిరి పైవాన గురియుచందమున, నలువు దీపింపంగ నతనిపైఁ నేసె
నానీలుఁడును వానియస్త్రసంతతులఁ, దానెంతయును భిన్నతనుఁడునై నొచ్చి
యటు మూర్ఛనొందియు నంతనె తెలిసి, పటుగతితోడ నభంబున కెగసి
తరువులతోడ నుద్ధతి మీఁదికెత్తి, ధరణీధరము మహోదరునిపై వైచె
వైచిన దానిచే వారణయుక్తుఁ, డై చచ్చెఁ దలవ్రస్సి యమ్మహోదరుఁడు
ధరమీఁద నమ్మహోదరుఁడు గూలుటయుఁ, దిరమైన కడిమితోఁ ద్రిశిరుండు వేర్చి
సరిగొందునని పెక్కుశరములు నేసె, నరవాయిగొనక యాహనుమంతుమీఁదఁ
జెచ్చెఱఁ బర్వతశిఖరంబు విఱిచి, తెచ్చి యారావణి త్రిశిరుపై వైచె

నది నడుమనె తుమ్మురై రాల నేసెఁ, ద్రిదశులు వెఱఁగందఁ ద్రిశిరుండు వేర్చి
హనుమంతుఁడును దానియరదంబుమీఁది, కనువారగా దాఁటి యత్యుగ్రముగను
సింగంబు గజములఁ జెలరేఁగి వ్రచ్చు,భంగి రథ్యంబులఁ బటుగతిఁ జంపె
నా త్రిశిరుండును ననిలజుమీఁద, నాతతంబుగ శక్తి యడరించుటయును
బలుమంట లెగయంగఁ బఱతెంచుదాని, బలువిడిఁ బట్టి యప్పావని ద్రుంప
శక్తి ద్రుంచిన నిజశక్తి వాటించి, శక్తి జిహ్వాయుఁ బోలు చటులాసిఁ గొనుచు
నచ్చెరువైన రయంబు సొంపార, వచ్చి యాహనుమంతువక్షంబు ఛాఁక
వ్రేసిన నతఁడును వెస నఱచేత, వ్రేసె నారాక్షసువిపులవక్షంబు
నటు వ్రేటుపడి తనయడిదంబు వైచి, కుటిలరాక్షసుఁడు గ్రక్కున మూర్ఛకొం దె
ననిలజుం డటుఁ బడ్డయడిదంబుఁ బుచ్చు,కొని బిట్టుగా నార్చెఁ గుంభిని పగుల
నాలోనఁ దెప్పిరి యా త్రిశిరుండు, వాలిన పిడికిట వాయుజుఁ బొడిచె
హనుమంతుఁ డంత నత్యంతరోషమునఁ, దనకటంబులు పొంగ దర్పముప్పొంగ
రూపించి యావిశ్వరూపుమస్తకము, నేపునఁ ద్రుంచు సురేంద్రచందమునఁ
జెచ్చెఱ దనుజుని శిరములు మూఁడు, నచ్చెరువైన యాయడిద మంకించి
తెగనేసె నాదైత్యతీవ్రకర్మంబు, దగఁ బుచ్చుకొని త్రుంచు దైవంబుకరణి
దిశలు భూభాగంబు దివియు ఘూషింపఁ, ద్రిశిరుండు భూస్థలిఁ ద్రెళ్లెఁ ద్రెళ్లుటయుఁ
బటురౌద్రమున మహాపార్శ్వుండు గినిసి, నిటలంబు బొమలును నెరి ముడివడఁగ
నలయ నెత్తుటఁ దోఁగి యాశాకరీంద్ర, కరభీకరంబైన కనకచక్రముల
నురుమణిప్రభల నత్యుగ్రమై యమని, పరుషోగ్రదండంబు పాటిగాఁ గలిగి
యరుణపుష్పంబుల నరుణగంధమున, నురుతరం బగుచు నయోమయంబైన
యుదయార్కభాసమానోజ్జ్వలం బగుచు, నొదవ గదాదండ ముగ్రుఁడై తాల్చి
తనకోపశిఖి మండ దర్పముప్పొంగ, హనుమంతుమీఁద రయంబున నడువ
నెడసొచ్చి యొక్క మహీధరం బెత్తి, యెడపక దైత్యుపై ఋషభుండు వైచె
నడరి యంతటిలోన నమ్మహీధరము, దొడివడ గదఁ గొని తుమురుగా వ్రేసె
జటులత గదద్రిప్పి సమదుఁడై ఋషభుఁ, బటుసత్త్వమున మహాపార్శ్వుండు వైచె
దానిచే వక్షంబుఁ దాకి యావృషభుఁ, డూనిన మూర్ఛచే నొక్కింత దెలిసి
యాలోన వేగ మహాపార్శ్వుఁజొమ్ము, వ్రాలినపిడికిట వ్రయ్యఁ దాటించెఁ
దాటించుటయు గదాదండంబు విడిచి, మేటిసత్త్వముదూలి మేదినిఁ బడియె
నాగదాదండంబు నాఋషభుండు, వేగంబె కొని యార్చి వ్రేసిన దైత్య
వ్రేసిన వజ్రంబు వ్రేటునఁ గొండ,తో సరియై తల తుమురుగాఁ గూలె
నటు మహాధ్వనితో మహాపార్శ్వుఁ డవనిఁ, బటుభయంకరవృత్తిఁ బడుటయుఁ జూచి
కరువలిచేఁ దూలు కారాకు లనఁగఁ, దిరిగి దైత్యులు నలుదెసలకుఁ జనిరి
ఆచందమువ వార లవనిపైఁబడుటఁ, జూచిన రోషవిస్ఫురణశోభిల్ల
మిడుక లోకములెల్ల మ్రింగెద ననుచు, గడఁగినక్రియ నతికాయుఁడు వేర్చి
వేయుసూర్యులభంగి వెలుఁగుచు మిగుల, నాయతం బైనట్టి యరదంబు నెక్కి

తనకార సింహనాదము చెలఁగించి, తనపేరు చెప్పి యుద్దండకోదండ
నిష్ఠురాకారావంబు నిగుడఁ గాలాగ్ని,కాష్ఠంబు లడఁగింపఁ గవయుచందమునఁ
గపిసేనపై మహోగ్రంబుగాఁ గవియఁ, గపులు నిశాటునాకారంబుఁ జూచి
పటురౌద్రలీల నిప్పటికుంభకర్ణుఁ, డిట వచ్చెనో యని యెంతయు బెదరి
కొందఱు మూర్ఛిల్లఁ గొందఱు వెఱువఁ, గొందఱు వెఱఁగు చేకొని చూచుచుండఁ
గొందఱు వాపోవఁ గొందఱు గలఁగఁ, గొందఱు రామ చేకొనుమని మ్రొక్కఁ
బర్వినభీతిమైఁ బఱతెంచుకపుల, నుర్వీశ్వరుం డోడ కోడకుం డనుచుఁ
గలయ లోకములెల్లఁ గప్పి గర్జిల్లు, ప్రళయావసరమేఘపటలంబపోలె
బెడిదంబుగాఁ బేర్చి పృథులవేగమున, నడతెంచుచున్న దానవనాథతనయు
నగ్గలికయు లావు నధికరౌద్రంబు, నగ్గతియును దవ్వులందె వీక్షించి
యనయంబు వెఱఁగంది యప్పు డారాము, జననాథుఁ డావిభీషణుఁ జూచి పలికెఁ
బిడుగుమ్రోసినమాడ్కి బెడిదంపుమ్రోత, నడరి వచ్చుచునున్న యరదంబుమీఁద
నింద్రచాపనుతోడ నెనవచ్చునట్టి, సాంద్రప్రభాయిత చాప మొప్పారఁ
బరిఘగదాప్రాసపట్టసశూల, పరశుతోమరభిండివాలచక్రాది
వరదివ్యశస్త్రనిర్వాహంబుతోడ, నరుదైనయట్టి సింహధ్వజం బొప్ప
నలువొంద నార్చుచు నలుగురు సార,థులు తోల నొకవెయితురగము ల్వాన్చి
మూఁడుకన్నులుగల మూర్తియుఁబోలె, వేడిమి దిక్కుల వెదచల్లుకొనుచుఁ
గపులఁ దోలుచును నిక్కడనె చూచుచును, విపరీతగతి వచ్చు వీఁ డెవ్వఁడనిన

విభీషణుఁడు శ్రీరాముల కతికాయునిప్రభావముఁ దెలుపుట.

దేవ యీదైత్యుఁడు దేవారిసుతుఁడు, రావణుకంకెను రణగరిష్ఠుండు
చతురంగములయందు సమరంబునేయ, నతినిపుణుండు వీఁ డవనీశతిలక
యరుదైన వేదశాస్త్రాదివిద్యలను, బరిణతుం డెంతయుఁ బరతత్త్వవేది
లంక యీవీరుని లావునఁజెసి, శంకలే కెపుడు నిశ్చలవృత్తి నుండు
ననిమిషు లలిగిన ననిఁ జావకుండ, వనజాసనునిచేత వరము గొన్నాఁడు
దివ్యాయుధంబుల దివ్యశస్త్రముల, దివ్యమంత్రంబుల దీపించువాఁడు
మీఱి యింద్రాదినిమిషులను నూఱు,మూఱులు గెలిచిన మగటిమివాఁడు
వాసవవజ్రంబు వరుణుపాశంబు, నాసమర్థి మహోగ్రదండంబు
ధనపతిగదయు నీతనిశస్త్రసమితి, ననిశంబు గడుఁ బ్రతిహతము లైయుండు
మనుజాశనుఁడు ధాన్యమాలినియందె, గనినపుత్త్రుం డతికాయుండు వీఁడు
ఈదానవునిచేత నీకపులెల్ల, మేదినీనాయక మెదుగక మున్నె
సమరంబులో వీనిఁ జంపుట లెస్స, యమితవిక్రమకేళి నని చెప్పుచుండ
వాఁడంతఁ బటుగుణధ్వని దిక్కులద్రువ, వాఁడిమిమై నట వచ్చుటఁ జూచి
ఖండనోదగ్రుండు గవయుండు గోము,ఖుండును జ్యోతిర్ముఖుఁడు కుముదుండు
మారుతాత్మజుఁడును మైందుండు నలుఁడు, శరభుండు నీలుండు శతబలి గజుఁడు
నాదిగాఁ గలుగు మహాకపివరులు, మేదినీజంబులు మేదినీధ్రములు

వడి నెత్తుకొనిపోయి వానికి నెదురు, నడువంగ నటుచూచి నవ్వి దానవుఁడు
కలహావిక్రమకళాకరినసత్త్వములు, గలుగవు తొలఁగుఁడు కపులార మీరు
త్రిజగంబులును మెచ్చుఁ దివిరి వారాశి, నిజశరాగ్రంబున నిల్పినశూరుఁ
డతఁ డెవ్వఁ డిటు చూపుఁ డతనిపైఁ గాని, యతులితంబైన నాయస్త్రంబు విడువ
దురమున నింద్రజిత్తుఁడు గట్టినట్టి, యురగపాశంబుల నూడ్చుకొన్నట్టి
యతఁ డెవ్వఁ డిటు చూపుఁ డతనిపైఁగాని, యతులితంబైన నాయస్త్రంబు విడువ
మూఁడులోకంబులు మునుమిడి గెలిచి, వాఁడిమి మగఁటిమి వ్రాలినశూరు
నలఘుబలోదీర్ణ నాకుంభకర్ణుఁ, దలఁ ద్రెవ్వనేసి యుద్ధతిఁ బేర్చియున్న
యతఁ డెవ్వఁ డిటుచూపుఁ డతనిపైఁగాని, యతులితంబైన నాయస్త్రంబు విడువ
దేవదానవయక్షదివిజులకాజి, భావింప నెక్కుఁడై పరఁగినయట్టి
రావణు నోర్చెద రణములో ననుచు, నీవిధంబున లంక కేతెంచుశూరుఁ
డతఁ డెవ్వఁ డిటుచూపుఁ డతనిపైఁగాని, యతులితంబైన నాయస్త్రంబు విడువ
నని పెక్కుగర్వంబు లాడుచునున్న, దనుజాధినాథునితనయునిఁ గిట్టి
కడిఁది కోపమున వృక్షంబులు గిరులు, నుడుగక కపినాయకోత్తములైవ
నవి యంతవట్టును నతికాయుఁ డెడనె, యవిరళమార్గణాహతిఁ ద్రుంచివైచి
గురుతరాస్త్రంబులఁ గుముదునిమూఁటఁ, గరముగ్రశరపంచకంబున ద్వివిదు
నరుదార మైందు నైదమ్ము లేడింట, శరభునిఁ దొమ్మిదిసాయకంబులను
ఘనతరబాణాష్టకంబున గజునిఁ, గినిసి బెట్టుగ నాలుగింట గవాక్షు
గవయుని నెనిమిది ఘనసాయకములఁ, దవిలి జ్యోతిర్ముఖుఁ దశమార్గణములఁ
బలుకాండముల శతబలిఁ బడేనింట, నెలమితో నీలుని నిరువదేనింటఁ
బెడిదంబుఁగా నేయఁ బృథివిపై నొరగి, కడుమూర్ఛనొంది రాకపివరులెల్ల
దివిజులు వెఱఁగంది దివినుండి చూడఁ, దవిలి వెండియును సుద్దండకోపమున
మృగముల దోలెడి మృగపతిమాడ్కి, నగచరావళిఁ దోలె నతికాయుఁ డపుడు
తోలియుఁ దన్ను నెదురొక్కనుకపుల, నేలనుఁ గూల్చుచు నిగిడి రామునకుఁ
బగతోడి భక్తి నప్పరమేశువలనఁ, దగ ముక్తిగలుగు నింతట నని తలఁచి
నిగిడి యారాఘవునికి నతికాయుఁ, డగలనిలెగువమై ననియె నవ్వుచును
రామ యీసమరధరాస్థలిలోన, నీమగఁటిమి చూపు నిక్కంబు నాకు
నెంతటివాఁడవో యెన్నఁడు నిన్ను, నింతటివాఁడని యెఱుఁగ రెవ్వరును
మాతండ్రికతమున మానిసివైతి, మాతండ్రికతమున మహి రాజవైతి
వమరేంద్ర యమవరుణాదిదేవతలఁ, గుమిలోన నొకఁడవు గావు నిన్నెదుర
గడముట్టశూరుఁడై కదిసినవానిఁ, గడిమిమై నెదురంగఁ గవియుదుగాక
యేను నీమగతనం బెఱుఁగనే ముందు, మానాభిమానము ల్మఱి నీకుఁ గలవె
గణుతింప నన్నెఱుంగవుగాక నీవు, గుణహీనుఁడవు సత్త్వగుణ మెంతుగలదు
ఏజాతిఁ గలవాఁడ వేమి చెప్పెడిది, రాజకులాచార రతుఁడవే నీవు
అనఘమానసమానసాటవుల్దూరు, ననుఁ జేరి పోరాడ నాయీడు గావు

గొనకొని వేదాద్రిగుహలలోనుండు, ననుఁ జేరి పోరాడ నాయీడు గావు
సనకాదిమునియోగిసదనములొచ్చెరుము, ననుఁ జేరి పోరాడ నాయీడు గావు
కాషాయవస్త్రసంకలితులై విగత,దోషులై భవరోగదూరులై పోయి
కూరలు గాయలు కూళ్లుగాఁ గుడిచి, నీరసాహారులై నిష్ఠల డస్సి
ఘోరాటవులలోనఁ గ్రుమ్మరుచున్న, వారిలోపలఁ బోయి వర్తింపు మీవు
కలహావిక్రమశక్తి కడపట లేదు, తలపోసి యెఱుఁగుదు తగిలి నీవావు
నొగి నొంటివాఁడవై యుండెడి నీకు, జగతిలో నీకపిసైన్యంబు గలిగె
దిక్కెవ్వరును లేక తిరిగెడి నీకు, దిక్కయ్యె నిప్పుడు దినకరాత్మజుఁడు
ఎక్కడ గురుఁడని యెఱుఁగని నీకు, నక్కడ గురుఁడు విశ్వామిత్రుఁడయ్యె
నాకదేశమును లేక యుండెడు నీకు, నకలంక మగునయోధ్యాదేశ మొప్పె
నివి నీకుఁ బెద్దగా నిచ్చలో నుబ్బి, తివురకు నీవింక ధృతిపెంపుఁ దూలి
చలియించి మీనమై సకలవారిధులు, సొలవక చొచ్చినఁ జొత్తుగాకేమి
తలఁపు నీమీఁదిదె తప్పదు నాకుఁ, బలుకు లేటికి నిన్నుఁ బట్టెద వెదకి
తలఁగ్రుచ్చి కూర్మమై ధరణిలోపలికి, సొలవక వచ్చినఁ జొత్తు గాకేమి
తలఁపు నీమీఁదిదె తప్పదు నాకుఁ, బలుకు లేటికి నిన్నుఁ బట్టెద వెదకి
యలిగి వరాహంబ వై రసాతలము, సొలవక చొచ్చినఁ జొత్తు గాకేమి
తలఁపు నీమీఁదిదె తప్పదు నాకుఁ, బలుకు లేటకి నిన్నుఁ బట్టెద వెదకి
చలమున వికృతవేషమున నెంచైన, సొలవక చొచ్చినఁ జొత్తు గాకేమి
తలఁపు నీమీఁదిదె తప్పదు నాకుఁ, బలుకు లేటికి నిన్నుఁ బట్టెద వెదకి
కడుగుజ్జవై నీవు కార్పణ్యవృత్తిఁ, బొడవేది పోయినఁ బోదుగా కేమి
తలఁపు నీమీఁదిదె తప్పదు నాకుఁ, బలుకు లేటికి నిన్నుఁ బట్టెద వెదకి
ధారణీసురవేషధారి కురారి, వై రాజసంహారి వగుదు గాకేమి
తలఁపు నీమీఁదిదె తప్పదు నాకుఁ, బలుకు లేటికి నిన్నుఁ బట్టెద వెదకి
అచ్చెరువగునరుణాంబుధిలోనఁ, జెచ్చెఱ నిన్ను మోచియుఁ దేలియాడఁ
బరికింప నల వటపత్రంబు గాదు, కరము భీషణము నాకంకపత్రంబు
దురమున ననుఁ నీకుఁ దొడరంగరాదు, వరగర్వమున నెందు వ్రాలినవాఁడ
ననివేర్చి పలికెడు నయ్యతికాయు, ఘనగర్వమునకు లక్ష్మణుఁడు గోపించి

లక్ష్మణాతికాయులద్వంద్వయుద్ధము.

యోరి నిశాట నేనుండ రాఘవుని,తో రణం బొనరింపఁ దొరకొన నేల
నాడెసఁ జక్కనై నడతెమ్ము నిన్ను, నాదుబాణముల భగ్నంబుచేసెదను
అని దానవునిగుండె లవియ నందంద, ఘనగుణధ్వని చేసి కదిసిన వాఁడు
నారభసంబున కాశ్చర్యమంది, క్రూరాస్త్ర మొక్కటిఁ గొని యార్చి పట్టి
నిలు నిలు లక్ష్మణ నీవుఁ బాలుఁడవు, వలదంత నీకంఱె వ్రాలినవాఁడ
నావరశరఘట్టనంబు సహింప, నీవసుంధర యొండె హిమగిరి యొండె
రావణుం డెత్తిన రజతాద్రి యొండె, దేవతలున్న ధాత్రీధరం బొండె

నంజకహరువిల్లు నడఁచి గర్వమున, రంజిల్లు మీయన్న రాఘవుం డొండె
గాక నన్ననిమొనఁ గదియ శక్యంబె, నీకు నాముందట నిలువంగఁ దరమె
యీవరబాణంబు నిట నిన్నుఁ గట్టి, త్రావెడు నీదురక్తంబు సౌమిత్రి
యని దురహంకృతి నాడిన నతఁడు, దనుజుఁడ నీకు వృథాగర్వ మేల
పోర నీలావు చూపుదుగాక నీకు, నీరిత్తమాట లింకేల నాయెదుట
నీవును శస్త్రాస్త్రనిచయంబుతోడ, నీవిధంబున రథ మెక్కి యుద్ధృత్తి
మానక యిటఁ బోటు మగవాఁడపోలెఁ, బూనియున్నాఁడ విప్పుడు నిశాచరుఁడ
యనవుడు కోపించి యతనిపై నేసె, దనచేతిబాణ ముద్ధతి వాఁడు దొడఁగి
యేసి యార్చిన దితి నింద్రాదిసురులు, నాసమయంబున నాశ్చర్యపడఁగ
వదలక రాఘవేశ్వరుననుజుండు, నది యర్ధచంద్రబాణాహతిఁ ద్రుంచి
చెలువార బ్రహ్మ వ్యాసినవ్యాత యింక, వలదని తా భువి వైచినకరణిఁ
జటులాస్త్ర మొక్కటి సంధించి వాని, నిటలస్థలము నాట నిపుణుఁడై యేసె
నేసిన రుద్రునియేటున వడఁకు, భాసురాసురపురప్రాసాద మనఁగఁ
జలియించి నాతోడ సమరంబుసేయఁ, గలిగె వీఁడని యతికాయుండు వేర్చి
కడిమిమై నరదంబుఁ గదియఁ దోలించి, తడయక యా రాముతమ్మునిమీఁదఁ
జల మొక్కటియె తక్క చంపవే నన్ను, చెలువున నొక్కనిశితబాణమేసె
మూఁడంబకంబులమూర్తి గాచినను, బోడిమిఁ దక్కింతుఁ బొమ్మన్నకరణిఁ
జటులవేగంబున సంధించి మఱియుఁ, బటుతరంబగు మూఁడుబాణంబు లేసె
ననయంబు బెరుకుదు నైదుప్రాణములు, ననుమాడ్కి వెండియు నైదమ్ము లేసె
నేడువార్ధలు సొచ్చి యీఁడిపోయినను, తోడనే నినుఁబట్టి త్రుంతు నన్నట్టి
కరణి నెంతయు భుజాగర్వంబు మీఱి, యిరవొంద సంధించి యేడమ్ములేసె
నవి వేగ లక్ష్మణుం డంతలోపలనె, వివిధఖండములు గావించి వెల్లార్చి
యతికాయుపై నేసె నాగ్నేయబాణ, మతఁడు నూఱేసె సారాస్త్రంబుఁ దొడిగి
యా రెండుశరములు నడరి యొండొంటి,తో రణం బొనరించి తుమురులై రాలె
చేకొని దనుజుఁ డైషికబాణ మేసెఁ, గాకుత్స్థతిలకుఁ డాకంపంబునొంద
నది యైంద్రమునఁ ద్రుంచెనడరి లక్ష్మణుఁడు, అది గని దైత్యుండు యామ్యాస్త్ర మేసె
నది ద్రుంచె నతఁడు వాయవ్యాస్త్ర మేసి, యదిగాక వెక్కమ్ము లసురవై నేయ
నవి వాని మైమసు వటుఁదాఁకి విఱిగి, భువిమీఁద నొఱిగినఁ బోక లక్ష్మణుఁడు
వెండియుఁ బెక్కేయ విఱుగుటఁ జూచి, కాండంబు లేమొకో కాడవు వీని
నని యని చింతించి యలయుచున్నంత, నెనలేనియామర్మ మెఱిఁగింతు ననుచు
నప్పు డాతనితోడ ననిలుండు వచ్చి, చెప్పె లక్ష్మణ బ్రహ్మచే వీఁడు వడసె
వరముగాఁ గోరి యీవజ్రకవచమ్ము, శరము లెవ్వియు వీనిఁ జాలవు నాటఁ
బలుచనియలుగాఁగ బ్రహ్మాస్త్ర మేసి, పొలియింపు మనవు డుప్పొంగి లక్ష్మణుఁడు
అది సమంత్రకముగా నార్చుచుఁ దొడిగి, త్రిదశారిసుతుమీఁదఁ దెగఁగొనియేసె
నేసిన బ్రహ్మాండ మెల్లను బగుల, వాసవుం డదర దేవతలు గంపింప

ధరణి వడంక దిక్తటము లల్లాడ, శరధులు ఘూర్ణిల్ల శైలము ల్వడఁకఁ
దరణిచంద్రులగతి దప్పంగఁ జుక్క, లురులంగ రత్నపుంఖోజ్జ్వలం బగుచుఁ
బ్రళయకాలమునాఁటి పావకుభంగి, నెలకొని లోకముల్ నిండి మండుచును
యమదండమునుబోలె ననిలవేగమునఁ, గ్రమమొప్ప నింతయుఁ గడురభసమున
నమ్మెయి బ్రహ్మాస్త్ర మరుదేరవైత్యుఁ, డమ్ములు నిగుడింప నవియుఁ గైకొనక
వచ్చుటయును శక్తి వైచె వైచుటయుఁ, జెచ్చెఱ నాశక్తిఁ జేకొన కదియు
లావున రాఁగ శూలంబున వైచె, నావిధంబును గొన కది మీఱి రాఁగ
గద వ్రేసె వ్రేసిన గదయును ద్రోచి, యది వచ్చుటయుఁ జూచి యడిదాన వ్రేసె
నది దాఁటిరాఁ బరశ్వాయుధం బెత్తి, వదలక వ్రేయ దీవ్రంబున నదియుఁ
గడవి యేతేరంగఁ గడఁగి కటారిఁ, బొడిచిన నందునఁ బోక వై రాఁగ
వలనొప్ప మొలనున్నవంకిని బొడిచెఁ, జలమున నది మీఱి చటులవేగమునఁ

అతికాయుఁడు లక్ష్మణునిచేఁ జచ్చుట.

బోవ కేతెంచినఁ బొడిచెఁ బిడికిటను, జేవతల్ దలలూఁప దివిరి యాశరము
మండితకోటీరమండలితోడఁ, గుండలంబులతోడఁ గూల్చెఁ దచ్ఛిరము
నటువజ్రహతి రోహణాద్రిశృంగంబు, చటులతఁ గూలిన చాడ్పునఁ బడ్డ
నతికాయుతలఁ జూచి యతిభీతిఁ బొంది, హతశేషులైన దైత్యాధముల్ పఱచి
లంకఁ జొచ్చుటయుఁ గెలంకుల కపులు, నంకించి రెంతయు నారామతమ్ముఁ
డరుదెంచి శ్రీరామునడుగుల కెరఁగఁ, గరము సంతోషించి కౌఁగిటఁ జేర్చి
వినుతించు నాకపివీరులతోడ, ననయంబు హర్షించె నవనీశుఁ డంత
నాదైత్యనాథుండు నయ్యతికాయుఁ, డాదిగాఁగలదైత్యు లార్వురు వడుట
విని మూర్ఛపాల్పడి వేగంబె తెలిసి, ఘనముగాఁ గన్నీరు గ్రమ్మ నందంద
నతిదుఃఖమునుబొంది యడలుచునున్న, పతికడ కేతెంచి పల్కె మయుపుత్రి
యసురేశ లోకంబు లన్నిటిలోన, నసమానసత్త్వుఁడ వైన నీకిట్లు
పాడియె శోకింప బంటవై నీవు, నాఁడేల తెచ్చితి నరనాథుదేవి
నొప్పింపనేరవై తుచితకాలమునఁ, దప్పె నారామునిఁ దలపడ్డదైత్యు
లరుదెంతు రనుమాట లవియుఁ బోవిడువు, సురవైరి యాజిలోఁ జూపు నీకడిమి
యనుమాట లాలించి యాత్మ జింతించి, వనిత నంతఃపురవరమున కనిచె
నిలిచినవగలతో నిట్టూర్పుఁ బుచ్చి, తనమంత్రివరులతో దశకంఠుఁ డనియెఁ
గటకటా! తమ్ములు గాదిలిసుతులు, నిటు నేలఁ గూలి రింకేమనఁ గలదు
విబుధులకైనను విడిపింపరాని, ప్రబలంబులగు నాగపాశబంధములఁ
బాసిరి మాయపోఁ బలిమినో మనుజు, లాసచేసినఁ జెల్ల దది నాకు జయము
ఆరామతమ్ముని నాజిలో గెలుచు, వీరుని నెవ్వని వెదకియుఁగాన
భయమెన్నఁడును లేక పరఁగు నీలంక, భయమును బొందె నాబలియులవలన
నారామవిభునిపరాక్రమంబునకు, మేర యెయ్యెది యిఁటమీఁద నీలంక
యతనిచేఁ జెడకుండ నరసి యేమఱక, ప్రతిదినంబును గావఁ బంపుఁడి యనుచు

నంతగపురంబున కరిగి యొక్కరుఁడ, యంతరంగంబున నడలుచునుండె
నప్పుడు చనుదెంచి యామేఘనాదు, డప్పంక్తికంరున కనియె నింపార
నే నీకుఁ గలుగంగ నిటు వగపేల, దానవాధీశ్వర తగదు చింతింపఁ
బటుతరంబైన నాబౌణసంహతికి, నెటు సహింపఁగఁజాలు నీశ్వరుండైన
నటు చూడు రాముని నాతనితమ్ముఁ, జటులాంబకముల జర్జరితులఁ జేసి
యసువులు వెఱకి యయ్యగచరావళుల, వసుమతిపైఁ గూల్చి వచ్చెదఁ గడిమి
విబుధకంటక నేఁడు వినుము నాప్రతిన, విబుధలోకేశుండు విష్ణుండు యముఁడు
శిఖియును రుద్రుండు సితకరార్కులును, నఖిలసాధ్యులు బలి యజ్ఞవాటమున
నేచి విజృంభించునెడఁ ద్రివిక్రమునిఁ, జూచినగతి నన్నుఁ జూతురుగాక

ఇంద్రజిత్తు రెండవమాఱు యుద్ధమునకు వెడలుట.

యని వీడుకొని దివ్య మగురథంబెక్కి, దనుజేంద్రతనయుఁ డెంతయు సొంపుమీఱి
నడువంగ నప్పుడు నానాముఖములఁ, గడువేగమున నుర్వి గదలగాఁ గదలి
వెడలె రథంబులు వెడలె నేనుఁగులు, వెడలె గుఱ్ఱంబులు వెడలెఁ గాల్బలము
పుండరీకంబుల బొలుపారువారు, పుండరీకాక్షులఁ బొలుపారువారు
పుండరీకచ్ఛాయఁ బొలుపారువారు, పుండరీకోన్నతిఁ బొలుపారువారు
నప్పు డుగ్రతఁ జతురంగసైన్యముల, నొప్పిరి దానవు లుగ్రాసనముల
నార్పులు బొబ్బలు నతులఘోషములు, దర్పితసింహనాదస్ఫురణములు
నేమిరవంబులు నిస్వానరవము, రామణీయకము లుగ్రంబులై యమర
భాసురధవళాతపత్ర మొప్పార, నాసుధాకరుతోడి యాకాశ మనఁగఁ
గమలలోచనములు గ్రాల నందందఁ, బ్రమదాజనము చామరంబులు వీవ
బహుభూషణప్రభాపటలంబు వెలుఁగ, సహజవైభవమహోజ్జ్వలుఁ డింద్రజిత్తు
చనుదెంచి రణమహీస్థలమున నిలిచి, ఘనభుజుం డత్యంతకౌతూహలమున
రక్తవస్త్రంబుల రక్తమాల్యముల, రక్తగంధంబుల రాజితుం డగుచు
వరమంత్రముల హుతవహుఁ బ్రతిష్ఠించి, శరములు తోమరచయములు వరుసఁ
బరిధులుఁగాఁ జేసి పలుస్రుక్స్రువములు, కరమర్ది లోహముల్‌గా సంఘటించి
తనలోని నిష్ఠయుదాత్తమై యొప్ప, దనుజేంద్రతనయుఁ డథర్వణోక్తముగఁ
దగ నెయ్యి లాజలు దాడిసమిధలు, నొగి వేడ్క వేల్చుచు హోమాంతవేళఁ
గడిది కృష్ణచ్ఛాగకంరరక్తంబు, నడరెడువహ్నిఁ బూర్ణాహుతి వేల్వ
ననలుండు పొడసూపి హవ్యముల్ గొనియె, ననలునికరుణ బ్రహ్మాస్త్రంబు రథము
ధనువును గవచంబుఁ దద్దయుఁ బ్రీతిఁ,గొని యార్చుటయును దిక్కులు వెల్లగిల్ల
దానవుం డర్కేందుతారకాసమితి,తో నభం బగులంగ దుర్దాంతుఁ డగుచు
రథరథ్యకేతుసారథులతో నెగసి, ప్రథితవేగమున నంబరవీథి డాఁగి
యగణితబలసత్త్వుఁడై యొప్పఁ బలికెఁ, దగియెడుబుద్ధిగాఁ దనసేనతోడఁ
దరలక నిలిచి యుద్ధము సేయుచుండుఁ, డురక యేనిచె దివిసుండి ఘోరముగ
రణ మెనరించి యారామలక్ష్మణుల, గణుతింప కెంత వేగమె చంపువాఁడ

ననిన నుత్సాహవాక్యము విని వేర్చి, దనుజులు సేనావితానంబుతోడఁ
దరుచరసేనలు దరియంగఁ జొచ్చి, బరవసంబునఁ బెక్కు-భంగులఁ బోర
నాదివినుండి దివ్యాస్త్రంబు లేయ, నాదానవునిదెస కగచరు లెగసి
యగములు వైవంగ నవి క్రుంచి గుండె, లగలించి పెక్కుండ్ర నవనిపైఁ గూల్చి
వేగంబె యొక్కొక్క-విషమబాణమున, నేగురఁ దొమ్మండ్ర నేడ్గుర నేసె
మఱియును గడిమిమై మర్కటేశ్వరులు, నెఱసిన గిరిధరణీజంబు లెత్తి
యాయింద్రజిత్తుపై నడరింప నతఁడు, సాయకంబుల వానిఁ జతురుఁడై త్రుంచి
పదియు నెన్మిది తీవ్రబాణంబు లేసె, మదమెల్లఁ జెడ గంధమాదనుఁ గడిమి
దీపింప నలుఁ దొమ్మిదిట రూపుమాపె, నేపార మైందుని నేడింట నొంచెఁ
గదిసి పంచకమున గజుని నొప్పించెఁ, బదియింట భల్లూకపతిఁ గూలనేసె
నూటను హనుమంతు నొప్పించి మించె, మూఁట గవాక్షుని మొగి గాడనేసెఁ
బదియింట హరిరోమప్రాణముల్ గొనియె, నదటణంగ గరంబు నాఱింటనేసెఁ
దగిలి యాఱిట వేగదర్శి భంజించెఁ, దెగి సుషేణుని నెన్మిదింట నొప్పించె
ననయంబు పదిట సూర్యప్రభు నొంచెఁ, బనసునియంగంబుఁ బదుమూఁట నేసె
ఘనతరబాణాష్టకంబునఁ గుముదు, నెనసి నీలుని ముప్పదింటను ముంచె
మసలక మఱి పెక్కు-మార్గణంబులను, రసికతదూలఁ దారాతనూభవుని
సునిశితంబైన యాశుగముల నూట, దినపనందనుని నైదిట నింద్రజాలు
గిరిభేది రెంటను గెడపి యాబుషభు, నిరువదిశరముల నిలఁ ద్రెళ్ళ నేసెఁ
గేసరి పదునాలుగిట దధిముఖుని, భాసురంబుగ బాణపంచకంబునను
సుముఖునిఁ గ్రధనుని సొరిది నాఱింట, విముఖు నేడింటను ద్వివిదు నాఱింట
శరభు నేడింటను శతబలిఁ బదిట, సరి నెన్మిదిట హరు సన్నాదు మూఁట
నరుదుగాఁ దక్కిన యఖిలయూథపుల, వరదివ్యశస్త్రాస్త్రవర్షంబు గురిసి
కడుభిన్నగాత్రులఁగాఁ జేసి నేలఁ, బడవైచి మఱి గతప్రాణులఁ జేసి
కొందఱ నమ్ములు గొని గాడనేసి, కొందఱ గదలెత్తుకొని బిట్టువ్రేసి
కొందఱ శూలముల్ గొని గాడనేసి, కొందఱ శక్తులు గొని నిగుడించి
దనుజేంద్రతనయుఁ డెంతయుఁ బ్రతిలేక, తనరు బ్రహ్మాస్త్రమంత్రప్రభావమున
నందఱ నీక్రియ నందందఁ బేర్చి, యెందును బోనీక యయ్యింద్రజిత్తుఁ
డున్న వానరసేనయును జంపివైచి, యున్నతజయమున నుగ్రుఁడై యార్చెఁ
గపికోటి నొచ్చినఁ గడఁగి సౌమిత్రి, కుపితుఁడై యన్నఁ గన్గొని విన్నవించె
దేవ బ్రహ్మాస్త్రంబు దీపింపఁజేసి, రావణసహిత మీరాక్షసకోటి
నంతయుఁ జంపెద నానతి యిమ్ము, చింతింపనేటికిఁ జెచ్చెఱ ననుడు
వీనిమాయలఁ జేసి వీనిరూపంబు, గాననియప్పుడు గడఁగి లోకములు
భస్మంబునేయుచు బ్రహ్మాస్త్ర మరుగు, విస్మయంబగు బలావిర్భావ మెప్పుఁ
గావున వీనికై కడఁగి లోకముల, నీవేల కాల్చెదు నిష్ఠురవృత్తి
నీరాక్షసుఁడు బ్రహ్మ యిచ్చినవరము, కారణంబునఁ జేసి కపికోటిఁ జంపె

ననయంబు మనమింక నాబ్రహ్మవరము, మనమున నొకకొంత మన్నింపవలయు
నని పల్క నింద్రజిత్తారఘుకులుల, ఘనబాణములనేసె గదలక నిలిచి

ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రముచే రాముఁడు మొదలగువారల మూర్ఛనొందించి మరలుట.

గర్వితుండగు దశకంఠనందనుఁడు, పర్విన నీలాభ్రపటలంబుగాఁగ
నడరించు కార్ముకజ్యానినాదంబు, లుడుగక వెస మ్రోయనుఱుములుగాఁగ
వడిఁ బూన్చి వైత్యుఁడు వైచుచు నున్న, బెడిదంపుశక్తులు పిడుగులుగాఁగ
నగణితదివ్యశస్త్రావళియందు, మిగిలినదీప్తులు మెఱుఁగులుగాఁగఁ
బొరిఁబొరిఁ బుంఖానుపుంఖంబు లగుచు, నరుదెంచు నమ్ములు నతివృష్టిగాఁగఁ
గరుల నొప్పిన సెలకట్టియ లెల్లఁ, దఱుచుగా నాడు చాతకములుగాఁగ
కనకరత్నప్రభాకలితంబు లగుచుఁ, దనరుచాపం బింద్రధనువునుగాఁగ
నసురులయందును నగచరులందు, వెసఁ గ్రమ్ము నెత్తురు వెల్లువగాఁగ
బింబహారములకుఁ(?)బాసినమాక్తి,కంబులు నెరి వడగండ్లనుగాఁగ
నురులినమకుటమహోజ్జ్వలమణులు, పరఁగంగ నింద్రగోపంబులుగాఁగ
లాలితాయతకాహళారవంబులును, వ్రాలిన కేకారవంబులుగాఁగ
సమధికపటహోగ్రసన్నాహరవము, రమణీయమండూకరావంబుగాఁగ
నసమున రఘుపతి హలికుఁడై పేర్చు, నసురేశు విపులదేహక్షేత్రమునను
అడరి లోకములెల్ల నలరంగ ముష్టి, విడువక యమ్ములు వెతఁ బెట్టుకొఱకు
వచ్చిన తోలుకరివానకాలంబు, నచ్చుగా నొప్పారె నాసమయంబు
గానఁగదా యింకఁ గడఁగి రాఘవుఁడు, మానిక బాహుసమగ్రతఁ బూని
కలనికి నద్దశకంఠునిఁ దెచ్చి, తలకోత కోసి యుద్దండత నునుచు
ననిన చందంబున నతివిచిత్రముగ, నెనయంగ డెబ్బదిరెండువెల్లువల
వనచరులను నృపవరుల జయించి, ఘనతరజ్యానాదకలితుఁడై మగిడి
యాలంబు చాలించి యాయింద్రజిత్తు, డాలంకలోనికి నరిగె నవ్వచును
మనుజేశుదురవస్థ మది విచారించి, కనుఁగొనఁజాలక కన్నులు మొగిచి
కొని తోఁడినమాడ్కిఁ గ్రుంకె నర్కుండు, వనచరాననపద్మవనములు మొగుడఁ
గపికోటిచే లంక కాలుచో ధూమ, ముపమింప నీగతి నుండు నన్నట్లు
కడునగ్గలముగ లోకంబెల్ల నిండి, తడయ కెంతయు నంధతమసంబు పర్వి
నప్పుడు తొడిగి బ్రహ్మాస్త్రమంత్రంబు, లొప్పఁ జపింపంగ నొకటియుఁ గాక
నున్న విభీషణుఁ డుర్వరఁ గూలి, యున్న సుగ్రీవాది యోధులఁ జూచి
వనచరులార గీర్వాణారిసుతుఁడు, వనరుహగర్భనివరమునఁజేసి
పన్ని యేయుటయును బ్రహ్మాస్త్రశక్తి, మన్నింపఁదగునని మనమునఁ దలఁచి
వంచించి యారామవసుమతీనాథుఁ, డించుక సైఁచినాఁ డింతయే యనుఁడు
వాయుసూనుఁడు బ్రహ్మవరమునఁజేసి, యాయింద్రజిత్తుదివ్యాస్త్రసంతతులఁ
జావకుండుట విభీషణుతోడ ననియె, భావింపు మిప్పుడు భండనభూమి
నిటఁ బడ్డవారిలో నెవ్వరు గలరు, పటుబాణహతులయ్యు బ్రతికినవారు

అని యిద్దఱును గూడి యంధకారమునఁ, గొనకొని మండెడి కొఱివులు బట్టి
కొని కలనెల్లను గ్రుమ్మరునపుడు, ననయంబు నాసంగరావనిలోన
నందంద నుడుగక యాడునట్టలును, క్రందుగా మాంసము ల్గఱచుభూతములు
బెడిదంబుగానార్చు బేతాళములును, అడరెడురక్తంబు లానుఢాకినులు
కండలు గబళించు కంకగృధ్రములు, కొండొండ నెలుఁగిచ్చు నురుసృగాలములు
గెడసి రక్తములు గ్రక్కెడిభల్లుకములు, నుడుగక యందంద నొరలు కోతులును
గుదిచి కాళ్లను దన్ను కొనువలీముఖులు, కదిసినదంతము ల్గలప్లవంగములు
లావరిపడిన గోలాంగూలములును, భావింపరాని రూపముల వానరులు
కీలాలవారిఁ దోఁగినయగచరులు, కేళిమైధూళి బ్రుంగినవనచరులు
పదుగుర నేబండ్రఁ బ్రదర మొక్కటను, గుదులు గ్రుచ్చినక్రియఁ గూలినగఫులు
అంతంతఁ దుత్తుము లైనశైలములు, నింతింతలైన మహీరుహములును
ఖండంబులైన రాక్షసులశస్త్రములు, దండిగాఁ దునకలై ధరనున్నగదలు
నిండిన సామజనికరముల్ సమర,మండలిఁ బడియున్న మఱి వెఱఁగంది
కనుఁగొని ఖిన్నులై కడుదుఃఖ మడరి, యనిరి విభీషణహనుమంతు లఫుడు
వలయుకార్యము జాంబవంతుని నడుగ,వలయుకార్యంబు లవల నాతఁ డెఱుఁగు
నతఁడున్నయెడ నింక నరయుద మరసి, యతఁడు చెప్పినట్లోవ నరుగుద మనుచుఁ
గలనెల్ల వెదకుచుఁ గనుఁగొని రఫుడు, బలితంపుశరశయ్యఁ బడియున్న వానిఁ
గని జాంబవంతు డగ్గఱి దైత్యనాథుఁ, డనియెఁ బెద్దయు నార్తుఁడై వగనొంది
బ్రతికియున్నాఁడవే పలుకంగఁగలవె, యిదె ఋక్షరాజ మమ్మెఱుఁగుదె యనిన
దానవుశరహతి దర్పంబు దక్కి, హీనసర్వంబున ఋక్షేశుఁ డనియె
స్వరవిశేషంబు విచారించి బుద్ధి, పరికించి నీవని పలికెదఁగాని
కలయ నమ్ములు కండ్ల గాడుటఁజేసి, చలితదృష్టిని విభీషణ గానరాదు
చెవులకు నింపుగాఁ జెప్పుము నాకు, పవమానసూనుండు బ్రతికియున్నాఁడె
యనవుడు వెఱఁగంది యాజాంబవంతు, కనియె విభీషణుఁ డతిసంభ్రమమునఁ
గడువెఱఁ గయ్యెడు ఘనుఁ డైనరాము, నడుగక లక్ష్మణు నడుగక యినజు
నడుగక యంగదు నడుగక యతని, నడుగుట యేతలం పగు ఋక్షరాజ
యనిన విభీషణా హనుమంతుఁ డొకఁడు, తనువుతో నుండినఁ దరుచరులెల్ల
బ్రతుకుదు రాతఁడు బ్రతుకఁడేనియును, బ్రతికియుండిననైన బ్రతుకరు కపులు
అనుమాట విని ముదం బంది వాయుజుఁడు, దనపేరుఁ జెప్పి పాదములకు మ్రొక్కె
మ్రొక్కిన నెఱిఁగి యిమ్ముల ఋక్షరాజు, తక్కక యాత్మ ముదంబునుబొంది
తనుఁ బునర్జాతుఁగాఁ దలపోసి యనియె, ననిలనందనుతోడ నర్థి దీపింప
దలపోయ వాయునందన నీవుబక్కఁడ, గలుగునే యొక్కఁ డీకపులకు దిక్కు
అదిగాక యిప్పు డీయంబుధిఁ దాఁటి, వదలక యాహిమవంతంబు గడచి
హేమకూటంబును ఋషభపర్వతము, నామేరువును రజతాద్రియుఁ గడచి
శ్వేతాచలము దాఁటి శీఘ్రంబు మెఱసి, యాతతమగులవణాంబుధిఁ గడచి

యరిగి శాకద్వీప మవ్వలి కేగి, తరఁగల నొప్పు సుధావార్ధి దాటి
చంద్రశైలద్రోణశైలమధ్యమున, సాంద్రదీధితుల నుజ్జ్వలత వహించి
తిరమైన యాయోషధీశైల మెక్కి, కర మొప్పు సంజీవకరణి విశల్య
కరణియు సంధానకరణి సౌవర్ణ్యకరణియు నానాల్గు గలవౌషధములు
అవి తెచ్చి యీవానరావళినెల్లఁ, బవనతనూభవ బ్రతుకంగఁ జేసి
రాగంబు నొందింపు రామలక్ష్మణుల, వేగంబె యనవుడు విని వాయుజుండు

ఆంజనేయుఁడు ఓషధీశైలము దెచ్చి రామలక్ష్మణాదుల మూర్ఛ జేలించుట.

అతని వీడ్కొని సువేలాచలం బెక్కి, చతురుఁడై పదములు సమముగా మెట్టి
లలితశేషాభవాలము మీఁదికెత్తి, నెలకొని భుజములు నిక్కించి పొంగి
రామునిఁ దలఁచుచు రయమున నెగయ, నామహనీయాద్రి యవనిపైఁ గ్రుంగె
చెనలు గంపించె దిర్దిరథాత్రి దిరిగె, నసమానమైనట్టి యారభసమున
నతఁ డట్టు లెగసి యయ్యాకాశవీథి, నతిభీషణంబైన యంబుధి దాటి
హరిచక్రమునుబోలె నరుగుచు నడుమ, తరమిడి పెక్కుచోద్యములు గన్గొనుచు
సాంద్రఫేనామృతజలనిధి దాటి, చంద్రశైలద్రోణశైలమధ్యమున
తిరమైన యాయోషధీశైల మెక్కి, యరయుచు వచ్చుచో నాయోషధములు
కామరూపులుగాన గపిశేఖరునకు, నేమియుఁ బొడచూపనీవయ్యెఁ దమ్ము
ననిలనందనుఁడును నవి గానకుండి, తనలోన నందందఁ దలపోసి చూచి
యితివినయంబున నాపర్వతంబు, నతులగుణోదాత్తుఁ డై వేడఁ దొడఁగెఁ
బ్రాలేయగిరియును బర్జన్యగిరియుఁ, గైలాసగిరియును గైకొన కేను
క్రన్నన వచ్చితిఁ గారాన్యతురుండ, నిన్ను నుద్దేశించి నిఖలాద్రినాథ
నీయందు నిర్జరుల్ నెఱిదాఁచియున్న, యాయోషధము లెవ్వి యవి నాకుఁ జూపు
మారాఘవునకుఁ గార్యము పుట్టియున్న, దేరూపముననైన నిచ్చుట లెస్స
యనిన నగ్గిరి యట్టహాసంబుచేసి, యనిలనందనుతోడ ననియె గర్వమునఁ
బెలుచ నీవిటువచ్చి పెక్కులాడెదవు, తలఁకక యాయోషధములు నన్నడుగ
నీవెంతవాఁడవు నిన్ను దెమ్మనఁగ, నేవిధంబున రాముఁ డెంతటివాఁడు
చేకొనిసురలు దాఁచినయోషధములు, నీకు నిచ్చుటకంటె నేగమి గలదె
యని గర్వమూడిన ననిలనందనుఁడు, కినుకతో ననియె నగ్గిరితోడఁ బేర్చి
యేనిన్ను వలెనని యిటు వేడుఁగొనిన, దాని విచారింపఁ దగదొకో నీకు
నగలించి నాభుజాయతశక్తి నిన్ను, నగమ మూలోన్మూలనంబుగాఁ బెఱికి
యిదె కొనిపోయెద నెఱుఁగనిరాము, హృదయంబులోఁ నప్పు డెఱిఁగెదుగాక
యని భీషణంబుగా హనుమంతుఁ డద్రి, యనువారగాఁ బట్టి యగలించి వేర్చి
పెఱికి గంధర్వుల బెదరంగఁదోలి, గురుతిడరాకుండఁ గొనిరాఁ దొడంగె
ననిలనందనుఁడు సహస్రధారలను, ఘనముగా మండు చక్రముతోడి విష్ణు
కరణి నేతేర రాఁకసవీరముక్త, శరహతి నొచ్చి మూర్ఛల నున్నకపులు
వరమహౌషధవాతవశతచేఁ దేరి, కరము సంప్రీతితోఁ గడఁగి యార్చుచును

అనిమొనఁ బడిన వైతాళ్యావళిఁ గిట్టి, వనధిలోఁ బాఱంగ వైచిరి చెలఁగి
హనుమంతుఁడును సువేలాద్రివైనుండి, చనుదెంచి యాకపివైన్యంబునడుమ
మహనీయమైనట్టి మందులకొండ, మిహిరప్రతాపుఁడై మెల్లన డించి
తపనవంశజులగు తపనసుతాది,కపిముఖ్యులకును స్రుక్కక ప్రయోగింప
ధీయుక్తి నట మూర్ఛఁ దెలిసిరి వారు, నాయౌషధములమహత్త్వంబువలన
ననిమొనఁ దునక లైనట్టిదేహాములు, ఘనమైన సంధానకరణిచేఁ గదిసె
శరపుంజముయశస్రచయము విశ్వల, కరణిచే నపుడూడి గండులు పూడె
సౌవర్ణకరణిచే సకలాంగకములు, సౌవర్ణ కాంతి సుజ్జ్వలములై మించెఁ
గలయంగ సంజీవకరణిచేఁ బ్రాణ,ములు వచ్చి చెలఁగుచు మునుపటికంటెఁ
గడునొప్పి రెంతయుఁ గపివీరులెల్లఁ, గడఁకతో నిద్రమేల్కనినచందమున
నప్పుడు కపివీరు లనిలనందనుని, నొప్పార నగ్గించి రుత్సాహ మొదవ
ననిమొనఁ జచ్చిన యసురులఁ గపులు, వనధి నంతకుమున్నె వైచుటఁజేసి
కదనంబులోని రాక్షసుఁ డొకఁడైన, బ్రతుకుటలేదయ్యెఁ బరమౌషధముల
నంత సుగ్రీవాదు లైనవానరులు, సంతసంబున సూర్యచంద్రులభంగిఁ
గరమొప్ప రామలక్ష్మణులకు మ్రొక్కి, యరుదార నుతియించి రనిలనందనుని
నప్పుడు మ్రొక్కెడు నాంజనేయునకు, నుప్పొంగ విబుధాళి యుర్వీశుఁ డనియె
మనకు వాసవునాజ్ఞ మన్నింపవలయు, ననయంబు గావున నమరులు మెచ్చ
నీయౌషధీశైల మెప్పటిచోట, వాయుతనూభవ వైచి రమ్మనుఁడు
మారుతాత్మజుఁ డసమానవేగమున, నారాఘవుఁడు మెచ్చ నగ్గిరిచంద్ర
నెనయ నెప్పటిచోట నిరవొంద నునిచి, చనుదెంచె రయమున సంగరస్థలికి
అంత సూర్యోదయం బయ్యె రాఘవుని, చింతతోడనె కూడి చీఁకటి వాసె
నప్పుడు సుగ్రీవుఁ డారామచంద్ర, నొప్పారఁ గనుఁగొని యుల్లాస మెసఁగ
వసుధేశ పాలిసె రావణుబలంబెల్ల, నసమసాహసబలాహవకేళి వ్రాలి
గుదులు గ్రుచ్చినక్రియఁ గుంభకర్ణుండు, మొదలైన రాక్షసముఖ్యులందఱును
అదిగానఁ దనవర్గ మంతయుఁ గడఁగి, త్రిదశారికయ్యంబు తెఱఁగొల్లఁ డింక
లంకఁ గాల్పంగ గోలాంగూలబలము, పంకజహితవంశ పనుపు మీరాత్రి
ననుమాట విని కపులందఱుఁ గూడి, యినమండలము స్రుంకు మొప్పుడో యనుచుఁ

వానరులు లంకం గాల్చుట.

దమకింపుచుండంగఁ దరణి స్రుంకుటయుఁ, దమమును పెద్దయై దట్టమై పర్వ
అప్పుడు కపివీరు లధికరోషమున, నుప్పొంగి ధీరులై యుగ్రులై కపులు
గునియుచు నార్చుచు గొరవులు పట్టి,కొని జవంబులు మీఱ గుప్పించి దాఁటి
వడి లంక ముట్టియు వాకిళ్ల వారు, కడుభయంబునఁ బాఱఁగా లంకఁ జొచ్చి
యారావణునిపురి యడలి కాల్చుటకు, నారామవిభునికోపాగ్ని యేమిటికి
నీయనలము చాలదే యని వేర్చి, పాయక లంకఁ గాల్పంగఁ జొచ్చుటయు
అనలుండు దరికొని యందందఁ బర్వి, వినువీథిఁ దాఁకి దిగ్వీవరంబు నిండె

నాయగ్ని బడబాగ్ని యై ధూమపటలి, తోయమై మిన్నప్డు తోయధివోలె
విస్తయంబుగ మణివితతులు చెదర, భస్మంబుగాఁ గాలెఁ బ్రాసాదతతులు
పొడిపొడిగాఁ గాలి పొడవెల్ల నడఁగి, పుడమి గంపింప గోపురములు గూలె
గ్రక్కున మంట లుగ్రంబుగా నెగయ, నక్కజంబుగఁ గాలి యట్టల్లు రాలె
మహనీయకాంచనమంటపంబులును, బహురత్నమయగృహపంక్తులు గాలె
నిండినసొమ్ములు నిండినట్లుండ, భండారగృహములు భస్మంబులయ్యె
వెలలిడగారాని వివిధాంబరములు, దలఁపఁ బైకైకొన గంధద్రవ్యములును
బహువిధరత్నకంబళచయంబులును, మహనీయమరకతమాక్తికాదులును
అగరు కుంకుమ మలయజ ఘనసార, మృగమదాద్యములైన మేలివస్తువులు
దరగని బహువిధధాన్యరాసులును, మఱియును గల్గిన మహితవస్తువులు
కడునొప్పు కరితురంగముల పక్కరలు, నెడనెడఁ బ్రోవుఁగా నిడినట్టిజోళ్లు
దొరల నానేకవస్తువులు దైత్యులకుఁ, గరకరిచి త్తము ల్గ్రిందంగఁ గాలెఁ
దడయక పైఁడికత్తళములు వూని, వడి నాయుధములు దుర్వారులై వూని
కపులఁ జంపెదమని గడఁగినవారిఁ, గపులపైఁ బఱతెంచి కదిసినవారిఁ
బొలఁతులతో సుఖంబుల నున్నవారిఁ, దొలఁగంగనేరక తూలెడువారిఁ
బోలింపఁ గడునిద్ర బోయెడివారి, బాలురగొని భీతిఁ బాఱెడువారి
నాలుగుదెసలకు నలి నేగువారిఁ, జాల రోదనములు సల్పెడువారి
నార్పంగ నురుమందిరాగ్రంబు లెక్కి, నేర్పున మఱి దిగనేరనివారి
విడువక ధనముల వెడలంగఁ బట్టి, కడుసంభ్రమంబునఁ గదిసినవారి
ద్రోవలు గానక ధూమంబుచేత, నావలింపుచుఁ బడి యడలెడువారిఁ
గూడి నివ్వెఱఁగంది గుమురులుగట్టి, వాడవాడలయందు వదరెడివారి
నప్పుడు చూడఁ గాలాగ్నిచందమున, నిప్పులు మంటలు నెరయు నప్పురము
గాలుచు నందందఁ గడురభసమున, గాలిచేఁ జెడిరి పెక్కండ్రు నవ్వేళ
లలనలమణిమేఖలారవంబులును, గలయఁ జెన్నొందు కంకణరవంబులును
బొలుపారు రత్ననూపురరవంబులును, చెలఁగెడునా విపంచీరవంబులును
సురుచిరమధురవచోరవంబులును, నరుదైననృత్తగీతారవంబులును
గరమింపుఁ గులుకు కేకారవంబులును, చరియింపుచుండు హంసలరవంబులును
సొంపారు పంజరశుకరవంబులును, ఇంపారు ఱెంతయు నేలతోఁ గలిసి
సలలితంబైనట్టి చంద్రికకంటె, తెలుపుచుబొందిన దీధితుల్గలిగి
ప్రణుతింప నొచ్చిన పద్మరాగాది,మణులచే నొప్పిన మహిమలు బలసి
కాలెడిరవములఁ గప్పెడి పొగల, వ్రీలి పెల్లెగనెడి విస్ఫులింగముల
నాలంకలోపలి హర్మ్యంబులెల్ల, చాల భీషణముగా సమసె నన్నియును
గాన సుఖంబెల్ల గ్రాగి నీహారి, మానినీజను లభిమానంబు దూలి
చండతరంబైన శబ్దంబుతోడ, మండుచు నుండెడి మంటలఁ గూలి
నెఱయైన తోరణనికరంబు లొప్పె, మెఱుఁగులతో నొప్పు మేఘుంబు లనఁగ

వినువారిగుండెలు వీనులు బగుల, ననయంబు బెట్టుగా నాలంకలోన
తరమిడి యందంద దైన్యంబు మీఱే, వరవధూరోదనంబులు వినవచ్చెఁ
గాలి కాలక తమకట్టులు ద్రవ్వి, నీలిగి విడివడ నేరనికరులు
హాయములు గ్రందుగా నాపురంబందు, రయమున ముందఱి రాముబాణాగ్ని
తలకొని జలచరతతులు సమ్మర్ద,ములను ఘూర్ణించు సముద్రంబువోలెఁ
బారెడువారినిఁ బఱతెంచువారిఁ, గూరినవగలతోఁ గుందెడువారి
నొదిగెడివారిని నొకకొంత గాలి, విదిలించికొంచును వెడలెడివారి
లంఘించువారి విలాపించువారి, సంఘంబులై నీరు చల్లెడివారిఁ
బట్టి యామంటలో బడఁద్రోచి త్రోచి, నెట్టన నార్తురు నెరయంగఁ గపులు
అటు లంక వికలతనంద రాఘవుఁడు, పటుతరకోదండపాణియై కదిసి
త్రిపురము ల్నాధింపఁ ద్రిణయనుఁ డలిగి, విపులపినాకంబు వీఁక మ్రోయించు
కరణి నిర్వక్రవిక్రమశాలి రాముఁ, డురుతరజ్యాఘోష మొనరించుటయును
వసుధాతలంబున వడిఁ జుక్క లురిలె, వసుమతి గంపించె వార్ధులు గలఁగె
దెసదప్పిరినశేషు ల్ధివిజాద్రి యొఱగె, దెసల సందులు వ్రీలె దిక్కరుల్ బెదరె
నసమాశుఁ డతివిస్మయంబందె భూత,విసరంబు ఘూర్ణిల్లె విధి తల్లడిల్లె
రయమున రోధోంతరాళంబు మ్రోసె, భయమంది రెంతయుఁ బొలస్తు్యలెల్లఁ
గోదండరవము రక్షోభటసింహ,నాదంబు వీరవానరులయార్పులును
దిక్కు లొక్కట నిండె దివిజారిపురము, దిక్కుగోపించుచుఁ దీవ్రవేగమునఁ
గైలాసశిఖరంబుకరణిఁ జెన్నొందు, నాలంకగోపురం బైదుబాణముల
వడి నూఱుతునియలై వసుమతిమీఁదఁ, బడనేసి మఱియును బహుసాయకముల
నేసె గేహాములపై నేసె సౌధము ల, నేసెఁ దేరులమీఁద నేసె నేయుటయు
నారాచసులు పోరు కాయత్తపడఁగ, నారాత్రి వర్తించె నతిఘోరలీల
అప్పుడు సుగ్రీవుఁ డఖిలవానరులఁ, దప్పక చూచి యుద్యుక్తుఁడై పలికె
లావు నోప్పారంగ లంకావాకిండ్లఁ, గావలియుండు రాక్షసుఁ డెవ్వఁడైన
వెడలినఁ జంపుఁడు వెఱచితిరేని, కడుదప్పు సైరింపఁ గపివీరులార
అనవుడు కపివీరు లందఱు వేర్చి, కనలుచుఁ గుజములు ఘనశైలములును
చారుభీషణరణోత్సాహులై వూని, వారక యక్కోటవాకిండ్లనుండి
దర్పించి యార్చినఁ దరుచరావళుల, యార్పులు సైరింప కసురవల్లభుఁడు

కుంభనికుంభాదులు యుద్ధమునకు వచ్చుట.

కుంభకర్ణునికొడుకుల ననికనిచెఁ, గుంభనికుంభుల ఘోరవిక్రములఁ
బనిచి వెండియును గంపసుని బ్రజంఘు, ననికిఁ దోడుగ శోణితాక్షు యూపాక్షు
నారాచసులును గజాశ్వరథంబు, లారసి యుద్ధతి నడరి తోనడువఁ
బరిఘపట్టసగదాప్రాసాదిశూల, కరవాలకుంతముద్గరభిండివాల
శరశరాసనము లుజ్జ్వలభంగిఁ దాల్చి, గురుశక్తి దానవకోటులు నడువఁ
జారుపతాకాదిచయములు గ్రాల, భూరిభూషణదీప్తిపుంజము లెల్లుఁగ

నధికమైనట్టితూర్యంబులు మ్రోయఁ, గుధరంబు లడల దిక్కులు నిండ నార్చి
పరువడిఁ గల్పాంతపవనసంఘములు, తరమిడి కాలాంబుదంబులఁ దాఁకి
వితరియించు తెఱఁగున వీడెల్లఁ గాల్చి, యతిమతి విహరించు నగచరావళుల
నురవడిఁ దాఁకి మహోగ్రులై కదిసి, తెరలించి నొంచి యుదీర్ణవిక్రములు
వాకిండ్లయందు దుర్వారులైయున్న, యాకపిసేనల నందందఁ దోల
నాలంక వెడలిన యగచరసేన, లోలి వీగుటఁ జూచి యోడకుం డనుచు
నురుబాహుసత్త్వసమగ్రులై పేర్చి,(?) హరిరోమకేసరు లాదిగాఁ గల్గు
వానరు లాదైత్యవర్ధంబుతోడ, మానక రోషసమగ్రులై కదిసి
తరులును గిరులును దఱుచుగా వైవ, కరవాలముద్గరగదలశూలములఁ
బరిఘపట్టసభిండివాలచక్రాది, వరశస్త్రముల నొంచి వ్రాలిన నంత
వారు నఖంబుల వక్షస్థ్సలంబు, జీరియుఁ గర్ణనాసిక లోలి ద్రెవ్వఁ
గడిమిమై పండ్లును గఱచియుఁ దలలు, పిడికిళ్లబొడిచియు బోరొక్కి నపుడు
నొకవానరుఁడు వచ్చి యొకదైత్యుఁ బొడువ, నొకదానవుఁడు వాని నుద్ధతిఁ బొడుచు
నొకరాక్షసుఁడువచ్చి యొకకపిఁ జంప, నొకకపి యాదైత్యు సురవడిఁ జంపు
నొకకపి జసుడెంచి యొకదైత్యుఁ బట్ట, నొకదైత్యుఁ డాకపి నుగ్రతఁ బట్టు
నొకదైత్యుఁ డొకకపి యుద్ధమి మ్మనిన, నొకకపి వానితో యుద్ధంబుసేయు
నెడపక యేడ్దుర నెనమండ్ర నొక్క,పిడికిటఁ గపులేచి పెల్లడంగింప
నందందఁ గూలుదు రసురులు గపులు, నందఱు నుగ్రులై యార్చుచు నపుడు
ఇరువాఁగుఁ బోరంగ నింతింతయైన, తరుమహీధరముల తరుచరాంగములఁ
గరిహయదనుజనికాయకాయముల, వరశస్త్రముల రణోర్వరఘోరమయ్యెఁ
గడిమిమై నప్పు డంగదునితోఁ బోర్చి, కడఁగి కంపనుఁడు నగ్గద యెత్తి వైచె
నంగదుండును నొచ్చి యంతలోఁ దెలిసి, తుంగశైలమున దైత్యుని వేయుటయును
ఆకంపనుఁడు చూర్ణమై నేలఁ గలిసె, నాకపినాయకుఁ డార్చి మోదింప
నతఁడు చచ్చినశోణితాక్షుండు గినిసి, గతిదప్ప నరద మంగదువిూఁదఁ బఱపి
యక్షశస్త్రములేయ నడరి యంగదుఁడు, రాక్షసుఁడున్న యారథముపై కుఱికి
విల్లు ద్రుంచుటయును వెస నొడ్డ నమ్మ, ల్లసితాసియు నుగ్రతఁ గొనుచు
నాకాశమునకు నయ్యసుర పోవుటయు' నాకపివీరుండు నతనితో నెగసి
యారాక్షసునిచేతియడిదంబుఁ బుచ్చి, యారాక్షసుని వ్రేయ నతఁడు మూర్ఛిల్లె
నంతకుఁడై రాక్షసావలిఁ దునుమ, నంతలోననె శోణితాక్షుండు లెలిసి
గదఁ బుచ్చికొనుచు నంగదు గూడఁబాఱఁ, గదిసె నప్పుడు తోడుగాఁ బ్రజంఘుండు
యూపాక్షుఁడది చూచి యొగిరాఁగఁ జూచి, యేపున ద్వివిదుండు నేచి మైందుండు
నాయంగదునకుఁ దోడై కూడికొనిరి, ఆయార్వురకు ఘోరమయ్యె రణంబు
అప్పుడు వానరు లగములు గురియఁ, జప్పరింపుచును బ్రజంఘుండు ద్రుంచె
మఱియు నాయువ్వురు మర్కటేశ్వరులు, దఱుచుగా గిరులును దరులును నెత్తి
కరిరథాశ్వములపైఁ గడుఁబెట్టు వ్రేయ, నరుదుగా నడుమ యూపాక్షుండు ద్రుంచె

విన విస్మయంబుగా ద్వివిదమైందులును, బెనఁగొని వృక్షము ల్వెఱికి వైచుటయు
నవియన్నియును శోణితాక్షుండు నడుమఁ, గవిసి చూర్ణములుగా గదగొని యేసెఁ
గలకలధ్వని యొప్పఁ గరవాల మెత్తి, జళిపించుకొనుచుఁ బ్రజంఘుండు గదియ
మానైన యొకనల్ల మద్దిమా నెత్తి, వానిపై నడరించి వారక మఱియుఁ
బిడికిట వక్షంబు బెట్టుగాఁ బొడువ, నడిదంబు వైచి యయ్యసుర కోపించి
పిడుగున కెనయైన పిడికిటఁ బొడిచెఁ, బొడిచిన వెస మూర్ఛఁ బొందియుఁ దెలిసి
సమధికముష్టిఁ బ్రజంఘు మైందుండు, తమకించి పొడిచిన ధరణిపైఁ గూలెఁ
బృథివిపై నిటు దనపినతండ్రి పడుట, ప్రధితంబుగాఁ జూచి రథ మటు డిగ్గి
యడిదంబు దాల్చి యూపాక్షుండు నడువ, విడువనియలుకతో ద్వివిదుండు దాఁకి
వరముష్టి యమరించి వక్షంబుఁ బొడిచి, గుగుసత్త్వుఁడై పట్టుకొనుటయు నపుడు
అతనితమ్ముఁడు శోణితాక్షుండు వచ్చి, వితతబలంబొప్ప ద్వివిదునిఱొమ్ముఁ
బిడికిట నొప్పించి పెనుమూర్ఛఁ బుచ్చి, విడిపించుకొని పోయె వేగ యూపాక్షు
డెలిసి మైందునితోడ ద్వివిదుండు గూడి, సొలవక యూపాక్ష శోణితాక్షులను
అటు దాఁకి వారితో ననిసేయునపుడు, చటులత ద్వివిదుఁ డాశ్చర్యంబుగాఁగ
నలమి క్రమ్మిన శోణితాక్షునిఁ బట్టి, యిలవైచి ప్రాణ మే రూపేర్పడకుండ
నడరి మైందుండు యూపాక్షునిఁ గట్టి, బెడిదంబుగాఁ దనపిడికిటఁ బొడిచి
చలమున ధీరుఁడై చంపెను బేర్చి, నలియ నెమ్ములు మేను నలినలిగాఁగ
నిలమీఁదఁ గపులచే నిట్టిచందమున, నలువురు బడుటయు నానాముఖముల
నేపరి రాక్షసు లెల్లను బాఱఁ, గోపించి యప్పుడు కుంభుండు వారి

కుంభనికుంభులయుద్ధము.

వెఱవకుండని తనవింటిలావొప్ప, మెఱుఁగుటమ్ములు దొడ్డి మెఱుఁగులతోడి
సురచాప మనఁజాలి శోభిల్లుదాని, పరఁగఁ బ్రత్యాలీఢపాదుఁడై నిల్చి
తెగఁగొని వేయఁగ ద్వివిదుండు భిన్న, నగముకైవడిఁ గూలె నతిఘోరలీల
ముందఱి ననుఁగుఁదమ్మునిపాటుఁ జూచి, యందంద మైందుండు నసమవేగమునఁ
గుంభునిపై నొక కొండ వైచుటయుఁ, గుంభుఁ డైదమ్ములఁ గుథరంబుఁ ద్రుంచి
మఱియు నొక్కమ్మున మైందుని నేయ, నొరిగె నయ్యగచరుం డుర్వరమీఁద
ధరమీఁద నీగతిఁ దనమేనమామ, లిరువురుఁ గూలిన నేచి యంగదుఁడు
కుంభునిపై వైచె ఘోరభూధరము, కుంభుఁ డేడమ్ముల గుథరంబుఁ ద్రుంచి
నెరబాణములు మూఁట నిటలంబునేసి, మఱి పెక్కుశరముల మర్మంబులేయ
నెరియుచుఁ గుంభుపై నెగసి యంగదుఁడు, తరలెత్తి వైచె నత్తరువును ద్రుంచి
యాకుంభుఁ డంగదు నందంద మఱియు, భీకరబాణసంపీడితుఁజేయ
నతఁడు మూర్ఛిల్లిన నారామకడకు, నతివేగమున వానరావలి పాఱి
యంతయుఁ జెప్పిన నధిపతి జాంబవంతుఁ డాదిగఁగల వనచరోత్తములఁ
బనిచిన వారును బొదపశిలల, దనుజుల నొంచుచుఁ దఱుమఁ గుంభుండు
వారి ననేకతీవ్రప్రకాండముల, వారక నొప్పించి వారి వారించె

నప్పుడు సుగ్రీవుఁ డాకపివరుల, నప్పరుసునఁబడ్డ యంగదుఁ జూచి
కోపంబు మూడివడఁ గుంభునిఁ జూచి, యేపారఁగాఁజొచ్చి యెన్నఁ బైక్కొన
ఘనశైలములు నశ్వకర్ణవృక్షములు, వనచరులార్వంగ వైచి పెల్లార్చి
నవియన్నియును గుంభుఁ డంతలోఁ ద్రుంచి, రవిజునిఁ బెక్కుమార్గణముల నొంప
స్రుక్క కాతనివిల్లు సుగ్రీవుఁ డొడిసి, యక్కజంబుగఁ ద్రుంచి యటు పాఱవైచె
దంతంబుఁ దునిమినఁ దఱిమి పైవచ్చు, దంతిచందంబునఁ దఱిమి కుంభుండు
కడురోషమున మండి కడఁగి సుగ్రీవుఁ, బడవైతు ననిపాఱి పట్టుకొన్నప్పు
డినజుండు కుంభుండు నిభములు రెండు, పెనఁగినకైవడి పెనఁగి రుద్ధతిని
గరలాఘవములొప్ప ఘనశక్తి మెఱసి, చరణఘట్టనల భూస్థలము గ్రక్కదలఁ
బొగలచందమున నూర్పులు గ్రమ్ముచుండ, మిగిలినతాఁకుల మిన్నెల్లఁ బగుల
అప్పుడు సుగ్రీవుఁ డాకుంభుఁ బట్టి, త్రిప్పి యంబుధి వైచె దేవతలార్వ
దనుజుఁ డావారిధితలము ఘోరంబు, దనరాఁ బడియె మందరశైల మనఁగఁ
బడియు నాదనుజుండు భానుజుఁ జేరఁ, గడఁకతోడుత మహోగ్రత నేగుదెంచి
బెడిదంబుగా ఱొమ్ముఁ బిడికిటఁ బొడువ, నెడవ్రచ్చి యదియు నాయెమ్ములు చాఁకఁ
గడిఁది వజ్రముఁ డాకఁ గనకాద్రి వెడలు, మిడుగురులో యన మిడుగురు లెగసె
దానికిఁ గోపించి తరణినందనుఁడు, దానవాధము సురస్థలమారఁ జూచి
యుచ్చెరువుగ ముష్టి నమరించి పొడువఁ, జచ్చె నమ్బుతబహుసత్వుండు దూలి
వాఁడంత శాంతపావకుఁడును బోలె, వేఁడిమి చెడి పడ్డ వెఱచి రాక్షసులు
పఱచిరి దివియు భూభాగంబు వగుల, నెఱి దప్పి యెంతయు నీరధి గలఁగ
నప్పుడు దమయన్న యవనిఁ గూలుటయు, నిప్పులు చెదరెడు నెరిచూడ్కి లడరఁ
గొలఁదికిమీఱిన కోపంబుతోడ, నలి నికుంభుఁడు సింహనాదంబుచేసి
కనకరత్నప్రభాకలితమై తనరి, యనయంబు గంధపుష్పార్చితంబైన
పరిఘుఁ ద్రిప్పటయును బ్రహ్మాండమెల్ల, నురిలెడుగతినుండె నుగ్రభావమున
నాశలన్నియుఁ దీరినట్లయ్యె వాయు,పాశంబులును ద్రెస్సి పలువిధంబయ్యె
హనుమంతుఁ డప్పు డుద్ధతి దైత్యుఁ డాఁకి, యినతనూభవునకు నెడసొచ్చి పేర్చి
ఘోరాజిఁ బరిఘు నికుంభుండు ద్రిప్పి, మారుతివక్షమున్మత్తుఁడై వ్రేసె
వ్రేసిన నత్యుగ్రవిస్ఫులింగములు, భాసమానంబులై పర్వుచునుండ
నురములో చెయువెట్టిదో యన నప్పుడు, కరమరుదుగ పరిఘము తుమురయ్యె
వాలినపరిఘుంబు వాటున నతఁడు, గాలిచేఁ దూలు వృక్షంబునుబోలెఁ
దూలియు ధైర్యంబుతోడ నికుంభు, వాలినపిడికిట వక్షంబు వొడిచెఁ
బొడచిన నాదైత్యపుంగవునురము, కడు వ్రస్సి నెత్తురు గ్రమ్ముదెంచుటయు
నతఁడు మహానిలాఘాతి మహీజంబు, గతిఁ గంప మొందియుఁ గ్రమ్మఱఁ దెలిసి
హనుమంతుఁ బట్టి యుద్ధతి మీఁదికెత్తి, దనుజులార్వఁగ వియత్తలమెల్ల నద్రువఁ
గడువేగమున వైవఁ గపికుంజరుండు, విడిపించుకొని రణోర్వీస్థలి కుఱికి
కడఁగి నికుంభు నుగ్రత బిట్టు వొడిచి, వడిఁ బడవైచి యవ్వసుమతిమీఁద

విసరి యమ్ములు పారవ్రేసి ఱొమ్మెక్కి, దెసలద్రువఁగఁ దలఁ ద్రుంచి వెల్లార్చె
నారభసంబున నవనియు మిన్నున, వారిధులును దిశావలయంబు మ్రోసె
హతశేష రాక్షసు లాలంకలోని, కతిరయంబునఁ జని యారావణునకుఁ
గుంభనికుంభాదిగురుసత్త్వధనులు, కుంభినిమీఁద నార్తరు వైత్యవరులు
కూలుట చెప్పినఁ గోపించి యసుర, వాలిన ఖరుఁడనువానినందనుని
మకరాక్షుఁ బిలిచి సమగ్రసైన్యములఁ, బ్రకటంబుగాఁ గూర్చి పరఁగంగ నీవు
రామలక్ష్మణుల మర్కటములఁ జంపి, రా మగఁటిమినని రావణుఁ డాడ

మకరాక్షుఁడు యుద్ధమునకు వచ్చుట.

విని మహోత్సాహుఁడై వేగంబ వాఁడు, దనతండ్రిపగఁ దీర్పఁ దనకబ్బె ననుచు
ముదమంది తనరెండుమూఁపు లుప్పొంగఁ, ద్రిదశారి కప్పుడు ధీరుఁడై మ్రొక్కి
వీడ్కొని రథమెక్కి వెడలి కయ్యంబు, వేడ్కతోఁ దనయొద్ది వీరుల కనియె
మీరు సమగ్రత మెఱసి యుగ్రతను, బోరుఁడు కపులతోఁ బొరిఁబొరి నేను
రామలక్ష్మణుల మర్కటుల నాదైన, భీమశరాగ్నుల భిన్నులఁ జేసి
యేఁచెద ననవుడు నెలమి దానవులు, త్రోచితో నడవంగ దుశ్శకునములు
గలిగెఁ బె క్కవియెల్లఁ గనియు సయ్యసుర, తలఁకక తూర్యనాదంబులు నెలఁగ
నలినార్చి కవిసె వానరసేనమీఁద, నిలయు నాకాశంబు నిట్టట్టుఁ బడఁగఁ
దఱిమి వానరులును దరులును గిరులు, దఱచుగా వైచిరి వైత్యులమీఁద
దానవులును గదాదండకోదండ, మానితఖడ్గాదిమహితశస్త్రముల
వాని నన్నింటిని వడిఁ ద్రుంచి వైచి, వానరకోటిఁ దీవ్రతనొంచి యార్చి
రాసమయమ్మున నమ్మకరాక్షుఁ, డాసర్వకపులపై నతివేగ రథము
పఱుపుచుఁ గదిసి ముప్పదిట నూఱేంట, నఱువదింటను మఱి యరువదేనింట
నిరువదింటను వెస నిరువదాఱేంటఁ, బరఁగ నాఱేంటను బండ్రెంట రెంటఁ
బదిటఁ బదేనింటఁ బదునెన్మిదింటఁ, బదుమూఁట నాల్గింటఁ బదునాలుగింటఁ
దెగఁగొని మూఁట నైదింట నేడింట, నగలించి తొమ్మిది యమ్ములనేసె
నవి సహింపఁగలేక యఖలవానరులు, భువి తల్లడిల్ల నప్పుడు పాఱుటయును
ఏమిభయం బిట నేనుండ ననుచు, రాముఁడు విలుఁగొని రాక్షసుల్బెదరఁ
జతురంగబలములఁ జంపుటఁ జూచి, యతికోపమున మకరాక్షుండు పేర్చి
యరదంబు వఱపించి యారాము డాసి, ఖరసూతి నేను రాఘవ మున్ను నీవు
పెరిగి మాతండ్రిఁ జంపినఁదానఁ జిత్త, మెరియుచునుండె నాకింతకాలంబు
నాకు నీతోడి రణం బబ్బుటయును, జేకొని చింతింతుఁ జేకూడె నేఁడు
తరలకు నీవు మాతండ్రిసూడునకు, నెరయంగఁ బోరాడ నిన్గంటి నేను
దుర మొనరింపు నాతో వింటనైనఁ, గరవాలముననైన గదనైన ననుడు
వానితో రాఘవేశ్వరుఁడు కోపించి, దానవాధమ యీవృథాగర్వ మేల
భాసిల్లు నాబాహుబలము సొంపారఁగా సమరంబున ఖండింతు నిన్ను
ననుడు రాముని మకరాక్షుండు గిట్టి, ఘనమైన నిశితశాంబకంబుల నేసె

నేసిన నవి రాముఁ డెడఁ ద్రుంచివై చె, నాసమయంబున నవనియు మిన్ను
నిండ నాయిద్దఱ నిష్ఠురచాప, దండమహాగుణధ్వనులు పెల్లడ రె
సురఖేచరాదులు చోద్యంబునొంద, నరుదారనేయు రామాస్త్రంబులెల్ల
నతివేగమున మకరాక్షుండు ద్రుంచి, యతనిపై బాణంబు లడరించుటయును
నవి రాఘవుఁడు త్రుంచి యమ్మకరాక్షు, వివిధనిష్ఠురశరావృతుఁ జేయ నతఁడు
నవియెల్లఁ గడఁగి యత్యంతరోషమున, వివిధఖండములు గావించి పెల్లార్చెఁ
గోపించి కాకుత్స్థకులుఁడు నద్దైత్యు, చాపంబు వెస నొక్కశరమునఁ ద్రుంచి
సారథి నెనిమిదిసాయకంబులను, నారథంబును మఱి యన్ని బాణముల
వికలత్వ మొనరింప విరథుఁడై యపుడు, మకరాక్షుఁ డొక్క సమగ్రశూలంబు
వైచిన నది వేగ వచ్చుట విభుఁడు, చూచి మూఁడమ్ములఁ జూర్ణంబుచేసె
అనిమిషు లారాము నగ్గించి రపుడు, దనుజుండు కినిసి యాదశరథాత్మజునిఁ
పిడికిటఁ బొడువంగ బిట్టేగుదేర, నడుమనె యారామనరనాయకుండు
అనలాస్త్రమున హృదయము గాడనేయ, ననిమొన నమ్మకరాక్షుండు గూలెఁ
బ్రథితతోరణప్రభాభాసియై యంత, బ్రథమాద్రిపైఁ దోఁచెఁ బద్మబాంధవుఁడు
హతశేషరాక్షసు లాలంక కరిగి, యతఁడు చచ్చుటఁ జెప్ప నారావణుండు
కోపంబు చింతయుఁ గూడి చిత్తమున, నేపార ననియె నయ్యింద్రజిత్తునకు
రణమునఁ గపులను రామలక్ష్మణుల, క్షణమాత్రమునఁ జంపఁగాఁ జాలువాఁడ
నీవె కాకింక నాకెవ్వరు గలరు, నీవిట నీవాహినీసమేతముగఁ
జని యందఱను జంపి చనుదెమ్ము తొల్లి, యనిమిషకోటుల ననిఁ ద్రుంచుకరణి
రణమున గెల్చి సంరంభంబుతోడఁ, బ్రణుతింప నేతెమ్ము ప్రమద మొప్పార
ననవుడు నింద్రజిత్తారావణునకు, వినయంబుతో మ్రొక్కి వీడ్కొని కదలె
వాయువేగముల యశ్వంబులఁ బూన్చి, యాయితంబైనట్టి యరదంబు నెక్కి
శరదభ్రసంవృతశైలంబుకరణి, గురుభుజుండై వెలిగొడుగులనీడ
రమణీయకంకణరణితము లెఱయ, రమణు లిమ్ములఁ జామరమ్ములు వీవ
నొలసి మోమున సంగరోత్సాహలీల, దళుకొత్త నేతెంచి తల్లికి మ్రొక్కి
జనని దీవింపంగఁ జని తనపత్ని, దనయుల వీడ్కొని తమ్ములచావుఁ
దలపోసి కోపాగ్ని దరికొనఁ బేర్చి, యలఘుపర్వంబున నయ్యింద్రజిత్తు
మానక రోషసమగ్రతతోడ, దానవకోటులు దన్ను సేవింప
ఘనకామరూపులు దనమంత్రివరులు, తనుఁగొల్వ నుత్తరద్వారంబునందు
నద్రులగతిఁ దేరు లఱువదికోట్లు, భద్రగజంబులు పదుమూఁడుకోట్లు
కోరలెడు నాల్గేసి కొమ్ములు కరులు, పరఁగంగఁ గోటినిర్భరవృత్తినడువఁ
దురగంబు లరయంగఁ దుద నూఱుకోటు, లుపతరహేషంబు నొప్పుచు నడువ
భేరుండములఁ బోలి పెంపువహింప, భూరివేగంబునఁ బొలుపారునట్టి
చిలుకవన్నియలతోఁ జెలఁగుగుఱ్ఱములు, కొలఁదులై నాలుగుకోటులు నడువ
వలుద నిస్సాణాదివాద్యముల్ మ్రోయఁ, గలనికి వెడలి లంకాపురినుండి

తనచుట్టు దైత్య్య లసంఖ్యులు గొలువ, (1) ఘనతరభీషణాకారంబుతోడ
వానరవీరదుర్వారనాదముల, మానైన రణమహీమధ్యంబుఁ జొచ్చి

ఇంద్రజిత్తు హోమముఁ జేసి కృత్తి యనుశక్తిఁ బుట్టించుకొని మూయాయుద్ధము చేయుట.

యరదంబు డిగి ధీరుఁడై కాచియుండఁ, దిరిగి రాదైత్యులఁ దెఱఁగొప్ప నిలిపి
గురుతరవేది త్రికోణమై పెద్ద, పరపొంది దక్షిణప్రవణమై యున్న
భూరిశ్మశానాగ్ని పొలుపారఁ దెచ్చి, ధీరుఁడై వేదిలో దీపింపఁజేసి
రక్తవస్త్రంబులు రక్తమాల్యములు, రక్తచందన మనురక్తుఁడై తాల్చి
దండంబు నుపవీతతతియు మౌంజియును, నిండుమనంబుతో నెరయంగఁ బూని
యలవడ నచట ఖట్వాంగధ్వజంబు, నిలిపి కపాలంబు నిస్తతో నెక్కి
పరఁగంగఁ గంకాళపరిధిఁ గావించి, తిరముగా దక్షిణదిశ స్రుక్స్రువంబు
లినుపపాత్రలనుంచి యేర్పడఁ గృష్ణ, తనుఁడైన వానిరక్తమును మాంసమును
పొరిఁబొరి నవి నిండఁ బోసి మౌనంబు, ధరియించి యప్పు డథర్వణక్రమము
దప్పకయుండ మంత్రము లుచ్చరించి, చొప్పడ నినుప స్రుక్స్రువములు పట్టి
కమియఁ బావకుఁడును గడునొప్పు తాటి, సమిధలు తిలలును సర్ష పంబులును
హోమంబు సేయంగ నురుతరం బగుచు, నామహాధూమ మజాండంబు గప్పె
నాయగ్నిలోనుండి యప్పుడు వేగ, యాయతంబైనట్టి యరదంబు వెలుఁగ
రయమున నుగ్రకరాళకేశములు, భయదరూపంబు కపాలపాత్రయును
దళతళమను కోఱవడలు మెఱయ, మలగకాప్పుచు నస్థిమాలిక లలర
నెఱమంట లొలికెడు నేత్రంబు లొప్ప, నుఱక హాసముతోడ నొకకృత్తి వెడలి
పంపుము పంపు మేపనికైన నన్ను, సొంపారఁ జేసెద సురవైరి యనుడు
నాకృత్తి నడిగి యింద్రారి శస్త్రములు, నాకృత్తిఁ గైకొని యాకాశమునకు
నరదంబుతోడనె యరిగి వానరులఁ, దిరిగి యేయియటకు నదృశ్యుఁడై యుండె
అంతట నారావణాత్మజునేన, యంతయుఁ గ్రమ్మఱి యరిగె లంకకును
అట నింద్రజిత్తును నాకపిసేనఁ, బటుశిలీముఖపరంపరల నొప్పింప
వలియ దాఁకెడిశిలావర్షంబుచేతఁ, బలుదెసఁ జెడిపాఱు పఱులలో యనఁగ
ఛిన్నభిన్నాంగులై చెదరిరి కొంద, ఱున్నతగతి దప్పి యుండిరి కొంద
ఱెసఁగంగఁ జెవురు చేఱులతోడి, వసుమతీధరములు వడిఁ గూలుకరణిఁ
బడిరి రక్తంబులపైఁ బయిఁ దొరఁగఁ, గుడుసుగా మఱి యొకకొందఱు కపులు
అప్పు డాయమ్ములయంధకారంబుఁ, గప్పి యెవ్వరికినిఁ గానరాకుండ
నంత వానరవీరు లంతరిక్షమున, నంతర్హితుండగు నాయింద్రజిత్తుఁ
బొడగానఁజాలక భూనభోంతరము, వడి నిండఁ బఱతెంచు వాఁడిబాణముల
నడుములుఁ దెగువారు నలియైనవారు, కడికండలై నేలఁ గలసినవారు
కడిమిమై నాజికిఁ గైకొన్నతరులు, విడిచి యమ్ములు గాడ వెసఁ జచ్చువారు
నడునెత్తిఁబడు ఘోరనారాచసమితి, పుడమితోఁ గీలింపఁ బొడవులు నెదర

నిలువు చచ్చినవారు నిఖిలాంగకములఁ, బలుబొణములు గాడఁబడి పొరల్వారు
మాతంగశవముల మాటుకొన్వారు, చేతుల గిరులెత్తి చేష్టించువారు
దృష్టికిఁ దోఁపక తిరిగి విన్వీథి, దృష్టించి యాడులు దీఱెడువారు
నఖిలాశుగప్రవాహములు పైఁదొరఁగ, ముఖసరోజములకు మురియరాకుండ
బొందిమిఁదికి నెత్తి భూరినేతువుల, చందంబుగాఁ బ్రకోష్ఠము లొడ్డువారు
ప్రేవులు ప్రోవులై పృథివిపైఁ బడఁగ, నావులింతలతోడ నధికనిద్రలను
గనుమూయువారును గడిమి రామునకు, ననిప్రాణ మిగంటిమని పల్కువారు
చిచ్చుఱిపిడుగుల చెలువునఁ జదర, వచ్చుకోలలఁ గేల వడిన్ఁడ్డువారు
వాలంపపొదువుల వాలఘాతములఁ, దూలించువారు నెత్తుటఁ దోఁగువారు
ఘోరాంబకంబులఁ గొనియు ధైర్యంబు, లారంగ నిశ్చలు లైయుండువారు
దుర్లక్ష్యుఁ డితఁడని తొడరంగ నేఁడు, దుర్లభంబని బ్రహ్మ దూషించువారు
బ్రహ్మ యిచ్చినశక్తిఁ బడిలుఁడై వీఁడు, బ్రహ్మాండమునఁ గానఁబడకున్న వాఁడు
బ్రహ్మవరం బెంత బ్రహ్మాండ మెంత, బ్రహ్మ యెంతటివాఁడు పార్థివేంద్రునకుఁ
దలపోయ ననిలోన ధరణీశుఁ డేటి, కలుగఁడో యనువారు నైయుండ మఱియు
నుద్దండకోదండ మొకచోట మొఱయ, నుద్దామశరజాల మొకచోట నిగుడ
నొకచోట దనుజేంద్ర నొకచోట నార్చు, నొకచోట నదలించు నొకచోట నవ్వ
నొకచోట హుంకార మొనరించునట్లు, సకలభీకరలీలఁ జరియింప నలిగి
యురుభుజుం డాంజనేయుఁడు నంగదుండు, శరభుండు ఋషభుండు జాంబవంతుండు
గజుఁడు గవాక్షుండు గంధమాదనుఁడు, విజయుండు నీలుండు వెస సుషేణుండు
పనసుండు మొదలుగాఁ బటుపరాక్రములు, వనచరులందఱు వడిఁ దరుల్గిరులు
నిగిడి యాకసమెల్ల నిండఁవైచుటయు, మొగి వచ్చుశరముల మురియలై చెదరి
జడియ శరానిల చటులవేగమున, నుడుగని మ్రోతతో నురవడి వచ్చి
యాశైలములు దరు లప్పుడు దునిసి, యాశకలములపై నందందఁ దొరఁగ
నాశంబులైరి వానరులు వెక్కండ్రు, ఆశాకరీంద్రంబు లవని కంపింప
మెఱసిన కడిమిమై మేఘనాదుండు, నెఱయుంగ నిగుడించు నిబిడబాణములఁ
గొందఱు తునియలై కూలిరి భీతి, నొంది కొందఱు పాఱి రొదిగి దిక్కులకుఁ
బ్రదరపరంపర ల్పఱపుచు నిట్టు, పదికోటు లగచరపతుల రూపడఁచి
వెండియు నెదిరిన వీరవానరుల, ఖండించి యతిచండకాండసంతతుల
నతులవిక్రముఁడైన హనుమంతు వాలి,సుతు శతబలి గవాక్షుని నీలు నలుని
బంధురబలుఁడైన పనసునిఁ గుముదు, గంధమాదను ఋక్షకపియూథపతుల
మఱియుఁ గొందఱ సుగ్రమార్గణావళుల, నటిమురి నిశ్చేష్టు లైయుండనేసి
యాదితేయులగుండె లవియ నమ్మేఘు,నాదుండు పటుసింహనాదంబు సేయ
మనముల భీతిల్లి మానము ల్దూలి, వనచరు ల్దనవెక్క వచ్చి చొచ్చుటయు
సౌమిత్రియును రామచంద్రుని జూచి, భూమిశ యీమాయఁ బొందున వీఁడు

వినువీథి నత్యంతవిభవంబుతోడఁ, దనుఁ గానరాకుండ దర్పించినాఁడు
గర్వించి యిబ్భంగిఁ గపివీరబలము, సర్వంబు సమయింప సమకట్టినాఁడు
మన మింతలో వీని మడియింపవలయు, ననవుడు శ్రీరాముఁ డనుజుతో ననియె
విను బ్రహ్మవరమున వినువీథి వీఁడు, దనరూపు చూపక దాఁగియున్నాఁడు
మనమెంత యలిగిన మనకు లోఁబడఁడు, వినుము లక్ష్మణ నేఁడు వీఁ డసాధ్యుండు
అస్త్రంబు లేమియు నతనిపైఁ గొలుపఁ, నస్త్రము లెచ్చిపోవు నని పల్కుచుండ
నాసమయంబున ననిలుండు వచ్చి, భాసురమ్మదనచోషణితి నిట్లనియె
విను వీనిమాయకు వెరవు భూనాథ, దనర నాగ్నేయమంత్రము జపియించి
నీవు బాణం బేయ నెరిఁ దప్పి కృత్తి, దేవారిఁ బాసి యదృశ్యమై పోవు

శ్రీరాముఁ డాగ్నేయాస్త్రముచే నింద్రజిత్తునిమాయ చెరల్చుట.

నని యద్ధిదీపింప ననిలుండు పలుక, జననాథుఁ డాహవసంరంభ మెసఁగ
మానితంబగు నగ్నిమంత్రపూతంబు, గానమ్ము సంధించి కడఁకతో నేయఁ
గృత్తి యత్యద్భుతక్రియ నింద్రజిత్తు, నత్తఱి నెడఁబాసి యరిగె నెందేని
ఆయింద్రజిత్తును నవని కేతెంచి, యాయెడఁ గార్తకజ్యానాద మడరఁ
గడఁగిన నంత నక్కపికులో త్తంసు, లడరిన యామూర్ఛ లందంద తెలిసి
వడిఁ గూడికొని వచ్చి వానిపైఁ గవిసి, కడిఁదియై శైలశృంగమును వాయుజుఁడు
గండశైలముల నంగదుఁడు మైందుండు, దండిమై ఘనపర్వతమును గజుండు
జయమూలమైన వృక్షమును నీలుండు, రయమున నశ్వకర్ణంబున నలుఁడు
అవనీధరంబును నర్కనందనుఁడు, నవిరళశాఖిని నటఁ బనసుండు
కదిసి యుగ్రంబైన గద విభీషణుఁడు, గదరుచు సాలవృక్షమును సంపాతి
భూజమహాశైలముల వలీముఖులు, నాజాంబవత్ప్రముఖాదివీరులును
నలినార్చి మూఁడుబాణముల లక్ష్మణుఁడు, కలయంగ నూరంబకముల రాఘవుఁడు
వానిపై నడరింప వాఁ డంతవట్టు, నానాంబకములఁ జూర్ణములు గావించి
యనలోగ్రఘోరంబు లైనబాణముల, వనచరసేనల వడిఁ బెల్లువఱపి
కరలాఘవం బొప్ప గంధమాదనునిఁ, బరుషోగ్రకరములఁ బదునెన్మిదింట
నేడింట మైందుని నేడింట ద్వివిదు, నేడింట హనుమంతు నేడింటఁ గుముదు
వడిఁ దొమ్మిదింట నవ్వాలినందనునిఁ, గడిమి నన్నియ సాయకమ్ముల నలుని
నైదింట నీలు గవాక్షు నేడింట, నాదిత్యనందను నఱువదేనింటఁ
బనసుని నిరువది పటుసాయకముల, నెసయంగ దధిముఖు నేకబాణమున
నెసఁగ లక్ష్మణు డెబ్బదేనంబకముల, వసుధేశు నఱువది వరసాయకముల
సాయకత్రయమున శతబలి నూఱు, సాయకంబుల విభీషణుని నొప్పించి
మఱియుఁ దక్కినయిట్టి మర్కటవరుల, గొఱ్ఱప్రాణములతోడఁ గూల నేయుటయు
నప్పుడు హనుమంతుఁ డచలశృంగంబు, నుప్పొంగి యంగదుం డురుగండశిలయు
పనసవిభీషణు ల్బలుగద ల్బలిమి, దనర సంపాతి యుత్తాలతాలమును

నలుఁడు సారాశ్వకర్ణముల నందంద, నలినాప్తతనయుఁ డున్నతిగ్రావములను
సౌమిత్రి మూఁడుగ్రసాయకంబులను, భూమీశుఁ డురుశరంబులు నూఱు వఱుప
శరభుండు ఋషభుండు జాంబవంతుండు, నురుభుజుం డగుగవయుఁడు సుషేణుండు
వెస గవాక్షుండును ద్వివిదమైందులును, నసమానవిక్రము లయినవానరులు
తక్కినవారును దరుశైలతతుల, నక్కజంబుగఁ బేర్చి యందంద వైవ
వానిఁ దుత్తునియలై వడిఁ గూలనేసి, భానునందను నొక్క భయదభల్లమున
వక్షంబు నొప్పింప వడఁకి పెన్గాలి, వృక్షంబు చలియించువిధ ముండె నతఁడు
ఆలోన ఋషభ గవాక్ష సుషేణ, వాలినందన జాంబవంతులు కుముద
మారుతసుత గంధమాదన నలులు, వీరాదిగాఁగల వీరవానరుల
వివశులగాఁ జేసి వివిధబాణముల, నవనీశుపై నేసి యస్త్రలాఘవము
విలసిల్ల లక్ష్మణు విలుఁ ద్రెవ్వనేసి, యలుక విభీషణు నదరంట నేసి
విలయకాలాంబువవిధమునఁ జెలఁగి, పలుమాఱు గర్జించి పలికె నెంతయును
చూచితె రఘురామ సుగ్రీవముఖ్య, లేచందమునఁ గూలి రేనల్లి నపుడు
నరనాథతనయ నిన్నమ్మినయట్టి, బిరుదు వానరజాతి పీచంబు లడఁగె
ననుచు వెండియుఁ బేర్చి యన్నిశాచరుఁడు, ఘనబాణతతుల నక్కపినేనమీఁద
నడరించె ఘనభూధరాభదేహముల, నెడ లేకయుండ ననేకమార్గణము
లటులేసి తెలిసితి నని యార్చికొనుచుఁ, బటుగతి లంకలోపలి కేగి యంత
తనసంగరక్రీడ దశకంఠుతోడ, వినుతంబుగాఁ జెప్ప విని యతం డుబ్బి
తనయ రమ్మనుచు నందనుఁ గౌఁగిలించి,కొని నాకు నీయట్టికొడుకు గల్గంగఁ
బగవారిచే నాజిఁ బడినబౌంధవుల, పగనీగఁ గాంచితిఁ బౌనె నావగపు
కడిఁది వీరుఁడు కుంభకర్ణుండు మడిసె, నడఁగె మహాబలుం డగుప్రహస్తుండు
మృతిబొందెఁ ద్రిశిరుండు మేటివీరుండు, హతుఁడయ్యె నతికాయుఁ డాలంబులోన
నొగి మహాపార్శ్వ మహోదరు ల్వడిరి, తెగిరి నరాంతకదేవాంతకులును
గుంభకర్ణనిసుతు ల్ఘోరవిక్రములు, కుంభుండు వడియె నికుంభుండు సమసె
మకరాక్షుఁ డనిలోన మడిసె తోడ్తోన, సకలనిశాచరసైన్యంబు వొలిసె
లంకఁ గాల్చెను నొకయలఁతియూ కోతి, ఇంకయేటికి మాట లివియెల్లఁ దలఁచి
రయమునఁ జని నీవు రామలక్ష్మణుల, భయదసాయకపరంపర లేసి చంపు
రణదక్షుఁడవు నీవు రణములోఁ దొల్లి, తృణలీల గెలిచితి దేవేంద్రుఁ గడిమి
నీవేచి నడచిన నిఖిలలోకములు, భావించినప్పుడె భస్మమైపోవు

ఇంద్రజిత్తు హోమమునుచేసి శస్త్రసమేతముగా రథమును బడయుట.

నరు లెంతవారు వానరు లెంతవారు, పరికింప నీకని పల్కి వీడ్కొలుప
నెలమితోడన పురోహితునిఁ దోడ్కొనుచుఁ, బొలుపారఁగా రణభూమి కేతెంచి
చెన్నొంద హోమంబు సేయంగఁ బూని, యున్నంతఁ బరిచారు లొగి వేగమునను
బరఁగంగ నరసి కపాలపత్రికలు, సొరిది నుక్కునయిన స్రుక్కు స్రువంబులును
శస్త్రంబులును దాటిసమిధలు రక్తవస్త్రగంధాదులు వరుసఁ దెచ్చుటయు

రక్తాంబరంబులు రక్తమాల్యములు, రక్తగంధంబును రయమొప్ప నతఁడు
ధరియించి మారణతంత్రమార్గమునఁ, బరువడిఁ దోమర ప్రాసఖడ్గములు
సరిపరిధులు వెట్టి స్ప్రాణకృష్ణ, హరిణంబు మెడ యస్థి యది పుచ్చుకొనుచు
నక్తంచరాధీశునందనుం డెలమి, యుక్తక్రమంబున హోమంబుసేయఁ
దనరిన ధూమప్రదక్షిణశిఖల, ననలుండు వెలుఁగుచు నాహుతు ల్గొనియె
జయనిమిత్తంబులు చాలఁ గన్గొనుచు, జయశీలుఁ డానిశాచరవీరుఁ డలరి
నియతి హోమము దీర్చి నిరుపమంబైన, హయచతుష్టయముతో నతిఘోరలీల
నురుతరబాణాసనోజ్జ్వలం బగుచు, సురుచిరాలంకారశోభితం బగుచు
సరినొప్పు సింహార్ధచంద్రచిహ్నములఁ, బరఁగుచు వైడూర్యభాసురంబయిన
పడగచే నమరుచు బ్రహ్మాస్త్రరథి, నడరుచు ననినదృశ్యం బయియుండు
నట్టి యారథ మెక్కి యనికి నేగుచును, గట్టల్కఁ బల్కె రాక్షసులెల్ల వినఁగ
మిథ్యాతపస్వుల మీఱి సంగ్రామ, రధ్యఁ గూలుతు నేఁడు రామలక్ష్మణుల
పగదీర్చి మాతండ్రిఁ బజ్జికంధరుని, విగతశోకునిఁ జేసి విజయ మేనిత్తు
భానునందనముఖప్లవగవల్లభుల, నే నేఁడు సమయింతు నిమిషమాత్రమున
మఱియుఁ దక్కినయట్టి మర్కటోత్తముల, నెఱయంగఁ జంపుదు నేఁ డాజిలోనఁ
దెగువతో ననుచు నదృశ్యుఁడై యచట, నొగి రాక్షసుల నేయుచున్న రాఘవులఁ
బొడగని భీకరభ్రుకుటియై విల్లు, వడి నెక్కు వెట్టి దుర్వారవేగమునఁ
బ్రళయకాలమునాఁడు బలునృష్టి గురియు, జలదంబువిధమున శరవృష్టి గురిసె
గగనంబు నిండ నాఘనులు రాఘవులు, నొగి నేసి రలుకమై నుగ్రబాణములు
అమరారి యవి ద్రుంచి యమ్ములసోనఁ, దివిరంబు వరగించె దిక్కులం దపుడు
పృథుచండకోదండభీకరధ్వనియు, రథనేమిరవమును రథతురంగముల
గొరిజలమ్రోఁతయు గుణమునిస్వనము, నరుదార జనియించు నతనిరూపంబు
వినఁ గానఁబడకుండ విస్మయంబంది, ఘనవీథిఁ బరికింపఁ గ్రమ్మఱి నతఁడు
అఖలాంబకంబుల నాదాశరథుల, నిఖలావయవములు నిండనేయుటయు
నాఖరకరకులుం డారాఘవేంద్రఁ, డాఖరసూదనుం డపుడు కోపించి
వాఁడేయు మార్గణావళు లెందు వచ్చు, వాఁడి భల్లనులందు వడినేసి యేసి
యాబాణజాలంబు లందంద తునుమ, నాబాహుబలశాలి యగునింద్రజిత్తు
బహుముఖంబులఁ దేరుఁ బఱపుచు నేసె, బహుశరంబుల నంతఁ బార్థివసుతులు
కమియఁ బూచిన కింశుకంబులతోడి, సమత నొప్పిరి శరక్షతయుతాంగముల
కరముగ్ర మైనట్టి కాలమేఘంబు, కరణి నొప్పిన తనఘనశరీరంబు
తెలియకుండఁగ యామ్యదిక్కుననుండి, పలికె నయ్యింద్రారి పార్థివేశ్వరుల
ఎక్కడఁబోయెద రెందు డాఁగెదరు, చిక్కితి రిట మిమ్ముఁ జేరి కావంగ
దిక్కెవ్వ రిలమీఁద దివిజు లటన్నఁ, జుక్కవాల్నావంకఁ జూడ నోడుదురు
బక్కకోఁతుల నమ్మి బవరమ్మునకును, మొక్కలమ్మున వచ్చి మోసపోయితిరి
పటుతరంబైన నాబాణాగ్నిశిఖలఁ, బెడపెటఁ బ్రేలక ప్రిదిలిపోఁగలరె

యావిభీషణునివాక్యములె నిక్కువము,గా విని నాశక్తిఁ గానలేరైతి
రదె మిముఁ దెగటార్చి యేచి యీప్రొద్దె, కదలి యయోధ్యలోఁ గలవారినెల్లఁ
బరిమార్చి మించి యాభరతశత్రుఘ్నుఁ, లిరువురఁ జంపి నే నేతెంతు ననినఁ
గడు వెఱఁగందిరి కపులు నాకపులు, నడరు కోపంబున నాయింద్రజిత్తు
పడమటఁ దనవేరు పంతంబులాడుఁ, దడయకుదీచిన ధనువు మ్రోయించు
ధీరుఁడైయటఁ దూర్పుదిక్కుననుండి, భూరంపుశరవృష్టి గురియించు మఱియు
దక్షిణంబున కేగి ధరణి గ్రక్కదల, నక్షీణశక్తిచే నడరి పెల్లార్చు
నిబ్బంగిఁ దిరుగు చనేకమార్గముల, నబ్భానుసూన్వాదు లరుదంది చూడ
శరముల వింటితో సంధించుకొనుచుఁ, బరువడి వాఁడేయు బాణజాలములు

జనపతుల్భ్రంతురు చటులాంబకముల, ననిమిషు లప్పు డత్యాశ్చర్యమంద
అప్పుడు శతసంఖ్య లతనిచేఁ గపులు, కుప్పలు కుప్పలై కూలుట చూచి
సౌమిత్రి కోపించి జనపతి కనియె, భూమిశ వీనిచేఁ బొలిసిరి కపులు
ఇదియేమి దేవ నీ విట్లూరకున్కి, యిదె చూడుమీ భువి నెల్లదిక్కులను
బడి పొర్లుచున్నారు భల్లూకపతులు, మడిసి రనేకులు మర్కటేశ్వరులు
జగదీశ నిను నమ్మి సకలవానరులు, మిగిలినభక్తితో మేకొనివచ్చి
తగిలి యీయింద్రారిదారుణాస్త్రముల, నొగిలి నీనామమే నొడువుచున్నారు
పగవాఁడు చేరి నీబలమెల్లఁ ద్రుంపఁ, దగదింకఁ దెగకున్నఁ ద్రైలోక్యనాథ
పగదగనల్లు నీబాణజాలములు, గగనంబు దిక్కులు గలయంగ నిండి
నిండినభక్తితో నిజదివ్యతనువు, లొండొంట ధరియించి యున్నవి వానిఁ
గైకొమ్ము రిపుఁ జంపు కమలాప్తవంశ, నీకెదురై పోర నేర్తురే రిపులు
ఇంత శాంతము దగునే నృపులకును, జింతింప వేల విచిత్రంబుగాఁగఁ
బరఁగిన నీబాహుబలపరాక్రమము, తరుణార్కసమతేజ తలపోయవకట!
యీనిశాచరకోటి నీయింద్రజిత్తు, నేన చంపెద దేవ నీమహత్వమున
నిటమీఁద బ్రహ్మాస్త్రమే ప్రయోగించి, కుటిలరాక్షసకోటికులమెల్ల నడఁతు
అనవుడు రఘురాముఁ డనుజుని కనియె, వినుము లక్ష్మణ యొకవీనికై పూని
చనునె పల్వురఁ జంప సంగ్రామమునకుఁ, జనుదేని వారల సమయింప నగునె
యనిమిషబ్రహ్మరుద్రాదులచేత, ననిఁ జావఁ డితఁడని యబ్జజుం డిడిన
వరము చెల్లింపంగ వలసియే వీని, నిరవొందఁ గావితి నిఁక నుండెనేని
వీనిఁ జంపఁగఁజాలు వీరవానరుల, నేను బంచినవారె హింసింతు రితని
నటుగాక తక్కిన నమ్మేఘనాదుఁ, డట నింద్రలోకంబునందు డాఁగినను
నట బ్రహ్మలోకంబునందు డాఁగినను, నట రుద్రలోకంబునందు డాఁగినను
ధరణి దూరిన రసాతలముఁజొచ్చినను, శరధిలో మునిఁగిన జముఁడు గాచినను
దనతాత యగుతాత తనవెన్కఁ బెట్టు, కొనిన నేఁ బోనీను ఘోరాజిఁ ద్రుంతు
నని పల్క రఘురామునలుక వాఁడెఱిఁగి, యనిసేయనొల్లక యాలంకఁ జొచ్చి
ఘోరనిశాచరకోటితోఁ బోయి, యారావణునితోడ ననె నింద్రజిత్తు

కట్టల్కఁ గపులను గయ్యంబునందు, నెట్టన నేసితి నేలపైఁ గూల
మనుజుల నిద్దఱ మానముల్గొంటి, ననవుడు రావణుం డతనిఁ గోపించి
యిదియేమిపోక యీ యిదియేమిరాక, యిదియేమి సేతఁగా నెన్ని చెప్పెదవు
ఒక పఱియును జంప కూరక వచ్చి, ప్రకటించె దంభము వడిరని నీవు
నీవేచి నడఁచిన నిఖిలలోకములు, భావింప నప్పుడే భస్మమైపోవు
నదిగాన నిది యొక్కయధిక మటంచుఁ, దుదిఁ దలంపకుము సంతోషంబుగాక
మగఁటిమి రామలక్ష్మణుల వానరులఁ, దెగటార్చికాని నాదెస కేగుదేకు
మనవుడు నౌఁగాక యని యింద్రజిత్తు, దనుజేంద్రు వీడ్కొని తనమదిలోన
నతికాయకుంభకర్ణాదిదైతేయ, పతులెల్ల మడిసి రిబ్బంగి నుగ్రాజిఁ
గాన నారామలక్ష్మణుల నేరీతి, నైనను గెల్చెద ననని నిశ్చయించి
సీత చందముగాఁగఁ జెలువొంద నొక్క, నాతినిఁ దనమాయ నాకేళవైరి

ఇంద్రజిత్తు మాయాసీతను దెచ్చి తలఁ దఱుగుట

యటఁజేసి ప్రీతి మాయాసీతఁ గొనుచుఁ, బటుబలసహితుఁడై పడమట వెడలె
వానికిఁగాక యావానరులెల్ల, నానాముఖంబుల నలికి పాఱుటయు
హనుమంతుఁ డపుడు మహాశైలశృంగ, మనువారగాఁ బట్టి యసుర మార్కొనఁగ
నరుదార నడచుచో నల యింద్రజిత్తు, నరదంబుమీఁద మాయాసీతఁ జూచె
వెక్కసంబుగ రామవిరహానలంబు, నిక్కిన నాహారనిద్రలు దొరఁగి
కడలేని వగఁబొంది గతిఁగానఁబడక, వెడలు నిట్టూర్పుల వెలవెలఁ బాఱి
కడుఁ గృశంబగుమేను కమలపత్రముల, నొడుచులోచనముల నొలుకుబాష్పముల
జడగట్టి సీమంతసరణిఁ జిక్కొదవి, యడగొని మలినంబు లగుశిరోజములు
రథనిరజోలిప్తతనుతరాంగములు, గరము విన్ననిమోము గరపల్లవంబు
గదిసిన చెక్కునై గాలిచేఁ జాల, గదలెడు లతవోలెఁ గంపించుచున్న
యామహీసుతఁ జూచి యకట వీఁడింక, నేమినేయునో రామహృదయవల్లభను
నీదీనదశ నాకు నీక్షింపవలసె, హా దైవమా యని హనుమంతుఁ డడరి
ఘోరవానరపరికోటితో నడువ, దారుణాకృతిఁ బేర్చి తనమీఁద ననికి
నడచుచో నవ్వాయునందను గాంచి, కడుఁ గ్రూరుఁడై దశకంధరనందనుఁడు
ఇది యేలవచ్చేఁ దానీనేనతోడ, ఇదె చూడరా సీత యీసీతకొఱకు
నలజడి వడియెద రటుగాన దీనిఁ, దలద్రెవ్వ నేనెదఁ దవిలి యేననుచుఁ
గలఁగి శార్దూలంబుకడ నున్నహరిణి, పొలుపున నయనాంబుపూరంబు లొలుక
హారామ హారామ యనునార్తరవము, లారంగఁజేయు మాయాసీత నొడిసి
తలవెండ్రుకలువట్టి దట్టించి యీడ్వ, నలఁగి యావైత్యుతో ననియె వాయుజుఁడు
తగునె దురాత్మక దనుజుండవైన, నగుదుఁగా కేము నీవావిశ్రవసుని
మనుమఁడ విబ్బంగి మనకులేశ్వరుని, వనితముందలఁ బట్టి వారక తిగువ
ననవుడుఁ గరవాల మంకించి యసుర, దనరు మాయాసీత తల ద్రెవ్వనేనెఁ
జనుమింక రామలక్ష్మణులకుఁ జెప్పు, మన ఖిన్నుఁడై యుండె ననిలనందనుఁడు

వసుధాతలంబున వడి నెత్తురొల్క, నసిధారఁ దెగియున్న యాసీతఁ జూపి
హనుమంతుతో ననె నాయింద్రజిత్తు, వనచరోత్తమ రామువనిత నీసీత
ఘనతరంబైన నాకరవాలమునను, దునిమితి మీరణోద్యోగంబు లింకఁ
జిక్కెఁ బొమ్మంచు విజృంభించి పలికి, దిక్కుంభికర్ణము ల్దిశలును బగుల
సంహారఘనఘన స్తనితమో యనఁగ, సింహనాదమునేయఁ జిత్తము ల్గలఁగి
యప్పుడు రణములో నాయింద్రజిత్తుఁ, దప్పక కనుఁగొని తనరినభీతి
వనచరులార్వంగ వాయునందనుఁడు, కనుఁగొని పలికె నోకపివీరులార
సమరవిక్రమములు చాలించి పాఱు, సమయమే వినరొక్కో సమరధర్మంబు
దలఁప బంధులకెల్లఁ దలవంపుగాఁగఁ, గలనఁ బాఱుటకంటె కష్టంబు గలదె
నడఁచెద నేమున్ను ననుఁగూడి మీరు, కడిమి వాటింతురు గాకంచుఁ బలుక
నందఱు తరువులు నద్రిశృంగములు, నందంద కయికొని హనుమంతుఁ గూడి
రయమున నార్చుచు రాక్షససేన,పయి వైచి రంత నాపవమానసుతుఁడు
చలమున నొకమహాశైల మంకించి, యలుకతో వైవంగ నానిశాచరుని
సారథిరథ మాలఁ జన తోల నదియు, దారుణధ్వనితోడ ధర క్రుంగఁబడియె
ఆలోన పెండియు నగచరు ల్తరులు, శైలశృంగములు రాక్షసులపై వైవఁ
దనసేన విఱిగిన దశకంఠసుతుఁడు, కనుఁగొని కోపించి కపియూథపతులఁ
బటుశూలముద్గర ప్రాసఖడ్గములఁ, జటులవేగంబున సమయించె నపుడు
మారుతాత్మజుఁడును మదిలోనఁ గినిసి, ఘోరవిక్రమకళాకుశలుఁడై వేర్చి
కడిమిచేఁ గవియు రాక్షసుల రూపడఁచి, వడి శిలాతరుఘోరవర్షముల్ గురిసి
యానిశాచరసేన నవలీలఁ దోలి, వానరావలిఁ జూచి వాయునందనుఁడు
వనచరపతులార వసుధేశుదేవి, దనుజాధముఁడు జంపెఁ దప్పేఁ గార్యంబు
సమరమేటికి నింక జనకజావార్త, కమలాప్తకులున కొక్కఁట నెఱిఁగింప
నరుగుద మటమీఁద నారామముఁ దెద్ది, వెరవాన లిచ్చు నావిధము నేయుదము
మీరందఱును సంభ్రమింపకయుండుఁ, డీరాక్షసుఁడు క్రూరుఁ డేమఱువలదు
అనియటు మగిడిన హనుమంతుఁ జూచి, తగమది నప్పు డద్దశకంఠసుతుఁడు
ఈమహాబలుఁ డేగె నిటమీఁదఁ దనకు, హోమవిఘ్నమునేయ నోప రెవ్వరును

ఇంద్రజిత్తు నికుంభిళయాగము సేయుట.

అని నికుంభిళకేగి యచట నిశాటుఁ, డెనసిన నిష్ఠతో నేపుదీపింపఁ
గల్లు నెత్తురు పాలు ఘనకచ్ఛపముల, బల్లుల బిల్లులఁ బలుసర్పములను
గారుకోళ్లను మంచిగంధంబు తేనె, నారికేళంబుల నల్లనికోళ్ల
సూకరంబుల మఱి సొరిది కేశములఁ, గాకులఁ దెల్లని గార్దభంబులను
గాఱెనుపోతుల ఘనమేషములను, నాఱు నాలుగు రెండు నఱువదికరులఁ
గొండగొఱ్ఱెలు వేయి కోటుల లక్ష, మండూకములఁ గోటి మాణిక్యములను
ముత్యంపుఁజిప్పలు మూఁడర్బుదములఁ, గాత్యాయనీదేవికడ నిష్ఠ నిలిపి
మనమున నిగమనమంత్రపూతముగ, ననలుని రుధిరమాంసాదులఁ దనిపి

హోమంబుసేయుచు నుండె నయ్యెడను, రాముండు పడమటిరభసమంత యును
విని జాంబవంతుని వేగంబ పిలిచి, వినవచ్చెఁ బడమట విపులఘోషంబు
హనుమంతునకు నెట్టి యనియైన యదియొ, ఘనమైన యట్టి యాకలకలం బరయఁ
జనుము రయంబున సైన్యంబుతోడ, ననిన ఋక్షేశ్వరుం డతిశీఘ్రవృత్తి
బలువిడి భల్లూకబలములు దన్నుఁ, గొలిచి యప్పుడు నూఱుకోటులు రాఁగ
వడిగొని పశ్చిమద్వారంబు దెసకు, నడుచుచోఁ గనియె నన్నడుమ వాయుజుని
వాయుజుండును జాంబవంతునితోడ, నాయింద్రజిత్తునేఁ తంతయుఁ జెప్పి
యీవార్త రామున కెఱిఁగించి వత్తు, నేవచ్చునందాఁక నేనున్నయెడను
గాచి యీవాకిటఁ గదలకయుండు, మేచిన పగవాని నేమఱవలదు
అని పంచి వచ్చుచో ననతిదూరమున, హనుమంతుఁ బొడగని యారాఘవుండు
ఇతనిముఖస్థితి నేమొకో కార్య, గతి దోఁచుచున్నది కనుఁగొన నిపుడు
ఇదియే తెఱంగని యిచ్చుఁ జింతింపఁ, గదిసి వాయుజుఁడు రాఘవునకు మ్రొక్కి
దేవ యేమెల్లను దెంపుమై దాన,వావలితోడఁ గయ్యమ్మొనరింప
మాముందటనె తెచ్చి మది శంకలేక, భూమిజ తలఁ ద్రెంచెఁ బొరినింద్రజిత్తు
ఆవాకిటికిని ఋక్షాధీశుఁ బెట్టి, యీవార్త చెప్పంగ నేను వచ్చితిని
అనువార్త చెవులలో నడరకమున్నె, ఘనవాతనిహతి వృక్షంబునుబోలె
నతులశోకాగ్నియు నడరి దహింప, ధృతిదూలి రవికులాధిపుఁడు మూర్ఛిల్లి
యవనిపైఁ బడియున్న నతిభీతినొంది, ప్లవగవల్లభులెల్లఁ బటుశోకులైరి
కైకొని యపుడు లక్ష్మణుఁ డన్నతోడల, పైకిరాఁదిగిచి సంభ్రమచిత్తుఁ డగుచు
నక్కటా! రామ నీయట్టియుత్తమున, కిక్కశంకము పుట్టెనే యిట్టిచోటఁ
దలపోయఁగా మేలు ధర్మంబునందుఁ, గలదనుమాట నిక్కము గాకపోయె
నదియొ నిక్కంబైన నకట! నీయట్టి, సదయచిత్తున కేల సంతాప మొదవు
నీచేత రావణునికిఁ జావులేక, యీచందమునసుండ నేటికివచ్చు
జానకి కేల యీచావు సిద్ధించుఁ, గాన ధర్మముకంటె ఘనమధర్మంబు
త్యాజ్యంబుగాదని తలపోయకట్టి, రాజ్యంబు విడిచి యరణ్యంబులందుఁ
దిరుగ వచ్చితిమటుఁ దిరిగెడు మనకుఁ, బురుషార్థములు సిద్ధి వొందునే యధిప
అవనీశ నిర్ధను లగువారుసేయ, వివిధయత్నంబులు వెస నిదాఘముల
నడరెడు సెలయేరు లడఁగినభంగిఁ, జెడిపోవునని బుధు ల్చెప్పంగ వినమె
ధనము లార్జించిన ధర్మకామాదు, లనుపమస్థితితోడ నధిప సిద్ధించు
ఎసఁగంగ నర్థంబు లెవ్వాని కొదవు, వసుధ వానికి నెల్ల వారు చుట్టములు
అర్థంబుగలవాఁడె యరయంగఁ బురుషుఁ, డర్థంబుగలవాఁడె యధికుండు జగతి
అర్థంబె విద్యయు నర్థంబె నేర్పు, నర్థంబె కీర్తియు నర్థంబె పెంపు
అర్థంబె బలమును నర్థంబె కులము, నర్థంబ బలగంబు నర్థంబె గుణము
అర్థంబె శీలంబు నర్థంబె ప్రాణ, మర్థంబె పుణ్యంబు నర్థంబె భూమి
అర్థంబె రూపును నర్థంబె నీతి, యర్థంబె ఖ్యాతియు నర్థంబె భూతి

అర్థంబె గతియును నర్థంబె మతియు, నర్థంబ యెఱుకయు నర్థంబె సుఖము
అర్థంబు కావున నఖలకామ్యములు, నర్థసంపన్నున కరచేతివరయ
అధికులు వేదవేదాంగపారగులు, బుధులు పూర్వంబులఁ బూతాఁతమల
నర్థంబుగలవాని నమరఁ బూజింతు, రర్థి మోఁకొర్థులై యడఫులనుండు
మునిపుంగవులు కందమూలంబు లిచ్చి, ధనవంతులగువారి దర్శింతు రెలమిఁ
బొయక మంగళపారకానీక, గాయకకులములు కలవారిఁ బొగడు
ఉన్నతకుచములు నురునితంబములు, నన్నువనడుములు నలసయానములు
బింబోష్ఠములు చంద్రబింబాననములు, నంబుజలలితంబు లగులోచనములు
రోలంబకులనీలరుచిరధమ్మిల్ల, లీలాలకంబులు లేతసిగ్గులును
ఒయ్యన నవ్వుట నోరచూపులును, దియ్యమాటలు గాముదీమంబు లనఁగ
నెలయించు నేర్పులు నెలజవ్వనములు, గలకాంత లర్థంబు గలవృద్ధునైన
మనమారఁ గొలుతురు మహితభోగేచ్ఛ, ధనహీను నొల్లరు దర్పకునైన
లేమియే నరకంబు లేమియే రుద్ర,భూమియు లేమియే భూరిశోకంబు
లేమియే రోగంబు లేమియే మృతియు, లేమియే పాపంబు లేమియే జరయు
లేమియే కష్టంబు లేమియే కరువు, లేమియే దైన్యంబు లేమియే వగపు
లేమియే సకల మాలిన్యంబు దలఁప, లేమియే సర్వంబు లేమి గావునను
అచ్చెరువుగ రాజ్య మంతయు విడిచి, వచ్చినప్పుడ కాదె వచ్చె నాపదలు
జానకిమరణంబు సైరింపఁజాల, మానవలోకేశ మార్గణావళుల
విసువకాసురబలాన్వితముగా లంక, మసలక నింక భస్మంబు చేసెదను
అని లక్ష్మణుఁడు పల్క నావిభీషణుఁడు, దనమది నూహించి ధరణీశు కనియె
నాయింద్రజిత్తుమాయయె కాని సీత, కేయపాయంబును నిట్టుగాదు వినుము

విభీషణుఁ డింద్రజిత్తునిమాయ శ్రీరాములతోఁ జెప్పుట.

ఖలుఁడైన యాపజ్జ్యకంయండు దలఁచు,తలఁపు నేనెఱుఁగుదు త్రైలోక్యనాథ
జానకి నొప్పింపు జనపతి కనుచు, నేనెన్ని చెప్పిన హితవుగాఁ గొనఁడు
జనకనందన నేల చంపించు నతఁడు, మనుజేశ యిది వాని మాయగావలయు
అట్టిదియైన నోయవనీశవర్య, నెట్టనఁ బొలియవే నిఖిలలోకములు
ఇది బొంకు చింతింపనేల యాసీతఁ, బదిలంబుగాఁ జూచి ప్రతివార్త దెత్తు
నని రామునానుమతి నవ్విభీషణుఁడు, దనరూపమంతయు దాఁచి వేగమున
నలిరూపుఁ గైకొని యసురేశువనము, తలఁకకఁ జొచ్చి సీతను గాంచి మరలి
వచ్చి యారామభూవరునకు మ్రొక్కి, యచ్చపుభక్తితో నంతయుఁ జెప్ప
విని విభీషణ యిట్టివిధ మేల నేనె, ననిలోన నింద్రజిత్తని రాముఁ డడుగ
దనుజుఁ డాసురహోమతాత్పర్యబుద్ధి, జనుటకునై యిట్టి చందంబుచేసె
హనుమంతుఁడాదిగా నగచరకోటి, మనములు గలఁచి యిమ్మాడ్కిఁ బుత్తెంచి
తనహోమవిఘ్నంబు తగఁజేయువార, లనయంబు లేరింక నని నికుంభిళకు
నరిగినవాఁడు వాఁ డచట హోమంబు, పరిసమాప్తముగాఁగఁ బటునిష్ఠ నేఁడు

దనహోమమంత్ర మింతయుఁ జక్కఁకుండ, మనుయు క్తి నవధానమతిఁ జేసెనేని
దేవదానవులైన దృష్టించి నిలిచి, యీవీరవరు నెవ్వ రని గెల్వలేరు
అటుగాన నీలోన నసురవ్రేలిమికిఁ, బటుగతి విఘ్ను మాపాదింపవలయుఁ
జనియెద నేనిదె సైన్యంబుతోడ, మనుజేశ పంపు లక్ష్మణుఁ దోడు మాకు
సౌమిత్రి యవ్వీరుఁ జండకాండముల, భూమిపైఁ బడనేసి పొలియింపఁ గలఁడు
నేడింద్రజిత్తును నీతమ్ముఁ డొడుచు, వాఁడు నికుంభిళావనములోపలను
దపము గైకొన్నాఁడు దశకంఠసుతుఁడు, తపము నిండకమున్న దండింపకున్న
బ్రహ్మ మెప్పించి యాపరమేష్ఠివలన, బ్రహ్మశిరంబును బాణంబు విల్లు
కవచంబు ఖడ్గంబు కవదొన ల్మ ఆయ, నవిరళమంత్రపూతా స్త్రము ల్వడసి
కామగాశ్వంబును గమనీయకేతు, భీమంబు మారుతస్ఫీతవేగంబు
నగురథం బాయగ్నియందు వెల్వడినఁ, దగనారథం బెక్కి ధను వందెనేని
నావాసవాదాతి నాలంబులోన, దేవాసురాదులు దృష్టింపలేరు
వానికి నిమ్ముల వరమిచ్చునప్పు, డాసీరజాసనుం డతని వీక్షించి
నీవు నికుంభిళ నెఱయ హోమంబు, గావించితేని నేగతి నజేయుఁడవు
కావించు హోమంబు గడమగునేని, రావణసుత నీవు రణములోపలను
బగతుచేఁ జత్తని పల్కినవాఁడు, జగదీశ యటుగాన సమరయత్నంబు
నేయించి నేడింద్రజిత్తుఁ జంపింపు, మాయావి యగువీఁడు మడిసినఁ జాలు
నమరకంటకుఁడగు నద్ధశానుఁడు, సమరంబులో మున్నె చచ్చినవాఁడు
అని పల్క రఘురాముఁ డప్పుఁ డనుజన్ముఁ, గనుఁగొని యనఘాత్మ ఘనుఁ డింద్రజిత్తు
ఘనతిరోహితతిగ్మకరుభంగి నింగి, ఘనమాయఁ దనగతి గానరాకుండఁ
జరియించు నవ్వీరు శక్రాదిసురులు, దురమునఁ గడిమిమైఁ దొడరంగలేరు
హోమమధ్యంబున నుగ్రరాక్షసుని, సౌమిత్రి నీవేగి సమయింపు వేగ
పటుతరభల్లూకబలముతోఁ గూడి, చటులవిక్రముఁడైన జాంబవంతుండు
హనుమంతుఁడును దోడు నరుగుదెంచెదరు, ఘనతరవిజయవిక్రమధురంధరుఁడు
ఇమ్మంత్రివరులతో నివ్విభీషణుఁడు, నెమ్మి నయ్యాగంబు నీకుఁ జూపెడిని
అని పల్క రఘురాముఁ డనుజాతునకును, వనధియిచ్చినయట్టి వజ్రకవచమ్ము
ఘనతరఖడ్గంబు కవదొనల్విల్లుఁ, బెనుపొందఁగా నిచ్చి ప్రీతితో మఱియు
వరభూషణంబులు వరుసగా నిచ్చి, యరుదైనవేర్మి నిట్లనుచు దీవించె
అనిశంబు జయము శ్రీహరి యొనఁగూర్చు, ఘనతరశుభము శంకరుఁ డిచ్చు నజుఁడు
నీకాయువు ఘటించు నిఖలదేవతలు, గైకొని దిశలందుఁ గాతురు నిన్ను
అనిలుండు ననలుండు నభిరక్షణంబు, దనరఁ జేయుదురు ముందఱవెనక నీకు
అనవుడు లక్ష్మణుం డప్పు డుప్పొంగి, ధను వందుకొని తనుత్రాణంబుఁ దొడిగి
కవదొనల్ధరియించి ఖడ్గంబు దాల్చి, వివిధభూషణముల విలసితుం డగుచు
నారాముఁ గనుఁగొని యతిభక్తి మ్రొక్కి, ధీరవాక్యంబులఁ జెఱఁగొప్పఁ బలికె
నలి నాకరములోన నలి మరాళములు, కలఁగొనఁబడునట్టి గతి గానఁబడఁగ

నాతెల్లగరులబాణము లింద్రజిత్తు, వేతూరి చని నేఁడు వెస లంక పడును
విపులతూలస్తోమవిధమున దాని, నృపవీర విశిఖాగ్ని నీయుచేనెదను
అని యధోచితభంగి నారామచంద్రు, మనమార వీడ్కొని మహితతేజమున

లక్ష్మణుఁడు యుద్ధమునకు వెడలుట.

గరుడుని నెక్కిన కమలాక్షుపగిదిఁ, గరువలిసుతు నెక్కి కరమొప్ప మిగిలి
పంబి గోలాంగూల బలములు గొల్వ, జాంబవదాదులు చనుదేరఁ గదలి
బలువిడి నటకు ముప్పదియోజనములు, గలనికుంభిళ కేగి ఘనతరంబుగను
నురుమదేభంబులు సుత్తమాశ్వములు, నరిది రథంబులు నలరు శాల్వలము
స్తోమమైనవనంబు చుట్టును గాచి, భీమమై యెందు నభేద్యమై తనరి
బలములన్నియు నల బలమెల్ల నుడిగి, యలలు లేనట్టి యాయంబుధికరణి
నున్న రాక్షససేన నొప్పారఁ జూచి, సన్నుతశస్త్రాస్త్రసన్నద్ధుఁడైన
సౌమిత్రితో విభీషణుఁ డిట్టులనియె, నీమహాసైన్యంబు నిషుపరంపరల
నెడల నేసినఁగాని యింద్రారి మనకుఁ, బొడగానరాఁడు నీభూరిబాణములఁ
దూలింపు మీనేనఁ దొలితొలి పిదప, హాలాహలాభీల మైనశరాలి
దొరకొన్నహోమంబు తుదిముట్టకుండ, దురితాత్ముఁ డగువానిఁ ద్రుంపుము వేగ
అనవుడు సౌమిత్రి యత్యుదగ్రతను, గనుఁగొనలం దగ్నికణములు దొరఁగఁ
బలుతెఱంగుల బాణపఙ్క్తులు వఱపె, నలఘుబలోదగ్రులై వెల్లు రేఁగి
తరుచరాధిపులును దరులును గిరులు, పొరిఁ బొరి వైచి రప్పుడు సొంపు మిగిలి
అసురులు నత్యుగ్రులై వనచరుల, వెసఁ బరిఘుంబుల విసరివైచియును
గదలచే మోఁదియుఁ గరవాలములను, విదళించియును బహువిధముల గడఁగి
మఱియును దక్కిన మహితశస్త్రముల, నురక నొప్పించిరి యుగ్రత నిట్టు
మార్పడ నసురుల మర్కటేశ్వరుల, యార్పుల నాలంక యట్టిట్టుఁబడఁగ
అంతఁ బోవక రాక్షసావలిఁ దఱిమి, యెంతయుఁ గడఁక ననేకశస్త్రములఁ
గఫుల నొప్పింపంగఁ గఫులును గవిసి, కుపితులై రాక్షసకోటి నొప్పింప
విఱిగి రాక్షసులెల్ల వెస నింద్రజిత్తు, మఱుఁగున కరిగిరి మతమెల్లఁ దక్కి
ఆలోన నొక్కొక్క యాహుతిఁబట్టి, యాలోలకీల మహావహ్ని కసుర
పరఁగంగ నిన్నూటపదియాహుతులకు, దొరకొని యొక నూతతొమ్మిది వేల్చి
కడమ యాహుతులు నాకైవడిఁబట్టి, విడువక నిష్ఠతో వ్రేల్చుచునుండి
యురుతరసత్త్వులై యుగ్రతఁ బేర్చి, ధరణి గంపింప నత్తరుచరవరులు
బలువిడి నేతెంచి పైనార్చుటయును, గలుషతఁ జిత్తంబు గలఁగినఁ జేతి
యాహుతి యటు వైచి యాయింద్రజిత్తు, నాహవోన్ముఖుఁడు మహారోషమెత్తి
కన్నుల నిప్పులు గ్రమ్మంగ భీషణోన్నతి రథమెక్కి యుగ్రకార్ముకము
ధరియించి మించి యుద్ధతి నేగుదెంచి, తరుచరసేనలఁ దఱిమి నొప్పింప
దనుజేశుతమ్ముండు దనర సౌమిత్రిఁ, గొనిపోయి వనమతి క్రూరుఁడై చొచ్చి
సమధికంబగు నీలజలదంబపోలెఁ, గొమరారుచున్న న్యగ్రోధంబు క్రిందఁ

దొడఁగి యాయింద్రజిత్తుఁడు నేయఁజేయఁ, గడమ చిక్కినహోమకర్మంబు జూపి
సౌమిత్రి చూచితే సమరంబుకొఱకు, హోమ మిక్కడ దైత్యుఁ డుగ్రతఁ జేసి
బలిభూతముల కిచ్చి పావకువలనఁ, గలశక్తిసహితులఁ గడఁగి జయించుఁ
దొల్లియు నిటుచేసి దుర్మదవృత్తి, బల్లిదుఁడై యనిఁ బర్జన్యు గెలిచె
నిప్పుడు నిదె చూడు మీహోమవహ్ని, నొప్పార వెడలుచు నున్నది రథము
అరుణనేత్రంబుల నరుణకేశముల, నరుణవస్త్రంబుల నరుణమాల్యముల
జడిగొన్న నల్లని సారథితోడఁ, గడునెఱ్ఱి నగుతురంగంబులతోడ
వాఁడు క్రమ్మఱ వచ్చి వరహోమశక్తి, వేడిమి నెంతయు వెడలించి మించి
యీరథం బెక్కిన నింద్రాదులైన, నారావణాత్మజు ననినోర్వరాదు
కాన నింతటిలోనఁ గడఁగి సౌమిత్రి, వానినిఁ బటుశరవ్రాతంబుచేతఁ
బొలియింపు మనుడును బొంగి లక్ష్మణుఁడు, తలఁగక కార్ముకధ్వని చెలంగింపఁ
గరవాలహస్తుఁడై కవచంబుఁ దొడిగి, యరుదార శిఖివర్ణ మగురథం బెక్కి
తనరూపు చూపిన దశకంఠసుతుని, గనుఁగొని సౌమిత్రి కడునల్కఁ బలికె
మాయలఁ బనియేమి మగవాఁడవేని, నాయెదుటికివచ్చి ననుఁ జూతుగాక
నిక్కంపులావున నీవు గయ్యమునఁ, జక్క నిల్వుము నిన్ను జమునఁ గూడఁబత్తుఁ
గపటంబుఁ గైకొన్నఁ గైకొనకున్నఁ, గపటరాక్షస నిన్నుఁ గడతేర్తు వేగ
నెఱసిన కడిమితో నిలువు నాయెదురఁ, గఱకురాక్షస యనుకడ నింద్రజిత్తు
భీలకరాళసంస్థితుఁడై పలికె, బాలుండవై యిట్టి పంతంబులేల
లక్ష్మణ నిన్ను నాలంబున వీర, లక్ష్మికిఁ బెడఁబాపి లావెడలించి
యసువుల నాదు బాణావలిఁ బెఱికి, వసుమతిపైఁ గూల్చి వారక వ్రచ్చి
కాకుల గ్రద్దలఁ గండలఁ దనుప, భీకరాకారతఁ బెంపారువాఁడ
ఉరక నాకట్టిన యురగపాశములు, మఱచితె లక్ష్మణ మది నింతలోనె
అని లక్ష్మణునిఁ బల్కి యట విభీషణునిఁ, గనుఁగొని యింద్రారి కడునల్కఁ బలికెఁ
బినతండ్రివఁట నీవు ప్రియమార నేను, దనయుండ నాకెగ్గు దలఁపంగఁ దగునె
దుర్మతివై కులద్రోహంబు నేయ, ధర్మభూతుక నీకుఁ దగవేల కలుగు
ఎడరైనబంధుల నెట్టి నీచుఁడును, విడిచి శత్రులఁ బోయి వేఁడునే శరణు
తగవు దప్పిననైనఁ దనవారిఁ బాసి, పగవారి సేవించి బ్రతుకు కొబ్రతుకు
అనిశాచరనాథుఁ డధికతేజుండు, నీనిష్ఠురోక్తులు నీతిగా వినునె
అన్న కోపించిన నటయింటిమూల, నున్న నేమగు నుండకున్న నేమగును
నీలావుబలిమినే యెల్లదేవతల, నాలంబులో గెల్చె నాదశాననుఁడు
హితుఁడవై మర్మము హిత మెఱింగించి, యతనిచేతన చెడుమన విభీషణుఁడు
నావర్తనము మేఘనాద యీవెఱుఁగు, దీవృథాజల్పంబు లేల యియ్యెడను
ఆతండ్రికొడుకైన యవనీతిమతికి, నీతియు ధర్మంబు నీకేల కలుగు
పాసఁగఁ జేపట్టిన భుజగంబుపగిది, వెసఁ గ్రూరుఁ డగుబంధు విడువఁగా వలయు
పాపాత్ముఁ డగునట్టి పక్షికంధరుఁడు, నాపలుకులు విన్న నాఁడింత లగునె

పరధనంబులకును బరకాంతలకును, బరితాపములఁ బొందు పాపకర్ములకుఁ
దగవేల మేలేల ధర్మంబులేల, జగదేకహితమైన చరితంబు లేల
మగ్నమౌ మీమది మదము గర్వంబు, నగ్నులై కాల్పక యవి యేల పోవు
తలకొని యెప్పుడు నధర్మవర్తనమె, కలిగి వర్తింతురు కడుఁ గ్రొవ్వి మీరు
సురల బాధింతురు సువ్రతులైన, పరమమునీంద్రులఁ బట్టి చంపుదురు
కావున నాదశకంఠునితోడ, నీవును లంకయు నిఖలబంధువులు
మాన కిచ్చకమాడు మంత్రులు గూడ, సేనలు రాజుచేఁ జెడుట సిద్ధంబు
బుద్ధిహీనుండవైతి స్ఫుటకాలపాశ,బద్ధుండవై తేమి పల్కినఁ బల్కు
మిటమీఁద నీమాయ లెక్కవు వినుము, వటమృక్షందికి హోమవాంఛఁ బోరాదు
చనరాదు లంకకు సౌమిత్రిఁ దొడరి, చనవచ్చు నిక వేగ జముపురి కనఁగఁ
బ్రభమాద్రిపయివచ్చు భానునిపగిదిఁ, బృథుగాత్రు హనుమంతుఁ బెంపార నెక్కి
యమరిన లక్ష్మణు నావిభీషణుని, సమరార్థులగు నగచరుల వీక్షించి
వీరులై నాబాణవృష్టికి మీరు, సైరించెదరుగాక సమరోర్వి నేఁడు
ఉడుగక నావింట నొదవు బాణాగ్ని, యడరి మిమ్మిందఱ నాహుతిగొనుచుఁ
గరవాలపట్టిసఘనభిండివాల, శరజాలముల మిమ్ము సమయింతు ననుచు
రోదసీకుహరంబు భ్రాయంగ సింహ,నాదంబు సేయుచు నానాశుగముల
వెస నేయుచును బాహావిక్రమస్ఫూర్తి, నెసఁగు నాముందఱ నెవ్వండు నిలుచు
అనవుడు లక్ష్మణుం డాదైత్యతోడ, దనుజాధమఁడ యీవృథాగర్వమేల
చేరక యడఁగి మ్రుచ్చిలి పోటువొడుచు, శేరణంబునఁ బాడి యేమగతనము

ఇంద్రజిల్లక్ష్మణులద్వంద్వయుద్ధము.

నీమాయలన్నియు నిరసించి నిల్వ, నామార్గణములఁ బ్రాణముల హరింతు
అనవుడుఁ గోపించి యతఁ డేసె నతని, ఘనకాలసర్పప్రకాండకాండముల
అవి లక్ష్మణుని గాడి యవ్వల వెడలి, యవనీస్థలము గాడె నద్భుతశక్తి
మఱియును వాఁడు లక్ష్మణదేవుమీఁదఁ, గరులాడగాఁ బెక్కుకాండంబులేయ
వడివచ్చి తాఁకి యవ్వల గ్రుచ్చిపాఱె, వెడలు రౌద్రరసంబు వెల్లియపోలెఁ
గడుఁబెల్లు నెత్తు రంగంబుల వెడల, నడరంగ రాక్షసు లార్చుచునుండ
జంకెల నట్టహాసములు చేయుచును, లంకేంద్రతనయుఁ డాలక్ష్మణుఁ జేరి
నరనాథసుత నేఁడు నన్నాజిఁ గదిసి, బిరుదవై యిటు విజృంభించిన నిన్నుఁ
దొలుతఁ గత్తళముఁ దుత్తునియలునేసి, తల త్రుంచి వైచెద దారుణాస్త్రముల
పెనుపేది పడియున్న ప్రియసహోదరుని, నిను జూచు రాముఁడు నేఁడవశ్యమును
అని పల్క లక్ష్మణుం డన్నిశాచరుని, గనుఁగొని యీవృథా గర్వమేమిటికి
పలుకులఁ బనియేమి బవరంబులోనఁ, దొలఁగక నాతోడ దొడరుమగాక
మాటలాడక వహ్నిమడియించు మాడ్కి, మాటలాడక నిన్ను మడియింతు నిపుడు
పనిలేనిపంతము ల్పలుకంగనేల, యనుచు నుగ్రాస్త్రంబు లరివోసి తిగిచి
ఘనతరభీషణాకారుఁడై వేర్చి, కనుగవఁ గెంజాయ గడలుకొనంగ

నమరంగఁ గోపించి యర్క–దీధితులు, గమియంగ దిక్కు–లఁ గలయంగఁ బర్వి
విలయాగ్ని కీలల విస్ఫులింగములు, కనుఁగొనఁ దెరలెడు ఘనతరశ క్తి
కలయమ్ము సంధించి కఱకురక్క–సుని, యలఘువక్షస్థ్సల మటగాడనేయ
దాన దైత్యుండు ర క్తము గ్రక్కి– మూర్ఛ, నూని యంతనె తెల్పినొంది పెల్లార్చి
వాఁడిమి మిగులఁ దీవ్రంబున నేసె, మూఁడుబాణముల రామునితమ్ముురము
అప్పుడు ధీరులై యధికరౌద్రముల, నిప్పులు గన్నుల నివ్వటిల్లంగఁ
జెలగు నయ్యిద్దఱు సింహనాదములు, బలువిడిఁ బఱతెంచు బాణఘట్టనలు
నురుగుణస్వనములు నొక్క–ట నెసఁగ, నరయ మృత్యువునట్టహాసంబువోలె
వెలసినలావుల విక్రమంబులను, బొలుపులఁ జలముల భూరిరౌద్రముల
ననిశంబు వెలుఁగు చంద్రార్క–లఁ బోలెఁ, దనరు చతుర్దంతదంతులవోలెఁ
గొమరారు సింగంపుఁగొదమలఁబోలెఁ, గ్రమమొప్ప శంబరకాములఁబోలె
నమరఁ ద్రినేత్రాంధకాసురులోలె, రమణఁ గుమారతారకులునుబోలె
నేపారు వృత్రాసురేంద్రులఁబోలె, రూపింప లయకాలరుద్రులఁబోలెఁ
బాయని జయకాంక్ష బలియురై పోర, నాయిద్దఱును నొప్పి రప్పుడు చూడ
కోపించి కోదండగుణఘోష మెసఁగఁ, జాపరథధ్వజసహితంబుగాఁగ
నామేఘనాదుని నంపవర్ష మున, సౌమిత్రి ముంచిన సైరింప కతఁడు
ప్రతిసాయకములేయ బలువిడి ద్రుంచి, వితతంబుగా బాణవృష్టిఁ గప్పుటయు
ఆయింద్రజితుఁ డప్పు డలవెల్లఁ బొలిసి, యాయస్త్రములకు మాఱైనయస్త్రములు
నెరినేయనేరక నిట్టూర్పు పుచ్చి, తరిగొని చూడ నత్తఱి విభీషణుఁడు
సౌమిత్రిఁ గనుఁగొని జననాథతనయ, నీమార్గణంబుల నిర్విణ్ణుఁ డగుచు
దశకంధరసుతుఁ డున్నదశఁ జూడు మింక, దశరథాత్మజ రణస్థలి వీని గెల్వ
మనవుడు నుగ్రంబులైన బాణములు, గొని యంగకములెల్ల గ్రుచ్చిపోనేయ
నొకముహూర్తము మూర్ఛనొంది వే తెలిసి, యకట ముందే వాసవాదుల గెల్చి
పరికింప దైవంబు ప్రతికూలమైన, నరునకు నిటు నేడు నాకోడవలసె
ననిలోన రాక్షసు లందఱుఁ బొలిసి, రినవంశజులచేత నిక నేటి బ్రతుకు
అనుచుఁ గోపమున నయ్యమరకంటకుఁడు, జననాథసుతుఁ జూచి చలమగ్గలించి
నరనాథనందన నావిక్రమంబుఁ, బరికించి నీవింక బంటవై నిలువు
మనుచు నేడమ్ముల నతని నొప్పించి, హనుమంతుఁ బదియింట నదరంట నేసి
వెస విభీషణుమీఁద విశిఖములాఱు, మసలక నిగుడించి మఱి విజృంభించెఁ
గాకుత్స్థతిలకుఁ డాకడిమి గైకొనక, నాకేంద్రరిపుఁ జూచి నవ్వుచుఁ బలికె
నధికుండు పంతంబు లాడకే గెలుచు, నధముండు పంతంబు లాడియు నోడు
ననుచితస్థితి శూరు లగువారు డాఁగ, ననిలోన వంచించు టది యొక్క– గెలుపె
కుటిలయుద్ధమునేయఁ గ్రూరాత్మ నీకుఁ, బటుగతి నిహామును బరము లేదనుచు
దినకరకరజాలతీవ్రార్చు లడరఁ, గనకపుంఖంబులు గలుగు బాణములు
వానిపై నిగుడించి వడి జోదుఁ ద్రెంచి, మేనుచ్చి చనఁగ నమ్మెయి మరువపుడు

కాలోగ్రసర్పంబు కంచుకం బనఁగ, నాలోకనాభీలమై నేలఁ బడియె
వాఁడు వెండియు నొక్కవజ్రాంగిఁ దొడిగి, వాఁడిబాణంబుల వడినేయ నపుడు
పరువడి నొండొరుబాణఘాతములు, నురువడి వెలువడు నురుశోణితములు
గైరికనిర్ఝరకలితంబులైన, భూరిభూధరముల పొలుపుఁ గైకొనుచుఁ
గరవేగశరవేగగతులు నేర్పులును, గరమొప్పఁ బోరుచోఁ గారాకురాలి
పూచినకింశుకభూజంబులొప్పు, నాచందమున నొప్పి రస్త్రఘాతముల
నమరగంధర్వాదు లచ్చెరువంది, సమరంబు చూడ నాసమయంబునందు
కలభవేష్టితమత్తగజలీల మంత్రి, కలితుఁడై భీకరగతి విభీషణుఁడు
విలుగుణధ్వనిచేసి విపులరోషమున, వెలుఁగుమంటలతోడి విశిఖంబులేయఁ
బిడుగులు చఱచిన పృథులభూజముల, వడువున రాక్షసు ల్వసుధపైఁ బడిరి
అనలుండు మొదలుగా నతనిమంత్రులును, ఘనశూలపట్టిసఖడ్గఘాతముల
నెగడి రాక్షసకోటి నేలపైఁ గలిపి, రగచరావలిఁ జూచి యవ్విభీషణుఁడు
ఇంక నీతనిఁ జంపుఁ డిందఱుఁ బొదివి, లంకేంద్రుబలమన్న లావన్న నితఁడె
అని నీతఁ డీల్గిన నాదశాననుఁడు, దనసేనతోఁ గూడఁ దానీల్గినాఁడు
మును ప్రహస్తుని వజ్రముష్టిఁ బ్రజంఘుఁ,డనువాని సుష్టఘ్నుఁ డనువాని మఱియుఁ
గుంభనికుంభుల ఘోరవిక్రములఁ, గుంభకర్ణుని మహోగ్రుని నతికాయు
వికటు మహాపార్శ్వ వెలయ ధూమ్రాక్షు, మకరాక్షు రక్తాక్షు మఱి శోణితాక్షు
యూపాక్షుఁ ద్రిశిరు మహోదరు నగ్నిశోభుని దేవాంతకుని నరాంతకుని
ఖరుజంబుమాలిని కంపను మఱియు, బరుషవిక్రములైన పగతురఁ జంపి
యాహవసాగరం బవలీల దాఁటి, బాహాబలంబులఁ బరఁగితి రింక
సౌమిత్రికిని మీకు సమయంబు దాఁటుఁ,డామెయి నింద్రజిత్తను గోప్పదంబు
కొడుకుఁ జంపఁగ నాకుఁగూడదు వీఁడు, చెడునుపాయము మీకుఁ జెప్పెద వినుము
హింస గావించిన నెదిరిచేఁ బంచి, హింస నేయించిన నివిరెండు సరియె
ఇది రాముకార్యార్థ మిదిలోకహితము, నదికాన పాతకం బైన గానిండు
సౌమిత్రిచే నేఁడు చంపింతు వీని, నేమాయలును గొల్వ వీటమీఁద ననఁగ
జాంబవంతుఁడు ఋక్షసంఘంబుతోడ, నంబరం బగలంగ నార్చి రాక్షసుల
నగశృంగతరుసింహనఖదంతములను, బగతుర నవలీలఁ బొల్పడి సొచ్చి
నొప్పింపఁ గపులచే నొగిలి రాక్షసులు, నిప్పలు సెదరంగ నెరి దారు ఘోర
పరశుముద్గరశూల పట్టిసప్రాస, పరిఘశరాసనపాణులై బెరయఁ
బొరి సురాసురులకుఁ బోలె నయ్యద్రి, చరనిశాచరులకు సంగ్రామమయ్యె
హనుమంతుఁ డాసమయంబున నలిగి, ఘనులక్ష్మణుని డించి కాలునిపగిది
నొక్కొక్కవాటున నొక్కొక్కమాటు, పెక్కండ్రనైత్యులఁ బృథివిపైఁ గూల్చి
శైలశృంగంబుల సాలవృక్షముల, లీలమైఁ జంపి బల్లిదుఁడునై వేర్చి
సరభసంబున విభీషణుఁ డంత నలుక, నురుతరజ్యాఘోష మొనరించి మించి
తనమంత్రులును దాను దద్దయుఁ గడిమి, దనుజులఁ బెక్కండ్ర దరమిడి చంపి

కర మొప్పఁ గనకపుంఖప్రదరములు, నొరఁగించె నింద్రజిత్తునిమేను గాడ
తరమిడి వాఁడు నుదగ్రుఁడై కినిసి, యరిది శరంబు లేయఁగ నవి వచ్చి
పొరి విభీషణునురంబున నుచ్చి పాఱి, ధరఁ గాఁడె ధరణియుఁ దల్లడపడియె
దురము విభీషణుతో నింద్రజిత్తు, కరముగ్రముగ నిట్టు కావించుచుండఁ
గనుఁగొని యపుడు లక్ష్మణుఁడు కోపించి, హనుమంతు నెక్కి తీవ్రాస్త్రసంతతుల
వడి మీఱి రాక్షసవరునిపై నేయఁ, గడు నొచ్చియును భయంకరముగా నపుడు
మగుడ వాఁ డుజ్జ్వలమార్గణపఙ్క్తి, మిగులంగ లక్ష్మణుమీఁదఁ బెల్లేసె
అడరి యయ్యిద్దఱు నతికోపు లగుచుఁ, గడిఁదిబాణంబు లుగ్రతనేయ నపుడు
ఆయంపతండంబు లడరి యొండొరుల, కాయంబు లందంద కప్పిన నపుడు
అంబుధారలతోడి యంబుదంబులను, నంబుదంబులతోడి యర్కచంద్రులను
బోలి రామార్గణంబులు వచ్చుచున్న, యాలోని వేగ మేమని చెప్పవచ్చు
తొడిగినశరములు తొడిగినయట్లు, విడువరొకో యనువిధమున నుండె
ఆరెండు తెఱఁగుల యమ్ములు గగన, మారంగఁ గప్పిన నడరెఁ జీఁకట్లు
వీరరసావేశవివశత నెఱుఁగ, రైరి యొండొరుల మహాజిరంగమున
ఆయవసరమున నచ్చెరువడర, వాయువు రణభూమి వర్తింపదయ్యె
అనలుండు వెలుఁగొందఁడయ్యె దిక్పతులు, ననిమిషగంధర్వయక్షకిన్నరులు
చకితాత్ములై వచ్చి శరణంబు సొచ్చి, సకలదేవతలు లక్ష్మణుఁ బ్రశంసించి
యాలక్ష్మణునకు జయం బగునటుల, చాల దీవన లిచ్చి సమ్మదంబునను
నతిలోకకంటకుం డైనయాదైత్యు, మృతునిగాఁజేయు సౌమిత్రి నీవనుచుఁ
బలుకుచునుండ నాభానుకులుండు, పెలుచ నార్చుచు గుణాభీలరావంబు
చెలఁగంగ నాయింద్రజిత్తును గిట్టి, బలుకాండములు మీఁదఁ బరఁగించుటయును
ఆరాక్షసుఁడు వేగ యవి త్రుంచి వైచి, ఘోరనారాచము ల్గురిసి పెల్లార్చె
మదిలోనఁ గోపించి మఱియు లక్ష్మణుఁడు, గదిసి యాశాఖామృగంబు లార్వ్వఁగను
జలమున నొకయర్ధచంద్రబాణమున, బలియుఁడై వానిచాపము ద్రుంచివైచి
పడగ యేఁడింటను బడనేసి యొకటఁ, దడయక సారథితల ద్రెవ్వనేసి
పదియింట వక్షంబు పగులంగనేసి, యదరంటనేసె రథ్యముల నాల్గింట
ఆరావణునిసుతుం డప్పుడు తానె, సారథి రథియునై సౌమిత్రిఁ గిట్టి
నెట్టననేయుడు నిగుడుకోపమున, నట్టహాసమునేయ నాలక్ష్మణుండు
నరదంబుఁ గడపుచు ననినేయుడై త్యు, నరుదార వీక్షించి యదరంట నేసె
ఆవాఁడియిమ్ముల నధికంబు నొచ్చి, రావణసుతుఁడు మూర్ఛాగతుం డగుచు
నంతన తెలివొంది యాత్మలోఁ బెద్ద, చింతించి యిదియేమి చిత్రమో నరుఁడు
నన్ను నొప్పించె నెన్నఁడు నిట్టి దెఱుఁగ, మున్న నేకాహవంబులఁ బోరునపుడు
కాల మెవ్వరికినిఁ గడవరా దనుచు, వాలిన యుష్ణనిశ్వాసంబు లడరఁ
జాపంబు తివియంగ శరము సంధింప, నోపక పరిపంథి నొనరంగఁ జూడ
నేగతయుండిన నిఖలదేవతలు, నారామతమ్ముని నగ్గించి రపుడు

వెలవెల నగువాని విన్ననిమోము, కలయంగఁ గనుఁగొని కపివీరులార్వ
వీరులుగ్రధనుండు వెసఁ బ్రమాథియును, మేరుసన్నిభుఁ డగుమేఘనిస్వనుఁడు
శరభుండు ఋషభుండు శైలము లై ర్వచి, రరుదార నింద్రారియరదంబు విఱుగ
నటుపైన కేతురథ్యంబులతోడ, విటతాటమై కూలి విపులకోపమున
నసురనాయకసుతుం డంత బిట్టార్చి, వెస విభీషణు రామవిభుననుజన్ము
నుదురును వక్షంబు నోనాటనేసె, వదలక మూఁడేసి వాఁడిబాణముల
నేసి గుఱ్ఱని యెసకంబుగాఁగఁ, జేసి చెలంగించె సింహనాదంబు
అప్పుడు కోపించి యధికరౌద్రమున, నిప్పులు కన్నుల నివ్వటిల్లంగ
రావణుతనయుసురం బుచ్చిపాఱఁగా విభీషణుఁ డేనేఁ గాండంబులయిదు
ఆతఁడు గోపించి యాగ్నేయబాణ, మాతండ్రిపయి నేయ నది రాఁగఁ జూచి
వారుణాస్త్రం బేసె వడి లక్ష్మణుండు, నారెండు నటఁ బోరి యవనిపైఁ బడియె
ఉరగాస్త్ర మాదైత్యుఁ డుగ్రుఁడై యేయ,గరుడాస్త్రమునఁ ద్రుంచె గళము సౌమిత్రి
తగఁ గుబేరాస్త్ర ముద్ధతినాతఁ డేయ, నగణితంబుగఁ ద్రుంచె యామ్యబాణమున
నతఁడు వెండియును వాయవ్యాస్త్ర మేయ, నతఁ డదియును ద్రుంచె నైంద్రాస్త్ర మేసి
దానవుం డపుడు గంధర్వాస్త్ర మేయ, దాని లక్ష్మణుఁడు రౌద్రంబునఁ ద్రుంచె
చలమున నిటు వారు సమరంబుసేయఁ, బ్రళయకాలమునాటిభంగిపై తోఁచె
సౌమిత్రిరణపరిశ్రాంతి మాన్పుటకు, నామందవాయువు లల్లన వీచె
అంత లక్ష్మణుఁడు నాయంతకుపగిది, నంతకంతకు నుగ్రుఁడై యింద్రజిత్తు

లక్ష్మణునిచే నింద్రజిత్తు చచ్చుట.

నటు చూచి కార్తుకజ్యానినాదంబు, పటుశక్తితో దిశాభాగంబు వగులఁ
జెలఁగించి మయి పెంచి సింహనాదంబు, నెలఁగించి దేవేంద్రుచేఁ గొన్నయట్టి
యారూఢిమీఱి నింద్రాస్త్రంబు దొడిగి, యారామవిభుఁడు ధర్మాత్ముఁ డైనేని
దేవి యాసీత పతివ్రతయేని, దేవతాకరుణ నాదెసఁ గల్గెనేని
నింద్రాదులకునెల్ల హితమగునేని, నింద్రజిత్తునితల యిమ్మహాశరము
త్రెంచుఁ గావుతమని దృష్టిసంధించి, మించి యేయుటయును మిన్నెల్ల నిండి
పృథుదీర్ఘనిర్ఘాతభీషణం బగుచుఁ, బ్రథనవికాసనప్రారంభ మగుచు
బహురత్నపుంఖశోభాయితం బగుచు, విహగేంద్రసమజనావిర్భావ మగుచు
నహిముఖానలకణాత్యాలోల మగుచు,నహిమాంశుబింబప్రభాభీల మగుచు
మండుచు రుచులతో మహియు నాకసము, నిండుచు నత్యుగ్రనిగ్రహోదగ్ర
గతులమైఁ బఱచి రాక్షసలోకనాథు,సుతుఁ గిట్టి యందంద సుకలు మిన్నందఁ
దనరిన నమ్మహోద్దండాస్త్ర మతని, యనుపమమణికుండలాంచితంబైన
లలితారుణేక్షణాలంకృతంబైన, తల బొమిడికముతో ధరఁ గూలఁ ద్రోసెఁ
గలుషభావమున లంకానిధానంబు, చలమున నుగ్రుఁడై సాధింపఁ గోరి
బలియిచ్చుకొఱకునై పటులులాయంబు, దలద్రుంచి వైచువిధం బచ్చుపడగ
ననిలోనఁ బడియున్న యాయింద్రజిత్తుఁ, గనుఁగొని జయలక్ష్మిగైకొని దిశలు

గలయంగ నపుడు శంఖంబు పూరించి, విలు గుణధ్వనిచేసి వెస లక్ష్మణుండు
నలి నప్పు డురుసింహనాదంబు నేసెఁ, జెలువొంద నప్సరస్త్రీలలాస్యములు
వీనుల సొలయించె విశ్రుతశ్రుతుల, మానైన గంధర్వమధురగానములు
అంత విభీషణుం డంతంత కెచ్చు, సంతోషమునఁ గ్రుచ్చి సౌమిత్రి నెత్తి
యాలింగనమునేసె నాలంబులోన, నాలోన వనచరు లందంద చెలఁగి
రంతలో హతశేషు లగునిశాచరులు, నెంతయు భీతిల్లి యేపెల్లఁ బాసి
వనచరుల్ దోలంగ వడి ధృతుల్లూలఁ, దనరారుపదహతి ధరణి గంపింపఁ
గలఁగొని చీఁకట్లు కన్నులఁ గవియఁ, దలలు వీడఁగ నాయుధంబులు వైచి
చెందినభయమునఁ జెడి పాఱి లంకఁ, గొందఱు చొచ్చిరి కుధరశృంగములు
కొంద తెక్కిరి వార్ధిఁ గొందఱు వడిరి, కొందఱు దూరిరి గుహానికుంజములు
అనలుండు తీవ్రార్చు లండరంగ వెలిఁగె, దినకరుం డుజ్జ్వలదీప్తిఁ జెన్నొందె
జలము లెందును నతిస్వచ్ఛంబు లయ్యెఁ, గలయదిక్కుల కప్పు కావిరివిఱిసె
గగనప్రసన్నత గలిగె నిష్కంప, మగుచు భూతలమొప్పె నప్పు డెంతయును
బవనసూనుఁడు శతబలియును నలుఁడు, జవశాలి పనసుండు శరభుండు ఋషభుఁ
డతులవిక్రమశీలుఁ డావాలిసుతుఁడు, నుతబలుం డగుసుషేణుం డర్కజుండు
గజుఁడును గవయుండు గంధమాదనుఁడు, విజయులైనట్టి యాద్వివిదమైందులును
దక్కినవానరోత్తములు నేతెంచి, మ్రొక్కి కీర్తించిరి ముదితాత్ము లగుచు
అప్పుడు లక్ష్మణు నఖిలదేవతలు, నొప్పార నుతియించి యొగిఁ బుష్పవృష్టిఁ
గురిసిరి వానరకోటి పెల్లార్చెఁ, బరిమళయుతముగఁ బవనుండు వీచె
ఆలక్ష్మణుఁడు విష్ణునంశంబుగాన, నాలంబులోపల నతనిచేఁ దెగిన
కపటరాక్షసుఁడును గాయంబు విడిచి, యపరాబ్ధిఁ గ్రుంకిన యర్కుండువోలె
విష్ణుసాయుజ్యంబు వెలయంగ నందె, నుష్ణాంశుకులకీర్తి లొగి దిశల్నిండ
సౌమిత్రి యట జయస్తంభంబు నిల్పి, రామునియొద్దకు రయమునఁ జనియె
సర్వవానరవిభీషణవాయుజులును, బర్వి యెంతయుఁ దన్ను బలిసి యేతేర
వచ్చి రాముని పాదవనరుహంబులకు, నచ్చుగా నెరఁగిన నప్పు డుప్పొంగి
యలరి కౌఁగిటఁజేర్చి యానందబాష్ప, ములతోడఁ దొడలపై ముదమొప్ప నునిచి
పౌరి నంగముల వీరఫులకలనంగ, నరగరుల్పొర గాడినట్టిబాణముల
ముసుకొను నాదుగఖమున మేఘనాదుఁ, డనిలోనఁ గూలిన యాసంతసమున
నతిరయంబున మూర్ఛ యంతలోపలనె, ధృతిదూలుకొనఁ దోనతెలివియుఁగలిగి
యా యోధనంబున నలవుమై నింత, సేయునే యీతం డజేయుఁడై నేఁడు
బహుదివ్యశస్త్రాస్త్రబలునింద్రజిత్తు, నహితభయంకరు ననిలోనఁ జంపె
నటుగాన నాచేత ననిఁ జచ్చు నింకఁ, బటుశౌర్యధనుఁడైన పజ్జ్వికంధరుఁడు
ఆతనివిభవంబు నాతనిబలిమి, యాతనిసుతునితో నటఁ నేఁడు పొలిసె
నిఖిలశస్త్రంబుల నిపుణుఁడై మెఱసి, యఖిలరాక్షసులకు నాధారమైన
కొడుకుచావున కెల్లకోర్కులు విడిచి, కడిమిమై నాతోడఁ గయ్యంబుసేయ

సర్వాయుధోజ్జ్వలసన్నద్ధుఁ డగుచు, గర్వించి దుర్వారగతి వచ్చెనేని
చతురంగబలదైత్యసంఘంబుతోడ, వితతౌహవక్షోణి విశిఖజాలముల
బలువిడి దునుమాడి బలిభూతములకు, నలవడఁ గావింతు నద్దశాననుని
అని సుషేణునిఁ జూచి యారామముఁ డనియెఁ, దనరు నోషధశైలతటవనంబునను
నురుతరప్రభలతో నొప్పువిశల్య,కరణి వేతెచ్చి లక్ష్మణవిభీషణుల
వానరావలి శరవ్రణవేదనలను, వానరో త్తమ పావలయు నీవనిన
ఆతండు నత్తెఱం గటు సేయ వారు, వీతక్షుతాంగులై వెస నుల్లసిలిరి
ఇనసూనుపసుపున నెల్లవానరులు, మనమారఁ గైసేసి మహితతేజమునఁ
జంద్రదివాకరసదృశులౌ రామ,చంద్రసౌమిత్రుల సరిఁ గొల్వ నపుడు
రామలక్ష్మణులును రవితనూజుండు, యామినీచరవరుఁ డగువిభీషణుఁడు
సుతబలుం డనిలసూనుఁడు సుషేణుండు, శతమన్యుమనుమఁడు జాంబవంతుండు
నీలుండు మొదలుగా నిఖిలయూథపులు, పాలస్త్యులకునెల్లఁ బట్టుగొమ్మైన
యావీరవరునిచా వధికసమ్మదము, గావింప సంపూర్ణకాములై రిటను
అంత నారాతిసు లట లంక కరిగి, యెంతయు కోపంబు లెసఁగ నవ్వేళ
రావణు లోకవిద్రావణుఁ గాంచి, దేవ నీపుత్రుండు దేవేంద్రవైరి
తనబాహుబలమునఁ దఱిమి వానరులఁ, దునుమాడి పెక్కండ్ర దురములోపలను
దివిజు లచ్చెరువంద దివ్యాస్త్రకోటి, నవిరళంబుగఁ బేర్చి యంతటఁ బోక
బలువిడి లక్ష్మణుప్రాణము ల్గలఁగఁ, బలుసాయకంబులఁ బ్రోథుఁడై యేసి
యామేఘనాదుం డుదగ్రవిక్రముఁడు, సౌమిత్రిచేఁ జచ్చె సమరమధ్యమున

రావణుఁ డింద్రజిత్తుమరణమునకు శోకించుట.

ననవుడు రావణుం డధికశోకమున, మునిఁగి పెద్దయుఁ బ్రొద్దు మూర్ఛిల్లి తెలిసి
హా వంశవర్ధన హా మహావీర, హా వీరరణధుర్య హా శూరవర్య
ఆశతమన్యుని నవలీల గెలుచు, నాశౌర్య మెవ్వాఁ డుదగ్రుఁడై యడఁచె
బలసూదనాదిదిక్పతులు ఖేచరులు, పలుమాఱు నీవన్నఁ బాఱుచుండుదురు
నీయుగ్రశక్తికి నిలిచి నిన్నెదిరి, యాయోధనంబున నడఁచెనే నరుఁడు
చటులకోపంబునఁ జండకోదండ,పటుబాణపాణివై బవరంబులోన
నిలిచిన జముఁడైన నీకోడునట్టి, బలిమి యొక్కఁడ బోయెఁ బరికింప నేఁడు
వక్రమై దైవంబు వలనుగాకున్న, శక్రారి నీకంఱె జముఁ డెక్కుడయ్యె
అక్కజంబుగ మందరాచలంబైన, వ్రక్కలు సేయు నీవాడిబాణములు
రణములోపల మున్ను రామలక్ష్మణుల, దృణలీల గెలిచితి తివిరి పల్మాఱు
ఆమహత్వము దూలి హా పుత్ర నీవు, సౌమిత్రిచే నిటు సమసితే యకట!
అమరులు మునులును నమరారి నీవు, సమరోర్వీ బడుటకు సంతసించెదరు
సంహారఘనఘన స్తనితమైనట్టి, సింహనాదము నీవు చేసిన బెదరు
నిఖిలలోకంబుల నీవజేయుఁడవు, నిఖిలనిర్జరులకు నీవేర్మి దక్కి
యల్పునిగతిఁ గూలి తకట! యాబ్రహ్మ,కల్పన దప్పినఁ గానేరవైతి

సచరాచరములైన జగము లీరేడు, సుచిరవిక్రమ వీరశూన్యమైనదియు
నందన నీలావు నమ్మిన నన్ను, బృందారకులు నవ్వఁ బెడఁబాయఁ దగునె
చెవులార రాక్షసస్త్రీవిలాపములు, వివిధభంగులు నేఁడు విన నాకు వలసె
నీయావరాజ్యంబు నీదులంకయును, నీయిష్టబంధుల నీతల్లి నన్నుఁ
దనయ నీపత్నులఁ దనయుల డించి, చనఁజాలితే యెందుఁ జనితి వీవకట!
నాఁడంతకుని గెల్చినాఁడ వాలమున, నేఁడెట్టువోయితి వీవు తత్పురికి
పరలోకకృత్యము ల్భక్తితోఁ దనయుఁ, డరయఁ దండ్రికిఁ జేయనవియెల్లఁ బోయి
యే నీకుఁ జేయంగ నిటు నేఁడు వలసె, నేనింక నేమందు నేమి సేయుదును
రామలక్ష్మణులును రవితనూజుండు, యామినీచరపాలుఁ డగువిభీషణుఁడు
భీమవిక్రమలీలఁ బెంపొందుకపులు, నామర్మములు దూరనాఁటియున్నారు
అట్టి నాహృదయశల్యంబు లోపుత్ర, నెట్టనఁ బెఱుకక నేఁడెందుఁ జనితి
నాపాలిజయమయ్యు నాతేజమయ్యు, నాపుణ్యఫలమయ్యు నాభాగ్యమయ్యు
నాపెంపుగతియయ్యు నాకీర్తియయ్యు, నేపార నోపుత్ర యెంచినవెల్ల
నీవ యైయుండుదు నీయట్టికొడుకు, చావఁ జూచితి నింక జన్మ మేమిటికి
ఈకష్టశోకాబ్ధి యెడ లెగకీద, నాకు నెయ్యది తెప్ప నలినాప్తతేజ
నినుఁగొని రాముని నిర్జింతుఁ బోర, ననిన నమ్మియుండితి నదియును దీరె
ఆశలన్నియుఁ దీరె నకట! యేనింక, నీశోకదవవహ్ని నెరియంగఁజాల
ననియని శోకించి యందంద పొగిలి, మనసు డిందకయుఁ గ్రమ్మఱ మూర్ఛనొంది
యున్నదశగ్రీవు నుగ్రప్రభావు, నున్నతాత్ములు మంత్రి లొయ్యనఁ దెలుప
బలురోషశోకము ల్బలిసి కన్నులము, పలుమఱు ముడివడఁ బరవసంబొప్ప
నేచిన కిన్కమై నేదిక్కు చూచెఁ, జూచినదిక్కున స్రుక్కి రాక్షసులు
ఘనభీతిఁ బఱవ రాక్షసలోకవిభుఁడు, కనదుగ్రదంతసంఘట్టనరవము
లతిభయంకరవృత్తి నప్పుడు దిశలఁ, బ్రతిరవం బొనరింపఁ బదిముఖంబులను
గనుగవలను నగ్నికణములు దొరుఁగఁ, దనమంత్రివరుల నందఱఁ జూచి పలికె
విడువనితపమున వేధ మెప్పించి, పడసితి శస్త్రాస్త్రపంక్తులు పెక్కు
ఎన్నఁడు నపజయం బెఱుఁగ యుద్ధముల, నెన్నఁడు నేశోక మెఱుఁగఁ జిత్తమున
నిరుపమస్థితినొప్పు నీలాభ్ర మనఁగఁ, బర మేష్ఠి మెప్పించి పడసినజోడు
గైకొని రథమెక్కి కదలితినేని, నాకనాయకుఁడైన ననుఁ గెల్వఁగలఁడె
నలినసంభవుచేత నాఁడేను గొన్న, విలునమ్ములును మీరు వేగంబ తెండు
వాఁడిమి మీఱంగ వడిఁ గిట్టి కలన, నేఁడు నే గెల్తు నానృపులను గపుల
నని వేర్చి ప్రళయకాలాగ్నియుఁ బోలె, మనమున జాజ్వల్యమానుఁడై యుండి
దివ్యవాద్యములతో దిక్కులు మెఱయ, నవ్యబాహాస్ఫాలనంబు నేయుచును
అనియె నిట్లుగ్రుఁడై యధికరోషంబు, పెనఁగొన మఱియును బేర్చి యిట్లనియె
నేఁడు నాతమ్ముల నేఁడు నాసుతుల, నేఁడు నాబంధుల నేఁడు నాభటులఁ
జంపెను సీతకై చనుదెంచి కడిమి, పెంపార రాముఁ డభేద్యుఁడై వేర్చి

యాయింద్రజిత్తు మాయాసీతఁ జంపె, నాయుపాయంబు నిరర్థకంబయ్యె

రావణుండు సీతను చెఱవేయఁ బోవుట.

నేనింక నిజముగా నిప్పుడ పోయి, జానకిఁ దెగటార్చి చలము సాధింతు
నని హస్తమునఁ జంద్రహాసంబు పూని, తనరినపదహతి ధరణి గంపింపఁ
జనుచుండ వృద్ధరాక్షసమంత్రివరులు, దనరంగ నూహించి తమలోన ననిరి
దశరథాత్మజుల నీదశకంధరుండు, నిశితబాణంబుల నిర్జింపలేఁడె
నైకొన కీతఁడు కడిమిమై సకల, లోకపాలుర నాజిలో మున్ను గెలిచె
నోలి మరుత్తుల నుగ్రాహవమునఁ, దోలెను నలువలఁ దొమ్మండ్ర గెలిచె
నెనమండ్రు వసువుల నేపడంగించె, ఘనతతోఁ దొమ్మిదిగ్రహముల నడఁచెఁ
దెగువఁ బన్నిద్ద రాదిత్యుల నొంచెఁ, బగగెల్చె రుద్రులఁ బదునొక్కరుండ్ర
నరుదార గంధర్వయక్షరాక్షసుల, నురగుల గరుడుల నుగ్రదానవుల
నతిభీతి పొందించె నారసి చూడ, నితనికి నరులన నెంతటివారు
తమకించి సతిఁ జంపఁ దగవుగా దనుచు, సమవర్తిబోలె నాసమయంబునందు
లోకభయంకరాలోకుఁడై తివిరి, నాకేంద్రవైరి జానకిఁ జంపఁ గదిసె
అప్పు డప్పాపాత్తు నత్యుగ్రదృష్టి, కప్పుణ్యవతి స్రుక్కి యనదచందమున
నొందినభీతితో నుగ్రగ్రహంబు, ముందట నిల్చిన మోదంబు దక్కి
పడియున్నరోహిణి పగిది నాసీత, పతితుఁడౌ రావణుభావంబుఁ జూచి
యీదురాత్మునిచేత నిటుఁ జావవలసె, హా దైవమా! యని యతిబాధ పొంది
దురమున నింద్రజిత్తుఁడు చచ్చుకొఱఁగి, సురవైరి చంపవచ్చుచునున్న వాఁడొ
కాక యారామలక్ష్మణుల జయించి, చేకొని ననుఁ జంపఁ జేరుచున్నాఁడొ
వీనిచే చావ నావిధి చెరఁచెట్ట, నేనేమి సేయుదు నిలమీఁద నింక
నక్కటా! దైవంబ యతిపుణ్యధనులఁ, జెక్కుసంకటములఁ బెట్టితే తెచ్చి
రామాభిరాముల రామలక్ష్మణుల, నామీఁద పగనంచు నలినాయతాక్షి
పలవించి పలవించి భావమధ్యమున, నెలకొన రఘురామునిజమూర్తి నిలిపి
పరవశయై తూలిపడి మూర్ఛనోయె, ధరణిపైఁ బడియున్న ధరణిజఁ జూచి
ధరణిజదెసనల్లు దశకంఠుఁ జూచి, కరము శోకించి రాక్షసులెల్లఁ గలయ
హాహానినాదంబు లందంద చెలఁగ, నోహో దురంత మాయుగ్రకృత్యంబు
అనుచుండునత్తఱి నమరారిఁ జేరి, ఘనుఁడు సుపార్శ్వుండు ఘననీతిధనుఁడు
వెఱవక తననీతివిభవంబు మెఱయఁ, దెఱఁగొప్ప నతని బోధించుచుఁ బలికె
ధాత పులస్త్యుండు తండ్రి ధర్మైక, నీతిజ్ఞుఁ డురుయశోనిధి విశ్రవసుఁడు
నీవు వేదాగమనిధివి నీపెంపు, భావింప కేల దుర్భావుండ వయితి
తగదు త్తమస్త్రీలఁ దవిలి వధింప, నగణితం బగుదోష మటుఁగాన వలదు
ఈకోపమంతయు నెల్లి యుద్ధమునఁ, గైకొని రామలక్ష్మణులపైఁ జూపు
మని చెప్పి యాచంద్రహాసంబు పుచ్చి,కొని సుపార్శ్వుండు దోడ్కొనివచ్చె మగుడ
అంత నాదశకంఠుఁ డధికరోషమునఁ, జింతించి విన్నవై చిత్తంబునందు

మఱపుపుట్టని పుత్రమరణాతురమున, మఱుఁగుచు నాస్థానమంటపంబునకుఁ
జనుదెంచి కొలువుండి చటులవేగమున, తనమంత్రి బాంధవతతుల రప్పించి
కొందలమందుచుఁ గొడుకుచందంబు, మది నుగ్గడించుచు మానతనుండె

ఇంద్రజిత్తుభార్య సులోచన శోకించుట.

అంతఁగపురంబున నతివలు గూడి, చింతింపఁగా విని శేషునిపుత్రి
యైనసులోచన యాత్తేశుచావు, విని చాల వగచుచు వివశతనొంది
పొలుపొందఁగాఁ బెద్దప్రొద్దుకుఁ జెలులు, తెలుపఁగా నొకకొంత తెలివొంది కుంది
నానావిధంబుల నాథునిఁ గూర్చి, యాననం బదరఁ బ్రలాపింపఁ దొడఁగె
హా ప్రాణనాయక హా జీవితేశ, హా ప్రాణనాథ నీవాజిలో నెదిరి
యేపార నిన్ను జయించెనే నరుఁడు, చూపోపఁజాలకఁ జులకఁగాఁ జూచి
పాపపుబ్రహ్మ యీపట్ల నిద్దఱినిఁ, బాపంగఁ దగునె దాత్పర్యంబులేక
యెప్పు డెక్కఁడికైన నేగుచోఁ బిలిచి, చెప్పిపోదువు నన్ను నేమ ముప్పొంగ
నాకుఁ జెప్పిన నీకు నాథ యీచావు, చేకూరునే శత్రుచేత నీలాగు
మాతండ్రి నన్ను ప్రేమనుమీఱి నీకుఁ, బ్రీతిరెట్టింపఁగఁ బెండ్లిగావించు
తఱి నీవు జయకాంక్ష దలఁచితివేని, సరవి కార్యంబులు సతితోడఁ దెల్పి
అరిగిన నజహారాదుల కజేయుఁడవు, నరు లనఁగా నెంత నాకేశ వైరి
యనుచు శిరోరత్న మపుడు నాచేతి, కొనరంగ నిచ్చి నాకొకబుద్ధి దెల్పె
తనయ నీపతి శత్రుతతిమీఁదఁ బోవ, మానుగా తలపయి మణినివాళించి
పంపినఁ బగఁదీర్చు బగతులనెల్ల, నింపుగాఁ జెప్పిన నీమామమాట
మఱచి యిప్పుడు నీవు మఱి వైరిదివ్య, శరవహ్నిచే రణస్థలిని వ్రాలితివి
అని తనప్రాణంబు లాత్తేశునకును, ముకుళించి మదిదారఁ బోసి యాక్షణమె
తనయులఁ జూచి యాతరలాయతాక్షి, ఘనమైన శోకసాగరమున మునిఁగి
భీతిల నేల విభీషణుండుండ, నాతఁడు మన్నించు నధిక తేజమున
వర్ధిష్ణులై తనూభవులార మీరు, వర్ధిల్లుఁ డెప్పుడు వరగుణోన్నతిని
నాకింక నుండుట న్యాయంబుగాదు, ప్రాకటంబుగఁ బోదు ప్రాశేశుకడకు
నని ముదమందుచు నన్నిట రోసి, మనమునఁ గలవాంఛ మమత రెట్టింప
నలయుచు సొలయుచు నసురసు రనుచు, లలిఁ దూలి యజపుష్పలతికచందమునఁ
జని దశకంరునాస్థానంబుఁ జేరి, తనకన్నులను బాష్పతతులును దొరుఁగ
మదిరాక్షి యేడ్చుచు మమత రెట్టింప, నొదుగుచు మామతో నొయ్యనఁ బలికె
పతివియోగంబైన సతియు నాక్షణమె, పతినంటి యేగుట పరమధర్మంబు
అటుగానఁ బతినంటి నరుగంగవలయుఁ, బటుబుద్ధితోడ నాపతికళేబరము
తెప్పింపు మిప్పుడు తీవ్రంబుగాను, పంపు (?) మిప్పుడు భటవర్గబాంధవుల
ననిన నాతఁడు నాత్మ నల్లఁ జింతించి, మనుజాశనుండు నామగువ కిట్లనియె
విన్నవై యాహవవిముఖమధ్యమున, పన్నుగాఁబడియున్నపడఁతి నీవిభుని
నేను బోయడిగిన నిత్తురే వారు, కాన నాచేతను కాదు మృగాక్షి

నీమన సటుమీఁద నేనేమి చెప్ప, భామ నీవెఱుఁగని పనియేమి కలదు
చెప్పితి నాకుఁ దోఁచినవిధం బనిన, నప్పద్మలోచన నతని కిట్లనియెఁ
గైలాసనగము వేగమె కేలనెత్తి, ఫాలాక్షునకు నతిభయముఁ బుట్టించి
కడఁకమై మూఁడులోకములను గెల్చి, కడిమిగల్గిన మహాఘనుఁడవు నీవు
సురనాథుఁగెల్చిన శూరున కిపుడు, నరు లెంతవారు వానరు లెంతవారు
నరులలో హీనవానరులలోఁ బడిన, గురుస త్త్వశాలి నీకొడుకుదేహంబు
తేలేను నేనని ధీరత్వ మెడలి, యీలీలననఁ గాలహేతువో యనుచుఁ
గరమొప్పఁగా బాహ్యకర్మంబులకును, తరుణులు పతిరహితం బైన నగ్ని
సరవితోఁ జన ధర్మసరణియుఁ గాన, వెఱవక నే విన్న వించినమాట
నెగ్గుగాఁ గొన కానతిచ్చి నన్ను నుపు, డిగ్గున చని పతిఁ దెచ్చుకోవలయు
ననిన నాదశకంఠుఁ డతివ వీడ్కొలుప, మానినియును తనమామకు మ్రొక్కి
మెలుపైన దొలుకరిమెఱుపుచందమున, కలితమౌ తనమేనికాంతిజాలములు
తలకొని భూనభోంతర మెల్ల నిండ, జలరుహనేత్రి నిశ్చలబుద్ధిచేత
వినువీథి రాఁ గపివీరు లందఱును, మనమున నాశ్చర్యమగ్నులై చూడ
నంతఁ గొందఱు గొప్ప యాశ్చర్యమునను, వింత రెప్పలు విచ్చి వేవేగ చూడ
వెఱఁగొందుచున్న యీవెలఁదులుమేటి, సురపురినుండి యీసుదతీలలామ
దేవత లంపిన జయలక్ష్మిరామ(?), దేవునికడ కేగుదెంచెనో కాక
తనయుఁడు మృత్యుఁడైన దశకంధరుండు, మనమున రోషంబు మఱియింతలేక
కక్కసంబడిగి వేగమె సీత రథము, నెక్కించి మగుడ నంపించెనోగాక
కాక వేఱొక దేవకాంతయు నిందు, రాఁగారణంబేమి రయమున ననుచు
అంగద సుగ్రీవ లాంజనేయుండు, సంగరస్థలినున్న తరుచరాధిపులు
వెరవొప్ప శ్రీరామవిభుఁడు లక్ష్మణుఁడు, దొరకొని చోద్యమందుచు నుండిరపుడు
పరమపావనుఁడైన పవమానసుతుఁడు, వెరపున నాకాశవీథి నేతెంచు
భామినీమణిఁ జూచి పరఁగ రామునకు, తామసింపక వేగఁ దగ విన్న వించె
ఈమానవతి మది నెంచఁగా దేవ, భామకా దిది ధరాపుత్త్రియు కాదు (?)
మానుగాఁ బతిలేని మగువయేకాని, దానికి నదిగో ప్రత్యక్షంబు గలదు
అప్పడఁతుకయున్న యరదంబుమీఁదఁ, గప్పినధూళి రాఘవ విలోకింపు

సులోచన శ్రీరాముల నుతించుట.

మని చూచుచుండ నయ్యబ్జాక్షి వేగ, చనుదెంచి యరదంబు చయ్యన డిగ్గి
పుత్తడిబొమ్మయో పొసగంగ మొదల, క్రొత్తగుమొత్తెమో కొదమరాయంచొ
యనఁగ సన్నఫునడు మసియాడుచుండఁ, గనుగవలను బాష్పకణములు దొరుఁగ
నందందఁ దూలుచు నసురసు రనుచు, మందయానంబున మగువ రాఘవునిఁ
గదిసి సాగిలి నమస్కారంబు నేసి, ముదిత హస్తంబులు ముకుళించి నుడుట
రవికులాంబుధిసోమ రామాభిరామ, ప్రవిమలగుణధామ పరరాజభీమ
జలదసన్నిభగాత్ర సారసనేత్ర, విలసితచారిత్ర వితతపవిత్ర

కలశాబ్ధిగంభీర కనకాద్రిధైర్య, లలితో క్తిమాధుర్య లావణ్యధుర్య
జననాథ నీపాదసంసేవకతన, యెనయు నాపాపంబు లెల్లను బాసె
నని విన్నవించుచు నరనాథునెదుట, వినయంబుతో నున్న వెలఁది నీక్షించి
మానవేంద్రునియనుమతిమీఁదఁ జేరి, భానుతనూజుఁ డాపడఁతి కిట్లనియె
నెలనా గ నీ వెవ్వ రిచటికి నిఫుడు, వెలయంగ వచ్చిన విధమేమి నేఁడు
వెలఁది నీవే రేమి విభుఁడు నీకెవఁడు, పొలుపొంద నెవ్వనిపు(త్రివి నీవు
చెప్పు మేర్పడ నీదుచందంబటన్న (?), నప్పు డప్పడఁతి తానశ్రువులొలుక
భానుజ విను భోగిపతి నాదుతండ్రి, యేను సులోచన యిదియ నావేరు
నాకు నాథుఁడు మేఘునాదుఁ డాపుణ్య, ప్రాకటబహుభోగభాగ్యశీలుండు
నధికబాహాటోపుఁ డధికతేజుండు, కదనభీకరుఁడు వాసవభంజనుండు(?)
కడిందిశూరుఁడు దశకంరనందనుఁడు, కడఁక మందోదరీగర్భసంభవుఁడు
అని చెప్పి శ్రీరాము నతివ వీక్షించి, మనమున నతిశోకమగ్నయై పలికె
నిట్టిశూరుని రాఘువేంద్ర రణోర్విఁ, బట్టి చంపితి కృపాపరులయ్య మీర
లెట్లు చంపితిరయ్య యినకులాధీశ, పుట్టునే యిటువంటి భూరివిక్రముఁడు
పతివియోగాగ్ని చేఁ బడఁతులు మదిని, పరితాప (?)మొందరె పలుతెఱంగులను
ఎఱుఁగవే సర్వజ్ఞ యేఁ బతిఁ బాసి, ధరణి వైధవ్యంబు దాల్పంగఁగలనె
శరణార్థిరక్షక సదయాంతరంగ, పరిపూర్ణహృదయ శోభనకృపాపాంగ
మరుగుచొచ్చితికాన మన్నించునట్టి, బిరుదు నీబిరుదు రూపింప నావిభుని
మరలఁ బ్రాణములిచ్చి మన్నించు నాకు, పురుషభిక్షము పెట్టి భువి నన్ను నిలుపు
మనుచుఁ బ్రార్థించిన నవనీశ్వరుండు, ఘనదయాపరమూ ర్తి గాన నయ్యింతి
పురుషుని బ్రతికింప బుద్ధి నూహించు, ఔడేగి మారుతియును మఱి విన్నవించె
నిదియేమి రాఘువ యెఱుఁగరే మీరు, వదలక యా బ్రహ్మవరము తప్పింప
నీతియే మీరు మానినికినిఁ జెప్పి, ధాతను మన్నింపఁ దగును భూనాథ
యని మారుతాత్మజుఁ డాడువాక్యములు, అన విని దలపోసి యపు డిట్టులనియె
జలజాక్షి యింకొక్క జన్మంబునందు, కలనెదు భువి పెద్దకాలంబుదాక
పెక్కుసంపదలచేఁ బెంపుసొంపార, యక్కజంబుగ భోగ మనుభవంబొంది
యామీఁద వైకుంఠమందు నిర్వారును, కామితార్థోన్నతి కాంతురుగాక
యనిన సంతోషించి యతిదయాపరుని, వినయపూర్వకముగా వినుతింపఁదొడఁగె
సదయాంతరంగ శోభనకృపాపాంగ (?), సదమలగుణధీర సాధుసాంగత్య
పరఁగ నాపతికళేబరము తెప్పించు, పురమున కతివేగఁ బోవంగవలయు
ననవుడు సుగ్రీవుఁ డపు డిట్టులనియె, వనజలోచన పతివ్రత వౌదువేని
నీదుపురుషునితోడ నీచందమెల్ల, తగఁబల్కు(?)మిప్పుడు తడయక ననినఁ
గడువేగమునఁ బోయి కదనరంగమును, దడయక చొచ్చి యాతరలాయతాక్షి
పడియున్నతలఁ జూచి పలుతెఱంగులను, అడలుచు పతిఁజేర నరిగియు దుఃఖ
జలధిలో మునిఁగి మూర్ఛయుఁ బొంది తెలిసి, పలువిధంబులఁ బడి ప్రాణేశుమీఁద

నెలుగెత్తి హాయని యేడ్చి ధైర్యంబు, నిలిపి సుస్థిరమున నిలిచి యాలేమ
పలికె సత్యప్రభాభాసిత యగుచు, వలనొప్పు నామనోవాక్కాయకర్మ
ములయందుఁ బతిభక్తి మొనసితినేని, సలలితధర్మసంచారంబునందు
పతియె దైవంబని భావంబులోన, సతతంబు వ్రతముగా సలుపుదునేని
చెలఁగి నావిభునకు జీవంబు వచ్చి, యలమి నాతో మాటలాడుఁగా కనుచు
అని తమయాత్మమర్యాదలు కొంత, యనినఁ గన్విచ్చి దశాస్యనందనుఁడు
నెలత చంపినవాఁడు నీతండ్రి గాఁడె, తలపోయ నొరులకు తరమె నగ్గెల్వ
నిలిచి యుద్ధమునేయ నిమిషమందైన, బలుచింతపడ నీకు పనిలేదు వినుము
తనదు ఋణానుబంధము గూడియున్న, నెనసియుందురు నరు లింతులఁగూడి
వెలయఁగ యోగవియోగముల్బ్రహ్మ, వెలయంగఁ గల్పించె వెలఁది జీవులకు
ఇటుగాన మఱి కాలహేతువుగాన, కుటిలకుంతల యిట్లు కూలితి ధరణిఁ
జనుమని కన్నులు చయ్యన మూయఁ, గని మదిలోఁ జింత గడలుకొనంగ
నప్పుడు బహుదుఃఖయై కొంతనేపు, అప్పాలతందుండ కతివేగ వచ్చి
శ్రీరాముఁవిభునకుఁ జేతులుమొగిచి, యారామ వినుతించె నతిమోదమునను
నప్పుడు రఘురాముఁ డంగదుఁ బిలిచి, యిప్పుడఁతుకపతి నిప్పింపు మనిన
తరమిడి యారామధరణీశునాజ్ఞ, తలనిడి యాయింతి పతికళేబరము
నిచ్చిన యురముపై నిడి రాఘవునకు, నచ్చపుభక్తితో నతివ వీడ్కొలుప
నతివేగమున పురి కప్పుడే పోయి, యతివ మందిరమున కప్పుడు పోక
వామాక్షి పతికళేబర ముంచఁదగిన, భూమిని నిల్పి కాపుండఁగాఁజేసి
యంతఃపురంబున కటుచేర నరిగి, చింతించి తనమదిఁ జింతించి మఱియుఁ
దనపుత్త్రులను ప్రేమ తగఁ జేరఁదీసి, కనుగవలను బాష్పకణములు దొరుఁగ
శిరము మూర్కొని ప్రేమఁ జెక్కిలి నొక్కి, కరమర్థితోఁ దన కౌఁగిటఁజేర్చి
సుతులార మీముద్దు చూడంగ నాకు, హితవుమీఱఁగ దైవ మియ్యకపోయె
మహిమీఁదనుండ ధర్మముగాదు తనకు, సహగమనంబు నిశ్చయముగాఁ గూర్తు
నిక్కడ నుండుట యిది బుద్ధికాదు, తక్కక పొండు పాతాళంబునకును
స్థిరబుద్ధి మీరాదిశేషునియింట, వెఱవకుండుఁ డటంచు వేగంబె పంపి
కడువేగమున దశకంఠసన్నిధికి, గడగడ వడఁకుచుఁ గమలాక్షి పోయి
విన్నై వదనారవిందంబు వాంచి, కన్నీరు విడిచి గద్గదకంఠ యగుచుఁ
గరములు మొగిచి యగ్గపుభక్తితోడఁ, బురపురఁ బొక్కుచు పొలతి మాఁమకును
బోయినవృత్తాంతమును విన్నవించి, కాయను దెచ్చినక్రమ మెఱిఁగించి
రామచంద్రునిదయారసము లక్ష్మణుని, ప్రేమాతిశయము విభీషణుకూర్మి
గపికుంజరులపరాక్రమము నామహిమ, విపరీతమనిచెప్ప విని రావణుండు
విన్నై మోమున వేడుకలేక, తిన్ననిస్వరమునఁ దెలిసి తెలియకను
యాయింతి తెగువయు నాయింతి తెలివి, నాయింతిసమబుద్ధి కామహామహిమ
కాయింతి పతిభక్తి కాయింతి వేగఁ, గాయము దెచ్చినక్రమశక్తియుక్తి

కేమనఁజాలక యేయు త్తరంబు, కోమలి కియ్యకఁ గొతుకుచునున్న
కని సులోచన దైవకారణంబునకు, మనమ్మునఁ జింతించి మఱియేల యింక
నాకానతీవయ్య నాకేళవైరి, యేకచి త్తంబున నేగెద నింక
ననఁగ వ్యాకులచిత్తుఁ డై రావణుండు, తనదుకోడలిమోము తప్పక చూచి
యాయింతి తెగువయు నాయింతి తెలివి, పాయక యిఁక నిల్వఁబట్టరా దనుచు
నేమి చెప్పుదు నీకు నిందీవరాక్షి, నీమదిపూనిక నీతెఱం గెదియె
ప్రియసుతాగ్రజుఁ జంపి భీతులచేత, భయదుఃఖవార్ధిలోఁ బడియున్న వాఁడ
నాకేమి తోఁచదు నాతి యీమిాఁద, నీకుఁ దోఁచినజాడ నీవేగు మనిన

సులోచన సహగమనము సేయుట.

తరలాక్షి మ్రొక్కి సంతసమంది మదిని, కరమొప్పఁ దనకు భాగ్యము గల్గెననుచు
గృహమున కేగి కోకిలవాణి తనదు, సహవాసులౌ పెక్కుసతులు గొల్వంగ
దశకంఠునానతిఁ దగుబాంధవులను, దశదిశ ల్నిండ మృదంగనిస్వాన
పటహభేరీశంఖపటుకాహళాది, చటులనాదములు విచ్చలవిడి మ్రోయ
సతతనిశ్చలకృతస్నానయై యపుడు, నతివేగమునను గార్యార్థియై యచట
సిరిపట్టుఁబుట్టంబుఁ జెలువొందఁ గట్టి, సరసత రత్నభూషణములుఁ బెట్టి
పువ్వులదండలు పొలుపొందవేసి, యవ్వారిగాఁ జుట్టి యాణిముత్తెముల
సూచకం బొనరించి సుందరి నొసలఁ, బ్రాచుర్యగంధలేపనము గావించి
తిరమొప్పఁగా నింద్రజిత్తుదేహంబు, కరమొప్పఁగా నలంకారం బొనర్చి
మంచివస్త్రంబులు మహితభూషణము, లంచితశృంగార మలవడఁజేసి
వరవిమానంబుపై వరుఁ డెచ్చి పెట్టి, వరవాద్యతూర్యరావంబులు చెలఁగఁ
ద్రేతాగ్నులును గొంచుఁ దిరముగా దైత్యు, లాతతంబుగ వెంట నరుగుదేరంగ
వెసుకొని వేదోక్తవిధిపూర్వకముగ, మొనసి యుత్తరభాగమునఁ జితి వేర్చి
యాగతలైన ముత్తైదుల కపుడు, బాగైనపసిఁడి శృంగ్వములు దానముల
నిచ్చి వస్త్రంబు లనేకంబు లొసఁగి, యచ్చపుభక్తితో నాచితిమీఁదఁ
బరఁగఁ బ్రవేశించి ప్రాణేశు నురము, కరమర్థితోఁ దనకౌఁగిటఁ జేర్చి
యనలంబు సంధింప నాయింతిమేను, పనిగొని పతి సమర్పణముగాఁ జేసి
సకలదేవతలును సన్నుతుల్సేయఁ, బ్రకటంబుగాఁ దనపతితోడఁగూడి
దేవవిమానంబు తెఱఁగొప్ప నెక్కి, దేవతాకోటిలోఁ దేజరిల్లుచును
గడువేడ్కఁ బుణ్యలోకంబునఁ జేరి, పడఁతియుండెను దనపతితోడఁగూడి
యంతట రావణుం డధికరోషమున, నంతయు మూలబలాళి రప్పించి
చలమును బలమును సమరనైపుణియుఁ, గలసైనికులనెల్లఁ గలయ నీక్షించి
కపులను రామలక్ష్మణుల మీఁదేగి, నెపమార నిర్జించి నెఱిఁ బగఁదీర్చి
రండు పొండనవుడు రభసంబుతోడ, నొండొరుఁ గడచుచు నుద్దండవృత్తి
సామజఘోటకస్యందనసుభట, సామగ్రితో యుద్ధసన్నద్ధు లగుచు
వజ్రసమానేకవరసాధనములు, వజ్రాంగులాదిగా వలయువర్మములు

కరమరుదయి భయంకరలీల దనర, ధరియించి మించి యుదగ్రులై పేర్చి
కరిఘటాఘీంకార ఘంటికానేక, తురగోగ్ర హేషిత దుందుభిశేంఖ
పటహఢమామికా పణవాదివాద్య, పటురభసధ్వజపటపటాత్కార
రథనేమిశింజినీరావసంకులము, మధితార్ణవధ్వనిమాడ్కి ఘూర్ణిల్లఁ
బలుధూళిజలరాశిపట్టుగయ్యంపు, గలను నేయఁగ నేగుకరణిఁ బెల్లెగయ
బింకము ల్జంకెనల్పృథుతరఘోర,హుంకారములును నొండొరులపంతములు
నంకించునెలుఁగులు నార్పులు చెలఁగ, నంకితమణికుండలానేకహార
కంకణకోటీరకాంతులు నిగుడ, లంకేశుసైనికు ల్లంక వెల్వడిరి
భూకంప మెసఁగ నార్పులు మిన్నుముట్ట, భీకరగతినేచి పెడబొబ్బ లిడుచు
ఘనసత్త్వమునఁ బేర్చి కపికులాంభోధి, గనుఁగొని బెగడొందఁగా నుత్సహించి
కడఁకతో నపుడు లంకావార్ధివెడలు, బడబాగ్నికోటులభంగి శోభిల్లి
కాటుకకొండలగతిఁ దనరారు, మేటిదైత్యులఁ జూచి మిగిలినకడఁక
నప్పుడు కపివీరు లార్పులు నిగుడ, నుప్పొంగి చెలఁగుచు నుడుపదం బవియఁ
గ్రుంకి దిగ్గజములు కుదికిలఁ బడఁగ, నింగికి లంఘించి నేలకు దాఁటి
బ్రహ్మాండ మగలంగ బొబ్బలువుల్సరచి, బ్రహ్మాదిదివిజులు పరికించి చూడఁ

మూలబలయుద్ధము.

గొండలు తరువులు గోటానకోట్లు, గండశైలంబులు కడువడిఁ బెఱికి
కొనివచ్చి తాఁకిరి క్రూరులై యంత, ననిలోన రఘురాముహస్తవైచిత్రిఁ
గనుఁగొనువేడుకఁ గమలబాంధవుడు, చనుదెంచెననఁ బూర్వశైలాగ్రమెక్కె
వననిధి వననిధి వడిఁ దాఁకునట్లు, దనుజబలంబును దరుచరబలము
నొండొంటిఁ దలపడి యుగ్రత మెఱయ, మెండుగాఁ గపిసేన మిగులంగఁ జొచ్చి
యరదములశ్వముల్పుచు హరులఁ దోలుచును, గరులు డీకొలుపుచుఁ గవిసి రాక్షసులు
మునుమిడి నొప్పింప మొక్కలంబనను, వనచరు ల్దరులెత్తి వైవంగ నపుడు
వాటుల వ్రేటుల వడి నిందు నందుఁ, బోటులఁ గాటులఁ బొరి నందు నిందుఁ
గరవాలముల భయంకరవాలములను, గరగండముల గదాఘనదండములను
బరశులఁ బరిఘులఁ బట్టసంబులను, గిరులను దరులను గిరిశృంగములను
దరుచరు లైవంగ దనుజులువైవ, ధరణిపైఁ శోణితధారలు దొరుఁగ
వనచరుల్గొండలు వాలయంత్రములఁ, గొని మీఁద వైవ నాకొండలనడుము
దుత్తుమురై నేల దొరుఁగఁ జక్రంబు, లెత్తివ్రేసియు గద లెత్తిమోఁదియును
సరిపోరి రొండొరు ల్చలమునఁ గిట్టి, సుర లద్భుతంబంది చూడంగ నపుడు
కరులను హరులను ఘనరథంబులను, సరిదోలి కపుల రాక్షసులు నొప్పింప
వనచరేశ్వరుఁడును వాలినందనుఁడు, ననిలజుండును నీలుఁ డాదిగాఁగలుగు
నగచరప్రముఖులు నధికవేగమున, నగపాదపముల వానలు వెసఁ గురియఁ
బరియలై పడియెడు బహురథంబులును, గరమ్రగతి గూలు కరిసమూహములు
నతిముఖఁ గెడయు వాహనములు నేల, కొఱగు దానవులు నైయుండంగఁ గినిసి

రథరథ్యవేగంబు రథికు లగ్గింప, రథములు పటపి సారథులు బిట్టార్వ
రథములు తమమనోరథములకరణిఁ, బృథివీతలంబెల్లఁ బెల్లుగా నద్రువఁ
గవిసిన కడనొగ ల్కరములఁ బట్టి, యవలీల దివికెత్తి యవనిపై వైచి
తురగముల్దోలినఁ దొలఁగక కపులు, తురగంబుతో నెత్తి తురగంబు ద్రోసి
కరుల డీకొలిపినఁ గరులపైఁ గవిసి, కరిఁ గరిఁ దాటించి గములకు నుఱికి
డాకాల నొక్కని డాకేల నొకని, నాకేల నొక్కని నాకాల నొకని
నదిమి నొంచియు నదరంట వ్రేసియును, గుదియించి వైచియుఁ గూల దన్నియును
బెక్కువిధంబులఁ బేర్చి రాక్షసుల, నిక్కడక్కడ నేయునెడఁ బెచ్చుపెరిఁగి
తురగరింఖాదులధూళి గప్పుటయుఁ, దరుచరాధిపులును దానవాధిపులు
నరుపైన యానిబిడాంధకారమునఁ, గరవాలరోచులఁ గలకలం బెసఁగ
వీరు వారును బోర వెడలినర క్త,ధారామరీచులు దఱుచుగాఁ గవిసి
బలురేణువను తమగిపటలంబు నడపఁ, జలమరి కయ్యంబు సందడియైనఁ
గుంజరరథకూల ఘోటకమకర, పుంజధ్వజానేకభూరుహసుభట
కరకాండకల్లోల ఖడ్గపారీన, కరికరోరగ ఖేటకచ్ఛపనికర
వికలభూషణరత్నవిసరవికీర్ణ, శకటనైకత కేశజాలశైవాల
జనితచామరఫేనచయరక్తనదులు, వనచరు ల్దనుజులు వడి దాఁటి దాఁటి
తాఁకుదు రాలోనఁ దరుచరు ల్గినిసి, వీఁకగో లెమ్ములు విఱుగ నొక్కియును
మోఁకాళ్ల మోఁచేత ముష్టి నందంద, తాఁకించి వడఁదీసి తలలు ద్రొక్కియును
బొట్టలు చీల్చియుఁ బోనీకపట్టి, చట్టలు వాపియుఁ జదియవ్రేసియును
గఱచియు విఱచియుఁ గడకాళ్లుపట్టి, జిఱజిఱఁ ద్రిప్పియుఁ జిదిమివైచియును
బలువిడి దలలొగిఁ బట్టి వెండ్రుకలు, పెళపెళ మనఁ బెల్చుఁ బెఱికివైచియును
నిరుచేతులందును నిరువురఁబట్టి, పొరిఁ బొరి దాటించి పొళ్లుసేయుచును
వెరసి రంధ్రంబుల నెత్తురు ల్వెడల, నురవడిఁ బడఁద్రోచి యురములు సరచి
నఖరదంతంబుల నాసికాకర్ణ, ముఖపాలపట్టిక ల్తుసరి త్రెంచియును [రను
నొప్పించియును గపు ల్నాల్గు రొక్కొకని, నుప్పొంగ యొక్కొకం డొనర నూర్వ్వ
బట్టి చంపియుఁ జలపట్టి దానవుల, నట్టిట్టు వోనీక యవనిపైఁ గూల్చి
చిందరవందర సేయంగ నప్పు, డందఱి వెసఁ జూచి యధికరోషమున
ధరణి గంపింప దిక్తటములు వగుల, శరధులు గలఁగ ముజ్జగములు బెగడ
దారుణాకారులై తద్దయుఁ బేర్చి, భేరీమృదంగగంభీరవాద్యములు
చెలఁగించి యక్కపిసేనపైఁ గవిసి, బలసూదనాదిదిక్పతులు భీతిల్ల
వికృతమస్తకములు వికృతహస్తములు, వికృతప్రకోష్ఠము ల్వికృతోష్ఠములును
వికృతనఖంబులు వికృతముఖములు, వికృతగాత్రములును వికృతనేత్రములు
వికృతహాసములును వికృతనాసములు, వికృతవక్షములును వికృతకక్షములు
వికృతకర్ణములును వికృతవర్ణములు, వికృతపాదములును వికృతనాదములు
గలసైనికులు లయకాలాభ్రపఙ్క్తి, బలువిడి విడివడి పఱతెంచుకరణిఁ

బరిఘగదాచక్రపట్టసప్రాస, పరశుతోమరభిండివాలత్రిశూల
కరపత్ర కుంతముద్గరయష్టిపరశు, కరవాలఖేటకక్రకచాసినాగ
ముఖశిలీముఖచాపముసలాయుధాది, నిఖిలసాధనములు నెరయంగఁ బూని
నరికియు నడచియు నలియ మోఁదియును, నురువడిఁ జిమ్మియు నొనరఁ గ్రుమ్మియును
వ్రేసియుఁ బొడిచియు వీఁక వైచియును, నేసియుఁ గోసియు నీరీతిఁ గపుల
నొప్పింప నెంతయు నొచ్చి భీతిల్లి, యప్పుడు తరుగిరు లవనిపై వైచి
మనకేల యుద్ధంబు మనకేల చలము, నినకులేశ్వరుఁ డేల యినసూనుఁ డేల
యడవిలోఁ గాయ పండాకులు నమలి, కడుపునించుకయుండఁ గానక వచ్చి
మదిమది నిచ్చట మడియంగ నేల, పదపదం డని కపిపతులు రాఘవుల
విడిచి ధైర్యంబులు విడిచి రాక్షసులు, విడువక చలమున వెనువెంటఁ దఱుమ
సేతువుదిక్కుకై చెడి పాఱునపుడు, వాతూలసుతనీలవాలినందనులు
గని సేతువును దాఁటి గ్రక్కున నెందుఁ, జనకుండ మరలింపఁ జనుదెంచి భీతి
వనచరు ల్దనవెక్క వచ్చి చొచ్చుటయుఁ, గనుఁగొని రాముఁ డక్కపివరు ల్చెలఁగ

శ్రీరాముఁడు మూలబలముపై మోహనాస్త్రము వేయుట.

దనుజులమనములు తల్లడంబంద, ధను వందుకొని గుణధ్వని సేసి డాసి
కరలాఘవము చిత్రగతినొప్ప మెఱయ, శరములు గురియ నిశాచరు ల్బెగడి
తెరువులు గానక తిరుగుడువడుచుఁ, దెరలియు మరలియుఁ దీవ్రకోపమున
ధరణీశు గాన రాధరణీశుఁ డేయు, శరముల తఱుచున సమరాంగణమున
రవికులతిలకుండు రభసంబుతోడ, వివిధభంగులఁ దనవిలువిద్య మెఱసి
యేసినశరము లనేకంబు లగుచుఁ, గాసి సేయుచుఁ దాఁకఁగా దైత్యవరులు
నడుమునఁ దెగియు నెన్నడిమికిఁ దొడరు, కడిఖండమయ్యు వక్షములు వ్రస్సియును
వదనములార్వాడి భావంబులు సెదరి, పదములు దునియలై బాహువు ల్విఱిగి
గళములు దునిసియుఁ గరములు దెగియుఁ, దల లవిసియుఁ దనుత్రాణము ల్దూఁకి
శరములు మెయినుచ్చి చనఁగ నెత్తురులు, దొరుఁగ నంగములఁ దుత్తునియలై రఘుడు
కెడయు రాక్షసులు బెగ్గిలెడు రాక్షసులు, పుడమిపై మూర్ఛను బొందురాక్షసులు
నొగలు రాక్షసులును నోరులు దెఱచి, దిగులొందురాక్షసు ల్ధీరత సడలి
వారణంబులవారు వాజులవారుఁ, దేరులవారునై తిరుగుడువడుచు
నదె రాఘవుండేసె నదె రాముఁడేసె, నదె డాసె నిదె పాసె నదె యిదె యనుచు
వీక్షింపరానట్టి వేగంబు మెఱసి, రాక్షసబలములు రయమునఁ బఱచె
నంతఁ బోవక రాఘవావనీనాథుఁ, డెంతయు ఘనరోష మెసఁగ వెండియును
సమ్మోహనాస్త్రంబు సంధించి పఱపఁ, దమ్ముఁ దా మెఱుఁగక దనుజులు భ్రమసి
దానవుం డీతఁడు తరుచరుం డితఁడు, దానని తెలియక దనుజుండు దనుజుఁ
గనితాఁకునప్పుడు గాంధర్వశరము, ఘనమహత్వమున రాక్షసులకుఁ జూడ [గుచు
నొకొక్కనికి రాముఁ డొకొక్కఁడగుచు, నొకొక్కనికి రాము లొగిఁబదుండ్ర
నొకొక్కనికి రాము లొగి నూర్ల రగుచు, నొకొక్కనికి రాములొగి వేవురగుచు

నొక్కొక్కనికి రాము లొగి లక్ష యగుచు, నొక్కొక్కనికి రాములొగిఁ గోటి యగుచు
శతకోటి యర్బుద సంఖ్యలు గడచి, యతులితం బైనట్టి యాజిరంగమున
మఱి సర్వమును రామమయమయ్యె నపుడు, గిరికొనియుండ నీక్రియ నల్కతోడ
వడి నేయునప్పుడు వారక గుడుసు, పడియున్న రఘురాము పసిడివిల్ చూచి
సమరసమాభీలచక్రి యుగ్రతను, నముచిపై వైచిన నాఁటిచక్రంబొ
కిరణజాలంబుల గిరికొన్న భాను, పరివేషచక్రమో పరికింప ననుచుఁ
దమమనంబుల నెంచి దైత్యు లయ్యంపఁగముల మెఱుంగులు గనుఁగొని పఱువ
నమరారినేనలో నప్పు డొక్కొక్కఁ, నిమిషంబులోపల నెత్తురువాన
లాన వాజులు పదునాలుగువేలు, నేనుఁగులో పదునెనిమిదివేలు
లక్షతేరులు రెండులక్షలవీర, రాక్షసవీరులు రణభూమిఁ గెడయ
శరములరంబులై చాపంబునేమి, కరణియై గుణరవక్వణితమై మెఱసి
కిరణస్ఫులింగము ల్గిరికొన్న రామ, కరచాపచక్రంబు కాలచక్రంబు
గతి నుల్లసిల్లంగఁ గనుఁగొని పెలుచ, హతశేషులై తేయు లతిభీతిఁ బొంది
కడుఘోరమైన సంగరభూమి విడిచి, వడి లంకఁ జొచ్చిరి వనచరులార్వఁ
గాలాంతమునఁ గాలకంధరుం డలుకఁ, గేళి సల్పిననాఁటిక్రియ నుండె రణము
వలనయినట్టి రావణుమూలబలముఁ, జలమున రఘుపతి సమయించునపుడు
పదివేలుకరులు నిర్వదివేలుహరులు, పదిపదులరదము ల్పద్మంబుబలము
నాలంబులోపల నతిదారుణముగఁ, గూలిన నొకయట్ట గునియుచు నాడు
నట్టలు కోటాడ నారాము వింటఁ, గట్టిన యొకఘంట ఘణిలని మొరయు
నొరయ ఘంటలు నాద మూర కీరేడు, మొరసె నవ్విభుచాపమున నరజాము
భావింపరాకుండఁ బడియేడుగడియ, లావీరవరుని బాణాసనవిద్య
కిన్నరగంధర్వఖేచరయక్ష, పన్నగామరవరు ల్ప్రణుతించి రెలమి
ఆరామచంద్రుండు నప్పు డింపలర, శూరపుంగవుఁడగు సుగ్రీవుఁ గనియె
జగదేకభయదమీనమ్మోహనాస్త్ర, మొగిఁ బ్రయోగింపను నుపసంహరింప
నేనొండె విషధరుం డీశ్వరుం డొండె, గాని నేర్పరులార్రు ల్గారు లోకముల
కౌశికుం డిచ్చిన కనదస్త్రమహిమ, గౌశికాదులకైనఁ గననశక్యంబు
అనిన విభీషణుఁ డారాముఁ జూచి, వినయసంభ్రమములు వెలయ నిట్లనియె
దేవ యీబలములు దేవేంద్రుఁడాది, దేవతలకునైనఁ దెరల వెన్నఁడును
బొలస్త్యనకు మూలబల మిది నేల, పాలయ్యె నిఁకఁ గూలుఁ బంక్తికంధరుఁడు
తలకొని నీపెంపుఁ దలఁపవుగాక, తలఁచిన నెదురింపఁ దరమె యెవ్వరికి

రాక్షసస్త్రీలు రావణుని నిందించుట.

అని విభీషణుఁ డాడునట్టివాక్యములు, విని యప్పు డారామవిభుఁ డాత్మనలరె
అంత నక్కడ దానవాంగనలెల్ల, నంతంతఁ బెనుమూఁకలై లంకలోనఁ
బొరిఁబొరి శోకాగ్నిఁ బొగులుచుఁ బలికి, రరయ జగన్నింద్య మగుచరిత్రంబు
ప్రాయిడిమోమును బలితరోమంబు, లైయున్న శిరము నభ్యాయతోదరము

వికృతవేషంబును వికృతయూవనము, గ్రక్కచోగ్రదంష్ట్రలు గలుగుశూర్పణఖ
సకలగుణోజ్జ్వలు సత్యసంపన్ను, సుకుమారుమరుతేజుసుముఖు నారాముఁ
గందర్పసురుచిరాకారుఁ గామించె, నందనిపంటికి నఱుచాపఁదగునె
యీలంకలోఁగల యెల్లరాక్షసులు, కాలగోచరులైన కారణంబునను
భానువంశజునకుఁ బంక్తికంఠునకు, నానిశాచరి నేసె నధికవైరంబు
తగవు చింతింపక దానిమాటలకుఁ, బగగొనివచ్చి యీపంక్తికంధరుఁడు
తనచాపునకె కాదు ధరణీశుదేవిఁ, గొనివచ్చె రాక్షసకులమెల్లఁ జెఱుప
నింతట సిద్ధించెనే సీత దనకు, నింతతెంపునకుఁ దా నితఁ డేల దొడఁగె
మారీచు నొకకోల మడియించె దండ, కారణ్యమునఁ జంపె గనలి విరాధు
నిది యెఱింగియు రాము నెఱుఁగలేఁడయ్యె, మదిలోన గర్వించి మనరావణుండు
అనలసమానంబు లగుసాయకముల, జననాయకుఁడు జనస్థానంబునందుఁ
బదునాల్గువేవురఁ బరిమార్చి రోష, మెదవంగ నేచి యత్యుగ్రబాణములఁ
ద్రిశిరు దూషణు ఖరు దృణలీలఁ జంపె, దశకంధుఁ డదియును దలపోయఁడయ్యె
రుధిరాశనుని నతిక్రూరవిక్రముని, నధికయోజనబాహు నాకబంధకుని
గ్రాంచవనంబునఁ గడతేర్చి పుచ్చి, రంచితవిక్రము లగుదాశరథులు
ఇట్టిరాక్షసులచా వెఱిఁగియుఁ దొడరె, నట్టిరాముని గెల్వ నలవియే తనకు
జగదీశుఁడగు రామచంద్రుతోఁ బోర, మగఁటిమి గలుగునె మనరావణునకు
నవలీల వాలి నొక్కమ్మునఁ గూల్చి, రవిజుఁ గిష్కింధకు రాజుఁ గావించె
నధికపరాక్రము నాకుంభకర్ణు, వధియించె నొక్కఁడె వసుధేశ్వరుండు
కరిసహస్రంబు లగ్గలములౌ పెక్కు, తురగలక్షలు రథస్తోమకోటులును
గణనకు మిక్కిలి గలకాలుబలము, నణుమాత్రముగఁ జంపె నాజిరంగమున
నట్టిపరాక్రమం బదియెల్లఁ గనియె, నిట్టివాఁడని రాము నెఱుఁగలేఁడయ్యె
ఆమేటి నతికాయు నయ్యింద్రజిత్తు, సౌమిత్రి యొక్కఁడ సమయించె నాజి
ఇంకనైనను రాము నిట శర ణనఁడు, లంక నింటింట విలాపములఘట్టె
తమబంధు లీల్గిరి తమమగ ల్దెగిరి, తమసుతు ల్మృతులైరి తమసహోదరులు
హతులైరి రణభూమి ననియెల్లవారు, నతిశోకమును బొంది యడలుచున్నారు
దుర్మతియును నీతిదూరుండు క్రూర,కర్ముండునై నాఁడు కపటరూపమున
సీత నీపురికిఁ దెచ్చిననాఁటనుండి, తోతెంచుచున్నవి దుర్నిమిత్తములు
దశకంధుఁ డింక నీదశరథసుతుని, విశిఖాగ్నిఁ గూలుట వేగంబ యుండు
నక్కటా! నీతిజ్ఞుఁ డగువిభీషణుఁడు, పెక్కుభంగులఁ జెప్పెఁ బ్రియమున బుద్ధి
నతఁడు చెప్పినబుద్ధు లన్నిచు నాఁడు, హితవులుగా విన్న నీలంక నెడునె
కులశైలపక్షము ల్గులిశభూతమున, నలుకమైఁ దునుమాడు నాపురందరుఁడొ
మధుకైటభాదుల మర్దించునట్టి, యధికుఁ డావిష్ణుఁడో యదయుఁ డంతకుఁడో
ప్రళయకాలమునాఁటి ఫాలలోచనుఁడో, యిల రాముఁడై పుట్టి యిటు చంపఁదొడఁగె
దశరథతనయుండు దర్పంబు మెఱసి, దశకంఠు ననిలోనఁ దగఁ జంపునపుడు

ఘనులగుసురలైన గంధర్వులైన, మునులైన వీనికి మునువరం బిచ్చు
వనజసంభవుఁడు శర్వాణీశుఁడయిన, వినుఁడు రాక్షసులైన విడిపింపలేరు
వరమిచ్చునప్పు డావనజసంభవుఁడు, నరులచేఁ జాకుండ నాఁడీడుగానఁ
బరికింపఁగా సర్వబంధులతోడ, ధరణీశుచేఁ జచ్చు దశకంధరుండు
ఇది నిజమెట్లన్న నింద్రాదిసురల, మది దయలేక పల్తాఱు నొప్పింప
నీరావణునిచేత నెంతయు నొచ్చి, నీరజాసనుఁ గాంచి నిఖలదేవతలు
నభయంబు వేడిన నాచతుర్ముఖుఁడు, శుభతరస్థితివారిఁ జూచి యిట్లనియె
నేబాధలనుజెంద వీటమీఁద మీకు, మీబుద్ధివర్తించు మీరుండుఁ డెలమి
నని వారు దాను మహాదేవుకడకుఁ, జని ప్రస్తుతింపఁ బ్రసన్నుఁడై శివుఁడు
కమలాసనాదులఁ గరుణ నీక్షించి, యమరరక్షార్థమై యఖిలరాక్షసుల
సమరంబులోపలఁ జంపించుకొఱకు, నమర నిందిరపుట్టు నాసతీమణికిఁ
బతియయి ప్రజల నాపదలొందకుండ, సతతంబు గావ దుర్జనుల రాక్షసులఁ
జంపంగ విష్ణుండు జన్మించుఁ బుడమి, నింపారనని యానతిచ్చె రాముండె
యరయంగ వావిష్ణుఁ డామహీజాత, పరికింప-నిందిర భావంబులోవఁ
దలపోయ శివుమాట దప్పదుగాన, మలఁగనిశోకంబు మనకుఁ బాటిల్లె
మనకు దిక్కెవ్వరు మనరావణుండు, మననేరఁ డీకమీఁద మరుగంగనేల
మనకండఱకు దిక్కు మనవిభీషణుఁడు, చని రామచంద్రుని శరణంబుసొచ్చె
నని పెక్కుభంగుల నసురకామినులు, పనుపుచుండఁగ విని పంక్తికంధరుఁడు
చింతాసమాకులచిత్తుఁ డై యపుడు, వంతలో నొక్కింతవడి యూరకుండి
చండకాలవ్యాళసమలీల దోఁప, నిండుకోపంబున నిట్టూర్పువుచ్చి
యవుడులు దీటుచు నందంద కన్ను, గవల నిప్పులు రాలఁగా నుగ్రుఁ డగుచు
నురవడిఁ గనలి యుద్ధోన్మత్తు మత్తు, సొరిది విరూపాక్షుఁ జూచి మీరెలమి
దండడిసింహనాదములు తూర్యములు, నందంద మెఱయంగ ననికి నేతెండు
అని పల్క భయమున నానిశాచరులు, విని యూరకున్న నవ్విధము వీక్షించి
యాలంబునకు వేగ యత్నంబుసేయుఁ, డేల యుత్సాహంబు లిటు మానియుండ
ననిన వారరిగి పుణ్యాహకర్మంబు, లొనరించి సన్నాహ మొప్ప నేతెంచి
యారాక్షసేంద్రున కవనతులైన, నారాక్షసులఁ జూచి యతఁ డల్కఁబల్కె
నానాఁటి కిబ్బంగి నాబలంబెల్ల, హీనమయ్యెను భృత్యులెల్లఁ జచ్చుటయు
నమరేంద్రవిక్రముఁడైనయాఖరుఁడు, నమితబలోద్యుక్తుఁ డగునింద్రజిత్తు
నాకుంభుఁడును భీకరుఁ డగునికుంభుండు, నాకుంభకర్ణుండు నాప్రహస్తుండు
భీమవిక్రమవిజృంభితుఁ డతికాయుఁ, డామహాకాయుండు నామహోదరుఁడు
నాసురాంతకుఁడును నానరాంతకుఁడు, భాసురయశులకంపనుఁడు గంపనుఁడు
నాకాధిపతినైన ననినోర్చువారు, నాకునై పొలిసిరి నాగర్వ మడఁగె
నటుగాన శత్రుల నందఱఁ దునిమి, పటుపరాక్రమమునఁ బగనీగువాఁడ
మీఆనశరములు మిన్నులు ముట్టి, యేఱులు జలధులఁ నెఱుఁగరాకుండ

నఖిలంబుఁ గప్పుచు నచ్చెరువార, నిఖిలవానరులను నేఁడు నిర్జింతు
నేపున నల్క నేనేయుబాణమ్ము, లాపుంఖముగఁ గాడి యగచరాస్యములు
నాళములగిలిన నవపంకజములఁ, బోలంగ నేఁడాజిభూమిఁ గైసేతు
మగలు తనూజులు మాసహోదరులుఁ, దెగిరింక నెవ్వరు దిక్కుమా కనుచు
లంకాపురస్త్రీలు లలిఁ దూలి సోలి, యింక నీశోకాబ్ధి నిట మునిం గెదరు
మార్తురఁ బొలియించి మఱి పురజనుల, యార్తి వాపుదు శోక మడఁచెదఁగాక
నేఁడాజిఁ బ్రతిపక్షనికరసైన్యముల, వాఁడిబాణంబుల వడిఁ ద్రుంచివైచి
కరమొప్ప ఘోరవకంకగృధ్రములుఁ, బొరి పిశాచప్రేతభూతజాలములుఁ
దనివోవ మాంసరక్తంబులఁ ద్రృప్తి, యొనరింతు ననుచు యుద్ధోన్మత్తు మత్తు
నక్షీణబలుఁడగు నవ్విరూపాక్షు, నీక్షించి రణమున కిప్పుడ వేగ
యనుపమంబగునట్టి యరదంబు దేరఁ, బనుపుడు నేఁడు నాపటుసాయకములు
ఘనులైన రామలక్ష్మణులప్రాణములు, గొని వారిరుధిరము ల్గ్రోలఁ గోరెడిని
శతసంఖ్య లొక్కొక్కసాయకంబునను, మృతిబొందఁ గపికోట్లమీఁద నేనెదను
అనికి బలాఢ్యతఁ లగువారిఁ జూచి, కొనిరండు సేనలఁ గూర్చుక వేగ

రావణుఁడు రెండవసారి యుద్ధమునకు వెడలుట.

యని వారు పిలిపింప నఖలరాక్షసులు, వినువీధి యద్రువంగ వీకనార్చుచును
గరవాలచక్రభీకరభిండివాల, పరశుశూలప్రాసపట్టసగదలు
ముసలంబులును గాఢముద్గరంబులును, నెసఁగెడుశక్తు లనేకవిచిత్ర
వివిధాయుధంబులు వెలుఁగ నేతెంచి, రవిరళోత్సాహంబు లడరంగ నంత
దనుజులు నానాస్త్రతతులతోఁ గూడ, దినకరప్రభగలతేరు తెచ్చుటయు
రమణీయరత్నాంశురాజివిరాజి,తములైన కర్ణావతంసంబు లమరఁ
బదికంఠముల రత్నపదకముల్గ్రోలఁ, బదిముఖంబుల వింత పంతము ల్దనర
మహనీయకేయూరమణికంకణాది, బహుభూషణాంకితబాహుదండముల
శరశరాసనఖడ్గచక్రాసిపరశు, పరిఘాదిసాధనప్రకరంబు మెఱయ
దివిజారి చెఱఁబెట్టె దినకరు నొకని, దివి నొక్కదినమణి దిరుగుచున్నాఁడు
తలఁపఁ దక్కినభానుదశకమో యనఁగ, దలకొని కోటీరదశకంబు వెలుఁగ
నంత నాదశకంరుఁ డారథం బెక్కి, దంతిరథాశ్వపదాతులు నడవఁ
బటుతరనిస్వానభాంకారవీర, భటసింహనాదాది బహునినాదముల
విలయకాలాభ్రేళవేళ ఘూర్ణిల్లు, జలరాశితో లంక సరివోలుచుండ
నవిరళవందిజనావలివినుత, రవముతోడుత నుత్తరద్వార మపుడు
బలువడి వెలువడి పౌలస్త్యముఖ్యుఁ, డలుక యుద్ధోన్మత్తు నావిరూపాక్షు
మత్తుని వీక్షించి మహి వ్రయ్యవార, నొత్తిలి యార్చుచు నోలి నాలంక
వెడలంగ రవిదీప్తి వెలవెలఁబాఱె, నడరి దిక్కుల నిండె నంధకారంబు
ధరణి గంపించె రథంబులు విఱిగెఁ, దురగంబు లొఱిగె నెత్తురువాన గురిసెఁ
గడుఁగీడు శకునము ల్గానంగఁబడినఁ, గడిమి డింపక దశకంధరుం డడరె

లంకేశు నానాబలంబులఁ జూచి, పంకజగర్భనిభాండంబు వగులఁ
నిగుడు నార్పులతోడ నిఖిలవానరులు, నొగి వీఁకతోఁ దాఁకి రుగ్ర దానవులఁ
గలుషించి యాలోనఁ గపిసేన గిట్టి, బలములు నెరయంగఁ బంతము లైఅయఁ
గఱకురాక్షసులు నుగ్రముగ నేయుదురు, నెఱకులు దూరంగ నిశితబాణముల
ముసలతోమరశ క్తి ముద్గరచక్ర, విసరము లై వ్రేతురు వీఁకఁ బెల్లేచి
యంకుశకుంతశూలాదులఁ బొడుతు, రంకించి వ్రేయుదు రాభీలగదల
నడిదము ల్బళిపించి యలుకనంగముల, కడిఖండములఁజేసి కడిమిఁ జూపుదురు
కఫులును గుపితులై కడిమివాటించి, విపులశైలంబుల వృక్షజాలములఁ
బదదంతనఖవాలపాశహ స్తముల, నదయులై యూరాక్షసావలినెల్ల
శిరములు నరములు చేతులు మూతు, లురములు బాహువు లోష్ఠకంఠములు
ద్రెంచియు నొంచియుఁ దీవ్రవైఖరులఁ, జించియు వంచియుఁ జిదిమియు నదిమి
తరమిడి నిబ్బంగి దనుజుల నొంపఁ, దరుచరావలిఁ జూచి దనుజేశుఁ డంత
దారుణాకృతివత్సదంతాశ్వకర్ణ, నారాచభల్లాది నానాస్త్రవితతి
నగచరరుధిరంబు నవనిపైఁ దొరుఁగ, నిగుడించి యొక్కొక్క-నిశితబాణమునఁ
గపిపంచకంబును గపిస ప్తకంబు, గపినవకంబును గదనరంగమునఁ
గుదులు గ్రుచ్చినక్రియఁ గూలనేసియును, వదలక తరుచరు లై వ్చుశైలములు
ఘనతరుల్శకలము ల్గానేసి మఱియుఁ, గనలి యేనమ్ముల గంధమాదనునిఁ
బదునెన్మిదింటను బనసుని మఱియుఁ, బదియింట నీలునిఁ బదియింట నలుని
ద్వివిదు నాఱింటను వినుతు నేడింటఁ, బవననందను నిరువదిట గవాక్షు
నైదైదులను మైందు నైదింటఁ గుముదు, నైదింట గోముఖు నైదింట ఋషభు
నేడిట శరభుఁ బదేడింట గజుని, నేడమ్ములను బృథు నేడింట హరునిఁ
దరిమి యొక్కు-మ్మడి దారునిగ్రథునిఁ, జెరి మూఁట సాయకాశీతినంగదునిఁ
దక్కి-నవనచరతతి నిలఁ గూలఁ, బెక్కు-బాణంబులఁ బేర్చి యుగ్రతను
వెసనేసె మగఁటిమి వీఁకతో మెఱయ, నసురేశు మునుమున నందందకపులు
నడుములు నిశితబాణంబుల విఱిగి, పడువారు నిలలేక పడి తూలువారు
నురములు వ్రయ్యలై యొగిఁ గూలువారు, చరణము ల్తునియలై సరిమ్రగ్గువారు
చేతులు దెగువారు శిరములు పగిలి, భూతలంబునఁ బడి పొరలెడివారు
గళము లూరులును జంఘులు ద్రెవ్వ నొచ్చి, పలుమాఱు మూల్గుచుఁ బడియెడివారు
నంగంబు లివియవి యని యేరుపడక, సంగరాంగణమునఁ జచ్చినవారు
బాణముల్గాడినఁ బఱచుచు నడుమ, బ్రాణములొ్వోయి యుర్వరఁబడువారు
నయ్యుండ నప్పు డయ్యసురేశుఁ జూచి, చయ్యన రణమున నైరింపలేక
వానరు ల్వాఁకొరి వసుధ గంపింప, దానవేంద్రుండును దవిలి వెన్వెంట
బలువిడి నేతేరఁ బాఱనేమిటికి, నిలు నిలుండని పల్కి నిలువక పాఱు
నేనలఁ గావ సుషేణుని నునిచి, భానుసూనుఁడు వృక్షపాణియై నడచె
తరుశిలాహస్తులై తరుచరపతులు, నిరుగెలంకుల వెన్క నేపుచీపించి

నడుమ నాతఁడు సింహనాదంబుచేసి, తొడరి కాలాగ్నిరుద్రునివిధంబునను
వృక్షతాడనముల వెసఁ జంపి చంపి, వృక్షశిలాఘోరవృష్టి నందంద
రాక్షసబలముపై రయమునఁ గురియ, రాక్షసవరులు శిరంబులు పగిలి
కులిశాగ్రహతిభగ్నకూటంబులైన, కులశైలములభంగిఁ గూలిరి మఱియు
రవినందనుఁడు క్రోధరక్తాక్షుఁ డగుచు, నవనిధరాభీలహస్తుఁడై నడవ

సుగ్రీవునిచే విరూపాక్షుఁడు మొదలగురాక్షసవీరులు చచ్చుట.

నంత విరూపాక్షుఁ డధికరోషమునఁ, బంతంబు మెఱయంగఁ బయిఁ దేరువఱపి
విలు గుణధ్వనినేసి విపులనిర్ఘాత, తులితంబులగు వాఁడితూపులనేసి
నవి లెక్కసేయక యరదంబుపైకి, రవిజుండు లంఘించి రథసూతహారులఁ
బృథివీధరంబునఁ బృథుశక్తితోడఁ, బృథివిపైఁ బడనేయఁ బృథివికి నుఱికి
విరథుఁడయ్యెను దైత్యవీరుండు వివిధశరము లేయుచుఁ బాదచారియై నిలువ
నమరారిపనుపున నఖలాయుధములు, సమకూర్చి మావతు ల్సమదసామజము
దెచ్చిన వెస నెక్కి దీకొని కపుల, విచ్చలవిడినేసి విక్రమం బెసఁగ
నుగ్రదానవులార్వ నుగ్రబాణముల, నుగ్రాంశుతనయుపై నురవడి నేసె
నక్కజంబుగ విరూపాక్షుండు మఱియుఁ, బెక్కాయుధంబులఁ బెక్కుబాణముల
వసమర నేయంగ వసుధ గంపింప, వెసఁ బాఱు తనవారి వెఱపకుం డనుచు
నలుకతో సుగ్రీవుఁ డతని నిర్జింప, దలపోయఁ గ్రథనుఁడ న్దరుచరోత్తముఁడు
విపులవృక్షమున దద్ద్విరదంబుశిరము, గుపితుఁడై యేయంగఁ గుంభంబు పగిలి
తఱుచుగా శోణితధారలు దొరుగఁగ, బిఱిదికి నొకవింటి పెట్టొనరించి
యది మ్రొగ్గనేల యయ్యసురయు ఁాటి, కదురుచు ఖేటకఖడ్గముల్ గొనుచు
మర్కటపతి దాఁకె మారొక్కని వాని, నర్కసూనుఁడు వైచె నతులశైలమున
నక్కొండఁ దెగ వ్రేసె వడరి దానవుఁడు, రక్కసుఁ బిడికిట రవిజుండు వొడిచె
నాలోనఁ గరవాల మంకించి యసుర, వాలితమ్ముని వ్రేసె వడిచెడ కపుడు
పిడికిటిపోటునఁ బెలుచదానవుఁడు, నడిదంబు వ్రేటున నర్కనందనుఁడు
నొక్కటఁబడి యంత నొక్కట దెలిసి, యొక్కలాగున బోరి రొగి నుక్కుమిగిలి
యప్పుడు సుగ్రీవుఁ డఱచేత వ్రేయఁ, దప్పించుకొని హేతిదనుజుండు వ్రేసెఁ
గరవాలనిహతి కగ్గతిదప్ప నుఱికి, కరహేతిజడిసిహో గపిరాజు వ్రేసె
మగటిమితో నంత మల్లయుద్ధమున, మిగిలినవెరవుల మెఱసి పోరుచును
దినవల్లభులభంగిఁ దేజరిల్లుచును, గనలుకాలాగ్నులకరణి మండుచును
బలిబిడౌజులమాడ్కి బాహుగర్వముల, వెలయుచు నిరువురు విజయంబు గోర
నక్కజం బగుశక్తి నఱచేత నిజు, మొక్కలంబున వాఁడు మూర్ఛిల్ల వ్రేసి
కరవాలహస్తుఁడై కపులపైఁ బాఱు, దరణిజుం డాలోనఁ దనమూర్ఛ దెలిసి
పఱతెంచి నిర్ఘాతపాతమైనట్టి, యఱచేత నావిరూపాక్షువక్షంబు
నెఱలావుతో నేయ నెత్తురుగ్రక్కి, యుఱలుచు ధర గూలె నుగ్రదానవుఁడు
తరుచరు ల్చెలఁగిరి దానవు ల్లలఁగి, తిరుగుడువడి రంత దీనాస్యు లగుచుఁ

స్రుక్కి యుద్ధోన్మత్తుఁ జూచి రావణుఁడు, తక్కనికడక యెంతయుఁ దోడఁ బలి కెఁ
గంకె యాసుగ్రీవుకడిమి మీయన్నఁ, గంకె విరూపాక్షుఁ గలనరంగమునఁ
బడి రనేకాసురభటులును బెక్కు, మడిసెఁ గుంజరములు మడిసె నశ్వములు
విఱిగె రథంబులు విరిసె మూకలును, నుఱక నొప్పించుచు నున్నారు కపులు
సమయంబు నీకిది సమరంబునేయ, సమరాంగణంబున సమయింపు రిపుల
నన విని యనిఁ గూలి యఖిలేశుఁడైన, మనుజేశుఁ గలయంగ మది నిశ్చయించి
తరుచరానీకంబు దరియంగఁ జొచ్చి, శరగదాఖడ్గాదిసకలాయుధముల
నడరి విరూపాక్షునసుజుఁడు కపులఁ, గడిమిమై నొప్పింపఁ గని భానుసుతుఁడు
నగ మెత్తి వైచిన నడుమనె దానిఁ, దెగనేసె దనుజుఁ డాదినకరాత్మజుఁడు
తనర సాలము వైచె దాని దానవుఁడు, దునియలుగా మూఁడు తూపులనేసె
లక్షించి బాణజాలము లేయుచుండ, రాక్షసు లదరంగ రథముపై కుఱికి
భానుసూనుఁడు వాని పరిఘాయుధమున, వానికేతుప్రవిల్లు వడి ద్రుంచివైచి
రథసూతుఁ దెగవ్రేయ రయమున వాఁడు, పృథుగదాపాణియై పృథివికి దాటి
యిరువురు పోరాడి రిల చలియింపఁ, బరిఘగదాభీలబాహువుల్మెఱయఁ
గంఠీరవంబుల కరణి గర్జిలుచుఁ, గంఠములవ్వదనము ల్గరము లంసములు
చరణము ల్నఖములు జానుజంఘములు, నురములు వెన్నులు నూరులు వ్రేళ్లు
బరులును బిరుదు జబ్బలు మధ్యములును, శిరములుఁ జెవులును జెక్కులోష్ఠములు
వరుసతో నపు డురవడిఁ దాఁకి తాఁకి, వెరవులు చిత్రము ల్వేసఁ గల్గుచుండ
సరిగాఁగ నత్యంత సాహసలీల, నిరువురు వోరి రనేకమార్గముల
నాలోనఁ బరిఘగదాభీలహతుల, వాలుదు రొక్కట వ్రాలి యాలోనఁ
గడిమిమై నొండొరుకంకెమున్దెలిసి, వడినార్తు రెంతయు వసుధ గంపింప
దానవుం డురుగదాదండంబు రెండు, నేనలవారు నచ్చెరువందఁ ద్రిప్పి
భానుజుఁ బడవైచెఁ బడి లేచి వచ్చి, వనజాప్తసుతుఁ డేసెఁ బరిఘుంబు ద్రిప్పి
దనుజాంగనిహితిదత్పరిఘుంబు దునియఁ, గనలుచు దనుజుండు గరవాలమునను
వనచరపతి వైవ వడిఁ దత్కృపాణ, మినజుండు గొని దీప్తు లెసఁగ నంకించి
వికలమై ధర డొల్లవ్రేసె వైతేయ, మకరకుండలదీప్తిమయమస్తకంబు
కనుఁగొని విరిగి రాక్షసులు రావణుని, వెనుకకు లంకకు వెసఁ బాఱి రపుడు
బలగర్వ మెసఁగ సుపార్శ్వుఁ డంగదుని, బలునేనవైఁ గిట్టి పటుసాయకముల
వానరశిరములు వడిఁ గూలనేసి, తోన హస్తంబులు ద్రుంచె గొందఱను
గొందఱ బాహువుల్ ఘోరబాణముల, నందంద తునుమాడె నంత వానరులు
నానిశాచరునకు ననిఁ బాఱఁ జూచి, వానితెఱకి దాఁటి వాలినందనుఁడు
పసయేరుపడ వానిపరిఘాయుధంబు, వెసఁ బుచ్చుకొని నేల వివశుఁడై తూల
వడినేసె నాజాంబవంతుండు నొక్క, వెడఁదపాషాణంబు వీకతో నెత్తి
యరుదార నంకించి యరదంబు విఱుగ, హరులు సూతుఁడు జావ నలుకతో వ్రేసె
దనుజుఁ డాలోఁ ధైర్యి దశసాయకములఁ, గనలుచు నంగదుఘనభుజంబేసి

యంబకత్రయమున నధికరోషమున, జాంబవంతునినేసి చలనంబు నొంద
నేనె గవాక్షుని నిషుపంచకమున, నాసమయంబున నంగదుఁ డలిగి
వజ్రసన్నిభముష్టి వడిఁ గిట్టి పొడువ, వజ్రంబుతాఁకున వసుధాధరంబు
వసుధఁ గూలినక్రియ వాఁ డాజిఁ గూలె, నెసఁగ దేవతలార్చి రేచి మిన్నద్రువ
నంత రాక్షసబలం బతిభీతిఁ భాఱి, నంతయుఁ జూచి దశాననుం డనియెఁ
బరుషవిక్రముఁడు సుపార్శ్వుండు మడిసె, నురుబాహుబలుఁడు యుద్ధోన్మత్తుఁ డీఁగె
ననిఁగూలె నావిరూపాక్షుఁడు మఱియు, ఘనమైనరాక్షసు ల్దడతేరి రింక
బలసమన్వితులైన పార్థివసుతుల, బలువిడి గెలిచి నాబంధులవలన
నెలకొన్న శోకాగ్ని నెరియు నీలంకఁ, గలవారివగపెల్లఁ గడఁకతోఁ దీర్చు
నవిరళశస్త్రధారైకమూలంబు, నవజయోన్నతలక్ష్మణప్రకాండంబు
భానునందనముఖప్లవగశాఖంబు, మానవపతికీర్తి మంజరీకంబు

రావణుఁడు రామలక్ష్మణులపై గదియుట.

ప్రకటసీతానామఫలభాసురంబు, సకలామరాశ్రితచ్ఛాయంబునైన
రామద్రుమం బేను రయమారఁ జెఱికి, నామనోదుగిఖంబునకు మందుచేసి
యెసఁగెద జగములో నేనంచు నప్పు, డసురేశుఁ డధికరోషాయత్తుఁ డగుచు
సారథి కనియె నీచతురత మెఱసి, తేరు రాఘవులపైఁ దీవ్రతఁ బఱపు
వారిఁ జంపెద నేఁడు వారాజిఁ బడిన, తారేగుదురు విచ్చి తరుచరు ల్భీదరి
యనవిని వాఁడట్ల యరదంబు వఱపె, ఘననేమిరవము లుత్కటముగాఁ జెలఁగ
సాయకాసనధనుర్జ్యానినాదంబు, మ్రోయంగ నిస్సాణములు బోరుకలుగ
వందిమాగధసూతవరనుతు ల్మించ, నందంద నిజసేన యార్పు లుప్పొంగఁ
దరుచరసేనపై దారుణాస్త్రంబు, లరుదార నిగుడించె నద్ధశాననుఁడు
అజనిర్మితంబులౌ నాబాణతతుల, భుజబలంబులు దూలి భూరిసత్త్వులును
నేలఁ గూలిరి పెల్లు నిఖిలప్లవంగు, లాలోన రఘురాముఁ డనుజుండుఁ దాను
గోదండపాణులై కోపించి నిలిచి, రాదశాననుఁడును నలుక మాఱ్కొనఁగ
నుడువీథి యవియంగ నుదధులు గలఁగఁ, గడుతేర్చి దిక్కుంభికర్ణములు ఘ్వగుల
నడరు రామునిధనుర్జ్యాఘోషమునకుఁ, గడుమానసంబులు గలఁగి రాక్షసులు
గుపితదశగ్రీవకోదండముక్తతపనోగ్రసాయకధ్వనికి వానరులు
భయమంది ధరణిపైఁ బడిరి యుక్కడఁగి, రయమార నాలోన రామలక్ష్మణులు
రవిసుధాంశులభంగి రాగిలి కదియ, దివిజారి రాహుప్రదీప్తుఁడై కవిసె
నంత నాలక్ష్మణుం డతితీవ్రవిశిఖ, సంతతులేసె దశగ్రీవుమీఁద
నడుమన తెగనేసి నాశేషవైరి, కడిఁదిబాణముల నుత్కటముగా మఱియు
నొక్కొక్కశరమేయ నుగ్రుఁడై వాని, నొక్కొక్కశరమున నొగి ద్రుంచివైచి
మూఁడేసిశరము లిమ్ముల వడినేయ, మూఁడుమూఁడమ్ముల మురియలుచేసి
పదియమ్ములేసినఁ బదియింట వానిఁ, బిదురుపఱై ధరఁ జెదరిపోనేసె
నూఱేసి యేసిన నూతనగతుల, నూఱునూఱమ్ముల నుగ్గుగావించి

సౌమిత్రి నటు రణస్థలిఁ జిక్కువడిచి, రామచంద్రునితోడ రణముసేయుటకు
దనుజాధినాథుఁ డుద్ధతి నేగుదేరఁ, గనుఁగొని సమవర్తిఁ గని పాఱుకరణిఁ
గనుకనిఁ జెదరి మర్కటు లనిఁబాఱఁ, గని కన్నుగవఁ గెంపుగడల రాఘవుఁడు
విల్లంది దివిజులు వినుతింప ధరణిఁ, దల్లడపడఁ దాఁకె దానవేశ్వరుని
ముఖములఁ గోపంబు ముడివడ నతఁడు, నఖలలోకాతిభయంకరంబుగను
రామునిఁ దాఁకె నారామరావణులు, భీమాట్టహాసము ల్బెరయించి మించి
సైన్యద్వయంబున సరినార్పు లెసఁగ, ననోన్యకార్ముకజ్యానినాదములు
పరువడి దశదిశాభాగంబులందు, మొఱయఁ బరస్పరముక్తబాణంబు
లొండొంటితోఁ దాఁకు నుగ్రంపురవము, మండుమంటలు నభోమండలి నిండ
సరినొప్పి యిరువురు శరలాఘవములఁ, గరలాఘవంబులకరణి నొండొరులు
మెచ్చుచు నొండొరు మీఱు వైచిత్రి, కచ్చెరువడుచును ననిసేయునపుడు
త్రోణీశుపై నొక్క ఘోరతమిస్రబాణంబు నిగుడించెఁ బంక్తికంధరుఁడు
ఆకాండ మడరిన నఖలవానరులు, చీఁకటిగప్పి నిశ్చేష్టితులైరి
అప్పుడు గన్నుల నలుకఁగెంజాయ, లొప్పార రఘురాముఁ డుగ్రబాణములు
పదిపదులేసినఁ బటుభల్లసమితిఁ, ద్రిదశారి వానినిఁ దెగనేసి మఱియు
నిశితబాణములేయ నృపుఁ డర్ధచంద్ర,విశిఖంబు లడఁగించి వేగంబ త్రుంచి
యసురేశునిఖిలావయవములు దూర, నసవృశంబగు ననేకాస్త్రము ల్వఱపె
రౌద్రబాణం బంత రావణుం డేయ, రౌద్రబాణంబున రఘురాముఁ డేసె
అవిరెండు ననోన్యహతములై పడఁగ, నవనీశ దనుజేశు లాలోనఁ గినుక
దివిరి యొండొరులేయు తీవ్రబాణములు, దివినిండఁ గప్పినఁ దిమిరంబుగప్పె
రణములో నప్పుడు రయమున మ్రోఁగు, గుణరావములచేత ఘూర్ణిల్లుచున్న
యురుచాపసాగరయుగమున నెగయు, శరవీచు లొగిఁ బరస్పరఘట్టనముల
విరియంగ దైతేయవిభుఁడు కోపించి, నరనాథు నురమేసె నారాచసమితి
నదియుండె నీలోత్పలావలికరణిఁ, గదిసి రాముఁడు చండకాండము ల్దొడిగి
కవచంబు సించి వక్షము గాడనేసె, దివిజారి యప్పు డెంతే నొచ్చి మఱియు
నహిశిలీముఖముల నడరింపఁ దోన, యహిమాంశుకులనాథుఁ డవి ద్రెవ్వనేసె
నాసమయంబున నమరేంద్రవైరి, యాసురసాయకం బడరింపఁ బెక్కు
ముఖముల శార్దూలముఖములు నుష్ట్ర,ముఖములు సూకరముఖములు నురగ
ముఖములు కరవైరిముఖములు దంతి, ముఖములు ఘనగృధ్రముఖములు దనరు
ఘనశిలీముఖములై కడుఁబెక్కు నిగుడఁ, గని వానిఁ దునుకలుగాఁజేసి మఱియు
జననాథుఁ డాగ్నేయసాయకం బేయఁ, గనుఁగొని నెందు నుల్కాముఖాస్త్రములు
మహితవిద్యుత్స్తుఖమార్గణంబులును, గ్రహముఖంబులుగల్గు ఘనసాయకములు
మిహిరముఖంబుల మెఱయు బాణములు, దహనముఖంబులై తనరుశస్త్రములు
నగుచు నచ్చెరువుగా నడరంగ వానిఁ, దగనేసి యప్పుడు దైత్యవల్లభుఁడు
మయునిచేఁ బడసిన మాయాశరంబు, రయమున సంధించి రాముపై నేసె

నేసిన ధాన నసేకంబు లగుచుఁ, బ్రాసతోమరగదాపరిఘంబు లడరె
గాంధర్వశరమంత ఘనకార్ముకమున, సంధించి నిగుడించె జనలోకవిభుఁడు
నాదిత్యతులితంబు లైనచక్రంబు, లాదివ్యభాణంబునం దనేకములు
జగములు భయమంద జనియించి రుచుల, నిగిడి యాకసమెల్ల నిండఁ బెల్లడరి
యామార్గణంబున నడరినపరిఘ, తోమరాదులనెల్లఁ దునియలునేయ
దశకంధుఁ డంత నద్ధరణీశుమీఁద, నిశితనారాచను ల్నిగిడించె నలుకఁ
బరఁగించె నృపుఁడును బ్రతిసాయకములు, పొరిఁబొరిఁ బుంఖానుపుంఖంబుగాఁగ
జగతీశదనుజేశశరపరంపరలు, గగనభాగంబెల్లఁ గప్పె నాలోన
నెడఁజొచ్చి లక్ష్మణుం డేడుబాణములఁ, బడగయు విల్లొక్కపటుసాయకమున
సారథిశిర మొక్కశరమునఁ ద్రుంచి, యారావణునివక్షమైదింట నేసె
నీలధరాధరనిభతురంగములఁ, గూలంగనేసె మార్కొని విభీషణుఁడు
విరథుఁడై దైతేయవిభుఁ డంతలోన, ధరణికి లంఘించి తరుచరుల్బెదర
భ్రూకుటిదశకవిస్ఫురితాస్యుఁ డగుచు, భీకరశక్తి విభీషణు వైవ
నడుమనె మూఁడు బాణంబుల దాని, మిడుగురు ల్మంటలు మింటఁ బెల్లెగ్గయ
ధరణిపైఁ బడనేసెఁ దరుచరులార్వ, ధరణీశుననుజుండు దశకంఠుఁ డంత
కడునల్లి మయునిచేఁ గన్న యాశక్తి, వడి విభీషణుమీఁద వైవ నంకింప
శరణాగతత్రాణసద్ధర్మపరులు, శరణాగతులచావు సైతురే యనుచు
దనుజేశుతమ్మునిఁ దనవెన్కఁ దిగిచి,కొని రాముతమ్ముఁడు క్రూరబాణములు

రావణునిశక్తిచే లక్ష్మణుఁడు మూర్ఛిల్లుట.

పరఁగించె నప్పుడు పంక్తికంధరుఁడు, బిరుదవై వచ్చి విభీషణు వెనుక
నిడుకొంటి లక్ష్మణ యాశక్తిహతికిఁ, గడిమిమై నోర్తువు గాకంచుఁ బలికి
ప్రళయకాలాదిత్యపరివేషఘోర, వలయమై దీపింప వడిఁ ద్రిప్పి వైచె
నది కింకిణీఘంటికానేకరవము, లొదవంగ మ్రోయుచు నుదధులు గలఁగ
వడిఁ గుళాచలములు వడకాడ దిశలు, బెడఁక దివాకరబింబంబు గదలఁ
బిడుగులు దొరఁగంగఁ బృథివి గంపింప, నుడుపథం బవియంగ నుడుపంక్తి చెదర
మిడుగురు లెగయంగ మింటఁ బెన్మంట, లడరంగ శేషజిహ్వాకార మగుచు
రయమునఁ బఱతెంచి రాముఁ డాలోక, భయదసాధనముచేఁ బ్రాణభయంబు
సమకొనకుండెడు సౌమిత్రి కనఁగ, నమరులు మింట నాహాకృతుల్సేయ
నెడనెడఁ బయినేయు నిషుపంక్తి జడిని, వడిమీఱఁగా వచ్చి వక్షంబునందు
భీకరఘనశక్తి పెల్లుగాగాడ, రాకుమారుఁడు దూలి రణభూమి వ్రాలెఁ
గాలావసానంబు గదియఁ బెంపేది, కూలుమహామేరుకుధరంబుపగిది
ధరణిపైఁ బడియున్న తమ్మునిఁ జూచి, దరికొన్నశోకాగ్ని దనచిత్త మెరియఁ
గనుగవబాష్పము ల్గ్రమ్మి పై నిగుడ, దనుజేశుపటుబాణతతులు గైకొనక
పృథుతరవక్షంబు పెల్లుగాఁ గూడి, పృథివి గూడినయట్టి భీకరశక్తిఁ
బఱతెంచి వానరపతులెల్లఁ గూడి, పెఱుకఁజాలకయున్నఁ బెఱికిపోవైచి

యర్క-జానిలసుతులాదిగాంగలుగు, మర్క-టేశులఁ జూచి మనుజేశుఁ డనియె
శౌర్యంబు సలిపెడి సమయంబుగాని, కార్యంబు లడఁచు శోకపువేళగాదు
ఘనులార! మీరు లక్ష్మణుఁ గాచికొనుఁడు, వినుఁడు నాపలికెడు వీరప్రతిజ్ఞ
వెనుకకు రాజ్యంబు విడుచుట బంధు,జనులఁ బాయుట వనస్థలులఁ గ్రుమ్మరుట
బాణబాణాసనపాణినై యుండి, ప్రాణంబు దానైన పత్ని గోల్పడుట
కడిఁది మాయావిరాక్షసులతో ననికిఁ, దొడరుట మొదలైన దుఃఖంబులెల్ల
ఘోరాజిలోఁ బాపుకొనువాఁడ నేను, దారుణకర్తు నీదశకంఠుఁ దునిమి
సమరోర్వి నీతనిఁ జంపెడికొఱకు, నమితవిక్రముఁడైన యావాలి గూల్చి
కపిసేనలై దినకరతనూభవుని, గపిరాజ్యపట్టంబు గట్టితిఁ బ్రీతిఁ
జండతరగ్రాహసంకులం బగుచు, నొండొండ మిన్నందు నూర్పులుగలిగి
కడలేనియావార్ధి గట్ట గట్టించి, కడచి వచ్చితి మహాకపిసేనతోడ
వచ్చి లంకాపురవరము వేడించి, యిచ్చట సౌమిత్రి నిటు గోలుపడితి
నాదశానను డేచి యాలంబులోన, నాదృష్టిమార్గంబునకు వచ్చెనేని
దృష్టివిషంబులఁ దీవ్రసర్పంబు, దుష్టజంతువుగాల్చు లెఱుఁగు చూపెదను
బ్రదికిపోనీ నింకఁ బ్జ్కికంధరునిఁ, బ్రదరపరంపరపాలుచేసెదను
గిరులెక్కి- నేడెల్ల గిరిచరావలులు, సొరిది యారణకేళి చూతురుగాక
లోకపాలురు నెల్లలోకులు నేఁడు, నాకార్తకప్రౌఢి నలువారఁ జూచి
రణములోపల నేను రఘురాముఁ డగుట, ప్రణుతవిక్రమలీలఁ బరికింపనిండు
సురకంటకుఁడు డాఁగి సురలోకమునకు, నరిగిన నభ్రిమధ్యమునఁ గ్రుంకినను
ధరణిఁ దూఱిన రసాతలముఁ జొచ్చినను, బొరిపుత్తుఁ గాకేల పోనిత్తుఁ దన్ను
భువి నర్కకులమునఁ బుట్టితినేని, రవితేజుఁడగు దశరథుతనూజుండ
నైతినే రాముఁడ నైతినే నింక, దైతేయపతి రణస్థలి నిల్చెనేని
నేవిధంబుననైన నిపుడె నిర్జింతు, రావణుం డయ్యెడి రాముఁ డయ్యెడిని
నిల రామరావణు లిరువురయునికి, గలుగంగ నేఁ దీకదనరంగమున
ననుచు నారాచంబు లందందఁ దిరిగి, దనుజేశుపైనేయ దశకంధరుండు
ప్రతిశిలీముఖపరంపరలు పైఁబఱప, నితరేతరాశుగానేకసంఘములు
మండుమంటలు నభోమండలి నిండ, నొండొంటితోఁ దాకు నుగ్రంపురవము
గురుతరకోదండగుణనినాదములు, బెరసె నొక్కొకట లోకభీకరగతులు
అంత జర్జరితాంగుఁడై రాముఁవిశిఖ, సంతానవేగంబు సైరింపలేక
గజవైరిఁ గనిపాఱు గజముచందమున, రజనీచరేంద్రుండు రణభూమి విడిచి
కచభారములు వీడఁ గమనీయరత్న, ఖచితభూషణములు గనుకనిఁ జెదర

రావణుఁడు విభీషణాదులమాట దలంచి చింతించుట.

ఘనపాదహతి నేల కంపింపఁ బాఱి, వనచరు లార్వంగ వడి లంకఁ జొచ్చి
కొలువుకూటంబునఁ గూర్చుండి బుద్ధిఁ, దలపోసి తనకు ముందర విభీషణుఁడు
చెప్పినబుద్ధులు చిత్తంబులోన, నప్పుడు తలఁచుచు నారాముఁడేయు

నేటులు దలఁచుచు నెల్లండు సుభటు,ఁకోటులు గొనియాఁడఁ గుంభకర్ణుండు
నతికాయుఁడును ఘనుం డగునింద్రజిత్తు, మృతులౌటఁ దలఁచుచు మిగులఁ జిత్తమున
గవిసిన శోకాంధకారంబువలన, నవశభావముఁ బొంది యాలోనఁ దెలిసి
యంతఃపురంబున కంత నేతెంచి, యంతరంగమునఁ జింతాక్రాంతుఁ డగుచుఁ
దనసతి రావించి తల వాంచి పలికె, విను రామజగదేకవిక్రమక్రమము
నేమని చెప్పుదు నిదె నాకు నెదుర, రామసహస్రము ల్రమణి తోఁచెడిని
ఎక్కఁడఁ జూచిన నీలంకలోన, నక్కఁడ రఘురాము డైయున్న వాఁడు
ఇంక జయోపాయ మేమియు లేదు, శంకరుచరణము ల్శరణంబు నాకుఁ
ద్రిపురంబు లేదేవుదివ్యోగ్రబాణ, విపులాగ్ని నీఱయ్యె విస్మయం బెసఁగ
నిందుఖండంబున నేదేవుమకుట, మందమై విలసిల్లు నభినవస్ఫురణఁ
దనర నేదేవుహస్తమునఁ బినాక, సునిశితఖడ్గత్రిశూలము లైఱయ
నేదేవుఁ డఖలలోకేశుఁ డేదేవుఁ, డాదక్షు మర్దించి యాగంబు చెఱిచె
అలుకతో నేదేవుఁ డంధకాసురుని, బొలియించె నేదేవుఁ బొగడువేదములు
తెలియ నేదేవుఁడు దేవుఁడు దేవుఁ, డెలమి నాదేవుని నే భజించెదను
అని కృతస్నానుఁడై యగ్రజన్ములకుఁ, దనియంగ బహువిధదానము ల్చేసి
మదిలోన మదదర్పమానముల్విడిచి, పదిలుఁడై సాత్వికభావంబు పూని
రక్తాంబరంబులు రక్తమాల్యములు, రక్తోపవీతము ల్రక్తగంధంబు
రక్తాక్షసూత్రము ల్రాజిల్లఁ బరమ,భక్తితో మంత్రజపంబు సేయుచును
నీశ్వరాలయమున కేతెంచి రాక్ష,నేశ్వరుం డచలితహృదయుఁడై నిలచి
తగవేది గావించి దర్భాంకురంబు, లొగిఁ జేర్చి తనకుఁగా నుగ్రదానవుల
నన్నిదిక్కులనుండ నమరించి వ్రేల్వ, నున్నంత నెఱిఁగి మందోదరి వచ్చి
కనుఁగొని యోపజ్ఞికంధర నీకుఁ, జనునె దీనునిభంగి శౌర్యంబు విడువ
ఉఱక నీవలిగిన నుదధులు మ్రోయ, వెఱచు సమీరుండు వీవంగ నఱుకు
వినువీథి నర్కుండు వెలుఁగ శంకించు, ననలుండు తీవ్రార్చి లడరింప నోడు
జగములు నీసన్నఁ జలియించు నేల, మగటిమి చెడి విప్రమతము గైకొంటి
నేడింత ధైర్యంబు నీకు లేకున్న, నాఁడేల తెచ్చితి నరనాథుదేవి
మారీచుమాటలు మదిలోన నాఁడు, నేరములార్లాఁ గొంటి నీతిగావంటి
నీతి విచారించి సీచేటు సైఁప, కాతతధర్మాత్ముఁ డగువిభీషణుఁడు
తొడరి పల్మాఱును దోషాచరేంద్ర, చెడుత్రోవలేటికి సీత నీవైని
విడుచుట గడుమేలు విడుమంచు నీకు, విడువక చెప్పఁడా వినవైతిగాక
మాతామహుం డైనమాల్యవంతుండు, నీతి దాఁ జెప్పఁగ నీసుగైకొంటె
తప్పక మీతల్లి తగవు చింతించి, చెప్పినబుద్ధులు చెవిదొగ్గి వింటె
జననాథుతో నేల శాత్రవం బనిన, గనలవే మఱి కుంభకర్ణమాటలను
వలదని చెప్పినవారివాక్యములు, తలగూడెనే నేఁడు దనుజలోకేశ
భుజవిక్రమంబెల్లఁ బోవంగ విడిచి, నిజముగా మునివృత్తి నేఁడు గైకొంటి

ఇంద్రుండె యని నోడ నెఱుఁగఁడు రామ,చంద్రుని నని జగజ్జనులు నిన్నఁ గరె
యని వాని గెల్తుగా కసురేశ నీకు, ననదచందము లేల యని తూలఁ బల్క
నెలకొన్నసిగ్గున నిట్టూర్పువుచ్చి, నెలఁత నీమాటలు నిజమగు నైన
రామచంద్రుని కింక రమణి నే వెఱవ, హోమంబు గావించి యుద్ధరంగమున
జననాథవరులను జంపెద నీవు, చనుమన్న మ్రొక్కి బొప్పంబు లందంద
దొరుఁగ మందోదరి దుఃఖించి లోని, కరుగుచో నాడిన యార్ద్రవాక్యములు
విని సిగ్గుపడి వ్రేల్మి విడిచి రావణుఁడు, చనియె సైజ్ఞకునంత జననాథుఁ డిచట
ఒడలు నెత్తుటఁదోఁగి యూర్పులు సడలి, పడియున్న శేషాహిపతిఁ బోలియున్న
యనుఁగుఁదమ్మునిఁ జూచి యాలోన ధృతికిఁ, జొనుపని మతితోడ శోకింపఁదొడఁగె

లక్ష్మణునిమూర్ఛకు శ్రీరాముఁడు శోకించుట.

ఇబ్భంగి సౌమిత్రి యిలమీఁద నుండ, నెబ్భంగిఁ బ్రాణంబు లేను నిల్పుదును
లలి రణం బొనరింప లావెట్లు గలుగు, బలుముష్టి విల్లెట్లు పట్టంగవచ్చుఁ
గన్నులబొప్పము ల్గ్రిమ్మంగ నెట్టు, పన్ని పైఁ బఱతెంచు పరిపంథిఁ జూతు
నాకన్ను లెదుటనే నాసహోదరుఁడు, నాకుర్మిబంధుండు నాప్రాణసఖుఁడు
నాకుఁ బ్రాణము లిచ్చి నను డించిపోయె, నాకు సిగ్గయ్యెడి నాశౌర్యమునకు
నాకేల రణ మింక నాకేల జయము, నాకేల రాజ్యంబు నాకేల సీత
నాకేల శౌర్యంబు నాకేల బ్రతుకు, నాకు నీతోడిద నాకంబుగాక
జయశాలివై మున్ను శరభశార్దూల, భయదాటవులలోనఁ బాటించి తెచ్చి
యరుదైన తుచ్ఛదై త్యాటవియందుఁ, బరునికైవడిఁ గాడుపఱచితే నన్ను
ఉన్నతోన్నతబుద్ధి నోరంత ప్రొద్దు, నన్నుఁ గాచుటకుఁ గాననభూములందు
నిద్రవో వెన్నఁడు నేఁడిట్లు దీర్ఘ, నిద్రపోవుట నీకు నీతియే తండ్రి
పలుమఱు నిబ్భంగిఁ బనవుచుఁ బిలువ, నెలుఁగెత్తి యోయన వేమి లక్ష్మణుఁడ
ఇంక నెవ్వరు గల రేనెంచుఁ జొత్తు, నింకఁ బొలయితిగా యీశోకవహ్ని
శుభలక్షణోపేతసురుచిరాకారుఁ, డభిరామబలుఁడు నాకతిథ క్తిపరుఁడు
ప్రియసహోదరుఁడు గంభీరుండు సమర, జయశాలి నాప్రాణసఖుఁడు లక్ష్మణుఁడు
ఇతఁడు నాతోఁ గాన కేతెంచె నిప్పు, డితనితో నేగెద నేనింద్రపురికిఁ
గలరిందు నెందును గలరు బాంధవులు, నిల నిట్టిసోదరు లెక్కఁడఁ గలరు
యత్నంబుచేసిన నవనిజఁ బోలు, పత్నినొండొకచోటఁ బడయఁ జొప్పడును
ఇట్టి సద్గుణశీలుఁ డిట్టి దయాళుఁ, డిట్టి మహాబలుం డిక నెందుఁ గలఁడు
తమ్ముఁడన్మాత్ర మే తలపోయభ క్తి, నిమ్ముల ననుఁగొల్చు నిమ్మహాభుజుఁడు
ఇతఁడె నాపౌరుషం బితఁడె నాశాంత, మితఁడె నాకీర్తియు నితఁడె నాసూక్తి
యితఁడె నాశౌర్యంబు నితఁడె నాధైర్య, మితఁడె నానయమును నితఁడె నాజయము
భావింప నాపాలిభాగ్యంబు నితఁడె, పావనంబగు రాజ్యపదవియు నితఁడె
యని పెక్కుభంగుల నడలుచునుండ, విని సుషేణుఁడు రామవిభుఁ జూచి పలికె
ఇదియేమి దేవ నీకింత శోకింప, హృదయంబుఁ గుందింప కిదె చూడు మితని

యొడలఁ బ్రాణములు లేకున్న నాసనము, కడునొప్పి యుండునే కళలు దేరుచును
గన్ను లిందీవర కమనీయకాంతిఁ, జెన్నొంది యుండునే చెలువంబు మిగిలి
అందంబులై యున్న వఱుచేతు లెలమిఁ, గెందామరలభంగిఁ గెంజాయ మెఱసె
నని పల్కి రఘురామునడలువారించి, హనుమంతుఁ గనుఁగొని యతనితో ననియె
మును జాంబవంతుండు ముదముతోఁ దెల్ప, వినినాఁడ నౌషధవిధ మెల్లఁ దెలియ
బొలుచు మహాద్రోణభూధరేంద్రమునఁ, జెలువొందు దక్షిణశిఖరంబునందు
బరికింప దీప్తులఁ బరఁగు విశల్య,కరణియు సౌవర్ణకరణియు మఱియు
సంధానకరణియు సంజీవకరణి, బంధురతరశుభప్రభ నొప్పుచుండు
నాలుగౌషధములు నవి దెమ్ము వేగ, మాలక్ష్మణునిప్రాణ మెత్తంగవలయు
లవణసముద్రంబు లంఘించి పోయి, యవకుశద్వీపము లవియును గడచి
వడి నేగి దుగ్ధార్ణవము నాక్రమించి, తడయక పోయి చంద్రద్రోణగిరులఁ
బంబి దేవాసుర ల్బలువడి దొల్లి, యంబుధి మథియించి యమృతంబు వడసి
యందు దాఁచుటఁ జేసి యమృతంబువలన, నందు జన్మించె నానౌషధలతలు
అందు దేవేంద్రునియనుమతంబునను, మందరంబులఁబోలు మహనీయతనులు
గంధర్వు లొగి వానిఁ గాచియుండుదురు, గంధర్వులకు నీకుఁ గలుగుఁ గయ్యంబు
తెరువున రాక్షసు ల్దిరుగుచుండుదురు, వరుస మాయావులై వారి నేమఱక
ద్రోణాద్రి కవలీలతోఁ నేగి యితని, ప్రాణ మెత్తుము రఘుపతి సంతసింప
నిరుమూఁడులక్షలు నిరువదివేలు, పరికింప నిన్నూటపదియోజనములు
వాయునందన నీవు వాయువేగమునఁ, బోయి రమ్మిటఁ బ్రొద్దుపొడువకమున్నె
భానుండు వొడిచినఁ బ్రభఁ చూలి శక్తిహీనంబులై బోవు నీయౌషధములు
అటమీఁద లక్ష్మణునాయు వెత్తుటకు, ఘటియిల్ల నేరదు గాన నీలోన
వానరోత్తమ నీవు వడిఁ బోయిరమ్ము, వానిలక్షణములు వలయు నీకెఱుఁగ
హరితఫలంబులు నరుణపుష్పములు, నరుదారఁ దెల్లనియాకులు నమరు
జననాథసుత విభీషణు జాంబవంతు, నినసూను నంగదు నెలమి వీడ్కొనుము
అని సుషేణుఁడు వల్క నౌఁగాకయన్న, యనిలనందను జూచి యవనీశుఁ డనియెఁ
బడియున్నలక్ష్మణుప్రాణంబు లెత్తి, పడయము త్రిభువనప్రఖ్యాతకీర్తి
అనుజులు మును మువ్వురయ నాకిప్పు, డనిలనందన నల్వురై రి నీతోడ
నన విని నీబంటు హనుమంతుఁ డుండ, నినకులోత్తమ నీకు నేల చింతింప
నీయాజ్ఞఁ దలమోచి నృపసింహ వేగ, మాయేడుదీవుల కవలనుండినను
నినుఁ డుదయాద్రి కేతెరకమున్న, కొనివత్తు నౌషధకుధరమే ననుచు
నడుగుల కెరఁగిన హనుమంతు నెత్తి, నడుఁగ్రుచ్చి యాలింగనముసేసి విభుఁడు
ఇంద్రుండు నీశిర మినుఁడు నీముఖము, చంద్రుండు నీమది శక్తి నీపిఱుఁదు
లనిలుండు నీవెన్ను హరుఁడు నీవాల, మనలుండు నీయంఘ్రు లజుఁడు నీబుద్ధి
వరుణుండు నీశక్తి వాణి నీవాణి, గరుడకేతనుఁడు నీఘనబాహాయుగము
కుంజరాననుఁడు నీకుక్షి రక్షింతు, రంజనాసుత వేగ యరిగి రమ్మనిన

హనుమంతుఁడు సంజీవకరణికొఱకు ద్రోణాద్రికిఁ బోవుట.

సరవి నర్కజ విభీషణ ఋక్షరాజ, పురుహూతపౌత్ర లప్పుడు వీడుకొల్ప
మేదిని వడి వ్రయ్య మెట్టినగము, పాదంబు లూఁదిన బలువడిఁ గ్రుంగ
మెయిగాలి యవ్వీరు మిన్నేఱు గలఁగ, రయమున లంకాపురంబుగోపురము
వెసఁగూలఁ గుప్పించి వినువీధి కెగసి, లసితవిద్యున్నిభలాంగూలలతయు
నుగ్రబాహార్గళయుగళంబు నెత్తి, యుగ్రాంశుపటుమండలోద్యగ్రలీల
వదనంబు గడుసముజ్జ్వలితమై వెలుఁగఁ, బదకర్ణసంకోశభంగిఁ జెన్నగుచు
బహుపర్వతంబులు బహుదేశములును, బహుననీనదములు బహువనంబులును
పురములు సాగరంబులు గనుంగొనుచు, నరుదారఁ దుహినాద్రి నవలీలఁ గడచి
దెసలు ఘూర్ణిల్లంగ దిగ్భాగమగల, నసహాయశూరుఁడై హనుమంతుఁ డరిగె
వేవులవా ర్ధివిధమెల్లఁ జెప్పఁగా విని విఘ్నంబుగాఁ జేయఁ దలఁచి

కాలనేమివృత్తాంతము.

యెంటిమై రావణుం డొగిఁ గాలనేమి, యింటికి నడురేయి నేగుదెంచుటయు
భక్తితోడుత నర్ఘ్యపాద్యాదు లిచ్చి, నక్తంచరేంద్రున కాతఁ డిట్లనియె
నీమధ్యరాత్రి మీరిటకు విచ్చేయ, నేమి కారణ మానతిండు నాకనిన
నని నేఁడు నాశక్తిహతి మృతుండైన, యనుజునికై రాముఁ డటుఁ దన్నుఁ బనుప
సంజీవకరణిచే సౌమిత్రిఁ బడయ, నంజనాసుతుఁ డిప్పు డరుగుచున్నాఁడు
చని వేగ హనుమంతుఁ జంపు కాదేని, వినుభాను గనునంత విఘ్నంబుసేయు
కలదు దేవాసురకల్పితంబైన, నలినాకరము ద్రోణనగసమీపమున
మదముతో నొకమహామకరియందుండు, నది దేవతల మ్రింగు నగచరుం డెంత
ఆసరోవరమున కనిలజుం డరుగ, మోసపుచ్చుము వేగముగ నేగుమనిన
మనమున నట నీతిమార్గంబు దెలియ, దనుజేశుతో నాడెఁ దగఁ గాలనేమి
మాయామృగాకృతి మారీచుఁ డరిగి, మాయమైపోఁడె యామతము పోనిమ్ము
ఘోరాజిఁ గూలిరి కుంభకర్ణాది, వీరదానవు లెల్ల విను మింకనైన
మనుజేశునకు సీత మరలంగ నిచ్చి, దనుజేశ లంక నీతమ్మునిఁ గిచ్చి
యరిగి మృడావాస మైనకైలాస, ధరణీతలంబున తపసివై యుండు
కాదేని బిరుదుమైఁ గదనరంగమున, మేదినీపతిచేత మృతిఁబొంది మీఁద
నొనరంగ విష్ణుసాయుజ్యంబునొందు, మనిపల్కఁ గన్నుల నలుక గెంపెసఁగ
నాయెడ వెసఁ జంద్రహాసంబు పెఱికి, వ్రేయఁ దలంచె నావిధ మాతఁ డెఱిఁగి
యిదె చనుచున్నాఁడ నేనంచు నచటు, గదలి మనోవేగగతి లావు మెఱసి
చని చూతపున్నాగచంపకక్రముక, పనసచందనజంబు పాటలీవకుళ
కదలికాఖర్జూరకర్పూరతరులు, మొదలుగాఁగల భూజముల సొంపు మిగిలి
బహుశిష్యగణవేదపఠనంబు చెలఁగ, మహనీయమణిదీపమాలిక ల్వెలుఁగ
బాసురమంజరీఫలహోమధూమ, ధూసరీకృతలతాద్రుల ఁ జెన్ను మిగిలి
కలకంఠశుకనీలకంఠచారికల, కలహంసకలరవకలకలం బెసఁగ

హుతదానమంత్రస్వరోదీర్ణమైన, కృతకాశ్రమము ద్రోణగిరిసమీపమున
నిర్మించి మునివోలె నియతితోఁ గపట, నిర్మలాకృతిఁ దాల్చి నేత్రములు మూసి
సన్నపుఁజెలుఁగున జపమాలపూస, లెన్నుట మంత్రమై యెదిరికిఁ దోఁప
నావనంబుననుండ నాకాశవీథిఁ, బోవుచో మారుతపుత్రుఁ డీక్షించి
యిది యొక్క మునివనం బింత యొప్పగునె, యిది నాఁడు లేదిప్పు డెందు వచ్చితినొ
యొక్కఁడి దుగ్ధాబ్ధి యొక్కఁడి మేరు, వొక్కఁడి మునివనం బిది త్రోవ దప్పెఁ
దెరువిమ్మునీంద్రుఁ జేఁ దెలియంగ నడిగి, యరిగెదఁ గాకంచు నవని కేతెంచి
వనపక్వఫలములు వాంఛఁ బుట్టించి, మునిశాపభయమున ముట్టనోడుచును
మునిఁజేరఁ జనుదెంచి మ్రొక్కి కేల్మొగిచి, మునినాథ దుగ్ధసముద్రంబుకడకు
మనుజేశకులశిఖామణియైనరామ, జననాథుపనుపునఁ జనుచున్న వాఁడ
హనుమంతుఁ డనువాఁడ నధికమౌ తృష్ణ, జనియించె నిచ్చోట జలములు గలవె
చెప్పవే యనవుడుఁ జిఱునవ్వు నవ్వి, డప్పివో మాకమండలువుతోయములు
ద్రావు మీఫలములు దనియంగ నమలు, నీవింక రాతిరి నిద్రింపు మిచట
నగచరోత్తమ యతీతానాగతంబు, లగుమేర లెఱుఁగుదు నంతరంగమున
రాము వంచించి యారామునిదేవి, భూమిజఁ జెఱగొనిపోయె రావణుఁడు
అవనీశుఁడును వాలి నవలీలఁ జంపి, లవణాంబునిధిఁ గట్టి లంకపై విడిసి
యనిలోనఁ గుంభకర్ణాదిరాక్షసులఁ, దునుమాడి యింద్రజిత్తును ద్రుంచివైచెఁ
బుత్రశోకంబునఁ బుట్టినయలుక, రాత్రించరేంద్రుండు రణభూమిలోన
మయనిచేఁ బడసిన మహనీయశక్తి, రయమునఁ గొని సుమిత్రాపుత్రు వైచెఁ
బడిన యాసౌమిత్రిప్రాణములర్వడయ, వడి నౌషధములకు వచ్చితి వీవు
వినుము నీవిప్పుడు వేయోజనంబు, లనిలనందన వచ్చి తనిలవేగమున
నన్ను నధర్తాత్ములకుఁ గానరాదు, నిన్ను నుత్తమునిఁగా నిశ్చయించితిని
జగదేకహితముగా జనియించెఁగాన, జగదీశుపని మాకు సమకూర్పవలయు
దివ్యౌషధంబులు దీపించునట్టి, దివ్యమంత్రము లుపదేశింతు నీకుఁ
గంజాప్తుదయంబు గని శక్తిమిగుల, సంజీవనీముఖ్యసకలౌషధములు
గలవు మావనమునఁ గనుఁగొని యందు, వలసినయవి గొంచు వడి లంకకరుగు
కనురెప్ప వెట్టెడుకంటె వేగమునఁ, జనియెదు నామంత్రసామర్థ్యమునను
అనవుడుఁ గపటసంయమిఁ జూచి పవన,తనయుండు వల్కె నోతాపసాధీశ
అక్కడ లక్ష్మణుం డడ్డంగి నుండ, నిక్కడ నుచితమే యిటు నాకు నిలువ
ఫలములు నా కేల పఠింపుకోర్కి, ఫలముగా సౌమిత్రిఁ బడయకమున్న
నిద్రవోవుట నాకు నీతియె దీక్ష,నిద్ర గైకొని రామనృపుతమ్ముఁ డుండ
జలము లల్పంబులు చాలవు లేదె, నలినాకరంబైన నదియైన ననుఁడు
ఉన్నది చేరువ నొకదివ్యసరసి, కన్నులు మూసి యాకమలాకరమున
నమృతోపమానంబు లగునిర్మలోద,కములు ద్రావిన దివ్యకాయుండ వౌదు
దృగ్గోచరములగు దివ్యౌషధములు, దిగ్గనఁ జనుమంచుఁ దెరువు సూపుటకుఁ

గపటసంయమిశిష్యగణము నంపుటయుఁ, గపివీరుఁ డేతెంచి కనియె నక్కొలను
మాకందమందారమాధవీవకుళ, శాకోటకుటజకచందనసాల
నీపార్జునాశోకనింబకదంబ, తాపించ్ఛతరులస త్తటములదాని
కమనీయకోమలకమలకల్హార, విమలకైరవముల విలసిల్లుదాని
లలితకల్లోలడోలాకేలిఁ దేలు, కలనాదకలహంసగతు లొప్పుదానిఁ
బటుహంసవేషచుంబకపికక్రౌంచ, పటలకారండవప్లవతులదాని
వెనుకొని తముఁ బిల్చి విరహులమీఁదఁ, బనిచిన గెల్చి నిర్భరవృత్తిగొన్న
విపులాభిమానార్ధవితతు లీకున్నఁ, గుపితుఁడై రతిరాజు కొట్లులఁబెట్టె
ననఁ బక్వబంధంబులై వాఁడి మిగుల, మొనసినకైరవముకుళాగ్రశిఖల
మూఁగి చలింపని మొకరితుమ్మెదల, బొగొప్ప నొప్పుల బలిసినదాని
మఱికొన్ని యెడలను మకరందములకుఁ, దెఱపి చూపక తమ్ముఁ ద్రిప్పుచునున్న
కమలగేహాంతరకమలకుఁ బ్రీతి, సమరీతి మంగళాచారగీతములు

నలిఁబాడుగాయకనాయకు లనఁగ, మెలపున నందంద మృదురీతిమ్రోయు
మధుపానరసమత్తమధుకరతతుల, బధిరాబ్జపుటసమీపము లొప్పుదానిఁ
గామునుగ్రాతుచేఁ గ్రమ్మఱు బడయఁ, గామించి నీరమాకందబృందంబు
లలరునగ్నులలోన నాజ్యహోమములు, చెలువొంద నందంద చేయుచందమునఁ
జిలుకలు చంచులఁ జించినఁ దొరుఁగు, ఫలరసధారలు పర్ణాగ్రవీథి
దొలఁగక యురిలి చెందొవలలోఁ దొరుగు, పొలుపెంతయును జూడఁబొసఁగెడుదాని
ఫలరసంబులువచ్చి పైఁబయిఁ దొరుఁగ, నొలసి చెందొవలలో నుండరాకున్నఁ
దొలఁగు నుజ్జ్వలహోమధూమంబు లనఁగ, నలులాకసంబున నమరెడు దాని
నాకంజపత్రంబు లనుపల్లెరముల, శ్రీకరాకృతములు చెలువొప్ప నునిచి
కొలనప్పుడును త్రుళ్లఁ గువలయవలయ, దళవిలోచనములఁ దనరాక కెదురు
చూచుతెఱంగున శోభిల్లుదానిఁ, జూచి డగ్గఱవచ్చి సుఖకేలిఁ దేలి
యడరు సమ్మదమున నానందమంది, కడు విస్మయంబంది కన్నులు మూసి
యక్కొలనికి డిగ్గి హనుమంతుఁ డంత, నెక్కొన్నతృష్ణతో నీళ్లుద్రావఁగను
బొలుపార సంసారభూరివారాశి, మలఁగుచు వర్తించు మాయావధూటి
విషయరసంబులు వేడ్కతోఁ గ్రోలు, తృషితునిఁ గబళించుతెఱఁగు దీపింప
నురవడి నందుండి యొకమహామకరి, హరినాథుపాదంబు లలమి పట్టుటయుఁ
దగిలినయంస్రు లుద్ధతశక్తిఁ దిగిచి, తిగువఁజాలక చాల ధీరుఁడై నిలిచి
యిది యేటిదో యని యేర్పడఁ జూచి, మది వాయుసూనుండు మకరిగా నెఱిఁగి
యంతకంతకు మది నలుక రెట్టింప, నంతలో నతినిష్ఠురాకారుఁ డగుచు

వేవేగ రఘురాము విజయివల్లభుల, కావాలమై వ్రాలు నావాల మెత్తి
రాగరసోద్రేకరావణాయోగ,భోగసంచితపాపములు డుల్లుపగిది
వాల మంకించి దుర్వారుఁడై విజయ, లోలుఁడై మకరిపండులు డుల్ల వ్రేసె

హనుమంతుని మకరి మ్రింగుట.

సంతతమునికృతశాపరోగమున, కంత మాయాషధమని మ్రింగుకరణి
నరిమురి మకరి మహారోష మెత్తి, మెఱసి యాహనుమంతు మ్రింగఁజొచ్చుటయు
నక్కటా రాముకార్యము నిల్వఁబడియె, నిక్కడ దీనిచే నిట్టిచందమునఁ
దెగిపోదునో యింకఁ దెఱగేది యనుచుఁ, దగ విచారించి యుద్ధతి వాయుసుతుఁడు
కడుపులోపలఁ జొచ్చి కడతేర్తు ననుచు, నొడిసి మ్రింగుచునున్న నూరకయుండి
పదిలుఁడై యంధకూపముబోని మకరి,యుదరంబుఁ జొచ్చె నాయురుబాహుబలుఁడు
అంత నామకరియు నాహారబుద్ధి, సంతోషమునఁబోయె జలమధ్యమునకు
ఆవీరవరుఁ డంత నలుకతో దాని, ప్రేవులు నరములు పెనచి త్రెంచుచును
నడరినకడకతో నమ్మహామకరి, కడుపులోపల విషకబళంబపోలె
నరుగక తిరుగుచు ననలంబుభంగి, జురవుచ్చఁ దొడఁగిన స్రుక్కి యమ్మకరి
దేహంబులోపలి ధృతిదీఱ డించి, దాహంబు పెంపున ధరియింపరాక
వరవట్లు వెట్టెడు వదనగహ్వరము, తెఱచి నిల్పుటయు నత్తెరువున వచ్చి
క్రూరనక్రగ్రాహఘోరప్రవాహ, వారిపైఁ బడుటయు వాయునందనుఁడు
పెనచి త్రెంచిన దానిప్రేవులు ముద్ద, గొనివచ్చి చెచ్చెఱఁ గుత్తుకఁ దురిమె
ఆలోన మకరియు నాహార మరుగఁ, బోలదు పొమ్మని బుద్ధిఁ జింతించి
పరవశ యగుటయుఁ బవననందనుఁడు, దరిఁజేర్చి మకరి నుద్ధతి వ్రచ్చి వెడలి
ఘోరి చూడఁగ నొప్పె ఘోరాంధకార,దారుణనిర్ముక్త తరుణార్కుపగిదిఁ
బ్రళయారుణోదగ్రబడబాగ్నిశిఖలు, కలయఁ బర్వినవాటి ఘనపయోరాశి
కరణి నమ్మకరిర క్తములతోఁ బెరసి, యరుణమై కడునొప్పె నప్పు డాసరసి
యంత నామకరియు నమరియై యమరి, యంతరిక్షమున నుద్యద్విమానమున
జలదంబులోపలఁ జపలతమాని, మెలఁచు తిరమ్మైన మెఱుపుచందమున

ధాన్యమాలి తనశాపప్రకారము హనుమంతునితోఁ దెల్పుట.

నిలిచి మారుతిచేత నిజశాపముక్తి, గలిగిన నలరి యక్కపిముఖ్యుఁ జూచి
యోకపికుంజర యోవానరేంద్ర, నీకతంబున శాపనిర్ముక్తి గంటి
నేనింకఁ బోయెద నింద్రలోకమున, కేను నీకొకవార్త యెఱిఁగింపవలయు
నని మున్ను హనుమంతు నక్కొలనికిని, బనిచిన కపటదాపసిఁ జూపి పలికె
వానరోత్తమ మునివరుఁడు గాఁ డరయ, వీని నమ్మకుమయ్య వీఁడు రాక్షసుఁడు
చలమున దానవేశ్వరునియోగమున, బలిష్ఠుఁడై నినుఁ జంపఁ బనిపూనివచ్చి
యేనిందులో నున్కి యెఱిఁగి నాచేతఁ, బూని నిక్కజంపింపఁ బుత్తెంచినాఁడు
వీఁడు వధ్యుఁడు నీకు వీని నమ్మకుము, వీఁడొప్పఁ డిటమీఁద వేవేగ చంపి
పొమ్ము నీవౌషధంబులకు ద్రోణాద్రి, కిమ్ముల నటఁబోవ నిదె నీకుఁ ద్రోవ
అన విని హనుమంతుఁ డాశ్చర్యమంది, వనితఁ గనుంగొని వలనొప్పఁ బలికె
మదిరాక్షి మును నీవె మకరివై యుండి, త్రిదశభామిని వైనతెఱఁగేమి యనిన
వినవయ్య పావని వీరాగ్రగణ్య, కనకాద్రిసమధైర్య గాంభీర్యధుర్య

ధాన్యమాలిని యనఁ దనరు గంధర్వ,కన్యక నాజన్మకథ యేర్పరింతు
నఖిలలోకాధ్యఁ డగుసదాశివుఁడు, సుఖగోష్ఠి రజతాద్రి శోభిల్లుచుండ
నరుదార నే పాడి యాడి మెప్పించి, హరుచేత నసమాన మగువిమానంబు
వడసి యిక్కొలనిలోపల జలక్రీడ, లెడపక కావింప నేగుదెంచుటయు
శాండిల్యఁ డనుముని చనుదెంచి నన్ను, నిండినప్రేమంబు నెలకొనఁ జూచి
యాలోనఁ దనలోన నానందకేలి, నాలోకనాలోలుఁ డయి తేలి తేలి
కొనకొని తూకొన్న కోర్కుల వ్రాలి, మనసిజజ్వరమున మానంబు డూలి
యేను బుణ్యాత్ముండ నేతపోధనుఁడ, నేనేడ యెలనాఁగ యేడ పొమ్మనక
యూని నన్దామించుచున్న కన్నెఱిఁగి, యేనేడ యీవేడ యీదృష్టి యేల
నీవు తపస్వివి నీవు పుణ్యఁడవు, భావింప నిది తపఃఫలవిఘ్నకారి
యనవిని మునినాథుఁ డతికాముఁ డగుచు, ననుఁ జూచి మదిలోని యాసవోవిడిచి
యిది తపఃఫలసార మెలనాఁగ నాకు, నిది పుణ్యఫలసార మెలనాఁగ నాకు
నిది మోక్షసాధన మెలనాఁగ నాకు, నిది స్వర్గసోపాన మెలనాఁగ నాకు
ననిన రజస్వల యటుఁగాన నేఁడు, మునినాథ ననుఁ మీరు ముట్టఁగారాదు
ఇమ్మూఁడుదివసంబు లేను మీయింట, నెమ్మితో వసియించి నిజశుద్ధిఁ బొంద
మఱి పొందుమని గంధమాదనంబునకు, నేఱి నేగి మునియింట నిష్ఠతోనుండ
దిక్కులు సాధించి తివిరి రావణుఁడు, నక్కొండ సబలుఁడై యారాత్రి విడిసి
యాపర్వతాగ్రంబునం దేనుబాడ, నాపాట విని దశాననుఁ డేగుదెంచి
తనసొంపు దనపెంపు దనప్రతాపంబు, తనవేరు నెఱిఁగించి తగ బుజ్జగించి
వనిత నీరూపయౌవనవిలాసములు, మునుమిడిఁ దుదముట్ట ముట్టవే నన్ను
ననినఁ బరాధీన నంటఁగారాదు, ననుముట్టఁ దగదన్న నరభోజనుండు
అరయ రజస్వల లయినకామినులు, పరభామినులు సువ్వె భామ నామెచ్చు
వనిత నఁ గాఱింపవలదు రమ్మనుచు, ననుఁ బ్రియోక్తులఁ దేల్చి నాతో రమింప
నతికాయుఁ డుదయించె నంత నాపుత్రు, నతివేగమున దానవాగ్రణి కిచ్చి
దివసత్రయంబును దీఱినపిదప, ప్రవిమలతను శుద్ధిఁ బాటించి యేను
మునిగణాధీశ్వరు ముందఱ నిలువఁ, గనుఁగొని నాయున్నగతి వివేకించి
నాయింటిలోనుండి ననుఁ డాఁగురించి, పోయి నీవెవ్వరిఁ బొందితి ప్రీతి
నింతి నీయౌవన మెవ్వండు గొనియె, చింతింప కిక్లేల చేసితివీవు
పరమపరిజ్ఞానభావమార్గమున, నరసి చూచిన నది యట్టిద కాదె
పరహిత మేయూరు పడఁతు లేయూరు, గురుశీల మేయూరు గొంతు లేయూరు
జలజాతు లేయూరు సత్య మేయూరు, కలకంరు లేయూరు కరుణ లేయూరు
వనజాతు లేయూరు వరుస లేయూరు, ననఁబోడు లేయూరు నచ్చి కేయూరు
తరలాతు లేయూరు తగవు లేయూరు, పరికింప సతులకు బాస లేయూరు
అని తీరఁ గోపించి యమ్మునీశ్వరుఁడు, ఘనశాపమిచ్చె సత్కరుణఁ బోవిడిచి
యీసరోవరమున నీవిలాసంబు, గాసిగాఁబడ నీవు గ్రాహివైయుండు

మెందేని బహుపుణ్యహీనుఁడై నిన్నుఁ, బొందినవాఁడును బుత్రమిత్రాది
బలములతోఁ గూడ భస్మమై పోవ, గలఁ డింక నీపాతకంబున ననుచు
శాప మిచ్చుటయును జలనంబు నొంది, యాపుణ్యనిధిమ్రోల హస్తము ల్మోగిచి
యోమునివల్లభ యోమునిచంద్ర, యోమునిసింహమ యోమునిశ్రేష్ఠ
యీశాపజలరాశి యేతెప్పఁ గడతు, నీశాపదావాగ్ని యేనీటనార్తుఁ
గరుణింపవే దయాకర నన్ను ననుచు, నురుభీతినొందుచు నున్న వీక్షించి
తిరమైనసుజ్ఞానదృష్టి నూహించి, పరమకృపామూర్తిపరుఁ డిట్టు పలికెఁ
గామిని యొకకొంతకాలంబు చనఁగ, రాముకార్యార్థమై రానున్నవాఁడు
హనుమంతుఁ డిచటికి నతనిచే నీకు, ఘనశాపనిర్ముక్తి గలుగుఁ బొమ్మనుచుఁ

మునివేషధారి యగుకాలనేమిని హనుమంతుఁడు చంపుట.

బోయె గంగాతీరమునకు నమ్మౌని, పోయె శాపం బేను బోయెద నింక
నని చెప్పి దీవించి యాసరోజాక్షి, యనిలజు వీడ్కొని యరిగె నద్దివికి
ఎడపనికడఁకతో నిటఁ గాలనేమి, కడ వచ్చి నిలిచె నాకపికులో త్తముఁడు
అప్పు డప్పాపాత్ముఁ డచలసమాధిఁ, దప్పక యున్నచందమునఁ గూర్చుండు
యెడలివ్రూరంబుతో నురమెల్ల విచ్చి, నడుము నిక్కించి మానన మొప్ప వంచి
కపటచింతావృత్తిఁ గన్నులు మూసి, జపమాలవరుసఁ బూసలు త్రోసి త్రోసి
నిక్కంపుజపముగా నెరి నోరు గదల, నక్కలి గనువిచ్చి హనుమంతుఁ జూచి
యీయున్న మడువేల యీతడవేల, పోయినపని యెంత ప్రొద్దెంతవోయె
నొలసి నీమదిలోన నుపదేశవాంఛ, గలదేని గురుపూజ గలదె యేమైన
మాకిప్పు డనవుడు మారుతాత్మజుఁడు, నీకిదె గురుపూజ నెమ్మిఁ గొమ్మనుచుఁ
బ్రధననిష్ఠురుఁడు నిర్భరవృత్తి వాని, బృథుబాహుమధ్యంబుఁ బిడికిటఁ బొడిచె
నాక్షణంబున దైత్యుఁ డారూప ముడిగి, పక్షియై రణవీథిఁ బావనిఁ గదిసెఁ
గదియుటయును బట్టి కడిమి దీపింప, జదిపి రెక్కలు రెండు సరి ద్రుంచివైచె
నారూప ముడిగి మాయాశక్తి మెఱసి, ధీరసింహాకృతిఁ దివిరి లంఘించి
గర్జించి దంష్ట్రాల గడునుగ్రుఁ డగుచు, తర్జించె రణవీథి దర్పించె నసుర
అలయక హనుమంతుఁ డక్కాలనేమి, తలబిట్టువగుల నుద్ధతశక్తిఁ బొడిచెఁ
బొడిచిన నారూపు పోనిచ్చి యసుర, కడఁగి సుగ్రీవుఁడై కదియ నేతెంచి
యిదియేమి మారుతి యిచట నేమిటికి, పదపద లక్ష్మణుప్రాణము ల్వచ్చెఁ
దొలఁగక నీవింక ద్రోణాద్రి కరుగ, వల దౌషధంబులు వలదింక మనకు
ననవుడు హనుమంతుఁ డతని సుగ్రీవుఁ, డని చూచి తెలిసి కాఁడని నిశ్చయించి
యలిగి రాక్షసుసుర మదరంట వ్రేయ, నిలఁ గూలి మూర్ఛిల్లి యింతలోఁ దెలిసి
యతఁడును శతశృంగుఁడై హనుమంతు, నతిశాతనఖముల నడరి నొప్పింప
ముష్టిఘట్టనముల మొగిఁ బాదహతుల, నష్టసత్త్వునిఁ జేసి నలిఁ జిక్కువఱచి
యమితసత్త్వక్రీడ నవలీలఁ దిగిచి, కమలనాళము ద్రెంచు గంధసింధురము
పరుసున రాక్షసప్రవరమస్తకము, తెరలిచి వెస నుల్చి త్రెంచిపోవయిచి

నలి నేచి వెస సింహనాదంబు చేసి, తొలఁగక మాపతి ద్రోణాద్రి కరిగె
నరిగి యాగిరిమీఁద నౌషధలతలు, పరికించి పరికించి పవననందనుఁడు
బహుదివ్యలతికావిభాభాసమాన, మహిమయు నిర్మలమణిగణప్రభల
దీపవృక్షంబుల దీప్తులు పర్వి, దీపించు నక్కొండ ద్రిమ్మరి చూచి
హితపుష్పగంధంబు లివె లత లనుచు, నతఁడు దగ్గరఁ బోవ నవి డాఁగిపోయె
నంత నాహనుమంతుఁ డంతరంగమునఁ, జింతించి సంతాపచిత్తుఁడై పలికె
నోపర్వతాధీశ యోయద్రిరాజ, యోపుణ్యవత్సల యోగిరిచంద్ర
యనఘుఁ డారఘురాముఁ డౌషధంబునకుఁ, బనిచిన వచ్చితిఁ బనిపూని యేను
నిన్నిలోకములకు హితవైనపనికి, నన్నేల వంచింప నగరాజ నీకు
నడరి నీయందున్న యౌషధలతలు, పొడసూపు వేవేగ పోఁబనిగలదు
ఇమ్ముల నిది లోకహితకార్య మగుట, మిమ్ము వేఁడెద మీరు మీప్రభావముల
దీపింపుఁడీ యౌషధీలతలార, చూపుఁడీ నాకు మీసురుచిరాకృతుల
నని పల్క వంచన నపుడు తేజములు, పొనుపడఁ దనకవి పొడసూపకున్న
నగకులోత్తమ నీకు నాధాక చూచి, తగుఁ బ్రియం బొనరింపఁ దగదూరకుండ
నని తన్నుఁ బ్రార్థించి యడుగుచునున్న, తనకు నౌషధము లాధరణీధరంబు
చూపకుండుటయును జూచి యెంతేని, కోపించి వానరకులవజ్రపాణి
యే నెంత వేఁడిన నేల నీమనసు, నానదు నాయెడ నగకులాధముఁడ
తలకొని ఱాలకు దయగల్గునన్నఁ, గలుగునే గుణశౌన్యకఠినమూర్తులకు
నని యుగ్రకోపాగ్ను లంగరోమములఁ, గనదగ్నికీలలై క్రమ్మఁ బైఁ గ్రమ్మి
రాముతో నెదిరిన రావణాచలము, నీమెయిం బెరుఁగుదు నిలనని మూఁడ్క
దశ యోజనముల విస్తారంబు పంచ,దశ యోజనోన్నతత్వంబును గలుగు
నాభీలతరశైల మవలీలఁ బెఱికె, భూభాగమగల నభోభాగమద్రువ
నపు డాగిరి సురేంద్ర ననుమతిఁ గాచు, తపనతేజులు త్ర యోదశకోటిసంఖ్య
గలచిత్రసేనాదిగంధర్వపతులు, బలశౌర్యములు మీఱఁ బావనిఁ జూచి
యిది దివ్యగణవాస మిది మేరుతుల్య, మిది జగజ్జీవనం బిది నీకు వలదు
నీకిది దక్కదు నెరి డించి పొమ్ము, పోకున్నఁ బ్రాణము ల్పోకుండ వనుఁడుఁ
గదనోగ్రసమవర్తి కపివీరుఁ డార్చి, వదలనికడిమిమై వారి నీఱీంచి
బంధురంబగు వాలపాశంబుతోడ, బంధించి బంధించి బలువిడిఁ ద్రిప్పి
యలుకమైఁ గొందఱు నబ్ధిలో వైచె, నలుకమైఁ గొందఱు నడరి కారించె
నలుకమైఁ గొందఱు నదరంట వ్రేసె, నలుకమైఁ గొందఱు నవనిపైఁ గూల్చె
నామహావీరనుద్ధతిశక్తిఁ జూచి, సోమింపరాదని స్రుక్కి కేల్ మొగిచి
యోకపికుంజర యోవానరేంద్ర, యీకొండఁ గొనిఁ యేగు మెలమితోనీవు
అని వాయునందసు నర్థి దీవించి, వినుతించి గంధర్వవీరులు దొలఁగ
నధికసత్వంబున ననిలనందనుఁడు, కుధరంబు బిట్టెత్తుకొని మింటి కెగసి
కడువేగమున భయంకరవృత్తి దోఁప, నడరి జితారాతియై సొంపుమిగిలి

భూచరఖేచరాద్భుతవేగుఁ డగుచు, నాచందమునఁ బోవ నామధ్యరాత్రి
బ్రాంమితమిత్రుఁడౌ భరతుస్వప్నమున, రామసౌమిత్రులు రణమధ్యమునను
దలనూనియలతోడ ధనువులు డస్సి, బలహీనులై క్రుస్సి పంకమధ్యమునఁ
బడి పలవించుచు పలురోదనంబు, లుడుగక కావించుచున్న బిట్టులికి
భరతుండు మేల్కాని పాపంపుఁగలకుఁ, బరితపించుచు వెలుపలికి నేతెంచి
కలలోన రామలక్ష్మణులున్న తెఱఁగు, తలపోసి తలపోసి తలఁకుచు నుండఁ
దొడఁగి దానికిఁదోడు దుర్నిమిత్తములు, కడఁగి పెక్కులు దోఁపగా భీతిబొంది
యిదియేమి పాపమో యిదియేమి తెఱఁగో, యిది యింక నిటమీఁద నేమిగాఁగలదో
రామసౌమిత్రు లరణ్యమధ్యమున, నేమైరో జానకి యేమైనయదియొ
యెన్నంగఁ బదునాలుగేండ్లును నిండు,చున్నవి వినఁగరా దొకవార్తయైన
నాసత్యధనులకు నాయుదారులకు, నాసదాచారుల కాకృతార్థులకు
నేకీడుఁ గాకుండ నేను నాసుకృత, పాకమిచ్చితి నని భరతుండు పలికి
భావించి వేదతత్పరుల భూసురుల, వేవేగ రావించి వేదోక్తయుక్తి
సకలదానంబుల సకలధర్మముల, సకలహోమంబుల శాంతి చేయించె
నాలోన హనుమంతుఁ డాకాశవీథి, నాలోలబాలార్కుఁడై వచ్చి వచ్చి
బలిసిననిష్ఠతో భరతేశుఁడున్న, పొలుచు నందిగ్రామపురిఁ జేర వచ్చి
ఘనజటాభారవల్కలములతోడ, ఘనఘనశ్యాముఁడై కమలాప్తకులుఁడు
భరతుఁ డారఘురాముభంగిఁ దోఁచుటయుఁ, గరమద్భుతం బంది కపిముఖ్యుఁ డపుడు
సౌమిత్రి మృతుఁడైన జానకి డించి, రాముఁ డొక్కరుఁ డిటు రాఁబోలు ననుచు
నడుగుదునో యంచు నడుగఁబొమ్మనుచుఁ, గడఁకతోఁ దలపోసి కపికులోత్తముఁడు
శరణాగతత్రాణచరితార్థచరితుఁ, డరయంగ రఘురాముఁ డభిరామబలుఁడు
తనసూనృతము డించి తమ్ముని డించి, తనకులసతి డించి తనవేరు డించి
యంగదసుగ్రీవ లాదిగాఁ బ్లవగ,పుంగవకోటులఁ బోరిలో డించి
మొనసి రావణుఁ బ్రాణములతోడ డించి, తనమేనుఁ దెచ్చునే దశరథాత్మజుఁడు
మానవసామాన్యమతిఁజేసి రాము, నేనేల చూచితి నీపిన్నచూపు
ఒలసి రామునిఁబోలు నొకతపోధనుఁడు, కలిగినాఁ డింతియ కాఁబోలు ననుచు
నతివేగమున లంక కరిగెడుత్రోవ, నతులబలోదాత్తుఁడై పోవఁబోవ
కలగన్నభరతుఁ డాకాశంబుఁ జూచి, యలఘుఁడై చనుచున్న హనుమంతుఁ గాంచి
యిటఁ దోఁప నేలొకో యీదుర్నిమిత్తంబు, నటు బ్రాణముల దీనిఁ బడనేయవలయు
నని శరచాపంబు లాటోపమొప్ప, ఘనసత్త్వుఁ డప్పుడు కైకొన్నఁ జూచి
కాకుత్స్థతిలకుఁ డాకర్ణించుకొలఁది, నాకాశముననుండి యశరీరి పలికె
నీతనిదిక్కున హితబుద్ధి నేయు, మీతఁడు మీబంధుఁ డీవల్లవలదు
అని యెప్పఁబలికిన యశరీరిపల్కు, విని శరచాపము ల్విడిచె నవ్విభుఁడు
అంత నాహనుమంతుఁ డంభోధిఁ గదియ, నంతలో రాక్షసు లక్ష్మణబలులు

హనుమంతునితో మాల్యవంతుడు పోరుట.

ఉదితబలోద్ధతు లుగ్రవిక్రములు, పదివేలు కోటులు బలిసి తన్గొలువ
రావణుపనుపున రణజయస్ఫురణ, వావిరి నమ్మాల్యవంతుఁడు వచ్చి
చదల నెదుర్పడి జలధిమధ్యమునఁ, బొదివి యాహనుమంతుఁ బోనీక కదిసె
గదిసిన నక్కొండ ఘనబాహుశక్తిఁ, బదిలంబుగాఁబట్టి పవననందనుఁడు
దాఁకిన భుజబలదర్పము ల్మెఱయ, వీఁకతో రాక్షసవీరులు గదిసి
పరశుతోమరచక్రపట్టసప్రాస, కరవాలశూలముద్గరభిండివాల
తతుల నొప్పింప నుద్ధతిఁ బెచ్చుపెరిఁగి, యతులవిక్రమదక్షుఁ డవి లెక్కగొనక
యమరు లచ్చెరువంద ననిలనందనుఁడు, సమరలీలాభీలచటులవాలమునఁ
గడఁకతో నొడిసి రాక్షసవీరవరుల, వడిఁ జుట్టి పట్టి యవ్వనధిలో వైచె
భంజించెఁ గొందఱఁ బదతాడనముల, భంజించెఁ గొందఱ భయదనాదముల
భంజించెఁ గొందఱఁ బటువాలహతుల, భంజించెఁ గొందఱఁ బరుషోగ్రదృష్టిఁ
గొందఱఁ బడఁదోసెఁ గొందఱ వ్రేసెఁ, గొందఱ గారించెఁ గొందఱ నొంచె
నంతరోషాయత్తుఁడై మాల్యవంతుఁ, డంతకాకారుఁడై హనుమంతుమీఁద
నెనయ బాణములు నూఁతెసె నేయుటయు, ఘనవాలమున వాని ఖండించివైచి
యలుక విల్లొడిసి యల్లటుఁ బాఱవైచి, బలుతోఁకచేఁ గాళ్లు బంధించి యెత్తి
వడి వైచుటయు మాల్యవంతుఁడు మగిడి, పొడిచె నమ్మారుతపుత్రు శూలమున
నది లెక్కసేయక యతఁ డున్నఁ జూచి, యదరులు చెదరంగ నత్యుగ్రశక్తి
నురము నొప్పించిన నురుశోణితంబు, లురువడిఁ దొరుఁగంగ నొక్కింత నిలిచి
యలుకతోఁ గపివీరుఁ డసమున వాని, తలఁదాచి చని వియత్తలమున నిలిచె
దలకొని దివిజులు తలలూచి పొగడఁ, దలఁ దన్నుటయు వానితల బిట్టువగిలి
యోలిఁ గీలాలంబు లొలుకలో దారి, యాలోన మూర్ఛిల్లి యంతలోఁ దెలిసి
కదనరంగమున నిగ్గదగదా నీకుఁ, దుదియించు గదయల్కతో బిట్టువైచి
తడయక యది తాఁకుతఱి మంట లెగయ, వడి జూచి యమ్మాల్యవంతుఁ డిట్లనియె
నోరి వానరుఁడ యీయుదధిలో నద్రి, బోరనఁ బడవైచి పో నిన్నుఁ జంప
మొనసేసి తొల్లి సముద్రమధ్యమున, వినతాత్మజుని నెక్కి విష్ణుండు వచ్చి
నాతోడ యుద్ధంబు నలఁజేసి చేసి, భీతుఁడై చాలక పెనువేదిపోఁడె
లోకంబు లెఱుఁగ ముల్లోక మీకడిమి, నీకోర్వరాదురా నెరి నాదుకీర్తి
అనవుడు హనుమంతుఁ డమ్మాల్యవంతుఁ, గనుఁగొని పలికె నుత్కటకోపుఁ డగుచు
యుద్ధమధ్యమున మహోద్ధతి మెఱసి, వృద్ధరాక్షస నీవు వెఱవక నన్నుఁ
గదియ నెవ్వఁడవని కదియు నవ్వీరు, మదభాషలకు నల్గి మాల్యవంతుండు
ఘనచంద్రహాసోగ్రఖడ్గ మంకించి, హనుమంతువఱ్ ముద్ధతిశక్తి వైవ
నది వజ్రనిభకాయుఁ డగునాంజనేయు, విదితంబుగాఁ దాఁకి వెసఁ బెల్లు విఱిగె
ననిలజుఁ డాఖడ్గహతి కింత నొచ్చి, కినిసి నిశాచరుఁ గిట్టి బిట్టలిగి
భూతభయంకరాద్భుతవాలమెత్తి, యాతనిమెడఁ జుట్టి యలుకతోఁ బట్టి

చెలఁగి యాకసమునఁ జిరజిరఁ ద్రిప్పి, యలఘువిక్రమశీలుఁ డబ్ధిలో వైచె
వైచినఁ బడి మాల్యవంతుఁ డాత్రోవ, వేచని పాతాళవివరంబుఁ జొచ్చె
హతశేషరాక్షసు లన్నిదిక్కులకు, ధృతి దూలి పఱచిరి దివిజు లుప్పొంగఁ
గొండంత గెలుపుతోఁ గొండతో నమర, మండలి వొగడ ధీమండనుం డరిగెఁ
బర్వతదీక్షిఁ బ్రభాతవిభ్రాంతి, పర్విన భీతిమై భానువంశజుఁడు

శ్రీరాముఁడు లక్ష్మణునిఁ జూచి పరితపించుట.

సమరలక్ష్మీరతిశ్రమ నిద్రనొందు, క్రమమునఁ జెలువుఁడై రణశయ్యనున్న
తమ్మునిఁ గనుఁగొని తమ్ముఁడా నీవు, తమ్ముఁడవై యుండు టది నోచనైతి (?)
నిలజీవులకునెల్ల నిదె వేగెఁ బ్రొద్దు, పొలుపేది నాపాలి ప్రొద్దస్తమించె
నటిమునీ నడవిలో నాలిఁ గోల్పడితి, నెఱయ నేఁడాజిలో నిన్నుఁ గోల్పడితి
నెడ నాకు నైన దుష్కృతపంకంబు, గడప దిక్కెవ్వరు గలరు సౌమిత్రి
మానపయోనిధి మహనీయశీలు, నానోచికన్నయున్న తపుణ్యశీలు
నేను నీచే నమ్మి యిచ్చిన నకట, కానలోఁ గొనిపోయి కడతేర్చితన్న
యే నేమిసేయుదు నిటమీఁద నన్న, నేను సుమిత్రతో నేమననేర్తుఁ
దుదిఁ బోయి భరతశత్రుఘ్నులు నన్ను, గదియ నే తెంచి లక్ష్మణుఁ డేడియనిన
నేమని చెప్పుదు నేమని పోదు, నాముఖంబునను వైన్యము దోఁప నింకఁ
దేనికిఁ జింతింప దేనికి వగవ, నేను జింతించెద నిను దీర్ఘచింత
బలుఁడైనరావణు గతులకుఁ జేసి, తలపోసి మదిరోసి తమయన్నఁ బాసి
హితభృత్యవృత్తిమై నీవిభీషణుఁడు, చతురుఁడై నను వచ్చి శరణంబుఁ జొచ్చెఁ
జొచ్చినఁ బ్రీతి రక్షోరాజ్యమెల్ల, నిచ్చితి నీకని యేనూఁడించి
పట్టంబు గట్టితిఁ బ్రబలినతోఁ బలికి, నెట్టన నిండింప నేర్పు లేదయ్యె
నిది వేగుచునువచ్చె నింక లక్ష్మణుఁడు, బ్రదుకఁడు నాకింకఁ బ్రాణములవలదు
దురితదూరుని వీనితోడిదె లోక, మరసిచూచిన నింక నడలోర్వరాదు
శరణన్న వారి నెచ్చట వీడరాదు, ధరణిపై క్షత్రియధర్మ మూహింపఁ
దారలోనైననుఁ దమ్మాశ్రయించు, వారల రక్షింపవలయు రాజులకు
నీవిభీషణుఁ గొంచు నీవేగి పుణ్య,భావుఁడైనట్టి మాభరతుతోడుతను
నరయ నిక్కడికార్య మంతయుఁ జెప్పి, పరఁగంగ లంకకుఁ బ్రతిగాఁగ సతని
వెలయు నయోధ్యకు విజయలగ్నమున, ఫలసిద్ధి సొంపారఁ బట్టంబుగట్టు
మని యేను జెప్పితి నని యెప్పుఁ జెప్పి, యెనరంగ నందుండి యుచితంబుతోడ
వానరేశ్వర నీవు వాలినందనుఁడు, సేనలఁ గొంచుఁ గిష్కింధకు నరుగు
మన వైన్యపాటుతో నాడ భీతిల్లి, వనచరాధీశుండు వలనొప్పఁ గదిసి
పరికించిచూడఁ బ్రభాతంబు గాదు, నరనాథ యిప్పుడు నాలవజాము
సొచ్చె నింతియ వాయుసూనుండు నిపుడ, వచ్చు సంతాపింప వలదంచుఁ దేర్చె
దేర్చిన నంతయుఁ దేలక మఱియుఁ, బేర్చినశోకాగ్ని పెల్లున మిగులఁ
బొరిబొరి భూమిపైఁ బొరలుచు వగలఁ, బురపురఁ బొక్కుచు భూవరతనయుఁ

డన్న నేజనకాజ్ఞ నడవి కేతేర, నిన్నుఁ బొమ్మనకున్న నీవు నావెనుకఁ
జనుదెంచి యిడుములఁ జాలంగఁబడగఁ, గనుఁగొని మనమునఁ గరము శోకింతు
నేఁడు నీవొరుచేత నీలాప్య మూలి, పోడిమిచెడి యిట్లు భూమిపైనుండ
నేనెట్లు బ్రదుకుదు నేమని వగతు, నేనిను డించి యెల్లేగుదుఁ బురికి
సీత నాకేటికి జీవమేమిటికి, నీతరుచరనేన లేటికి నాకు
నోతండ్రి నాకింక సుర్వి యేమిటికి, నాతండ్రిక్రియ నన్ను నరయుచుండుదువు
నావిధి నిను నేఁడు నాకారిచేత, నీవిధి నిటునేసె నీరసంబెత్తి
దేశదేశముల సతీజనంబులను, దేశదేశములందుఁ దివిరి బాంధవుల
నరసి కానఁగవచ్చు నట్టిదేశములఁ, బరఁగు తమ్ముని నెందుఁ బడయంగవచ్చు
నని యచేతనుఁ డగు ననుజుపై వ్రాలి, కనుఁగొని దిక్కులు కడుధైర్య మెడలి
యన్నరో నీవు నన్నన్నని పిలువ, నెన్నఁడు వినఁగల్గు నింక వీనులకు
సీత సుమిత్రగాఁ జిత్తానఁ జూతు, చూతు నన్దశరథక్షోణీశుఁగాఁగ
నెప్పుడు నాతోడ నెడఁబాయకుండు, దిప్పుడు పాడియే యెడఁబాయ నన్ను
నాతతవిషమఘోరారణ్యభూమిఁ, బ్రీతి నయోధ్యగాఁ బెంపునఁ జూతు
పూపుపాన్పున నిద్రఁబొందించుమేను, నీవెట్లు నేర్చితి నేఁడు తానేలఁ
బడియు నిద్రించెదు పరిణామమెందు, పుడమిపై నందన పొలుపొంద నీవు
పదునాలుగేండ్లును బాయక నిద్ర, పదిలంబుగా డించి పన్నుగానడవి
నరసి నన్వేషించి యాజిమధ్యమున, నరులఁ జంపకపోవ నగునయ్య నిద్ర
నిద్ర నీవిట్లున్న నిజమయ్య దీర్ఘ,నిద్ర మాయన్నకు నృపనందనుండ
మాయన్న కెప్పుడు మిక్కిలి భక్తి, నేయుదు నేఁడేల చింతింప వకట!
యున్నవంతయుఁ దూలి యుండెడుమాట, లిన్నియుఁ బొంపిరి నేల పల్కెదవు
రావణకోటుల రణములోఁ గూల్చి, భూవిభునందను భూసుతఁ గూర్తు
నని నాకు వీనుల కసలారఁ బలుక, కునికికిఁ గతమేమి యోపుణ్యమూర్తి
యిప్పుడు మేల్కొని యేల శ్రీరామ, తప్పఁబల్కఁగ నీకుఁ దగునయ్య యనుచు
నొప్పెడిమాటల నూఱడఁ జేర్చి, తప్పక కనువిచ్చి తనుఁ జూడు మనుచు
రాసుతు కెంగేలు రమణమైఁ దిగిచి, భాసురంబుగ గండపాలికఁ జేర్చి
ననుఁ దేర్పవే యని నరనాథుఁ డపుడు, మనమునఁ దెలియక మహిమీఁదఁబడియెఁ
బడియున్నయారఘుపతి మూర్ఛదెలిపి, యడలు వారించి రాయగచరాధిపులు
అంత ప్రభామండలాభీలుఁ డగుచు, నంతలో హనుమంతుఁ డరుగుదెంచుటయుఁ
దేజంబుపెంపున దృష్టింపరాక, తేజోదివాకరదీప్తుడైయున్నఁ
గపులెల్లఁ గలఁగి యుత్కటభీతి బొంది, విపులతరభ్రాంతి వివశులైతూల
నాలోనఁ గమలాప్తుఁడని చూచి విభుఁడు, కాలకాలోదగ్రగతి నిండనుండఁ
గపికులాధీశులఁ గలయ నీక్షించి, కపులార సూర్యునిఁ గంటిరే మింటఁ
జేకొని బహుపుణ్యశీలంబులందు, మాకులంబునకెల్ల మహిఁ గర్తయైన
యంధకారారాతి యకట! యీపద్మబంధుండు నేఁడు నాఘగవానిఁ గూడి

యుదయించుచున్న వాఁ డుగ్రత మిగిలి, యిదె వడి సౌమిత్రి యిబ్బంగిసుండ
నీసూర్యమండలం బిలమీఁదఁ గూల, నేనెద నంచు సహీనసాహసుఁడు
బ్రహ్మాండకోటుల భంగింపఁ బొంగి, బ్రహ్మాదు లదరంగఁ బ్రళయకాలంబు
నాఁడుగ్రవృత్తిఁ బినాకి విల్లంది, వాఁడిమి మెఱయ నవ్వడువు దీపింప
నాపూర్ణభుజనై పుణాటోపకోపుఁడాపినాకియుఁ దానె యగుటఁ దెల్పుచును
విల్లంది భుజబలవిస్ఫూర్తి మెఱయఁ, బెల్లు కోపించి సంభృతవేగుఁ డగుచుఁ
జటులరౌద్రాస్త్రంబు సంధింపఁ దివురు, పటువృత్తిఁ గనుఁగొని భయవృత్తిఁ గలఁగి
యసమానసత్త్వతో నతికోపుతోడ, వసుధేశుతో జాంబవంతుఁ డిట్లనియె
నగణితశక్తివై నలుక దీపింప, జగతీశ నీవిటు శరము పుచ్చుటయు
ధృతిదూలి నలుకడ దేవగంధర్వ, పతులెల్ల భీతులై పాఱుచున్నారు
ఇదియేమి రఘురామ యిచ్చలో నీవు, పదిలుండవై చూచి భావింపలేవు
వెలుఁగొందు బహుదీపవృక్షదీధితులు, దొలుకాడు సుజ్జ్వలద్రోణాచలంబు
గొనివచ్చుచున్నాఁడు గురుసత్త్వధనుఁడు, అనిలసూనుఁడుగాని యర్కుండుగాఁడు
భానుప్రభాభాసిపవనసూనునకు, భూనాథ యెదురుగాఁ బుచ్చు వానరుల
ననుటయు శ్రీరామునానతి వడసి, హనుమంతునకు నెదు రరిగిరి కపులు
ఆకాశమునసుండి హనుమంతుఁ డంత, నా కొండఁ గొనివచ్చి యవనిపై నునిచి
జననాథుఁ డగు రామచంద్రున కర్థి, వినతుఁడై కరములు వెరవొప్ప మొగిచి
యుర్వీశ నేఁబోయి యొగి నౌషధములు, పర్వతంబునఁ జెక్కుభంగుల వెదకి
పనివడిఁ గానక పర్వతంబెల్లఁ, గొని యేను వచ్చితిఁ గువలయాధీశ
యడరి మీయానతి నటఁ బోవునపుడు, నెడపనికడఁకతో నిటవచ్చునపుడు
కడఁగి విఘ్నము లనేకములయ్యె నడుమఁ, దడయుట దప్పుగాఁ దలపోయవలదు
ననవుడు రాముఁ డా హనుమంతుఁ జూచి, ఘనతరసంతోషకలితుఁడై పలికె
నీకేటి తప్పులు నీచేత బ్రదికెఁ, గాకుత్స్థకులలీల గౌరవోన్నతులు
సురుచిరశక్తివై సురలకునైన, నరుఁడైనపనిచేసి తని ప్రీతినొందె

సుషేణుఁడు సంజీవకరణిచే లక్ష్మణుని మూర్ఛఁదేర్చుట.

నాసమయంబున నర్కతనూజుఁ, డాసుషేణునిఁ జూచి యర్థిదీపింప
నిక్కొండఁ దడయక యీవు వానరులు, నెక్కి మహౌషధు లెర్వడఁ దెచ్చి
భావించి లక్ష్మణుప్రాణములర్వడయు, వేవేగ యనవుడు విని సుషేణుండు
పనిపూని యప్పుడు బరవసంబొప్ప, వనచరసహితుఁడై వడిఁ గొండనెక్కి
యమరేంద్రు డిక్కడ నర్థితోఁ దొల్లి, యమృతపానముచేసె నమరులు దాను
నిచట విష్ణుఁడు జగద్ధితబుద్ధివూని, యచలుఁడై తనచక్రహతిఁ ద్రుంచివయిచె
సురరాహుమస్తకంబుగ్రుడై యనుచుఁ, దరుచరవరులకుఁ దవిలి చూపుచును
నొగిఁ బర్వతమున మహౌషధుల్దెచ్చి, తగఁ బ్రయోగింప నంతన దానిశక్తిఁ
దగిలి నాటినబాణతతులోలి వెడలి, మగిడెఁ బ్రాణములు లక్ష్మణకుమారునకు
నప్పుడు వానరు లందఱు గొలువ, నెప్పటిపేర్మితో నినవంశకుడకుఁ

జనుదేరఁ గౌఁగిట సౌమిత్రిఁ జేర్చి, కనుగవ హర్షాశ్రుకణములు దొరుగ
నాసమీరజుఁ జూచి యతులపుణ్యాత్మ, యీసుమిత్రామిత్రు నిచ్చితి నాకుఁ
గాకుత్స్థకులమిత్రుఁ గమనీయగాత్రు, నీకతంబునఁ గంటి నేఁడు లక్ష్మణుని
బడిన నాతమ్ముని ప్రాణంబు లెత్తి, పడసితి నిపుడు నాప్రాణముల్మగుడఁ
బ్రాణంబులన నాకుఁ బరికింప నితఁడ, ప్రాణబంధుండవు పరమబంధుఁడవు
తరుచరోత్తమ నీవ తలఁప నీచేయు, పురుషార్ధ మెరులకుఁ బోలునే చేయ
నుపకారమునకుఁ బ్రత్యుపకార మెలమిఁ, గపివీర సేయుట గడునుత్తమంబు
నీకుఁ బ్రత్యుపకృతి నేనేరఁ జేయ, నీకాపదలు లేవు నిఖిలలోకముల
నని పల్కి రఘురాముఁ డంత సుషేణుఁ, గనుఁగొని కొనియాడి కౌఁగిటఁ జేర్చ
ముదితాత్ముఁ డగుచు నిమ్ముల సుషేణుండు, నుదధి పొంగినక్రియ నుబ్బి యారాము
ననుమతి రణములో నటఁ బడియున్న, వనచరోత్తముల జీవములెల్లఁ బడసె
నంత వానరవీరు లంతరంగమున, సంతోష మెసఁగ నాశైలంబుఁ గదిసి
సకలరత్నోజ్జ్వలసానుశృంగముల, నకలంకరుచిఁ బొల్చు నాసొంపు చూచి
యవనీశుననుమతి నగ్గిరి యెక్కి, వివిధస్థలంబుల వేడుకఁ దిరిగి
పరిపక్వఫలములఁ బరితృప్తినొంది, పెరయ తేనియలాని పెన్నీరుఁ గ్రోలి
యవరోహణముచేసి రందఱు నంతఁ, బవనునందను జూచి పలికె భూవిభుఁడు
ఎప్పటిచోటనే యేర్పడఁ జెట్టు, మిప్పర్వతాధిపు నింక నీవనుచు
రాముఁడు వంప సంరంభంబు మెఱసి, యామహాశైలంబు ననిలనందనుఁడు
అలఘుఁడై కొనిపోవ నాకాశవీథి, జలధిమధ్యమున రాక్షసులు వీక్షించి
పఱచి యిత్తెఱఁగెల్లఁ బరువడిఁ దనకు, నెఱిఁగింప నేర్పడ నెఱిఁగి కోపించి
లంకాధిపతి జయాలంకారధనుల, శంకుకర్ణస్థూలజంఘులతోడ
నట మహానాదుని నట మహావక్త్రు, నటఁ జతుర్వక్త్రుని నట మేఘజిత్తు
నట హస్తికర్ణు మహావీరజైత్రు, గటువాక్యశాలి నుల్కాముఖుఁ జూచి
యలవుసొంపును మీర లడ్డంబు దాకి, బలియు నాహనుమంతుఁ బట్టితెండొండె
కొనిపోవుచున్న యక్కుధరంబు వుచ్చి, వనధిలోపలఁ బాఱవైచి రండొండె
ఈరెండుతెఱఁగుల నేర్పడ నొకటి, ధీరులై చేసి యే తెంచినఁ జాలు
నచ్చుగా నతనికి నర్మిలి వెలయ, నిచ్చుమై సగరాజ్య మిచ్చెద నిపుడె
నావిని విపులసేనాసహస్రములతో వారు వెడలి బంధురస్థ్వధనులు
దానవామరవేషధారులై కినుక, లూని రణోద్గ్రులగ్రవిక్రములు
తూరికాసితోమర శూలకోదండ, పరశుకుంతాదిక ప్రముఖశస్త్రములు
ధరియించి మించినదర్పంబు మెఱసి, యురుతరహుంకారహుంకారు లగుచుఁ
గనుకని గర్జించు కాలమేఘములు, పొనుపడ సూర్యునిఁ బొదువుచందమునఁ
బొదివి యాహనుమంతుఁ బోనీక కదిసి, మదమునఁ జెర్చి దుర్మదులు బిట్టార్చి
దేవాసురుల మమ్ము దృష్టింపకోరి, పోవుచున్నాఁడవు భుజశక్తి మెఱసి
యీకొండఁగొనుచు నీవెటఁబోయె దనిన, నాకపివీరుఁ డాయసురులఁ జూచి

విలయకాలాచలవిస్ఫులింగములు, తొలుకొడ నుజ్జ్వలదుర్జయాభీల
కాలచక్రాకారఘనవజ్రకరిన, వాలచక్రము ద్రిప్పి వడి వ్రేయఁ దొడఁగె
నప్పు డారాక్షసు లడరి యెంతయును, నొప్పింప వాయుజుం డుగ్రకోపమున
భంజించెఁ గొందఱఁ బటువాలనిహతి, భంజించెఁ గొందఱఁ బరుషోగ్రదృష్టి
భంజించెఁ గొందఱఁ బదతాడనముల, భంజించెఁ గొందఱ భయదనాదముల
ఘనసత్త్వుఁ డిబ్బంగిఁ గయ్యంబుచేసి, వినుతవిక్రమమున విజయంబునొంది
తోయజాప్తుఁడు పేర్చి తుప్పలదూలఁ, దోయదంబులదూలఁ దోచుచందమున
రాక్షసవీరుల రణవీథి నొడిచి, నక్షత్రవీథి నున్నతశక్తి మెఱసి
పోవుచునుండ నాభుజశక్తిఁ జూచి, దేవగంధర్వులు దివినుండి యపుడు
పారిఁబొరి నతనిపైఁ బూవులవాన, గురియుచు నుండిరి కొలఁది కగ్గలము
అంతలో హనుమంతుఁ డతివేగుఁ డగుచు, నంతరిక్షంబున నరిగి యక్కొండ
మున్నున్న చోటనే ముదమొప్పఁ బెట్టి, క్రన్నన రఘురాముకడకు నేతెంచి
వినతుఁడై తనపోవువృత్తాంతమెల్ల, వినిపింప శ్రీరామవిభుఁడు హర్షించి
యావాయునందను నాలింగనంబు, కావింపఁ గనుఁగొని కపివీరులెల్ల
వచ్చి లంకాపురవరమెల్లఁ గలఁగఁ, జెచ్చెఱఁ జేసిరి సింహనాదములు
భూరిదశాననపుణ్యచిహ్నములు, బోరన నొండెడ పోవుచందమునఁ
దఱిగి యాకసమునఁ దార లొండొండ, యరిగిపోవఁగఁ జొచ్చె నటవేగెఁ బ్రొద్దు
దారుణస్ఫుటరోషదైత్యగర్వాంధ,కారంబుతో నంధకారంబు విఱిసె
నలి మీఱి వానరాననసరోజాత,ములతో సరోజాతములు వికసించెఁ
దమపెంపు లొగిఁదూలి దనుజాస్యకైర,వములతో భువిఁ గైరవమ్ములు మొగిడె
భానువంశాధీశబహుశక్తిప్రతాప, భానుతో భానుండు ప్రాగ్దిశఁ దోఁచె
జానకీవిభుఁ డంత సౌమిత్రిఁ జూచి, యూనినసంతోష ముల్లంబు నిండ
సదమలగుణముల సౌమిత్రి నీవు, బ్రదికితి నాపాలి భాగ్య మెట్టిదియొ
యనియని కొనియాడునతులవాక్యములు, విని లక్ష్మణుఁడు రామవిభునకు మ్రొక్కి-
దేవ ప్రాకృతుఁడవె దేవ దీనుఁడవె, దేవ నిర్ధనుఁడవే దేవ యల్పుఁడవె
యీభంగి యానతి యీనేల నాకుఁ, బ్రాభవంబునఁ బెంపుఁ బరికింప మఱచి
మును దండకారణ్యమునులకు సాధు,జనుల కిచ్చిన ప్రతిజ్ఞలు విచారించి
యిచ్చలో మిము నమ్మి యీవిభీషణుఁడు, వచ్చిన నిచ్చినవరమునుఁ జింతించి
యినుఁడస్తశిఖరికి నేగకమున్న, యని రావణునిఁ జంపు మఖిలలోకేశ
యనవుడు రఘురాముఁ డొండగాక యనుచు, ఘనరణవిక్రమక్రమశక్తి మెఱసె
నంత నావృత్తాంత మంతయు నెఱిఁగి, యెంతయుఁ జింతించి యిచ్చలోఁ గలఁగి

శుక్రునియొద్ద రావణుఁడు శోకించుట.

విక్రమక్రమశక్తి విడిచి రావణుఁడు, శుక్రుసన్నిధి కేగి స్రుక్కుచు మ్రొక్కి-
చుట్టాల భృత్యుల సుతుల సోదరుల, నెట్టన రఘురామునిశితబాణాగ్ని
దరికొని కాల్చి దగ్ధులఁ జేసి, పరఁగి యమోఘమై ప్రళయాగ్నిపగిది

నున్న ది మాన్పరా కున్న ది పోర, నన్నియుఁ దెగటారె నన్నియుఁ బొలిసె
నేను బ్రాణములతో నెబ్బంగి నిలుతు, నానతి యిమ్మన్న నాశుక్రుఁ డనియె
నలఘుసంగరవీథి నరుల సాధింపఁ, గలయుపాయంబును గలుగ నేమిటికి
నేవిఘ్నములు లేక యీవు హోమంబు, గావించుపుణ్యంబె కలిగినఁ జాలు
భీమసంగ్రామగంభీరంబు లగుచు, హోమాగ్ని ముఖమునఁనుండి నీకడకు
నురురథాశ్వంబులు నుగ్రఖడ్గములు, శరచాపకవచము ల్సనుదెంచుఁ గడఁగి
యవి సాధనములుగా నరుల సాధింపు, మవి నీకు జయసిద్ధు లనుచు నాతనికి
హోమమంత్రము లెల్ల నుపదేశ మిచ్చి, హోమమంత్రము లెల్ల నొగి నేర్పరించి
పొమ్మన వీడ్కొనిపోయి రావణుఁడు, క్రమ్మిన కడకతోఁ గడునుగ్రుఁ డగుచుఁ
బురవప్రరక్షకు భూరిసత్త్వులను, బరికించి చతురంగబలములఁ బనిచి
యవధానతత్పరుఁడయి నేగ లంక, గవకులు వేయించి కలయ శోధించి
యంత విద్యుజ్జిహ్వుఁ డనుమహావీరు, నంతకాకారు నుద్ధతశూరుఁ బిలిచి
నీవు నీబలమును నెలకొని నగరు, గావు మేమఱకుము గదలకు మనుచుఁ
బనిచి యనుష్ఠానపదశుద్ధిఁబొంది, చని మృత్యువక్త్రంబుఁ జనఁ జొచ్చుభంగిఁ
బాతాలగుహఁ జొచ్చి పడిలుఁడై నిలిచి, యాతతహోమకృత్యములకుఁదగిన
రక్తవస్త్రంబులు రక్తమాల్యములు, రక్తచందన మనురక్తుఁడై తాల్చి

రావణుఁడు పాతాళహోమము చేయుట.

బంధురదక్షిణప్రవణవేదికకు, గంధపుష్పాక్షత ల్గరమొప్ప నిచ్చి
యామహావేదిలో నగ్నిసంధించి, హోమమంత్రము లెల్ల నొగి నుచ్చరించి
వెరవొప్ప నాహోమవేదిలోఁ గలయఁ, బరికించి నిశితాస్త్రపరిధులఁ జేర్చి
శ్రీవృక్షభల్లాతసితముఖ్యసమిధ, లావృత్తిఁ గైకొని యంతట మఱియు
నోజసర్షపములు నొనర దూర్వములు, లాజలు దగ గుగ్గిలంబును నగరు
నేయిదేనియగల్లు నెత్తురుఁ బెరుఁగు, పాయసాన్నములు దర్భలు ప్రవాళములు
తగరులు మీలు గ్రద్ధలు వరాహములు, నొగి నివిమొదలుగా నొప్ప వ్రేల్చుచును
నాశ్చర్యకరమైన యామహావేది, నిశ్చలతాధ్యాననిరతుఁ డై యుండె
బలువిడి రావణుపాపంబు లెల్లఁ, గలసి పెల్లెగసిన కైవడిఁ దోఁప
నామహాగుహనుండి యప్పు డత్యుగ్ర,ధూమంబు లురుతరస్తోమంబు లగుచుఁ
బటుతరనిర్ఘాతపవనసంఘాత, చటులంబులై నిక్కి చదలఁ బర్వుటయు
వెఱచిరి దివిజులు వెఱచిరి మునులు, వెఱచిరి దిక్పతు ల్వెఱచిరి కపులు
ఆమహాధూమంబు లప్పుడు చూచి, రాముతో ననియె నారావణానుజుఁడు
నెలకొని యనిమోన నినుఁ దాఁకి గెలువ, నిలువనేరకపోయి నేఁడు రావణుఁడు
కపటకర్తారంభగంభీరవృత్తి, విపులజయార్థియై వేల్చుచున్నాఁడు
అవధరించితె పొగ లాకసంబునను, నివ్వడుచు నున్నవి నిండి యొండొండ
హోమంబు నిర్విఘ్ను మోగమై యితఁడు, కామించు తెఱఁగునఁ గడముట్టెనేని
రావణు లోకవిద్రావణుఁ బోర, దేవాసురులకైనఁ దెగి గెల్వరాదు

కావున హోమవిఘ్నము సేయవలయు, వేవేగ వానరవీరులఁ బనుపు
మనవుడు రఘురాముఁ డగుఁగాక యనుచుఁ, బనిచినఁ బనిపూని బలువిడిఁ గడఁగి
గురుబలాఢ్యుఁడు గవాక్షుండు దారుండు, శరభుఁడు క్రథనుండు శతబలి నలుఁడు
గవయుండు మైందుండు గంధమాదనుఁడు, పవమానసూనుండు పనసుఁ డంగదుఁడు
కుముదుండు జ్యోతిర్ముఖుండు గోముఖుఁడు, క్రమమున వీరాదిగాఁ గపివరులు
పదికోటు లుద్భటప్రథనవిక్రములు, విదితప్రతాపులు విదితకోపనులు
గగనమార్గమున లంకకు నేగుదెంచి, యగణితాహంకారులై పెచ్చువెరిఁగి
పదఘట్టనముల భూభాగంబు వగులఁ, జదియ దిగ్గజములు చదలు గ్రక్కదల
నార్పులు బొబ్బలు నడరఁ బెల్లడరి, దర్పితనిర్భరోత్సాహసాహసులు
నలిఁ దాఁకి రావణునగరు గాపున్న, బలియుర బెక్కండ్రఁ బట్టి చెండాడి
క్రూరులై దొవారికులఁ జంపివైచి, భూరిసత్త్వములఁ దల్పులు వీడఁదన్ని
నగరుద్దవిడిఁ జొచ్చి నగరూపధరులు, నగచరుల్వడి దశాననుఁ రోయువారు
పృథురథశాలలు బిరుదులై చొచ్చి, రథములు విఱుగ నుర్వర వ్రేయువారు
గజశాల లొగిఁ జొచ్చి ఘనముష్టిహతుల, గజమస్తకములు వ్రక్కలు సేయువారు
హయశాలలొగిఁ జొచ్చి హయశరీరములు, భయదోగ్రనఖములఁ బడ వ్రచ్చువారు
సొరిది శాలలనున్న జోడుపక్కెరలు, దరమిడి చింతించి దరలాడువారు
చలమొప్ప నాయుధశాలలఁ జొచ్చి, కలయశస్త్రాస్త్రము ల్గుండించువారు
నేచి బండారపు టిండ్లలోఁ జొచ్చి, రాచి యర్థములు చూరలు చల్లువారు
నురుసత్త్వగతులొప్ప నుప్పొంగి పొంగి, వరుస తోరణములు వడిఁ ద్రెంచువారు
పసిఁడిగోపురములు భర్మహర్మ్యములు, వెసనుర్విఁ గూల బల్విడిఁ ద్రోయువారు
కట్టల్కఁ గొందఱు గని జగద్రోహిఁ, బట్టి తెండని పట్టి బాధించువారు
వనితలు సుతులును వాపోవఁగన్న, జనను లడ్డము చొర సదనము ల్వొచ్చి
నెట్టన వెలి కీడ్చి నెరసి రాక్షసుల, దట్టించి తలలూడఁ దాటించువారు
వాసిమై నిబ్బంగి వనచరుల్గూడి, గాసివెట్టుచు నుండఁగా భీతినొంది
దీనదశాతురస్థితి దూలపోయి, దానవువీడు విధ్వస్తమై కలఁగి
హరిపీడితానేకహయహేషితములు, కరిఘటానేకభీకరబృంహితములు
వృద్ధబాలాంగనావిలవిలాపములు, సిద్ధవిక్రమకపిసింహనాదములు
గలయఁ బర్విన లంక కల్పాంతకాల,ములఁ బేర్చు బడబాగ్ని ముఖముఖార్చులకు
నులికి వాపోవు పయోధిచందమునఁ, గొలఁది కగ్గలముగా ఘూర్ణిల్లఁ దొడఁగె
అంత సూర్యోదయమయ్యె రావణుని, నంతటఁ బరికించి యతఁ డున్న చోటు
కానక చింతించి కడుసంభ్రమమున, వానరు ల్వెదకంగ వారి నీక్షించి
చతురతమై విభీషణుపత్ని సరమ,పతిహితం బాత్మలో భావించి యపుడు
వడి నంగదునకు రావణుఁ డున్న చోటు, చిడిముడిపాటుతోఁ జేసన్నఁ జూపె
చూపుటయును జూచి సుభటదంభోళి, కోపించి యప్పు డగ్గురుహవాతనున్న
శిల నుగ్గుఁగాఁ దన్ని చెచ్చెఱఁ జొచ్చి, యలఘువిక్రమకళాయతకేలి వ్రాలి

పొలుపొంద భుజసత్వమునఁ బెంపుమీఱి, కలఁగి రాక్షసులెల్లఁ గడుభీతిఁబొందఁ
జని హోమనియతి నిశ్చలుఁడైనవాని, ఘనమంత్రతంత్రసంగతుఁడైనవాని
రావణు నమరవిద్రావణుఁ గాంచి, రావణుఁ బొడగంటి రండు రండనిన
ననిలతనూభవుం డాదిగాఁగలుగు, వనచరాధిపులెల్ల వడిఁ గూడముట్టి
యగ్గుహారక్షకు లైనరాక్షసుల, నుగ్గునూచముచేసి నుతశక్తి మెఱసి
యొక్కఁడై వేల్చుచు నున్నయద్దనుజు, నక్కడఁ బొడగని యలుక దీపింపఁ
దోడెవ్వరును లేక తుది నొంటిపడియెఁ, దోడు వేలుతమని దొరకొని కపులు
సారిది నవ్వేదికచుట్టులనున్న, పరిధులు సమిధలు బహుకలశములు
హస్తికుక్కుటజంబుకాశ్వోష్ట్రశునక, మస్తకంబులు ఘృతమధుపాత్రతతులు
నటేముఱే బుచ్చి హోమాగ్నిలో వైచి, నెఱసి యార్చిరి దైత్యనికరంబు పెదర
నప్పుడు పాపాత్మునంగంబులందు, నిప్పులు సల్లుచు నెఱమంట లొదవ
గుండంబులో మండుకొఱివులు పుచ్చి, యొండొండ వ్రేయుచు నుండిరి కపులు
చేతిస్రుక్స్రువములు చెనసి రాదిగిచి, వాతూలసుతుఁడు రావణు వ్రేసి డాసె
నిత్తెఱంగునఁ గపు లేచి కాఱేపఁ, జిత్తంబులో నిష్ఠ చెదరంగనీక
కనియక కదలక క్రతునిష్ఠనుండెఁ, గొనకొని నిద్రించుకొండచందమున

అంగదుండు మందోదరిని రావణుపద్దికి సీడ్చుకొని వచ్చుట.

సంగరక్రమకళాసంగుఁ డభంగుఁ, డంగదుం డంగద నంచితాంగదుఁడు
అంతఃపురంబున కరిగి యాదైత్యు, కాంతానివాసంబు కరమర్థిఁ జొచ్చి
పరికింప రోహిణిఁ బాసినచంద్రుఁ, దరుణపల్లవశయ్యఁ దగఁజేర్చుకరణిఁ
గందినముఖచంద్రుఁ గరపల్లవమునఁ, బొందించి వగలచేఁ బొగలెడిదాని
ఘోరాహవంబునఁ గుంభకర్ణాది, వీరులు పెక్కండ్రు విషమవిక్రములు
దక్కి రందఱు విభుం డొక్కఁడ చిక్కె, నెక్కటిరఘురాము నితఁ డేమిగెలుచు
నని యని రావణునపజయంబునకుఁ, దనబంధువులు దాను దలఁకెడుదాని
చిత్తంబులో నింద్రజిత్తుచావునకు, నొత్తిలి యేడ్చుచు నున్నట్టిదాని
రమణీయమణిమందిరమునఁ గొల్వున్న, రమణి మందోదరి రాజాస్థఁ గదిసి
యొలసినగతి రావు వొడిసి పట్టుటకుఁ, జలదిందుమండలీచంద్రికవోలెఁ
దిగిచినఁ బెడమరదిరుగువేగమున, మృగనేత్ర మొగమున మెఱుఁగులు పెదర
నెఱుఁగమితోఁ గూడ హృదయంబు గలఁగ, తెఱఁగున నలివేణిఁ దిగిచి పట్టుటయు:
గమ్మసౌరభములు గలుగుసంపుల్ల,థమ్మిల్లమల్లికాదామంబు లనఁగ
గెడఁగూడి రావణుకీర్తిపుష్పములు, గడివోయి భువిరాలు కైవడిఁ దోడ
నేసముత్తియములు చెలువంబు వాసి, గానిలి వసుధపై గనుకనిఁ జెదర
వలనేది చెడిన రావణురాజ్యపదవి, చెలువున నెరి దప్పి సీమంతవీథిఁ
గృతకంపుదైత్యలక్ష్మీపదాబ్జమున, శ్రితచంచరీకము ల్చెదరుచందమున
నాలోలలోలముఖాంభోజనీల, నీలాలకంబులు నెరి దప్పి చెదర
నురుమంగళంబులై యొప్పెడినాత్మ, వరభూషణములు రావణులక్ష్మి చెవుల

నుండనిక్రియ వడి నొండొండ కర్ణ,మండనంబులు మహిమండలి రాల
దనుజేశునపకీ ర్తిధారలో యనఁగఁ, గనుగవఁ గాటుకకన్నీరు దొరుఁగ
నొగి దైత్యపతికి మహోల్కలు డుల్లు,పగిది భూషణమణిప్రకరములుల్లల్ల
వరభర్మనిర్మలావరణంబు కలఁగ, నిరవేది రావణు నిహపరోన్నతులు
చలియించు తెఱఁగునఁ జనుగట్టు దొలఁగి, చలియింప నున్నత స్తనకలశములు
కొమరేది సురవైరిగుణవల్లి నులియు, క్రమమున నెంతయుఁ గౌఁదేఁగె నులియు
నిర్మలుఁ డగురామనృపతిచేఁ దెగిన, కర్మబంధములు రాక్షసలోకపతికి
వదలు నీక్రియనను వడువున నీవి, వదలుచు మేఖలావల్లియు వీడఁ
బ్రమదరాక్షసరాజ్యపదసంధి రోసి, విమలవర్ణావలి వీడుచందమున
నుదితరావంబులై యొండొంటిఁ గడవఁ, బదనూపురము లూడిపడి మ్రోయుచుండ
వెఱచి రాక్షసవధూవితతి శోకింపఁ, జెఱసున్న నిర్జరస్త్రీ లుత్సహింప
నీరసంబునఁ బట్టి యీడిచి తెచ్చె, వారక రాక్షసేశ్వరుని ముందఱకి
నంత మందోదరి యాత్తేశుఁ జూచి, యంతరంగమున శోకాగ్నులు నిగుడ
నింద్ర గెల్చినసత్త్వ మెక్కుడఁ బోయెఁ, జంద్రహాసమువాఁడి సమసెనే నేఁడు
పాళలోచనుతోడఁ బ్రమథులతోడఁ, గైలాసమెత్తిన గర్వ మెందఱఁగె
మూఁడులోకంబులు మునుమిడి గెలిచి, నేఁడేల తూలెదు నీవేర్మి విడిచి
యింద్రజిత్తుఁడు నన్ను నిటఁ బాఱవైచి, యింద్రలోకంబున కేగకయున్న
నన్నిళ్లు చూచునే నాకొడుకున్న, నిన్నీచదుర్దశ లేను బొందుదునె
సిగ్గు లజ్జయు లేని చెనటిరో నన్ను, బగ్గించుచున్నారు పగతు లిబ్భంగి
నీహోమమేటికి నిష్ఫయేమిటికి, నాహుతు ల్నిన్నుఁ బూర్ణాహుతిఁ జేసెఁ
బట్టుబుద్ధి వై రాముబాణాగ్నిఁ బడుము, కుటిలక్రియలకింకఁ గొలదిఁగా దుడుగు
శుద్ధినిని దశకంఠుఁ డలుక దీపింప, దనచేతియాహుతు ల్ధరణిపై వైచి
యురుతరం బగునిష్ఠురోగ్రకోపాగ్నిఁ, బురవధూతోరణంబులు వోనిబోమలు
మూడివడ సమవర్తిమూర్తియై పేర్చి, కడఁకమై నత్యుగ్రఖడ్గ మంకించి
యతులరత్నాంగదు నంగదు, వ్రేసి, వితతవిక్రముఁ డింతి విడిపించి పుచ్చె
వీడిన నెఱివేణి వెన్నున జార, వాడినమోముతో వగలఁ దూలుచును
నంతఁగిపురంబున కరిగె దైతేయు, కాంత చింతించుచుఁ గడుఁ జిన్నివోయె
నప్పుడు హనుమంతుఁ డత్యుగ్రముష్టిఁ, దప్పక దశకంఠుతల బిట్టు వొడిచె
నావాలిసూనుండు నంతలోఁ దెలిసి, రావణు వ్రేసె విక్రమకేలివాని
తోరంపునెత్తుటఁ దోఁగి యెంతయును, గ్రూరుఁడై జేగురుకొండచందమున
నతిఘోరకోపాట్టహాసంబు లెసఁగ, నతులసత్త్వోద్ధాత్తుఁ డై దశాననుఁడు
అంగదుఁ దగ వ్రేసె ననిలనందనుని, భంగించె నిశితాశిఁ బటుశక్తి మెఱసి
నలి శూలముఖమున నలుని నొప్పించె, నలువున గజునొంచె నంకుశనిహతి
మొగి నీలు ధట్టించె ముసలఘాతమున, దగుశక్తి శతబలిదర్పంబు మాపెఁ
బవితుల్యముద్గరప్రదరంబు పుచ్చి, ద్వివిదుని మైందుని వ్రేసె వ్రేయుటయు

వానరవరులు దుర్వారులై తమదు, సేనలఁ జొచ్చి రచ్చెరువుగాఁ బఱచి
యనిలసూనుఁడు రాఘవాధీశకడకుఁ, జని మ్రొక్కి హస్తాంబుజంబులు మొగిచి
రామావనీశ్వర రాక్షసేశ్వరుని, హోమంబుఁ జెఱిచితి మొప్ప వచ్చితిమి
అనవుడు విని రాముఁ డంతరంగమున, ననయంబు హర్షించె నట దైత్యపతియుఁ
గడువేగమునఁ బోయి ఘనశోకవహ్ని, నుడుకుచు నున్నమందోదరిఁ జూచి
యతివ నీమనమున నక్కట దైవ,కృతమున కింత శోకింప నేమిటికి
ననిమొన నేఁడు రామావనీనాథుఁ, దునిమెద నటుగాక దురములో నతఁడు
నను సమయించిన నలినాయతాక్షి, జనకనందనఁ జంపి సాహసంబొప్ప
వేవేగ యగ్ని ప్రవేశంబు నేయు, నీవనుటయు నింతి నిజనాథుఁ జూచి

మందోదరి శ్రీరాములమాహాత్మ్యము రావణునికిఁ దెల్పుట.

యోదశానన నీకు యుద్ధమధ్యమున, రాదు జయింపఁగ రఘురామదేవు
నీవొక్కఁడవ యేల నెఱసి రాఘవుని, దేవాసురులకైనఁ దీఱదు గెలువ
నీమది రాజుగా నిర్ణయింపకుము, రామచంద్రుండు పురాణపూరుషుఁడు
ఆమేటి తొల్లి మత్స్యావతారమున, సోమకు నిర్జించి శ్రుతు లుద్ధరించె
ఘనమంథశైలంబు గమఠమై యతఁడు, దనవీపుఁ గుదురుగా ధరియించెఁ దొల్లి
రాముఁడు మున్ను హిరణ్యాక్షుఁ జంపి, భూమి వరాహమై పొగడొందనెత్తె
నతఁడు నృసింహుఁడై యలుకమైఁ దొల్లి, పతితుఁడై తున్నిఁ జంపి ప్రహ్లాదుఁ గాచె
నలిగి యాతఁడు వామనావతారమున, బలి నర్థిమై వేఁడి బంధించెఁ దొల్లి
జమదగ్ని రాముఁడై జన్మించి యతఁడు, విమలశౌర్యనిధి గార్తవీర్యుని ద్రుంచె
వీకను జేకొన్న విశ్వమంతయును, నాకశ్యపబ్రహ్మ కర్థితో నిచ్చె
సన్నుతగతి విరోచనుఁ జంపి వైచె, మున్ను మాయారూపముఖుని నిర్జించె
జలధిమధ్యంబునఁ జరణఘాతమున, బలువిడి రాక్షసపతుల రూపడఁచె
లవణాసురునిఁ జంపె లలిఁ బార్ష్ణిహతుల, జవమార నీరామచంద్రుండు మొదల
నధికుఁడై యాతఁడ యాదికాలమున, మధుకైటభాదుల మర్దించె నతఁడు
తనసత్త్వమంతయుఁ దలకొని వచ్చి, నినుఁ జంప నిప్పుడు నిష్ఠమైఁ బూని
దిశలఁ దేజంబులు దీపింపఁజేసి, దశరథేశ్వరునకుఁ దనయుఁడై పుట్టె
నామహామహిమ లత్యద్భుతక్రియలు, నేమని చెప్పుదు నేను వాక్కుచ్చి
యలఘువిక్రమకళాయతశక్తి మెఱసి, బలియుఁడై యీతఁడు బాల్యంబునందుఁ
గౌశికప్రముఖదివిక్పతులెల్లఁ బొగడఁ, గౌశికుం డొనరించు క్రతువు రక్షించె
శతసహస్రాయుతసంఖ్యలు గడవ, నతనిచేఁ బడసె దివ్యాస్త్రశస్త్రములు
జనకుండు మొదలుగా జగమెల్లఁ బొగడ, ఘనశక్తి విఱిచె శంకరుశరాసనము
దైవయోగంబునఁ దనకుఁ బట్టమున, దేవిగాఁ బూని వైదేహిఁ గైకొనియె
సోమించి నిజబలస్ఫురణంబు చూపి, రాముఁ డాభార్గవరాము భంగించెఁ
దనతండ్రిపనుపునఁ దపమొప్పఁ బూని, మునివృత్తి వనవాసమునకు నేతెంచె

సన్నుతశక్తిమైఁ జంపె విరాధుఁ, బన్నుగాఁ బేర్చి శూర్పణఖ శిక్షించె
నడుగుల నాదండకారణ్యభూమి, గడుఁ బుణ్యభూమిగాఁ గావించినాఁడు
ఖరదూషణాదిరాక్షసవీరవరుల, ధరఁ గూల్చె మఱి చతుర్దశసహస్రములఁ
మారీచుఁ దునుమాడె మాయఁబోనీక, ఘోరరూపుఁ గబంధుఁ గూలంగనేసె
నీగండు గుణమెల్ల నిలిపి దట్టించి, లాగొప్ప నిన్ను వాలమున బంధించి
చతురబ్ధిజలములఁ జలమున ముంచి, యతులసత్త్వక్రీడ నడరి కాఱించి
విడిచిన యావాలి వెస నొక్కకోలఁ, బడనేసె సుగ్రీవు బట్టంబు గట్టి
నలవుమైఁ దనదుబాణాగ్నికీలలను, జలనిధి నింకించె జగములు మెచ్చఁ
గలనిలోపలఁ గుంభకర్ణు ఖండించెఁ, జలమున నఖలరాక్షసమేతముగ
సమరంబులోపలఁ జంపె లక్ష్మణుఁడు, నమర నయ్యతికాయు నయ్యింద్రజిత్తు
నలుగఁ డెన్నఁడును రామావనీనాథుఁ, డలిగిన నిలువ రింద్రాదులు నెదుట
మదిమది నుండ నామనుజేశుదేవిఁ, ద్రిదశారి వంచనఁ దేనీకుఁ జనునె
నీవెఱుంగవె రామునిత్యసత్యములు, నీవెఱుంగవె రామనృపుమహత్త్వములు
రాముసత్త్వస్థితి రావణ నీకు, నేమిపాపముననో యెఱుఁగఁ జొప్పడదు
నీవింక రఘురాము నిష్కరబాణ,పావకజ్వాలల భస్మమై పడక
జనకనందనతోడ సకలరాజ్యంబు, నెనయ రాఘవునకు నిమ్ము వేవేగ
మఱలి తపోవృత్తి మనమరణ్యములఁ, జరియింత మింతియ చాలు భోగములు
నీవు దీఱిన నాకు నీతోడఁ గూడఁ, బావకుముఖమునఁ బడి కాలరాదు
మున్ను మాతండ్రియు ముదిమియుఁ జావు, నన్నుఁ బొందకయుండ నాకిచ్చె వర
వరభోగ మేనొల్ల వలవ దీత్రోవ, తరముగా దింక దుస్తరము తద్వరము [ము
సరమకునొండె నాజనకజకొండె, వరపుడనై యేను వర్తింపవలసె
ననవుడు దశకంఠుఁ డాకలకంఠిఁ, గనుఁగొని పలికె నుత్కటరోషుఁ డగుచు
నింతేల చింతింప నెలనాఁగ నీకు, నింతకు వచ్చితినే యేను నేఁడు
చుట్టాల భృత్యుల సుతుల సోదరుల, నెట్టనఁ జంపించి నేఁడింక నాకు
దేవదానవభయోద్వృత్తిఁ బోనాడి, యీవట్టిప్రాణంబు లేల రక్షింప
దురమున నింద్రజిత్తునివంటికొడుకుఁ, బరులచేఁ జంపించి బ్రదుక నేమిటికి
గరుడోరగామరగంధర్వవరులఁ, బొరిగొంటిఁ జెఱిచితిఁ బుణ్యగేహినులఁ
దపసులఁ జంపితిఁ దరుణి యేనింకఁ, దపసినై పోయినఁ దపసులు నగరె
కావు నీమాటలు కార్యంబుతెఱఁగు, భావింపనేర్పరి పద్మాయతాక్షి
ఏనెల్లభంగుల నింక రాఘవులఁ, బోనీను జంపుదు భూమిజ నీను
ఆరూఢబలుఁడనై యటుఁగాక యేను, శ్రీరాముశరములచేఁ జత్తునేని
నాకవాసులు మెచ్చ నాకోరుచున్న, వైకుంఠ మెదురుగా వచ్చు నిచ్చటికి
లలన నీవేటికి లంక యేమిటికిఁ, దలకొన్న ముక్తిసత్పథముఁ గైకొందు
ఎలనాఁగ నీవింక నేను లేకున్నఁ, గలపుణ్యలతికళ లెల్లఁ బొలిసి
కమలబంధుఁడులేని కమలినిబోలె, కొమరేది శశిలేని కుముదినిఁబోలె

రేరాజు లేనట్టి రేయనుబోలె, శారికలేని పంజరమునుబోలె
ఎనయఁ గోయిలలేని యెలమావివోలె, దినమణిలేని యాదినమునుబోలె

రావణుఁడు మూఁడవసారి యుద్ధమునకు వెడలుట.

ఉండుము నీవన్న నొండాడ వెఱచి, యుండె మందోదరి యుదరి లజ్జించి
యంత దశగ్రీవుఁ డాహావోద్యోగ, సంతోషపోషితోత్సాహుఁడై కినిసి
యాదిత్యులదర బ్రహ్మాండభాండంబు, భేదిల్లఁ బటురణభేరి వేయించి
కలహావిక్రమకళాకల్పుఁడై తివిరి, బలములఁ బన్నింపఁ బడవాళ్లఁ బనిచి
యుదయార్కబింబసముజ్జ్వలప్రభలఁ, బదికిరీటంబులు పదిలమై యొప్ప
వినుతరత్నప్రభావిద్యోతమాన, ఘనకుండలంబులఁ గర్ణంబు లడర
నాయతభుజశాఖ లన్నియు రత్న, కేయూరకంకణాంకితములై తనర
నిరవొంద డాకాల నింద్రాదిభయద, బిరుదభీషణ గండపెండేర మొప్పఁ
గరము లన్నిటను భీకరచంద్రహాస, శరశరాసనగదాచక్రాది లమరఁ
బటురోషదృష్టిప్రభావహ్ని లెందుఁ, జటులంబులై పర్వఁ జనుదెంచి యపుడు
స్ఫుటబంధబంధుర పోడశచక్ర, ఘటితకోటిద్వయఘంటికాబద్ధ
భయదోగ్రసంఘల్ల భల్లూకవర్మ, హయసహస్రోద్యగ్ర మగురథం బెక్కి
కాకుత్స్థుశరములఁ గడతేరి మీఁద, వైకుంఠరథ మెక్కువడువు దీపింప
నెలకొని రథకళానిధి కాలకేతుఁ, డలఘుబలోదారుఁ డాతేరుఁ గడప
దీపించు వెన్నెలతేటలై మీఁద, నేపారుగొడుగు లనేకంబు లొప్ప
మండితమార్తాండమండలచంద్ర, మండలకబళనోన్మదసముద్యోగ
రాహుత్రయమపోలె రహిఁ మిన్నుముట్టి, సాహసరాహుమస్తకముప్రశస్త
బిరుదధ్వజంబు లాభీలమై మూఁడు, దరలంగఁ బటపటధ్వనులతో వెడలె
భేరీమృదంగాది భీమగంభీర, భూరిభాంకృతుల నంభోధు లుప్పొంగ
ఉప్పొంగుకడలకు నుర్వి గంపింప, నప్పుడు కరులును హరులుఁ దేరులును
బలసముద్భటమహాభటకదంబములు, బలువిడి వెడలె దిగ్భాగంబు నిండఁ
బ్రళయకాలమునాఁటి భానులభంగిఁ, దలకొని వెడలి రుద్రగ్రులై ఖడ్గ
రోముండు నగ్నివర్ణుఁడు గయ్యమునకుఁ, దామేగఁ బదహతి ధరణి పెల్లడరె
నప్పు డంభోనిధు లన్నియుఁ గలఁగె, నప్పుడు లోకంబు లన్నియు బెదరె
నప్పుడు దిగ్దంతు లన్నియు వ్రాలె, నప్పుడు కులగిరు లన్నియు వడఁకె
నెడపనికడకతో నిబ్బంగి వెడల, నుడువీథి సురలు దా రొండొండ నిండి
రావణోద్యోగసంరంభంబు సూచి, దేవారి యిటుఁ గ్రింద దేవదేవారి
యోధులపైఁ బేర్చి యుద్వృత్తినెత్తి, క్రోధించి మించి పేర్కొనిపోవువాఁడు
ఈరీతి యీభాతి యీరణోద్యోగ, మీరోష మీవేష మెన్నఁడు లేదు
నేఁడు లక్ష్మణసమన్వితుని రాఘవునిఁ, బోడిమితోఁ దాకి పోరాడకున్నె
యని రత్నమయవిమానారూఢు లగుచు, ననిమిషులనిమిషులై చూచుచుండ
రాశి వానరబలారణ్యంబుఁ గాల్పఁ, గా సొంపుతోవచ్చు కార్చిచ్చుపగిది

నడతెంచె నసురసేనాసహస్రమును, బొడగని కపివీరపుంగవు లెల్ల
నంగదఁ జెలరేఁగి యట్టహాసమును, బొంగ నుప్పొంగి యార్పులు నింగిముట్టఁ
దరమైనతరులు నుద్ధతమైనగిరులు, గిరిశృంగములఁ గొని గిరిసమాకృతుల
దరమిడి బరువడి దనుజసైనికులు, దురమును నిరువాఁగుఁ దొడరి రొండొంటి
నక్షీణబలము లేపారంగఁ దాఁకు, దక్షిణోత్తరసముద్రములచందమున
నప్పుడు దానవు లాసేనమీఁద, ముప్పిరిగొనురోషములు మండుచుండ
నార్పులు జంకెలు నతులహుంకృతులు, నేర్పులు కడఁకలు నిండ నొండొండఁ
గటమదోత్కటదంతి ఘటల డీకొల్పి, పటుజవాశ్వంబుల బలువిడిఁ దోలి
యలవొప్ప నరదంబు లజేముఱిఁ బఱపి, నలుగడఁ గాల్వురనలిఁ గవియించి
కరవాలముసలముద్గరభిండివాల, పరశుతోమరశరప్రాసఖడ్గములఁ
గనుకని వైచియు గాడఁబొడిచియుఁ, దునిమియు మెఱమియుఁ దూలనేసియును
వ్రచ్చియు మోదియు వసుధఁ గూల్చియును, గ్రుచ్చియుఁ గపులఁ బెరొక్కాని విదళింప
మొనసి వానరవీరముఖ్యులు గడిమిఁ, గినిసి యుద్భటరణక్రీడమైఁ గదిసి
యుఱికి సమీపమందున్నశైలములు, తఱుచైన గిరిశృంగతతులు వృక్షములు
శిలలును వడివ్రేసి చెలరేఁగి మఱియుఁ, దలమీఱి గుట్టలుపుదళనుల కురికి
యుదితోగ్రసత్త్వంబు లొప్పఁ గుప్పించి, కుదియక రౌతులఁ గూలఁ దన్ని యును
గర మగ్రమై కరిఘటలపైఁ గవిసి, సొరిది శైలము లెత్తి మోదులు వెలుచఁ
గుంభమధ్యంబులఁ గ్రుంగ నేసుఁగులఁ, గుంభిని నొక్కటఁ గూల నేయుదురు
రథములతోడ సారథులరథ్యముల, రథుల నొక్కట నెత్తి రణమధ్యవిథిఁ
బెలుకుర నందంద పృథివి గంపింప, నలవున నటువ్రేసి నలియఁజేయుదురు
ధరణీధరంబులఁ దరుకదంబముల, నురవడిఁ గాల్వురనురక మోఁదుదురు
కఱుతురు పండ్లను గరతలాగ్రములఁ, జఱుతురు పదములఁ జదియఁ బ్రాముదురు
వ్రత్తు రుజ్జ్వలనఖావలుల వాలముల, మొత్తుదు రలతురు ముష్టిఘట్టనల
పనసనీలాంగదప్రముఖులు మరియు, వనచరపతులు దుర్వారులై యెగసి
తనియనికడిమి నుద్దండదానవుల, మొనలపై నాకసంబునసుండి నిండి
భూరిధారాధరంబులు లయవేళ, ఘోరనిర్ఘాతము ల్గురియుచందమున
గురుశైలపాషాణకోటు లందంద, కురియ నుద్భటరణక్షోణి నెల్లెడలఁ
గూలు నేనుంగులు కుంభమధ్యముల, వ్రాలు మావుతులు పైవ్రాలుచందములు
విఱుగువిండ్లును గూలు వీరరాక్షసులు, నొఱగు నశ్వములుపై నురులు రావుతులు
చదియు రథంబులు సమయు సారథులుఁ, జిదియు పీనుంగులు చెదరు మాంసములు
పడు కిరీటంబులు పగులు మస్తకము, లడరు నెత్తురులు బెల్లవియు గాత్రములు
తొలుకాడువ్రేవులుఁ దునియు ఖడ్గములుఁ, గలిగి యప్పుడు రణాంగణ మొప్పెఁజూడ
బహుభోగపర్జన్యభాగ్యంబపోలె, మహితాభ్రమాతంగమదసిక్త మగుచు
నతిరౌద్రరుద్రవిహారంబపోలె, హతగజాసురపిశాచానంద మగుచు
నక్షీణరామకటాక్షంబుపోలె, ప్రేక్షణహృష్టవిభీషణం బగుచుఁ

గలియుగాంతో ద్యద గ్ర కాలంబపోలె, బలశూన్యవిధ్వ స్తబహుధర్మ మగుచు
గతతోషసంపుల్లకమలినిపోలె, శ్రితశిలీముఖపుండరీకౌఘ మగుచుఁ
జారుశుభోదారుసదనంబపోలె, నా ర్తకథనమార్గణాకీర్ణ మగుచు
స్థిరపుణ్యమూలనదీభ ర్తపోలె, హరిస త్త్వనిర్మథితాభీల మగుచు
ననఘు క్రమాగమయాగంబపోలె, ననిమిషలోకచింతాభీష్ట మగుచు
నొప్పెడిరణములో నుగ్రభావమున, కుప్పలిల్లుచు సుర లొగిఁ జూచుచుండఁ
దొడగి నెత్తుట దొప్పదోగి లోగలయఁ, బడియున్న వేగిరులు పవడంపుఁబొదలు
రథములు యానపాత్రము లూడిపడిన, రథచక్రతతులు గూర్మములమొత్తములు
మొగి నున్నశవములు మొసళులు గలయఁ, దెగిపడ్డ భుజములు దీర్ఘసర్పములు
ఆయుధరధరశ్మ లస్థిసమూహా, మాయతశైలంబు లతులదంష్ట్రములు
తిమితిమింగిలములు దీర్ఘఘోటకపు,గములు సముల్లోకకల్లోలతతులు
వివిధాశ్వలాలలు వెలి నుర్వులందు, ధవళాతపత్రసంతతులు హంసములు
బహుకిరీటప్రభల్బడబాగ్నిశిఖలు, మహిమీఁదఁ జెదరినమాంసము ల్మణులు
ప్రీతనిశాచరప్రేతభేతాళ, భూతాట్టహాసము ల్భూరిఘోషములు
చంద్రుండు రఘురామచంద్రుఁ డవ్విభుని, సాంద్రహాసవ్యుత్పల్చంద్రిక లగుచు
నడరెడురక్తాబ్ధి యబ్ధితోఁ దొరసి, యుడువీథితో రాసి యుప్పొంగుచుండె
నప్పుడు హనుమంతుఁ డసురేశుమీఁద, నుప్పొంగి కవియ నుద్యోగంబు సూచి
యచలాచలాకారుఁ డతిబలోన్నతుఁడు, రుచిరఖడ్గుఁడు ఖడ్గరోముండు గినిసి

ఖడ్గరోముఁడు మొదలగురాక్షసులు వానరవీరులతో యుద్ధముసేయుట.

యందెందుఁ గడఁగెద వందేల నీకు, నిందు రమ్మనిలజ యేనున్న వాఁడ
ననవుడుఁ గుప్పించి యతనిపై కుఱికి, తనురోమశితఖడ్గధారల మునిఁగి
యొకభంగి నిగిడి మహోగ్రుఁడై కడఁగి, ప్రకటసత్త్వోన్నతిఁ బవమానసుతుఁడు
కులశైల మనఁబోలు కొండ చేఁబూని, పెలుచ నార్చుచు వచ్చి పృథివి గంపింప
వానిపై నురువడి వైచె వైచుటయు, దాని వాఁడురురోమధారాభిహతిని
గండ్రించి ప్లవగుల ఖండించుకొనుచు, దండి నప్పవమానతనయుఁ దాఁకుటయుఁ
బావని మఱియును బర్వతం బొకటి, వేవేగ దానవవీరుపై వైవఁ
గులిశధారాహతిఁ గూలుపర్వతము, పొలుపునఁ గూలె నప్పుడు రక్కసుండు
సర్వరోముఁడు తీవ్రసర్వాంగుఁ డగుచు, దర్పించి కడఁకతోఁ దాఁకి యంగదుని
దనురోమసర్పసంతతుల నొప్పింప, ఘనమైనకడిమి కంగదుఁడు గోపించి
గ్రద్దన లయకాలకాలుఁడై మండి, యద్దైత్యోమ స్తకం బఱచేత వ్రేసె
దనుజునిశిరమంతఁ దద్దయుఁ బగిలి, ఘనర క్తధార లొక్కటఁ గ్రమ్ముచుండ
రోషాగ్ను లొలుకుచు రోమసర్పముల, భీషణాకారుఁడై పేర్చి యద్దనుజుఁ
డంగదునంగంబు నంగద వ్రేయ, నంగదుం డధికరోషాయత్తుఁ డగుచు
నసురశిరోమధ్య మతిఘోరముష్టిఁ, బస చెడఁ దాటించి పడవైచి త్రొక్కి

తలఁ ద్రుంచివైచి యుద్ధతిశ క్తి వాని, బలువిడి నిర్గతప్రాణుఁ గావించె
భీషణరణకళాభీలు నన్నీలు, రోషించి వృశ్చికరోమముండు దాఁకి
ఘనవిషజ్వాల లొక్కఁటఁ బిక్కటిల్లఁ, దనురోమవృశ్చికతతుల నందంద
యేచి నొప్పింప సహింపక నీలుఁ, డాచేత దానవుఁ డాత్మ గైకొనక
విరథులై రాక్షసవీరులు పర్వ, నురుసాలతరువున నురువడి వ్రేసె
వ్రేసిన దనుజుఁ డావృక్షంబు ద్రుంచె, గాసిల్లి విషరోమకంటకాగ్రముల
ద్రుంచిన కనుఁగొని తోరంపుగడిమి, కంచితజయశీలుఁ డానీలుఁ డలిగి
ఘోరబాహాశక్తిఁ గుశలుఁడై వేర్చి, భూరిశాఖల నొప్పు భూజంబు వెఱికి
కొనివచ్చి వాని వక్షోవీథి వ్రేసి, యనిమిషు లుప్పొంగ హతజీవుఁ జేసె
భగ్నారివీరుఁ డభగ్నప్రతాపుఁ, డగ్నివర్ణుం డనునతఁ డాగ్రహించి
వడి మహాటవుల దుర్వారతఁ బేర్చి, కడఁగి యుగ్రతనేర్పు కార్చిచ్చుకరణి
నగణితస్ఫుటవహ్ని లంగంబులందు, నిగిడించి కోతుల నీఱుసేయుచును
బ్రళయాగ్నియనుబోలి పఱతెంచుచుండ, నలుకమై వీక్షించి యవనీశ్వరుండు
బలిముఖప్రముఖుల పరిభవక్రమము, తిలకించి కరుణావిధేయుండుగానఁ
దలఁపున నోర్వ కద్ధనుజునుగ్రతకుఁ, దలయూఁచి దశకంరుతమ్మున కనియె
నోవిభీషణ నాకు నూహింపఁ దెలియ, దీవచ్చుచున్న వాఁ డెవ్వఁడో చూడ
నారావణుఁడు పంప ననిసేయఁగోరి, ధీరుఁడై యనలుఁ డేతెంచుచున్నాఁడొ
వీఁడొకరాక్షసవీరుఁడో కాక, వీఁడెవ్వఁ డేర్పడ వినుపింపు నాకు
ననవుడు దేవ వీఁ డగ్నివర్ణుండు, దనమేనిమంటలు దరికొల్పి వీఁడు
పర్వతంబులనైన భస్మీకరించు, గర్వదుర్వారుఁ డఖండవిక్రముఁడు
అనిన నచ్చెరువంది యర్కవంశజుఁడు, ఘనమైన వానియుగ్రతఁ జూచి యలిగి
వాసవనుతుఁ డంత వరుణాస్త్ర మేసె, నేసిన నది మింట నెడమీక నిండి
కప్పారుమేఘుంబు గప్పి యార్భటము, లుప్పొంగ జడివాన లుడుగక కురిసి
యలవేఁడిమంటల నార్చి పెల్లార్చి, ఖలునగ్నివర్ణు నొక్కఁట నేలఁ గూల్చె
నాలంబులో నప్పు డగ్నివర్ణుండు, గూలుటయును జూచి క్రూరుఁడై వేర్చి
కోపంబుపేర్మి నశ్రుల నిప్పులురులఁ, జూపుల లయకాలసూర్యుఁడై మండి
రాముఁ గనుంగొని రాక్షసేశ్వరుఁడు, రామ నన్నె ఱుఁగవే రణమధ్యవీథిఁ
గ్రూరనిష్ఠురవజ్రఘోరదుర్వార, ధారావిదారితోద్ధతకులాచలుఁడు
దేవేంద్రుఁ డుద్వృత్తి దేవసంఘములతో వచ్చి యెదరినఁ ద్రుంతునే నాజి
నిన్నేలఁ గైకొందు నీచకావేయ, సన్నాహమే నన్ను సాధింప నహహా
పదిలుఁడై మగపాడి పాటింతుఁగాక, తుదిముట్ట నన్ను నెదుర్కొందుగాక
త్రోచి శస్త్రాస్త్రపఙ్క్తుల నొంతుగాక, యేచి నీలావు నాకెఱఁగింతుగాక
యనవుడు రఘురాముఁ డద్దురాత్మకుని, చెనఁటిమాటలు విని చిఱునవ్వు నవ్వి
గంధసింధురము ఘీంకార మాలించి, సింధురాంతకమత్తసింహంబపోలె
నూరకుండుటయు మహోగ్రుఁడై కినిసి, యారామతమ్ముఁ డయ్యసురారిఁ దాఁకి

ఘోరనారాచము ల్లురియఁ దద్బాణ,ధారలు ద్రుంచి యాతని లెక్క-గొనక
యెంతయుఁ ద్రోచి పెల్లేచి లంకేంద్రుఁ, డంతకాకారుఁడై యఱిమి వైఁ దఱిమి
భానువై నడచు స్వర్భానుచందమున, భానువంశాధీశువై నప్పు డడరి
దారుణస్ఫుటవజ్రధారానుకారి, నారాచతతుల నన్నరనాథుఁ గప్పెఁ
గప్పిన నప్పు డాకాకుత్స్థుఁ డలిగి, నిప్పులురాలెడు నిష్ఠురాస్త్రముల
నుగ్గుఁడై యేయంగ యుద్ధమధ్యమున, నిగ్రహింపఁగఁజొచ్చె నెఱసి రావణుఁడు

దేవేంద్రుఁడు శ్రీరామునకు రథంబుఁ బంపుట.

ఆసమయంబున ననియె మాతలికి, వాసవుఁ డారామవల్లభుఁ జూచి
దేవహితార్థమై తివిరి రాఘవుఁడు, పోవక దనుజుతోఁ బోరుచున్నాఁడు
వాఁడె పదాతియై వసుధనున్నాఁడు, వాఁడు రథస్థుఁడై వ్రాలుచున్నాఁడు
ఎందు లోకోన్నతుఁ డితఁడె దుగిఖముల, డింది యక్కు-మతికి దిగువనున్నాఁడు
వేదపల్లవముల విహరించుసౌఖ్య,వేది కర్క-శరణవీథి నున్నాఁడు
కమలామనోరథగతుల నున్నతుల, నెమకెడుసుఖ నేల నిలుచున్నవాఁడు
ఇనకులాధిపునకు నీదివ్యరథము, గొనిపొమ్ము వేవేగ కుంభిని కనుడు
ననిలమనోవేగ మగుతురంగములఁ, గనకదండాబద్ధఘనకేతనముల
మహనీయరుచిరోరుమణికదంబముల, మహితమై బొలారు-మహిమ దీపింపఁ
దనరారురథము మాతలి మహీస్థలికిఁ, గొనివచ్చి వేడ్క-తోఁ గుంభిని నిలిపి
యారామముందట హస్తము ల్మొగిచి, యారూఢబలశాలి యై విన్నవించె
దేవ రాఘవ ధరాధీశ సమస్త,దేవతారాధ్య వందితభక్తసాధ్య
శరచాపకవచాదిసన్నాహరథము, పురుహూతుఁ డిదె నీకుఁ బుత్తెంచినాఁడు
కాకుత్స్థ నీవింకఁ గౌశికుపనుప్పు, గైకొని యీవజ్రకవచంబు పూని
యీదివ్యరథమెక్కి- యీయాయుధముల, నీదుర్మదాంధుని నెదిరి సాధింపు
మేను సారథిగాఁగ నింద్రుండు సకల, దానవావలి గెల్చె ధరణీశ తొల్లి
ననవుడు విని రాముఁ డవ్విభీషణుని, యనుమతితోఁ గూడ నారథంబునకు
వలగొనివచ్చి యుజ్జ్వలతను ప్రభలు, పొలయంగ నీరేడుభువనంబు లలరఁ
జదల నొక్క-టఁబర్వ జయజయధ్వనులు, పొదివి శాఖామృగంబులు మిన్నుముట్ట
సురవడిఁ గమలాప్తుఁ డుదయాద్రి నెక్కు-,కరణి నారథ మెక్కెఁ గమలాప్తకులుఁడు
నప్పుడు నభమెల్ల నల్లాడుచుండి, యుప్పతిల్లుచునుండె నొండొండ నిండి
శరదభ్రసంఘాభ్రచయసమానములు, గరుడోరగామరగణవిమానములు
సరిచూచుసురలు ఖేచరులు గిన్నరులు, పరమసమ్మదమును భయము నుప్పొంగ
నీపర్వతద్వంద్వ మీయబ్ధియుగళ, మీపావకద్వయ మీనభోయుగము
గదిసెపోఁ బోరాడఁ గదిసెఁబో పోర, నిది సమానస్కం-ధ మెట్లొకో యనుచుఁ
గంపింప జగము లాశంపింప నిట్లు, కంపింప నిరువాఁగు కంపింపఁ గడఁగి
రణజయోద్యుక్తులై రామరావణులు, రణజయవ్యగ్రులై రామరావణులు
గదిసినదృష్టి నిర్ఘాతపాతములఁ, జదిసినమెఱుఁగులు చదలపైఁ జెదర

చెలఁగె నేనలరెంట సింహనాదములు, గలఁగె నాకాదిలోకంబు లన్నియును
నామేటివిలుకాఁడు లనోన్యవిజయ,కాములై రణచిత్రగతు లొప్పుమెఱయ
దినకరానలకల్పదీర్ఘనిర్ఘాత, ఘనశాతశరసముత్కరపరంపరలఁ
గరములు గళములు కటిము ల్భుజము, లురములు నిటలంబు లూరులు బరులు
నేసి నొప్పించుచు నిరువురు గదిసి, త్రాసులై దొరసి విత్రాసులై బెరసి
యంపకయ్యము సేయునప్పు డొండొరుల, సొంపు బెంపును దెంపు చూడ నచ్చెరువు
ఫలితవిక్రమసమ్ప్రారంభ లగుచుఁ, దొలఁగక చేతుల దొనలయమ్ములకుఁ
జాచిరి తివిచిరి సంధించిరేయఁ, బూచి నేసిరి పోయెఁ బొమ్మని తెలియ
రాకుండె నప్పు డారామరావణుల, భీకరకరళ రాభీలవేగములు
గణనలు క్రమములు గడచి యందంద, రణచండకోదండరవిమండలములఁ
బ్రేంఖచ్ఛరాంశులఁ బేర్చి పుంఖాను,పుంఖంబు లగుటయుఁ బొంకుగావించి
బాణబాణాసనప్రౌఢులక్షీణ, తూణీరు లేయుచోఁ దొడఁగి యొండొరులఁ
బ్రతిసేసి యొకటికిఁ బదియింటివెనుక, నుతశక్తి దానికి నూఱింటివెనుక
వెనుకొని దానికి వేయింటివెనుకఁ, బనిగొని దానికిఁ బదివేలువెనుక
నుడుగక దానికి నొకలక్షవెనుక, మడువక దానికి మఱికోటివెనుక
నేసినశరము మున్నేసినశరము, రాసి యొక్కట దాఁకు రామరావణుల
నరినప్పు డమరారి నారి సారించి, తలకొని దేవగంధర్వబాణములు
పరువడి నేయంగఁ బఱతెంచుచునికిఁ, బరికించి చూచి యప్పరమాస్త్రవేది
తడయక దేవగంధర్వబాణముల, వడినేసి పొడినేసె వసుధేశుఁ డంత
నలుకమై రావణుం డారాముమీఁద, బలువిడి రాక్షసబాణ మేయుటయు
మిడి గ్రుడ్లు నిడుదలై మెఱయుకోఱలును, సుడిగొన్నకఱకుజుంజురువెండ్రుకలును
నసదృశోన్నతిమించునట్టికాయములు, పొసఁగ దానవరూపములతోడ నిగుడఁ
గనుఁగొని రఘుకులాగ్రణి యల్క మదిని, దనరంగ వైష్ణవాస్త్రముఁ బ్రయోగించి
తరణిదీధితి నంధతమసంబు నడఁచు,కరణి రాక్షసబాణ గౌరవం బడఁచె
నంత రావణుఁ డురగాస్త్రంబు వింట, నెంతయు సంధించి యేసె నేయుటయు
నామహాబాణమునందు బాణములు, భీమసర్పంబులై పేర్చి యందంద
పదియు నిర్వదియును బండ్రెండు రెండు, పదుమూఁడు మూఁడును బదునేను నేను
తలలతోఁ దలలపైఁ దళతళరుచులు, గలమహామణులతోఁ గడకమైఁ బేర్చి
గరుడవాహనుఁడని కాకుత్స్థుమీఁద, బరవసంబునవచ్చు పాపదండనఁగఁ
జదలనత్యుజ్జ్వలజ్వాల లెల్లెడల, వెదచల్లుచును వచ్చువిధము వీక్షించి
కాకుత్స్థకులభర్త గారుడాస్త్రంబు, గైకొని సంధించి కడకనేయుటయుఁ
గడుకొని గారుడాకారబాణములు, వడినందుఁ బ్రభవించి వసుధ గంపింప
వరపక్షసంఘాతవాతవిధూత, ధరణీధరంబులై తడయక నిగిడి
నడుమన త్రుంచె నన్నాగబాణముల, నుడువీథి సురలుండి యుప్పొంగి యార్వ
వెండియు నాదైత్యవిభునిపై నగ్ని,కాండంబు నిగిడించెఁ గాకుత్స్థుఁ డలిగి

అది భూమివిస్ఫులింగా క్రాంతదిశము, నది సికాదగ్ధసురాధీశవనము (?)
నగుచు నేతెంచు సురారాతి యుగ్ర, మగువారుణాస్త్ర ముద్ధతినేయుటయును
ఘనసమూహంబు నాకసమెల్లఁ గప్పి, పొనర శంపాజాలముల వానగురిసి
యనలసాయకము పెంపడచి గర్జిల్లఁ, గనుఁగొని రాముఁ డాకాండంబుమీఁద
వాయవ్యశరమేసి వారించె దనుజుఁ, డాయెద దంతిముఖాస్త్రంబు పఱుప
దానఁ బెక్కగు దంతితతి గళద్బహుళ,దానజంబాలితధాత్రియై కదియ
శ్రీరాముఁడును నారసింహాస్త్ర మేసె, బోరునఁ దద్బాణమున సింహచయము
దారుణతరసటాతారితసకల, నీరదనివహమై నిజఘోరనాద
చలితదిగ్వారదమై చటులత నిగిడి, కులిశోగ్రనఖములఁ గుంభములవ్రచ్చి

రావణుఁడు శ్రీరాములపై శూలము వేయుట

హస్తిసంతతిఁ ద్రుంచె నయ్యెడ సురలు, ప్రస్తుతిచేసి రాపార్థివోత్తముని
గలుషించి యప్పుడు కల్పాంతవహ్ని, తొ[illegible]లు దొలకాడుచుండ
నాలోన లోకభయంకరాకార, శూలంబు గని రాముఁ జూచి రావణుఁడు
వసుమతి కంపింప వారిధు ల్గలఁగ, దెసల నెల్లెడలఁ బ్రతిధ్వను ల్గలఁగ
బిట్టుల్కి భూతము ల్బెదరఁ గట్టల్క, దట్టించి సింహానాదముచేసి పలికె
పన్నిరారామ యీపటుశూలవహ్ని, నిన్ను నీతమ్ముని నీయుగావించి
పోర నిన్నెదిరించి పోరాడి చన్న, వారినారులబొప్పవారి వారింతుఁ
జూడుము నీవంచు శూల మంకించి, యొడక రాముపై నుంకించి వైచె
దానిపై రాముఁ డుదగ్రుఁడై కినిసి, వానలు కల్పాంతవహ్నిపైఁ గురియు
పురుహూతుపగిది నద్భుతశితాస్త్రములు, గురియంగ నది దాన గుదియక వాని
నుఱక నీయుగఁ జేసి యుగ్రవేగమునఁ, బఱతెంచుగతిఁ జూచి భానువంశజుఁడు
దేవేంద్రుఁ డర్ధిఁ బుత్తెంచినశక్తి, వావిరిఁ గైకొని వైచె వైచుటయు
నది నిర్గళద్ధుంటికారావ మగుచు, నది విస్ఫురత్పావకారంభ మగుచు
నది యఖిసురఖేచరానంద మగుచు, నది రాక్షసాలోకనాభీల మగుచు
వఱలు మనోవేగవాయువేగమునఁ, బఱతెంచుశూలంబు భస్మంబుచేసె
నప్పుడు రావణుం డలుక చిత్తమున, ముప్పిరిగొనఁగఁ గార్ముకదశకంబు
ధరియించి వేర్చి యుద్యుక్తుఁడై యార్చి, శరవృష్టి ముంచిన జననాథసుతుఁడు
తానేకకోదండధరుఁడయ్యెఁ దనిమె, వానియస్త్రములెల్ల వారనికడిమి
మదము మత్సరమును మాంద్యంబు చలము, గదురఁ గన్నులనిప్పుకలు నివ్వటిల్ల
రావణుఁ డెంతయు రఘురాముమీఁద, వావిరి నమ్ములవానలు గురిసి
కుదియనికోపంబు కొలఁదికిఁ మిగులఁ, బదియింట మాతలిఁ బదియింట హరుల
వికలసత్త్వులఁజేసి విషమాస్త్ర మొకటఁ, బ్రకటంబుగాఁ ద్రుంచెఁ బటుకేతనంబు
విపులచింతాభరవివశులై తూలి, కపులు నాకపులు నొక్కట విన్ననైరి
భువనము ల్మంకించె బుధుఁడు వేధించె, జవమున రోహిణీశకటంబునందుఁ
బటుతరతేజంబు భయదంబుఁగాఁగ, నట విశాఖకు వచ్చె నంగారకుండు

చటులోగ్రతరభంగి జలధు లుప్పొంగ, నటదూర్మిమాలిక ల్నభమంది పొరలె
నెగయునౌర్వానలనిష్ఠురశిఖలు, పొగలచందముగాఁగఁ బొగయంగఁ దొడఁగె
ఉగ్రాంశుబింబంబు నొరయుచు వచ్చి, యుగ్రదీప్తులతో మహోల్కలు డుల్లె
నవిరళతరతేజ మటు మ్రానుపడఁగ, రవియును గడు మందరశ్మియై తోఁచె

శ్రీరాముల కగస్త్య లాదిత్యహృదయ ముపదేశించుట.

నలినప్ర డేచి మైనాకంబుపోలెఁ, దలఁకఁగ నందంద దశకంఠుఁడేయు
శరవేగగతిఁ జూచి జనలోకనాథుఁ, డరుదంది చింతింప నట యగస్త్యుండు
చనుదెంచి యారామచంద్ర నీకుంబి, విను మహాభుజబలవీర యోరామ
వితతంబుగా నాజివిజయంబుచేయు, నతిగోప్యమగుచున్న యట్టిమంత్రంబు
నెలమితో నాదిత్యహృదయంబు హృదయ, మలర ననుష్ఠింపు మవనీశతిలక
యిమ్మహాజపమున నిప్పుడు నీవు, సమ్మదం బడరంగ శత్రు గెల్చెదవు
ఇది యాయు వొనరించు నిది దుగిఖమడఁచు, నిది సర్వమంగళ హేతుభూతంబు
వెలయ సురాసురవినతుఁడై పొల్చు, జలజాప్తుఁ బూజింపఁ జను నీకు నధిప
యీలోకలోచనుం డెల్లలోకముల, జాలరశ్మిలు నిండఁ జరియించుచుండు
బ్రహ్మయు విష్ణుండు ఫాలలోచనుఁడు, బ్రహ్మకల్పాదిని భానుఁడైనాఁడు
మది సర్వదేవతామయునిఁగా నెఱిఁగి, కదనంబునప్ర డీకమలబాంధవుని
నెవ్వఁడు కీర్తించు నింపుసొంపార, నవ్వీరునకుఁ గల్గు నాహవజయము
అనుచు నమ్మునివరుం డాశ్రమంబునకుఁ, జనుటయు నాసౌరజప మాచరించి
యప్ర డత్యున్నతుఁడై రాఘవేంద్రుఁ, డుప్పొంగి రావణోద్యోగంబుఁ జూచి
ఘోరావలోకనాగ్నులు మండుచుండ, భూరిధూమ్రాయతభ్రుకుటి నిక్కించి
పెరిఁగి రావణురథాభీలఘోటములు, నురుతరాస్త్రంబుల నురుక నొప్పించి
వరశరత్రయము రావణులలాటమున, సరిఁ గ్రుచ్చి యురుర క్తసంసిక్తుఁజేసె
నప్పుడు రక్తసిక్తాంగుఁడై చూడ, నొప్పె లంకేశ్వరుం డొగి రామచంద్రు
శరవసంతాగమసమయసంఫుల్ల, తరుణారుణాశోకతరువుచందమునఁ
గుపితుఁడై యంత రక్షోభర్త రాము, విపులవక్షుంబేసె వేయిబాణముల
నధమప్రయుక్తంబు లై సురద్రోహ,విధి కోసరింపక విషశక్తి మెఱసి
నిర్మలగుణయుక్తి నెఱిఁ బెడఁబాసి, ధర్మంబు విడిచి యుద్ధతశక్తి నిగిడి
చనుదెంచి రాఘవేశ్వరుని నొప్పింపఁ, జన నధోగతిగాక సద్గతి గలదె
యనినచందంబున నద్దశాననుని, ఘనబాణములు వచ్చి కాకుత్స్థు గాడి
జగదద్భుతంబుగాఁ జని భూమి దూరి, తగులక నిగిడి పాతాళంబుఁ జొచ్చె
నురుతరక్షతముల నుఱక పెల్లుబ్బి, తొరుఁగు నెత్తుట దొప్పదోఁగి రాఘవుఁడు
ప్రళయకాలాభీలపావకజ్వాల, లలవుమై నిట్లుండునన నిండ మండి
మండుచిచ్చుఱకంటిమంటలు మింట, నొండొండపర్వ కాలోగ్రుఁడో యనఁగఁ
జండతేజమునఁ బ్రచండమార్తాండ,మండలకిరణసమానాసమాన
మానితశరపరంపరలోలి పఱపి, మానగర్వముతొంటి మదమును నుడిపి

యనిసేయఁ గాలుసే యాడకయుండఁ, దనువెల్ల జర్జరితంబుగాఁ జేయఁ
బర్విడి రఘురాముబాణవేగమున, నిర్విణ్ణుఁడై యుండె నిల్చి రావణుఁడు
దశరథసుతుఁడు ప్రతాపభాస్కరుఁడు, దశకంఠుఁ జూచి యుదగ్రుఁడై పలికె
నేలరా రావణ యిట్లు నిర్విణ్ణ,శీలుఁడవై యుండఁ జేష్టలు మఱచి
యోడ నెన్నఁడునని యుగ్రాహవముల, నాడుదు బీరంబు లవి యెందుఁ బోయెఁ
బెరిఁగి మీాయన్నఁ గుబేరు గాఱించి, పరునిచందమునఁ బుష్పకముఁ దెచ్చుటయు
మఱి యరణ్యములందు మము డాఁగురించి, చెఱుఁగొని లంకకు సీతఁ దెచ్చుటయు
నివి వీరకృత్యంబులే దశగ్రీవ, యివి పౌరుషములని యిందు గర్వింతు
వడిఁ బురాకృతదోషవశుఁడవై చిక్కు,పడి నేఁడు నాదృష్టిపథమునఁ బడితి
పడితిగాకింక నీప్రాణముల్గొనక, విడుతునే నిన్నేల విడుతునే లంక
హరిహరబ్రహ్మాదు లడ్డమైరేనిఁ, బొరిగొందుఁ బోసీనుఁ బోర సాధింతు
రావణ నేఁడు నీరక్తమాంసములు, నేవింపఁజేయుదుఁ జెలఁగి భూతములఁ
గష్టచిత్తుఁడ వతికామాతురుఁడవు, దుష్టబుద్ధివి సురద్రోహివిగానఁ
బదిలమై నిలువక పాఱితేనియును, బొదివి నిఁక జంపుట పుణ్యంబు నాకు
నాసన్నమృత్యుఁడ వైననీతోడ, నీసుమాటలు వల్క నింక నేమిటికి
నీవిక్రమంబును నీభుజాబలము, నీవైభవంబును నేఁడు వాపెదను
గలన నీతమ్ముని ఖరుఁడనువానిఁ, బొలియించు టెఱుఁగవే భువనభీకరుని
నింక నొక్కటి నీకు నెఱిఁగింతు వినుము, శంకింప వలవదు జనకజ నిచ్చి
శరణను కాచెద సమరంబు నేయ, నురుజయం బిది నీకు నోటమిగాదు
ఆయువు వరశక్తి నధికంబు వడసి, మాయావిధంబులు మఱిఁబెక్క లెఱిఁగి
సమరోగ్రశస్త్రాస్త్రసామగ్రి గలిగి, యమరేంద్రు డాదిగా నఖలదిక్పతుల
మూఁడులోకంబుల మును గెల్చియున్న, వాఁడివీరుని నిన్ను వధియింతు ననిన
మర్కటయూథపు ల్మది సంతసిల్లి, రర్కతనూభవుం డావిభీషణుఁడు
భూవర జయమును బొందు నీవనఁగ, రావణు వీక్షించి రఘురాముఁ డనియె
నింక నొక్కటి నీకు నెఱిఁగింతు వినుము, శంకింప వలవదు జనకజ నిచ్చి
శరణను కాచెద సమరంబు నేయ, నురుజయం బిది నీకు నోటమిగాదు
యనుచున్నరఘురామునత్యుగ్రభాష, లనలార్చులై తన్ను నడరి కాల్చుటయు
నలుకమై నులుకుచు నద్దశాననుఁడు, బలియుఁడు జానకీపతిఁ జూచి పలికె
దురమునఁ గొందఱ దుష్టరాక్షసులఁ, బెరిఁగి జంపితినని పేర్చెదు కడఁగి
నన్నె ఱుంగవు నీవు నాలావుకొలఁది, మున్నె ఱుంగవు నేను మునుమిడిఁ దొల్లి
యతిలోకకృతులైన యక్షగంధర్వ,పతుల దేవతల దిక్పతులఁ బెక్కండ్ర
బలువిడిఁ గాఱించి భంగించి నొంచి, చెలఁగి వర్తింతు విశృంఖలవృత్తి
సమబలప్రౌఢి విచారింప.కేను, సమరంబులో నిన్ను సరకుసేయుదునె
నిన్ను నీతమ్ముని నేఁడాజిఁ జంపి, కన్నులపండువుగాఁ జూచి కాని
యీలంకఁ జొరనింక నేనంచు మించి, కాలాగ్నికల్పుఁడై గడఁగి రావణుఁడు

మహియు నాకసమును మండ రాఘవుని, బహుదివ్యశస్త్రాస్త్రపంక్తులఁ బొదివెఁ
బొదివినఁ గోపించి భూపాలుఁ డేనిఁ, బొదిగొని ప్రతిబాణములు సహస్రములు
అప్పుడు రఘురాముఁ డధికసంతోష, ముప్పొంగ రెట్టించి యురుపరాక్రమము
చెనఁటియో తాటక జీఱిననాఁడు, మని యిచ్చు దివ్యాస్త్రముల మదిఁ దలఁపఁ
దలఁపులోనన వచ్చి తమమూర్తులొప్ప, విలసితజయలింగవిస్ఫులింగముల
నమర దివ్యాస్త్రంబు లవి వెలుంగుటయ, సముచితస్థితి వాని సంధించి మించి
కొండవైఁ బిడుగులు గురియుచందమునఁ, జండత సవ్యాపసవ్యంబులేని
తనియక మఱియు నుద్ధతశక్తి మీఱి, ఘనబాణవృష్టులఁ గప్పి నొప్పించి

రావణుఁడు మూర్ఛిల్లుట.

కడఁకమైఁ బోరాడఁగాఁ బొడసూడ, నడుమిఁక దశకంఠు నలిఁ జిక్కువఱిచె
నారామశరహతి నవశుఁడై దనుజుఁ, డారథమధ్యంబునందు వ్రాలుటయుఁ
గనుఁగొని భీతుఁడై కాలకేతుండు, గొనిపోయె నరదంబు ఘోరాజి వెడల
సురలప్పు డెంతయుఁ జూచి యార్వంగఁ, దరుచరయూథము ల్లగ నుత్సహింప
నొలసినలావ్ఱుమై నొకకొంతవడికి, బలశాలి రాక్షసపతి మూర్ఛఁ దేరి
ప్రథనవిక్రమసమప్రారంభుఁ డగుచు, రథముపై నిలిచి సారథిఁ జూచి పలికె
ఓరి రాముఁడు నవ్వ నురుకీర్తిఁ ద్రెవ్వఁడ, దేరింత యెడదవ్ఱు దెత్తురే యనిన
నోడినవాఁడవై యుండ నీపగతుఁ, గూడినవాఁడనై కొనిరాక గాదు
రథిసంకటంబు సారథిఁ గన్న చోట, రథము మరల్చుట రణధర్మ మెందు
నటుగానఁ దెచ్చితి ననవుడు వాని, పటువివేకమునకు బలుమాఱు మెచ్చి
పరమసమ్మదమునఁ బసదనం బిచ్చి, సురవైరి యప్పుడు సూతు వీక్షించి
రాముఁ డున్నాఁడఁ దె రణమధ్యవీథి, రామునిరథముపై రథముఁ బోనిమ్ము
నావుడు నరద మన్నరనాథుఁ గదియ, ద్రోవనక్కాలకేతుండు బిట్టు వఱపె
దశకంరునరద ముద్ధతి రాఁగఁ జూచి, దశరథసుతుఁడు మాతలిఁ జూచి పలికె
నదె రావణునిరథ మరుదెంచుచున్న, దదె మనరథమును నటఁ బోవనిమ్ము
దృష్టి చలింపక తీవ్రబాణముల, దృష్టించి వెఱవక తిరుగుడువడక
వదలక కుదియక వరుసఁ బగ్గములు, పదిలంబుగాఁ బట్టి పఱపు రథ్యముల
మాతలి హయములమనసు నీవెఱుఁగు, దాతతరథవేగ మతివిచిత్రముగ
సారథ్య మొనరింపు సకలంబు నీవు, నేరనియది లేదు నీకేల చెప్ప
ననవుడు నపసవ్య మగుత్రోవ నాతఁ, డనిమిషారాతిపై నరదంబు వఱప
లోకకంటకుఁడు త్రిలోకభీకరుఁడు, భూకంపముగ మహాద్భుతశితాస్త్రములు
రథముపైఁ గప్పి సారథిఁ జిక్కువఱిచి, రథవాహముల నొంచి రౌద్రంబు మించి
కాండ మొక్కట విల్లు ఖండించి పెక్కు, కాండంబు లేసి రాఘవుని నొప్పించె
నొప్పింప నొచ్చి మనోవీథి నలుక, ముప్పిరిగొన నుగ్రమూర్తియై కడఁగి
దేవేంద్రుఁ డర్ధఁ బుత్తెంచినవిల్లు, వావిరి రామభూవరుఁ డెక్కువెట్టి
నెఱసిన ఘనశింజినీనినాదములఁ, బఱియలై బ్రహ్మాండభాండంబు వగుల

దానుగ రాత్రింధతమసంబడంగ, భానుభాసురములై పరఁగు నస్త్రములు
శతములు వేలు లక్షలు కోట్లు మఱియు, శతకోటు లర్బుదసంఖ్యలు గడవ
వాసవ ప్రముఖగీర్వాణు లుప్పొంగ, నీసున నింద్రారి నేసె నేయుటయుఁ
గడుఁబాపకర్ముండు గట్టుఁ డద్ధిరుఁడు, వెడమాయములప్రోగు వీనిలో నునికి
ధర్మప్రయుక్తమైఁ దనరెడి మాకు, ధర్మంబు గాదని తలపోసి రోసి
పోవుపోలిక నుచ్చిపోవుచు నుండు, రావణుఁగొని కాడి రాముబాణములు
ఎడలేదు రావణుం డిలఁగూలు నింక, నడలకుం డిటమీఁద నని ముదం బొదవ
ధరణికి సురలకు ధరణినందనకుఁ, బొరిఁబొరి నెఱిఁగింపఁ బోవుచందమున
నొకకొన్ని ధరణికి నొకకొన్ని దివికి, నొకకొన్ని లంకకు నురవడిఁ బోవు
పావకోగ్రంబులై పరువడి నిగిడి, రావణుఁ గొనికాడు రాముబాణములు
నెఱసి యిత్తెఱఁగున నిబిడంబు లగుచు, నఱిముఱి జడిగొన్న యంపవానలకుఁ
దెరలక మరలక దివిజారి దివిరి, ధరణీశు నురుశరోత్కరముల నొంచె
ఘనబాణవిక్రమక్రమబాహు లగుచుఁ, జెనఁగి రిబ్బంగి నభేద్యవిక్రములు
సమసత్వ సమవేగ సమబాణవిభవ, సమసమరారంభచతురులై కదిసి
బలముల నేర్పుల బాహుగర్వములఁ, దులదూగి యిద్దఱు దురములోపలను
నెఱసినకినుకలు నిండ నొండొండ, చెఱవిడి పోరాడు సింగంబు లనఁగ
నేడహోరాత్రంబు లెడతెగకుండ, రూఢిఁ బోరాడి రారూఢి విక్రములు
అత్తఱి రావణునరదంబుమీఁద, నెత్తురు వర్షించె నిల్చి మేఘములు
ఘనరథాశ్వములతోఁకల నిప్పు లురలె, నినరుచిచ్ఛాయ లనేకంబులయ్యె
నిలువవు చచ్చెదు నేఁడు నీవనుచుఁ,బలికె రావణుఁ జూచి బలసి భూతములు
గెలిచెదు రాఘవఋషిప నీవనుచుఁ, బలనొప్ప నాకాశవాణి భాషించె
తనకైన దుర్మిత్రము లటు సూచి, యనిమిషారాతియు నాస పోవిడిచి
ధృతిపెంపు దీపింపఁ దివిరి కాకుత్స్థు, నతిశాతశరముల నడరి నొప్పించి
కరవాలములు మహాగదలు చక్రములు, పరిఘలు శక్తులు బ్రాసము లై వచె
వైచిన వానిపై వజ్రసన్నిభము, లై చండకాలానలాకృతులైన
సాంద్రార్ధచంద్రాస్త్రచయ మేసి రామ,చంద్రుండు నడుమన చక్కఁగావించె
నారావణుండును నత్యుదగ్రతను, ఘోరనారాచము ల్గురియించె మఱియుఁ
జలమున రాఘవేశ్వరుడును వాని, నలినర్ధచంద్రబాణము లేసి త్రుంచె
నారీతి నిరువురు ననోన్యసమర,ధీరులై జయకాంక్షఁ దెగి పోరుచుండ
సమరంబులో నద్రిచరనిశాచరులు, దమతమయుద్ధసాధనములు గొనుచు
రణవిచక్షణులైన రామరావణుల, రణకేళిఁ గనుఁగొని రణకేలి మఱచి
పరువడిఁ జిత్రరూపంబులో యనఁగ, నరుదంది చూచిరి యద్ధశాననుఁడు
తనచాపు నిక్కంబు తానెఱిఁగియును, గినిసి రాముఁడు దనగెలు పెఱిఁగియును
నెంతయుఁ గడఁకతో నిరువురుఁ జలము, లంతకంతకు నెక్కుఁడై పోరుతఱిని
గనలి కాలానలకల్పుఁడై రోష,మునఁ గన్నుగవల నిప్పుక లుప్పతిలఁగ

నింద్రారిరథకేతు విలఁ గూల్చె రాము,చంద్రుండు నిశితార్ధచంద్ర బాణమున
నారావణుండును నధికరోషమున, ఘోరబాణముల నెక్కొ-ని రథాశ్వముల
మాతలినేసె నామార్గణనిహతు, లాతతాంబుజనాళహతులచందమున
నారాఘువేంద్రుని నాతురంగముల, సారధి నొప్పింపఁ జాలకయుండ
హాసంబులును నట్టహాసము ల్చెలఁగ, వాసిగఁ గఫలు రావణుని మార్కొ-నినఁ
దరుచరసేనపైఁ దనమాయ మెఱసి, సురకంటకుఁడు మహాశుగవృష్టిఁ గురిసెఁ
గురిసినఁ దద్బాణకోటులచేతఁ, దరుచరుల్జడిసి రత్తఱి రామవిభుఁడు
సారధి రథరథధ్వసహితుఁగా దైత్యు, భూరిమార్గణములఁ బొదివి నొప్పించె
దశరథసుతునిపై దశకంధరుండు, విశిఖజాలంబుల వృష్టిగా నపుడు
కురిసినఁ గనుఁగొని ఘోరబాణముల, నరుదుగా సంధించి యమరులు వొగడ
నతని నాకాశంబు నవనీతలంబు, నతిరయంబున రాముఁ డమ్ములఁ గప్పెఁ
బగలెల్ల నమ్ములపందిరినీడ, నొగి రాత్రి శరదీప్తి నుడుగక యుండి
తనరుమహేంద్రమందరమహీధరము, లొనరుధైర్యంబుల నొప్పుచందమున
నలిఁ దిరంబై నిల్చి నభముతో నభము, జలధితో జలధియు సరిఁ బోరుకరణి
రామరావణులసంగ్రామంబుతోడ, రామరావణులసంగ్రామంబె పోలు
ననుటకుఁ దగి మహోద్యగ్రకోపనులు, దనరార నిరువురు దమకించి పోర
జలదగర్జితధనుర్జ్యాఘోషములను, గలహనిష్ఠురబాణఘట్టనధ్వనుల
జితవర్మసమరోగ్రసింహనాదములఁ, జతురరథాశ్వహేషావిరావముల
నుదధులు ఘూర్ణిల్లె నుల్కలు డుల్లెఁ,ద్రిదశు లుప్పొంగిరి దిక్కులల్లాడె
బెగడె భూతంబులు పృథివి గంపించె, దిగిభంబు లూటాడెఁ దిరిగె లోకములు
నగములు వడఁకెఁ బన్నగభర్త దలఁకె, నగణితప్రౌఢి నిట్లరిమి పోరాడఁ
గడకలు విడిచి యుగ్రతలుడ్డి కొంత, తడ విద్దఱును బాహుదర్పము ల్నడలి
ఘనబాణసంధానగతు లుజ్జగించి, కనుఁగొనుచుండిరి కలయ నొండొరులఁ
దెమలిపైవయిన ఘాత్కృతులు నార్పులును, జెమటలవఱదలు చిఱుతహుంకృతులు
నలయికలును ఘటికార్ధానఁ దేరి, మలుగనిచలములు మఱియుఁ బ్రేరేప
నత్యుగ్రనిగ్రహవ్యగ్రులై కదిసి, రత్యంతకాలకాలాకృతినప్పు

శ్రీరాములు రావణునికరశిరంబులఁ దెగ నేయుట.

డలవుద్ధైర్యంబును నలుక దీపింప, బ్రళయకాలమునాఁటి ఘాలాగ్నుపగిది
ఘనశాతకర్క-రిక్రకచభల్లంబు, నినవంశవల్లభుం డెసఁగ సంధించి
యరుదరు దనఁ ద్రుంచె నద్దశాననుని, శిరములు పదియును జేతు లిర్వదియు
త్రుంచుట బొంకొకో త్రుంచితి ననుచుఁ, ద్రుంచిన రాముఁ డద్భుతమంది చూడఁ
గరవాలములను ముద్గరభిండివాల, శరచాపకేయూరచయములఁ దనరు
కరము లిర్వదియును ఘనకిరీటముల, శిరములు పదియును జెచ్చెర మొలచె
మొలచినఁ గోపించి మొగిఁ ద్రుంచె మఱియుఁ, దలలు చేతులు వేర్మి దశరథాత్మజుఁడు
తలలుద్ధవిడిఁ ద్రుంచుతఱిఁ గ్రింద మొలచు, తలలకిరీటము ల్తద్బాణతతులు

తాఁకి మ్రోయుట చెవిఁ దాఁకకమున్న, తాఁకున త్తలలయుదగ్ర హాసములు
తరమిడిఁ ద్రెవ్విన తలలలోలి మొలవఁ, బరమేష్ఠిచేఁ దొల్లి పడయుచో వరము
గలకరంబులతోడఁ గనుకని మొలవ, బలియుఁడై యీతఁడు వడసెనో యనఁగఁ
దలలొగి మొలతేరఁ దడపకుత్తుకల, నలిఁ గాడి రాముబాణము లుండెనోలి
మొగిఁ ద్రెంచుతలలు నమ్ములతోన మీఁది, కెగయఁద్రోచుచు వెస నెగయున త్తలలు
దొంతులకుత్తుక ల్దుంచునస్త్రములు, నెంతయు రమ్యమై యెసఁగెఁ జూపరకు
ఫలితసౌరభరామబాణోత్పలములఁ, గలిపి రావణశిరఃకమలసంతతులు
రమణమై రక్తధారాసూత్రతతులఁ, గ్రమమొప్ప నెత్తులుగట్టి వేల్పులకుఁ
బొలుపొంద నాకాశపుష్పలావికుఁడు, సొలవక పలుమఱుఁ జూపుచందమున
దనుజాధిపతి గొంతదడవు చూడ్కులకు, నినకులాధీశ్వరుం డేయుచో మఱియు
ద్రెవ్వి రాలెడునెడఁ ద్రెవ్వనితలలు, గ్రువ్వనివేరులై కొమరొప్ప నప్పు
డనిమిషావలియొల్ల నచ్చెరువంది, కనుఁగొన నద్దశకంధరుం డమరె
లలి శిరోమాలికాలంకృతుండైన, ప్రళయావసరఘోరభైరవుపగిది
నావేళ రఘురాముఁ డాగ్రహావ్యగ్ర, భావుఁడై రణబలప్రౌఢి దీపింప
లక్ష్మించి దృఢముష్టిలాఘవగతుల, దక్షుఁడై రావణుతలలు బాహువులు
త్రెంచుఁ గ్రమ్మఱ మొలతెంచు వెండియును, ద్రెంచుఁ గ్రమ్మఱ మొలతెంచు నిబ్భంగిఁ
గరములు శిరములు కాకుత్స్థతిలకు,శరపరంపరలచే జటులవేగమునఁ
దెగుటలు మొలుచుట ల్దెలియరాకుండె, నగచరావలికి నయ్యనిమిషావలికి
నాలోన రఘురామునమ్ములఁ ద్రెస్సి, రాలుచునున్న యారావణుతలలు
ఆవులింపవు నొవ్వ వలసముల్లావు, లావుమాలవు నిజోల్లాసము ల్వెడవు
గాజువారవు మిడుకవు రెప్పవేయ, వోజఁ దప్పవు వైరనుడుగ వెంతయును
బగయొండె బొమముడిపాటొండె నిండు,నగవొండె నార్పొండె నలుకచూపొండె
పలుకొండె మెచొచ్చొండె బైవడి పోరు, నలవొండె ధృతియొండె హంకృతియొండె
గలుగనితలలేదు ఘనరణభూమి, తలమునఁ బడియున్న తలలలో నొకటి
తలలందు సమముల్గై తలకొనుచుండ, మొలతెంచు తలలందు మొగి నుర్వికూలు
దానవాధీశ్వరు తలలు బాహువులు, భూనభోంతరము లద్భుతముగా నిండె
నిండుటఁ గనుఁగొని నిండఁ గోపించి, వెండియు రామభూవిభుఁ డేయుచుండెఁ
ద్రెంచినశిరమును ద్రెవ్వినకరముఁ, ద్రుంచినశిరమును దునిఁగినకరము
బలువడిఁ బుట్టిన బాహుదండముల, నలమి యప్పుడు పట్టి యద్దశాననుఁడు
గణుతింపరాని వేగము లావు మెఱసి, రణరోషదృష్టిమై రాముపై వై చె
నఱిముఱి దశకంఠుఁ డందంద వైవఁ, బఱు తెంచుశిరములు బాహుదండములు
గువలయహితవృత్తి కుశలుఁడై కళల, నవిరళాకృతి జగదానందుఁ డగుచుఁ
గమనీయవానరగ్రహమధ్యవీథి, రమణుఁడై యొప్పెడు రఘురామచంద్రుఁ
గని చంద్రుఁ డనుబుద్ధిఁ గమలషండములు, ఘనరాహుకోటులఁ గడఁకతోఁ గూడి
యడరి యన్యోన్యసహాయము ల్వడసి, వడిఁ బేర్చి వచ్చుకైవడిఁ దాఁకుచుండె

శిరములుఁ గరములు నెలఁగి యే లెంచు, వరుసలు పంక్తులు వర్ణింప నొప్పు
శ్రీరామవిజయలక్ష్మీవివాహమున, నారణదేవత లర్ధి శోభిల్లఁ
బల్ల వరత్నదర్పణతోరణములు, తెల్లమై కట్టిన తెఱఁగు దీపింపఁ
దరిగినతలలు నుద్దామబాహువులుఁ, గురిసెడిసరములు ఘూకకాకాది
ఖగములు జగము లాకంపింపఁ బేర్చి, గగనమండలమెల్లఁ గలగొనఁగండ
గురుతరంబై జముకొలువుకూటమునఁ, గరముగ్రముగ మేలుకట్టునఁ బరఁగి
యిది దివ మిది రాత్రి యిది సంధ్య యనుట, త్రిదశులకైనను దెలియరాకుండె

రావణునికరశిరంబులు మరల మొలుచుటకై శ్రీరాములు చింతించుట.

ప్రథితశరాసనబాణదీప్తులును, ప్రథనంబులోఁ బట్టపగలయి తోఁచె
నప్పుడు రఘురాముఁ డాదైత్యుఁ గెలుచు, చొప్పింత యైనను జొప్పడకునికి
గనుఁగొని శరసంధిగతులుఁ బాలించి, తనలోనఁ బలుమఱు దలపోయఁ దొడఁగె
తెరలక శిరములు త్రెంచి వేసరితి, దొరకొని కరములు త్రుంచి వేసరితి
నెసఁగు మర్మములెల్ల నేసి వేసరితి, విసువక పలుమాఱు వ్రేసి వేసరితి
నెబ్బంగిఁ దెగటారఁ డీదుష్టచిత్తుఁ, డెబ్బంగిఁ దెగటార్చ నిద్దురాత్మకుని
ననియని తలపోసి యలయుటఁ జూచి, జననాథుతో విభీషణుఁ డర్ధిఁ బలికె
వనజాతజాతుని వరమునఁ జేసి, యినకులాధీశ్వర యీతనినాభి
నమృత మున్నది కుండలాకృతిఁ గలిగి, యమృతత్వమూలమై యది చంపనీదు
దానవుతలలు నుద్దండబాహువులు, మానక నీవెన్ని మాఱు లేసినను
మొలతెంచుచుండు నుస్మాలముల్గావు, తలఁకఁడు దీన నద్దనుజవల్లభుఁడు
తఱిమి యిమ్మెయి నీవు తలలు బాహువులు, నఱుకుచున్నాఁడవు నరనాథ కడఁగి
తుదియేది దీనికి దొసగొడ్డి నీవు, చదురొప్ప నాగ్నేయశరమేయు మింక
నానాభిమూలమూలామృతం బిగురు, దాన దానవపతి దాన లోదారు
నిగిడెడు భవదీయనిష్ఠురాస్త్రములఁ, దెగి మఱి చేతులు త్రిదశారితలలు
దురములోపల నూటతొమ్మిదిమాఱు, లరుదుగా మొలతెంచు నంతటఁ బోలియు
ననవుడు విని లక్ష్మణాగ్రజుం డతని, వినయనయజ్ఞానవిశ్వాసభక్తి
భావశుద్ధికి నాత్మఁ బలుమఱు మెచ్చి, దేవత లుప్పొంగ దివిజారి గ్రుంగఁ
గ్రుంగనిధర్మంబు గొనలుసాగంగఁ, గాగిననదు లెల్లఁ గలఁక దేరంగఁ
దేరనిచిత్తంబు దేరి రాఘవుఁడు, ఘోరంబుగా ధనుర్గుణము మ్రోయించి
కనలెడి దీర్ఘనిశ్శాతములుగరియ, ననలాస్త్రమరివోసి యలవొప్పనేసి
యారావణునినాభియం దున్నయమృత, మారూఢశరవహ్ని కాహుతిచేసి
మఱి నూటతొమ్మిదిమాఱులు ద్రుంచి, తఱిగొని రావణుతలలు బాహువులు
నిరుపమాస్త్రంబున నృపకులాధిపుఁడు, పరికింప మఱి నూటపదియవసారి
యొక్కశిరంబును నొగిఁ గరద్వయము, దక్కఁగఁ దక్కినతలలు బాహువులు
దెగనేసె నేసినఁ ద్రిదశులు చెలఁగి, రగచరవరులార్చి రందంద వేర్చి
తలలోలిఁ దెగి రక్తధారలు ధాత్రి, నొలుకఁగ దివి కుబ్బ నొప్పె రావణుఁడు

లోకహావిర్భాగలోలకీలములు, పైకొని మండెడి ప్రళయాగ్నిపగిదిఁ
దనువున ఘనరక్తధారలు నిండ, దనుజేశుతనువుపైఁ దలయొప్పఁ జూడ
నరుణారుణచ్ఛాయ లడరు నస్తాద్రిఁ, బరఁగెడి భానుబింబంబుచందమున
నప్పుడు రావణుం డావిభీషణునిఁ, దప్పక చూచి యుదగ్రుఁడై యలిగి
యెవ్వరు నెఱుఁగని యిట్టి నామర్మ, మివ్వసుధీశున కెఱిఁగించె వీఁడు
వీని ద్రుంచెద నంచు విపులోగ్రశక్తి, పూని వైచుటయు నభోవీథినుండి
యఱిమిఱి నిగిడి కాలాగ్నిచందమున, నెఱిమంటలుమియుచు నేతెంచుచుండ
నారామవల్లభుం డచలుఁడై ఘోర, నారాచముల దాని నడుమునే త్రుంచె
జడిగొని రఘురాముశరవృష్టి పర్వి, యడుగకుండుటయు నందుండరాకున్న
వలనేది రాక్షసేశ్వరుకోపవహ్ని, పొలుపరఁ బెడఁబాపి పోవుచందమునఁ
బోయె రావణు దేహమున నున్న తేజ, మాయవసరమున నద్భుతం బగుచు
తలలుచేతులుద్రెవ్వి దశకంరుఁడొక్క, తలయుఁ జేదోయునై దర్పించి యపుడు
వీరరసంబను వెల్లిచందమునఁ, దోరమై తొరుఁగు నెత్తుటఁ దొప్పఁ దోఁగి
తడఁబడనెత్తుటఁ దడిసి రణోర్విఁ, బడియున్నతలులును బాహుదండములు
వాని చంచులఁజించు వరపక్షిరణము, బూని యొక్కటఁ జూచి భూనాథుఁ జూచి
చఱగొని తనదైన సటలెల్లఁ బెఱుక, చెఱ విడివడి మ్రోయు సింగంబుభంగి
నేపారు తనకోఱ లెల్లనుఁ బెఱుకఁ, గోపించి పైఁబడు ఘోరాహికరణి
మీసంబు లూఁచిన మిగుల గోపించి, శ్వాసింపఁగడఁగిన జమునిచందమున
మెఱసి లోకములెల్ల మ్రింగెడిరీతి, నుఱక కోపించి మహోగ్రుఁడై తొంటి
యన్నిచేతులఁగల యాసత్త్వమెల్ల, నున్నచేతులరెంట నుగ్రమై తోఁప
నాసురవరుఁ డట్టహాసంబుచేసి, ప్రాసతోమరశూలపరశుఖడ్గముల
శరముల సురియల శక్తుల గదల, నురువడి వ్రేసియు నురక వైచియును
బొడిచియు నడచియుఁ బోనీక రాము, నుడుగక నొప్పించి యుగ్రుఁడైయేచి
దేవత ల్భయమందఁ దెగి మహారణము, గావించుచుండె నక్కజమైనకడిమిఁ
గడఁకయు లావును గర్వంబు మిగుల, నడరి ధీరతఁ బోరు నమరారిఁ జూఁచి
మాతలి భీతుఁడై మఱి రాము ననియె, నీతడవేటికి నినకులాధీశ
తలలు బాహువులు నిద్దనుజాధిపతికి, మొలచునో క్రమ్మఱ మొలవకమున్నె
యెడపక బ్రహ్మాస్త్ర మేసి యీనీచుఁ, బడవైతుకాక దోర్బలశక్తి మెఱసి
యనవుడు విని రాముఁ డభిరామబలుఁడు, వినుతవిక్రమభుజావిభవనిర్భరుఁడు
విదితమా శస్త్రాస్త్రవేదిగావునను, నిది వేఱ బ్రహ్మాస్త్ర మెత్తంగ ననుచు
భూదేవదేవ తపోధనువేద, వైదికకర్మప్రవర్తనఁ దలఁచి
తనప్రతాపంబును దర్పంబు మెఱసి, ధనువు మ్రోయించుచు ధరణి గంపింపఁ
గౌశికకృతమైన క్రతువేళఁ దనకుఁ, గౌశికుఁ డిచ్చినఁ గైకొన్నయట్టి
యక్షయబ్రహ్మాస్త్ర మప్పుడు దలఁచి, దక్షత వేదమంత్రములతోఁ బుచ్చి
తిరముగా నరివోసి తెగ నిండఁ దిగిచి, పరఁగఁ బ్రత్యాలీఢపాదుఁడై నిలిచి

దేవేంద్రుఁడాదిగా దివిజు లుప్పొంగ, దేవారియురమునై దృష్టి సంధించి
యేసె నేయుటయుఁ బెల్లేచి యాబాణ, మాసురాలోకకీలాభీల మగుచు
వసువులు కెలఁకుల వనజాతమిత్ర, వసువు లగ్రంబున వసుగర్భ్ను తతులు
పిఱుఁదుముందఱ మహాపృథులమారుతము, గరుల నుజ్జ్వలదివ్యకళ లెల్లకడల
సహజంబులై వేర్చి సంతతామోఘు,మహితమై దేదీప్యమానమై సకల
శాఖామృగాభీష్టసఫలమై చతుర,లేఖావలోకనాలీఢమై నిగిడి
నిలువక విలయాభ్రనిర్ఘోషఘోష,ములు పర్వ రాక్షసముఖ్యులు బెదర
జయజయధ్వనులతోఁ జదలు గ్రక్కఁదల, రయమున రావణోరస్థలి గాడి

రావణుఁడు బ్రహ్మాస్త్రముచే మడియుట.

యయ్యింద్రయమవరుణాదులచేత, వ్రయ్యనిమర్మము ల్వ్రిచ్చి రావణుని
ప్రాణముల్గొని యుచ్చి పాఱే యాదివ్య, బాణంబు వెస మహీభాగంబు గాడి
నీకూఁతుఁ జెఱఁబెట్టి నీచభావమునఁ, గైకొనఁ దలఁచిన ఖలుని ప్రాణములు
కైకొంటి నేనని కదిసి భూస్థలికిఁ, బ్రాకటంబుగఁజెప్పఁ బఱచెనో యనఁగ
మహి గాడి పఱతెంచి మగిడి రాఘవుని, మహితతూణీరమున్నదవృత్తిఁ జొచ్చె
నలి బ్రహ్మమనుమని నాటిచంపుటకుఁ, గలిగినదోషంబు గడతేర్చుకొనఁగ
నేచందమున నెందు నితరంబులేమి, చూచి రాఘవుమర్వ్ సొచ్చెనో యనఁగ
రాఘవాస్త్రాహతరక్తాంబుధార, లోఘంబులై పర్వ నొరయుచు వచ్చి
కులిశధారాహతిఁ గుంభిని గూలు, కులశైలమును బోలెఁ గూలె రావణుఁడు
ఆదైత్యభూరిదేహాపతితమున, భూదేవి యప్పు డద్భుతముగాఁ గ్రుంగెఁ
గ్రుంగె శైలంబులు గ్రుంగె దిక్కరులు, గ్రుంగె భుజంగంబు గ్రుంగెఁ గూర్మంబు
తలఁకిరి సప్తపాతాళవల్లభులు, దలఁకిరి హతశేషదనుజపుంగవులు
గిరిచరులార్చిరి కీర్తించి రమర, వరులు కిన్నరులు దిగ్వరులు ఖేచరులు
ఆరఘురాముపై నప్సరస్త్రీలు, బోరనఁ గురిసిరి పుష్పవర్షములు
దివ్యదుందుభులును దివ్యకాహళులు, దివ్యశంఖంబులు దివినిండ మ్రోసె
శీతలపరిమళాశ్లిష్టవాయువులు, వీతెంచె దిక్కులు విమలంబు లయ్యె
సురమునిఖేచరశోకంబు డించి, పరికించి సకలభూభారంబు డించి
యభిమతజయశీలుఁడై వేర్చి రామ,విభుఁ డంతఁ దనచేతివిల్లెక్కుడించి
యానందమయచిత్తుఁ డగుచు నవ్విల్లు, జానకీవిభుఁడు లక్ష్మణుచేతికిచ్చె
సకలవానరులును సకలఖేచరులు, సకలదిక్పతులును సకలభూవరులు
సకలభూతంబులు సకలదేవతలు, సకలలోకంబులు సన్నుతిసేయ
ననిమొన గర్వాంధు నంధకాసుహనిఁ, దనుమూడి విలసిల్లు ధూర్జటివోలె
రాముఁడు లోకాభిరాముఁడై విజయ, రాముఁడై నవసుధారాధాముఁడై యొప్పె
నంత విభీషణుం డధికశోకమున, సంతాపమందుచు సమరమధ్యమున
నలఘుఁడై పడియున్నయగ్రజుఁ జూచి, పలుమఱు నెలుగెత్తి పలవింపఁదొడఁగె
నాహవోదగ్రసురాసురభయద, బాహులు పతులపాలయ్యె నేఁడు

సురుచిరమృదుతల్పసుభగదేహంబు, పరుషసంగరభూమిఁ బడియెనే నేఁడు
అహితాంధకారబాలార్క-బింబములు, మహిఁ గూలెనే నేఁడు మణికిరీటములు
వినయవిక్రమనయవిఖ్యాతులందు, నినుఁ బోల రెవ్వరు నీయంతవాఁడు
కడపట నరయంగఁ గష్టుండు ఖలుఁడు, బెడిదుండు వీఁడనఁ బృథివి నేర్పడితి
తప్పుట తప్పని తలపోయవైతి, చెప్పినమాటలు చెవిఁ బెట్టవైతి
వెమ్మెయి నయమార్గ మెఱుఁగలేవైతి, విమ్మన్న జానకి నీనేరవైతి
మంతనంబున రాము మర్త్యగా నీవు, చింతింపవలదన్నఁ జేకొనవైతి
నీమానగర్వంబు నిన్నింతచేసె, నేమని శోకింతు నేనింక నీకు
వలదు రామునితోడి వైరంబు విడువు, చలమొప్పదని నీకుఁ జాటనే తొల్లి
నిరుపమనయనిధీ నీయట్టిసుకృతి, పరసతిఁ దల్లిఁగా భావింపవలదె
జగతిలో తగవు విచారింపవైతి, తగిలి నామాటలు తలకూడె నేఁడు
అని యని శోకించు నన్న నేరములు, మనమునఁ జింతించు మఱియు శోకించు

మందోదరి మొదలగు రావణునిభార్యలు శోకించుట.

నంత మందోదరి యాదిగా దనుజ,కాంతలు గూడి లంకాపురి వెడలి
యడుగులకెంజాయ లవనిపై నొలుకఁ, దడఁబడి మేఖలాదామము ల్నడల
నఱికొను లసియాడ నలసయానములు, మెఱయలోయలతల మెయిదీఁగె లులియ
హారము ల్దెగి రాల నశ్రుపూరములు, తోరంబులై యొల్క- దొలఁగఁ బయ్యెదలు
వీడినవేణులు వెన్నులనొరయ, వాడినమోములు వరవట్లు గట్ట
మొకములు దలలును మొగి మోఁదికొనుచుఁ, బ్రకటరోదనములు బహువిలాపములు
గుదియఁగ రోదసీకుహరంబు నిండఁ, గదిరెడిశోకాగ్నిఁ గాలుచు వచ్చి
విఱిగినరథములు వికలభావములఁ, బఱియలైయున్న కపాలకుంభములు
తునిసినచేతులు తునియలైపడిన, తనువులు నురుమైన దంతిదంతములు
చిదిసినతలలు విచ్ఛిన్నంబులైన, గదలును బొడియైన ఘనకంకణములు
తెగినగుండియలును దృఢమస్తకములు, పగిలినగళములు భగ్నశస్త్రములు
ప్రేవులపోగులు పిశితఖండములు, జీవము ల్విడిచియుఁ జెలువొందుకపులు
హయములు చిద్రపలు నద్రిశృంగములు, పయిఁబయిఁబడిన కబంధబృందములు
నిలువక పాఱెడి నెత్తురుఁ జేర్లు, కలిసి మెండుగఁ బాఱు కరటితుండములు
నడ్డంబు నిడుపునై యద్రులక్రిందఁ, గుడ్డులు వెలికుర్కి- కూలినభటులు
చేకొని శవములఁ జిట్టుముట్టాడు, కాకఘూకానేకకంకగృధ్రములు
రామశరక్షతరక్తపానములు, సోమపానములని సోలుభూతములు
రామునిఁ గీకురించి రాక్షసేశ్వరుఁడు, భూమిజఁ దెచ్చుట పొగడుభూతములు
శిరములు పదియును జేతులిర్వదియు, నరుదార నొకరిత్త యట్టఁ బొందించి
దైతేయకులనాథ తగదు రామునకు, సీతనిమ్మని బుద్ధి చెప్పుభూతములు
కోతిమొందులు సొచ్చి కోఁతులై వచ్చి, బ్రాఁతైన కరటికబంధముల్ దెచ్చి

వడిఁబెర్చి ఘనరక్తవార్ధిలోముంచి, గడకఁతో నేతువుఁ గట్టుభూతములు
నారాయణుఁడ నేను నాకులు మీరు, మీరు రాక్షసులని మేరలుచేసి
పనివడి కరటికబంధములైచ్చి, ఘనతఁ బ్రేవులు శేషుగాఁ జేసి చుట్టి
కోరి రక్తాబ్ధిలోఁ గొనితెచ్చి వైచి, ధీరత మించి మర్దించుభూతములు
మాఁసాముబొణనిర్మథితమాంసముల, కీరాఁ దె నీనాక మేల యిచ్చెదవు
సొలవక మేకనంజుళ్లకు ననుచు, నలినింద్రుఁదెసఁ జూచి నవ్వు భూతములు
మదిఁ జేవగలిగి కుమారతారకులు, గదిసిన సంగరాంగణముఁ జూచితిమి
అదయులై విషకంధరాంధకాసురులు, గదిసినసంగరాంగణముఁ జూచితిమి
త్రిదశేంద్రవృత్రులు దెగువమై మెఱసి, కదిసినసంగరాంగణముఁ జూతిచిమి
ఈమాంసఖండంబు లీకబంధంబు, లీమహారక్తంబు లీవింతచవులు
పొడగాన మేమని పొంగి యొండొండ,నడరుచుఁ దొడరుచు నాడుభూతములు
రవికులాధిపుఁడైన రామువిక్రమము, తివుటమైఁ గడఁగి కీర్తించుభూతములు
ఈరామవిక్రమం బేటివిక్రమము, ఘోరాహవంబులు కోటులు సలిపి
వరమాంసరక్తప్రవాహము ల్వఱపి, పరితృప్తి గావించు పజ్జకంధరుని
ననిమొనఁ దెగటార్చె నాచవు లింక, మనకెందుఁ గలవని మరుగుభూతములు
ఊరురథధ్వజదండయుగళము ల్నిలిపి, పొరిఁబొరిఁ బ్రేవులు పొందొండ ముడిచి
పరమసమ్మదమునఁ బ్రమదలుఁ దారు, సరసడోలాకేళి సలుపుభూతములు
ఎమ్ములు నమ్ములు నెడలుగఁ ద్రోసి, యిమ్మైనచోటుల నెడగల్ల నిలిచి
ప్రియమొప్పఁ బ్రియులును బ్రియలను గూడి, ప్రియరక్తపానసంభృతకేలి దేలి
చెలువొప్ప రాముఁడు సీతతోఁగూడి, వెలయుఁగాకంచు దీవించుభూతములు
కలిగి భయంకరాకారమైయున్న, కలహారంగముఁ జొచ్చి కడుచోద్యమంది
పనవుచు నేడ్చుచుఁ బతిఁ బోరుకొనుచుఁ, జనుదెంచి యందు రాక్షసవధూజనము
తునిసి నెత్తుటఁ దొప్పదోఁగినకేలు, తనుపారు కిసలయతల్పంబుగాఁగ
నకలంకతరములై యడరి పైఁబర్వ్, మకుటరత్నారుణమండలప్రభలు
తనుఁ బెక్కుగప్పినఁ దద్దయు నొప్పు, ఘనధాతువస్త్రనికాయంబుగాఁగ
ననివడఁ బర్వి సర్వాంగంబులందుఁ, దలకొన్న మెదడు చందనచర్చగాఁగఁ
జతురసంఘట్టనజాతాస్థిరజము, ప్రతిలేని పుష్పపరాగంబుగాఁగఁ
దాలసముత్తాలదండము ల్వీరిగి, వ్రాలి తూఁగాడెడు ధ్వజములఁ గ్రాలు
కోమలమృదులదుకూలఖండములు, వేమఱుఁ బైవీచు వీవనల్లాఁగ
నంతంతఁ జుట్టును నవనిపైనున్న, దంతావళోరుముక్తాఫలావళులు
వరుసతో బడిసిపో వైచినఁ జెదరి, కర మొప్ప మల్లికాకళికలుగాఁగ
నరుదుగాఁ బర్విన యారామచంద్రు, శరచంద్రికలచేత సంతాపమంది
వీరలక్ష్మీఘనవిరహాగ్నిఁ గ్రాగి, ధారణిఁ బడియున్న దశకంధరుఁ గనిరి
కని యంత శోకాబ్ధికరడులఁ దేలి, దనుజేశుపైఁ బడి దానవాంగనలు

మందోదరీవిలాపము.

పనువ మందోదరి పతిమీఁద వ్రాలి, తనరెడుశోకాబ్ధిఁ దరియింపలేక
కలసి బాష్పంబులు కన్నులదొరుఁగఁ, బలుమాఱు నెలుఁగెత్తి పలవింపఁదొడఁగె
హా రాక్షసేశ్వర హా వీరవర్య, హారణాలంకార హా నాథ యనుచు
నలఁతయుఁ బలువగ లడలు దీపింపఁ, బలుమాఱుఁ బలవించి పతిఁ జూచి పలికె
లంకేశ నేఁడు నీలంకలోపలికి, శంకింప కినశశ్మిజాలములొచ్చెఁ
నెడరయ్యె నిపుడని యింద్రాదిదివిజు, లుడువీథి నందఱు సుబ్బుచున్నారు
అమరాధిపతి గెల్చి యనలుని గెల్చి, సమవర్తినాజిలో సాధించి మఱియుఁ
బాశహస్తుని గెల్చి పవమాను గెలిచి, యీశానుసఖు గెల్చి యీశాను గెలిచి
నీలావులావుగా నిఖిలలోకముల, వాలుదు వెందు దుర్వారుండ వీవు
నీకిట్టిదుర్దశ నేఁడేల కలిగె, నీకంఱె బలియురు నేర్చిరే కలుగ
ధారణీసుతనిమ్ము తగదు రాఘవుఁడు, నారాయణుఁడుగాని నరుఁడు గాఁడతఁడు
అని నీకుఁ జెప్పితి నకట! నాపలుకు, వినవైతి నీవిధి విన నేలనిచ్చుఁ
దప మాచరించుచో దశకంఠ దొల్లి, విభులైకనిష్ఠతో విదితంబుగాఁగ
నీవింద్రియంబుల నెఱి నిగ్రహించి, తీవ్రతరమున నిష్ప డవి యేమఱించి
యసుకూలశత్రులై యాయింద్రియములు, జనకజఁ దెప్పించి సమరంబులోన
నినవంశుచే నిన్ను నిట్లు చంపించె, ననినీకు హితులెవ్వ రసురాధినాథ
సురలకు నెబ్బంగిఁ జొరరానిలంక, నురవడి హనుమంతుఁ డొక్కఁడే చొచ్చెఁ
గలఁగక జలరాశి కట్ట వానరుల, కలవియే సురలు వీరంటి నేనఱుఁడె
తరమిడి నాజనస్థానంబునందు, ఖరదూషణాదిరాక్షసులఁ బెక్కండ్రఁ
బలువిడి నొక్కండె పటుబాహుశక్తి, నలిరేఁగి చంపిననాఁటనుండియును
దలఁకుదు రాముని దలఁచి నిఁజూచి, తలఁకుట యెల్లను దలకూడె నేఁడు
ధర్మతత్పర యరుంధతికంఱె నిత్య,నిర్మలమతి రోహిణీదేవికంఱె
భూరిగుణోజ్జ్వల భూదేవికంఱె, సైరణగల పుణ్యసాధ్వి జానకిని
దెగిఁ దెచ్చినప్పుడే దేవికోపాగ్ని, బొగిలినాఁడవు గదె భువనంబు లెఱుఁగఁ
గైకొని యెవ్వఁడే కర్మంబుజేసె, నాకర్మఫలము వాఁ డందకపోఁడు
అతినీతిపరుఁడైన యావిభీషణున, కతులసౌఖ్యము గల్గె ననఘాత్ముఁ డగుట
ఏపున లోకంబులెల్లఁ గాతెంచు, పాపికి దురవస్థ పాటిల్లె నేఁడు
కలదు సీతాదేవికంఱె సౌభాగ్య,కలితలు పెక్కండ్రు కామిను ల్నీకుఁ
గామాంధకారంబు కన్నులఁ గప్పి, నీమదిఁ దెలియంగ నేరవుగాక
కులరూపదాక్షిణ్యగుణగణాకేళిఁ, దలఁప వైదేహి నాతరముగాదెందు
నాకంఱె నెక్కుడో నాతోడ సరియొ, నీకానమికిఁ జెప్పి నేరగాకేను
మృత్యు వొక్కొక్క నిమిత్తంబువలన, సత్యంబు గలుగుట సకలజీవులకు
నెడవైనమృత్యువు నిటఁ జేరఁదెచ్చు, వడువునఁ దెచ్చితి వైదేహి నీవు
భాగ్యంబుగలసీత పతితోడఁగూడి, యోగ్యంబు లగుసుఖం బొనరఁ బెంపొందె

నాథ భాగ్యములేని నసుఁ జూడు దుఃఖ,పాధోధిలోపలఁ బడి మునింగెదను
పాలుపార నీతోడఁ బుష్పకం బెక్కి, లలితంబులైన లీలావిహారములు
సలిపితి మందరశైలంబునందుఁ, గలధౌతగిరియందుఁ గనకాద్రియందు
నాతతనందనోద్యానంబునందుఁ, బ్రీతిమై మఱియును బెక్కుదేశముల
నక్కటా! యాలీల లన్నియు నన్నుఁ, ద్రెక్కొన్న విధి కడతేర్చెనే నేఁడు
మయుఁడు నాతండ్రి నామగఁడు రావణుఁడు,ప్రియపుత్రు డాహవప్రియుడింద్రజిత్తుఁ
డని గర్వమననుండి యనిలోన రాము,జననాథుచే నీవు చచ్చుఁటెనెఱుఁగ
పిడుగడచినయద్రి పృథివిపైఁ గూలు, వడువునఁ జూర్ణమై వసుధపైఁ ఒడితి
మృత్యువునకు నీవె మృత్యువై యుండి, మృత్యువుపాలైతి మేదినిఁ గూలి
వైరులసతులకు వైధవ్యమిత్తు, నీరామలకుఁ గల్లె నేఁడాఘలంబు
అనియేడ్చుఁ బలవించు నసురేశుమోమున, గనుఁగొని వర్ణించుఁ గన్నీరునించుఁ
దొడలపైఁ దలయిడుఁ దొరుఁగుకన్నీటఁ, గడుగు నాననధూళి కడుఁజిన్నవోవ
కీలించి కేలు కెంగేలిలోఁ దారు, వాలుడెందము గంద వగచు నాత్తేశు
తలయెత్తి డాకేల ధరియించి చూచు, తలయూఁచు వలచేయి ధరణిఁ బొరల్చు
పోయెఁ బొమ్మను రామభూపాలుఁ డింత, నేయునే నేనేమి నేయుదు నింక
నని యలమటఁబొందు నవనిపైఁ బొరలుఁ, దనదికక్కు లేమికిఁ దద్దయు వగచు

విభీషణుఁడు మందోదరిని చూచి దుఃఖింపుట.

తుదిలేనిశోకాగ్నిఁ దొడరి యిబ్భంగి, వదలక కాలెడి వదినెను జూచి
యడుగులపైఁబడి యాత్మలోఁబెద్ద, యడ లిన్మడింపఁగ ననె విభీషణుఁడు
వడితోడఁ బేర్చి రావణపయోరాశి, పడఁతుక రఘురాముబాణాగ్ని నిగిరె
పఱతెంచి రాఘవప్రళయమారుతము, సరసరావణపారిజాతంబుఁ గూల్చె
గమి విచ్చిపాఱ రాఘవనాగవైరి, సమదరావణసామజంబును జంపె
నతులితనిశితరామామోఘబాణ, శతకోటి రావణశైలంబు దునిమె
బలువిడి రాఘవప్రళయదావాగ్ని, నని దశాననకాననము నీఱుచేసెఁ
బడఁతుక రాఘవాపరపయోరాశిఁ, గడఁగి రావణదివాకరుఁ డస్తమించె
ఖరకరామోఘరాఘవనీలమేఘు, శరవృష్టి రావణసప్తార్చి నార్చె

రాముఁడు విభీషణు నోదార్చి రావణునకుఁ బ్రేతకృత్యంబులఁ జేయించుట

నని పెక్కుభంగుల నడలుచునున్న, ఘనవిభీషణుఁ జూచి కాకుత్స్థుఁ డనియె
నీవనితలయేడ్పు లింక వారింపు, మీవును శోకింప కిటమీఁద నుడుగు
పరిగొని శూరులు బవరంబులోనఁ, బరులచేఁ జత్తురు పరులఁ జంపుదురు
జయ మిద్దఱికి లేదు సమరంబులోన, జయపరాజయము లస్థలితమిల్లావు
సకలసుపర్వుల సాధించె నితఁడు, సకలగంధర్వుల సాధించె నితఁడు
సకలదిక్పాలుర సాధించె నితఁడు, సకలభూపాలుర సాధించె నితఁడు
ఏకాంగవీరుం డహీనసాహసుఁడు, లోకైకజితుఁడు త్రిలోకభీకరుఁడు
మీయన్న రణమున మిక్కిలి కడిమిఁ, జేయాపఁ దెలియఁ జూచితికాదె నీవు

ఈచందమున నిల్చి యెవ్వండు పోరు, నీచందము నెదిర్చి యెవ్వండు చచ్చు
నీలావు నీచావు నెవ్వరు వడయఁ,జాలుదు రక్కటా! జయ మేమినేయు
ననఘు మాయన్న కృతార్థుండు వగవఁ, బనిలేదు ధైర్యంబు పాటించి వినుము
కడఁకతో నగ్నిసంస్కా-రాదివిధులు, తడయక చేయు మాదనుజాధిపతికి
ననవుడు భీతుఁడై యావిభీషణుఁడు, ఘనభ క్తియు క్తిమైఁ గరములు మొగిచి
యెక్కఁడి సంస్కా-ర మాతఁడు నాకు, నెక్కఁడి తోఁబుట్టు వితఁడు నాపగత
నీదేవిఁ దెచ్చిన నీచుండు కష్టుఁ, డీదుష్టచిత్తున కెక్కఁడి విధులు
పరవధూజనుల సంస్పర్శంబుసేయు, పురుషు లధోగతిఁ బోయి కూలుదురు
అట్టివారల ముట్ట నర్హ్యంబు గాదు, గట్టిగాఁ గనుఁగొనఁ గాదటుఁగాన
నీపాపకర్ముని నే ముట్టుటకును, నోప వైదికవిధి కుచితుండు గాఁడు
అనుటయు నమ్మాట లంతరంగమునఁ, జొనిపి విభీషణుఁ జూచి రాఘవుఁడు
అనఘు నీచెప్పిన యంతకుఁ గలఁడు, దనుజాధిపతి నింకఁ దగదు దూషింపఁ
గడఁకతో సమరగంగాప్రవాహమునఁ, గడిగికొన్నాఁ డొగిఁ గలకల్మషములు
అచ్చుగా నాపను లన్నియు నయ్యెఁ, జచ్చినపిమ్మటఁ జనదు వైరంబు
పరువడి నితనికిఁ బరలోకవిధులు, కరమర్థిఁ జేయుము కడఁకతో నీవు
అనవుడు నౌఁగాక యని విభీషణుఁడు, తనబుద్ధి వైదికధర్మంబుఁ బూని
యచటికి నగ్నిత్రయంబుఁ దెప్పించి, యచలమానసుఁ డప్పు డగ్రజస్తునకుఁ
గరమొప్ప నగ్నిసంస్కా-రాదులైన, పరలోకవిధులెల్ల భ క్తితోఁ జేసి
చనుదెంచి యారామచంద్రునంఘ్రులకు, వినతుఁడైయున్న యవ్విభులాత్తుఁ జూచి
ప్రియభాషణంబులఁ బెద్ద మన్నించి, దయపెంపు మిగుల నాతని నూఱడించి
ధరణీశుఁ డప్పుడు తమ్మునిఁ జూచి, నిరుపమకారుణ్యనియతుఁడై వలికె

విభీషణుని లంకాపట్టాభిషేకము.

నీవింక లంకలోనికిఁ బోయి పుణ్య, భావు విభీషణుఁ బట్టంబుఁ గట్టి
రమ్ము పొమ్మనవుడు రాఘవానుజుఁడు, నెమ్మితో లంకలోనికిఁ బోయి యపుడు
తడయక తరుచరోత్తములను బనిచి, కడఁక సముద్రోదకములఁ దెప్పించి
వారిపురోహితవరుల రప్పించి, వారిసజ్జనమంత్రివరుల రప్పించి
భూరిమంగళతూర్యములు మ్రోయ నతని, నారూఢనియతితో నభిషిక్తుఁ జేసి
సంచితమంగళాచారము లెఱయ, నంచితసింహాసనాసీనుఁ జేసి
కరమొప్ప నతని లంకా రాజ్యమునకుఁ, బరమసమ్మదమునఁ బట్టంబుఁ గట్టి
యెందాఁక రవిచంద్ర లెందాఁక ధరణి, యెందాఁక కులగిరు లెందాఁక నభము
నెందాఁక జలనిధు లెందాఁక దిశలు, నెందాఁక రాఘవాధీశుకీ ర్తనము
లారూఢముగఁ జెల్లు నందాఁక నేలు, మీరాజ్యమని యప్పు డెలమి దీవించి
పరఁగ రక్షోరాజ్యభరణ మెవ్వరికిఁ, బరికించి నడపుట పరమదుర్లభము
దీని నేమఱక వర్తింపుము నిత్య, మైనధర్మము సేయుమని యొప్పఁ బలికె
నంత విభీషణుం డఖిలరాజ్య, సంతోషమునుబొంది చతురమానసుఁడు

తడయక మంగళద్రవ్యములల్లంచి, తొడవు లంబరములు దూర్వాక్షతములు
గొని లక్ష్మణునిఁ గొల్చి కొమరొప్ప వచ్చి, జననాథునకు నిచ్చి సద్భక్తి మ్రొక్కి
నలవుమై రఘురాముఁ డవియెల్లఁ బుచ్చి, యెలమితో మాతలి కిచ్చి వీడ్కొలిపె
మాతలి రథమెక్కి మహనీయమహిమ, నాతతరథవేగుఁడై పోయె దివికిఁ
దదనంతరంబ చుద్ధరణివల్లభుఁడు, మదిలో విచారించి మారుతిఁ జూచి
జనకపుత్రికి మనజయము నేమంబు, వినుపింపు లంకకు వేగ పొమ్మనుడు
చని హనుమంతుఁడు సంతోష మొదవ, ఘనవేగమున లంకఁ గడఁకతోఁ జూచి
యారామువిజయంబు నాత్మఁ జింతించు, నారాముసతి నశోకారామవీథిఁ
గని మ్రొక్కి వచ్చుతిఁ గల్యాణి యనుచు, వినతుఁడై పలికెను వినయంబుతోడ
సంతోష మెంతయు జానకి నీవు, చింతించుపగిదినే సిద్ధించె నీకు
దేవి నీపతి రామదేవుండు వచ్చి, రావణు లోకవిద్రావణుఁ జంపి
తొడరి యనేకుల దుష్టరాక్షసులఁ, బొడిచేసి సమర మద్భుతముగాఁ జేసి
తమ్ముఁడు సౌమిత్రి తనుఁగొల్వఁ బరమ, సమ్మదంబున రామచంద్రుఁ డున్నాఁడు
అని చెప్పి యాదేవి యడలార్పఁ దొల్లి, పనివచ్చియాడిన బాసలు దలఁచి
జలజాక్షి నీపతి జలధి బంధించు, లలన నీనాథుండు లంకపై విడియు
రమణి నీరమణుండు రావణుఁ ద్రుంచుఁ, గమలాక్షి నీభర్తఁ గైకొను నిన్ను
నని విన్నవించితి నర్థినాఁ డిచట, వనిత నాప్రతినలు వచ్చె నన్నియును
పనివినియెద నింకఁ బతిపాలి కేను, బను లానతిమ్మన్నఁ బవనజుఁ జూచి
రావణుమరణంబు రఘురాముజయము, భావించి భావించి పడఁతి హర్షించి
తెగి నీప్రతాపంబు దీపింప రామ,జగతీశ్వరుఁడు వచ్చి సాధించెఁ గాక
ఘనదైత్యగర్వాంధకార మీలంకఁ, జనఁజొచ్చి పరులకు సాధింపఁబరమె
నీస్థైర్యగాంభీర్య నిరవద్యశౌర్య, మాధుర్యపర్యాయమహిమ లేమందు
నేమని వర్ణింతు నేను నీచరిత, మేమని పొగడుదు నేను నీకడిమి
నూత్నభూషణజగన్నుతవస్త్రహేమ, రత్నసంపదలతో రాజ్యమిచ్చినను
బరఁగ నీచేసినపౌరుషంబునకుఁ, బరికింప సరిగావు పవమానతనయ
సంతోష మందితిఁ జాల నీవలన, నంతరంగంబున నని సీత పలుక
హనుమంతుఁ డత్యంతహర్షంబు తనదు, మనముసఁ బొనఁగొన మగువ కిట్లనియె
నన్ను మీరిటు కరుణాదృష్టిఁ జూచి, మన్నించి యాడిన మాటయె చాలు
భావింప దేవేంద్రపదమునకంటె, నేవస్తువులకంటె నిధి ఘనం బరయ
ననిపల్క మఱేయును నమ్మహీపుత్రి, హనుమంతుఁ గనుఁగొని యతని కిట్లనియె
బలమును శౌర్యంబు బాహావిక్రమము, నలఘుతేజంబును నంచితక్షమయు
శ్రుతము మాధుర్యంబు సుస్థిరత్వంబు, సతతంబు నిశ్చలస్వామిభక్తియును
వినయంబు మొదలైన విశ్రుతగుణము, ననుపమస్థితి నొప్పు ననఘు నీకనినఁ
గడుభీకరాకృతు లల్లిగి యద్దేవి, కడనున్న రాక్షసాంగనల నీక్షించి
యాపాపకర్మనియాజ్ఞ వాటించి, యీపాపమతులు నీకెన్గనేయుదురు

ఘనముష్టినిహతులఁ గడతేర్చిపుత్తు, ననవుడు జానకి హనుమంతుఁ జూచి
యేసినవాఁడుండ నిషువేమి సేయు, దాసీవధం బెందుఁ దగదు చింతింపఁ
దొల్లి నేఁ జేసిన దుష్కర్మఫలము, లెల్లను గంటి వీరేమి సేయుదురు
అనఘచారిత్ర పాపాత్ములంటైన, ఘనులు దయాబుద్ధిఁ గలిగియుండుదురు
గాన నీరాక్షసకాంతలఁ జంప, వానరోత్తమ నీకు వలదన్న నలరి
నిర్మలగుణరత్ననిధివి నీవరయ, ధర్మపత్నివిగాఁగఁ దగుదు రామునకు
భూనాథుకడ కింకఁ బొమ్మని నాకు, నానతి యిమ్మన్న నద్దేవి పలికె
భావంబు తానని పట్టితిఁ బ్రాణ, మే వానరోత్తమ యింతకాలంబు
తన్నుఁజూడక యింకఁ దడవోర్వఁజాల, నున్నరూపని తెల్పు మూర్వీశునకును
బొమ్మని దీవింప భూమినందనకు, నెమ్మితో మ్రొక్కుచు నిపుణమానసుఁడు
చనుదెంచి యారామజగతీశ్వరునకు, వినతుఁడై పావని వెస విన్నవించె
దేవ నీసేమంబు దేవ నీజయము, దేవితోఁ జెప్పిన దేవి హర్షించె
వనజాతనేత్ర దేవరఁ జూడవలయు, ననిన విన్నపమునేయుమని పంచె నన్ను

శ్రీరాములు విభీషణునితో సీతను దెమ్మనుట.

ననిన నించుకతడ వాత్మఁ జింతించి, జననాథుఁ డావిభీషణుఁ జేరఁబిలిచి
జనకజ మంగళస్నానంబుసేయఁ, బనిచి దివ్యాంబరాభరణమాల్యములు
వెలయఁ గైసేయించి వేడ్క నిక్కడికిఁ, బొలఁతుకఁ దోడ్తెమ్ము పొమ్మన్న నతఁడు
సంతసంబున నేగి సరమాదులైన, యంతఃపురస్త్రీల కంతయుఁ జెప్పి
జనకజఁ దెండన్న సంప్రీతి వారు, చని భూమిజకు మ్రొక్కి సద్భక్తితోడ
దేవి నీపతి రామదేవుండు పిలిచి, యావిభీషణుతోడ నానతియిచ్చి
పుత్తెంచుటయు మమ్ముఁ బుత్తెంచె నీవు, చిత్తంబులోపలఁ జెలువువాటించి
యభిమతమంగళాయతుఁ డైనరామ, విభుఁడున్నచోటికి వేంచేయవలయు
నీవేష మేటికి నెలనాఁగ నీకు, నీవు కల్యాణివి నీరేరుహాక్షి
యని మంగళస్నాన మర్థిఁ జేయించి, తనులతాతన్వికిఁ దడియొత్తులొత్తి
దివ్యాంబరంబుల దివ్యమాల్యముల, దివ్యభూషణముల దేవిఁ గైసేసి
యసమానమహిమతో నసుర కామినులు, పసిఁడిపల్లకియందుఁ బడఁతుక నుంచి
తోడితెచ్చుటఁ జూచి తోరంపుభక్తి, గడునొప్పు మిగుల రాక్షసులేశ్వరుఁడు
ప్రకటరాజ్యమునకు ఫాలపట్టమును, నకలంకనియతికి హస్తవేత్రమును
ధరియించి యత్యంత ధన్యతఁ బొంది, పరమానురక్తుఁడై బంటువై కడఁగి
ముందర రాక్షసముఖ్యులు నడవ, సందడి జడియుచుఁ జతురుఁడై వచ్చి
యనతిదూరంబున నద్దేవి నునిచి, చనుదెంచి యావిభీషణుఁడు రామునకుఁ
జెచ్చెఱ వినతుఁడై చేతులు మొగిచి, తెచ్చితి విచ్చేసె దేవి నావుడును
అతిహర్షరోషమై న్యాయత్తుఁ డగుచు, మతినింత చింతించి మనుజవల్లభుఁడు
పిలిచి తెమ్మనుడు విభీషణుం డరిగి, యొలసినకడఁకతో నుచితసంవేది
పావనవీధి నప్పరమపావనుఁడు, దేవిజానకిఁ దోడితెచ్చుచోఁ గదిసి

ధనవేత్రహస్తుఁడై కపుల రాక్షసులఁ, గనుఁగొని సందడిగ్రంద వ్రేయుటయు
నామహాకలకలం బప్పు డాలించి, రాముఁడు రాక్షసరాజు నీక్షించి
యోహోవిభీషణ యుచితమే నీకు, నూహింప నేఁటికి నుగ్రకృత్యములు
వింతవా రెవ్వరు వీరిలో మనకు, నింత నొప్పింతురే యిబ్బంగిఁ గడఁగి
వలవదు వారింప వచ్చి యందఱును, గలసి చూతురుగాక కలదె యించెగ్గు
కాలదేశాంతరక్రమమునఁ జెడని, యీలు వొక్కఁడ మఱు వింతియాకా
యెనసినకోటలు నింద్లును దెరలు, వనితల కెందు నావరణముల్లావు
వ్యసనంబులందు వివాహంబులందు, నెసఁగు కయ్యములందు నిష్ఠలయందు
తలకొనిచెల్లు నుత్సవములయందు, వలవదావరణము ల్వారిజాక్షులకు
నేనిందు నున్నాఁడ నిది రణభూమి, గాన నెగ్గేమియుఁ గాదు రానిమ్ము
అనిన విభీషణుం డారాఘవుండు, పనిచినతెఱఁగునఁ బత్నాక్షిఁ దెచ్చె
నప్పుడు కల్యాణి కవనీతనూజ, కుప్పొంగుసంతోష ముల్లంబు నిండ
వెలికి నేతెంచిన విధమునఁ జెమటఁ, గలయఁ దనూలతఁ గ్రమ్మి వైవార
రాకాసుధాకర రామచంద్రావ,లోకనామృతపానలోలయై తేలి
చిరవిరహాగ్నులఁ జెచ్చెరనార్చి, పరమానురాగసంభరితాత్మ యగుచు
నేచినకోర్కుల నెలమిదీపింప, జూచెఁ జూడఁగ నాఁగఁ జూచి రాఘవుని
నవనతవదనయై యశ్రుపూరములు, ధవళవిలోచనోత్పలములఁ దొరుఁగ
భయమును బ్రియమును బైపాటు సిగ్గు, పయిఁబడుచుండ నప్పడఁతుకయుండె
నప్పుడు రఘురాముఁ డాత్మలోఁ గోప, ముప్పొంగఁ దప్పక యుగ్మలిఁ జూచి
మానంబు ప్రాణంబు మహితవృత్తులకు, మానాభిరక్షణ మతిచింతచేసి
మానిని వినుము నామహితవర్తనకు, నే నిన్ను దెచ్చితి నింతియొకాని
యింతి నీదెస నాకు నింతకు మిగుల, నంతరంగంబున నాసక్తి లేదు
కాకుత్స్థకులజులు గాంభీర్యధనులు, లోకరక్షణకళాలోలతత్పరులు
వారివంశంబున వచ్చి జన్మించి, భూరివృత్తోన్నతిఁ బోకార్చెనండ్రు
పగవానియింటిలోపల నున్ననిన్నుఁ, దగిలి వరించుట ధర్మంబుగాదు
ఆలిఁ గోల్పడిపోయి యక్కటా! మగుడఁ, దేలేఁ డితండను తిట్టువాటునకు
వెఱచి తెచ్చితిఁగాని వెలఁది నిన్నొల్ల, నొఱుపైనచోటుల నుండు పొమ్మనిన
జననాథుపరుషభాషాసాయకములు, గొనికాడ నొప్పింపఁ గువలయనేత్ర
యప్పటిసంతోష మంతయు మఱచి, చెప్ప నోరాడక చేష్టలు దక్కి
తాపంబుఁ బొంది యుత్తలమంది కుంది, కోపించి వగచి డగ్గుత్తిక వెట్టి
జలజాప్తకులు రామచంద్రునిఁ జూచి, యెలనాఁగ యేడ్చుచు నిట్లని పలికె
దేవ నాచిత్తంబుఁ దెలియదే నీకు, నీవు సర్వజ్ఞు మనీషివి గావె
ననుఁదెచ్చి నాపిన్ననాఁటనుండియును, బెనిచి రక్షించి గాంభీర్యంబు నించి
యీనీచభాషల నేల నొప్పించెఁ, దేనేల నీవేల యీమాటలేల
భూదేవికడుపునఁ బుట్టితి జనకుఁ, డాదట ననుఁ బెంచె నంతటిమీఁద

నృపశిరోమణివైన నీదేవినైతి, చపలవధూవృత్తి సైఁచునే నాకు
మగవారు నమ్మని మగువలనాడు, తగవుల నాడెదు తగులు వోవిడిచి
నమ్మనివాఁడవు నాఁడు నన్నరయఁ, బొమ్మని హనుమంతుఁ బుచ్చినయపుడె
చెప్పి పుత్తెంచినఁ జెనఁటిప్రాణముల, నప్పుడె విడువనె యడియాస లుడిగి
యని లక్ష్మణునిఁ జూచి యనఘు మీాయన్న,యనుమాన ముడిగి నన్నాడుచున్నాఁడు
తగునె యీాక్రియ నాడఁ దరము నాతరము, తగనిమాటలు నీకుఁ దగదనఁ దగదె
కలపుణ్యగుణములఁ గడచన్న పోడ, నొలసి నీయెఱుఁగని యుచితంబులేదు
నావర్తనముఁ జూడు నాయందుఁ గలదె, భావింపఁ గల్మషభావమింతైన

సీత యగ్నిచొచ్చుట.

శంకింప వలదు విచారంబుచేసి, యింక మీానిశ్చయ మిట్టిదయేని
యిక్కడ సొదఁబెర్చు డిందఱు చూడ, స్రుక్కక యనలంబు సొచ్చెదఁ జూచి
పావకుముఖమునఁ బతికింకఁ బరమ,పావనురాలనై బ్రహ్మాదిసురల
మెచ్చించి మిమ్మెల్ల మెచ్చించి భూమిఁ, జొచ్చెద ననవుడు స్రుక్కి లక్ష్మణుఁడు
రాముఁ గనుంగొని రాముకన్నెఱిఁగి, భూమిజ కప్పు డద్భుతముగాఁ దెచ్చి
సొదవేర్పుటయు మహీసుత సీత ప్రీతి, సొదఁ జూచి ప్రణమిల్లి సొదచుట్టుఁ దిరిగి
యభినుతు లింపొంద నగ్ని దేవునకు, నభిముఖయై నిల్చి హస్తములో మొగిచి
ధర్మదేవతలార ధర్మంబులార, నిర్మలమతులార నియతాత్ములార
జగదధిపతులార చంద్రార్కులార, నిగమసాధకులార నిగమంబులార
సంచితోన్నతులార సర్వజ్ఞులార, పంచభూతములార పరహితులార
నరవరులార కిన్నరవరులార, సురవరులార భూసురవరులార
కరుణాఢ్యులార దిక్పతులార విమత, హరులార పాపసంహరులార యేను
ఘనమనోవాక్కాయకర్మంబులందుఁ, బనిగొన రామభూభర్తకుఁ దప్పఁ
దప్పిన నీయగ్ని ధరియింపలేక, యిప్పుడు నీఱౌదు నిందఱు చూడ
నని యెప్పుఁ బలుకుచు నమ్మహీపుత్రి, తనచిత్తమునసున్న తాత్పర్య మెప్పుఁ
గనుఁగొని బ్రహ్మాండకటకంబు నిండి, యనుపమాకారంబులై పేర్చిపేర్చి
యెండొండశిఖల మహోదగ్ర మగుచు, మండెడునగ్నిలో మానిని చొచ్చె
నావంతయును గంద దావూవుఁబోడి, పావకసరసిలోఁ బదిలమై నిలిచి
కరచరణాననకమలంబులొప్ప, వరకుచద్వయచక్రవాకంబులొప్ప
నవబాహువల్లిమృణాళంబులొప్పఁ, బ్రవిమలత్రివళీతరంగంబులొప్ప
మహితలోలన్నేత్రమత్స్యంబులొప్ప, సహజరోమావళిశైవాలమొప్పఁ
గమలినితెఱఁగునఁ గరమొప్పుచున్న, కమలాక్షి గనుఁగొని కపులు రాక్షసులు
శోకింపఁ జొడఁగిరి సురసిద్ధసాధ్య,లోకంబులెల్ల నాక్రోశింపఁ దొడఁగె
నామరుత్తనయుండు నర్కనందనుఁడు, సౌమిత్రియును విభీషణుఁ డంగదుండు
దరుచరయూథపు ల్దానవాధిపులు, సరమాదులైన రాక్షసవధూజనులు
నధికశోకంబున నడలుచునుండి, రధిపతి నిర్విణ్ణుఁడై యుండె నంత

హరుఁడు వాగ్వరుఁడును నఖిలదిక్పతులు, గరుడగంధర్వులు ఖచరవల్లభులు
వరవిమానస్థులై వచ్చిరందఱును, బరఁగఁ బ్రత్యక్షానపరుఁ డైనరాము
వీక్షించి వేదాంతవేద్యుండ వఖిల,సాక్షివి కర్తవు సంవిదాకృతివి
నిర్వాణపరుఁడవు నిత్యపూర్ణుఁడవు, సర్వసంవేదివి జగదేకనిధివి
యక్షీణపుణ్యుండ వవ్యక్తపరుఁడ, వక్షరత్రయమూర్తి వాద్యంతపతివి
భువనంబు ఒబ్బులు భూతేము ల్నదులు, సవనంబు లద్రులు జంతుసంతతులు
తరువులు తెరువులు తంత్రము ల్విధులు, సుగులు నక్షత్రము ల్ఖ్యాతులు శాస్త్రములు
గనుఁగొన వేలు లక్షలు కోట్లు గణన, ననుపమశతకోటు లరసి యెవ్వరును
గడగాన రొక్కొక కమలజాండమునఁ, బడి యట్టి బ్రహ్మాండ పఙ్క్తులు గలసి
నీకుక్షి నున్నవానికి లెక్క లేదు, నీకడఁ గానంగ నేర్తురే యెరులు
భవదీయమాయాప్రభావంబు దెలియ, భవదీయులకుఁగాక పరులకు వశమె
యొకనిఁ జంపితి గెల్చి తొకఁడు నిన్గెలిచె, నొకఁడు సాధ్యుఁడు నీకు నొకఁ డెక్కుడ
స్తుతినిందలవి నిన్ను సోక వెన్నఁడును, నతిమహత్త్వోన్నతు లట్టివి నీకు [నుచు
దానభావంబునఁ దక్క నొండొకట, నీసంవిదాకృతి నిత్యదుర్ఘటము
నరనాథ నీవాదినారాయణుండ, వరయ నజ్ఞానకి యయ్యాదిలక్ష్మి
లోకైకరక్షణలోలత నీవు, కాకుత్స్థుఁ డనఁగఁ బ్రఖ్యాతుండవైతి
నిన్నేల మఱచితి నిష్ఠురవహ్ని, నున్నజానకిఁ జూచుచుండుట తగదు
పిలిపించి కైకొమ్ము ప్రీతి మన్నింపు, వలవ దుపేక్షింప వనజాక్షి నింక

అగ్నిదేవుఁడు సీతను శ్రీరాముల కొప్పగించుట

నని పెక్కుభంగుల నఖిలదేవతలు, గనుఁగొని పలుకుచోఁ గడఁగి పావకుఁడు
వనిత చెమర్పదు వాడదు మోము, తనువల్లి గందదు తలఁక దింతయును
బొలఁతి ధరించిన పుష్పమాలికలు, నలఁగవు తొలఁగవు నాతిమైపూత
యనుచు దైత్యులు కపు లందంద నిక్కి, కనుఁగొంచు నుబ్బుచుఁ గనదశ్రులగుచు
జగదీశుఁ డీపుణ్యసతి నింక పలుకఁ, దగదంచు నీతెంపు తగదంచునుండఁ
గోమలిఁ దగ నెత్తుకొనివచ్చి ప్రీతి, రాముసన్నిధి నిల్పి రాముతో ననియె
నీవె దైవంబును నీవె ప్రాణంబు, నీవె చుట్టంబును నీవె సర్వంబు
గానుండు నొండొకగతిఁ జిత్తవృత్తిఁ, గాన దీకల్యాణి కడుముద్దరాలు
రావణుపనుపున రాక్షసస్త్రీలు, వెవురు వేవేల విధములవచ్చి
తఱిమి నొప్పింతురు దారుణక్రియల, వెఱపింతు రలఁతురు వెడ్డువెట్టుదురు
ఇన్నియుఁ జేయంగ నెంతయు సాధ్వి, తన్నింత మఱువదు తలఁక దెంతయును
నీయందె చిత్తంబు నిలిపి సర్వంబు, నీయధీనముచేసి నిల్చె నీయింతి
కైకొమ్ము నెమ్మి నీకమలాక్షి నింక, గైకొనకుండుట గాదు ధర్మంబు
అని పావకుఁడు వల్కనారామవిభుఁడు, దనమది నొక్కింత తడవు చింతించి
యాదిదేవుండు బ్రహ్మాదులు వినఁగ, నాదేవసభలోన నప్పు డిట్లనియె
నీయింతి దెసఁ బాప మింతయు లేదు, నాయెడఁ దప్ప దున్నతచిత్తురాలు

పెఱపును భ క్తియు విమలశీలంబు, నెఱుకయు ధైర్యంబు నీయింతియందుఁ
గలదెఱుంగుదునట్లుగాక దైత్యునకు, మెలఁతుక గదియ రామియు నెఱుంగుదును
అధిగతబహుదోషుఁ డగుదశగ్రీవుఁ, డధికబలోన్మత్తుఁడై కొనిపోయి
తనవినోదారామతరుమధ్యసీమ, నునిచిన జానకి నూరక తెచ్చె
నిలమీఁద రఘురాముఁడిట్టికాముకుఁడు, గలఁడె దుష్కీర్తికిఁ గలఁగఁడేమియును
అని లోకమునఁ బుట్టు నపవాదమునకు, జనకజ నిబ్బంగి శాసింపవలసెఁ
గలశంకలన్నియుఁ గడతేరె నింక, మెలఁతుకఁ గైకొంటి మీమాట వింటి
నని సమీపంబున నద్దేవినుండఁ, బనిచి రాఘవుఁడు చూపఱు చూడనొప్పె
దివినుండి రోహిణిదేవియుఁ దాను, నవిరళప్రభనొప్పు నమృతాంశుభంగి
నప్పుడయ్యఖిలలోకారాధ్యచరణుఁ, డొప్పు మహోల్లాస ముల్లంబు నిండ
శ్రీమహాదేవుఁ డాశ్రితకల్పతరువు, రాముఁ గనుంగొని రాగిల్లి పలికె
నెవ్వఁడుద్యోగించు నింతటిపనికి, నెవ్వఁడు సాధించు నీజగద్ధితము
లోకకంటకుఁడు త్రిలోకభీకరుఁడు, నాకాదిలోకప్రణామసాధకుఁడు
రావణలోక విద్రావణబలుఁడు, రావణుమర్దింపఁ రాఁ దెవ్వరికిని
వీనితోఁ బగఁగొని వీనిపై విడిసి, వీని నివ్విధిఁ జంపి వీనిఁ గాల్పించి
బలవిక్రమక్రమప్రౌఢిమ మెఱయఁ, గలరె లోకమున నెక్కడనైన మగలు
ఆరావణునిఁ జంపి తనఘు నీవలన, నీరేడుభువనము లిటమీఁద బ్రదికె
మీతండ్రిదశరథమేదినీనాథుఁ, డే తెంచె దివినుండి యీయొప్పు చూడ
నదె విమానారూఢుఁడై యున్నవాఁడు, త్రిదశగణాధీశదీప్తుఁడై వాఁడె
ఆజగద్ధితకృత్యుఁ డగునత్యనిధికిఁ, బూజానమస్కారములు సేయఁబొమ్ము
అనవుడు రఘురాముఁ డభిరామశీలుఁ, డనుజన్మయుక్తుఁడై యవనీశునకును
నిండినప్రేమంబు నెలకొన నపుడు, దండప్రణామముల్ దగఁజేయుటయును
జిత్తసమ్మదమునఁ జేనిండఁ గూర్చి, యెత్తి కౌఁగిటఁ జేర్చి యినవంశుఁడనియెఁ
గైకేయిమాట లాకర్ణించి నిన్ను, లోకరక్షణకళాలోలుఁ గానలకుఁ
బుచ్చితిఁ దగవింత పోలింపనైతి, నిచ్చలో శుభకర్మ మెఱుఁగలేనైతి
నిన్నుఁ బట్టముగట్టి నీవు రాజ్యంబు, కన్నులపండువుగాఁ జేయుచుండఁ
జూచి లోకంబులు సుఖియించుచునికి, చూచుపుణ్యము నాకుఁ జొప్పడదయ్యెఁ
బుత్రశోకంబునఁ బోయిననాకు, సుత్రామలోకంబు చొరఁ బూటగలదె
ఆతాపమెప్పుడు నంతరంగమున, నాతతస్ఫుటవహ్ని లై మండుచుండు
నమరలోకంబున నాఱుదాచిచ్చు, శమియించె నేఁడు నీసన్నిధిఁజేసి
కమలాప్తసమతేజ కమలాభిరామ, కమలాప్తవంశ యఖిలకీర్తి లొప్ప
నీవయోధ్యకుఁ బోయి నిఖిలధర్మములు, భావించి మదిఁబెట్టి పట్టంబుఁ బూని
రామునఁడ లోకాభిరామునఁడ సుతులతో మహి యేలుము తుదముట్ట ననుచు
సౌమిత్రిఁ గనుఁగొని సౌమిత్రి నీవు, రామునివెనుక నరణ్యభూములకుఁ
జనుదెంచి యుత్తమసాహసక్రియల, ననఘుఁడై వర్తించి తతులపుణ్యుఁడవు

మెలకువ నిటమీఁద మీయన్న మనసు, నలగకుండఁగ నీవు నడవుమీ యనుచుఁ
దనకర్ధి మ్రొక్కి యాదల వాంచియున్న, జనకనందనఁ జూచి జననాథుఁ డనియెఁ
బరమపాతివ్రత్యపదశుద్ధి నీకు, సరియెవ్వ రుత్తమసాధ్వివి నీవు
సిను రాముఁ డాడిననిష్ఠురోక్తులకుఁ, గినియకు నొవ్వకు గీడ్పడియుండు
ఘనకీర్తియుతుల రాఘవుఁబోలుసుతులఁ, గనుము పుణ్యము లెల్లఁ గైకొని మనుము
అని మువ్వురను మెప్పు లలర దీవించి, తనలోన మోదించె దశరథేశ్వరుఁడు
చంద్రశీతలు రామజననాథచంద్రు, నింద్రాదిదేవత లెల్ల వీక్షించి
మనుజుండవై నీవు మాకుఁగా వచ్చి, జనియించి రాక్షసక్షయము గావించి
యీభంగి దుఃఖంబు నిన్నియ నోర్చి, భూభారమంతయుఁ బుచ్చిపోవైచి
మమ్మిట రక్షించి మాజీవనములు, నెమ్మితో మాకిచ్చి నిలుకడ లొసఁగి
ప్రచ్ఛన్నుఁడవు పురాణాత్మవరము, లిచ్చెద మడుగు మభీష్టంబులేమి
యనవుడు రాముఁ డాయమపులఁ జూచి, తనలోన చిఱునవ్వు దళుకొత్తఁ బలికె
నింపొందు మీకృప నెల్ల కామ్యములు, సంపూర్ణములు మాకు జగములయందుఁ
దమతమభూములఁ దమమందిరములు, దమబంధుజనులను దమతనూజులను
దమకళత్రాదులఁ దగవొప్ప విడిచి, సమరంబులోపల సకలవానరులు
తెగి తమ్ముఁ డాపక తివిరి నాకొఱకుఁ, బగరతోఁ బోరాడి ప్రాణము ల్విడిచి
యున్నారు కపివీరు లున్న తాత్మకులు, నన్ను మన్నించుట నాకిండు వీరి
ననవుడు విని దివ్య లౌఁగాక యనుచు, వనచర ప్రాణము ల్వచ్చుఁగా కనిరి
అని మహాదేవుండు నబ్జసంభవుఁడు, ననఘులై యింద్రాదు లైనదిక్పతులు
మునులును సురలు నిమ్ముల నుతించుచును, జన దశరథుఁడును జనియె నద్దివికి
ననిలోనఁ దెగిపడ్డ యగచరు లఖిలు, ఘననిద్ర మేల్కొను నైవడిఁ దోఁప
నమరులవరశక్తి నద్భుతం బెసఁగ, సమగోర్వ నందఱు సప్రాణు లగుచుఁ
జనుదెంచి యారామచంద్రుని వేడఁ, గనుఁగొని హర్షించి కలయ మ్రొక్కుటయుఁ
దనరార నందఱ దయతోడఁ జూచి, జనలోకనాథుండు సంతోషమొందె
నంత విభీషణుం డారాముతోడ, నెంతయు భక్తితో నేర్పడఁ బలికె
దేవ రాఘవ ధరాధీశ నీవింక, వేవేగ లంకకు వేంచేసి యచట
నవిరళమతితోడ నభిషేక మిప్పు, డవధరింపఁగ వేళ యనిన రాఘవుఁడు
భరితశిరోజటాభారవల్కలుఁడు, భరతుఁ డక్కడఁ దపోభరముననుండ
నతనిఁ జూడక మాకు ననుచితం బీచటఁ, జతురభోగక్రమసముచిత క్రియలు
అనుటయు నుచితజ్ఞుఁ డగువిభీషణుఁడు, ఘనభక్తియుక్తిమైఁ గడఁకదీపింపఁ
గనకపాత్రంబుల గంధాక్షతములు, ఘనరత్నభూషణకనకాంబరములు
పుణ్యనాదములతోఁ బుణ్యలతోడఁ, బుణ్యచిహ్నములతోఁ బుణ్యభామినులఁ
బనిచి తెప్పించి నిర్భరభాగ్యధనుఁడు, వినయాభిరతి వినువీథి నందంద
సురదుందుభులు మ్రోయ సురలు నుతింప, సరసాక్షతముల నేసలు నిండఁ జల్లి
రామలక్ష్మణులకు రాజీవనేత్ర, భూమినందనకు నప్పుడు గట్టనిచ్చె

నంతో రాముఁడు నిశ్చలానందుఁ డగుచు, నెంతయుఁ బ్రియమంది యింపొందఁ బలికెఁ
గడుఁబెద్దకార్యము ల్గలవు మాకింకఁ , దడయుటగా దయోధ్యకుఁ బోవవలయు
ననుటయు రాముని నావిభీషణుఁడు, కనుఁగొని భ క్తితోఁ గరములు మొగిచి
భీషణరణకేళిఁ బేర్చి రావణుఁడు, రోషించి మును కుబేరుని గెల్చి కొన్న
పుష్పకం బున్నది పురుహూతలోక, పుష్పక క్రమమహాద్భుతవేగ మరయ
నెలమి నాపుష్పక మెక్కి సమ్మదము, వెలయ నయోధ్యకు వేంచేయవలయు
నన విని రఘురాముఁ డనుమతించుటయుఁ, జని మహాసంభ్రమసంప్రీతులొప్ప
నరిది వైభవముల నమరుపుష్పకముఁ, గరమర్థిఁ దెచ్చె రాక్షసకులేశ్వరుఁడు
రావణులోకవిద్రావణుశక్తి, భావించి యెంతయు భయమును బొంది
యఱిముఱిఁ గదలుప ననిలుండు గదియ, వెఱచునో దీపము ల్వెఱచునో కదల
నవరత్నదీపంబు లచలరూపముల, నొనరు మందానిలంబుల నొప్పుదాని
ఘనవిమానోదరకలితపుష్పములఁ, గొనకొన్న గంధముల్ గ్రోల నేతెంచి
యలికి లోపలఁ జొరకొన్న తుమ్మెదల, చెలువున దీప్తుల చెన్నగ్గలించు
నావిమలద్వార హరినీలమణుల, భావింప నెంతయు భాసిల్లుదాని
తలకొని తోఁటలఁ దమపిన్ననాఁడు, వలపించి తముఁ బాసి వచ్చినఁ జూచి
పొగులుచు షట్పదంబులతోడవచ్చి, మొగినున్న మల్లికాముకుళంబు లనఁగ
నానీలమణులతో నలవడఁ గ్రుచ్చి, మానైనవాక్తికమణు లొప్పుదాని
త్రిభువనంబులయందుఁ దిరిగెడుగంగ, యభిమతవిశ్రాంతికై యున్నధరణి
ఖచితహంసావళి కమలదుకూల, రచితవితానంబు రాజిల్లుదాని
నెప్పుడు వచ్చునో యిందు నారాముఁ, డెప్పుడు చూతుమో యేము రాఘవుని
నని యని చింతించి యమరకన్యకలు, తనువు లుజ్జ్వల మణిస్తంభములఁ జేర్చి
నిలిచిన చెలువున నిర్మలస్తంభ,ముల మణిపుత్రిక ల్తొగినున్నచానిఁ
జేకొని వసుధపై సృష్టి రక్షింప, వైకుంఠపతి రావువల్లభుఁడైనఁ
బొలుచు వైకుంఠంబు పుష్పకంబైన, చెలువున నంతయుఁ జెలఁగెడిదానిఁ
గనుఁగొని యప్పు డాకాకుత్స్థతిలకుఁ, డనురక్తితో రాక్షసాధీశుఁ జూచి
రా విభీషణ వీర రావణోదగ్ర, పావకునార్చిన పటుపయోదములు
వీరి నారాధింపు వీరిఁ బూజింపు, వీరి సంభావింపు విపులసంపదల
నని వానరులఁ జూపి యర్థిదీపింప, బనిచిన రాక్షసపతి విభీషణుఁడు
ధనము లంబరములు తగుభూషణములు, కనకము ల్దెప్పించి కడుఁ బ్రీతి మెఱసి

శ్రీరాములు పుష్పకవిమాన మెక్కి యయోధ్యకుం జనుట.

జనపతిసన్నిధి సంభ్రమంబొప్ప, వనచరపతులకు వరుసతో నిచ్చెఁ
బతిరాముఁ డపుడు పుష్పకము నర్పించి, సతియుఁ దమ్ముఁడుఁ దాను సద్భక్తియుక్తిఁ
గృతకృత్యుఁడై ప్రదక్షిణముగా వచ్చి, యతిహర్షమున నెక్కె నవ్విమానంబు
లెక్కి సుగ్రీవాదిహితుల వానరులఁ, దక్కక వీక్షించి దశరథాత్మజుఁడు
మీరు చేసినయట్టి మిత్రకార్యములు, నేరరు సురలైన నిష్ఠతోఁ జేయ

నెల్ల తేజంబులు నెల్ల సౌఖ్యములు, నెల్ల యశంబులు నేను మీవలనఁ
బడసితిఁ బుణ్యులు పరమపావనులు, కడుధన్యులగుమీరు కపులార యింకఁ
బొండు మీమీదేశములకు నావుడును, నిండారువేడ్కల నృపుఁ జూచి కపులు
ధరణీశ మే మయోధ్యకుఁ గొల్చి వచ్చి, పరమానురక్తి మీపట్టంబుఁ జూచి
నిరుపమచరితుల నీసహోదరుల, భరతశత్రుఘ్నులఁ బరమపావనులఁ
జూచి మీతల్లులఁ జూచి మీపురము, చూచి భాగీరథి చూచి వచ్చెదము
అనవుడు విని రాము డంతరంగమున, ననయంబు హర్షించి యావిభీషణుని
భానుజు నంగదుఁ బవనుజు నీలు, మాననీయాత్తుల మఱియుఁ బెక్కండ్రు
వనచరప్రముఖుల వాత్సల్య మొప్ప, నెనయ నాపుష్పక మెక్కఁ బంచుటయు
ధరణీశుమన్ననఁ దగ నుత్సహించి, పరమపావనులు పుష్పక మెక్కి రంతఁ
ద్రిజటాదిసతులు థాత్రీజకు మ్రొక్కి, నిజగృహంబుల కంత నెమ్మితోఁ జనిరి
దశరథాత్మజుఁ జూచి దానవేశ్వరుఁడు, విశదంబుగాఁ బల్కె వినుము శ్రీరామ
యెలమి నీపుష్పక మెందఱెక్కినను, సలలితంబుగఁ జోటు చాలి వెండియును
నొకమూల కడమయై యుండు నేనూటి, కకలంకగతిని జోటన ముదంబంది
ధరణీశుఁ డప్పుడు తరుచరాసురులఁ, గరుణ పుష్పక మెక్కఁగా నానతిచ్చె
నప్పు డాపుష్పకం బాకాశవీథి, నొప్పెడి వేడుక నుప్పొంగి యెగసి
ఘనమనోవేగంబుఁ గైకొని నిగిడి, వినువీథి దివ్యులు వినుతింపఁ బేర్చి
పరివేషప్రభలతో భానుబింబంబు, పూర్వపశ్చిమపథంబులఁ బోక మగిడి
దక్షిణంబుననుండి తగను త్తరమున, కక్షీణగతిఁ బోవునాకృతిఁ దోఁప
బోవునప్పుడు నిత్యపుణ్యుండు రామ, దేవుండు జానకీదేవితో ననియె

శ్రీరాములు సీతకు రాక్షసవీరులవిక్రమముఁ దెల్పుట.

శుకవాణి జానకి చూచితే లంక, యకలంకలక్ష్ముల నమరుచున్నదియుఁ
గమలాక్షి యిది విశ్వకర్మ నిర్మింపఁ, గొమరుదీపించెఁ ద్రికూటమధ్యమున
నీలంక నిమ్ముగ నేలుపుణ్యంబు, చాలక పొలిసె దుర్జనుఁడు రావణుఁడు
అని రక్తమాంసగజాశ్వతండముల, ఘనమైన సమరభాగముఁ జూపి విభుఁడు
కదనవిక్రమశక్తిఁ గడఁగి యే తెంచి, మదిరాక్షి యిక్కడ మడిసె రావణుఁడు
ఘనసత్త్వుఁడై కుంభకర్ణుండు దొడరి, యని ఘోరముగఁ జేసి యక్కడఁ గూలె
నహితుఁడై నీలుఁ బ్రహస్తుండు దాఁకి, బహుసత్త్వుఁ డిక్కడ భస్మమై పొలిసె
శూరతఁ బవమానసుతుఁడు ధూమ్రాక్షు, నారూఢబలు ద్రుంచె నతివ యిక్కడను
భేదించి యిచట నభేద్యుఁడై మేఘు,నాదుండు మముఁ గప్పె నాగపాశముల
ధృతియు లావును బేర్చి తెగువమైఁ బోరి, యతికాయు సౌమిత్రి యక్కడఁ గూల్చె
నలఘుఁడై మకరాక్షుఁ డక్షీణబలుఁడు, బలమేది యిక్కడఁ బడియెఁ బోరాడి
భగ్నారివీరుండు భగ్నప్రతాపుఁ, డగ్నివర్ణుండు గూలె నయ్యెడ నతివ
కడిమిమైఁ బోరాడి గర్వంబు లావు, నెడలి యకంపనుం డిక్కడఁ గూలె
నలుకమై సౌమిత్రి యాయింద్రజిత్తు, నలవొప్పఁ దెగటార్చె నయ్యెడనబల

యనుపమబలుఁ డగునమ్మహాకాయుఁ, దునిమె నియ్యెడ నంగదుఁడు సకోజాక్షి
తతమి యయ్యెడ మహోదరమహాపార్శ్వ, లతమి చచ్చిరి మహోదగ్రవిక్రములు
క్రూరులై దేవాంతకుఁడు నరాంతకుఁడు, పోరాడి యిక్కడఁ బొలిసి రిద్దఱును
ఇదె పయోనిధిమీఁద నేపుదీపింపఁ, గదిసి మాకట్టిన ఘనసేతు వబల
ఇదె గంధమాదనం బిదె పుణ్యతీర్థం, బిదె సదాశివసమాహితనివాసంబు
కమలాక్షి యీతోఁచుకాంచనాచలము, రమణీయ మిదియ హిరణ్యనాభంబు
పవమానసూనుండు పడఁతి నిన్వెదక, జవమొప్ప లంకకుఁ జనుదెంచునాఁడు
అతనికి నాతిథ్య మర్థిఁగావించు, నుతి నబ్ధివెడలె నమ్మహితశైలంబు
నని చెప్పుచును రాఁగ నారాఘవునకు, ఘనతరభీషణాకారంబుతోడ
నేతెంచి దశకంరుఁ డెదుటఁ దోఁచుటయు, భీతిల్లి యపుడు విభీషణు కనియె
జలజజుం డాదిగా సకలదేవతలు, పలుమఱు గొనియాడఁ బ్జిక్కంధరునిఁ
దునిమితి నాజిలో దోర్బలశక్తి, నెనయ నారావణుఁ డేతెంచి యిటకుఁ
గదియుచు నాకసుఁగవమ్రోల నిలిచె, నిది చిత్ర మేర్పడ నెఱిఁగింపు మనుడు
జననాథ యాబ్రహ్మసంతతియందు, జనియించినట్టి దుర్జనుని రావణునిఁ
దెగటార్చి తటుగాన దేవ యాహత్య, దగిలి యేతెంచి ముందటఁ దోఁచె మీకుఁ
గడఁక నీపాప మిక్కడఁ బాపి వేగ, కడచిపోయినఁగాని కార్యంబుగాదు
అవనీశ మీయాత్మ నబ్జసంభవునిఁ, దవిలి తలంపుము దలఁచిన నతఁడు
అతిముదంబున వచ్చి యమరులుఁ దాను, మత మెఱిఁగించెడి మనువంశతిలక
యనవుడుఁ బుష్పక మవనికి డించి, తనమదిలోపలఁ దాత్పర్య మొప్ప
భూమీశుఁ డప్పు డంబుజసంభవునిని, గామించి తలఁప నక్కడి కేగుదెంచె
నఖలదిక్పాలురు నఖలదేవతలు, నఖలసంయములును నందందఁ గొలువఁ
బ్రేమ నిట్టేతెంచి ప్రియపూర్వకముగ, రాముతోఁ బలికె నారాజీవభవుఁడు
దేవ రాఘవ యేమి తెఱఁగున నన్ను, రావించి తనవుడు రఘువల్లభుండు
తనముఖంబునఁ దోఁచు తత్క్రమంబెల్ల, వినిపింప నాతఁడు విస్మయంబంది
దేవ దైత్యుఁడు నాదుతేజంబునందు, నీవసుమతిఁ బుట్టి యిన్ని పాపముల
నురుతరంబుగఁజేసి యుగ్రత మెఱయఁ, బరికింపఁ బిదప నిష్పాపుఁడై పోలిసె
ధరణిపై విప్రుండు దనకులక్రమము, నరసి తా నిలుపక యన్యవర్తనము
నరయుచు నతులదోషాచారుఁడైన, గురుదూషకుండైనఁ గులశీతుఁడైన
నారయ గోబ్రహ్మహత్యాదిఘోర,దారుణకర్తఁడై తనరువాఁడైన
వధకు నర్హుఁడు గాఁడు వసుధపై నెన్ని,విధములనైనను వివరించిచూడ
నట్టిదుర్జనునకు నట్టిక్రూరునకు, నట్టిపాపాత్మున కాజ్ఞ యేమనిన
నతనికులంబున కంత్యంబుఁజేసి, పతి తనభూమిలోపల నుండనీక
తగ వెడలించుట దండంబు సుమ్ము, జగతీశ యిపుడు విశ్రవసుపుత్రుండు
మోక్షంబుఁ గోరి నీముందటఁ దోఁచె, మోక్షకాముని జేయు ముదమునన్నిపుడు
భావించి నీవేర భవునిఁ బ్రతిష్ఠఁ, గావింపు మున్నీటికట్టపై నొప్ప

రమణమై నొకముహూర్తములోన ననుచుఁ, గ్రమమొప్ప దెలిపియాకమలజుం డరిగె

శ్రీరాములు లింగప్రతిష్ఠ సేయుట.

నావేళ రఘురాముఁ డాసన్నుఁడైన, పావని నీఱింఁచి పలికె నిట్లనుచు
సన్నుతబలశౌర్య సాహసధుర్య, పన్నగాశనవేగ పరమానురాగ
మాకార్య మీడేర్చి మము నుద్ధరించి, మాకీర్తి నెగడించి మముఁ బ్రోచితీవు
వినయవిక్రమధైర్యవిఖ్యాతులందు, నినుఁ బోల రెవ్వరు నిఖిలలోకములఁ
గావున నిపుడొక్కకార్య:మీడేర్పు, మావార్త యెఱిఁగింతు మదియొట్టు లనిన
నగచరాధీశ యత్యంతవేగమున, నగణితఫలరాశి యగుకాశి డాసి
కరమొప్ప నొక్కలింగము గొనితెమ్ము, పరఁగ నిన్నాటనల్వదియోజనములు
గల దిచ్చటికి రెండు గడియలలోన, నిలువక చనుదెమ్ము నీవాహవమున
ధరమీఁదఁబడిన నాతమ్మునికొఱకు, నిరుమూఁడులక్షలు నిరువదివేలు
పదియోజనములును బవనవేగమునఁ, గదలి మందులకొండఁ గ్రక్కునఁ దెచ్చి
తిరుగ నెప్పటిచోటఁ దిరముగా ననిచి, యరుగుదెంచితి వప్పు డరజాములోన
నదిగాన నీకిది యధికమే యనిన, ముదమున నుప్పొంగి మ్రొక్కి వీడ్కొనుచు
నరిగి యప్పుడు మహేంద్రాచలం బెక్కి, యురుతరశక్తిమై యుంకించి యెగసి
ఘనతరంబగు కాశికాపురి డాసి, యనఘతరంగిణి నాగంగఁ గ్రుంకి
కాశికానిలయుని ఘనువిశ్వనాథు, వాసవనుతు నీశు వరదయాలోలుఁ
గని మ్రొక్కి నుతిఁజేసి కదలి యాఘనుఁడు, ఘనబుద్ధి నొక్కలింగంబు నైకొనుచు
నధికవేగంబున నరుదెంచుచుండె, బుధజనవినుతుఁ డాభూమీశుఁ డంత
హనుమంతు రాకకు నటుచూచి చూచి, తనరంగ నిట ముహూర్తము చేరవచ్చెఁ
జనుదేరఁ డేమొ రాఁడుసుఁ డెవ్వఁడైనఁ, జెనకిన జగడంబు సేయుచున్నాఁడొ
యేమికార్య మొ యనియిచ్చఁ జింతించి, యీముహూర్తముదప్పకిట లింగ మొకటి
నెనయఁ బ్రతిష్ఠింతు నిసుకచే ననుచు, జననాథుఁ డట సమస్థలమున కరిగి
కరముల నొక్కలింగముగాఁగ నిసుకఁ, గరమొప్పఁ జేసినఁ గంజాక్షి సీత
నంది గావించె నానగజాధినాథు, ముందట నిసుకచే మొగి రామవిభుఁడు
నాయెడఁ బూజసేయఁ గడంగునంత, వాయువేగంబున వాయునందనుఁడు
అరుదెంచి రఘురామునడుగుల కెరఁగి, ధరణీశుఁ డుంచిన దర్పకారాతిఁ
గనుఁగొని ఖిన్నుఁడై కళవళంబంది, తనువుగంపింప గద్గదకంఠుఁ డగుచు
నంజనాసుతుఁ డప్పు డనియె నోరామ, కంజాప్తకులసోమ కాశికి నన్నుఁ
బనిచినఁ బనిపూని బ్రహ్మాదిసురలు, గనుఁగొన నచటి లింగమును దెచ్చితిని
ననుఁబంపి యిచ్చట నగజాధినాథు, ననుపంగఁ దగునయ్య యుర్వీశచంద్ర
అనువొంద నేఁదేర నర్హుండుగానొ, మనమున నామీఁద మక్కువ లేదొ
అనుడు రాముఁడు మందహాసంబుచేసి, హనుమంతుఁ జూచి యిట్లనియె నాకరయఁ
దమ్ములలో నొక్క తమ్ముఁడ వీవు, నెమ్మితో నీమీఁద నెయ్యంబు ఘనము
ఈముహూర్తముఁ దప్పనీక యీశివునిఁ, గామించి యిసుకచేఁ గావించి తర్థి

నంతలోనన నీవు నరుగుదెంచితివి, సంతోషమయ్యె నీశ్వరుని నవ్వలికిఁ
దెమలించి నీతెచ్చుదేవుని నిలుపు, మమరులు వొగడంగ ననిన వాయుజుఁడు
ముదమంది తనవాలమున నీశుఁ జుట్టి, కదలించి కదలించి కదలింపలేక
మదిలోన శంకించి మఱియు నుంకించి, మెదలింపఁజాలక మిగులఁ జింతించి
యక్కట! మున్ను ద్రోణాచలం బేను, దక్కఁక యగలించి తనరఁ దెచ్చితిని
భుజగకంకణుతోడ భూతాలితోడ, రజతాద్రినెత్తిన రావణునకును
నెత్తంగ నలవిగా కెసఁగు సౌమిత్రి!, నెత్తితి నింద్రాదు లెల్లఁ గీర్తింపఁ
దటుకున మేరుమందరములనైన, బొటవ్రేలఁ జిమ్ముదు భూరిసత్త్వమున
నిదియేల వ్రేగయ్యె నీరీతి నాకుఁ, బదిలంబుఁ దప్పెనో భానువంశజుని
గినిసి యేమాఱుపల్కిన పాపముననొ, కనుఁగొన నటుఁగాక కాశీశు నిటకుఁ
జెఱొని యేను దెచ్చినపాపముననొ, కాకున్న నిదియేల ఘనమగు ననుచుఁ
బదిలంబుగాఁ దనబలమెల్లఁ గూర్చి, త్రిదశులు వెఱఁగందఁ దివిరి వెండియును
నగచరేశ్వరుఁడు ధైర్యముతోడ నభవు, నగలింపలేక బాహాగర్వ మెడలి
పటురక్తములు గ్రక్కి ప్రాణము ల్గలఁగి, యట మూర్ఛతోడ నయ్యవనిపైఁ ద్రెన్నె
నాసమయంబున నారామవిభుఁడు, భాసురమృదుకరపద్మముల్సాచి
హనుమంతునెత్త నొయ్యన మూర్ఛదెలిసి, జననాథవరునకు సాష్టాంగ మెఱిగి
జయ భూమిజాస్వాంతజలజషట్చరణ, జయ ఘోరకుటిలరాక్షసచయహరణ
జయ ఖండితోద్దండశర్వకోదండ, జయ శోషితాబ్ధిప్రచండోరుకాండ
జయ రావణోన్నతశైలామరేంద్ర, జయ భక్తపరిపూర్ణసత్కృపాసాంద్ర
జయ నిర్మలాత్మ సజ్జనకల్పభూజ, జయ పద్మబాంధవశతకోటితేజ
నీమహిమంబులు నేర్తురె తెలియ, నామహేశ్వరుఁడైన నమరేజ్యుఁడైన
నాగేంద్రుఁడైనను నాకేంద్రుఁడైన, వాగీశుఁడైనను వసుధాతలేంద్ర
ఏనిన్ను నెఱుఁగంగ నెంతటివాఁడ, నే నిన్నుఁ గొనియాడ నెంతటివాఁడ
జేలనై మీరునిల్పిన యీశు నెఱుఁగ, కేలీలఁ దెమలింప నెంచినయట్టి
నాతప్పులోఁ గొని నన్ను మన్నించి, యీతఁడే మీయాజ్ఞ నేఁ దెచ్చినట్టి
యీయీశునకు వెర వెఱిఁగింపు మనుచుఁ, బాయనిభక్తితోఁ బ్రణుతించుచున్న
హనుమంతుఁ జూచి యిట్లనియె రాఘవుఁడు, మనమున నీవేల మరిగెద విట్లు
నీవు దెచ్చిన కాశినిలయు నిచ్చోటఁ, బావని యునుపుమీ భవునకు మునుపు
ప్రీతిఁ బూజ నొనర్చి పిదప నాయీశు, నాతతభక్తితో నర్చింతు సకల
భూజనంబులు నిట్లు పూజగావింతు, రాజాహ్నవీజలం బవనిలో జనము
తెచ్చి నీతెచ్చినదేవున కర్ధిఁ, జెచ్చెర నిట నభిషేకంబునేయ
నతఁ డొనర్చిన బ్రహ్మహత్యాదియఘము, లతనిఁ బొందవు కీర్తి లలర సిద్ధించు
నతులితపుత్రపౌత్రాభివృద్ధియును, నతులభోగంబులు నమరంగఁ గలుగు
ననిపల్కి హనుమంతుఁ డతిముదంబంది, మనమున సంతోషమగ్నుఁడై పొంగెఁ
బరమాత్ముఁడట నుమాపతిఁ బ్రతిష్ఠించి, యురుభక్తి దగ షోడశోపచారములఁ

గరమొప్ప మునుమున్ను కాశికావాసుఁ, దరణివంశ్యుఁడు సొంపు దనరారఁ బూజ
గావించి పిదపఁ దాఁ గావించుశివుని, భావించి యర్చించెఁ బరమహర్షమున
రమణఁ బూవులవాన రఘురాముమీఁద, నమరులు గురియింప నగచరు ల్తరియ
నంత విభీషణుం డధిపతికనియె, సంతోష ముప్పొంగ జగతీశ యిప్పు
డీకట్టతెరవుగా నెవ్వరికైన, రాకుండఁ జేయుమో రామ లంకకును
నావుడు హర్షించి నలినాప్తకులజుఁ, డావిభీషణుఁ జూచి యాఁగాక యనుచు

శ్రీరాములు సేతుమహిమను చెలుపుట.

నడరంగ నటఁ గొన్నియడుగులు మగిడి, నడునేతుమీఁద నున్నతితోడ నిలిచి
కపులుగ్రముగ నబ్ధి గట్టినయట్టి, విపులబంధము లెల్ల విడిచెనో యనఁగఁ
దనసహోదరుచేతి ధనువంది పుచ్చుకొని వేగమున ధనుష్కోటిఁ గావించి
పరదారగమనంబు బ్రహ్మహత్యలను, గురుజనద్రోహంబు గోగణవధయు
సోదరీరతియును సురఁ గ్రోలుటయును, వేదదూషణమును విత్తాపహరము
సుందరీచ్ఛేదంబు చోరసంగమము, మందిరదహనంబు మాంసభక్షణము
మొదలైనపాతకంబులు చేసియైనఁ, గదిసి యిచ్చట నవగాహంబుసేయు
పురుషముఖ్యున కగుపుణ్యసంఘములు, అరుదార నాయుష్య మారోగ్య మెపుడు
పరహితాచార సౌభాగ్యసంపదలు, చిరకీర్తులును వేగ చేకూరు ననుచు
నారాఘవేశ్వరుం డపుడు పుష్పకము, నారూఢగతి నెక్కి నధికమోదమున
నమరులు దీవింప నగచరు ల్వొగడ, నమరంగ నెప్పటియట్ల పుష్పకము
ఘనవేగమున జన గగనమార్గమున, మనుకులేశ్వరుఁ డంత మహిమత్రి కనియె
హిమకరబింబాస్య యిదె విభీషణుఁడు, మముఁ గన్నచోటు సమ్మదమున వచ్చి
ఇక్కడఁ గుశతల్ప మేను గైకొంటి, నిక్కడ నుండితి నేకతంబునను
ఘని బ్రహ్మాస్త్ర మద్భుతశక్తి మెఱసి, యేను బయోధిపై నిక్కడఁ దొడుంగ
నదులతో నన్న దీనాథుండు వచ్చి, ముదమతో ననుగాంచి మ్రొక్కినచోటు
అలఘువిక్రమశక్తి నమ్ము సంధించి, జలజాస్య యిక్కడఁ జంపితి వాలి
పుష్కరబహుఫలాద్భుతకాననముల, కిష్కింధకంటె సుగ్రీవపట్టణము
అనియని తెల్పుచో నాలోలనేత్ర, జనకనందన రామచంద్రుతో ననియె
జననాథ సుగ్రీవసతులతోఁగూడ, వినుఁ డయోధ్యకుఁ బోవ వేడ్కపుట్టిడిని
ననవుడు పుష్పకం బయ్యెడ నిలిపి, జనపతి యనిచినఁ జతురుఁడై యరిగి
తారాధినాథుండు తారాద్రికీర్తి, తారాపథంబునఁ దారాదిసతులఁ
జెలువొందఁ దోడ్తేర సీతకు మ్రొక్కి, యెలమిఁ బుష్పకమెక్కి రింపార వారు
ఎంతయుఁ బదిలమై యేపుదీపింప, నంత నెప్పటిమాడ్కి నరిగెఁ బుష్పకము

శ్రీరాముఁడు మార్గమధ్యములోని విశేషములు సీత కెఱిఁగించుట.

ఆలోన రఘురాముఁ డాబుష్యమూక, శైలంబు డగ్గరి జానకిఁ జూచి
హితవానరానీక మీబుష్యమూక, మతిలోక మీగిరి నర్థితో మున్ను
శరణాగతుండయి చను దెంచుటయును, గరుణ సుగ్రీవునిఁ గాన్పించుకొంటి

నాసన్న రవికిరణాస క్తకమల, భాసురోదరము పంపాసరోవరము
ఇదె చూచితే యొప్పె నీపుణ్యసరసి, మృదులతీరంబున మెలఁత నిన్బాసి
బహుదుఃఖములబొందఁ బవమానసుతుఁడు, మహితపుణ్యాత్ముండు మమువచ్చి కాంచి
హృదయపద్మమునకు నింపు పుట్టించి, మదిరాక్షి కాన్పించె మర్కటేశ్వరుని
ఒదవుకాననముల నొప్పుచునున్న, దదె శబర్యాశ్రమ మబ్జాయతాక్షి
యలిగియిక్కడ మహాహవక్రేలి వాలి, బలశాలియైన కబంధుఁ జంపితిని
నినుఁ జెఱఁగొనిపోవు నీచురావణునిఁ, గనుఁగొని పోనీక కడిమిమైఁ దాఁకి
మిన్న కయ్యసుతతో మెఱసి పోరాడి, యున్న తాయువు జటాయువు గూలె నిచట
నదె యాజనస్థాన మబ్జాయతాక్షి, పొదలువనంబులఁ బొలుపొందెఁ జూడ
నదె శూర్పణఖ నుగ్రుఁడై ముక్కుఁ జెవులు, కుదియగ సౌమిత్రి కోసినతావు
అదెచూడు ఖరదూషణాదిరాక్షసులు, మదమునఁ జనుదెంచి మడిసి రిచ్చోట
నీయెడ ననొగి నెలయించుచుండె, మాయామృగాకృతి మారీచుఁ డేచి
మదిరాక్షి యిక్కడ మఱవాఁడు మడిసె, నిదె పంచవటిఁ జూడు మిదె పర్ణశాల
పటుమాయ నిక్కడఁ బ్జిక్కకంధరుఁడు, కుటిలుఁడై మ్రుచ్చిలి కొనిపోయె నిన్ను
నదె సుతీక్ష్ణాశ్రమ మాశ్రమరత్న, మదె యగస్త్యాశ్రమం బబ్జాయతాక్షి
యదె శరభంగుని యావాస మింతి, యదె యత్రిమౌనిపుణ్యాశ్రమభూమి
అదె నీకు ననసూయ యంగరాగములు, హృదయరాగముతోడ నిచ్చినచోటు
అదె చిత్రకూటాద్రి యక్కడ నన్నుఁ, బదిలుఁడై భరతుండు ప్రార్థించి చనియె
విమలకాననముల విలసిల్లుచున్న, యమున యల్లదె కంటె యనతిదూరమున
ముదమొప్ప బహుదివ్యమునులు సేవింప, నదె చూచితే గంగ నమలతరంగ
ఒదవినకొలఁకులు నుద్యానములను, నదె శృంగిబేర మొప్పారుచున్నదియు
నదె గుహుం డేతెంచి యర్థితో మమ్ము, గదిసికాంచినయట్టి కమనీయభూమి
నదె సరయూనది యధికయూపముల, బొదిగొన్నతటములఁ బొదలుచున్నదియు
నదె యయోధ్యాపుర మబ్జాక్షి మ్రొక్కు, మది కానవచ్చె నాయతపుణ్యరాశి
అని భూమిజకు రాముఁ డర్థితోఁ జూప, ఘనమైనవేడ్కలఁ గపులు రాక్షసులు
బహురత్నకాంచనప్రాసాదతతుల, బహుతోరణంబుల బహుపతాకలను
బహువారణంబుల బహుతురంగముల, బహురథోత్కరముల ప్రణుతింప నెందు
నమితవైభవముల నతులమై మెఱయ, నమరావతియుఁబోలె నమరు నప్పురము
నినిచినవేడ్కల నెరి నిక్కి నిక్కి, గనుఁగొనఁ దొడఁగిరి కడఁకతో నంతఁ
బదునాలుగవయేడు పరిపూర్ణమైన, వదలకప్డు శుభకృద్వత్సరమందు

శ్రీరాములు భరద్వాజాశ్రమంబునకు వచ్చుట.

మదిలోన సుప్రీంగి మాఘమాసమునఁ, బదపడి యాశుద్ధ పంచమినాఁడు
అక్రాంతశుభ తేజుఁ డగుభరద్వాజు, నాశ్రమోపరివీధి నవ్విమానంబు
ధీయుక్తి రాముండు దివి నిల్పి డిగ్గి, యాయాశ్రమంబున కర్థి నేతెంచి
యమ్మునిపాదంబులందు మోదంబు, గ్రమ్మ ఫాలస్థలిఁ గదియించి మ్రొక్కి

మునిచేత దీవన ల్ముదమొప్పఁబడసి, వినయ రసావేశవివశుఁడై పలికె
నేను మీఁదగునేమ మేమియు నరయఁ, గాన గానకుఁ బోయి కాలంబు గడనె
ఫలవు కదా మీకుఁ గందమూలములు, ఫలములు జలము లపాయంబులేక
ఎల్లతెఱంగుల నెప్పుడు చెడక, చెల్లు గదా మీకు శిష్టకృత్యములు
అనవుడు మునినాథుఁ డారామచంద్రు, వినయవాక్యంబులు విని సంతసిల్లి
నిఖలలోకారాధ్య నీవు జన్మించి, నిఖలలోకంబులు నిష్ఠఁ బాలింపఁ
గలవె సంకటములు గలవె దుఃఖములు, గలవె బాధలు పుణ్యకర్ముల కెందు
నిత్యసతోన్నత నీప్రసాదముల, నత్యంతసుఖులమై యఖలధర్ములు
సలుపుచు వేదోక్తసముచితక్రియలు, సలుపుచుఁ దపములు సలుపుచుండుదుము
నీవిందు విచ్చేసి నెమ్మి నేఁ బనుపఁగా వీడుకొని పోయి క్రమ్మఱ నిందు
విచ్చేయు నీలోని వృత్తాంతమెల్ల, నచ్చుగాఁ బొడగంటి నథార్థదృష్టి
నరయ నీచేసిన యద్భుతక్రియల, నరిది యనుష్ఠింప నాదివ్యులకును
నీవరణ్యములకు నిష్ఠదీపింపఁ, బోవుట మొదలుగా భోగంబు లుడిగి
ఘనజటాభారవల్కలములు దాల్చి, పనివడి భరతుండు భక్తి వాటించి
నీపాదుకలయందు నిఖలరాజ్యంబు, రూపించి నిలిపె నారూఢమానసుఁడు
చెప్ప నక్కజమైన చిత్తానురక్తి, నెప్పుడు నీరాక కెదురు వీక్షించు
నీవ్రు నీతమ్ముని నెయ్యంబు దలఁచి, వేవేగ పోవ భావింపఁగావలయు
వనవాసమున డస్సి వచ్చినవాఁడ, వనఘు మాయాశ్రమంబందు నేఁడుండి
భూపాల నీవెళ్లిప్రొద్దునఁ గదలి, మాపంపుఁ గైకొని మఱి పొమ్ము విందుఁ
గావింతునని చెప్పి ఘనతపోమహిమ, నావేళ రాముఁ డత్యాశ్చర్యమంద
నామహామునివరుం డాత్మలోపలను, గామధేనువుఁ గుతుకముతోడఁ దలఁప
మిలమిల మెదలెడి మృదుతరాన్నమును, ఫలములు ఘృతము సూపము లపూపములు
సవితో శాకము ల్మర్కటఁ పెరుఁగు, పరమాన్నమును నానబాలును జుంటి
తేనియశిఖరలు తియ్యచారులును, బానకం బొబ్బట్లు పచ్చళ్లజున్ను
వరుగులు వడియము ల్వాసనోదకము, లురుతరరుచి నొప్పు నూరగాయలును
మొదలైన వావేల్పు మొదవు కల్పింప, ముదమునఁ గపిదైత్యముఖ్యులతోడ
నచ్చపుభక్తిమై నారామచంద్రుఁ, డిచ్చ మెచ్చుచు భుజియించుచున్నంత
ఆభరద్వాజుఁ డిట్లనియె రామునకు, శోభనగుణధామ సుగుణాభిరామ
యేము నీకొకవరం బిచ్చెద మిపుడు, కామింపు మనుటయుఁ గరములు మొగిచి
పోడిగా సాకేతపురముచుట్టులను, మూఁడు యోజనములు మునినాథ వినుఁడు
ఏచి తలిర్చుచు నెల్లకాలమును, బూచుచుఁ బండుచు భూజంబులుండ
వరమిండు మఱియొండువరము నేనొల్ల, గరుణింపు మనవుడు గరుణించె మౌని
ఆయీగీఁ జరితార్థు లైనవానరులు, మాయనిహృదయసమ్మదమునఁ బొదలి
రప్పుడు రఘుపతి యనిలనందనునిఁ, దప్పక చూచి యుదాత్తుఁడై పలికె
నతులసతోన్నతి నత్యంతవేగ, రతి శృంగిబేరపురంబున కరిగి

భూరిమానసుగుహుఁ బుణ్యాత్ముఁ గాంచి, మారాక యతనికి మానుగాఁ దెలిపి
యాయున్న తాత్ముచే నటఁ బోవుత్రోవ, ధీయుక్తి నెఱిఁగి నందిగ్రామపురికి
నరిగి మాభరతున కతిశుభవ్రతున, కురుదయారతునకు నున్న తాత్మునకు
నేము వచ్చితిమని యెఱిఁగించి రమ్ము, పో మారుతాత్మజ పొమ్ము నావుడును
మారుతాత్మజుఁడును మానుషవేష,ధారియై యరిగి యచ్చుత వేగుఁ డగుచు
గంగాతరంగిణిఁ గడఁకతో దాఁటి, శృంగిబేరమునకుఁ జెచ్చెరఁ బోవఁ
బరహితాత్మకుఁడైన పరమేశురాక, నరసి కానక గుహుఁ డాత్మలోపలను
నన్నేలు శ్రీరామ నరలోకవిభుని, సన్నుతపదపంకజంబులఁ గొలిచి
పోలేక నిలిచితి భూరిదుర్గముల, నేలీల మెలఁగిరో యెందున్న వారో
శరభ భేరుండ రాక్షసవహ్ని భుజగ, గరళ బాధలచేతఁ గ్రాగిరో కాక
లేకున్న వ్రతము చెల్లినమోఁద మగిడి, రాకయుండునె రఘురాముండు వలికిఁ
దప్పునె కార్యంబుఁ దప్పనే నింక, నిప్పుడే సొదఁజొచ్చి యెనయుదు రాము
నని మనంబునన్నున్న యాందోళ ముడిగి, తనసతు ల్సుతులును దమ్ములుఁ దాను
సొరిదిఁ గుండమునందు సొదఁబెర్చి మిగుల, దరికొల్ప ననల ముదగ్రమై మండ
నరుదైనభక్తితో నాగుహుం డపుడు, ధరణీశుఁ డగురాముఁ దలఁపులో నిలిపి
యయ్యగ్నిలోఁ జొర నరుగుదేరంగ, నయ్యెడ హనుమంతుఁ డడ్డమై నిలిచి
పుడమిఱేఁ డిదె వచ్చె బొంకుగా దెల్లి, యుడుగక తనవ్రతం బొనరఁ జెల్లించి
పదపడి నగ్నిలోఁ బడిన శ్రీరాము, పదములయా నంచుఁ బలికిన నాతఁ
డనిలజునకు మ్రొక్కి యారాముకాక, కనుచరసహితుఁ డై హర్షంబునొంది
పరఁగ నగ్గుహుఁడు సంభావింప నరిగి, యురుపుణ్యనిధి సరయూనది దాఁటి
పోవ నందిగ్రామమున భరతుండు, పావనచరితుండు భావంబులోన
నారామలక్ష్మణు లవనినందనయు, నేరీతి నున్నారొ యేమైనవారొ
ఎన్నినఁ బదునాలుగేండ్లును నిండెఁ, గ్రన్నన రాముఁ డిక్కడికి రాఁడేమొ
మోసపోయితి నాఁడె మునివృత్తి రాము, భాసురకోమలపాదపద్మములు
నాసుమిత్రాపుత్రుఁ డర్ధితోఁ గొలిచి, యాసమీఱఁగఁ దోన యరిగినరీతి
నరుగలేనైతి నే నారాముఁ బాసి, ధరణి నేవిధమునఁ దనువు ధరింతు
పదునాలుగేండ్లను బరిపూర్ణమైన, సదయాళగుణనిధి చనుదేరకున్న
ఘనమైనసొదఁబెర్చి కడఁకతోఁ జొత్తు, ననినిశ్చయంబుగా నాడినప్రతిన
హితమతి రిత్తవోనిత్తునే యంచు, మతి నిశ్చయముఁ జేసి మంత్రుల కనియె
శాత్రవమదహారి శౌర్యసంపన్నుఁ, బాత్రు శత్రుఘ్ను నిఁ బట్టంబుఁ గట్టుఁ
డేనగ్నిలోఁ జొచ్చి యేగెద రాముఁ, గానంగ ననిన నాఘనుఁ జూచి యపుడు
శత్రుఘ్నుఁ డిట్లను జగతీతలేశ, యీధాత్రి నాకేల యీతనువేల
నీపాదములఁ గొల్చి నీతోడఁ గూడ, నేపార నేనును నేగుదెంచెదను
అని కృతనిశ్చయు లైననానరులు, గనుఁగొని భీతులై కలఁగి రందఱును
ఆసమయంబున నధికవేగమున, నాసమీరాత్మజుం డరుదెంచి భరతుఁ

హనుమంతుఁడు భరతుని జూచుట.

గనుఁగొని వినతుఁడై కరముల మొగిచి,కొని నిల్వఁ గాకుత్స్థకులుఁ డిట్టులనియె
నీకులం బెయ్యెది నీకుఁ బేరేమి, చేకొని యిటకు వచ్చినపని యేమి
యెవ్వండ వెందుండి యెటకేగె దనిన, నవ్వసుధేశుతో ననిలజుం డనియెఁ
గపి నేను శ్రీరాముగాదిలిబంటఁ, దపనకులాంభోజతపనుఁ డున్నతుఁడు
తనపుణ్యచరిత యుత్తములెల్ల మెచ్చ, ననిమిషుల్గొనియాడ నారామవిభుఁడు
వినుము జగద్ధితవృత్తిమై మెఱసి, వనవాససమయంబు వలనొప్పఁ దీర్చి
సౌమిత్రియును దాను జనకనందనయు, రాముండువచ్చి యరణ్యము ల్విడిచి
నెమ్మితో ముందఱ నీనేమ మరసి, రమ్మన్న వచ్చినరాక యీరాక
అనవుడు భరతుఁ డత్యంతహర్షమునఁ, గొనకొని ఫలకించి కోర్కిఁదీపింప
రా పుణ్యవత్సల రా కపిశ్రేష్ఠ, రా పవనాత్మజ రమ్మంచుఁ దిగిచి
నరనాథసుతుఁడు వానరనాథసుతునిఁ, గరము సమ్మదమునఁ గౌఁగిటఁ జేర్చి
గజమాల్యమణు లిచ్చి గజముల నిచ్చి, గజరాజగమనలఁ గరమర్థి నిచ్చి
కనకాంబరంబులు కనువేడ్క నిచ్చి, వినుతభూషణములు వెలయంగ నిచ్చి
తగుపట్టణము లిచ్చి ధనకోటు లిచ్చి, యగణితగుణధీరుఁ డనియె మారుతికి
నడవుల కరిగి రామావనీవిభుఁడు, దడసినకార్యంబుఁ దలఁప నచ్చెరువు
ఎందెందు వర్తించె నెందెందుఁబోయె, నెందున్న వాఁ డిప్పు డినకులేశ్వరుఁడు
నీవు రాఘవునకు నిజదూత వగుట, యీవిధంబంతయు నెఱిఁగింపు మనఘ
యిచ్చలోపల నమ్మ నీపలుకేను, వచ్చుట నిక్క మే వనచరాధీశ
యనవుడు విని నవ్వి యవ్విమలాత్ముఁ, డెనసినభక్తితో నేర్పడఁ బలికె
మీతండ్రి దశరథ మేదినీశ్వరుఁడు, భూతలరాజ్యప్రభుత్వంబు మాన్పి
యడవికిఁ జనుమన్న నన్న రేశ్వరుఁడు, జడలు వల్కలములు శాంతుఁడై తాల్చి
భానుప్రభాభాసి పాదచారమున, జానకీలక్ష్మణసహితుఁడై వెడలి
చిత్తసమ్మదమునఁ జిత్రకూటాద్రి, నుత్తమమునిగోష్ఠి సున్నచో నీవు
భూరాజ్య మొల్లకపోయి మీయన్న, నారాధనముచేసి యర్థిఁ బిల్చుటయుఁ
బతిరాకయున్నఁ దత్పాదుకాయుగళ, మతిభక్తియుక్తిమై ననురక్తి నడిగి
తలమోచికొనివచ్చి ధారణీరాజ్య, ఫలభోగ ముడిగి తపస్వివై తిచటఁ
గుటిలదానవబలక్రూరవర్గముల, నట రాఘవుఁడు దండకారణ్యమునకుఁ
జని శరభంగునాశ్రమభూమి నిలిచి, ముసుల నూఱడఁబల్కి ముదమొప్పఁబోయి
యాజనస్థానంబునం దున్నదైత్య,రాజుచెల్లెలిఁ బట్టి రాజిమి మెఱసి
నలిమీఱి యాశూర్పణఖముక్కుఁజెవులు, కొలఁదులు మొదలంటఁ గోసిపోవైచి
ఖరదూషణాదిరాక్షసులఁ బెక్కండ్ర, నరభోజనులఁ బదునాలుగు వేలఁ
జంపి యొక్కఁడ పర్ణశాలలోనుండఁ, దెంపుమై రాక్షసాధిపుఁడు ప్రేరేప
మారీచుఁ డనియెడిమాయావి యొకఁడు, భూరిమృగాకృతిఁ బొడచూపుటయును
మృగనేత్రసీత యామృగము నీక్షించి, మృగమొప్పు నాకు నీమృగముఁ దేవలయు

ననవుడు శరచాపహా స్తుఁడై దాని, వెనుకొని రామభూవిభుఁ డొగినేయఁ
గూలెడునప్పు డాకుటిలరాక్షసుఁడు, హా లక్ష్మణా యను నా ర్తరావమున
నారూఢిఁ జీరిన నతివ భీతిల్లి, యారాఘువానుజు ననుప నచ్చటను
మునివేషధారియై ముద్దియ నెత్తి,కొనిపోవురావణుఁ గూడిపోసీక
ఘనుఁడు జటాయువు గని యడ్డపడిన, ననిమొన భర్జించి యతని నిర్జించి
దనుజాధిపతి సముద్రము దాఁటిపోయి, తనలంకలోని యుద్యానంబునందు
సీతామహా దేవిఁ జెచ్చెఱ నునిచి, యాతతజయశాలి యైయుండె నంత
మాయామృగముఁ జంపి మఱి రామచంద్రుఁ, డాయాసపడి ఖిన్నుఁడై వచ్చివచ్చి
సౌమిత్రిఁ బొడగని జానకి డించి, యేమిటి కిటువచ్చి తీవంచు వగచి
యతఁడుఁ దానును గూడి యాపర్ణశాల, కతిరయంబున వచ్చి యందులో సీతఁ
బొడగాన కిరువురు భూరిశోకమునఁ, బడి యంద వెదుకుచు బహుదుర్గములకుఁ
బోవుచో రావణుభుజశక్తిఁ దూలి, వావిరిలో దారి వసుధపైఁ గూలి
యున్నజటాయువు నొయ్యనఁ గదిసి, యన్నీచదుర్దశ యద్దశాననుఁడు
గావించి సీత లంకకు నెత్తుకొనుచుఁ, బోవుట యతనిచేఁ బోలంగ నెఱిఁగి
యావిహగాధీశు నచట దహించి, పోవుచు ఘనదుర్గభూములఁ గడచి
ముందట నాబుష్యమూకంబుఁ గాంచి, యందు సుగ్రీవునకై వాలిఁ జంపి
తారలో నాచంద్రతారార్కముగను, నారాజ్యమంతయు నతనికి నిచ్చె
నిచ్చిన సుగ్రీవుఁ డెంతయు మెచ్చి, విచ్చలవిడి సీత వెదకెడికొఱకు
లక్షల రెండేసిలక్షలఁ గపుల, నక్షీణబలుల మహోయశోధనులఁ
బదిదిక్కులకుఁ బంపఁ బఱచి వానరులు, వదలక వెదకంగ వచ్చి సంపాతి
సీత యున్నది లంకఁ జింతింపవలవ, దీతెఱంగిటఁజేయుఁ డిటమీఁద ననిన
జలరాశి నూఱుయోజనములే దాఁటి, నలఁగి యశోకవనంబులోనున్న
వైదేహిఁ గని యానవాలు నేనిచ్చి, యాదేవి మాణిక్య మర్థి నిచ్చుటయు
నది దెచ్చియిచ్చిన నవనివల్లభుఁడు, ముదమంది విస్మయంబునుఁ బొంది యపుడు
సకలశాఖామృగసహితుఁడై పోయి, యకలంక విక్రముం డబ్ధి బంధించి
లంకపై విడిసి యలంకృతశక్తి, లంకేశుఁ జంపి కళంకంబు లుడిపి
యవ్యయశ్రీయుక్తి నాలంకఁ బుణ్య,భవ్య విభీషణుఁ బట్టంబుఁ గట్టి
పావనాత్మకులైన బ్రహ్మాదిసురల,చే వరంబులు గొని చెలు వగ్గలించి
హితమతి సురలతో నేగుదెంచుటయు, నతిభక్తి మీతండ్రియడుగుల కెరగి
యనలముఖంబున నతిశుద్ధయైన, జనకజఁ గైకొని సమ్మదంబొప్ప
ఖ్యాతి పెంపొంద నాకపులు రాక్షసులు, ప్రీతి సుగ్రీవ విభీషణు ల్మోదలు
బలసి తన్నొలువఁ బుష్పక మెక్కివచ్చి, ఫలితవిక్రమశోభభరితుఁడై విభుఁడు
ఆభరద్వాజసంయమియాశ్రమమునఁ, బ్రాభవస్ఫురణ మొప్పఁగ నున్న వాఁడు
చందనచంద్రికా సమచారుకీర్తి, యిందెల్లభంగుల నెల్లి విచ్చేయు
ననవుడు భరతేశుఁ డతనివాక్యముల, జనితానురాగుఁడై శత్రుఘ్నుఁ జూచి

తడయక నీవయోధ్యాపురంబునకుఁ, గడుఁవేగమునఁ బోయి కడఁకదీపించి
యాయతమంగళాయతనమై యొప్పు, నీయుత్సవము వీటనెల్లఁ జాటింపు
గొనకొని మనరాజు కొలువుకూటమున, ఘనసేతుబంధాదికథలు వ్రాయింపు
దేవగేహములు భూదేవగేహములు, నీవు సన్నిధినుండి నెలయఁబొటింపు
వరరత్నతోరణధ్వజపరంపరలఁ, బురవీథులన్నియు భూషింపఁ బంపు
తరుణులఁ బిలిపించి తగినముత్యముల, వెరవార ముగ్గులు వెట్టింపఁ బంపు
లలితవస్తువుల నిండ్లకు నెల్లఁ బంపు, కలయఁ బౌరులనెల్లఁ గైసేయఁ బంపు
శ్రీరామనృపతి వేంచేసినశుభము, చేరువ నృపులకుఁ జెప్పంగఁ బంపు
కరితురంగాదుల క్రందుగానీక, పరువడిఁ జతురంగబలములు గొలువ
నెమ్మి మంత్రులతోడ నీవు వేగమున, నమ్మలఁ గొలిచి రమ్మని నియమించె
ననవుడు శత్రుఘ్నుఁ డత్యంతవేగ,మున నయోధ్యకుఁ బోయి ముదముదీపింపఁ
గరమొప్ప రాఘవాగమనమంగళము, వరుసతో నిట బంధువరులకుఁ జెప్పి
కౌసల్యకును జెప్పి కైకకుఁ జెప్పి, యాసుమిత్రాదేవి కర్థితోఁ జెప్పి
యది యిపి లేదుగా యనకుండ నిండ్లు, చదురొప్ప నంగళ్లు చక్కఁ జేయించి
చందనకర్పూరజలములు గూర్చి, యందంద చల్లించి యర్థితో ననుపు
పురవీథులందు నొప్పగ నవరత్న,వరతోరణంబులు వరుసఁ గట్టించి

భరతుఁడు వసిష్ఠాదిసహితుఁ డై శ్రీరామల నెదురుకొనుట.

భరతుఁడు తనుఁ బిల్చి పనిచినరీతిఁ, బురము సర్వంబును భూషింపఁజేసి
యనఘుమూనసులైన యావసిష్ఠాది,మునులు పురోహితు ల్మునిపుణ్యసతులు
జనులు బంధులు సచివులు హితులు, వనితలు దాసులు వరవృద్ధజనులు
కొంద ఱందలములుఁ గొంద ఱశ్వములఁ, గొందఱు రథములఁ గొంద ఱేనుఁగుల
నెక్కి యేతేరఁ బెంపెక్కి శత్రుఘ్నుఁ, డెక్కుడు మహిమతో నెలమిదీపింపఁ
బంచమహావాద్యపటురవం బెసఁగ, నంచితగతి వచ్చె నన్న యున్నెడకు
తల్లులు తమ్ముఁడు తాను సేనలును, వెల్లియై భరతుండు వేడ్కతోఁ గదలి
యెనయ రాఘవునకు నెదురేగుచోట, హనుమంతుఁ డనియె ననుత్తుఁడై భరతు
నదె చూడు రాఘవుం డాభరద్వాజు, సనసంబునందుండి చనుదెంచువాఁడు
అదె చూడు పుష్పకం బదెచూడు రాము, డదెచూడు కపిసేన యదెవచ్చెఁ జూడు
సరయూప్రవాహ ముజ్జ్వలశక్తిచాటు, తరుచరకలకలోద్ధతపటుధ్వనులు
అనవిని భరతేశుఁ డవ్విమానంబుఁ, గనుఁగొని యుబ్బి గద్దదకంఠుఁ డగుచుఁ
గన్నంతదవ్వులఁ గడుభక్తి మ్రొక్కి, యన్నకు సాష్టాంగ మక్కడ నెరఁగి
యుదయాద్రిపైనున్న యుదయార్కుపగిదిఁ, బదిదిక్కులను ప్రభాపటలంబుపర్వఁ
బుష్పకారూఢుఁడై పొలుపారుచున్న, నిష్పాపు రఘురాము నెరిఁజేరి మ్రొక్కి
నంత నాపుష్పకం బవనికి డించి, యెంతయు హర్షించి యినకులేశ్వరుఁడు
ఒండొండ కావించె నొనరఁ దల్లులకు, దండప్రణామము ల్దాను లక్ష్మణుఁడు
పరువడి వారును బరఁగ దీవించి, పరిరంభణముల సంభావించి రెలమి

భరతశత్రుఘ్నులు భ క్తితో రామ,భరణివల్లభునకు భరణినందనకుఁ
జతురత వెలయ లక్ష్మణునకుఁ బ్రీతిఁ, గృతకృత్యమతులు మ్రొక్కిరి పుణ్యధనులు
భరతశత్రుఘ్నులఁ బరఁగ దీవించి, పరిరంభణముల సంభావించి రొప్ప
నత్తఱి సీతామహాదేవి ప్రీతి, నత్తలకెల్ల నాయతభ క్తి మ్రొక్కె
మ్రొక్కిన కోడలి మొగిఁ గౌఁగిలించి, యొక్కఁట దీవించి రోలి నందఱును
రామలక్ష్మణులును రాగిల్లి మ్రొక్కి, రామమహాముని వర్యుఁ డగువసిష్ఠునకు
నమ్ముని దీవించి యాలింగనంబు, నెమ్మిఁ గావించె నానృపనందనులను
రూపించి భరతశత్రుఘ్నులు ప్రీతి, నాపూర్ణహృదయులై యప్పుడు వచ్చి
తమతల్లులకు మ్రొక్కి తగుభ క్తిగలిగి, విమలాత్ములై రాము వెనుక నున్నట్టి
నావిభీషణునకు నర్కసూనునకు, నావాలిసుతునకు నట ముఖ్యులైన
కపులకుఁ బ్రియములు గావించి వారి, విపులపరీరంభవితతి నూరార్చి
జయమును గీర్తియు సాధించె రాముఁ, డయనయోదయకృతులయి మీరుగలుగఁ
జెలులు భృత్యులును నై చిత్తంబు లింత, కలసినబంధువు ల్గలరు మాకనుచు
నేకొలందులుఁగాని హృదయసమ్మదము, గైకొనుచుండిరి కడఁకతో నంతఁ
దల్లులు బాంధవు ల్దమ్ములు కపులు, వెల్లియై బలములు వేడ్క నేతేరఁ
దేజంబు మెఱయ నందిగ్రామపురము, రాజశిరోమణి రాముండు సొచ్చె
నంతఁ బుష్పకమున కర్చన లిచ్చి, యెంతయు భ క్తితో నినకులేశ్వరుఁడు
తలచినప్పుడు రమ్ము ధననాథుకొద్ద, నలకలోపలనుండు మనుచు వీడ్కొలిపె
భరతుఁ డప్పుడు రాముపంచకుఁ జేరి, కరమొప్పఁ గరములు కడుభ క్తి మొగిచి
మీపాదుకలయందు మేదినీభార, మేపార నునిచి యేనింతకాలంబు
నవధానమతితోడ నాలస్య ముడిగి, యవనీశ మీరాజ్య మరసితి నొప్ప
నని చెప్పి పాదుక లర్థి నొప్పించి, వినతుఁడై యత్యంతవినయంబు మెఱసి
వెలయ నయోధ్యకు వేంచేయవలయు, నొలసినమునివేష ముచితంబుగాదుఁ
రాజమండనములు రమణమైఁ బూనుఁ, డీజటాభారంబు లీవల్కలములు
మానుండు మీరన్న మనుజవల్లభుఁడు, వూనిక నిండుట బుద్ధిలోఁ దలఁచి
యవ్వుఁగాక యనవుడు నప్పుడు గదిసి, వివిధవిధిజ్ఞులు వెరవు భ క్తియును
గలవారు కడఁకతో ఘనజటాబంధ,ములు వీడ్వ నభ్యంగము లవధరించి
తమ్ములుఁ దాను నుత్సవజలస్నాన, మిమ్ములఁ గావించి యినకులేశ్వరుఁడు
ప్రకటదివ్యాంబరాభరణమాల్యముల, నకలంకచిత్తుఁడై యమరఁ గైసేసె
ధరణీతనూజకు దశరథాంగనలు, కరము ప్రియంబునఁ గైసేసి రెలమి
సుదతులు తారాదిసుగ్రీవసతులు, ముదమొప్ప శృంగారములు నేసి రపుడు
ఆలోన హనుమంతుఁ డర్థిఁ దోడ్తెర, వేలసంఖ్యలు చెంచువిలుకాండ్రు గొలువ
లలితజటావల్కలమ్ములతోడఁ, గొలఁదిమీఱినవేడ్క గుహుఁ డేగుదెంచి
జవ్వాదిపిల్లులు చమరవాలములు, మవ్వంపుగజదంతమా క్తికంబులును
గిటిదంష్ట్ర వేణుమా క్తికములు సర్ప, నిటలసంభవమణు ల్నిబిడశార్దూల

నఖములు భేరుండనఖములు సింహ,నఖములు కృష్ణాజినంబులు మిగుల
నాఁజెంపుగోరోచనంబు కస్తూరి, వీఁజెలు తేనియ ల్వివిధంబులైన
ఫలములకావళ్లు భయభక్తులాత్మ, మొలవఁ గానుకలుగా ముందటఁ బెట్టి
పొడగాంచి యానందమున రాఘవునకుఁ, దడయక సాష్టాంగదండంబువెట్టి
నిటలాగ్రహస్తుఁడై నిలుచున్నగుహుని, జటిలత్వ మీక్షించి జనలోకవిభుఁడు
తనకృపాజలధి నాతని నోలలార్చి, చనువిచ్చి యమృతభాషల నిట్టులనియె
సురుచిరతేజ చెంచులరాజ నీదు, పిరిగొన్నభక్తియుఁ బెంపును దెంపు
సొంపార నీవాయుసుతునిచే వింటి, నింపుగా మాలోన నీవు నొక్కఁడవు
గాన నాజడలు వల్కలములు విడిచి, పూనుము మాయట్ల భూపచిహ్నములుడు
అని యానతిచ్చిన నరిగి వల్కలము,లును జటాపటలంబులును వేగ విడిచి
సుమహితోదకముల సుస్నాతుఁ డగుచు, విమలాంగుఁడై రామవిభునిసన్నిధికి
వచ్చినఁ జూచి దివ్యములైనయట్టి, మెచ్చులసొమ్ములు మేల్మివస్త్రములు
నెట్టన నొసఁగిన నెరయఁ గైనేసి, దట్టంపుభక్తి భూధవుఁ గొల్చియుండె
నంత శత్రుఘ్ననియాజ్ఞ సుమంతుఁ, డెంతయు రయమున హితసమాహితుఁడ
బహురత్ననిర్మలప్రభనొప్పు మిగుల, మహితార్కబింబసమంచితరథముఁ
గొనివచ్చి యట రఘుకులభర్త కెదుట, నునిచిన శ్రీరాముఁ డున్న తాత్మకుఁడు

శ్రీరాము లయోధ్యఁ జేరుట.

తల్లులచరణపద్మములకు మ్రొక్కి, యెల్ల వారును నెలుఁగెత్తి దీవింప
ననఘుండు సుముహూర్తమగుట ఖ్యాతి, మునివసిష్ఠుఁడు దనమందట నెక్కఁ
బృథుకీర్తు లించెక్క పృథివి పెంపెక్క, రథమెక్కి జనమనోరథ మెక్కుకరణి
నిరుపమకరభక్తి నిరతుఁడై చేరి, భరతుండు ధవళాతపత్రంబుఁ బట్ట
నాసుమిత్రాపుత్రు లర్థి నిద్దఱును, నాసన్నులైపట్ట నాలవట్టములు
ఆరూఢపంచమహావాద్యరవము, తో రాసి దేవదుందుభులోలి మ్రోయ
వినువీథి సురపుష్పవృష్టులు గురియ, జనులెల్ల జయజయ శబ్దంబు లొసఁగ
నతులరథారూఢుఁడై మహోదార,గతు లొప్ప వెనుక రాక్షసభర్త నడువఁ
బరువడిఁ జతురంగబలములు నడువ, వరుసతో నిజబంధువర్గంబు నడువఁ
గెలకులఁ గదిసి సుగ్రీవాదికపులు, బలువారణము లెక్కి పదిలులై నడువ
ఘనసేతుబంధాదికథ లుగ్గడించి, పెనుపొంద వరవందిబృందములు నడువ
జననులు తారాదిసతులు జానకియు, ఘనరథంబులమీఁదఁ గరమొప్పి రాఁగ
నడచె నయోధ్య కానందకందళితు, లెడనెడ దీవింప హితపురోహితులు
కరిబృంహితంబు లుత్కటరథధ్వనులు, తురగహేషితములు తోరంబులైన
భేరీరవంబులు పృథులఖడ్గోగ్ర,ధారాభిఘట్టనధ్వనులుఁ బెల్లెసఁగ
నక్షీణకల్యాణుఁ డగురామవిభుఁడు, నక్షత్రపరివృత నవచంద్రుభాతి
తియ్యంబు దీపింపఁ దేజంబు మెఱసి, యయ్యయోధ్యాపురం బర్థితోఁ జొచ్చె
నప్పుడు సంతోష మంతరంగముల, నుప్పొంగ బహుమంగళోన్నతు లైయయఁ

బల్లవహా స్తలు పల్లవాధరులు, పల్లవారుణపాదపల్లవోజ్జ్వలులు
హరిమధ్యసమమధ్య లమృతాంశుముఖులు, కరిరాజగమనలు కమలలోచనలు
అలినీలకుంతల లంబుజగంధు, లెలదీఁగఁబోఁడు లింపెక్క నందంద
కైసేసి చనుదెంచి కామినీమణులు, ప్రాసాదగోపుర ప్రతతులందుండి
పుణ్యావలోకనంబులఁ బుణ్యసతులు, పుణ్యపుష్పాక్షతంబులు చల్లుచుండ
మేడలపైనుండి మినాతులోలిఁ, బ్రోడలై తమతమ బోటులతోడ
నీసునఁ బిన్ననాఁ డీపుణ్యధనుఁడు, చేసినచేతలు చెప్ప నచ్చెరువు
తనునెదిర్చినమాత్ర ఁ దాటకఁ జంపె, ననఘుఁడై కౌశికుయాగంబు గాచె
సర్పకంకణుమహాచాపంబు విఱిచె, దర్పించి జమదగ్నితనయు భంగించె
నహితలోకాంతకుం డంతటిపనులు, సహజశూరుఁడుగానఁ జనఁజేసెఁ గాక
అమ్ముద్దుప్రాయంబునందుఁ గానలకుఁ, బొమ్మన్నఁ దపసియై పోయె వేడుకను
పోయి జగద్ధితపుణ్యకృత్యములు, నేయ నెవ్వఁడు చాలుఁ జేవదీపింప
వనధి బంధించి రావణుఁ బోరఁ ద్రుంచి, దనుజులఁ బెక్కండ్ర ధరణిపైఁ గూల్చెఁ
దనతండ్రిపనుపునఁ దవిలి కానలకు, మునివృత్తిఁ జనునాఁటి ముద్దుప్రాయంబు
లీపెద్దచందంబు లెన్నిచందములఁ, దీపించుచున్నవి తెలియఁ జూచితిరె
పర్జన్య నవలీల భంజించి మరలఁ, దర్జించి భుజశక్తి దర్పించినట్టి
యామేఘనాదు నుగ్రాజిలోఁ జంపె, సౌమిత్రి గంటిరే చపలాక్షులార
పడఁతి రావణుఁ డతిపాపాత్ముఁడైన, విడిచి లంకాపురీవిభుఁడయ్యె నితఁడు
వనజాక్షి యీతఁడు వాలి సోదరుఁడు, వనిత యీపుణ్యుండు వాలినందనుఁడు
తడయక యంబుధి దాఁటి యీసీతఁ, బొడఁగాంచి వచ్చిన పుణ్యాత్ముఁ డితఁడు
కలకంఠి యవలీలఁ గడలి బంధించి, నలిలంకపై రాము నడపించె నితఁడు
నీరేరుహానన నిఖలౌషధములఁ, బోర లక్ష్మణుప్రాణములు దెచ్చె నితఁడు
అని తన్నుఁ దమ్ముల నసురను గపులఁ, గొనియాడుచును జెప్పికొనుచుండ వచ్చి
నగరు ప్రవేశించె నలినాక్షకులుఁడు, జగదేకనిధి రామచంద్రుఁడు తాను
భరతశత్రుఘ్నులఁ బనిచి కైత్యేంద్ర,తరుచరపతులను దగుమందిరముల
విడియించి యిష్టాన్నవిధభోజ్యములు, కడఁకతోఁ బుత్తెంచెఁ గారుణ్య మొప్ప
సురుచిరమతి నంత సుగ్రీవుతోడఁ, బరమసమ్మదమున భరతుఁ డిట్లనియె
నెల్లిరే ఘభిషేక మినవంశనిధికి, నెల్ల లెఱుంగు లాయితముచేసితిమి
సంగతిఁ జతురబ్ధిజలములు వలయు, గంగాదితీర్థోదకనులు దేవలయుఁ
దెప్పింపు మనవుడు దిననాథతనయుఁ, డప్పుడు పరమహర్షానందుఁ డగుచు
వలనొప్ప గజు జాంబవంతు సుషేణు, నలఘువిక్రమవేగుఁ డగువేగదర్శిఁ
గమనీయనవరత్నకలశంబు లిచ్చి, క్రమమునఁ దీర్థోదకములు తేఁబనిచె
నలుగవాక్షునివాయునందను ఋషభుఁ, గలయసముద్రోదకములకుఁ బంచె
బనిచినఁ గడిమిమైఁ బ్లవగవల్లభులు, వినువీథి నత్యంతవేగులై పోయి

శ్రీరాములపట్టాభిషేకము.

యురవడి మరునాఁటియుదయకాలమున, కరుదరుదనఁ దెచ్చి రఖిలోదకములు
చేతోవినిర్మలశిష్టువసిష్ఠు, గౌతమజాబాలి కశ్యప కణ్వ
వామదేవాదులౌ వరమునీశ్వరుల, సామాదిబహువేదచతురబోధకుల
భరతుండు రప్పించి భయభక్తులొప్పఁ, బరమసమ్మదవచోభంగుల మెఱసి
శ్రీరామునకు నభిషేకంబుసేయుఁ, డారూఢనియతితో ననిపల్క వారు
పూని మంగళతూర్యములు మ్రోయుచుండ, జానకీరాములఁ జదురొప్పఁ దెచ్చి
రమణీయతరమైన రత్నపీఠమునఁ, గొమరొప్ప నిరువురఁ గూర్చుండఁ బనిచి
మానితవేదోక్తమంత్రపూర్వకము,గా నభిషేకంబుఁ గరమర్థిఁ జేయ
నారామునొదల నాపూర్ణవారి, ధార డగ్గరునప్డు దగఁ జూడ నొప్పె
గీర్వాణముఖ్యులు కీర్తనల్సేయఁ, బార్వతీసహితుఁడై ప్రణుతింప నొప్పు
నంగజహరుమౌళినమలమై తోరుఁగు, గంగానదియుఁబోలెఁ గమనీయ మగుచు
నాతీర్థజలధార లంఘ్రులకొలికి, భూతలంబున నిండి పొలుపారెఁ జూడ
హరిపాదమునఁ బుట్టి యయ్యాదిగంగ, ధరపైనఁ బరఁగువిధం బచ్చుపడఁగఁ
బరికించి రామభూపాలకుం డపుడు, హరుఁడు విష్ణుఁడు దాన యనుమాడ్కి నుండె
మఱి పట్టభద్రుఁడై మనుజవల్లభుఁడు, నెఱసెఁ బట్టముతోడి నిటలంబుతోడ
సరసజటారుణచ్ఛాయల మాని, కరమొప్ప శశిరేఖగంగవీచికల
సరిదాఁటి నుదిటికి జారిన నొప్పు, హరునిచందంబున నలరెఁ జూపఱకు
గరుడవియచ్చరగంధర్వపతులు, సురసిద్ధసాధ్యులు సొరిదిమై నపుడు
చదల నుత్సవపటుజయజయధ్వనులఁ, గుదియక యందంద ఘోషించి రెలమి
నప్పు డచ్చరలోలి నాడిరి ప్రీతి, నప్పుడు పుత్తెంచె నమరవల్లభుఁడు
పారిజాతామలప్రసవమాలికయు, హారంబుఁ బ్రియమున ననిలునిచేత
నమితమంగళమూర్తి యయినరాఘవుఁడు, గొమరొప్ప వానిఁ గైకొనియె వీక్షించి
వసుధ యెంతయు సస్యవతియయ్యెఁ బ్రీతిఁ, గుసుమఫలంబులు గొమరొప్పెఁ దరుల
ఘనగంధబంధము ల్గలిగెఁ బుష్పముల, వినుతింప దిక్కులు విమలంబులయ్యె
నప్పుడ రఘురాముఁ డఖిలవిభవ, మొప్ప భూసురులకు నున్నతాత్ములకు
ననుపమతరభక్తి యంతరంగమునఁ, గొనకొన ముప్పదికోటులధనము
లక్షగుజ్జంబుల లక్షయుష్ట్రముల, లక్షగోవుల నిచ్చె లలి సొంపుమీర
లలితదివ్యాంబరాలంకారతతులు, పొలుపొందు కాంచనపుష్పమాలికయుఁ
గొలఁదిమీఱిన ప్రియోక్తులఁ జేరఁ బిల్చి, యెలమి సుగ్రీవున కిచ్చెఁ జెంపొంద
ఘనవజ్రవైడూర్యకలితాంగదంబు, ననఘుఁ డంగదునకు నర్థితో నిచ్చె
మహితోరుకేయూరమకుటంబులొప్ప, సహజపుణ్యుఁడు విభీషణునకు నిచ్చె
నమితబలోదాత్తుఁ డగువాయుజునకుఁ, గమనీయరత్నకంకణయుగం బిచ్చె
నాలోలరుచినిచయానూనమైన, నీలహారను ప్రీతి నీలున కిచ్చె
వలనొప్ప నవరత్నవరహార మొకటి, నలునకు నిచ్చె నానంద ముప్పొంగ

నంబరమణిభూషణాదివస్తువులు, జాంబవంతుని కిచ్చె సమ్మదం బొదవ
నభిమతవేదియై యందఱఁ జూచి, విభుఁడు వానరులకు వీరువారనక
ప్రకటదివ్యాంబరాభరణమాల్యంబు, లకలంకమహిమతో నందఱ కిచ్చె
శారదనిస్మలచంద్రికానూన,హారంబు సీతకు నర్థితో నిచ్చె
ధరణిజ హారంబుఁ దానుఁ గైకొనుచుఁ, గరములు ధరియించి కాకుత్స్థుమోము
చూచెఁ జూచుటయును సుదతి చూపెఱఁగి, యాచతురాత్మకుఁ డనుమతించుటయుఁ
దనకృపారసధారదనరునాహార, మనిలజుకంరంబునం దొప్పఁ బెట్టె
నానిర్మలోదారహారంబుఁ బూని, యానిర్మలాత్మకుఁ డనిలనందనుఁడు
శారదాభ్రావలి సరిఁజుట్టియున్న, మేరువు తెఱఁగున మెఱసెఁ జూడ్కులకు
నంత వసిష్ఠునియనుమతి రాముఁ, డంతఃపురంబున కరిగి తల్లులకు
వరుసతో మ్రొక్కి దీవన లిచ్చి రఘుడు, ధరణీతనూజ యత్తలకెల్ల భక్తి
చెలఁగంగ మ్రొక్కిన శ్రీదేవిరేవ, నలసరస్వతిఖాతి నగజాతరీతిఁ
బతిభక్తిమతియు సౌభాగ్యంబుకాంతి, యతులకీర్తియును బెంపలరంగఁ గలిగి
యినచంద్రులనఁ గాంతి నెనయుపుత్రులును, గనుము నీవని ప్రేమఁ గౌఁగిటఁజేర్చి
దీవింప రఘుకులాధిపుఁడు వేడుకలు, గావించు భోజనాగారంబునకును
జనుదెంచుహితులను సకలబాంధవుల, ననుజుల రవిజాదు లైనవానరుల
నావిభీషణముఖ్యు లగుదైత్యవరులఁ, బావనాత్మకు గుహుఁ బరఁగ రావించి
యుచితాసనమునఁ గూర్చుండఁగఁ బనిచి, సుచరిత్రు నంజనాసూనునిఁ దనదు
పొత్తుల వేడుక భుజియింపు మనియె, నత్తఱిఁ జాల నెయ్యము దియ్యమమర
నెనయంగ నవ్వేళ నెలఁతలు దెచ్చి, కనకపళ్లెరములఁ గ్రమమొప్ప నునిచి
పరఁగఁ బాయసము సూపములుఁ బూపములు,వరుగులు వడియము ల్వాంఛఁబుట్టించు
కూరలు పచ్చళ్లు కోరొండుశిఖర, లూరుగాయలును శాల్యోదనంబాత్మఁ
దనరఁగ సద్యోఘృతము వింతరుచులఁ, బెనుపొందుఫలములు వేర్మితో నిడగ
నినకులాధీశ్వరుం డింపు రెట్టింప, ననిలజ భుజియింపు మనుచుఁ దానొక్క
కబళంబుఁ గొనిన నాకపికులోత్తముఁడు, ప్రబలమౌభక్తి నప్పళ్లెరం బెత్తి
తలమీఁద నిడుకొని తనర నాడుచును, జెలఁగుచు నోకపిశేఖరులార
రండు రాముని పళ్లెరము ప్రసాదంబు, దండిగా దొరకె నందఱకు నేఁడనుచు
మునివృషు మెక్కి యిమ్ముల దానిదళము, లనువొందగా ద్రుంచి యాప్రసాదమున
నొనరించి సంతోష ముల్లంబు నిండ, ఘనభక్తి నొసఁగె నాకపినాయకులకు
వారును దానును వాంఛలు దీర, నారూఢిఁ దృప్తులై రాప్రసాదమున
ననిశంబు నదిమొదల్వారివాసములు, మునివృషుపర్ణము ల్తుళ్ళింబు లయ్యె
నంత నారఘురాముఁ డంజనాసుతుని, సంతతభక్తికి సంతోషమంది
పరపైన వేఱొకపళ్లెరంబునను, ధరణీశ్వరుండును దగ భుజియించి
జలముల నొగివార్చి జతనంబు మీఱ, లలితసుగంధమాల్యము లొప్ప ముడిచి
కర్పూరతాంబూలగంధాక్షతముల, నర్పింప దయమీఱ నందఱఁ జూచి

యినకులో త్తముఁ డిచ్చె నెల్లవస్తువులు, మనమార నప్పుడు మహిమ దీపింప
సకలభృత్యామాత్యసహితుఁడై వేడ్క, నకలంకచిత్తుఁడై యటఁ గొలువుండె
నప్పుడు సౌమిత్రి ననురక్తితోడ, నొప్ప నిద్రా దేవి యొగిఁ బొందుటయును
గొలువులోపలను గాకుత్స్థునియెదుటఁ, గలకల నవ్వినఁ గమలా ప్తకులుఁడు
జనకజయును విభీషణుఁడు సుగ్రీవుఁడును మారుతాత్మజుఁడును వాలిసుతుఁడు
నలనీలశరభసన్నాథతారాది, బలిముఖుల్మత్రుఘ్నభరతులు భీతిఁ
దలలు వాంచిరి యప్డు తమయందుఁ జెంది, లలి మీఱినట్టి కళంకము ల్దలఁచి
యందఱు నట్లుండ నలుక చిత్తమునఁ, జెంద లక్ష్మణుఁ జూచి శ్రీరాముఁ డనియెఁ
దగవువోవిడిచి యాస్థానంబునందు, నగుఁబేమి నిష్కారణముగ సౌమిత్రి
అనవుడు భయమంది యాలక్ష్మణుండు, తనకరంబులు మోడ్చి తగ నిట్టులనియె
వనవాసమునకు దేవరఁ గొల్చి వచ్చి, వనముల నున్నచో వచ్చెఁ జూ నిదుర
వచ్చినఁ బదునాల్గు వత్సరంబులకు, నచ్చుగాఁ జేరకు మన నిద్ర చనియెఁ
బదునాలుగేండ్లును బరఁగ నిండుటయు, వదలక యిప్పుడు వచ్చెఁగా నిద్ర
యదికారణంబుగా నవనీశతిలక, యిది యేను నవ్వితి నిదియె నాతప్పు
నీవు సహింపుమో నిఖిలాధినాథ, దేవదేవేశ యో దీనమందార
యనవుడు సంతోషమంది రందఱును, ననుమానములు వాసి యలరి రెంతయును
నిర్మలకారుణ్యనిధి రాముఁ డంత, నర్మిలి నిండార నందఱఁ జూచి
యెల్లతెఱంగుల నెట్టికార్యముల, నెల్లధర్మంబుల నేమఱ కెపుడు
గొనకొని చేయుఁడీ కోర్కిదీపింప, ననువొంద ననుచు నత్యాదరంబొప్పఁ
బొండని కడఁకతో బుద్ధులు గరపి, యొండొండ ప్రియముల నూఱడఁ బలికి
యనిలజసుగ్రీవ లాదిగాఁగపుల, దనుజపుంగవుల నత్తఱి విడుకొలుప
కిష్కింధ కెలమి సుగ్రీవాదికపులు, నిష్కళంకాత్ములై నెమ్మితోఁ జనిరి
చనియె లంకకు విభీషణుఁ డర్ధిఁ దన్ను, దనుజులు గొలువ నుత్సవక్రేలిఁదేలి
రాముఁడు మఱియావరాజ్యంబునందు, సౌమిత్రిభరతులఁ జతురమానసులఁ
దగఁ బ్రతిష్ఠించి యాతతరాజ్యభూతిఁ, దగిలి సుఖించుచుఁ దాను సీతయును
సకలభోగంబుల సౌఖ్యంబునొంది, యకలంకచిత్తుఁడై యనవరతంబు
వేదోచితాచారవిమలమార్గమున, నాదిరాజన్యుల నందఱఁ గడచి
పూజితాస్థానములు నశ్వమేధ,వాజపేయాదికవరయాగతతులు
సొలవక చేయుచు సురల భూసురుల, నెలమి రక్షించుచు నేపుదీపింప
నిండార ధర్మైకనిష్ఠతోఁ బదునొ,కొండువేలేండ్లు దా నుర్వీ బాలించెఁ
బాలించి యేలుచోఁ బ్రజలు దుర్గిఖములఁ, దూలరు దురితము ల్దుర్భిక్షతతులు
కలుగ వెయ్యెడలను గాలదోషములఁ, జలియింప వెన్నఁడు సత్యధర్మములు
పరహితాచారతాత్పర్యంబులెల్ల, పురుషులయందును బొలుపారుచుండు
ననియాంధ్రభాషభాషాధీశనిభుఁడు, వినుతకావ్యాగమవిమలమానసుఁడు
పాలితాచారుం డపారధీశరధి, భూలోకనిధి కోనబుద్ధభూవిభుఁడు

తమతండ్రి విట్ఠలధరణీశువేరఁ, గమనీయగుణధైర్యకనకాద్రివేరఁ
బనిపూని యరిగండభైరవువేర, ఘనువేర మీసరగండనివేర
నాచంద్రతారార్కమై యొప్పు మిగుల, భూచక్రమున నతిపూజ్యమై వెలయ
నసమానలలితశబ్దార్థసంగతుల, రసికమై చెలువొందు రామాయణంబు
పరఁగ నలంకారభావనల్నిండఁ, గరమర్థి నీయుద్ధకాండంబు చెప్పె
నారూఢి నాశ్లేయమై యాదికావ్య,మై రసికానందమై యెల్లనాఁడు
నివ్వసుమతి నొప్పు నిష్పుణ్యచరిత, మెవ్వరు చదివిన నెవ్వరు వినిన
సామాదిబహువేదచయథామరామ, నామవింతామణి నవ్యభోగములు
పరహితాచారముల్పరిభువిచారములు, పరిపూర్ణశక్తులు ప్రకటరాజ్యములు
నిర్మలకీర్తులు నిత్యసౌఖ్యములు, ధర్మైకనిష్ఠలు దోనాభిరతులు
నాయురారోగ్యంబు లైశ్వర్యములును, బాయకపాటించుఁ బాపక్షయంబు
వరపుత్రలబ్ధియు వైరనాశనము, సరినొప్పు ధనధాన్యచయసమృద్ధియును
నేవిఘ్నములు లేక యిండ్లలో నధిక, లావణ్యవతులైన లలనలపొందు
కొడుకులతో నెప్డుఁ గూడియుండుటయు, నెడగాఁగ నాపదలెల్ల బాయుటయు
సమ్మదంబున బంధుజనులకూటమియు, నిమ్ములఁ గామ్యంబు లెడపకుండుటయు
సతతంబు దేవతాసంతర్పణంబు, పితృగణతృప్తియుఁ బెంపారుచుండు
వ్రాసినవారికి వరశుభోన్నతులు, వాసవలోకాదివాసులఁ జేయు
నిది మోక్షసాధనం బిది పాపహరము, నిది దివ్య మిది భవ్య మిది శ్రీకరంబు
ఎందాఁకఁ గులగిరు లెందాఁక జలధు, లెందాఁక రవిచంద్రు లెందాఁకఁ దార
లెందాఁక భువనంబు లెందాఁక దిశలు, నెందాఁక వేదంబు లేపుదీపించు
నందాఁక నీకథ యక్షరానంద, సందోహదోహళాచారమై పరఁగు.

శ్రీరంగనాథరామాయణము యుద్ధకాండము

స మా ప్త ము

చెన్నపురి: వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము — 1941

ఆంధ్ర గ్రంథములు.

	ప్రతి 1-కి రూ	అ
అచ్చతెనుగు రామాయణము, తిమ్మకవి ప్రణీతము, శుద్ధప్రతి	1	0
డిటో కాలికోబైండు	1	10
అడవిమల్లెలు, ఎనమండ్ర నారాయణ మూర్తి	0	8
ఆంధ్రభాగవతము, పోతనామాత్య ప్రణీతము, ఇదివఱకు ముద్రితమైన ప్రతులకన్న అన్నివిధముల బాగుగనున్నది	4	0
,, అత్యుత్తమప్రతి, 2 సంపుటములు	6	8
,, 3 సంపుటములు	7	8
శ్రీమదాంధ్రభారతము, పద్యకావ్యము:- అనేక వ్రాతప్రతుల సాహాయ్యమున చిరకాలమునుండి సంపూర్ణ పరిశ్రమతోఁ బరిష్కరింపఁబడినది మేలుకాగితములపై స్ఫుటముగ అచ్చొత్తించి మంచి కాలికో బైండు చేయఁబడియున్నది		
7 సంపుటముల ప్రతి	14	0
3 సంపుటముల ప్రతి	13	0
ఆది, సభాపర్వములుగల సంపుటము	2	0
ఆరణ్యపర్వము ,,	2	0
విరాటోద్యోగపర్వములు,,	2	0
భీష్మద్రోణపర్వములు ,,	2	0
కర్ణశల్యసౌప్తిక స్త్రీపర్వములు	2	0
శాంతిపర్వము ,,	2	0
అనుశాసనిక, అశ్వమేధ, ఆశ్రమవాస, మూసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణపర్వములు	2	0

	ప్రతి 1-కి రూ	అ
ఆదిపంచకము, ఒకటేసంపుటము	5	8
యుద్ధపంచకము, స్త్రీపర్వము గలసంపుటము	3	12
శాంతిసప్తకము	3	12
ఆదిపర్వమాత్రము, పెద్దచ్చు, చిన్నసైజు	1	0
ఉత్తరరామాయణము, కంకంటి పాపరాజ ప్రణీతము, గిల్టుబైండు	2	0
గోపీనాథరామాయణము, 2 సంపుటములు, శ్రీమద్రామాయణమునకు సరియైనతర్జుమా, కవనము మిక్కిలి సొంపు, పీరిక అతివిపులము	7	8
చిత్రభారతము, చరిగొండ ధర్మనకృతము, కాలికోబైండు	1	4
జైమినిభారతము, అశ్వమేధపర్వము పిల్లలమర్రి పినవీరభద్రకవి	1	0
డిటో కాలికోబైండు	1	6
నిర్వచనోత్తరరామాయణము, తిక్కనామాత్యప్రణీతము	1	0
డిటో కాలికోబైండు	1	6
భాస్కరరామాయణము	4	0
మొల్లరామాయణము	0	10
డిటో కాలికోబైండు	0	14
శతకంఠరామాయణము, మర్దనకవి కృతము	0	10
సహస్రకంఠరామాయణము, రామావజ్ఝుల కొండయ్య విరచితము	0	12

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,

292, ఎస్ప్లనేడ్, మదరాసు.

ఆంధ్రగ్రంథములు.

వచనగ్రంథములు.

	ప్రతి	కి	ర్పు	అ
ఆంధ్రవచనభాగవతము, ద్వాదశ స్కంధములు, ఒకేసంపుటం	9		0	
,, మూడుసంపుటములు	10		8	
ఆంధ్రవచనభారతము—				
,, ఆదిసభాపర్వములు	3		0	
,, ఆరణ్యపర్వము	3		0	
,, విరాటోద్యోగపర్వము	3		0	
,, భీష్మద్రోణపర్వములు	4		8	
,, కర్ణశల్యసౌప్తికస్త్రీపర్వములు	3		0	
,, శాంతిపర్వము	4		8	
,, ఆనుశాసనికము మొదలు స్వర్గారోహణపర్వము వరకుగల సంపుటము	4		8	
ఆంధ్రవచనవాల్మీకిరామాయణము, 2 సంపుటములు		(అచ్చు)		
ఆంధ్రవాజ్మయచరిత్రసంగ్రహము	1		12	
ఆంధ్రకవిత్వచరిత్ర, బసవరాజు అప్పారావుగారిది	1		11	
శ్రీగురుజాడ శ్రీరామమూర్తిగారి ఆంధ్రకవిజీవితములు	4		0	
ఆరేభీయ్ నైట్సుకథలు	1		4	
న్యాయవిచారము, ప్రహసనం	0		4	
తులసీదాసురామాయణము	8		0	
తిలకుగారినెక్యూరిటీకేసు, ఉపన్యాసములు	0		14	

	ప్రతి	కి	ర్పు	అ
ద్వాదశోపనిషత్తులు, వచనం	3		8	
భారతరమణీమణులు, 1 భా॥	0		12	
డిటో రెండవభాగము	0		10	
యజుర్వేదకథాసంగ్రహము	0		8	
శ్రీమహాభక్తవిజయము, నూతనముద్రితము	6		0	
నీతిచంద్రిక, చిన్నయసూరి	0		8	
పంచతంత్రము, వచనము, సులభశైలి	0		8	
నవనాథభక్తులచరిత్ర	2		0	
నీతిరత్నాకరము	0		8	
సంగ్రహరామాయణము	0		12	
సంగ్రహభారతము	1		4	
సంగ్రహభాగవతము	1		4	
ప్రాచీనదేశచరిత్రలు	1		12	
పతివ్రతలచరిత్రలు	2		0	
దక్కనువూర్వకథలు	2		0	
భోజునికథలు	0		8	
హితోపదేశము, సులభశైలి	0		12	
భోజకాళిదాసకథలు, 1 భా॥	0		12	
,, 2 భా॥	0		12	
తెనాలిరామలింగనికథలు, జీవితము	0		6	
సంస్కృతనాటకకథలు	1		8	
దశకుమారచరిత్రము	1		8	
మదనకామరాజుకథలు, చక్కనికూర్పు	0		14	

	ప్రతి 1-కి	రూ.	అ.
గాజశేఖరుడు, గోపాలుడు		0	8
విక్రమార్కునికథలు		0	8
చార్ దర్వీషుకథలు		0	8
తాతాచార్యులకథలు		0	6
వైద్యులకథలు		0	4
బేతాళునికథలు		0	8
వీరాంగనలు		0	12
పరమానందశిష్యులకథలు		0	3
నలుగురుమంత్రులకథలు		0	4
అయిదుగురుదొంగలకథలు		0	6
రేచుక్కపగటిచుక్కకథ		0	3
సత్యసేనవిజయము		0	4
ఋషులచరిత్ర		0	8
పురాణగాథలు I		0	12
,, II		0	12
బాజీరాయని చరిత్ర		0	14
రఘువంశకథ		0	8
విక్రమార్కచరిత్ర		1	0
వివేకానందవిజయము		2	0
పరిష్యావినోదకథలు		0	12
ఈసబునీతికథలు, 1-వ భా॥		0	6
డిటో 2-వ భా॥		0	8
పంజాబుఅల్లరి		0	8
శుకసప్తతికథలు		0	6
మర్యాదరామన్నకథలు		0	3
మైరావణచరిత్ర		0	1
షేక్స్‌పియర్ నాటకకథలు		1	8
అనంతసాగరము, బుక్కరాయ సముద్రచరిత్ర		0	12
ప్రహ్లాదచరిత్ర, ప్రతిమలతో		0	6
శకునగాథలు	,,	0	6

	ప్రతి 1-కి	రూ.	అ.
నల	,,	0	8
సావిత్రి	,,	0	6
హరిశ్చంద్ర	,,	0	8

నవలలు.

		రూ.	అ.
సీతారామము		1	4
ఐవన్‌హో,	నవల	0	8
మదాలస	,,	(అచ్చు)	
సుజనరంజని	,,	0	8
విజ్జలదేవి	,,	1	8
ఉన్మాదిని,	నవల	0	4
రాధారాణి	,,	0	4
అస్తమయము	,,	1	8
దుర్గేశనందని	,,	0	12
కపాలకుండల	,,	0	12
లక్షణ	,,	0	12
టిప్పుసుల్తాన్	,,	1	8
లీల	,,	0	6
రాజర్షి	,,	1	0
తారాబాయి	,,	0	14
దిలారామ	,,	1	4
కోవలన్ కన్నకి		0	12
మనోహరి	,,	0	14
వీరబాల	,,	0	8
ఆనందమఠ	,,	0	12
లాలాబాయి	,,	0	8
ఆంధ్రరాష్ట్రము	,,	1	8
రోషినారా	,,	0	12
బాలాదిత్య	,,	2	0
దేశభక్తుడు		1	0
శంభుతోనొకనాటిసహవాసం		0	4
చంద్రగుప్తుడు, నవల		2	8